ప్రాచీన భారతవర్ష

# మహర్షుల చరిత్రలు

మొదటి భాగము


గ్రంథకర్త :

'ఆర్షకవిశిరోమణి'

విద్వాన్ బులుసు వేంకటేశ్వరులు, ఎం.ఏ.

ఆంగ్లభాషోపన్యాసకులు, పిఠాపురరాజా ప్రభుత్వ కళాశాల, కాకినాడ



ప్రచురణ :

కార్యనిర్వహణాధికారి

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

1992

# ముందుమాట

* * *

సనాతన భారతీయ సంస్కృతిలో "ఋషులు" నిర్వహించిన భూమికలు జగత్ప్రసిద్ధాలు.

క్రాంతదర్శులై, తపస్స్వాధ్యాయ నిరతులై, నిగ్రహానుగ్రహ సమర్థులై త్రికాలజ్ఞులైన మహర్షులను గురించి శ్రుతిస్మృతి పురాణేతిహాస మహాకావ్యాలలో నవరసరుచిరాలైన విషయాలు ఎన్నోవున్నాయి. మహర్షులు మంత్రద్రష్టలు. అతిలోక మహిమాన్వితులు. వారి జీవిత చరిత్రలు భారతీయ సంస్కృతిని అధ్యయనం చేసేవారికి అవశ్యపఠనీయాలు.

ఆధ్యాత్మిక ప్రగతిపట్ల అభిరుచి కలవారికి, అభినివేశం ఆర్జించ దలచినవారికి మహర్షుల జీవిత చరిత్రలు మాత్రమే కాకుండా వారు ప్రతిపాదించిన ధర్మతత్త్వాలూ, అందించిన సందేశాలూ అనుశీలించడం ప్రధాన కర్తవ్యం. విశ్వజనీనాలైన మహర్షుల చరిత్రలు వేదాలనుంచీ, అష్టాదశ పురాణాలనుంచీ, ఇతిహాసాలనుంచీ, మహాకావ్యాలనుంచీ సంగ్రహించి, ఒక చోటకు చేర్చి అందించడంలో విశేష పరిశ్రమ, కూలంకష వైదుష్యం, విశిష్ట ప్రతిభ అవసరం.

విద్వాంసులూ, సత్కవీశ్వరులూ అయిన శ్రీ బులుసు వేంకటేశ్వర్లు గారు వ్రాసిన మహర్షుల చరిత్ర అనేకసార్లు అచ్చయి సహృదయుల మన్ననలు పొందింది. ఆర్షసాంస్కృతిక పునర్వికాసానికి తోడ్పడుతుందనే ఉద్దేశంతో ఈ గ్రంథాన్ని ప్రచురించడానికి తిరుమల తిరుపతి దేవస్థానంవారు సంకల్పించారు. ఆ ఆశయం నెరవేరుతుందని మా విశ్వాసం.

తిరుపతి, కార్యనిర్వహణాధికారి,
11—5—1981. తిరుమల తిరుపతి దేవస్థానములు.

# అవతారిక

—:—

"నమ ఋషిభ్యో మంత్రకృద్భ్యో మంత్రపతిభ్యో
మామామృషయో మంత్రకృతో మంత్రకృతో మంత్రపతయః పరా
దుర్మాహ మృషీ న్మంత్రకృతో మంత్రపతీన్పరాదాం"

"మంత్రద్రష్టలు మంత్రపతులు నగు మహర్షులకు నమస్కారము. వారు నన్ను విడువకుందురుగాక! నేను వారిని విడువకుందునుగాక!"

— కృష్ణయజుర్వేదము.

భారతదేశమున జన్మించిన ప్రతివ్యక్తికిని పరమపావనులగు భారతమహర్షులు త్రికాలస్మరణీయులు; భుక్తిముక్తిప్రదాతలు. ఆధ్యాత్మికౌన్నత్యమున, జ్ఞానప్రకాశమున, విజ్ఞానవిశేషమున, ధర్మప్రవచనమున, సర్వవిషయములందును భారతవర్షమునకేకాక యావత్ప్రపంచమునకును భారత మహర్షులే భిక్షాప్రదాతలు. విశ్వసంసృష్టికిని తత్సుస్థితికిని వారే కారణభూతులు. అట్టి మహర్షుల సంతతని జనించుటచేతనే భారతీయుఁడు విశిష్టసౌభాగ్య విలసితుఁడై ఉజ్జ్వలింగుట కధికారము గడించియున్నాఁడు. ఆ మహర్షుల పవిత్రాశీర్వచన బలముచేతనే నాఁటికిని నేఁటికిని ఇంక నేనాఁటికిని జ్ఞానతేజమును ప్రసరింపఁజేయుట కొక్క భారతీయుఁడే యర్హుఁడై యున్నాఁడు. ప్రపంచగురుత్వము వహించుట కాతఁడే సమర్థుఁడు. అజ్ఞానాంధకారబంధుర మగు పాశ్చాత్య ప్రపంచము విజ్ఞాన ప్రదీపమునకు భారతమహర్షులనే యాశ్రయింపక తప్పదు.

అట్టి మహామహులగు మహర్షుల జీవితవిశేషము తెలుఁగుటకు వారి నాదర్శముగాఁ గైకొనుటకుఁ గుతూహల పడని భారతీయుఁ డుండఁడు. కాని వారి జీవితవిశేషము లేకముఖముగా నొకచోటఁ గాక వివిధ పురాణాంతర్గతములై జిజ్ఞాసువుల కలభ్యము లగుచున్నవి.

మఱియు సమన్వయశక్తి వివిధ పురాణ పరిశీలనా సామర్థ్యము లేనివారి కవి కొన్ని పరస్పరవిరుద్ధములుగను నర్థరహితములుగను దోఁచుచుండుటలో నాశ్చర్యము లేదు. వివిధ పురాణవిదులగు విద్వద్వతంసులీవైరుధ్యములను వైకొలఁగించి సమన్వయ మొనరించి యేకముఖముగా నింతవఱకే భాషలోను గొనిరాకపోవుట తీఱని కొఱఁతయే యనక తప్పదు. ఈ పరిస్థితిలో భగవత్ప్రేరితుఁడనై మహర్షులపైఁ గల భక్తితాత్పర్యము లూఁతగాఁ గొని బహుపురాణ ప్రామాణ్యము ననుసరించి యీ గ్రంథమును సంధానించితిని.

మానవ పరిపూర్ణతకు సత్యాహింస శౌచదయాగుణములకు నింద్రియనిగ్రహము, తపోబలము, నాత్మజయము మున్నగువాని కన్నిటికి మన ప్రాచీనభారతవర్ష మహర్షులే యెన్ని యుగములకైన నాదర్శప్రాయులు. వారి జీవితోపదేశములు నిత్యమననపాత్రములు, ఐహికాముష్మిక ఫలప్రదములు.

1945లోఁ దొలుత ముద్రితమైన యీ గ్రంథమున కిది ఆఱవ ముద్రణము. ఆంధ్రమహాజనుల హృదయకమలముల నిది యధివసించుట మిక్కిలి ముదావహము.

కాకినాడ
1—3—69

ఇట్లు, బుధజనవిధేయుఁడు
బులుసు వేంకటేశ్వరులు

## అ గ స్త్య స్తు తి

" ప్రణవపంచాక్షరోపనిషత్ప్రపంచంబుఁ
గడదాఁక నెఱిఁగిన కలశకలాని
వాతాపిదైత్యు నిల్వలునితోఁ గూడంగ
జఠరాగ్ని వ్రేల్చినసవనకర్తఁ
గోపించి నహుషునిఁ గుంభీనసంబుగా
హుంకార మిచ్చినయుగ్రతేజు
వానకాలమునాఁడు పండునట్టిననీటి
కాలుష్య ముడిపెడుకతకఫలముఁ

పాండురసిత త్రిపుండ్రాంకఫాలభాగు
భద్రరుద్రాక్షమాలికాభరితవక్షు "
వింధ్యగర్వాపహారి నాపీతజలధి
నయ్యగస్త్యమహర్షి నే నభినుతింతు.

[శ్రీకాశీఖండము ౨. ౧౬౮

## అ త్రి స్తు తి

అంభోజగర్భహృదంభోజసంభవు
జంభారిదైత్యసం స్తంభయితుని.
వనితాజనానీక ఘనశిరోరత్నమౌ
యనసూయఁ జెట్ట పట్టినగృహస్థుఁ
జంద్రదుర్వాసోమునీంద్రదత్తాత్రేయ
ఋషిచంద్రములఁ గన్న ఋషివతంసు
ధర్మశాస్త్రానేక మర్మజ్ఞు. నిర్మల
కర్మరహస్యు సత్కర్మనిరతు

బహుతపోధన సంయుతు, నిహతనిఖిల
కామరోషాదిశత్రు, దివ్యామలాత్మ
తత్త్వమూర్తిని, సప్తర్షిసత్త్వమహితు,
నత్రిఋషిఁ గొల్తు నెప్పు డిహాముత్రములకు.

## అష్టావక్రస్తుతి

మాతృగర్భమునందె మహిత వేదవ్రాత
        మరసె నెవ్వఁ డట్టి యురువివేకి
యేకపాదసుజాత లేమహాత్ముని గని
        ధన్యాత్ములై రట్టి తపసిదిట్ట
జనకరాజర్షి యేజ్ఞానిబోధనముచే
        విజ్ఞుఁడై వెలసె నావిబుధవరుఁడు
సద్బ్రహ్మచర్యదీక్షాదక్షుఁడై యెవ్వఁ
        డలఘుకీర్తిని గాంచె నామహర్షి

సుప్రభాకాంతపతి యెవ్వఁ డాప్రభావుఁ
డమలవిజ్ఞానమూర్తి గృహస్థరత్న
మతిపవిత్రుఁ డష్టావక్రుఁ డామహర్షి
కంజలి ఘటించి స్మరియింతు నహరహంబు.

## ఋష్యశృంగస్తుతి

సంగత మైనభక్తిని బ్రశంస యొనర్తు "పఠిత వేదవే
దాంగుని సర్వసంయమిసమాజ్ఞనతాంగుని విర్జితేంద్రియా
సంగుని లిప్తభూతిలపదాంగుని సద్గుణసంగునిన్ బ్రశాం
తంగుని సంతతోదితతపఃకృతిరంగుని ఋష్యశృంగునిన్."

[భాస్కరరామాయణము. బాం కాం]

## కపిలస్తుతి

కపిలమహర్షి రూపమునఁ
        గర్దమమౌనికి దేవహూతియం
దపరిమితప్రభావమున
        నర్మిలిఁ బుట్టి తరింప నరుసాం
ఖ్యమతము లోకమందుఁ బర
        మాత్మననుగ్రహపాత్ర మందుఁ జూ
పి వయిని భక్తిమార్గమును
        బెంపుగఁ జేసినవిష్ణుఁ గొల్చెదన్.

"శ్రీవిష్ణుపదభక్తిఁ జెలఁగు సప్తర్షి చం
ద్రములలో మున్నెన్నఁ దగినమేటి
దిత్యదిత్యాదిసాధ్వీశిరోరత్నంబు
లను బ్రేమఁ జెట్టపట్టిన గృహస్థు
కమలాప్త భుజగేంద్ర ఖగరాజరోహిణీ
కన్యకారమణులఁ గన్నతండ్రి
రాముచే దానధారాపూర్వముగ భూత
ధాత్రి గ్రహించిన శ్రోత్రియుండు

తోయరుహాసంభవునకు బౌత్రుఁడు మరీచి
పుత్రుఁడు విచిత్రగుణమణిపాత్రుఁ డఖిల
వేదవేదాంతతత్త్వవివేకశాలి
మహిమఁ జెలువొందుకశ్యపమౌనిఁ " గొల్తు.

[దశావతారచరిత్రము. ౧ ఆ, ౪౫

## గౌ త మ స్తు తి

కరములఁ మోడ్చి నుతింతు భక్తి "సురగం
గాపూతతోయార్ద్రిభా
స్వరమూర్తిన్ గతధూమసంజ్వలితప
జ్జ్వాలాగ్నికల్పున్ సురా
సురదుర్ధర్షవిపక్షపాదు రచిత
శ్రుత్యర్థవాదున్ వ్రతా
వితతామోదు సుధీయుతుం బ్రతిహతా
విద్యాతమున్ గౌతమున్."

[భాస్కరరామాయణము, బాల.. ౫-౨

## చ్య వ న స్తు తి

భృగువంశాంబుధిచంద్రుఁడై తపమునన్ విశ్వప్రభావాఢ్యుఁడై
సుగుణాలంకృత యౌసుకన్యసతియై శుశ్రూషలం జేయఁగా
జగదుద్ధారకు లౌసుతుల్ గలుగ శశ్వద్యోగమార్గంబునన్
సుగతింగాంచినపావనాత్ముఁ జ్యవనున్ గొల్తున్ మహర్షీంద్రునిన్.

## జ మ ద గ్ని స్తు తి

జమదగ్నిన్, బరమర్షివీరవిజహ్యాత్పంబంధషడ్వర్గమున్
విమలాత్మోద్ధృతసత్తపఃఫలమునన్ విధ్వస్తముం జేసి యా
నమలోదాత్తమనీషచేఁ బరమధర్మానీకసంరక్షణన్
నమితన్ గీర్తిని గాంచినాతనిఁ బ్రశంసన్ గొల్తు నశ్రాంతమున్.

## ద త్తా త్రే య స్తు తి

"నిజగర్భగత జగన్నిచయ మారయు లీల
నంతర్ముఖాపాంగుఁ డైనవాని
పరివజాండావృత్తి నాభిపీఠికి నేర్పు
రీతి పక్షసరంబుఁ ద్రిప్పువాని
శ్రుతు లాత్మయందు నిల్పుటఁ దెల్పు తెఱఁగున
నవరుద్ధనిశ్వాసుఁ డైనవానిఁ
దనపూనినధరిత్రికి నలోలత ఘటించు
పగిది జటిలవృత్తిఁ బరగువాని
ప్రాప్తనస్వీయదామోదరత్వ మెఱుఁగఁ
జేయుగతి యోగపట్టికఁ జెలఁగువాని
యోగము దెక సూచితాద్భుతచరిత్రుఁ
డైనవాని దత్తాత్రేయమౌనిఁ గొలుతు"

[చంద్రభానుచరిత్రము. ౧ ఆ. ౪౬]

## ద ధీ చి స్తు తి

అతులతపోధనుండు చ్యవనాత్మజరత్నము దేవకార్యసం
గతికి నిజాస్థు లిచ్చినయకల్మషదానమహావ్రతుండు పా
ర్వతిని దృఢీకరించుటఁ బరాత్పరుఁ బట్టుట దక్ష నల్గి కా
వతిమిరబద్ధుఁ జేసినప్రభావవిలాసి దధీచిఁ గొల్చెదన్.

## దు ర్వా స స్తు తి

"అనుభావశక్తి బ్రహ్మాదుల నొకపూరి
పుడకకుఁ గైకోనిపోతరిఁడు

ఘనకోపవాణిజ్యమునఁ దపోవిత్తజా
లముఁ గూడఁబెట్టెడులాభగాఁడు
తనరథంబునకు మాధవసత్యభామల
గుఱ్ఱాలఁ జేసినకోడిగీఁడు
యతిపతికుంతిత్న మనసూయకడుపున
మునుమునఁ బుట్టినముద్దులాఁడు

సకలకల్యాణకరుఁడు సాక్షాదనంగ
హరుఁడు నిర్మలతత్త్వ విద్యావిహార
భావిలాసుఁడు దుర్వాసుఁ" డావరిష్ఠు
నధికనిష్ఠ భజింతుఁ బ్రత్యహము భక్తి.

[వరాహపురాణము. ౨ ఆ. ౧

పరమపవిత్ర భారతవిభాసుర దివ్యమహర్షివర్య సు
స్థిరచరితామృతం బిది ప్రసిద్ధిగ దీనివి గ్రోలఁగల్గుచో
నరుఁడు సుఖించు; నిత్యము వినం బఠియించిన భక్తియుక్తులఁ
వరము లభించు నీప్రథమభాగము భాగములెన్మిదింటికో.

# విషయసూచిక


1. అగస్త్యమహర్షి

1 అగస్త్యుని జన్మకథ 1

2 అగస్త్యుని బాల్యము 4

3 అగస్త్యునికిఁ బితృదేవతల యాదేశము 4

4 అగస్త్యుని వివాహము 5

5 వాతాపీల్వలమర్దనము 7

6 అగస్త్యుఁడు కవేరకన్యను వివాహమాడుట 8

7 అగస్త్యుఁడు సముద్రోదకము నాపోశనించుట 10

8 అగస్త్యుఁడు శ్రీరాముని కుపకరించుట 12

9 అగస్త్యమహర్షి నహుషుని శపించుట 15

10 అగస్త్యమహర్షి ద్వాదశ వార్షికయజ్ఞము 16

11 దేవతలగస్త్యునికై వెదకుట 17

12 అగస్త్యాశ్రమవర్ణనము 18

13 దేవతలగస్త్యుని గొల్చుట 19

14 బృహస్పతి అగస్త్యునితో వచ్చినపనిఁ దెల్పుట 19

15 వింధ్యగర్వాపహరణము 20

16 అగస్త్యుఁడు దక్షిణకాశికిఁ బోవుట 21

17 అగస్త్యకృతలక్ష్మీస్తోత్రము 22

18 లోపాముద్రాగస్త్య సంవాదము 23

19 కుమారాగస్త్య సంవాదము 25

20 అగస్త్యవ్యాసుల వృత్తాంతము 26

21 అగస్త్యుఁడు భూభారము తగ్గించుట 27

22 అగస్త్యుఁ డింద్రద్యుమ్నుని శపించుట 27

23 అగస్త్యుఁడు మణిమంతుని శపించుట 28

24 అగస్త్యుఁడు భద్రాశ్వు ననుగ్రహించుట 29

25 అగస్త్యగీత: అగస్త్యసంహిత 30

26 అగస్త్యార్ఘ్యప్రదానవిధానము 32

2. అత్రిమహర్షి

1 అత్రిజననము 34

2 అత్రితపోనియతి ,,

3 అత్రిమహర్షి వివాహము 35

4 త్రిమూర్తు లనసూయకు వరము లొసఁగుట 36

5 అత్రిమహర్షి సంతానమునకై తపముచేయుట 37

6 అత్రిమహర్షికి లోకోత్తర పురుషు లుదయించుట 38

7 అత్రిమహర్షి పృథుచక్రవర్తి కడ కేఁగుట 39

8 అత్రిమహర్షి సూర్యచంద్రుల రక్షించి రాక్షసుల భస్మము చేయుట 40

9 అత్రిమహర్షి సీతారాముల కాతిథ్య మిచ్చుట 40
10 అత్రిమహర్షి యపరిగ్రహ వ్రతపాలనము 41
11 అత్రిసంహిత 42
12 అత్రిస్మృతి 43

3. అష్టావక్రమహర్షి

1 ఏకపాదుఁ డష్టావక్రుని శపించుట 44
2 ఏకపాదుఁ జలమజ్జితుఁ డగుట 45
3 అష్టావక్రుఁ డుదయించి తండ్రిని రక్షించుట ,,
4 అష్టావక్రుఁడు నిర్వక్రుండై సుందరుఁడగుట 47
5 అష్టావక్రుని వివాహ వృత్తాంతము 47
6 అష్టావక్రుండు రంభాదులను శపించుట 50
7 అష్టావక్రుఁడు భగీరథుని దీవించుట 51
8 అష్టావక్రుని పూర్వజన్మకథ 52
9 అష్టావక్రసంహిత 54

4. ఋష్యశృంగమహర్షి

1 ఋష్యశృంగుని జననము 56
2 రోమపాదుని వృత్తాంతము 57
3 సర్వకళాపూర్ణాది వేశ్యలు ఋష్యశృంగునిఁ గొనిపోవుట 58
4 శాంతాఋష్యశృంగుల వివాహము 59
5 శాంతాఋష్యశృంగు లయోధ్య కేఁగుట 60
6 ఋష్యశృంగుఁడు దశరథు నిచే నశ్వమేధపుత్త్రి కామేష్టులఁ జేయించుట 61
7 ఋష్యశృంగుని ద్వాదశ వార్షిక యాగము 63
8 ఋష్యశృంగ స్మృతి ,,

5. కపిలమహర్షి

1 కపిలుని జననము 65
2 కపిలమహర్షి తండ్రికిఁ గర్తవ్యము బోధించుట 66
3 కపిలమహర్షి దేవహూతికి మోక్ష మొసఁగుట 67
4 కపిలమహర్షి వేదప్రామాణ్య బుద్ధి ,,
5 కపిలమహర్షి పుండరీకు ననుగ్రహించుట 68
6 కపిలమహర్షి సగరపుత్త్రులను భస్మముచేయుట 71
7 కపిలమహర్షి యశ్వశిరునకు విశ్వరూపము చూపి కటాక్షించుట 72
8 కపిలుని సాంఖ్యసిద్ధాంతము 73
9 కపిలుని భక్తియోగము 74
10 కపిలమహర్షి రావణునకు విశ్వరూపము చూపుట 75

6. కశ్యపమహర్షి

1 కశ్యపమహర్షి సంతానము 77

2 కశ్యపప్రజాపతికిఁ గద్రూ వినతల వలని సంతతి 78
3 కశ్యపుఁడు గరుత్మంతు నాశీర్వదించుట 79
4 భూమి కాశ్యపి యనఁ బరగిన విధము 80
5 గంగ కాశ్యపి యనఁ బరగిన విధము 80
6 కశ్యపుఁడు భూమిని రాజులకుఁ బంచియిచ్చుట 82
7 కశ్యపుఁ డదితివలన వామనునిఁ గనుట 83
8 కశ్యపుఁడే వసుదేవుఁడు దశరథుఁడు నగుట 84
9 కశ్యపునివలన దితికి మరుద్గణము పుట్టుట 85
10 కశ్యపుని జ్ఞానబోధ ..
11 కశ్యప స్మృతి 86
12 కశ్యప గీతలు 87

7. గౌతమమహర్షి

1 అహల్యాగౌతముల వివాహ వృత్తాంతము 88
2 గౌతమమహర్షి క్షామసమయమున ప్రజాసంరక్షణము చేయుట 89
3 గౌతముఁడు తన్నుఁజూచి యసూయపడిన బ్రాహ్మణుల శపించుట 91
4 గౌతమమహర్షి గంగను భూమికిఁ దెచ్చుట 92
5 గౌతముఁ డహల్య కొసఁగిన సంతానము 93
6 గౌతముఁ డహల్యా శక్రుల శపించుట 94
7 గౌతముఁడు బ్రహ్మదత్తను శపించుట 96
8 గౌతమ ధర్మసూత్రస్మృతి న్యాయ సంహితలు 97

8. చ్యవనమహర్షి

1 చ్యవనుఁడు జన్మించి పులోముని భస్మముచేయుట 98
2 చ్యవనుని తపోనిరతి 99
3 చ్యవనుఁడు సుకన్యను వివాహమాడుట 100
4 చ్యవనుఁడు నవయౌవనుఁ డగుట 101
5 చ్యవనుఁ డాశ్వినులను సోమపీథులఁ జేయుట 102
6 చ్యవనుఁ డింద్రునకు గర్వభంగము చేయుట 103
7 చ్యవనుఁడు సుకన్యకుఁ బుత్త్రు ననుగ్రహించుట 104
8 చ్యవనుఁడు నహుషు ననుగ్రహించుట 105
9 చ్యవనమహర్షి కుశిక భూపతిని బరీక్షించుట 106
10 పామొకటి చ్యవనుని పాతాళమున కీడ్చుకొనిపోవుట 108
11 చ్యవనుఁడు లవణాసుర వధకుఁ గారకుఁడగుట 109
12 సింహావలోకనము 110

9. జమదగ్నిమహర్షి
- 1 జమదగ్ని జననవృత్తాంతము 111
- 2 జమదగ్ని రేణుకను వివాహమాడుట 112
- 3 జమదగ్ని సూర్యుని శపించుట 113
- 4 పరశురాముని పితృభక్తి 115
- 5 జమదగ్ని కార్తవీర్యునిఁ జంపిన పరశురాముని శిక్షించుట 117
- 6 జమదగ్ని పితృదేవతల శాపమున నకులమై పుట్టిన వృత్తాంతము 119

10 దత్తాత్రేయమహర్షి
- 1 దత్తాత్రేయుని జననము 121
- 2 దత్తాత్రేయుని ప్రవర్తనము 122
- 3 దత్తాత్రేయుఁడు జంభాది రాక్షసులఁ జంపించుట 123
- 4 దత్తాత్రేయుఁడు కార్తవీర్యార్జునుఁ గటాక్షించుట 124
- 5 దత్తాత్రేయుఁ డలర్కునకు జ్ఞానము బోధించుట 126

11. దధీచిమహర్షి
- 1 దధీచి జననము 129
- 2 దధీచికి సారస్వతుఁడు జనించిన విషయము ,,
- 3 దధీచి కింద్రుఁడు నేర్పిన శాస్త్రముల వృత్తాంతము 130
- 4 దధీచి క్షువుల పరస్పర వైరము 131
- 5 దధీచి క్షువుని విష్ణుని నిందించి గెల్చుట 132
- 6 దధీచి దక్షుని శపించుట 133
- 7 దధీచి దేవతల యస్త్రశస్త్రముల మ్రింగుట 135
- 8 దధీచి దేవకార్యమునకై దేహము త్యజించుట 136
- 9 దధీచికిఁ బిప్పలాదుఁ డుద్భవించిన విధము 137

12. దుర్వాసోమహర్షి
- 1 దుర్వాసుని జననప్రకారము 138
- 2 దుర్వాసుఁ డింద్రుని శపించుట 139
- 3 దుర్వాసుఁడు ధర్ముని శపించుట 141
- 4 దుర్వాసుఁడు సుప్రతీకు ననుగ్రహించుట 142
- 5 దుర్వాసుఁడు తిలోత్తమాసాహసికుల శపించుట 142
- 6 దుర్వాసుఁడు వపు వను నచ్చరను శపించుట 143
- 7 దుర్వాసుని వివాహము 144
- 8 దుర్వాసుఁడు భార్యను భస్మముచేయుట ,,
- 9 ఔర్వుఁడు దుర్వాసుని శపించుట ,,
- 10 దుర్వాసుఁ డంబరీషుని కతఁ బరిభవింపఁబడుట 145

11 దుర్వాసుఁడు శంబరతాపసుని పరీక్షించి వరములొసఁగుట 145

12 దుర్వాసుఁడు ముద్గలున కతిథి యగుట 147

13 దుర్వాసోమహర్షి కుంతీదేవికి వరమొసఁగుట ,,

14 దుర్వాసుఁడు యోగమాయను వివాహమగుట 148

16 దుర్వాసునికిఁ బార్వతి శ్రీకృష్ణుని గుఱించి తెల్పుట ,,

16 దుర్వాసుఁడు శ్రీకృష్ణుని యాదవులను శపించుట 149

17 దుర్వాసుఁడు పాండవుల కతిథి యగుట 151

18 దుర్వాసుఁడు లక్ష్మణుని మరణమునకు గారకుడగుట 152

19 దుర్వాసుని యాధిక్యము ,,

20 తుదిమాట 154

౧

శ్రీమద్భారతధరణీ
ప్రామాణిక ఋషివరేణ్య భవ్యోత్ఫుల్ల
శ్రీమానిత పాదాబ్జ ర
జోమాధురి చేరుఁగాక! సుహృదంతరమున్.

౨

జ్ఞానుల్ భారతభాగ్య దేవతలు వి
జ్ఞానప్రనిష్ఠాత్ములున్
మౌనిశ్రేష్ఠులు వారిఁ గొల్చి మఱి
న్నం బింక లేకుండఁ ద
న్మానాదివ్యచరిత్రముల్ తడవి సం
ధానించి యీ సత్కృతిన్
జ్ఞానైకాత్ములు మద్గురూత్తములకున్
సద్భక్తి నర్పించెదన్.

౩

సాకారమహేశ్వరది
వ్యాకారుఁడు సద్గురుం డహో! కృతిపతి త
ల్లోకేశుఁ జేసి కృతిపతి
చేకొనుతన్ భుక్తి ముక్తి చిరజీవినినై!

# మహర్షుల చరిత్రలు

* * *

## అగస్త్య మహర్షి

శ్రీమంత మగు భరతఖండము పుణ్యతపోనిలయము. కావుననే పరమ పవిత్రము. ఇందు జన్మించి తపో మహిమచే సృష్టి స్థితి లయకారులైన వారే మహర్షులు. వీరు విశ్వ సంరక్షణమునకై త్రిమూర్తుల కృత్యములు నిర్వహింప సమర్థులగుటే కాక త్రిమూర్తులకు నార్తిసమయముల నుద్ధారకులు సంరక్షకులు నైన పరాత్పరులు. ఇట్టి మహామహులఁ గని యుండుటచేతనే భారతవర్ష మార్ష భారత మనియు నార్యావర్తమనియు విఖ్యాతి గడించెను.

ఇట్టి పరమపవిత్రవర్తనులు బ్రహ్మవిద్యావనద్యులు పరమేశ్వర కల్పులు నగు భారత బ్రహ్మర్షులలో నగస్త్యమహర్షి యగ్రేసరుఁడు. ఈతఁడు వసిష్ఠమహర్షికి సహజన్ముఁడు. త్రికాలవేది. భక్తిజ్ఞాన యోగవిరాగనిధి, గృహస్థరత్నము. ఈ పరమ పురుషుని జన్మకథ కడుఁ జిత్రమైనది. మహాపురుషులయు, మహానదులయు జన్మగాథలు చిత్రాతిచిత్రములే కదా!

### అగస్త్యుని జన్మకథ

తొల్లి మహేంద్రుఁడు. దేవతలను బాధించు తారకాదులగు రాక్షసులను జంపవలసినదని అగ్నికి వాయుదేవునకు నాజ్ఞాపించెను. వాయువు సాయమున అగ్ని రాక్షసుల నెల్లరి నిశ్శేషముగా నాశనము చేయుచుండెను. అంత, వారు భయపడి సముద్రముఁ జొచ్చిరి. వారి బాధ తొలఁగినదికదా యని అగ్నివాయువులు ఉపేక్షాభావ [illegible]

కాని, కొంత కాలమైన పిదప రాక్షసులు రాత్రి సమయము లందు వచ్చి దేవతలను, మునులను, మానవులను నానావిధముల బాధించి పోయి పగటివేళల సముద్రములో దాఁగికొనుచుండిరి. ఇట్లు పండ్రెండు వేల సంవత్సరములు రాక్షసులు ప్రవర్తించి పెక్కండ్ర నుక్కడించిరి. దాన లోకోపద్రవ మేర్పడెను.

మహేంద్రుఁడు మండిపడి అగ్నివాయువులఁ బిలిపించి "అగ్నిహోత్రా! వాయుదేవా! కాలకాది రాక్షసులను జంపుఁడని మీకు నేను విధించితిని. మీరు వారిని జంపక విడుచుటవలన లోకమున కింతకీడు మూడినది. గతజలసేతుబంధనము వలదు. ఇప్పుడైన మీరు సముద్రము నింకించి యందు దాఁగియున్న యా రాక్షసులను భస్మము చేయుఁ" డని యాజ్ఞాపించెను.

అందులకు వారు "దేవేంద్రా! సముద్రము నెండఁ బెట్టుటవలన, అందు జీవించు అనంతమైన జీవరాశి నశించును. అది మహాదోషము. కావున రాక్షస నాశనమునకు మఱియొక యుపాయ మూహింపు" మని కోరిరి. ఇంద్రుఁ డందులకు వారిపైఁ గోపించి "ఏమేమి? నాయాజ్ఞ ధిక్కరించి మేర మీఱుదురా? కానిండు. దానికి ఫలిత మనుభవింపుఁడు. మీ రిరువురు భూమిపై నొక యచేతన పదార్థమునుండి మునులై పుట్టుఁ" డని శపించెను.

ఆ పిమ్మట విష్ణుమూర్తి ధర్ముని సుతులగు నరనారాయణుల యవతారమెత్తి గంధమాదనపర్వతమున నుగ్రతప మొనరించు చుండెను. ఆ నరనారాయణుల అపూర్వ తపోవైభవమున కసూయపడి యింద్రుఁడు తత్తపోవిఘ్నముఁ గలిగింపుఁ డని మన్మథవసంతుల కాజ్ఞాపించెను. మహేంద్రునాజ్ఞ నౌదలధరించి వారిరువురు పెక్కు రప్సరసలను దీసికొని వెళ్ళి తమ కళానైపుణ్యముఁ బ్రకటించి నరనారాయణులకుఁ దపోభంగ మొనరించిరి. అంత నారాయణుఁ డెంతయు

నర్తెరువ గొలుపునట్లు తనతొడనుండి యొక జగన్మోహినిని బుట్టించెను. నారాయణుని యూరువునుండి పుట్టుటచే ఆమెకు "ఊర్వశి" అను పేరు కలిగెను.

ఆ యూర్వశిని జూడఁగనే సూర్యున కామెపైఁ గోరిక కలిగెను. తనతో సుఖింప నాతఁ డామెను దనలోకమునకు రమ్మనెను. ఆమె వల్లెయని యాతని లోకమునకుఁ బోవుచుండ దారిలో వరుణదేవుఁ డామెను జూచి మోహించి "తరుణీ! నీ మీఁద నా మానసము నిలిచినది. నీవు నా లోకమునకు వచ్చి నాతో సుఖింపు" మని కోరెను. అందుల కామె "దేవా! నన్నిదివఱకే సూర్యదేవుఁడు కామించి తన లోకమునకు రమ్మని కోరెను. అతని కోరిక దీర్చుటకై నే నేగుచుంటి" నని సమాధానము చెప్పెను.

వరుణుఁడది విని "కాంతా! నీస్వాంతము నాపై నిలిపి పొమ్ము నా కదియే పదివే" లనెను. అందుల కామె యంగీకరించి మనసున వరుణుని స్మరించుచు సూర్యునికడ కేఁగెను. ఆతఁడామె భావమును గ్రహించి "ఓసీ! ఒక పురుషుని మనమునఁ దలఁపోయుచు నింకొక పురుషుని గనఁగూడ వచ్చితివా? ఇంతకన్నా స్త్రీ చేయఁగల యధికాపరాధము లేదు. ఈ దోషమునకు నీవు భూలోకమున బుధ పుత్రుఁడగు పురూరవునకుఁ బత్నివిగా జనింపుము. పో" మ్మని శపించెను. ఆ శాపమువాతఁ బడి యామె వెడలిపోయెను.

కాని, మిత్రావరుణులకుఁ గామోపశమనము కాదయ్యెను. అమోఘవీర్యులగు మహానీయులకు వీర్యపతనము కానుండెను. 'ఇది యేమి! ఆశ్చర్య' మని వారాలోచింపఁగా మహేంద్రుఁడు అగ్ని వాయువుల కిచ్చిన శాపము, అగ్ని సూర్యుని, వాయువు వరుణుని ప్రవేశించి మునిజన్మ మందఁగోరుట, వారికిఁ దేట తెల్లమయ్యెను. అది గ్రహించి వారు స్ఖలనముఁ గోరు తమ వీర్యములను స్తంభింపఁజేయ

నిచ్చగింపక లోక సంరక్షణార్థ మొక జలపూర్ణ కలశమున విడిచి యథేచ్ఛముగా వెడలిపోయిరి. కాలక్రమమున ఆ జలకలశమునుండి అద్భుత తేజస్వులై బ్రహ్మవర్చస ముట్టిపడ అగస్త్యుఁడు, వసిష్ఠుఁడు నుద్భవించిరి.

ఈ కారణముచేతనే వీరిరువురకును 'కలశజు' అని, 'కుంభసంభవు' అని, 'ఔర్వశేయు' అని, 'మిత్రావరుణపుత్రు' అని, 'వహ్ని మారుతసంభవు' అని పేరు వచ్చెను.*

## అగస్త్యుని బాల్యము

ఈ రీతి జన్మించిన యగస్త్యుఁడు క్రమముగా శుక్లపక్ష చంద్రుని వలె దేదీప్యమానుఁడగుచుండెను. అతఁడు బాల్యమునుండియు మహానిష్ఠాగరిష్ఠుఁడై బ్రహ్మచర్యము చేయుచు నిరుపమాన తపస్సంపదచే విరాజిల్లఁ జొచ్చెను. బాల్యముననే యాతని కుపనయనాది సంస్కారములను, ప్రణవ పంచాక్షరీ మంత్రోపదేశమును దేవతలే యొనరించిరి. ఆతఁడు పిదప నిష్ఠాతిశయమున బ్రహ్మచర్యపాలనము నుగ్రతపస్సు చేయుచుండెను. అందు నిరాహారుఁడు, నిర్జితేంద్రియుఁడు, నిర్ధూత కల్మషుఁడునై నానాఁటి కాతఁడు దివ్యతేజస్వి యయ్యెను.

## అగస్త్యునికిఁ బితృదేవతల యాదేశము

ఇట్లుండ నొకనాఁ డరణ్యములో సంచరించుచు నొక వల్లీ వృక్షశాఖ నధోముఖులై వ్రేలుచున్న కొందఱు మునీశ్వరులంజూచి యగస్త్యుఁడు "మహాత్ములారా! ఇపుడు మీరీ దురవస్థలో నుండుటకుఁ గారణ మేమి? ఇంతకూ మీ రెవరో యానతిం" డని వేఁడుకొనెను. అంత వారు విస్పష్టముగా "నాయనా! మే మన్యులము గాము పితృగణ దేవతలము. నీవు పుత్త్రులను పౌత్త్రులను గాంచి తప్పక మా కూర్ధ్వ లోకముల నొసంగఁజాలుదువని చిరకాలము నుండి కొండంత యాశతో నున్నాము. కాని, నీవట్లు చేయక బ్రహ్మ

* పద్మపురాణము — సృష్టిఖండము. భారతము — అరణ్యపర్వము.

చర్యాశ్రమముననే యుండుట మాకీ భరింపరాని వేదనకు. నిట్టి దుస్థితికిని గారణమైనది. కావున నీవు మా కోరికఁ దెల్లించి యూర్ధ్వ లోకములఁ బ్రసాదింపవే" యని వేఁడుకొనిరి. ఈ మాటలు విన్న యగస్త్యుఁడును దన పితరుల దుస్థితికి జాలిగొని "మహాత్ములారా! పితృదేవతలారా! మీ కోరిక సిద్ధింపఁ జేసెదను. నమ్ముఁడు. కులమున నెప్పటికైన నొక యుత్తముఁడు జనించి యూర్ధ్వలోక గతు లొసంగు నని యెదురుచూచు పితరుల ఋణముఁ దీర్పని యా వంశజుని జన్మమేల? కాల్పనా? కావున, మీపం పొనర్చెద" నని యగస్త్యుఁడు వారి యాశీస్సులఁ గొని యాశ్రమమున కేఁగెను.

### అగస్త్యుని వివాహము

పితృదేవతల యాదేశము శిరసావహింపఁ దీవ్రముగఁ గోరిన యగస్త్యుఁడు తన తపశ్శక్తిచేఁ బుత్త్రికాముఁ డగు విదర్భ రాజునకు జక్కని చుక్కయగు నొక కూఁతురు కలుగునట్లు వరమిచ్చెను. ఈ వరమున విదర్భరాజునకుఁ గూఁతురు కలిగెను.

ఆమె లోపాముద్ర యను నామమునఁ దలిదండ్రుల గారాపు బిడ్డయై జలమున విలసిల్లు నలినివలె, వినీతునం దొప్పు లక్ష్మినిఁ బోలి, యుద్యుక్తునం దొప్పు విద్యరీతి దినదిన ప్రవర్ధమానయై రూప గుణ సౌజన్యముల నప్రతిమానముగా ననురూప కన్యకాశతమున నొప్పుచుండ నొకనాఁ డగస్త్యమహర్షి విదర్భరాజుకడ కేతెంచెను. ఉచిత మర్యాదల నందిన పిదప లోపాముద్రను దనకిచ్చి వివాహము చేయుమని యగస్త్యుఁడాతని నడిగెను. అందుల కయ్యో!

నారలు గట్టి కూర లశనంబుగ నుగ్రవనంబులోఁ దపో
భారమువం గృశుండయిన బ్రాహ్మణుఁడీ లలితాంగిఁ బెండ్లియై
నారలుగట్టి కూర లశనంబుగ నుగ్రవనంబులోఁ దపో
భారము దాల్చియుండుమని పంపఁగ మిన్నకయుండ నేర్చునే?

ఎఱిఁగి యెఱిఁగి దీని నెట్లిఁగ నగు భోగ
యోగ్యయైనయది పయోజనేత్ర
యీనినాఁడు శాపమిచ్చుఁగా కీముని
యేల సైఁచు నింక నెట్లు లోక్కా?"

(భార. అర. ౨. ౩౨౬, ౩౨౭)

యని విదర్భనరేంద్రుఁడు సంశయ భీతచిత్తుఁడై యుండఁగా లోపాముద్ర వచ్చి యా మునివరుని వివాహమగుటయే తన యభీప్సితమని తెలిపెను. అందులకు విదర్భధారుణీపతి యెంతయు సంతసిల్లి విధ్యుక్తముగా లోపాముద్రాగస్త్య మహర్షుల వివాహ మతివైభవముతో జరపెను. ఈ వివాహప్రదేశము నాఁటినుండి "సిద్ధతీర్థ" మను పేర మహాతీర్థ ప్రదేశముగా లోకప్రసిద్ధి గాంచెను. పిమ్మట నగస్త్యుఁడు లోపాముద్రను వల్కలాజిన ధారిణిఁ జేసి తోడ్కొనిపోయి గంగా ద్వారమున నొక్క యాశ్రమమును నిర్మించుకొని గార్హస్థ్య ధర్మములు నిర్వర్తించుచుఁ దపోవృత్తి నుండెను.

ఆజన్మసిద్ధులై యావిర్భవించియు మన మహర్షులు లోక సంగ్రహమునకును సాధుసజ్జనుల కనువర్తన సాధనములగు నాదర్శ జీవితమును జూపుటకును యథావిధిగా బ్రహ్మచర్యాద్యాశ్రమములు నిర్వర్తించుచునే నిరంతర దైవచింతనమున నెగడెడివారు. అట్లే యగస్త్యుఁడు విశ్వశ్రేయమునకే వివాహమాడి కాలక్రమమున సహ ధర్మచారిణి సతీతిలకమునగు లోపాముద్రయందుఁ బుత్రులం బడసి పితరుల ఋణమునుదీర్చి దన ధర్మమును నిర్వర్తింపఁ దలఁచెను.

ఈ కారణమున నొకనాఁ డగస్త్యుఁడు లోపాముద్రా సంగమ మపేక్షింప నామె తనకు సమస్తాభరణములు, నున్నిత వస్త్రములు కావలయునని యాతనిఁ గోరెను. అగస్త్యుఁ డాపని కై తపోధనమును వ్యయింప నొల్లక శ్రుతర్వుఁడను రాజు కడకేఁగి యాతనికి నరిపోఁగా నేమేని ధనమున్నఁ దనకిమ్మని కోరెను. అతనికడ

నాతనికి సరిపోవు ధనమే యుండుటచే నిరువురును గలిసి బ్రధ్నశ్వుని కడ కేగి యర్థించిరి. అతనికడ నాతనికి సరిపడు ధనమే యుండుటచే మువ్వురును గలిసి త్రసదస్యుడను రాజుకడకరుదెంచి యర్థించిరి. అతడును నట్టి స్థితియందే యుండ నల్వురుంగలసి యిల్వలుడను రాక్షసునికడ కేతెంచిరి.

## వాతాపీల్వల మర్దనము

మణిమతీపురాధిపతి యగు నిల్వలుడు విఖ్యాతబలుడు అతని తమ్ముడు వాతాపి కామరూపి. ఒకనాడిల్వలుడుత్తము బ్రాహ్మణు నొకనిం దనకు సకలకామ సిద్ధికర మగు మంత్ర ముప దేశింపుమని కోరి విఫలుడై తన తమ్ముని మేకను జేసి వధించి యా మాంస మా బ్రాహ్మణునకు భోజనమునం బెట్టి భోజనానంతరము తమ్మునిం బిలిచెను. వాతాపి యా బ్రాహ్మణుని కడుపు వ్రచ్చి బయటకు వచ్చెను. ఆ ద్విజుడు వెంటనే మరణించెను. ఈ రీతి నది మొదలు తనకడ కతిథులుగా వచ్చు బ్రాహ్మణులం జంపుట యిల్వలునకుం బరిపాటి యాయెను.

నాడగస్త్యుం డామువ్వురు రాజులతో నిల్వలున కతిథి యాయెను. యథాపూర్వముగా నిల్వలుడు వాతాపిని మేకను జేసి చంపి వండి యా మాంసమ్ము నగస్త్యునకుం బెట్టించెను. ఆ మువ్వురు రాజులు నీవిషయ మగస్త్యునకుం జెప్పినను వినక యాతడు వానిం గంఠముదాకం భుజించెను. ఇల్వలుడును దానెప్పటియట్లే తమ్మునిం బిల్చు చెలంగి యగస్త్యుడును "జీర్ణం జీర్ణం వాతాపి జీర్ణ" మ్మని కడుపుం బడపికొనుచు గఱ్ఱని త్రేన్చిన వాతాపి జీర్ణమైపోయెను. ఇల్వలుడు నాశ్చర్యమంది కుక్కిన పేనువలె మాటాడక వచ్చినపని యడిగి యా రాజుల కపరిమిత ధనమును బసిండియు నిచ్చి యగస్త్యునకు [illegible]

ఇరువదివేల పాడియావులు, ఇరువదివేల గద్దెల బంగారము నిచ్చెను. అగస్త్యుడు ఆ ధనసంపదలతో రాజులతో నిండిన రథమును గుఱ్ఱములు తాల్చి తనయాశ్రమమునకుఁ దక్షణమే పోయి చేరెను. రాజర్షు లగస్త్యుని వీడ్కొని చనిరి.

వాతాపి నట్లును బ్రాహ్మణ హంతయగు నిల్వలుని దరువాతను నగస్త్యుఁడు రూపుమాపి 'వాతాపిల్వలమర్దనుఁ' డను నామమును ధరించెను. అగస్త్యుఁ డా ధనముతో లోపాముద్ర కోరిన సమస్తాభరణములు నొసఁగి యనేక రమ్యవస్త్రములిచ్చి పిమ్మట బదుగురఁ బోలుసుతులు మూర్వురు కావలెనా? నూర్వురఁ బోలు సుతులు పది మంది కావలెనా? లేక వేవురకు సరిపడు నొక్కకుమారుఁడు కావలెనా? యని యాదరముతో భార్య నడిగెను. ఆమె వేవురఁ బోలెడువాని నొక్కనిఁ గోరికొనెను. ఆమెకోరిక యనుగ్రహించి యగస్త్యుఁడు తపోవ్రతమున నుండెను. పిమ్మట లోపాముద్ర గర్భవతి కాఁగాఁ గాలక్రమమున నామెకు ననవద్యుఁడగు దృఢస్యుఁడను కుమారుఁ డుదయించెను. దృఢస్యుఁడు పెరిగి పెద్దవాఁడైన పిదప నాతనికిఁ దేజస్వి యను కుమారుఁడు పుట్టెను. ఈ ప్రకార మగస్త్యుఁడు పుత్రపౌత్ర వంతుఁడై పితరులకుఁ బుణ్యలోక గతుల నొనగూర్చెను.*

### అగస్త్యుఁడు కవేరకన్యను వివాహమాడుట

తొల్లియొకనాఁడు బ్రహ్మదేవుఁడగస్త్యాశ్రమమున కేతెంచెను. అగస్త్యుఁడు శ్రద్ధాభక్తులతో విరించి కర్ఘ్యపాద్యాదు లొసంగి సుఖాసీనుఁ జేసి "చతురాననా! మహా తపః ప్రభావముననైన నలభ్య దర్శనుఁడ వగునీవు నాయింటి కేతెంచుట నాయదృష్టము. మహాత్ము లూరక రారుగదా! ఇట్లు నీవు నాపైఁ గటాక్షము చూపి నందులకు సదా కృతజ్ఞుఁడను. ఏమి యానతి!" యని వినయవిధే

* భారతము — అరణ్యపర్వము.

యతలతో బ్రహ్మనడిగెను. సృష్టికర్త "మహనీయ తపోనిధీ! నీవంటి యుత్తమ మహర్షుల మూలముననే కదా విశ్వస్థితి సాధ్యమైనది! మహర్షి కల్పులనవరతము మాకుఁ బూజ్యులు స్మరణీయులుఁ గదా! ఇఁక నావచ్చినపని యొకటి కలదు. పూర్వ మొకప్పుడు కవేరుఁడను రాజర్షి పరమశివునిఁగూర్చి మహాతపస్సు చేయఁగా నాతఁడు ప్రత్యక్షమై కవేరునికోరిక యడిగెను. కవేరుఁడు భయభక్తి తాత్పర్యములతోఁ దనకు ముక్తినిమ్మనికోరెను. ఈశ్వరుఁ డాలోచించి యాపని విరించి సిద్ధింపఁ జేయును గాన నాతనిఁగూర్చి తపింపుమని చెప్పి వెడలి పోయెను. కవేరుఁ డానందముతో నన్నుగుఱించి ఘోర తపస్సు చేయఁగా నేనుబ్రత్యక్షమై యాతని వాంఛా సంసిద్ధికై నాకుమారియగు విష్ణుమాయ యాతనికిఁ గూఁతురై జన్మించునని చెప్పిపోతిని. తరువాతఁ గవేరునకుఁ బుత్రిక జన్మించినది. ఆమె యిపుడు తండ్రికి ముక్తినొసఁగుటకై యుగ్రతపస్సు చేయుచున్నది. ఆమె యొక యంశమే నీ భార్యయగు లోపాముద్రగాఁ దొల్లి నేను సృష్టించితిని. లోపాముద్రను నీవు వివాహమాడితివి, ఈ కవేరకన్యను సైతము నీవు వివాహమాడవలయును. దానివలన నీకు నామెకును శ్రేయమగు" నని వేఁడుకొనెను. అగస్త్యుఁడు "చతుర్ముఖా! నీవింతగాఁ జెప్ప వలయునా? నీ యాజ్ఞ నాకవశ్యానుష్ఠేయము కదా!" యని విరించిని బంపివైచి యగస్త్యుఁడు కవేర కన్యాన్వేషణమునకై బయలుదేఱెను.

తపఃకార్శ్యముచే దివ్యసుందరముగ నొప్పు కవేరకన్య నగస్త్యుఁడు సమీపింప నామె యగస్త్యుని పాదారవిందములపైఁ బడి, "మహాత్మా! త్రిలోకపూజ్యులగు తమ దివ్యదర్శనమునఁ బునీతనైతిని. తమ కృపాకటాక్షములఁ బఱపి నాయాతిథ్య మంగీకరించి ననుఁ గృతార్థను జేయవే! "యని వేఁడుకొనియెను. అగస్త్యుఁడు "తరుణీమణీ! నేనేతత్కార్యార్థమే నిను వలచి వచ్చియున్నాను. కాన

నన్నుఁ బరిణయమాడు" మని యడిగెను. కవేరకన్య "తేజోనిధీ! నాకంతటి భాగ్యమే కలిగినఁ గావలసినదేమి? ఇంతకును దాము లోపాముద్రా పరిపూర్ణపార్శ్వలుగదా! ఇఁక నా కెటఁ దావున్నది? అదియునుగాక నే నవతికాలముననే నదినై పోవుచున్నాను. నావలనఁ దమకెట్టిసుఖము గల్గు?" నని యడిగెను. అగస్త్యుఁడు "కాంతామణీ! లోపాముద్ర నీ యంశముచేతనే జనించినది. కావున నందు సంశయింపఁబనిలేదు. ఇఁక నీవు నదివైనను నీ పత్నీత్వము నాకాంక్షితమే" యని బదులు చెప్పెను. కవేరతనయ యనుమతించి యగస్త్యుని వివాహమైన వెంటనే నది యయ్యెను. అగస్త్యుఁ డామెను దన మండలువున నుంచుకొనెను. ఈ కవేరతనయయే తరువాతఁ గొంత కాలమునకు వింధ్యగర్వాపహరణార్థ మగస్త్యుఁడు పోవుచుఁ దన కమండలువును శిష్యులఁ గొని తెమ్మని చెప్పి పోఁగా సహ్యాపర్వత సమీపమున నగస్త్యుఁడు లేకుండుటఁ జూచి తనకార్యము జ్ఞప్తికి రాఁగా నామె నదియై నేలపైఁబడి ప్రవహించి పోయెను. ఈ నదియే కావేరినది. ఈ నదియందు స్నానము చేయుటతోడనే కవేరరాజర్షి సద్యోముక్తి నందెను. *

### అగస్త్యుఁడు సముద్రోదకము నాపోశనించుట

కృతయుగమున నొకప్పుడు వృత్రుఁడను రాక్షసుఁడు కాలకేయాదులతోఁ గలసి యింద్రుని జయించి వేల్పుల బాధించుచుండఁగా వారు బ్రహ్మకడ కేఁగి మొఱవెట్టుకొనిరి. బ్రహ్మ వారితో దధీచికడ కేఁగి యాతని యస్థులఁగొని వృత్రు నింద్రుఁడు జయించునని తెల్పఁగా సరస్వతీతీరమున కరిగి వారు దధీచిని బ్రార్థించిరి. దధీచి దేవహితార్థమై ప్రాణములు విడువఁగా నాతని యస్థులను దేవత లాయుధములుగా గ్రహించిరి. త్వష్ట యిచ్చిన వజ్రాయుధముచే నింద్రుఁడు వృత్రుని జంపెను కాని, కాలకేయగణములు పగలెల్ల సముద్రములో దాఁగి

* స్కాందపురాణము — తులాకావేరీ మాహాత్మ్యము.

యుక్తులై ధర్మచరితులైన ఋషులఁ జంపినఁగాని జగమున కపాయము వాటిల్లదని కాలకేయాదులు వశిష్ఠాశ్రమమున నూట తొంబది యేడ్గురను, చ్యవనాశ్రమమున నూర్వురను, భరద్వాజాశ్రమమున నిరువదుండ్రను బ్రహ్మవిదుల భక్షించిరి. ఇట్లుపద్రవముఁ గొనితెచ్చు కాలకేయుల నెట్లు వధించుటో తెలియక యింద్రయమాగ్ని వరుణ కుబేరాదు లెల్లరును విష్ణుమూర్తిని ప్రార్థించిరి. విష్ణుమూర్తి వారి మొఱలాలించి యగస్త్యమహర్షి యాసముద్ర జలములఁ బానము చేయఁగలఁడనియు నపుడు రాక్షసులు బయలుపడఁగా వారిని జంపుఁడనియుఁ జెప్పి పంపివేసెను. వెంటనే యమరు లగస్త్యుపాలికేఁగి స్తుతించి తమ వచ్చినపని నెఱిఁగించిరి. అగస్త్యుఁడును దేవహితార్థమై యమరగణముఁ గూడి మహర్షి యక్షగణములు తన్ననుసరింప వచ్చి సముద్రము నొక్కసారిగా నాపోశనించెను. త్రిజగజ్జను లచ్చెరువందిరి. దేవయక్షగణము లభినందించెను. అంతఁ గాలకేయగణములు బయలుపడఁగానే దేవతలు విజృంభించి యసురుల నిశ్శేషము చేసి "పీతసముద్రుఁ"డని యగస్త్యు నెంతయుఁ గీర్తించిరి. పిదప నాతనిని

"మునినాథ! నీ యనుగ్రహ
మున నిగ్రహ మొదిగె నఖిల భువనంబుల కి
వ్వనధిఁ బయఃపూర్ణముగా
నొనరింపుము నీవ కాని యొరు లోప రిలన్"

ఇది యనేక జంతువుల కాశ్రయము. కాన, రిక్తమై యుండరాదు. తిరిగి పూరింపు మని వేఁడుకొనిరి. కాని, అగస్త్యుఁడు "దేవతలారా! ఈ సముద్రజల మంతయు నా కిదివఱకే జీర్ణమయి పోయినది. *నే నిపుడు మూత్రద్వారమునుండి పూరింపఁగల"నని

---

* "ఇది స్కాందపురాణమున, భారతారణ్యపర్వమునఁ గల గాథ.

"నిశ్శేష పీతోజ్ఝితసింధురాజః" అని రఘువంశము.

యట్లు చేసెను. ఈ కారణముననే నాఁటి నుండి సముద్రజల ముప్పన యయ్యెను; పర్వదినములందక్క స్నానపానాదుల కనర్హమయ్యెను.

### అగస్త్యుఁడు శ్రీరాముని కుపకరించుట

అగస్త్యుఁ డాపిమ్మట ఘోరతపో నియమమును బాటింప దండకావన మధ్యమున నొకయాశ్రమము నిర్మించుకొని యందుండెను. ఆ సమయముననే శ్రీరామచంద్రుఁ డరణ్యవాసముచేయుచు శరభంగుఁడు, మందకర్ణి మున్నగు మహర్షులను దర్శించి సీతాలక్ష్మణ సమేతుఁడై వారిచేఁ బూజింపఁబడి సుతీక్ష్ణమునీశ్వరు నాశ్రమమున కేఁగెను. అచటఁ గొంతగాలముండి తరువాత శ్రీరాముఁ డగస్త్యాశ్రమమునకు సతీసహోదరులతో నేతెంచెను. అగస్త్యమహర్షి శ్రీరామ లక్ష్మణులఁ గౌఁగిటఁ జేర్చి మూర్ధాఘ్రాణ మొనరించి యాశీర్వదించి, పురోభాగమున నున్న సీతామహాసాధ్వి నభినందించి ముప్పురకు నతిథి సత్కారములఁ జేసి యానందించెను. అప్పటి కగస్త్యుఁడు వానప్రస్థాశ్రమమున నుండుటచేఁ దదుచితముగా శ్రీరామాదులఁ బూజించి శ్రీరామునకు దివ్యమైన ఖడ్గయుగ్మము, వైష్ణవమైన విల్లు, అమోఘబాణములు, అక్షయమైన అమ్ములపొది, ఇచ్చి గౌతమీతీరమునఁ గల పంచవటి యందాశ్రమము నిర్మించుకొనియుండుట శ్రేయస్కరమని సూచించెను. సీతాలక్ష్మణ సహితుఁడగు శ్రీరాముఁ డగస్త్యు ననేక వందనములతో స్తుతించి ముందునకుఁ బయనమైపోయెను.

తరువాతఁ గొంతకాలమునకు శ్రీరామరావణుల ఘోర యుద్ధకాలమున రాముఁడు రావణ తీవ్రబాణములచే ముంపఁబడి భావికర్తవ్యము మఱచి యున్న తరుణమున నగస్త్యుఁడు శ్రీరాముని సన్నిధికేతెంచి శ్రీరాముఁడు విష్ణుమూర్తియగుట జ్ఞప్తికిఁదెచ్చి యాతని యనంతప్రభావమును గీర్తించెను. పిమ్మట శ్రీరామునకు

నిఖిల జయప్రదమును నిఖిలైశ్వర్య మంగళ సౌభాగ్యావహమును సక దురితదూరీకరణచణమునగు నాదిత్యహృదయ మను పుణ్యమహా వమును సాదరముగా నుపదేశించి శ్రీరాముని కుత్సాహము విజృ భింపఁ జేసెను.

### ఆదిత్యహృదయము

"రశ్మిమంతం సముద్యంతం దేవాసుర నమస్కృతమ్ ।
పూజయస్వ వివస్వంతం భాస్కరం భువనేశ్వరమ్ ॥
సర్వదేవాత్మకో హ్యేష తేజస్వీ రశ్మిభావనః ।
ఏష దేవాసుర గణాన్ లోకాన్ పాతు గభస్తిభిః ॥
ఏష బ్రహ్మా చ విష్ణుశ్చ శివస్స్కందః ప్రజాపతిః ।
మహేంద్రో ధనదః కాలో యమస్సోమో హ్యపాంపతిః ॥
పితరో వసవస్సాధ్యా హ్యశ్వినౌ మరుతో మనుః ।
వాయుర్వహ్నిః ప్రజాప్రాణా ఋతుకర్తా ప్రభాకరః ॥
ఆదిత్య స్సవితా సూర్యః ఖగః పూషా గభస్తిమాన్ ।
సువర్ణ సదృశో భానుః హిరణ్యరేతా దినాకరః ॥
హరిదశ్వ స్సహస్రార్చిః సప్తసప్తిర్మరీచిమాన్ ।
తిమిరోన్మథనశ్శంభుః త్వష్టా మార్తాండ అంశుమాన్ ॥
హిరణ్యగర్భ శ్శిశిరః తపనో భాస్కరో రవిః ।
అగ్నిగర్భోదితేః పుత్రః శంఖః శిశిరనాశనః ॥
వ్యోమనాథ స్తమోభేదీ ఋగ్యజుస్సామపారగః ।
ఘనవృష్టి రపాం మిత్రో వింధ్యవీథీప్లవంగమః ॥
ఆతపీ మండలీ మృత్యుః పింగళస్సర్వతాపనః ।
కవిర్విశ్వో మహాతేజా రక్తస్సర్వభవోద్భవః ॥
నక్షత్రగ్రహతారాణా మధిపో విశ్వభావనః ।
తేజసామపి తేజస్వీ ద్వాదశాత్మన్నమోఽస్తుతే ॥
నమః పూర్వాయ గిరయే పశ్చిమే గిరయే నమః ।
జ్యోతిర్గణానాం పతయే దినాధిపతయే నమః ॥

జయాయ జయభద్రాయ హర్యశ్వాయ నమోనమః।
నమో నమస్సహస్రాంశో ఆదిత్యాయ నమోనమః॥

నమ ఉగ్రాయ వీరాయ సారంగాయ నమోనమః।
నమః పద్మప్రబోధాయ మార్తాండాయ నమోనమః॥

బ్రహ్మేశానాచ్యుతేశాయ సూర్యాయాదిత్యవర్చసే।
భాస్వతే సర్వభక్షాయ రౌద్రాయ వపుషే నమః॥

తమోఘ్నాయ హిమఘ్నాయ శత్రుఘ్నాయామితాత్మనే।
కృతఘ్నఘ్నాయ దేవాయ జ్యోతిషాంపతయే నమః॥

తప్త చామీకరాభాయ వహ్నయే విశ్వకర్మణే।
నమః తమోభి నిఘ్నాయ రుచయే లోకసాక్షిణే॥

నాశయత్యేష వై భూతం త దేవ సృజతి ప్రభుః।
పాయత్యేష తపత్యేష వర్షత్యేష గభస్తిభిః॥

ఏష సుప్తేషు జాగర్తి భూతేషు పరినిష్ఠితః।
ఏష చైవాగ్నిహోత్రంచ ఫలం చైవాగ్నిహోత్రిణామ్॥

వేదాశ్చ క్రతవశ్చైవ క్రతూనాం ఫలమేవచ।
యానికృత్యాని లోకేషు సర్వఏష రవిః ప్రభుః"॥

ఈ ఆదిత్యహృదయ పారాయణముచే శ్రీరాముఁ డచిర కాలముననే శత్రునిర్మూలనమున విజయలక్ష్మి సందఁగల్గెను.

శ్రీరాముఁడు రావణుని జయించిన పిమ్మట నయోధ్యాపురమునఁ బట్టాభిషిక్తుఁడై నతనిఁ గణ్వాది మహర్షులతోనగస్త్యమహర్షియు శ్రీరాముని జూడ నేఁగి యాతని సంస్తుతించిన, శ్రీరాముఁడు రావణాదుల జనన విజయాది వృత్తాంతముల నడుగఁగా నగస్త్యుఁడాతని కెల్ల వినిపించెను. మఱియొకప్పుడు సీతాదేవి వాల్మీక్యాశ్రమమునఁ గుశలవులఁ గన్న పిదపఁ బుష్పకవిమానారూఢుఁడై పోవుచు శ్రీరాముఁడగస్త్యాశ్రమమున కేతెంచెను. అగస్త్యమహర్షి తాను జేయు

చున్న యాగమును బూర్తిజేసి శ్రీరాముని బూజించి యొక విచిత్ర రత్నమయనవ్యవిభూషణము నొసఁగఁగా శ్రీరాముఁడది యెట్లువచ్చె ననియు దానిని దానుగ్రహింపవచ్చునా యనియు నగస్త్యు నడిగెను. అగస్త్యుఁడు శ్వేతుఁడను రాజర్షి వృత్తాంతముఁ జెప్పి యాతఁడే యా భూషణమును దన కిచ్చెననియు నృపాలున కెవ్వరేమిచ్చినను గైకొన వచ్చు ననియుఁ జెప్పెను. శ్రీరాముఁడానందముతో దానిం గైకొని ధరించి దండకారణ్యవృత్తాంతము నగస్త్యునివల్ల విని యగస్త్యునిఁ గీర్తించి యయోధ్యకుఁ బోయెను *

### అగస్త్యమహర్షి నహుషుని శపించుట

తొల్లి యొకానొకప్పుడు నహుషుఁడనురాజు బ్రహ్మనిష్ఠుఁడై నూఱుయజ్ఞములుచేసి యుత్తములగు కుమారులఁగని దేవత్వము నొంది, యింద్రుఁడు విశ్వరూపునిఁ జంపినపాపమునకు వెఱచి పాఱి పోఁగా దేవతల యభిమానమును జూఱగొని యింద్రపదవి నధిష్ఠించెను. కాని, కాలక్రమమున నైశ్వర్యమదాంధతయు భోగలాలసతయు వృద్ధికాఁగా నహుషుఁడు శచీదేవితోడి పొత్తు నాకాంక్షించెను. ఉత్తమ పతివ్రతయగు శచీదేవి యుపాయ మాలోచించి మునివాహనుఁడై తనకడ కేతెంచినచో నాతని యభీప్సితముఁ దీర్తునని యాతనికి వర్తమానమంపెను. నహుషుఁడును వివేకవిహీనుఁడు నార్యవృత్తిరహితుఁడునై సహస్రోత్తమ బ్రాహ్మణధృతమైన బ్రహ్మరథమున నెక్కి బ్రాహ్మణానమాన మొనర్చి ప్రసంగవశమున గోసంప్రోక్షణమందుఁ జెప్పఁబడిన బ్రాహ్మణములైన మంత్రములు తనకుఁ బ్రమాణములు కావని ఋషులతో వాదించెను. పూర్వాచార్యుల మంత్రములను నిందించుట యజ్ఞానమని యగస్త్యుఁ డనఁగా నహుషుఁ డాతనిఁ దలపైఁ దన్నెను. అగస్త్యమహర్షి యట్టిఘోరదుష్కృతమును జూచి యూరకుండలేక

* రామాయణము.

వెంటనే యత్యుగ్రాహివి కమ్మని శాపమిచ్చెను. తత్క్షణమే నహుషుఁడు శక్రాసనమును బాసి క్రూరసర్పమై వచ్చుచు నగస్త్యుని పాదములపైఁబడి "మహాత్మా! క్షమింపుము. నే నెంతయుఁ బశ్చాత్తప్తుఁడనైతిని. బలవద్విధి వైపరీత్యముఁ దప్పింప నేరితరము? కావలసినదైనది. కావున నాకుఁ బూర్వస్మృతి చెడకుండను, బలవంతములగు జంతువులు నన్ను ముట్టి బలహీనము లగునట్లును, శాపమోక్షమున కుపాయమును బ్రసాదింపు" మని కృతాంజలియై వేఁడుకొనెను. అగస్త్యుఁడు వెంటనే కరుణించి యాతనివరము ననుగ్రహించెను. ఆహా! మన మహర్షులెంత దయార్ద్రహృదయులో కదా! పరమ బ్రహ్మర్షుల నవమానించిన దుష్కృతమునకు ఘోర శాపమిచ్చి నహుషుని దౌష్ట్యమును బోఁద్రోలిన యగస్త్యమహర్షి పశ్చాత్తప్తుఁడైన యానహుషునే వరమున ననుగ్రహించుట యాతని యనంత మహత్త్వమును జాటుచున్నది. ఇట్టి పవిత్రాత్ములగు మహాశక్తిసంపన్నులఁ గడుపారఁగన్న భారతవర్ష మెంత పవిత్రమైనదో కదా!

## అగస్త్యమహర్షి ద్వాదశవార్షికయజ్ఞము

ఒకానొకప్పు డగస్త్యమహర్షి ద్వాదశవార్షికయజ్ఞ మారంభించెను. ఈ మహాయజ్ఞము పండ్రెండు సంవత్సరములు జరిగెను. ఆ యజ్ఞమున దివ్యానుభావముగల పరమ మునులు ఋత్విజులై నిజప్రౌఢి నఖిలతంత్రములు నడుపుచుండిరి. కాని, కొండొక కారణమున నింద్రుఁడు వర్షింపకుండెను. ఓషధులు వికలత్వము నందెను. ఇది చూచి మునీశ్వరు లగస్త్యుని యన్నదానవిధి యెట్లు నెఱవేఱునో యని భయపడఁ దొడఁగిరి. న్యాయసమ్మతమైన ద్రవ్యమును గాని యొండు ద్రవ్యముల నాతఁడు వినియోగింపఁడుకదా! మఱి వానలు లేనిచో మునుల కెట్లీతఁడు భోజనము పెట్టఁగలఁడని వారు సంశయించిరి. అగస్త్యమహర్షి యిది యెఱిఁగి యింద్రుఁడు

పదవి వహించి జగమును బోషెద ననియు లేనిచోఁ ద్రిజగముల నెచట బహుళోదారద్రవ్యకోటు లున్నవో వాని నెల్లఁ దెప్పించెద ననియుఁ దనశక్తి సంపన్నతను విశదీకరింప మునివరులెల్లరు నగస్త్యుఁడు తపోధనము వ్యయింప నక్కఱ లేకయే తామే తెచ్చుకొందు మని వంతలు దక్కి యాగకార్యము నెఱవేర్ప మొదలిడఁగానే దేవేంద్రుఁ డీ సంగతిఁ దెలిసికొనీ భయభ్రాంతుఁడై కుంభవృష్టిఁ గురియ సంభోద ములఁ బంపి వెంటనే బృహస్పతిని వెంట నిడుకొని వచ్చి వినయవిన మితగాత్రుఁడై యగస్త్యుని శరణుచొచ్చి మన్నింప వేఁడుకొనెను. అంత నగస్త్యుఁ డాతనిని గౌరవించి యర్చనలిచ్చి శాంత ప్రియ వచనముల నెల్లరకుఁ బ్రమోదముఁ గల్పించి యింద్రుని బృహస్పతిని బంపివైచెను. తరువాతఁ ద్రిలోకవినుతముగా జన్నము పూర్తి యయ్యెను. అగస్త్యుఁడు వినయవిధేయతలతోఁ బరమమునులగు ఋత్విజుల కెల్లర కర్చనలిచ్చి యామంత్రించి యపూర్వమాహాత్మ్యము నందెను. *

అగస్త్యుఁడు తారకబ్రహ్మోపదేశము నందుటకై అవిముక్త క్షేత్రమున కరిగి యచట విశ్వేశ్వరుని సేవించుచుండెను.

### దేవత లగస్త్యునికై వెదకుట

ఇటు లుండ, వింధ్యపర్వతము మేరుపర్వతముపైఁ గల యసూయ, సూర్యుఁడు తనచుట్టుఁ దిరుగక మేరుపర్వతము చుట్టుఁ దిరుగు ననుకోపము కారణములుగా నొకప్పుడు మిక్కిలి పెరిగి సూర్యచంద్రనక్షత్రముల గమనమున కవరోధము కలిగించెను. అందుచే రాత్రిందివము లేర్పఱుపరాక లోకవ్యవహార మాఁగిపోయెను. అపుడు దేవత లెంత ప్రార్థించినను వింధ్యకుఁ గోపముపశమింప

* భారతము — అరణ్యపర్వము.

డాయెను. వారంత బ్రహ్మపాలి కరిగి యంతయుఁ జెప్పి తమ్ముఁ గాపాడఁ గోరిరి. బ్రహ్మ యాపని తనవలనఁ గాదని, అవిముక్త క్షేత్రమునఁ దపము చేసికొనుచున్న అగస్త్యమహామునియే వారిని రక్షింప సమర్థుఁడని పోయి యాతని సేవింపుఁడని తెలిపెను. అది విని దేవతలు బ్రహ్మ చెప్పినచొప్పున బయలుదేఱి భూలోకమునకు దిగి కాశీ పట్టణముఁ జేరి పిదప:

"పంచాక్షరీ మంత్రపారాయణమునకు
  నెవ్వానిమానసం బేడుగడయు
దర్పోద్ధతు లగువాతాపీల్వలులకును
  వధశిలాస్థాన మెవ్వానికుక్షి
ఆది నెవ్వానిదివ్యావతారమునకుఁ
  బూర్ణాంబుభాండంబు పురిటియిల్లు
మెఱసి లోపాముద్ర మెఱుఁగుఁబాలిండ్లపైఁ
  బవళించు నెవ్వానిభవ్యమూర్తి

కవరి యెవ్వానికంఠహుంకారరవము
కొండచిలువకులమ్ములోఁ గూల్చె నహుషు
నట్టిపరమమహాతేజు నఘుతేజు
వెదకి రానందవనములో విబుధమునులు."

(కాశీ. ౨. ౪౦)

పిమ్మట, నటఁ గాననైన పెద్దలవలనఁ గందువ యెఱిఁగి నెమ్మదిగా వారగస్త్యమహర్షి యాశ్రమమును బ్రవేశించిరి.

### అగస్త్యాశ్రమ వర్ణనము

అగస్త్యుని పుణ్యాశ్రమములో దివ్యమహిమము లెన్నో విరాజిల్లుచుండెను. అచట నాఁడేనుఁగు తొండమెత్తి సింహపుఁ బిల్లను లాలించును. తనవాఁడిగోళ్ళతోఁ బులి లేడిపిల్ల మొగమెత్తి ముద్దాడును. తోడేలు చింబోతుల బిగికౌఁగిటఁ జేర్చి ప్రేమచూపును.

చెలగాటమాడును. ఎండతాఁకువేళ ముంగికి త్రాచుపాము పడగవిప్పి గొడుగుగాఁ బట్టును. అచటి కొండగొఱ్ఱెలు కోతులతోఁ జొత్తు గలిగి మెలఁగును. ఇట్టి వింతలు గల అగస్త్యాశ్రమముఁ గన్న దేవతలు పొందిన యానందాశ్చర్యము లనంతములు.

### దేవత లగస్త్యుని గొల్చుట

ఇట్లు కాశీనగరమునకుఁ గ్రోశమాత్రదూరమందు గంగాతీరమున బ్రహ్మ లోకమును దలదన్నుచు వెలయు అగస్త్యుని పర్ణశాలఁ జేరి లోపాముద్రాసహితుఁ డగు మహర్షిని దేవతలు కాంచిరి. అగస్త్య మహర్షి యపుడు నిమిషనిమిషమునకు భక్తిపారవశ్యమునఁ బార్వతీ వల్లభుని బహుమనోహర కంఠస్వరమునఁ బలుమాఱు స్తుతించుచుండెను. కొంతసేపామహాత్ముడు యోగనిరూఢి నుండి పిదపఁ బ్రసన్నుఁడై ప్రశాంతిముద్ర ధరించి యున్నసమయమున జయజయధ్వానములతో సురలాతనిఁ జేరి మ్రొక్కి నాతఁ డెదు రేఁగి వారందఱకు సత్కారము లొనర్చి సుఖాసీనులఁ గావించి వచ్చినపని యడిగెను.

### బృహస్పతి అగస్త్యునితో వచ్చినపనిఁ దెల్పుట

దేవత లెల్లరికోరికపైని బృహస్పతి అగస్త్యునికి నమస్కరించి స్తుతించి ప్రక్కనున్న లోపాముద్రాసాధ్విని బ్రస్తుతించి యిట్లనెను. "మునిచంద్రా! నీవు ప్రణవమవు. ఈమె వేదవిద్య. నీవు తపస్సువు. ఈ సాధ్వి శాంతి. నీవు ఫలము. ఈమె సత్క్రియ. నీవు సూర్యుఁడవు. ఈమె చైతన్యలక్ష్మి. నీయందు బ్రహ్మతేజము, ఈమెయందుఁ బతివ్రత తేజము ప్రజ్వరిల్లు చున్నది. ఈయుభయ తేజఃపుంజము మాకు క్షేమ మొసంగును." అని వింధ్యవృత్తాంతము, సూర్యచంద్రాదుల గమన మాఁగిపోవుట, దానివలన లోకమునకుఁ గలిగిన మహావిపత్తును సమస్తముఁ దెలిపి యానచ్చిన దేవతాధిపులను వేరు వేరఁ జూపి వింధ్యగర్వ ముడిసి యిందఱకు మేలు చేయుమని యర్థించెను.

ఆ మాటలు విని అగస్త్యుఁడు 'దేవకార్యసిద్ధికి యత్న మొనరించెదను. కాశీపతి యతనిసతి మనపాలఁ గలరుకదా! భయములేదు పోయి రం'డని వారినెల్లరను వీడ్కొలిపెను. అగస్త్యుని యభయమునకు వారెల్ల రమితానంద మంది యాతనికిఁ బెక్కునతులొనర్చి వీడ్కొని నిజనివాసముల కరిగిరి.

## వింధ్యగర్వాపహరణము

అగస్త్యుఁడు దేవకార్య నిమిత్తమేయైనను బుణ్యరాశియగు కాశి విడువవలసి వచ్చినందులకుఁ బరిపరివిధములఁ బరితపించి లోపాముద్రాసహితుఁడై యందలి దేవతలయొద్ద సెలవు గైకొని యెట్టకేల కెట్లో కాశిని విడిచి కొంత దవ్వరిగి యొక్కచోఁ జతికిలఁబడి "సాధ్వీ! సుఖదుఃఖములు కారణములేక మానవులకుఁ గలుగవు గదా! పరమసుఖాకరమైన యీ కాశీక్షేత్రమును వీడిపోవలసిన దుఃఖప్రాప్తికి మనమేమి చేసితిమి? కాశ్మీరములందుఁ గుంకుమ మనునది దేశాపేక్ష, పగలు పద్మము రాత్రి కలువపూవు వికసించుట కాలాపేక్ష, పుణ్యాత్మునకు సుఖము, పాపాత్మునకు దుఃఖము అదృష్టాపేక్ష. సర్వము ఈశ్వరాయత్త మనునది ఈశ్వరాపేక్ష, ఈశ్వర ప్రేరణమునఁ గర్మమే సుఖదుఃఖములఁ గూర్చు నని నాయుద్దేశము. ఈశ్వరుఁ డెవనిని రక్షింపఁదలఁచెనో వానిచేఁ బుణ్యకర్మములు చేయించు. ఎవనిని జెఱుపఁదలఁచెనో వానిచేఁ బాపకర్మములే చేయించును. ఈ కర్మలకుఁ గారణ మన్న అవిద్యతోఁ గూడిన రాగద్వేషాదిక్లేశపంచకము. ఈ కర్మఫల మిహాపరలోకములఁ బ్రాణులనుభవించును. కర్మకు హేతువైన క్లేశపంచక మున్నంతకాలము జన్మము, సుఖదుఃఖభోగము, పునర్జన్మ హేతుకరణము - ఇవి తప్పవు." అని పలు తెఱఁగుల వాపోయి, కాశిఁ దలఁచి తలఁచి దుఃఖించి మరలఁ బ్రయాణము సాగించి వింధ్యపర్వత ప్రాంతము సమీపించెను.

అగస్త్యమహర్షిని దూరమునుండి చూచి వింధ్యపర్వతము వెనుకటివలె నొదిగిపోయెను. వెంటనే లోకోపద్రవము తొలఁగిపోయి గ్రహాగమనములన్నియు మునుపటివలె జరిగెను. అపుడు పురుషాకృతిఁ దాల్చి వింధ్యపర్వతము అగస్త్యమహర్షికి సాష్టాంగము లొనర్చి, అతిథిసత్కారములుచేసి "మహానుభావా! భృత్యునాజ్ఞాపించి కటాక్షింపు" మని వేఁడుకొనెను. అగస్త్యుఁడు "పర్వతరాజా! మా దంపతు లిరువురము దక్షిణాపథమునఁ దీర్థములాడఁ బోవుచున్నారము. పెద్దల మైత్రిమి కావున, నీ శిరశ్శృంగముల నెక్కి దిగుట మాకుఁ గష్టము. కాన, మేము తిరిగివచ్చు వఱకు నీవు భూమి సమముగ నుండవలయును." అని పలికెను. "మహాత్మా! చరాచర ప్రపంచమున నీయాజ్ఞ చేయనివారెవరు? అట్లే పడియుండెదను. నన్నుఁ గటాక్షింపు" మని వింధ్యము పలుకఁగా అగస్త్యుఁడు సంతసించి వీడ్కొలిపి ముందునకుఁ బోయెను.

వింధ్యపర్వతము సహజముగఁ గల పెంపుకూడఁ గోల్పోయి మద ముడిగి సిగ్గుపడి చచ్చినట్లు పడియుండెను. అసూయాగ్రస్తుల గతి యింతేకదా!

### అగస్త్యుఁడు దక్షిణకాశికిఁ బోవుట

ఈ విధముగా భువనోపద్రవము నరికట్టి అగస్త్యుఁడు దక్షిణకాశిఁ గన్నఁగాని తన కాశీవియోగబాధ పోఁజాలదని భార్యాసహితుఁడై తీర్థయాత్రలు చేసికొనుచు మందమంద ప్రయాణముల గోదావరీతీరమును బట్టి ఆంధ్రదేశముఁ జేరెను. పిదప, నాతఁడు పంపాసరోవరము, దండకారణ్యము దాఁటి పట్టిసము, కోటిపల్లి, ఏలవల మున్నగు చోట్ల విడిసి దక్షవాటముఁ జేరి యట భీమేశ్వరుని భజించి సుఖించెను. పరోపకార పరాయణుఁడైన వానికి సంపదలు పుంఖానుపుంఖము సంభవించును. తీర్థస్నాన జపహోమ దేవతార్చనాదులు పరోపకారమును బోల నేరవు. పరోపకారముకంటెఁ బరమధర్మము

లేదు. లోకోపకార పరాయణుఁడైన అగస్త్యుఁడు దక్షారామమునఁ బరమసౌఖ్యము అనుభవించెను.

పిదప నాతఁడు భార్యాసహితుఁడై వీరభద్ర శిఖరమీక్షించి దాని విశేషము లోపాముద్రకుఁ దెలిపి ముందునకు బయనించి కొల్లాపుర మేఁగి యట లక్ష్మిదర్శనముఁ జేసికొనెను.

## అగస్త్యకృత లక్ష్మీస్తోత్రము

కొల్లాపురమున అగస్త్యమహర్షి భక్తి భరితుఁడై లక్ష్మి నిట్లు స్తుతించెను. "తల్లీ! నీవు చంద్రునియందు వెన్నెలవు. సూర్యుని యందుఁ బ్రకాశమవు. అగ్నియందు దాహశక్తివి. అట్టి కల్యాణ మూర్తివగు నీకు నమస్కారములు. అమ్మా! బ్రహ్మవిష్ణుమహేశ్వరులు నీ కరుణా ప్రభావముననే సృష్టిస్థితిలయములు జరపుచుందురు. ఇందిరా! పండితుఁడన్నను, శూరుఁడన్నను, వివేకియన్నను, వదాన్యుఁడన్నను, ధన్యుఁడన్నను, సమర్థుఁడన్నను, కళావిదుఁడన్నను, ఏమన్నను నీ కటాక్షకలితుఁడేకదా. నీ యంశ విశేషమే పురుషులయందు భాగ్యముగను, స్త్రీలయందు వికాసరేఖగను, మఱి సమస్తమునందు సొంపుగను గానవచ్చుచుండును. దేవీ! నీవు కల చోటు రసవంతము, నీవు లేనిచోటు రసహీనము. నీవు కలవాఁడే సమస్తము కలవాఁడు. నీవు లేనివాఁడు ఏమియు లేనివాఁడే. అబ్ధికన్యా! జలపూర్ణములగు బంగారుకుండలు తొండములతో నెత్తిపట్టి యిరువంకల నేనుఁగులు నిన్నుఁ గొలుచుచుండఁగా, శంఖపద్మమహాపద్మ మకరాదినిధులు నియమమున నిన్నర్చించు చుండఁగా, వింజామరలు తాల్చి దేవగంధర్వ గుహ్యకాంగనలు నీకు వీచోపు లిడుచుండఁగా, మఱియొక వంక నింద్రాది దివిజపతులు చేతులు మోడ్చి స్తుతించుచుండఁగా, పద్మమధ్యమున నిండుకొలువుండి యఖిలలోకములను రక్షించు జగజ్జననివగు నీకుఁగోటి మ్రొక్కులు." అని పెక్కు

తెలుఁగుల స్తుతింప లక్ష్మి యాతనికిఁ బ్రత్యక్షమై "ఋషివరా! నీస్తుతికి సంతసించితిని. నీవు రాఁగల యిరువదితొమ్మిదవ ద్వాపరమున వ్యాసుఁడవై వారణాశిలో వేదశాస్త్ర పురాణసంహితా ధర్మశాస్త్రముల వక్కాణింపఁగలవు. నీవిపుడు తుంగభద్రా తీరమునకరిగి కిష్కింధ ప్రాంతమునఁగల స్వామిమల యను నడవిలో నున్న కుమార స్వామిని దర్శించి యతని వలనఁ గాశీ ప్రశస్తిఁ దెలిసికొని యేఁగుము." అని పలికి లోపాముద్ర నాదరించి యామెకు బహువిధములగు దివ్యాభరణము లిచ్చి వీడ్కొలిపెను.

ఇట్లు చరితార్థులైన యా దంపతులు పయనించి పయనించి శ్రీశైలమునఁ జేరిరి. అట నొక్కచోఁ గూర్చున్నతఱి అగస్త్యుఁడు లోపాముద్రకు శ్రీశైల మహత్త్వముం దెలిపి యా పర్వతశిఖరమును జూచినంతమాత్రనే ముక్తి కలుగునని చెప్పెను. అంత నామె చనవు బలిమిని "నాథా! ఈ శిఖరముఁ జూచినంతనే ముక్తి కలుఁగుచుండఁగా నిఁకఁ జచ్చినఁగాని మోక్షము లేని కాశి కేఁగు టెందులకు?" అని పలికెను.

### లోపాముద్రాగస్త్య సంవాదము

మఱియు నామె "దేవా! కొందఱు కేవల విజ్ఞానముచాలు నందురు. కొందఱు విజ్ఞానసహితమైనకర్మ ముఖ్యమందురు. వ్రతదాన క్రతుయోగములు, తపోబ్రహ్మచర్యగార్హస్థ్య వానప్రస్థ సన్న్యాసాశ్రమములు, వేని కవియే ముక్తిప్రదములందురు. వీనియన్నిటిలో సులభముక్తిమార్గము సెలవీయుఁ" డని కోరెను. అగస్త్యుఁడామె కిట్లు బదులు చెప్పెను. "సాధ్వీ! శ్రీశైలాదులన్నియు ముక్తిప్రదములే యేలన, నివి కాశీప్రాప్తికరము లగుటవలన. ఇఁకఁ గాశియే సాక్షాన్ముక్తిహేతువు. అందుచే నది గొప్పది. ప్రయాగ, నైమిశము, కురుక్షేత్రము, గంగాద్వారము, అవంతిక, అయోధ్య, మధుర,

ద్వారక, సరస్వతి, మున్నగున వెల్ల ముక్తి కారకములగు తీర్థములు. నీకొక్క రహస్యము చెప్పెద. ఈశ్వర కటాక్షము లేక పోయినచోఁ దీర్థయాత్ర చేయవలెనను బుద్ధియే పుట్టదు. తీర్థయాత్రా కాంక్ష లేనిచోఁ బ్రతిబంధ పాపము పోవదు. ఆ పాపము నశింపనంత వఱకుఁ గాశీప్రాప్తి లేదు. కాశీవాస యోగము లేనిచో విజ్ఞానము విస్తరింపదు. జ్ఞానమునఁగాని మోక్షము లేదు. వేదాంత వాక్యముల వలనఁ బుట్టిన సుజ్ఞానమే జ్ఞానము. మిగిలినదెల్ల అజ్ఞానము.

తరుణీ! మానస తీర్థములే మోక్షహేతువులు. బాహ్య తీర్థములకంటె నివి మేలు. అవి యేవందువా వినుము. సత్యము, ఇంద్రియనిగ్రహము, అనసూయ, దానము, దయ, సంతోషము, బ్రహ్మచర్యము, ధైర్యము, యమము, సమత్వము, విజ్ఞానము ఇవన్నియు మానస తీర్థములు. ఇవియాడనివారికి బాహ్యతీర్థము లాడుట వలన నించుకంతయైనను బ్రయోజనము లేదు. ఏలయందువా తీర్థజలములలో మునిఁగినంతనే మోక్షము కలుగనున్నచో నిత్యమందే యుండు చేఁపలకు, కాఁబేళ్ళకు, మొసళ్ళకు, ముందు మోక్షము కలుగవలెగదా! సుదతీ! కల్లుకుండ యెన్నిమాఱులు కడిగిన శుద్ధి యగును? అట్లే మానసిక తీర్థము లలవఱచుకొన్నఁ గాని బాహ్య తీర్థప్రయోజనము లేదు. దేహమునందలి యంగములకువలెఁ దీర్థముల భేదము కలదు. ఎవ్వరేమిచ్చినను బుచ్చుకొనక పోవుట, అహంకారము లేకుండుట, కోపముఁజంపుకొనుట, ఆలస్యము చేయకుండుట, సత్యనిష్ఠ, సమాధానము, శ్రద్ధ, హేతునిష్ఠ మున్నగునవెల్ల సాంగోపాంగములై ఫలములిచ్చును. కాని, ఎన్ని తీర్థములైనను కాశీప్రాప్తి ఈయఁగలవు "కాశీకాతీర్థమాడనివాఁడు లక్షతీర్థములాడినను మోక్ష లక్ష్మి నందలేఁ" డని యుదాహరణమునకుఁ గొన్ని పూర్వగాథ లామెకుఁ దెలిపెను.

ఆ పిమ్మట సతీసహితుఁడై అగస్త్యుఁడు శ్రీశైలమునకుఁ బ్రదక్షిణ నమస్కారము లొనరించి ముందున కేఁగి స్వామిమలఁ జేరి యందుఁ గుమారస్వామిని దర్శించెను.

### కుమారాగస్త్య సంవాదము

కుమారస్వామి పత్నీసహితుఁడైన అగస్త్యమహర్షిని రమ్మని కుశలమడిగి కూర్చుండ నియమించి వచ్చినపని యడిగెను. అగస్త్యుఁడు కాశీమాహాత్మ్యమును దెలుపుమని కోరెను. కుమారస్వామి "అయ్యా! నన్నడిగితివి కాని కాశీమాహాత్మ్య మెవ్వరును వర్ణింపఁ జాలరు. యథాశక్తిఁ దెలిపెదను. నిన్నుఁ గొల్లాపుర లక్ష్మి యిచటికిఁ బుత్తెంచుట యెఱుఁగుదును. కాన, నీ వేమి విన వలతువో కోరుకొ"మ్మనెను. అంత, అగస్త్యుఁడు కుమారస్వామికి నమస్కరించి కాశికిఁ గల నామములు, విశేషములు తెలుపమనెను. కుమారస్వామి యవి యెల్లఁ దెలిపెను. పిదప నాతఁడు మణికర్ణికా మాహాత్మ్యము, కాశీతీర్థమాహాత్మ్యము, కాలభైరవచరిత్రము, హరికేశచరిత్రము, జ్ఞానవాపికాతీర్థ మాహాత్మ్యము, కళావతికథ, అగస్త్యునకుఁ దెలిపెను. పిదప, సదాచార నిరూపణముఁ జేయుమనఁ గుమారస్వామి "ఋషీంద్రా! మనువు, అత్రి, భృగువు, భరద్వాజుఁడు, యాజ్ఞవల్క్యుఁడు, ఉశనసుఁడు, అంగీరసుఁడు, యముఁడు, ఆపస్తంబుఁడు, సంవర్తుఁడు, కాత్యాయనుఁడు, బృహస్పతి, శాతాతపుఁడు, శంఖుఁడు, లిఖితుఁడు, పరాశరుఁడు మున్నగువారు సదాచారము నిరూపించిరి. అవి యెల్లఁ దెలుప సాధ్యముకా"దని దిఙ్మాత్రముగఁ దెలిపెను. పిదప, కాశీనగరమును గుఱించిన సమస్త విషయములు అగస్త్యునకుఁ గుమారస్వామి తెలిపెను. ఇవన్నియు విని అగస్త్యుఁ డానందించి సభార్యుఁడై స్వామి నారాధించి సెలవు గైకొని ముందునకుఁ బయనమై పోయెను. *

* స్కాందపురాణము — కాశీఖండము.

## అగస్త్యవ్యాసుల వృత్తాంతము

కాశీక్షేత్రమును శపింపఁబూనిన కారణమున వ్యాసుఁడు శిష్యసమేతుఁడై వారాణసీపురమునుండి విశ్వేశ్వరునిచేఁ ద్రోలి వేయఁబడి వచ్చుచుండఁగా లోపాముద్రాసహితుఁడగు నగస్త్య మహర్షి యాతని కెదురయ్యెను. ఆ ఋషిపుంగవు లొకరినొకరు కౌఁగిలించుకొని పరస్పరము కుశలప్రశ్నము లొనరించుకొనిరి. పిదప, సశిష్యులగువారు తుల్యభాగాతీరమునఁ గల బిల్వవనమునందలి చలువ రాతితిన్నెలపైఁ గూర్చుండి కొంతకాల మిష్టకథా వినోదములఁ బ్రొద్దు పుచ్చిరి. అనంతరము వ్యాసుఁడు కాశీఁ బాసి వచ్చుటకుఁ గారణ మేమని యగస్త్యుఁ డడుగఁగా నాతఁ డంతయుఁ బూసగ్రుచ్చినట్లు చెప్పి యన్నపూర్ణ యాజ్ఞ వలన దక్షిణ కాశి యగు దక్షారామమునకు విచ్చేసితి ననియు భీమేశ్వరుఁడు తన్నుఁ గాపాడుఁగదా యని పలికెను. అగస్త్యుఁడు వ్యాసు నోదార్చి దక్షారామమహిమఁ దెలిపి వ్యాసుని కోరికపైఁ దన తపోమహత్త్వముచే నాకాశమున కెగయించి వ్యాసాదుల కగస్త్యుఁడు భీమమండలమును జూపి ఇంద్రేశము, సిద్ధేశ్వరము, యోగీశము, కాలేశ్వరము, శమనేశము, వీరభద్రేశము, బ్రహ్మేశము, కపాలేశ్వరము, కుక్కుటేశము, సోమనాథేశ్వరము, శ్రీమహేశము, రామతీర్థము అను ద్వాదశ క్షేత్రములఁ దెలిపి వానినెల్ల వేర్వేఱ నిరూపించి దక్షాధ్వరానలము, అఖిలేష్టసంసిద్ధి, సోమేశ్వరము, హైమవతము, సప్తగోదావరము అను పంచతీర్థములఁ జేర్కొని వానియందెల్ల వ్యాసు నోలలాడించెను. ఆ తరువాత నాతఁడు వ్యాసునితో భీమేశ్వరాలయముం బ్రవేశించి దాని మహాత్త్వమును వేయినోళ్ళఁ దెలిపెను. వ్యాసుఁడు శివు నర్చించి బ్రహ్మానందమందెను, పిదప, అగస్త్యుఁడు సగౌరవముగా నాతని వీడ్కొని భార్యాసహితుఁడై తన యాశ్రమమునకు వెడలి సుఖముండెను.

పరశురాముఁ డొకప్పు డగస్త్యమహర్షిని దర్శించి యాతనిచేఁ గృష్ణామృత స్తోత్రమును విని కృష్ణకవచధరుఁడై యిరువదియొక్క మాఱు రాజులఁ జంపెను.

### అగస్త్యుఁడు భూభారము తగ్గించుట

తొల్లి హిమగిరిపైఁ బార్వతీపరమేశ్వరుల వివాహము జరుగుచుండఁగా నా కల్యాణమును జూచుటకు యక్ష కిన్నర సిద్ధ కింపురుషులు నెల్లరు వచ్చి బ్రహ్మానంద సముద్రమున నోలలాడుచుండిరి. అప్పుడు భూదేవి దక్షిణదిక్కునఁ బైకి లేచుటయు నుత్తరదిశను లోనికిఁ గ్రుంగిపోవుటయు సంభవించెను. అందఱును భయపడసాగిరి. అంతఁ బరమేశ్వరుఁ డగస్త్యమహర్షిని బిల్చి "కుంభసంభవా! ఈ యుపద్రవమునుండి కాపాడుటకు నీవు దక్క నన్యులెవ్వరును గానవచ్చుటలేదు. కావున నీవు సశిష్యుఁడవై దక్షిణదిక్కునకుఁ బొమ్ము. అంత భూమి సమమగును. అచటనుండియే నీవును నీ శిష్యులును నా కల్యాణ మహోత్సవము చూడఁగలశక్తి యనుగ్రహించితిని ఆలసింపక పొ"మ్మనెను. అంత నగస్త్యమహర్షి శివునానతిని లోపాముద్రాపరిపూర్ణపార్శ్వుఁడై శిష్యసమేతముగా దక్షిణమునకుఁ బోయెను. అంత భూదేవి భారము తగ్గుటచే యథాపూర్వముగ సమవర్తిని యాయెను. అగస్త్యమహర్షి యట్లు సర్వేశ్వర కటాక్షముఁ బడసి సశిష్యుఁడై లోపాముద్రతో నట నుండియే దివ్యచక్షువులచేఁ బార్వతీ పరమేశ్వరుల కల్యాణ మహోత్సవమును గాంచి యానందాంబుధి నోలలాడెను.*

### అగస్త్యుఁ డింద్రద్యుమ్నుని శపించుట

పూర్వ మొకప్పుడు ద్రవిళాధీశుఁ డగు నింద్రద్యుమ్నుఁడు వైష్ణవోత్తముఁడై సర్వాత్ముఁ డగు నారాయణు నారాధించుచు నొక

* శివపురాణము

శైలాగ్రమునఁ బూజాపరతంత్రుఁడై యుండెను. ఒకనాఁ డటకుఁ గలశజుఁ డరుదెంచి నిలిచియుండెను. ఇంద్రద్యుమ్నుఁ డాతనిఁ గాంచియు నేమఱిపాటున నిర్లక్ష్యముగా నూరకుండెను. అగస్త్యుఁ డాతని నిర్లక్ష్యబుద్ధికిఁ గినిసి యాతఁడు నీచగజయోనిం బుట్టుఁగా కని శాపోదకమును విడిచెను. ఇంద్రద్యుమ్నుఁ డప్పటి కొడ లెఱిఁగి భక్తి తాత్పర్యములతో నగస్త్యుని పాదములపైఁ బడి "మహాత్మా! నేను నిర్లక్ష్యబుద్ధితో లేను. ఈ శైలాగ్రభాగమున నుండి గృహీత మౌననియతితో సర్వాత్ముఁడైన నారాయణు నూహించుచు దేహస్మృతి వీడి యుండుటచే నిన్నుఁ గనఁజాలకపోయితిని. అంతియకాని మఱియొక భావమున నున్నవాఁడను గాను. నన్నుఁ గరుణింపవే!" యని ప్రార్థించెను. అగస్త్యమహర్షియు "నృపాగ్రణీ! నీ విషయము నే నెఱుఁగుదును, ఎట్టి పుణ్యాత్ములైనను విప్రులఁ గని యిచ్ఛామూలమునఁ గాని పరేచ్ఛా కారణమునఁగాని యేమఱి గాని యవమానించి రేని యది దుష్కృతమే యగును. నీవు పుణ్యాత్ముఁడవు. నేఁటి విప్రావమానదోషము నిలిచియున్నచో ముందుముందు నీ కది ప్రమాదహేతు వగును. ఏతద్దోషపరిహారణార్థమై నీవు గజ జన్మము నెత్తక తప్పదు. ఇదియు విధివిలసితము. కాని, నీవు నారాయణ భక్తి వరిష్ఠుఁడవు, కనుక గజజన్మ మెత్తియు నీవు నారాయణచరణ సేవ నేమఱనికతమున నే ముక్తి నందఁ గలవు పో" మ్మని కలశజుఁడు దనదారిఁబోయెను. ఇంద్రద్యుమ్నుఁ డేనుఁగై పుట్టి యొకకాసారమున జలమును గ్రోలుతఱి నొక మకరముచేఁ బట్టువడి యితఃపర మెఱుఁగక విష్ణుమూర్తిని బ్రార్థింపగా నాతఁడు ప్రత్యక్షమై శాప విమోచనముఁ జేయ నాతఁడజ్ఞానరహితుఁడై విష్ణురూపుఁడై వెలసెను. ఈ గజేంద్రమోక్షమే శ్రీమద్భాగవతమందలి గజేంద్రమోక్షణము.

### అగస్త్యుఁడు మణిమంతుని శపించుట

తొల్లి యొకప్పుడు కుశవతి యను పుణ్యనదీతీరమున నమరులు సత్రయాగము చేయుచుండిరి. కాని కాహుతుఁడై కుబేరుఁడు పుష్పక

విమానమున శతమహాసంఖ్యగల యక్షరాక్షస బలములతోఁ ప్రియసఖుఁడైన మణిమంతుఁ డనువానితోఁ గూడి యాకాశమార్గమునఁ బోవుచుండెను. దారిలో యమునానది గలచోట నాకసమునఁ బోవు విమానమునుండి మణిమంతుఁ డుమ్మివైచెను. అది యమునానదీ తీరమున నూర్ధ్వబాహుఁడై యుగ్రతపము చేయుచున్న యగస్త్యుని పైఁ బడెను. అగస్త్యుఁడు వెంటనే విమాన మాఁపుచేయ దిగివచ్చి నమస్కరించిన కుబేరుని జూచి 'మూర్ఖుఁడగు నీ మిత్రుఁడు నాపై నుమిసెఁ గావున నాతఁడొక్క మానవునిచేతఁ జచ్చు. అతని పరివారమైన యీ యక్షరాక్షసగణములెల్ల నా నరునిచేతనే చచ్చు'నని శపించి పొండనెను. కుబేర మణిమంతు లగస్త్యుని గటాక్షింపు మని ప్రార్థించి సెలవుగైకొని పోయిరి. ఈ యగస్త్య శాపముకతముననే సౌగంధిక ప్రసవాపహరణ సమయమున మణిమంతుఁడు నాతని పరివారము భీమసేనుని చేతిలోఁ జచ్చిరి. *

## అగస్త్యుఁడు భద్రాశ్వు నను గ్రహించుట

కృతయుగమున నవవర్షములలో నొకవర్షమునకుఁ దనపేర భద్రాశ్వనామధేయంబుఁ గల్పించిన భద్రాశ్వుఁ డను రాజు నిజభార్యయగు కాంతిమతీదేవితో నుండ నగస్త్య మహర్షి యేతెంచి యాతనిచే నెన్నో మన్నన లంది పద్మనాభ వ్రత సంబంధ మగు దీపమాలికలం గాంచిన ఫలమున వా రా జన్మమున నంతయైశ్వర్యము గాంచిరని వారి పూర్వజన్మ వృత్తాంతమును దెలిపి వారి కేతద్వ్రత విధానమును బోధించి యనుగ్రహించెను.

మఱికొంత కాలమున కాతఁడు పుష్కరతీర్థమున కేఁగి కుమారస్వామిని భజించి వచ్చి భద్రాశ్వునకు మఱికొన్ని వృత్తములఁ దెలిపెను. అందిలావృతవర్షమున నున్నతఱిఁ దనకు నారాయణుఁడు

* భారతము — అరణ్యపర్వము.

వైకుంఠపురమున నిజభవనమును జూపి "వత్సా! ఈ చరాచరము జలరూపమున నావరించి వరుణాభిధేయుఁడ నగు నారాయణుఁడను నేనే. నీవు మద్భక్తుఁడ వగుట దీనిని గంటివి ఏతద్దర్శన ఫలముకతన నీ కేకాలమునను జేటు లేదు. "పో" మ్మని వీడ్కొలుపుటను దెలిపి వాని నాశ్చర్యమగ్ను నొనర్చెను †

"అగస్త్యగీత:" "అగస్త్య సంహిత."

అగస్త్యమహర్షి లోకోత్తరపురుషుఁడై యాజీవితాంతము జగద్ధితమునకై పాటుపడినవిశ్వశ్రేయస్కరుఁడు. మహాభారతమందలి శాంతిపర్వమున వెలయు నీతని ప్రసిద్ధ మహా విద్యాబోధనయే యగస్త్య గీతానామమునఁ జిరస్థాయియై నిల్చినది. మఱియు, నీ మహర్షి రామచంద్ర విష్ణునామవాద్యవతార పూజావిధానము శాస్త్రోక్తముగాఁ దెలిపియుండెను. ఇదియే "యగస్త్యసంహిత" యనఁ బరగుచున్నది. *

అగస్త్యమహర్షి జీవితమంతయుఁ బ్రసిద్ధ బ్రహ్మవిద్యాబోధకమే యైయున్నది. ఈతని తత్త్వసారమంతయు;

"శివుఁడే దాత శివుండె భోక్త శివుఁడే
చేయున్ మఖాదిక్రియల్
శివుఁడే విశ్వము నే శివుండ...."

నను సద్భుతాద్వైతానుసంధానమునఁ బ్రవ్యక్తమైన దనఁ జెల్లును. సతీసహితుఁడై సమస్తతీర్థములఁ గ్రుంకివచ్చి యగస్త్యమహర్షి దేహశుద్ధికి యమనియమాదులకు నవి యవసరములే యైనను:

"తీర్థములు మానసములు ముక్తిప్రదములు"
"బాహ్యతీర్థావళులు ముక్తిఫలము నీవు"

అని తన సాధ్వీమణికిఁ దీర్థపరమార్థమును వెల్లడించినాఁడు.

---

† వరాహపురాణము. * సంస్కృతవాచస్పత్యము

## అగస్త్యుఁ డొసంగిన 'ఆదిత్య కవచము'

"జపాకుసుమ సంకాశం ద్విభుజం పద్మహస్తకం।
సిందూరాంబర మాల్యం చ రక్తగంధానులేపనమ్॥

మాణిక్యరత్న ఖచిత సర్వాభరణభూషితం।
ధ్యాయేత్పఠేత్సువర్ణాభం సూర్యస్య కవచం ముదా॥

ఘృణిః పాతు శిరోదేశే సూర్యః పాతు లలాటకమ్।
ఆదిత్యో లోచనే పాతు శ్రుతీ పాతు దివాకరః॥

ఘ్రాణం పాతు సదా భానుః ముఖం పాతు సదా రవిః।
జిహ్వాం పాతు జగన్నేత్రః కంఠం పాతు విభావసుః॥

స్కంధౌ గ్రహపతిః పాతు భుజౌ పాతు ప్రభాకరః।
కరా వబ్జకరః పాతు హృదయం పాతు భానుమాన్॥

మధ్యం పాతు సుసప్తాశ్వో నాభిం పాతు నభోమణిః।
ద్వాదశాత్మా కటిం పాతు సవితా పాతు సక్థినీ॥

ఊరూ పాతు సురశ్రేష్ఠో జానునీ పాతు భాస్కరః।
జంఘే మే పాతు మార్తాండో గుల్ఫౌ పాతు త్విషాంపతిః॥

పాదౌ దినమణిః పాతుపాతు మిత్రోఽఖిలం వపుః।
ఆదిత్య కవచం పుణ్యం అభేద్యం వజ్ర సన్నిభమ్॥

సర్వరోగ భయాదిభ్యో ముచ్యతే నాత్ర సంశయః।
సంవత్సర ముపాసిత్వా సామ్రాజ్య పదవీం లభేత్॥

అనేకరత్న సంయుక్తం స్వర్ణమాణిక్య భూషణమ్।
కల్పవృక్ష సమాకీర్ణం కదంబ కుసుమప్రియమ్।
అశేషరోగ శాంత్యర్థం ధ్యాయే దాదిత్య మండలమ్॥

సిందూరవర్ణాయ సుమండలాయ సువర్ణ రత్నా భరణాయ తుభ్యమ్।
పద్మాది నేత్రేచ సుపంకజాయ బ్రహ్మేంద్ర నారాయణ శంకరాయ॥
సంరక్తచూర్ణం ససువర్ణతోయం సకుంకుమాభం సకుశం సపుష్పమ్।
ప్రదత్తమాదాయచ హేమపాత్రే ప్రశస్తనాదం భగవన్ ప్రసీద॥

### అగస్త్యుఁ డొనర్చిన 'ఆదిత్యస్తోత్రము'

"ధ్యాయేత్సూర్యమనంతకోటి కిరణం తేజోమయం భాస్కరం।
భక్తానా మభయప్రదం దినకరం జ్యోతిర్మయం శంకరమ్॥
ఆదిత్యం జగదీశమచ్యుత మజం త్రైలోక్య చూడామణిం।
భక్తాభీష్ట వరప్రదం దినమణిం మార్తాండ మాద్యం శుభమ్॥
కాలాత్మా సర్వభూతాత్మా వేదాత్మా విశ్వతోముఖః।
జన్మమృత్యు జరావ్యాధి సంసార భయనాశనః॥
బ్రహ్మా స్వరూప ఉదయే మధ్యాహ్నేతు మహేశ్వరః।
అస్తకాలే స్వయం విష్ణుః త్రయీమూర్తిః దివాకరః॥
ఏకచక్రరథోయస్య దివ్యః కనక భూషితః।
సోయం భవతు నప్రీతః పద్మహస్తో దివాకరః॥
పద్మహస్తః పరంజ్యోతిః పరేశాయ నమోనమః।
అండయోనిర్మహాసాక్షి ఆదిత్యాయ నమోనమః॥
ధర్మమూర్తి ర్దయామూర్తిః సత్యమూర్తిర్నమోనమః।
సకలేశాయ సూర్యాయ శాంతీశాయ నమోనమః॥

### అగస్త్యార్ఘ్యప్రదానవిధానము

అగస్త్యమహర్షి జగజ్జేగీయమానుఁడై నేఁటికిని భాద్రపద మాసమున భూలోకమునకు నక్షత్రరూపమున దర్శనమొసఁగుచు పండువట్టిన నీటి కాలుష్య ముడిపెడుకతకఫలమై మనస్స్మృతిపథమునకు వచ్చుచుండును.

అగస్త్య నక్షత్రోదయము కాఁగానే విప్రులు సుస్నాతులై కాశపుష్పముతో అగస్త్యప్రతిమను జేసి పుష్పధూపాదులతో నర్చించి యర్ఘ్యప్రదాన మొసఁగి పూజావిధానము నెఱవేర్చి రాత్రి జాగరము చేయవలయును. అట్టివారి కిష్ట కామ్య సిద్ధియు మోక్షపదప్రాప్తియు నాతఁ డొసఁగుచుండును.

"కాశపుష్ప ప్రతీకాశ వహ్ని మారుతసంభవ।
మిత్రావరుణయోః పుత్ర కుంభయోనే నమోస్తుతే॥
వింధ్యవృద్ధిక్షయకర మేఘతోయ విషాపహః।
రత్నవల్లభదేవేశ లంకావాస నమోస్తుతే॥
వాతాపిర్భక్షితో యేన సముద్రశ్శోషితః పురా।
లోపాముద్రాపతి శ్శ్రీమాన్ యోఽసౌ తస్మై నమో నమః॥
యేనోదితేన పాపాని విలయం యాంతి వ్యాధయః।
తస్మై నమోస్త్వగస్త్యాయ సశిష్యాయ చ పుత్రిణే"॥

అని యర్ఘ్యము విడిచి పిమ్మట లోపాముద్రాసాధ్వి నుద్దేశించి

"రాజపుత్రి మహాభాగే ఋషిపత్ని వరాననే।
లోపాముద్రే నమస్తుభ్య మర్ఘ్యం మే ప్రతిగృహ్యతామ్"॥

అని యర్ఘ్యమిచ్చి యగస్త్యప్రతిమను బూజించి విప్రులకు గోదానాదికము నొసంగి, యాదిన ముపవసించినవారికి లోపాముద్రాగస్త్యులు భుక్తిముక్తుల నిత్తురు.

"అగస్త్యాయ నమస్తేఽస్తు అగస్త్యేఽస్మిన్ ఘటేస్థితః
అగస్త్యో ద్విజరూపేణ ప్రతిగృహ్ణాతు సత్కృతః।
అగస్త్యప్రజన్మాఘం నాశయిత్వాఽనయోరయం
ఆపత్యం విపులం సౌఖ్యం ప్రయచ్ఛతు మహామునిః"॥

# మహర్షుల చరిత్రలు

* * *

## అత్రి మహర్షి

అత్రిమహర్షి సప్తమహర్షులలో నొకఁడు. అనసూయా మహా సాధ్వికిఁ బ్రాణనాథుఁడు. నిజతపఃప్రభావమున లోకోత్తరుఁడైన మహాపురుషుఁడు.

### అత్రి జననము

సృష్టికర్తయగు బ్రహ్మదేవుఁడు తనకు సహాయుఁడుగా నుండి ప్రపంచమునఁ గొంత సృష్టిఁ గారకుఁడగు నను నుద్దేశముతో దన మానసమునుండి యత్రిని బుట్టించెను. అత్రి జన్మించి తండ్రికి నమస్కరించి "తండ్రీ! నీవు నన్నేనిమిత్తమై సృజించితివి? నీయాజ్ఞ నాకు శిరోధారణ మగును గాక!" యని పలుకఁగా బ్రహ్మదేవుఁడు సంతసించి "నాయనా! నీవు మహాతపస్సు చేసి లోక సంరక్షణమునకై కొందఱను సృజింపవలయు. సాహాయ్యము నేను చేయుచుందు" నని చెప్పి యత్రిని దపోవనమునకుఁ బంపి బ్రహ్మదేవుఁడు తన నివాసమున కేఁగెను.*

### అత్రి తపోనియతి

బ్రహ్మదేవుని యాజ్ఞానుసార మత్రి బయలుదేఱి యొక వనమున కేఁగి యందుఁ దపోవృత్తి నుండెను. పంచభూతములచే నేర్పడి రక్తమాంసాస్థికలచే హేయమై వినశ్వర మగు దేహముపై నిర్మమత్వము గలిగి యా దేహముకాని యాత్మను దర్శించి తదంతర్లీనత నానందసుస్థిరచిత్తమున నెగడఁ గనుటకే యమనియమములు, ధాన

---

* భాగవతము.

ధర్మములు. తపోవ్రతములు నేర్పడినవి. తాను కాని దేహముపై మమత్వము నశింపఁ జేసికొనుటకుఁ దానైన యాత్మవలని యానంద మనుభవించు శక్తిఁ గనుటకు దేహము నుపవాసాది కఠిననియమములచేఁ గృశింపఁ జేయవలయును. అట్టి దేహ కార్శ్యమువలన దుఃఖము నందక యాత్మానందస్థితిని నిలువఁగలిగినవారే మహర్షులు. ఈ శాశ్వత స్థితికి నిత్యతపోనిరతియే మార్గము. ఈ స్థితినున్న వారనంత శక్తిమయులు. దీనినే యత్రి సాధింప దొరకొనెను. ఇట్టి మహోగ్రతపస్సంపన్నుఁ డగు నత్రిమహర్షి నేత్రగోళముల నుండి కొంతకాలమున కొకదివ్యతేజ ముదయించెను. ఆ మహాతేజ మంతులేనిదై భూనభోంతరమంతయు వ్యాపించెను. దశదిశలు నా తేజము భరింపనెంచి యాహ్వానించెను. కాని యా తేజో విశేష మత్యంతమై నిర్భర మగుటచేఁ గొంతకాలమున కా దశదిశలును మోయఁజాలక వెడలఁగ్రక్కెను. అంత నా దీధితి సముద్రగర్భమునఁ బడెను. ఈ సంగతి బ్రహ్మదేవుఁ డెఱింగి యా ప్రదేశమునకు వచ్చి యా తేజమును దాను ధరించెను. దేవత లిది చూచి యావిరించిని సోమమంత్రములతో స్తుతించిరి. అంత బ్రహ్మ యా తేజోంశమునకుఁ బురుషరూప మొసఁగి యత్రిమహాముని వివాహమైన పిమ్మట నాతని కనసూయయందుఁ దన యంశముచేఁ జంద్రుఁడై జన్మించుననియు నా తేజోంశమే యొకటి తరువాత క్షీరసాగర మథన సమయమున జనించి యా శశాంకునిఁ గలియు ననియు దేవతలకుఁ జెప్పి యా చతుర్ముఖుఁ డంతర్హితుఁడయ్యెను. అత్రి యథాపూర్వము తపోవిద్యానవద్యుఁడై బ్రహ్మచారియై యుండెను. *

## అత్రిమహర్షి వివాహము

కొంత కాలమునకు దేవహూతీకర్దములకు విష్ణుమూర్తి కటాక్షముచేఁ దొమ్మండ్రుకూఁతులును నొకకుమారుఁడును జన్మించిరి.

* మార్కండేయపురాణము.

కర్దమప్రజాపతి తన కూఁతుండ్రను బ్రహ్మర్షులకే యిచ్చి వివాహము చేయనెంచి వారిలో నొకతె యగు ననసూయకుఁ దగినవరుఁ డత్రిమహర్షియే యని యాతనిఁ బిలువనంపెను. అత్రిమహర్షియుఁ గర్దమమునియొద్దకు వచ్చి యాతని కోరికపై ననసూయను వివాహమాడి యత్తమామల యాశీర్వచనము లంది తన యాశ్రమమునకు సభార్యుఁడై వెడలిపోయెను.

ఈ ప్రకార మత్రిమహర్షి గృహస్థాశ్రమమును స్వీకరించి యనసూయాసాధ్వితోఁ గాపురము చేయుచుండెను. అనసూయ తన యద్వితీయ భర్తృసేవలో సమస్తమును విస్మరించుచుండెను. భర్తనే దైవముగా నెంచి యాతనికి సకలోపచారములను జేయుచు నాతని హృదయమును జూఱగొని జ్ఞానోపదేశము, ననంతమహత్త్వము నాతనివలన నామె పడయఁ గల్గెను. ఆహా! ఆహారవిహారనిద్రాసంగమవ్యామోహాదులచే నపవిత్రమై యత్యంత దుఃఖప్రద మగు సామాన్య సంసార జీవనమునకు, నాత్మానవద్యవిద్యానందముచే వినశ్వరదేహసుఖవిదూరము విశ్వమంగళార్థము వినియుక్తము మమకార రహిత మగు మహర్షుల సంసారజీవనమునకు నెంతదవ్వు! *

## త్రిమూర్తు లనసూయకు వరము లొసఁగుట

అందుచే నత్రిమహర్షి దయవలన ననసూయకు నానాఁటికి గొప్పతనము హెచ్చుచుండెను. ఒకనాఁడు బ్రహ్మవిష్ణుమహేశ్వరు లనసూయ మాహాత్మ్యమును బరీక్షింప నెంచి యత్రిమహర్షి యాశ్రమమునకు వచ్చి యాతిథ్యము కోరిరి. అత్రి మహాప్రసాద మనెను కాని, యా త్రిమూర్తులును దమకొక వ్రతము కలదనియు దాని ప్రకార మానాఁడు తమకు వడ్డించు స్త్రీ నగ్నయై వడ్డింపవలె ననియుఁ జెప్పిరి. అత్రిమహర్షి యనసూయతో నీ విషయమును

* భాగవతము – తృతీయస్కంధము.

చెప్పెను. అనసూయ యంగీకరించెను. త్రిమూర్తులు స్నానము చేసి వచ్చి కూర్చుండ వారిపై ననసూయ మంత్రాక్షతములు జలమును జల్లఁగా వారు మువ్వురు నామె మాహాత్మ్యమునఁ జంటిబిడ్డలైరి. ఆమె నగ్నయై వడ్డించి పిమ్మట వస్త్రము ధరించి తిరిగి వారిపై జలము చల్లి యథాపూర్వముగాఁ ద్రిమూర్తులఁ జేసి భుజింపుఁడని కోరుకొనెను. వారు భుజింపఁగనే మరల వారిని శిశువులఁ జేసి తన గృహముననే యుయ్యేలలోఁ బరుండఁ బెట్టి యూఁచుచుండెను. సరస్వతీ లక్ష్మీ పార్వతులు భర్తలను వెదకికొనుచు వచ్చి యనసూయను బతిభిక్షము వేఁడిరి. అనసూయ వారి నాదరించి యాముగ్గురు బిడ్డల నిచ్చెను. వారాశ్చర్యపడి తమ భర్తలను బ్రసాదింపు మని యామెను బ్రార్థించిరి. అనసూయ వారికి మ్రొక్కి మంత్రాక్షతములతో నా బిడ్డలఁ ద్రిమూర్తులఁ జేసి యా త్రిమాతలకు నిచ్చెను. అంతఁ ద్రిమూర్తులును భార్యాసహితులై యనసూయామాహాత్మ్యమునకు మెచ్చుకొని తమయంశములచే లోకోద్ధారకులగు మువ్వురు పుత్రులుదయింతు రని వరమిచ్చి యనసూయాత్రి మహర్షుల నాశీర్వదించి వెడలిపోయిరి. *

మఱియొక పర్యాయము కౌశికపత్ని శాసనమున సూర్యుఁ డుదయింపకుండఁగా లోకోపద్రవము కలిగెను. అప్పుడు బ్రహ్మ పంపున దేవత లా యుపద్రవమును బాపుమని యనసూయను గోరిరి. అనసూయ కౌశికపత్ని నంగీకరింపఁ జేసి సూర్యోదయమగునట్లు కావించి మరణించిన యామె భర్తను వెంటనే బ్రతికించెను. అప్పుడును ద్రిమూర్తులు ప్రత్యక్షమై యామెకుఁ దమ యంశములఁ బుత్రత్రయ ముదయించు నని యాశీర్వదించిరి. †

### అత్రిమహర్షి సంతానమునకై తపముచేయుట

అటుపిమ్మటఁ గొంతకాలమున కత్రిమహర్షి భార్యాసహితుఁడై ఋక్షపర్వతముపై నిలిచి దేవదేవుని గుఱించి శతవర్షములు ఘోరతప

* భాగవతము — మార్కండేయపురాణము. † మార్కండేయపురాణము

మొనర్చెను. ఆ తపోనలముచేఁ ద్రిజగములును గలఁగుఁడువడఁగా బ్రహ్మవిష్ణుమహేశ్వరులు మువ్వురును బ్రత్యక్షమైరి. అత్రి వారిని బూజించి "నేను సత్సంతానార్థమై దేవాదిదేవుని గుఱించి తపమొనర్ప మువ్వురేల వచ్చితిరి? మీలో నధికులెవ? రని వారిని బ్రశ్నించెను. ఆ త్రిమూర్తులును దమ కభేదమని చెప్పి తమ యంశములచేఁ ద్వరలోనే యాతనికి సత్పుత్త్రోదయ మగు నని వర మిచ్చి యదృశ్యులైరి.

## అత్త్రిమహర్షికి లోకోత్తరపురుష ఉదయించుట

కాలక్రమమునఁ ద్రిమూర్తులవరమున నత్రిమహర్షి నేత్రగోళమునుండి చంద్రుఁడును ననసూయాగర్భమున దత్తాత్రేయ దుర్వాసులును గ్రమముగా బ్రహ్మవిష్ణు మహేశ్వరాంశములతో నుద్భవించిరి. ఆ మువ్వు రట్లు జన్మించి దినదిన వర్ధమానులై తల్లిదండ్రుల కధికామోదమును గూర్చుచుండిరి.

ఇట్లు పుత్త్రులు పెరుఁగుచుండఁగా నత్రిమహర్షి తపోధ్యాననిమగ్నుఁడై యనసూయను బిలిచి "సాధ్వీ! నీవు కోరినట్లు సత్పుత్రులుదయించినారు. నే నిఁకఁ దపోజీవనము నభిలషించుచున్నాను. నీవు నాతో నుందువా? లేక యీ బిడ్డలకడ నుందువా?" యని యడిగెను. అనసూయ వినయవిధేయతలతో "మహాత్మా! పుత్త్రు లింకను బెరిఁగి పెద్దవారు కాలేదు. అగుట నిపుడే యాశ్రమాంతరమున కరుగుట ధర్మము కాదు. కావునఁ బుత్త్రపోషణార్థమై పృథుచక్రవర్తికడ కరిగి యర్థముఁ గొనితెండు. వారలఁ బెంచిన పిమ్మట మన ముభయులము వానప్రస్థాశ్రమమున కరుగుట లగ్గు. తమకుఁ జెప్పుటకు నేనెంతదానను! ఐనను దమ యభీప్సితమే యొనరింతు" నని వాక్రుచ్చెను. అత్రిమహర్షియు నామె వాక్యములందలి ధర్మము నౌచిత్యము గ్రహించి ధనార్థియై పృథుచక్రవర్తి చేయుచున్న యశ్వమేధయాగమును జూడ నేఁగెను.

## అత్రిమహర్షి పృథుచక్రవర్తికథ కేఁగుట

అచటఁ బృథుచక్రవర్తి యాగాశ్వమును విడిచి తత్సంరక్షణమునకై పుత్త్రుని బంపుచు నత్రిమహర్షి నాతనికి సాహాయ్యము గమ్మని ప్రార్థించెను. అత్రిమహర్షి యంగీకరించి వెడలెను. పృథుచక్రవర్తి యాగవైభవమును జూడలేక యింద్రుఁడు పాషండవేషమునఁ దిరోహితుఁడై యాగాశ్వము నపహరించి యాకాశమున కేఁగెను. పృథుపుత్త్రుఁ డత్రిసాహాయ్యమున వాని ననుసరించి దేవేంద్రునిపై బాణము వేయ సంశయించుచుండఁగా నత్రిమహర్షి యజ్ఞహంత నెంతవానినైనఁ జంపవచ్చునని యాతనికి బోధించెను. అంతఁ బృథుపుత్త్రుఁ డింద్రునిపై బాణము వేసి నొప్పింప నింద్రుఁ డశ్వమును విడిచి పాఱిపోయెను. అత్రిసహితుఁడై రాజకుమారుఁ డశ్వమును ద్రోలి తెచ్చుచుండఁగా నింద్రుఁడు మఱల దాని నపహరించెను. ఈసారి పృథుపుత్త్రున కది గోచరము కాలేదు. అత్రిమహర్షి దివ్యనేత్రములఁ జూచి యాతనికిఁ జెప్పఁగా నాతఁడు మఱల నింద్రుని దరిమి యాగాశ్వమును గొని తెచ్చెను. అశ్వమేధయాగ మాపై నిర్విఘ్నముగాఁ బూర్తి కాఁగానే పృథుచక్రవర్తి బ్రాహ్మణుల కనేక దక్షిణ లిచ్చి సంతృప్తి పఱచుచుండెను. ఆసమయమున నత్రిమహర్షి పృథుచక్రవర్తి నింద్రుఁ డనియుఁ జంద్రుఁ డనియు విధాత యనియుఁ గీర్తించెను. అట నున్న గౌతమమహర్షి యిది విని "యొక మానవమాత్రు నింతగా నేల నుతింతు" వని యాతనిపైఁ గలుషించెను. అత్రియుఁ దన వాక్యముల దోషము లే దనెను. క్రమముగా నిరువురకు వాదము ప్రబలెను. నాఁటి సభాంగణమునఁ గల ఋషిపుంగవు లాధర్మనిర్ణయముఁ జేయఁ జాలకుండిరి. అంతఁ గాశ్యపమహర్షి లేచి సనత్కుమారుఁడు దక్క నన్యు లీసమస్యఁ దేల్ప లేరని వక్కాణించెను. అంత నాసదస్యు లందఱతో నత్రి గౌతములు సనత్కుమారుపాలి కేఁగి యా వాదమును దెలియఁబఱచిరి. సనత్కుమారుఁడు అత్రి వాక్యము

లందు దోషము లేదనియు "నావిష్ణుః పృథివీపతిః" అను భావమున నవి ధర్మయుక్తములే యని తీర్మానించెను. అంత సదస్యు లందఱును బృథుచక్రవర్తితో నీ నిర్ణయమును నివేదింప నాతఁ డత్రిమహర్షిని గీర్తించి యనేక ధనకనకవస్తు వాహనములిచ్చి సత్కరించెను. అత్రిమహర్షియు వానిని దీసికొని వెళ్ళి పుత్త్రులకుఁ బంచి యిచ్చి వారలు వయసు గన్నంతనే భార్యా సహితుఁడై ధర్మసంహిత బుద్ధితో వనమున కేఁగెను.*

### అత్రిమహర్షి సూర్యచంద్రుల రక్షించి రాక్షసుల భస్మము చేయుట

ఒకప్పుడు దేవతలకు జంభాదిదైత్యులకు గొప్ప యుద్ధము సంభవించెను. అందు రాహునస్త్రసమితిచే సూర్యచంద్రులు సోలిపోఁగా వెలుఁగు నశించి లోకమంతయు నంధకారబంధుర మయ్యెను. అప్పుడు రాక్షసులు విజృంభించి దేవతల నొప్పింపఁదొడగిరి. దేవతలు భయార్తులై యత్రిమహర్షికడ కరుదెంచి దమదుస్థితిని సూర్యచంద్రుల పాటును జెప్పి తమ్ము రక్షింపవలె నని వేఁడుకొనిరి. అత్రిమహర్షియు వెంటనే వారి కభయమిచ్చి సూర్యచంద్రుల శరీరముల నక్షతము లగు నట్లు చేసివైచెను. పిమ్మట నాతఁడు తీక్ష్ణదృష్టిమాత్రముననే రాక్షసులెల్లరు మడియునట్లు చేసెను. అంత దేవతలెల్ల రత్రిమహర్షి కటాక్షమున బ్రతికితి మని యాతని నెంతయు శ్లాఘించి వెడలిరి. ఆహా! మహర్షుల మహత్త్వము వర్ణనాతీతము గదా! జగద్ధితార్థము దేవకార్యనిమిత్తము నత్రిమహర్షి యనంతములగు నిట్టిమాహాత్మ్యము లెన్నిటినో చూపెను.†

### అత్రిమహర్షి సీతారాముల కాతిథ్యమిచ్చుట

భరతుఁడు సపరివారుఁడై యరణ్యమున నున్న సీతారామలక్ష్మణులకడకు వచ్చి శ్రీరామునిపాదుకలు గొని నందిగ్రామమున కేఁగిన

---

* భారతారణ్యపర్వము. † బ్రహ్మాండపురాణము.

పిదప శ్రీరాముఁడు భార్యానుజులతో నత్రిమహర్షి యాశ్రమమున కేతెంచెను. అత్రిమహర్షియు వారిని మిగుల మన్నించి యనసూయాదేవి మాహాత్మ్యము వారల కెఱిఁగించెను. సీతాదేవి యనసూయ వలనఁ బతివ్రతాధర్మములు విని యామెకుఁ దన వివాహవృత్తాంతమును దెల్పెను. అనసూయయు సీతకు నూతనాంబర భూషణములతో శశ్వదలంకృతి యగు కుంకుమ నిచ్చి యాశీర్వదించెను. ఆ రాత్రి సీతారామలక్ష్మణు లత్రిమహర్షి యాశ్రమమునఁ గడిపి మఱునాఁ డుదయమున బయలుదేఱి యేఁగిరి. *

## అత్రిమహర్షి యపరిగ్రహవ్రతపాలనము

అత్రిమహర్షి మొదటఁ గొంతకాలము కశ్యప విశ్వామిత్రాదులతోఁ గలిసి భూమిపైఁ జరించుచుఁ దపశ్చరణతత్పరుఁడై యుండెను. కొంతకాలమున కొక మహాక్షామము సంభవించెను. ప్రతిగ్రహము చేయమని వ్రతము ధరించిన సప్తర్షులు వాఁకలి దీర్చుకొనుటకై యొక శవమును దినఁదొడఁగిరి. వృషాదర్భి యను రాజు వారికడ కేఁగి భోజనపదార్థములఁ బంపెద ననెను. కాని వారు గ్రహింపమనిరి. రహస్యముగా నాతఁ డంపగా వా రంగీకరింపకుండిరి. కొంతకాలము వారు తామరతూండ్లు తిని బ్రతుకనెంచి యొకకొలనుఁ జొచ్చి కొన్ని బిసనాళములను ప్రోగుచేసి కట్టఁ గట్టి గట్టుపై బెట్టి సుస్నాతులై వచ్చుసరికి, దేవేంద్రుఁడు ప్రచ్ఛన్న వేషుఁడై యా తామరతూండ్లను దాఁచివేసెను. సప్తర్షులు నెవరు దాఁచినది తెలియక తామరతూండ్ల నపహరించినవానికిఁ గల్గుదోషముల నిర్వచింపఁ దొడఁగిరి. అంత నింద్రుఁడు వారి యపరిగ్రహమునకు వ్రతపాలనకుఁ దపఃప్రధాన జీవితమునకు మెచ్చి స్వస్వరూపియై మహర్షులతో నత్రిమహర్షిని స్వర్లోకమునకుఁ దీసికొనిపోయి యనేకవిధములఁ బూజించి కృతార్థుఁ డయ్యెను. †

* రామాయణము. † భారతము — అనుశాసనిక పర్వము.

" అత్రి సంహిత "

ఒకమారు ధర్మసంసక్తు లగుఋషు లత్రిమహర్షిని దర్శించి "మహాత్మా! నీవు విశ్వవిదుఁడవు. ఋషిశ్రేష్ఠుఁడవు. విశ్వహితోదయుఁడవు కావున, మాయందుఁ గటాక్షముంచి దైవములలో నుత్తమదైవ మెవరు? ఏది పరమధర్మము? ఏది పరమవిధి? పరమేశ్వరు నర్చించువిధాన మేది? అను సంశయములను దీర్పు" మని వేఁడుకొనిరి. అత్రిమహర్షి చాల సంతసించి వారి నెల్లరఁ దగురీతి సమ్మానించి యిట్లు పలికెను. "ఋషులారా! సర్వదేవతలలోను శ్రీమన్నారాయణుఁడే యుత్తమోత్తమదైవము.. ఈతఁడే పరంధాముఁడు, పరంజ్యోతి, సర్వకారణకారణుఁడును. ఉపవాస వ్రతదాన స్వాధ్యాయాదులచే నాతని నర్చించుటయే పరమధర్మము, పరమవిధి. ఇహాముత్ర సుఖముల కాతని నర్చించుట – అమూర్తార్చనము, సమూర్తార్చనమని - ద్వివిధము, అగ్న్యాహుతి యమూర్తార్చనమనియుఁ బ్రతిమాద్యర్చనము సమూర్తార్చన మనియుఁ దెలియవలెను. వైఖానసమతము ననుసరించిన యర్చనమే యుత్తమము. సాయంప్రాతలయందు గృహమునఁ గాని దేవాలయమునఁ గాని ద్విజులు భక్తిభావముతో నగ్నిహోత్రాది హోమాంతముగాఁ బరమేశ్వరప్రతిమను బూజించుటే సమూర్తార్చనము. భృగుఁడు కాశ్యపుఁడు, మరీచి, నేను దీని నభినందింతు" మని యత్రిమహర్షి యామూలాగ్రముగా నుపదేశించెను. ఇదియే 'యత్రిసంహిత'గా విఖ్యాతి గాంచినది.

ఇం దత్రిమహర్షి కర్మ, ప్రతిష్ఠ, పూజన, స్నపనోత్సవ ప్రాయశ్చిత్తము లను విభాగముల క్రిందఁ దన విషయమును విభజించెను. ఇందు మొదటిభాగమున దేవాలయస్థల పరిశీలనము, దేవాయతన రూపము; దైవప్రతిమానిరూపణము మున్నగువిషయములును, రెండవ భాగమునఁ బ్రధాన పరివార దేవతాప్రతిష్ఠాదికము, మూఁడవభాగమునఁ బూజావిధానమును, నాల్గవభాగమున మహాభిషేకవివరణము, ఐదవభాగమున నుత్సవవిశేషములుఁ బ్రత్యేకోత్సవములుఁ దన్నిబంధనములును, నారవభాగమునఁ బూర్వోక్తవిధానములందలి దోషాదికమునకుఁ బ్రాయశ్చిత్తమును వివరింపఁబడినవి. ఈ ప్రకార మత్రిమహర్షి

దేవతార్చనావిధానమును లోకమునకుఁ జాటి పరమేశ్వరోపాసనమును దన్మూలమునఁ దరణోపాయమును మనకుఁ బ్రసాదించెను.

## అత్రి స్మృతి

అత్రిస్మృతి లేక ఆత్రేయధర్మశాస్త్రమను పేర అత్రిమహర్షి ప్రోక్తమగు ధర్మశాస్త్రము కలదు. విప్రుఁడు శూద్ర స్త్రీని వివాహమాడినచోఁ బతితుఁడే యగునని యత్రిమహర్షి పేర్కొన్నట్లు మనుస్మృతి (iii-16) లోఁ గలదు. ఈ ధర్మశాస్త్రమునఁ దొమ్మిదధ్యాయములు కలవు. దానధర్మములఁ గూర్చియు జపతపముల గూర్చియు రహస్యప్రాయశ్చిత్తాదులను గుఱించియు, యోగము యోగాంగములు మున్నగు వానిని గుఱించియు నెన్నో విషయము లిందుఁ గలవు.

ఇది కాక అత్రి సంహితలు అత్రిస్మృతులను పేర నెన్నియో స్మృతి గ్రంథములు కాన వగుచున్నవి. వీనిలో ప్రాయశ్చిత్తములు, దానములు, పితృమేధము, ఆచారములును, గురుప్రశంస, చాతుర్వర్ణ ధర్మములు, జపమాలాపవిత్రత, బ్రాహ్మణుల కుండవలసిన శౌచానసూయాది సుగుణములు, ఇష్టాపూర్త నిర్వచనము, యమనియమములు, పుత్త్రులు, దత్తపుత్త్రులు, ప్రాయశ్చిత్తములు, అశౌచము, చాంద్రాయణకృచ్ఛ్ర శాంతపనములు, మున్నగు విషయములు కలవు.

దత్తపుత్త్ర స్వీకృతి విషయమున అత్రి యనుశాసనమే మొట్ట మొదటి దని దత్తకమీమాంసలోఁ గలదు. అత్రి ననుసరించి యంత్యజులేడు జాతులవారు. రజకులు, పాదరక్షలు తయారుచేయువారు, నటకులు, బురుడులు, కైవర్తకులు (పల్లెవారు), మేదరులు, భిల్లులు. కాని, యాత్రా వివాహయజ్ఞాదులలోఁ దాఁకఁదగినవారు తాఁకరానివారు నను విషయమునఁ బట్టింపు లేదు. మఱియు, లఘ్వత్రిస్మృతి, వృద్ధాత్రేయస్మృతి యని రెండుస్మృతులు అత్రిమహర్షి పేరఁ గానవగుచున్నవి.

# మహర్షుల చరిత్రలు

* * *

## అష్టావక్ర మహర్షి

పూర్వ మొకప్పు డేకపాదుఁ డను సద్బ్రాహ్మణుఁ డొకఁడు నిరంతరతపోనిరతుఁడై యుండెను. ఆతనికి సుజాత యను నుత్తమ కన్య భార్యయై సకలోపచారములు సంతోషముతోఁ జేయుచుండెడిది. సద్గృహస్థుఁడు వేదవేత్త యగు నేకపాదునికడకు వటువరులు వచ్చి యధ్యయన మర్థించిరి. ఏకపాదుఁడు వటువులయధ్యాపనము కూడఁ దపోంగముగా భావించి శిష్యులచే నెల్లవేళల వల్లింపఁ జేయుచుండెను.

### ఏకపాదుఁ డష్టావక్రుని శపించుట

ఇటు లుండఁ గొంతకాలమునకు భర్తయనుగ్రహమున సుజాత గర్భము ధరించెను. ఏకపాదుఁడు నిరంతర శిష్యాధ్యాపనముతోఁ గాలముఁ గడుపుచుండెను. సుజాత గర్భమునన్న బాలునికి గర్భమున నుండఁగనే పుణ్యవశమున వేదము లలవడెను. ఒకనాఁడాతఁడు మాతృగర్భము నుండియే స్వరము తప్పిన దని తండ్రికిఁ జెప్పెను. మఱియొకపర్యాయ మాతఁడు "నిద్రాహారములైన లేకుండ శిష్యుల నెల్లపుడును జదివింతు వేల? మాతృగర్భమున నుండి యొక్కసారి వినఁగానే నాకు వేదములు వచ్చినవి. వారి నింతగా బాధించు చుందు వేల?" యని తండ్రి నడిగెను. అంత నేకపాదుఁడు తనకు జన్మించు కుమారుఁడు దివ్యమహిమోపేతుఁ డని గ్రహించి యానందించెను. కాని యింత బాల్యముననే తండ్రికిఁ దప్పు దిద్దుటయు నధ్యయనమును గూర్చి వక్రముగఁ బల్కుటయు శిక్షార్హములే కాని క్షమార్హములు గావనియు శిక్షింపవలసినపుడు పుత్త్రభావ మడ్డు రారాదనియు నెంచి యాతని నెనిమిది వంకరలతోఁ బుట్టు మని శపించెను. పిమ్మట నా బాలుఁ డగ్నికల్పుఁడై తల్లి కడుపునఁ బెరుగుచుండెను.

### ఏకపాదుఁడు జలమజ్జితుఁడగుట

ఒకనాఁడు సుజాత ప్రసవకాలమునకు వెఱచి ఘృతతైల ధాన్యములఁ దెం డని యేకపాదునిఁ గోరెను. ఏకపాదుఁడు నట్లే యని ధనార్థియై జనకచక్రవర్తిపాలికిఁ బోయెను. అప్పుడు జనక చక్రవర్తి వరుణపుత్త్రుఁ డగు వందితో వాదము చేసి గెలిచినవారికి సమస్తము నిచ్చెద ననియు నోటువడిన వారు జలమజ్జితులై యుండ వలె ననియుఁ బ్రకటించెను. ఏకపాదుఁడు విజయకాంక్షియై వందితో వాదమునకు దిగి దైవవశమున నోటువడి జలమజ్జితుఁడై యుందుండెను.

### అష్టావక్రుఁ డుదయించి తండ్రిని రక్షించుట

ఇట్లుండగా సుజాత యింటియొద్దఁ బుత్త్రునిఁ గనెను. ఆ పుత్త్రుఁడు తండ్రి శాపకారణమున నెనిమిది వంకరలతోఁ బుట్టి యష్టావక్రనాముఁ డయ్యెను. ఆ సమయముననే సుజాత తల్లి - ఉద్దాలకుని భార్య - కూడ నొకపుత్త్రునిఁ గనెను. అతఁడు శ్వేతకేతుఁ డను నామమునఁ బెరుఁగుచుండెను. మాతుల భాగినేయు లగు నష్టావక్ర శ్వేతకేతు లిరువురును బాల్యము నుండియు నుద్దాలకునికడ నేక సంథాగ్రాహులై చదివి యధ్యయనశూరులైరి. ఉద్దాలకుఁడు తండ్రి యనియు శ్వేతకేతుఁడు భ్రాత యనియు నష్టావక్రుఁ డెంచుచుండెను. ఒకనాఁడు శ్వేతకేతుఁ డష్టావక్రుని "మీ తండ్రికడకుఁ బో" మ్మని కసరెను. అట్లవమానింపఁబడి తల్లి యగు సుజాతకడ కేఁగి యష్టావక్రుఁడు తన తండ్రి సంగతిఁ జెప్పుమనెను. సుజాత యేకపాదుఁడు జనక నృపాలు నగరమున కేఁగి వందితోడి వాదమున నోడి జలమజ్జితుఁ డగుటఁ దెల్పెను.

అష్టావక్రుఁడు వెంటనే మాతులుఁ డగు శ్వేతకేతునిఁ దీసికొని పోయి జనకమహారాజు నాస్థానమునఁ బ్రవేశింపఁజూడ విదగ్ధు లగు వృద్ధులే కాని బాలు రట రాఁ గూడ దని ద్వారపాలకుఁడు

నివారించెను. అష్టావక్రుఁ డట ద్వారపాలునితో సంవాదము చేసి "జ్ఞానము కలిగినవాఁడే వృద్ధుఁడు కాని వయోవృద్ధు వృద్ధా? బాలుఁడైనను జ్ఞాని వృద్ధసమానుఁ డగుట మీ రాజు నన్ను నివారింపఁడు. మఱియు, నంధుని త్రోవకును బధిరుని మార్గమునకు, స్త్రీపథమునకును, రాజ వర్త్మనమునకును, బ్రాహ్మణుని యధ్వమునకును, బ్రతిబంధకము కలిగింపరా"దని యాతఁడు శాస్త్రసమ్మతముగ వాదించెను. ఆద్వారపాలుఁ డాతని శక్తిసామర్థ్యముల కచ్చెరువంది ప్రవేశ మొసఁగెను. జనకునిపాలి కేఁగి యష్టావక్రుఁడు వందితో వాదింతు ననెను. జనకుఁ డాచిఱుతవానిసాహసమునకు మెచ్చియు "నీవంటి బాలుఁడా వందిని గెల్చుట?" యని హేళనము చేసెను. అష్టావక్రుఁడు జనకునితో సంవాదము చేసి తన శక్తిఁ గొంత యాతనికిఁ జూపెను. జనకుఁ డాశ్చర్యపడి వందితో వాదింప నాతని కనుజ్ఞ నిచ్చెను. నాఁడు మహాసభాంగణమున బ్రాహ్మణశ్రేష్ఠుల నడుమ నష్టావక్రుఁడు వాదమున వందిని డీకొనెను. "అగ్ని యొక్కఁడే ప్రజ్వలించును; సూర్యుఁ డొక్కఁడే ప్రకాశించు; శివుఁ డొకఁడే సర్వవ్యాపి" యని వంది ప్రారంభించెను. "ఇంద్రాగ్ను లిద్దఱు మిత్రులు; నారదపర్వత లిద్దఱు దేవర్షులు; అశ్వినేయు లిద్దఱు రూపవంతులు; భార్యాభర్త లిద్దఱు సంసార మూలము" లని యష్టావక్రుఁడు బదులు చెప్పెను. ఈ ప్రకార మిరువురు ద్వాదశ సంఖ్యవఱకు సమానముగా వాదించుచు వచ్చిరి. కాని, యష్టావక్రుఁ డింకను వాదించి వంది నోడించెను. వెంటనే జనక చక్రవర్తి యష్టావక్రు నభినందించి యాజ్ఞాపింపుమనెను. అష్టావక్రుఁడు తన తండ్రిని నాతనితో జలమజ్జితులై యున్న బ్రాహ్మణులను విడిపించి వందిని జలమజ్జితునిఁ జేయింపుమనెను. వంది తన తండ్రియగు వరుణదేవుని యజ్ఞమునకై యామిషచే బ్రాహ్మణప్రవరుల నటకుఁ బంపితినే కాని బాధింప లేదని చెప్పి యష్టావక్రు నభినందించి వెడలిపోయెను. నాఁటినుండి యష్టావక్రుని కీర్తిచంద్రిక లెల్లెడల వ్యాపింపఁ జొచ్చెను.

జనకచక్రవర్తి యష్టావక్రుని నేకపాదుని గడుంగడుఁ బూజించి వక్రునినుండి యద్వైత వేదాంత రహస్యముల నెల్ల గ్రహించెను. క్ర జనకుల యీ సంవాదమే యష్టావక్ర సంహితయై యద్వైత త రహస్యముల నద్భుతముగా వెల్లడించు చున్నది. అంత డాత్మానందమును జూఱగొని యష్టావక్రుని సమ్మానించి .లిపెను

### అష్టావక్రుఁడు నిర్వక్రుఁడై సుందరుఁ డగుట

ఏకపాదుఁడు కుమారుని గొప్పతనమునకును పితృభక్తికిని ంచి యష్టావక్రునిఁ జూచి "నాయనా! నీ యీ యంగవైకల్య పుఁ గారకుఁడను నేను. నీ పితృభక్తి, పాండిత్య మాహాత్మ్య ు సంతసించితిని. నీవు వెంటనే పోయి సమంగానదియందు ్నాతుఁడవై యింటికి ర"మ్మని చెప్పి తా నింటికి వెడలిపోయెను. వక్రుఁడు జనకు ననుమతిని దిన్నఁగా సమంగా నదీజలముల కేఁగి ను మునిఁగి తేలఁ గానే తన దేహవక్రతలు నశించుటఁ గని శ్చర్యపడి యది తన తండ్రి మాహాత్మ్యమని యేకపాదు నెంతయు ంచెను. అతఁ డంత దివ్యసుందరవిగ్రహుఁడై గృహమున కేఁగి ంద్రుల కమితానందముఁ జేకూర్చి వారికి శుశ్రూష చేయుచు కర తపోవృత్తియందుండెను. *

### అష్టావక్రుని వివాహవృత్తాంతము

కొంత కాలమున కేకపాదుఁడు కుమారునిఁ బిలిచి "నాయనా! ; ద్యాపరిగ్రహమున, ననుపమాన బ్రహ్మచర్యాశ్రమమున నీయశో క మనోహరమై వ్యాపించినది. నీ విఁక గృహస్థాశ్రమమును ీ రించి యుత్తమగార్హస్థ్య ధర్మనిర్వహణమున నాకును మీతల్లికిని దము చేకూర్పు" మని పచించెను. అష్టావక్రుఁడు తండ్రి యాజ్ఞ

* భారతము — వనపర్వము.

శిరసావహించి వివాహమాడఁ గృతనిశ్చయుఁ డాయెను. అంత నష్టావక్రుఁడు దనకుఁ దగినకన్నియ యెవతె యని యాలోచించి వదాన్యమహర్షి తనూజ యగు సుప్రభను వివాహము కాఁదలఁచి వదాన్యునాశ్రమమునకుఁ బోయెను.

వదాన్యుఁ డష్టావక్రునికీర్తిచంద్రికలు కాంచినవాఁడయ్యు నాతని నింకను బరీక్షింపఁ గోరియుండెను. తనకడకు రాఁగానే యష్టావక్రు నాతఁడు గౌరవించి వచ్చినపని యడిగెను. అష్టావక్రుడు సుప్రభను వివాహ మొనరింపఁ గోరెను. వదాన్యుఁ డంగీకరించెను. కాని యాతనిఁ బరీక్షింపఁ గోరి "అష్టావక్రా! నీవంటి యుత్తమునకుఁ బిల్ల నిచ్చుటకంటెను నాకుఁ గావలసిన దేమున్నది? కాని, నా కూఁతును వివాహమాడఁ గోరువాఁడు ముందుగా నుత్తరదిశకుఁ బోయి కుబేరుని నగరమును దాఁటి హిమగిరిపైనున్న పార్వతీపరమేశ్వరులఁ బూజించి మఱియు నుత్తరమునకుఁ బోఁగాఁ గాననగుని పవనమును గని యందు సువర్ణనిర్మితమైన సౌధములతో నున్న నగరమును బరిపాలించు రమణిని జూచి యామె యాశీర్వచనమంది రావలయును. అప్పుడు సంతోషముతో నాకొమార్తె యగు సుప్రభ నిచ్చి వివాహము చేయుదు" నని చెప్పెను. ఇది యెంతపని యని పలికి యష్టావక్రుఁడాపనికై బయలుదేఱి పోయెను.

అష్టావక్రుఁడు పర్వతములను నదులను దాఁటుచుఁ బయనించుచుండెను. ప్రకృతిరామణీయకముఁ దిలకించుచు నతఁడు నిజమానసబంధురమును బరమేశ్వరుని పాదారవిందములపై వ్రాలఁ జేయుచు బాహుదానదిఁ గాంచి యం దవగాహితుఁడై యొకదిన మందుఁ గడపి యలకాపురమార్గమును బట్టెను. కుబేరుఁ డష్టావక్రునిరాక యెఱిఁగి వాని కెదురువచ్చి సమాదరముతోఁ బుష్పకారూఢునిఁ జేసి యలకానగరమునకుఁ దీసికొనిపోయెను. అచ్చట బహురమణీయ

స్వర్ణసౌధము నష్టావక్రునకు విడిదిగా నిచ్చి రంభాద్యప్సరోభామల నాతనికిఁ బరిచారికలఁగా నేర్పఱిచెను. వా రనుదినమును నృత్య గీతవాద్యములచే నాతని నానందింపఁజేయు చుండిరి. కాని, యష్టావక్రుఁ డేమాత్రమును వారిమోహవాగురలకు లోనుగాక యొక్క వత్సర మలకాపురమునఁ గడపెను. కుబేరుఁడు నాతనిఁ బలువిధములఁ గీర్తించి వీడుకొలిపెను. అంత నష్టావక్రుఁడు హిమాలయ సమీపమునకుఁ బోయి యటఁ గాననగు మహర్షులకు నమస్కరించుచు నానందతన్మయుఁడై హిమశైలతట మధిష్ఠించెను. అందుఁ బార్వతీ పరమేశ్వరులకుఁ బ్రమథగణములకుఁ బలువిధముల బూజ లర్పించి సర్వేశ్వరస్తోత్రముతోఁ గొంత కాల మటఁ గడపెను. పిమ్మట నింకను నుత్తరమున కేఁగ వదాన్యుఁడు చెప్పిన కడిమిత్రేమ్రాఁకుల యడవి తోఁచెను. అందాతఁడు ప్రవేశింపఁగానే దివ్యసుందరస్త్రీవిలసితము లగు హేమసౌధములు గోచరించెను. వానిని జూచి యాశ్చర్యమందుచు నష్టావక్రుఁడు లోనికిఁ బోయి యట గానవచ్చిన నారీజనానీకము నకు వశుఁడు గాక వారల రాజ్ఞిఁ జూపుమనెను. అంత వారు భవ నాంతర్భాగమున కాతనిఁ గొనిపోయి దివ్య దీధితితో నొప్పు నొక మదవతిని జూపిరి. ఆమె యనంతవిలాస హాసములతో నష్టావక్రు నాహ్వానించి యర్ఘ్యపాద్యాదులొసఁగి యాదరించెను. పిమ్మట రాత్రిపడఁగా నాతని నిష్టమృష్టాన్నముల సంతృప్తునిఁ జేసి యాతఁడు నిద్రించుతఱి నాతనిశయ్యఁ జేరి యామె యతనిఁ గవయఁగోరెను. తా నస్ఖలిత బ్రహ్మచారి ననియుఁ బరసతి నపేక్షించుట పాపహేతు వనియుఁ జెప్పి నాఁటి కాతఁడు తప్పించుకొనెను. కాని మఱునాఁడు మరల నాతని కామె యభ్యంగనాదు లొనర్చి షడ్రసోపేతముగా నతి కాదరమున విందుచేసెను. మమకారరహితుఁడై యాతఁ డన్నిటి కంగీకరించెను. కాని, యారాత్రి తిరిగి యాతనిఁ దన్నుఁ గవయ వలయునని యామె బలవంతము చేసెను. ఆమె యెన్ని చెప్పినను వినక యాతఁడు స్త్రీలకు స్వాతంత్ర్యము లే దనియు బాల్యమునఁ

దండ్రి యౌవనమున భర్త వార్ధక్యమున సుతుఁడు రక్షించును గాని స్త్రీ యెన్నఁడు స్వతంత్రించి యే కార్యమును జేయరా దని యుపదేశించెను. కాని, యామె మన్మథబాధావివరణము చేయుచుఁ దనశక్తి ప్రభావముచే ననుపమాతిశయసౌందర్యశోభిత యయ్యెను. ఐన, నష్టావక్రుఁ డేమాత్రమును చలింపక నిర్లిప్తుఁడై యుండెను. అప్పుడామె స్వస్వరూపమునఁ గానవై తాను వదాన్యుని ప్రార్థనమున నష్టావక్రుఁ బరీక్షింప నంతయుఁ బన్నినయుత్తర దిశాంగన నని చెప్పి యాతనిదీక్షావిజయమున కెంతయు నభినందించి సుప్రభాకన్యను వివాహమై త్రిభువనవినుతముగా గృహస్థాశ్రమమును నిర్వహింపుమని యాశీర్వదించెను. అష్టావక్రుఁడట్లు పరీక్షావిజయమంది వదాన్యు నింటి కేఁగి యావద్వృత్తాంతము నివేదించెను. వదాన్యుఁడు నానందించి వివాహముహూర్త మేర్పఱిచెను. ఏకపాదుఁడు సుజాతయుఁ గుమారుని విజయమున కభినందించి యానందముతో సబంధుమిత్త్ర పరివారముగా నష్టావక్రుని వివాహమునకుఁ దరలివచ్చిరి. సుప్రభాష్టావక్రుల వివాహము పరమవైభవముతో జరిగెను. కుబేరాదులు వివాహము చూడవచ్చిరి. దేవతలు వధూవరులపైఁ బుష్పవృష్టిఁ గురిసిరి. కిన్నరు లాకసమున నాట్యమాడిరి. బ్రహ్మర్షులు వధూవరుల నాశీర్వదించిరి. అష్టావక్రుఁడు పిమ్మట సుప్రభాసహితుఁడై యాశ్రమమున కేఁగి తపోవృత్తినుండెను. *

### అష్టావక్రుఁడు రంభాదులను శపించుట

అష్టావక్రమహర్షి గృహస్థాశ్రమము నద్వితీయముగా నాదర్శప్రాయముగాఁ గడపి సుప్రభాదేవిమూలమున నుత్తమమగు పుత్త్రసంపదఁ బడసెను. తరువాత, నాతఁడు జలమధ్యముఁ జేరి ఘోర తపస్సు చేయుచుండెను. ఒకనాఁడు రంభాద్యప్సరస లాతనికడకు వచ్చి నమస్కరించిరి. "మీ రేల వచ్చితి" రని వారి నాతఁ డడిగెను.

---

* భారతము — అనుశాసనికము.

నృత్యగీతములను చూచివిని చిరకాలమైనది. ఒకసారి తమకుఁ జూపి మెప్పుపొంద వచ్చితి" మని వారనిరి. అట్లైనఁ బ్రదర్శింపుఁ డని యష్టావక్రుఁడు జలములోనే కూర్చుండెను. రంభాదు లద్భుతముగాఁ దమనైపుణ్యముఁ జూపిరి. అందుల కష్టావక్రుఁ డానందించి మీకేమి కావలెనో కోరుకొండనెను. అంత వారు విష్ణుమూర్తితోడి సంభోగము కావలె నని కోరిరి. అష్టావక్రుఁ డాలోచించి శ్రీ విష్ణుమూర్తి కృష్ణావతారముఁ దాల్చినపుడు మీరు గోపికలై జనింతురు. అప్పుడు మీకోరిక సిద్ధించును. పొం" డని చెప్పి బయటకు వచ్చెను. అతని యాకారముఁజూచి రంభాదులు వెంటనే నవ్విరి. అష్టావక్రుఁడు వారి యవినయమునకు గర్వమునకు నసహ్యించుకొని "మీకోరిక సిద్ధింప వరమిచ్చిన నన్నుఁ జూచియే మీరు నవ్వితిరి. కాన, మీరు శ్రీకృష్ణుని పరోక్షమున బోయవాండ్రచేఁ జుట్టుముట్టఁబడి ఘోరావమానముల నందుదురు గాక" అని శపించి యాశ్రమమున కేఁగెను. *

## అష్టావక్రుఁడు భగీరథుని దీవించుట

అష్టావక్రమహర్షి ఘోరతపఃకార్యముచే దేహజవసత్త్వములఁ గోల్పోయి యస్థిపంజరము మాత్రము మిగిలినదా యనునట్లుండెను. ఈ స్థితిలో నొకనాఁ డష్టావక్రుఁ డొకచోటికిఁ బోవుచుండెను. దారిలో భగీరథుఁ డీతని కెదురు వచ్చెను. సగర పుత్త్రులు కపిలమహర్షి కనుమంటచే భస్మీభూతులై పోవ వారి భార్యలు నారాయణు నారాధించి "వంశోద్ధారకుఁ డగు సత్పుత్త్రు నీయక యే భర్తలు చనిపోయిరి. ఇఁక మాగతి యే" మని నారాయణుఁడు ప్రత్యక్షమైనప్పు డడిగిరి. విష్ణుమూర్తి వారిపై జాలిగొని "కాంతలారా! మీరు భర్తృవిహీనలైనను వైధవ్యదోషము మీకుఁ గలుగకుండునట్లనుగ్రహించితిని. మీకు నుత్తమోత్తముఁ డగుకుమారుఁ డుదయించు" నని యొక యుపాయము చెప్పి యంతర్హితుఁ డయ్యెను.

* విష్ణుపురాణము.

వారట్లుచేయఁగ భగీరథుఁడు జన్మించెను. కాని, యాతఁడు శుక్రము లేకయే జన్మించినకతమున బాల్యమునుండియు నర్పకుండై పడుచు లేచుచు నుండువాఁడు. ఈ భగీరథునిఁ గాంచి యష్టావక్రుఁడు దన కృశశరీరమును గాంచి యాతఁడపహాసము చేయుచుండెనని భావించెను. కాని, స్థిరముగా నిశ్చయము చేసికొననివాఁ డగుట నాతఁ డపహాసమున కట్లు తూలుచు నడుచుచున్న చో వెంటనే భస్మ మగునట్లును గానినాఁడు దృఢశరీరుఁడై సుందరాకారుఁ డగునట్లును శపించెను. వెంటనే యాశాపము భగీరథునికి వరప్రసాదము కాఁగా భగీరథుఁడు దృఢగాత్రుఁడై సుందరాకారుఁడయ్యెను. అష్టావక్రుఁడది చూచి యోగదృష్టివలన నాతని జన్మాదుల నెఱిఁగి యాతఁడు గంగను భూమికిఁ దీసికొని వచ్చి యాతని పితృపాదులను స్వర్గమునకుఁ బంపు నని యాశీర్వదించి తన దారిని బోయెను.

### అష్టావక్రుని పూర్వజన్మ కథ

అష్టావక్రమహర్షి యనేకసంవత్సరములు పుష్కర తీర్థమునను మాల్యవంతమునను బరమవైష్ణవుఁడై పరమజ్ఞానియై మహా తపస్సు చేసెను. పిమ్మట నొకనాఁడు శ్రీకృష్ణుఁడు రాధాదిభార్యలు బలరామప్రభృతులుఁ గూడరాఁగా బృందావనమున విహరించుచు జలక్రీడలఁ దనిసి యొక మఱ్ఱిచెట్టుక్రిందఁ గూరుచుండి సరససల్లాపము లాడుచుండఁగా నష్టావక్రమహర్షి వచ్చి శ్రీకృష్ణునకు సాష్టాంగ నమస్కారములొనర్చి యీశ్వరదత్తమగు స్తోత్రమున నిట్లని కీర్తించెను.

సీ॥ "ప్రకృతియు మూలంబు బ్రహ్మేశవిష్ణువుల్
శాఖలు సుర లుపశాఖ లఖిల
తపములు పుష్పముల్ విపులసంసారాది
కంబులు ఫలసమూహంబు లగుచుఁ
దనరు బ్రహ్మాండపాదమున కర్థి నా

[illegible]

దవును వరాకారుఁడవు మహాత్మ!

సర్వమయుఁడవు మఱియు స్వేచ్ఛామయుఁడవు
ముక్తిమయుఁడవు నఖిల సుముక్షులకును
ముక్తిదాయకుఁడవు జగన్మూర్తి వీవు
నీకు నతు లాచరించెద నీరజాక్ష!"

[ బ్రహ్మవైవర్తము — శ్రీకృష్ణఖండము ]

పిదప, అష్టావక్రుఁ డాపరమాత్మునియందు పవిత్రమగు తన మనస్సు లయ మొనర్చి శ్రీకృష్ణుని పాదములపైఁ బడి మరణించెను; వెంటనే యాతని తేజము దివ్యరూపమును ధరించి పుష్పక విమాన మధిష్ఠించి గోలోకమున కేఁగి ముక్తినందెను. అప్పుడు శ్రీకృష్ణుఁ డాతని దేహమునకు దహనాది కృత్యములు స్వయముగా నొనర్చి యాతని కగ్నితర్పణము లొసఁగి క్రియాకలాపములు పూర్తిచేసెను. ఇది యంతయుఁ జూచి యాశ్చర్య నిమగ్నయైన రాధ యాతని వృత్తాంతముఁ దెలుపు మని శ్రీకృష్ణునిఁ బ్రార్థించెను.

అప్పుడు శ్రీకృష్ణుఁడు వా రందఱు సావధానమనస్కులై వినుచుండఁగా నష్టావక్రమహర్షిని గుఱించి యిట్లు చెప్పెను; "ఈ మహర్షి యష్టావక్రుఁ డను నా పరమభక్తుఁడు, జితేంద్రియుఁడు, మహాతపస్సంపన్నుఁడు, బ్రహ్మవంశస్థుఁడు. తొల్లి సృష్ట్యాదిని నా నాభికమలమునుండి బ్రహ్మను బుట్టించి విశ్వసృష్టి చేయ నియోగించితిని. ఆతఁడు సనకసనందన సనత్కుమారసనాతన నామధేయు లగు నల్వురు కుమారులఁ దన మానసమునుండి సృజించి వారిని సృష్టింపుఁ డని కోరెను. వారు స్త్రీసంపర్క మొల్లక బ్రహ్మానుసంధానమున నిత్య తపస్వులైరి. తరువాత వశిష్ఠాంగిరోమరీచి ప్రచేతసులు మున్నగు మానసపుత్త్రులఁ బుట్టించి వారిని జగత్సృష్టికై యుజుఁడు నియమించెను. వారందఱు మహాతపస్సంపన్నులై తండ్రి పనుపున వివాహమాడి

పలువురు పుత్త్రులఁ బడసిరి. అందుఁ బ్రచేతునకుఁ గొంతకాలమున కసితుఁ డను కుమారుఁడు జన్మించి విష్ణుభక్తుఁడై తపోవృత్తి నుండెను. కొంతకాలమున కాతఁడును వివాహితుఁడై తన సతికి సంతానము కలుగని కారణమున విచారించుచుండఁగా నాకాశవాణి యీశ్వరుని గుఱించి తపింపు మని ప్రబోధించెను. అసితుఁడు నీశ్వరుని గుఱించి మహా తపము చేయ నాతఁడు ప్రత్యక్షమై రాధామంత్ర మను స్తోత్ర రాజము నుపదేశించి యంతర్హితుఁడయ్యెను. అసితుఁ డేకాంతమునఁ జిరకాల మామంత్రము జపించి రాధాకారుణ్యమునఁ దనభార్యయం దొక పుత్త్రునిఁగని దేవలుఁ డని నామకరణము చేసెను. దేవలుఁడును మాలావతియను రాజకుమారిని వివాహమై సంతానమును బడసి మహావిరాగియై తపోవృత్తి నుండెను. ఆతని తీక్ష్ణతపోనలము త్రిలోకములను వేధింపఁ జొచ్చెను. ఆతని తపోభంగమునకై యింద్రుఁడు రంభను బంపెను. ఆమె యెంత ప్రయత్నించిన నాతని హృదయము చలింపదాయెను. అందుచే నామె కోపించి "ఓ దేవలా! నీవు నన్నష్టకష్టములపాలు చేసితివి. నా యభీష్టము దీఱకుండఁ జేసితివి. కావున. నీవు మఱుజన్మమున నష్టావక్రుఁడవై జనింతు"వని శాప మిచ్చెను. అంత నామె వెడలిపోవుచు "దేవలా! నిన్ను నేననవసరముగ శపించితిని. ఐన, నాశాప మమోఘము. నీ వష్టావక్రుఁడవై జనించియు నీ తండ్రి కృపవలన దివ్యశరీరుఁడవై మహాజ్ఞానివై ముక్తి నందఁగల" వని రంభ స్వర్లోకమున కేఁగెను. ఆతఁడే యేకపాద సుజాతలకు జన్మించి సమంగానదీస్నానమున దివ్యశరీరియై మహా తపోధికుఁడై నేఁడిట్లు ముక్తి నందినాఁ" డని శ్రీకృష్ణుఁడష్టావక్రుని చరిత్రముఁ జెప్పి యందఱతో నిజగృహమున కేఁగెను. *

## అష్టావక్ర సంహిత

ఇట్లు ప్రత్యక్షముగా శ్రీకృష్ణుని పాదారవిందములఁ బ్రాణములు వీడఁ గనిన యష్టావక్రమహర్షి సుకృతవిశేషము వర్ణనల కంద

* బ్రహ్మవైవర్తపురాణము — శ్రీకృష్ణ ఖండము.

నిది. ఈమహర్షి జనకరాజర్షితోఁ జేసిన వేదాంత విచారణ మద్వైత వేదాంతసారము నద్భుతముగా వెలిపుచ్చునదై యష్టావక్రసంహిత యనుపేర శాశ్వతమై వెలసినది. ఈయష్టావక్రసంహితయందు ఆత్మోపదేశము, ఆత్మానుభవోల్లాసము, ప్రత్యాక్షేపద్వారోపదేశము, ఆత్మజ్ఞానసంకీర్తనము, లయయోగము, జ్ఞానయోగము, అనుభవపంచకము, బంధమోక్షవ్యవస్థ, నిర్వేదము, ఉపశమము, జ్ఞానము, స్వరూపసంస్థితి, ఆత్మసౌఖ్యానుభూతి, శాంతి, తత్త్వోపదేశము, విశేషోపదేశము, తత్త్వజ్ఞస్వరూపము, శాంతిశతకము, ఆత్మస్థితుని యనుభవము జీవన్ముక్తి యను నిరువది యధ్యాయములలో నాయా విషయము లద్భుతముగా వివరింపఁబడినవి. ఈసంహిత నిత్య పారాయణ యోగ్యము. అష్టావక్రుని బోధామృతమును గ్రోలి జనకరాజర్షి పొందిన యాత్మానంద మనిర్వాచ్యమైనది. ఈ సంహితయందలి "ఆకాశవదనంతోఽహం, ఘటవత్ ప్రాకృతం జగత్." "మహోదధిరివాహం స ప్రపంచో వీచిసన్నిభః" "అహంనా సర్వభూతేషు" మున్నగు నద్వైతవేదాంతఘీంకారవములు అష్టావక్రమహర్షిని ధన్యాతిధన్యుని జేసివైచినవి.

---

# మహర్షుల చరిత్రలు

* * *

## ఋష్యశృంగ మహర్షి

తొల్లి కశ్యపుఁడను మునిచంద్రునకు విభాండకుఁడను కుమారుఁ డుదయించెను. విభాండకుఁడు బాల్యము నుండియు నస్ఖలిత బ్రహ్మచర్యదీక్షతోఁ దపము చేయుచుండెను. ఒక్కనాఁ డాతఁ డొక్క మడువున నీళ్ళాడుచున్న సమయమున సురుచిరసురూపసుగుణ సుందరి యగు నూర్వశి యాతనిఁ గానవచ్చి తన విలాసహాసములఁ బ్రదర్శించి నంతఁ గామకృతమునఁ బతనమైన యా ముని యమోఘవీర్యముతో మిశ్రమైన జలము నొక మనుఁబెంటి త్రావి గర్భము ధరించెను.

### ఋష్యశృంగుని జననము

ఈ మృగము పూర్వము చిత్రరేఖ యను నొక యప్సరస. ఆమె యింద్రసభలో నాట్యమాడుచుండఁగాఁ గొన్ని తేళ్ళచ్చటికి వచ్చెను. చిత్రరేఖ నేత్రములపై దృష్టినుంచి యానందించుచున్న యింద్రునిఁ జూడక యామె తేళ్ళఁ జూచెను. తనయానందమునకు విశేషభంగము గలిగించిన యా చిత్రరేఖ నింద్రుఁడు మృగివై పుట్టుమని శపించెను. అప్పు డామె శాపవిమోచనోపాయము కోరుకొనఁగా నింద్రుఁడు కరుణించి విభాండకుఁ డను మహర్షి వీర్యమువలన బుత్రునిఁ గనిన పిమ్మట శాపవిమోచన మగునని తెల్పెను. ఆ చిత్రరేఖయే మృగియై దాహము తీర్చుకొనుటకు విభాండకుఁడు స్నానము చేయు జలాశయమునకు వచ్చి జలముతో పాటాతని వీర్యమును గ్రోలి చూలాలయ్యెను.

కొంతకాలమున కా మృగము మనుష్యరూపము గల యొక పుత్రునిఁ గని యరణ్యమున విడిచి తనశాపమోక్షణము కాఁగా నింద్ర

లోకమున కేఁగెను. ఆ బాలుఁడు మనుఁబెంటికి జన్మించినవాఁ డగుట వాతని నొసట నొక శృంగము నుండెను; దానిమూలమున నాతనికి ఋష్యశృంగుఁ డను నామము కలిగెను. అతఁ డచటఁ బెరుఁగుచుండఁగా నొకనాఁడు విభాండకుఁడు చూచి దివ్యదృష్టివలన నాతఁడు తన పుత్త్రుఁడే యని గ్రహించి వానిని దనయాశ్రమమునకుఁ దీసికొనిపోయి పెంచుచుండెను. బాల్యమునుండియు ఋష్యశృంగుఁడు తండ్రి యాశ్రమము దక్క నన్యమేమియు నెఱుఁగక పరమస్వాధ్యాయవిదుఁడు నద్వితీయ బ్రహ్మచారియునై ఘోరతపము చేయుచుండెను. అతని తపోవిశేషమున కచ్చెరు వందిన యింద్రుఁ డాత డెచ్చటనున్న నచ్చట సువృష్టి కలుగు ననియుఁ బ్రజ లాధివ్యాధి రహితులై సుఖ ముందు రనియు ననుగ్రహించెను.

## రోమపాదుని వృత్తాంతము

ఇట్లుండఁగా నంగదేశమును బరిపాలించు రోమపాదుఁడను రాజునకు సంతానము లేకపోయెను. ఈతఁడు దశరథుని మిత్త్రుఁడు. ఒకనాఁ డతఁ డయోధ్య కరుదెంచి దశరథునకు సురభి యనుగ్రహమునఁ గలిగినశాంత యను కూతుఁగాంచి ముద్దాడి యామెను బెంపిమ్మని యడిగెను. కాని, దశరథునకును బిడ్డలు లేనికారణమున నాతఁ డంగీకరింపఁ డాయెను. అంత దగ్గఱనున్న వసిష్ఠమహర్షి త్రికాలవేది యగుట దశరథునితో శాంతను రోమపాదున కిమ్మనియు నామె వలనఁ ద్వరలో నిరువురకును బురుషసంతానము కలుగు ననియుఁ జెప్పెను. అందులకు వా రుభయులు నానందించిరి. తుద కాఱుమాసములు దశరథునింట నాఱుమాసములు రోమపాదు నింట శాంత యుండున ట్లంగీకరించి రోమపాదుఁడు శాంతనుదీసికొని యంగదేశమున కేఁగెను. తరువాత నాతఁడు పుత్త్రకామియై బ్రాహ్మణుల కనేక దానధర్మములు చేయుచుండెను. ఒకనాఁ డొక బ్రాహ్మణుఁడు

బాలుని కొకగోవు నిమ్మని రోమపాదునిఁ గోరెను. అంత నాతఁడు బ్రాహ్మణులు దురాశాపరు లని నిందించెను. ఒక్కగోవు నిచ్చుటకు బదులు సద్ద్విజజాతిని బుద్ధిపూర్వకముగాఁ దెగడిన యా రాజును దండ్రికొమరు లిరువురును గోపించి యంగరాజ్యము దుర్భిక్షమై యనావృష్టిదోష మందుఁగాక యని శపించి యారాజ్యము నుండి వెడలిపోయిరి. తరువాత రోమపాదుఁడు పశ్చాత్తప్తుఁడై గత్యంతర మే మని మిగిలిన బ్రాహ్మణుల నడుగఁగా వారు ఋష్యశృంగుని చరిత్రము వినిపించి యాతఁ డిటకు వచ్చిన నీ యవగ్రహదోషము వాయు నని చెప్పిరి. పిమ్మట రోమపాదుఁ డా బ్రాహ్మణులను బూజించి వారి యనుమతిని గొందఱు వారాంగనలను సర్వకలాపూర్ణ యను నామె యాధిపత్యమున ఋష్యశృంగునిఁ దోడ్కొని రాఁబంపెను.

### సర్వకలాపూర్ణాదివేశ్యలు ఋష్యశృంగుని గొనిపోవుట

నవయౌవనలు నతివిలాసినులు నగు నా వారాంగనలు విభాండకుఁ డాశ్రమమున లేని తరుణమున ఋష్యశృంగునిపాలి కరుదెంచిరి. స్త్రీముఖము చూచి యెఱుఁగని ఋష్యశృంగుఁడు వారలు మునికుమారు లని యెంచి యర్ఘ్యపాద్యాదు లీయ వారు స్వీకరింపక తాము తెచ్చిన దివ్యగంధ మాల్యములు సరసభక్ష్యములు విచిత్ర వస్త్రములు నిచ్చిరి. వారు పిమ్మటఁ దమ నృత్యగీతముల నాతని నానందింపఁజేసి వానిఁ గౌఁగిలింతల నొడలిపుడికిళ్ళ మోసపుచ్చి తమ యాశ్రమము సమీపముననే యున్నదనియు నందుఁ దపముచేయ రమ్మనియు నాహ్వానించిరి. పిమ్మట వారు విభాండకునకు భయమొంది నాఁటికి వెడలిపోయిరి. ఋష్యశృంగుఁడు తండ్రిచెప్పిన యగ్ని హోత్రము వేల్వ మఱచి వారియొప్పునఁదగిలి వారితోఁ దపముచేయ నాసక్తుఁడై యుండెను. ఇంతలో విభాండకుఁడు వచ్చి సుతు నగ్నిహోత్రము వేల్వకుండుటకుఁ గారణ మడిగెను. ఆతఁ

డద్భుత సుందరాకారు లగు మునిబాలురు వచ్చిరనియు వారు కట్టిన చీర లతిమృదులము లనియు, వారిశరీరములు రమ్యసౌరభయుతము లనియు వారి కలకూజితము లానంద ప్రదము లనియు నం దొక మునిబాలుఁడు తన్నుఁ గౌఁగిలించుకొని నిజాస్య మాసన్నముచేసి యొకమృదుమధురశబ్దము చేసె ననియుఁ జెప్పి వారితోఁ దపము చేయుట కిష్టపడియుంటి నని పలికెను. విభాండకుఁ డవి రాక్షస మాయలనియు వారిదానములు వర్జనీయము లనియుఁ బ్రబోధించెను.

మఱునాఁడు విభాండకుఁ డెప్పటియట్ల వన్యఫలముల కరిగిన వెంటనే వేశ్యాంగన లరుదెంచి ఋష్యశృంగుని డాయుడాతఁ డమితానందము నంది వారితో వారివనమున కేఁగుదేర నంగీకరించెను. వారును దమకోరిక యీడేఱినందుల కానందభరితులై మచ్చికతోడను మేలములగు ముద్దులతోడను నా ముగ్ధమౌని నంగదేశమునకుఁ దోడ్కొని వచ్చిరి. అతఁడు రాజాశ్రయ మగు దివ్యభవనమును జేరఁగనే యాతని నివాసశక్తిచే సర్వజన ప్రమోదముగాఁ గుంభవృష్టి కురిసెను. రోమపాదుఁ డమితానందము నంది శాంత నాతని కిచ్చి వివాహము చేయువేళ నాలోచించుచు నాతనిఁ బూజించుచుండెను.

### శాంతా ఋష్యశృంగుల వివాహము

ఒకనాఁడు ఋష్యశృంగుఁడు పరమసౌందర్యనిధియు వినయ విద్యావివేకశీలయు నగు శాంతను జూచి యామె యద్వితీయ సౌందర్యమునకు ముగ్ధుఁడై రోమపాదునిఁ బిలిచి యామె యెవ రని యడిగెను. రోమపాదుఁ డామె దశరథునిపుత్త్రి యనియు దశరథుఁడు దనమిత్త్రుఁ డగుట నామెను బెంచుకొనఁ దీసికొని వచ్చితి ననియుఁ జెప్పెను. అంత ఋష్యశృంగుఁడు దశరథుని వృత్తాంత మడిగెను. రోమపాదుఁ డాతని చరిత్రమును దెల్పి తొల్లి దశరథుఁడు శాంతా స్వయంవరముఁ జాటుటయుఁ బరశురాముఁ డరుదెంచి యెల్లరు రాజులతో

దశరథునిఁ జంప నుంకించుటయు వశిష్ఠమహర్షి కోరికపై దశరథుని కొమార్తెను బ్రాహ్మణునకే యిచ్చి వివాహము చేయవలెనని శాసించి చంపక విడిచి వెడలుటయుఁ జెప్పెను. ఋష్యశృంగుఁ డానందించి శాంతను వివాహ మాడఁగోరెను. రోమపాదుఁ డానందతరంగముల నోలలాడి వెంటనే వివాహ వైభవమును బురమంతెల్లఁ జాటఁ బంపెను. తరువాత మహా వైభవముతో శాంతా ఋష్యశృంగుల వివాహము జరిగెను. ఋష్యశృంగుఁడును రోమపాదునివలన బహువిధ సమ్మానముల నందుచుఁ గాంచనమయ శయ్యాసనమున శాంతా సహితుఁడై రాజమందిరమునఁ జిరకాలము నివసించెను

ఈ సమయముననే రోమపాదునకుఁ బుత్త్రోత్పత్తి నిమిత్తమై ఋష్యశృంగుఁ డంగదేశమున నింద్రునిఁగూర్చి యొక యిష్టి చేయించెను. దానిమూలమున నింద్రుఁడు ప్రీతుఁడై రోమపాదునకుఁ బుత్త్రుఁ డుదయింప వరమిచ్చెను. తరువాత ఋష్యశృంగుని యాశీర్వచనముచే రోమపాదునకుఁ బుత్త్రి సంతానము కలిగెను. నాఁటినుండి రోమపాదుఁడు దినదినవర్ధమాన మగు భక్తి తాత్పర్యముతో ఋష్యశృంగుని శాంతను బూజించుచు వారి యడుగులకు మడుఁగు లొత్తుచుండెను. *

## శాంతా ఋష్యశృంగు లయోధ్య కేఁగుట

ఇంతలో నయోధ్యానగరమున దశరథునిచేఁ బుత్త్రి కామేష్టిఁ జేయింపఁ దలంచి వశిష్ఠమహర్షి సనత్కుమారుఁడు తొల్లి చెప్పిన వృత్తాంత మంతయుఁ జెప్పి దశరథునిఁ బ్రేరేపించెను. దశరథుఁ డానందముతో వసిష్ఠుని బూజించి చతురంగ బల సమేతుఁడై యంగ దేశమునకు ఋష్యశృంగుని గొనివచ్చుటకు బయలు దేఱెను. సచివులును దాను నంగదేశము సొచ్చి దశరథుఁడు రోమపాదునింటి కేఁగి దీప్తాగ్నివలెఁ దేజరిల్లుచున్న ఋష్యశృంగుని దర్శించి యనేక

* భారతము — అరణ్యపర్వము.

విధములఁ బూజించెను. రోమపాదుఁడు దశరథు ననేక విధముల సమ్మానించెను. అంత దశరథుఁడు, శాంతా సహితుండై ఋష్య శృంగుఁడును భార్యాసమేతుఁడై రోమపాదుఁడును దన గృహమునకు విచ్చేయవలయునని ప్రార్థించెను. శాంతా ఋష్యశృంగు లంగీకరించిరి. రోమపాదుఁడు తరువాత వచ్చెద నని కృతాలింగనుఁడై దశరథుని శాంతా ఋష్యశృంగులను వీడ్కొలిపి యయోధ్యకుఁ బంపెను.

శాంతా ఋష్యశృంగులతో దశరథుఁ డయోధ్యఁ బ్రవేశించు సరికి నగర మంతయు నద్భుతముగా నలంకరింపఁబడి యుండెను. పురసతులు లాజలు, అక్షతలు, దళత్కుసుమములు వారిపైఁ జల్లిరి. నానాజయవాదులైన జనులు మ్రొక్కిరి. అంతలో రాజప్రాసాదమును సమీపింపఁగానే రాజనితంబినులు మహితరత్నసమాన నీరాజనరాజితో నెదురువచ్చి వారికి హారతులిచ్చిరి. అంత దశరథుఁడు రథము దిగి ఋష్యశృంగుని గౌరవముతో మంగళతూర్యఘోషములతో లోనికిఁ దీసికొనిపోయెను. పుణ్యస్త్రీలు శాంతాదేవి నంతఃపురమునకుఁ గొని పోయిరి. కౌసల్యా కైకేయీ సుమిత్రాదు లమితానందముతో 'అమ్మా! శాంతా! ఇఁక నీవు మా బిడ్డవు కావు. మాకుఁ బూజనీయవైన మహర్షి పత్నివి. వందనము లమ్మా!' యని మేల మాడిరి. శాంత చిఱునగవుతో వారిని గౌఁగలించుకొనెను. శాంతా ఋష్యశృంగుల కట ననుక్షణము నధిక పూజలు జరుగుచుండెను.

## ఋష్యశృంగుఁడు దశరథునిచే నశ్వమేధ పుత్త్రికామేష్టులఁ జేయించుట

ఇట్లుండఁగా యజ్ఞనిర్వహణానుకూలమగు వసంతకాల మరుదెంచెను. బహుపాదములతోపాటు దశరథుని మనోవృక్షమును జక్కఁగాఁ జిగిర్చెను. అంత నాతఁడు ఋష్యశృంగుని జేరఁ బిలిచి పుత్త్రికామేష్టి చేయు మద్యమముఁ దెలుపఁగా నాతఁ డంగీకరించెను.

పిమ్మట వశిష్ఠమహర్షి యాదరమున దశరథుఁడు సరయూనదీ ప్రాంతమున నుత్తరముగా యజ్ఞశాల నిర్మింపించెను. అధ్వర సంభారము లన్నియు వెంటనే సమకూర్చెను. ఉత్తమోత్తము లగు ఋత్విజులతోడను మహాత్ములగు మంత్రకోవిదులతోడను యజ్ఞము ప్రారంభమాయెను. మంత్రులధిపునానతిని సర్వము నిర్వహించి యాగాశ్వమును విడిచిరి. సంవత్సరము గడచి తిరిగి వసంత మాసన్నమగు సరికి యజ్ఞాశ్వము సురక్షితముగా వచ్చి చేరెను. అంత దశరథుఁడు గురువరుఁడగు వశిష్ఠునిఁ బూజించి యజ్ఞభారము సమస్తముఁ బూనవలె నని ప్రార్థించెను. వశిష్ఠుని యాజ్ఞచే నతి కర్మఠులు నుత్తమోత్తములగు బ్రాహ్మణు లిష్టకాసహస్రములు దెచ్చిరి. కుండమండపవేదికాదులు, స్నానాగారములు, శాయమానములు మున్నగున వన్నియు నిర్మింపఁబడెను. జనకమహారాజు కేకయరాజు సింధుదేశవిభుఁడు మున్నగువారాహూతులై వచ్చిరి. ధరణీసురు లెల్లరు విచ్చేసిరి. అంత వశిష్ఠప్రముఖులును భూసురోత్తములును ఋష్యశృంగునిఁ బురస్కరించుకొని యజ్ఞకర్మారంభమున విహితక్రమమున నా యశ్వమేధమును సమాప్తి నొందించిరి. దశరథుఁ డనేక భూరిదక్షిణల బ్రాహ్మణోత్తముల సంతసింపఁ జేసెను. అంత దశరథుఁడు ఋష్యశృంగునిఁ జేరి "మహాత్మా! మీ దయావిశేషమున నధ్వరము పూర్తియైనది. ఇఁకఁ దాము పుత్రకామేష్టిఁ బ్రియమునఁ జేయుఁ" డని ప్రార్థించెను. ఋష్యశృంగుఁడు నంగీకరించి నానా మంత్రపూతముగా నాహుతుల నగ్నికిడుచుఁ బుత్రకామేష్టి చేయుచుండ నా పావనహోమాగ్ని వలనఁ బ్రాజాపత్యపురుషుఁడు దేవ నిర్మితము నారోగ్యవర్ధనమును బుత్రోత్పత్తికరమును నగుపాయసము నొకపవిత్ర హేమపాత్రమునఁ దెచ్చి దశరథున కొసఁగి యంతర్హితుఁ డయ్యెను. ఋష్యశృంగుఁడు దశరథునిఁ బ్రియమారఁ బిలిచి యా పాయసము నాతని భార్యలకుఁ బంచి యిమ్మని చెప్పెను.

పాయసము కౌసల్యకు సగమును మిగిలినసగములో సగము సుమిత్రకును మిగిలినదానిలో సగము కైకకును ద్రావనిచ్చి యవశిష్టమయిన యష్టమాంశమును మరల సుమిత్రకు నీయ దానిని వారు మువ్వురుఁ బ్రీతి మెయిఁ గ్రోలిరి. దీనిమూలముననే తరువాత గొంతకాలమునకు వారికిఁ గ్రమముగా శ్రీరామ భరతలక్ష్మణ శత్రుఘ్ను లుదయించిరి. పరమశోభాయమానమై యాగము సాంతము కాఁగా ఋష్యశృంగుఁడు శాంతాసహితుఁడై విభాండకుని యాశ్రమమునకుఁ బోయెను. విభాండకుఁడు పుత్త్రుని జగద్ధితమతి కానాఁడే దివ్యదృష్టిఁ దెలిసికొని యుండెఁ గావునఁ గొమరుని గోడలి నెంతయు నాదరించెను. వసిష్ఠున కరుంధతివలె, అత్రి కనసూయవలె, అగస్త్యునకు లోపాముద్రవలె శాంతయు ఋష్యశృంగుని సేవించి చతురంగుఁడను నుత్తమపుత్త్రునిఁ గనెను.*

## ఋష్యశృంగుని ద్వాదశవార్షికయాగము

తరువాత ఋష్యశృంగుఁడు కొంతకాలమునకు ద్వాదశ వార్షికయజ్ఞము నిర్వర్తించెను. ఆ యజ్ఞమునకుఁ జూలాలైన సీతయు నామె ప్రియమునకై శ్రీరాముఁడు నతనికై లక్ష్మణుఁడు నుండి పోవుటచే వారుదక్క నందఱును విచ్చేసిరి. శుభయజ్ఞ పరిసమాప్తి యైనవెనుక నందఱు వెడలిపోయిరి.†

## ఋష్యశృంగ స్మృతి

ఋష్యశృంగమహర్షి యొక్కస్మృతి కర్తగాఁ గాన వచ్చుచున్నాఁడు. ఆచారాశౌచ శ్రాద్ధ ప్రాయశ్చిత్తమునకు మితాక్షరాపరార్కస్మృతి చంద్రిక లీ స్మృతినుండి తత్సంబంధ శ్లోకముల నుదాహరించినవి. మితాక్షరమున శంఖుని దని పేర్కొనఁబడిన యొక శ్లోక

---

* రామాయణము. † ఉత్తరరామాయణము.

మును అపరార్కము ఋష్యశృంగ స్మృతిలోని దని పేర్కొన్నది.*
స్మృతిచంద్రిక "అపి వాససా యజ్ఞోపవీతార్థాన్ కుర్యాత్, తదభావే త్రివృతా సూత్రేన" అన్నవచనము ఈ స్మృతిలోని దని పేర్కొన్నది. సమగ్రముగు స్మృతి యింకను లభింపవలసియున్నది.

ఋష్యశృంగుడు మహోత్తమతపశ్శాలియై శ్రీరామాదుల లోకమునకు ప్రసాదించిన పరమపుణ్యాత్ముడు కావున నాతని నామస్మరణ మతిపవిత్రము.

---

* "పూర్వనష్టం తు యో భూమి మేకశ్చేదుద్ధరేత్ క్రమాత్
యథాంశంతు లభంతేన్యే దత్త్వాంశంతు తురీయకమ్."

# మహర్షుల చరిత్రలు

* * *

## కపిల మహర్షి

తొల్లి కర్దమప్రజాపతి కృతయుగమున విశ్వసృష్టికై బ్రహ్మచే నియోగింపఁబడి సరస్వతీనదీతీరమున కేఁగి పదివేల దివ్యసంవత్సరములు తపముచేసెను. అతఁ డొకనాఁడు జపసమాధి నేకాగ్రచిత్తుఁడై విష్ణుమూర్తిని ధ్యానింపఁగా నాతఁడు ప్రత్యక్షమై దేవహూతివలనఁ దొమ్మండ్రు కూఁతులును దన యంశముచే నొక కుమారుఁడును నాతనికి జన్మించునని వరమిచ్చి యంతర్హితుఁ డయ్యెను. తరువాతఁ గొంత కాలమునకే దేవహూతికిఁ గర్దమునివలనఁ గళ, అనసూయ, శ్రద్ధ, హావిర్భువు, గతి, క్రియ, ఖ్యాతి, అరుంధతి, శాంతి యను తొమ్మండ్రు కూఁతుం డ్రుద్భవించిరి. పిమ్మటఁ గర్దముఁడు సన్న్యసింప నెంచఁగా దేవహూతి యాతని పదములకు మ్రొక్కి "దేవా! కూఁతుండ్రకు యుక్తకాలమున వివాహముచేసి యాపై నాకు జ్ఞానోపదేశము చేయఁగల సుకుమారుని దయచేయుఁడు నేను తరించిన పిమ్మటఁగాని తాము సన్న్యసింప వల" దని వేదనాభరమునఁ బలికెను. కర్దముఁ డామె గర్భమున నచిరకాలముననే జనార్దనుఁడు సుతుఁడై పుట్టును గాన నాతని పాదపద్మములు పూజించుచుండుమనియు నా కుమారుఁడే యామె శంకాగ్రంథి విచ్ఛేదము చేయుననియుఁ జెప్పి గృహముననే యుండెను.

### కపిలుని జననము

దేవహూతి భర్తవాక్యానుసారమట్లు భగవంతునిఁ బ్రార్థించుచుండఁగాఁ గొంతకాలమునకుఁ గార్దమమైన తేజమున విష్ణుమూర్తి దేవహూతిగర్భమును బ్రవేశించి కాలక్రమమున దనుజారి శమీతరుకోటరమున వైశ్వానరుఁ డావిర్భవించినట్లామె గర్భమునఁ గుమారుఁడై

జన్మించెను; అప్పు డాకసమున దేవతూర్యఘోషములు తుముల, మయ్యెను. దేవతా బృందములు మందారవృష్టిఁ గురిసిరి; గంధర్వ కిన్నర గానములు నప్సరోవనితల యాటపాటలు నొప్పెను. పిమ్మట నారాయణుని దర్శించుకొనుటకు మరీచిప్రముఖమునిగణసేవితుఁడై చతుర్ముఖుఁడు వచ్చి కపిలుని దర్శించి దేవహూతి కర్దముల కాతని నెఱిఁగించి మరీచిని దిగవిడిచి సనకసనందన నారదులతో నంతర్హితుఁ డయ్యెను.

## కపిలమహర్షి తండ్రికిఁ గర్తవ్యము బోధించుట

పిమ్మటఁ గర్దమ ప్రజాపతియుఁ దన దుహితల వివాహ మాడుటకు మహర్షులఁ బిలువఁ బంచి వారు వచ్చిన వెంటనే మరీచికిఁ గళను, అత్రిమహర్షి కనసూయను, అంగిరసునకు శ్రద్ధను, పులస్త్యునకు హవిర్భువును, పులహునకు గతిని, క్రతువునకుఁ గ్రియను, భృగువునకు ఖ్యాతిని, వసిష్ఠుని కరుంధతిని, అథర్వునకు శాంతిని నిచ్చి నిజకులాచారానుసారముగా మహావైభవముతో నుద్వాహము లొనర్చి యల్లుండ్రను గూఁతుండ్రనాశీర్వదించి సంభావనాసంభావితులఁజేసి వారివారి గృహముల కంపివేసెను. తరువాతఁ గుమారుఁడగు కపిలమహర్షి నేకాంతమునకుఁ దీసికొనిపోయి వందనమాచరించి "మహాత్మా! పరమేశ్వరుఁడ వగు నీవు నీమాటలు తప్పకుండ నా గృహమునఁ బుట్టితివి. సంసార చక్రపరిభ్రామ్యమాణుల మగుచు గ్రామ్యుల మగు మా వర్తనములు గణింపక యనుగ్రహించి నాకు ముద మొదవించితివి. దాన నేను ఋణత్రయమునుండి తొలఁగితిని. ఇఁక యోగసమాధి నిరతి నీ పాదారవిందములు డెందమునఁ జేర్చి శోకములఁ బాసి యేకాంతస్థలమున సంచరించెద" నని పలికెను. అంతఁ గపిలమహర్షి "వరమునీంద్రా! నిర్హేతుక దయాగుణమున నా వాక్యముల ననుసరించి నీయింటఁ బుట్టితిని. నేను నన్ముని వేషము ధరించుట నాకొఱకుఁ గాదు. మహాత్ములైన మునులకుఁ దత్త్వబోధము చేయుటకే యని తెలిసికొనుము. సన్న్యస్త సకల కర్ముండవై నన్నే భక్తితో

భజింపుము. మోక్షము నొందెద" వని కర్తవ్యము బోధించెను. అంతఁ గర్దముఁడు నాతని కధికభక్తి ననేక వందనములు చేసి మునిగణ సేవితమగు వనమున నిస్సంగుఁడై, యాత్మైక శరణతత్పరుఁడై పరబ్రహ్మమును జిత్తమున నిలిపి సమత్వ శాంత శేముషీగరిష్ఠుఁడై, ధీరుఁడై నిఖిలప్రపంచము వాసుదేవమయముగా నెంచి భక్తిభావమున భాగవతగతిం జెందెను. ఇటుఁ గపిలమహర్షి బిందుసరమునఁ దీవ్ర తపోనియతి నుండెను.

### కపిలమహర్షి దేవహూతికి మోక్షమొసఁగుట

అంత దేవహూతియుఁ గొమరుని దర్శించి యాతని శరణంబు వేఁడి రక్షింపుమని యాశ్రయించెను. కపిలమహర్షి యాత్మ నలరి దేవహూతికి జీవునిచిత్తము సంసారమునఁ దగులుకొని త్రిగుణాసక్తమగుననియు, నదియే నారాయణాసక్తమైనచో మోక్షకారణమగు ననియుఁ జెప్పెను. పిమ్మట నాతఁడామెకు సాంఖ్య యోగమును, భక్తియోగమును బోధించెను. తరువాత దేవహూతి కపిలోక్తమార్గమున గురుయోగశక్తిచే నంబరమున కెగసి వాసుదేవ చరణాంబురుహన్యస్త చిత్తయై శ్రీహరియందుఁ గలిసెను. ఆమె మోక్షమున కేఁగిన క్షేత్రము "సిద్ధపద" మని ప్రసిద్ధికెక్కెను. అంతఁ గపిల మహర్షియు సిద్ధచారణాదులు గొలువ సముద్రునిచేఁ బూజాదులందెను. అతఁడనంతరము సాంఖ్యాచార్యాభిష్టుతమగు యోగము నవలంబించి శాంతి సమాహితుఁడై పిత్రాశ్రమమును వీడి యుదగ్భాగమున కేగెను. *

### కపిలమహర్షి వేదప్రామాణ్యబుద్ధి

ఒకప్పుడు కపిలమహర్షి యుత్తమాకృతి యగు గోవునుజూచి వేదస్వరూపమని పలికియు నిర్లక్ష్యముగ నుండెను. కొంత దూరమున

* భారతము — హరివంశము.

నున్న సూర్యరశ్మి యను సంయమి కపిలునకు వేదములయం దేభావ మున్నదో యెఱుంగఁ గోరి సూక్ష్మరూపమున నా గోవును బ్రవేశించి "మహర్షివర్యా! వేదములు హింసికత్వాపాదకము లని యతులు పల్కుదురు. నీవు నా యభిప్రాయముతో నుంటివా?" యని యడిగెను. అందులకుఁ గపిలమహర్షి వేదములయందు నా కాదరానాదర భావములు లేవు. కాని, సంసారు లెల్లరకు వేదవిహితాచారము వల యును. పాణి యుపస్థము నుదరము వాణి యనునవి మూయరాని వాకిళ్ళు. వానిని మూయఁగల్గిన బుధునకుఁ దపోదానవ్రతాదులు గాని వేదప్రామాణ్యముకాని కావలసిన పనిలే" దని చెప్పెను. అంత స్యూమరశ్మి సంతసమున గోగర్భమునుండి బయటపడి కపిలునకు నమ స్కరించి 'సత్య మెఱుఁగఁగోరి యట్లు గోగర్భమునఁ జొచ్చి ప్రశ్నించితిని. మన్నించి వేదప్రామాణ్యమును గుఱించి నా మనశ్శాంతి కొఱకింకను జెప్పు' మని వేఁడుకొనెను. అంతఁ గపిలమహర్షి వాని భావ మెఱిఁగి "వేదములే లోకమునకుఁ బ్రమాణములు. శబ్దబ్రహ్మ పరబ్రహ్మలలో శబ్దబ్రహ్మము మూలమునఁ బరబ్రహ్మము గ్రహింప వచ్చును. బ్రాహ్మణు లుత్తములై వేదచోదితకర్మములఁ జేయుచు శాశ్వతపదము నందవచ్చును. వేదతాత్పర్యమరసి వేదితవ్య మెఱుఁ గువారలే వేదజ్ఞులు. ఇట్లు కానివారు వేదపాఠకులు; సర్వము వేద పరినిష్ఠితము. కావున, నేను వేదమానిత బ్రాహ్మణులకు నమస్క రింతు" నని పలికెను. ఈ మాటలు విని స్యూమరశ్మి యానందించి వెడలిపోయెను. *

### కపిలమహర్షి పుండరీకు ననుగ్రహించుట

తొల్లి పుండరీకుఁ డను మహారాజు మృగయా వినోదార్థము సపరివారుఁడై వనముఁ జొచ్చి యథేచ్ఛము మృగముల వేఁటాడి దప్పిగొని కపిల మహర్షి యాశ్రమ ప్రాంతమునఁగల సరోవరమునందు

* భారతము — అనుశాసనిక పర్వము.

చల్లనివి, తియ్యనివి. స్వచ్ఛమైనవి యగు నీళ్ళుత్రాగి యట నొక లేడి యా ప్రాంతమునఁ బరుగిడుట చూచి యారాజు దానిపై నొక బాణమును విడిచెను. ఆ బాణము తగిలి యాలేడి కపిలముని యాశ్రమము కడకు వచ్చి పడి మరణించెను. అది చూచి కపిలుఁడు తన యాశ్రమమున నిట్టిహింస కావించిన మూర్ఖుఁ డెవఁ డని లేచి యటఁ దిరిగి యొుక చెట్టునీడను విల్లమ్ములతోనున్న రాజును జూచెను.

కపిలునిగాంచి పుండరీకుండు గడగడ వణఁకుచు లేచివచ్చి భక్తితో నమస్కరించి కులగోత్రములు చెప్పుకొని తన తప్పిదమును మన్నింపుమని కోరెను. అంత నా మహర్షి యాతనితో నిట్లనెను. "ఓయీ! క్షణభంగుర మగు జీవితము గల మానవుఁడు పశువుకన్న బుద్ధిబలమున మిన్నయయ్యు, ఏపాప మెఱుఁగని, నోరులేని, సాధు జంతువులఁ జంపుటవలన మహాపాపము గడించును. నీ విట్లు దారుణ కర్మ మొనరించుటకుఁ గారణ మేమి! రక్తమాంసాది మయ మగు నీ దేహముపై నీ కెట్టి మమత కలదో ఆలేడికి దాని దేహముపై నట్టి మమత యుండదా? తుచ్ఛమగు నీ విలాసమునకై పసికందు, పుణ్యజీవి, యగు నీ లేడి నిండు ప్రాణములను బలిగొంటివే? నిన్నిప్పు డేమిచేసినను దప్పులే" దని యాతని నెంతయు నిందించి వైరాగ్య ముపదేశించెను.

పుండరీకుఁ డా మహామహుని మాటలు శూలములవలెఁ గ్రుచ్చుకొనఁగా సిగ్గుపడి పశ్చాత్తాపమంది తానుచేసిన దోషమున కా మహర్షి యెదుటనే ప్రాణత్యాగము చేసికొనఁ దలఁచి వాడియగు కత్తి నొర నుండి తీసి తన శిరముఁ ద్రుంచుకొనఁ బోవునంతఁ గపిలుఁడు కనికరించి యాతని నాత్మహత్యనుండి కాపాడెను. పుండరీకుఁడు కపిలుని పాదములపైఁ బడి జ్ఞానభిక్షఁ బెట్టుమని ప్రార్థించెను.

అంతఁ గపిలమహర్షి యాతని కిట్లు బోధించెను. "రాజా! మోక్ష మపేక్షించు మానవుఁడు పూర్వదానఫలమునఁ గలిగిన సంప

దలు క్షణికములనియు, పరహింసా వ్యాపారములు పాపహేతువు లనియు, నెఱిఁగి భయపడుచు గురుపాదము లాశ్రయించి తత్త్వ మెఱిఁగి దృఢనిశ్చయుఁడై మెలఁగ వలయును. అట్లు మెలఁగువారు మూఁడు రకములు; అంకురితులు, పుష్పితులు, ఫలితులు. మోక్ష ధర్మాపేక్షగలవా రంకురితులు; సదాచార నిరతులు పుష్పితులు; జీవన్ముక్తులు ఫలితులు. వీరు గురుబోధితజ్ఞానమున మోక్షమందు దురు." ఇట్లు బోధించి కపిలుఁ డాతనిని వీడ్కొలిపి నిజాశ్రమము నకు విచ్చేసెను.

తదనంతరము పుండరీకుఁడు సర్వసంపదలను రోసి వైరాగ్య యుతుఁడై కపిలమహర్షి యాశ్రమమునకు విచ్చేసి తన్ను శిష్యునిగా ననుగ్రహించి తపముచేయ ననుమతింపు మని యాతనిఁ గోరెను. కపిలుఁ డాతనిఁ గన్నెత్తిచూడక నోటఁ బలుకక తృణీకరించెను. కాని, పుండరీకుఁడు పదమూఁడు దినము లటనే జలాంజలిత్రయ పానమాత్ర మునఁ గదలక మెదలక కపిలునే ధ్యానించుచు నుండెను. పదునాలవ దినమునఁ గపిలుఁడు శిష్య సహితుఁడై సంధ్యాద్యనుష్ఠానములఁ దీర్చి యాతనిఁ బలుకరించి యాతని మనస్సు రాజ్య సతీ పుత్త్రాదులపై మరలింప యత్నించెను. కాని పుండరీకుఁడు నిజమగు విరాగమున నుండుటచేఁ జలింపఁడాయెను. కపిలుఁ డపుడు సంతసించి యాతనికిఁ గర్మ భక్తి వైరాగ్య జ్ఞాన యోగములు బోధించి

"పరాయ పరరూపాయ
        పరమాత్మన్ పరాత్మనే
నమః పరమ తత్త్వాయ
        పరానందాయ ధీమహి"

అను మహామంత్రము నుపదేశించి యనుగ్రహించెను.

పుండరీకుఁ డట్లు కపిలమహర్షినే గురువుగా భావించి యాతని యుపదేశామృతమునఁ బునీతుఁడు శ్రద్ధా భయభక్తి యుక్తుఁడై చిర

కాల మా మంత్రమును జపించి విష్ణుదేవుని బ్రత్యక్షము చేసికొని యాతని కటాక్షమున మోక్షమునందెను. *

### కపిలమహర్షి సగరపుత్త్రుల భస్మముచేయుట

మఱియొకప్పుడు సగరచక్రవర్తి విష్ణుప్రీతికొఱకై యనేకాశ్వమేధయాగములఁ జేసి తృప్తిగనక మఱియొక మఖమును జేయ హయమును విడిచెను. అసూయాగ్రస్తుఁడై యింద్రుఁ డాగుఱ్ఱమును నాగలోకమునకుఁ దీసికొనిపోయి యట నొకచోఁ దపోనియతి నున్న కపిలమహర్షి యాశ్రమ సామీప్యమునఁ గట్టివైచి వెడలిపోయెను. యాగాశ్వ సంరక్షణమునకై సగరుఁడు నిజపుత్త్రులఁ బంపెను. వారు చని యేడుదీవులు వెదకి యశ్వముఁ గానక భూమిఁ ద్రవ్వి పాతాళలోకమున కేఁగిరి. అందుఁ దిరిగి వారు కపిలమహర్షి యాశ్రమ ప్రాంగణమున నున్న యశ్వముఁ జూచి యాతఁడే దానిని హరించి యుండె నని భావించి యాతనిఁ జంప నేఁగిరి. కపిలమహర్షి కను దెఱచి చూచెను. వెంటనే సగరపుత్త్రు లఱువది వేల మందియు భస్మీభూతులై పోయిరి. తరువాత సగరుఁడు మనుమఁడగు నంశుమంతునిఁ బంప నాతఁడు పాతాళమున కేఁగి యందుఁ గపిలాశ్రమ సామీప్యమున భస్మరాసుల పొంతనున్న యశ్వమును జూచి కపిలమహర్షికిఁ బ్రణమిల్లి యనేక విధములఁ బ్రార్థించెను. కపిలుఁడు "బుద్ధిమంతుఁడా! గుఱ్ఱమును దోలుకొనిపోయి మీ తాత జన్నముఁ బూర్తిసేయింపుము. వెఱ్ఱులై నీతండ్రు లిట భస్మమైరి. గంగాజలములు వీరిపైఁ బ్రవహించిన వీరికి ముక్తికల్గు"నని యనుగ్రహించెను. అంశుమంతుఁడు కపిలు ననుగ్రహమునకుఁ బాత్రుఁడై తండ్రుల దుఃస్థితికి విచారించి యాగాశ్వమును గొనిపోయి తాత యశ్వమేధమును బూర్తి చేయించెను. తుదకు భగీరథుఁడు గంగా జలమును బాఱింపఁ జేసి సగరపుత్త్రులకుఁ బుణ్యలోకము లొసఁగెను. †

* మత్స్యపురాణము. † భారతము, భాగవతము — బ్రహ్మాండపురాణము.

పూర్వ మొకప్పు డశ్వశిరుఁ డను మహారా జనేక యాగములఁ జేసి యనేకవిధముల బ్రాహ్మణులను సత్కరించుచుండెను. కపిలమహర్షి యశ్వశిరుని యోగ్యత యెఱిఁగి యాతనిఁ గటాక్షించు నుద్దేశముతో నొకనాఁడు జైగీషవ్యుఁ డను ముని వెంటరాఁగా నశ్వశిరుని గృహమున కేఁగెను. నాఁ డశ్వశిరుఁడు యజ్ఞదీక్షితుఁడై బ్రాహ్మణుల కనేకభూరి దక్షిణ లిచ్చి సన్మానించెను. అతఁడు కపిల జైగీషవ్యుల నెంతయు నాదరించి పలువిధములఁ బూజించెను. తరువాత నశ్వశిరుఁడు కపిలమహర్షికి మ్రొక్కి "మహాత్మా! మీ రాకచే నేను ధన్యుఁడ నైతిని. విష్ణుమూర్తి కటాక్షసంపాదనకు నే నేమి చేయవలయునో తెలుపుఁ"డని కోరెను. అంతఁ గపిలమహర్షి "రాజా! నేనే విష్ణుమూర్తిని. నన్నుఁ బూజించిన నీవు కృతార్థుఁడ వగుదువు. నేనుగాక వే ఱొక విష్ణుమూర్తి కలఁడని యెంచుటకన్న నవివేకము లే"దని పల్కెను. అశ్వశిరుఁ డామాటల కాశ్చర్యము నంది యాతని యహంభావమున కసహ్యించుకొనెను. కాని, కపిలమహర్షి నేమియు ననఁ జాలక "మహాత్మా! విష్ణుమూర్తిని నే నెఱుఁగుదును. అతఁడు శంఖచక్రగదాపాణి గరుడవాహనుఁడు గదా! నీవే విష్ణుమూర్తి నన్న నవి నీకు లేవుగదా" యనెను. ఈమాట లశ్వశిరుని నోటినుండి వెలువడఁగానే కపిలమహర్షి విష్ణుస్వరూపుఁడై శంఖచక్రగదాపాణి యయ్యెను. జైగీషవ్యుఁడును గరుడుఁడై యాతని వాహనమయ్యెను. అంత నశ్వశిరుఁడు తన నేత్రములను నమ్మఁజాలక యది యంతయు మోసమనియు విష్ణుమూర్తి కమలనాభుఁ డనియు బ్రహ్మ యందుండి జన్మించెననియు నట్లు లే దేమని యడిగెను. వెంటనే కపిలమహర్షి కమలనాభుఁ డయ్యెను. అంత జైగీషవ్యుఁడు బ్రహ్మయై నిలచెను. ఐన, నశ్వశిరుఁడు నమ్మఁజాలక యది యంతయు మోసమే యనియుఁ గపిలమహర్షి విష్ణుమూర్తి కాఁ డనియు ననెను. వెంటనే

కపిలుని మాహాత్మ్యమున సభాసదు లెల్లరంతర్ధానమైరి. యజ్ఞశాల
దుష్టమృగములతో నిండిపోయెను. అశ్వశిరుఁ డతిభయాకుల చిత్తుఁడై
కపిలమహర్షియే విష్ణుమూర్తి యను పూర్ణవిశ్వాసము కలుగఁగాఁ
దిరిగి యాతనిఁ బ్రార్థించెను. వెంటనే కపిలుఁడు ప్రత్యక్షమయ్యెను.
సభాసదులు వచ్చిరి. దుష్టమృగము లంతర్ధానమయ్యెను. అశ్వశిరుఁడు
కపిలమహర్షి పాదములపైఁ బడెను. కపిలమహర్షి యాతనిఁ గటా
క్షించి "రాజా! నీవు విష్ణుభక్తుఁడవు. విష్ణువెట్లు వశపఱచుకొనఁగల
నని యడిగితివి. బ్రహ్మాది స్తంబపర్యంతము విష్ణుమూర్తి రూపమే
యని గ్రహించిన, నాతఁడు నీకు వశుఁ డగును. విష్ణుఁడు సర్వాంత
ర్యామి సర్వము నని నిరూపించుట కిట్లు చేసితిని. ఇఁకనైన నీ వది
గ్రహించి కులోచిత ధర్మములను వేదవిహితాచారములను నెఱవేర్చుచు
సుజ్ఞానము నందిన మోక్షము నందఁగలవని బోధించి కపిలమహర్షి
జైగీషవ్యునితో వెడలిపోయెను. *

## కపిలుని సాంఖ్యసిద్ధాంతము

కపిలమహర్షి సాంఖ్యయోగమును బోధించిన మహాత్ముఁడు.
"విషయములవిధము తెలిసికొని శ్రుతివాక్యములచే వాని తత్త్వ
మును గ్రహించి దృఢజ్ఞానముచే వానిని విడిచిపెట్టవలయును.
ఆయువు క్షణిక మనియు సుఖదుఃఖములు కాలగతి వచ్చు ననియు
నెఱుఁగవలెను. కర్మతత్త్వము వేద చోదనముల విధము గ్రహించి
సత్త్వరజస్తమోగుణములచే బుద్ధికిఁ గలుగు ప్రవర్తనముల గుర్తెఱుఁగ
వలయును. పంచేంద్రియములు గోష్ఠమునందు. నగ్ని వాయువులు
బయలను, పావకునందుఁ దోయములును, భూమి తోయములందును,
బలము కౌశికునందును, గ్రాంతి యుపేంద్రునందును, నర్థమున లోభ
మును, మనస్సున బుద్ధియు, రజస్సునఁ దమస్సును, సత్త్వమున రజ
స్సును దగులును. సత్త్వ మాత్మఁ దగులును. ఆత్ముఁడు నారాయణుఁ

* వరాహపురాణము.

డనియు మహోక్షుఁ డనియు నొప్పుచుండును; ఆత్ముఁడు పరమునఁ దగులును; పరము మోక్షమునఁ దగులును మోక్ష మింక నెందును దగులదు, పదునాఱు వికారములు గల ప్రకృతి యాత్మ కాశ్రయము. ఆత్ముఁడు ప్రకృతివికృత్యతీతుఁడు. ఆత్మునకు రెండురూపములున్నవి. ఒకటి విషయములందును రెండవది మధ్యస్థభావమునందును బ్రవర్తిల్లును. ప్రాణాపానవ్యానోదానసమానములను నైదు వాయువులు నాతనివి. వీనివిధము నెఱిఁగినఁ గలుగుజ్ఞాన మంతరాత్మునిఁ జూపును. గర్భ వాస దుఃఖము, జన్మవ్యథ, బాల్యవిమూఢత్వము, రాగము, క్లేశము, వార్ధక్యము, వీని వలనఁ గలుగు కృపణతలు గుర్తెఱిఁగి సంగముఁ బాసి యాత్మునిఁ గని మోక్ష మందఁదగును. దేహగుణాదిదోషముల నెల్లఁ ద్రోచు మార్గములను గ్రహించి యామార్గ పరిచయమున విష్ణు మాయచేఁ దోఁచు విశ్వమంతయు బుద్బుద ప్రాయముగా ఫేన సదృశమై మృద్ఘటములఁబోలి యున్న దని గ్రహించి దానిని లక్ష్య పెట్టక మోక్షమార్గము నరయుటయే సాంఖ్యము. కపిలమహర్షి బోధించిన యీ సాంఖ్యదర్శనము ప్రజాపతిపూజ్యమై, వేదశాస్త్ర పురాణ విదిత పరిజ్ఞానముల కెల్లఁ జేరుగడయై బ్రహ్మభావ భాజన తకు సరిలేని సమ్యగుపాయమై వెలసినది. ఇదియే షడధ్యాయవిల సితమై, త్రివిధ దుఃఖాత్యంత నివృత్త్యత్యంత పురుషార్థాదికనిగదనమై "కపిలస్మృతి" యనఁ బరగుచున్నది.*

## కపిలుని భక్తియోగము

కపిలమహర్షి మాతృదేవికి భక్తియోగమును బోధించెను. తామస రాజస సాత్త్విక మను భేదములఁ ద్రివిధముల భక్తియోగము నిట్లు నిరూపించెను. 'నిత్యము హింసాపరుఁడై దంభ మాత్సర్యాదుల కాలవాలమై యొప్పుచున్నను, భేదదర్శియై భగవద్భక్తుఁ డగు వాఁడు తామస భక్తుఁడు. విషయ సుఖములఁ బ్రవీణుఁడై

* భారతము — శాంతిపర్వము.

యైశ్వర్యాదుల ననుభవించుచున్నను భగవద్భక్తి విడువని వాఁడు రాజస భక్తుఁడు. పాప పరిహారమునకై భగవదర్పణ బుద్ధితోఁ గర్మములు చేయుచు జన హితకారియై భక్తుఁ డగువాఁడు సాత్త్విక భక్తుఁడు. పరమేశ్వరుని గుణములను వినుటచేఁ గలిగిన భక్తిచే నైన నాతనిపై మనస్సును నిల్పినవాఁడును బరమభక్తుఁ డని కపిలుఁడు భక్తియోగమును దదనంతఫలమును విశదీకరించెను*

### కపిలమహర్షి రావణునకు విశ్వరూపము చూపుట

కపిలమహర్షి యొకప్పుడు పశ్చిమ సముద్ర తీరమున నొక యరణ్యములోఁ బద్మాసనస్థుఁడై కన్నులఁగవ మూసికొని యాత్మ యోగ సుఖ మందుచుండెను. అప్పుడు రావణుఁడు వరగర్వముచే బలవంతుల నందఱను జయించు నుద్దేశముతోఁ దిరుగుచుఁ గపిల మహర్షిని గాంచెను. రావణుని కంటికిఁ గపిలమహర్షి నేత్రాంచల ముల నగ్నిశిఖలు, బాహువుల యందు బహుశితాయుధములు, శరీర మందెల్ల మరుద్వసు రుద్ర సంఘములు గానవచ్చె దుస్సహముగాఁ గాన వచ్చెను. మఱియుఁ గపిలమహర్షి యురమున లక్ష్మీదేవియు, శల్య ముల మరుద్గణములు, కడుపున సముద్రములు, కన్నులలో సూర్య చంద్రులు, ధాత, విధాత, రుద్రాదులు మున్నగువారెల్లరు నాతని శరీరమునఁ గానవచ్చిరి. రావణుఁ డిది ఋషులమాయ యని వానిపై ననేక శస్త్రాస్త్రములు ప్రయోగించెను. వెంటనే కపిలమహర్షి "ఓరీ! చెడుగా! నన్ను సాధింప వచ్చితివా?" యని పిడికిలిచేఁ బొడిచెను. దానితో రావణుఁడు మూర్ఛపడెను. తోడి దైత్యులాతని నెదిరించిరి. కపిలుఁడు దైత్యుల హుంకరించి గుహాభ్యంతరమున కేఁగెను. రావణుఁడు కొంత సేపటికి మూర్ఛ దేఱి యాతని సాధింపనెంచి బాణ కృపాణాదులతోఁ గపిలుని గుహఁ బ్రవేశించెను. అందు మహావీరులు దేవసుతులు, సిద్ధులు, శంఖచక్రాదులు ధరించి చతుర్భుజులైన పురుష

* భాగవతము — తృతీయస్కంధము.

పరులు గానైరి. దివ్యసౌరభములు నిండఁగ రమణీయరోచుల నీను రత్నాలంకారముల ధరించిన స్త్రీలు వింజామరలు వీచుచుండఁగాఁ సౌందర్యనిధియైన యొక స్త్రీ పాదములొత్తుచుండఁగా గపిలమహర్షి కనుమోడ్చి నిదురించుచుండెను. రావణుఁడు చెంతకేఁగ నతఁడు లేచెను. రావణుఁడు విస్మితుఁడై యాతని యపూర్వ చరిత్ర మడిగెను. కపిలమహర్షి రావణుఁడు త్వరలోఁ జంపఁబడనుండు టెఱిఁగించి నోరు తెఱచెను. అందు విశ్వరూపము ప్రత్యక్షమయ్యెను. రావణుఁడు భీతచిత్తుఁడై యాతనికి నమస్కరించి "మహాత్మా! నీ చేతిలోఁ జని పోవుటకంటె శుభము వేఱొకటి లేదు. నే నందుకొఱకే నిన్ని విశ్వమున విసుగు విరామములు లేక వెదకుచున్నా" నని కడుఁగడుఁ బ్రశంసించెను. ఇంతలో గిరితో గుహతోఁ గపిలమహర్షి యంతర్హితుఁ డయ్యెను. రావణుఁడు పరమవిస్మయచిత్తుఁడై యట నుండి వెడలి పోయెను. *

కపిలమహర్షి యవతారముమూలమున లోకము గడించినది కపిలాచార్యుని సాంఖ్యతత్త్వము. భక్తియోగమునకు శ్రుతిస్మృతులకుఁ బ్రామాణ్య మొసఁగి యిది విఖ్యాతి నార్జించినది. సూర్యరశ్మితోఁ బలికిన పలుకులవలనఁ గపిలుని వేదప్రామాణ్య బుద్ధి, మాతృశ్రీయగు దేవహూతికి బోధించిన భక్తియోగము నిట్లనుటకు సాక్షిభూతములు. కపిలమహర్షి తండ్రితోఁ జెప్పిన ట్లవతార మెత్తి మునివేషము గైకొనుట ఋషిజనములను దన్మూలమునఁ బ్రజానీకమును దత్త్వబోధామృతముచేఁ బునీతులను జేయుటకే యనుట నిస్సంశయము. ఆ మహర్షి వర్యుని బోధామృతమును దనివితీఱఁ గ్రోలి భక్తుల జరామరత్వముల నంది తమజీవితములను సార్థక మొనరించుకొందురుగాక!

---

* ఉత్తర రామాయణము.

# మహర్షుల చరిత్రలు

* * *

## కశ్యప మహర్షి

మరీచిమహర్షి బ్రహ్మాదులతోఁ గూడి దేవహూతీకర్దములకు జనించిన విష్ణుమూర్తి యగు కపిలమహర్షినిఁ జూడవచ్చెను. అప్పుడు కర్దమప్రజాపతి మరీచిమహర్షిని దన యింట నుంచుకొని తన కూఁతుండ్రలో నొకతె యగు కళనిచ్చి వివాహము చేసెను. అట్లు వివాహితుఁడై మరీచిమహర్షి భార్యాసహితుఁడై తపోవనమున కేగి సుఖముండెను.

అంతఁ గొంత కాలమునకుఁ గళకు మరీచిమహర్షి దయచే గర్భము సంభవింపఁ గాలక్రమమున నామె మగశిశువును గనెను. మరీచిమహర్షి కుమారుఁడు ప్రజాపతి యగు ననియు నాతనిని జాగ్రత్తగాఁ గాపాడు మనియు భార్యకుఁ జెప్పి యాతనికిఁ గశ్యప నామ మొసఁగి యుక్తకాలమున నుపనయనాది సంస్కారము లొనర్చి తపోవనమున కేఁగెను.

### కశ్యపమహర్షి సంతానము

కశ్యపుఁడు తరువాతఁ బెరఁగి పెద్దవాఁడయ్యెను. బ్రహ్మ నియోగింప దక్షప్రజాపతి తనకుఁ గల్గిన పుత్త్రికలలో నదితి, దితి. దనువు, కాల, అనాయువు, సింహిక, ముని, కపిల, క్రోధ, ప్రథ. క్రూర, వినత, కద్రువ లనువారిని గశ్యపుని కిచ్చి వివాహము చేసెను. కశ్యపమహర్షి తన భార్యలందఱకు సంసార సౌఖ్యము నొసఁగి పుత్త్రుల నిచ్చెద నని వచించెను. కొంతకాలమునకుఁ గశ్యపమహర్షి కృపచే నదితి ధాత, మిత్త్రుఁడు, అర్యముఁడు, శుక్రుఁడు, వరుణుఁడు. అంశుఁడు, భగుఁడు, వివస్వంతుఁడు, పూషుఁడు, సవితృఁడు. త్వష్ట, విష్ణుఁడు

నను ద్వాదశాదిత్యులను గనెను. కశ్యపునివలన దితికి హిరణ్యాక్షుఁడు హిరణ్యకశిపుఁడు జన్మించిరి. దనువునకు విప్రచిత్తిశంబరాదిదానవులు నలువం డ్రుదయించిరి. కాల యనుదానికి వినాశన క్రోధాదు లెన మండ్రుగురు పుట్టిరి. అనాయు వనునామెకు బలవీరాదులు నలుగురు పుట్టిరి. సింహికకు రాహువు కలిగెను. ముని యను భార్య భీమసేనోగ్ర సేనాదు లను గంధర్వులఁ గనెను. కపిల కమృతము, గోగణము, బ్రాహ్మణులు, ఘృతాచీమేనకాదు లగు నప్సరసలుఁ బుట్టిరి. క్రోధ యను నామెకుఁ గ్రోధవశగణములు జనించెను. ప్రథ యను నామెకు సిద్ధాదులును, క్రూరకు సుచంద్ర చంద్రహంత్రాదులును బుట్టిరి. *

### కశ్యపప్రజాపతికిఁ గద్రూవినతలవలని సంతతి

తరువాతఁ గొంతకాలమునకుఁ గద్రూవినతలు కుమారులఁ గాంచు నుద్దేశముతోఁ గశ్యపమహర్షి కడ కేఁగి యనేక సహస్రవర్షము లాతని నారాధించిరి. కశ్యపు డంత వారి సేవ కానందించి వరములు వేఁడుకొనుఁ డనెను. అందుఁ గద్రువ వేయిమందిని వినత యా వేయిమందికంటె బలాధికులైన యిద్దఱు పుత్త్రులను గోరుకొనెను. కశ్యపమహర్షి యట్లే యని వారి కోర్కెఁ దీర్చుట కుగ్రతపము చేసెను. తరువాత గశ్యపుఁ డింద్రాది దేవతలను వాలఖిల్యాది ఋషిగణములను దనకు సహాయులఁ జేసికొని పుత్త్రకామేష్టి యొనరించెను. ఆయజ్ఞమున నంగుష్ఠమాత్ర దేహులు ననవరతోపవాసకృశీభూత గాత్రులు నగు వాలఖిల్యాదులఁ జూచి యింద్రుఁడు నవ్వెను. అంత వా రాతనిపైఁ గోపించి యింద్రునికంటెను నూఱురెట్లు బలవంతుఁడగు పుత్త్రుఁడు కశ్యపున కుదయించి రెండవ యింద్రుఁ డగుఁ గాక యని మహామంత్రములతో వేల్వఁ దొడగిరి. ఇంద్రుఁడు భయకంపితుఁడై కశ్యపుని శరణు వేఁడెను. కశ్యపమహర్షి లోకసంరక్ష

భాగవతము — చతుర్థస్కంధము.

ణార్థమై వాలఖిల్యాది మహర్షులఁ బ్రార్థించి భువనప్రవృత్తికి విపరీతము కాకుండునట్లు తన కుదయించుసుతుఁడు పక్షికులమున కింద్రుఁ డగు నటు వారందఱ నొడంబఱిచెను. పిమ్మటఁ గశ్యపుఁడు కద్రూవినతలకుఁ గోర్కిసిద్ధింపఁజేసి గర్భముల సంరక్షించుకొనుఁ డని చెప్పి పంపివేసెను. కొంత కాలమునకు వారిగర్భములందండము లుదయించెను. వాని నెల్ల ఘృతకుండములఁ బెట్టి యిరువురు రక్షించుచుండిరి. నూఱేండ్లకుఁ గద్రూగర్భాండములు క్రమముగాఁ జిట్లి యందు శేషుఁడు, వాసుకి, తక్షకుఁడు, కర్కోటకుఁడు, ధనంజయుఁడు, కాళియుఁడు మున్నగు వేయిమంది నాగముఖ్యు లుదయించిరి. వినత తన గర్భాండములనుండి పుత్త్రులు కలుగ లేదని విచారించి యొకయండమును బ్రద్దలుకొట్టిన నందుండి యనూరుఁడు జన్మించి యకాలమున నండము జిట్లించుటచేఁ దా నంగహీనుఁడ నైతినని తల్లిని నిందించి రెండవ యండమునైనను జాగ్రత్తగాఁ గాపాడుకొనుమని తల్లికిఁ జెప్పి తాను సూర్యసారథి యయ్యెను. తరువాతఁ జిర కాలమునకు రెండవ యండమునుండి గరుత్మంతుఁ డుదయించెను.

### కశ్యపుఁడు గరుత్మంతు నాశీర్వదించుట

గరుత్మంతుఁ డుదయించి మాతృ దాస్యవిమోచనమునకై యమృతముఁ దెచ్చుటకుఁ దల్లి యనుమతి కోరి యామె చెప్పిన చొప్పున సముద్రమునందలి నిషాదుల భక్షించిన నాఁకలి తీఱక తండ్రియగు కశ్యపమహర్షి కడ కేఁగి యాహారమడిగెను. కశ్యపుఁడు కుమారుని ధైర్యమునకు మెచ్చుకొని విభావసుఁడు సుప్రతీకుఁ డను బ్రాహ్మణులు కలహించి కూర్మ గజ రూపులై పోరుచున్నా రనియు వారిని భక్షింపుమనియుఁ జెప్పెను. గరుత్మంతుఁడు తండ్రి పంపున నలంబతీర్థమున కరిగి రౌహిణ మను వృక్షముపై వ్రాల దాని శాఖ విఱిగి పోయెను. దాని నంటి తపముచేయు వాలఖిల్యులకు బాధ కలుగకుండ నాకొమ్మను గ్రిందబడకుండ నోటఁ గఱచుకొని

గజకచ్ఛపములఁ జేతుల నిఱికించుకొని గంధమాదన పర్వతమునఁ దపముచేయు తండ్రికడ కేఁగి మ్రొక్కెను. కశ్యపుఁ డది గ్రహించి యా వాలఖిల్యుల నందుండి మఱియొక చోటికిఁ బొండని వేఁడుకొనెను. వా రా శాఖను విడిచి హిమగిరి కరిగిరి. కశ్యపుఁ డా శాఖను నిష్పురుష నగమున విడువు మన గరుడుఁ డతివేగమున నట్లు చేసి హిమగిరిపై దిగి గజగచ్ఛపముల భక్షించి మహాబల సంపన్నుఁడై యమృతము గొనివచ్చి మాతృశాప విమోచనముఁ గావించెను.*

### భూమి కాశ్యపి యనఁబరగిన విధము

పూర్వము పరశురాముఁ డిరువదియొక్కమాఱు నేల నిఃక్షత్త్రము గావించి యా పాపవిముక్తికై యశ్వమేధయాగమును జేసి యది పరిపూర్తి యైనంతనే కశ్యప మహర్షిని బిలిచి భూమియంతయుఁ దక్షిణగా నిచ్చివేసెను. కశ్యపమహర్షి లోకసంరక్షణార్థ మది గ్రహించి రాజవంశమునకు నిశ్శేషత్వము కలుగకుండుటకై పరశురాముని దక్షిణాబ్ధి పారదేశమునకుఁ బొమ్మనెను. పరశురాముఁడు శూర్పాకార ప్రదేశము సముద్రుఁడు నిజహారమున కీయ నందుఁ దపోనియతినుండెను. కశ్యపమహర్షి భూమినంతను భూసురుల కిచ్చి తపోవనమున కేఁగెను. నాఁటినుండి భూదేవి 'కాశ్యపి' యని పిలువఁబడుచున్నది,

### గంగ కాశ్యపి యనఁబరగిన విధము

తొల్లి యొకప్పుడు కశ్యపప్రజాపతి మహర్షులను దర్శింప నైమిశారణ్యమున కేఁగెను. అపుడందలి ఋషులు బహు భక్తి సత్కృతులతో నాతనిని బూజించిరి. కశ్యపుఁడు వారి యోగక్షేమము లడిగి యాదరించిన సమయమున వారు "తాపసేంద్రా! మాకు సర్వకాలసర్వావస్థలయందును స్నానపానాదుల కనుకూల మగు నది యొకటి కావలయును. నీవు సర్వలోక సంరక్షణసమర్థుఁడవు. నీవేర

* భారతము — ఆదిపర్వము.

విలసిల్లునట్లు గంగానదిని భూమిపైఁ బ్రవహింపఁజేసి లోకక్షేమముఁ జేకూర్చి మాకోరిక తీర్పు" మని ప్రార్థించిరి.

కశ్యపుఁడు వారికోరికఁ దీర్ప నెంచి వెంటనే అర్బుదాద్రి కేఁగి యందు ఘోరనిష్ఠతోఁ బరమశివుని గుఱించి చిరకాలము మహాతపస్సు చేసెను. అంత శివుఁడు కనికరించి ప్రత్యక్షమై వరము కోరుకొను మని కశ్యపునితో ననెను. కశ్యపుఁడు గంగను భూలోకమునఁ బ్రవహింపఁజేయుమని కోరెను. శివుఁడట్లేయని తన జడనుండి గంగానది నొకపాయగా విడిచెను. కశ్యపుఁ డట్లు కృతార్థుఁడై పరమ శివుని భజించి గంగతో నైమిశారణ్యమునకుఁజని ఋషుల నానందింపఁ జేసెను. వారు బ్రహ్మానందపడి కశ్యపు నభినందించి ఆ గంగావాహినికి 'కాశ్యపి' యను పేరొసంగిరి. ఈ 'కాశ్యపి' యే కృతయుగమున 'కృతవతి' యనియు, త్రేతాయుగమున 'గిరికర్ణిక' యనియు, ద్వాపరయుగమున 'చంధన' యనియు, కలియుగమున 'సాభ్రమతి' యనియు జగద్విఖ్యాతిఁ గాంచెను.

సాభ్రమతీనది సకల పాపసంహారిణి. ఈ నదీ తీరమున యవ క్రీతరైభ్య భృగ్వంగిరో దత్తాత్రేయ విశ్వామిత్ర భరద్వాజాది మహర్షులు తపోనిష్ఠులై నిత్యనివాసముండిరి. నీలకంఠ, నందహ్రద, రుద్రహ్రద, రుద్రమహాలయ తీర్థములును, మందాకినీ, అచ్ఛోద సాభ్రమతి యందు గూఢముగాఁ బ్రవహించును. ఈ సాభ్రమతీ నదీమతల్లి వలననే బ్రహ్మచారి, వికీర్ణ, శ్వేత, గణాగ్ని హిరణ్యా సంగమాప్సరస తీర్థములును; కపితీర్థ, వంకితీర్థ, పిప్పలాద, నింబార్కాది మహాతీర్థము లనంత మేర్పడెను.

కశ్యపమహర్షి తప మొనరించిన యాప్రదేశము 'కాశ్యపతీర్థ' మనఁ బరగెను. అం దాతఁడు నిర్మించిన కుండమునకు 'కాశ్యపకుండ' మను పేరువచ్చెను. అం దాతఁడు కుశేశ్వరుని సంస్థాపించెను. మఱియు

ఆ పరిసరముల నొక నగర మాతఁడు నిర్మించెను. అది 'కాశ్యప' యను పేరఁగాశీక్షేత్రమున కెనయై విలసిల్లెను. కశ్యపసంబంధమైన యీ క్షేత్రమున నే తీర్థమున జనుఁడు స్నానమాచరించినను, దర్శించినను. సకల పాపక్షయ మంది యాతఁడు ముక్తినందును. *

### కశ్యపుఁడు భూమిని రాజులకుఁ బంచి యిచ్చుట

కొంతకాలమునకు భూమిపై ధర్మము నశించి యధర్మము పెరుఁగఁ జొచ్చెను. బ్రాహ్మణులు యజ్ఞయాగములు మాని యకృత్యములకుఁ జొచ్చిరి. ఈ మహాదోషములచే భూమి పాతాళమునకుఁ బోవుచుండఁగాఁ గశ్యపమహర్షి తనతొడఁ గ్రుచ్చి దాపుచేసి యెత్తఁగా భూదేవి మరలఁ బూర్వరూపమున నుండెను. అంతఁ గాశ్యపి కశ్యపమహర్షికి నమస్కరించి యుత్తమక్షత్రియులు దండనీతిచే ధర్మమును రక్షించి తన్ను సురక్షితఁ జేయునట్లనుగ్రహింపఁ గోరెను. అపుడు కశ్యపుఁడు పరశురామునిచేఁ జావని రాజు లెవ రనెను. భూదేవి సంతసించి హైహయులు కొందఱు పౌరవంశజుఁడగు విదూరథుని కొడుకును ఋక్షపర్వతమున ఋక్షములు రక్షించుటయు, సౌదాసుని వంశమువాఁ డొకఁడు పరాశరమహర్షి యజ్ఞమున శూద్రకర్మలు చేయుచు బ్రదికి యుండుటయు, శిబి మనుమఁడు గోపతి యనువానిని వనమున గోవులు రక్షించుటయుఁ, బ్రతర్దన పుత్త్రుఁడు వత్సరాజు నల్లే జీవించియుండుటయుఁ జెప్పి వారిని బిలిపించి యధిపతులఁ జేయు మని ప్రార్థించెను. కశ్యపమహర్షి యానందించి యా రాజసుతుల నందఱఁ బిలిపింప వారెల్లరు విచ్చేసి కశ్యపునకు నమస్కరించి నిలిచిరి. కశ్యపుఁడు వారందఱికు భూమిని విభజించి యొసఁగి పరిపాలింపుఁ డని యభిషేక మాచరించి పంపెను. క్రమముగా నా నృపులవంశములం దనేకులు పుట్టి ధరణిభారము వహించిరి.

* పద్మపురాణము — ఉత్తరఖండము.

## కశ్యపుఁ డదితివలన వామనునిఁ గనుట

తొల్లి యొకసారి బలిచక్రవర్తి భృగ్వాదిబ్రహ్మవాదుల నర్చించి యనంత బలోపేతుఁడై స్వర్లోక మాక్రమించెను. ఇంద్రాది దేవత లెల్లరుఁ గామరూపముల ధరించి తమతమ తోఁచినచోట్ల కేఁగిరి. బలి యైశ్వర్య విభవుఁడై యుండ భృగ్వాదు లతనిచే శతాశ్వమేధములు చేయించిరి. ఇట్లుండఁగా నదితి తన బిడ్డలపాటు సవతి బిడ్డల యైశ్వర్యము నరసి చింతాక్రాంతయై యుండఁగా నొకనాఁడు కశ్యపమహర్షి భార్యపాలి కేతెంచి యోగక్షేమ మడిగెను. అదితి తన బిడ్డల దుస్థితిని దితి బిడ్డల ప్రాబల్యమును జెప్పి తనబిడ్డల సంరక్షింపుమని భర్తను వేఁడుకొనెను. కశ్యపమహర్షి భావికాలగతు లూహించి నారాయణుని బ్రార్థింపు మని తనసతి కుపదేశించెను. ఏవ్రతముచే నారాయణు నుపాసింతునని యామె యడుగఁ గశ్యపుఁడు 'పయోభక్షణ' మను వ్రతమామె కుపదేశించి తత్కాల మంత్రములఁ జెప్పెను. అదితి యట్లు చేయఁగా నారాయణదేవుఁడు ప్రత్యక్షమై తా నామెకుఁ గుమారుఁడై పుట్టి యభీప్సితముఁ దీర్తుననియుఁ బుత్రోత్పత్తికి భర్తను సేవింపుమనియుఁ జెప్పి యంతర్హితుఁడయ్యెను. అదితియు నానందముతో భర్తకు శుశ్రూష చేయుచుండఁగా నొకనాఁడు కశ్యపుఁ డామెతో భోగించి యచ్యుతునంశ మాత్మ నొలయ దాని నదితి గర్భమునఁ జేర్చెను. అంత నదితి గర్భవతియై కాలక్రమమున నారాయణుఁ గనెను. శంఖచక్రగదాధరుఁడు కౌస్తుభాభరణుఁడునైన హరి తన గర్భమున నెట్లుండెనని యదితి వెఱఁగుపడఁగాఁ గశ్యపుఁ డాతని ననేక విధముల స్తుతించెను. అంతఁ నారాయణుఁడు రూపాంతరము గ్రహించి వామనుఁడై కశ్యపునింటఁ బెరుఁగఁజొచ్చెను.

కశ్యపమహర్షి మహర్షులఁ బురస్కరించుకొని యుక్త కాలమున వామనున కుపనయనము చేయ, సవిత సావిత్రి నుపదేశించెను; బృహస్పతి యజ్ఞోపవీత మొసఁగెను. కశ్యపుఁడు మౌంజి నిచ్చెను;

అదితి కౌపీన మిచ్చెను. బ్రహ్మ కమండలువును, సరస్వతి యక్షమాలికయు సప్తర్షులుఁ గుశ పవిత్రములు నిచ్చిరి. ఈ ప్రకారము వామనుఁడు వడుగై తల్లి దండ్రుల యాజ్ఞఁ గైకొని బలిచక్రవర్తికడ కేగి మూఁడడుగుల దానము యాచించి నాతనిఁ బాతాళమున కనిపి స్వర్లోక రాజ్యమును నిజసోదరుల కొసఁగి మాతృకాంతను దీర్చెను. *

### కశ్యపుఁడే వసుదేవుఁడు దశరథుఁడు, నగుట

ఒకమాఱు కశ్యపుఁడు కద్రువకోరికఁ దీర్పనెంచి యామెచే ననేక వత్సరములు శుశ్రూషఁ గొని తత్ఫలితముగా నామెతోఁ గ్రీడించుచుండెను. ఆ సమయముననే యీవిషయ మెఱుఁగని యదితియు భర్తతోడి సంభోగమపేక్షించి నూతన వస్త్రాభరణయై యలంకరించుకొని కశ్యపమహర్షి యాశ్రమమున కేఁగెను. కద్రూ సహితుఁడైన పతిఁ గాంచి యదితి మాత్సర్యసహితయై తన ప్రయత్నము విఫలమగుటకుఁ జింతించెను. తాను వాంఛించిన సౌఖ్యమున కడ్డువచ్చిన కద్రూ కశ్యపులపైఁ గోపించి వారిని నరులై జన్మింపుఁడని యదితి శపించెను. ఆ కారణమునఁ దరువాతఁ గశ్యపుఁడు వసుదేవుఁడు గను, గద్రువ దేవకి గను జన్మించిరి. కశ్యపుఁడు ప్రతి జన్మమందును దనకే విష్ణుమూర్తి కుమారుఁడుగా నవతరింపఁ గోరుకొనెను, విష్ణుమూర్తి యాతని కోరిక నంగీకరించి యదితి కశ్యపులకు వామనమూర్తియై జన్మించెను. వసుదేవరూపమున నున్న కశ్యపునికే దేవకి యందుఁ గృష్ణుఁడై జన్మించెను. కశ్యపుఁడే దశరథుండై కౌసల్య యందు శ్రీరామచంద్రునిఁ గాంచెను. ఈ విధముగాఁ గశ్యపుని కోరిక ఫలించెను. †

పూర్వ మొకప్పుడు కశ్యపుఁడు సముద్రుని హోమధేనువుల నాతనియనుమతి నింటికిఁ దోలుకొనిపోయి చిరకాల మా గోక్షీరముల

---

* భాగవతము. † బ్రహ్మవైవర్తపురాణము.

ననుభవించెను. తరువాత నొకనాఁడు సముద్రుఁడు వచ్చి యాహోమ ధేనువుల నిచ్చివేయుమని కశ్యపునిఁగోరెను. కశ్యపుఁ డిచ్చివేయ నెంచినను నాతని భార్యలగు నదితియుఁ గపిలయు నీయ నంగీకరింపని కారణమున మరల వెనుదీసెను. సముద్రుఁడు బ్రహ్మతోఁ జెప్పు కొన్నను బ్రయోజనము లేకపోఁగాఁ కశ్యపుఁడు భూమిపై గోపాల కుఁడై పుట్టుఁగాక యని యాతఁడు శపించెను. ఆ శాపముచేతనే కశ్యపుఁడు వసుదేవుఁడైపుట్టి కంసుని గోగణమున కధిపతి యయ్యెను. *

## కశ్యపునివలన దితికి మరుద్గణము పుట్టుట

ఇంద్రుఁడు బలవంతుఁడై దితికుమారులను బాధించుచుండఁగా నొకనాఁడు దితి భర్తను జేరి విచారముతోఁ దన కింద్రునంతబలము కలయొక కుమారు నిమ్మని కోరుకొని యనేక వర్షము లతనికి శుశ్రూష చేసెను. కశ్యపమహర్షి యామె కోరిక చెల్లించెను. దితి గర్భవతియై యుండఁగా నింద్రుఁడీవిషయ మెఱిఁగి తన సేవ నంగీకరిం పుమని దితిని గోరఁగా నామె యానందించి యంగీకరించెను ఒకనాఁ డామె యశుచియై శయనించియుండఁగా నింద్రుఁడామె గర్భమును బ్రవేశించి గర్భస్థశిశువు నేడు ఖండములుగాఁ జేసెను. అంత నా ఖండము లేడు నేడుగురు శిశువులై విలపించుచుండఁగా నొక్కొక్కని నేడేసి ఖండములుగా మరల నింద్రుఁడు ఖండించెను. ఈలోపున దితి మేల్కొని యీవిషయ మెఱిఁగి వా రతనికి శత్రులు గాక మిత్రులే యగుదురని యింద్రుని రక్షింప వేఁడెను. ఇంద్రుఁడు వారి నను గ్రహించి వెడలిపోయెను. ఇట్లు వారు నలువది తొమ్మండ్రుగురును బుట్టి 'మరుద్గణ' మనుపేర విలసిల్లిరి. †

## కశ్యపుని జ్ఞానబోధ

కశ్యపుని భార్యలలో దితిదనువు లొకప్పుడు తమ పుత్త్రులు దేవతల చేతిలో మృతి చెందిరని మిక్కిలి దుఃఖింపఁ దొడఁగిరి. అపుడు

---

కశ్యపుఁ డట కరుదెంచి వారి కిట్లు బోధించెను. "శాంతలారా! పురాకృత కర్మఫల మనుభవింపక తప్పదు. మీ పుత్త్రులు శమదమ దయాధర్మనిరతులు కారు. అందుచే వారు నశించిరి. మీరు వారికై వగవవలదు. ఏలన దుఃఖము సత్యధర్మములను నశింపఁజేయును. ధర్మక్షయము వలనఁ బుణ్యక్షయ మగును. పుణ్యక్షీణతయే సర్వ దుఃఖములకుఁ గారణము. అందుచేతనే మహాఋషులు సంసారము బహుళదుఃఖమునకుఁ దావని దానిని రోసి దానివలన దుఃఖము తమకిఁకఁ గలుగకుండుటకై ఘోరతప మొనరింతురు.

నిత్యుఁడు, నిర్వికారుఁడు, నిర్గుణుఁడు నగు పరమాత్మయందు మాయాశక్తివలనఁ బంచతన్మాత్రలు, పంచభూతములు పుట్టినవి. వానివలన లోకములు, స్థూల శరీరములు మున్నగునవి పుట్టినవి; జ్ఞానేంద్రియ ప్రాణపంచకములు, మనోబుద్ధులు జనించినవి. లింగ సూక్ష్మకారణశరీరములతో నైక్యభ్రాంతి నొంది పరమాత్మ జీవుఁడై కర్మఫలభోక్త యగును. జాగ్రత్స్వప్న సుషుప్త్యవస్థాభిమానియై జీవుఁడు విశ్వుఁడు, తైజసుఁడు, ప్రాజ్ఞుఁడు నగును. శరీరమునే తానను కొను జీవుఁడు గురూపదిష్ట మహావాక్యముచే అపరోక్ష జ్ఞాన మంది పునరావృత్తిరహితమైన మోక్షమందును. ధర్మము, శరీరము, సత్యము, హృదయము, నగు విష్ణుని భజించి తత్కీర్తన స్మరణ పూజావందనములచే జీవుఁడు జీవత్వభావము విడిచి పరమాత్మతాదాత్మ్యము నందఁ గలడు" ఇట్లు బోధించి వారికి జ్ఞాన సుఖ మొసఁగి కశ్యపుఁడు తపమున కేఁగెను.*

### కశ్యపస్మృతి

కశ్యపస్మృతి లేక కశ్యపధర్మసూత్రము లను పేర నొక ధర్మశాస్త్రము గాననగుచున్నది. అగ్నిసాక్షిగా వివాహమాడక కొని

* పద్మపురాణము – భూమిఖండము.

యింట నుంచుకొన్న స్త్రీ భార్యకాఁజాల దని, యామె దేవ పితృ కార్యములలోఁ బాల్గొన నర్హురాలు కాదని కశ్యపుఁడు చెప్పిన శ్లోకమును బోధాయనుఁడు పేర్కొనెను. విశ్వరూప హరదత్తాదులెల్లరును గశ్యపస్మృతినుండి యుదాహరించి యున్నారు.

## కశ్యప గీత

కశ్యపమహర్షి క్షమాగుణమును బ్రశంసించుచుఁ దెలిపిన వాక్యములకే కశ్యపగీత యని పేరు. దానియందలి ప్రధాన భావమిది. వేదములు, యజ్ఞములు, శౌచము, సత్యము, విద్య, ధర్మము, సచరాచరమయిన జగమంతయు క్షమయందే నిలిచినవి. తపస్స్వాధ్యాయ యజ్ఞకర్తలు, బ్రహ్మవిదులు పడయు పుణ్యగతులు క్షమావంతులు పడయుదురు.*

---

* కశ్యపగీతా

క్షమా ధర్మః క్షమా యజ్ఞః క్షమా వేదా క్షమా శ్రుతమ్।
య ఏతదేవం జానాతి వసర్వం క్షంతు మర్హతి॥
క్షమా బ్రహ్మ క్షమా సత్యం క్షమా భూతం చ భావి చ।
క్షమా తపః క్షమా శౌచం క్షమ యేదం ధృతమ్ జగత్॥
అతియజ్ఞవిదాన్ లోకాన్ క్షమిణః ప్రాప్నువంతి చ।
అతిబ్రహ్మవిదాం లోకా వతి చాపి తపస్వినామ్॥
అన్యే వై యజుషాం లోకాః కర్మిణామపరే తథా।
క్షమావంతాం బ్రహ్మ లోకే లోకాః పరమపూజితాః॥
క్షమా తేజస్వినాం తేజః క్షమా బ్రహ్మ తపస్వినామ్।
క్షమా సత్యం సత్యవతాం క్షమా యజ్ఞః క్షమా శమః॥

# మహర్షుల చరిత్రలు

* * *

## గౌతమ మహర్షి

శతపథబ్రాహ్మణము ననుసరించి గౌతమమహర్షి బ్రహ్మ మానసపుత్త్రులలో నొకఁడు; సప్తర్షులలో సుప్రసిద్ధుఁడు. శ్రుతుల ననుసరించి గౌతమవంశమున జన్మించిన యొక మహర్షి. ఈ గౌతమ మహర్షి యే గౌతమధర్మసూత్రకర్త.

### అహల్యాగౌతముల వివాహవృత్తాంతము

తొల్లి విష్ణుమూర్తి మోహినీరూపము ధరించి త్రినేత్ర సురాసురుల సైతము మోహింపఁజేయఁగా నెల్లరును బ్రహ్మ సృష్టిని జప్పగఁ దలపోసిరి. ఆ కారణమున నధిక ప్రయత్నమున నఖిలలోక మోహనముగా నబ్జభవుఁ డహల్యా మోహనాంగిని సృష్టించి నైష్ఠిక బ్రహ్మచర్యమునఁ దపము సలుపు గౌతమునకుఁ బరిచర్య చేయ నియోగించెను. అహల్య యంగీకరించి హోమాదికృత్యములం దెల్ల నిచ్చలాతనికి సపర్య లొనరించుచుండెను. గౌతముఁడు నామెయం దేమాత్రమును లౌల్యము లేకుండ నుండెను. కొంతకాలమున కహల్య యౌవనము నంది సౌందర్యమున నద్వితీయ యై యలరారెను. అంత గౌతముఁ డామెను దోడ్కొనిపోయి బ్రహ్మ కిచ్చెను. బ్రహ్మదేవుఁ డామెను గౌతమునికే యిచ్చి వివాహము చేయనెంచెను. కాని, యామె త్రిలోకసుందరి యగుట "మా కిమ్ము మాకి"మ్మని యింద్రాది దేవతలే వచ్చి 'బ్రహ్మ' నడుగఁ జొచ్చిరి. గౌతముఁడు మాత్ర మెన్నఁ డడుగలేదు. బ్రహ్మ యుపాయ మూహించి భూప్రదక్షిణము చేసి యెవరు ముందు తనకడకు వచ్చెదరో వారికే యహల్య

గౌతమమహర్షి నెమ్మదిగా లేచి యనతిదూరముననే యున్న యొక యుత్తమ గోమాతకుఁ బ్రదక్షిణముచేసి యది భూప్రదక్షిణమునకు సమమే యను శ్రుతివాక్య ప్రమాణబుద్ధితో మఱి యొకపర్యాయ మాగోవుచుట్టును దిరిగి బ్రహ్మకడకు వచ్చి విన్నవించెను. బ్రహ్మ యది సత్యమేయని మిగిలినవారు తిరిగి వచ్చుసరి కహల్యాగౌతముల కిరువురకు దివ్యవైభవముతో నుద్వాహ మొనరించెను. ఇంద్రాది దేవతలును గౌతముని మాహాత్మ్యమునకు మెచ్చి యసూయాపరు లయ్యు నేమియును జేయలేక యహల్యాగౌతముల దాంపత్యమును బహువిధముల నభినందించి వెడలిపోయిరి.*

### గౌతమమహర్షి క్షామసమయమునఁ బ్రజాసంరక్షణము చేయుట

గౌతమమహర్షి యహల్యాసహితుఁడై దండకావన వాటిక కరిగి మహోగ్రముగ బహుకాలము బ్రహ్మదేవుని గుఱించి తప మొనర్చెను. అంత నాతఁడు ప్రత్యక్షమై గౌతముని కోరిక యడిగెను. అతఁడు "బ్రహ్మదేవా! నేను విత్తినసస్యము జాములోఁ బరిపాకము నందునట్లు వర మొసంగు"మని వేఁడుకొనెను. బ్రహ్మ యట్లేయని యంతర్ధానమయ్యెను. పిమ్మట గౌతమమహర్షి యహల్యాసహితుఁడై 'శతశృంగగిరి' కరిగి యొకపర్ణశాల నిర్మించుకొని యజ వరమహాత్త్వమున నతిథికోటిని షడ్రసోపేతభుక్తిఁ దనుపుచుండెను.

అహల్యయుఁ బతిశుశ్రూషయం దేమఱక శ్రద్ధాభక్తులతోఁ జరించుచుండెను. గౌతమమహర్షి తపోమహత్త్వముచే నాతఁడు తపముచేయు నాశ్రమము సుభిక్షమై సస్యశ్యామలమై యొప్పు చుండెను. ఇట్లుండఁగా నొకప్పుడొక మహాక్షామము సంభవించెను. ఒక్క గౌతమాశ్రమ భూములుతప్ప భూభాగమందెల్లడలను పంటలు నశించెను. జనులు క్షుద్బాధాతురులై చనిపోఁ దొడఁగిరి. ఆహారముఁ

---

* బ్రహ్మాండపురాణము.

గానక కొందఱు శవములనే తినఁ దొడఁగిరి. ఇట్లుండఁగా ననేకు లగు ఋషులు బ్రాహ్మణులు గౌతముని కతిథులుగా రాఁ జొచ్చిరి, గౌతమమహర్షి యహల్యా సమేతుఁడై భక్తిపూర్వకముగా నందఱ నాహ్వానించుచుఁ దనదపశ్శక్తిచే నెల్లరకుఁ గడుపునిండఁ గూడును, గట్ట నూతనాంబరములు నిచ్చుచుండెను గౌతమమాహాత్మ్యము దశ దిశల నెఱుకపడఁగా నానాఁటికి జనులు తండోపతండములుగా వచ్చి యహల్యాగౌతముల యాహ్వానముపై వారు చేయు మర్యాద లకు నిర్విణ్ణులై యచటనే భార్యాపుత్రాదులతో నివసింపఁ దొడఁగిరి. ఈ ప్రకారము దినదినము జనులు వృద్ధియగుటచే గౌతమమహర్షి యాశ్రమము సహస్ర యోజనాధికము కాఁజొచ్చెను. గౌతమ మహర్షి కీర్తి యింద్రలోకమునకుఁ బ్రాకెను. ఇంద్రుఁడు నారదుఁడు మున్నగువారు వచ్చి యహల్యా గౌతముల వితరణమునకు మెచ్చి వారి ననేకవిధముల శ్లాఘించి పోవుచుండిరి. పార్వతీ తనయుఁడగు విఘ్నేశ్వరుఁడు గౌతముని ప్రతిజ్ఞాభంగ మొదవించు ప్రయత్నమున బ్రాహ్మణరూపధారియై వచ్చి యహల్యాగౌతములచే నధిక సత్కార ముల నంది యకృతార్థుఁడై యా యాశ్రమముననే యుండెను,

ఆదినములలో గౌతమాశ్రమము భూలోకస్వర్గమై పోయెను. క్షణక్షణమును బెరుగుచున్న ప్రజాసముదాయమునకు నిరంతరము నహల్యాగౌతము లేలోపమును లేకుండఁ జూచుచుండిరి. యావత్ప్ర పంచము నతిథిలోక మయ్యెను. నిజ తపోవనవద్యతచే నంతలోకమున కొక గౌతమమహర్షియే భిక్షాప్రదాత యయ్యెను. క్షణమైన నేమఱ కహల్యాగౌతము లతిథి సేవలో మునిఁగియుండి యెల్లరకు షడ్రసోపేతముగ విందులొనరించుచు నూతనాంబరము లొసంగు చుండఁ బ్రతిపురుషునకుఁ గలలో సైతము గౌతముఁడును బ్రతిస్త్రీకి నహల్యయు "మీకేమి కావలయును? మీకేమికావలయును? దయతో సెలవిం" డనుచున్నట్లే గానవచ్చుచుండిరి.

ఇట్లుండగా నొకనాఁడు విఘ్నేశ్వరుఁడు తల్లి కొనర్చిన వాగ్దానము ననుసరించి శివజటాజూటమునఁ గల గంగను భూమికిఁ బంపివేసినచోఁ బార్వతికి సవతిబాధ యుండదని యుపాయ మాలోచింపఁ దొడఁగెను. గౌతమునంతటి మహర్షికిఁ దక్క నన్యుల కంత పని సాధ్యము కాదనుకొని గౌతము నావనికై వినియోగించు ప్రయత్నమున నాతఁడుండెను. ఒకనాఁడు బ్రాహ్మణుల నందఱ సముకూర్చుకొని గౌతమాశ్రమమును వీడి పోవ నాతఁడుద్యుక్తుఁడయ్యెను. ఈ సంగతి యెఱిఁగి గౌతమ మహర్షి వారి నందఱ నటనే యుండి తన యాశ్రమము నింకను బవిత్రము చేయుఁడని కోరుకొనెను. మాయా బ్రాహ్మణుఁడగు విఘ్నేశ్వరుఁడాలోచించి పార్వతి చెలికత్తె నొకతెఁ బిలిచి మాయా గోవై గౌతముని పొలములో మేయు మనియు, గౌతముఁ డేమి చేసినను వెంటనే చనిపొమ్మనియు నియోగించెను. ఆ ప్రకారమామె మాయా గోవై యట మేయఁ జొచ్చెను. గౌతముఁడు దానిని జూచి యొక గరిక విసరఁగనే యది చనిపోయెను. గౌతముని గొప్పతనమున కసూయాగ్రస్తులగు బ్రాహ్మణులందఱొక్క పెట్టున గోహత్యాపాతకుఁడని గౌతముని నిందింపఁ దొడఁగిరి బ్రాహ్మణరూపమున నున్న గణపతియు నాతనిఁ దూఱి బ్రాహ్మణులెల్లరఁ గూడి యటనుండి పోఁబోవు చుండెను. అహల్యాపై భవమును దిలకించి మత్సరగ్రస్తులైన స్త్రీలు నిదే సమయమని యహల్యా గౌతముల నిందించిరి.

### గౌతముఁ డసూయపడిన బ్రాహ్మణులను శపించుట

అహల్యాగౌతములు తమకుఁ గలిగిన ప్రమాదమున కెంతయుఁ జింతించి వారల నందఱఁ బాపముక్తి యెట్లు కలుగునో చెప్పి కాపాడుఁడని కోరుకొనిరి. కొంతసేపు బతిమాలించుకొని విఘ్నేశ్వరుఁడు గౌతమునితో "ఋషివరా! శివునిగుఱించి తపము చేసి యాతని మెప్పించి శివజటాజూటమునఁ గల గంగాభవాని నిటఁ బ్రవహింపఁ

జేసినచో నీ పాపము శమించుటే కాక త్రిజగత్ప్రఖ్యాతి నీకుఁ గల్గు" నని చెప్పి వెడలిపోయెను. ఈలోపున ఘోరవర్షములు గురిసి క్షామము తలఁగుటచే బ్రాహ్మణులు గౌతముని నిందించుచునే వెడలి పోయిరి. గౌతముఁడు తన కిట్టి తప్పిద మేల వచ్చినదని యోగ దృష్టిచేఁ జూడఁగా విఘ్నేశ్వరుఁడు పన్నిన వ్యూహము, తన యింటి కడఁ దిని యసూయాగ్రస్తులైన బ్రాహ్మణులను గోచరించిరి. గౌతమమహర్షి విఘ్నేశ్వరుని దేవకార్యము సిద్ధింపఁ జేయుటయే తన విధియని నిశ్చయించుకొనెను. కాని, యసూయాగ్రస్తులగు బ్రాహ్మణులు తన్నుఁ దిట్టిన కారణమున వారిని పాషండులు కండని శపించెను. ఈ సంగతి యెఱిఁగి బ్రాహ్మణు లందఱు భయ కంపితులై వచ్చి గౌతముని శరణువేఁడిరి. గౌతమమహర్షి కరుణించి తన శాపము మోఘ మనియు వారు కొంతకాలమునకు శ్రీకృష్ణుఁడు జన్మించిన పిమ్మట ముక్తినందుదు రనియు జెప్పెను.*

## గౌతమమహర్షి గంగను భూమికిఁ దెచ్చుట

గౌతముఁడు వెంటనే బయలుదేఱి యహల్యా సహితుఁడై హిమవన్నగమును జేరి యా నగప్రదేశమున నొక్కచోట శోధాంబన ధేనుయూథనిస్స్రుతదుగ్ధధారా ధునీతీర పారిజాతవనాంతరచింతామణి స్థలమున విడిసి యేకపాదస్థుఁడై మహోగ్రముగ శివునిఁగూర్చి తపస్సు చేయఁదొడఁగెను. అతని తపోమాహాత్మ్యమున కచ్చెరువంది శివుఁడు ప్రత్యక్షమయ్యెను. గౌతమమహర్షి శివు ననేకవిధముల స్తుతించి గంగాదేవిని భూతలమునకుఁ బంపుమని వేఁడుకొనెను. శివుఁడనుగ్ర హించెను. గంగాదేవి గౌతముని కోరికపై భూతలమునకు వచ్చి మాయా గోవు చనిపోయినచోటఁ బ్రవహించి గోవును బ్రతికించి భూమిని బవిత్రము చేసెను. ఇంతలో గౌతముని నిందించిన బ్రాహ్మణు లా గంగాజలమున స్నానము చేసి తరింప వచ్చిరి. అంత గంగాదేవి

* శివపురాణము, జాపసంహిత : వరాహపురాణము.

వెంటనే తనరూప ముపసంహరించుకొని యదృశ్య మయ్యెను. గౌతముఁ డెంతయో ప్రార్థింపఁగా నాతని నిందించిన బ్రాహ్మణులు తనలో స్నానము చేయవచ్చి రనియు, వారి మహాపాపమును దాను భరింపఁ జాల ననియు నామె చెప్పెను. గౌతమమహర్షి పరిపరి విధముల నామెను ప్రార్థించి బ్రాహ్మణులను క్షమింపు మనియుఁ దిరిగి భూమిపైఁ బ్రవహింపు మనియుఁ గోరుకొనెను. గంగ యనుగ్రహించి తిరిగి భువిపై నవతరించెను. ఆ గంగామాతయే గౌతముని మూలమున నవతరించుటచే 'గౌతమి' యనియు, గోవును బ్రతికించుటచే 'గోదావరి' యనియు నలరారు చున్నది.*

## గౌతముఁ డహల్య కొసఁగిన సంతానము

అహల్యాగౌతము లన్యోన్యముగఁ గాపురము చేయుచుండిరి. అహల్యాసాధ్వి బ్రహ్మర్షి వరుఁ డగు గౌతముని సహధర్మచారిణియై నిజ శుశ్రూషామహత్త్వమున నాథుని యుల్లము రంజిల్లఁ జేయుచుండెను. ఆమె త్రిలోకసుందరి యయ్యుఁ దుచ్ఛకామములకు లోను గాక పతిసేవయే మహాభాగ్యముగా వెలుఁగొందుచుండెను. ఆ సాధ్వి పాతివ్రత్యమునకు వెఱఁగొంది యామెఁ దలఁపోయుటయే యింద్రాదులు సైతము మానుకొనిరి. ఇట్లు పవిత్రహృదయముతోఁ దన్ను సేవించు భార్యను మెచ్చి గౌతముఁడు గృహస్థ ధర్మములోఁ బుత్త్రోత్పాదన ముత్తమవిధి యగుట స్మరించి యహల్యను బిల్చి యొక వరముఁ గోరుకొమ్మనెను. అహల్య కొడుకు నను్గ్రహింప గౌతముని వేఁడుకొనెను. గౌతముఁ డంగీకరించి యామెకుఁ గామవాంఛఁ దీర్ప నామె గర్భిణియై యుక్తకాలమున శతానందుఁడను కుమారుని గనెను. వెంటనే యా బాలుఁడు తపోజీవన మారంభింపఁ దలిదండ్రుల యాజ్ఞ గైకొని వెడలిపోయెను. ఈఁతడే శరద్వంతుఁ డనియుఁ బిలువఁ బడుచు మహాతపస్సంపన్నుఁ డాయెను. కాలక్రమమున నీతని

* వరాహపురాణము — బ్రహ్మపురాణము.

వీర్యమునుండియే కృపి, కృపాచార్యుఁడు జన్మించిరి. మఱియొక పర్యాయము కామవాంఛోపహతయైన యహల్యకు గౌతము నను గ్రహమున గర్భమై యంజన యను కూఁతు రుద్భవించెను. ఈయంజన పితృవాత్సల్యమునకు గుఱియై నిరంతర మహల్యకడనే యుండు చుండెను. ఈమె కొడుకే ఆంజనేయుఁడు.

మఱికొంత కాలమునకు గౌతముని కృపవలన అహల్య గర్భము ధరించి, మఱియొక కుమార్తెను గాంచెను. ఈ కుమారినే గౌతముఁడు తన శిష్యుఁడగు నుదంక మహామునికి నూతనదేహము నవయౌవనము నొసఁగిన తరువాత నిచ్చి వివాహము చేసెను.*

### గౌతముఁ డహల్యాశక్రులఁ శపించుట

అహల్యవివాహ మైనప్పటినుండియు నింద్రుడామె లోకాతీత సౌందర్యమునకు వశుఁడై యామెపొందు కోరుచునేయుండెను. కాని యహల్యాసాధ్వి చిత్తవృత్తి యెఱిఁగి గౌతమమహర్షి కోపానలమునకు వెఱచి యుండెను. కాని, యొకనాఁ డింద్రుఁడు తన కోర్కె దీర్చుకొనఁ గోరి యొక యుపాయ మాలోచించి కోడియై గౌతమాశ్రమునఁ జేరి వాఁటి నడురేయియే కూయఁ దొడఁగెను. ఈ కోడికూఁతవిని గౌతమమహర్షి కాలకృత్య నిర్వహణమునకు నదీస్నానమునకై యాశ్రమము వీడి వెడలిపోయెను. ఈ యవకాశము నుపయోగించుకొని యింద్రుఁడు గౌతమవేషముతో నాశ్రమముఁ బ్రవేశించి యహల్యతోడి సంగమ మపేక్షించెను. ఆమె యీ ద్రోహ మెఱుఁగఁజాలక కామోపహతుఁడగు భర్తకు వ్యతిరేకము పలుకలేక యంగీకరించెను. అంత వారిరువురును నొడలు మఱచి సుఖానుభవము నందుచుండ గౌతముఁ డింకను జాల ప్రొద్దు గలదని యాశ్రమమునకు వచ్చి చేరెను. లోపలఁ ప్రవేశింపఁగనే యహల్య

* భారతము — అశ్వమేధపర్వము.

యాశ్చర్యపడి "మహాత్మా! ఇంతవఱకు నాతో నున్న నీ విట్లు రెండు రూపము లేల తాల్చితి"వని ప్రశ్నించెను. ఇంద్రుఁడు వణఁకి పోయి పిల్లియై బయటకుఁ బోఁజూచెను. గౌతమమహర్షి యా పిల్లిని జూచి "ఓరీ! నీ విషయమును ద్వరలోఁ జెప్పనిచో దగ్ధమై పోదు" వనెను. ఇంద్రుఁడు స్వరూపమును ధరించి తన యహల్యాపేక్షను క్షమింపుమని కాళ్ళపైఁ బడెను. అహల్య యాశ్చర్యభరితయై "మహాత్మా! ఈ మోసము నే నెఱుఁగను. నీవు తిరిగి వచ్చి నా తనుసౌఖ్య మపేక్షించితి వని యోచించి తీర్చ నెంచితిని. ఇంతకు మించి పంచభూతములు తోడుగా నే నేమి యెఱుఁగ" నని శపథము చేసెను. వెంటనే యాకాశవాణి యహల్య నిర్దోషిణి యని పల్కెను. గౌతమ మహర్షి యూరకుండక "నీ వెఱిఁగి చేసినను నెఱుఁగక చేసినను దోషము దోషమే. అజ్ఞానముననైన నగ్నిసంస్పర్శనమున హస్తము కాలకుండునా! కావున, నీవు చైతన్యహీనమగు శిలవై పడియుండు" మని శపించి యింద్రునిఁ జూచి "దుర్మార్గా! దేవేంద్రా! శచీపతి వయ్యు నీ కామలాలసతకు మితిమేరలు లేకుండఁ బ్రవర్తించితివి. అగ్నిహోత్రముతో నపహాసముచేయు తుంటరిమిడుత వైతివి. ఓరీ! నీచా! మహాపతివ్రత యగు మహర్షి పత్నిని మోసగించి పరమహేయమగు పనికిఁ బాల్పడితివి. కావున, నీయండము లూడిపడిపోవుఁగాక! నీ శరీర మంతయు యోనిమయమై నీకు నిత్యఖేద మొదవించును గాక! నీ సామ్రాజ్యము శతృవు లపహరింప నీవు పదభ్రష్టత నంది దైన్యజీవనముఁ గడుపుదువు గాక!" యని తీవ్రముగా శపించెను. వెంటనే యహల్యా సంక్రందను లిరువురు నాతని పాదములపైఁ బడి శాప విముక్తి ననుగ్రహింప వేఁడుకొనిరి. గౌతమమహర్షి కొంత సరికిఁ గటాక్షించి యహల్యవైపు చూచి, "పాపాత్మురాలా! నీవు శిలవై శీతవాతాతపంబులకోర్చి నిరాహారవై రాత్రిందివములు రామస్మరణ పూర్వకముగా సహస్రాధికవర్షములు తపింపుము. ఈ [illegible]

చంద్రుని పాదారవిందరజః పుంజము నీ శిరస్సుపైఁ బడఁగానే నీకు శాపవిముక్తి యగును. నాఁడు నీవు తిరిగి పవిత్రాంగివై నా కడకు రావచ్చును. పొ"మ్మని పలికి యింద్రునిఁ జూచి ఓ మహాపాపాత్మా! నీ పైని వాకుఁ గరుణ ముదయించినది, మహర్షులకోపము నీటిపై గీచిన గీఁత వంటిది. నీ యోను లితరులకుఁ గనపడకుండ నుండును. అవి నేత్రములవలెఁ బై వారికిఁ దోఁచును. స్వర్లోకసామ్రాజ్యవిహీనుఁడ వయ్యుఁ దిరిగి కొంతకాలమునకు స్వపదప్రాప్తి నందఁగలవు. పొ"మ్మని కరుణించి గౌతముఁడు హిమగిరి కరిగి తపోనియతి నుండెను. ఇంద్రుఁడు నండము లూడి క్రిందఁబడ దేహమెల్లెడ యోను లేర్పడఁ బశ్చాత్తప్తుఁడై వెడలిపోయెను. గౌతమమహర్షి శాపమున నింద్రుఁడు పదచ్యుతుఁడై తిరిగి కొంతకాలమునకు స్వారాజ్యము నందఁగల్గెను. అహల్యయుఁ జిరకాలమునకు శ్రీరాముని పాదరజము సోఁకఁగనే స్త్రీరూపము నంది పరమేశ్వర పాద సంస్పర్శచేఁ బవిత్రయై గౌతమమహర్షిని శేరి సేవించుచు మహాపతివ్రతయై వెలసెను.*

## గౌతముఁడు బ్రహ్మదత్తుని శపించుట

మహర్షిసత్తముఁడగు గౌతము డొకనాఁడు బ్రహ్మదత్తుఁడనురాజు నింటి కేఁగి యాతిథ్య మిమ్మనెను. అతఁడు బ్రహ్మానందముతో నా పరమమునీంద్రు నింట నుంచుకొని చిరకాల మాతని కాతిథ్యమిచ్చి పోషించుచుండెను. అశ్రద్ధ కారణముగా నొకనాఁడు గౌతముని భోజనపదార్థములలో నొక మాంసపుముక్క కాననయ్యెను. గౌతముఁ డాదోషపరిహారణార్థమై బ్రహ్మదత్తను గ్రద్దయై పుట్టుమని శపించెను. బ్రహ్మదత్తుఁడు తనయెఱుఁగమిఁ దెల్పి శాపవిముక్తిఁ గోరెను. గౌతముఁడు కరుణించి శ్రీరాముని హస్తము సోఁకగనే యాతనికిఁ బూర్వరూపము లభింప వరమిచ్చెను. ఆ ప్రకారము

బ్రహ్మదత్తుఁడు గ్రద్దయై పుట్టి యొక నాఁడొక గ్రుడ్లగూబతోఁ బోరి శ్రీరామునికడకు వచ్చి తగవు తీర్పుమనఁగా నాతఁడు తన పవిత్రహస్తమున నాగ్రద్దను నిమురఁగా నది శాపవిమోచన మంది బ్రహ్మదత్తుఁడై పోయెను. *

### గౌతమధర్మసూత్ర – స్మృతి – న్యాయసంహితలు

గౌతమమహర్షి లోకమునకుఁ బ్రసాదించినవానిలో మొదటిది గౌతమధర్మసూత్రములు లేక గౌతమస్మృతి. రెండవ దగు న్యాయశాస్త్రమును ఖండింపఁ జూచిన వ్యాసునిపైఁ గోపించి గౌతముఁడు తనపాదమున నేత్రము సృష్టించుకొని యాతనిఁ జూచెను. నాఁటినుండి గౌతమమహర్షి "అక్షపాదుఁ"డయ్యెను. ఈ గౌతమ న్యాయశాస్త్రము ప్రతిజ్ఞా హేతూదాహరణాది షోడశపదార్థనిరూపకమై పంచాధ్యాయాత్మకమై యొప్పుచున్నది ప్రథమాధ్యాయ ప్రథమాహ్నికమందుఁ బ్రమాణాది పదార్థనవక లక్షణనిరూపణము, ద్వితీయాహ్నికమున వాదాది సప్తలక్షణనిరూపణము గలవు. ద్వితీయాధ్యాయప్రథమద్వితీయాహ్నికముల సంశయపరీక్షణాదికము, అర్థాపత్త్యాద్యంతర్భావనిరూపణము గలవు. తృతీయాధ్యాయమున శరీరేంద్రియార్థబుద్ధిమనఃపరీక్షణము. చతుర్థాధ్యాయమునఁ బ్రవృత్తి దోషాదికము, దోషనిమిత్తాదికము, పంచమమున భేద, నిగ్రహస్థాన భేద నిరూపణము గలవు.

మూఁడవదగు గౌతమ సంహిత గొప్ప జ్యోతిశ్శాస్త్రగ్రంథము.

# మహర్షుల చరిత్రలు

* * *

## చ్యవన మహర్షి

భృగుమహర్షికిఁ బులోమ యనునొక భార్యయుండెను. ఆమె తన శుశ్రూషచేఁ బతి మనస్సును హరించెను. ఒకనాఁడు భృగుమహర్షి యామె కోరిక యడిగెను. పులోమ భర్తకు భక్తిపూర్వకముగా వందనము చేసి "మహాత్మా! మీ సేవాభాగ్యముకన్న నాకుఁ గావలసిన దేదియును లేదు. ఐనను, వంశోద్ధారకుఁడు బ్రహ్మర్షి వరేణ్యుఁడు నగు నొకపుత్త్రుని దయచేయుఁ" డని వినయ విధేయతలతోఁ గోరుకొనెను. భృగుమహర్షి యంగీకరించి యామెకు గర్భము నిలిపి యామె కోరికపై నగ్నిహోత్రము సిద్ధము చేయుట, హోమద్రవ్యము లందిచ్చుట మున్నగుపను లామెచేఁ జేయించుకొనుచుండెను.

### చ్యవనుఁడు జన్మించి పులోముని భస్మము చేయుట

ఒకనాఁడు యథాపూర్వకముగా నగ్నిహోత్రమును సిద్ధము చేయుమని చెప్పి భృగుమహర్షి స్నానమునకై నదికేఁగెను. పులోమ యగ్ని రగిల్చి జాజ్వల్యమానముగా వెలిఁగించెను. పులోముఁ డను రాక్షసుఁ డొకఁడు చిరకాలమునుండి పులోమను ప్రేమించి యామెను వివాహ మాడుదునని చెప్పుచుండెను. కాని, యామె తలిదండ్రు లామె నాతని కీయక భృగుమహర్షి కిచ్చి వివాహము చేసిరి. నాఁటి నుండియు నవకాశము లభించినపు డీమె నపహరింప నా రాక్షసుఁడు వేచి యుండెను. నాఁ డాతఁడు భృగుమహర్షి లేకుండుటఁ జూచి యామె యున్నయగ్నిగృహమును బ్రవేశించెను. ఆమె పులోమ యగునా కాదా యను సంశయముతో నగ్నిహోత్రు నామె యెవ రని యడిగెను. అగ్నిదేవుఁడు విప్రశాపమునకు నసత్యదోషమునకు

వెఱచియు విప్రశాపముఁ గ్రమ్మఱించుకొనవచ్చుఁ గాని యసత్యదోషము తీర్పరాని దని నిశ్చయించుకొని యామె భృగుపత్ని యని చెప్పెను. పులోముఁడు వెంటనే వరాహరూపము ధరించి యామె నెత్తుకొని పాఱిపోఁ జొచ్చెను అపుడామె గర్భము చ్యుతము కాఁగా నొక యర్భకుఁడు బయట పడెను. మాతృగర్భచ్యుతుఁడగుట నాతనికి 'చ్యవనుఁ' డను పేరు కలిగెను. ఆ బాలుని తీవ్ర తేజము చూచినమాత్రముననే పులోముఁడు భస్మీభూతుఁడై పోయెను.

పులోమ సంతసమున నా బాలు నెత్తుకొని గృహమున కరుదెంచెను. అంతలో భృగుమహర్షి స్నానాదికము నొనర్చి యింటికి వచ్చెను. పులోమ జరిగిన యుదంతమంతయుఁ జెప్పి పతికి బాలునిఁ జూపెను. భృగుమహర్షి యంతఁ దన భార్య నా రక్కసునికిఁ జూపిన యగ్నిపైఁ గోపించి యతిక్రూరుఁడు సర్వభక్షకుఁడగుఁ గాక యని యాతనిని శపించెను. అగ్నిహోత్రుఁ డిది విని కోపించి తన తేజోమూర్తి నుపసంహరించుకొనఁగా బ్రహ్మాదులు భృగుశాప మమోఘ మనియు నైన నగ్ని సర్వభక్షకుఁడైనను శుచులలో నత్యంతశుచి, పాత్రులయందుఁ బరమ పాత్రుఁడు పూజ్యులలోఁ బరమ పూజ్యుఁడు వేద చోదిత విధానముల విప్రసహాయుఁడై భువనముల నడపునని వరము లనుగ్రహించి యగ్ని కోపముఁ బాపి శాంతింపఁజేసిరి.*

## చ్యవనుని తపోవిరతి

ఈ విధముగా జన్మించిన చ్యవనుఁడు పులోమా మాతృ స్తన్యములఁ బెరిఁగి పెద్దవాఁ డగుచుండెను. భృగుమహర్షి తనయున కుపనయ నాదిక మొనర్చి బ్రాహ్మణ ప్రధాన వృత్తియు, జీవిత పరమావధిని సిద్ధింపఁ జేయునదియు నగు తపోవనమునకుఁ గుమారుని మనసు గొలిపి విడిచిపుచ్చెను. చ్యవనుఁడు తల్లిదండ్రులకుఁ గృత

* భారతము — ఆదిపర్వము.

ప్రణాముఁడై బయలుదేఱి వైదూర్య పర్వతప్రాంతమున కరిగి యొక సరోవరము పొంత మహాతపోనిష్ఠాగరిష్ఠుఁడై యుండెను. అనఁ డట్లు తపోవృత్తి నుండఁగఁ గొన్ని వేల సంవత్సరములు గడచెను. అతఁడును వృద్ధుఁడయ్యెను. దేహమును మఱచి పరమేశ్వరునిపై మనసు లగ్నముచేసి దివ్యానందము నాతఁ డనుభవించుచుండఁగా నాతని దేహము పుట్టలు పెట్టెను. లతాగుల్మము లాపుట్టలపై మొలిచి యల్లుకొనుచుండెను. ఐన, నా చ్యవనునకు దేహస్మృతి లేకుండెను.

### చ్యవనుఁడు సుకన్యను వివాహమాడుట

ఇట్లుండఁగా సంయాతి యను నొకరాజు చతుస్సహస్ర దేవీ నివహముతోడను సుకన్య యను కూఁతు తోడను సైన్యసమేతుఁడై యా సరోవరమున జలక్రీడార్థమై వచ్చి యుండెను. అతనికుమారి చక్కనిచుక్క యగు సుకన్య యువతీజనపరివృతయై యందుఁ దిరుగుచుఁ బుట్టలు వోసిన చ్యవనుని కడకు వచ్చెను. ఆ పుట్టలోనుండి చ్యవనుని నేత్రములు ఖద్యోతద్యుతులవలె మెఱయుచుండుటఁ గాంచి సుకన్య యా నేత్రములఁ బొడిచెను. చ్యవనుఁ డిది యెఱిఁగి సంయాతి సైన్యమునకు మూత్రపురీషనిరోధము గావించెను. సంయాతి దానికిఁ గారణ మరయలేక వెఱఁగుపడెను. ఇంతలో సుకన్య తండ్రి కడకు వచ్చి తానొక పుట్టలో రెండు మిడుఁగురులను జూచి పొడిచిన సంగతి చెప్పెను. సంయాతి యట కరిగి యందుఁ దపఃక్లేశత్వగస్థిభూత శరీరుఁడు నతి వృద్ధుఁడు నగు చ్యవనుని జూచి యాతని పాదములపైఁబడి శరణుచొచ్చి తన కూఁతు నపరాధము మన్నింపుమని వేఁడుకొనెను. చ్యవనమహర్షి భవితవ్యము నెఱిఁగి సుకన్యను దన కిచ్చి వివాహము చేసినచో క్షమింతు ననెను. సంయాతి యంగీకరించి కూఁతు నడుగఁగా సుకన్య "తండ్రీ! ఇంత కన్న నాకుఁ గావలయున దేమున్నది! పరమ తపోధనుఁడగు బహ్మర్షిని భర్తగాఁ బడయు మహాభాగ్యమున మన వంశమును బరమ పవిత్ర మొనరింపఁ

గల్గితినేని నాపుట్టువు చరితార్థముగుఁగదా! కావునఁ దప్పక మీఁట్లొనర్పుఁ" డని సమ్మతించెను. అందుల కెంతయు నానందించి యచ్చటనే యా బ్రహ్మర్షికిఁ దనకూఁతు నిచ్చి పరిణయముచేసి సైన్య సురోధముఁ బాపికొని సుకన్యనట విడిచి సంయాతి తన నగరమునకుఁ బోయెను.

సుకన్య తనకు ఋషిశ్రేష్ఠుఁ డగు చ్యవనుని సేవాభాగ్యము లభించినదని మహోత్సాహముతోఁ బరిచర్య చేయుచుండెను. తాను యువతి యయ్యు సుకన్య వయోవృద్ధుఁడు జీర్ణాంగుఁడు నైనను నిజ భర్తయే పరమదైవమని యాతని నారాధించుచుండెను. ఆమె భర్త యనుగ్రహమున నాత్మానందమును గుర్తెఱిఁగి తుచ్ఛదేహ వాంఛో పహతి గాక పరమ పవిత్రజీవితమును గడుపుచుండెను.

### చ్యవనుండు నవయౌవనుఁ డగుట

ఇట్లుండఁగా నొకనాఁడాశ్వినేయు లీమె సౌందర్యమును విని యచ్చెరువంది చ్యవనాశ్రమమునకు వచ్చి యొంటరిగ నున్న సుకన్యఁ జూచి యామె నామధేయాదుల నడిగి పలుకరించిరి. సుకన్య తాను సంయాతి కూఁతుర ననియు చ్యవనమహర్షి భార్య ననియుఁ జెప్పెను. అంత వారు కాంతా! త్రిలోకసుందర మగు నీశరీరము నట్టిమునలి పగ్గున కిచ్చుటచే నీకుఁ గామభోగానందము సంభవించుచున్నదా? ఇఁకనైనను నీ సౌందర్యము నడవిని గాచిన వెన్నెల కానీయకుము. పరమ సుందరు నొకనిఁ గోరుకొమ్ము. మేము తీసికొనివత్తు మనిరి. అంత సుకన్య "మహాత్ములారా! మీకు నాపై నింత యాదరమేల కలిగినదో యెఱుఁగను. పరమపావనమగు నాపతి పాదసేవ కితోధిక మగు భక్తిశ్రద్ధ లొసంగ మీరు సమర్థులేని యట్లొసంగుఁడు. లేని నాఁడు మీదారిని మీరు పొం" డని బదులు చెప్పి నాథునికడ కేఁగి యావిషయమును దెల్పెను అతఁడు వారు చెప్పినట్లే చేయు మని

యాదేశించెను. భర్త యానతి యందలి యంతరార్థమును గ్రహించి వెంటనే యాశ్వినులకడ కరుదెంచి యామె తనకు నవయౌవన నొకనిఁ దెండని కోరుకొనెను. వారు బ్రహ్మానందము నంది సమీపమునఁ గల కొలనులో దిగుసరికి నవయౌవనులైరి. చ్యవనుఁ డది చూచి తాను నందు దిగి నవయౌవనుఁడై వారితోపాటు సుకన్యకడ కరుదెంచెను. మహాపాతివ్రత్య ముట్టిపడ సమానరూప వయోవిలాసముల నొప్పు నామువ్వురిలో నామె చ్యవనునే వరించెను అశ్వినులానందించి యామె పవిత్రపాతివ్రత్యము నభినందించి యామెను బరీక్షించుటకే యట్లొనర్చితి మనిచెప్పిరి. *

### చ్యవనుఁ డాశ్వినులను సోమపీథులఁ జేయుట

చ్యవనుఁడు తన కశ్వినీ పుత్త్రుల మూలమున నూత్న యౌవనము లభించినకారణమున వారికిఁ దాను బ్రత్యుపకారము చేయు నెంచెను. అంతవఱ కశ్వినీ కుమారులకు సోమపానము చేయనర్హత లేదు. ఆకారణమున నాశ్వినీ దేవతలను సోమపీథులఁ జేసెద నని ప్రతిజ్ఞచేసి చ్యవనుఁడు వారిని బంపివేసెను. చ్యవనుఁడు తన నూత్న యౌవనమును జూచి యానందించుటకు సపరివారముగా వచ్చియున్న సంయాతని గాంచి యాతని యభ్యున్నతి కొకక్రతువును దా నాతనిచేఁ జేయించుటకు నిశ్చయించెను. సంయాతి వల్లె యని నగరమున కరిగి యజ్ఞసంభారములను సమకూర్చెను. చ్యవనమహర్షి సుకన్యాసహితుఁడై శ్వశురగృహమున కేఁగెను. అంత సుముహూర్తమున విధ్యుక్తముగ సంయాతి చ్యవనుని యార్త్విజ్యమున యజ్ఞ మారంభించెను. ఇంద్రాదిదేవతలు హవిర్భాగమున కాహూతులై మఖమునకు వచ్చి యుండిరి. చ్యవనమహర్షి తాను గావించియున్న వాగ్దానము ననుసరించి యాశ్వినులకు సోమ మీయఁబోఁగానే యింద్రుఁడు కోపించి యాశ్వినేయులు బృందారకులు కాని కారణమున వారికి సోమ

* భారతము – అరణ్యపర్వము, దేవీభాగవతము.

మీయవలదని నివారించెను. చ్యవనమహర్షి యాతనిమాటలు పాటి సేయక యాశ్వినేయులను సోమపీథులఁ జేసెను.

## చ్యవనుఁ డింద్రునకు గర్వభంగము చేయుట

అంతఁ దనమాట నిర్లక్ష్యమగుటఁ గాంచి యింద్రుఁ డలిగి వజ్రాయుధ మెత్తి చ్యవనునిపై వేయఁబూనెను. చ్యవనుఁ డింద్రుని హస్తమెత్తినది యెత్తినట్లే యుండఁ జేసి యాతనిని వజ్రాయుధముతో పాటు రూపఱఁ జేయ నగ్నియందు వేల్వఁగా నందుండి యపారఘోరబలుఁడు మహాజీవుఁడు నయి మదుఁడను రాక్షసుఁడు భీకరాకారుఁడై యుద్భవించెను. అతనిచేతులు పదివేల యోజనముల పొడువుండెను. అంతకుఁ దగిన నాలుగుదంష్ట్రలును సూర్యచంద్రులఁ బోలు కన్నులును గాలాగ్నివంటి నోరును భూమ్యాకాశముల నంటు శరీరమును గలిగి యొక్కసారిగా నోరుదెఱచి నాలుకతోఁ బెదవులు నాఁకుకొనుచు మహానాదముతో నింద్రుని మ్రింగవచ్చు నా రాక్షసునిఁ జూచి యిమ్రుఁడు భయకంపితుఁడై తన తప్పిదమును క్షమింపుమని నాఁటినుండియు నాశ్వినీ దేవతలు సోమపీథులే యగుదురని పలికి చ్యవనుని పాదములపైఁ బడెను. చ్యవనమహర్షి యాతని కభయమిచ్చి యా రాక్షసుని నివారించెను. మదుఁడు చ్యవనునకు నమస్కరించి తన కాశ్రయమును జూపుమని వేఁడుకొని నాఁటినుండి యాతని మద్యస్త్రీ మృగయాక్షముల నాశ్రయింపుమని చ్యవనుఁ డాదేశించుటతోడనే యా రాక్షసుఁ డంతర్థానమాయెను. ఇంద్రుఁడును బ్రతుకు జీవుఁడా యని స్వర్గమునుఁ డయ్యెను. ఈ ప్రకారము తనకృతజ్ఞతను వెలిపుచ్చుకొన్న చ్యవను ననేకవిధముల నభినందించి యాశ్విన్యాది దేవతలు హవిర్భాగసంతృప్తిఁ దమలోకమునఁ కేఁగిరి. చ్యవనమహర్షి తన తపఃప్రభావమును వెల్లడి చేసిన కారణమున నా పర్వతము 'ఆర్చీకపర్వత' మను పేరఁ బరిగి ప్రసిద్ధిగాంచెను.*

---

* భారతము, అరణ్యపర్వము, అనుశాసనికపర్వము

మఱియొకప్పు డింద్రుఁడు గర్వియై కోపించి చ్యవనునిపై నొకపర్వతమును విసరెను. చ్యవనమహర్షి వెంటనే తన కమండలూదకము మంత్రించి చల్లఁగానే యాపర్వత మెదురు తిరిగి యింద్రునిపైనే పడెను. ఆ కారణమున వెంటనే యింద్రుఁడు మూర్ఛపోయెను. చ్యవనమహర్షి కరుణించి యాతని కేబాధ లేకుండఁ జేసి మూర్ఛనుండి మేల్కొలిపెను. ఇంద్రుఁడు సిగ్గుపడి వెడలిపోయెను. ఆహా! చ్యవనుఁ డెంతదయాశాలియో కదా! అపకారి కుపరార మొనరించి తన యభేదభావము నాతఁడు చాటినాఁడు. ఇదే మన ఋషులలో మనము గ్రహింపవలసిన రహస్యము. వా రాత్మజ్ఞులు. అహంకారమమకారరహితులు. కాని, యెదుటివారియందలి రజస్తమోగుణముల ప్రకోపము నణచుటకుఁ గ్రోధము నటించి శాపాయుధమున నెదుటివారిఁ జక్కఁజేసి వెంటనే తమయాయుధ ముపసంహరించుకొను మహాశక్తిసంపన్నులు వారు నారికిని మనకును బోలికయే లేదు.

### చ్యవనుఁడు సుకన్యకుఁ బుత్త్రుల ననుగ్రహించుట

నవయౌవనుఁడైన చ్యవనుఁడు సుకన్యాపాతివ్రత్యమునకు సంతసించి యామెకు సకలభోగముల నొసఁగి యానందింపఁ జేయనెంచెను. ఒకనాఁడు సుకన్యను బిలిచి "సాధ్వీ! నేను ముసలివాఁడ నని రోయక దేహసౌఖ్యముల నిన్నుఁ దేల్పకున్నను నీవు నాయందతి విధేయురాలవై యుంటివి. కావున యౌవనము నీకొఱకే ధరించితిని. నీ త్యాగశీలమునకు మెఱుఁగుపెట్టఁ గల్గు నొక్క సుపుత్త్రునిఁ దత్తుల్యకీర్తిప్రదులగు నిరువురు కుమారులను నీ కనుగ్రహింతు" నని చ్యవనుఁడు సుకన్యను గారవించెను. "మీ కటాక్షమునకు మించి నాకేమి కావలయు" నని యామె యాతనితోఁ స్త్రీసౌఖ్యము ననుభవించెను. కాలక్రమమున నామెకు దధీచి, ప్రమతి, అప్రవానుఁడను కుమారులు జన్మించిరి. మహాతపస్సంపన్నులగు మహర్షులు తుచ్ఛ

కామముతోఁగాక సత్పుత్త్రజననకు లగుట కేకదా నిజపత్నీ సమాగమము నభిలషించుట! అట్టిసంగమమున మహాత్ములు కాక యన్యులుదయింపరుగదా!

### చ్యవనుఁడు నహుషు ననుగ్రహించుట

చిరకాలము గృహస్థధర్మములు నడపి చ్యవనమహర్షి యొకప్పుడు భాగీరథీయమునాసంగమమున సుస్థిరుఁడై యధిక నిష్ఠతో నుదకవాసమహావ్రత మారంభించి నీటిలో నుండి తపము చేయుచుండెను. అందలి మత్స్యము లాతనిచుట్టును దిరుగుచుండఁగా నాతనికి వానిపై గృపయుఁ బ్రేమమును జనించెను. ఆప్రకార మాతఁడందుఁ బండ్రెండు సంవత్సరము లుండెను. అతఁడు సకల భూతములందును బరమశుభమగు విశ్వాసము గలిగి శుచియై దేవతా పురస్సరముగాఁ దపము చేయుచుండ, నాజలము లాతనికిఁ బ్రదక్షిణ మొనర్చి భక్తిమెయి నే కీడు నొనర్పకుండెను. ఇట్లుండ నొకనాఁడు జాలరులు వలలతో నందలి చేఁపలను బట్టుచు నామహర్షిని బట్టి గట్టునకు లాఁగిరి. ఆతనిఁ గాంచిన వెంటనే వారు భయకంపితులై తమతప్పు క్షమింపు మనిరి. చ్యవనమహర్షి యించుకేని కోపపడక "మీ కులవృత్తి మీరు చేయుటలో దోషము లేదు. నన్ను నీమత్స్యములతో పాటు విక్రయించుకొనుఁ" డన వారు పరుగునఁ బోయి తమ రాజగు నహుషునితో నీవిషయ మెల్ల వినిపించిరి. నహుషుఁ డాశ్చర్య భక్తిసంభరితుఁడై వచ్చి యామహర్షికి మ్రొక్కి క్షమింప వేడుకొనెను. చ్యవనుఁడు వారు చేసిన దోషమేమియును లే దనియుఁ దనకు వెల నిర్ణయించి యాజాలరుల కిమ్మనియుఁ గోరెను. నహుషుఁడు నూఱుమాడలీయ నియమించెను అర్ధరాజ్య మిచ్చెద ననెను. రాజ్యమంతయు నిచ్చెద ననెను ఏమనినను దనకుఁ దగిన వెల కాదని చ్యవనుఁ డనెను. ఇంతలోఁ గవిజాతుఁడను ముని వచ్చి గోబ్రాహ్మణులు సమాను లగుట నొక గోవు నిమ్మనెను. నహుషుఁ

డక్లేయని చ్యవనునకుఁ దెలుప నాతఁ డానందించి గోప్రభావము నాతని కుపన్యసించెను. ఒక గోవును దీసికొని వచ్చి నహుషుఁడు జాలరుల కీయ వారు దానిని చ్యవన మహర్షి కే యిచ్చి తమ్ముఁ గృతార్థులఁ జేయుమని కోరుకొనిరి. చ్యవను డంగీకరించి యా చేఁపలకు నా జాలరులకును స్వర్లోకము కలుగునట్లు వరమిచ్చెను. వెంటనే వారు దివ్యవిమానారూఢులై స్వర్గమున కేఁగిరి. నహుషునిఁ జూచి యాతనికి ధర్మపరత్వము నింద్రపదవి కలుగునట్లు చ్యవన మహర్షి యాశీర్వదించి వెడలిపోయెను. చ్యవనమహర్షి యాశీర్వచన మున నే నహుషుఁ డొకసారి యింద్రుఁడయ్యెను.

## చ్యవనమహర్షి కుశికభూపతిని బరీక్షించుట

సురలు మునులు సురశ్రేష్ఠునిఁ గొలిచి యుండఁగాఁ బ్రసంగ వశమున నొకనాఁడు భృగుకుశిక వంశములకు బ్రహ్మక్షత్త్రములు తడఁబడి సంకరము వాటిల్లునని బ్రహ్మ పలికెను. ఇది చ్యవనమహర్షి వినెను. నాఁటినుండి కుశిక వంశము నంతరింపఁ జేసినచో సాంకర్యము కలుగదని యాతఁ డెంచుచుండెను. కుశికకులమున కుత్పాత మాపా దింపఁగోరి చ్యవనుఁడొకపర్యాయము కుశికభూపాలుఁడగు కుశి నాథునికడ కేఁగెను. అతఁ డీతని నత్యంతము గౌరవించెను. బంధు మిత్త్రపరివారముతోఁ గుశినాథుఁ డీతనికి సేవచేయ మొదలిడెను. చ్యవనుఁడభ్యంతరమందిరమున హంసతూలికా తల్పమునఁ బరుండి భార్యాభర్తల నిరువురను బాదము లొత్తుఁ డనెను కుశికుఁడు సభార్యుఁడై సేవచేయుచుండఁగా నిరువదియొక్క దినములు చ్యవనుఁడు కదలకుండ నిద్రించెను. కుశికభూపాలుఁడు నాతనిని విడువక సేవించుచునే యుండెను ఇరువదిరెండవ నాఁడు లేచి యెటకో పోవుచుండెను. రాజు భార్యయు వాని ననుసరింపఁ గొంత దూర మేఁగి యాతఁ డదృశ్యుఁడయ్యెను. భార్యాభర్త లిరువురును విచారముతో నింటికి వచ్చి చ్యవనుఁడు వేఱొక తల్పమున నుండుటఁ

జూచి సంతసముతో భక్తిభరితులై మరల నాతని పాదము లొత్తు చుండిరి. అతఁడును మఱి యిరువదొక్క దినము లట్లే కడపెను. పిమ్మట నాఁడు తైలాభ్యంగము కావలె నని చ్యవనుఁడనిన రాజు తైలాభ్యంగము చేయించుచుండ నాతఁ డంతర్హితుఁడై యపరాహ్ణము దాఁటిన పిదప వచ్చి స్నానము చేసెను. కుశినాథుఁడు భార్యయుఁ జలింపక వివిధాన్నపానములు ఘటించి భోజనమునకు రమ్మనఁగాఁ దిరిగి యాతఁ డంతర్హితుఁడయ్యెను. రాజును భార్యయు భుజింప నొల్లక యాతనికొఱ కెదురుచూచుచుండ మఱునాఁ డుదయ మాతఁడు వచ్చి కుశినాథునితో "నీవును నీభార్యయు నే నెక్కిన రథమును లాగుఁ" డనెను. వా రంగీకరించి యట్లు చేయఁగా రక్తములు కాఱునట్లు వారి నాతఁడు బాధించెను. ఐనను, వారు చలింపలేదు. చ్యవనుఁడు దయతో వారిని స్పృశించినంతనే వారి కాయాసము పోయెను; నవయౌవనము కలిగెను. చ్యవనుఁడు వారివింటికిఁ బోయి మఱునాఁడు తాను గంగాతీరమునఁ జేయు యజ్ఞమునకు రండని పిలిచి పంపివేసెను.

కుశికభూపతి యింటి కరిగి విధ్యుక్తముగాఁ గర్మములు నిర్వర్తించి మఱునాఁడు స్నానాదు లొనరించి భక్తిభరిత హృదయముతో భార్యాసమేతుఁడై చ్యవననిర్దిష్ట ప్రదేశమున కరిగెను. అందు మణిమయ దివ్య హర్మ్యములు నిర్మితములై యుండెను. మండపములు, ఆరామములు, పద్మాకరములు, క్రీడాచలములు, సురకిన్నర గంధర్వగణములు గానవచ్చెను. అందొక దివ్యభవనమున భార్యాభర్తలు చ్యవనునిఁ గాంచిరి. వెంటనే యాతఁడు మేడతో నంతర్ధాన మయ్యెను. కొంతసేపటికి వారె నిరువురఁ బిలిచి చ్యవనుఁడు "రాజా! నీ మనస్సు నింద్రియములు నీ కింత స్వాధీనముగ నుండుట స్వల్పవిషయము కాదు. నా కానందమైనది. నాఁడు నీయింటఁ జరియించుచు నారీతిఁ బ్రవర్తించుటకుఁ గల కారణము నీయందుఁ

దప్పువట్టి నీ వంశ క్షయమునకై శపించుటకే. కాని, నీవు నాపరీక్షల కాఁగితివి. మీ యుభయులయందును ధైర్యహాని, కోపము, శోకము మందునకైన లేవు. కావున దయదలఁచి యిట్లు స్వర్గమునే భూమిపైఁ జూపితిని. నీకు మూఁడవ తరమువాఁడు బ్రహ్మ తేజో దీప్తుఁడయి పుట్టును. నా తనయుని తనయుఁడు ఋచీకుఁడు నీతనయుని-గాధి-కూఁతుఁ బరిణయమై జమదగ్ని యనువానిం గని యాతని యందు సమస్త ధనుర్వేదమును నిలుపును మహాశాస్త్ర ముతో నాతనికిఁ బుత్త్రుఁడై పరశురాముఁడు జన్మించును. గాధికి బ్రహ్మర్షి యగు విశ్వామిత్రుఁడు జన్మించు" నని చెప్పి చ్యవనమహర్షి వెడలి పోయెను. కుశికభూపతి బ్రహ్మానందము నందెను. చ్యవన మహర్షి చెప్పినట్లే ఋచీకుని మూలమున భార్గవవంశమున జమదగ్నియు నాతనికిఁ బరశురాముఁడును గుశికవంశమున విశ్వామిత్రుఁడును జన్మించిరి.*

### పా మొకటి చ్యవనుని పాతాళమున కీడ్చుకొనిపోవుట.

తొల్లి యొకప్పుడు చ్యవనుఁడు నర్మదానదిలో స్నానము చేయుచుండఁగా నొక పెద్ద పా మాతనిం బట్టుకొని పాతాళలోకమున కీడ్చుకొని పోవుచుండ మౌని పరమేశ్వరుని ధ్యానించెను. దైవకటాక్షము వలన నాతని కేమియు విషబాధ కలుగదాయెను, ఇంతలోఁ బా మాతనిఁ బాతాళమునకుఁ దీసికొనిపోయి నాగకన్యకల నడుమ విడిచెను. ఉరగాంగన లాతనిని భక్తియుక్తి సేవింపఁ దొడఁగిరి.

అపుడు పాతాళమును బాలించు ప్రహ్లాదుఁ డాతనిం గాంచి నమస్కరించి తనగుట్టుమట్టులఁ దెలిసికొనిరా నీతని నింద్రుఁడు పంపియుండు నని తలఁచి తన యనుమానమును వెల్లడించెను.

* భారతము — అనుశాసనికపర్వము.

చ్యవనుఁడాతని భావమెఱిఁగి తన కింద్రునితోఁ బని లేదనియుఁ దాను నర్మదా జలముల మునిఁగినపు డొక పెనుబామీడ్చుకొని వచ్చెననియుఁ దెలిపెను. ప్రహ్లాదుఁడు సంతోషించి "ఋషీంద్రా! నీ రాకవలన నేను బవిత్రుఁడనైతిని. నాపై దయయుంచి నీవు తిరుగని తీర్థములు క్రుంకనినదులు నుండవు కానఁ దీర్థ పరమార్థమును బోధింపు"మని కోరెను.

చ్యవనుఁడు ప్రహ్లాదుని కిట్లనెను. "హరిప్రియా! నీవంటి విష్ణు భక్తుఁ డెందును లేఁడు. నీ ప్రశ్నముల కుత్తర మీయకుండు టెట్లు? చెప్పెదను వినుము. చిత్తశుద్ధిలేని తీర్థాటనము వ్యర్థము. మనస్సు నిర్మలము కావలయునే కాని గంగలో మునిఁగినంత మాత్రమున లాభము లేదు. తీర్థవాసము మహాకష్టము. అటఁ జేసిన పాపము లత్యధిక దుఃఖాకరములు. తీర్థములందుఁ జేసిన పాప మే విధముగను నశింపదు. మఱియు సర్వతీర్థాటనముకంటె భూతదయ, సత్యము, శౌచము, ముఖ్యములు. ఇవి కలవారి పాదముల క్రిందనే సకల తీర్థములు వచ్చి వసించును. ఐనను నైమిశము, చక్రతీర్థము, పుష్కరము ఈమూఁడును సకలలోక శ్రేష్ఠములగు భూలోకతీర్థము"లని తెలిపెను. ప్రహ్లాదుఁడు చ్యవను నతిభక్తి వీడ్కొలిపి తీర్థయాత్రాచరణ శీలియై సపరివారముగ బయలు దేఱెను. *

## చ్యవనుఁడు లవణాసురవధకుఁ గారకుఁ డగుట

మధుఁ డను రాక్షసుఁడు శివుని మెప్పించి యాతనిచే నజేయమగు శూలమును గ్రహించి యా శూలము తన యనంతరము తన కుమారునకుఁగూడ నుపయోగింపవలెనని కోరుకొనెను. శివుఁ డంగీకరించి యా శూలము చేత నుండఁగ శత్రువు మిమ్ముల జయింపఁజాలఁడనియును శూలము లేక యాలము చేయుచో నందు మడియవచ్చుననియును జెప్పి యంతర్హితుఁ డయ్యెను. మధుఁడు కుంభీనసి యను

* బ్రహ్మవైవర్తపురాణము.

రావణు చెల్లెలిని వివాహమాడెను. ఆమె యందాతనికి లవణుఁడను రాక్షసుఁడుదయించి మధుఁడు చనిపోయిన పిమ్మట నా శూలమును గ్రహించి పూజించుచుండెను. లవణాసురుఁడు పెరిగి పెద్దవాఁడై మహర్షుల కనేక బాధలు కలిగించుచుండెను. ఈ లవణాసురుని జంపించు టెట్లని మరీచి కశ్యప దళాద పులస్త్య ఋచీకాది మహర్షులు వచ్చి చ్యవనమహర్షి నుపాయ మడిగిరి. చ్యవనమహర్షి వా రందఱతోఁ గలసి శ్రీరామునికడ కేఁగి లవణాసురుని దారుణవృత్తాంతమును జెప్పఁగా శ్రీరాముఁడు శత్రుఘ్నుని లవణాసురవధకై పంపెను. చ్యవనుఁడు శ్రీరాముని స్తుతించి మహర్షులతోఁ దన యాశ్రమమున కేఁగెను. శత్రుఘ్నుఁడు సేనాసమేతుఁడై బయలుదేఱి పోవుచు వాల్మీకి యాశ్రమమున నొకరేయి గడపి నాఁడే సీతామహాసాధ్వి కుశలవులఁ గన్నదన్న శుభవార్త విని చ్యవనమహర్షి యాశ్రమమునకు వచ్చెను. చ్యవనుఁడు నాతని నాదరించి లవణాసురుఁడు మాంధాతను జంపిన తెఱఁగుఁ జెప్పి శూలము చేతలేని సమయముననే లవణునిఁ జంపుమని శత్రుఘ్నునకు బోధించెను. శత్రుఘ్నుఁడు చ్యవనునిమాట విని లవణాసురుని జంపిన పిదప మునులందఱును ప్రీతులై యథేచ్ఛముగా సంచరింపఁ దొడఁగిరి.*

### సింహావలోకనము

భృగువంశవరిష్ఠుఁడై చ్యవనమహర్షి మహాతపోనిష్ఠాగరిష్ఠుఁడై యాత్మతపోబలసంపన్నతచే లోక హితార్థియై మన ఋషులలో నగ్రేసరుఁడై చెలువొందెను.

---

* ఉత్తరరామాయణము.

# మహర్షుల చరిత్రలు

## జమదగ్ని మహర్షి

### జమదగ్ని జననవృత్తాంతము

తొల్లి భృగువంశసంజాతుఁడగు ఋచీకమహర్షి కుశిక వంశోద్భవుఁడగు గాధిరాజుకూఁతురు సత్యవతి యనునామెను వివాహమాడఁ గోరి తనకోరికను గాధికిఁ దెలిపెను. గాధి యాతఁడు తన కూఁతునకు దగినవరుఁ డగునో కాదో యని సంశయించి తెల్లని దేహము నల్లనిచెవులు గల వేయిగుఱ్ఱములను దనకూఁతునకుంకువగా నొసఁగినచో సత్యవతినిచ్చి పెండ్లి చేయుదు నని సమాధానము చెప్పెను. ఋచీకమహర్షి యిది యెంతపని యని బయలుదేఱి వెడలి వరుణదేవుని ప్రార్థించి యాతనిచే నట్టి యశ్వములను బడసి తీసికొనివచ్చి గాధి కిచ్చెను. గాధిరాజు ఋచీకుని శక్తిసామర్థ్యములకు మెచ్చుకొని యాతనికి దనకూఁతురగు సత్యవతినిచ్చి మహావైభవముతో వివాహముచేసి యల్లునిఁ గూఁతును వారి యాశ్రమమునకుఁ బంపివేసెను. సత్యవతి భర్తయే దైవమనియుఁ దనయదృష్టముచే నుత్తమబ్రాహ్మణుఁడు తనకు భర్తయాయెననియు నెంచి యాతని కనేకవిధములఁ బరిచర్య చేయుచుండెను. ఒకనాఁడు ఋచీకమహర్షి యామెసేవకు సంతసించి యొకకోరిక గోరుకొనుమనెను. సత్యవతి పుత్త్రహీనులగు తనతలిదండ్రులకొక కొమరుని, దనకొక పుత్త్రుని నిమ్మని భర్తను బ్రార్థించెను. ఋచీకమహర్షి యట్లేయని రాజబ్రహ్మమంత్రములచే రెండుచరువులను వేల్చి యారెంటిని భార్య కిచ్చి "సాధ్వీ! క్షత్త్రియాజేయుఁడు క్షత్త్రియసూదనుఁడు నగు క్షత్త్రియోత్తముఁడు మొదటిచరువు నుపయోగించినవారికిఁ గల్గును. కాన, దానిని మీయమ్మ కిమ్ము. ఈ రెండవచరువు నీ వుపయోగింపుము.

దానివలన నీకుఁ దపోధృతిశమములచే నుత్కృష్టుఁడగు బ్రాహ్మణుఁడు జన్మించు" నని చెప్పి నదీస్నానమునకుఁ బోయెను.

ఇంతలో సుతాజామాతలం జూడఁ దలఁపు కలిగి గాధి భార్యాసమేతుఁడై ఋచీకుని యాశ్రమమునకు వచ్చెను. సత్యవతి యానందపరవశతఁ దల్లిదండ్రులు రాఁగానే తల్లికాచరు వృత్తాంతమును దెల్పి దైవోపహతయై తానుపయోగింప వలసినది తల్లికిచ్చి తల్లి కీయ వలసినది తాను గ్రహించెను. ఇంతలో ఋచీకమహర్షి వచ్చి యత్తమామలఁ దివ్యబోధమున జూచి మాతాసుత లొనరించినపనిఁ దెలిసికొని సత్యవతిని జూచి "నీకు క్షత్రియాంతకుఁడు మహాక్రూరుఁడగు కొడుకు పుట్టును. మీయమ్మకు బ్రహ్మభూతుఁడు తపోధనుఁడు నగు కొడుకు పుట్టు" నని చెప్పెను. సత్యవతి భయపడి యదేమని యడగఁగా ఋచీకుఁడు "నేను నీకుత్తమ బ్రాహ్మణుఁడు పుట్టునట్లు మీతల్లికుత్తమ క్షత్రియుఁ డుదయించునట్లు మంత్రములఁ జదివి వేల్చి యాచరువులఁ జేసితిని నీవుపయోగింప వలసినది మీ జననియు నామెయుపయోగింప వలసినది నీవు నుపయోగించితిరి. కావున నట్లు వ్యత్యాసము కలుగు" నని చెప్పెను. సత్యవతి భయపడి క్రూరుఁడగు కొడుకును గనఁజాలను రక్షింపు మని వేఁడుకొనఁగా ఋచీకుఁ డామెను గరుణించి యా విశేష మామె కుదయించు పుత్త్రునకుఁ గాక పౌత్త్రునకుఁ గల్గుననియెను. అంత గాలక్రమమున సత్యవతి గర్భమున జమదగ్ని మహర్షియు నామె మాతృగర్భమున విశ్వామిత్రుఁడును జన్మించిరి. *

## జమదగ్ని రేణుకను వివాహమగుట

ఇట్లు జన్మించిన జమదగ్ని యుత్తమగుణసంపన్నుఁడై రేణువు కూఁతు రగు రేణుకను వివాహమాడి గార్హస్థ్యమును నడుపుచుండెను. ఈతఁడు తన తపోమాహాత్మ్యమున ఒక హోమధేనువును

* భారతము ; విష్ణుపురాణము.

సంపాదించెను. ఆధేనువు వలసినపుడెల్ల నెందఱకైన నేమైన సమకూర్పఁ గల సామర్థ్యము కలది. ఆ కామధేనువు కారణముగ నే కొఱంతయు లేక జమదగ్ని రేణుకాదేవితో సమస్తభోగము లనుభవించుచున్నను మహాతపస్సంపన్నుఁడై యుండెను.

### జమదగ్ని సూర్యుని శపించుట

జమదగ్ని రేణుక పతిభక్తికి మెచ్చి యామెతో నర్మదాతీర మందలిది, నిర్జనము, ఫలపుష్పయుక్తము, శారికాశుకపికమయూర నినాదయుక్తము, సుగంధివాయుసురభీకృతము నగు వనమున కేఁగి యందు విహరించెను. పిదప, అపుడే వికసించిన పుష్పములఁ దల్పములుగ నేర్పఱిచికొని చందన చర్చిత గాత్రులై యా దంపతులు నఖక్షతచుంబనాదు లారంభించి క్రమక్రమముగా మన్మథక్రీడ లారంభించిరి.

ఆ సమయమున సూర్యుఁడు వారి కడకు విప్రరూపమున విచ్చేసి "ఓయీ! జమదగ్నీ! నీవు బ్రహ్మ మనుమఁడవు. వేదకర్తవు, మహాతపశ్శాలివి. అట్టి నీ విట్లు పట్టపగలు సురత క్రీడకుం జొచ్చుట ధర్మమా? 'యద్యదాచరతి శ్రేష్ఠ స్తత్తదేవేతరో జనః' యన్న నానుడిని బట్టి పెక్కురు నిన్ననుసరింతురు. తాపసశేఖరుఁడ వగు నీవే యిట్లు ధర్మమును విరాకరించిన వేదధర్మములు హీనత నందవా? నేను గర్మసాక్షి నగుటచే నీ కిటు చెప్పవచ్చితి" నని పల్కెను.

అది విని జమదగ్ని సురతవిముఖుఁడై నిలువ నగ్న యగు రేణుక వెంటనే సూక్ష్మవస్త్రము ధరించి సిగ్గుపడి నిలిచెను. అంత జమదగ్ని సూర్యునితో "ఓయీ! నీవు పండితాహంకారమున నాకుఁ జెప్ప వచ్చితివి. భృగుశిష్యుఁడను, చతుర్వేద ధర్మాధర్మము లెఱుంగని వాఁడనా? అజ్ఞాని స్వకర్మచే నెల్లప్పుడు జడీభూతుఁ డగును. విజ్ఞాని సర్వభక్షకుండగు నగ్నివలె మహాతేజస్వియై కర్మదోషములఁ

గాంచఁడు, నీవు కర్మ సాక్షి నని ఫలప్రదాత నని శాస్త నని గర్వించి నన్నాక్షేపింప వచ్చితివి. తపోధనవిరాజితులము, జ్ఞానమూర్తులము నగు మాకు నారాయణుఁడు సంరక్షకుఁడు, మా భావము లాతఁ డెఱుఁగును. మే మాతని నెఱుఁగుదుము. మ మ్మొరులు బోధింప శిక్షింప సమర్థులు కారు. నీవే కాదు బ్రహ్మ రుద్రయమాదులైన మమ్ము శిక్షింపలేరు అట్టి మాకు నీవు రతిభంగ మొనరించితివి కాన, నా శాపమున రాహుగ్రస్తుఁడవై పాపదృశ్యుఁడవు హతతేజుఁడవు నగుదువు" అని శపించెను.

సూర్యుఁ డది విని "అయ్యా! మనము పరస్పరము పూజ్యులము. ఐనను, నీవు నన్ను శపించితివి నే నూరకున్నచో లోకులు నన్నశక్తుఁ డని నిస్తేజుఁ డని నిందింతురు. కావున ఒక క్షత్రియునిచే నీకుఁ బరాభవము, అతని యాయుధముచే మరణము గల్గఁగల"దని ప్రతిశాపమిచ్చెను.

అపుడు జమదగ్ని మరలఁ గోపించి నీవు శివునిచే జితుండ వగుదు వని మరల శపించెను. ఈ సంగతి కశ్యపునివల్ల నెఱింగి బ్రహ్మ యాతనితోఁ గూడ క్షణములో సూర్య జమదగ్నులకడ కరుదెంచి వారిని శాంతపఱిచి సూర్యునితో "ఓయీ! నీవు ఒకానొక దినమునం దాకాశమున మేఘచ్ఛన్నుఁడవై వెంటనే ముక్తుఁడవయ్యెదవు. మేఘాతిశయ కాలమునఁగాని వర్షంబునంగాని రాహుగ్రస్తుఁడ వయ్యెదవు. ఐనను, కొందఱి కదృశ్యుఁడవు. కొందఱికిఁ బూర్ణదృశ్యుఁ డవుఁ నగుదువు నిన్నుఁజూచి నమస్కరించి సర్వజనులు పాపహీను లగుదురు. జన్మసప్తాష్టమ, చతుర్థ దశమస్థానంబులందు, జన్మ ఋషనిధనములందును నీవును జంద్రుఁడు నదృశ్యులయ్యెదరు. అస్తకాల, ఘనాచ్ఛన్నకాల మధ్యాహ్న కాలములందు. జలములందు అర్ధోదిత కాలములందు నీవు పాపదృశ్యుఁడ వగుదువు. కార్యాదుఃఖనిమిత్తమునఁ గారణభూతయైన భార్యచేతను శ్వశుర

స్యాలకులచేతను హతతేజుఁడ వగుదువు. మాలి సుమాలి యుద్ధమున శివుఁడు నిన్ను జయించును" అని చెప్పి జమదగ్నిం జూచి "మహాశయా! పరాజయలజ్జితుఁడైన సూర్యునింతతో విడువుము. నీ తేజమున క్షణమాత్రములో జగమంతయు భస్మీభూతము కాఁగల దనుట నిజము. నీవును సూర్యుఁడును బరస్పరపాల్యులు. పూజ్యులును. నీవు కార్తవీర్యునిచేఁ బరాభవము, ఓటమి, మరణము నందుదువు. ఐనను విష్ణుమూర్తి నీకు సుతుఁడై జన్మించి ముయ్యేడుమాఱులు శోధించి జగమంతయు నిఃక్షత్త్రము గావించును. నీమరణము లోకకల్యాణ బీజమే కాఁగల"దని చెప్పి యదృశ్యుఁడయ్యెను. జమదగ్నియు సూర్యుఁడును బరస్పరమభినందించుకొని పురాకృత కర్మముల నివారింప సమర్థుఁడెవ్వఁ డనుకొని నిజ గృహముల కరిగిరి.*

రేణుకాదేవి భర్తకుఁ బరమభక్తితో సేవచేయుచు నాతని కటాక్షమునఁ గ్రమముగా నైదుగురు కుమారులంగనెను. వారు వరుసగా రుమణ్వంతుఁడు, సుషేణుఁడు, వసువు, విశ్వావసువు, పరశురాముఁడు నను నామములఁ దాల్చిరి. పరశురాముఁడు విష్ణునవతారమై జన్మించెను. ఇట్లు జనించిన పుత్త్రులం బెంచుకొనుచు భర్తృశుశ్రూష యేమఱక రేణుకాదేవి చరించుచుండెను.

## పరశురాముని పితృభక్తి

ఒకనాఁడు రేణుకాదేవి జలమునకై యేటికిఁ బోయెను. అందుఁ జిత్రరథుఁ డను రాజు భార్యాసహితుఁడై జలక్రీడా పరవశుఁడై యుండెను. వారినిఁ జూచుసరికి రేణుకాదేవి విధివశమున వారి క్రీడలపైఁ గోరిక జనింపఁగ నటు నిలిచి వారి యానందమును గాంచుచుండెను. ఆ కారణమున నామె మహోత్తమ పాతివ్రత్యమున

* బ్రహ్మవైవర్తపురాణము. ఉపానద్ధావ విషయకమగు సూర్య జమదగ్ని సంవాదము భారతానుశాసనిక పర్వమునఁ గలదు.

కించుకదోషము గలుగ నామె హస్తమందలి ఘటము క్రిందపడి ఛిన్నాభిన్న మయ్యెను. ఎప్పుడైన జలభాండ మట్లు పగులుచో నామె మహత్త్వమున యిసుక తీసి తలపోయఁగనే భాండ మేర్పడెడిది. నాఁ డామె పూర్వవిధముననే యిసుక తీసి కుండ కావలయునని కోరఁగా నట్లు సంభవింపదయ్యెను. రేణుక మహాపతివ్రత గానఁ దన తప్పిదమును వెంటనే గ్రహించి యాదోషమున కానదిలోఁ బడి మరణింప నెంచెను. కాని, పతికి జరిగినవిషయము నివేదించి యాతని యాజ్ఞాబద్ధురాలగుటయే శ్రేష్ఠమని యెంచి భాండరహితయై యింటి కేతెంచెను.

జమదగ్ని భార్యచేత భాండము లేకపోవుటకుఁ గారణమేమని చూడఁగా దివ్యదృష్టి కెల్లవిషయము గోచరించెను. చిత్రరథుని మక్కువఁ దగిలిన తన భార్య యాంతరంగికమున కసహ్యించుకొని యాదోషమున కామెకు మరణదండనమే శిక్షయని యతఁడు నిశ్చయించుకొనెను. రేణుకాదేవి సమీపింపఁగానే జమదగ్ని కొడుకులఁ గ్రమముగాఁ బిలిచి తల్లిని జంపివేయుఁడని యాజ్ఞాపించెను. అహో! జమదగ్ని సౌశీల్యాదర్శము! అన్యపురుషు ననురక్తిఁ గాంచిన నది వ్యభిచారమే యౌననిగదా పరమసాధ్వి యగు భార్య శిరము ఖండింపఁ జేయుట? అతఁడుకదా మహర్షి! పుత్త్రులలో మొదటి నల్గురు నాపని చేయలేమని చెప్పివేసిరి. పరశురాముని బిల్చి జమదగ్ని తల్లిని, నన్నలను జంపుమని యాజ్ఞాపింపఁగా వెంటనే యాతఁడు తన పరశువుతో దల్లి, సోదరుల తలలను ఖండించెను. జమదగ్ని యాతని పితృభక్తికి సంతసించి యొకవరము వేఁడుకొను మనెను. వెంటనే పరశురాముఁడు చనిపోయిన తన తల్లిని సోదరులను బ్రతికింపు మని తండ్రిని గోరుకొనెను. జమదగ్ని పరశురాముని మాతృప్రేమమునకును భ్రాతృవాత్సల్యమునకును మెచ్చుకొని యట్లే చేసెను.

## జమదగ్ని కార్తవీర్యునిఁ జంపిన పరశురాముని శిక్షించుట

పూర్వము హైహయాధీశ్వరుఁ డగు కార్తవీర్యార్జునుఁడు దత్తాత్రేయు నారాధనముచేసి యతనివలన శత్రుజయమును, వేయి చేతులను, అణిమాదిసిద్ధులను, యశము, బలము, యోగీశ్వరత్వము, తేజము చెడని యింద్రియములను బడసి వెలుఁగొందెను. దిగ్విజయ యాత్రకై వచ్చిన రావణాసురు నీతఁ డవమానించెను. పిమ్మటఁ గార్తవీర్యార్జునుఁడు దైవయోగమున వేటకై యడవిలో సంచరించుచు జమదగ్ని మహర్షి యాశ్రమముచేరి యాతనిని దర్శించెను. జమదగ్ని మహర్షి రాజును భృత్యులును డస్సియుండుటఁ గాంచి వారిని బూజించి తన హోమధేనువును రప్పించి యిష్టాన్నములు గురియించి వారి నారగింపుఁ డని కోరెను. కార్తవీర్యార్జునుఁడు బ్రహ్మానందముతో షడ్రసోపేతముగా విందుఁ గుడిచి యా గోవుపైఁ గోర్కి కలుగఁగా సపరివారముగాఁ దనపురమున కేఁగెను.

కాని, యా ధేనువుపైఁ గల మక్కువచే దానిని కొనితెండని కార్తవీర్యుఁడు తన భటులను బంపెను. వారు జమదగ్నితో యుద్ధమునకు సిద్ధపడిరి. జమదగ్ని సురభితో నీవిషయముఁ దెలిపెను. వెంటనే యామె రోమకూపములనుండి మహావీరులగు సైనికులు, నుత్తమ రథాశ్వములు వెలువడఁగా వానితో జమదగ్ని కార్తవీర్యుని సేనలతోఁ బోరెను. కార్తవీర్యుని సైనికులు హతమారఁగా నా సంగతిఁ దెలిసికొని కార్తవీర్యార్జునుఁడు ససైన్యుఁడై వచ్చి స్వయముగా జమదగ్నితోఁ బోరెను. కార్తవీర్యార్జునుండు రెండు మూఁడు పర్యాయము లోడిపోయి జమదగ్నికిఁ జిక్కి యాతనిచే బుద్ధులు గఱపఁ బడియుఁ బాటింపక తిరిగి యాతనిపై యుద్ధమునకువచ్చి తిరిగి యోడిపోయెను. ఈ ప్రకార మిరువది పర్యాయము లోడిపోయి యిరువది యొకటవ మాఱు సురభి వాక్యమును విస్మరించిన జమదగ్నిని సంహరించి సురభిని వెదకఁగా నా కామధేను వాతనికి లభింపక యింద్రునికడకుఁ బోయి

సురక్షితముగా నుండెను. కార్తవీర్యార్జునుఁడు రిక్తహస్తములతో నింటికిఁ బోయెను. రేణుకాదేవి భర్తతో సహగమనము చేయనుండ నాకాశవాణి వలదని వారించెను. ఇంతలో భృగుమహర్షి వచ్చి జమదగ్నిని బ్రదికించెను.

తరువాతఁ బరశురాముఁడు వచ్చి జరిగినసంగతిఁ దెలిసికొని యింటఁ దిని యింటివాసములు లెక్కపెట్టినట్లున్నదని కోపించి కార్తవీర్యు నవమానింపఁ దండ్రియనుమతిఁ గొని కుఠారకవచకోదండ కాండుఁడై మాహిష్మతీపురమున కేఁగెను. అందుఁ గార్తవీర్యార్జునుఁడు నాతని సంహరింపుఁడని దండనాయకులఁ బదియేడక్షౌహిణులఁ బంపెను. పరశురాముఁ డొక్కక్షణమున వారి నందఱ రూపుమాపెను. కార్తవీర్యార్జునుఁడు యుద్ధమునకు రాఁగా నాతని వేయి చేతులను ద్రుంచి తనగండ్రగొడ్డలిచే నాతనిశిరముఁ దునిమెను. పిమ్మట నాశ్రమమున కేఁగి యాతఁడు తండ్రికి జరిగిన వృత్తాంతముఁ జెప్పెను. జమదగ్ని మహర్షి రాజెంత దుష్టుఁడైన నాతనిఁ జంపుట దోషమనియుఁ దద్దోషపరిహారమున కొకయేఁడు తీర్థయాత్ర గావింపు మనియుఁ బుత్రుని శాసించెను. పరశురాముఁ డట్లే యని తీర్థయాత్రకై బయలు వెడలిపోయెను. ఆహా! తన కుమారుఁడు విష్ణుస్వరూపుఁ డని యెఱిఁగియుఁ గార్తవీర్యుఁడుఁ దనకుఁ బరమవిరోధియై యున్నను, నాతనిఁ జంపిన కారణమున ధర్మసంహితబుద్ధితోఁ బుత్త్రుని శిక్షింప వెనుకంజవేయని జమదగ్ని మహర్షి నెంతకొనియాడినను దనివి తీరదు కదా!

కార్తవీర్యార్జునుని కొడుకులు కొంతకాలమునకు దమ తండ్రిని జంపుటకుఁ గారకుఁడు జమదగ్నియే యని యొక్కసారి జమదగ్ని హోమగృహముఁ జేరి యాతనిఁ బట్టి చంపిరి. రేణుకాదేవి యాతని పైఁ బడి "పరశురామా! వచ్చి తండ్రిని రక్షింపుము, రక్షింపు" మని యిరువదియొక్కసారి కేకవేసెను. అంతలోఁ దీర్థయాత్రనుండి

పరశురాముఁడు వచ్చి తండ్రి మరణమునకు విచారించెను. పిమ్మటఁ తల్లి యిరువదియొక్కమాఱులు పిలిచినది. కావున నిరువదియొక్క మాఱు కార్తవీర్యులనే కాక క్షత్రియుల నెల్లరను సంహరించి వారి రక్త ప్రవాహమునఁ దండ్రికిఁ దర్పణము లిత్తునని పరశురాముఁడు సోదరుల నూఱడించి బయలుదేఱి వెడలి యిఱువదియొక్కమాఱు వెదకి వెదకి రాజులఁ జంపెను. ఈలోపున రేణుకాదేవి భర్తకై ప్రాణములఁ బాసెను. పరశురాముఁడు తాను చేసిన ప్రతిజ్ఞను పాలించి క్షత్రియ రక్తముతోఁ దండ్రికిఁ దర్పణము విడిచిపెట్టెను. ఉత్తమోత్తముఁడు పితౄణవిమోచకుఁడు నగు పరశురామునివంటి పుత్త్రరత్నమును గాంచిన యా మహర్షిసత్తముని యదృష్టవిశేష మెంతటిదో కదా!*

### జమదగ్ని పితృదేవతల శాపమున నకులమై పుట్టిన వృత్తాంతము

జమదగ్ని మహర్షి యొకనాడు పితృకార్యార్థియై చాల నియమముతో నూతన కలశమున గోక్షీరమును స్వయముగాఁ బితికి యొకచోటఁ బదిలముగాఁ బెట్టెను. జమదగ్ని మహాప్రశాంతుఁ డగుట నాతని చిత్తవృత్తి యెఱుఁగఁ దలఁచి క్రోధాధిదైవము సాకారమై వచ్చి ప్రమాద మన్మథము పుట్టించి యా పాలు పాఱఁ బోసెను. జమదగ్ని మహర్షి కోపింపక యూరకుండెను. అంతఁ గ్రోధాధిదేవత యాతని యెదుటఁ బ్రత్యక్షమై "మహాత్మా! భృగు వంశమువారు మహాకోపు లని వింటిని. నీయం దది యసత్య మైనది. అది పరీక్షించుటకే యిట్లు చేసితిని క్షమింపు" మని వేఁడు కొనెను. జమదగ్ని శాంతచిత్తముతోఁ బొమ్మనఁగాఁ గ్రోధుఁ డంతర్ధానమయ్యెను.

నాఁటిరాత్రి జమదగ్ని పితృదేవత లతనికిఁ బొడసూపి "వత్సా! నీ వెంతదోషము చేసితివి! నీవు మాపూజ కుత్సహించి

* భారతము — బ్రహ్మపురాణము.

తద్వైకల్యము కలిగినను నూరకుంటివి. ఇది శాంతమగునే? సమయా సమయముల నెఱిఁగి చూపినదే శాంతము. వలయునెడఁ గోపించినను నది శాంతసమానమే యగును. అసమయమున శాంతము చూపినను దోషమే యగును. కావున నీ వొనరించిన దోషమునకు నీవు ప్రతిఫల మనుభవించి తీరవలెను. కావున, నీవు ముంగివై పుట్టు" మని శపించిరి. జమదగ్ని వారలకు దండప్రణామములు చేసి "మహాత్ములారా! తపస్వికి నలుగఁ దగదని యపరాధము చేసినను నలుగనైతిని. నా తప్పు నా కిప్పుడు తెలిసినది. కావున, నన్ను సైచి శాపమోక్షము ననుగ్రహింపుఁ" డని కోరెను. వారు 'నాయనా! నీమీఁద మాకుఁ గ్రోధము లేదు. ఎంతటివానికిని గర్మఫలమనుభవింపక తప్పదు కదా! నీకు నంతియే. కావున, నీవు నకులమై పుట్టుట తప్పదు. ఎప్పుడు విదగ్ధవిప్రసమూహా మంగీకరించు నుచిత వాక్యములతో నొక మహాధర్మమును కీడని నీవందువో యానాఁడు నీకు శాపమోచనమై మోక్షసౌభాగ్యమందఁగల" వని చెప్పి పితృదేవత లదృశ్యులైరి. ఆ శాపము మూలముననే ముంగియై పుట్టి ధర్మరాజు చేసిన యశ్వమేధయాగ సమయమున సక్తుప్రస్థుని యుదాహరణమున ధర్మజు నశ్వమేధము నధిక్షేపించి విగతశాపత్వానందమున జమదగ్ని మహర్షి జన్మరాహిత్యము నందఁగనెను.*

ఇట్లు జమదగ్ని మహర్షి మహాప్రశాంతుఁడై, అరిషడ్వర్గముల జయించి యాత్మానందసింహాసనాధిష్ఠితుఁడై వెలసెను.

---

* భారతము - అశ్వమేధపర్వము.

# మహర్షుల చరిత్రలు

* * *

## దత్తాత్రేయ మహర్షి

### దత్తాత్రేయుని జననము

పూర్వము కౌశికుఁడను బ్రాహ్మణుని పత్ని సూర్యోదయ మైనంతనే తన భర్త మరణించు నని యెఱిఁగి సూర్యోదయము కాఁగూడ దని శాసించెను. ఆ మహాపతివ్రత శాసనమున సూర్యుఁ డుదయింప కుండుటచే లోకములు తల్లడిల్లఁ జొచ్చెను. దేవత లత్రిమహర్షి భార్యయగు ననసూయను శరణుచొచ్చిరి. అనసూయ కౌశికపత్ని ననునయించి సూర్యోదయ మగునట్లు చేసి దన ప్రాతివ్రత్యమహిమచే నామెభర్తను బ్రదికించి నవయౌవనుని సుందర గాత్రునిఁ జేసెను. దేవత లామె పాతివ్రత్యమునకు మెచ్చి పుష్ప వర్షము కురిపించిరి. దేవదుందుభులు మ్రోయించిరి. అప్పుడు బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు "తల్లీ! నీవలన లోకోపద్రవము తప్పినది. మేము సంతుష్టులమైతిమి. ఏదైన వరము కోరుకొని మామాట చెల్లింపు" మని యనసూయను గోరుకొనిరి ఆమె "మీరు ముువ్వురును బరమయోగ్యులైన పుత్రులై నాకడుపునఁ బుట్టవలయు" నని కోరుకొనెను. బ్రహ్మ విష్ణుమహేశ్వరు లామెకు వరమిచ్చి యంతర్హితులైరి. పిమ్మట నత్రిమహర్షి పుత్రకాంక్షియై చేసిన ఘోరతపమునకుఁ ద్రిమూర్తులును మెచ్చి యా వరమునే యొసఁగిరి. అత్రిమహర్షి వీర్యరూపమున విష్ణ్వంశ మనసూయ గర్భమును బ్రవేశించెను. ఆ యంశముచే ననసూయకు జన్మించిన మహాత్ముఁడే దత్తాత్రేయుఁడు.

### దత్తాత్రేయుని ప్రవర్తనము

భూమిపై ధర్మక్షయము కలిగి మ్లేచ్ఛాచారములు హెచ్చి వర్ణసంకరము కాఁజొచ్చెను. అప్పుడు బ్రాహ్మణ క్షత్రియులు

యజ్ఞాదికము మాని భ్రష్టులగుచుండిరి. యోగశాస్త్ర మడుగంటి క్షీణింపఁగడంగెను. రాక్షసులు ప్రబలులై దేవతలను బాధింపఁ దొడఁగిరి. ఈ సమయమున దత్తాత్రేయుఁడు జనించి బాల్యము నుండియుఁ బరమయోగియై పెరుఁగఁ జొచ్చెను. అతఁడు చిన్నతనమునుండియు నిస్సంగియై కాలము పుచ్చుచుండెను. బాహ్యేంద్రియ నిగ్రహుఁడు నిరంతరాత్మానంద తన్మయుఁడు నగు నాతఁడు తల్లిదండ్రులను సంతోషపెట్టుచుండెను. బాల్యమునుండియు దత్తాత్రేయుఁ డింతటి వాఁడగుటఁ గన్నులారఁ గాంచిన తోడి మునిబాలు రెల్లపుడు నీతని కడనే యుండుచుండిరి. సంగరాహిత్యమున కలవడిన దత్తాత్రేయ మహర్షికి వీరి రాకయే పలువిధముల బాధకరముగా నుండెను. అతని స్వేచ్ఛా ప్రవర్తనమునకు వారడ్డు వచ్చుచుండిరి. ఈ కారణమున నాతఁడు వారి నట్లైనఁ దప్పించుకొన నెంచి యొకనాఁ డొక కొలనులో మునిఁగియుండెను. మునిపుత్త్రులేమైన నాతని విడువ నొల్లక యాతీరభూమినే నిలిచియుండిరి. ఎంతకాలమునకు వారట్లు తన్ను విడువకుండుటఁ జూచి యాతఁడు సంకల్పమాత్రమున లక్ష్మి నటకుఁ దెచ్చి యామెతోఁ గొలనువీడి బైటకు వచ్చెను. స్త్రీసహితుఁ డైన నాతని నా ఋషిబాలురు విడువక పలువిధములఁ గీర్తించుచుండిరి అంత నాతఁడు లక్ష్మి నంకతలమునఁ గూర్చుండఁ బెట్టుకొని మద్యపానము చేయుచు నాటలాడుచుఁ బాటలుపాడుచు లక్ష్మితోఁ గామాలాపము లాడ మొదలిడెను. అంత, మునిబాలకు లసహ్యించుకొని యా దత్తాత్రేయుని విడిచి యరిగిరి.

నాఁటినుండియు దత్తాత్రేయుఁ డాంతరంగిక తపోధ్యానపరుఁడై బహిరంగముగా మద్యపానము చేయుచు స్త్రీలోలుఁడై నట్లు నటించుచు నుండఁ దొడఁగెను. మహాయోగులు దక్క నన్యులాతని నెఱుఁగలేక మూఢాత్ములై మరలిపోఁ జొచ్చిరి. యోగ శ్రీయుతు లగు వారికి హవ్యసేవనాసవసేవలు సమానమని సామాన్యులు తెలియఁ

గలరా? యోగి నెఱుఁగుట యోగికే సాధ్యము కాని యితరులకు సాధ్యము కాదుకదా! *

### దత్తాత్రేయుఁడు జంభాది రాక్షసులఁ జంపించుట

ఇట్లుండఁగా జంభాది రాక్షసప్రముఖు లింద్రునిపై దండెత్తి దేవతల నోడించుచు ననేకవిధముల బాధలు పెట్టుచుండిరి. ఒక సంవత్సర మా రాక్షసులతోఁ బోరాడియు దేవతలు గెలువ లేకుండిరి. అందుచే నింద్రాదులు భయపడి వాలఖిల్యాది మహర్షులఁ గూడి తమ గురువగు బృహస్పతికడ కేఁగి యుపాయము చెప్పుమని కోరిరి. బృహస్పతి యాలోచించి "ఇంద్రాది దేవతలారా! నా కొక యుపాయము తోఁచుచున్నది. అత్రిమహర్షి కుమారుఁడు దత్తాత్రేయుఁడను మహాత్ముఁడు కలఁడు. మీరు పోయి వానిని భక్తితో సేవించి భజించినచో నాతఁడు మీకుపకారము చేయఁగలఁడు. అంతకుమించి గత్యంతరము కానవచ్చుటలే" దని చెప్పఁగా వెంటనే యింద్రాదులు గురుననుమతిఁ గైకొని యతివేగమున బయలుదేఱిపోయి దత్తాత్రేయనాశ్రమమును సమీపించిరి. అట నాతఁ డనేక కిన్నర గంధర్వగీయమానుఁడై లక్ష్మీసమన్వితుఁడు తేజస్సముజ్జ్వలుఁడునై యుండఁగాఁచి దేవత లతి భక్తియుతులై మ్రొక్కిరి. దత్తాత్రేయుఁడును దన వికృతచేష్టలఁ జూపుచు మద్యము తెండనఁగా వారు మద్యముఁ గొనివచ్చి యాతని కందిచ్చిరి. ఆతఁడు లక్ష్మితో దానిం ద్రావి గంతులువేసి పాఱిపోఁ జొచ్చెను. ఇంద్రాదులును వానిని వెనుదగిలి విడువకుండిరి. వారిచే నట్లారాధింపఁబడుచు దత్తాత్రేయుఁడు కరుణించి "మీ రేపనికై వచ్చితి?" రని యడిగెను. వారును జంభాసురుని వృత్తాంతము చెప్పి రాక్షసుల నందఱను జంపి దేవహితము చేయుమని యాతనిఁ బ్రార్థించిరి. ఆతఁడు "నేను మద్యాసక్తుఁడను, స్త్రీలోలుఁడను, కర్మభ్రష్టుఁడను, ఉన్మత్తుఁడను, నాకా రాక్షసుల గెలువరాదు. పొం"డనెను. వారు

* మార్కండేయ పురాణము.

"మహాత్మా! నీవు విష్ణుఁడవు. ఆద్యుఁడవు. నీతో నున్న యీమె యిందిర. నీవు సత్యజ్ఞానానంతస్వరూపుఁడవు. నీకు విధినిషేధములు లేవు. నీకన్న సర్వసమర్థుఁ డింకొకఁడు లేఁడు. మమ్ము రక్షింపు" మని వేఁడుకొనిరి. అంత దత్తాత్రేయుఁడు కరుణించి "నన్ను మీరు తెలిసికొంటిరి. దేవహితముకంటె నాకుఁ గావలసిన దేమి? మీరా దైత్యులను యుద్ధవ్యాజమున నిటకుఁ దోడితెండు. క్షణమాత్రములో వారిఁ బరిమార్తు" నని వారిని బంపివేసెను.

దేవత లొక్కపరుగునఁబోయి జంభాదులను యుద్ధమునకుఁ బిలుచుకొని వచ్చిరి. జంభుఁడు ససైన్యుఁడై దత్తాత్రేయు నాశ్రమమునకు వచ్చి దత్తాత్రేయుని పార్శ్వమున నున్న లక్ష్మిని జూచి కామమోహితుఁడై నెమ్మదిగా నామెను దొంగిలించి శిబికలో నెక్కించుకొని మోయుచుఁ గొనిపోఁ జొచ్చెను. దత్తాత్రేయుఁ డింద్రాదులఁ బిలిచి "లక్ష్మి దానవుల శిర మెక్కినది. అనఁగా నింక వారిని విడిచి వేయు నన్నమాట. దాని మూలమున దైత్యులందఱు బలహీనులైరి. మీరు యుద్ధము ప్రారంభించి వారిని దునుమాడుఁ" డని చెప్పెను. దేవతలు పూర్వమువలెఁ గాక క్షణములో రాక్షసు లెల్లరఁ జంపి దత్తాత్రేయుని స్తుతించి వెడలిపోయిరి.

### దత్తాత్రేయుఁడు కార్తవీర్యార్జునుఁ గటాక్షించుట

ఆ దినములలో హైహయవంశీయుఁడగు కార్తవీర్యార్జునుఁ డను రాజు తండ్రి మరణానంతరము సింహాసన మధిష్ఠించి రాజ్యపరిపాలన మొల్లక మంత్రులఁ బిలిచి "మంత్రులారా! ఈ రాజ్యము నాకక్కఱలేదు. పరస్పర ద్వేషతస్కరాది బాధలనుండి కాపాడుటకై ప్రజలు ధరణిపతికి ధనము చెల్లింతురు. నేనాపనులు చేయఁజాలను. వనమున కరిగి తప మాచరించి యధ్యాత్మయోగసిద్ధి పొంది వచ్చెద" నని చెప్పెను. అందు గర్గుఁ డను మంత్రిపుంగవుఁడు రాజుమాట

త్రేయ మహర్షి మహాయోగసంపన్నుఁడు. అతని కృపఁ గాంచినచో నీ యభిమతము సిద్ధించు" నని చెప్పి దత్తాత్రేయుని కటాక్షమున నింద్రుఁడు జంభాది రాక్షసులఁ జంపిన వృత్తాంతము నెఱిఁగించెను. కార్తవీర్యార్జునుఁడు బయలుదేఱి పోయి దత్తాత్రేయు నాశ్రమమున కరిగి యాతనికి నమస్కరించి భక్తితో ననుదినము నాతని పాదము లొత్తుచు మద్యమాంసాదు లాహారముగాఁ గొనితెచ్చి యిచ్చుచుఁ జందన కర్పూరకస్తూరికాది సమస్తవస్తుప్రదానముల నాతని చిత్తము రంజించునట్లు పూజించుచుండ నొకనాఁ డాతని యపానవాయువగ్నిహోత్రమై వచ్చి కార్తవీర్యార్జునుని బాహుద్వయమును మాడ్చివేసెను. మఱియు దత్తాత్రేయుఁ డనేకవిధముల నాతని హింసించెను. ఐన, నాతఁడు తనభక్తి విడువక పరమానందముతోఁ బరిచర్య చేయుచుండెను దత్తాత్రేయుఁ "ఓరీ! కాంతాలంపటుఁడను. మద్యపాయిని, నన్నేల సేవింతువురా?" యని యడుగఁ గార్తవీర్యార్జునుఁడు "మహాత్మా! నీ వంతశ్శుద్ధుఁడవు. అసంగుఁడవు. నీవు విష్ణుమూర్తివి. ఆమె పద్మ" యని కేలుమోడ్చి సంస్తుతించెను. దత్తాత్రేయుఁ డాతని భక్తికి సంతసించి యేమి కావలయునో కోరుకొనుమనెను కార్తవీర్యార్జునుఁ డంత వేయి హస్తములు, సమస్త భూమిపాలనసామర్థ్యము, సంగర విజయము, సిరిసంపదలు, ధర్మతత్పరబుద్ధియు, శైలాకాశజల భూమిపాతాళములయందుఁ దనరథమకుంఠితముగా నడచు శక్తి కోరుకొనెను. దత్తాత్రేయుఁడు వానికా వరము లొసఁగి యంతర్హితుఁడగుచు "ఓరీ! నీ రాజ్యమందెల్లెడల నీ బాహుశక్తి మూలమున ధర్మప్రతిష్ఠానము చేయుము. యజ్ఞయాగాదులొనరించు బ్రాహ్మణులకు సమస్త మిచ్చుచుండుము, మద్భక్తియోగము నెల్లెడఁ జాటుచుండుము. నీ వెన్నండధర్మముగా మహర్షుల బాధింతువో యానాఁడే మరణింతువు సుమా" యని ప్రబోధించెను.

కార్తవీర్యార్జునుఁడు బ్రహ్మానందముతో నా మాటలెల్ల విని యనంతబలసంపన్నుఁడై మాహిష్మతీపురమున కరిగి రాజ్యమును స్వీకరించెను. నాఁడు మొద లాతఁడు ధర్మబద్ధముగా భూపరిపాలనము చేయుచు ననేకయజ్ఞములు చేసి బ్రహ్మర్షి పూజన మొనరించి ధర్మమును బూర్వస్థితికిఁ దీసికొనివచ్చెను. తన బాహుబలమున భూమండలమెల్ల జయించి యందెల్ల ధర్మప్రభుత్వము నెలకొల్పి కార్తవీర్యుఁడు విప్రపూజ చేయుచుండెను. అతఁడు ప్రతిదినమును దత్తాత్రేయమహర్షిని బూజించుచు నాతనికిఁ గృతజ్ఞుఁడై యుండెను. తుద కీతఁడు దత్తాత్రేయుఁ డన్నట్లే జమదగ్ని మహర్షి నన్యాయముగా బాధించి పరశురాముని చేతిలో జనిపోయెను.

### దత్తాత్రేయుఁ డలర్కునకు జ్ఞానము బోధించుట

మదాలసా ఋతుధ్వజుల పుత్త్రుఁడగు నలర్కమహీపతి రాజ్యము చేయుచుఁ బురుషునకు ముముక్షను బోలిన వస్తు వొకటి లేదనియు దాని నందుటకు సత్సాంగత్యము దక్క మార్గాంతరము లేదనియు నిశ్చయించుకొనెను. ఇంతలో విరాగియై యడవుల నున్న యీతని యన్న యాసమయముననే కాశీరాజుకడ కేఁగి తన రాజ్యము తన తమ్ముఁడపహరించినాఁ డనియు దానిని తన కిప్పింపు మనియుఁ గోరుకొనెను. కాశీరాజు ససైన్యుఁడై యలర్కునిపై దండెత్తి సామాద్యుపాయములఁ బ్రయత్నించుచుండెను. ఈ సమయమున రహస్యముగా నలర్కుఁడు దత్తాత్రేయుని కడకుఁ బరుగునఁ బోయి దండప్రణామము లాచరించి శరణార్థి యగు తనకు శరణై రక్షింపుమని పరిపరివిధముల దీనుఁడై ప్రార్థించెను. దత్తాత్రేయ మహర్షి యాతనిఁ గరుణించి "ఓయీ! వివేకహీనా! నిను నీవు తెలిసికొనుమోయీ! అంగములఁ జింతించి యంగిఁ జూచి నిరంగునిఁ గనుఁగొని యసంగుఁడవై సర్వాంగముల నుడుఁగు" మని యాతనికిఁ దత్త్వజ్ఞానోపదేశముచేసి "ఇఁక విచారమే?" మని యడిగెను.

అలర్కుఁడు సమ్యగాత్మదర్శనుఁడై దత్తాత్రేయునకు వందనము లాచరించి "నీకృపచే బ్రతికితిని. సుస్థిరజ్ఞాన ముపదేశింపు" మని వేఁడుకొనెను. దత్తాత్రేయుఁడు "మమ యనుట దుఃఖమునకు, నమమ యనుట నిర్వృతికిని మార్గము. అహంకారమను నంకురముచేఁ బుట్టి మమకార మను మొదలు కలిగి గృహము క్షేత్రము నను కొమ్మల నంది పుత్త్రిలు భార్య యను పల్లవముల నొప్పి ధనము ధాన్యము నను పెద్ద యాకులు వేసి పుణ్యాపాపములను పుష్పముఁ బూచి సుఖ దుఃఖములను పండ్లు కాచి చిరకాలము పెరిగి యజ్ఞాన మను కుదుళ్ళతో నిండి ముక్తిమార్గమును గప్పివేసియున్న మమ యను వృక్షమునీడను సంసార పథపరిశ్రాంతు లగు మిథ్యాజ్ఞాన సుఖాధీనులకుఁ బరమ సుఖము పరమ దుర్లభము కావున. నీ మహావృక్షమును విమల విద్యయను గొడ్డలిఁ దీసికొని తత్త్వనిధులు సాధుజనులు వీరితోడిసంగ మను పాషాణమున బాగుగా నూఱి పదనుపెట్టి యెవరు నఱకుదురో వారు చల్లని బ్రహ్మవనము చొచ్చి నిత్యానందులై యపునరావృత్తి నుందు" రని యుపదేశింపఁగా విని యానందితుఁడై "మహాత్మా! నిర్గుణ బ్రహ్మైకత్వమును బోధించు యోగము నెఱిఁగింపు" మని వేఁడుకొనెను. అంత నాతఁడు "వత్సా! శరీరమునందలి పరమజ్ఞానమునకు గురుఁడే యుపద్రష్ట. మోక్షార్థికి యోగము జ్ఞాన పూర్వకమగును. ప్రకృతి గుణములతో నేకత్వము లేకపోవుటయు బ్రహ్మైకత్వము కలుగుటయు ముక్తి యన నొప్పును. ఆముక్తి పరమ యోగమునఁ గలుగును. యోగము సంగత్యాగము వలన సిద్ధించును. సంగత్యాగము వలన నిర్మమత్వము దాని వలన వైరాగ్యము దానివలన జ్ఞానము దానివలన మోక్షమును సంభవించును.?

యోగికి ముం దాత్మజయము కావలెను. కనుకఁ బ్రాణాయామముచే నాతఁడాత్మదేహదోషము దహింపఁ జేయవలెను. కామ్యములైన కర్మములు యోగవిఘ్న కార్యములగుట యోగి

వానిని ద్యజించి శుద్ధాత్ముఁడై పరమాత్మునిలో నైక్యమైపోవును. అట్టి యోగికి గౌరవము విషము. అవమానమే యమృత మగును. ఆయోగి తన కున్నదే "యిల్లుగాఁ దన యాఁకలికి దొరకినదియే భోజ్యముగాఁ దనకు గలదియే ధనముగా ముదమంది మమకారము నందఁడు. కావున, నీవు విచారము దక్కి యట్టి యోగపురుషుఁడవై మోక్షవృత్తి మఱవకు" మని యలర్కునకు బోధించెను. అలర్కుఁడు బ్రహ్మానందముతో గృహమునకేఁగి రాజ్యమును ప్రీతిపూర్వకముగాఁ గాశీరాజున కిచ్చెను. దానిని గాశీరాజు అలర్కుని యన్న కీయఁబోయెను. అలర్కుని యన్నయు నానందించి తాను సోదరునకు జ్ఞానప్రబోధము చేయుటకే రాజ్య మర్థించితి ననియు నాపని యగుటచేఁ దనకు రాజ్య మక్కఱలేదని కాశీరాజునకుఁ దత్త్వ ముపదేశించి తన యాశ్రమమునకుఁ బోయెను. కాశీరాజు అలర్కునిఁ బూజించి రాజ్య మాతనికే విడిచి చనియెను. అలర్కుఁడు సుతునకుఁ బట్టము కట్టి యడవి కేఁగి యోగియై విరాగియై యాత్మసుఖము నందెను. *

దత్తాత్రేయమహర్షి సంగమును విడనాడుటకై వివిధవేష ములఁ గైకొనువాఁడు. విల్లునమ్ములు కొని వేఁటకుక్కలు వెంట రాఁగాఁ జెంచువానివలె నుండువాఁడు. కాఱడవిలోఁ గిరాతతతి యుండెడుచో నుండి మద్యమాంసములు సేవించువాఁడు. మాలపల్లె కేఁగి చండాలురతోఁ గూడి మద్యమును గ్రోలువాఁడు. ఉన్మత్తుఁడై నట్లు విహరించువాఁడు. ఐన నాతఁడు మహాయోగీశ్వరేశ్వరుఁడు. విచిత్రచరిత్రుఁడు.

"శ్లో॥ విభుర్నిత్యానంద శ్శ్రుతిగణశిరోవేద్యమహిమా
యతో జన్మాద్యస్య ప్రభవతి స మాయాగుణవతః ।
సదాధార స్సత్యో జయతి పురషార్థైక ఫలదః
సదా దత్తాత్రేయో విహరతి ముదా జ్ఞావలంహరిః "॥

# మహర్షుల చరిత్రలు

## దధీచి మహర్షి

### దధీచి జననము

చ్యవనమహర్షి యాశ్వినుల సేవమున సుకన్యా పాతివ్రత్య ప్రభావముచే నవయౌవనుఁడు త్రిలోకసుందరుఁడునై సుకన్యను బిలిచి "సాధ్వీ! నీవు చేసినత్యాగ మనంతము. ఏలన, సుకుమార గాత్రివై హంసతూలికాతల్పమునఁ బరుండు రాజపుత్రి వగు నీవు తుచ్ఛ కామమున నీసడించి యంధుడను వృద్ధుననై నన్ను వివాహమాడితివి మహాపతివ్రతవై నాకు యౌవనము సుందరాకారము గడించితివి. కావున, నీకు మహాత్యాగి పరమతపోధనుఁడు నగు కుమారుఁ డుదయించు" నని చెప్పి యామెతో రమించెను. అంత, సుకన్య గర్భముఁ దాల్చి యుక్తకాలమున నొక శుభ ముహూర్తమున సుపుత్త్రుని గనెను. అతఁడే దధీచిమహర్షి.

### దధీచికి సారస్వతుఁడు జనించినవిషయము.

దధీచి బాల్యమునుండియు మహాతపస్సు చేయుచుండెను. అతఁడు చిరకాలము సరస్వతీ నదీతీరమున నాశ్రమము నిర్మించుకొని యందుండెను. దధీచి తపశ్శక్తిచే నాతని దేహమెల్ల దివ్యతేజో గోళముగాఁ బ్రకాశించుచుండెను. సరస్వతీ నది యాతనిఁ జూచి సమ్మోహిత యగుచుండెడిది. ఇట్లుండఁగా దధీచి మహర్షి తపోగ్నిచే నెల్లలోకములు తల్లడిల్లుచుండెను. అందుచే నింద్రుఁ డాలోచించి యలంబుస యను నొక యప్సరసను దపోవిఘ్నమునకై యాతని కడకుఁ బంపెను.

దధీచి మహర్షి సరస్వతీనదిలో స్నానముచేసి నీటిలో నిలిచి జపము చేసికొనుచుండఁగా నలంబుస యట కేఁగి తన నృత్యగీతాలాపములచే దధీచిదృష్టిఁ జూఱకొనెను. దధీచి కామమోహితుఁడు కాఁగానే యాతనివీర్యము స్ఖలితమై నదిలోఁబడెను. సరస్వతీనది సంతసముతో స్త్రీరూపధారిణియై యా వీర్యమును దనగర్భమున ధరించి గర్భవతి యయ్యెను. దధీచి యంత నిశ్చలుఁడై తనయాశ్రమమునకుఁ బోయెను. కాలక్రమమున సరస్వతి పుత్త్రునిఁగని యాతని దధీచికడకుఁ గొనిపోయి జరిగిన యుదంతమును జెప్పెను. దధీచి దివ్యదృష్టినిజూచి యది సత్యమగుట యెఱిఁగి కుమారుని ముద్దాడి యాతనికి 'సారస్వతుఁ' డను పేరిడెను. సరస్వతి పుత్త్రునిఁ గైకొమ్మని యాతని బ్రార్థించెను. దధీచి "సరస్వతీ! నేను తపోవ్రతుఁడను. కావున, వీనిని నీవే పెంచుచుండుము. ఈతఁడు మహాశక్తిసంపన్నుఁడై ముందు రాఁబోవు మహాక్షామములలో నిజశక్తిచే మహర్షుల రక్షింపఁగలఁ" డని యామెకే యప్పగించెను. ఆమె తన పవిత్రజలములచే నాతనిఁ బెంచి విడిచెను. అతఁడు తపోధనుఁడై తండ్రి చెప్పినట్లు మహాక్షామ కాలమున మహర్షుల నాహ్వానించి వారందఱకు షడ్రసోపేతముగా భోజనము పెట్టుచు క్షామనివారణము గావించెను.

### దధీచి కింద్రుఁడు నేర్పిన శాస్త్రముల వృత్తాంతము

ఒకప్పు డింద్రుఁడు దధీచికడకు వచ్చి "ఋషిసత్తమా! నీవు మహాత్ముఁడవు. కావున, నీకు మహోత్తమశాస్త్రముల నుపదేశింతు" నని చెప్పి యాతనికిఁ గొన్నిశాస్త్రము లుపదేశించెను. ఇంద్రుఁ డంతర్హితుఁ డగుచు "నీవు వీని నెవ్వరికైన నుపదేశించినచో నా నాఁడే నీశిరము ఖండింతు" నని చెప్పెను. దధీచి యా శాస్త్రములను గ్రహించియుండెను.

అశ్వినీ దేవత లీవిషయము విని యొకనాఁడు దధీచికడకు వచ్చి "మునికులతిలకా! తొల్లి మీ తండ్రియగు చ్యవన మహర్షికి నవయౌవన మొసంగిన యాశ్వినేయులము మేము. నీ వింద్రునివలన నెఱిఁగిన శాస్త్రములను మాకిచ్చుచో మేము నీ కుపకృతి చేయఁగలము. కావున, నా శాస్త్రములను మాకు బోధింపు" మని వేఁడుకొనిరి. దధీచి తనకుఁ గల శాపవృత్తాంత మెఱిఁగించి తాను బోధింపఁజాల ననెను. అశ్వినులు "నీ కెట్టి యుపద్రవము వచ్చినను నిన్నుఁ గాపాడు బాధ్యత మాది. మేము దేవహితార్థ మయియే నిన్నర్థించుచున్నా" మని బతిమాలిరి. దధీచి యంగీకరింపఁగా వారొక యశ్వశిరమును గొనివచ్చి దధీచి తలఁదీసి యా యశ్వశిరము నదికి దానివలన శాస్త్రములు గ్రహించి యాతని పూర్వశిరమును భద్రపఱచి యుండిరి. ఇంద్రుఁడు దధీచి చేసినపనికి నగచి వెంటనే సాయుధుఁడై వచ్చి-దధీచి శిరస్సు నఱికి వెడలిపోయెను. వెనువెంటనే యాశ్వినీ దేవతలునువచ్చి దధీచి పూర్వశిరమును దధీచి కదికి యాతనిఁ బునరుజ్జీవితుఁ జేసి వెడలిపోయిరి. *

## దధీచి క్షుపుల పరస్పరవైరము

ఈ ప్రకారము పునర్జన్ముఁ డైన దధీచిమహర్షి యొకనాఁడాతని బాల్యహితుఁ డైన క్షుపుఁ డనురాజుచే నాహూతుఁడై యాతని యింటి కేఁగెను. క్షుపుఁ డాతని నుచితరీతిని గౌరవించి మన్నించెను. కాని, కొంతసేపటికి వారొక వివాదమునకు దిగిరి. బ్రాహ్మణాధిక్యమును దధీచి నిరూపింపఁ దొడఁగెను. క్షత్త్రియాధిక్యము క్షుపుఁడు నిరూపింప మొదలిడెను. తుదకు వారివాదము తేలక క్రుతిమించి రాగమునఁబడి యొకరి నొకరు నిందించుకొనఁ జొచ్చిరి. దధీచి కోపించి క్షుపుని గొట్టెను. క్షుపుఁ డొక వజ్రాయుధమును

ప్రయోగించి దధీచి శరీరమును ముక్కముక్కలుగాఁ జేసెను. అంత దధీచి మరణించెను. దధీచి భార్గవవంశజుఁ డగుటచే శుక్రాచార్యుఁడు జాలిగొని యచటికి వచ్చి దధీచి దేహశకలము లన్నిటిఁ జేర్చి తన సంజీవనీ మంత్రప్రభావమున నాతనిని క్షణములో బ్రతికించెను. దధీచి నిద్రనుండి లేచినట్లు లేచి భార్గవునకు వందన సహస్రము లాచరించెను. శుక్రుఁడు దధీచిఁ గౌఁగిలించుకొని "వత్సా! నీవు సర్వశక్తిసంపన్నుఁడ వగుదువు సదాశివునిఁగూర్చి తపము చేయు" మని దీవించి యంతర్హితుఁడయ్యెను.

### దధీచి క్షువుని విష్ణుని నిందించి గెల్చుట

దధీచి యటనుండి లేచిపోయి యాశ్రమమున కేఁగి పరమశివుని గురించి తపముచేయ మొదలిడెను. నిరాహారుఁడై నిర్జితేంద్రియుఁడై దధీచి మహర్షి తపస్సు చేయుచుండఁగా ముల్లోకములు గగ్గోలు పడుచుండెను. ఈశ్వరుఁడు నతనితపోనవద్యతకు మెచ్చి ప్రత్యక్షమై దధీచికి స్వచ్ఛంద మరణము, వజ్రమయశరీరము లోకత్రయ విజయ శక్తి నిచ్చి యదృశ్యమయ్యెను. దధీచి మహావరసంపన్నుఁడై యుండియు క్షువుఁడు తనకుఁ జేసియున్న యవమానము బ్రాహ్మణ నింద మఱవఁజాలక యాతని గృహమున కేఁగి క్షువు నొక తన్నుఁ దన్నెను. క్షువుఁడు మహాకోపముతో దధీచి నెన్నియో విధముల హింసింపఁ జూచి బహుశస్త్రాస్త్రములఁ బ్రయోగించిన నవి విఫలమయ్యెను. అంత దధీచి "ఓరీ! క్షత్రియాధముఁడ వగు నీ వెక్కడ? బ్రాహ్మణశ్రేష్ఠుఁడ నగు నే నెక్కడ? బ్రాహ్మణుఁ డధికుఁ డగునో కాదో తెలిసినదా? నీవు కాదు. నీ దేవుఁడగు విష్ణువుకూడ నా కాలి గోటికి సరికాఁడు గ్రహింపు" మని గర్వించి పల్కెను. క్షువుఁడు చేయునది లేక, విష్ణుమూర్తిని గురించి తపస్సు చేయఁగా నాతఁడు ప్రత్యక్షమయ్యెను. క్షువుఁడు తనకు దధీచివలనఁ గల్గిన యవమానమును దధీచి విష్ణుని లెక్కసేయక పోవుటయుఁ జెప్పి రక్షింపుమని కోరెను.

అంత విష్ణుమూర్తి క్షువుని వెంటఁగొని దధీచికడ కేఁగి 'ఓరీ! శివగర్వితుఁడవైతివా? నేనును శివుఁడును నొక్కటిగాదా!' యని యడిగెను. దధీచి "నీ వేడ? శివుఁ డేడ? శివభక్తుఁడనగు నా గోటికైనను నీవు చాలవు. ఇఁక శివునితోడి సామ్యమెందుల" కని పరిహాసము చేసెను. విష్ణుమూర్తి దధీచి శిరముఁ ద్రుంపఁ జక్రమును బంపెను. దధీచి తన తపశ్శక్తిచేఁ జక్రమును నివారించుకొనెను. విష్ణుమూర్తి మాయ పన్నెను. దధీచి మాయను ఛేదించెను. అంత విష్ణుమూర్తి "వత్సా! దధీచీ! నీ భక్తి తాత్పర్యము బరీక్షింప నిటు వచ్చితిని. నిజముగా మా భక్తశ్రేష్ఠుఁడ వగు నీవంటివాని కాలి గోరితోనైనఁ బోలఁగలవాఁ డెవఁడు? నీవు దేవహితార్థివై జీవింపు" మని పలికి క్షువునితో నాతని శరణు చొచ్చుటకంటె నుపాయాంతరము లేదని యంతర్హితుఁ డయ్యెను. క్షువుఁడు దధీచి పాదములపైఁ బడి "మహాత్మా! నీశక్తి యెఱుఁగక నీ కెగ్గు చేసితిని. నా తప్పు సైరింపు" మని పరిపరివిధములఁ బ్రార్థించెను. దధీచి శాంతుఁడై "మిత్రమా! నీ మీఁద నా కావంతయుఁ గోపములేదు. బ్రాహ్మణ క్రోధము నీటిపై గీఁత క్షణికములు కదా! నీవు యథాపూర్వము నా ప్రియమిత్రుఁడవై యుండు" మని యనుగ్రహించి యాతనిఁ బంపివేసెను.

ఈ రీతిగాఁ దపోనవద్యుఁడై వరశక్తిసంపన్నుఁ డయ్యు దధీచి మహర్షి శిష్యప్రశిష్యులఁ జేర్చుకొని ధర్మసంరక్షణార్థము 'గభస్తిని' యను నామాంతరము గల 'సువర్చ' యను కన్యను బరిగ్రహించి గృహస్థజీవనమును మహోదర్శముగాఁ గడపుచుండెను. సువర్చ మహాసాధ్వియై పతిపదపద్మసేవ తక్క నన్య మెఱుఁగకుండెను. దధీచి కనతికాలముననే కోటానఁగోట్లు ఋషులు శిష్యప్రశిష్యులైరి.

### దధీచి దక్షుని శపించుట

ఇట్లుండ నొకనాఁడు దక్షప్రజాపతి యజ్ఞము చేయఁదలఁచి

మంపెను. దధీచి యానందించి శిష్యప్రశిష్యుఁడై దక్షాధ్వరమునకు బయలుదేఱి వెళ్ళెను. దక్షుఁడు శివభక్తాగ్రగణ్యుఁడగు దధీచియుఁ దన యజ్ఞమునకు వచ్చుట తనకు వెలచియే యని యానందించి యాతని కుపచారములు సల్పి "మిత్రమా! శివుఁడును శివానుచరులును రాకుండఁజేసి నేను యజ్ఞము చేయ నిశ్చయించితిని. జగద్ద్రోహి యగు శివుని బిలువకుండుట నీకును సంతోషమైనచో నిటనుండి యజ్ఞము నిర్వర్తింపు" మని పల్కెను. దధీచి తోకద్రొక్కిన త్రాఁచువలె లేచి వసిష్ఠవామదేవవ్యాసనారదాదిమహర్షు లెల్లరు రాకుండుట కదియే కారణ మని యెఱిఁగి "ఓ దక్షప్రజాపతీ! నీకీ దుర్బుద్ధి యేల పుట్టినది? విశ్వేశ్వరుఁడు, దేవాదిదేవుఁడునగు శివుఁడు లేనిదే యజ్ఞ మెట్లు జరుగును? జరిగినను నీకు లభించు ఫలిత మేముండు?" నని శివు ననేకవిధముఁ బ్రస్తుతింప మొదలిడెను. దక్షుఁడు శివుఁడు శ్మశానవాసి, దిగంబరుఁడు, గజచర్మధరుఁడు, బిచ్చగాఁడు, శశశృంగుఁడు నని యనేకవిధముల దూషించెను. దధీచి సభాసదు లెల్లరు వినుచుండఁగా మహాప్రశాంతుఁడై వానికన్నిటికిని సముచితముగా బదులుచెప్పి పరమశివుని ప్రఖ్యాతిని బలువిధముల విస్తరించి చెప్పెను. ఎన్ని చెప్పినను దక్షుఁడు లెక్కచేయక "ఆ నిర్భాగ్యుని నుతించువార లొక్క నిమేషమైన నిటనిల్వ రా" దని యాజ్ఞాపించి దధీచి నవమానించెను. దధీచి శిష్యసహితుఁడై లేచి "ఓ దక్షనామకమూర్ఖాగ్రేసరా! నే నెన్ని చెప్పినను వినక సదాశివుని దూషించితివి. కావున, నీ యజ్ఞ మశుభప్రతిపాదక మగుఁగాక! నీవును దగిన ప్రాయశ్చిత్తము నందుదువు గాక! వివేకవిహీనుఁడవై నీవు చేయ జన్నమునకు వచ్చిన యీ దేవఋషిగణ మెల్ల వినాశము నందుఁ గాక! యని శపించి యజ్ఞవాటమునుండి వెడలిపోయెను. ఈతని శాపప్రకార మచిరకాలముననే వీరభద్రునిచే దక్షాధ్వర ధ్వంసము సదస్యవినాశనము కలిగెను.

## దధీచి దేవతల యస్త్రశస్త్రములఁ మ్రింగుట

ఒకప్పుడు రాక్షసులు విజృంభించి దేవతలపై దండెత్తి వారి నోడించి యింక నెన్నఁడు వారు తిరిగి తమ కపకృతి యొనరింపఁ జాలకుండుటకు వారివారి యస్త్రశస్త్రములను లాగివైచుకొనుచుండిరి. దేవతలు నుపాయాంతర మాలోచించి దధీచి మహర్షి కడఁ దమ యస్త్రములు దాఁచియుంచినచోఁ బ్రమాదము తప్పునని యెంచిరి. అంత నింద్రాది దేవతలెల్లరును నస్త్రశస్త్రసమేతులై దధీచి మహర్షి కడ కేఁగి యాతని పాదములపైఁ బడి తమ దురవస్థఁ దెలిపికొని తమ యస్త్రములను దాఁచిపెట్టుమని యర్థించిరి. దధీచి జాలిగొని యట్లంగీకరించి వారి యస్త్రముల నెల్ల గ్రహించెను! దేవతలును దమ యస్త్రశస్త్రభద్రత కానందించి వెడలిపోయిరి. త్వరలో వారికిని రాక్షసుల యుపద్రవము తొలఁగిపోయెను. కాని, వారు భోగలాలసులై దధీచికడకు వచ్చి యస్త్రములను గ్రహింప నాలస్యము చేయుచుండిరి. దధీచి వాని నన్నిటినిఁ జిరకాలము దాఁచియుంచఁ జాలక వానిపై జల మభిమంత్రించి వానినెల్ల నొక్కపరి మ్రింగివేసెను. ఆతని తపఃప్రభావమున నవియెల్ల జీర్ణమై యాతని రక్తనాళములలో నెముకలలోఁ జేరిపోయెను.

అంతఁ గొంతకాలమునకు దేవతలు వచ్చి దధీచి నస్త్రము లిమ్మని కోరిరి. దధీచి తాను చేసినపని చెప్పి వారి యాలస్యమే దాని కారణ మని పలికెను. దేవతలు భయగ్రస్తులై యెట్లో తమ యాయుధము లిమ్మని కోరిరి. దధీచి యవి జీర్ణములై యెముకలకు వ్యాపించిన వనియు నవసరమైనచోఁ దన్నుఁ జంపి తీసికొండనియు ననెను. దేవతలు నాతనిఁ జంపు శక్తిలేక చంప భయభ్రాంతులై దీనవదనులై యేడ్వఁ జొచ్చిరి. దధీచి వారి నూఱడించి "నేను మీకొఱకే జీవించుచున్నాను. ప్రస్తుతము మీ కాయుధము లవసరము లేదుకదా! మీ కత్యావశ్యక మైననాఁడు రండు. నా దేహము నేనే

విడిచివేయుదును. నా యస్థులే శతాధిక బలసంపన్నములగు మీ యాయుధము లగును. విచారము దక్కుఁడొం" డని పల్కెను. దేవత లాతని జగద్ధితమతికి మెచ్చి నమస్కరించి యానందముతో వెడలిపోయిరి.

## దధీచి దేవకార్యమునకై దేహము త్యజించుట

మఱియొకప్పుడు వృత్రాసురుఁడు నహాచ రాసురులతో విజృంభించి దేవతలకు మహాపద సంభవింపఁ జేసెను. ఆతని నెట్లును జయింపశక్తి లేక దేవత లందఱు బ్రహ్మకడ కేఁగి ప్రార్థించిరి. ఆతఁడును దనశక్తిహీనతఁ దెల్పి "ఇఁక మీరు దధీచిని బ్రార్థించి యాతనియస్థులు గైకొని వాని నాయుధములుగా నుపయోగించినచో మీ రీయసురులఁ జంపఁ గల్గుదురు. అంతకు మించి మార్గాంతరము లేదు. కనుక, పోయి యాతనిఁ బ్రార్థింపుఁ" డని వారిని బంపివేసెను. దేవతలు దధీచి వాగ్దానము జ్ఞప్తికిఁ దెచ్చుకొని యాతనికడ కేఁగి యాతనితోఁ దమ దుస్థితిని దెల్పుకొని సంరక్షింప వేఁడుకొనిరి.

దధీచి తనభౌతికదేహమును విసర్జించి దేవహితము చేయుట కంటె వలసినది లే దని నిశ్చయించుకొని "దేవతలారా! మీరు నన్ను వెంటనే చంపి నా యస్థులు కొనిపోవచ్చు" నని యాహ్వానించెను ఇంద్రాదులు భయకంపితులై "మహాత్మా! నిన్నుఁ జంపుశక్తి మాకడ లేదు. బ్రహ్మహత్యాదోషముమాట యటుండ నిమ్ము. నీకు స్వచ్ఛందమరణ మీశ్వరుఁ డనుగ్రహించియుండుట నొరు లెవ్వరు నిన్నుఁ జంపఁ జాల" రని పల్కిరి దధీచి "ఐనచో యోగాగ్నిఁ గల్పించుకొని నేను మరణింతును. మీ కర్తవ్యమును మీరు నిర్వర్తించుకొనుఁ" డని యోగాగ్నిఁ గల్పించుకొని పరబ్రహ్మను సంధానమున దేహముఁ ద్యజించి పరమశివునిలో నైక్యమయ్యెను. దేవతలు గోగణమును బ్రార్థించి వానిచేఁ బరిశుద్ధము చేయఁబడిన దధీచి యస్థులనే బ్రహ్మ చక్రము, వజ్రాయుధము మున్నగు నాయుధములు చేసికొని యసురులను నిర్జించిరి. *

* స్కాందపురాణము, బ్రహ్మపురాణము, శివపురాణము.

### దధీచికిఁ బిప్పలాదుఁ డుద్భవించిన విధము

దధీచి మహర్షి చనిపోవునపుడు కాతని భార్య సువర్చ గర్భవతియై యుండెను. భర్తమరణము వినఁగానే యా మహాసాధ్వి సహగమనమునకై చితి నెక్కెను. అంతలో బ్రహ్మాదులు ప్రత్యక్షమై "సాధ్వీ నీ గర్భమున మహాత్ముఁడగు బాలుఁడున్నాఁడు కావునఁ బ్రాణత్యాగము చేయకు" మని పల్కిరి సువర్చ "దేవతలారా! మీ వర్తనము చూడఁ జిత్రముగనున్నది. నా భర్తను జంపితిరి. సాధ్వినగు నాకు వైధవ్యదుఃఖము నిచ్చుట కిట్లు పన్నుచుంటిరా? నా భర్తను జంపిన దేవతలు పశువులై ప్రవర్తింతురు గాక" యని శపించి భర్త చితి నెక్కెను. అంతలో నామె గర్భమునుండి యొక బాలుఁడు జాఱి సమీపమునసున్న పిప్పలవృక్షము కడఁ బడెను. ఆమె చితిలో భస్మమైపోయెను

అట్లు జనించి పిప్పలవృక్షముక్రిందఁ బెరిఁగిన బాలుఁడే పిప్పలాద మహర్షి. పిప్పలవృక్ష మాతనిపై జాలిగొని చంద్రునర్థించి యమృతముఁ గొనివచ్చి యా బాలునికిఁ బోయఁగా నాతఁ డాఁకలి దప్పు లెఱుఁగక చక్కఁగాఁ బెరిఁగెను. ఆ కారణముననే యాతనికిఁ బిప్పలుఁ డను పేరు కలిగెను. ఈతఁడు పెరిఁగి పెద్దవాఁడై తన తండ్రి మరణమునకుఁ గారకులైన దేవతలఁ జంప నెంచి యీశ్వరుని గుఱించి తపస్సుచేసెను. ఆతఁడు ప్రత్యక్షమై దేవతలను జంప సమర్థముగు కృత్యను బంపెను. దేవతలు శివుని శరణు వేఁడఁగా శివుఁడును బిప్పలాదునిఁ బ్రార్థించి దేవతావధోద్యోగమును విరమింపఁజేసి యా పిప్పలాదునికిఁ బితృలోకమునఁ దలిదండ్రులను జూడఁ గలుగు వరమిచ్చి యదృశ్యుఁ డయ్యెను. పిప్పలాదుఁ డిట్లు దధీచి మహర్షికిఁ బుట్టి యారీతి మహర్షియై వెలుఁగొందెను. *

* స్కాందపురాణము. మాహేశ్వరఖండము. కేదారము.

# మహర్షుల చరిత్రలు

* * *

## దుర్వాసో మహర్షి *

### దుర్వాసుని జననప్రకారము

దుర్వాసుఁ డత్రిమహర్షి నిరుపమాన తపఃఫలము. త్రిమూర్తు లనసూయ కొసంగిన వరప్రసాదము. ఈతఁడు శివాంశ సంజాతుఁడు. హైహయుఁ డను రాజొకఁడు దుష్టుఁడై అనసూయకు గర్భనిరోధము కావించెను. ఇది యెఱింగి యా రాజును నిర్దగ్ధుం జేయఁ దలఁచి దుఃఖము, కోపముఁ దాల్చి గర్భావాసమున నేడుదినములుండి దుర్వాసుఁ డను నామమున రుద్రుఁడు తమోగుణోద్రిక్తుఁడై యవతరించెను. వెంటనే యాతని తేజోంశమున హైహయుఁడు భస్మమయ్యెను.

---

* దూర్వాసమహర్షి, దుర్వాసమహర్షి అను రూపములు వాడుకలోఁగలవు. కాని, అవి వ్యాకరణదుష్టములు. దుర్వాసో మహర్షి యన్నదే వ్యాకరణయుక్తము. † మార్కండేయపురాణము. కాని

సీ॥ ప్రబలదైత్యులు పురత్రయనాయకులు జగత్త్రియము నప్రతిమప్రతాపలీల
బాధింప దివిజులు ఫాలలోచనుఁగాంచి కావుము కృప దేవ దేవ మమ్ముఁ
జనుల మగువారిఁ జనపతివైన నీ వనుచు మహాక్రోశమాచరింప
నప్పురంబులు మూటినవ్వ మొక్కట భస్మముగాఁగఁజేసి యమ్మార్గణంబు

గీ॥ వంకమున విడ వది బాలుఁడైన నీతఁ
డెవ్వఁ డని చూచి వెఱఁ గంది యెల్ల సురలు
వినుతి సేయ బ్రాహ్మణమూర్తి వెలుఁగు నతని

నయనుఁడై వారి యాశీర్వచనము లంది యేకాకియై మహోగ్ర తప మొనరింపఁ జొచ్చెను. అతని బ్రహ్మచర్యదీక్షకును దపోనిరతికిని ముల్లోకము లచ్చెరువందెను. ఏ తత్ఫలితముగా నాతఁ డేలోకమునఁ గావలసిన నాలోకమునఁ దలఁచిన మాత్రముననే తిరుగఁ గల సామర్థ్యము సంపాదించెను. అతని దివ్యతేజముఁ గాంచి సురయక్ష కిన్నరాదులు జోహారు లొనర్చుచుండిరి. ఈరీతి ననంతశక్తిసంపన్నుఁడై దుర్వాసుఁడు నిజతపోగరిమఁ ద్రిలోకములఁ జరించుచుండెను. పిదప, నీతఁడు తలిదండ్రులను సర్వసంగములను విడిచి, "ఉన్మత్తము" అను మత్తవ్రత మవలంబించి తిరుగుచుండెను.

## దుర్వాసుఁ డింద్రుని శపించుట

ఒకనాఁడు దుర్వాసుఁడు విష్ణుమూర్తిని దర్శించి యాతని యాశీస్సుల నంది యాతఁ డాదరపూర్వకముగా నిచ్చిన పారిజాత ప్రసూనమును, మార్గమధ్యమున విద్యాధరకాంతలు సభక్తికముగా నిచ్చినపుష్పమాలికలును నిజహస్తమున నుంచుకొని తిరిగి వచ్చుచుండెను. దేవేంద్రుఁడైరావతము నెక్కి నందనోద్యానవిహారానంతరము తిరిగి వచ్చుచు నాతని కెదురయ్యెను. దుర్వాసో మహర్షిని గన్నంతనే యింద్రుఁడు పలుకరించి నమస్కార మొనరించెను. దుర్వాసుఁడు తనచేత నున్న పుష్పమాలికల నాతనికి బహుకరించెను. ఇంద్రుఁడు వానిని గైకొనియుఁ గొంతనిర్లక్ష్యముగా నైరావతము శిరముపై నా దండల నుంచెను. ఐరావతము తన తొండముతో నా మాలికలు లాగి చించి పాఱవైచెను. దుర్వాసుఁడది చూచి యింద్రు నుద్దేశించి "ఓరీ! దుర్మదాంధా! పరమపవిత్రమును విష్ణుప్రసాదము నగు మాలికను నీకు బహూకరింప నింతనిర్లక్ష్యముతోఁ గైకొందువా? మదోన్మత్తుఁడవై యొడ లెఱుంగని నిన్నారక

పోనిత్తునా! నీ యైశ్వర్య మంతయు గంగపా లగుఁ గాక! నీ యైరావతము శిరము ఖండింపఁబడుఁ గాక!" యని శపించెను. దేవేంద్రుఁడు వెంటనే దుర్వాసుని పాదములఁ బడి కరుణింప వేఁడుకొనెను. దుర్వాసుఁడు కరుణించి శ్రీహరిని బూజించినచోఁ దిరిగి స్వసంపద నందఁగలవని పలికి వెడలిపోయెను. ఈ శాపమూలముననే యమృతాదు లెల్ల సముద్రము పాలాయెను; ఐరావతము శిరము నఱుకఁబడి వినాయకుని కతుకఁబడెను.*

* అని విష్ణుపురాణము.

తన్నుఁ గురించి ఘోరతపము చేయు సుప్రతీకుఁ డను రాజు ననుగ్రహింపఁ దలఁచి దుర్వాసుఁడు విచ్చేయుచుండఁగా దారిలో నాతని వనవిహారము చేయుచు నైరావతము నెక్కి తిరుగు నింద్రుఁడు కానవచ్చెను. తన్నుఁ జూచి గౌరవింపక, వాహనమైన దిగక గర్వియై యున్న యింద్రుని జూచి మండిపడి దుర్వాసుఁడు:

"అనుకంప లేక బ్రాహ్మణుని వమ్మించు గొం
తుక గోసిపోయిన దోసకారి
గౌతమఋషి కులాంగన నహల్యాదేవిఁ
జీకటితప్పు చేసిన దురాత్మ
పరసతి బిడ్డని హరికోప హుతవహా
ర్చులలోనఁ ద్రోచిన క్రూరకర్మ
సగర క్షమాపాల సప్తతంతు విముక్త
హరి మ్రుచ్చిలించిన పరమ ధూర్త

....దేవరాజ్యాధి పత్య
మునకుఁ బెడబాసి భువిఁగూలు మని శపించె"

అని వరాహపురాణమునఁ గలదు.

### దుర్వాసుఁడు ధర్ముని శపించుట

తొల్లి దుర్వాసుఁడు సోదరుఁ డగు దత్తాత్రేయునితోఁ గలిసి ధర్మదేవతయొక్క నిజరూపమును జూడఁ దలఁపు కలిగి పెక్కు సంవత్సరములు మహాతపము చేసెను. నిరాహారులై పంచాగ్ని మధ్యముననను, జలమధ్యముననను నిలిచి వారు ఘోరతపము చేసినను, ధర్మ దేవత ప్రత్యక్షము కాఁడయ్యెను. తుదకు విసిగి వేసారి దుర్వాసుఁడు తనకుఁ బ్రత్యక్షముకాని ధర్మునిపై మిగులఁ గోపించి శపింప నుద్యుక్తుఁ డయ్యెను. అంత ధర్మ దేవత బ్రాహ్మణరూపమును ధరించి సపరివారముగా విచ్చేసి యా మహర్షి సత్తముల యెదుట నిలఁబడెను. దుర్వాసుఁ డాతనివంకే చూడక శాపాక్షరములు విడువఁ దలఁచుచుండెను. "ఓయీ! తపస్వులకుఁ గోపము పనికి వచ్చునా? క్రోధాంధులకుఁ దపఃఫలము దక్కగున గదా!" అని ధర్మువు దుర్వాసునితో ననెను. దుర్వాసుఁడు కోపముతో "ఓరీ! ముందు నీ వెవఁడవో చెప్పుము. నీతో వచ్చిన యీ పరివార మెవరో తెల్పుము. పిదప, నాకుఁ గ్రోధము తగునో తగదో నేనే చెప్పెదను" అని పల్కెను. అంత నావిప్రుఁడు "మునీంద్రా! బ్రహ్మచర్యము, సత్యము, తపము, దానము, దమము, నియతి, శౌచము, క్షమ, శాంతి, ప్రజ్ఞ, అహింస, శ్రద్ధ, మేధ దయ అను గుణముల పుంస్త్రీరూపములు వీరు. వీరు నా పరివారము నేను ధర్మదేవుఁడను. నీ కోపముఁ జూప వచ్చితి" మని చెప్పెను. దుర్వాసుఁడు శాంతింపక "ఓయీ! పదివేలేండ్లు కడచిన పిదప నిప్పుడు నీకంటికి మేము కనఁబడితిమా! ఇప్పుడైనను, నా శాపమునకు నీవు భయపడి వచ్చితివి కాని, నీ యోగ్యతచేఁ గాదు. బ్రాహ్మణక్రోధ మమోఘము. నిన్ను శపింపక మానను. నీవు సుఖ మెఱుఁగని రాజువుగను, దాసీపుత్త్రుఁడవు గను, చండాలుఁడవుగను జన్మింపు" మని మూఁడు శాపము లిచ్చెను.

ధర్మువు చేయునది లేక ఋషిశాప మంది పిదఁ దనయొక యంశమున యుధిష్ఠిరుఁడుగను మఱియొక యంశమున విదురుఁడుగను,

వేటంశమున హరిశ్చంద్రమహారాజు సేవింపించిన వీరబాహుఁడను చండాలుఁడుగను జన్మించెను. ఆహో! ఎంతటివారికిని గర్మఫల మనుభవింపక తప్పదు గదా!*

## దుర్వాసుఁడు సుప్రతీకు ననుగ్రహించుట

కృతయుగమున సుప్రతీకుఁ డను మహారాజు శుభలక్షణవతు లగు సతు లెందఱనో చెట్టవట్టియు నొక్కపట్టిఁ బడయఁ జాలఁడయ్యెను. తుద కాతఁడు కుమారు నపేక్షించి దుర్వాసో మహర్షిఁ గూర్చి తపము చేయఁగా నాతఁడు విచ్చేసి "నీకు విద్యుత్ప్రభ యను భార్యయందు సుతుఁ డుదయించు" నని వరమిచ్చి వెడలిపోయెను.

పిదప దుర్వాసుని వరము కతమున సుప్రతీకునకు విద్యుత్ప్రభ యందు దుర్జయుఁడను కుమారుఁడు జన్మించెను. అతనికి జాతకర్మాదులు దుర్వాసుఁడే యొనరించెను. పిదప, నాతనికి సర్వశాస్త్రములు నాతఁడే నేర్పెను. దుర్వాసుఁడు పనిబూని యొకయిష్టివేల్చి యా బాలుని వెంటనే పదునాఱుసత్సరముల వానిఁ జేసెను. సుప్రతీకుఁడు దుర్వాసుని కెంతయో భక్తిచూప నాతఁడు మెచ్చి సుప్రతీకునికిఁ గాంతిమతి యను నిల్లాలియందింకొకపుత్త్రుఁడు కలుగ వరమిచ్చెను. సుద్యుమ్నుఁ డను కుమారుఁడామెకుఁ గలిగెను. ఇట్లు దుర్వాసుఁడు సుప్రతీకు ననుగ్రహించెను. †

## దుర్వాసుఁడు తిలోత్తమాసాహసికుల శపించుట

దుర్వాసో మహర్షి గంధమాదనపర్వతముపైఁ దపస్సు చేసుకొనుచు నుండెను, ఆ సమయమున బలిచక్రవర్తి కుమారుఁడైన సాహసికుఁడు నప్సరోంగన యగు తిలోత్తమయుఁ బరస్పర వివశులై

* పద్మపురాణము — భూమిఖండము.

కాఁజొచ్చెను. వీనివలనఁ దనకు వ్రతభంగము గలుగ దుర్వాసుఁడు మితిమేరలు సమయాసమయములు నెఱుఁగ వలదా యని వారిని మందలించి రాక్షసులై భువి జన్మింపుఁ డని శపించెను. వారు నంత నొడలెఱిఁగి యాసంయమికి నమస్కరించి ప్రార్థింపఁగా శ్రీకృష్ణునిచేఁ జచ్చిన పిదప నాతనికిని, కృష్ణుని కుమారుని తోడిజీవనమున నామెకును శాపవిమోచన మగు నని పల్కెను. సాహసికుఁ డందులకే గార్ధభాసురుఁ డయ్యెను. తిలోత్తమ బాణుని గృహమున నుషయై జన్మించెను. *

### దుర్వాసుఁడు వపువను నచ్చరను శపించుట

తొల్లి యింద్రుఁడు నందనోద్యానమున నప్సరసల గానము లాలించువేళ నచటికి నారదుఁడు విచ్చేసెను. అతని ననేకవిధములఁ బూజించి యింద్రుఁడు "మునీంద్రా! ఈ యచ్చరలలో నెవతె యెక్కువయో సెలవిం" డని కోరెను. నారదుఁడు "మంచుకొండ మీఁదఁ దపముచేయు దుర్వాసు నెవతె చలింపఁజేయునో యామె యెక్కువ" దని పలికెను. తా మందులకుఁ జాల మని యప్సరస లెల్లరు తలలు వాలించిరి. కాని వపు వను నచ్చర గర్వముతో "మునిరాజా! నేను దుర్వాసుని వెంటఁ గొనివచ్చెద. అతఁడే యేల? నేను దలఁచు కొన్నచో రుద్రుడైనను గామునింటికి ఘటదాసుని జేయుదు" నని చెప్పి దుర్వాసునికడ కరిగెను.

తపస్సున నున్న దుర్వాసుఁ డామె యటఁ బ్రదర్శించిన హావభావవిలాసములకుఁ గనలి పక్షివై పుట్టు మని శపించెను. కడ కాతఁడు కరుణాళువై యామెకు శాపమోక్షము ననుగ్రహించెను. †

---

* బ్రహ్మపురాణము. † మార్కండేయ పురాణము.

## దుర్వాసుని వివాహము

తిలోత్తమాసాహసికుల రతిక్రీడఁ గాంచిన దుర్వాసునకు సంసార వాంఛ జనింపఁగా నౌర్వ మహర్షి కొమార్తెయగు కందళి నాతఁడు వివాహమాడ నెంచెను. ఔర్వుఁ డామె కోపిష్ఠిని యనియు నవివేకిని యనియుఁ జెప్పి యందుల కామెను మన్నింపు మనెను. దుర్వాసుఁ డంగీకరించి కందళిని వివాహమై యుచితభోగముల నందెను. కాని, తుద కామె గయ్యాళియై యాతని బాధింపఁ జొచ్చెను.

## దుర్వాసుఁడు భార్యను భస్మము చేయుట

ఎంతకాలమైనను దనగుణము మార్చుకొనలేని కందళితో విసిగి వేసారి యొకనాఁ డామెయందు నిర్మముఁడై దుర్వాసుఁడు తీక్ష్ణముగాఁ జూచెను. వెంటనే యామె భస్మమైపోయి యొకసుందరి రూపమున నాకసమునఁ గానవై తన దోషమును క్షమింపుమని కోరి యదృశ్యమయ్యెను. దుర్వాసుఁడు తనయంతటివాని వివాహ మాడిన కారణమున నామె నామము భువిపై శాశ్వతముగ నుండు నట్లు చేయఁ గదళీ జాతిని సృష్టించి యామె నామమును జిరస్థాయి నొనర్చెను.*

## ఔర్వుఁడు దుర్వాసుని శపించుట

కొంతకాలమునకుఁ గూఁతునల్లునిఁ జూడఁ దలంపు గలిగి యౌర్వమహర్షి దుర్వాసునాశ్రమమునకు వచ్చి తనూజం గానక దివ్యదృష్టి నామెకు జరిగినగతిఁ దెలిసికొని దుర్వాసునిం జూచి "ఓరీ! నాకొమార్తె యవివేకిని యని చెప్పి మన్నింపుమని ముందే కోరితిని. దానికి నీ వొడంబడి వివాహమై యామెను భస్మముచేసి నన్నవమానించితివి. ఈ కారణముచే నీవు నంబరీషుఁ డను రాజన్యునివలన

* బ్రహ్మవైవర్తపురాణము.

ఘోరావమానమునకుఁ బాత్రుఁడవై ఖేదము ననుభవింతువుగాక" అని దుర్వాసుని శపించి వెడలిపోయెను. దుర్వాసుఁడు చేయునది లేక కానున్నది కాక మానదని తపదారిం బోయెను. *

### దుర్వాసుఁ డంబరీషునికడఁ బరిభవింపఁ బడుట

కొంతకాలమునకు దుర్వాసుఁడు సంచారము చేయుచు నాభాగుని కుమారుఁడగు నంబరీషునింట కేఁగి యాతిథ్యము గోరెను. భక్తవరిష్ఠుఁడగు నంబరీషుఁడు మహాప్రసాద మని యాతని శిష్య సమేతముగా స్నానముచేసి రమ్మని కోరెను. దుర్వాసుఁడు శిష్యులతో నదీస్నానమున కేఁగి యెంతకును దిరిగి రాకుండుటచే ద్వాదశీ వ్రత నిష్ఠుఁడగు నంబరీషుఁడు బ్రాహ్మణానుమతి నుదకపానముచేసి యుండెను. అంత దుర్వాసుఁడు సశిష్యుఁడై వచ్చి తాను రాకుండ నుదకపానము చేసిన యంబరీషుని శిక్షింపఁ దనజటలనుండి యొక కృత్యను మంత్రించి పంపెను. భక్తబాంధవుఁడగు విష్ణు నంబరీషుని గాపాడఁ దనచక్రము నంపెను. ఆ చక్ర మాకృత్యను రూపు మాపి దుర్వాసుని మీఁదకు రాఁగాఁ నాతఁడు పాఱిపోయి శివుని శరణుచొచ్చెను. ఆతఁడు తా నేమియుఁ జేయఁజాల ననెను. దుర్వాసుఁడు విష్ణుమూర్తికడ కేఁగి శరణు వేఁడ నాతఁ డంబరీషునే శరణు గోరుమని సూచింప దుర్వాసుఁడు పరుగున వచ్చి యంబరీషుని శరణువేఁడ నాతఁడు విష్ణుచక్రమును బ్రార్థింప నది యదృశ్య మయ్యెను. దుర్వాసుఁ డౌర్వుని శాపమూలమున నీ ఖేదము గల్గినదని చెప్పి యంబరీషు నభినందించి వెడలిపోయెను. *

### దుర్వాసుఁడు శబరతాపసుని బరీక్షించి వరము లొసంగుట

తొల్లి యొక శబరతాపసుఁ డడవిలో మహాతపము చేయుచుండ దుర్వాసుఁ డచటి కేతెంచెను. ఆ భిల్లుఁ డాతని నెంతయుఁ

* బ్రహ్మవైవర్తపురాణము, † భాగవతము.

పూజించి తన కతిథి వమ్మని కోరెను. దుర్వాసుఁ డాతనిఁ బరీక్షింపఁ దలఁచి వల్లెయనెను. ఆభిల్లుని చిత్తశుద్ధికి మెచ్చి యాకాశవాణి యొకమణి నంపెను. దానివలన నెందఱో యువతు లుద్భవించి పంచభక్ష్యపరమాన్నములు సిద్ధముచేసిరి. శబరుఁడు దుర్వాసుని నారగింప రమ్మని కోరెను. కాని, యాతఁడు తనకు జలములు కావలయు ననెను. శబరతాపసుఁడు దేవికానదిని బ్రార్థించి యామె దుర్వాసునికడకు వచ్చి ప్రవహించునట్లుచేసెను. దుర్వాసుఁ డానందించి యాయేటమునిఁగి వచ్చి యాతని విందారగించి దయామయుఁడై "ఓయీ! నీవు గురూపదేశమార్గమున సత్యం బవలంబించి తపంబు చేసితివి. ఇఁకనుండి నీవు సత్యతపుఁ డను పేరఁ బరగుము. వేదశాస్త్ర పురాణాది వైశారద్యము నీకుఁ గలుగుఁగాక" యని వరమిచ్చెను.

అనంతరము దుర్వాసుఁ డాతని కిట్లుపదేశించెను. "ఓయీ! సుజ్ఞానమునఁగాని సత్కర్మము జరుగదు. సత్కర్మమునఁగాని విజ్ఞానము పొడమదు. ఆలోచింపఁగా నీ రెండును ఒకదాని కొకటి సాధనములు సత్కర్మములు జాతులఁబట్టి నాలుగువిధము లయ్యెను. కులధర్మము తప్పక బ్రహ్మోపాసకులైనవారు మోక్షమందుదురు. బ్రహ్మ మనఁగా భక్తరక్షాపరాయణుఁ డగు నారాయణుఁడు. అతఁడు యజ్ఞాది వైదిక క్రియలకు సులభుఁడు."

ఆమాటలు విని "మహాత్మా! యజ్ఞాదికృత్యములు ధనసామగ్రి లేక నడపలేము. ధన మున్నను లోభమున సంసారు లాకార్యము లొనరింపరు. కావున, అల్పప్రయాస మాత్రమున సకలవర్ణముల వారికి మోక్షము గలుగు నుపాయముఁ జెప్పు" మని యాశబరుఁడు దుర్వాసుని గోరెను. అందు కాతఁడు మహోత్తమఫలప్రదము లగు వ్రతముల నెన్నిటినో తెలిపి యవి యాచరించినచో నిహపర సౌఖ్యములు కలుగు నని యుపదేశించి యాతని నాశీర్వదించి వెడలి పోయెను. అవి చేయుచు సత్యతపుఁడు తరించెను.*

* వరాహపురాణము.

## దుర్వాసుఁడు ముద్గలున కతిథియగుట

తొల్లి ముద్గలమహర్షి యుంఛవృత్తి నవలంబించి మహోత్తమ తప మొనరించుచుండఁగా నాతని చిత్తశుద్ధిఁ బరీక్షించి యాతనికి మహోపకృతిఁ గావింపఁ దలఁచి దుర్వాసుఁ డాతని యింటి కతిథిగా నేఁగెను. పక్షోపవాసములు చేయు ముద్గలుఁడు సకుటుంబముగా నాతనిని గౌరవించి తాము తినుట మాని యామునివరుని కన్నము పెట్టి గౌరవించెను. దుర్వాసుఁ డంతయన్నముఁ దిని మిగిన దాని నొంటినిండఁ బాముకొని పోవువాఁడు. ఇట్లెన్నిమారులు వచ్చి చేసినను ముద్గలుఁడు కొంచెమైనఁ గోపింపక యామహర్షికి మహాసేవ చేసెను.

తుదకు దుర్వాసుఁడు ముద్గలుని మిక్కిలి స్తుతించి యాతనికి సశరీరస్వర్గసుఖము సమకూరు వర మొసంగి పోయెను. కాని, ముద్గలుఁడు స్వర్గమును దృణీకరించి బ్రహ్మర్షియై మోక్షమందెను.*

## దుర్వాసోమహర్షి కుంతీదేవికి వర మొసఁగుట

దుర్వాసోమహర్షి యొకసారి కుంతిభోజునియింటి కేఁగ నాతఁ డత్యంతభక్తి పూర్వకముగా నాతనికి సపర్య లొనర్పఁ గన్యయగు తనకొమార్తెఁ గుంతిని నియమించెను. కుంతియు నేమఱపాటు లేక దుర్వాసుని హృదయము కరఁగున ట్లాతనికిఁ బరిచర్య లొనర్చెను. దుర్వాసుఁడు కుంతిభోజు నాశీర్వదించి కుంతీదేవికి వర మనుగ్రహింతుఁ గోరుకొను మనఁగా నామె తన కొక మంత్ర ముపదేశింపు మనియు నామంత్రశక్తిచే నేదేవు నుపాసించిన నాదేవుని వలనఁ దన కొక పుత్త్రుఁడు గలుగవలె ననియుఁ గోరుకొనెను. దుర్వాసుఁ డట్లే యని యామె కొక మంత్ర ముపదేశించి వెడలిపోయెను. ఈ మంత్ర ప్రభావముననే కుంతికి సూర్యుఁడు ప్రత్యక్షమై కర్ణునొసఁగెను.†

---

* భారతము — అరణ్యపర్వము. † భారతము — ఆదిపర్వము.

## దుర్వాసుఁడు యోగమాయను వివాహమగుట

దుర్వాసోమహర్షి యొకనాఁడు పదునాఱువేలగోపికలను, అష్టమహిషీమణులను వివాహమైన శ్రీకృష్ణునిఁ జూడ మనసుగలిగి ద్వారకకుఁ బయనమై పోయెను. ద్వారకానగరము నా మహర్షి సమీపించుసరికి శ్రీకృష్ణుఁ డుగ్రసేన వసుదేవాదులతో నాతని కెదురువచ్చి యర్ఘ్యపాద్యాదుల నొసంగి సభక్తికముగా నాతనిఁ దన యింటికిఁ దోడ్కొని పోయెను. అచ్చట నవయౌవనయై హావభావ విలాసములతో నతిసుందరాంగియైన యోగమాయ నాతని సేవకు శ్రీకృష్ణుఁడు నియోగించెను. దుర్వాసుఁ డామె పరిచర్యలకు మెచ్చి వరము కోరుకొనుమనెను. శ్రీకృష్ణుఁ డంత నుగ్రసేనాదులఁ బిలిచి దుర్వాసోమహర్షి శివునంశమునను యోగమాయ పార్వతి యంశమునను జనించినవారగుట నుభయులు వివాహమగుట తన యభీప్సితమని వాక్రుచ్చెను. దుర్వాసుఁ డంగీకరించెను. అంత దివ్య వైభవోపేతముగా యోగమాయా దుర్వాసులకు వివాహమైనంతనే శ్రీకృష్ణుఁడు వినయవినమితుఁడై యా మహర్షిని గొంతకాలము తననగరముననే యుండఁ బ్రార్థించెను. దుర్వాసుఁ డట్లే యని భార్యతో నటనే నివసించుచుండెను.

ఒకనాఁడు దుర్వాసుఁడు శ్రీకృష్ణుని మాహాత్మ్య మెఱుంగఁగోరి రాత్రివేళ వరుసఁగా అష్టమహిషుల గృహములకుఁ బదునాఱువేల గోపికలయిండ్లకు వెళ్ళి చూచెను. అతని కన్ని చోట్లను శ్రీకృష్ణుఁడు భార్యాసహితుఁడై కానవచ్చెను. ఇది చూచి దుర్వాసుఁ డాశ్చర్య మంది యాతని ననేకవిధముల స్తుతించి యానందించెను. *

## దుర్వాసునికిఁ బార్వతి శ్రీకృష్ణునిగుఱించి తెల్పుట

ఇట్లు ద్వారకానగరమున యథేచ్ఛముగా విహరించుచు దుర్వాసోమహర్షి భూతలమునఁ గాలము వ్యర్థపుచ్చుటకంటెఁ

* భారతము — బ్రహ్మవైవర్తపురాణము.

కైలాసమున కేఁగి పార్వతీపరమేశ్వరులపాదసేవ చేయుటే పరమ కర్తవ్య మని యెంచి భార్యతోఁగాని శ్రీకృష్ణునితోఁగాని చెప్పక యే కైలాసమున కేఁగి పార్వతీపరమేశ్వరుల పాదములపై వ్రాలెను. శివుఁ డాతనిఁ గౌఁగిలించుకొని యాశీర్వదించెను. పార్వతియు దీవించి విశేషము లడిగెను. దుర్వాసుఁడు "అమ్మా! భూలోక జీవనమునఁ బ్రాణము విసిగినది. ఇఁక మీకడనే యుండి మీపవిత్ర పాదారవిందముల భక్తితోఁ గొల్చుచు నుండ నిశ్చయించుకొని వచ్చితి" ననెను. శివుఁ డానందించి పార్వతి వదనారవిందముఁ దిలకించెను. పార్వతి "పుత్త్రా! నీవు మాకడ నుండిపోవుట మా కానందప్రదమే. కాని, నాయంశమునఁ బుట్టినయోగమాయను వివాహమైతివికదా! ఆమె నచట విడిచి వచ్చితివి. ఆమె యందులకెంతయు ఖిన్నయై నీకై పలవించుచున్నది. అగ్నిసాక్షిగ వివాహమైనభార్య నకారణముగా నట్లు విడువఁ దగునా? ఆమె మహా పతివ్రత. ఆమె వలన నీకు సత్సంతానము కలుగును. మఱియు, శ్రీకృష్ణుఁడు మానవమాత్రుఁడు కాఁడు. గోలోకవాని యగు పరబ్రహ్మమే యాతఁడు. ఆయనపాదపద్మములు కొల్చుట మా సేవచేయుటకన్నఁ గోటిమడుంగు లధికము. కావున, నీ వట కేఁగి వలయునపుడు వచ్చిపోవుచుండు" మని బోధించెను. దుర్వాసుఁ డామెమాట లాలించి యా జగన్మాతాపితలకు వందనము లొనర్చి తిరిగి ద్వారకకుఁ బోయి సుఖముండెను.*

### దుర్వాసుఁడు శ్రీకృష్ణుని యాదవులను శపించుట

దుర్వాసోమహర్షి యొకనాఁడు కృష్ణునిఁ బరీక్షింప వేఁగ సత్యభామగృహమున నున్న శ్రీకృష్ణుఁడు సభార్యాసహితుఁడై దుర్వాసు నెంతయుఁ బూజించెను. దుర్వాసుఁ డాతని శాంతమరయుటకై యొకరథ మెక్కి దానికి సభార్యామాధవుల రథ్యములఁ గండనెను. వా రుభయులు వెంటనే యామహర్షి యాజ్ఞ శిరసావహించి యాతఁ

* శివపురాణము.

వారికి వరము లొసఁగి వెడలిపోయెను.

మఱియొకపర్యాయము దుర్వాసుఁడు చీరవసనుఁడు, బిల్వదండుఁడు, దీర్ఘశ్మశ్రుఁడు, కృశశరీరుఁడునై రుక్మిణీ సహితుఁడైన శ్రీకృష్ణునికడ కేఁగి యాతిథ్యము కోరెను. శ్రీకృష్ణుఁ డధికభక్తి నాతనికి నమస్కరించి యుచిత శయ్యావాసముల నేర్పఱిచి షడ్రసోపేతముగా విందు చేయుచుండెను. ఆతఁ డొకనాఁడు బహుసహస్రసంఖ్యాకులు తినఁగలుగుపదార్థముల భుజించును. మఱియొకనాఁడు స్వల్పముగనే కైకొనువాఁడు. ఒకప్పు డుపవాసమే చేయుచుండెను. ఇట్లుండి యొకదినమున దుర్వాసుఁడు నిజశయ్యాస్తరణములను సమస్తహార్మ్యములను భస్మపటల మొనర్చి రుక్మిణీకృష్ణులకడ కరుదెంచి తనకు వెంటనే పాయసము వండి పెట్టవలయు నని కోరెను. అట్లే యని రుక్మిణి సిద్ధము చేసెను. ఆ పాయసమును దుర్వాసుఁడు రుక్మిణిదేహమునకుఁ బూసెను. శ్రీకృష్ణుఁ డతి శాంతముతో నుండెను. తుదకు దుర్వాసుఁ డాపాయసమును దనకుఁ బూయు మనెను. శ్రీకృష్ణుఁ డాతని దేహ మెల్లెడలఁ బూసి యాతని పాదములకుఁ బూయ మఱచెను. దుర్వాసుఁ డంత సమయము దొరికిన దని యఱకాళ్లనుండియే కృష్ణునకుఁ బ్రాణభయము కల్గు నని శపించెను.

పిమ్మట దుర్వాసుఁడు రుక్మిణీకృష్ణుల క్షమావిశేషమును బ్రశంసించి శ్రీకృష్ణుఁడు పరమశుభములు చేకొని సర్వలోకప్రియుఁ డగుటకును రుక్మిణీదేవి జరాజాడ్య వివర్జితయై యుత్తమపతివ్రతాతిలక మగుటకును వరము లిచ్చి తత్క్షణమే యంతర్ధాన మందెను. *

---

* ఇది విష్ణుపురాణము, భాగవతమునందుఁ గలదు. కృష్ణునిఁజూడ వచ్చుచున్న కణ్వ నారద విశ్వామిత్రులు యాదవుల శపించినట్లు భారతము మౌసలపర్వమునఁ గలదు. యమునాతటమున దపముచేయు కణ్వమహర్షి కడకు స్త్రీ వేషమువేసి సాంబుని దీసికొని పోయి యేబిడ్డ పుట్టునని యడుగఁ గణ్వుఁడే శపించె నని పద్మపురాణమునఁ గలదు.

భూభారము తగ్గించుటకు యాదవవంశవినాశన మెట్లొనర్చుట యని శ్రీకృష్ణుఁ డొకపరిఁ దలపోయుచు దుర్వాసోమహర్షిని స్మరించెను. త్రికాలజ్ఞుఁడగు దుర్వాసుఁ డది యెఱింగి ద్వారకకు వచ్చి వాకిట నుండ, దైవకృతమున యాదవకుమారులు సాంబుఁ డను వానికి స్త్రీ వేషము వేసి దుర్వాసునకు మ్రొక్కించి "సంయమీంద్రా! ఈమెకుఁ బుత్త్రుఁడెపుడు గల్గు" నని పరిహసించిరి. దుర్వాసుఁ డది గ్రహించి శ్రీకృష్ణుని సంకల్ప మిదేయను గదా యని "మూర్ఖులారా! ఈమెకు లోహరూప ముసల ముదయించి సపుత్త్ర బాంధవముగా యాదవ వంశము నిర్మూలించును. బ్రహ్మాదులు నిది తప్పింపలే" రని శపించి కృతకృత్యుఁడై యరిగెను. దాననే యాదవు లెల్ల రంతరించిరి.

### దుర్వాసుఁడు పాండవుల కతిథి యగుట

ఒకమాఱు దుర్యోధనుఁడు పాండవుల నవమానింపఁ గోరి దుర్వాసునిఁ బ్రసన్నుఁ జేసుకొని యాతనిని సశిష్యుఁడై పాండవులకడ కేఁగు మని ప్రార్థించెను. దుర్వాసుఁ డట్లే యని శిష్యసమేతుఁడై ద్వైతవనమునఁ గల పాండవులకడ కేఁగ ధర్మరాజాదు లమితభక్తి శ్రద్ధలతో నాతని సేవించిరి. దుర్వాసుఁడును సశిష్యుఁడై భోజనమునకు వత్తు ననెను. ధర్మరా జంగీకరింప నాతఁడు శిష్యులతో నదీస్నానమున కేఁగెను. ద్రౌపదీప్రార్థన నింతలో శ్రీకృష్ణుఁడు పాండవులఁజూడ వచ్చి క్షుధాభరము నటించి ద్రౌపదిచే భోజన పాత్రముఁ దెప్పించి దానికంఠమున లగ్న మగు నొక మెతుకునుదిని పాండవుల కభయ మిచ్చెను. శ్రీకృష్ణప్రభావమున స్నాతులగు దుర్వాసునకు శిష్యులకు నాఁకలిదప్పులు లేకుండఁబోయెను. దుర్వాసుఁడు సమస్తవిషయ మును యోగదృష్టి నెఱింగి దుర్యోధనుని కుటిలాభిప్రాయము గ్రహించి యాతఁడు బంధుమిత్రాదులతోఁ బాండవులచే నోడిపోయి మడియ నుండుటఁగని శిష్యులతో వెడలిపోయెను. *

### దుర్వాసుఁడు లక్ష్మణుని మరణమునకుఁ గారకుఁడగుట

దుర్వాసస్సంయమీంద్రుఁ డొకప్పు డతిక్షుధాతురుఁడై శ్రీరాముని చే నాతిథ్య మందు నుద్దేశముతో నయోధ్యకువచ్చెను. ఆ సమయమున శ్రీరాముఁడు బ్రాహ్మణరూపుఁ డగు యమునితో రహస్యముఁగ మాటలాడుచు నెవ్వరిని లోనికి రానీయవల దనియుఁ దాను రావల దనియు లక్ష్మణుని నియమించెను. కాని, దుర్వాసుఁడు వచ్చి లోనికిఁ బోఁబోఁగా లక్ష్మణుఁడు నివారింప నాతఁడు వంశనాశనముగా శపింతుననెను. లక్ష్మణుఁడు భయపడి శ్రీరాముని కడ కేఁగి విన్నవించెను. శ్రీరాముఁడు తనయాన దాఁటిన లక్ష్మణుని నగరము వెడలనడప నాతఁ డన్నయనుమతిఁ గొని సరయూనదిఁ గ్రుంకి యవతారమును జాలించెను. ఇట్లు దుర్వాసుఁ డిందులకుఁ గారకుఁ డయ్యెను.*

### దుర్వాసుని యాధిక్యము

పరమేశ్వరాంశాసంభూతుఁ డగు దుర్వాసోమహర్షి యనేకు లగు శిష్యప్రశిష్యులఁ జేరఁదీసి వారి కెల్లరకు విమల విద్యారహస్యముల నామూలాగ్రముగా నెఱింగించెను. త్రిలోక పూజ్యుఁడై లోక క్షేమంకరుఁ డైన యనసూయాగర్భశుక్తి ముక్తాఫలము సత్రితపస్సారము నగు దుర్వాసోమహర్షి మహర్షులలో నప్రతిమానుఁడు.

### దుర్వాసుఁడు చెప్పిన రుద్రకవచము పరమశుభప్రదము

### రు ద్ర క వ చ ము

"ప్రణమ్య శిరసా దేవం స్వయంభుం పరమేశ్వరం
ఏకం సర్వగతం దేవం సర్వదేవమయం విభుమ్.
రుద్రవర్మ ప్రవక్ష్యామి అంగప్రాణస్య రక్షణే
అహోరాత్ర మయం దేవం రక్షార్థం నిర్మితం పురా

* ఉత్తరరామాయణము.

రుద్రో మే చాగ్రతః పాతు పాతు పార్శ్వౌ హరస్తథా।
శిరో మే ఈశ్వరః పాతు లలాటం నీలలోహితః॥
నేత్రయో త్ర్యంబకః పాతు ముఖం పాతు మహేశ్వరః।
కర్ణయోః పాతు మే శంభుః నాసికాయాం సదాశివః॥
వాగీశః పాతు మే జిహ్వాం ఓష్ఠౌ పాత్వంబికాపతిః।
శ్రీకంఠః పాతు మే గ్రీవాం బాహూచ్చైవ పినాకధృత్॥
హృదయం మే మహాదేవ ఈశ్వరోవ్యాత్స్తనాంతరమ్।
నాభిం కటిం చ వక్షశ్చ పాతు శర్వ ఉమాపతిః॥
బాహుమధ్యాంతరం చైవ సూక్ష్మరూపస్సదాశివః।
సర్వం రక్షతు మే శర్వో గాత్రాణి చ యథాక్రమమ్॥
వజ్రం చ శక్తిదం చైవ పాశాంకుశధరం తథా।
గండశూలధరాన్నిత్యం రక్షతు త్రిదశేశ్వరః॥
ప్రస్థానేషు పదేచైవ వృక్షమూలే నదీతటే।
సంధ్యాయాం రాజభవనే విరూపాక్షస్తు పాతు మామ్॥
శీతోష్ణాదథకాలేషు తు హిమద్రుమకంటకే।
నిర్మనుష్యే స మే మార్గే త్రాహిమాం వృషభధ్వజ॥
ఇత్యేత ద్రుద్రకవచం పవిత్రం పాపనాశనమ్।
మహాదేవప్రసాదేన దుర్వాసోముని కల్పితమ్॥
త్రాహి త్రాహి మహాదేవ త్రాహి త్రాహి త్రయీమయ।
త్రాహి మాం పార్వతీనాథ త్రాహి మాం త్రిపురాంతక॥
పాశం ఖట్వాంగదివ్యాస్త్రం త్రిశూలం రుద్రమేవ చ।
నమస్కరోమి దేవేశ త్రాహి మాం జగదీశ్వర॥
శత్రుమధ్యే సభామధ్యే గ్రామమధ్యే గృహాంతరే।
గమనే గమనే చైవ త్రాహి మాం భక్తవత్సల. * ॥"

* స్కాందపురాణము.

## తుది పాట

"కోమలపల్లవనిభవా
సోమునిఁ బరిపీతవసనసోముని సుషమా
సోమునిఁ బోలిన దుర్వా
సోముని నుతియింపఁ దరమె సోమునికైనన్."

[దత్తావతారచరిత్ర, ౧ అ, ౯]

## సంపూర్ణము

శ్రీ శ్రీ శ్రీ

శ్రీకృష్ణార్పణమస్తు.

# మహర్షుల చరిత్రలు

## రెండవభాగము

విద్వాన్ బులుసు వేంకటేశ్వర్లు, ఎం.ఏ.,

ప్రచురణ:
కార్యనిర్వహణాధికారి
తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

# మహర్షుల చరిత్రలు

## రెండవభాగము

విద్వాన్ బులుసు వేంకటేశ్వర్లు, ఎం.ఏ.,

ప్రచురణ :
శ్రీ సి. హెచ్. వేంకటపతిరాజు, ఐ. ఏ. ఎస్.,
కార్యనిర్వహణాధికారి
తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.
1987

# ముందుమాట

మహర్షులు మంత్రద్రష్టలు! మంత్రపతులు. పవిత్రమైన భారతావనిలో ఎందరో మహర్షులు అవతరించి బ్రహ్మనిష్ఠాగరిష్ఠులై లోకోపకారకములైన ఎన్నో ఘనకార్యాలు నిర్వర్తించారు. ప్రజాసముదాయం ఆ మహర్షుల ఋణాన్ని ఎన్నటికీ తీర్చుకోలేదు. యుగయుగాల భారతీయ సంస్కృతినీ, విజ్ఞానమునూ విశ్వమునకు చాటిన ధర్మస్వరూపులు వారు. తపస్స్వాధ్యాయ నిరతులై, నిగ్రహానుగ్రహసమర్థులై, త్రికాలజ్ఞులైన మన మహర్షుల గురించిన విషయము లెన్నో శ్రుతి స్మృతి పురాణేతిహాసాలలో కనిపిస్తాయి. వారు స్వయంగా ధర్మమును ఆచరించి లోకానికి ఆదర్శప్రాయు లైనారు. అనేక ధర్మశాస్త్రాలు రచించి ప్రపంచానికి ఉపకరించారు.

నారదుడు సంగీతమునకు, పరాశరుడు స్మృతికి, హోరా శాస్త్రమునకూ పెట్టిన భిక్షయే ఈ నాటి మేటి విద్వాంసు లందరికీ శరణ్యం. నేటికీ మన భారతభూమిలో అసమాన మహిమాన్వితులైన యోగిపుంగవులు తమ ధర్మప్రబోధముతో భక్తులను తరింప జేస్తున్నారు.

"మహర్షుల చరిత్రలు" అను ఈ పుస్తకములో నారద పరాశర భరద్వాజ భృగు మార్కండేయ యాజ్ఞవల్క్య వసిష్ఠ విశ్వామిత్ర వ్యాస శుకుల చరిత్రలు సాకల్యంగా పౌర్వాపర్య సందర్భసమన్వితంగా విచారింపబడినవి. ప్రతిమహర్షి జీవితాన్నిగూర్చి చదివినపుడు పాఠకులు ఎన్నో అమూల్యవిషయాలు ఆకళింపుకు తెచ్చుకొని ప్రయోజనం పొందగలరు. భారతీయు లందరికీ మహర్షుల జీవితచరిత్రలు అవశ్య పఠనీయాలే.

అనేకములైన ఇతిహాస పురాణాలను చక్కగా అవలోకనము చేసి వైమర్శికదృష్టితో సర్వజనావబోధకమైన శైలిలో శ్రీ బులుసు వేంకటేశ్వరులు గారు రచించిన మహర్షుల చరిత్రలలో ఇది రెండవ సంపుటము.

మిగిలిన సంపుటాలు కూడ అచిరకాలములోనే అనుక్రమముగ ముద్రించి ఆంధ్రపాఠకలోకానికి అందజేయు గలము.

సనాతన ధర్మప్రచారమునకై శ్రీ తిరుమల తిరుపతి దేవస్థానముల వారు వెలువఱచుచున్న ధార్మికగ్రంథ పరంపరలో ఈ మహర్షుల చరిత్రలు కూడ ఆంధ్రపాఠకుల ఆదరాభిమానాలు సంపాదించుకొనగలవని మా విశ్వాసము.

తిరుపతి,
27-7-87

సి. హెచ్. వేంకటపతిరాజు,
కార్యనిర్వహణాధికారి,
తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

## వి ష య సూ చి క


| విషయము | | పుట |
|---|---|---|
| నారదమహర్షి | .... | 1 |
| పరాశరమహర్షి | .... | 42 |
| భరద్వాజమహర్షి | .... | 57 |
| భృగుమహర్షి | ... | 71 |
| మార్కండేయమహర్షి | .... | 82 |
| యాజ్ఞవల్క్యమహర్షి | .... | 95 |
| వసిష్ఠమహర్షి | .... | 109 |
| విశ్వామిత్రమహర్షి | .... | 130 |
| వ్యాసమహర్షి | .... | 144 |
| శుకమహర్షి | .... | 165 |



శ్రీ వేంకటేశ్వరస్వామివారు



శ్రీపద్మావతి అమ్మవారు

# మహర్షుల చరిత్రలు

## నారదమహర్షి

శ్రీమంతమగు భరతఖండమున నిత్యశ్రీవిలసితములైన పురాణములలో సమ్కృతభాషలో వర్ణింపఁబడిన ఋషిసత్తములలో నారద మహర్షి ప్రస్తావములేని పురాణగాథ లేదన్న నతిశయోక్తి కాఁజాలదు.

**నారదుని జననము:**

శ్రీవిష్ణుమూర్తి నాభికమలమునుండి జన్మించిన బ్రహ్మదేవుఁడా శ్రీపతిశాసనము ననుసరించి విశ్వమును సృజించుటకై చిరకాలము మహాతప మొనరించెను. పిమ్మట నాతఁడు సనకసనందన సనాతన సనత్కుమారులను దన సంకల్పముచే సృష్టించెను. వారు బాల్యము నుండియు సంసార మొల్లక విష్ణుభక్తాగ్రణులై విలసిల్లఁ జొచ్చిరి. ఆ తరువాత విరించి తన వామభాగమునుండి స్వాయంభువ మనువును శతరూప యను సుందరిని బుట్టింప నా యిరువురకు సమస్త క్షత్రియకులము జనించెను. అంతఁ జతుర్ముఖుఁడు ఫాలతలమునుండి యేకాదశ రుద్రులను సృజింప వారు క్రోధమూర్తు లయిరి. అనంతరము కమలాసనుఁడు కర్ణములనుండి పులస్త్య పులహులను, నేత్రముల నుండి యత్రిక్రతువులను, నాసికనుండి యరుణుని, ముఖము

నుండి యంగిరసుని, దక్షిణవామపార్శ్వములనుండి భృగుదక్షులను, గ్రీవమునుండి నారదుని జనింపఁజేసెను.*

## నారదుని గానవిద్య, విష్ణుభక్తి :

నారదుఁడు శారదాదేవి యొద్ద కేగి యామె కటాక్షము గాంచి యామెవలన సంగీతవిద్య నభ్యసించి యుత్తీర్ణుఁ డయ్యెను. అనంతర మాతఁడు మారుతలోకమున కేగి వాయుదేవతా దత్తమగు 'మహతి' యను వీణను గైకొని యొకనాఁడు దేవమునియక్షకిన్నర కింపురుష గరుడగంధర్వాది సమాజ సంకులమగు బ్రహ్మదేవుని యాస్థానమున కరుదెంచెను. అట నాతఁడు మహతి సారించి స్థాయి సంచారి ఆరోహణ, అవరోహణ రూపములనై, వాది సంవాది యను పాదభేదముల సారియలయందు సారితములైన మధ్యమ, పంచమ, గాంధార, ఋషభ, ధైవత, షడ్జ, నిషాదము లను సప్తస్వరముల నందుఁ బాదుకొలిపి, షాడవములు, ఐడవములు, సంపూర్ణములునై శుద్ధసాళగరూపములను బ్రవృత్తము లగు భైరవి, భూపాళ శ్రీరాగ పడవంజరములును, వసంతము, మాళవి, బంగాళి, నాటు, దేవక్రియ,

* అని భాగవతము. కాని, మత్స్యపురాణమున నారద జననమును గూర్చిన కథ యిట్లున్నది: తొల్లి విష్ణుమూర్తి వామనుఁడై బలిని మూఁడడుగుల భూమి యాచించి యాతఁడీయఁగా, నొకపాదమున సర్వ భూతలమును, మఱియొక పాదమున సమస్త దిఙ్మండలము, నాక్రమింపఁగా ఆకసముపైఁ జాచిన పాదపద్మమును గడుగ సంకల్పించి బ్రహ్మ తత్క్షణము నొక్క మానసపుత్రుని బుట్టించి నార-ద- యనెను. అనఁగా జలము తెమ్మని కమండలువుఁ జూపెను. అతఁడు వెంటనే దేవ పుష్కరిణికిబోయి జలముఁ గొనివచ్చియిచ్చెను. బ్రహ్మ యాజలమున విష్ణు పాదముఁ గడుగఁగా శంకరుఁడు వచ్చి యాపాదజలము భూమిపైఁ బడ కుండఁగాఁ దన మౌళిని ధరించెను. అట్లు జలము తెచ్చుటకై జనించిన బ్రహ్మ మానసపుత్రునకు నారదుఁ డను పేరు వచ్చెను.

మేఘరంజి, వేళావళి, మలహరి, జాళి, హిందోళము, ఛల్లాటునవనీత ఝుంకారధ్వని, నాదనామక్రియ, వరాళి, మంగళకైశికి, గుండక్రియ; ఘూర్జరి, ధన్యాసి, శంకరాభరణము మొదలైన రాగోపరాగములును, చంచత్పుట, షట్పితాపుత్రిక, సింహానందన, రాయఝంకాళ, వేణు వాద్య, లీలా వినోదినీ ధ్రువాది నానా తాళయుక్తములుగఁ; దంత్రీ ముఖములయందు ఆహతము, అనాహతము అను గానమాత్ర విశేష ముల వాయించుచు, మఱియు, ఆ తాళములతోఁ గూడిన మాలితాగ వాద్యతుల్యములుగ వదనమున సందష్ట, ప్రవృష్ట, సీత్కృతి, భీత, శంకిత, కరాళ, కపిల, కాక, వితాళ, సాంబక, తుంబక, ప్రసాద, వినిమీల, విస్వర, అపస్వర, అవ్యక్త, స్థానభ్రంశక మిశ్రము లగు బహువిధరాగదోషములఁ బరిత్యజించి పాడుచు, ఆ గానమునఁ దండ్రి యగు బ్రహ్మను మిక్కిలి సంతోషపెట్టెను.

ఆ కారణమున బ్రహ్మ నారదునికి విష్ణుభక్తిని బోధించి పాదు కొలిపి, అష్టాక్షరి నుపదేశించి, అనేకవిషయము లెఱిఁగించి వీడు కొలిపెను.*

## నారద బ్రహ్మల వరప్రద శాపములు :

బ్రహ్మ యొకనాఁడు పుత్త్రుల నందఱఁ బిలిచి "పుత్త్రులారా! మీ రందఱును వివాహితులై ప్రజాసంసృష్టి యొనర్పవలెను. భవ దీయ వయోగుణానుసారము మీకు భార్యలను సృజింతును, అట్లు చేయుఁ" డని చెప్పెను.

ఆ మాటలు విని యెవ్వరును బదులు పలుక లేదు. అంత నారదుఁడు తండ్రికి నమస్కరించి "మహాత్మా! నేను నీయాజ్ఞ పాలింపఁ జాలను. నా మనస్సు శ్రీవిష్ణు పాదారవిందములనే చేరఁ గోరుచున్నది. నా యన్నలగు సనక సనందనసనాదులవలె నేను నే

* మత్స్యపురాణము.

కాంతికుఁడనై బ్రహ్మానందాంబుధి నోలలాడుదును. సెల విమ్మనెను. చతురాననుఁ డా నుడులు విని "నారదా! నిన్ను సృజించిన నన్నె యింత తృణీకరింపఁ దగదు సుమా! నాయాజ్ఞ పాలింతువా? లేక నా శాపము పా లగుదువా!" యని గద్దించెను. నారదుఁడు నిశ్చలుఁడై "తండ్రీ! సారహీనము ఘోరదుఃఖదము నగు సంసారమున నన్ను మగ్న నొనర్పకున్న శాపదగ్ధు నొనర్చినను నా కానందమే. కావున, నీ యిచ్చవచ్చి నట్లొనర్పు" మని తృణీకరించెను. అంతఁ గమల గర్భుఁడు "నారదా! నీయవిధేయత నేను సైరింపఁజాలను. నిన్ను విడిచిపుచ్చినచో నీ సోదరగణము నిన్ననుసరింపఁ గలదు కావున, నీ వీ తత్త్వజ్ఞానమును విస్మరించి గంధర్వుఁడవు, స్త్రీలోలుఁడవు నౌదువు గాక! నా సంకల్ప మేల సిద్ధింపదో నేను చూచెదఁగాక!" యని యాతనికి శాప మిచ్చెను. నారదుఁడు కోపించి "తండ్రీ! నీకును నాకును సమస్త లోకములకును మూలకారణుఁడైన విష్ణుమూర్తి పాద పద్మముల సేవించు సదుద్దేశముతో నున్న నన్ను నీవు శపించితివి. నీకును నేను ప్రతిశాప మిచ్చు చున్నాను. నీకు ముల్లోకములలోను పూజా పురస్కారములు లేకుండుఁగాక! నే నెన్నజన్మ మెత్తినను శ్రీ హరియందు నిమగ్న చిత్తుఁడ నౌదునుగాక!" యని యుద్ఘోషించెను. ఇట్లు పరస్పర శాపగ్రస్తులై విరించి నారదులు తమ తమ నెలవుల కరిగిరి *

## నారదుఁడు గంధర్వుఁడై పుట్టుట :

ఆ కాలమున సమస్త సంపదలతోఁ దులతూఁగుచు వసిష్ఠ శిష్యుఁడగు నొకగంధర్వరాజు పుత్రహీనుఁడై గురువగు వసిష్ఠమహర్షిని జేరి "గురుదేవా! ఎంత యైశ్వర్యమున్నను బుత్రగాత్రపరిష్వంగ సుఖమునకు నోచుకొననైతిని. ఆ కారణమున జీవితలిప్తలుకుల నప్పు

* బ్రహ్మవైవర్త పురాణము.

తముచిలుకు చిఱుతవాని నొకనిఁ బ్రసాదించు నుపాయముఁ జెప్పవే” యని ప్రార్థించెను. వసిష్ఠమహర్షి “రాజా! నీ కోరిక సిద్ధింపఁగలదు. నీకు శివపంచాక్షరీమంత్రము కవచస్తోత్రసహితముగా నుపదేశింతును. నీవు కడుభక్తియుక్తుఁడవై పుష్కరతీర్థ పుణ్యప్రదేశమునఁ బరమశివుని గుఱించి జపింపుము. అతఁడే నీ కోరిక తీర్పఁగలఁ”డని శిష్యునకు మంత్రోపదేశము చేసెను. ఆ గంధర్వుఁడు పరమ భక్తియుక్తి గురు ప్రోక్తముగా నూఱు దివ్యవత్సరములు తపింప శివుఁడు ప్రత్యక్షమై విష్ణుభక్తుఁ డగు కుమారుఁ డుదయించునని వరమిచ్చి యదృశ్యుఁ డయ్యెను. గంధర్వరా జానందభరితుఁడై గృహమున కేగి వసిష్ఠుని సన్మానించి సుఖముండెను.

కొంతకాలమున కా గంధర్వపత్ని గర్భవతియై కాలక్రమమున నొక సుపుత్రునిఁ గనెను. వసిష్ఠమహర్షి యా బాలునకు జాతకర్మాది సంస్కారము లొనర్చి ఉపబర్హణుఁ డని యాతనికి నామకరణ మొన రించి శ్రీహరిమంత్రము నుపదేశించి యాశీర్వదించెను. ఈ ప్రకారము నారదుఁడే గంధర్వుఁడై పుట్టి పెరుగుచుండెను.

ఉపబర్హణుఁడు భక్తితాత్పర్యములు శ్రీహరిపై నిలువ గండకీ నదీతీరమున కేగి శ్రీహరిమంత్రపునశ్చరణమునఁ దపోవృత్తి నుండెను. ఇట్లుండఁగా నొకనాఁ డా నదిలో చిత్రరథు డను మఱియొక గంధర్వ రాజు పుత్రిక లేఁబదిమంది జలక్రీడ నభిలషించి వచ్చి దివ్యసుందర విగ్రహుఁ డగు నుపబర్హణుని మోహించి మోహింపఁ జేసిరి. ఉపబర్హ ణుఁడు బ్రహ్మశాపోపహతుఁడై శ్రీహరి మంత్రజపమునకుఁ దిలోదకము లర్పించి వారి నందఱ గాంధర్వవిధిని వివాహమై యథేచ్ఛముగాఁ గామభోగలాలసుఁడై కాలముఁ బుచ్చుచుండెను. వారిలో మాలావతి యను జ్యేష్ఠపత్ని సౌందర్యమాధుర్య గాంభీర్యాదిగుణముల నద్వితీ యుఁడై యొప్పు నుపబర్హణునకు మిగులఁ గూర్చునదియై చెల్లెండ్రఁ గూడి యాతనితో నిష్టకేళిఁ దనియుచుండెను.

ఇట్లుండ ఒకనాఁడు విశ్వస్రష్టలైన బ్రహ్మలు దేవసత్ర మను యాగముఁ జేయుచు నారాయణ కథావిశేషములు గానము చేయుటకై యుపబర్హణుని అతని యేఁబదిమంది భార్యలను బిలువ నంపిరి. ఉపబర్హణుఁడు సభార్యుఁడై బ్రహ్మలోకమున కేగి యప్సరోవనితలఁ గూడి విష్ణుగాథలు పాడుచుండెను. కొంతసేపటి కాతనికిఁ బ్రారబ్ధ వశమున నిజభార్యలపై మనసుపోవుటే కాక తమతోపాటు విష్ణుగాథలు గానముచేయు రంభను జీరచెఱంగుఁ బట్టిలాగి కేళికి రమ్మని యాతఁడు సైగచేసెను. ఆ దోషమునకు విశ్వస్రష్ట లాతనిఁ గోపించి "గంధర్వరాజా! పంకజాక్షుఁ బాడక పంకజాక్షుల మొఱఁగి పాపపంకమునఁ బడితివి. కావున నీవు భూతలమున శూద్రస్త్రీకి సుతుఁడవై పుట్టుదువుగా"కని శపించిరి.

ఉపబర్హణుఁ డీ విషయమును భార్యలకుఁ దెలిపి దర్భశయనుఁడై ప్రాణములు విడిచెను. అంతఁ బతివ్రతా శిరోమణి యగు మాలావతి దుఃఖనిమగ్నయై బహువిధములఁ బలవించు చెల్లెండ్ర నూఱడించి దేవతల నుద్దేశించి "దేవతలారా! నా యభిమతము లేనిదే నా భర్త మరణింపఁడు. నేఁడు నా భర్త పునర్జీవితుఁడు గాఁడేని బ్రహ్మకు సృష్టించుశక్తి నశించుఁ గాక! యముని ధర్మము నశించుఁ గాక! ఈశ్వరుని జ్ఞానము విస్మృతమగుఁ గాక!" యని శాపోదకను విడిచెను. ఆ మహాపతివ్రత శాప మమోఘ మని దేవతలెల్లరు భయపడి క్షీరసాగర శయనుఁడైన విష్ణుమూర్తి కడ కేగి యాతని శరణు చొచ్చిరి. విష్ణుమూర్తి వారల కభయమిచ్చి పోయి మాలావతికడ నుండుఁడని వారి నందఱఁ బంపి తా నొక బ్రాహ్మణవేషధారియై యటకు వచ్చి మాలావతిని నూఱడింపఁ జూచెను. కాని, యామె భర్త పునరుజ్జీవితుఁడు కావలయునని గాఢముగాఁ గోరెను. విష్ణుమూర్తి చనిపోయినవారు మరల బ్రతుకరనియు దేవతలు తమ్ముఁ బూజించిన వారి కైహికాముష్మికసుఖము లీయఁగలరే కాని పునర్జీవముఁ

గలిగింప లేరనియు నెన్ని చెప్పిన నామె వినకుండెను. అంత నా కపటబ్రాహ్మణుఁ డామె కాయుర్వేదమును దెలుపుచు "మాలావతీ! వ్యాధు లన్నిటికిని జ్వరము తండ్రి. జ్వరమున కజీర్ణము తండ్రి. క్రూరమగు జ్వరదేవతకుఁ గాళ్లు మూఁడు, చేతు లాఱు, శిరములు మూఁడు, నేత్రములు తొమ్మిది, ఎఱ్ఱని రూపము. ఈమె యవకాశము లభించినపుడు పిత్తశ్లేష్మవాత త్రిదోషజ్వరరూపములలో నొకరూపము ధరించి యరువదినాలుగు సంఖ్యగల యుపరోగము లను తమ్ములతోఁ దల్లియగు మృత్యుదేవతతోఁ జెల్లెలగు జరతో మానవశరీరముల ననేక విధములుగాఁ బ్రవేశించును. నీ భర్త వీనిలో నే దోషమున మరణించెనో నేను వైద్యముచేసి బ్రదికింపఁ గలను. లేనినాఁడు బ్రదికింపలే" నని చెప్పఁగా మాలావతి తన భర్త విశ్వస్రష్టల శాపమూలమున మరణించెనే కాని రోగార్తుఁడై మరణింపలేదనియుఁ దన శాప మమోఘ మనియుఁ జెప్పెను.

అంత విష్ణుమూర్తి బ్రహ్మముఖముఁ జూచెను. బ్రహ్మ "దేవతలారా! ఇతఁడు పూర్వభవమున నా కుమారుఁడగు నారదుఁడు. నా శాపమూలమున లక్షసంవత్సరములు గంధర్వుఁడై విహరింపవలయును. ఇంక నొక వేయిసంవత్సరములు కొఱఁతయున్నది. పిమ్మట నాతఁడు శూద్రయోనిఁ బుట్టక తప్ప"దని తన కమండలూదకమునుజల్లి యుపబర్హణుని బ్రదికించెను.

దేవత లందఱు మాలావతిని సంస్తుతించిరి. ఉపబర్హణుఁడు భార్యాసహితుఁడై గంధర్వలోకమున కేఁగి చిరకాలము కామకేళినిపుణుఁడై సంతానవృద్ధి నొనర్చి వార్ధకమున గంగాతీరమున శ్రీహరిని ధ్యానించుచు శరీరమును విడిచెను. అతని భార్యలు సహగమన మొనరించిరి. *

---

* భాగవతము, సప్తమస్కంధము.

## నారదుఁడు శూద్రుఁడై పుట్టుట:

ఆ దినములలోఁ గన్యాకుబ్జమును ద్రుమిళుఁ డను యాదవ రాజు పరిపాలించుచుండెను. అతనిభార్య కళావతి సకల కళావతియై యుండెను. పుత్త్రోద్భవమునకై యా జాయాపతులు పట్టని నోములు, చేయని వ్రతములు లేకుండెను. విఫలమనోరథులై వా రిరువురు రాజ్య భారమును మంత్రులపై నిడి యడవి కేఁగి తపము చేయసాగిరి. శూద్రు లగుటఁ దపోనవద్యతలేమి వారి కోరిక సిద్ధింపదాయెను. ఒకనాఁడు ద్రుమిళుఁడు విసివి వేసారి "సాధ్వీ! మనకిఁక సంతానము కలుగునను నాశ లేదు. ఇఁట కనతిదూరమునఁ దప మొనర్చు నిందు కశ్యపుఁడను ఋషికడ కేఁగి పుత్త్రభిక్షము వేఁడి యాతని కృపచే గర్భ వతివై రమ్ము. దాన మనకు దోషము లేదు. మఱియు వంశము నిలిపినదాన వౌదు"వని కోరెను. కళావతి భర్త యానతి యిందు కశ్యపునకుఁ దెలుప నాతఁ డామెను మోహించి నిగ్రహించుకొని యామె కోరిక నిరాకరించెను. కళావతి వేచియుండి యాతనికి విధి వశమున రేతఃపతనము కాఁగా నాతని యానతి నామె యా రేతస్సును ద్రావి సెలవు తీసికొని భర్తను జేరి నివేదించెను.

ద్రుమిళుఁ డానందించి కళావతీ సహితుఁడై నగరమున కేఁగి సుఖముండఁగాఁ గాలక్రమమునఁ గళావతి గర్భవతి యయ్యెను. ద్రుమిళుఁడు తీవ్రవిరాగియై సమస్త రాజ్యమును నొక క్షత్త్రియున కిచ్చి భార్య నొక విప్రగృహమున నుంచి తాను గంగాతీరమున కేఁగి శ్రీహరిస్మరణపూర్వకముగా జీవములఁ బాసి ముక్తి నందెను. విప్ర గృహమునఁ గల కళావతి ప్రతిస్మృతి యను విద్యకతమున భర్తృ మరణము నెఱిఁగి యసువులఁ బాయఁబోఁగా నాకాశవాణి వారించి సుపుత్త్రోదయముగా నుండుటఁ దెలిపెను. ఈ కారణమునఁ గళావతి బ్రాహ్మణగృహమున కేఁగి దినములు గడపుచుండఁగాఁ దేజోరాశి యగు కుమారుఁ డుదయించెను. ఉపబర్హణుఁడే విశ్వస్రష్టల శాప

మున నిట్లు జనించి బాల్యమునుండియు హరినామసంకీర్తనపరుఁడై మృత్తికతో హరివిగ్రహము చేసి ధ్యానించుచు హరిభక్తియుక్తుఁడై యుండెను.

ఈ బాలుఁడు జనించినతోడనే యనావృష్టిదోషము తగిలిన కన్యాకుబ్జమునఁ జక్కని వానలు కురియఁజొచ్చెను. మఱియు నీతఁడు దాహమిచ్చిన జల మెట్టి తృష్ణలనైనను బాపుచుండుటచే నీతనికి నారదుఁడను నామము విప్రోత్తము లొసఁగిరి. నార మనఁగా జలము, జ్ఞానమును. జలము నిచ్చినవాఁడు, జ్ఞానము నిచ్చినవాఁడు కావున నారదుఁ డన్వర్థనామ భాజనుఁ డయ్యెను. వేదవిదు లగు బ్రాహ్మణుల గృహమునఁ బెరుఁగుచు నారదుఁడు వారిచేఁ బనుపఁబడి యొక్క వాన కాలమునఁ జాతుర్మాస్యమున నేకస్థల నివాసులైన యోగిజనముల నేమఱక సేవించుచు వారి యెంగిలియే మంగళప్రద మని తినుచు వారుచేయు విష్ణుగాథా ప్రసంగములను వీనులవిందుగా వినుచుండి వారి కారుణ్యమునకుఁ బాత్రుఁడై వారివలన నీశ్వర రహస్యోదార విజ్ఞానోపదేశము నందెను.

పిమ్మట నారదుఁడు ద్విజగృహమున నియమితకృత్యములు నెఱవేర్చుచుఁ దల్లి యుపలాలించుచున్నను మాతృమోహవాగురలకు లోనుగాక వేఱు చింతలేక విష్ణుపాదసక్త చిత్తమున నుండఁగా నాతని తల్లి యొక రేయి పాలు పిదుకుచు సర్పదష్టయై చనిపోయెను. నారదుఁడు కలఁగక మాతృసంగవివర్జనమున కానందించి యుత్తరాభిముఖుఁడై చాలదూరము పోయి యొక రావిమ్రానిపొంతఁ గూర్చుండి హృదయగతుఁడు పరమాత్మ స్వరూపుఁడు నైన హరిని జింతింప నాతఁడు ప్రత్యక్ష మయ్యెను. కాని, నారదుఁడు నీచోపాధివలన నాతని గానలేకపోవ విష్ణుమూర్తి గరుణించి యదృశ్యుఁ డయ్యుఁ బేరెలుఁగున "నారదా! నీ వీ జన్మమున నన్నుఁ గానఁజాలవు. ఐనను, మత్పరుఁడవై యుండి ప్రళయావసాన సమయమునఁ బునస్సృష్టి

గలుగ నిర్దోషివై శుద్ధసాత్త్వికులలో నుత్తముఁడవై జన్మింతు" వని పల్కెను. నారదుఁ డందుల కానందించి నాటినుండి మదము విడచి మచ్చరము దిగనాడి, కామము నిర్జించి, క్రోధము వర్జించి, లోభ మోహముల విడనాడి సిగ్గు విడిచి యనంత నామములు పఠించుచు నిర్మలాంతఃకరణమున విష్ణు నుపాసించుచుండెను.

అంతఁ బ్రళయకాల మేతేర నారదుఁడు పంచభూతమయ మయి కర్మస్వరూపమైన పూర్వదేహము విడిచి హరి కృపావశమున శుద్ధసత్త్వమయ భాగవతదేహముఁ జొచ్చి త్రైలోక్యసంహారకుఁడై ప్రళయకాల సముద్రమునఁ బవ్వళించు నారాయణుని శ్వాసము వెంట నాతనిలోనికిఁ బ్రవేశించి సహస్రయుగ పరిమితమైన కాల మందుండి లోకములు సృజింప నుద్యోగించు బ్రహ్మ ప్రాణమువలన మరీచి ప్రముఖులతోఁ దిరిగి జన్మించెను.*

## బ్రహ్మ నారదు ననుశాసించుట:

ఈ ప్రకారము తిరిగి జన్మించిన నారదుని మరీచ్యాదులకు వలెనే వివాహమాడి ప్రజాభివృద్ధి నొందఁ గూర్చుమని బ్రహ్మ శాసించెను. నారదుఁడు "తండ్రీ! నన్ను మరల గృహస్థుఁడవు కమ్మని యేల బాధించెదవు? ఈ కారణముననే కదా తొల్లి మనము పరస్పర శాపానలమున కెర యైతిమి? నన్ను సైరింపు"మని వేఁడెను. విరించి శాపాయుధము నిష్ప్రయోజన మని తనయు నుపలాలించి, "కుమారా! నీ కిది తప్పదు. అడవినిజేరి కేవలము తప మొనరించిన నేమి ప్రయోజనము? అట్లది వ్యర్థ మని కాదు. ఈ పద్ధతి బహుక్లేశదాయకము, నగమ్యగోచరమును. నీవు నన్న్యస్తచిత్తుఁడవై సంసారముఁ బోఁద్రోచిన పిమ్మట పతితుఁడవైతివా యధోగతి పాలగుదువు. గృహస్థుఁడవై శ్రీహరి ధ్యానపూర్వకముగాఁ గర్మానుష్ఠాన మొనర్చిన నే విధ

* భాగవతము, ప్రథమస్కంధము.

మునను బతనము సంభవింపదు. మఱియు బుత్రవంతుఁడ వైనచో పున్నామనరకము నవలీల దాఁటఁగలవు. నాకోరిక చెల్లించినవాఁడ వౌదు" వని బహువిధములఁ జెప్పి నారదు నొడంబఱచెను. నారదుఁడు "తండ్రీ! అట్లే చేయుదును. కాని, నేను ముందు కైలాసమున కేఁగి శివదర్శనము నుపదేశము నందవలయును. తరువాత బదరికావనమున కేగి నరనారాయణుల దర్శింతును. వారి యనుమతిఁ గొనివచ్చి వివాహ మాడుదును. నా కీ పనులు చేయఁగల శక్తి ప్రసాదింపు" మని వేఁడుకొన నానందమున నట్లే యొనర్చెను.

## నారదుఁడు బ్రహ్మను విశ్వప్రకార మడుగుట :

అంత నారదుఁడు "తండ్రీ! నేను పోవుటకు ముందు నాకుఁ గల కొన్ని సందేహములను దీర్ప వేఁడుదును. నీవు పెల్పుఁబెద్దవు. జగత్సర్గానుసంధాయివి. కావునఁ జెప్పఁగోరుదు" నని విశ్వప్రకారము తెల్పు మని కోరెను. విరించి "నాయనా! దేహమునకు ద్రవ్యములైన మహాభూతములు, జన్మనిమిత్తములైన కర్మములు, కర్మక్షోభకమైన కాలము, కాలపరిణామ హేతువైన స్వభావమును, భోక్తయైన జీవుఁడును సర్వము వాసుదేవుఁడే. అతఁడు మాయామూలమున బ్రహ్మాండమును సృజించి చతుర్దశ లోకములుగా విభజించెను. మీఁదటి యేడులోకములు శ్రీమహావిష్ణువునకుఁ గటిప్రదేశోపరి భాగము, క్రిందటి సప్తలోకములు నాతని జఘనమునుండి క్రిందిభాగము. బ్రహ్మాండములోపల నుండుచు నాతఁడు బహిరంతరముల వెలిఁగించును. నే నాతని నాభికమలమునుండి పుట్టి యాతనికి మానసయజ్ఞ మొనర్చి యాతని కృపచే బ్రతుకుచుందును. ఆ మహాత్ముఁడు, విశ్వాత్ముఁడు, విశ్వేశుఁడు, విశ్వమయుఁడు. ఆతని మొదటి యవతారము సహస్రశీర్షాదియుక్తమయి ప్రకృతిప్రవర్తకమగు నాదిపురుషరూపము. అతని లీలావతారము లనంతములు, సుయజ్ఞ, కపిల, దత్తాత్రేయ, సనక, నర, నారాయణ, ధ్రువ, పృథు, వృషభ, మత్స్య, కూర్మ,

నృసింహ, వామన, శ్రీరామాద్యవతారములు గాంచి యీ విధమునఁ బరమేశ్వరుఁడు, సర్వాత్మకుఁడు నైన హరి విశ్వోత్పత్తిస్థితి లయ హేతు భూతుఁడై విలసిల్లు" నని ప్రపంచక్రమ మంతయు నెఱింగించెను.*

## నారదుఁడు నారాయణఋషిని దర్శించుట:

నారదుఁ డంత విధాతయొద్ద సెలవు గైకొని యాతని కటాక్ష ముచే నతివేగమునఁ గైలాసమున కేఁగి శివుని దర్శించి యాతని వలన శ్రీహరి మంత్రము, స్తోత్రకవచము, పూజావిధి మున్నగునవి యెఱిఁగి గృహస్థ ధర్మ నిర్వహణము, ప్రకృతి పురుషుల స్వరూప సంబంధములు సమగ్రముగాఁ దెలిసికొని యాతనిఁ బలు తెఱఁగుల స్తుతించి బదరికావనమునకుఁ బయనమై పోయెను.

నారదుఁడు బదరికాశ్రమము భక్తితోఁ జొచ్చి యవ్యయుఁడు, సనాతనుఁడు, విశ్వాత్ముఁడునైన నారాయణఋషింగొలిచి, "మహాత్మా! సిద్ధి కారాధనీయమైన దేదియో తెలిపి కటాక్షింపవే" యని ప్రార్థించెను. అంత నాతఁడు "వత్సా! ధ్రువము, నచలము, నింద్రియాగోచరము, సూక్ష్మము, ననుపమము నన సర్వమున కంతరాత్మయై వెలుఁగుతత్త్వమే సిద్ధి కారాధనీయము. అంతకన్న వేఱువస్తువు లే"దని చెప్ప నారదుఁడు తనకుఁ దదీయాలోకన మెట్లు కలుగునని యడిగెను. నారాయణఋషి "నారదా! నీవు పరమైకాంతి వగుచో నీ కట్టి పెంపు సంపాదించి పెట్టెద, పొ" మ్మని యాదరముతో వీడ్కొలిపెను.

నారదుఁడు ప్రీతుఁడై వినువీథిని పోవుచు దుగ్ధార్ణవమునకు నుత్తరభాగమునఁ గల శ్వేతద్వీపమున కేగి యం దనాహారులు, నింద్రియవృత్తి రహితులు, నస్వేదులు, సుగంధిశ్వేతాంగులు నగు పురుషులఁ గాంచెను.♦

---

* భాగవతము. ద్వితీయ స్కంధము.

♦ భారతము. శాంతిపర్వము.

### శ్వేతద్వీపవాసి యగు నారాయణుఁడు నారదునకుఁ దత్త్వోప దేశము చేయుట :

అంత నారదుఁడు వారి యాదరము నంది యట దుష్కర తపోనిష్ఠ నూని యూర్ధ్వబాహుఁడై కదలకుండ విష్ణుమూర్తి నేకాంతియై స్తుతింప నాతఁడు సితాసిత పీతారుణ పిశంగహరిత వర్ణములను, బహుశిరోబాహు పాదములను, వేదికమండలు స్రుక్స్రువాగ్ని ధారణమున నోంకారసావిత్రీ చతుర్వేదోచ్చారణములను, మహాద్భుతమయిన దివ్యరూపము నారదునకుఁ జూపి "వత్సా! నా దర్శన మేకాంతికు లగు పరమ పురుషులకే లభించును. నీ వట్టివాఁడ వౌటఁ గాంచితివి. కావున, నీకుఁ దత్త్వప్రకారముఁ దెలుపుదును. నేనే వాసుదేవుఁడను. దేహము భూతాత్మకమైన ధాతుచయము. అందు జీవవ్యాప్తి లేనిచోఁ జేష్ట లుండవు. కావున జీవశరీరములు పృథగ్భావాకలితములు. జీవుఁడు మత్సముపేతుఁ డని దృఢముగా నెఱిఁగినవాఁడే ముక్తి నందును. బ్రహ్మను సృజించి సకలజగద్ధురాని యుక్తునిఁ జేసి నేను నివృత్తి నేకాంతికుఁడనై మధ్యస్థవృత్తి నుండుచు నొక్కొక్క కాలమున జగద్ధితముగా జన్మకర్మములఁ బూనుదు" నని తన తెఱఁ గెల్ల దెలిపి నారదుని వీడ్కొలిపి యదృశ్యుఁ డయ్యెను.

నారదుఁ డానందభరితుఁడై తిరిగి బదరికాశ్రమమున కేతెంచి నరనారాయణులఁ బొడగని తనకుఁ గలిగిన నారాయణ దర్శనప్రకారము వారలకుఁ దెలిపి యానందించెను. నారాయణఋషియు నారదుని దైవసమారాధనకుఁ బురిగొల్పి యేకాంతిగా నుండఁ బ్రోత్సహించెను.*

---

* భారతము శాంతిపర్వము.

## నారాయణఋషి నారదమహర్షికి బ్రహ్మవైవర్త పురాణము చెప్పుట:

అంత నారదుఁడు "మహాత్మా! నన్ను సృజించిన బ్రహ్మదేవుఁడు నన్ను వివాహమయి పుత్త్రులఁ గనుమని యాదేశించి యున్నాఁడు. పరమైకాంతినగు నా కది భావ్యమగునో కాదో తెల్పు" మని ప్రార్థించెను. నారాయణఋషి యాతనికి బ్రహ్మ, ప్రకృతి, గణేశ, శ్రీకృష్ణఖండములు గల బ్రహ్మవైవర్తపురాణముఁ దెలిపెను. నారదుఁ డిది వ్యాసమహర్షికి వినిపింపఁ నాతఁడు గ్రంథస్థముచేసెను. బ్రహ్మఖండమున బ్రహ్మసృష్టులను గుఱించి తెలుపఁబడెను. ప్రకృతి ఖండమునఁ బ్రకృతియే సృష్టికి గారణ మగుటయు, విరాట్పురుషుఁడు సృష్టికై స్త్రీపురుష భాగములను దన దేహమున నేర్పఱచి కొనుటయుఁ, బురుషునితోఁ బ్రకృతి కలిసి యుండుటయు, నామె శివునితోఁ గలిసి దుర్గ యనియు, విష్ణునితోఁ గూడి లక్ష్మి యనియు, బ్రహ్మతోఁజేరి సావిత్రి యనియు, స్వర్గ మందుండి స్వర్గలక్ష్మి యనియు రాజగృహ మందుండి రాజ్యలక్ష్మి యనియు, గృహములందుండి గృహలక్ష్మి యనియుఁ బరగుచుండుట మున్నగు విషయము లున్నవి. గణేశఖండమున గణపతిజన్మము నాతని ప్రభావాదులు వివరింపఁబడెను. శ్రీకృష్ణఖండమున శ్రీకృష్ణావతార చరిత్రము గలదు.

ఈ బ్రహ్మవైవర్తపురాణము నారదునకు బోధించి నారాయణఋషి "నారదా! శ్రీకృష్ణుఁడుకూడఁ బ్రకృతిస్వరూపిణియగు స్త్రీని బరిగ్రహించెను. అదయునుఁ గాక నీ పూర్వజన్మమున నీకు జ్యేష్ఠభార్యయైన మాలావతియే నీతో సహగమనముఁ జేసి యీ జన్మమున నీకు కూతురై జనించి నిన్ను భర్తగాఁ బడయ నీశ్వరునుండి వరముఁ గని యున్నది. కాన నీకు వివాహము తప్పదు. పోయి ర" మ్మని పంపివైచెను.

## నారదుని వివాహవృత్తాంతము :

నారదుఁ డట్లాతనియొద్ద సెలవు దీసికొని యింకను దన హృదయమున వివాహేచ్ఛ గలుగకపోయిన కారణమున హిమాలయ ప్రాంతమున కేగి యందు మహా తపోనిష్ఠుఁడై నారాయణ మంత్రోచ్చారణమును జేయుచు నుండెను. ఈతని తపోనిష్ఠకు భయపడి యింద్రుఁ డీతనిఁ గామమోహితుని జేయుటకై యప్సరసలఁ బంపెను. ఆ యప్సరోవనిత లెంత ప్రయత్నించినను శివానుగ్రహమున నారదుఁ డచంచలుఁడై వారి నెల్లరను జయించెను. వారును ఖిన్నలై మరలిపోయిరి. నారదునకు విజయగర్వము, తన శక్తి చేతనే కామమును నిర్జించితి నను నహంభావము పెచ్చు పెరిగెను. తన శక్తిని గూర్చి శివునికడను, విష్ణుమూర్తియొద్దను నాతఁడు పొగడుకొనఁ జొచ్చెను. విష్ణుమూర్తి శివకటాక్షముననే కామము జయించితివి కాని నీ తెలివి కా"దని యెంత చెప్పిన నాతనికి విశ్వాసము కుదురకుండెను. దీనికిఁ దగిన గర్వభంగము చేయ విష్ణుమూర్తి మనమున నెంచెను.

నారదుఁడు హిమాలయమున నున్న తన మిత్రుఁడైన పర్వతుని కూడి త్రిలోకసంచార మొనర్ప నిశ్చయించుకొనెను. ఆ ప్రకారము పర్వతనారదు లిరువురుఁ దిరుగుచు నిక్ష్వాకువంశ క్షత్రియుఁడు విష్ణుభక్తుఁడు నగు నంబరీషుని గృహమున కేగిరి. ఆ యంబరీషుఁడు విష్ణువును గూర్చి తప మొనరించి, యాతఁడు ప్రత్యక్షముకాఁగా విష్ణువునకు భార్య కాఁబోవు నొక కొమార్తెను గోరుకొన నాతఁ డనుగ్రహించెను. ఆ ప్రకార మాతనికి శ్రీమతి యను సుందరాంగి జనించి వయోగుణానురూపయై పెరుగుచుండెను. శ్రీమతిని జూచునరికి మిత్రులగు పర్వత నారదుల కిరువురకు సమ్మోహము జనింప వారు తమ యభిమతము నంబరీషునకుఁ దెలిపిరి. అంబరీషుఁడు "మహాత్ములారా! త్వరలోనే నా కొమార్తె స్వయంవర మహోత్సవము జరుగును. దానికి మీరును రండు. మీ రుభయులుఁ ద్రిలోకసుందరు లగుట

మీలో నొకరిని నా కుమారి వరింపవచ్చు"నని బదులు చెప్పెను. వల్లె యని వా రిరువురు నొకరికిఁ దెలియకుండ నొకరు విష్ణుమూర్తి కడ కేగి తమ యభిమతముఁ దెల్పి నారదుని ముఖము వానర ముఖమువలె స్వయంవర సమయమునఁ గానవచ్చునట్లు చేయుమని పర్వతుఁడు, పర్వతుని ముఖము వానరముఖముగాఁ గానరాఁ జేయు మని నారదుఁడు గోరుకొనఁగా విష్ణుమూర్తి నారదగర్వభంగము కా నున్నదని సంతసించి యిరువురకుఁ గోరిన దనుగ్రహించెను.

ఈ సంగతి తెలియక పర్వత నారదు లిద్దఱును స్వయంవర మున కేఁగ నచట వారి కోతిమొగములు చూచి సభ్యులు నవ్విరి. శ్రీమతి దివ్యసుందరియై స్వయంవరమునకు వచ్చిన విష్ణువునువరింప నాతఁడు దా నొసఁగిన వరముప్రకారము శ్రీమతిఁ దీసికొని నిజస్థాన మున కేఁగెను. పర్వత నారదు లవమానపరీభూతచేతస్కులు, నవాంఛి తార్థ సిద్ధులునై యంబరీషునిఁ దమోమయునిగా శపింపఁబోవ విష్ణు చక్రము వచ్చి వారిని దఱిమెను. వారు వెంటనే విష్ణుమూర్తి కడకుఁ బరువిడిపోయి శ్రీమతియుతుఁ డగు నాతనిఁ జూచి కలుషితులై "స్వామీ! మ మ్మి ట్లవమాన దండహ్యమాన మానసులఁ జేసి మా వలచిన దానిఁ దెచ్చుకొంటివి. మమ్ము వానరముఖులఁ జేసితివి. కావున, నీవు నరుఁడవై జన్మించి భార్యావియోగము నందుదువుగాక! మఱియు, నీవు వానరులమూలముననే తిరిగి భార్యను బడయుదువు గాక!" యని శపించిరి. విష్ణుమూర్తి నవ్వుచు "నారదా! సంతోషము. నేను శ్రీరామావతార మెత్త సంకల్పించియుంటిని. అపుడు నీవు చెప్పి నట్లే యగును. కాని నీవు కామజయుఁడ నని గర్వించితివి. ఇఁక నైనను నీ యహంభావము విడచి నీవు బాగుపడుదువు గాక" యని పలుక నారదుఁడు తన తప్పిదమును గ్రహించి విష్ణుమూర్తిని శరణు వేఁడి యాతని దీవనలంది పర్వతునితో యథేచ్ఛ మేగెను. *

---

* భారతము, శాంతిపర్వము.

పిమ్మట నారదుఁడు పర్వతునితో సంచరించుచు బ్రహ్మదేవుని యాదేశమును నారాయణఋషి బోధమును స్మరించుకొని యిఁక వివాహమాడుట తప్పదని నిశ్చయించుకొని సృంజయుని గృహమున కేగెను. దారిలో నారద పర్వతు లిరువురును నొకరి రహస్యము లొకరు దాఁచుకొనఁ గూడదని, యట్లు జరిగిననాఁడు శపించుకొన నొడంబడిక చేసికొనిరి. సృంజయుఁడు పర్వతనారదుల గౌరవించి వారి పరిచర్యకుఁగా నిజపుత్రిక యగు సుకుమారిని నియోగించెను. సుకుమారి వారి కుపచర్య లొనరించుచుండెను. ఇట్లుండఁ బ్రారబ్ధవశమున నారదుని కామెపై మోహము జనింప దుర్వారమనోవ్యథచేఁ గృశాంగుఁ డగుచుండెఁ గాని పర్వతున కా వృత్తాంతముఁ దెలియనీయకుండెను. పర్వతుఁడు నారదుని పరిస్థితిఁ జూచి తన దివ్యవీక్షణమున యాథార్థ్యముఁ దెలిసికొని "నారదా! నీ మనోవృత్తి నాతోఁ జెప్పక మన నియమమునకు భంగము వాటిల్లఁజేసితివి. కావున, నీవు సుకుమారిని వివాహమైన వెంటనే వానరవదనము నందుదువు గాక" యని శపించెను. నారదుఁడు "మిత్రమా! విధివైదము లెవఁడు తప్పింపఁ గలఁడు? పూర్వజన్మప్రారబ్ధమున నీమె నాకు భార్య గావలసి ఉన్నది. కాక తప్పదు. నీవు నన్ను శపించితివి గాన నీవు స్వర్గలోకసంచారము లేకుందువు గాక!" యని ప్రతిశాప మిచ్చి యాతని వీడ్కొలిపెను.

పిదప, నారదుఁడు సృంజయుఁ జేరి సుకుమారి పూర్వ జన్మమున మాలావతి యను తన భార్యయనియు, నామె సహగమనము చేయు తఱి మఱు జన్మమునఁ దనకే భార్యగా శివ వరప్రసాదము నందె ననియుఁ దెలిపి సుకుమారి యొడంబడ నామెను వివాహమయ్యెను. పర్వత శాపమున నారదుఁడు వెంటనే వానర వదనుఁ డయ్యెను. కాని సుకుమారి విరక్త గాక పతివ్రతయై నారదు నారాధించుచుండఁ జిరకాల మాతఁ డామె కడనుండి యిష్టకామోపభోగముల నందుచుండెను.

పర్వతుఁడు నారదశాపమున నాకమున కేగలేక భూతలము నందే యశేషజనపూజితుఁ డగుచుఁ దిరుగుచుఁ గొంతకాలమునకు నారదు కడకేగి యొంటరిగ నున్నప్పు డాతనితో మాటలాడెను. వా రుభయుల శాపము లొకరొక రుపసంహరించుకొనిరి. తోడనే నారదుఁడు పూర్వరూపప్రాప్తి నంది రాఁగా సుకుమారి యాతనిఁ బరపురుషునిగా భావించి వైదొలఁగఁ బర్వతుఁడు నిజశాపమోక్ష సంవిధానము తెఱిఁగింప నామె యానందించి వారిఁ బూజించెను.*

## నారదుఁడు సృంజయు ననుగ్రహించుట:

నారదుఁడట్లు సుందరరూపుఁడై సుకుమారితోఁ జిరకాలము నుండి తనకు గమనేచ్ఛ కలుగఁగా సృంజయునిఁ బిలిచి "మామా! నీవు నేను గోరినట్లు సుకుమారి నిచ్చి వివాహ మొనర్చి నా కామితార్థ మీడేర్చితివి. నీ కేదేని ప్రత్యుపకృతిఁ జేయవలెనని యున్నది. కావున, వర మొకటి కోరుకొను" మన సృంజయుఁడు సంతసించి "నారదా! నీవు కటాక్షించి నా యల్లుఁడ వైతివి. ఇంతకు మించి నాకు వరమేమి కావలయు?" నని పలుక నారదుఁ డనిమిషుల మిగుల తనయునిఁ గాంతు వని దీవించెను. వెంటనే పర్వతుఁ డింద్ర తేజోరక్షణాయత్తచిత్తుఁడై "సృంజయా! నీ కుమారుఁడు దీర్ఘాయురుపేతుఁడు గాకుండుఁగాక!" యని పలికెను. సృంజయుఁడు ప్రార్థింప నారదుఁడు "సృంజయా! నీకు భయము వలదు. ఇంద్రుఁడాతని సంహరించుచో నన్నుఁ దలంపుము. నే బ్రదికింతు. మఱియు నీ కుమారుని మలమూత్ర లాలాశ్రు స్వేదములు సువర్ణ మయము లగు" నని వర మిచ్చి పర్వతునితో వెడలిపోయెను.

నారదునిదీవన ననుసరించి సృంజయునకు నిష్ఠీవనాదులు కనకమయము లగు సువర్ణష్ఠీవి జనించెను. సృంజయుని యిల్లు

* భారతము. శాంతిపర్వము.

పుత్త్రినివలన స్వర్ణమయ మగుచుండఁ గొందఱు చోరు లాతనిఁ గొంపోయి యా బాలునిఁ జంపి కడుపులో బంగారము లేకుండుటఁ జూచి విచారించి వెడలిపోయిరి. సృంజయుని పుత్త్రి నింద్రుఁడు చంపి యుండు నని నారదుఁడు దలంచెను. నారదుఁడు వెంటనేవచ్చి చనిపోయిన వానికై వగచుట యవివేక మని షోడశమహారాజుల చరిత్రములు దెల్పి సువర్ణష్ఠీవిని బ్రతికించి వెడలిపోయెను.

మఱియొక పర్యాయ మింద్రుఁడు సువర్ణష్ఠీవి కతమున నాత్మ తేజోగరిమ తఱుఁగుటఁ గని యాతని నెట్లేనిఁ గడదేర్ప నుద్దేశించి బృహస్పతి యాలోచనముఁ గొని తన వజ్రాయుధమును శార్దూల రూపమున సువర్ణష్ఠీవిని జంపఁ బుత్తెంచెను. నాఁటినుండి వజ్రము నింద్రుని పనిఁ జేయఁ బూనియుండెను. ఒకనాఁడు సృంజయుఁడు భార్యాపుత్త్ర పరివారసహితుఁడై భాగీరథీతీర కాంతారప్రదేశమున విహరించుచుండెను. సువర్ణష్ఠీవి యందుఁ గుసుమాపచయముఖ బహువిధకేళీతత్పరత నుండఁగా దంభోళి వంచనఁ బొంచి శార్దూలరూపమున నాతనిఁ జంపి యంతర్హిత మయ్యెను. సృంజయుఁడు చచ్చిన బాలుఁ జూచి శోకాలాపముల నారదునిఁ దలఁచెను. నారదుఁడు నింద్రుని విరోధ ముడిపి వచ్చి సువర్ణష్ఠీవిని బ్రతికించెను. పిమ్మట సువర్ణష్ఠీవి తండ్రి యాజ్ఞ పాలించుచు నాతని యనంతరము పృథ్వీ భారము వహించి శిష్టానుగ్రహ దుష్టశిక్షణముల నెఱపుచు బహువిధ యజ్ఞము లొనర్చుచు శతాధిక సహస్ర వర్షములు రాజ్య మేలెను.*

## నారదుని దక్షుఁడు శపించుట.

నారదుఁ డటనుండి సుకుమారి నొప్పించి పోయి త్రిలోక సంచారమున దినములు పుచ్చుచుండెను. ఒకనాఁ డాతఁడు నారాయణ సరస్సను తీర్థరాజముకడ దక్షపుత్త్రిలు పితృనిర్దేశమునఁ బ్రజా

* భారతము, ద్రోణపర్వము; శాంతిపర్వము.

సంసర్గముకొఱకు మహోగ్ర తపము చేయుచుండఁ గాంచి వారికి జన్మహేతువైన జనకుని నిర్దేశము పాటింపఁ దగ దని చెప్పి వారి కాత్మజ్ఞానోద్బోధము చేయ వా రట్లొనర్చి పుణ్యగతిఁ గనిరి. నారదుఁ డీ విషయమునెల్ల దక్షునకుఁ జెప్పి వెడలిపోయెను. దక్షుఁడు బ్రహ్మ కడకేగి విన్నవింప నాతఁ డోదార్చి దక్షునకు శబళాశ్వులను సహస్ర సంఖ్యలు పుత్త్రు లుదయింప ననుగ్రహించెను. దక్షుఁడు నట్లు తిరిగి పుత్త్రవంతుఁడై వారిని బ్రజాసృష్టికిఁ బురికొల్ప వారును దపమున కేగిరి.

నారదుఁడు యథాపూర్వము వారికిని దత్త్వోపదేశము చేసి సంసర్గమును మాన్పించెను. దక్షుఁ డీ సంగతి నెఱిఁగి నారదు నుద్దేశించి "నారదా! నీవు దేవర్షి పితృఋణములు మీమాంసిత కర్మలు గల నా బాలురకు బుద్ధిఁ జెఱచి యుభయ లోకముల శ్రేయోహాని నొనర్చితివి. కావున భాగవతులలో లజ్జాహీనుఁడవై చరింతువుగాక! సకల భూతములు గ్రహములు తారకములు ని న్నందఱి పట్లునఁ గలహంకారివని తలంచును గాక! నీ చేత స్నేహపాశ నికృంతనమైన మిత్త్రభేదమే కాని తదుపశమము కలుగకుండుఁ గాక! ఇంతనుండి పురుషుఁడు విషయతీక్ష్ణత్వము ననుభవించిననేకాని తెలియకుండెడి జ్ఞానము తనంతనె కాని యొరులచే బోధింపఁబడి తెలియరాకుండుఁ గాక! నిరంతరమును జరించు నీ కేలోకమున నునికిపట్టు లేకుండుఁ గాక!" యని శపించెను. నారదుఁడు సర్వాతీతుఁడయిన సర్వేశ్వరుఁ డనఁబరగి మహాశాంతుఁ డగుటఁ దక్షక్రోధ వాక్యముల కలుగక సమ్మతించి వెడలిపోయెను. నాఁటినుండి నారదుఁ డస్ఖలిత బ్రహ్మచారియై త్రిలోకముల బహిరంతరముల మహావిష్ణు ననుగ్రహమున నడ్డులేక యీశ్వరదత్తమై బ్రహ్మాభివ్యంజకములైన సప్తస్వరములు దమయంతనమ్రోయు మహతి యను వీణను జేఁబూని నారాయణ కథాగానము చేయుచుఁ దిరుగుచుండెను. విష్ణుమూర్తియు నత్యంత

కరుణాపరత్వమున నిరంతరము నారదుని మనమునఁ గానవచ్చుచు భక్తవత్సలుఁడై యుండెను.*

## నారదుఁడు వ్యాసునకు విష్ణుభక్తి బోధించుట

వ్యాసమహర్షి దీనవత్సలుఁ డయి వేదపఠనార్హత లేని స్త్రీ శూద్రాదులకై మహాభారతమును రచించియు నాత్మానందము నందలేక భాగవత విధము పలుక లేనైతిఁ గదా యని పరితపించు చుండెను, ఆ సమయమున నారదుఁడు వ్యాసుని సమీపింపఁ నాతఁ డాదరించి "నారదా! నీ వజునకుఁ బుట్టి పురాణపురుషుని భజనముఁ జేపట్టి మహాప్రబోధమునఁ దుదిముట్టితివి. నీవు సూర్యునిభంగి ముల్లోకములఁ జరింతువు. వాయువురీతి నఖిలజనులలో మెలంగుదువు. నీ వెఱుఁగరాని ధర్మములేదు. కాన, దయయుంచి నాకుఁ గల లోపము దెల్పవే" యని ప్రార్థించెను, నారదుఁడు సంతసించి "వ్యాసా! నీవు సమస్త ధర్మములు చెప్పితివి. కాని హరిని గోరి నుతింపవు. నిరుపాధికమైన జ్ఞానము హరిభక్తి లేక శోభితముగాదు. నీవు మహానుభావుఁడవు; యథార్థదర్శనుఁడవు. దిగంతవిశ్రాంత కీర్తివి. సత్యరతుఁడవు, దృఢవ్రతుఁడవు, నిఖిలబంధమోచనమునకై వాసుదేవుని లీలావిశేషములు భక్తితో వర్ణింపుము. అతఁ డెట్టివాఁ డంటివా! విష్ణుఁడే విశ్వము. విష్ణునికంటె వేఱేమియు లేదు. విశ్వమునకు భవవృద్ధి లయము లాపరమేశునిచేతనే యగు. నేను విష్ణు నారాధించియే యీ స్థితి నుంటి" నని తన పూర్వజన్మ వృత్తాంత మాతని కెఱిఁగించి యాతఁడు యథేచ్ఛ మేగెను. ఈ భక్తితత్త్వమే విఖ్యాతి నందినది. వ్యాసుఁడు నారాయణభక్తి యుక్తుఁడై శ్రీమద్భాగవతము రచించి శ్రీశుకునిచేఁ జదివించి స్థిరజ్ఞాని యయ్యెను.✦

---

* భాగవతము, షష్ఠస్కంధము.

✦ భాగవతము ప్రథమస్కంధము.

## నారదుఁడు సనత్సుజాతునిచే దత్త్వోపదేశము నందుట:

నారదమహర్షి సంచరించుచు సోదరుఁ డగు సనత్సుజాతునిఁ జూడఁగోరఁగా మేరుశిఖర సమీపమున నొకనాఁడు సనత్సుజాతుఁ డంగుష్ఠమాత్ర ప్రమాణమూర్తితోఁ బ్రజ్వల దనలస్ఫూర్తి నెదురాయెను. నారదుఁ డాతని సల్లాపసౌఖ్య మాశించి తత్త్వోపదేశము చేయుమన సనత్సుజాతుఁడు నారదు నుపలాలించి యిట్లు పలికెను. "దశకల్ప సహస్రములు నిశయు నంతియె పరిమాణముకల కాలము దినముఁ గల్గి, పరమేశ్వరుఁడు రాత్రి నిద్రించి ప్రభాత మైన మేల్కని యంబువుల సృజించి తన వీర్యము దాని యం దిడఁగా నది హేమస్ఫురణమై మహాండ మగును; అంతనొక బ్రహ్మ నతఁడు గల్పించి దానికి వానినే పతిని జేయును. అతఁ డహంకార మంది మనసు, దశేంద్రియములు, బుద్ధి, పంచభూతములు సృజించి శబ్దస్పర్శరూప రసగంధాదు లావహించి క్రమముగా దేవ ముని దానవ గంధర్వ కిన్నర నరాది జంతుజాలములఁ గల్పించును. ఇవన్నియు నహంకార వ్యాప్తములై యవ్యక్తసాగరమున మగ్నోన్మగ్నములగును. వీని ప్రభవస్థితి విలయములకు శుభాశుభములకు విష్ణుఁడే విభుఁడై నడపుచు విభవోజ్జ్వలుఁ డగును. మఱియు నధ్యాత్మాధిభూతాధి దైవతములు బుద్ధీంద్రియ ప్రపంచము నెల్ల విష్ణువునం దుద్భవమై లయమగును. మూలప్రకృతి యవ్యక్తమై పురుషచైతన్యము నెక్కొనఁ జేతనమై భువనతంత్రము నడుపుచుండును. ఈ విధముగా నంబుజాక్షుఁడు పట్టుఁగొమ్మ కాఁగా భావభవహరుఁడు హరుని యనుమతమున నఖిలాబ్జజాండములు పుట్టించి గిట్టించు చుండును." ఇది విని నారదుఁడు చరితార్థుఁ డాయెను. అంత వా రొకరి నొకరు వీడ్కొని వెడలిపోయిరి.

## నారదుఁడు ప్రాచీనబర్హికి జ్ఞానమార్గమును దెలుపుట:

పూర్వ మొకప్పుడు పృథుచక్రవర్తి పౌత్త్రుఁడగు ప్రాచీనబర్హి ఘనకర్మాయత్త చిత్తుఁడై బహుయజ్ఞాదికము లొనర్చి యితోధిక

కర్మావలంబియై యున్న నారదుఁ డేతెంచి "రాజా! కర్మాధీనుఁడవై యే శ్రేయము నాశింతువు? వీనివలన నీ కా శ్రేయము కలుగ" దనఁగాఁ బ్రాచీనబర్హి నారదుఁ బూజించి జ్ఞానోపదేశముఁ జేయుమని కోరెను. నారదుఁడు కరుణించి పురంధరరాజకథామిషమున నధ్యాత్మ తత్త్వములు దెలిపి "రాజా! ప్రాగగ్రములగు దర్భలచేత సకల క్షితి మండలాస్తరణముఁ గావించి యహంకారి వైతివి. కర్మ విద్యా స్వరూపము తెలియఁగవైతివి. సర్వేశ్వర పరితోషక మేదియో యదియ కర్మము. ఆ సర్వేశ్వరునియం దేమిటు మతి సంభవించునో యదియే విద్య. అతఁడే దేహుల కాత్మయు నీశ్వరుఁడు నగుచుండు. పురుష లకు క్షేమకర మగు నాశ్రయ మాతని పాదమూలమే. మృత్యువు భీతి గలిగించుచుండ నంగనాజన నివాసముల క్షుద్రతమ మగు కామ్య కర్మపరిపాక జనితమైనజిహ్వోపస్థాదికామసుఖలేశము నన్వేషించుచు విహరించు జీవుని మృగచేష్టితముగా విచారించి యసజ్జన యూథ వార్తానహితమైన గృహాశ్రయము విడచి సకల జీవాశ్రయుఁ డైన యీశ్వరుని భజించి సర్వతో విరక్తచిత్తుఁడవై చరింపు" మని బోధిం చెను *

## నారదుఁడు వపువను నప్సరోవనితకు గర్వభంగ మొన రించుట:

ఒకనాఁడు నారదుఁ డింద్రసభా విశేషములఁ దిలకింప నట కేగెను. ఆ సమయమున రంభాద్యప్సరసలు నృత్యవిద్యా విశేషమున నిలింపుల నోలలాడించుచుండిరి. కొంతసేపటి కింద్రుఁడు "నారద సంయమీంద్రా! ఈ యప్సరసలలో నెవతె యెక్కువ ప్రవీణయో నాకుఁ దెలియరాకున్నది. నీవు బరికించితివి గావున సమర్థుఁడవై నిర్ణయింపు" మని కోరెను. అంత నా యచ్చరలేమ లందఱు విజ్ఞ

* భాగవతము చతుర్థస్కంధము.

వీఁగుచుఁ దమతమ యాధిక్యముల నుగ్గడించుకొనుచుండ నారదుఁ డిట్లనెను. "అచ్చర లేమలారా! పరీక్షలేనిదే శక్తి తెలియదు కదా? కాన నేఁడు మహాతపోనిష్ఠుడైన దుర్వాసస్సంయమీంద్రు నెవతె లోలునిఁ జేయఁగలదో యామెయే నిపుణ యని నిర్ణయింతు ననెను. ఆ పని కెవ్వరును సాహసింపలేక తమ యోటమి నంగీకరించిరి. వపు వను నప్సరసమాత్రము "ఇదియేనా పరీక్ష! నేను క్షణములో నాతని వశపఱచుకొందు" నని ప్రగల్భములు పలికెను. నారదుఁ డామెకు గర్వభంగ మొనరింప నెంచి యింద్రునితోఁ జెప్పి యామెను దుర్వాసోముని తపోభూమికిఁ బంపించెను. వపు వట కేగి తనహావ భావ విలాసాదులు నెఱపుచుండ దుర్వాసుఁడు లోలుఁడు కాక తపోభంగ మొనరింప నెంచిన వపువును పక్షివై పుట్టుమని శపించెను.*

## నారదుఁడు స్త్రీయై పుత్త్రులఁ గన్న వృత్తాంతము :

నారాయణ వరభక్తులలోఁ దనయంతవాఁడు లేఁడని నారదున కొకపరి గర్వ ముదయించెను. నారాయణుని దాను దక్క నితరులు గ్రహింపలేరనియు నతఁడు నమ్మియుండెను. ఈ స్థితిలో నారదుఁడొకపరి విష్ణుదర్శనలాలసుఁడై శ్వేతద్వీపమునకుఁ బోవ నందు మన్మథాకారులు శంఖచక్రగదాపాణు లగు దివ్యపురుషులు గానవైరి. నారదుఁ డందు శ్రీవిష్ణుమూర్తి యెవరో తెలిసికొనలేక యాతని గుఱించి ప్రార్థించెను. అంత విష్ణుమూర్తి కానవై యేమి కావలెనని యడుగ విష్ణుమాయా వివరణ మొనరింపఁ గోరెను. విష్ణుమూర్తి "నారదా! నీకుఁ దెలియని దేమి కలదు? నన్ను గుర్తింపఁ గల్గినవాఁడవు నీ వొక్కఁడవే కదా!" యనఁగా నారదుఁ డంగీకరించెను. అంత విష్ణువు "నారదా! ఈ సమీపమునఁ గల కొలనిలో సుస్నాతుఁడవై రమ్ము. నీ కొక రహ

* మార్కండేయ పురాణము.

స్యముఁ దెలుపుదు" ననెను. నారదుఁ డట్లే యని యా కొలనిలో మునుఁగఁ గానే స్త్రీయై, గట్టెక్కఁగనే బాలికయై పోయెను. అంత నా దారినిబోవు కాశీరాజు బిడ్డలులేని వాఁ డగుట నా కొలని దరిఁ బడి యున్న యా బాలికఁ గొనిపోయి పెంచి పెద్దదాని నొనర్చి శిబి యను రాజకుమారున కిచ్చి పెండ్లి చేసెను. ఆమె చారుమతి యన బరఁగుచు శిబివలన నగ్నిజిత్తు, విప్రజిత్తు, విచిత్తు, చారువక్త్రుఁడు, చిత్రుఁడు నను పుత్త్రులఁ గనెను. వా రధికబల సంపన్నులై విజయము లంది మరణింపఁగనే చారుమతి పుత్త్రమరణ ఖిన్నహృదయయై యగ్నిలోఁ బడి మరణింప నుద్యుక్త కాఁగా వెంటనే పూర్వ నారద రూపమువచ్చెను. నారదుఁ డాశ్చర్యపడి యదియంతయు విష్ణుమాయ యని యెఱిఁగి విష్ణుమాయావిలాస మొక్క విష్ణువునకుఁ దక్క నన్యు లకుఁ దెలియదని తెలిసికొని నాఁటినుండి నిగర్వి చూడామణియై నెగడెను.*

## నారదమహర్షి చిత్రకేతునకు జ్ఞాన ముపదేశించుట:

పూర్వము శూరసేనాధీశ్వరుఁ డగు చిత్రకేతుఁ డను రా జఖిలై శ్వర్యము లనుభవించుచు నంగిరసుని కృపవలన భార్యయగు కృత ద్యుతియందు సుపుత్త్రునిఁ బడసెను. చిత్రకేతుని యితర భార్య లసూయాగ్రస్తలై యొకనాఁ డా బాలుని దుర్విషమునఁ జంపివేసిరి. చిత్రకేతుఁ డమితార్తి ననుశోకించుచుండ నంగిరసుఁడు నారదుఁడు నరుదెంచి యాతని ననునయించిరి. నారదుఁ డా బాలునకుఁ బ్రాణ మిచ్చి యాతనిచేఁ జిత్రకేతునకుఁ గర్మవశమైన యాతని పుత్త్రభావ ముపన్యసింపఁ జేసెను. చిత్రకేతుఁడు తత్త్వమెఱిఁగి నారదునకు నమస్కరించి యాతనిచే బోధితుఁడై తరించెను.•

---

* వరాహపురాణము.

• భాగవతము షష్ఠస్కంధము.

**నారదమహర్షి ధర్మరాజున కుపకరించుట :**

నారదమహర్షి యుధిష్ఠిరుని కడ కరుదెంచి యాతని యోగ క్షేమాదికము నడిగి యింద్ర యమ కుబేర వరుణ బ్రహ్మ సభావృత్తాంతములఁ జెప్పి పాండ్యరాజు ధర్మరాజునకు రాజసూయ మొనరింపఁ దెలుపుటఁ దెలిపి, యాతని నందులకుఁ బ్రోత్సహించెను. శ్రీకృష్ణుని కడ కేగి ధర్మరాజు రాజసూయము నిర్విఘ్నముగా నెరవేర్పుమని చెప్పి పంపెను.

రాజసూయ సమయమున శిశుపాలుఁడు హరిని నిందించి నిశితనిర్వక్రచక్రధారాదళితమస్తకుఁ డయి తేజోరూపమున హరిం బ్రవేశింపఁగా ధర్మజుఁ డందలి రహస్యమును జెప్పుమని నారదు నడిగెను. నారదుఁడు "యుధిష్ఠిరా! అలుక, చెలిమి, భీతి, కామము, బాంధవము, విరోధము మున్నగువానిలో దేనివలననైన శ్రీహరినిఁ బ్రాపింపవచ్చును, కామోత్కంఠచే గోపికలు, భయమున గంసుఁడు, వైరక్రియ శిశుపాలుఁడు, సంబంధులై వృష్ణులు, ప్రేమచే మీ సోదరులు, భక్తిచే మేము శ్రీకృష్ణునిఁ గన సాధ్యమైన"దని చెప్పి సనకసనందులచే శాపగ్రస్తులై జయవిజయులు హిరణ్యాక్షహిరణ్యకశిపులైన వృత్తాంతము, ప్రహ్లాదచరిత్రము, త్రిపురాసుర వృత్తాంతము సమగ్రముగా వినిపించెను.

తరువాత ధర్మజుని కోరికపై నారదుఁడు వర్ణాశ్రమధర్మములనిట్లుపన్యసించెను. "రాజా! సకల వర్ణములకు సత్యము, దయ, ఉపవాసాదితపము, శౌచము, సైరణ, సదసద్వివేకము, మనోలయము, బహిరింద్రియ జయము, అహింస, బ్రహ్మచర్యము, దానము, యథోచిత జపము, సంతోషము, మార్దవము, సమదర్శనము, మహాజనసేవ, గ్రామ్యకాంక్షావిసర్జనము, నిష్ఫలక్రియావర్జనము, మితభాషిత్వము, దేహముకాని తన్ను వెదకికొనుట, అన్నోదకములు ప్రాణులకుఁ బంచి

యిచ్చుట, ప్రాణులందు దేవతాబుద్ధి, నారాయణచరణ స్మరణ కీర్తన శ్రవణ సేవార్చన నమస్కార దాస్యాత్మసమర్పణ సఖ్యము లను లక్షణ ములు కలుగవలయును. అందు సత్కులాచారుఁ డయి మంత్రవంతము లైన గర్భాధానాది సంస్కారము లవిచ్ఛిన్నముగాఁ గలవాఁడు బ్రాహ్మ ణుఁడు. అతనికి యజనయాజనాధ్యయనాధ్యాపనదానప్రతిగ్రహ షట్కర్మములు విహితములు. రాజునకుఁ బ్రతిగ్రహ వ్యతిరిక్తములైన యజనాది కర్మము లైదును, ప్రజాపాలనము, బ్రాహ్మణేతరులనుండి దండశుల్కాదులఁ గొనుటయు విహితకర్మములు. వైశ్యునకుఁ గృషి వాణిజ్యగోరక్షణాది కర్మములును, బ్రాహ్మణకులానుసరణమును విహిత ములు. ఇఁక శూద్రునకు ద్విజశుశ్రూషయే విహితము. ఇట్లు నార దుఁడు ధర్మరాజున కనేక విషయముల ననేక పర్యాయములు బోధిం చెను. తుదకు ధృతరాష్ట్రాదులయొద్దఁ బాండవులతో సఖ్యమున మను మని దుర్యోధనునకు బోధించెను. ధృతరాష్ట్రాదుల మరణము పాండ వుల కితఁడే నివేదించెను. ధర్మజునకు స్వర్గమున నాతని మిత్త్రుల నితఁడే చూపెను.*

## నారదుని సత్కృతులు :

పరమపావనుఁ డగు నారదభగవానుఁడు త్రిలోకసంచారము చేయుచు నెందఱకో యెన్ని విధములనో భక్తిజ్ఞాన వైరాగ్యములను బోధించి తరింపఁ జేసెను. మహర్షులకు సైతము భగవద్విలాసము తెలుకపఱచి వారిని ప్రశాంతచిత్తుల నితఁ డొనరించెను. అకంపను నకు మృత్యుదేవతాప్రభావము చెప్పి యాతని దుఃఖము నివారిం చెను. సృంజయునకు షోడశమహారాజుల చరిత్రములు చెప్పి యాత నికిఁ దత్త్వజ్ఞానము నొసంగెను. హిరణ్యకశిపుని భార్యయగు లీలా వతి నింద్రుఁడు సంహరింపఁ బోవ నామె కడుపునఁ బ్రహ్లాదుఁ

* భాగవతము, సప్తమస్కంధము.

తుదయింపనుండు తెలిఁగించి యింద్రుని నివారించెను. ధ్రువుఁడు తపోవనమున కేగుచుండ నాతనికి విష్ణుభక్తి నినుమడింపఁ జేసి సద్విషయప్రబోధ మొనరించెను. శ్రీరామలక్ష్మణు లింద్రజిత్తు నాగాస్త్రముచే బంధింపఁబడి ఖిన్నులై యున్నపుడు నారదుఁడు గరుత్మంతుని స్మరింపుఁడని చెప్పి శ్రీరాముని శ్రీవిష్ణుతత్త్వమును గొనియాడి కాపాడెను. ఈతఁడు భీష్మున కంబాది వృత్తాంతము, ధర్మజునకుఁ గర్ణాదుల వృత్తాంతము, ఇంద్రునకు భృగునామక విప్రవృత్తాంతము, వసుదేవునకు విదేహర్షభుని వృత్తాంతము, శ్రీకృష్ణున కనిరుద్ధవృత్తాంతము, వ్యాసున కాత్మవృత్తాంతముఁ దెలిపెను.

నారదుఁడు దుష్టశిక్షణమునకై దుష్టులను శిష్టులపైఁ బోఁజేసి యుభయులకుఁ గలహము సిద్ధింపఁజేసి యందు దుష్టులు మరణింప సాధకుఁడై లోకోపకారకుఁ డయ్యెను. ఈ కారణముననే యాతనికిఁ గలహాభోజనుఁ డను పేరు కలిగెను. ఉదాహరణమునకుఁ గొన్నిటిఁ జూతము. జలంధరాసురుఁడు దేవతలను జయించి విఱ్ఱవీఁగుచుండ నాతనివలన లోకోపద్రవము సంభవించెను. అపుడు నారదుఁ డాతని కడ కేగి స్తుతించి "జలంధరా! నీవు సర్వలక్ష్మీసమన్వితుఁడవే కాని జయలక్ష్మి నీకు సరియైనది కాదు. త్రిలోకసుందరి యగు పార్వతి శివు నాశ్రయించి యున్నది. శ్మశానవాసి యగు భిక్షున కామె యేల? నీ వామెను బట్టినచో నీకిఁక గొఱఁత యుండ"దని ప్రేరేచెను. ఆ జలంధరుఁడును నిక్కమనుకొని శివునితోఁడి వైరమున భస్మీభూతుఁడు కాఁగా జగద్ధితము వాటిల్లెను. నారదుఁడే రావణుని కడ కేగి యాతనిని యముఁడు, వాలి, కపిలుఁడు మున్నగువారిపై దండెత్తి యోడింపుమని పురికొల్పి వారి కడ కేగి దుర్మార్గుఁ డగు రావణుని పీఁచ మడఁపుఁడని వారికిఁ జెప్పెను. ఆ కారణమున రావణుఁడు పరాభవింపఁబడెను. మహిషాసురుఁడు లోకములకు మహోపద్రవ మొనరించుచుండ నాతఁడు మలయపర్వతమున నున్న నారాయణి కడకేగి,

"అమ్మా! దుర్మార్గుఁ డగు మహిషాసురుఁడు నిన్ను వివాహమాడునఁట! నీవు వానిని సంహరింప నుపాయ మూహింపు"మని యామెకుఁ జెప్పి మహిషాసురుని కడకేగి స్తుతించి "ఓయీ! నీవు మలయపర్వతమున గల నారాయణిని వివాహ మాడనిచో నీ యౌవన మేల కాల్పనా!" యని యాతని కామెపైఁ బ్రేమ మొదలించి యామెచేత నాతనిఁ జంపించి లోకహిత మొనర్చెను. నారదుఁడే శ్రీకృష్ణునకు రుక్మిణీపరిణయ వృత్తాంతముఁ జెప్పి యామెను గాంధర్వమున వివాహమాడుమని ప్రేరేచెను. కంసునకుఁ గృష్ణవృత్తాంతముఁ జెప్పి ధనుర్యాగ వ్యాజమున కృష్ణునిచేఁ గంసుఁ డడఁగునట్లు చేసిన మూలకారణుఁడు నారదుఁడే.

ఈ విధముగా నారదమహర్షి బహువిధముల లోకోపకారియై విశ్వహితము నొదవించెను.

## నారదునకుఁ బురాణములతోడి సంబంధము :

నారదమహర్షి తురుష్కుల జననము, అన్నదానమహిమ, శివ ధనుస్సును జనకుఁడు పొందుట, సాక్షి గోపాలుని చరిత్రము, జగన్నాథక్షేత్రమందలి నీలచక్రవృత్తాంతము మున్నగు విషయములుగల యొక పురాణము వ్యాసమహర్షికి బోధించి వ్రాయింపఁ జేసెను. ఇదియే నారదపురాణ మను పేర వెలయుచున్నది. నారదుఁడు బ్రహ్మ కడ కేగినపుడు భవిష్యపురాణము లేక కల్కిపురాణముఁ దెలిసికొని వచ్చి వ్యాసునకుఁ జెప్ప నాతఁ డా పురాణమును లిఖించెను. పులస్త్య మహర్షి కడకేగి నారదుఁడు వామనపురాణమును విని వ్యాసమహర్షి కిఁ జెప్పి వ్రాయించెను. మఱియు మత్స్యపురాణమును నారదుఁడే యింద్రద్యుమ్న మహారాజునకు బోధించెను. ఇతఁడు నారాయణ ఋషికడ బ్రహ్మవైవర్తపురాణము విని వ్యాసునకుఁ జెప్పి వ్రాయించెను. తరువాత, శ్రీమద్భాగవతపురాణమును గూడ నారద ప్రోత్సా

హాముననే వ్యాసమహర్షి గ్రంథస్థ మొనరించెను. నారద విరించి సంవాదమే శివపురాణమందలి జ్ఞానసంహిత.

నారదుఁడు సమస్త వేదశాస్త్రములను నృత్తవాద్యవిద్యా విశేషములను బాగుగా నెఱిఁగియు బ్రహ్మజ్ఞానము నెఱుఁగక సనత్కుమారుని కడకేగి యాతనిచే బోధితుఁడై బ్రహ్మజ్ఞాని యయ్యెను.

## నారదుఁడు శ్రీశుకునకుఁ దత్త్వము బోధించుట :

నారదమహర్షి యొకనాఁడు వ్యాసాశ్రమమున కేగి వేదనినాదము వినరాకుండుటఁ గాంచి వ్యాసునిఁ గారణమడిగెను. వ్యాసుఁడు శిష్యులటు లేరని చెప్ప నారదుఁడు "బ్రహ్మర్షివర్యా! మీరును, సుతుఁడునైన నా నియమముఁ బాటింపవలదా? వేదనినాదము వినరాకుండినచో లోటు వాటిల్లును. కాన నట్లొనర్పుఁ"డని కోరెను. అంత వ్యాసుఁడు సుతునితో వేదపఠన మారంభించి భువనమంతయు నాదపూరితము చేసెను. కొంతసరికి వ్యాసుఁడు కుమారుని విడచి యాకాశగంగాప్రపాతస్థలికి స్నానార్థ మేగెను. ఈ సమయమున నారదుఁడు శ్రీశుకుని వేదనాద మాలించి యానందించి వరమొందుఁ గోరుకొను మనెను. శ్రీశుకుఁడు "నారదా! ఈ లోకమున జనించిన వానికి హితప్రద మేదియో తెలుపు"మని కోరెను. నారదుఁడు "వత్సా! ఈ లోకమున జనించినవాఁడు ముక్తి కుత్సహింపక భవసక్తుఁడైనచో మఱి యే జన్మముునను దాని నాతఁ డొందఁజాలఁడు. కామక్రోధములు రెండును జయించినవానికి సంసార మహంకార రహితమగును. అపరిగ్రహసర్వారంభ పరిత్యాగములు దుఃఖపుఁదెరువుఁద్రోచి మోక్షపథముఁ జూపును. భూతస్పర్శనదర్శన సంభాషాతరలత నొందమియే మోక్షసుఖగరిష్ఠతకుఁ దెరువు. అహింస, ఇంద్రియజయము, నైరాశ్యము, అచపలత్వము కలుగువాని కాత్మమహిమ కరతలామలకమగును. ఇఁక బుత్త్రదారమిత్త్రసక్తుఁడు, భోగజాలపరుఁడు, రొంపిఁ

బడిన గజమువలెఁ దరింపఁజాలఁడు. ధర్మాధర్మములు సత్యానత్య ములు విడచినవాఁడు మహాయోగి. అహింసచే నధర్మము సంకల్ప వర్జనముచే ధర్మము వీడవలెను. ఆత్మవిభావనచేతనే బుద్ధి విలీనతఁ బొందును. భూతములు నింద్రియములు ప్రోవుగట్టియున్న యీ శరీ రమునకుఁ గలుగు దుఃఖములకు విచారించువాఁడు ఊరివారికిఁ గలి గిన బాధలు తనవనుకొని శోకించు మూర్ఖునివంటివాఁ"డని బోధింప శ్రీశుకుఁడు మహాయోగియై సుస్థిరవిజ్ఞానము నందెను.*

## నారదుఁడు విష్ణుమూర్తి యాధిక్యమెఱిఁగిన వృత్తాంతము:

తొల్లి యొకనాఁడు నారదుఁడు గంగానదీపవిత్ర జలములఁ బరమనియమముతోఁ ద్రిషవణస్నాననిరూఢుఁడై యుండఁగా నాతని సమీపమునఁ గ్రోశమాత్రపరిమితిగల కూర్మ మొకటి యాతనికిఁ గానవచ్చెను. నారదుఁ డానందముతో నా కూర్మదేహమును హస్త ముతో నిమిరి లాలించి "కూర్మరాజా! ఏమి నీ యదృష్టము! వీ దెట్లు జరుగుచున్నను నిర్విచారుఁడవై యీ జలములకు రాజవై సంచ రింతువు. నీకంటె ధన్యుఁ డింకొకఁడు గలఁడే!" యని స్తుతించెను. ఆ తాఁబేలు "మహాపురుషా! నన్నింతగా నేల కొనియాడుదువు? ఈ గంగాజలములు లేకున్న నేనెట్టిగతికిఁ బాల్పడవలసి యుండునో కదా! కావున జాహ్నవిని నీవు నుతింపుము, కాని నన్ను నుతింప వల"దని బదులు చెప్పెను. నారదుఁ డది సత్యమేయని గంగా భవానిని బొగడెను. అంత నా యమ సాకారయై వచ్చి "నారదా! నా గొప్ప యేమి? నా కంటెఁ బెద్దనదు లెందఱ జేర నేది రంగారు తరంగములఁ బొంగారునో యా సముద్రమును నుతింపుము. నన్ను వల"దని యదృశ్య యయ్యెను. పిమ్మట నారదుఁ డదియు సత్యమే యని సముద్రుని శ్లాఘించెను. సముద్రుఁడు సాకారుఁడై వచ్చి "ఋషి

* భారతము శాంతిపర్వము.

చంద్రా! నీవు నన్నేల నుతింతువు? భూదేవి లేనిచో నే నెటుఁ బ్రవహింతును? కావున నీ వామెను నుతించిన నుతింపుము గాని నన్ను వల"దని యదృశ్యుఁ డయ్యెను. నారదుఁ డాశ్చర్యమున నంత ధాత్రీమతల్లిని గొనియాడెను. భూదేవి "నారదా! మహాసత్త్వనము దీర్ఘములగు గోత్రాదులు నా సుస్థితికిఁ గారణము. కావున నా యాధిక్యమేమి గల"దని పలికెను. నారదుఁ డపుడు కులపర్వతములను వినుతించెను. అవి "అయ్యా! విశ్వాధారుఁ డగు పితామహుఁ డున్నవాఁడు. అతని సృష్టి పరమాణువుల మగు మాకుఁ బ్రశంస యెంతదవ్వు? పొ"మ్మనియెను. నారదుఁడు కమలగర్భునిపాలికిఁ బోయి యాతనిఁ బ్రశంసించెను. బ్రహ్మ "పుత్త్రా! నన్నేల నుతింతువు? పరమప్రభావములు సమస్త లోకధారకములు నగు వేదములే యస్మద్బుద్ధిబలము నుపబృంహితము చేయఁగలవు. వానిని గొనియాడుము, పొ"మ్మనఁగా నారదుఁడు వేదముల నారాధించి సాక్షాత్కారము నొందించికొని స్తుతించెను. వేదము లిట్లు చెప్పెను. "తపోధనా! మేము కలుగుట యజ్ఞములకొఱకు, యజ్ఞములు లేక మేము నిరర్థులము. కావున, యజ్ఞములఁ గొల్వుము మమ్ము నుతింపకుము." అంత నారదుఁడు యజ్ఞములఁ బ్రత్యక్షము గావించి కొని వానిని బహుభంగులఁ బ్రస్తుతించెను. అవి "మునీంద్రా! మాకు విష్ణుఁడే యాత్మ. అతఁడే మమ్ము నడపుచుండును కావున నాశ్చర్యధన్యశబ్దములకు వాచ్యుఁ డాతఁడే" యని వాక్రుచ్చెను. అంత నారదుఁడు విష్ణుమూర్తిని జేరి కొనియాడఁగా "నారదా! నేనే యజ్ఞమయుఁడను. ఆ యజ్ఞము సంపూర్ణదక్షిణతోఁ గూడినఁగాని యస్మదాత్మకము గానేర"దని యానతిచ్చెను. ఆ వాక్యసమాప్తి విని నారదుఁ డధికభక్తియుక్తి నతనిం గొనియాడి ధన్యుఁ డయ్యెను.

తరువాత యాదవులు దుర్యోధనాదిరాజన్యులు శ్రీకృష్ణుని గూడియున్నపుడు నారదుఁడు విష్ణువే శ్రీకృష్ణుఁడై జనించెనని చెప్పి

శ్రీకృష్ణుని యాధిక్యమును దెలుపుటకుఁ దన యనుభవమును వారికి విశదీకరించెను *

## నారదుఁ డప్సరసలకు వర మొసఁగుట:

నారదుఁ డొక పర్యాయము మానససరోవరమున స్నాన మొనరింప నభిలాషయొదవ నటకుఁ జనిన సమయమున నట విలాసముగ విహార మొనరించు విలాసిను లగు నచ్చరలఁ గాంచెను. రంభాదులగు నా యచ్చరలేమ లాతనికడ కరుదెంచి "నారదసంయమీంద్రా! చేతోభవునిఁ గన్న శౌరిని వరించు భాగ్యము మాకుఁ గలుగఁ జేయు" మని ప్రార్థించిరి. నారదుఁడంతఁ "కాంతలారా! ప్రాయపుమదమున నన్నుఁ గాంచినంతనే ప్రణత లగుట మఱచితిరి. అందులకు మిమ్ము ఘోరముగ శపింపవలసినదే. కాని మీ పూర్వపుణ్యవశమున శౌరి స్మరణ మూలమున నది దాఁటఁ గలిగితిరి. కావున మీరు ధన్యలు. మీకోరిక సిద్ధించు" నని వారి కనంతద్వాదశీవ్రతము సమూలముగ నుపదేశించెను. "అచ్చరలారా! మీ రీవ్రతము నొనరించిన పిమ్మట నీ సరోవరతీరముననే యష్టావక్రమహర్షినిఁ గనఁగలరు. ఆతని శాపవ్యాజమున మీరు గోపాలబాలికలై జనించి శ్రీకృష్ణుఁడై యవతరించిన శ్రీవిష్ణునిఁ బొందఁగలరు. కాని నా కొనర్చిన లోపమునను నా మహర్షి శాపమువలనను నంత్యకాలమునఁ గిరాతులచే మానభంగ మందుదు"రని చెప్పి నారదుఁడు యథేచ్ఛావిహారియై పోయెను.

## నారదుఁడు కృతయుగమునఁ గనుగొన్న చిత్రములు:

తొల్లి యొకప్పుడు ప్రియవ్రతుఁ డను రాజు బదరికావనమునఁ దపముచేయ నేతెంచెను. అప్పు డచటికి నారదమహర్షి విచ్చేయఁగాఁ బ్రియవ్రతుఁ డాతనికి నమస్కరించి అర్ఘ్యపాద్యములఁ బూజించి

* బ్రహ్మవైవర్తపురాణము శ్రీకృష్ణఖండము.

కృతయుగమున నారదుఁడు కనుగొన్న చిత్రములఁ జెప్పుమని కోరెను. నారదుఁ డిట్లు చెప్పెను. "రాజా! నే నొకప్పుడు శ్వేత ద్వీపమున కేగి యందొక రమ్యకాసారముఁ గంటిని. ఆ ప్రాంతమున నొకజగన్మోహిని విహరింపఁ జూచి నీ వెవ్వతె వని యామె నడిగితిని. ఆమె పక్కున నవ్వినది. అంత నా విద్య లెల్ల నన్ను వీడిపోయినవి. నేను భయపడి యామె శరణుఁ జొచ్చితిని. అంతలో నామె శరీరము నుండి యొక దివ్యతేజుఁడు, నాతని శరీరమునుండి యింకొక మహా తేజస్వి, వాని శరీరమునుండి యింకొక తేజస్వి పుట్టిరి. క్షణములో వారు మువ్వురు నదృశ్యులైరి. మరలఁ దొలియామె యట నిలిచెను. నే నామెను జేరి తల్లీ! "నీ వెవ్వతెవు? నా చదువు లిట్లు నన్ను వీడి పోవుటకుఁ గారణమేమి?" అని యడిగితిని. ఆమె "వత్సా? నేను సావిత్రిని. నా ప్రభావముఁ జూప నీవిద్య లపహరించితిని. నా శరీరము నుండి మొదటఁ బుట్టినవాఁడు ఋగ్వేదమని పేర్కొనఁదగిన నారా యణుఁడు, అతనినుండి పుట్టినవాఁడు యజుర్వేద మనఁదగిన బ్రహ్మ. ఆతనివలనఁ బుట్టినవాఁడు సామవేద మనందగిన రుద్రుఁడు. వీరు మువ్వురు అగ్నిత్రయము, వేదత్రయము, సవనత్రయము, వర్ణ త్రయము" అని తెలిపి ఆ విద్యలు నా కొసఁగి న న్నా కాసారమున స్నానముచేయు మని చెప్పి యామె యంతర్హిత యయ్యెను.

నే నా సరస్సున మునిఁగి లేవఁగనే నాకు వేయి జన్మముల పూర్వచరిత్ర తెలియవచ్చినది. ఒక జన్మమున నేను సారస్వతుఁ డను బ్రాహ్మణుఁడను. అపుడు నేను సర్వము విడిచి యీ సరోవరప్రాంత మునఁ బరమేశ్వరుని బ్రార్థించి ప్రత్యక్షము చేసికొంటిని. నే నాతని సాయుజ్యముఁ గోరితి. అతఁడు నీ కది బ్రహ్మ మానసపుత్త్రుఁడవై పుట్టిన పిదపఁ గలుగునని దీవించి యదృశ్యుఁ డయ్యెను. తరువాత నేను తపము చేసి దేహము విడతిని. పిదప బ్రహ్మమానసపుత్త్రుఁడనై పుట్టి దేవత్వసిద్ధి నందితిని" అని తెలిపి యేగెను.

నారద వాసుదేవ సంవాదము :

వసుదేవపుత్త్రుఁడగు శ్రీకృష్ణుఁ డొకపరి నారదుని "నారదా! నేను ప్రభుత్వ మను మహాదాస్యమున మ్రగ్గుచున్నాఁడను. మహాభోగి నయ్యు సర్వనిందాస్పదుఁడ నగుచున్నాను. జ్ఞాతుల బాధలు మిక్కుటము మగుచున్నవి. బలరాముఁడు బలవంతుఁడని, గదుఁడు మృదుస్వభావుఁ డని ప్రద్యుమ్నుఁ డందగాఁ డని గర్వించుచుఁ బరస్పర మసూయ గలిగి, వారివలె నుండని నన్నుఁ జూచి వేఱు విధమునఁ బ్రవర్తించుచున్నారు. నాకర్తవ్యమేమో చెప్పు"మని కోరెను.

అపుడు నారదుఁ డిట్లు చెప్పెను. "వాసుదేవా! బాహ్యములు అభ్యంతరములు నని వ్యథలు రెండు విధములు. ఈ నీ యాపద అభ్యంతరము దీనిని దాఁటుటెట్లో గ్రహింపఁగించెద వినుము. సంతత శాంతి, అన్నదానము, మృదుప్రవర్తనము, అర్హపూజ వీనిచే నీ జ్ఞాతుల హృదయముల నుపశమింపఁ జేయుము. వారిపై భేదబుద్ధిఁ బోనాడుము. శాంతము, ఇంద్రియనిగ్రహము, లోభపరిత్యాగము అనునవి ఈ పనికి సహకారులు. కావున, భేదబుద్ధిచే జ్ఞాతులకు వినాశము కలుగకుండ వర్తించి సుఖింపుము. సర్వజ్ఞుఁడ వగు నీ వెఱుఁగని దేమున్నది?"

ఆ మాటలకుఁ బ్రసన్నుఁడై వాసుదేవుఁడు నారదుని బూజించి వీడ్కొలిపెను.*

నారద ప్రశంస :

ఒకప్పుడు వాసుదేవుఁ డుగ్రసేనునికి నారదుని గూర్చి యిట్లు తెలిపెను. నారదుఁడు సాధుగుణసంపన్నుఁడు. దేహమునకు దుఃఖమును గలిగించు నహంకారము కాని, గౌరవాదరములు కావలెనన్న

---

* భారతము, శాంతిపర్వము.

తలంపులు కాని యాతనికి లేవు. అతఁడు వేదధర్మము ననుసరించి చరించువాఁ డగుట లోకపూజ్యుఁ డయ్యెను. అప్రీతి, కోపము, చాపల్యము, భయము నారదునియెడ మందు కైనఁ గానరావు. అతఁడు దీర్ఘసూత్రుఁడు కాఁడు. అతఁడు శౌర్యశూరుఁడు. లోభ ప్రమాదములచే నసత్యమాడి యెఱుఁగఁడు.. అతఁడు శాంతుఁడు, దాంతుఁడు, సర్వతత్త్వజ్ఞుఁడు, సత్యవాది. తేజము, జ్ఞానము, వినయము, కీర్తి, జన్మము, తపము నీతని యున్నతికిఁ గారణములు. నారదుఁడు పుణ్యకార్యములనే కాని, పాపకృత్యము లొనర్చి యెఱుఁగఁడు. అతఁడు లోభక్రోధ దైన్యశూన్యుఁడు. దృఢభక్తి, శాస్త్రజ్ఞానము, నిర్మోహము, అక్రోధము నీతనికి గౌరవ హేతువులు. సక్తునివలెఁ బైకిఁ గానవైనను ఈతఁడు సర్వసంగపరిత్యాగి. ఆత్మస్తుతి కాని, కామచింతనము కాని యీతఁ డెఱుఁగనే యెఱుఁగఁడు; ఈతఁడు ప్రజ్ఞానిధి, కృతపరిశ్రముఁడు, నిత్యయోగశీలి, సర్వశ్రేయోభిలాషి యగుటచేతనే ఈతనికి సర్వలోకపూజ్యత కలిగెను. ఈతఁడు దక్షుఁడు, శుచి, నిరామయుఁడు, కాలజ్ఞుఁడు. ఇట్టి మహాత్ముఁ డెట్టివారిచే నైన నెల్లప్పుడును స్తుతింపఁబడుటలో నచ్చెరు వే మున్నది?" ఉగ్రసేనుఁ డా మాటలు విని నారదుని మనమున మిక్కిలి నుతించెను.*

**నారద సమంగ సంవాదము :**

తొల్లి యొకప్పుడు నారదుఁడు సమంగుఁ డను ముని కడకేగి యాతని హృదయశాంతిఁ బరీక్షించుటకై "సమంగా! నీవు శోకమోహములు లేక సంతుష్టాంతరంగుఁడవై చరించుచున్నావు. ఉద్వేగము లేక యూఱట కలిగి నీ విట్లుండుటకుఁ గారణమే"మని యడిగెను. దాని కాతఁ డిట్లు బదులు చెప్పెను. "నారదా! ప్రాణుల భూత భవిష్య ద్వర్తమానములు, ప్రాణుల తత్త్వములు నే నెఱుఁగుదును. ఎవ్వరికైనను వారి వారి కర్మములఁ బట్టి కదా ఫలములు

* భారతము, శాంతిపర్వము.

కలుగుచుండును? సుఖదుఃఖములు దైవవశములు. మానవులు కర్మానుయాయులు. ఇంద్రియములే మోహశోకములఁ బొందునవి. సుఖమునకు పొంగు, దుఃఖమునకు క్రుంగు నాకు లేవు. లాభమునకు హర్షింపను. నష్టమునకు దుఃఖింపను. దుఃఖపరిత్యాగము, ధైర్యము ఈ రెండే నా సుఖమునకు హేతువులు. మఱియు సుఖదుఃఖములం దజ్ఞతను గలిగించు శోకమోహభయాదుల నేను సాక్షినై చూతును. అర్థకామములు, తృష్ణామోహములు ఇవి నాకుఁ గడుదవ్వులు. అమృతముఁ ద్రావినవాఁడు మృత్యువునకు జడియనట్లు నేను దేనికి జడియను. అందుచే నేను సంతుష్టుఁడనై ఉద్వేగము లేని యూఱట నందియున్నాఁడను." ఈ మాటలు విని నారదుఁడు సంతోషించి సమంగమునిని దీవించి యదృశ్యుఁడై పోయెను.*

## నారద గాలవ సంవాదము :

మోహాశ్రమములకు దూరమైనవాఁడు, జ్ఞానతృప్తుఁడు, జితేంద్రియుఁడు, నియమితాత్ముఁడు నగు నారదమహర్షికిఁ బ్రణమిల్లి గాలవుఁ డిట్లడిగెను. "దేవా! నీవు సర్వసద్గుణ సంపన్నుఁడవు. జ్ఞానప్రవృత్తి యెట్లు కలుగును? ఆశ్రమాచారములలో నేవి మేలు? పెక్కులగు శాస్త్రములు చూపు పెక్కు మార్గములలో శ్రేష్ఠమగు నొక్క మార్గముఁ దెలుపుము."

నారదుఁ డిట్లు చెప్పెను. "గాలవా! చతురాశ్రమములు ధర్మములు పరస్పర విరుద్ధముగాఁ దోఁచుట నిజమే. వానిని సద్గురువుల నాశ్రయించియే తెలిసికొనవలయును. మిత్రప్రీతి, శత్రునిగ్రహము, త్రివర్గసాధన, పాపకర్మవర్జనము, పుణ్యకార్యకరణము, సజ్జనసంగము ఇవి శ్రేయోమార్గములు.

---

* భారతము, శాంతిపర్వము.

దైవపూజ, పితృారాధనము, అతిథి సత్కారము, అహంకార వర్జనము, సత్యవచనము ఇవి శ్రేయఃప్రదములు." ఇంకను నారదుఁడు గాలవునకుఁ బెక్కువిషయములు తెలిసి యనుగ్రహించెను.*

## శ్రీకృష్ణ నారద సంవాదము :

ఒకప్పుడు బ్రాహ్మణ పూజాపరుఁడై యున్న నారదునిఁ జూచి శ్రీకృష్ణుఁడు నారదమునీంద్రా! సర్వలోక పూజ్యుఁడవగు నీకును బూజింపఁ దగినవారు కలరా? నీ నమస్కారముల కర్హు లెవరో వివరింపు" మని కోరెను.

అంత నారదుఁడు "కృష్ణా! వాయు వరుణాదిత్యులు, ఇంద్రాగ్నులు, స్థాణుస్కందులు, లక్ష్మీనారాయణులు, బ్రహ్మ, బృహస్పతి, చంద్రుఁడు, పృథ్వీజలములు, సరస్వతి వీరి నెవ్వ రారాధింతురో వారు నాకుఁ బూజ్యులు. తపోధనులు, వేదవేత్తలు, నాకు బూజ్యులు, నిత్యశాంతులు, దాంతులు జితేంద్రియులు, సత్యవచనులు నాకుఁ బూజ్యులు. స్వాధ్యాయవ్రత నిష్ఠులు, మౌనులు, దేవతా పూజాపరులగు గృహస్థులు, శిష్టాచార పరాయణులు, మున్నగు వారెల్లరు నాకుఁ బూజ్యులు. వాయుభక్షకులై, పర్ణాహారులై, వారి భక్షులై, శాకనీవారభుక్కులై, తపము లొనరించు మహాత్ములెల్లరు నాకుఁ బూజ్యులు. లోకజ్యేష్ఠులు, లోకసత్తములు, దమోహంతలు లోకకరులగు ఋషులు నా కారాధనీయులు." ఇట్లు నారదుఁడు తనకుఁ బూజనీయులైనవారిని బెక్కండ్రఁ గూర్చి వక్కాణింపఁగా శ్రీకృష్ణుఁడు నారదుని వినయ విశేషమున కెంతయు మెచ్చుకొని గౌరవించెను.♦

---

* భారతము, శాంతిపర్వము.

♦ భారతము ఆనుశాసనిక పర్వము.

## దేవకి నారద సంవాదము :

ఒకప్పుడు దేవదర్శనుఁడగు నారదమహర్షి ద్వారకానగరమునకు విచ్చేసెను. అప్పుడు ధర్మజ్ఞురాలగు దేవకీదేవి యాతని నర్ఘ్యపాద్యములఁ బూజించి అశ్విన్యాది నక్షత్రముల నన్నదాన ఫలమెట్టిదో వివరింపుమని నారదునిఁ గోరెను. నారదుఁ డామె కా విషయము సవిస్తరముగాఁ దెలిపి యామెచే నధిక పూజలఁ గాంచి వీడుకొనెను.*

## నారద భక్తి సూత్రములు :

నారదమహర్షి నామమును చిరస్థాయి యొనర్చినవి యాతని భక్తి సూత్రములు. వ్యాసభగవానున కాతఁడు విష్ణుభక్తిని గుఱించి వివరించి యీ సూత్రముల వాక్రుచ్చెనని ప్రతీతి. ఇవి యైదధ్యాయములతో నొప్పుచు భక్తితత్త్వము నద్వితీయముగఁ గొనియాడి పరమేశ్వరావ్యాజ కటాక్షమునకు భక్తిమార్గము దక్క వేఱుగతి లేదని చాటుచున్నవి. ఆ నారదుని కటాక్షమున నేఁటికి నెందఱో యాతని సూత్రములు పఠించి తరించుచున్నారు.

## నారద స్మృతి :

నారదమహర్షి ప్రోక్తమగు జ్యోతిర్నారదమును గూర్చి "చతుర్వింశతిమత" మను తన గ్రంథమున భట్టోజిదీక్షితుఁడును, 'బృహన్నారద' మను స్మృతిని గూర్చి రఘునందనుఁడును పేర్కొనిరి. 'లఘునారద' మును గూర్చి నిర్ణయసింధు సంస్కారకౌస్తుభ గ్రంథములును పేర్కొనెను. నారదస్మృతికి 'అసహాయుఁ' డను నతఁడు భాష్యము రచించెను. బృహన్నారదమును లఘు నారదమును గూడ డాక్టరు జాలీపండితుఁ డాంగ్లమున కనువదించి 1885, 1886 సంవత్సరములలో వరుసగాఁ బ్రకటించెను.

---

* భారతము శాంతిపర్వము.

నారదస్మృతిలో వ్యవహారమాత్రకము, సభ, ఋణాదానము, ఉపనిధి, సంభూయ సముత్థానము, దత్తప్రదానిక, అస్వామివిక్రియము, విక్రియాసంప్రదానము, స్త్రీపుంసయోగము, దాయభాగము, సహనము, వాక్పారుష్యము, మున్నగు నెన్నో విషయములపై ధర్మ ప్రవచనము గలదు.

## నారద శిల్పశాస్త్రము :

నారదమహర్షి ప్రోక్తమగు నొకగొప్ప శిల్పశాస్త్రగ్రంథ మిటీవల బయలు పడినట్లు పత్రికాముఖమునఁ బఠించితిమి.* ఇట్లు నారదుఁడు స్వరశాస్త్రవేత్తయగు బ్రహ్మజ్ఞుఁడని తేటతెల్ల మగుచున్నది.

"భవదూరపథమునఁ బరమభాగవతుల
మూఁకలు నడిపించు మొత్తగాఁడు
ప్రోడయై నూఱుతంత్రులవీణ వాయించు
సరిలేని జగజెట్టి జంత్రగాఁడు
పూసిగొండితనానఁ బోయి యెవ్వరికైన
గొడవలు గావించు కొండెగాఁడు
గాన ప్రభావాఢ్యులైన తుంబురుపర్వ
తులతోడి కూరిమి చెలిమికాఁడు

* ఇందు అగ్రహారిగ్రామము మహాగ్రామము బ్రహ్మపథగ్రామము శంకరగ్రామము వాసవగ్రామము సంకీర్ణగ్రామము మంగళగ్రామము శుభ్రగ్రామము అను దశవిధగ్రామ నిర్మాణమును గూర్చియు, ద్రోణక, ప్రస్తర, నిగమ, పట్టణ సర్వతోభద్ర, కార్ముక, స్వస్తిక, చతుర్ముఖ, అష్టముఖ, వైజయంతీ, భూపాల, దేవేశ, పురందర, శ్రీనగరము అను చతుర్దశనగర నిర్మాణములను గూర్చియు మఱియు నెన్నో విషయములఁ గూర్చిన శాస్త్ర విషయములుఁ గలవు.

ప్రబలసంసార మను లేమి బడలి తన్ను
వేఁడు వారలకెల్లను విష్ణుభక్తి
సారదీనారదుఁడు తనుచ్ఛవిగుళుచ్ఛ
ధుత శరన్నారదుఁడు నారదుండు ప్రోచుః"

[వరాహపురాణము]

* * *

# మహర్షుల చరిత్రలు

## పరాశరమహర్షి

ధర్మముల ననుష్ఠించు మనుష్యులశక్తి తారతమ్యముల ననుసరించి కృతత్రేతాద్వాపరకలియుగములకు విభిన్నములైన పరమ ధర్మముల నుపదేశించుటకు వేదశాఖాప్రవర్తకులు స్మృతిసమాచార ప్రవర్తకులు నగు మహర్షులు పరమేశ్వరాదేశమున నియమింపఁ బడిరి. అందుఁ గృతయుగధర్మప్రతిపాదనకు మనువు, త్రేతాయుగమునకు గౌతమమహర్షి, ద్వాపరమునకు శంఖలిఖితులు, కలియుగ ధర్మనిర్ణయమునకుఁ బరాశరమహర్షి నియమితులైరి. పరాశరమహర్షి బ్రహ్మర్షివరేణ్యుఁడగు వసిష్ఠమహర్షికిఁ బౌత్త్రుఁడు, శక్తిమహర్షికిఁ బుత్త్రుఁడు, వ్యాసభగవానునకుఁ దండ్రి.

### పరాశరుని జన్మవృత్తాంతము

పూర్వ మొకప్పుడు వసిష్ఠుని పెద్దకొడుకగు శక్తి మహాముని యొకచోటికిఁ బోవుచుండెను. ఇక్ష్వాకువంశజుఁడు కల్మాషపాదుఁ డనువాఁడు వేఁటవోయి యలసి సొలసి వసిష్ఠాశ్రమమునకు వచ్చుచు శక్తిమహర్షి నెఱుఁగక తెరువు దొలఁగు మని యాదేశించెను. శక్తి విననొల్లక "రాజా! ఇది యేమి? ఎంతటి వారలైనను సద్బ్రాహ్మణుఁ డెదురైనచో నధికభక్తియుక్తి నమస్కరించి ప్రియము పలికి తెరు విత్తురు. ఈవట్టిధర్మము నెఱుఁగని వాఁడవా? నేను ధర్మ పథమున నున్నవాఁడ" నని తొలఁగకుండెను. అంతఁ గల్మాషపాదుఁ

దహంకారమదాంధీభూతుఁడగుచు నాతని నవమానించి తనచేతికఱ్ఱతో న మ్మునీంద్రుని వ్రేసెను. శక్తి కోపారుణిత నయనుఁడయి "దుర్మార్గా! నీవు రాక్షసాకారమున నకారణముగా నాకు వికారము చేసితివి. కావున, నీవు రాక్షసుఁడ వయి మనుష్యమాంసమే తిండిగా నుండు" మని శాప మిచ్చెను.

తరువాత వసిష్ఠమహర్షిపై మాత్సర్యము వహించియున్న విశ్వామిత్రుని ప్రోత్సాహమున, రాక్షసుఁడైన యీ కల్మాషపాదుఁడే శక్తిమహాముని నపగతప్రాణునిఁ జేసి యాతని తమ్ముల నెల్లరఁ జంపెను. వసిష్ఠమహర్షి యీ సంగతి విని పరమ యోగధరుఁడయ్యుఁ బుత్త్రవియోగశోకభరమున నాత్మమరణ వ్యవసాయుఁడై దవాగ్నిఁ జొచ్చిన నది చల్లనయ్యెను: రాయికట్టుకొని యంబుధిఁ జొర వార్ధి యాతనిఁ దన లసత్తరంగముల సురక్షితునిగా సైకతతీరముఁ జేర్చెను. మఱియు వసిష్ఠుఁడు సుతశతవర్జి తాశ్రమముఁ జూడలేక మేరుపర్వత శృంగ మెక్కిపడఁగా నాతని దేహబంధ మక్షతమయి తూలసంచయ నికాశతనొప్పెను. అహో! అనంత సంతతవ్రత నియమప్రభావు లగు వారిని దేహబంధములు పొందవుకదా!

వసిష్ఠు డిట్లు బహుప్రయత్నముల శరీరత్యాగ నిశ్చయుఁడయి విఫలమనోరథుఁడయియుండ భర్తృమరణవ్యథావివశాత్మయైన యదృశ్యంతి యను పెద్దకోడలు నిజగర్భవిలసితుఁడగు బాలునిఁ గనువఱకు మరణోద్యోగము విడిచిపెట్టి మామపాదముల కెఱఁగెను. అంత నామె గర్భమునందుండి షడంగాలంకృత వేదధ్వని మృదు మధురమై వెలువడ వీనులవిందుగా విని వసిష్ఠుఁ డామె నూఱడించి జరిగిన వృత్తాంతముఁ జెప్పి "బిడ్డా! విధివశమున భర్తృవిహీన వైతివి. కాని, నీయుదరమున వేదవిద్వన్మూర్తుఁ డగు సుకుమారుఁడు గలఁడు. అనవరత వేదాధ్యయనశీలుఁ డగు శక్తి చదువు వేదములు వినుచుఁ బన్నెండేఁడులు గర్భస్థుఁడై యీతఁడు సకల వేదము లభ్యసించెను.

పౌత్త్రిముఖావలోకమున నేఁ గృతార్థుఁడ నగుదును. నీవు మరణో ద్యోగము వీడు" మని చెప్పి తా నాశ్రమమున యథాపూర్వము జప తపహోమతత్పరుఁడై యుండెను.

ఇట్లుండ నొకనాఁడు రాక్షస రూపుఁడగు కల్మాషపాదుఁడు రౌద్రాకారుఁడై యదృశ్యంతి పైకి రాఁబోఁగా నామె వెఱచి మామకుఁ జెప్ప వసిష్ఠుఁ డామె నోదార్చి ప్రళయబీభత్స ఝంకారమున నా రాక్షసుని వారించి యాతనిపై మంత్రించి కమండలూదకమును జల్లెను. అంత నాతఁడు శాపవిముక్తుఁడై వసిష్ఠుఁ బూజించి యాతని కృపఁ దన భార్యయగు మదయంతి యందు సశ్మకుఁ డను సుతుఁ డుదయింపఁగాఁ దరించెను. ఇన్ని పర్యాయము లిట్లు గండము లన్నియు దాఁటఁగా నొక శుభ ముహూర్తమున నదృశ్యంతి తేజో నిధియగు సుపుత్త్రినీఁగనెను. వసిష్ఠమహర్షి బ్రహ్మానందభరితుఁ డయి మనుమనికి జాతకర్మాదు లొనరించెను. పిమ్మటఁ బరాశరుఁడు పితా మహాశీర్వచనమున దేదీప్యమానుఁడై పెరుగుచుండెను *

## పరాశరుని కోపమున జగము లల్లలాడుట:

పరాశరుఁడు క్రమముగాఁ బెద్దవాఁడగుచుండ నొకనాఁ డాత నికిఁ దండ్రి స్మృతిపథమునకు వచ్చి యాతని వృత్తాంత మరయ, నావేదనము కలుగఁ దపముఁ జాలించి మాతృసన్నిధి కరుగ నామె యాతని నత్యాదరమున లాలించి ముద్దాడి యానందించెను. అంత నాతఁడు "తల్లీ! తాత వసిష్ఠుఁడే కాని నా తండ్రి కానరాఁడేమి? ఆతఁ డెచట నున్నాఁడు? నా మనస్సు పితృదర్శనముఁ గోరియున్నది చెప్పు" మని పలుక నదృశ్యంతి యొక్కసారి పతిమరణ దుఃఖము పొంగిపొరల గోడుగోడున నేడ్వఁ దొడంగెను. పరాశరుఁ డాశ్చర్య చేతస్కుఁడై "అమ్మా! ఏమిట్లు పలవించుచుంటివి? నా తండ్రి లేఁడా?

---

* భారతము ఆదిపర్వము.

నీ విట్లమాంగళ్యవతివై యుండుటకుఁ గారణము చెప్పు" మని పరిపరి విధముల నడుగ నామె రాక్షసభక్షణమున శక్తి పంచత్వము నందిన వృత్తాంతముఁ దెలిపెను. అంత నాతఁడు కోపదహనదందహ్యమాన హృదయుఁడై "ఏమి! పరమపూజ్యుఁ డగు నా తండ్రి యొక క్రూర రాక్షసునిచే మడిసెనా? అది తప్పించుటకు లోకము లడ్డుపడ లేదేమి? ఇదిగో నా తపోమహత్త్వమున నఖిలలోక సంహార మొనర్తు" నని తల్లికడ తీవ్రశపథముఁ బూనెను. ఆ మహర్షివరుని దృఢనిశ్చయమునఁ బంచభూతములు గడగడ వడఁకి పోయెను. లోకములు గజగజ లాడెను. భూమ్యాకాశములు మాఱుమ్రోఁగెను. వాయువు విహ్వలముగా వీవఁ దొడఁగెను. ఈ సంక్షోభమును దపోనిమగ్నుఁడైన వసిష్ఠ మహర్షి గాంచి దివ్యదృష్టి నిది యెల్లఁ బరాశరుని శపథమూలముననే యని గ్రహించి తా నుపేక్ష చేయుచో లోకోపద్రవము వాటిల్లి తీరు నని శరవేగమునఁ బరాశరునికడ కేతెంచెను. పరాశరుఁడు పూజ్యపాదుఁ డగు పితామహునకుఁ బ్రదక్షిణ నమస్కారములొనర్చి వినయ వినమితవదనుఁడై తన ఘోరప్రతిజ్ఞ నాతనికిఁ దెలిపెను.*

## పరాశరమహర్షి వసిష్ఠుని కోరికపైఁ గోప మువసంహరించు కొనుట:

వసిష్ఠుఁ డాతని నుపలాలించి "వత్సా! నీ పూనిక యమోఘమైనది. దీనివలన లోకోపద్రవము వాటిల్లఁ గలదు. లోకానుగ్రహముగా నీ కోపము విడువుము. నీ తండ్రి పరమపుణ్యుఁడు. అతఁడు విధివిహితమైన మరణ మట్లు పొందినాఁడు. పుట్టిన జీవులెల్ల నెపుడో

---

* అని భారతము. కాని, తపోనిష్ఠ నున్న పుత్త్రుని కడకేగి తల్లియే రాక్షస వినాశమునకుఁ బ్రేరేచె ననియు, దైత్యనాయకు లెల్లరు వసిష్ఠుని పాదములపైఁ బడి శరణువేఁడ నాతఁడు వారి కభయ మిచ్చి మనుమని కడకు వచ్చె ననియు విష్ణుపురాణమునఁ గలదు.

యపు డెట్లో యట్లు చావవలెఁ గదా! ఇఁక నెట్లు చచ్చిన నేమి? అదియును గాక నీ నా కారణముల నీ తండ్రి పుణ్యలోకముల కేగినాఁడు. అతనిఁ జూడఁ దలఁతు వేని శివుని గుఱించి తప మొనర్పుము. పూర్వము భార్గవ వంశజుఁడగు నౌర్వమహర్షి తన తండ్రులు క్షత్రియాధములచే హింసితులై మరణింప సకలలోక ప్రళయార్థముగా ఘోరతపము చేయఁ దొడఁగినాఁడు అంత త్రిలోకములు భీతిల్లినవి. అపు డౌర్వునిపితృదేవత లౌర్వుని శాంతచిత్తునిఁ జేసి వారు నిమిత్తమాత్ర మగు కారణమున మరణించిరే కాని యన్యుల శక్తి వలనఁ గాదని తెలిపి యందులకై సర్వజనోపద్రవముఁ జేయవలదని కోరఁగా నౌర్వుఁడు వారి యాదేశము ననుసరించి శాంతింప నుతింపఁబడినాఁడు. నీవును బుద్ధిమంతుఁడవు. శాంతింపు"మని కోరెను. అంతఁ బరాశరుఁడు తాతకు నమస్కరించి "తాత! నీ మాట నేదాఁటుగలనా? ఎంత తీవ్రవేగమున నాకీ సంకల్ప ముదయించినదో నీ కరుణాకటాక్షమున నంతలో వికల్పమైనది. రెంటికని నాకుఁ గర్తృత్వము లేదు. నే నిఁక నీశ్వరుని గుఱించి తప మొనర్చి యొకపరి పితృపాదులఁ జూచెద"నని చెప్పి వసిష్ఠానుమతిని బరమశివునిఁ గొలువ నేగెను.*

## పరాశరుఁడు పరమశివుని వరప్రసాద మందుట:

పరాశరుఁడు పితృదర్శన లాలసుఁడై పరమశివుని కరుణఁ బితరులఁ గన నెంచి ఏకాంతమున రమణీయ తరుగుల్మలతాదుల నొప్పు నొక వనవాటిక కేగి యందొక యాశ్రమమును నిర్మించుకొని శివుని గుఱించి తప మొనర్చెను. అతని పరిశుద్ధాంతఃకరణము కతమున ననతి కాలముననే శివుఁడు ప్రత్యక్షమై వరము కోరుకొను మనెను. పరాశరుఁడు బ్రహ్మానందభరితుఁడై "మహాదేవా! సృష్టి స్థితి లయములకు మూలకారణుఁడవు. ఆనంద బ్రహ్మాధిష్ఠాన దేవతవు. ఆర్యానహిత

---

* భారతము, ఆదిపర్వము.

కరుణార్ద్ర హృదయుఁడవు నగు నిన్నుఁ గాంచఁ గలుగుట కన్న నా భాగ్యమేమి? తుచ్ఛమగు తాత్కాలిక వాంఛకు లోనై యైహికార్థము లాకాంక్షించి వెఱ్ఱులగువారు నిన్ను నిత్యునిగా నెఱుఁగఁ గలరా? దేవాధిదేవా! నిమిత్తమాత్రమగు పితృదర్శనలాలసత నూతగాఁ గొని నీ దివ్యదర్శనముచే నీ కరుణాకటాక్ష వీక్షణమునే వాంఛించి తపమొనర్చితిని. ఆశీర్వదింపవే" యని పరిపరివిధముల హర్షపులకాంకుర పవిత్రదేహుఁడై యీశ్వరుని స్తుతించెను. ఈశ్వరుఁ డానందించి "వత్సా! నీవు నిరభ్యంతరముగ స్వర్లోకమున కేగి నీ పితను జూడఁ గలవు. మఱియు నీ సదమలాంతఃకరణము నిన్నెంత వానినైనఁ జేయును. నీవు త్రిభువన వినతి నంది పరమధర్మ ప్రతిపాదకుఁడవై బ్రహ్మర్షి వరేణ్యుఁడవు కాఁగలవు. మఱియు నీకుఁ బురాణపురుషుఁడు వ్యాసభగవానుఁ డుదయింపఁ గలఁడు. నీవు మహానుభావుఁడవు. నీవు తలంచినది పవిత్రమై, నీవు చెప్పినది ధర్మమై, నీవు చేసిన దనింద్యమై నెగడును. పోయి రమ్మని శివుఁ డదృశ్యుఁ డయ్యెను. పరాశరుఁడు పరమానంద భరితుఁడై యథేచ్ఛావర్తనమున స్వర్లోకమున కేగి పితృదర్శనము పొంది యాతని యాశీర్వచనము లంది తిరిగియాశ్రమమున కేగి మాతృశ్రీయగు నదృశ్యంతికిని బితామహుఁడగు వసిష్ఠభగవానునకును జేతోమోద మొనఁగూర్చెను.

## పరాశరుఁడు రాక్షసవధార్థము సత్త్రయాగ మొనరించుట :

పిమ్మటఁ బరాశరమహర్షి సర్వలోకోపద్రవమునకుఁ గాక సర్వరాక్షస వినాశార్థము ఋత్విజుల సత్తమోత్తముల రప్పించి సత్త్రయాగము చేయఁగడఁగి యగ్ని వేల్చి హోమవిధు లొనర్చుచుండెను. వసిష్ఠమహర్షి ఈ సంగతి యెఱిఁగియుఁ గడుఁ బ్రశాంతాత్ముఁడయ్యు రాక్షసవినాశముఁ గోరి మనుమని వారింపకుండెను. పరాశరుఁడు హోమ మొనర్చుచుండ నగ్నిహోత్రుఁడు మహోజ్జ్వలుఁడై ప్రకాశించు

చుండెను. అందు ఘోరాకారులగు రాక్షసులు హాహాకారము లొనర్చుచు నబాలవృద్ధముగా వచ్చి పడి దగ్ధులగుచుండిరి. ఈ విధముగా రాక్షసకుల ప్రళయ మేతేర బులస్త్యపులహక్రతువులు మహాముని సంఘములతో నటు కేతెంచి మూఁడగ్నులయొద్దను నాల్గవయగ్నివలె ప్రజ్వలించు పరమ తపోనిలయుఁడగు బరాశరమహర్షిని జేర నరిగిరి. పరాశరుఁడు మహర్షుల కర్ఘ్యపాద్యాదుల నొసంగి ప్రణామము లొనర్చి వారి నందఱ నుచితభంగులఁ బూజించి విచ్చేసినపని యడిగెను. అందుఁ బులస్త్యుఁడు "వత్సా! పరాశరా! నీ చేయు యజ్ఞమున సర్వరాక్షసకులప్రళయ మేతెంచినది. ఇది మాకు సమ్మతము కాదు, నీవంటి యుత్తమబ్రహ్మర్షి సమస్తఫల మీశ్వరార్పణబుద్ధితోఁ గ్రతువు లొనర్చుట మా యభీప్సితము కాని కినుక మనమునఁ బెట్టుకొని యిట్టి జీవహింస యొనర్చుట మా కనభీప్సితము. మే మందఱ మొక్కపెట్టున నీ చేయు క్రతువు మాన్పఁగోరి యేతెంచితిమి. మా యభీప్సితము నెఱవేర్పుమా!" యని పలికెను. పరాశరమహర్షి "మహాత్ములారా! మీ యందర సమాగమము నిటు నాకు మహామోద మొనఁగూర్చినది. ఏ కాలముననైన నెంతటివాఁడైనను వయోజ్ఞానవృద్ధులగు పెద్దలయాజ్ఞ శిరసావహింపని నాఁ డధోగతినందును. కావున మీ యాజ్ఞ పాలించుటయే నాకుఁ బరమధర్మ" మని యా క్రతువు సమాప్త మొనర్చి "మహాత్ములారా! అఖిల రాక్షసలోకదహనోద్యతమైన యీ యగ్ని నిగ్రహీతమైన నన్ను దహించును. ఏమి చేయుదును? మీరు లోకహితులు. నాకును లోకమునకుఁ గీడు గలుగకుండు హిత మొనర్పుఁ"డని పలికెను. అంత వారంద ఱావంధించి యా యగ్నిహోత్రమును హిమాలయోత్తర భాగమున విడువు మనిరి. పరాశరమహర్షి యట్లొనర్చెను. అదియుఁ బర్వతములందు వృక్షలతాగుల్మశిలాభక్షణ మొనరించుచుండెను. ఈ రీతిఁ బరాశరుఁడు పెద్దల యాజ్ఞఁ బాటింప మహర్షు లెల్లరితని స్తుతించి తమతమ నెలవ

వుల కరిగిరి. పులస్త్యబ్రహ్మ పరాశరుని కోరికపై నాతనికిఁ బురాణ శాస్త్రజ్ఞానసిద్ధి, వాచామాధురి, మహాప్రతిభ, వైదగ్ధ్యము వరములుగా నిచ్చి వెడలిపోయెను.*

## పరాశరమహర్షి మత్స్యగంధి నడపునోడ నెక్కుట:

పిమ్మటఁ బరాశరమహర్షి సమస్త తీర్థయాత్రాపరుఁడై బయలు వెడలి పోవుచు యమునానది ప్రాంతమునకు వచ్చెను. ఆ సమయమున నట యమునానదిలో మత్స్యగంధి యోడనడపునదిగా నుండెను. ఈ మత్స్యగంధి యుపరిచరవసురాజర్షి వీర్యమున నొక మత్స్యమునకు జనించినది. వసురాజన్యుఁడు గిరికాదేవిని పెండ్లియాడి యొకనాఁడు వేఁటకై యడవికిఁ బోయి యందువిశ్రమించుతఱి నాతని హృదయమున గిరికాదేవి సౌందర్యము ప్రవేశింప నాతని కట రేతస్స్యందన మయ్యెను. ఆ యమోఘవీర్యము నాతఁ డొక యశీర్ణ పర్ణపుటమున సంగ్రహించి యొక డేగయఱుతం గట్టి దానిని గిరిక కిచ్చిరమ్మని పంపెను. ఆ ఖగము పోవుచుండ నింకొక ఖగము దానితోఁ బోరి యా పర్ణపుటమును యమునానదిలోనికిఁ ద్రోసెను. తొల్లి బ్రహ్మ శాపమున నద్రిక యనునచ్చర మీనై యుండి యా వీర్యముఁ గ్రోలెను. జాలరులు వలలువైచి దానిఁ బట్టుకొని తమరాజైన దాశరాజునకు సమర్పించిరి. ఆ మత్స్యము మానుష ప్రసవ మొనరించి శాపవిమోచనముకాఁగా దివ్యవనితయై దేవలోకమునకుఁ బోయెను. ఆమె క్రోలిన వసువీర్యము బిందుద్వయముగా నుండుటచే నామె కొక కొడుకు నొక కూఁతురు పుట్టిరి. ఆ కొడుకు మత్స్యరాజనఁ బరగి మత్స్యదేశాధిపతి యయ్యెను. ఆ కూఁతును గూఁతులులేని దాశరాజు కూఁతుఁగాఁ బెంచుకొనుచు సత్యవతీనామము నుంచెను. ఈమె తండ్రి నియోగమున ధర్మార్థముగా నోడఁ గడపుచుండఁగాఁ బరాశరమహర్షి

* భారతము, విష్ణుపురాణము.

నదిదాఁటి వచ్చి యేకత మోడ యెక్కెను. సత్యవతి యోడఁ గడపుచుండ నేకవస్త్రయగు నామె యంగసౌందర్య మాలోకింపఁ బరాశరునకు మదనపరవశత గలిగెను. దాన నాతఁ డామెచూపులఁ జూపు నిగిడించి చన్నుఁగవ నెన్నుచు నామెను సమీపించెను. పరమశాంతుఁ డయ్యు జితేంద్రియుఁడయ్యు, త్రికాలవేదియైన పరాశరుఁడు దనకోరిక యామె కెఱింగింప నామె శాపభీతయై "మహాత్మా! ఈ దేహము చేఁపకంపు కొట్టుచుండుట లేదా? నేను జాలరిదానను. పైఁగాఁ గన్యకను. మిమ్ముఁగూడి యింటి కెట్లేగఁ గలను? తాము ప్రసాదించి దోషదూషితను గాకుండఁజేసిన మీ యభీప్సితము దీర్తు" ననెను.

## సత్యవతి పూర్వజన్మవృత్తాంతము:

పరాశరుఁడు సత్యవతి పూర్వజన్మవృత్తాంతమును దివ్యదృష్టిని దెలిసికొని యామెతో నిట్లు చెప్పెను. "సత్యవతీ! నీవు అచ్ఛోద యను దేవకన్యవు. అమృతపాయులు, బర్హిషత్తు లను పితృదేవతలకు సంకల్పబలమున అచ్ఛోదసరస్సున నీవు పుట్టితివి. నీ వపుడు యోగశక్తి గలిగిన దివ్యకన్యకవు. తలిదండ్రులను జూచి యెఱుఁగనిదానవగు నీ వపుడట అద్రికయను నప్సరసతోఁ గూడి దేవవిమానమునఁ దిరుగు వసు వనురాజును దండ్రిగాఁ గోరితివి. ఆ నీ పొరపాటువలన నీ యోగశక్తి నశించి నీవు క్రిందఁ బడుచున్నపుడు మార్గమధ్యమున అణువులకన్నఁ జిన్నవగు శరీరములతో విమానములఁ దిరుగు నీ పితరులు నీ కభయ మొసఁగి నీ జన్మము కలుగు ననియు ఈ జన్మమున నా వలన మహామహుఁడగు పుత్త్రుఁడు కలుగు ననియు నీకుఁ జెప్పి పోయిరి" అని చెప్పెను. ఆ మాటలు విన్నంతనే యామెకుఁ బూర్వస్మృతి కలిగెను. వెంటనే యామె యాతఁడు చెప్పినదెల్ల సత్యమని తెలిసికొని పరాశరుని కూటమి కంగీకరించెను. పరాశరుఁ డందులకానందించి యామె కన్యాత్వదూషిత కాకుండ వరమిచ్చి సుందర శరీరిణియై యోజనగంధి యగున ట్లొనర్చి యనేక దివ్యాంబర భూషణ

భూషితను జేసి యఖిలదృష్టిపథరోధి నీహారతిమిరముఁ గావించి సత్య వతినిఁ గూడెను.

## పరాశరునివలన సత్యవతికి సద్యోగర్భమున శ్రీ వేదవ్యాసు లుదయించుట :

సత్యవతీపరాశరుల యీ కూటమి చంద్రికాచంద్రమునులకూట మిని దలఁపించెను. ఛాయానూర్యుల కలయిక నరిపోవలెను. వేద వ్యాసరత్నోద్భవమునకు సత్యవతీపరాశరశక్తి ద్వయమేళనము జరిగి పరమపవిత్ర ప్రయోజనకారియయ్యెను. పవమగుణైకాభరణ యగు సత్యవతీసాధ్వికిఁ బరమేశ్వర కల్పుఁడగు పరాశరుని సంగమమున ననవద్యమనోహరమూర్తిమత్త్వము పరమపవిత్రదౌహృదము సంభ వించెను. ఆ సమయమున నా పవిత్రగర్భమున మహాతేజుఁడు, వేద మయుఁడు, నిఖిల మునీంద్రాద్యుఁ డగు వేదవ్యాసుఁ డుద్యజ్జ్ఞానముతో సద్యోగర్భమున సంజనితుఁ డయ్యెను. కృష్ణుఁడు లీలార్థము కృష్ణ ద్వైపాయనుఁ డనఁబరగి వచ్ఛ్రీయుతుఁడు తపోవిద్యానవద్యుఁడు నయి తల్లిదండ్రులకుఁ గృతప్రణాముఁ డయ్యెను. పరాశరమహర్షి సంకల్పసిద్ధి నంది సత్యవతికిఁ గోరినవరము లిచ్చి పుత్త్రు నాశీర్వదించి యథేచ్ఛ మేగెను.

అంతఁ గృష్ణద్వైపాయనుఁడు కృష్ణాజిన పరిధాన కపిలజటా మండల దండ కమండలు మండితుఁడై తల్లికి మ్రొక్కి వలయు నపుడు తలఁచిన వత్తునని వర మొసఁగి సకలలోకపావనుఁ డఖిలలోక హితార్థము తపోభూమి కరిగెను.

పరాశరమహర్షియుఁ దీర్థయాత్రాచరణము పరిపూర్తియైన పిదప బదరికాశ్రమమును జేరి శిష్యప్రశిష్యులకు ధర్మతత్త్వముల నుపదేశించుచుఁ గాలము పుచ్చుచుండెను.*

---

* భారతము, ఆదిపర్వము.

## పరాశరుఁడు జనకునకు ధర్మప్రబోధము చేయుట:

### —: పరాశరగీత :—

ఒకప్పుడు జనకరాజర్షి పరాశరమహర్షిని జేరఁజని ధర్మసంబోధమొనర్చి కటాక్షింపుమని కోరెను. పరాశరుఁ డాదరించి యాతని కిట్లుపదేశించెను. "రాజా! ఫలము పడయుటకు బీజము నాశ్రయించినట్లే ధర్మము నాశ్రయించి మానవుఁడు సౌఖ్యము లందఁ గలఁడు. సుకృతదుష్కృతములు నరున కాయాఫలముల నొసఁగనిదే వానిని విడువవు. కావున, వాఙ్మనోదృష్టులచే సత్యశమదమాహింస లను సత్పథముల నాశ్రయింపవలయును. సమదర్శియై న్యాయపరుఁ డైన వానికి దేవతలును వందనము లొనర్తురు. మానవుఁడు మునీశ్వరుల ఋణ మధ్యయనముచేతను, దేవతల ఋణము యజ్ఞయాగాదుల చేతను, అతిథిఋణము పూజచేతను, పితృదేవతల ఋణము శ్రాద్ధమునను, ప్రజల ఋణము రంజన వ్రతముచేతను దీర్చి దానధర్మాదులచేఁ బవిత్రుఁడు కావలెను. జీవిత మనిత్యమని యెఱిఁగి సుఖదుఃఖ సమయముల రెంటను ధర్మము నేమఱక యుండవలె" నని శ్రేయస్సాధనము నుగ్గడించెను.

## తపోత్కృష్టత:

మఱియు జనకుఁడు దనకుఁ దపోధిక్యమును గూర్చి చెప్పుమని కోరఁ బరాశరుఁ డిట్లు నుడివెను. "రాజా! విద్యాధరఋషి దేవతాగణములెల్లఁ దపముననే మహితవిభవము నందిరి. బ్రహ్మ సృజించు నేర్పు సంపాదించుటకును, అధిరాజు లధిక కీర్తి కాయు లగుటకును ఇతరు లైహికాముష్మికము లందుటకును దపమే కారణము. దారధనపుత్త్రాది సంగమమునఁ జిత్తమలతఁ బొంది విసువఁగా నుపశాంతి నందచ్చుటకుఁ దపమే యోగ్యమైనది. తపోరాహిత్యము చేతనే మానవుని లోభమోహాదులు వశపఱచుకొని భ్రష్టుని జేయును.

ధర్మార్థకామమోక్షము లందుటకుఁ దపమే మూలకందము. ఈ తప స్సారరూపము సుఖదుఃఖాదులందుఁ బ్రాప్తాప్రాప్తములయందు మద విషాదములు లేక సంప్రాప్త నముపభోగ రతుఁడును, అప్రాప్య వాంఛానిరాసకుఁడు నగు పుణ్యపురుషులఁ గాన నగు" నని తపోనవ ద్యతఁ దెలిపి హింసాహింసల బోధించి యిఁక నేమి కావలె నన జన కుఁడు "మే లేది? పరమగతి యేది? నాశరహితకృత్య మేది? వీనిని దెల్పు" మని కోరెను. పరాశరుఁ డిట్లనెను.

## జ్ఞానబోధ :

"జనకా! అసంగమే మేలు. అంచితజ్ఞానమే పరమగతి. మహా తపమే నాశరహితకృత్యము. ఇది యెఱుఁగుటయే సర్వవేదసారావ లోకన మగును. ఇట్లెఱిఁగిన సుమతి విషయములయం దునికిఁ గని నను విజ్ఞానఫలము కతమున జలజపత్రమువలె విషయజలములచే నంటఁ బడఁడు. సంసారము కదళీగర్భాసారముగా నెఱిఁగిన విజ్ఞ నకు జననమరణము లుండవు. మృణాళము నంటిన రొంపి జలసేచ నమునఁ బాసినట్లు సంసారమలమును జ్ఞానజలములఁ గడిగి తొలఁ గింప నగును. శిశ్నోదరపరాయణుఁడు దీని నెఱుఁగలేక జరాజాడ్య గ్రస్తుఁడై పొలియును. మానవుఁడు పొందు దుఃఖములు కడుఁబెక్కులు; సుఖ మత్యల్పము నని తెలిసి వీని రెంటిని బోఁద్రోచినవాఁడే శుభ మందఁగలఁడు. మిత్రులు, భార్యలు, భ్రాతలు, పుత్రులు వీరందఱును నిజకార్యపరులు. బోధమే యాత్మత్రాణమూలము. ఈ బోధలక్ష్మి ధీరుఁడై యభేదదృష్టిఁ గలవాని నొక్క క్షణమైన విడువ" దని పరా శరుఁ డమోఘప్రజ్ఞాఘనత యొలయఁ దెల్పి జనకుని వీడుకొలిపెను. ఇది 'పరాశరగీతా' నామమునఁ బ్రసిద్ధ బ్రహ్మజ్ఞానోద్బోధకమై యొప్పారుచున్నది. *

---

* భారతము, శాంతిపర్వము.

## పరాశరుఁడు శిష్యులకు బోధించిన సాంఖ్యానము :

పరాశరుఁడు శిష్యుల కెల్లరకు శౌచాచారములఁ దెలిపి వారిచే నాచరింపఁ జేయువాఁడు. ఈ శౌచాదికాచారఫలము వలన మానవుఁడు బ్రహ్మలోకప్రాప్తి నంది తిరిగి యోగియై జన్మించి ముక్తి నందఁగలఁడని వారికి సాంఖ్యానము నిట్లుపదేశించెను, "వత్సలారా! పాపనాశనమైనఁ గాని జ్ఞానము లభింపదు. సద్గుణుఁడు చెప్పఁగా విని చేసిన పనులచేఁ బాపనాశనమును జ్ఞానోదయము నగును. దాన గర్వ ముదయింపఁగా వెంటనే యడఁచివేసి పరమబోధమునకు ఫల ముపశాంతి యని యెఱిఁగి యెంత జ్ఞాన మెక్కువైన నంత శాంతుఁ డగుచుండఁగా మే లొదవును. వాక్పాణిపాదపాయూపస్థోదరాదుల రక్షించి యింద్రియముల మనము, మనమున బుద్ధి నిల్పి ప్రబోధ వికచ హృదయుఁడై షోడశవికృతులను సప్తప్రకృతులను మూల ప్రకృతిలోఁ గాంచి వికృతిప్రకృతుల కతీతుఁడైన మహేశ్వరుని గన వలయు" నని సాంఖ్యానము బోధించెను.*

## పరాశరుఁడు భద్రసేను ననుగ్రహించుట :

తొల్లి కాశ్మీరదేశమున భద్రసేనుఁ డను మహారాజు ప్రజారంజకుఁడై యుండ నాతనికి సుధర్ముఁ డను కుమారుఁడు నాతని మంత్రికి తారకుఁ డను కొడుకును బుట్టి పెరుగుచుండిరి. బాల్యమునుండియు వా రిరువురును శివభక్తిపరులై రుద్రాక్షలు ధరించి వానిని విడచి బంగారునగలు ధరింపు మని చెప్పువారలఁ దృణీకరించుచుండిరి.

ఇట్లుండ భద్రసేనునిఁ గటాక్షింపఁ దలఁచి పరాశరమహర్షి విచ్చేసెను. భద్రసేనుఁ డాతని పాదముల వ్రాలి తన పుత్త్రునియు మంత్రిపుత్త్రునియు సంగతిఁ దెలిపెను. పరాశరమహర్షి యాతనికి వారి పూర్వజన్మ వృత్తాంతమును వినిపించి వా రల్పాయుష్కులని

* భారతము, శాంతిపర్వము.

చెప్పి వారికి రుద్రాధ్యాయజపము నుపదేశించి భద్రసేనుని, పుత్రులను దీర్ఘాయుష్మంతుల నొనరించి కటాక్షించెను.*

## పరాశరస్మృతి, పరాశరహోరాశాస్త్రము:

పూర్వ మొకప్పుడు వ్యాసమహర్షి కడకు ఋషు లరుదెంచి కలియుగమున నాచరింపవలసిన ధర్మము లెట్టివని యడిగిరి. వ్యాసుఁడును దనకుఁ దెలియవని వారితోఁ గలిసి బదరికాశ్రమమునఁ గల తండ్రికడ కేగి ప్రదక్షిణ నమస్కారము లొనర్చి వచ్చినపనిఁ జెప్పఁగా పరాశరుఁ డానందించి వారికి సర్వవర్ణ సకల ధర్మములు బోధించెను. ఇదియే పరాశరస్మృతి యను కలియుగ ధర్మశాస్త్రము. ఇందు మూఁడాశ్వాసములు గల యాచారకాండము, ద్వాదశాధ్యాయములు గల ప్రాయశ్చిత్తకాండము గలవు. ఈ పరాశర ధర్మశాస్త్రమునందు ౫౭౮ శ్లోకములు గలవు. ఇది పరమ పవిత్రగ్రంథము.

మఱియొకప్పుడు మైత్రేయాది మహర్షులు వచ్చి పరాశరునిఁ బ్రార్థించి జీవబ్రహ్మాంశ విషయములు దెలుపు మనిరి. పరాశరమహర్షి వారికి జ్యోతిశ్శాస్త్రమును దెలిపి దానివలననే నరులలోఁ గల జీవబ్రహ్మాంశభేదము తెలియుననియు దాని ననుసరించియే శుభాశుభము లొదవు ననియుఁ దెలిపెను. ఈ పరాశరప్రోక్తమగు జ్యోతిశ్శాస్త్రమే 'బృహత్పారాశరహోరాశాస్త్ర' మను పేరఁ బూర్వోత్తర ఖండములు గలిగి జ్యోతిషి కాలంకారమై విరాజిల్లుచున్నది.

## పరాశరసంహిత:

మైత్రేయమహర్షి పరాశరమహర్షి యాత్మగురువుగా వేదవేదాంగములు, ననేక ధర్మశాస్త్రములు నభ్యసించి కృతకృత్యుఁడై చిరకాలము గురుశుశ్రూష చేయుచు నొకనాఁ డుదయమున నమస్త

---

* బ్రహ్మోత్తర ఖండము.

కృత్యములు నిర్వర్తించి గురునకు నమస్కరించి "మహాత్మా! మీ కరుణాకటాక్షమున సకల వేదశాస్త్రాది విద్యల నభ్యసించితిని. మీ కంటె నుత్తమశ్లోకు లింకొకరులేరు. కావున నాకుఁ గలకొన్ని సంశయములఁ దీర్పుఁ"డని వినయవినమితుఁడై కోరినవిషయము లడుగుమనెను. అంత మైత్రేయుఁ డిట్లడిగెను. దేవా! సమస్త లోకములకు మూల మెవరు? వాసవాదులకు నేవేల్పు ప్రభువు? వేదము లేవేల్పువలనఁ గలిగినవి? విజ్ఞానకారణుఁ డెవరు? మఱియు బృథివ్యాది భూతప్రమాణములు, సప్తసాగరవిస్తారములు, సప్తద్వీపప్రకారము, సప్తకులపర్వతముల స్థానములు, సప్తాశ్వప్రముఖగ్రహ తారకాసంచారములు, దేవాది చతుర్విధ భూతనిర్మాణము, చతుర్దశ మన్వంతర ప్రమాణములు, చతుర్యుగ ప్రమాణములు, కల్పకల్పవిభాగములు, యుగధర్మములు, దేవర్షిచరిత్రములు, రాజవంశాను కీర్తనములు, వేదశాఖాప్రమాణములు, బ్రాహ్మణాదివర్ణధర్మములు, బ్రహ్మచర్యాది చతురాశ్రమక్రమములు, మొదలైన విషయము లెల్లఁ దెలుపుఁడు."

పరాశరమహర్షి యానందియై వత్సా! నీ యడిగిన యర్థము లెల్ల పురాణరూపమున వక్కాణించెదను. ఇది విష్ణుతత్త్వప్రతిపాదకమై విశ్వమున 'పరాశరసంహిత'యను నామమున వెలయఁ గలదు. విష్ణుఁడే భక్తవత్సలుఁడు, దేవమయుఁడు, వేల్పుల త్రాత, విశ్వగురుఁడు; సర్వమును విష్ణుమయము" అని మైత్రేయునకు సమస్త విషయములు తెలిపెను.

పరమభాగవతుఁడు వేదవిభాగకర్తయుఁ బరమబ్రహ్మజ్ఞుఁడు నగు కృష్ణద్వైపాయనునిఁ గడుపారఁ గన్న పరాశరమహర్షి పుణ్యమే పుణ్యముగదా! ఆ పరాశరమహర్షి తన ధర్మశాస్త్రముచే నఖండబ్రహ్మవిద్యాబలమున ననంతకృపాకటాక్షమునఁ గలియుగప్రజల కెంతయు నారాధనీయుఁడు ననుక్షణానుస్మరణ యోగ్యుఁడును గదా!

# మహర్షుల చరిత్రలు

## భరద్వాజ మహర్షి

స్తుతి

"జ్వలదగ్ని ప్రతిమానతేజుని భర
ద్వాజున్ వినిర్ధౌత వ
ల్కల భాస్వత్పరిధానుఁ బింగళజటా
లంకారుఁ గృష్ణాజినో
జ్జ్వలసంవ్యానుఁ దపఃకృశీకృతతనున్
శాంతాత్ము బ్రహ్మైక ని
శ్చలచిత్తు న్విజితేంద్రియున్ బ్రముదిత
స్వాంతున్ బ్రశంసించెదన్."

కాంచీమహత్త్వము.

భరద్వాజుఁడు సప్తమహర్షులలో నొకఁడు, పరమ పవిత్రుఁడు, ప్రశాంతనిధి. ఈతఁడు తపమొనర్చిన యాశ్రమము 'భారద్వాజతీర్థ' మనుపేర వన్నె కెక్కినది.

**భరద్వాజుని జననము :**

అంగిరసోమహర్షికి శ్రద్ధ యను భార్యయందు జనించిన పుత్త్రులలో బృహస్పతి యొకఁడు. అతని యన్న యగు నుతథ్యుఁ డను వాఁడు మమత యను కన్యను వివాహమై యొక యాశ్రమమును నిర్మించుకొని యందుఁ దప మొనరించుచుండెను. ఒకనాఁడు మమత

యాతనిఁజేరి పుత్త్రవాంఛ గలిగి యొక సుపుత్త్రు ననుగ్రహింపు మని కోరెను. ఉతథ్యుఁడు నామెతో నిష్టభోగములఁ దేలి యామెకు గర్భము నిలిపెను. మమత యానందించుచు భర్తకు శుశ్రూష చేయుచుఁ దన గర్భమును సంరక్షించు కొనుచుండెను.

బృహస్పతి తార యను నామెను దారగా గ్రహించి యభీష్ట సుఖముల నందుచు దేవగురువై యుండెను. ఒకనాఁ డాతఁ డన్న యగు నుతథ్యమహర్షి యాశ్రమమున కతిథియై వచ్చెను. ఆ సమయమున నుతథ్యుఁడు తీర్థయాత్రాపరుఁడై యేగియుండెను. మమత మఱఁది కుచితమర్యాద లొనర్చి యతిథి పూజ యొనరించెను. బృహస్పతి దైవోపహతుఁడై మమత సౌందర్యమున మమత్వ ముదయింప దానిని నిగ్రహింపఁజాలఁ డయ్యెను. తుద కొంటరిగ నున్న మమతనుజేరి విగతలజ్జుఁడై తనకోరిక దీర్పుమని యడిగెను. మమత యచ్చెరువంది పాపము శమించుఁ గాక యని చెవులు మూసికొని "బృహస్పతీ! ఇది యేటి న్యాయము? నీకు నేను వదినను. మాతృసమానను గదా! నీ కిది దుర్బుద్ధి సుమా!" యని బుద్ధి గఱపెను. బృహస్పతి "తరుణీ! బుద్ధిబలమున నన్నెవ్వరులు మించలేరు. నా బుద్ధి వక్రముగ నుండఁజాలదు. దేవర న్యాయమున మన సంగమమునకే దోషము కలుగదు. కావున మాఱుమాటాడక నా యభీప్సితమును దీర్పు" మని హస్తము పట్టెను. మమత తప్పించుకొని "ఓయీ! నీకు వినాశకాల మేతెంచి నట్లున్నది. లేనిచో విపరీతబుద్ధి పుట్టదు. పైఁగా నీ దుష్కృతమునకు ధర్మసమన్వయముకూడఁ జేయుచుంటివి. ధర్మమైనఁ గానిమ్ము. నే నిపుడు గర్భము ధరించియున్నాను. కావున బుద్ధిగలిగి పొ" మ్మని పలికెను. బృహస్పతి కామగ్రహావేశుఁడై బలవంతముగా నామెను శయ్యకుఁ జేర్చి యామెతో రమించి వీర్యము విడచెను. ఇంతలో మమతాగర్భస్థుఁ డగు బాలుఁడు బృహస్పతిని నిందించి 'వలదు తగ'దని మొఱపెట్టెను. బృహస్పతి యా బాలునిఁ

గోపించి యంధునిగ శపించెను. ఆ బాలుఁడు బృహస్పతి వీర్యమును మాతృగర్భమునుండి బయటకుఁ దన్ని వేసెను. అంత బృహస్పతి వీర్యము నేలపైపడి బాలుఁ డయ్యెను. బృహస్పతి మమతను జూచి "నీవే యీ బాలునిఁ బెంచి యిరువురు పుత్త్రు లుదయించిరని చెప్పు" మనెను. మమత "దుష్కృతమున జనించిన యీ బాలుని నేను బెంపఁజాల, నీవే తీసికొనిపోయి పెంపు" మనఁగా బృహస్పతి యాలస్యము ప్రమాద హేతువని "నీవే పెంపు" మని వెడలి పోయెను. మమతయు నా బాలుని విడచివేసెను. నీవ పెంపు నీవ పెంపుమని మమతాబృహస్పతులు విడచిపుచ్చుటచే నా బాలుఁడు ద్వాజుఁ* డనఁ బరఁగెను; మరుద్గణ మా బాలు నెత్తుకొని పోయి పెంచుచుండెను. మమతయు నీ సందర్భముననే పుత్త్రునిఁ గనెను. అతఁడు పినతండ్రి శాపమునఁ బుట్టుగ్రుడ్డియై జనించి తనకును తల్లికిని జరిగిన పరాభవమునకుఁ జింతించి బృహస్పతి నుద్దేశించి "ఓరీ! నిర్భాగ్యా! నీవు చేసిన యీ దోషమునకుఁగాను నీ భార్య నితరుఁడు గొనిపోయి రమించును గాక! నీవు నవమానవ్యథకుఁ బాలగుదువు గా"కని శపించెను.

## భరద్వాజుని భరతచక్రవర్తి పెంచుట:

ఆ సమయమున దుష్యంతమహారాజునకు శకుంతలవలన జనించిన భరతుఁడు తండ్రి యనంతరమునఁ జక్రవర్తియై శతాధికాశ్వమేధము లొనర్చి దేవేంద్రవిభవమున రాజ్యమేలుచు విదర్భరాజ పుత్త్రికల మువ్వురవలనఁ బుత్త్రులఁ గాంచెను. కాని, యా మువ్వురు భార్యలు జన్మించిన పుత్త్రులు భర్త కే విధమున నీడుకాని వా రని శిశువులఁ జంపివేసిరి. భరతచక్రవర్తి యా యుదంత మెఱిఁగి యపుత్త్రకుఁ డైన కారణమునఁ బుత్త్రప్రాప్తికై మరుత్స్తోమ మను

---

* ద్వాజుఁ డనఁగా నిరువురిచే విడువఁబడినవాఁడు.

యాగ మొనర్చి మరుద్గణమును మెప్పించిన మరుత్తు లీ ద్వాజునిఁ దీసికొని వచ్చి భరతుని కిచ్చిరి. భరతుఁడు ద్వాజుని స్వీకరించెను. వితథమైన భరతవంశమున కాతఁడు వంశకర్తయగుటచే నాతనికి వితథుఁ డనియు భరతునిచే స్వీకరింపఁబడిన కారణమున భరద్వాజుఁ డనియు నామములు కలిగెను.

తరువాత భరద్వాజుఁడు భరతునిచే ననేక యజ్ఞయాగము లొనరింపఁ జేసి యా కారణమున భరతునకు మహోత్రుఁడు, గయుఁడు, గర్గుఁడు, కపిలుఁడు నను నలువురు పుత్త్రు లుదయించునట్లు చేసెను. తానును వివాహమై భార్యవలన మన్యు వను కుమారుని దేవవర్ణి యను సుతను గాంచెను. ఈ మన్యుని మనుమఁడే రంతి దేవుఁడు. భరద్వాజుఁడు తన కూఁతురగు దేవవర్ణిని విశ్రవో బ్రహ్మ కిచ్చి వివాహము చేసెను.*

## భరద్వాజునకు ద్రోణాచార్యుఁడు కలిగిన విధము :

భరద్వాజుఁ డా విధముగా భరతవంశోద్ధారుఁడై భరతుని వందనము లందుకొని యటనుండి వెడలి గంగాతీరమున నాశ్రమము నిర్మించుకొని తపస్సుచేయుచుండెను. ఈ విధముగాఁ గాలము పుచ్చుచున్న భరద్వాజమహర్షి యొకనాఁ డభిషేచనార్థమై గంగాజలముల దిగునరి కందు ఘృతాచి యను నచ్చర క్రీడ గావించి యొంటిపై బట్ట లేకుండఁ గానరాఁగా నా మృగాక్షియం దాతనికిఁ కామరాగ ముదయించెను. అంత నతిరేకమున నాతనికి శుక్రపాత మా క్షణమునఁ గలుగఁగా భరద్వాజుఁడు దానిని దన చేతిద్రోణమున సంగ్రహించి గృహమునకుఁ దీసికొనిపోఁగా నాతని వీర్యమువలన ద్రోణుఁ డుదయించెను. భరద్వాజుఁడు ద్రోణునకు జాతకర్మాదిక మొనర్చి తన యాశ్రమమునఁ బెంచుచు వేదాదివిద్యల నభ్యసింపఁ జేసెను. భర

* భాగవతము నవమస్కంధము; భారతము ఆదిపర్వము.

ద్వాజుని మిత్రుఁడగు పృషతుని పుత్త్రుఁడగు ద్రుపదుఁడు ద్రోణునితోడి సహాధ్యాయత్వమున భరద్వాజుని కడనే విద్య నభ్యసించి పృషతుని పరోక్షమునఁ బాంచాలాధిపతి యయ్యెను.

ద్రోణుఁడు వేదవిద్య విలువిద్య గఱచి తండ్రి పనుపున నగ్నివేశ మహాముని వలన ధనుర్విద్యాపారగుఁడై యనేక శాస్త్రములు వడసెను. ఒకనాఁడు భరద్వాజుఁడు పుత్త్రునిఁ బిలిచి "నాయనా! విద్యా పరిపూర్తియైనది. కనుకఁ బరమ మాన్యమగు గృహస్థాశ్రమమును స్వీకరించి పితరులఋణముఁ దీర్పుము. నీ కనుకూల వయోరూపవిరాజిత, కృపాచార్యుని తోఁబుట్టువు కృపి యను నామె గల" దన ద్రోణుఁడు పితృవాక్య పరిపాలనమునకై కృపిని బెండ్లాడి యామెవలన వంశోద్ధారకుఁడగు నశ్వత్థామను గనెను.*

## భరద్వాజుఁడు భృగుమహర్షి కడ కేతెంచుట :

భరద్వాజమహర్షి యొక పర్యాయము కైలాసశైలశిఖరమునఁ దేజోరాశియై యున్న భృగుమహర్షి కడ కరుదెంచి యాతని వలన భూతసృష్టి ప్రకారము, ఆకాశాది పంచభూతప్రమాణములు, బ్రహ్మకుఁ బుష్కర మాదినివాసమైన విధము భూతము లైదే యగుటకుఁ గారణము, స్థావరములయందు భూతగుణములు గల్గిన తెఱఁగు, వర్ణాశ్రమాచార క్రమము, పరలోకస్థితి మున్నగు ననేక విషయములు విపులముగాఁ దెలిసికొని ప్రముదితాత్ముఁడై భృగుని వీడ్కొని యాశ్రమమున కరిగెను.◆

## భరద్వాజుఁడు సీతారామలక్ష్మణుల కాతిథ్య మిచ్చుట :

భరద్వాజమహర్షి యఖండ తపోధనయుక్తుఁడై త్రికాలవేదియు మహితమూర్తి యునై పలువురు శిష్యులు గణములుగా నేర్పడి తన్ను

---

* భారతము, ఆదిపర్వము.

◆ భారతము, శాంతిపర్వము.

సేవించుచుండఁగా నఘభంగచంగము, మృదులతుంగతరళతరంగము నగు గంగా యమునా సంగమమునఁ బ్రయాగవటమూలమునఁ గల యాశ్రమమున బ్రహ్మనిష్ఠాగరిష్ఠుఁడై యుండెను.

ఇట్లుండ నొకనాఁడు పితృవాక్యపరిపాలనార్థము సీతాలక్ష్మణసమేతుఁడై శ్రీరామచంద్రుఁడు వనవాసోన్ముఖుఁడై భరద్వాజు నాశ్రమమునకు వచ్చెను. భరద్వాజుఁడు యోగసమాధి నతీతానాగతవృత్తాంత మరసి వారి కతిథిసత్కారము లొనర్చెను. పిమ్మట భరద్వాజు డా మువ్వురను రాత్రికిఁ దన యాశ్రమమున నుంచుకొని వారికిఁ దన మహిమోదాత్తస్థితిఁ జూపి శ్రీరాముని విష్ణుమూర్తి యని కొనియాడి మఱునాఁ డుదయము వారు బయలుదేఱఁగా చిత్రకూటోదంతము చెప్పి యట కేగుఁడని దీవించి పంపెను.

తరువాత శ్రీరాముఁడు-రావణుని నిర్జించి సీతామహాసాధ్వితోడను సోదర మిత్రబృందములతోడను బుష్పకారూఢుఁడై యయోధ్యానగరమునకు మరలివచ్చు సమయమున దారిలో భరద్వాజాశ్రమము పొంత విమానము దిగి భార్యానుజులతో నా మునీశ్వరుఁ జూడ నేగెను. చక్కఁగాఁ బుష్పించిన చెట్లుగల యా పుణ్యాశ్రమము శాంతసత్త్వావృతమై యుండఁ గనుఁగొని పావన హోమధూమ సుగంధాఘ్రాణమున నుల్లము పల్లవించుచుండఁగాఁ బావకకల్ప తేజుఁడగు భరద్వాజమహర్షినిఁ గనుఁగొని సీతారామలక్ష్మణులు వినయాదరసంభ్రమముల నాతని చరణములకు మ్రొక్కిరి. పిమ్మట భరద్వాజుఁ డమితానందమున వారి నాదరించెను. శ్రీరాముఁడు "మహాత్మా! పదునాలుగేండ్లు నరణ్యవాసము గడిపి పదునైదవయేఁడు ప్రవేశింపగనే తిరిగి వచ్చుచున్నాము. భవదీయ సందర్శనమునఁ బరమ పవిత్రులమైతిమి. తాపసోత్తమా! ఇచటి మృగ వ్రజములు పరస్పర వైరవిరహితములై వ్యాధముక్తాశుగాది బాధలులేక సుఖముగ నున్నవి కదా? పరమ పరివర్ధితములై రుచిరామృత ఫలభారపూర్ణములై పల్లవ

పుష్పయుక్తములై పాదపములు తీవ్రమారుతద్వారద జనాద్యుపద్రవము లందకుండ నున్నవి కదా! ఋషికులతిలకా! స్నానసంధ్యాద్యను ష్ఠానములకు సలిలాశయము లనూనములై యొప్పుచున్నవి కదా: జప హోమ క్రతు తపములు ఆగమాధ్యయనములు నిర్విఘ్నముగాఁ దమ యాశ్రమమునఁ గొనసాగుచున్నవి కదా!" యని కరుణాము యుఁడై ప్రశ్నించెను. భరద్వాజు డానందియై "రఘువరా! నీ ప్రసా దమున సర్వము భద్రముగ నున్నది. నీ సచ్చరితము సమస్తము విమలజ్ఞానోజ్జ్వలదీపమహిమ కలిమిఁ దెలిసికొని యానందించుచునే యుంటిమి. నీ వీ దినమున నిటనుండి రేపకడఁ బోవచ్చునట్లు ప్రసా దింపు"మని కోరెను. శ్రీరాముఁ డట్లే యొనర్చి భరద్వాజుని సంప్రీ తునిఁ జేసిన నాతఁడు "రామా! నా కోరిక తీర్చితివి. సర్వలోకేశ్వ రుఁడవైన నీకు నే నేమీయఁ గలను? ఐన, నొక వర మడిగి కైకొ" మ్మని పలుకఁగా శ్రీరాముఁడు వినయాంజలియై "మహాత్మా! నీ కృపావిశేషమున సాకేతపురము చుట్టును యోజనత్రయారామములై వృక్షములు ఫలమధు నిష్యందాకల్పములై తనరఁ జేయవే" యని కోరెను. భరద్వాజమహర్షి యా వర మనుగ్రహింప నటనుండి శ్రీరామాదులు నందిగ్రామమున కేగిరి.*

## భరద్వాజుఁడు శ్రీకృష్ణునిఁ గని స్తుతించుట:

భరద్వాజమహర్షి వాసుదేవునితోఁ గూడి తీర్థయాత్ర యొన ర్చుచు యమునాతరంగిణి నోలలాడఁ గుతూహలియై యమునా పర్యంతకాంతారమునకు వచ్చి చేరెను. అట సైకతమున శ్రీకృష్ణుఁడు తోడి గోపాలబాలకులఁ గూడి యగ్రజుఁ డగు బలరామునితో విహ రించు చుండెను. ఇంతలో భరద్వాజ వామదేవులు గోపాలుర సమీ పించి "వత్సలారా! ఈ యమునానదిలో స్నానము చేయుటకు నాగ

* రామాయణము.

నక్రవర్జితమగు రేవును జూపుఁ" డని యడిగిరి. అంతవారు సామాన్య బ్రాహ్మణు లనుకొని యా విప్రుల నుల్లసమాడఁ దొడఁగిరి. దూరమున నున్న శ్రీకృష్ణుఁ డది గ్రహించి త్వరితగతి వచ్చి నమస్కరించి "తపస్వివరులారా! మీ రడిగిన త్రోవ నేఁ జూపెదను. కర్మానుష్ఠానమైనంత నిటకుఁ జనుదెంచి మా యాతిథ్య మంగీకరింపుఁడు. ఇక్కడ మేలిమిగల మీఁగడతోడి పెరుఁగునం గలిపిన చల్దివంటకము చిక్కమున నున్నది. శర్కరామిశ్ర మగు పాయసము గలదు. ధారోష్ణములగు గోక్షీరము లున్నవి; స్వీకరింపుఁడు. నేను నందనందనుఁడ" నని సవినయముగా నుడివెను. అంత భరద్వాజుఁ డాతని మాట లాలించి యాతని తేజోమూర్తిని గని సమాధి నిమీలితేక్షణుఁడై యాతని విష్ణుమూర్తిగా నెఱిఁగి బహువిధములఁ గీర్తించెను. శ్రీకృష్ణుఁ డానందించి నమస్కార పురస్సరముగా నా తాపసోత్తముల వీడుకొలిపెను. వారు యమునాతరంగిణి నోలలాడి యథేచ్ఛ మేగిరి. *

### భరద్వాజమహర్షి దివోదాసుఁ డను రాజును గాపాడుట:

పూర్వము మనుసంభవుఁడైన శర్యాతియొక్క వంశమున వీతహవ్యుఁ డను నామాంతరముగల హైహయుఁ డొకఁడు మహారాజయి ప్రబల వీరులగు నూర్వురు పుత్రులఁ గాంచెను. వారు విజయాభిలాషులై కాశీశుఁ డగు హర్యశ్వుని యుద్ధమునకుఁ బిలిచి యోడించిరి. వాని పుత్రుఁడగు సుదేవుఁడు పిమ్మట రాజు కాఁగా తిరిగి హైహయులు వానిపై దండెత్తివచ్చి యోడించిరి. అతని పుత్రుఁడగు దివోదాసుఁడు రాజు కాఁగా వా రాతనిపైని దండెత్తి యోడించిరి. దివోదాసుఁ డోడిపోయి భరద్వాజమహర్షిని శరణుఁ జొచ్చెను. భరద్వాజుఁ డాతనిఁ గటాక్షించి పుత్రకామేష్టి యొనరించి దివోదాసునకుఁ బ్రతర్దనుఁ డను నొక మహావీరుఁ డగు సుతు ననుగ్రహించెను. భరద్వాజ

* హరివంశము.

కటాక్షమున నా బాలుఁడు ధనుర్వేదాదుల నభ్యసించి సముజ్జ్వల తేజము నంది యువరా జయ్యెను. అతఁడు పిమ్మట భరద్వాజ దివో దాసుల యనుమతి నంది హైహయులపై దండెత్తి వారి నందఱ నొక్కుమ్మడిఁ దెగటార్చెను. ఇఁక మిగిలిన వీతహవ్యుఁడు భయముచే భృగుమహర్షి యాశ్రమమున కేగి యాతని శరణు చొచ్చెను. ఆ మహర్షి యాతనిపైఁ గరుణ యుదయింప నాతని తన శిష్యులలో దాఁచియుంచెను. తోడిబ్రాహ్మణ బాలురవలె నాతఁడును జరించుచు బ్రాహ్మణకృత్యము లొనరించు చుండెను.

ఇంతలోఁ బ్రతర్దనుఁడు వీతహవ్యుని జాడఁదెలిసి శత్రునిశ్శేష మొనరింపఁ దలఁచి భృగునాశ్రమమునకు వచ్చెను. భృగుఁ డాతని రాకకుఁ గారణ మడిగెను. అతఁడు "మహాత్మా! తమ దయవలన శత్రునిశ్శేషమైనది కాని, యొక్క వీతహవ్యుఁడు మాత్రము దమ యాశ్రమముఁ జేరినట్లు విని యాతనిఁ జంపవచ్చితిని. దయయుంచి యాతనిఁ జూపుఁ"డని ప్రార్థించెను. భృగుమహర్షి తన తపశ్శక్తి వలన వీతహవ్యునకు బ్రాహ్మణత్వము సిద్ధింపఁ జేసి "రాజా! ఇట క్షత్రియు లెవ్వరును లేరు. వీరందఱు నా శిష్యులే చూడు" మని తన శిష్యప్రతతిని జూపెను. ప్రతర్దనుఁడు సంతసించి శత్రువులు మూలమట్టుముగ నశించిరని యెంచి భృగువునకు వందనము లొనర్చి వెడలిపోయెను.

పిమ్మట వీతహవ్యుఁడు భృగువునకు మ్రొక్కి "మహాత్మా! నీ కటాక్షమున బ్రతికితిని. నాకు బ్రాహ్మణత్వము సిద్ధింపఁ జేయవే" యని ప్రార్థించెను. భృగుఁడును "రాజా! నీవు నా యాశ్రమమునఁ జేరి యే నాఁడు బ్రాహ్మణకృత్యము లగు తపోఽగ్నిహోత్రాదుల నొనర్ప మొదలిడితివో యా నాఁడే నా కటాక్షమున ద్విజన్ముఁడవైతివి. ఇఁక నీ వంశమున జనించినవారు బ్రాహ్మణులే యగుదు"రని పలికి యాతని వీడ్కొలిపెను. తరువాత నీతని వంశమున భృగు కృప

ననుసరించి సుతేజసుఁడు, వర్చసుఁడు, శునకుఁడు, శౌనకుఁడు మున్నగు మహాద్విజులు జనించిరి. *

## భరద్వాజుని విందు :

తొల్లి రామాన్వేషణమునకై సపరివారుఁడై వచ్చిన భరతునిఁ గటాక్షించి భరద్వాజుఁడు నిజతపశ్శక్తిచే రాజాధిరాజోచితములగు సౌధములు నిర్మించి షడ్రసోపేతమగు భోజనముఁ బెట్టి రేయెల్ల విలాసినీ విలాసాదులెల్ల సమకూర్చి విందొనర్చెను. ఇదియే 'భరద్వాజుని విందు'. భరతుఁడు సపరివారముగ నుపభోగించి మునిశక్తికి ముగ్ధుఁడై కొనియాడి వెడలిపోయెను.

## భరద్వాజ రాజధర్మ ప్రబోధము :

ప్రజారంజకుఁడు, మహారథుఁడు మహారాజు నగు శత్రుంజయుఁడగు రాజు భరద్వాజమహర్షిని జేరి తనకు రాజధర్మమును దెలుపుమని కోరెను. భరద్వాజుఁ డిట్లు బోధించెను. "రాజా! రాజు దండవిధానమునఁ జాల జాగరూకుఁడై యుండవలయును. దండనవిధానముచే శత్రుపక్షము వృక్షమూలమును ఛేదింపవలయును. రాజు శత్రువులయెడఁ గోయిలవలె మృదువుగా భాషించుచు వరాహమువలె మూలోచ్ఛేదము చేయుచు, మేరువువలె నిశ్చలుఁడై, శూన్యగృహమువలె సర్వసంపదలను గోరుచు, నటునివలె నానా రూపములు దాల్చుచు రాజ్యాభివృద్ధి చేసికొనవలయును.

ఆరామ, వేశ్యవాటికా, సత్రమందిర, స్నానపానప్రదేశముల దొంగలు చేరుచుందురు. వారిని బట్టించి రాజు ప్రజలకు సుఖమును సమకూర్పవలయును. ఎవనినైనఁ బరీక్షించి నమ్మవలయు, శుష్క వైరము, చేతులతో నది నీఁదుట, ఋణశేష, రణశేషాగ్నిశేషములు

---

* భారతము, అనుశాసనికము.

రాజునకుఁ బనికి రావు. గ్రద్ద దృష్టియు, కొంగ వినయము, కుక్క విశ్వాసము, సింహపరాక్రమము, కాకసంశయము, పామునడక, రాజు శత్రువులయెడఁ జూపవలయును. దాఁటరాని దానిని దాఁట జూచుట చేఁ జిక్కిన దాని నపహరింపఁ జూచుట, మూలచ్ఛేదము చేయఁదగని దాని నున్మూలించుట, అసాధ్యుఁడగు శత్రువును జంపఁ దలఁచుట, రాజునకుఁ బనికిరావు. ఇవన్నియు నాపదఁ బాపుకొనుటకే చేయవలయుఁ గాని కర్తవ్యము లని మాత్రము చేయరాదు." ఈ ప్రకారము భరద్వాజుఁ డెన్నియో రాజధర్మముల వాతనికి బోధించి పోయెను.*

## భారద్వాజ స్మృతి:

ఒకప్పుడు భృగువు, అంగిరసుఁడు, అత్రి, వసిష్ఠుఁడు, శాండిల్యుఁడు, మార్కండేయుఁడు, మాండవ్యుఁడు మున్నగు మహర్షులు రమ్యమగు మేరుపర్వతశిఖరమున సుఖాసీనుఁడై యున్న మునిశ్రేష్ఠుఁడు, సర్వవిద్యాతపోనిధి, పుణ్యాత్ముఁడు, పుణ్యశీలుఁడు, బ్రహ్మనిష్ఠుఁడు, జితేంద్రియుఁడు నగు భరద్వాజమహర్షికడ కరుదెంచి సర్వోపచారములచే నతనిం బూజించిరి.

> "భగవన్! సర్వధర్మజ్ఞ! సర్వవేదార్థపారగ!
> సర్వశాస్త్రార్థ తత్త్వజ్ఞ! సర్వసత్కర్మ కోవిద!
> సంధ్యాది ప్రముఖాః సర్వా నిత్యనైమిత్తిక క్రియాః
> యాస్తా ద్విజాదిభిః కార్యాః కథన్నో వక్తుమర్హసి."

అని ప్రార్థించిరి. భరద్వాజుఁడు వారినెల్లరను సముచితరీతిని సత్కరించి సమస్తశాస్త్రసారమగు ధర్మశాస్త్రమును వారికి వినిపించెను. ఇదియే "భారద్వాజస్మృతి" యనుపేర నొప్పుచున్నది. ఇందు శాస్త్రావతారిక, దిగ్భేదము, మలమూత్ర పరిచ్యుతి, శౌచము, అచర

* భారతము, శాంతిపర్వము.

ణము, దంతధావనము, క్షురకర్మ, సంధ్యాప్రమాణము, జపము, తపము, బ్రహ్మయజ్ఞము, పితృతర్పణము, ఔపాసనము, వైశ్వదేవము మహాయజ్ఞ చతుష్టయము, భోజనము, శయనము, ధ్యానము, మహాధ్యానము, పూజనము, పూజాద్రవ్యములు, జపకలశము, జపక్రియలు, యజ్ఞోపవీతధారణము, ప్రాముఖ్యము, కుశలు, ప్రణవము, వ్యాహృతి, సాధనము, ప్రాయశ్చిత్తములు మున్నగు నెన్నో విషయములు స్పష్టముగా, విశేషముగా, చక్కఁగా తెలుపఁబడి యున్నవి.

"తూర్పుదిశగాఁ దిరిగి కూర్చుండి సర్వసత్కర్మములు చేయవలయును. ఇఁక, ఏ ప్రక్కగాఁ దిరిగి సత్కర్మలు చేసినను దోషము కలుగును. తూర్పుదిక్కు తెలియనిచో కర్మప్రారంభమే చేయరాదు. చేసినయెడల నది యెల్ల నిష్ఫలమే యగును. విణ్మూత్రవిసర్జనజ్ఞానము ప్రతినరునకు అవశ్యకము. అది తెలియనివాఁ డేది చేసినను వ్యర్థమే. ప్రతినరుఁడు బ్రాహ్మీముహూర్తముననే లేచి ధర్మబుద్ధికలిగి పరమేశ్వరుని ధ్యానించి యిల్లు వెడలి దక్షిణ పశ్చిమములలో నొకదిక్కునకుఁ బోవలయును. పరిశుభ్రమగు ప్రదేశమును వెదకికొని యట మలమూత్రవిసర్జనము చేయవలయును. చెట్టులు పుట్టలుగల చోట్లు, కాలిబాటలు, దారితీరులుగల ప్రదేశములు, బురదగుంటలు, దేవాలయములు, గోవులు నివసించు తావులు, పవిత్రస్థలములు గల కడలను ఆ పని చేయరాదు. పిదప, మృత్తికాజలాదులచే పాత్రదేహహస్తక్షాళనము చేసికొనవలయును. పిమ్మట దేవాలయనదీతీరములందో గృహముననో సప్తవిధస్నానములలో నొక శుద్ధ స్నానమాచరింప వలయును. అనంతరము సంధ్యావందన మాచరింపవలయును" అని సమస్త విషయములను, అందలి పరమరహస్యములను, ఆ యా కర్మల యందలి మెలఁకువలను విధి నిషేధములను, ప్రాయశ్చిత్తములను సర్వమును దెలిపెను. మహర్షు లపరిమితానంద మంది యాతని సెలవుగైకొని తమ తమ నెలవుల కరిగిరి.

భరద్వాజ వైమానిక శాస్త్రము :

భరద్వాజమహర్షి యనేకశాస్త్రములు రచించిన మహావిజ్ఞాని. ఈతఁడు రచించిన "వైమానిక శాస్త్రము" చాల ముఖ్యమైనది. ఈ శాస్త్రమున విఱుగని, కోయఁబడని, అగ్ని దగ్ధము కాని, వినాశనము కాని విమానముల నిర్మాణము పేర్కొనఁబడినది. ఈ శాస్త్ర మెనిమి దధ్యాయములలోఁ గలదు. అందులోని కొన్ని ముఖ్యవిషయము లివి. చెక్కు చెదరని విమానము నిర్మించుట, అదృశ్యవిమాన నిర్మాణము, ప్రత్యర్థి విమానములలోని నరుల సంభాషణములు విను రహస్యశక్తి, శత్రు విమానముల ఛాయాగ్రహణశక్తి రహస్యములు, శత్రువిమానముల రాకపోకలు, అవి వెడలు మార్గములు తెలిసికొను రహస్యములు, శత్రువైమానికుల మూర్ఛిలఁ జేయఁగల శక్తిరహస్యములు, శత్రువిమాన నాశనరహస్యములు మున్నగునవి.

ఈ శాస్త్రమునందలి కొన్ని వాక్యము లివి.

"సర్వాంగసంపూర్ణమగు శరీరముచే నరుఁ డె ట్లిహపరముల సాధించి కృతార్థుఁడగునో అట్లే సర్వాంగసంపూర్ణ మగు విమానము కూడ మిక్కిలి యుపయోగకారి యగును. విమానమునకు ముప్పది యొక్క అంగము లుండవలయును.

వైమానికులకు వాతావరణ పరిస్థితులనుబట్టి వివిధములైన దుస్తు లుండవలయును. అగ్నిమిత్రుఁడు పేర్కొన్నవిధపు దుస్తులు వైమానికు లా యా కాలముల ధరింపవలయును.

వైమానికులకు మూఁడు విధములైన ఆహారపదార్థము లుండ వలయును. కల్పశాస్త్రప్రోక్తములగు నీ త్రివిధ భోజనపదార్థములు వైమానికులు కాలమానములఁబట్టి కైకొనుచుండవలయును. కాలానుకూల భోజనమువలన గాలిలోఁగల యిరువదైదు రకముల విషములు వైమానికునకు బాధ కలిగింపఁ జాలవు."

"శౌనకప్రోక్తమగు పదునాఱు రకముల లోహములే విమాన భాగముల కుపయోగింపవలయును. ఈ పదునాఱు రకముల లోహములు కూడఁ దేలికయైనవి. శీతోష్ణముల గ్రహించి మార్పు చెందనివి. ప్రాచీనఋషు లందఱు కూడ నీ పదునాఱు లోహములే విమాన నిర్మాణోపయోగులని చెప్పియున్నారు.

ఈ రీతి భరద్వాజుఁడు మహాతపోగ్రణియై బ్రహ్మర్షివర్యుఁడై సప్త మహర్షులలో నొకడై నేఁటికిని దివ్యజ్యోతియై ప్రకాశించుచున్నాఁడు. ఆ మహర్షి చంద్రునకు నిత్యనమస్కారము లొనర్చి యాతని కటాక్షమునఁ బరిఢవిల్లుదుము గాక!

* * *

# మహర్షుల చరిత్రలు

## భృగుమహర్షి

### స్తుతి.

భృగుమహర్షి బ్రహ్మహృదయమునుండి జనించిన పరమ పూజ్యుఁడు. నవబ్రహ్మలలో నొకఁడు. చ్యవన జమదగ్ని శుక్ర దధీచ్యాది మహర్షివరులఁ బడసిన భృగువంశమున కితఁడే మూల పురుషుఁడు. ఈ వంశముననే విష్ణుమూర్తి పరశురాముఁడై పుట్టి భృగు రాముఁ డనఁ బరగినాఁడు.

### భృగుమహర్షి సంతానము:

భృగుమహర్షి కర్దమప్రజాపతికొమార్తెయైన ఖ్యాతిని వివాహమై యామెభక్తి శుశ్రూషలకు సంతసించి ధాత విధాత యను నిరువురు కుమారులను, శ్రీ యను భగవత్ప్రాయణ యగు కన్యను నామెకుఁ బ్రసాదించెను. ఉశన యను నామెను వివాహమాడి కవి లేక యుశనసుఁ డను పుత్త్రినిఁ గాంచెను. ఈ యుశనసుఁడే రాక్షస గురువగు శుక్రాచార్యుఁడు. భృగువు పులోమ యను కన్యకామణినిఁ బెండ్లాడి యామెకు చ్యవనుఁడను మహర్షిని బుట్టించెను. ఈ విధముగా భృగుమహర్షి పలువురుస్త్రీలను వివాహమాడి వంశాభివృద్ధి నొనర్చెను.

### భృగుమహర్షి యగ్నిహోత్రుని శపించుట:

భృగుమహర్షి పులోమ యను భార్య శుశ్రూష యంగీకరించి యామె కోరిక ననుసరించి యామెకు గర్భము నొసఁగెను. పులోమ

పుత్రుఁడు జన్మించువఱకుఁ బతికడనే యుండి యాతనికి సపర్య లొనరించుచుండుటకు భర్తృవరము పడసెను. ఈ కారణమున భృగు మహర్షి పులోమ నగ్నిగృహమును గాపాడ నియమించి తాను స్నానార్థమరిగెను. ఈ లోపునఁ బులోమ యగ్నిగృహమున నగ్నిని రగుల్కొలుపుచుండఁగా బులోముఁడను రాక్షసుడు పులోమను మోహించి యామెను గొనిపోవు తరుణమున కెదురుచూచుచుండినాఁడు. అగ్ని గృహమున కేగి యామె పులోమ యగునో కాదో యని సంశయము కలుగ నగ్నిహోత్రు నామె యెవరని యడిగెను. అగ్నిహోత్రుఁ డా ప్రశ్నమునకు సరియగు సమాధాన మిచ్చిన నామెకుఁ గీడు వాటిల్లునని యెఱిఁగియు నసత్యదోషమునకు వెఱచి యామె పులోమ యని చెప్పివేసెను. అంత నా రాక్షసుఁడు సూకరరూపమున నామె నెత్తుకొని పోవుచుండ నామె గర్భచ్యుతుఁడై చ్యవనుఁ డాతని భస్మపటల మొనర్చెను. పులోమ గృహమున కేగి భృగుమహర్షితో వృత్తాంత మంతయుఁ జెప్పఁగా భృగుమహర్షి కోపించి యగ్నిని సర్వభక్షకుఁడుగా శపించెను. అగ్నియు నట కరుదెంచి తా నసత్యదోషమునకు వెఱచితి నని చెప్పినను ప్రయోజనము లేకపోయెను. అంత నాతఁడు తనరూపము నుపసంహరించుకొన బ్రహ్మదు లరుదెంచి భృగుమహర్షి యనుజ్ఞఁ గైకొని, యగ్ని సర్వభక్షకుఁడైనను బూజ్యులలోఁ బూజ్యుఁడగున ట్లనుగ్రహించి వెడలిపోయిరి. ఆ కారణమున నాఁటినుండి యగ్నిదేవుఁడు సర్వభక్షకుఁడయ్యు సర్వజన పూజ్యుఁడై వెలుఁగుచుండెను.*

### భృగుమహర్షి విష్ణుమూర్తిని శపించుట:

పూర్వ మొకప్పుడు దేవతలు దైవశక్తిసంపన్నులై స్వర్లోకము నుండి రాక్షసులను ద్రోలివైచిరి. అంత రాక్షసులు తమ గురువగు శుక్రాచార్యుని సమీపించి "గురువరా! తమవంటి మహాశక్తి సంపన్నులు

---

* భారతము. ఆదిపర్వము.

మాకు గురువులై యుండియు మేము దేవతలచేఁ బడు కడగండ్లను మడింప నిట్లు జనక్షయమగుచుండఁ జూచుచు నుండవలసినదేనా? ఏదే నుపాయ మూహింపుఁ" డని కోరిరి. శుక్రాచార్యుఁ డది విని చనిపోయిన వారిని బ్రదికించు సంజీవనీమంత్రోపదేశము శివుని మెప్పించి గడించి వచ్చి వారి నుద్ధరింతునని చెప్పి తపమున కేగెను. ఈ సంగతి యెఱిఁగిన దేవతలు నిదే సమయమని రాక్షసుల నుక్కడఁగించుచుండఁగా వారందఱు భృగుపత్నియగు నుశన కడకేగి రక్షింపుమని మొఱపెట్టుకొనిరి. భర్త కాని కుమారుఁడు కాని యటలేని కారణమున వారినెట్లైన రక్షింప సంకల్పించి యుశన వారి కభయమిచ్చి తాను వారితో నేగి యింద్రాది దేవతలను స్తంభింపఁ జేసెను. ఆ సమయమునఁ గొందఱు దేవతలు విష్ణుమూర్తి కడకేగి యింద్రాదుల పాటును, భృగుపత్ని కటాక్షమున రాక్షసులపోటును మనవిచేసికొనిరి. విష్ణుమూర్తి వారల కభయ మొసఁగి వెంటనే బయలుదేరి వచ్చి యింద్రాదుల దుస్థితిఁ జూచి యొకస్త్రీ నెట్లు చంపుట యని సంశయించు చుండెను. ఇంద్రుఁడు స్త్రీహత్యాదోషమునకు వెఱవవలదని చెప్పఁగా విష్ణు వామెను భయపెట్టఁ జూచెను. కాని యుశన సహేంద్రుఁడగు విష్ణుమూర్తి భస్మమగుఁ గాక యని శాపాక్షరములుచ్చరింప సంకల్పించినంతనే సర్వహృదయాంతర్వ్యాపి యగు విష్ణువది గ్రహించి వెంటనే యొక నిశితబాణమున నామె కంఠమును దునిమెను. భృగుపత్ని విదళితకంఠయై మరణించెను. దేవతలు జయజయధ్వను లొనర్చిరి. ఈ విషయము వెంటనే కొందఱు రాక్షసు లేగి భృగుమహర్షికి నివేదించిరి. సంకల్పమాత్రమున భృగుమహర్షి చనిపోయి పడియున్న భార్యకడకు వచ్చి కోపపరవశుఁడై "విష్ణుమూర్తీ! త్రిభువనాధీశుఁడవగు నీ కింత గర్వమేల? దుష్టశిక్షణము శిష్టరక్షణము పనిగాఁగల నీ వి ట్లధర్మమున నొక స్త్రీని వధించితివి. ఈ దోషమునకుఁ గాను నీవు భూలోకమున మానవుఁడవై జన్మించుచుఁ జావుపుట్టుక లందుచు సుఖదుఃఖముల నందుదువుగా" కని శపించెను. విష్ణుమూర్తి చేయునదిలేక యే మహర్షికిఁ దానంతశక్తి ప్రసాదించెనో

యా శక్తి తనపట్లు కదా యని పమ్మెనర్చుట తగదని తలఁచి భృగు మహర్షిని శరణువేఁడెను. భృగుమహర్షి "మహాత్మా! త్రిలోకాధిపతి వగు నిన్ను నేను శపింపఁగలనే! నీవు పుడమిపై నవతరింప సంకల్పించు కొని నన్ను నిమిత్తమాత్రునిగాఁ జేసి శపింపఁ జేసికొంటివి. నీ చైదము లద్భుతములు గదా! నీ వవతారములు ధరించుట దుష్టశిక్షణము శిష్ట రక్షణము మూలమున ధర్మసంస్థాపన కగుఁ గాక!" యని పలికి మంత్రజలములు చల్లి నిజ తపోబలమున భార్యను బునరుజ్జీవితను జేసికొనెను. ఇంద్రాదిదేవతలు భృగుమహర్షి మహిమ కచ్చెరువంది తమ తమ నెలవుల కరిగిరి. విష్ణుమూర్తి యట్లు శాపగ్రస్తుడై యంత ర్హితుఁ డయ్యెను.*

**భృగుమహర్షిబుషి వియోగమునఁ త్రిమూర్తులఁ బరిశో ధింప వేగుట:**

తొల్లి యొకప్పుడు సరస్వతీ నదీతీరమున మహర్షు లందఱును జేరి సత్రక్రతువు లొనర్చిరి. పిమ్మటఁ బరస్పర సంభాషణానంత రము త్రిమూర్తులలో నెవ్వ రధికులు? ఎవని మహత్త్వ మనంత మను ప్రశ్న ముదయించెను.♦ మహర్షు లందఱును భృగుమహర్షి వంకకుఁ

---

* లింగపురాణము.

♦ తొల్లి యొకప్పుడు స్వాయంభువ మనువు ధర్మాత్ముఁడు కర్మనిష్ఠుఁ డునై మందరపర్వతప్రాంతమున విష్ణుసత్రమను యజ్ఞమొనరించెను. ఆ యజ్ఞమునకు సర్వవేదార్థవిదులు, తత్త్వజ్ఞులు, సౌమ్యులు నగు మహా మునులు విచ్చేసిరి. వారు తత్త్వార్థపరిజ్ఞాన గోష్ఠీవినోదములఁ బ్రొద్దు పుచ్చుచున్న సమయమునఁ త్రిమూర్తులలో నెవ్వ రధికులు? ఎవని మహత్త్వ మనంతము? అను ప్రశ్నము లుదయించిన ఇంద్రుఁ డని కొందఱు, చంద్రుఁ డని కొందఱు, శివుఁ డని కొందఱు, బ్రహ్మ యని కొందఱు, సూర్యుఁ డని కొందఱు, విష్ణు వని కొందఱు పలికిరి. మనువు విష్ణుమూర్తియే యనెను—అని పద్మపురాణము.

దిరిగి "మహాత్మా! త్రిమూర్తుల ప్రాశస్త్య పరిశోధనమును గావింప సమర్థులు నీకంటె నన్యు లెవ్వరును లేరు. కావున మా యందఱపం బొనర్చి నీ వీ విషయము నిర్ధారణముగాఁ దేల్చికొనివచ్చి మా కెఱిం గించినచో మేమందఱ మా దైవమునే యుపాసించి సత్వరవిముక్తి నందఁ గలమని వేఁడుకొనిరి. భృగుమహర్షి యందుల కంగీకరించి సాహసలక్ష్మీ సమేతుఁడై బయలుదేఱెను.

ఆ భృగుమహర్షి మొట్టమొదట నవాఙ్మానసగోచరము, ననేక జీవరాసుల సృజించుచు నధికతపస్సుల తపఃఫలములు విధించుచు విశ్వకర్తలైనమహర్షులు చంద్రాదిత్యగ్రహ నక్షత్రగణములు దేవగణములు వసురుద్రసిద్ధసాధ్యులు విశ్వకర్మ విశ్వేదేవతలు పితృదేవతలు తన్నుఁ బరివేష్టించియుండఁగొలువున్న బ్రహ్మసభకుఁ జని యతని సత్త్వగుణము నరయఁ దలఁచి నుతివందనములు చేయక నిలిచి యుండెను. అంత బ్రహ్మ భృగువు దన్ను నుతింపకుండుట కలిగి మునమున యనుచుండ నాతని కోపానలమును దన శాంతోదకముల నార్పి భృగువు వెడలిపోయెను.

పిమ్మట నాతఁడు వెండికొండ కేగి యందుఁ బార్వతీ సహితుఁడై విశ్రమించియున్న శివునిఁ బొడగనెను. శివుఁడు నానందమున భ్రాతృవత్సలుఁడై యెదురేగి గౌరవింపఁగా భృగుఁ డాతని సత్త్వసంపద నరయఁ దలఁచి శివునిఁ గైకొనక యూరకుండెను. ఇది యవమానముగా గ్రహించి శివుఁడు తన శూలముచే మునిమండను నేయఁ బూనెను. వెంటనే పార్వతి యడ్డము వచ్చి తన భర్తకుఁ గోపోపశమన మొనర్చెను. భృగువు నట నిలువక వెడలిపోయెను.

అనంతర మాతఁడు వైకుంఠపురమున కరిగి కమలాంకపర్యంకగతుఁడై సుఖించు కౌస్తుభాభరణు వక్షస్స్థలమును దన పాదముతోఁ దన్నెను. అంత నగధరుఁడు పాన్పు దిగివచ్చి భృగుపాదముల కెఱఁగి "పరమ తపోధనా! నీ రాక యెఱుఁగలేక యీ గతినున్న నా తప్పు

మన్నించి కటాక్షింపుము. నీ పాదజలములు నన్నును నా గర్భమునఁ గల భువనములను లోకపాలురను బరమపవిత్ర మొనరించుఁ గదా! మహాత్మా! నీ పాదాబ్జహతి నా భుజాంతరమునకు భూషణమైనది. నీ రాకచే నేను ధన్యుఁడ నైతిని. దయయుంచి యీ రత్నసింహాసనము నధిష్ఠించి షోడశోపచారము లొనర్ప నవకాశ మీఁగదే!" యని బహువిధ మధురాలాపముల ననునయించెను. భృగుమహర్షి యాతని సంభాషణమున కత్యానంద మంది యనంత కల్యాణగుణనిధి యగు ముకుందు నభినందించి యానందబాష్పధారాసిక్తకపోలుఁడై తద్భక్తి పారవశ్యమున నొండు పలుకలేక యామంత్రితుఁడై మరలి సరస్వతీ నదీతీరమున కేగెను.

అట మహర్షు లందఱు భృగునాగమమున కెదురుచూచుచుండి యాతఁడు విచ్చేయఁగనే యెదురేఁగి సగౌరవముగాఁ దోడ్కొనితెచ్చి తమ మధ్యమున నుచితాసనాసీనుఁ జేసి యావద్వృత్తాంతము విని పింపుమనిరి. అంత భృగుమహర్షి ఋషిజన మానసాంభోజములు ప్రసన్నములై వికసింపఁ దనకు దృష్టమైన త్రిమూర్తులవిధము నెఱిఁగించెను. అది విని ఋషు లందఱును విస్మయచిత్తులు ఛిన్నసంశయులు చిన్మయాకారుఁడు శ్రీసతీశుఁడు నాదిమధ్యాంతరహితుఁడునై తనర్చిన పుండరీకాక్షుఁ డొక్కఁడే దైవమని నిర్ణయించుకొని విజ్ఞాన కలితులై హరిపదాబ్జాత యుగళము నారాధించి యవ్యయానంద మందిరి.•

## భృగుమహర్షి యువనాశ్వు ననుగ్రహించుట :

ఇక్ష్వాకువంశజుఁడగు యువనాశ్వుఁ డను రాజు వేయి యశ్వమేధయాగములుచేసి మహాప్రతిష్ఠఁ గాంచెను. కాని ఆతఁడు బిడ్డలు

• భాగవతము, దశమస్కంధము. శివబ్రహ్మలను భృగువు శపించెనని పద్మపురాణము.

లేక భృగుమహర్షి యాశ్రమమునకు విచ్చేసి పుత్త్రకాముఁడై యాతని ననేక వత్సరము లుపాసించెను. భృగుమహర్షి యాతనిఁ గరుణించి పుత్త్రకామేష్టిఁ జేసి యందు మంత్రపూతమగు జలముగల కలశమును గాంచి దానిని రక్షింప ఋత్విజుల కిచ్చెను. వారు దానిని దగ్గఱ నుంచుకొనిరి. కాని రాత్రి నిద్రావశమున నుండఁగా యువనాశ్వుఁడు దప్పికగొని యా కలశమందలి జలముం ద్రావెను.

ఇది తెలిసి భృగుఁడు యువనాశ్వుఁ బిలిచి "ఓయీ! నీభార్య కీయవలసిన జలమును నీవు త్రావితివి. దైవగతి నెవఁడు తప్పింపఁ గలఁడు? దీనివలన నీకు గర్భమై యింద్రసమానుఁడగు పుత్త్రుఁ డుద యించును. అతఁడు మహామహుఁడై మహావిఖ్యాతి నార్జించు"నని దీవించి వెడలిపోయెను. భృగుమహర్షి కటాక్షమున యువనాశ్వునకు నూఱేండ్లకు వామభాగమును జీల్చుకొని బాలార్క తేజుఁ డగు బాలుఁ డుదయించెను. అతఁడే మాంధాత; షట్చక్రవర్తులలో నొకఁడై ఖ్యాతి గాంచెను.*

## భృగు విద్యాధర సమాగమము :

భృగుమహర్షి వింధ్యపర్వతప్రాంతమున నున్నప్పుడు గొప్ప క్షామము సంభవించెను. పితృదేవ, బలివిధానములకు, హవ్యకవ్య ములకు నన్నము ఫలములు లభింపని కారణమున భృగువు శిష్యు లతోఁ గూడి యా ప్రదేశమును విడిచి కైలాసపర్వత ప్రాంతమున కేగి మణికూటపర్వతమునఁ బర్ణశాల నిర్మించుకొని శిష్యగణముతోఁ దపము చేయుచుండెను. అపు డటకు శార్దూలముఖుఁ డైన పురుషుని వెనుకఁ బసిఁడిబొమ్మవలె నున్న యొక్క పద్మాక్షి వచ్చుట నాతఁడు గాంచెను. వారిని జూచి భృగువు, మీ రెవ్వరని యడిగెను. పులి ముఖము గల పురుషుఁ డిట్లు చెప్పెను. అయ్యా! నేను సుఖముఖుఁ

* భారతము, అరణ్యపర్వము.

డను విద్యాధరుఁడను. ఈమె నా పత్ని. మే మిరువురము స్వర్లోక మునకేగి తిరిగి వచ్చుచుండగా నకారణమున నా ముఖ మిట్లయ్యెను. నగము చచ్చి యిట్లుంటిని. దీనిఁ బాపు నుపాయముఁ జెప్పు" మని ప్రార్థించెను. భృగువు "ఓయీ! ఒక్కచుక్కయైనను విషము మృత్యు హేతువైనట్లు, అల్పమైనను గర్మఫలము కట్టికుడుపును. దీనికిఁ గార ణము నీవు కృతయుగమున నేకాదశి నుపవసించి ద్వాదశినాఁడు తైలాభ్యంగమునఁ దేలితివి. ఆ దోషమున నీ కీ స్థితి కలిగిన"దని చెప్పి యాతనికి మాఘమానస్నానమున నా వికృతరూపముపోవునని యనుగ్రహించెను. ఆ విద్యాధరుఁడును భక్తియుక్తి మాఘమానస్నాన మొనర్చి దివ్యసుందరుఁడై భార్యఁ గూడి వెడలిపోయెను. •

## భృగుమహర్షి జమదగ్ని పరశురాముల కుపకృతి సల్పుట:

భృగుమహర్షి మహాతపోయుక్తుఁడై కైలాసపర్వతశిఖరమున నాశ్రమము నిర్మించుకొనియుండి సమయము ననుసరించి త్రికాల వేదియై తన వంశస్థులఁ గాపాడెను. కార్తవీర్యార్జుననితోడి యుద్ధ మున జమదగ్ని మరణించినపుడు రేణుకాదేవి సహగమన మొనర్ప నుంకించునపుడు భృగుమహర్షి వచ్చి రేణుక నోదార్చి జమదగ్నిని బ్రదికించి వెడలిపోయెను. మఱియొకప్పుడు పరశురాముఁడు భృగు మహర్షిని దర్శింపనేగినపుడు భృగుమహర్షి నిజవంశదీపకుఁడగు పరశు రాము నాదరించి తనకడ నుండి తప మొనరింపు మనెను. కాని యనతికాలమునకే పరశురాముని తపోమాహాత్మ్యమున నాతనికి దివ్య తేజము సంక్రమింప భృగుమహర్షి శిష్యు లాతని తేజమునకుఁ దాళఁ జాలక యంధీభూతు లగుచుండిరి. అంత భృగుమహర్షి పరశురాముని జేరఁ దీసి "వత్సా! నీవు లోకహితార్థము, స్వార్థము చేకూఱుటకు హిమాలయమున కేగి యందుండి పరమశివుని భజించుచుండుము.

---

• పద్మపురాణము, ఉత్తరఖండము.

దాన నీకును మాకును శ్రేయ మగు" నని పంపివేసెను. తరువాతఁ బరశురాముఁ డట్లొనరించి శివతేజమును భార్గవాస్త్రమును బరమ శివునికడఁ బడయఁ గల్గెను. ఈ రీతిగా భృగుమహర్షి నిజవంశోద్భవులకు హితోపదేశ మొనరించెడివాఁడు.

## భృగుమహర్షి భరద్వాజునకుఁ బహువిషయములు తెలుపఁగించుట :

కైలాసశైల శిఖరమునఁ దేజోవిరాజితుఁడై యున్న భృగుమహర్షి కడకు భరద్వాజమహర్షి యొకనాఁ డరు దెంచెను. భృగువు అతనినెంతయు నాదరించి యాతిథ్య మొసఁగి వచ్చినపని యడిగెను. భరద్వాజుఁడు "మహాత్మా! మునికులతిలకుఁడ వగు నీ కడఁ గొన్ని విషయము లెఱుఁగఁ గుతూహలమున వచ్చితి" ననెను. భృగుమహర్షి యానందించి యడుగుమని యాతని సంశయముల నన్నిటిఁ దీర్చెను.

భరద్వాజుఁడు భూతసృష్టిప్రకారముఁ దెలుపుమన భృగు విట్లు చెప్పెను. "వత్సా! అవ్యయుఁడు ననంతుఁడు నగు నారాయణుఁడు భూతసృష్టికై తన సహస్రాంశమున నవ్యక్తుఁడు మనసు నన నజరామరు ననుపమాను సృజించెను. అతనివలన మహత్తత్త్వ మావిర్భవించెను. అతఁడు దివ్యతేజోమయమైన పద్మ మొకటిఁ గల్పింపఁగా నందు బ్రహ్మ యుదయించెను. అతని తలఁపున నాకాశము, దాని యందు జలము, జలమునం దగ్ని, దానివలన మారుతము, దానివలన భూమి జనించెను. ఆ బ్రహ్మ యఖిలభూతాత్ముఁడు, వాఁడు విష్ణుఁడు. ఇట్లు విశ్వము విష్ణువలనఁ గలిగెను." భరద్వాజుఁ డంత నాకాశాది భూతప్రమాణమును దెల్పు మన భృగువు భూతము లనంతములు నిరవధికములు నప్రమేయము లగుటచే విష్ణున కనంత నామధేయము కలిగె ననెను. అంత భరద్వాజుఁడు పుష్కరము బ్రహ్మకాది నివాసస్థానమైన విషయము, భూతము లైదగుటకుఁ గారణము, స్థావరముల భూతగుణము గలిగిన విధము నడిగి తెలిసికొనెను.

పిమ్మట భరద్వాజుఁడు భూతగుణము లెట్లనుభవించుట యని యడిగెను. భృగువు "వత్సా! విషయము నింద్రియములు మనసు క్రమస్థానములుగా నంతరాత్మప్రదర్శియై యనుభవించి సుఖదుఃఖములఁ బురుషుఁ డొందు"నని పల్కెను. పిమ్మట వర్ణాశ్రమాచార క్రమము నెఱిఁగించి సత్యమే తపము, బ్రహ్మము సృష్టికర్త యగును. సత్య మసత్యముచే విహితమగును. కావున ధర్మాధర్మములు, బోధాజ్ఞానములు, స్వర్గనరకములు, సుఖదుఃఖములు మున్నగు వ్యావహారిక శబ్దములకు సత్యాసత్యములే యర్థములై ప్రవర్తిల్లును. కాన నసత్య మణఁగించుటకే బుధులు నియమనిష్ఠ లొనర్తురు. దానివలన శారీరక మానసికదుఃఖములు దూరము లగును. దుఃఖములు దూరములైన సౌఖ్యములు కూడఁ ద్రోయనేర్చి వైరాగ్యమందిన పురుషుఁడు పరమపదవి నందు"నని చెప్పెను.

భరద్వాజుఁ డంత నిహపర లోక భేద మెఱిఁగింపు మనెను. భృగు విట్లు పలికెను. "వత్సా! ఈ లోకము కర్మభూమి, భోగాస్పదము, దుఃఖబహుళము. ఆ లోకము భూరిసుఖనిరతము నగుట రెండింటికిని పాన గృహ శయన వసనాసన గంధ మానినీ జనాది సుఖసాధనములలో హస్తిమశకాంతరము గలదు. కాని, మమకారవివర్జితులు పుణ్యపాపమార్గ విముక్తు లగుట లోకములఁ ద్రిమ్మరిక శాశ్వతానందము ననుభవింతు"రని చెప్పి మఱియు బ్రహ్మవిహితములగు ధర్మసూక్ష్మము లనేకము లెఱిఁగించి భరద్వాజుని పంపెను.*

## భృగుసూత్రములు :

భృగుమహర్షి జ్యోతిశ్శాస్త్రసారమును భృగుసూత్రము లనుపేర చెప్పియుండెను. ఇందుఁ బ్రథమాధ్యాయమున రవిఫలమును, ద్వితీయాధ్యాయమునఁ జంద్రఫలము, తృతీయాధ్యాయమునఁ గుజ

---

* భారతము. శాంతిపర్వము.

ఫలము, చతుర్థాధ్యాయమున బుధఫలము, పంచమాధ్యాయమున గురుఫలము, షష్ఠాధ్యాయమున శుక్రఫలము, సప్తమాధ్యాయమున శనిఫలము, అష్టమాధ్యాయమున రాహుకేతుల ఫలము గలవు. తుదకు గ్రహముల పరమోచ్చ నీచభావములు, గ్రహజాతి భేదనిరూపణము గలవు.

## భృగుస్మృతి:

భృగుమహర్షిని ధర్మశాస్త్రప్రవక్తగా కాత్యాయనుఁడు పేర్కొనియుండెను. జాతినిబట్టి విద్యనుబట్టి గొప్పవాఁడైనను ఆతతాయియగు వానిం జంపినచో బ్రహ్మహత్య కాఁజాలదు. సాక్షులున్నను సాహసముల నెగ్గినను సర్వవిషయములందు దివ్యదృష్టినిబట్టి మంచి చెడ్డలు నిర్ణయింపవలెను—ఇత్యాది వాక్యములు భృగుస్మృతిలోనివని కాత్యాయనుఁడు పేర్కొనెను.

ఈ ప్రకారము బ్రహ్మమానసపుత్త్రుఁడగు భృగుమహర్షి సద్వంశ మూలపురుషుఁడై నిజతపోఽనవద్యతచే బ్రహ్మత్వము నంది పరబ్రహ్మానుసంధానమున లీనమైనాడు. ఈ మహర్షి పవిత్రనామామృతమున మానవ పాపాగ్నులు క్షణములోఁ జల్లారు ననుట నిర్వివాదాంశము గదా!

# మహర్షుల చరిత్రలు

## మార్కండేయ మహర్షి

స్తుతి

నిరుపమాన తపస్సంపదచే నాయుర్దాయభుజంగ మృత్యువు ననాయాసముగ గెల్చి చిరంజీవులైన భారతమహర్షులలో మార్కండేయుఁ డగ్రగణ్యుఁడు. ఆమహర్షికతముననే 'మార్కండేయాయుష్య' మను దీవెన జనించినది. పరమతపస్వి యగు నా మహర్షి నేఁటికి నెచటనో జీవించియే యున్నాఁడు.

### మార్కండేయుని జన్మవృత్తాంతము:

భృగుమహర్షి ఖ్యాతి యను భార్యవలనఁ గలిగిన పుత్త్రులలో ద్వితీయుఁడగు విధాత నియతి యను నామెను వివాహమై యామెతో నిష్టభోగము లనుభవించి యామె కొక పుత్త్రి ననుగ్రహించెను. ఈతఁడు మృకండుఁడను నామమున నద్వితీయ బ్రహ్మచారియై తదేక నిష్ఠ హరిహరులను గుఱించి యుగ్రతపము నొనరించెను.* కొంత కాలమున కాతనికి హరిహరులు ప్రత్యక్షమై వరము కోరుకొను మనిరి. మృకండుఁడు బ్రహ్మానందభరితుఁడై వారిని వేనోళ్ళ స్తుతించి గుణగణాఢ్యుఁ డగు నొక కుమారు నిమ్మని విష్ణుమూర్తిని, నాతనికి

* మృగశృంగమహర్షి కుమారుఁడు మృకండుఁడని పద్మపురాణము చూ. మృకండుమహర్షి (ఆఱవభాగములో)

జరాదులవలని దుఃఖములు లేకుండఁ జేయుమని శివుని గోరుకొనెను. వారిరువురు నాతనికి వరము లొసఁగి యదృశ్యు లైరి. కాని, విష్ణు వాతఁ డల్పాయుష్కుఁడగు నని పల్కి వెడలెను.

అంత మృకండుమహర్షి తపము చాలించి నిజభార్యయు మేరుతనూజయు నగు మనస్వినీసతితో సకలభోగము లనుభవించి కాలక్రమమున నామెయం దొక పుత్త్రునిఁ బడసెను. అతఁడే మార్కండేయ మహర్షి.*

## మార్కండేయుఁడు మృత్యువును జయించుట :

మనస్వినీమృకండుల నోములపంట యగు మార్కండేయుఁడు బాల్యమునుండియు నఖండనిష్ఠాగరిష్ఠుఁడై తప మొనరించుచుండెను. మృకండుఁడు సుతుని బిలచి "నాయనా! హరిహరుల కృపావిశేషమున నీవు జనించి మామానససరోవరమునకుఁ బద్మమవై నిండుశోభ నొనగూర్చితివి. అపుత్త్రత్వతిమిరావృత మగు మా మానసాకాశమునఁ జంద్రుఁడవై యుదయించి యశశ్చంద్రికలఁ దమోవిదూర మొనర్చితివి. కాని, నీ వల్పాయుష్కుఁడ వగుదువని విష్ణు వనెను. అందు కెంతయు వంత చెందుచుంటి" మని పల్కెను. మార్కండేయుఁడు మాతాపితలకు వందనమొనర్చి "జననీ జనకులారా! మీరు మహాదరమున నాకొఱ కత్యంత క్లేశదాయకములగు తపోవ్రతము లొనరించి నా యీ భౌతికదేహమునకుఁ గారకులైతిరి. నే నీ దేహముతో శివుని గుఱించి తపస్సొనరించి మృత్యువును జయించి మీ ఋణముఁ దీర్చి 'యాత్మోన్నతి నందుదును. వంతలుదక్కి నన్నాశీర్వదించి పంపుఁ"డని పలికెను. ఆ పుణ్యదంపతులు ప్రియపుత్త్రుని వచనామృతమును వీనులారఁ గ్రోలి యానందించి యాతని నాశీర్వదించిరి.

* భాగవతము. ద్వాదశస్కంధము. బ్రహ్మాండపురాణము.

అంతట మార్కండేయుఁడు పరమశివుని భక్తి మెయి భజియింపఁ దొడంగెను. కాలక్రమున నాతనికి యావత్ప్రపంచము శివమయముగా గోచరించుచుండ నితరములనెల్ల నాతఁడు మఱచి యుండెను. అంత నాతనికిఁ బదునాఱేండ్లునిండ మృత్యుదేవత యాతనిఁ గొనిపోవ నేతెంచి వానిని పాశబద్ధు నొనరించెను. కాని, పరమభక్తాగ్రణి యగు నాతఁ డించుకయుఁ జలింపక పరమశివభజనమునఁ బరవశుఁడై శివలింగమును గౌఁగిలించుకొని "పరమశివా! నీ వాద్యుఁడవు. సమస్త విశ్వమునకు హేతుభూతుఁడవు. దేవాదిదేవా! నీ భక్తుఁడనగు నన్ని యమకింకరులు పాశబద్ధు నొనరించి కొనిపోవుచున్నారు. భక్తాధీనా! ఈ సమయమున నీ వడ్డపడనిచో నా గతియేమి? శర్వా! ఈ పాశపీడన మించుకయు సహింప నోపరావే కాపాడవే" యని పరిపరివిధములఁ బ్రార్థింపఁ జొచ్చెను.

పరమ భక్తాధీనమనస్కుఁడగు పరమశివుఁడు వెంటనే త్రిశూలపాణియై యముని యమకింకరులను క్రోధదృష్టి నీక్షించుచు నటఁ బ్రత్యక్ష మయ్యెను. యమధర్మరాజు సపరివారముగ వచ్చి పరమశివుని శరణుఁజొచ్చి కోప ముపసంహరింపఁ గోరుకొనెను. శివుఁడు కరుణించి "ప్రేతాధిపతీ! నేఁడు మొదలు నీ వీతని దేఱిచూచిన నేమౌదువో గ్రహించుకొని పొమ్ము. మద్భక్తుల నేమఱియైనఁ బాశబద్ధులఁ జేసితివా నీవు నీఱయి పోఁగలవు. జాగ్రత్త!" యని హుంకరించి మార్కండేయుని శిరమునఁ దన యభయహస్తము నుంచి, యాశీర్వదించి యదృశ్యుఁ డయ్యెను.*

### మార్కండేయుఁడు హరిని గుఱించి తపించుట:

ఈ ప్రకారము శివునికృపారసమున బ్రతికిన మార్కండేయుఁ డింకను దృప్తి గనక తన కెప్పటికిని మృత్యు వనునది లేకుండఁ జేసి

---

* బ్రహ్మాండపురాణము.

కొన నెంచి విష్ణుమూర్తిని గుఱించి పరమనిష్ఠుఁడై పదివేలవత్సరములు తప మొనర్చెను. అంత నింద్రుఁడీతని తపోభంగమునకై యప్సరోంగనలఁ బంపెను. జటావల్కలధారియు, నచంచలదీక్షాబద్ధుఁడును, ధీరోదాత్తుఁడు నగు మార్కండేయుఁ డుండు తావున కరుదెంచి వీణా వేణువినోదగానముల నాతని రంజింప నెంచి యచ్చరలు విచ్చలవిడి నాట్య మొనర్చిన నాతఁ డించుకయుఁ జలింపఁడాయెను. వారలెల్లరు నింద్రుని కడకేగి యాతని నిశ్చలతఁ దెలిపిరి. కొంత కాలమునకు శ్రీహరి యాతని తపమునకు మెచ్చి వచ్చి యాతని నొక వరము వేఁడుకొను మనెను. అంత మార్కండేయుఁ డాతనికి సాష్టాంగ మెఱఁగి "విశ్వేశ! విశ్వసన్నుత! విశ్వరూప! నేను నీ దివ్యనామ స్మరణమున బహుయుగము లీ శరీరముతోడనే బ్రతుకునట్లు చేయు" మని ప్రార్థించెను. విష్ణుమూర్తి యాతని కా వర మనుగ్రహించి యదృశ్యుఁ డయ్యెను. ఈ రీతి హరిహరుల కటాక్షము సంపాదించి మార్కండేయుఁడు మృత్యువును జయించి వీరాధివీరుఁడై వెలసెను.

## మార్కండేయుఁడు శివానుగ్రహము పడయుట :

పిమ్మట మార్కండేయుఁడు మహోత్సాహ సంపన్నుఁడై శివపూజ చేయుచు హరిస్మరణ మేమఱక యుండెను. అంత నూఱు సంవత్సరములు ధారాధరములు ధారావర్షమున భూగోళమును ముంచెత్తి యంధకారబంధుర మొనర్చెను. మార్కండేయుఁ డా తిమిరమునఁ గన్నుఁ గానక యా జలమధ్యమున భయోద్వేగుఁడై యుండి యట నొక వటపత్త్రమున పద్మరాగకిరణపుంజముల రంజిల్లు పాదపద్మములు గల యొక బాలునిఁ గాంచి మ్రొక్కి యతని శరీరముఁ బ్రవేశించి కొంతకాలమున కాతని జఠరాంతరమునఁ దిరిగి యతని చరణారవిందస్మరణమున వెలువడి యా బాలునిఁ గౌగిలించుకొనఁబోయెను. అంత మాయఁ గైకొని యా బాలుఁ డదృశ్యుఁ డయ్యెను. పుడమి జల

మంతయు నింకిపోఁగా బూర్వరూపము ధరించెను. మార్కండేయుఁ డెంతయు నచ్చెరువడి స్వాశ్రమముఁ జేరి శివధ్యానతత్పరుఁడై యేకాగ్రతతో మహోగ్రతప మొనరింపఁ జొచ్చెను.

ఇట్లుండ నొకనాఁడు పార్వతీపరమేశ్వరు లిరువురు విలాసార్థ మాకాశమున సంచరించుచు మార్కండేయునిఁ గని యాతని యచంచలదీక్ష కచ్చెరువంది నిజభక్తుఁ డగుట నాతనిఁ గటాక్షింపఁ గుతూహలపడి యిరువురు దివినుండి భువి కరుదెంచిరి. శంకరుఁడు తన దివ్యమాయాప్రభావమున నాతని హృదయమునఁ బ్రవేశించి చతుర్బాహుఁడు విభూతిరుద్రాక్షమాలికాభరణుఁడు త్రిశూలడమరుకాది దివ్యసాధన సహితుఁడు వృషభవాహనారూఢుఁడు పార్వతీసమేతుఁడునై నిజస్వరూపమును మార్కండేయునకుఁ జూపెను. భక్తిభరిత హృదయుఁడై యాతఁడు కరములు శిరమున జోడించి "మహేశా! నీ కటాక్ష మవ్యయము కదా! దేవాదిదేవా! నా పుణ్య మగణ్యము. సఫలీకృత జన్ముఁడ నైతిని. తండ్రీ! నీ భక్తవత్సలత నెవ్వరెంచఁ గలరు? శివా! నీకు జోహారులు. ఇందుధరా! నీకు వేఁడికోళ్ళు" అని పలుతెఱఁగుల నాతనికి దండప్రణామము లర్పింప నాతని తపః ప్రభావమునకు భక్త్యతిశయమునకు సంతసించి శంకరుఁడు భక్తవశంకరుఁడై "మహాత్మా! నీవు పరమశైవుఁడవు. నీకు వలసిన దిచ్చెదను. కోరుకొ"మ్మని దయార్ద్రహృదయుఁడై పలికెను. మార్కండేయుఁడు భయభక్తిసంభ్రమముల "దేవా! హరిమాయాప్రభావ మతి దుర్లభము. కాన, నారాయణచరణాంబుజధ్యానమును మృత్యుంజయమును గృపచేయు" మని వేఁడుకొనెను. మహేశ్వరుఁ డా వరము లనుగ్రహించి యాశీర్వదించి యుమాసహితుఁడై తిరోహితుఁ డయ్యెను. *

---

* భాగవతము ద్వాదశస్కంధము.

## మార్కండేయుఁడు ప్రళయముఁ గడచిన వృత్తాంతము :

మార్కండేయుఁడు విష్ణుస్మరణపూర్వకముగ విష్ణుహృదయాభ్యంతరలబ్ధసన్నివేశుఁడై భువనప్రపంచమునందుఁ దీర్ఘ యాత్రాప్రసంగమునఁ బృథివీతల మెల్లఁ దిరుగుచుఁ గ్రమమునఁ జనుదెంచి విష్ణువదనమార్గమున వెలువడెను. అప్పుడు ప్రళయసంభృతమగు విశ్వమున మహాతిమిరసంవృతమై మహాప్రళయసలిలము నిండియుండెను. అది గాంచి మార్కండేయుఁడు భయపడి స్వప్నజాగ్రత్సుషుప్తులలో నది యే యవస్థయో గ్రహింపనేరక ప్రపంచమంతయు నితర పదార్థములు గానక జలమయ మగుట కేమి కారణమని తలపోయుచుండెను.

ఇట్లుండ నాతఁ డెదుట నుదకమధ్యమునఁ గాలాంజన పర్వతమును బోలి యతి ప్రమాణమగు దేహముతో మిక్కిలి తేజోవిలసనమున నుల్లసిల్లు నొక్క పురుషుఁ గాంచెను. మార్కండేయుఁ డాతని వృత్తాంత మరయ సమీపింపఁగనే యాతని నిశ్వాసమున నాతని హృదయమును బ్రవేశించి పూర్వపరిచితమగు ప్రపంచమునంతయుఁ గాంచి ఎప్పటి యట్లు తిరుగుచు మునులను యోగులను గాంచి భాపించి విష్ణుమాయవలన శతసహస్రవర్షము లందుండి యాదిదేవుని నోరి యూర్పున వెలువడి తొంటి యేకార్ణవమును గాంచెను. అందొక వటమహీరుహపర్ణపర్యంకమున నొక బాలుని గాంచెను. ఆ బాలుఁడు మార్కండేయునిఁ జూచి "పాపఁడా! మార్కండేయా! భయపడకుము. నా కడకు రమ్ము. నీకు మే లొనర్తు"నని పిలిచెను.

ఆ మాటలకు మార్కండేయుఁడు తన్నుఁ బాపఁ డనుటకు గనలి యా బాలుని శాపదగ్ధునిఁ జేయుదునని యూహించుచుండఁగా నా మాయాశిశువు "వత్సా! నీకు నేఁ దండ్రిని. నీకుఁ జిరాయువు నిచ్చిన దేవదేవుఁడను. శతసహస్రయుగములు నీవు నన్నారాధించుటచే నీ కీ యదృష్టము పట్టిన"దని పలుక మార్కండేయుఁడు ప్రబోధ

లక్ష్మీకటాక్షమున నిజ మెఱింగి యా బాలుని సనాతనుఁడు వాసుదేవుఁడుగా నెఱింగి వందనసహస్రము లొనరించెను.

వటపత్రశాయి యగు విష్ణు వాతనిఁ జేరఁ బిలిచి "వత్సా! నీవు నా భక్తవరిష్ఠుఁడ వగుట నీకు నా నిజప్రభావ మెఱిఁగించెదను. సావధానుఁడవై వినుము. నేను నారాయణుఁడను. ఆదిదేవుఁడను. బ్రహ్మనై సృజించి విష్ణుఁడనై పెంచి రుద్రుఁడనై లయింతును. నే వెలిఁగి విశ్వమును వెలిఁగింతును. విశ్వమును వేయి శిరముల ధరింతును. సమస్త విద్యలు, సమస్త ధర్మములు నేనే. క్రియ, క్రియాఫలము క్రియారహిత పురుషుఁడు, ప్రకృతి సాంఖ్యబోధ, సమస్తము నా సంజ్ఞలు. వే యేల? చూడఁబడునవి, వినఁబడునవి యన్నియు నేనే. నేను కాని దణువైన లేదు. జ్ఞేయమును నేను, వెలుపల విలయసంప్లవము గావించి లోన నబ్జభవాదుల నడఁచిన నా శక్తి చూచితివి కదా! నే నీ బాలరూపమున మహాయుగ సహస్రమైన కాల మిందు యోగనిద్రాపరవశుఁడనై యుందును. ఈ దారుణకల్పాంతము నీవు చూచి భయపడుదు వని నీయందు గటాక్షముంచి యాత్మగుప్తములగు సకల లోకములు నీకుఁ జూపితిని. నీవు సావాఁడవు. నీకు దుఃఖము లుండవు. తిరిగి సృష్టి జరుగువఱకు నీవు నిర్భయుఁడవై నా హృదయమున నుండు" మని యానతిచ్చి పూర్వమార్గమున మార్కండేయుని నాత్మస్థునిఁ గావించిన నాతఁడు నచ్యుతప్రసాదలబ్ధమగు నుపలబ్ధివిశేషమున నశేషమును గని యుల్లసిల్లెను. పిమ్మట బ్రహ్మ విశ్వమును సృష్టించిన పిదప మార్కండేయుఁడు బయలు వెడలి యథేచ్ఛమునఁ దప మొనరించుచుఁ దిరుగుచుండెను.*

## మార్కండేయుఁడు యుధిష్ఠిరు నను గ్రహించుట:

పాండవు లరణ్యవాసము చేయుచున్న సమయమున నొకప్పుడు శ్రీకృష్ణుఁడు సత్యాసహితుఁడై వారికడ కరుదెంచి సాంత్వ

* భారతము, వనపర్వము.

వచనముల వారి నాశ్వాసించెను. ఇంతలో ధర్మతత్పరుఁడగు యుధిష్ఠిరునకు మనస్తాపోపశమన మొనరించి యనుగ్రహింపఁ దలఁపు గలిగి మార్కండేయమహర్షి యటకు రాఁగా ధర్మరాజాదు లెదుర్కొని సరసనసంభావన మొనర్చిరి. శ్రీకృష్ణుఁడు మార్కండేయుని జూచి ధర్మజుని సందేహములు వాపు మని కోరి వెడలిపోయెను.

యుధిష్ఠిరుఁడు మార్కండేయు నెంతయుఁ బూజించి మనుష్యుల కర్మగతిప్రకారముఁ దెలుపఁ బ్రార్థించెను. అంత మార్కండేయుఁడు దయార్ద్రహృదయుఁడై యిట్లు తెలిపెను. "యుధిష్ఠిరా! ప్రథమ కల్పమున విధాత పరమపవిత్రములు ధర్మతంత్రములు నగు శరీరములఁ బుట్టించెను. ఆశరీరులు మహాసత్త్వసంపన్నులు, సత్యవాదులు, సత్యసంకల్పులు, బ్రహ్మభూతాత్ములు, స్వచ్ఛందజీవులు, సర్వజ్ఞులు, విగత మత్సరులు, బహు సహస్రసంతానులు, బహు సంవత్సరాయుష్కులునై వర్తిల్లిరి. కాలక్రమమున మనుజులు కామ క్రోధాది గుణములఁ జెంది మాయాప్రవర్తనులై యల్పాయువులు, దరిద్రులు, నల్పబలశరీరసత్త్వులు, నిష్ఫలారంభులు, బహురోగపీడితులు, నాస్తికులు, మచ్చరులు నై దురితము లొనరించుచుఁ దిర్యగ్యోనులఁ బుట్టుచు నరకాగ్నులఁ గాగుచు గతాగతభ్రమణముల నలయఁదొడఁగిరి. ఇట్లు తిరుగుచున్న సంసారచక్రమున నొనర్చు పుణ్యపాపములు వారు చనిపోవునప్పుడు నీడవలె ననుసరించి మానవులకు సుఖదుఃఖముల నొసఁగు జన్మములకుఁ గారణము లగును. ధనాధికులై శిశ్నోదర పరాయణులు లోభమోహచేతస్కులు నాస్తికులు నగు వారికి లోకమే సుఖప్రదము. ఉపవాసవ్రతతీర్థసంతతాధ్యయనులు దేహకార్శ్యమున నైహికము దుఃఖప్రాయము గాఁగాఁ బరమున విపులానందము లందుదురు. ధర్మము పలుకుచు ధర్మమార్గముననే నడచుచు సద్గృహస్థులై సుపుత్త్రులఁ గాంచి సత్కర్మము లొనరించి క్రతువు లొనర్చిన వారలైహికాముష్మికసుఖముల నందుదురు. సత్య శమ శౌచాదుల

లేక నాస్తిక్యము నిషిద్ధసేవనము గలిగి తిరుగు దుష్టకష్టులగు జనులిహపరముల దుఃఖమయు లగుదురు. ఇది మనుష్యుల కర్మగతి ప్రకారము."

ఈ మాటలు విని ధర్మజుఁ డెంతయు నలరి బ్రాహ్మణ ప్రభావమును దెలుపుమని వానిఁ గోరెను. అంత మార్కండేయుఁ డాతనికి ధుంధుమారుఁ డను రాజకుమారుఁడు మృగయాలసుఁడై తార్క్ష్యముని పుత్రునిఁ బొరపాటునఁ జంపుటయు నందులకు శమింపు మని యాతఁడు తార్క్ష్యుని శరణుచొచ్చుటయు తార్క్ష్యుఁడు నభయమిచ్చి తన యాశ్రమము పరమ పవిత్రమగుట నందలి వారికి వ్యాధినిరోధ మృత్యుదుఃఖములు లేవని తన కుమారునిఁ బిలిచి చూపి రాజకుమారునిఁ బంపివేసిన సంగతిఁ దెలిపెను. తరువాత, నత్రి గౌతముల సంవాదమును ధర్మజునకుఁ జెప్పెను.

పిమ్మట, యుధిష్ఠిరునకు మార్కండేయుఁడు సరస్వతీగీత యను తార్క్ష్యచరిత్రము, వైవస్వత మనుచరిత్రము, ప్రళయ ప్రకారము కలియుగ ధర్మములు, వామదేవుని చరిత్రము, ఇంద్రద్యుమ్న చరిత్రము, కువలయాశ్వచరిత్రము, మధుకైటభుల కథ మున్నగు విషయములఁ దెలిపెను. పుత్రున కుండవలసిన లక్షణములు తలిదండ్రులయెడ భక్తి, ధర్మార్థాసక్తి యనునవి ధర్మజునకుఁ దెలిపి పతివ్రతామాహాత్మ్యమును దెలుపుటకుఁ గౌశికుఁడను బ్రాహ్మణుఁడు కోపియై కొంగను జంపి భిక్షమునకు రాఁగా నొక పతివ్రత యది గ్రహించి యాతని నిందించి ధర్మవ్యాధుని కడకుఁ బంపుటయు ధర్మవ్యాధుఁ డాతనికి జీవహింసా నిరసనము తలిదండ్రుల సేవ బోధించి పంపిన వృత్తాంతమును జెప్పెను. ధర్మజుఁ డంత నంగిరసుఁ డగ్నియైన తెఱఁగు మహాసేనుఁ డనలునకుఁ గృత్తికలకు హరునకు సుతుఁడైన నిమిత్తము మున్నగు విషయము లెన్నియో మార్కండేయుని వలన నెఱింగెను. ఈ విధముగా మార్కండేయమహర్షి ధర్మతత్పరుఁ

డగు ధర్మజున కనేక ధర్మవిషయములు తెల్పి కటాక్షించి నిజాశ్రమ మునకుఁ బోయెను.*

## మార్కండేయమహర్షి గౌరముఖునకుఁ బితృదేవతలను గుఱించి తెలుపుట :

గౌరముఖుఁ డను మహీపాలుఁడు తొల్లి శ్రీకృష్ణు నారాధించు చుండ మార్కండేయమహర్షి చనుదెంచెను. గౌరముఖుఁ డాతని నెంతయుఁ బూజించి "మహాత్మా! తమ దర్శనము మాబోంట్లకు సందేహ నివారణమునకే లభించుచుండును. నా కిపు డొక సందేహ ముదయించినది. పితృదేవతలు గలరని బుధులు చెప్పుదురు కదా! వారు సర్వవర్ణసాధారణులో లేక వేఱువేఱుగా నుందురో తెల్పుఁ"డని ప్రార్థించెను. అంత మార్కండేయుఁడు "గౌరముఖా! నీ ప్రశ్నము నకు సమాధానము సావధానుఁడవై వినుము, తొల్లి విశ్వపిత యగు విష్ణునకు జనించిన బ్రహ్మ యేడ్వురు ఋషుల సృజించి తన్నుఁ బూజింపుఁ డని వారి కాదేశించెను. మరీచ్యాదు లగు వా రా మాట లాలింపక యాత్మలోఁ బరమేశుఁ గొలువఁ జొచ్చిరి. బ్రహ్మ యీ విషయ మెఱిఁగి వారి బ్రహ్మవిజ్ఞానగర్వము బూడిద పాలగుఁ గాక యని శపించెను. వార లందఱును వివాహితులై పుత్రులఁ గని విహీనస్థులై నాకమున కేగి తమ సుతులు సమంత్రకశ్రాద్ధములు పెట్టుచుండఁగా సుఖులై యుండిరి. వీరు దేవతలకుఁ బితరులు, వీరిలో నమూర్తులు ముప్వురు; సమూర్తులు నల్వురు. వీరు దేవతలచేఁ బూజిం పఁబడుచు యుగశతపర్యంతము సనాతనలోకమున వసించి వెనుక బ్రహ్మవాదులై జన్మించి తమ పూర్వసాంఖ్యమతముఁ గొంతకాలము వర్తించి పునరావృత్తిరహిత యోగసిద్ధిఁ గాంచి యోగబలమున సకల యోగులకు యోగాభివృద్ధిఁ గావింతురు. కాన, వారి కెల్లరు శ్రాద్ధము

* భారతము. వనపర్వము.

లోనర్పవలెను. ఇది ప్రథమ పితృసర్గము. మఱియు ననేకవిధములఁ బితరులు సప్తలోకముల నిలిచి భూలోకవాసులగు వారు భువర్లోకవాసులను, భువర్లోకవాసులు సువర్లోకవాసులను, సువర్లోకవాసులగు మరీచ్యాదులు కల్పోపివాసు సంజ్ఞులైన మహాలోకవాసులను, మహాలోకవాసులు సనకాదులైన జనలోకవాసులను, జనలోకవాసులు వైరాజులైన తపోలోకవాసులను, వారు సత్యలోకవాసులను బూజింతురు.

బ్రహ్మక్షత్ర వైశ్యులకు సమత్వమునఁ బూజింప సర్హులైన వారు వసుసాధ్యరుద్రాదిత్యాశ్విమరుద్వృషులు, నేతత్కన్యకానము ద్భవులు వసిష్ఠబ్రహ్మపితరులునైన యగ్నిష్వాత్తాదులును, శూద్రులకు వేఱ పితరులు లేని కారణమునఁ బైవారినే వారు బ్రహ్మక్షత్ర వైశ్యానుమతమునఁ బూజింతు" రని చెప్పి శ్రాద్ధకర్మలకుఁ గాలము, యోగ్యాయోగ్యులను దెలిపి యట్లొనర్చిన పురుషోత్తమచింతకుఁడు తప్పక యైహికాముష్మికములఁ బడయు నని చెప్పి వెడలిపోయెను.*

## మార్కండేయుఁడు జైమినికి ధర్మపక్షులగుఱించి తెలుపుట

ఒకనాఁడు వ్యాసశిష్యుఁడు విద్యానిపుణుఁడు నగు జైమిని నానామహీరుహవిరాజితమును, వివిధపక్షిగణ కలకలస్వనమనోహరమును, నిరంతర హోమధూమశ్యామలితవ్యోమ మండలమును, సంతతాధ్యయన సంపన్నమును, శాస్త్రపురాణేతిహాసకథాకథన చతురతాపసోత్తమపరిషదభిరామమునై యొప్పు పరమపావన నిరుపమనిష్ఠామరపూజ్యమగు మార్కండేయాశ్రమమును జేరి యాతనికి వినయ వినమితాంజలియై కొన్ని భారతసంబంధ సంశయములకుఁ బ్రత్యుత్తరమిమ్మని కోరెను. మార్కండేయుఁ డది నియమవిధులకు సమయమగుచుండు కాలము గానఁ దాను వివరింపఁ జాలఁడనియు పల

* వరాహపురాణము.

యుచో వింధ్యనగరమునఁ గల ధర్మపక్షుల కడకుఁ బోయి యడిగి నచో నవి సుసంగతములగు సమాధానములు చెప్పఁగల వనియు వచించెను.

జైమిని ధర్మపక్షుల వృత్తాంతముఁ దెలుపుమని కోరఁగా మార్కండేయుఁడు వపు వను నచ్చర దుర్వాసోముని శాపమునఁ బక్షియై పుట్టుటయుఁ దార్క్షి యను నామమున నా పక్షి పెరుగుచు మందపాలుఁ డను మునివలన గర్భిణియై భారతయుద్ధకాలమున నెగురుచు భగదత్తుని గజముపై నేసిన ఫల్గునుని యస్త్రము తగిలి గర్భచ్యుతయై శాపవిమోచనము నందుటయు దాని బిడ్డలను శమీకమహర్షి పెంచుటయు నవి పెరిగి పూర్వజన్మ పుణ్యమున సకల వేద శాస్త్రము లెఱుఁగుటయు నాగతానాగతముల గ్రహింపఁ గల్గుటయుఁ జెప్పి జైమిని నటకుఁ బంపివేసెను. జైమిని వింధ్యవాటి కేగి ధర్మపక్షులఁ గని వానివలనఁ దనకుఁ గల సమస్తసంశయముల నెఱిఁగెను. ఈ విషయములను, మార్కండేయుఁడు క్రోష్టుకి యను మునివరునకుఁ జెప్పిన విషయములెల్ల నా ధర్మపక్షులు జైమినికిఁ జెప్పినవి. ఇదియే మార్కండేయ పురాణము. అష్టాదశ పురాణములలో నిది యొక్కటిగాఁ బేరెన్నిక గన్నది.

## మార్కండేయుఁడు క్రోష్టుకికిఁ జెప్పిన విషయము :

ఒకప్పుడు క్రోష్టుకి యను ముని పరమ భక్తిసంయుతుఁడై మార్కండేయుని కడ కరుదెంచి యాతని కటాక్షముఁ బడసి తనకు విశ్వవిషయముల బోధింపుమని ప్రార్థించెను. శిష్యవత్సలుఁ డగు మార్కండేయమహర్షి యాతనికి మహదాది భూతసర్గము, బ్రహ్మజన్మము, ఏకాదశరుద్రసర్గము, స్వాయంభువ మనుసంభవము, దక్ష సర్గము, రుద్రసర్గము వివిధ ద్వీపవర్ణనములు, స్వారోచిష మన్వంతరము, ఉత్తమ మన్వంతరము, తామస, రైవత, చాక్షుష, వైవస్వత, సావర్ణి రౌచ్య మన్వంతర విషయములు, సూర్యప్రభవములగు రాజ

వంశములు, తత్తద్వంశాను చరితమును, లౌకిక వైదిక పారమార్థికము లైన యర్థజాతము లనేకము లాదరమున వివరించెను. క్రోష్టుకి పరమ కృతజ్ఞుఁడై మార్కండేయుని బహువిధముల స్తుతించి నమస్కరించి నిజాశ్రమమున కేగి తపోనియతిఁ దరించెను.*

ఇట్లు మార్కండేయమహర్షి హరిహర కటాక్షమున మృత్యు విజయమును, మహాశక్తిసంపన్నతను సంపాదించి నేఁటికిని నెచ్చటనో దివ్యతేజస్వియై పరమేశ్వర దివ్యతపోనియుక్తుఁడై వెలుఁగుచునే యున్నాఁడు. ఆ మహర్షివరుని మనసార స్మరించి భక్తియుక్తి నారాధించువారి కాతఁడు గానన్నై భుక్తిముక్తులు కరతలామలక మొనరించి చనుచుండును. మార్కండేయమహర్షిని స్మరించువారు పరమమిత్రులు కదా!

కల్పాంతవార్ధి మోకాఁటిబంటిగ నే య
    తీశ్వరుఁ డొంటిమైఁ దిరిగినాఁడు
వటపత్రనిధిని నెక్కటి నున్న బాలు నే
    తాపసాధిపుఁడు ముద్దాడినాఁడు
తనపేర నే తపోధనమౌళి సుస్థిర
    స్థితిఁ బురాణంబు సంధించినాఁడు
హరుని మెప్పించి సంహారకాలుని జయో
    న్మాద మే మునిరాజు మాన్పినాఁడు

కనియె నే సంయమీంద్రు విజ్ఞుని మహాత్ముఁ
దనయుఁడుగ నమ్మృకండుని ధర్మపత్ని
సహజ శివభక్తిరతుఁడు విశ్వప్రసిద్ధుఁ
డనఘకీర్తి మార్కండేయుఁ డతనిఁ గొల్తు.

వీరమాహేశ్వరము

---

* మార్కండేయ పురాణము.

# మహర్షుల చరిత్రలు

## యాజ్ఞవల్క్యమహర్షి

### యాజ్ఞవల్క్యుని పుట్టుక :

పూర్వము కురుపాంచాల దేశములందుఁ బ్రవహించెడి గంగా నదీతీరమునఁ జమత్కారపుర మను నొక నగర ముండెను. అందు సకల సద్గుణసంపన్నుఁ డగు నొక బ్రాహ్మణశ్రేష్ఠుఁ డుండెను. అతఁడు యజ్ఞము వేదములను సలక్షణముగా వచించువాఁ డగుట యజ్ఞవల్కుఁ డనియు, నిరంతరాన్నప్రదాత యగుటచే వాజసని యనియు బ్రహ్మము వేదమును శిష్యులకు బోధించుటే వృత్తిగాఁ గలవాఁ డగుట బ్రహ్మరాతుఁ డనియు, దేవ వరప్రసాదమునఁ బుత్రుని గాంచుటచే దేవరాతుఁ డనియు సార్థకనామధేయముల నొప్పారుచుండెను. ఈతఁడు సునంద యను సుకన్యను వివాహమాడి సత్పుత్రజననము నకై దేవదేవుని గురించి తప మొనర్చి ప్రత్యక్షము చేసికొని బ్రహ్మ విద్యావ్యాపనమునకై యాతఁడే తనకుఁ బుత్రుఁడుగా జన్మింప వరము సంపాదించెను.

కాలక్రమమున సునంద గర్భవతియై కార్తిక శుద్ధద్వాదశీ భానువారమున ధనుర్లగ్నమున నొక సుకుమారునిఁ గాంచెను. అతని రూపరేఖల గన్నవారెల్ల రాతఁడు భగవానుఁడే యని చెప్పుకొను చుండిరి. యజ్ఞవల్కుఁ డతి ముదమునఁ బుత్రునకు జాతకర్మ మొన రించెను. తండ్రికిఁ గల పేళ్ళ ననుసరించి యాతనికి యాజ్ఞవల్క్యుఁడు వాజసని, బ్రాహ్మరాతుఁడు, దైవరాతుఁడు నను నామములు వచ్చెను.

**యాజ్ఞవల్క్యుని బాల్యదశ :**

పిమ్మట యాజ్ఞవల్క్యునకుఁ దండ్రి యైదవయేఁట నక్షరాభ్యాసము నెనిమిదవయేఁట నుపనయనము నొనర్చెను. అతఁడు తల్లిదండ్రుల యనుమతి వడసి విద్యాభ్యాసమునకై బయలుదేఱి వెడలి బాష్కలునియొద్ద కేగి యాతని కడ ఋగ్వేదమును, జైమిని యొద్ద కేగి సామవేదమును, ఆరుణి యను నామాంతరము గల యుద్దాలకునియొద్ద నథర్వణవేదమును నేర్చెను. యజ్ఞవల్క్యుఁ డమితానందము నంది సాక్షాద్భగవంతుఁడే యట్లు జన్మించిన కారణమున నాతఁ డావేదత్రయ మనతికాలమున నేర్చు టెంతవింతయని సుతునిఁ దీసికొనిపోయి వైశంపాయనున కొప్పగించెను.

**యాజ్ఞవల్క్యుని గురుభక్తి :**

వైశంపాయనమహర్షి కృష్ణద్వైపాయనునిచే నియోగింపఁబడి యజుర్వేదమును బఠించి శిష్యులకుఁ జెప్పుచుండెను. ఆ సమయమున యాజ్ఞవల్క్యుని ముఖలక్షణములఁ బరికించి తన కాతఁ డుత్తమోత్తముఁడగు శిష్యుఁడుగాఁ గలఁడని యూహించి యాతని శిష్యత్వ మంగీకరించెను. బ్రహ్మరాతుఁడు బ్రహ్మానందపరవశుఁడై సుతుని బిల్చి "నాయనా! మన సుకృత వశమున నిట్టి మహర్షి తల్లజునకు శిష్యు నొనర్పఁ గలిగితిని. ఇకనుండి నీకుఁ దల్లియు దండ్రియు దైవము నీతఁడే. గురుఁడు వేఱుదైవము వేఱని యెంచు నజ్ఞుని మించు నజ్ఞుఁడు త్రిలోకముల వెదకినను గానరాఁడు. నీ సర్వము నీతఁడే యని యెంచి దురహంకార దుర్మదములఁ దెగనాడి యీతని శుశ్రూష నేమఱక యొనరించి సద్విద్యానవద్యుఁడవు కమ్మని యాశీర్వదించి వైశంపాయను నామంత్రణమున వెడలిపోయెను.

యాజ్ఞవల్క్యుఁ డా క్షణమునుండియు గురుసేవా నిమగ్నుఁడై వైశంపాయనుని కడ యజుర్వేదము సహాధ్యాయముని పుత్త్రులతో

నభ్యసించుచుండెను. గురునకు ముందుగనే మేల్కాంచి నిత్యకృత్యము లొనర్చుకొని యందఱకంటె ముందుగా గురునాజ్ఞ కెదురుచూచుచు గురువిహితములగు సమస్త కృత్యములు తానే యొనర్చుచుండెను. అనతికాలముననే నిజశుశ్రూషా మాహాత్మ్యమున యాజ్ఞవల్క్యుఁడు గురుహృదయముఁ జూఱకొని పరమార్థరహస్యములెల్ల నేర్చి శిష్య మండలిలో బుద్ధిశుద్ధి సంసిద్ధతల నెల్లరను మించి యనంత విద్యావిభవము నందఁ జొచ్చెను.

## యాజ్ఞవల్క్యుని విద్యామదము :

ఇట్లు యాజ్ఞవల్క్యుఁడు వైశంపాయనునివలన యజుర్వేద మంతయు నేర్చి యితరములగు ననేకవిద్యారహస్యముల నభ్యసించెను. మఱియు నాతనికి గురుశుశ్రూషా భాగ్యమున బ్రహ్మతేజోదీప్తియుఁ బుణ్యాతిశయమును గలిగెను. సత్త్వసంపన్నుఁడయ్యు యాజ్ఞవల్క్యుఁడు విధివశమునఁ గొంతకాలమునకు సాత్త్వికాహంకారము విద్యామదము నంకురింప వానిని గ్రహింపనేరఁ డయ్యెను. తీవ్రజ్వర పీడితుఁడగు రోగి జ్వరము వైద్యునకే గాని రోగికిఁ దెలియనట్లు యాజ్ఞవల్క్యుని గర్వప్రవృత్తి గురునకే కాని యాతనికి గోచరింప దయ్యెను. కాని, యది క్రమముగ నశించునని యెంచి వైశంపాయనుఁ డూరకుండెను.

ఒకనాఁడు వైశంపాయనుని శిష్యు లందఱొక యెడఁ గూర్చుండి యిష్టగోష్ఠి నుండగాఁ బ్రసంగవశమున యాజ్ఞవల్క్యుఁడు నిజపుణ్యాతిశయమునఁ దన గురువునకు బ్రహ్మహత్యాదోషము కలిగిన నేడు దినములలో దానిని బఱాపంచలు చేయఁగల నని పలుకఁ గొంద ఱసూయాగ్రస్తు లా విషయము గురువునకు నివేదించిరి. పరమ భక్తుఁడు పరమవిధేయుఁడు నగు యాజ్ఞవల్క్యు నేమియు ననఁజాలక వైశంపాయనుఁ డుపేక్షించెను. కాని యాజ్ఞవల్క్యునకు మాత్రము విద్యామదము నశింప దయ్యెను.

### వైశంపాయనుఁడు యాజ్ఞవల్క్యుని శిక్షించుట :

వైశంపాయనుఁ డొక దినమునఁ దన యాజ్ఞలో మెలఁగక యవిసీతుఁడై సంచరించు తన మేనల్లునిఁ గోపముతో నొక తన్ను దన్నెను. కాని, పిమ్మటఁ బశ్చాత్తప్తుఁడై బ్రాహ్మణుని దన్నిన పాపము బ్రహ్మహత్యాఘముతో సమాన మని నిశ్చయించి శిష్యవరుల నెల్లరఁ బిలచి "వత్సలారా! తాత్కాలిక కోపోద్రిక్తుడనై బ్రాహ్మణునిఁ దన్ని బ్రహ్మహత్యా సమమగు పాపము నొందితిని. మీరందఱు వెఱవూహించి దోషపరిహారమునకు వ్రతాదుల నొనరింపుఁ"డని కోరెను. వెంటనే యాజ్ఞవల్క్యుఁడు గురుదోషహరణావకాశము లభించినదని బ్రహ్మానందభరితుఁడై "గురుదేవా! దీని కిందఱతో నాలోచింపవలెనా? వీర లే మెఱుఁగుదురు? నే నొక్కఁడఁ దక్క నొరులగు విప్రు లీ దోషమును బాపలే" రని ప్రల్లదము లనాలోచితముగఁ బలికెను.

అంత వైశంపాయనుఁడు కోపముతో మండిపడి "ఓరీ! యహంకారీ! నాకు లేనిశక్తి నీకుఁ గలదని భ్రమింతువా? తోడి బ్రాహ్మణు లేమియు నెఱుఁగ రని నిందించితివి. నీ కీ శక్తియు గర్వమును దేనివలన లభించినవో యా వేదము నావలన నేర్చితివి. దానినిటఁ గ్రక్కి శీఘ్రమే లేచిపొమ్ము. నీవు గురుద్రోహివి. విప్రనిందకుఁడవు. నీ మోము నేను జూడ" నని కఠినముగఁ బల్కెను.*

అంత యాజ్ఞవల్క్యుఁ డాతని పాదములపైఁబడి "మహాత్మా! తమ యెడఁగల గాఢానురాగమున నట్లు పల్కితినే కాని నేను దుష్టుఁ

* సుప్రియుఁ డను రాజునకు వైశంపాయనుండు పురోహితుం డనియు నా రాజునకుఁ గుష్ఠరోగము రాఁగాఁ ద న్నివారణమున కొకనాఁ డతనిచెంతకు వైశంపాయనుఁడు యాజ్ఞవల్క్యునిఁ బంప నా రాజు నాదరించె ననియుఁ గాని మఱునాఁ డాతని శక్తి నెఱిఁగి తిరిగి యాతనినే పంపుమని గురువును గోరెననియు యాజ్ఞవల్క్యుఁ డంగీకరింపమి వైశంపాయనుఁడు తా నేర్పినవిద్య గ్రక్కు మనె నని కావ్యమునఁ గలదు.

డఁగాను. గర్వినై బ్రాహ్మణావమాన మొనరింపఁలేదు. వాత్సల్యదృష్టిఁ గరుణింపవే" యని పరి పరి విధముల బతిమాలెను. కాని వైశంపాయనుఁడు కోపారుణితనేత్రుఁడై యాడిన మాటయే యాడును గాని కరుణింపఁ డాయెను. మఱి యాజ్ఞవల్క్యుఁడు "గురుదేవా! నాకు హితమైన నహితమైనఁ దమ యాజ్ఞ శిరసా వహింతును. నే నిదే రక్తరూపమునఁ దాము నేర్పిన యజుర్వేదముఁ గ్రక్కి వేయుదును. ఐనను, నే నన్నాళ్లుడు దినములలోఁ దమకు వచ్చిన బ్రహ్మహత్యా దోషముఁ బాపి తమ ఋణముఁ దీర్చుకొందు"నని తన నేర్చిన వేదములు రుధిరరూపమునఁ గ్రక్కి వెడలిపోయి నిజతపోబలమున వైశంపాయనునికి సంక్రమించిన పాపముఁ బాపఁ గలిగెను. అతఁడు క్రక్కిన యజుర్వేదము నెత్తురు మాంసములై పడియుండఁగాఁ దిత్తిరిపక్షులు వచ్చి తిని పలికి తిత్తురు లను వేదశాఖలఁ బ్రవర్తింప జేసెను. అవియే తైత్తిరీయోపనిషత్తు లయ్యెను.

## యాజ్ఞవల్క్యుఁడు సూర్యునారాధించి శుక్లయజుర్వేదాదులు నేర్చుట :

యాజ్ఞవల్క్యుఁడు గురుభక్తిమూలమున దోషరహిత చిత్తుఁడై యేకాంతమునఁ బ్రాణాయామసహితుఁడై తప స్సమాధివలన సూర్య దేవు నారాధింపఁ దొడఁగెను. అతని వ్రతనిష్ఠకును దపోనవద్యతకును సకల వేదమయుండగు భాస్కరుఁడు కరుణించి వాజిరూపమునఁ గానవై "వత్సా! నీ భక్తికి సంతసించితిని. ఏమేని వరము గోరుకొను" మని పలికెను. యాజ్ఞవల్క్యుఁడాతని పాదములపైఁ బడిలేచి ముకుళితహస్తుఁడై యాతని ననేకవిధముల వినుతించి తనకు నిజగురువు వలనఁ గలిగిన దుఃస్థితిని దెలిపెను. సూర్యుఁ డంత "మునీంద్రా! మీ గురుఁ డెఱుఁగని శుక్లయజుర్వేదము నీకు నేను బోధింతును. నీవు నీ గురునికంటె నధికుఁడవు కాఁగల"వని యాజ్ఞవల్క్యునకు శుక్ల

యజుర్వేదము నొసఁగి యితరములగు సమస్త విద్యలకు సరస్వతి నారాధింప నామె యొసఁగఁ గలదని చెప్పి యదృశ్యుఁ డయ్యెను.

సూర్యుని కృపాకటాక్షవీక్షణపరుఁడై యాజ్ఞవల్క్యుఁడు శుక్ల యజుర్వేదము నపూర్వవేదము నభ్యసించి సరస్వతీదేవిని గుఱించి తప మొనరించెను. కొంతకాలమున కామె యాతనికిఁ బ్రత్యక్షమై కటాక్షింప సకల విద్యలు నాతని హృదయ ఫలకమున గోచరించెను. యాజ్ఞవల్క్యుఁ డా యమ నెంతయుఁ గీర్తింపఁ నామె కరుణించి దీవించి వెడలెను.

ఈ రీతి యాజ్ఞవల్క్యుఁ డమానుష విద్యానిధియై వెలుఁ గొందెను. అతండు క్రొత్తగ నేర్చిన యీ శుక్లయజుర్వేదము పదునేను తెఱఁగులై వాజిశాఖ లనఁ బ్రసిద్ధములై యాజ్ఞవల్క్యుని శిష్యప్రశిష్యుల కతమున విశ్వవ్యాప్త మయ్యెను. ఈతని ప్రథమశిష్యుఁడు కణ్వుఁ డను నాతఁడు. ఈతని శాఖకుఁ జెందినవారే ప్రథమశాఖీయు లనియుఁ గాణ్వశాఖీయు లనియు నొప్పుచున్నారు.*

## యాజ్ఞవల్క్యుఁడు శాకల్యముని నోడించుట:

యాగము చేయుచున్న జనకచక్రవర్తిచే నాహూతుఁడై యాజ్ఞవల్క్యమహర్షి యొకపరి జనకు నాస్థానమున కేతెంచెను. అచట పలువురు మును లాసీనులై యుండిరి. జనకుఁడు యాజ్ఞవల్క్యు నుచితస్థలమునఁ గూర్చుండఁ జేసి ఋషుల నెల్లరఁ జూచి "మహానుభావులారా! నా యాగము పూర్తి కావచ్చినది. ఇటఁ గల బ్రాహ్మణ్యులలో శ్రేష్ఠుని కనేకధనరాసు లివె యిచ్చుచున్నాను మీలో నుత్తము నెఱుఁగ నాకు శక్తి లేదు. కాన నిందుల కర్హులగువా రీ ధన రాసులఁ గైకొనవచ్చు" నని పలికెను. అంత సభలో నెవరికి వారే

* విష్ణుపురాణము. శతపథబ్రాహ్మణము.

తాము ఘనులని యనఁ జొచ్చిరే కాని సంశయభీతచిత్తులై యా ధనరాసులకడ కెవ్వరును రాలేకుండిరి. అంత యాజ్ఞవల్క్యుఁడు శిష్యులఁ బిలిచి యా ధనరాసులు వారి కెత్తి గృహమునకుఁ గైకొని పొండని పల్కెను. అంతఁ బలువురు విప్రు లాతనితో వాదమునకు దిగి యోడి పోయిరి. తరువాత శాకల్యముని వచ్చి" ఓయీ! ఏమి నీ సాహసము? నీకంటె ఘను లింకెవ్వరును లేరా? శక్తిగలదేని నాతో వాదింపు" మని యాతనిని డీకొనెను. యాజ్ఞవల్క్యుఁ "డోయీ! ఏల వృథా వాదము! నక్క ఎక్కడ నాక మెక్కడ? నీవా నాతో వాదించునది? పొ"మ్మన వినక యాతఁ డోడిపోయినవారు తమంతఁ దామే మర ణింప నియమ మేర్పరచి యాజ్ఞవల్క్యునిపై వేయిప్రశ్నపరంపరలఁ గురియించెను. యాజ్ఞవల్క్యుఁ డన్నింటికిని జక్కఁగా యుక్తి యుక్తముగా సమాధానమిచ్చి తాను శాకల్యు నొకప్రశ్న మడిగెను. దానికి యాతఁడు సమాధానము చెప్పలేక నోరు తెలవైచి యోటమి నంగీకరించి నియమానుసారియై మరణించెను. అంత యాజ్ఞవల్క్యునకు విశ్వవిస్తృతమగు కీర్తియు ధనరాసులు లభించెను. నాఁటినుండి జనకుఁడు యాజ్ఞవల్క్యు నెంతయుఁ బూజించి యాతనివలన ననేకాధ్యాత్మిక విషయములు తెలిసికొనెను. యాజ్ఞవల్క్యుఁడు కరుణించి నిజ శక్తిచే శాకల్యుని బ్రదికించెను.*

## యాజ్ఞవల్క్యుఁడు జనకున కాధ్యాత్మిక విషయము లెఱిం గించుట :

జనకుఁడు యాజ్ఞవల్క్యుని వలన నింద్రియములు. అవ్యక్తము బ్రహ్మము, పరము, భూతసర్గప్రళయములు, తత్కాలసంఖ్యలు మున్నగునవి తేటపడ నెఱిఁగి యధ్యాత్మాధిభూతాధిదైవత ప్రకారములఁ దెలుపు మని కోరెను. యాజ్ఞవల్క్యుఁ డిట్లు చెప్పెను.

---

* బృహదారణ్యకము. III. II-2

"రాజా! పాదము, పాయువు, ఉపస్థ, పాణి, వాక్కు ననునవధ్యాత్మములు. వానికి వరుసగా గంతవ్యము, విసర్గము, ఆనందము, కర్తవ్యము, వక్తవ్యము లధిభూతములు; వానికిఁ గ్రమముగా విష్ణువు, సూర్యుఁడు, ప్రజాపతులు, ఇంద్రుఁడు, అగ్నియు నధిదైవతములు. మఱి చక్షువు, జిహ్వా, ఘ్రాణము, త్వక్కు, శ్రోత్రము నివి యధ్యాత్మములు. వీనికి రూపము, రసము, గంధము, స్పర్శ, శబ్దము లధిభూతములు. సూర్యుఁడు, జలము, భూమి, వాయువు, దిశలు క్రమముగా వాని కధిదైవతములు. మన స్సధ్యాత్మము. దాని కధిభూతము మంతవ్యము; చంద్రుఁ డధిదైవతము. బుద్ధి యధ్యాత్మ మన నొప్పును. దాని కధిభూతము బోద్ధవ్యము, క్షేత్రజ్ఞుఁ డధిదైవతము. అహంకార మధ్యాత్మము. దాని కభిమాన మధిభూతము, రుద్రుఁ డధి దైవతము. చిత్త మధ్యాత్మ మనఁ బరగును. దాని కధిభూతము చేతయితవ్యము (చేయఁబడినది). బ్రహ్మ మధిదైవతము.*

పిమ్మట మనోనిర్వికారమునకుఁ బ్రకృతిపురుషుల విధమెఱుఁగవలెను. ఒక్కదీపమున ననేకము లగు దీపములు వ్యాపించు విధమున ప్రకృతి బహుగుణ రూపములఁ బఱపును. గుణములు మూఁడింటిలో సత్త్వగుణములు: సంతోషము, ఆనందము, ఆరోగ్యము, అక్రోధము, ఆర్జవము, శుద్ధి, ప్రకాశత, సుస్థిరత్వము, అహింస, నిర్మలశ్రద, వినీతి లజ్జ, సత్యము, శౌచము, సమత, ఆచారము, అకార్పణ్యము, అపైశున్యము, అకామవృత్తి. ఇఁక రజోగుణములు విగ్రహము, దర్పము, అభిమానము, కామము, క్రోధను, మత్సరము, కరుణలేమి, భోగకాంక్ష, అహంకారము, ఉమ్మలిక. మఱి తమోగుణములు అప్రకాశము

---

* అధ్యాత్మము = ఆత్మస్థస్వరూపము.
అధిభూతము = భూతములం దెల్ల వర్తించుచుండునది–పరమాత్మ
అధిదైవతము = అధిష్ఠించియుండు దేవత, అభిమానదేవత.

మోహము, బహుతరాశనము, వాదము, ప్రమాదము, మౌర్ఖ్యము, మాంద్యము, మరణదుఃఖము. ప్రకృతి యీ గుణములచేఁ దన స్వభావ మౌట నంతరాత్మున కనేక వికృతు లొనగూర్చును. పురుషుఁడు చైతన్యుఁడు. ప్రకృతి జడము. కావున నాత్ముఁడు తన్నెఱుఁగుచో నవ్యక్తము దరి కేగక యజరశాశ్వతవిగతాంజనవిమలాచ్యుత పదము గని నిజప్రకాశస్థిరతచే నక్షరుఁ డగును.

పురుషుఁడు ప్రకృతియందుఁ ప్రకృతి పురుషునందునిల్చును. ఐనను, పురుషుఁడు జలమత్స్యములు, నుదుంబరమశకములు సంగమించినరీతి నుండి వికృతిఁ జెందఁడు. అంతరాత్మ ప్రకృతిని బొందినను జలములందుండి జలముచే నంటని కమలముభంగి వికారము నందకుండును. దీనినే సాంఖ్యానుభవ మందురు. సాంఖ్యము వేఱు యోగము వేఱని యందురు. కాని రెండు నొకటే. ప్రాణాయామమున్న జిత్తము, తనువు శుద్ధత వహింపఁగా నింద్రియములు మనమున, మన మహంకారమున, నహంకారము బుద్ధిలోన, బుద్ధి ప్రకృతిని గలుప ధ్యానతత్పరత సిద్ధించును. ధ్యానతత్పరుఁడగు నాత్ముఁడు నిత్యానంద సత్యశుద్ధజ్ఞానమయుఁ డగు శివునిఁ గానఁ బడయును." ఈ ప్రకారము యాజ్ఞవల్క్యుఁడు జనకున కనేక విషయము తెలింగించెను.

## విశ్వావసునకు యాజ్ఞవల్క్యుఁ డెఱింగించిన తత్త్వ ప్రకాశము :

ఒక పర్యాయము విశ్వావసుఁ డను గంధర్వేశ్వరుఁడు యాజ్ఞవల్క్యుని కడ కరుదెంచి యాతనిచే సత్కృతు లంది విశ్వావిశ్వములు మిత్రావరుణులు, జ్ఞానజ్ఞేయములు, తపోతపములు, సూర్యాతిసూర్యులు విద్యావిద్యలు, వేద్యావేద్యములు, చలాచలములు నను నవి తెలుపఁ బుమని ప్రార్థించెను. యాజ్ఞవల్క్యుఁడు సావధానుఁడవై విను మని చెప్పఁ దొడఁగెను. "గంధర్వరాజా! విశ్వమనఁగా భూతభవ్యభవత్కర

మయి వ్యక్తావ్యక్తనామకమైన ప్రకృతియే సుమా! నిర్గుణుఁడగు పురుషుఁడే యవిశ్వము. మిత్త్రావరుణులుఁ బురుషప్రకృతులు. జ్ఞాన జ్ఞేయములు, తపోతపములు, స్వ్యారాతిసూర్యులు కూడఁ బ్రకృతి పురుషులే. విద్యావిద్య వేద్యావేద్య చలాచలము లను శబ్దములు వరుసగా పురుషునకుఁ బ్రకృతికి వాచకములు.

వేదార్థచింతనమున క్షరాక్షరముల నెఱిఁగి క్షరము విడిచి యక్షరముఁ జేపట్టి పంచవింశాఖ్యతత్త్వరత మున్న పురుషునకుఁ గేవలత్వము కలుగును; దానివలన నాతఁడు షడ్వింశదర్శన మంది తన్మయతచేఁ బురుషోత్తముఁ డగును. పురుషోత్తముఁ డని, షడ్వింశక మని, పరమేశ్వరుఁ డని పరమునకుఁ బేళ్ళు గలవు. ఆ పరమే నిరంజనానంద బోధ నిత్యము.

ప్రకృతి పురుషునిఁ జూడదు. పురుషుఁడు ప్రకృతిని జూచు చుండుటచేఁ బరమును గాంచలేకున్నాఁడు. మఱి పరముఁ డన్నో ప్రకృతి పురుషులఁ జూచుచుండును. స్నేహసహవాసముల మూలమున సమ్మోహ మువయింపఁగాఁ గాలసముద్రమున మునుఁగుచు గాఢాహంకారమమత్వము లీహనుబెంపఁ బ్రకృతితోఁ బురుషుఁ డైక్య మొందుచుండును. అట్లు గాకుండినఁ బ్రకృతి పురుషుల వేఱుపాటు పొడచూపును. ప్రకృతిని విడిచి పురుషుఁడు వివేకపృథక్త్వమునఁ బంచవింశకుఁడు కాఁగా షడ్వింశపదము నిస్సంశయముగ లభించును. అపునరావృత్తిపర మగు నదియే పరము."

ఇట్లు యాజ్ఞవల్క్యుఁడు పలుకఁగా విని విశ్వావసుఁడు ప్రమోద మంది పథ్యము తథ్యము నగు తెఱఁగు దెలిపితివని యాజ్ఞవల్క్యుని సంయమిలోక బ్రహ్మలోక సురలోక ప్రఖ్యాతప్రజ్ఞానసంభావనీయుఁడ వని కీర్తించి సభక్తిక ప్రదక్షిణ ప్రణామము లొనర్చి నిజస్థానమున కరిగెను.*

---

* శాంతము శాంతిపర్వము.

## యాజ్ఞవల్క్యుని వివాహవృత్తాంతము :

అపుడు మిథిలానగర సమీపారణ్యమున నొక ఋషి కతుఁడను నామముతో జీవించుచుండెను. ఆతనికి నిజభార్యయందు లక్ష్మీకటాక్షమునఁ గాత్యాయని యను నొక కూఁతు రుద్భవించెను. ఆమె దినదిన ప్రవర్ధమానయై యొప్పారుచుండెను. సకాలమున నామెకు వివాహ మొనరింపఁ దలఁచి కతుఁడు యాజ్ఞవల్క్యుని కడ కేగి తన సుతను వివాహమాడు మని ప్రార్థించెను. యాజ్ఞవల్క్యుఁ డానందించి యాతని కోరిక దీర్పనెంచి సకల ఋషిగణపరివృతుఁడై తరలి వచ్చి యథావిధిఁ గాత్యాయనిఁ బరిణయమై నిజాశ్రమమునకు వెడలి పోయెను.

తరువాత మిత్రుఁడను నొక సద్బ్రాహ్మణునకు మైత్రేయి యను నొక సుపుత్రి యుదయించెను. ఆమె బాల్యమునుండియు బ్రహ్మవిద్యాగోష్ఠియందు మిక్కుటమగు మక్కువఁ జూపుచుండెను. క్రమముగా నామె పెరిగి యుక్తవయస్క యయ్యెను. అప్పటి కామె తన బందుగురాలును యోగీశ్వరియు నగు గార్గి యను విఖ్యాతవనితామణి కడ శిక్ష వడసెను. తరువాత జనకరాజర్షి సభలో పండితాఖండలుల నెల్లరనోడించి గార్గితో వాదించి జయించి మహావిఖ్యాతి నందిన యాజ్ఞవల్క్యునిఁ దక్క నొరుల వివాహ మాడనని యామె కృతనిశ్చయురాలై తండ్రికిఁ దెలిపెను. తండ్రి యా విషయమును గార్గికిఁ జెప్పెను. గార్గి యానందించి యామెను దీసికొనిపోయి కాత్యాయని కొప్పగించి యామెతో స్నేహముఁ గలిపెను. క్రమముగాఁ గాత్యాయని, మైత్రేయి యిరువురు నొకరిని విడిచి యొక రుండలేక యేకశరీర లైరా యన్నట్లుండిరి. ఈ సమయము గనిపెట్టి గార్గి కాత్యాయనికి మైత్రేయి కోరిక దెల్పెను. కాత్యాయని సామాన్యస్త్రీ కాదు కనుక బ్రహ్మానందపడి మైత్రేయితోడి స్నేహము వృద్ధి యగునని, యామె నెడబాయకుండుటకుఁ గారణమగునని భర్తను బతి

మాలి యొక వరము గోరుకొనెను. అది యే మని దైవరాతుఁడడుగ మైత్రేయిని వివాహమగుట యని యామె పలికెను. బ్రహ్మరాతుఁడు కాత్యాయని యనసూయకును మైత్రేయి భక్తి తాత్పర్యములకును మెచ్చి యామెనుగూడ వివాహమాడెను. ఆమె భర్తతో నిరంతర బ్రహ్మవిద్యాగోష్ఠి సలుపుచు సపర్యల నాతనికి ముద మొదవించుచు నుండెను. కాలక్రమమున యాజ్ఞవల్క్యునకుఁ గాత్యాయనియందు చంద్రకాంతుఁడు, మహామేఘుఁడు, విజయుఁడు నను ముప్వురుపుత్త్రు లుదయించిరి.*

## యాజ్ఞవల్క్యుఁడు యోగీంద్రపట్టాభిషేకము నందుట :

తొల్లి మహర్షు లందఱునుగూడి యోగీశ్వరపట్టాభిషిక్తుఁడగుట కర్హుఁడగు ఋషివర్యుఁ డెవఁడని నిర్ణయింప దొరకొనిరి. అపుడు వా రందఱు యాజ్ఞవల్క్యుని కడకేగి యాతనివలనఁ బరమయోగ రహస్యము లెల్ల నెఱిఁగి యంతకుమించిన యోగి నే కాలమువ వారెఱిఁగి యుండని కారణమున మాఘశుద్ధ పూర్ణిమనాఁ డాతనికి యోగీంద్రపట్టాభిషేక మొనర్చిరి. యాజ్ఞవల్క్యుఁడు ఋషులకుఁ దెల్పిన విషయములే 'యోగశాస్త్రము' 'యోగయాజ్ఞవల్క్యము' అను పేర పంద్రెం డధ్యాయములలో విశ్వవిఖ్యాతి నందినవి.♦

## యాజ్ఞవల్క్యుని తురీయాశ్రమ స్వీకారము:

అనేక సమయముల ననేక పండితసభలలో సమస్త విషయములను యాజ్ఞవల్క్యుఁ డనేకులకు బోధించియున్నాఁడు. తుదకుఁ దాను సన్న్యాసాశ్రమమును స్వీకరించుతఱి భార్యలగు కాత్యాయనిని

---

* బృహదారణ్యకము.

♦ గరుడపురాణమున "యాజ్ఞవల్క్యేన యత్పూర్వం ధర్మం ప్రోక్తం కథం హరే, తన్మేకథయ కేశిఘ్న యథా తత్త్వేన మాధవ" (94. 1) అని స్పష్టముగాఁ గలదు. ఇందలి విషయము లెన్నో అగ్ని పురాణమునఁ గలవు.

మైత్రేయిని, బిల్చి వారికిఁ గావలసినది కోరుకొనుఁ డనెను. తాను
గడించిన సమస్తైశ్వర్యములు నిరువురకుఁ బంచి యిచ్చెద ననెను.
అంత వారిరువు రేమియు వలదనియు నజరామరత్వమునకు మోక్ష
మార్గమును దెలుపుమనియుఁ గోరిరి. అంత నాతఁడు "కాంతలారా!
ఉత్తమ విషయమును గోరి నా కానంద మొదవించితిరి. చెప్పెద
వినుఁడు. భర్త భార్యకుఁ బ్రియుఁడు కాక యాత్మకొఱకే ప్రియుఁ
డగుచున్నాఁడు. ఇట్లే పుత్త్రమిత్త్రాదులకే కాక సమస్తమునకు నాత్మ
ప్రయోజనమునకే ప్రియుఁ డగుచున్నాఁడు. అందుచే నాత్మము
చూడఁ దగినది; వినఁదగినది; మననము చేయఁదగినది; ధ్యానింప
వలసినది. దానివలన సమస్త మెఱుఁగుటయే యగును. అద్వితీయ
మగు పరమాత్మయే సకలమునకుఁ గారణము. వేదశాస్త్రాదులెల్ల నా
పరమాత్ముని నిట్టూర్పులు.

ఆత్మము భూతములనుండి పుట్టి వానినే యనుసరించి మర
ణము నందుచున్నది. జ్ఞానోదయమునకుఁ బూర్వము విశేషజ్ఞానము
కలిగి మరణానంతరము భేదవిషయికసూచన లేక బ్రహ్మమాత్రమైనది.
అజ్ఞానముచే నాత్మకును దేహేంద్రియాత్మకమగు జీవభావము గలిగి
నది. అది జ్ఞానముచే నశింపఁగా లేకపోయిన దైనది. విజ్ఞానఘనస్వ
రూప మగు నాత్మము నాశములేనిది. ఇది కా దిది కాదని సర్వనిషేధ
ములతో నిశ్చయింపఁ బడిన యాత్మ మాకారము లేనిది. కాన దేని
తోడను గూడనిది; దుఃఖము లేనిది; బాధ నొందనిది; నశింపనిది.
కావున, నాత్మమే యాత్మమును దెలిసికొనవలెను. ఇదియే యమృ
తత్వ"మని బోధించి వారలఁ దరింపఁజేసి తాను సన్న్యసించి నిత్యా
నందుఁ డయ్యెను.

## యాజ్ఞవల్క్యవి స్మృతి :

యాజ్ఞవల్క్యుఁడు మిథిలానగరమున నున్నప్పుడు ఋషులు
కొందఱాతనికడకు విచ్చేసి వర్ణాశ్రమాచార ధర్మములను విశదీకరిం

పుమని కోరిరి. అపుడు యాజ్ఞవల్క్యుఁడు ఆచార వ్యవహార ప్రాయశ్చిత్తములను మూఁడుకాండలలో ఈ స్మృతి వారి కుపదేశించెను. మొదటికాండలో పదునాలుగు విద్యలు, పరిషత్తు, సంస్కారములు, సపిండవివాహములు, స్నాతకవిధులు, పురోహితధర్మములు మున్నగు నెన్నో విషయములు గలవు. రెండవకాండలో న్యాయస్థానాదికము, శిక్షాదికము, స్త్రీ ధనవిషయము మున్నగునవి కలవు. మూఁడవకాండలో అపరకర్మ, అశౌచశుద్ధి మున్నగునవి, యతిధర్మములు, మోక్షమార్గము, సత్త్వ రజ స్తమోగుణముల వలని దోషములు, యమనియమములు, ప్రాయశ్చిత్తములు మున్నగునవి కలవు.

## యోగయాజ్ఞవల్క్యము :

ఇందు యాజ్ఞవల్క్యుఁడు యోగమును గూర్చియు, యోగాంగములు, ఉపాంగములు మున్నగువానిని గూర్చి పండ్రెండధ్యాయములలోఁ దెలిపియున్నాఁడు. ఇది యాతఁడు గార్గితోఁ జేసిన సంభాషణమునకు సారమని తెలియుచున్నది. తాను యోగశాస్త్రమును బ్రహ్మవలనఁ దెలిసికొన్న ట్లాతఁ డిందుఁ దెలిపెను. గృహస్థుఁడైనను స్వధర్మము లొనర్చుచు వేదాంతపరిజ్ఞానము వలనను, సమ్యగాత్మదర్శనము వలనను ముక్తుఁ డగుచున్నాఁడు. *కర్మజ్ఞానముల రెండింటి సమ్మేళనమువలననే మోక్షము కలుగును. ఒక్క జ్ఞానము వలననే మోక్షము కలుగుననుట అవివేకము. • మున్నగు భావము లిందుగలవని అపరార్కాదులు పేర్కొనిరి.

---

* స్వకర్మణా మనుష్ఠానా త్సమ్యగాత్మ విదర్శనాత్, వేదాంతానాం పరిజ్ఞానాత్ గృహస్థోఽపి విముచ్యతే.

• జ్ఞానకర్మ సమాయోగాత్ పరమాప్నోతి పూరుషః పృథగ్భావో న సిద్ధ్యేత ఉభే తస్మాత్ సమాశ్రయేత్.

# మహర్షుల చరిత్రలు

## వసిష్ఠమహర్షి

### స్తుతి

వసిష్ఠమహర్షి భారతబ్రహ్మర్షులలో నగ్రేసరుఁడు. నవబ్రహ్మలలో విశిష్టకీర్తనీయుఁడు, సప్తమహర్షులలో నుత్తముఁడు, ఇక్ష్వాకు వంశక్షత్రియులకుఁ గులగురువు, త్రిలోకపూజ్య యగు నరుంధతికిఁ బ్రాణనాథుఁడు.

**వసిష్ఠుని ప్రథమజన్మము :**

బ్రహ్మ సర్వలోకప్రాణుల బహువంశ పరంపరలు వృద్ధికాకుండుటకు శోకించి, తన్నిమిత్తము తనతో సరియగు వారగు ప్రజాపతులను దన మానససృష్టియందుఁ బుట్టించెను. వారు భృగువు, పులస్త్యుఁడు, పులహుఁడు, క్రతువు, అంగిరసుఁడు, మరీచి, దక్షుఁడు, అత్రి, వసిష్ఠులు. వీరే నవబ్రహ్మలను విఖ్యాతి నందిరి. వీరందఱును చిరకాలము తపోనిష్ఠాగరిష్ఠులై యుండి వివాహమాడి పుత్త్రులఁ గని వంశాభివృద్ధి నొనర్చిరి.

అందు వసిష్ఠుఁడు దక్షుని గూఁతురగు 'ఊర్జ' యను నామెను వివాహమాడి యామెయందు విరజుఁడు, గోత్రుఁడు, ఊర్ధ్వబాహుఁడు సవనుఁడు, అనఘుఁడు, సుతపుఁడు, శక్రుఁడు నను నేడ్వురఁ గాంచెను. ఈ యేడ్వురును నిజ తపఃప్రభావమున నుత్తరమన్వంతరమున సప్తమహర్షులై విలసిల్లిరి.

పిమ్మట వసిష్ఠుఁడు బాహ్యేంద్రియ వ్యాపారములు వర్జించి రాగద్వేషము లుడిగి ఫలమూలము లుపయోగించి ఘోరతపోనలమున వహ్నిరూపుఁడై రెండవ బ్రహ్మలోక మనఁదగు నాశ్రమము నిర్మించుకొని సాక్షాత్పితామహులఁబోలిన బ్రహ్మర్షి వాలఖిల్యాదులు శిష్యులై కొలుచుచుండ వెలుఁగొందుచుండెను.

ఇట్లుండ నొకనాఁ డయోధ్యాపాలకుఁ డగు నిక్ష్వాకుఁడను రాజు వసిష్ఠమహర్షి నాహ్వానించి తన గృహమున నుంచుకొని చిరకాలము పూజించి యాతని కరుణకుఁ బాత్రుఁ డాయెను. వసిష్ఠుఁ డాతనిఁ గరుణించి వరము కోరుకొను మనఁగా నాతఁడు "మహాత్మా! నేఁడు మొదలు తాము మా కులగురువులై మావంశక్షేమమును గోరుచుండఁ గోరుదు" నని వినయవినమిత వదనుఁడై ప్రార్థించెను. భూత భవిష్యద్వేదియగు వసిష్ఠమహర్షి విష్ణుమూర్తి శ్రీరాముఁడన నాతని వంశముననే జనింపఁ బోవుట గుర్తించి యాతని ప్రార్థన మంగీకరించెను. నాఁటినుండియు వసిష్ఠుఁడు వాగ్దానము ననుసరించి యిక్ష్వాకువంశస్థు లెల్లరకుఁ గులగురు వయ్యెను.

**నిమి వసిష్ఠుల పరస్పర శాపవృత్తాంతము :**

ఇక్ష్వాకుఁ డట్లు వసిష్ఠుఁడు పురోహితుఁడు కాఁగా బహు యజ్ఞము లొనర్చి చిరకాలము రాజ్యపాలన మొనరించి దివంగతుఁ డయ్యెను. తరువాత, నాతని పుత్త్రుఁడగు నిమి యనువాఁడు రాజ్యమునకు వచ్చి తండ్రివలె వసిష్ఠు నెంతయు గౌరవించుచుండెను. కొంత కాలమునకు నిమి వేయిసంవత్సరములు సత్త్రయాగ మొనరింప నుద్దేశించి కులగురువగు వసిష్ఠుని కడకేగి విషయము నివేదించి యాతనిని హోతగా నుండఁ బ్రార్థించెను. అంత వసిష్ఠుడు "రాజా! అపూర్వమగు నీ యజ్ఞమున నేను హోతగ నుండుట కభ్యంతరము లేదు. కాని, యింతకుఁ బూర్వమే యింద్రుఁ డేతెంచి యాతఁ డే నూఱేఁడులు చేయు మఖమున హోతగా నుండుటకై నా యామోదమును

బడసి వెడలిపోయెను. కావున, పురుహూతుని జన్నము పూర్తియై నంతనే నీ క్రతు వాచరింతు"నని చెప్పి నిమిని బంపివేసెను.

కాని, నిమిచక్రవర్తి యింటికి వచ్చి యజ్ఞోపకరణము లగు పదార్థముల నన్నిటిని సంపాదించి వసిష్ఠాగమనము మనమునఁ దృణీకరించి గౌతమమహర్షిని బురోహితునిగా బిలిచి యజ్ఞమారంభించెను. ఈ ప్రకారము నిమి యాగ మవిచ్ఛిన్నముగాఁ గొన సాఁగుచుండఁగా నే నూఱువత్సరములకు వజ్రియాగము సమాప్తము గావించి వసిష్ఠమహర్షి నిమియాగమునకు హోతయగు నుద్దేశ్యముతోఁ జను దెంచెను. నిమి యజ్ఞవాటమున గౌతమార్త్విజ్యమున యజ్ఞ మగుచుండుటఁ గాంచి వసిష్ఠుఁడు కోపించి "ఔరా! నన్ను హోతగాఁ బిలిచి నే వచ్చులోపలనే నాతోఁ జెప్పనైనఁ జెప్పక న న్నుదాసీనుని జేసినాఁడు. ఏమి యీ నిమి కావరము? ఈ దోషములకు నిమి విదేహుఁడగుఁ గాక!" యని శపించెను. ఇంతలో నిమి లేచి వచ్చి తన్ను శపించినందులకు వసిష్ఠునిఁ గోపించి యాతఁడును విదేహుఁ డగునట్లు ప్రతిశాప మిచ్చెను.

అంత నిమిచక్రవర్తి శరీరమును విడువఁగా గౌతమాదిమహర్షు లాదేహమును దైలగంధాదుల సంరక్షించి విధివదుక్తమార్గముల వేయి సంవత్సరములకు యజ్ఞము పూర్తి గావించిరి. అపుడు దేవతలు నింద్రాదులు వచ్చి నిమి కోరిన ప్రకారమాతఁడు సమస్తజీవుల నేత్రపద్మములకుఁ గనుఱెప్పయై మెలఁగు వరము ననుగ్రహించి వెడలి పోయిరి.*

## వసిష్ఠమహర్షి ద్వితీయ జన్మము :

అనంతరము వసిష్ఠమహర్షి విగతదేహుఁడై యపారమగు నాత్మీయతేజమును యోగవిద్యాబలమును మిత్రావరుణుల యందు

* దేవీభాగవతము షష్ఠస్కంధము. విష్ణుపురాణము.

నివేదించెను. పదపడి యూర్వశీ దర్శనమున మిత్రావరుణుల వీర్యములు స్ఖలితములు కాఁగా నూర్వశిచాని నొక నూత్న భాండమునఁ బడిలపఱిచెను. అందుండి దేహధారియై వసిష్ఠుఁడగస్త్యునితో బయటకు వచ్చి కుంభసంభవుఁ డయ్యెను.

ఇట్లు పునర్జన్మము గాంచిన వసిష్ఠమహర్షి తన పూర్వాశ్రమమునుజేరి తపోదీక్షానవద్యుఁడై యుండెను. అహా! వసిష్ఠుని యౌన్నత్యము! వసిష్ఠమహర్షి నిజ తపఃప్రభావమున నిమి యొసఁగిన శాపమును గ్రమ్మరింపుకొనుశక్తి గలిగియుఁ దన తపోధనము వ్యయింపనిచ్చగింపలేదు. మఱియు విగతదేహుఁడై తిరిగి దేహమును ధరించుటకుఁ గారణ మాతఁడు కారణజన్ముఁ డగుట. అతఁ డొనర్పవలసిన జగచ్ఛ్రేయను నుద్దేశించి స్వేచ్ఛాజన్ము డయ్యెనే కాని యాతఁడు కర్మపరంపరాహతుఁ డగు సామాన్యజీవుఁ డని యెంచరాదు. ఈ రీతి ద్విజన్ముఁడైన వసిష్ఠుఁడు తనయాత్మశక్తిని జాటి వెలుఁగొంది పరమ పవిత్రుఁడై యొప్పారెను.*

**అరుంధతీ వసిష్ఠుల వివాహవృత్తాంతము :**

కర్దమప్రజాపతికి దేవహూతి యందుఁ దొమ్మండుగురు కొమార్తె లుదయించిరి. వారిలో నరుంధతి యొకతె. ఆమె బాల్యమునుండియు జననీజనకులకు విధేయురాలై శౌచలక్ష్మివలె సద్గుణశ్రీయై పెరుఁగఁజొచ్చెను. కర్దమప్రజాపతి తన పుత్రికలను బ్రహ్మర్షులకే యిచ్చి వివాహ మొనరింప నిశ్చయించుకొని యుండెను.

ఇట్లుండ నొకనాఁడు వసిష్ఠమహర్షి కర్దమప్రజాపతి యింటి కరుదెంచి యాతనిచేఁ బూజింపఁబడి పరమతేజస్వినియై యాతని యింట మెలఁగు నరుంధతిని గాంచెను. అతఁడు తన దివ్యదృష్టి

* విష్ణుపురాణము.

వలన నామెయే తనకు భార్యయగునని యెఱిఁగి యామె మాహాత్మ్యమును జాటు నెంచెను. అంత నాతఁడు గొంత యిసుక దీసికొనివచ్చి దీనిని వండి పెట్టఁగలవా రెవరైనఁ గలరా యని యెల్లర నడుగుచు వచ్చెను గాని యే కాంతయుఁ డా నాపని చేయఁగల నని సంసిద్ధురాలు కాకుండెను. అరుంధతి యీ మాటలు విని "మునివరా! తమ కటాక్ష మున్నచో దానిని నా కిండు; నేను వండి పెట్టఁ గల" ననెను. అందుల కెల్ల రాశ్చర్యపడిరి. వసిష్ఠుఁ డా యిసుక నామె కొసఁగ నరుంధతి నిజశక్తిప్రభావమున నా యిసుక రేణువులు బియ్యపుగింజలగు నట్లొనర్చి వండి యన్న మొనరించెను. వసిష్ఠుఁ డానందించి యామెను గర్దమానుమతిని వివాహ మయ్యెను.

పిమ్మట నరుంధతీపాతివ్రత్యముఁ బరీక్షింప నెంచి యాతఁడు తన కమండలువు నామె కిచ్చి తాను దిరిగివచ్చువఱకు దానిని హస్తముననే యుంచి కాపాడుచుండు మని చెప్పి వెడలి యెంతటికిని దిరిగి రాఁ డయ్యెను. అరుంధతి చలనరహితయై భర్తకమండలువును జేతిలోనే యుంచుకొని తదేక చిత్తయైయుండెను. ఇట్లుండ నేండ్లును బూండ్లును గడవఁ జొచ్చెను. కాని యామె చలింపలేదు. వసిష్ఠుఁడు రాలేదు. ఆమె పాతివ్రత్యప్రభావమునకు నేకాగ్రదృష్టికిఁ ద్రిలోకములల్లాడఁ జొచ్చెను. బ్రహ్మాదు లరుదెంచి యామె యేకాగ్రతకు భంగము కలుగఁజేయఁ బ్రయత్నించిరి. కాని యామె వారివంకనైనఁ జూడలేదు. వారు చేయు ప్రార్థన లాలింపలేదు. ఈ దృశ్యమునకుఁ ద్రి జగజ్జను లచ్చెరు వందిరి. బ్రహ్మాదులు వేఱుగతి లేదని వసిష్ఠుని వెదకి తోడుకొని వచ్చిరి. వసిష్ఠుఁ డామెను సమీపించి కమండలువును స్వీకరించువఱ కామె యట్లే యుండెను. వసిష్ఠుఁ డానందమునఁ గమండలు వందుకొన నామె యాతనికిచ్చి యాతని పాదముల వ్రాలెను. అంత దేవతలు పుష్పవృష్టిఁ గురిసిరి. యక్షకిన్నర కింపురుషులు నృత్య మొనర్చిరి. బ్రహ్మాదు లామె యైదువతనమున

కచ్చెరువడి యామెకు దీర్ఘాయువును సుమంగళీత్వమును బ్రసాదించి యదృశ్యులైరి. వసిష్ఠుఁడును నిజసతీపాతివ్రత్యమున కానందించి యుత్తమాముల యనుజ్ఞయు నాశీర్వచనములు నంది యరుంధతితో నిజాశ్రమమున కేతెంచెను.*

## వసిష్ఠుని సాంసారిక జీవనము :

అరుంధతీసహితుఁడై యాశ్రమమును బ్రవేశించి వసిష్ఠమహర్షి తిరిగి సంసారి యయ్యెను. నిరుపమ తపస్సంపదచే నిత్యోజ్జ్వలులై యాత్మతత్త్వానవద్యులై నిర్వికారనిరామయజీవనము గడపు మహర్షి శ్రేష్ఠులు చేసిన సంసారము నపూర్వతపోజీవనమే యగును గాని సామాన్యసంసారజీవనము కాఁజాలదు. సామాన్యసంసారులకుఁ గల పామరత్వము, కామము, క్రోధము, లోభము, మోహము, మదము, మాత్సర్యము వారియెడ మందునకైనఁ గానరావు. వారి తపోజీవనమునకు, నియమ బాహుళ్యస్వచ్ఛంద ప్రవర్తనమునకు, ననువగునది పెంపొందించునదియగు సంసారమే వారు చేసినది. మన మహర్షులు తమనియమములకు నిష్ఠకు నేమాత్రము ప్రతికూలమైన నా సంసారమును ద్యజించుట కణుమాత్రము వెనుకంజవేయరు. మమకార రాహిత్యము, ధర్మముపట్ల పరమకాఠిన్యము, ఆత్మానందసింహాసనాధిష్ఠానమునకుఁ గల తీవ్రకృషి వారి సొమ్ము. అట్టిపవిత్రాత్ము లగు మహర్షుల భార్యలు, పుత్త్రిలు, మిత్రులేకాదు-ఆశ్రమప్రాంగణమునఁ గల జంతువులు తుదకుఁ జెట్టుచేమలును బరమ పవిత్రాశయములతో బ్రదుకుట కలవడుచుండు నన్న వారి మహత్త్వము వర్ణింప రానిది. భారతమహర్షుల యీ మహోన్నత్యము నిరుపమానము నిత్యసందీప్తము.

వసిష్ఠమహర్షి సాంసారికజీవన మట్టిది. అతని యాశ్రమమున నొకనాఁడు జలపాన మొనర్చి వేయేండ్లు తప మొనరించు ధన్యులు,

* శివపురాణము. అరుంధతీ చరిత్ర.

నొకనాఁడు గాలి పీల్చి యాజీవితము నిష్ఠనలుపు మహనీయులు, నొకనాఁడు జీర్ణపర్ణముల నుపయోగించి పెక్కేండ్లు తపము చేయు మహాత్ములు, నాహారవర్జితులై కల్పకాల మచలయోగమున నుండు యోగీంద్రులు, మున్నగు వారా మహర్షి శిష్యగణములై యుండిరి. మాతృవాత్సల్యముతో వారికి వలసిన వొసఁగుచు భర్త యానతిఁ బరిపాలించుచుఁ బవిత్ర జీవనమున బ్రహ్మభాజనత గృహస్థధర్మముల నిర్వర్తించుట యరుంధతీగృహిణీధర్మము. మనోవాక్కాయకర్మములచే భర్తయే భగవంతుఁడని నమ్మి యాతనికి శుశ్రూష లొనరించుచు నాతని కోరికపైఁ బరమ దయార్ద్రహృదయమున నతిథ్యభ్యాగతపూజ నలుపుచు నిరంతరనిష్ఠాగరిష్ఠత మెలఁగు నరుంధతి కదా యాదర్శగృహిణి! ఒక్క గృహస్థాశ్రమముననే యోగము, భోగము, దానము, త్యాగము, తపము, ధర్మము సమస్తము నిర్వహింపఁబడుచుండును గదా! ఇంత పరమాదర్శప్రాయము భారతమహర్షుల పవిత్రగృహస్థాశ్రమ ధర్మము!

ఈ రీతి నడచుకొనుచు నరుంధతి పతిసేవచే నాతని హృదయముఁ జూఱగొని యనంతసత్త్వులగు నూఱుగురు పుత్త్రులఁ బడసి పరమసాధ్వియై పేరొందెను. వసిష్ఠుఁడు సద్గృహస్థవిధులఁ దీర్చుచు నాదర్శగృహస్థరత్నమని కీర్తి గనెను.

## వసిష్ఠ విశ్వామిత్రుల వైరకారణము:

తొల్లి కన్యాకుబ్జమున గాధి పుత్త్రుఁడగు విశ్వామిత్త్రుఁడు నిరమిత్రముగా రాజ్యము చేయుచు నొక్కనాఁడు మృగయార్థ మడవికేగి యపారబలసమేతుఁడై తిరిగి తిరిగి కడు డస్సి వసిష్ఠమహర్షి యాశ్రమమున కేతెంచెను. వసిష్ఠుఁడు క్షత్త్రియోచితోపచారము లొనర్చి యాతఁడు ససైన్యుఁడై డస్సియుండిన కారణమున విందున కాహ్వానించి నందినీధేనువు మూలమున షడ్రసోపేతము లగు సమస్త

భక్ష్యములను విశ్వామిత్రాదుల కిడి విందు చేసెను. విశ్వామిత్రుఁడు నందినీప్రభావమున కాశ్చర్యపడి తత్పరిగ్రహకుతూహల హృదయుఁడయి వసిష్ఠు నిగాంచి "మునివరా! ఈ నందినీ ధేనువును గొని నీకు దీనితో సమానములగు లక్ష గోవులను, లక్ష మణులను లక్ష గుఱ్ఱములనునిచ్చెదను. అంగీకరింపు" మని కోరెను. వసిష్ఠుఁ డంత "రాజా! నే నేదో పితృదేవతాతిథి పూజనమునకై దీని నుపయోగించుచుంటిని. ఇది నీ కేల? మాకు-సంపద లేల? పో" మ్మనెను.

అంత విశ్వామిత్రుఁడు రాజసాహంకార పూరితుఁడై "మునీ! నేను క్షత్రియుఁడను. నీవు బ్రాహ్మణుఁడవు. నేను నిగ్రహానుగ్రహ సమర్థుఁడను. నీవు శాంతుఁడవు. నే నీ మొదవును బలిమిమైఁ గొని పోదు"నని ధేనువును బట్టించుకొని పోవుచుండెను. వసిష్ఠుఁడు ప్రశాంతచిత్తమున నూరకుండెను. కాని యాధేనువు పట్టిక వారిని దప్పించుకొని వసిష్ఠుపాలి కేతెంచి రక్షింపు మని మొఱ లిడెను. అతఁడంతఁ గరుణతో "అమ్మా! శత్రుబలముల నాశము నొందింపఁ జాలు బలములఁ బుట్టింపు" మనఁగా నందిని చిందఱరేఁగి నిదాఘసమయ మధ్యందిన దినకరమూర్తిని బోలి దుర్నిరీక్ష్యయై, యంగవిక్షేపమున నంగారవృష్టిఁ గురియుచు వాలమున శబరులను, శకృన్మూత్రముల శక యవన పౌండ్ర పుళింద ద్రవిళ సింహళులను, ఫేనమున దరదబర్బరులను బుట్టించిన వారంద ఱొక్కమ్మడి విశ్వామిత్ర సైన్యముల హతమార్చిరి. మిగిలిన జనులును విశ్వామిత్రుని నూఱుగురు సుతులును గలిసి వసిష్ఠుని జంపుదు మని యాతని మీఁదికి రాఁగా నాతని హుంకారమున వారెల్లరు నీఱైపోయిరి.

### విశ్వామిత్రుఁడు తపమున శివుని మెప్పించి యస్త్రములఁ బడసి యుద్ధమునకు వచ్చుట:

విశ్వామిత్రుఁ డవమాన పరీభూత చేతస్కుఁడై హిమగిరి కరిగి యీశ్వరుని గుఱించి తపించి యాతనివలన సమస్త శస్త్రాస్త్రములు

వడసి తిరిగి వసిష్ఠునిపై కేతెంచెను. అచట వసిష్ఠు నాశ్రమముపై విశ్వామిత్రుఁ డధికరోషమున దివ్యాస్త్రములు విడిచెను. ఆ యస్త్రములు వసిష్ఠు నాశ్రమమును జుట్టుముట్టి దహింప దొరకొన నాశ్రమవాసులు భీతచిత్తులైరి. వసిష్ఠుఁడిది విశ్వామిత్రుని కృత్యమని యెఱిఁగి యాశ్రమవాసుల కభయ మిచ్చి మహోన్నతమగు తన బ్రహ్మదండము మహోద్దండ దండధర కాలదండమువలె ప్రచండలీలఁ గేలఁ గ్రాల రౌద్రరసోల్లాసమూర్తియై నిజకోపోన్నతాగ్నిజ్వాలాజాల దహ్యమాన విశ్వామిత్రప్రయుక్తవిశిఖశిఖాపరంపరఁ దగుచు విశ్వామిత్రుని కెదురేఁగి "ఓరీ! రాజాధమా! పవిత్రమై చిరపరివృద్ధమైన నా యాశ్రమము నకారణముగ దగ్ధ మొనర్చితివి. నీవు దురాచారుఁడవు. కలుషబుద్ధివి. నశింపకపోవు సుమా!" యని కేక వేయఁగా విశ్వామిత్రుఁడు కోపించి యాగ్నేయాస్త్ర మాతనిపై వేసెను. వసిష్ఠుఁ డద్దానిఁ దన బ్రహ్మదండమున కెఱదేసెను. అంత విశ్వామిత్రుఁడు క్రమముగా రౌద్రము, ఐంద్రము, పాశుపతము, ఐషీకము, మానవము, మోహనము, గాంధర్వము, స్వాపనము, జృంభణము, సంతాపము, విలాపము, శోషణము, మార్గణము, సుదుర్జయము, బ్రహ్మపాశము, కాలపాశము, వరుణపాశము, పినాకాస్త్రము, దండాస్త్రము, పైశాచము, క్రౌంచము, ధర్మచక్రము, కాలచక్రము, విష్ణుచక్రము, వాయవ్యము, కంకాళము, కాపాలము. కంకణము, మున్నగు ననేకాస్త్రశస్త్రము లొక్కుమ్మడిఁ బ్రయోగించెను. వసిష్ఠమహర్షి యించుకంతయుఁ జలింపక తన బ్రహ్మదండమున నన్నిశస్త్రాస్త్రములను రూపుమాపెను. గాధి నందనుఁ డద్భుత కోపదందహ్యమానుఁడై బ్రహ్మాస్త్రమును బ్రయోగింప నది యా బ్రహ్మర్షి తెఱచిన వదనముఁ బ్రవేశించి యాతని నధికతేజోదీప్తు నొనర్చెను. దానిమూలమున వసిష్ఠుఁడు భువనభయంకరుఁడై వెలుఁగ సమస్తజీవు లతిభీతచిత్తులు కాఁగా దేవప్రార్థనమున వసిష్ఠుడు ప్రశాంతరూపము ధరించెను. అంతటితో జీవక్షోభ మంతరించెను.

గాధిసుతుఁడు సవమానితుఁడై "బ్రహ్మ తేజోబలం బలం ధిక్ క్షత్రియబల" మ్మని బ్రహ్మర్షిత్వము నంద బ్రహ్మానుగుణించి ఘోర తప మొనరింప వెడలి పోయెను. వసిష్ఠమహర్షి బ్రహ్మతేజోబల మ్మప్రతిహతమై విరాజిల్లెను.*

## వసిష్ఠుఁడు కల్మాషపాదుని శపించి యనుగ్రహించుట :

కాని, విశ్వామిత్రుఁ డదిమొదలు వసిష్ఠునిపై నసూయవహించి సమయము వచ్చినపు డాతని నవమానింపఁ బ్రయత్నించుచునే యుండెను. ఇట్లుండ యిక్ష్వాకు వంశజుఁ డైన సుదాసుని పుత్త్రుఁ డగు మిత్త్రసఖునకు యాజకత్వ ముపేక్షించి తత్పురోహితుఁ డైన వసిష్ఠునితో బద్ధవైరుఁడై యుండెను. ఇట్లుండ మిత్త్రసఖుఁడు వసిష్ఠునార్త్విజ్యమున యజ్ఞ మొనరించుచుండెను. ఒకనాఁడు వసిష్ఠుఁ డనుష్ఠానార్థ మరిగిన సమయమున విశ్వామిత్త్రుఁ డొక రాక్షసుని బతిమాలి వసిష్ఠరూపుఁజేసి సుమిత్త్రునికడ కరిగి నాఁడు తనకు నరమాంస మాహారముగాఁ బెట్టుమని కోరి యాతఁ డంగీకరింప నదృశ్యుఁడవు గమ్మని పంపెను. విశ్వామిత్త్ర శాపమునకు వెఱచి యా రాక్షసుఁ డట్లొనరించెను. అటు వసిష్ఠుఁ డనుష్ఠానానంతరము వచ్చి భోజన మొనరించుచుండ నరమాంసమును గొనివచ్చి సుమిత్త్రుఁ డాతనికిఁ బెట్టెను. వసిష్ఠుఁడు కోపించి యాతనిని రాక్షసుఁడవు గమ్మని శపించెను. సుమిత్త్రుఁడు తన దోషము లేదని చెప్ప వసిష్ఠుఁడు దివ్యదృష్టి నెల్ల గ్రహించి యాతనికిఁ బండ్రెండు సంవత్సరములకు శాపమోక్షణ మగు నని యనుగ్రహించెను. ఆ రాజును వసిష్ఠుని శపింపఁ దలఁచి జలములు సేకరింపఁగా నాతని భార్య యగు మదయంతి వారింప నాతఁ డా జలములు నిజపాదములఁ జల్లుకొనఁ దచ్ఛాపాగ్ని నాతని

* భారతము. రామాయణము. విష్ణుపురాణము. మార్కండేయ పురాణము.

పాదముల మచ్చ లేర్పడెను. నాఁటినుండి యాతఁడు కల్మాషపాదుఁ డనఁ బరగెను.

కల్మాషపాదుఁడు రాక్షసుఁడై చరించుచు నొకనాఁడొక బ్రాహ్మణ మిథునము క్రీడించుతఱి నా బ్రాహ్మణునిఁ జంప నాతని భార్య కల్మాష పాదుఁడు భార్యతోఁ గ్రీడించువేళ మడియునని శపించి భర్తతోఁ సహగమన మొనరించెను.

తరువాత నాతఁడు విశ్వామిత్రప్రేరితుఁడగు రాక్షసుఁ డొకఁడు తనహృదయమును బ్రవేశింపఁగా నేగి శక్తి మున్నగు వసిష్ఠపుత్త్రుల నూర్వురఁ జంపెను. తుదకుఁ బన్రెండేం డ్లైన తరువాత శాపవిము క్తుఁడై తన తప్పిదమును గ్రహించి వసిష్ఠుని క్షమింపు మని ప్రార్థించి "మహాత్మా! నీ ప్రసాదమున శాపమునలనఁ బాసి కృతార్థుఁడ నైతిని. నే నిఁక నడచు తెఱఁ గెఱిఁగింపు" మని కోరెను. వసిష్ఠుఁడు "రాజా! సకలగుణభూషితుఁడవై, బ్రాహ్మణభక్తుఁడవై రాజ్యమొన రించుచు సుఖముండుము. బ్రాహ్మణుల కవజ్ఞచేసి యింద్రాదులే చెడుట మఱవక కలనైన విప్రనింద సేయకుండు" మని బోధించి మఱియు నేదేని వరము కోరుకొను మని యాతని నడిగెను. కల్మాష పాదుఁడు తనకుఁ గలిగిన విప్రశాప వృత్తాంత మెఱింగించి తనకుఁ బుత్త్రోత్పత్తిఁ బ్రసాదింపు మని కోరెను. వసిష్ఠుఁడు ననుగ్రహించి యాతని భార్య యగు మదయంతి ఋతుమతియైయున్న నామెకు గర్భముఁ బ్రసాదించెను. ఈ ప్రకారము వసిష్ఠుని కృపవలన మద యంతి యశ్మకుఁ డనుకొడుకుఁ గనెను.*

## పుత్త్రశోకమువలన వసిష్ఠుని మరణోద్యోగము:

శక్తి మున్నగు వసిష్ఠపుత్త్రులు నూర్వురను విశ్వామిత్త్ర ప్రేరితుఁ డగు రాక్షసునిచే మడిసిన పిమ్మట వసిష్ఠుఁడు తనకుమారుల

* విష్ణు పురాణము.

మరణమును దప్పింపఁ గలిగియు నాత్మవిద్యాధికుఁ డగుటఁ బ్రశాంతి నందెను. కాని, యా సమయమునఁ బంచభూతములును దన పట్ల నెట్లు ప్రవర్తించునో చూత మని యాతఁడు బుత్త్రశోకవ్యాజమున మరణోద్యుక్తుఁడై దావాగ్ని మధ్యమునఁ బ్రవేశించెను. ఆ క్షణమందే యుగ్రశిఖానల ముష్ణము చెడి చల్లనై పోయెను. తరువాత వసిష్ఠుఁడు కంఠదేశమున రాయిగట్టుకొని సముద్రమున దిగెను. కాని, యంబుధి తరంగహస్తముల నాతని నెత్తి తన సైకత తీరముఁ జేర్చెను. పిమ్మట నాతఁడు మేరుపర్వతశిఖర మెక్కి క్రిందఁబడఁగా నాతని దేహ మక్షయ మయి తూలసంచయసీ కాశత నొప్పారెను. మఱి యాతఁ డొకనదిఁ బ్రవేశింపఁగా నా నది శతవిధములఁ బర్విద్రుతయై స్థలమయిన కారణమున నా నది శతద్రు వనఁ నొప్పెను. పాశబద్ధుఁడై యాతఁ డింకొక నదిఁ జొరఁగా నానది యాతని పాశములఁ ద్రెంపి దరికిఁజేర్చి విపాశ యనఁ బేరుగాంచెను. ఇదే విధముగ నెల్లభూతములు వసిష్ఠు నాదరించి సుఖవంతు నొనర్చి యాతని మరణోద్యోగము విరమింపఁ జేసెను.

పిమ్మట శక్తిభార్య గర్భమునఁ బరాశరుఁడు నాతనికి వేదవ్యాసుఁడును ముందు జనింపనుండు టెఱిఁగి వసిష్ఠ డాత్మమరణోద్యోగము మాని స్నుషామరణ ప్రయత్నములు నివారించెను. పరాశరుఁడు తండ్రివధకుఁ జింతించి సకలలోక సంక్షోభకరమగు యజ్ఞ మారంభింప జగద్ధితమతియై వసిష్ఠు డద్దాని వారించి సంస్తవనీయుఁ డయ్యెను.

## వసిష్ఠుఁడు తపతీసంవరణులఁ గూర్చి కాపాడుట :

తొల్లి యాదిత్యుని పుత్త్రి యగు తపతి యను నామె యౌవనవతియై యుండఁగా భరతకులుఁడు, నజామీఢనందనుఁడు నగు సంవర్తుఁడు తపతిని గాంచి మోహించెను. సంవర్తుఁడు తపతిని జేరి తన

కాంక్ష దెల్పఁగా నామె సూర్యు ననుమతిఁ దన్ను గ్రహింపు మని చెప్పి వెడలిపోయెను. సంవరణుఁ డది యెట్లు సాధ్యమగునని విచారించుచు సూర్యారాధనపరుఁడై కులగురువగు వసిష్ఠునిఁ దలఁచెను. వసిష్ఠమహర్షియుఁ గరుణాపరుఁడై చనుదెంచి సంవరణుని కోరిక యోగదృష్టినెఱిఁగి యాతని ననునయించి సూర్యునికడకు నియుత యోజనములు చని సూర్యుని సంస్తుతించెను. భానుమూర్తి వసిష్ఠు నాదరించి యాగమన ప్రయోజన మడిగెను. వసిష్ఠుఁడు తపతిని సంవరణుఁడు మోహించి యుండుటఁ దెలిపి తపతిని దనతోఁ గూడఁ బంపుమని కోరెను. సంవరణుఁడే తపతికిఁ దగిన వరుఁ డని సూర్యుఁ డానందించి తన కూఁతును వసిష్ఠున కొప్పగించెను.

వసిష్ఠుఁ డిట్లొక్క నిమిషమున మున్నూట యఱువదినాలుగు యోజనములు పఱచు నాదిత్యు నరదముతో నశ్రమమునఁ జని తపతిని దోడ్కొనివచ్చి సంవరణునకు విధ్యుక్తముగా వివాహ మొనర్చి తన పురోహితధర్మము నక్కజముగ నిర్వర్తించెను.

సంవరణుఁడు తపతీసంగమలోలుఁడై ద్వాదశవర్షములు రాజ్యముపేక్షింప దేశమున ననావృష్టిదోషము సంభవించెను. అపుడు వసిష్ఠుఁడు శాంతిపౌష్టికవిధు లొనరించి యఖిల ప్రజల కనురాగమగు నట్లనావృష్టిదోషమును దొలఁగించెను. ఈ విధముగ వసిష్ఠమహర్షి యాశ్రిత సుజనసంరక్షకుఁడై యమితవిఖ్యాతి నార్జించెను.*

### వసిష్ఠమహర్షి దాశరథుల కుపయోగించుట:

శ్రీరాముని పూర్వుఁడగు ననరణ్యుఁ డొకప్పుడు దైవద్రోహమునఁ గుష్ఠరోగపీడితుఁడు కాఁగా వసిష్ఠమహర్షి యాతని కారోగ్యవ్రత ముపదేశించి పశ్చాత్తప్తు నొనరించి రోగవిముక్తు నొనగూర్చి రక్షించెను. దశరథుఁడు, పుత్రి యగు శాంతను రోమపాదుఁడు పెం

---

* భారతము ఆదిపర్వము.

పిమ్మని కోరఁగాఁ నంగీకరింపని సమయమున భవితవ్యము నెఱిఁగిన వసిష్ఠుఁడు దశరథునకు శాంతకారణముగా సంతానము కలుగునని యెఱిఁగించి యొడంబడఁ జేసెను. పరశురాముఁ డంతకుఁ బూర్వము దశరథునిఁ జంప రాఁగాఁ నాతనిఁ గాపాడి శాంతను బ్రాహ్మణునకిచ్చి వివాహ మొనర్ప నియమించి పరశురాముని మరల్చి దశరథుని రక్షించెను. పుత్త్రార్థ మశ్వమేధపుత్త్రకామేష్టులఁ జేయుమని వసిష్ఠుఁడే దశరథునిఁ బురికొల్పెను. శ్రీరామాదులు జన్మింప వారికి జాతకర్మాదిక మొనరించి వసిష్ఠుఁడే నామకరణ మొనరించెను. దశరథుఁడు చనిపోఁగా భరత శత్రుఘ్నులఁ బిలిపించి రాజ్యము పాడుగాకుండ నాతఁడే గాపాడెను. శివధనుర్భంగ మొనరించి శ్రీరాముఁడు సీతను బడయఁగా వసిష్ఠుఁడే యూర్మిళను లక్ష్మణునకుఁ, గుశధ్వజునికూఁతులను భరతశత్రుఘ్నులకు నిప్పించి వివాహ మొనరించెను. ఇట్లనేక పర్యాయము లనేక విషయములఁ దోడ్పడి రఘువంశము నుద్ధరించిన మహానుభావుఁడు వసిష్ఠమహర్షి.*

**వసిష్ఠ జనక సంవాదము :**

ఒకప్పుడు సుఖాసీనుఁడై యున్న వసిష్ఠసంయమి కడకు జనక చక్రవర్తి యరుదెంచి సవినయభక్తిఁ బాదముల కెఱఁగి యుపాసించి యక్షరమును గుఱించి తెలుపుమని ప్రార్థించెను. ఆశ్రితజనవత్సలుఁ డగు వసిష్ఠమహర్షి యిట్లు చెప్పెను "రాజా! నయనము, ముఖము, పాణి, పాదము వీని నెల్లెడఁ గలిగి యాద్యంతక్షయవృద్ధిరహితమై నిర్ద్వయమగు తత్త్వమునే బుధు లక్షరమని పలుకుదురు. ప్రకృతి, అవ్యక్తము, మహత్తు, అహంకారము, పంచభూతములు, వానిగుణము లైన శబ్దాదు లైదును, దశేంద్రియములు—ఈ యిరువదినాలుగు క్షరమనఁబడును. ఈ యిరువదినాలుగు తత్త్వములు విజ్ఞానగోచరములు. కాని, వీని తరువాతి దైనతత్త్వ మవిజ్ఞేయము, నవ్యయము, సకలం

* రామాయణము.

తము, ననామయము, నమృతమును. ఈ యక్షరతత్త్వ మవర్ణ మయ్యు సత్త్వరజస్తమోనుసారముగా వికృతి నంది శుక్లలోహిత కృష్ణవర్ణము లందును. అహంకార విదూరమై నిర్వికారదీప్త మగును. ప్రకృతిగుణములచేఁ దనకుఁ దాన బంధ మొనరించుకొను పొత్తినూలి కాయపురువువలె నక్షరతత్త్వము నిజముగా నగుణమయ్యు సగుణతా వాప్తి నందును. ఇది యక్షరక్షరవివేకము. ఏకము ననేకము, దర్శనము నదర్శనము, నిస్తత్త్వముఁ దత్త్వము, అపవర్గము వర్గము నను నవి యక్షరక్షరమునకుఁ బర్యాయ పదములు. ఇది ప్రబుద్ధులకే గోచరము."

ఈ మాటలు విని జనకచక్రవర్తి "మహాత్మా! యోగము సాంఖ్యము, విద్యావిద్యలు వీనిని గుఱించి యెన్ని మారులు విన్నను నిలఁబడకున్నవి. తమవంటివారి నోటినుండి విన్నచో శాశ్వతముగ జ్ఞాపక ముండును. కానఁ గరుణించి యానతిం"డని కోరెను. వసిష్ఠుఁడు "రాజా! యోగ మనఁగా ధ్యానము. ఇది రెండువిధములఁ బరగును. ప్రాణాయామము, మనసు నేకాగ్రతావృత్తి యని. సగుణ భావమునఁ బ్రాణాయామము నిర్గుణభావమున నేకాగ్రత యొప్పారు చుండును. అవ్యక్త మగు ప్రకృతి ప్రసవధర్మిణియై బుద్ధి, అహంకారము, పంచభూతములు, విషయములు, నింద్రియములుగా విస్తరించును. వీని కధిష్ఠాత యగు పురుషునివల్లనే యివి కలుగును. అతని కనులోమ మగు సృష్టివలన బహుత్వమును, ప్రతిలోమ మగు సంహారమువలన నేకత్వమును సంభవించును. క్షేత్రము, అవ్యక్తము, ప్రకృతి ప్రధానమునఁ బరగు తత్త్వ మొకటియే. దానినే సత్త్వ మందురు. జీవుఁ డా క్షేత్రము నెఱిఁగినవాఁడు. కావున క్షేత్రజ్ఞుఁడు నవ్యక్తపురమున నుండుటచేఁ బురుషుఁ డనఁ బడును. అవ్యక్తము, జ్ఞానము, పురుషుఁడు జ్ఞేయుఁడు. ప్రకృతి సగుణాత్మక. పురుషుఁడు

నిర్గుణుఁడు. ఇదియే సాంఖ్యతత్త్వము. విద్య యనఁగాఁ బంచవింశతితమతత్త్వమగు నక్షరము. అవిద్య ప్రధానము. ఇట్లు కర్మేంద్రియములకు బుద్ధీంద్రియము విద్య; బుద్ధీంద్రియములకు మనస్సు విద్య; మనస్సునకు భూతపంచకము, దాని కహంకారము, దానికి బుద్ధి, దానికి నవ్యక్తము, దానికిఁ బంచవింశతితమతత్త్వము- క్రమముగా విద్యలు. ఎప్పుడు ప్రకృతి దా నను తలంచు పురుషుఁడు తాను బ్రకృతి గానని గ్రహించి పరమసంబోధనమున క్షరమగు నవ్యక్తమును దొలఁగి పంచవింశకుఁ డక్షరుఁడై పరత్త్వనిర్దేశమునఁ బొలుచుచు బుద్ధము, విమలము, నప్రేయము, సనాతనము నగు షడ్వింశకుఁడగును. అదియే నిరామయము ననంతము నగు పదము. ఇది గనిన పురుషుఁడు కేవలత్వమును నిర్మలత్వశుచిత్వాస్వతంత్రత్వసత్త్వపరత లొందు. ఇదియే మోక్షము తెలుఁగు. దీనిని శ్రద్ధాభక్తివిహీనున కెన్నఁడును బోధింపకుము. అట్టివాఁడు నీ కిష్టుఁ డేని నీ రాజ్యమైన నొసఁగుము కాని యీ పరమరహస్యమును మాత్రము చెప్పకుము."

ఈ వాక్యములు విని జనకుఁ డమితానందభరితుఁడై తగురీతి వసిష్ఠుని స్తుతించి సెలవు గైకొని వెడలిపోయెను.*

**వసిష్ఠ దిలీప సంవాదము :**

పూర్వ మొకప్పుడు దిలీపమహారాజు వైఖానసఋషి యాజ్ఞ చొప్పున వసిష్ఠాశ్రమమున కేగి

కనియె శ్రుతిస్మృతిప్రకర
　　గాథ తరార్థ వసిష్ఠుఁ దివ్యబో
ధనపదవీ మహత్త్వ నము
　　దగ్రగరిష్ఠుఁ దపోవిశేషసం

* భారతము, శాంతిపర్వము. (పద్మపురాణము, ఉత్తరఖండము 1. 128)

జనిత నితాంతపుణ్యగణ
సంచయ సువ్రతనిష్ఠ శేముషీ
జనితహిత ప్రభావముని
సంఘవరిష్ఠ వసిష్ఠ నయ్యెడన్.

వసిష్ఠుఁడు దిలీపుని రమ్మని యాదరించెను. దిలీపుఁ డాతని పాదపద్మములకు మ్రొక్కి తీర్థవిశేషములను మాఘస్నాన ప్రభావమును దెలిపి కరుణింపు మని కోరెను. వసిష్ఠుఁ డానందించి యాతనికి భృగు విద్యాధర వృత్తాంతము, పురూరవచ్చరిత్రము, వృషకాంగన చరిత్రము, సుందోపసుందోపాఖ్యానము మున్నగు కథల మూలమున మాఘస్నాన ఫలాదులను వివరించెను.

పిమ్మట దిలీపుఁడు "దేవా! మోక్షమార్గమును నాకుఁ దెల్పుము. మోక్షాసక్తుఁ డే మంత్రమును పఠింపవలయును? ఏ మూర్తి నారాధింపవలయును? ఏ ధర్మమును బాటింపవలయును?" అని వసిష్ఠు నడిగెను. అతఁడు శుభద మను పేరు గలిగి శ్రీమన్నారాయణుఁడు దేవత, గాయత్రి ఛందము, పంచవింశతివర్ణములు గల దివ్యమంత్ర మని చెప్పెను. మోక్షాసక్తుఁడు విష్ణుమూర్తి నారాధింప వలయును, విష్ణుధర్మములఁ బాటింపవలయును అని చెప్పి యష్టాక్షరీమంత్రము, లక్ష్మీస్తవము, త్రిపాద్విభూతిమహత్త్వము, మున్నగువాని నుపన్యసించి యవతార మహత్త్వముల వివరించి యనేక మహారహస్యములఁ దెలిపెను.

దిలీపుఁడు బ్రహ్మానందియై వసిష్ఠుని మిక్కిలి పూజించి యనేక పర్యాయములు భక్తిశ్రద్ధలతో వందనము లొనరించి వెడలిపోయి విష్ణుభక్తుఁడై చిరకాలము రాజ్యమేలి తుదకుఁ బరమపదమున విష్ణుసారూప్యమును బడసి నిత్యముక్తుఁ డయ్యెను.

## వసిష్ఠవాక్యమున సత్యవ్రతుఁడు త్రిశంకుఁ డగుట:

తొల్లి సూర్యవంశపు రాజగు సూర్యారుణుని కుమారుఁడగు సత్యవ్రతుఁ డనువాఁడు పౌరుఁ డొకఁడు పెండ్లాడిన యొకస్త్రీ నీనునను జెల్లుబడిని బుచ్చుకొనిన నాతనిఁ దండ్రి గ్రామమునుండి పోఁద్రోలి కొంతకాలమునకుఁ దా నరణ్యతపోజీవనమునకు వెడలిపోయెను. పురోహితుఁ డగు వసిష్ఠమహర్షి యరాజకము కాకుండ రాజ్యమును గాపాడుచుండెను. అపుడే పండ్రెండేండ్లవగ్రహదోషము సంభవింపఁగ వసిష్ఠుఁడు రాష్ట్రమును బురమును నంతఃపురమును శాసించి విశ్వసనీయ మగు ప్రభుత్వము పెంపుజనర గరిష్ఠమగు నాజ్ఞాబలమున రక్షించుచుండెను. ఈ సమయమున విశ్వామిత్రుఁడు దన కుటుంబమును బోషించుకొనలేక తన పుత్రునొకని మెడకుఁ ద్రాడుగట్టి నూఱుగోవుల కెవరైనఁ గొందురా యని తిరుగుచుండ సత్యవ్రతుఁడు నమస్కరించి "మహాత్మా! తమవంటి తపస్సంపన్ను లిటు చేయ నగత్యమేమి? నేను మిమ్మందఱఁ బోషించుటయే యుజనముగాఁ దలఁతును. అంగీకరింపుఁ"డని కోరఁగా విశ్వామిత్రుఁ డంగీకరించెను. అంత నాతఁడు మృగమహిషవరాహాది వన్యసత్త్వములఁ జంపి తెచ్చి కౌశికకళత్రపుత్త్ర సముదయమున కొసఁగుచు దీక్షవహించి నియమముతోఁ దన వాగ్దానముఁ జెల్లించుచుండెను.

తన దండ్రి తన్ను నగరమునుండి పోఁద్రోలినపుడు కాదు కూడ దనలే దని వసిష్ఠునిపై సత్యవ్రతుఁడు క్రోధము వహించియుండెను. ఆ కారణమున నొకనాఁ డెచ్చటను మాంసము దొరకనందున కామదోహిని యగు వసిష్ఠుని గోవు నొకదానిని జంపి యా మాంసముఁ దీయుచుండ వసిష్ఠుఁడు గాంచి "యోరీ! నీవు తండ్రి చిత్తమునకు రామియు, గురుదోగ్ధ్రివధయును, నప్రోక్షితమాంసోపయోగము నను మూఁడు తెఱఁగుల హృదయశంకువులు గావించితివి. కావునఁ

త్రిశంకుఁడ వైతివి. హీనుఁడవైతివి. పాపిష్ఠుఁడవైతివి అని శపించెను. అప్పటినుండి యాతఁడు త్రిశంకుఁడని వినఁబడెను. పిమ్మట వసిష్ఠుఁ డాతని రాజ్య మాతని కొసఁగెను.

బొందితో స్వర్గమునకుఁ బోఁజేయు యాగముఁ జేయింపుమని త్రిశంకుఁడు వసిష్ఠుఁ నడిగెను. వసిష్ఠుఁ డాతనిఁ జీవాట్లుపెట్టి యట్టి కోరిక తీరుట యసాధ్యము పొమ్మనెను. అతఁడు వసిష్ఠు వాక్య మసత్యము గావింపనెంచి విశ్వామిత్రుని కతమున యజ్ఞ మొనరించి విశ్వామిత్రుని తపశ్శక్తి వలనఁ ద్రిశంకుస్వర్గ మందెనే కాని స్వర్గముఁ గాంచలేక పోయెను. ఈ విధముగా వసిష్ఠవచన మమోఘ మయ్యెను.

ఈ త్రిశంకునిపుత్త్రుఁడగు హరిశ్చంద్రుఁడు పరమ సత్యవ్రతుఁ డని యింద్రసభలో వచ్చిన ప్రసంగమున వసిష్ఠుఁ డనఁగా విశ్వామిత్త్రుఁడు హరిశ్చంద్రుఁ డసత్యవాది యని తాను నిరూపింపఁ బన్నిదమిడెను. ఆ కారణమున విశ్వామిత్త్రుఁ డెంతగా బ్రయత్నించినను హరిశ్చంద్రునిచే నసత్యముఁ బలికింపలేకపోయెను. ఈ విధముగా వసిష్ఠమహర్షి ప్రతివాక్య మమోఘము, సత్యసమన్వితము నైనది.

## వసిష్ఠుఁడు మాంధాతకు హితోపదేశము చేయుట:

సర్వసంపదలతోఁ దులతూగుచు మహాచక్రవర్తియైన మాంధాత నిండుకొలువున్న సమయమున నాతని నభినందింప వసిష్ఠాది మహర్షులు విచ్చేసిరి. మాంధాత వారిపాదపద్మములకు భక్తిశ్రద్ధలతో నమస్కరించి రత్నసింహాసనముల వారిని గూర్చుండఁజేసి భార్యతో వారికి శుశ్రూష లొనరించెను. వా రానందించి యాతని నభినందించిరి. అపుడు మాంధాత ఋషికులతిలకుఁడగు వసిష్ఠునివలనఁ దన పూర్వజన్మవృత్తాంతముఁ దెలిసికొని తనకు జ్ఞానముఁ దెలిపి తరింపఁజేయుమని యాతనిఁ బ్రార్థించెను.

వసిష్ఠుఁ డాతనిం గరుణించి కర్మస్వరూపమును, బ్రహ్మస్వరూపమును, వేదవేదాంతపురాణస్వరూపము, ఉపాసక స్వరూపము

భగవదవతార రహస్యము, భక్తి యోగస్వరూపము, మున్నగునవి సవిస్తరముగాఁ దెలిపి వైరాగ్య ముపదేశించెను. మాంధాత యా మహనీయుని బోధనమునఁ గలంకదేఱిన బుద్ధిఁ గాంచెను. పిదప వసిష్ఠుఁ డాతనికి అష్టాక్షరీమంత్రరత్నము నుపదేశించి కటాక్షించి యథేచ్ఛ మేగెను.

## వసిష్ఠ స్మృతి:

వసిష్ఠమహర్షి స్మృతికర్తలలో నొకఁడు. వసిష్ఠస్మృతిలో ముప్పది యధ్యాయములు గలవు. 1. ధర్మజిజ్ఞాస, ధర్మాచరణఫలము, ధర్మలక్షణము, మున్నగునవి. 2. బ్రాహ్మణాదుల ప్రధానకర్మములు. 3. శ్రోత్రియుల శూద్ర నధర్మత్వము, అతతాయి వధవర్ణన. 4. మధుపర్కాదికము, పశుహింసనఫలము. 5. అత్రేయ ధర్మవర్ణనము. 6, అచారప్రశంసాదికము. 7. బ్రహ్మచారి ధర్మములు. 8. గృహస్థ ధర్మములు. 9. వానప్రస్థధర్మము. 10. యతిధర్మములు. 11. వైశ్వదేవాదికములు. 12. స్నాతకవ్రతము. వస్త్రాదిధారణవిధి. 13. ఉపాకర్మవిధి, మున్నగునవి. 14. పంక్తిబాహ్యవర్ణనము. 15. దత్తక ప్రకరణము. 16. వ్యవహారవిధి. 17. పుత్రప్రశంసాదికము. 18. చండాలాది జాతినిరూపణము. 19. రాజధర్మవర్ణనము. 20. ప్రాయశ్చిత్తాదికము. 11. బ్రాహ్మణీగమన ప్రాయశ్చిత్తములు 22. యాజ్యయాజనాది ప్రాయశ్చిత్తములు. 23. బ్రహ్మచారిణీగమన ప్రాయశ్చిత్తము. 24. కృచ్ఛ్రవిధివర్ణనము. 25. రహస్య ప్రాయశ్చిత్తము. 26. సాధారణపాపక్షయోపాయములు. 27. వేదాధ్యయనప్రశంస. 28. దూషితస్త్రీత్యాగాభావఫలాదికము. 29. దానాది ఫలనిరూపణము. 30. ప్రాణాగ్నిహోత్ర విధివర్ణనము అను విషయములు వసిష్ఠ స్మృతిలో వివరింపఁబడినవి. దీనికే "వసిష్ఠ ధర్మసూత్రము" లనియుఁ బేరు. ఇంతకంటెఁ జాల విపుల మగు ధర్మశాస్త్రమునే వసిష్ఠుఁడు బోధించెననియు దానినే 'వృద్ధవాసిష్ఠ' మందు రనియుఁ

దెలియుచున్నది. మితాక్షరము, స్మృతిచంద్రిక మున్నగునవి వృద్ధ వాసిష్ఠమునుండి యుదాహరించి యున్నవి, ఆ యా విషయములను వసిష్ఠుఁడు బోధించుటఁబట్టి యోగవాసిష్ఠము, జ్ఞానవాసిష్ఠము జ్యోతిర్వాసిష్ఠము, మున్నగుపేళ్ళు ఆ యా గ్రంథములకు వచ్చినవి.

బ్రహ్మతేజోబలంబు రూపము ధరించి
పరమపావన భారత వర్షమందు
వెలసెను వసిష్ఠుఁ డన భువి వెలిఁగి యదియె
సప్తఋషిమండలముఁ జొచ్చె శాశ్వతముగ.

---

# మహర్షుల చరిత్రలు

## విశ్వామిత్రమహర్షి

### విశ్వామిత్రుని జన్మ వృత్తాంతము :

తొల్లి యొకప్పుడు భృగువంశజుఁ డగు ఋచీకమహర్షి కుశనాభునికుమారుఁ డగు గాధియొద్దకు వచ్చి యాతనిచేఁ బూజితుఁడై యాతని పుత్త్రియగు సత్యవతిని వివాహమాడఁ గోరెను. గాధి రాజపుత్త్రి యగు సత్యవతి నొక బ్రాహ్మణున కెట్లిచ్చుట యని సంశయించి యుపాయాంతరమున నాతనిఁ దప్పించుకొనఁ గోరి "మునిచంద్రా! నీవంటి యుత్తమబ్రాహ్మణుఁడు జామాత యగుకంటె నాకు వలసిన దేమున్నది? ఐనను నీవు చంద్రధవళము లగు నంగములును మేఘశ్యామలములగు కర్ణములును గల వేయిగుఱ్ఱములఁ గన్యాశుల్కముగా నిచ్చినచో నీకు సత్యవతి నిచ్చి వివాహము చేయుదు" ననెను. ఋచీకుఁడు వల్లెయని యెల్లెడలఁ దిరిగి భూమీధవులయెడ నెచ్చట నట్టి యశ్వములఁ గానఁ జాలక వరుణుని కడ కేగి యర్థించి యట్టి హయములను దోడ్కొనివచ్చెను. గాధి యిఁక తప్పనిసరి యనియు సంతటి తపోధనుఁ డల్లుఁడగుట భాగ్యమనియు నెంచి సత్యవతీఋచీకులకు దివ్యవైభవముతో వివాహ మొనరించెను.

పిమ్మట సతీసహితుఁడై ఋచీకుఁ డాశ్రమమున కరిగి పరమపతివ్రత యగు సత్యవతితో గృహస్థధర్మములు నిర్వహించుచు సకలజనప్రియుఁడై చిరకాల ముండెను. ఒకప్పుడు భృగుమహర్షి వచ్చి

జ్ఞానోపదేశము చేసి గృహస్థాశ్రమము వీడఁ బ్రబోధించెను. అంత నాతఁడు భార్యను బిలిచి యొక వరముఁ గోరుకొను మనెను. ఆమె భక్తియుక్తులతోఁ దన కొక పుత్త్రు నిమ్మనియుఁ బుత్త్రహీన యగు తల్లికి నొక సుతుఁ డుదయింపఁ నాశీర్వదింపుఁడనియుఁ గోరుకొనెను. ఋచీకుఁ డట్లే యని బ్రహ్మరాజమంత్రముల వేల్చి రెండు చరువులను జేసి భార్యకుఁజూపి "సాధ్వీ! నీ కోరిక నెఱవేఱఁగలదు. ఇందు మొదటిచరువు నీ వుపయోగించి రెండవదానిని మీయమ్మ కిమ్ము. నీకు బ్రహ్మర్షి మీ యమ్మకు రాజశ్రేష్ఠుఁడు జన్మించు" నని చెప్పి స్నానార్థ మేగెను.

ఇంతలో సుతామాతలఁ జూడ గాధి భార్యాసహితుఁడై ఋచీకాశ్రమమునకు వచ్చెను. సత్యవతి తల్లిని గౌఁగిలించుకొని యా చరు వృత్తాంతములు దెల్పెను. దైవవశమున నా చరువులు తాఱుమాఱుగ నిరువురు గ్రహించిరి. పిమ్మట ఋచీకుఁడు వచ్చి చరుసంగతిఁ దెలిసికొని సత్యవతికి క్రూరుఁడగు రాజు పుట్టుననియు, నామె తల్లికి బ్రహ్మర్షి కలుగుననియుఁ బలికెను. సత్యవతి విచారగ్రస్తయై పతిని వేఁడుకొనఁగా నాతఁడు కరుణించి యామె పుత్త్రుడుగాక పౌత్త్రుఁడు క్రూరహృదయుఁడై క్షత్త్రియరక్తముఁ గ్రోలువాఁ డగునని తెలిపెను. కాలక్రమమున సత్యవతికి జమదగ్ని జనించెను. గాధి భార్యకు విశ్వామిత్త్రుఁడు జన్మించెను.*

ఈ రీతి జనించిన విశ్వామిత్త్రుఁడు బాల్యమునుండియు సమస్త రాజ్యభోగము లనుభవించుచు నల్లారు ముద్దుగాఁ బెరుగుచుండెను. యుక్తకాలమున గాధి పుత్త్రున కుపనయనాదిక మొనర్చి కృశాశ్వుని కడ నస్త్రవిద్యార్థిగాఁ జేర్పించెను. విశ్వామిత్త్రుఁ డా గురునికడఁ బరమభక్తియుక్తి ననేకాస్త్రశస్త్ర ప్రయోగముల నేర్చి త్వరలో గొప్పవిలుకా

* విష్ణుపురాణము, భారతము, ఆదిపర్వము, అనుశాసనికపర్వము.

నయ్యెను. కాలక్రమమున గాధి పంచప్రాణములు విశ్వామిత్రునిగాఁ జూచుకొనుచుండి స్వర్గస్థుఁడయ్యెను. అంత మంత్రి సామంత పురోహితు లెల్లరు యువకుఁడు, శస్త్రవిద్యాపారంగతుఁడు, వినయవినమితుఁడు, బుద్ధిశాలి యగు విశ్వామిత్రునకుఁ గన్యాకుబ్జమునఁ బట్టాభిషేక మొనరించిరి. నాఁటినుండి విశ్వామిత్రుఁడు ధర్మసహితబుద్ధియై ప్రజారంజకముగాఁ బాలింపఁ దొడఁగెను. ప్రజ లాధివ్యాధిబాధలు లేక ధర్మప్రభువగు గాధి తనయుఁడే చిరకాలము రాజ్య మేలవలెనని కోరుకొనుచుండిరి.

ఈ ప్రకారము విశ్వామిత్రుఁడు బహు సహస్రవర్షములు రాజ్య మేలుచు నొకనాఁడు వేటకై చమూసమేతుఁడై యరణ్యమున సంచరించుచు దన్స సమీపమునఁ గల వసిష్ఠబ్రహ్మర్షి యాశ్రమమునుజేరి యాతనికి సాష్టాంగనమస్కారము లొనరించెను. వసిష్ఠుఁ డానంద భరితుఁడై యథోచితముగ నతనికి సపర్య లొనరించి యోగక్షేమము లరసి యలసియున్న కతమున ససైన్యముగఁ దన యాతిథ్య మంగీకరింపుమని కోరెను. విశ్వామిత్రుఁ డాతని మాట కాదనఁజాలక సమ్మతించెను. కాని, పేదబాపఁడగు వసిష్ఠుఁ డెట్లు విందు చేయఁగలఁడని యాతఁడు సంశయించెను.

అంత వసిష్ఠుఁడు తన నందినీధేనువుఁ బిలిచి "యమ్మా! కౌశిక మహారాజు ససైన్యముగ మన కతిథియైనాఁడు. నీ మహిమ తెలుపద నెల్లవస్తువులు త్రుటిలో సిద్ధ మొనరింపు"మని కోరెను. వెంటనే నారభేయి షడ్రస సమన్వితములుగా స్వాదుసంగతములుగాఁ బరిపాక భేదములతో రుచ్యములగు నెల్లపదార్థములను సమృద్ధిగాఁ గురిసెను. పిమ్మట వసిష్ఠుఁడు గాధిపుత్రునిఁ బిలిచి విందారగింపు మనెను. అతఁడు చమూయుక్తుఁడై యద్భుతచిత్తమున నెల్లపదార్థములను గడుపార భుజించి సంతుష్టచిత్తుఁడై వసిష్ఠుని యాదరమును నుతించెను.

## విశ్వామిత్ర వసిష్ఠుల ఘోరయుద్ధము :

కాని, వసిష్ఠుని మహాసంపదకు హేతుభూతమైన యా నందిని ధేనువును దాను గ్రహింప విశ్వామిత్రునకుఁ గోరిక కలిగెను. ఆ కారణమున ననేకము లగు దంతి హయ రథ గో సమూహము లొసఁగుదును. తనకుఁ గామధేనువు నిమ్మని వసిష్ఠు నడిగెను. కాని యాతఁ డెంత వేఁడుకొనిన నంగీకరింపఁ డాయెను. తుదకు విశ్వామిత్రునకుఁ గ్రాణము విసిగి యహంకారమున నా శబళను బలాత్కారముగాఁ దోలుకొని ససైన్యుఁడై పోఁజొచ్చెను. కాని నందిని తప్పించుకొని వసిష్ఠు పాలికేగి యాతని యనుమతిని నిజదేహమునుండి యనేకాక్షౌహిణుల సైన్యమును బుట్టించెను. ఆ సైన్యమునకు విశ్వామిత్రుని సైన్యమునకు ఘోరయుద్ధము జరిగెను. అందుఁ దన సేన ఛిన్నాభిన్నమగుటఁ గాంచి యా వసిష్ఠునిఁ బుట్టిన నిజసుతులెల్ల రాతని దివ్య ప్రభావమున హతులగుటయుఁ గాంచిన విశ్వామిత్రుఁడు వ్రీడితుఁడై నిర్వేగ మగు సముద్రము చందమున, భగ్నదంష్ట్ర మగు భుజంగము లైవడి, నుపరక్తుఁడగు భాస్కరుని రీతిఁ, బరమ నిర్వేదనపరుఁడై పురమున కేగి యుదారుఁడగు కొమారు నొకనిఁ బుడమికి రాజుఁ జేసి, తాను హిమశైలమున కేగి యీశ్వరుని గుఱించి తప మొనర్పఁదొడఁగెను.

కొంతకాలమునకు శివుఁడు ప్రత్యక్షమై వరము వేఁడు కొనుమనఁగా, విశ్వామిత్రుఁడు శంకరధనుర్విద్యా రహస్యము, యక్షపతంగోరగసిద్ధచారణాదుల శస్త్రాస్త్రములు సాంగముగా నుపదేశింపుమని కోరుకొనెను. ఈశ్వరుఁడు కరుణించి విశ్వామిత్రుఁడు కోరిన రీతి నొనర్చి యదృశ్యుఁ డయ్యెను.

అంత విశ్వామిత్రుఁ డధికదోర్వీర్యుఁడై తిరిగి వసిష్ఠాశ్రమమున కేతెంచి యాతని యాశ్రమమును బాణాగ్నిచే దగ్ధమొనరింపఁ దొడఁగెను. అంత వసిష్ఠుఁడు తన బ్రహ్మదండమున నాతని కెదురై

యుద్ధసన్నద్ధుఁడయ్యెను. ఇదే తరుణమని విశ్వామిత్త్రుఁడు తా నేర్చిన శస్త్రాస్త్రముల నెల్ల వసిష్ఠునిపై ప్రయోగింప నాతఁ డన్నిటిని దన బ్రహ్మతేజోబలమున బ్రహ్మదండమున కెఱచేసెను. విశ్వామిత్త్రుఁడు తుదకుఁ బ్రయోగించిన బ్రహ్మాస్త్రమును వసిష్ఠుఁడు మ్రింగి వైచి మహోగ్రతేజస్సంపన్నుఁ డయ్యెను.

## విశ్వామిత్త్రుఁడు రాజర్షి యగుట:

దానితో విశ్వామిత్త్రుఁడు పరాభవము నొంది బ్రహ్మతేజోబలమే బలము. కాని క్షత్త్రియబలము క్షుద్ర మని నిశ్చయించి తపోనవద్య తచే బ్రహ్మత్వము నందెదఁ గా కని కృతనిశ్చయుఁడై భార్యతోఁగూడ దక్షిణదిశకుఁ బోయెను. అందొక ప్రదేశమున నొక్క తపోవనమున నిలిచి ఫలమూలాశనుఁడై మానసేంద్రియములను జయించి ఘోర తపము చేయుచుండియే హవిష్యంద, మధుష్యంద, దృఢనేత్ర, మహారథు లను సత్యధర్మపరాయణు లగు నల్వురుపుత్త్రులఁ గనెను. అంత మహానిష్ఠాగరిష్ఠుఁడై విరించిని గుఱించి తప మొనరింపఁ జొచ్చెను. కొంతకాలమునకు బ్రహ్మ ప్రత్యక్షమై విశ్వామిత్త్రునకు రాజర్షిత్వ మొసఁగి యదృశ్యుఁ డయ్యెను. విశ్వామిత్త్రుఁ డంత సంతృప్తినందక బ్రహ్మర్షిత్వమును గోరి తిరిగి యఖండ తప మొనరింపఁ దొడఁగెను.

## విశ్వామిత్త్రుఁడు త్రిశంకునకు స్వర్గము సృష్టించుట:

ఈ సమయమున నిక్ష్వాకువంశజుఁడగు త్రిశంకుఁ డను రాజు బొందితోఁ గైలాసమున కేగు జన్నము నొనరింపఁగల గురు వగు వసిష్ఠునిఁ గోరి విఫలమనోరథుఁడై, వసిష్ఠసుతుల నట్లే కోరి వారును నిరాకరింప, వారిని దూఱి చండాలుఁడుగా వారిచే శపింపఁబడి విశ్వామిత్త్రుని పాలి కరుదెంచెను. వసిష్ఠద్వేషి యగు విశ్వామిత్త్రుఁడు త్రిశంకుని వృత్తాంత మంతయు విని యట్టి యాగమును దా నొనరింతునని యూఱడించెను.

పిమ్మట విశ్వామిత్త్రుఁడు యజ్ఞసంభారములఁగూర్పఁ బుత్త్రుల నియోగించి బ్రహ్మవాదులు బహుశ్రుతులునగు మహర్షుల శిష్యులచేఁ బిలిపించి యజ్ఞ మారంభించెను. తన్ను నిందించిన వసిష్ఠపుత్త్రులను సప్తశత జన్మముల నీచజాతులఁ బుట్టి నిర్ఘృణులై, వికృతులై, విరూపులై మృత శునకమాంసభక్షకులై వర్తింపఁ దీవ్రశాప మొసఁగి విశ్వామిత్త్రుఁడు త్రిశంకుని ముందిడుకొని యజ్ఞ మొనరింపఁ ఋషులఁ బురికొల్పెను. విశ్వామిత్త్రుని ప్రచండకోపమునకు వెఱచి మును లెల్లరుఁ గిక్కురు మనక కల్పోక్తప్రకారమున సర్వకర్మములు నిర్వర్తించిరి. అంత విశ్వామిత్త్రుఁడు హవిర్భాగముఁగొన దేవతల నాహ్వానింప వారు రాకపోవుటచేఁ గుశపవిత్రము కేలఁ దనర స్రువ మెత్తుకొని త్రిశంకుని తన శక్తిచే స్వర్గమునకు స్వశరీరముతోఁ బంపెను. అటఁ బురందరుఁడు బృందారకులతో నాలోచించి చండాలుఁడు స్వర్గమున నుండరా దని యాతనిఁ దలక్రిందుగాఁ ద్రోయించెను. అపుడు త్రిశంకుఁడు "విశ్వామిత్త్రా! రక్ష! రక్ష!" యను విలాపములతోఁ బ్రలాపములతో వచ్చుచుండ గాధేయుఁడు కరుణాళుఁడై తీవ్రరోషమున సాక్షాత్ప్రజాపతివలెఁ దన తపఃప్రభావమును ఋషు లెల్లరుఁ జూడ నన్యస్వర్గమును త్రిశంకునకై నిర్మించెను. మఱియు నట వేఱె నక్షత్రములను సప్తర్షులను సురలను నింద్రుని సృజించెను. ఇది చూచి సుర గరుడ కిన్నర గంధర్వాదు లొక్కపెట్టునఁ గౌశికునిఁ జేరి యభినందించిరి. విశ్వామిత్త్రుఁడు త్రిశంకునకు శాశ్వతమైన దివ్యస్థాన మొసఁగి కృతకృత్యుఁడైనపిదపఁ బశ్చిమదిశ కేగి యందుఁ బుష్కరతీరమునఁ బవనపర్ణాంబుభక్షుఁడై బ్రహ్మర్షిత్వమునకుఁ దపముఁ బ్రారంభించెను.

### విశ్వామిత్త్రుఁడు శునశ్శేపునిఁ గాపాడుట:

ఆ సమయమునఁ గోసలాధిపుఁ డగు నంబరీషుఁడు యజ్ఞ మొనరించుచుండ నింద్రుఁ డసూయాపరుఁడై యజ్ఞపశువును గొని

పోయి దాఁచియుంచెను. అంతఁ బురోహితులు యజ్ఞవిఘ్నము కలుగకుండ నరపశువును విశసింపవచ్చు నని నుడివిరి. అది విని యంబరీషుఁ డొక లక్షగోవులఁ గొని వానిని గైకొని యెవఁడైన, దనయజ్ఞమునఁ బశు వగుట కిచ్చగించునేమో యని తిరుగుచు ఋచీకుఁడను విప్రునిఁ జేరి యాతని సుతుఁడగు శునశ్శేపునిఁ గొని యా గోవుల ఋచీకున కొసఁగి నగరమునకుఁ గొనివచ్చుచుండెను. శునశ్శేపుఁడు దారిలో నెదురైన కౌశికుని రక్షింపు మని ప్రార్థించెను. విశ్వామిత్రుఁడు తన కొడుకులఁ గని మీలో నొకఁడు శునశ్శేపునకు బదులు పశువై యాతని రక్షింపుఁడని కోరెను. కాని, వారు ప్రాణ విసర్జనమున కంగీకరింపక తండ్రి యాన నతిక్రమింప, విశ్వామిత్రుఁడు కోపించి నిర్మములై పుత్త్రుల శపించి శునశ్శేపునిఁ గరుణింప నిరామయమగునట్లు రక్ష యొసఁగి రెండు మంత్రము లాతనికి బోధించి “నిన్ను విశసించుతరుణమునఁ బఠింపు”మని బోధించెను. ఆ ప్రకారమాతఁ డంబరీషునితోఁ బోయి తన్నుఁ బశువుగా వ్రేయు తఱి నా మంత్రములు పఠింప నింద్రాదులు ప్రత్యక్షమై శునశ్శేపునకు బంధ విముక్తి, దీర్ఘాయుష్యమును, నంబరీషునకు బహు యాగఫలము నొసంగి యదృశ్యులైరి. ఆ ప్రకారము కౌశికుని కతమునఁ బ్రతికి శునశ్శేపుఁ డింటి కేగెను.

## విశ్వామిత్రుఁడు ఋషిత్వ, మహర్షిత్వ, బ్రహ్మర్షిత్వముల నందుట:

పిమ్మట విశ్వామిత్రుఁడు పుష్కరనదీతీరమున సహస్రవర్షము లత్యుగ్ర తప మొనరించి బ్రహ్మను మెప్పించి ఋషిత్వము నందెను. ఐన నంతతోఁ దనివినొంద కాతఁడు మహానిష్ఠఁ దపించుచుండెను. ఆ సమయమున నాతని తపోవిఘ్న మొనరింప నింద్రునిచేఁ బంపఁబడి మేనక విశ్వామిత్రాశ్రమమున కరుదెంచి విశ్వామిత్రుని మరులు గొల్పెను. ఆతఁ డామె వలలోఁ బడి కొన్నివత్సరము లామెతోఁ గ్రీడిం

దెను. అంత మేనక గర్భము ధరించి శకుంతలను గనెను. తరువాత విశ్వామిత్త్రుఁడు వివేకియై మేనకమూలమునఁ దన తపోభంగమైనందులకు విచారించి యామెను వీడి మరల ఘోరతప మారంభించెను. మేనకయు నింక లాభము లేదని పుత్త్రి నటు వీడి స్వర్లోకమున కేగెను. ఈమెకు జనించిన యా బాలిక తలిదండ్రులచే విడువఁబడి శకుంతములచేఁ బోషింపఁబడుచుండ దయాళుఁ డగు కణ్వమహర్షి గాంచి యా బాలికను దోఁకొనిపోయి నిజాశ్రమమునఁ బెంచుచుండెను. ఈమెయే దుష్యంతుని భార్యయై భరతచక్రవర్తిని గనెను.

అంత విశ్వామిత్త్రుఁడు కామవిజయముఁ గాంతు నని హిమాలయ ప్రాంతమున కేగి మఱి సహస్రవర్షములు తప మొనరించెను. అతని తపోనలమునకు వెఱఁగంది వేల్పు లెల్లరు బ్రహ్మకడ కేగి విశ్వామిత్త్రుని కోరిక తీరనిచో లోకములు నిలువనేరవని మొఱలిడిరి. బ్రహ్మ వారి కభయ మిచ్చి విశ్వామిత్త్రుని కడ కరిగి "మునీంద్రా! నీ తపమునకు సంతసించి నీకు మహర్షిత్వ మొసఁగితిని. ఇఁకఁ దపము చాలింపు" మని చెప్పి యదృశ్యుఁ డయ్యెను.

విశ్వామిత్త్రుఁడు బ్రహ్మర్షిపద మందిన గాని తపము చాలింపనని కృతనిశ్చయుఁడు బద్ధకంకణుఁడునై యూర్పులఁ గట్టిపెట్టి యూర్ధ్వహస్తుఁడు మారుతాశనుఁడునై ధీరత్వనిష్ఠ మహోగ్రతప మొనరించెను. ఈ పరి రంభ నాతిని తపోవిఘ్నమునకై యింద్రుఁడు పంపెను. ఆమె యతిభయస్వాంత యయ్యు నింద్రునియానఁ దిరస్కరింపలేక విశ్వామిత్త్రునిఁ జేరి నృత్యగానాదు లొనరింపఁ దొడఁగెను. విశ్వామిత్త్రుఁ డొక్కపరి గన్ను తెఱచి రంభను జూచి నిర్మోహుఁడై పదివేలవర్షములు ఱాయివై యిటనే పడియుండు మని శపించెను. అంత రంభ పాదములపైఁ బడి కరుణింప వేఁడుకొన వసిష్ఠునివలన శాపమోక్ష మగు నని యనుగ్రహించెను. విశ్వామిత్త్రుఁ డటనుండి

తూర్పుదిక్కునకుఁ బోయి నిష్ఠురప్రతిజ్ఞాదీక్షితుఁడై యచంచలముగఁ బెక్కేండ్లు తప మొనరించెను. అతఁడు తప మొనరించిన యీ ప్రదేశమే 'సిద్ధాశ్రమ' మనఁ బరగెను.

ఒకనాఁ డింద్రుఁడు విశ్వామిత్రునకుఁ గ్రోధము పుట్టించు నుద్దేశముతో వృద్ధవిప్రుఁడై యాతని యాశ్రమమున కరుదెంచి విఫల మనోరథుఁడై వెడలిపోయెను. విశ్వామిత్రుని తపోనవద్యతచే నాతని శిరమునుండి యద్భుతధూమము లుద్భవించి దశదిశలను భూనభోంతరములందు వ్యాపింపఁ జొచ్చెను. అంత దేవత లెల్లరు బ్రహ్మపాలి కరిగి మొఱపెట్టుకొనఁ జొచ్చిరి. బ్రహ్మ హంస వాహనారూఢుఁడై విశ్వామిత్రుని పాలి కేగి బ్రహ్మర్షిత్వము, దీర్ఘాయువు, బ్రహ్మతేజము నొసఁగి సత్కరించెను. విశ్వామిత్రుఁ డంత నోంకారము, వషట్కారము వేదములుఁ దన్నుఁ బొందుఁ గాక యని కోరఁగా నవి సిద్ధించెను. ఐనను వసిష్ఠుఁడు తన బ్రహ్మర్షిత్వ మంగీకరించినఁ గాని తృప్తినంద నని విశ్వామిత్రుఁడు వసిష్ఠుని పాలి కేగెను. వసిష్ఠుఁ "డోయి రాజా! యేల యిట్లరుదెంచితివి?" అని పలుకఁ గౌశికుఁడు కోపించి వెడలిపోయెను. తిరిగి కొంతకాలమున కాతఁడు వసిష్ఠుని కడ కరుగ "ఓయి ఋషీ! ర"మ్మని యాతఁ డనెను. విశ్వామిత్రుఁడు మారుమాటాడక వెడలిపోయి కొంతకాలము తప మొనర్చి మరల వచ్చెను. అంత అరుంధతీవల్లభుఁడు "రాజర్షీ! ర"మ్మని పిలిచెను. ఇపుడును గించిత్కోపపరీభూతుఁడై వెడలిపోయి యాత్మశోధన మొనరించుకొని మరల వసిష్ఠుని కడ కేగి ప్రణమిల్లెను. అతఁ "డోరీ! ధూర్తా! పో"మ్మనెను. విశ్వామిత్రుఁ డావంతయుఁ గోపపడక చలింపక వసిష్ఠుని పాదపద్మముల వీడకుండెను. అపుడు వసిష్ఠుఁడు విశ్వామిత్రుని గ్రుచ్చి కౌఁగిలించుకొని, "ఓయీ! బ్రహ్మర్షీ! లె"మ్మనఁగా విశ్వామిత్రుఁడు దివ్యతేజస్వియై లేచెను. విశ్వామిత్రుఁడు వసిష్ఠు ననేక విధములఁ బూజించి బ్రహ్మతేజమున దిశలు వెలిఁగించుచు దివ్యతపః

ప్రభావవిశేషమున బ్రహ్మర్షులలో నొకఁడై విశ్రుతిఁ గని యాతని వీడుకొని వెడలిపోయెను.*

## విశ్వామిత్రుఁడు విశ్వేదేవతల శపించుట :

విశ్వామిత్రుఁడు హరిశ్చంద్రుని రాజ్యముఁ గొని యాతనిని, జంద్రమతిని నగరముఁ వెడలఁగొట్టి చంద్రమతిని జేతికఱ్ఱతోఁ జావ మోదెను. విశ్వామిత్రుని యీ కటికతనముఁ జూచి హరిశ్చంద్రునిపై జాలిగొన్న విశ్వేదేవత లటకు విచ్చేసి విశ్వామిత్రుని నిందించిరి. అపుడు విశ్వామిత్రుఁడు వారిఁ గాంచి "ఓ దేవతలారా! మనుష్యపక్ష పాతమున ఋషినైన నన్ను నిందించితిరి, కావున మీరు మనుష్యులై భూమిపైఁ జరింతురు గాక" అని శాపమిచ్చెను. పిదప, వారిని గరు ణించి "మీరు భూమిపై సంతానము నిలుపరాదు. కావున బ్రహ్మ చారులై కామక్రోధాదు లందక యల్పకాలమున శరీరములు విడచి దేవభావముఁ గైకొందు" రని పలికెను. ఆ శాపమున విశ్వేదేవత లైదుగురు ద్రౌపది గర్భమునఁ బంచపాండవులకుఁ గుమారులై పుట్టి పెండ్లిండ్లులేక దీర్ఘాయుష్కులు గాక చచ్చి స్వర్గమున కేగిరి.•

## విశ్వామిత్రుఁ డొనరించు యాపద్ధర్మములు :

విశ్వామిత్రమహర్షి యనేక పర్యాయము లనేకములగు నాప ద్ధర్మములు నిర్వర్తింపవలసి వచ్చెను. అతఁడు నిజతపోబలమున నాపత్తు లన్నియు దాటఁగలిగియుఁ దపోవిత్తము వ్యయింప నొల్లక భద్రముగాఁ గాపాడుకొనువాఁడు. అదియే మన మహర్షుల గొప్ప తనము. "అంతటి మహర్షులకుఁ గూడ నాఁగతి పట్టుటకు వారి తప స్సేమైనది? వారును మనవంటివారేనా?" యను ప్రశ్నము లజ్ఞాన సంజనితములు. భౌతికదేహముఁ గ్రహింపఁజేయుచు దేహధర్మముల

---

* శ్రీమద్రామాయణము, బాలకాండము.

• మార్కండేయపురాణము.

వలని సుఖదుఃఖము లంటకుండఁ జేసికొనుటయే తపము. దేహి
దేహముల విభజించి దేహముండియు నుండనట్టి యెఱుకఁ జరించు
మహర్షులు దేహాభిమానులై-యనిత్యము హేయమునగు దేహమునకై
బహుజన్మలబ్ధమగు తపస్సంపద వ్యయింపఁజాల రనుటలో నాశ్చర్య
మే మున్నది? సుఖదుఃఖములు ప్రారబ్ధానుసారముగ దేహసంబంధ
ములే కాని యాత్మసంబంధములు కావనియుఁ దాను దేహము కాక
యాత్మస్వరూపుఁడని యెఱింగి తన్నుపాసించుకొను మహర్షికి,
దేహసంబంధమగు బాంధవ్య ముండదు కదా! కావుననే యొక క్షామ
సమయమున విశ్వామిత్త్రుఁడు కొడుకును విక్రయింపఁ జూచినాఁడు.
అది యవసరము లేకయే సత్యవ్రతుఁ డను రాజు కౌశికుని కాహారా
దిక మొసఁగి పోషించినాఁడు. మఱియొకప్పుడు తపోధనము కూడఁ
బెట్టుటకు సాధనమైన శరీరపోషణమునకై యాతఁడు క్షామసమయ
మునఁ గుక్కమాంసమును దిని శరీరమును బోషించుకొనవలసివచ్చి
నది. ఈపట్ల "శరీర మాద్యం ఖలు ధర్మసాధన"మ్మను సూత్ర మను
వర్తించినది. ఈ విషయమై విశ్వామిత్త్రుఁడు "బ్రహ్మవహ్ని ప్రాపై
యుండఁ బ్రాణము కాపాడుకొనవలెను. బ్రదికియున్నఁ దపముచేతను
జ్ఞానముచేతను దోషమును బాపుకొనవచ్చును. చచ్చినచో జీవితము
వ్యర్థ మగును. కాన, నాకీ మాంస మిమ్మ"ని చండాలు నర్థించుచుఁ
బలికినాఁడు. ఆ ప్రకార మాతఁడు ప్రాణములు రక్షించుకొని పిమ్మట
తపోవిశేషమునఁ బాపముఁ బాపుకొనెను.*

**విశ్వామిత్త్రుఁడు హరిశ్చంద్రుని బరీక్షించి కరుణించుట :**

విశ్వామిత్త్రమహర్షి కరుణించెనా తృణమునైనను మేరువుఁ
జేయఁగలఁడు. కోపించెనా మేరువునైనను దృణమును జేయఁగలఁడు
త్రిశంకునిఁ గటాక్షించి స్వర్లోకమును సృష్టించి యట నిలుపఁ గలి
గెను. శునశ్శేపునిఁ గరుణించి దీర్ఘాయువు నొసఁగి మృత్యుముఖము

* భారతము, శాంతిపర్వము.

నుండి కాపాడెను. ఇతఁడు కోపించి పలుబాములఁ బెట్టినది వసిష్ఠు నొకనిని హరిశ్చంద్రు నొకనిని. ఇరువురును మహానుభావు లగుట నిరువుర విషయమునను విశ్వామిత్రుఁడే యోడిపోయెను. ఐనను, వారి కీర్తిచంద్రికలు విశ్వవ్యాప్త మగుట కితఁడే కారణభూతుఁ డాయెను. విశ్వామిత్రుఁడే లేనిచో హరిశ్చంద్రుని యూరుపేరు లుండక పోయెడి వనుటలో నాశ్చర్యము లేదు. ఈ దృష్టిని దర్శించినచో విశ్వామిత్రుని ప్రాశస్త్యము తెల్లము కాఁగలదు.

తొల్లి యొకప్పు డింద్రుఁడు ఋషులతో సభదీరి యుండఁగా భూలోకమున నిత్యసత్యవ్రతు లెవరున్నా రను ప్రశ్నము వచ్చెను. మును లనేకు లూరకుండిరి. ఇక్ష్వాకువంశజుఁ డగు హరిశ్చంద్రుఁడు కలఁ డని వసిష్ఠుఁ డనెను. అతఁడు కాఁడని విశ్వామిత్రుఁ డనెను. అంత నుభయులకు వాద మయ్యెను. విశ్వామిత్రుఁడు హరిశ్చంద్రు నిచే నసత్య మాడింతునని ప్రతిజ్ఞపూని వెడలిపోయెను. తరుణము వేచి విశ్వామిత్రుఁడు హరిశ్చంద్రుని రాజ్యము, ధనము దానవ్యాజమున గ్రహించి యాతనిని నగరమునుండి వెడలఁ ద్రోయించెను. హరిశ్చంద్రుఁడు భార్యాపుత్రుల నమ్ముకొనియుఁ దుదకుఁ ద న్నమ్ముకొని కాటికాపరియై మెలఁగియు బలుబాములఁ గుడిచియు నసత్య మెన్నఁ డాడని కారణమున బ్రహ్మాదు లాతనికిఁ బ్రత్యక్షమై పూర్వరాజ్యము, బహువరములు నొసఁగిరి. విశ్వామిత్రుఁ డాతనిఁ బరీక్షించుటకు నాతని కీర్తి దిగంత విశ్రాంతముగ వ్యాపింపఁ జేయుటకు నట్లొనర్చితి నని యాతనిఁ గీర్తించి వరము లొసఁగి కరుణించెను.*

## విశ్వామిత్రుఁడు రామలక్ష్మణుల కీర్తిచంద్రికల వ్యాపింపఁ జేయుట :

విశ్వామిత్రమహర్షి నిజాశ్రమమున జన్నముచేయుచు హోమము లొనరించుచుండ మారీచ, సుబాహులు, తాటక మున్నగు రాక్షసులు

---

* మార్కండేయపురాణము.

విఘ్నము లొనరించుచుండిరి. వారి వినాశమునకు నిజతపోధన వ్యయ మొల్లక యయోధ్య కేగి రామలక్ష్మణులఁ దనతోఁ బంపుమని కౌశికుఁడు దశరథు నడిగెను. అతఁడు సంశయింప రామలక్ష్మణులు విష్ణుమూర్తి యవతారములుఁ గారణజన్ములు నని చెప్పి దశరథు నంగీకరింపఁజేసి వారి నాతఁడు తీసికొనిపోయెను. దారిలో శ్రీరామలక్ష్మణులకు బహువిధాస్త్ర శస్త్రప్రయోగములు సాంగముగా నేర్పి వారిచే యజ్ఞధ్వంసకు లగు మారీచాదిరాక్షసుల నితఁడే చంపించెను. శ్రీరాముని పాదరజమున నహల్యాశాపమోక్షము కాఁగాఁ; విశ్వామిత్రుఁ డామె వృత్తాంతము నంతను రామలక్ష్మణులకుఁ దెలిపెను. అట వా రిరువురకుఁ బలుతావులఁ జూపుచుఁ జిత్ర చరిత్రములఁ దెల్పుచు వారి నస్త్రవిద్యాకుశలులను సద్గుణనిధులను నొనర్చెను. పిమ్మట శ్రీరామలక్ష్మణుల నిరువురను మిథిలాపురము తీసికొని వెళ్ళి జనకునింట శివధనుర్భంగముకతమున సీతారాముల వివాహమే కాక లక్ష్మణ భరత శత్రుఘ్నులకు నూర్మిళా మాండవీ శ్రుతకీర్తుల నిప్పించి వివాహ మొనరింపఁజేసెను. ఈ ప్రకారము బాల్యముననే శ్రీరామలక్ష్మణులకారణజన్మ మెఱిఁగి వారి కస్త్రవిద్యాగురుఁడై వారి కీర్తి చంద్రికలు వ్యాపించుటకు విశ్వామిత్రుఁడే కారణభూతుఁడయ్యెను.*

## విశ్వామిత్ర స్మృతి :

విశ్వరూపాదులు విశ్వామిత్రుని స్మృతికర్తగాఁ బేర్కొనిరి. అపరార్కమున, స్మృతిచంద్రికయందు, కాలవివేకమున విశ్వామిత్ర స్మృతినుండి కొన్ని యుదాహృత శ్లోకములు కలవు. ఒక్క వ్యవహార విషయమునఁ దక్క నితర విషయము లన్నిటి పైని విశ్వామిత్రుని భావము లిందుఁ గాననగును. వేదవిదులైన యార్యులచేఁ నాచరింపఁ

* శ్రీమద్రామాయణము - బాలకాండము.

బడి ప్రశంసింపఁబడినదే ధర్మము అని యాతఁడు పేర్కొనెను.* మహాపాతకములను పేర్కొన్న విశ్వామిత్రుని శ్లోకములు చాలమంది పఠింతురు.• విశ్వామిత్రస్మృతి యనుపేరఁ దొమ్మిదధ్యాయములలో శ్లోకరూపమున నొక స్మృతి గలదని చెన్నపురి దొరతనమువారు ప్రకటించిన అముద్రితగ్రంథముల పట్టికలోఁ గలదు. ఇదియు నదియు నొక్కటియై యుండవచ్చును.

స్పర్ధ చేతను బ్రహ్మర్షి పదవిఁగాంచి
బ్రహ్మ సృష్టికిఁ బ్రతిసృష్టి వరగఁజేసి
చండశాసనుఁ డనఁగఁ బ్రశస్తిగనిన
కౌశికమహర్షి సప్తర్షి గణముఁ జేరె.

---

* యమార్యాః క్రియమాణం తు శంసంత్యాగమవేదినః,
న ధర్మో యం విగర్హంతి త మధర్మం ప్రచక్షతే."

(స్మృతిచంద్రిక - ఆహ్నిక. ౬ పుట)

• బ్రాహ్మణో న చ హంతవ్యః
 సురా పేయా న చ ద్విజైః
బ్రాహ్మణస్వర్ణ హరణం
 న కర్తవ్యం కదాచన,
గురుపత్నీం న గచ్ఛేచ్చ
 సంసర్గీ తైశ్చ నాచరేత్
మహాపాతక సంజ్ఞా తు
 నిర్దిష్టైషా మనీషిభిః.

(అపరార్కము - పుట ౧౦౪౪)

* * *

# మహర్షుల చరిత్రలు

## వ్యాసమహర్షి

### వ్యాసుని పూర్వజన్మము:

ఆదికాలమునఁ బ్రజాభిసర్గమునకు నారాయణుఁడు దన నాభికమలమున బ్రహ్మను బుట్టింప నాతఁడు భూతసంఘముల సృజించెను. అతని ముఖమున విష్ణుఁ డఖిలవేదముల బ్రసరింపఁ జేసి కరుణించెను. విరించికి మేలు చేయఁగోరి శ్రీహరి మానసమునుండి యపాంతరతముఁ డనువానిఁ బుట్టించి యాతఁ డతిభక్తిఁ దనకు మ్రొక్కి నిలువ "వత్సా! నీవు శ్రుతు లన్నియు దృఢావధానివై విని చక్కఁగ వ్యాస మొనరింపు" మని యాజ్ఞాపించెను. అపాంతరతముఁ డాతని యానతిఁ గొని వేదభేదన మొనర్చెను. నారాయణుఁ డానందించి వేదవ్యాస నామమున నతనిఁ బిల్చి "కుఱ్ఱా! నీ వన్ని మన్వంతరము లందును బుట్టి వేదవ్యాసమున నా కానంద మొదవించుచుండుము. నా చరిత మెఱిఁగి త్రైలోక్యాచారములు, నఖిలధర్మములు గ్రహించి త్రికాలజ్ఞులగు మునీశ్వరులలో మేటివై వెలుఁగఁగలవు. ని వుత్తరకాలమున వసిష్ఠపౌత్త్రుఁ డగు పరాశరుఁడను సంయమి తిలకున కుదయించి, నీవలన జనించిన కురురాజులు పరస్పరవైరమున మడియఁగాఁ గాల దుఃస్థితిని గలఁగిన వేదముల నేర్పఱించి వ్యాస మొనరింపఁ గలవు. జగముల జనించి ధర్మసందేహముల నెల్లఁ బాపి లోకహితవాణివై సుశ్లోకుఁడ వగుదు" వని నిర్దేశించి నిజేచ్ఛం బ్రవర్తింపుమని పంపివేసెను.

అంతనుండి యుపాంతరతముఁడు నియమ నిరూఢి నిర్మల తః కలనముఁ జిరకాల మాచరించి నిరంతరాయమానమగు పురుషోత్త ముని కారుణ్యము నధికముగా సంపాదించెను.*

## వ్యాసమహర్షి కృష్ణద్వైపాయనుఁ డనఁబుట్టుట:

తొల్లి యొకప్పుడు పరాశరమహర్షి తీర్థయాత్ర లొనర్చుచు యమునా నదీతీరమున కేగి యం దోడ నడపు సత్యవతి యను దాశ రాజకూఁతును గాంచి కామమోహితుఁ డయ్యెను. అతఁ డామె నడపు నోడ నెక్కి, యామె జన్మముఁ దన దివ్యజ్ఞానమున నెఱిఁగి, నావ కొంతదూర మరిగిన పిదపఁ దన కోరిక యామె కెఱిఁగించేను. ఆమె తన కన్యాత్వ వికలతకును మేని పొలసు కంపునకును వెనుదీయఁగా నాతఁ డామెకుఁ గన్యాత్వము చెడకుండ వర మొసఁగి యామె వసు రాజర్షి వీర్యమునఁ బుట్టుట యెఱింగించి యోజనదూర మామె సౌగం ధ్యము వ్యాపించునట్లు గంధవతి నొనర్చి నిజతపఃప్రభావమున ననేక దివ్యాంబరాభరణభూషితఁ జేసెను. ఆమె కడు ముదమంది పడవ నొక ద్వీపమునకుఁ జేర్చెను. పరాశరుఁ డంత దా మితరుల కంటఁ బడకుండ నీహారతిమిరము గల్పించెను. పిమ్మట వా రుభయులందుఁ దమితీర రమింప సత్యవతికి సద్యోగర్భమునఁ బరమతేజస్వి, వేద మయుఁడు నగు వేదవ్యాసుఁడు సుజ్ఞానియై జన్మించెను. పరాశరుఁడు సత్యవతి కోరినవరము లనుగ్రహించి కుమారు నాశీర్వదించి యథేచ్ఛ మేగెను.

సత్యవతీసూనుఁ డంతఁ దల్లికి నమస్కరించి కృష్ణాజినపరిధాన కపిలజటామండలదండకమండలుమండితుఁడై "అమ్మా! నీకుఁ బని గల యప్పుడు నన్నుఁ దలంపుము. ఆ క్షణమ నీకడ కరుదెంతును. సెల వొసంగు" మని సకలలోకపావనుఁ డఖిల లోకహితార్థియై తపో వనములకుఁజని యందు మహాఘోరతప మొనర్చుచుండెను. యమునా

* భారతము, శాంతిపర్వము.

ద్వీపమున శ్రీకృష్ణుఁడు లీలమై నట్లు జన్మించెఁ గాన నాతఁడు కృష్ణ ద్వైపాయనుఁ డనియుఁ బిమ్మట వేదవిభాగకర్తయగుట వేదవ్యాసుఁ డనియు సత్యవతీసుతుఁ డగుట సాత్యవతేయుఁ డనియుఁ బరాశర పుత్త్రుఁడగుటఁ బారాశర్యుఁ డనియుఁ బిలువఁబడుచుండెను. కృష్ణ ద్వైపాయనుఁ డట్లు శమ్యాప్రాస మను నిజాశ్రమమునఁ దపో యుక్తుఁడై యుండఁ బలువురు మహర్షు లాతనికి శిష్యులై యాతనిఁ గొలుచుచుండిరి. *

## వ్యాసుఁడు విచ్ఛిన్నమైన కురువంశమును నిలుపుట :

పిమ్మటఁ గొంతకాలమునకుఁ గురురాజగు శంతనుఁడు సత్య వతిని మోహించి, దాశరాజు కోరిక ననుసరించి యామెకు జనించిన సుతునకే రాజ్య మొసఁగ నంగీకరించి, పుత్త్రుఁడగు భీష్ముఁడును రాజ్యమొల్లకుండుటకును వివాహ మాడకుండుటకును ఘోరశపథ మొనరింప నామెను వివాహమాడెను. శంతనుఁడు సత్యవతివలనఁ జిత్రాంగద విచిత్రవీర్యు లను నిరువుర సుతులఁ గాంచి వారు సంప్రాప్త యౌవనులు గాకుండఁగనే మరణించెను. అంత భీష్ముఁడు చిత్రాంగదు నకు రాజ్యాభిషేక మొనరించెను. కొంతకాలమునకుఁ జిత్రాంగదుఁడు చిత్రాంగదుఁ డను గంధర్వరాజుతోఁ బోరి చనిపోయెను. భీష్ముఁ డా తరువాత విచిత్రవీర్యునకుఁ బట్టముగట్టి కాశీరాజపుత్త్రికలగు నంబాలి కాంబిక లిరువురను గొనివచ్చి విచిత్రవీర్యునకు వివాహమొనరించెను. కొంతకాలమున కాతఁడును బిడ్డలులేక మరణించెను.

ఈ సమయమున సత్యవతి యెంత బతిమాలినను నిజప్రతిజ్ఞాను సారము భీష్ముఁడు రాజ్య మొల్లకయు వివాహమాడకయు నుండి కురువంశమును నిల్పుట కొఱకయుత్తమ బ్రాహ్మణు నంబికాంబాలిక లకు నియోగింప ధర్మసమన్వితమని నిర్ణయించెను. సత్యవతి తాను

* భారతము. ఆదిపర్వము.

కన్యాత్వమున నుండఁగా దనకు జనించిన వ్యాసభట్టారకుని యుదంతము భీష్మునకుఁ జెప్పి యా పని కాతనిఁ దలంచుకొనెను. వెంటనే వేదవ్యాసమహర్షి యరుదెంచి తల్లిముందు నిలిచెను. సత్యవతి యాతనిఁ గౌఁగిలించుకొని యానందబాష్పధారల నభిషేకించిన నాతఁడు వానిం దుడిచి యభివాదన మొనర్చెను. భీష్ముఁ డాతనిని బరమభక్తియుక్తిఁ బురోహితభూసుర పురస్కృతుఁడై యర్ఘ్యాదిపూజ లొనరించి యాసీనుఁ జేసెను. అంత సత్యవతి నిజనందనుల మరణ వృత్తాంతము, భీష్మచరిత్రమును జెప్పి వంశవినాశనము గాకుండఁ దనకోడండ్రయందు దేవరన్యాయమునఁ బుత్త్రోత్పత్తి నొనరింపు మని ప్రార్థించెను. దానికి వ్యాసుఁ డంగీకరించి యొక సంవత్సరము శుద్ధాత్మలగుటకు వ్రత మొనరింప నంబికాంబాలికల నియోగించెను. వారు వత్సరమును వ్రతము సలిపిరి. పిమ్మట, సత్యవతి ఋతుమతియు శుచిస్నాతయు నగు నంబికను వ్యాసునిచేఁ బుత్త్రునిఁ బడసి వంశమును నిలుపు మని నియోగించెను. కాని, యామె వ్యాసుఁడు పుత్త్రదాన మొనరించుతఱి నాతని యాకారమును జూచి కన్నులు మూసికొని యుండెను. ఆ కారణమున నామెకు బలవంతుఁడు వంశ వివర్ధనుఁడు నగు సుతుఁ డుద్భవించియు మాతృదోషమున నంధుఁ డగునని వ్యాసుఁడు వచించెను. పిమ్మట వ్యాసుఁ డంబాలికకును సుతుని బ్రసాదించుతఱి నామె వెల్లనై పడియున్న కారణమున నామెసుతుఁడు బలవంతుఁ డయ్యు మాతృదోషమునఁ బాండుదేహుఁ డగు నని చెప్పి వెడలిపోయెను. క్రమముగా నంబికాంబాలికలకు ధృతరాష్ట్ర పాండురాజులు జన్మించిరి.

సత్యవతి యంబికకు జనించినసుతుఁ డంధుఁ డగుటకు వగచి మరల వ్యాసునిఁ దలంచుకొని యాతఁడు ప్రత్యక్షము కాఁగా నింకొకపుత్త్రు నంబికకుఁ బ్రసాదింపుమని ప్రార్థించి యామె నొడఁబఱచెను. ఆ ప్రకారము రాత్రిసమయమున వ్యాసు డంబికకుఁ

బుత్త్రివాన మొసఁగ నరుదెంచెను. అతని వికృతవేషము మేని దుర్గంధము భరింపఁజాలక యామె తన దాసి నొకతె నలంకరించి యామెకు బదులు తన తల్పమునఁ బరుండఁజేసెను. వ్యాసుఁ డరుదెంచి యా దాసికి గర్భమొసరించి సత్యవతి కడకేగి యంబిక చేసిన మోసమును, దానికి యముఁడు పుత్త్రుఁడై జన్మింప నుండుటయుఁ దెలిపి యదృశ్యుఁడయ్యెను. మాండవ్యునిశాపమున యముఁడు విదురుఁడై యా దాసిగర్భమున జన్మించెను. ఇట్లు ధృతరాష్ట్ర పాండురాజ విదురులు ముప్పురును వ్యాసభట్టారకుని వీర్యమున జనించిరి.

## వ్యాసుఁడు సత్యవతి నంబికాంబాలికలను బుణ్యగతికిఁ బంపుట :

తరువాత ధృతరాష్ట్రునకు గాంధారివలన దుర్యోధనాదులు, పాండురాజునకుఁ గుంతివలన ధర్మజాదులు జన్మించి పెరుగుచుండిరి ఇంతలోఁ బాండురాజు మరణింపఁగా వ్యాసభట్టారకుఁ డరుదెంచి యందఱకు దుఃఖోపశమన మొనరించెను. ఒకనాఁడు సత్యవతి నేకాంతముగఁ బిలిచి "అమ్మా! సంసార మతిచంచలము. సంపదలు క్షణికములు. వచ్చు కాలముకన్న గత కాలమే చాల మేలు. ఇఁక ముందు ధృతరాష్ట్రసుతులు పాండురాజసుతుల కెగ్గుచేసి సమరమున నశింతురు. నీ వీ దారుణమును జూడ సమకట్టక నీ కోడండ్రతో గూడి తపోవనమున కరిగి పుణ్యగతులు వడయు"మని యుపదేశించి వెడలిపోయెను. అతని యుపదేశమును శిరమునఁ గైకొని సత్యవతి యంబికాంబాలికలతోఁ గూడ దపోవనమున కరిగి యతిఘోర మగు తప మొనరించి వారితో గూడ శరీరము విడిచి పుణ్యగతికిఁ బోయెను.

## వ్యాసుఁడు పాండవులకు హితోపదేశము చేయుట :

పాండవులు ధృతరాష్ట్రు నియోగమున వారణావతమున కరుదెంచి యందు నిర్మలమైన లక్కయింటు నుండిరి. కాని దైవ

వశమున లాక్షాగృహదహనము గానుండు తెలిసి భీముఁడు వారిని రక్షించి భూగర్భమున అడవులఁ జేర్చెను. అట నాతఁడు హిడింబను వివాహమాడెను. అంతఁ బాండవులు శాలిహోత్రు నాశ్రమమునఁగల కొలనియందు స్నానము లొనరించి శాలిహోత్రునిచేఁ బూజితులై యుండిరి.

అపుడు వ్యాసుఁడు ప్రత్యక్షమై ధర్మజాదులచేఁ బూజితుఁడై ధృతరాష్ట్రుని నిందించి వారి కిట్లు హిత ముపదేశించెను. "వత్సలారా! మీరు సకలధర్మవిదులు. బాంధవవియోజనమైన యీ కర్మము పురాకృతము. దీనికి శోకింపకుఁడు. మీరు సబాంధవులై రాజ్యముఁ బడయుదురు. ఈ శాలిహోత్రు నాశ్రమము పరమపవిత్రము. ఈ కొలనున స్నాతులైనవారికి మునిప్రభావమున బుభుక్షాపిపాస లుండవు. మీరు త్వరలో నేకచక్రపురమున కేగి యందు బ్రాహ్మణ వృత్తి నుండుఁడు. నేను మిమ్మచటఁ గలియుదును." అతఁడు కుంతి నోదార్చి హిడింబను భీముఁ డాలిగాఁ గైకొనుట శుభప్రద మనియు నామెవలన నాపద్రక్షకుఁ డగు కొడుకు దయించు ననియుఁ జెప్పి యంతర్హితుఁ డయ్యెను. పిమ్మట, పాండవుల కేకచక్రపురమునఁ గాననై ద్రౌపదీవృత్తాంతమును జెప్ప ద్రుపదపురమున కరుగుట లగ్గని వారికి బోధించెను. మఱియు ద్రుపదనగరమున నాతఁడు బాండవులఁ గని యాగామి శుభవృత్తాంతము వారి కెఱింగించెను. అర్జునుఁడు మత్స్యయంత్రము నేసి ద్రౌపదిఁ బడసిన తరువాతఁ గుంతీ నియోగ మునఁ బాండవు లైదుగు రామెను వివాహమాడఁ దలఁప ద్రుపదుఁడు సంశయించు తఱి వ్యాసుఁడు ప్రత్యక్షమై ద్రౌపది పూర్వజన్మ వృత్తాంతమును, బంచేంద్రోపాఖ్యానముఁ జెప్పి ద్రుపదు నొప్పించెను. ఈ ప్రకారము వ్యాసమహర్షి బహుపర్యాయములు పాండవులకుఁ బొడ సూపుచు వారి యోగక్షేమములను గనుఁగొనుచుండెను.*

* భారతము. అరణ్యపర్వము.

## వ్యాసుఁడు దుర్యోధనాదుల విందించి ధృతరాష్ట్రునకు బుద్ధి చెప్పుట:

పాండవులు వనవాసము చేయుచుండఁగా నొకనాఁడు దుష్ట చతుష్టయ మగు దుర్యోధన దుశ్శాసన కర్ణ శకును లొండొరు లాలోచించుకొని వనములనున్న పాండవులపై దండెత్తి వారినిఁ జంపివేయ నిశ్చయించుకొనిరి. ఇది యంతయు తన దివ్యదృష్టి నెఱింగి వ్యాస మహర్షి యరుదెంచి దుర్యోధనుని నివారించెను. ధృతరాష్ట్రున కింద్ర సురభి సంవాదమును జెప్పి వ్యాసుఁడు బాండవుల కపకృతి చేయ నెంచుట యెగ్గనియు భీష్మాదుల సాహాయ్యమున దుర్యోధనుని వారించుట లగ్గనియు బహువిధముల బోధించి వెడలిపోయెను.

## వ్యాసుఁడు పాండవులకుఁ బ్రతిస్మృతి యుపదేశించుట:

ద్వైతవనమున నున్నపుడు పాండవు లొకదినమున భీష్మద్రోణ కృపాచార్యుల జయింప సాధ్య మగునా యని యాలోచించు సమయమునఁ దత్సంశయ నివారణమొనర్ప వ్యాసభగవానుఁడు వారికిఁ బ్రత్యక్ష మయ్యెను. పాండవు లాతని కర్ఘ్యపాద్యాదు లొసఁగి పూజించిరి. అంత నాతఁడు ధర్మజునకుఁ బ్రతిస్మృతి యను విద్య నుపదేశించి దాని మూలమున నర్జునుఁ డధిక తపోవీర్యుఁడై యింద్ర కుబేర వరుణాదుల నీశ్వరునిఁ బ్రత్యక్షము చేసికొని వారలవలన దివ్యాస్త్రములు వడసి శత్రువుల జయించునని వారు పెద్దకాల మా వనమున నుండ రాదని యుపదేశించి వెడలిపోయెను. పాండవు లా కారణమున ద్వైతవనమును వీడి కామ్యకవనమున కేగి సరస్వతీ తీరమున నుండఁ జొచ్చిరి. తరువాత ధర్మజుఁడు ప్రతిస్మృతి యర్జునున కుపదేశించెను. దానిచే నాతఁడు తపోయుక్తుఁడై దేవతల మెప్పించి యస్త్రశస్త్రములఁ బడసెను.

## వ్యాసుఁడు ధృతరాష్ట్రుని ననుగ్రహించుట :

ధృతరాష్ట్రుఁడు కురుక్షేత్రయుద్ధమునందుఁ దన సుతు లోడుదురో పాండు సుతు లోడుదురో తెలుపుమని సంజయునిఁ గోరెను. అతఁ డీ విషయము వ్యాసభగవానుఁడే తెలుపఁగలఁ డాతనిఁ దలంచుకొను మనెను. ధృతరాష్ట్రుఁడు నాతనిఁ దలంప వ్యాసుఁడు ప్రత్యక్షమై పాండవులే జయింతురని సంజయునిచేఁ జెప్పించి పురుషోత్తము మాహాత్మ్యము నాతనిచే నుగ్గడింపఁ జేసెను. పిమ్మట వ్యాసుఁడు సంజయుని వాక్యములు సత్యము లనియు శ్రీకృష్ణు నాశ్రయింపు మనియు నాతనికి బోధించెను. యుద్ధము ప్రారంభమగు తఱి మఱియొకమాఱు వచ్చి కాలము సమీపించిన కారణమున నృపులకు సమర మాసన్నమయ్యె ననియు దానికై యడల వలదనియు ధృతరాష్ట్రునకు వ్యాసుఁడు బోధించెను. మఱియు నాతఁడు యుద్ధవార్తలెప్పటికప్పుడు చెప్పుటకు సంజయుని నియోగించి సూతనందనునకు దివారాత్రప్రవర్తనములు, రహస్యప్రకారభాషణములు, ఇరు తెఱఁగు వారల మనోవృత్తములు తెలియఁగల శక్తి, యతిశీఘ్రగమనము నొసఁగి, శస్త్రాదికములవలని బాధ లేకుండునట్లు; దివ్యుల యాలాపములు రూపములు తేటపడున ట్లనుగ్రహించెను. నాఁడు కలుగుచున్న ప్రబలోత్పాతము లతఁడు ధృతరాష్ట్రున కెఱిఁగించి సంధి యగుట శ్రేయమే కాని పరిస్థితులు విషమించెననియు, యుద్ధమగుట తప్పదనియుఁ జెప్పి యాతని సంశయములు నివారించి యనుగ్రహించి వెడలిపోయెను.

## వ్యాసమహర్షి యుద్ధసమయమునఁ బాండవుల కొనర్చిన యుపకృతి :

వ్యాసమహర్షి ధర్మపక్షమగు పాండవపక్ష మవలంబించి పాండవులకుఁ గష్టసమయమునఁ బ్రత్యక్షమై నుత్సాహశక్తి నొసఁగుచు

దుఃఖోపశమన మొనరించుచు వారికి మహోపకృతి యొనర్చెను. అభిమన్యుఁడు మరణించిన పిదప నత్యంత దుఃఖాకులురైన పాండవులకు సువర్ణష్ఠీవ్యాదుల కథ లెఱిఁగించి తత్త్వము బోధించి దుఃఖోపశమనము నొనర్చెను.

నారాయణాస్త్రము కృష్ణార్జునులపట్ల వ్యర్థముకాఁగా దైన్యపడి విచారించు నశ్వత్థామకు వ్యాసమహర్షి నారాయణుఁడు శివునిగుఱించి తప మొనరించి సకల శస్త్రాస్త్రములను గాంచి చావునొవ్వులు లేకుండ వర మందినట్లు; నతఁడే కృష్ణుఁ డనియు నాతని యంశమే యర్జునుఁ డనియును బోధించెను. మఱియు నశ్వత్థామ పూర్వభవమున మృద్రూపమగు శివు నారాధించుటయుఁ గృష్ణుఁడు సాక్షాల్లింగారాధకుఁడై యుండుటయుఁ దెల్పి యా కారణమునఁ గృష్ణునికంటె నశ్వత్థామ తక్కు వగుట నాతఁడు తెలిపెను. ఈ మాటలు విని యశ్వత్థామ శ్రీకృష్ణునిఁ గొనియాడి యర్జునుఁ బొగడెను. అర్జునుఁడు తాను యుద్ధముచేయు సమయమున నొక మహాపురుషుఁడు శూలాయుధపాణియై ముందు రాజులను జంపుచుఁ బోవుచుండఁగాఁ దా నూరక బాణములఁ బ్రయోగించినట్లు పొడముచున్న దనియు నా పురుషుఁ డెవఁ డని వ్యాసు నడిగెను. అతఁడు శంకరుఁ డని యాతని దివ్యలీల లుపన్యసించి యాతఁ డర్జునునిఁ గటాక్షించుట కది నిదర్శన మని చెప్పి మహోత్సాహము శివభక్తి యర్జునునకు సాత్మ్యవతేయుఁ దీను మడింపఁజేసి రక్షించెను. మఱియు భక్తగణాధీనుఁడగు నాతనిని మనఃకమలమున సేవించిన విజయు మగు నని వ్యాసుఁడు బోధింప నర్జునుఁ డట్లొనర్చి కృతకృత్యుఁ డయ్యెను.*

పుత్త్రశోకమునఁ బొగులు ధృతరాష్ట్రు నూఱడింపనిచో నాతఁడు పాండవుల నేమి శపించునో యని ధృతరాష్ట్రుని కడకు వచ్చి భూతము లనిత్యము లనియుఁ, ధృతరాష్ట్రుఁడు స్వయముగా

* భారతము ద్రోణపర్వము.

ముప్పు తెచ్చుకొనె ననియుఁ జెప్పి యుపశమిల్లఁ జేసెను. పిమ్మట గాంధారి ధర్మజుని శపింపఁబోవు సమయమున నచటికి వేంచేసి పారాశర్యుఁ డామెను నివారించి ధర్మరాజును గాపాడెను. మఱియు కురుక్షేత్ర యుద్ధానంతరము యుధిష్ఠిరుఁడు బంధుమరణమునకు విచారించి రాజ్య మొల్లనను సమయమున వ్యాసమహర్షి యరుదెంచి యది రాజధర్మము గాదనియు నిషిద్ధము లాచరించుటయు, ననిషిద్ధముల వీడుటయు రెండు నధర్మములే యని పలికి యాతనికి సుద్యుమ్నుని చరిత్రమును సేనజిత్తుని వాక్యములును జనకున కశ్మకుఁడు చెప్పిన నీతియు నుపన్యసించుటే కాక ధర్మాధర్మములు, పాత్రాపాత్రులు, ప్రాయశ్చిత్త విశేషములు నెఱింగించెను. ఇంకొక పర్యాయము యుధిష్ఠిరునకు మరుత్తుని చరిత్రము చెప్పి యాతని దుఃఖమపనయింపఁ జేసెను. అతనిచే నశ్వమేధ మొనరింపఁజేసెను.

## వ్యాసభగవానుఁడు ధృతరాష్ట్రాదులకు భారత రణమృతుల నెల్లరఁ జూపుట :

కొంతకాలమునకు ధృతరాష్ట్రుఁడు భార్య యగు గాంధారి తోడను కుంతీవిదురులతోడను వానప్రస్థాశ్రమమునకేగఁ గృష్ణద్వైపాయను నంగీకారమును బడసి వెడలి యొక యాశ్రమము నిర్మించుకొని యందుండెను. అనంతరము విదురుఁడు యోగమార్గమున ధర్మజుఁ గలిసెను. ఆ పిమ్మట నొకనాఁడు పాండవసహితుఁడై యున్న ధృతరాష్ట్రుని యాశ్రమమునకు వ్యాసుఁడువచ్చి వారియోగక్షేమము లడిగి వారిభక్తికి సంతసించి యొకవరముఁ గోరుకొనుఁడని పలికెను. ధృతరాష్ట్రుఁడు రణమున మృతులైన నిజసుతులయుఁ బాండవ కుమారాదులయుగతుల నెఱుఁగఁ గోరెను. గాంధారి మున్నగు స్త్రీలు రణమృతులగు తమ బంధువుల నెల్లర నొకసారి చూపు మని యాతనిఁ గోరిరి. కుంతి తనకుఁ గర్ణుఁడు జనించిన తెఱఁ గెఱిఁగించి వానినిఁ జూడఁగోరెను. వేదవ్యాసుఁడు కటాక్షించి వారి వారి స్వరూపములఁ

తెలియఁ జేసెను. ధృతరాష్ట్రుఁడు గత జన్మమున నొక గంధర్వరాజు, పాండుమహారాజు మరుద్గణజని, యుధిష్ఠిరుఁడు ధర్మదేవత, భీముఁడు వాయుదేవుఁడు, అర్జునుఁడు నరముని, శ్రీకృష్ణుఁడు శ్రీవిష్ణువు, నకులసహదేవు లాశ్వినులు, గాంధారరాజు ద్వాపరయుగము, దుర్యోధనుఁడు కలియుగము, అతని యనుజులు రాక్షసులు, కర్ణుఁ డరుణకిరణుఁడు, అభిమన్యుఁ డమృతాంశుఁడు, ధృష్టద్యుమ్నుఁ డగ్ని శిఖండి యనిలాంశజుఁడు, ద్రోణాచార్యుఁడు దేవగురువు, భీష్ముఁడు వసుశక్తి, అశ్వత్థామ రుద్రాంశజుఁడు. ఇట్లు చెప్పివారందఱకు మఱునాఁడు భాగీరథీనదియందు తనతపఃప్రభావమునఁ గృష్ణద్వైపాయన మహర్షి రణమృతులెల్లరఁ జూపెను. వారెల్లరు దేవతామూర్తులై యుండిరి. నాఁటికి వారలెల్లరును యథేచ్ఛముగాఁ బరస్పరసంభాషణముఁ గడిపిరి. ధృతరాష్ట్రుఁడును వ్యాసకృపచే దివ్యదృష్టిఁ గాంచి మృతులయిన సుతబాంధవు లెల్లరఁ జూచి సంభాషించెను. మఱునాఁడు రణమృతుల నెల్లరఁ దమ లోకముల కనుపుచు వారి వారి భార్య లనుగమింప నుద్యుక్తలు కాగా వారి నెల్లరను గంగానదీప్రవేశ మొనరింపఁ జేసెను. ఆ రీతిని గౌరవస్త్రీ లెల్లరను తమ తమ భర్తల ననుసరించి దేవకామినులై వెడలిపోయిరి. తరువాతఁ గొంతకాలము మహాతప మొనరించి గాంధారీధృతరాష్ట్రులును, గుంతీదేవియుఁ గార్చిచ్చునపడి దగ్ధులై పుణ్యలోకముల కేగిరి.*

## బోయలచే నవమానితుఁడైన యర్జునుని వేదవ్యాసుఁ డూరార్చుట:

యాదవ సంరక్షణానంతరము రామకృష్ణు లవతారములఁ జాలించిన పిదప యాదవస్త్రీలతో నర్జునుఁ డరుదెంచుచుండఁగా బోయ లెదురై వారి మానధనములు చూఱగొనఁ జొచ్చిరి. అర్జునుఁ డస్త్రము లేయ నుంకింప నాతని హస్తము లేవని కతమునఁ జూచుచు యాదవ

* భారతము, ఆశ్రమవాసపర్వము.

స్త్రీ మాన ధనము లా చోరులకు విడిచి పరమదుఃఖితుఁడై పరుగుపరుగున వేదవ్యాసమహర్షిని జేరి యెల్లవృత్తాంతము వినిపించెను. సాత్యవతేయుఁ డర్జును నూఱడించి కృష్ణావతార మెత్తిన విష్ణువు భూభార ముడిపి చనుటయు నాతని కటాక్షముఁ గోల్పోయి యర్జునుఁ డవమానితుఁ డగుటయుఁ దెలిసి "వత్సా! అనుకూలమగు కాలమున బలము, బుద్ధి, తేజము విస్తరిల్లును. కానికాలమున నివి నశించి కీడుగొని వచ్చును. కాన, నన్నిటికిఁ గాలమే కారణము. బుధుఁడవగు నీవు కాలవిపర్యయముల నుబ్బు కలఁకల వీడి ప్రశాంతుఁడవై మీ వారలతోఁ గలిసి నిశ్చింతతో నిర్వికారుఁడవై యుత్తమగతికిఁ జను" మని బోధించెను.

పిమ్మట పాండవు లెల్లరును క్రమముగాఁ దనువులు చాలించిన పిమ్మట సత్యదర్శి, సర్వవిధిజ్ఞాత, సర్వవిజ్ఞానభవ్యాఖ్యాతృఁడు, సర్వేంద్రియ ప్రబోధశాలి, సర్వజ్ఞుఁడు, శౌచశాంతిక్షమాదాంతితపోనిత్యాభావిభాసి, ధర్మోపదేశచతురవాగ్విలాసుఁడు నగు వేదవ్యాసమహర్షి పాండవులకీర్తి ప్రకటించుటకును, జనపతుల చరిత్రములు జనులకెఱిఁగించుటకును, దేవదేవుఁడగు వాసుదేవుని క్రీడావిశేషములు వివరించుటకును, సర్వదేవజాతుల జన్మములు, వారి సాయుజ్యములు తేటపఱచుటకును, సకలధర్మములు తెలుపుటకును సంవత్సరత్రయమునఁ బంచమవేదమగు మహాభారతమును రచించెను.*

## వేదవ్యాసుఁ డొక కీటకమున కుత్తమజన్మము లొసంగుట:

వేదవ్యాసుఁ డొకప్పుడు మార్గమధ్యమున శకటపథమున నొక కీటము తొందరగాఁ బరుగెత్తుటఁ గాంచి దానిని భయకారణమే మని ప్రశ్నించెను. అంత నది "అయ్యా! ఈ మార్గమధ్యమున వచ్చు బండ్లు, బండియెడ్ల నదలించువారి కేకలు విని బండిచక్రముల మధ్య

* భారతము, మౌసలపర్వము.

బడి చనిపోవుదు నను భయమున బాఱిపోవు చున్నా"నని పలికెను. అంత నాతఁడు "నీవు నికృష్ట కీటక మవు గదా! నీ జన్మము దుఃఖమయము. అది పాయుటకు నీకు మరణము శ్రేయమే యగుఁగాదా?" యని యడిగెను. "ఆర్యా! మాకు విషయజములైన సౌఖ్యములను భవింప లేమను జ్ఞానము లేదుకదా! బ్రదుకన్నఁ బరమసుఖము. చావన్నఁ బరమదుఃఖము నివి యెల్ల జీవరాసులకు సహజమే కదా! ఇంతకు నీ వెఱుఁగని దేమున్నది? నా మన మరయ నెంచి యడిగితి" వని తాను బూర్వజన్మమున దుర్గుణభరితుఁ డగు నొక వైశ్యుఁడనియుఁ దనకు బ్రాహ్మణ భక్తి కతమున జాతిస్మరత్వము కలిగెననియు వచించెను. అంత వ్యాసుఁడు "కీటకరాజా! నీ వృత్తాంతము నే నెఱుఁగుదును. నీ వొనర్చిన యా యొక సత్కర్మమువలననే నేను నీతో మాటలాడుట సంభవించినది. దుష్కృతమున దేవతలు కీటకము లౌదురు; సుకృతమునఁ గీటకములును దేవత్వమందఁ గలవు. నీకు నా దర్శనముననే పరమసుకృతము చేకూరినది. నా తపోబలమున నీ కుత్తమజన్మము లొనఁగుచున్నాను. నీవు క్రమముగా నీవ శూద్ర వైశ్య నృపజన్మము లెత్తుదువు. నీవు పుట్టెఱుఁగునట్టి పోడిమి గని ధర్మమార్గమున సంచరింపఁ గల"వని యా కీటమును గరుణింప సకల భూతములు నా మహాత్ముని భూతదయకు సంతసించి వాని నెంతయుఁ గీర్తించెను.

పిమ్మటఁ గ్రమముగా నా కీట మా యా జన్మములంది తుదకు నృపత్వముఁ గాంచి సుకృతములు పెంపొందించుకొనుచు వ్యాసుని దర్శించి పూజించెను. అంత నాతఁ డా రాజన్యునిఁ గాంచి "రాజా! నీవు గోవులకై గాని విప్రార్థమై కాని నీ ప్రాణములు త్యజించినచో ముందు బ్రాహ్మణజన్మమందఁ గల"వని బోధించెను. ఆ రాజా జన్మమున సత్లొనరించి మఱుజన్మమున సద్విజుఁడై పుట్టి పుణ్యతీర్థయాత్రాపరుఁడై బహుయజ్ఞము లొనరించి నిజయశ మెల్లెడ నింపి తుదకు

దేవత్వమంది యింద్రునకుఁ బ్రియసఖుఁడై విలసిల్లెను. వ్యాసమహర్షి కారుణికత్వ మంతటిది! అతని కటాక్షశక్తి యంతటిది! *

## కృష్ణద్వైపాయనుఁడు వేదవ్యాస మొనరించి వ్యాపింపఁ జేయుట :

విష్ణుప్రభావమున వెలసిన వేదవ్యాసుఁడైన కృష్ణద్వైపాయనుఁడు బ్రహ్మచే నియుక్తుఁడై వేదములు నాలుగు భాగములుగా విభజించి యందు మొదటిదగు ఋగ్వేదము పైలుఁడును, రెండవదగు యజుర్వేదము వైశంపాయనుఁడును, మూఁడవదగు సామవేదము జైమినియు, నాలుగవదగు నథర్వణవేదము సుమంతుఁడును జదివి వ్యాపింపఁ జేయునట్లు నియమించెను. మఱియుఁ దాను వ్రాసిన పురాణేతిహాసములు రోమహర్షణపుత్త్రుఁడగు సూతుఁడు చదువునట్లు చేసెను. వారు క్రమముగా వాని నభ్యసించి తమతమ శిష్యులచే జగద్వ్యాప్త మొనరించి కృతకృత్యులైరి. అందు ఋగ్వేదము పైలుని శిష్యులగు బోధాయనాదులు బహుసహస్రశాఖలుగా వ్యాప్తి నొందించిరి. యజుర్వేదము వైశంపాయన శిష్యులచే నిరువదియేడు శాఖలై విలసిల్లెను. వారిలో నొకఁడగు యాజ్ఞవల్క్యమహర్షి శుక్లయజుర్వేద మర్కమునిచే గ్రహించి నిజశిష్యులచే వ్యాపింపఁజేసెను. సామవేదమును జైమిని బహుశాఖలుగా నొనరించి శిష్యులచేఁ ద్రిలోకవ్యాప్తి నందించెను. అథర్వణవేదమును సుమంతుఁడు బహుసంహితలుగా విరచించి జగములఁ బర్వఁజేసెను. సూతుఁడు సకల పురాణములను ఆఖ్యానోపాఖ్యానములుగా నొనర్చి నిజశిష్యులగు సుమతి, అగ్నివర్చుఁడు, మిత్త్రుఁడు, శంఖపాలుఁడు, కృతవ్రణుఁడు, సావర్ణి యను వార లార్వురకుఁ జెప్పి వారిచే నఖిల ద్వీపములందును వాని యర్థములను వ్యాపింపఁ జేసెను.

---

* భారతము, అనుశాసనికము.

ఈ రీతి వ్యాసమహర్షి చతుర్వేదములు, అష్టాదశ పురాణములు చతుర్దశవిద్యలు నేర్పఱించి బ్రహ్మర్షి దేవర్షి రాజర్షులచేత జదువఁబడి యుపన్యసింపఁ బడున ట్లొనర్చి కృతకృత్యుఁ డయ్యెను.

## వ్యాసమహర్షికి శ్రీశుకుఁ డుదయించిన వృత్తాంతము :

వ్యాసమహర్షి తొల్లి మేరుపర్వతాగ్రమునఁ గల కర్ణికారవనముఁ జేరి యందుఁ బుత్త్రార్థియై యీశ్వరుని గుఱించి ఘోర తపమొనర్చెను. అతని యౌగిక తపోవిశిష్టతకు మెచ్చి శివుఁడు ప్రత్యక్షమై వరముఁ గోరుకొను మనెను. వేదవ్యాసుఁడు భక్తిసంభరితుఁడై దండప్రణామము లాచరించి జలపవనాంబర వసుధానల సమవీర్యుఁ డగు పుత్త్రు నొసఁగుమని ప్రార్థించెను. శివుఁ డట్లే యగునని యాతనిచే నామంత్రితుఁడై యదృశ్యుఁ డయ్యెను.

ఇట్లు వరలబ్ధుఁడైన వేదవ్యాసుఁ డొకనాఁడు నిజాశ్రమమున నగ్నికార్యపరుఁడై యరణి మథించుచుండఁగ ఘృతాచి యను నప్సరస లోచనగోచర యయ్యెను. అతఁడు కామగోచరత్వము నొందఁగా ఘృతాచి వంచనఁ జిలుకయై యుండెను. మన్మథప్రభావమున నా సంయమి శుక్ల మా యరణియందుఁ బడ నాతఁడు నిర్విశంక మగు నంతఃకరణముతో దానిని మథించెను. అందుండి జనకసమాకృతియు శుకరూపమునంది శుకుఁ డుద్భవించెను. తోడనే దేవత లాతని కుపనయనాదు లొనరింప సర్వవిద్యలు నాతనిఁ బొందెను. శుకుఁడు తండ్రివలన గుణగణము లంది పితృనాజ్ఞ జనకమహర్షి పాలికరిగి జ్ఞానబోధితుఁడై నిజాశ్రమమున కరుదెంచెను.

## వ్యాసమహర్షి శ్రీశుకున కొనరించిన దివ్యప్రబోధము :

వ్యాసమహర్షి నిజసుతుఁడగు శ్రీశుకునకు సమస్త విషయములు తేటతెల్లముగఁ దెలుపుచు నిమేషకాష్ఠాకళాముహూర్తాహోరాత్రమాసర్తువత్సరాదిక మగు కాలావయవ నిరూపణమును, గృత

త్రేతాద్వాపరకలియుగపరిమితకాలము, వాని ధర్మములు తెలిపి యిట్లనెను. వత్సా! ఈ నాలుగు యుగములు గలసి మహాయుగ మనంబడును. వేయి మహాయుగములు బ్రహ్మ కొక పగ లగును. అదియే పరిమాణముగల కాల మాతనికి రాత్రి యగును. అతఁడు నిద్రించు రాత్రికాలము ప్రళయ మగును. ఆ ప్రళయాంతమునఁ దిరిగి భూతజాలము నతఁడు సృష్టించును. ఈ సృష్టించు శక్తియే బ్రహ్మము. అది తేజోమయము. ఆ మహనీయ తత్త్వము వలన మహత్తు, మనస్సు, గగనము, పవనము, అనలము, సలిలము, భూమి యను రూపములు జన్యజనకభావములై సంభవించి క్రమముగా శబ్ద స్పర్శ రూపరసగంధసద్భావము లను గుణములు గలిగి సప్తపురుషు లనంబరగి సృష్టికిఁ గారకము లగును. తేజోరూపమగు బ్రహ్మము ప్రాజాపత్య మన నొప్పి వెలుఁగొందుచుండును.

ఈ సృష్టియందలి కర్మజ్ఞులు కొందఱు పౌరుషమే ఫలదమని, కొందఱు దైవమే ఫలమిచ్చునని, మఱికొందఱు సమస్తఫలము భూతస్వభావ మని పలుకుచుందురు. కాని, సత్త్వగుణోపేతులగు పుణ్యాత్ములు సమవర్తనులై తపోనియుక్తులై యుందురు. వారి తపమునకు స్వాధ్యాయము బల మిచ్చును." ఈ రీతిగా ననేకవిషయము లాతఁడు సుతునకుఁ దెలిపి యోగసాంఖ్యముల తెఱఁగు లుపన్యసించి వర్ణాశ్రమధర్మములు ధర్మము సర్వవర్ణసామాన్యమగుట యెఱింగించెను.

శ్రీశుకుఁడు తండ్రితో "దేవా! పరమబ్రహ్మమును జేరుట కధ్వర ప్రజా యోగ సాంఖ్యములలో నేది యుత్తమ"మని యడిగెను. వ్యాసుఁడు "నాయనా! నీవు చెప్పిన మార్గములన్నియు నుత్తమములే కాని విశేషతపము, నింద్రియప్రవర్తనముల నిగ్రహించుట, రాగలోభములను బోఁద్రోలుట, దృఢవిద్య కలిగియుండుట యనునవి యెల్లఁ గల పుణ్యుఁడు బ్రహ్మము నందగల్గును. ఇందు నొక విశేషము గలదు. బుద్ధీంద్రియము లైదును బరమును గను వెలుగుఁన కర్త

ములు. వానిని నిగ్రహించుటకు మనసు నిపుణత యవసరము. పరమ నిందితములగు కామక్రోధాదుల నిర్జింపవలయును. ఎట్లన సంకల్పము విడిచినచోఁ గామము నశించును. సత్త్వగుణచింతఁ గన్నచో నిద్రాదోషము తొలఁగును. ప్రాజ్ఞసేవన మొనరించుచో లోభము నశించును. శమ మున్నచోఁ గ్రోధము వైతొలఁగును. అప్రమాదము భయమును రూపఱఁ జేయును. ఈ ప్రకార మన్ని యింద్రియములు జయించి సమదృష్టిని ఱాయిఁ గనకము నొకటిగాఁ జూచుచు నేకాంతమున వర్తించినచో యోగి శబ్దబ్రహ్మమును దన్మూలమునఁ బరమాత్మ నందవచ్చును.”

ఈ మాటలు విని శుకుఁడు తండ్రి కిట్లనియెను. “మహాత్మా! వేదములు కర్మ నాచరింపు మనియు, విడిచిపెట్టు మనియుఁ జెప్పుచున్నవి. ఈ రెండును బరస్పర విరుద్ధములుగా నున్నవి. దేనివలన నేది సిద్ధించునో తెలియఁజెప్పుము.” అంత వ్యాసుఁడు “పుత్రా! కర్మ ప్రవృత్తికి, నిష్కర్మ నివృత్తికి మార్గములు. ప్రవృత్తియే బంధము. నివృత్తియే మోక్షము. కావున బుద్ధిమంతులు కర్మము నొల్లరు. నిత్యనైష్కర్మ్యులు మహానందమును, గర్మపరులు జననమరణాది దుఃఖముల నందుదురు, ఇం దొక చిత్రము కలదు. చిత్తశుద్ధికై కర్మ మొనరించిన నది యవిద్యాప్రదమే యగును. నిష్కర్మమే ధర్మము, మోక్షదమును. ఇఁక విద్య యెట్లు లభించునందువా? బ్రహ్మచర్యసమేతమగు మహాతపమే మార్గము. బ్రహ్మచర్య, గృహస్థ, వానప్రస్థ, సన్న్యాసాశ్రమములలో నుక్తకర్మము లొనరించి తుదకు మోక్షము నందవచ్చును. ఎప్పటికైనను నిష్కామియై సర్వసమత వర్తించి రాగద్వేషాదుల వీడి బ్రహ్మచర్యము నవలంబించుట ముఖ్యము.

అన్నిటికంటె ముఖ్యమగు నంతర్త్యాగప్రకారము నీ కెఱిఁగింతును. సావధానుఁడవై వినుము. సర్వసంకల్పరహితుఁడై సత్త్వమునఁ జిత్తము నిలిపి ప్రసాదము నంది దానిచేఁ గాలముఁ గడపవల

యును. ఆ ప్రసాదగుణము గలవాఁడు నిరత మంతరాత్మఁ గనుచు నియతి నియతాశనుఁడై శాశ్వతత్వము నందును. ఇదియే వేదాంత శాస్త్రమథనజనిత మగు నవనీతము.

ఈ విషయములు సుదృఢము లగుటకు మరల వినుము. పంచేంద్రియములు, మనస్సు, వీనికంటె బుద్ధి గొప్పది. స్వస్థత, దుఃస్థత, జడత్వము, సత్త్వాదిగుణ సమీరితము, అది నశించుట, యింద్రియ గుణ విజృంభణము, అది యడంగుట–యిన్నియు బుద్ధియొక్క కృత్యములే. ఈ బుద్ధియే ప్రీతితో నువ్పొంగును. విషాదాదులచే గ్రుక్కిపోవును. ఈ రెండును లేక సమత్వముచే నదియే ప్రశాంతినందును. ఈ బుద్ధి గుణ మెఱిఁగి యింద్రియాదుల వెంటఁ బోక తన్నుఁ గను వానికి దుఃఖదైన్యములు, సుఖమదములు నుండవు. అట్టివాఁడు జలమందు నిలిచి జలపక్షి మునుఁగునట్లు, మేడిపండు మశకపీడ నొందనట్లు గుణములయొక్క వికారము నందఁడు.

కుమారా! వే యేల, ఇంద్రియనిగ్రహమే యన్ని ధర్మములలో నుత్తమోత్తమ ధర్మము. దానివలనఁ బ్రశాంతినొంది యవ్యక్త సంభవయు, సంకల్పకూలయుఁ, గ్రోధపంకయు, నింద్రియగ్రాహయుఁ, గామభుజంగయు, మోహతృణచ్ఛన్నయు సంసారసాగరగామియు, ఘోరయునై యకృతాత్ములకుఁ గడవరాని లోభవాహినిని సత్యతీర్థమున నుత్తరించి సుప్రసన్నాత్మత నందవలయును. ధర్మనిచయ మంతటికి శాంతమే విశిష్టవిద్య.

నాయనా! నీకింకను నధ్యాత్మవిలాసవిషయములను వాక్యము లెఱిఁగింతును వినుము. బంధనములలో నెల్లఁ బరమబంధనము కామము. దానిని విడిచినచో మేఘములు తొలఁగినఁ గననగు పూర్ణచంద్రబింబమువలె నాత్మరూపము సాక్షాత్కరించును. కామద్రుమము మోహబీజములనుండి పుట్టి ప్రమాదజలమునఁ దడిసి పెరుఁగుచు నజ్ఞానస్థిరాధారకలితమై యసూయాదిపత్రసంపదచే నున్నతి వహించి

శోకశాఖలు ననేక చింతోపశాఖలు గలిగి పురాకృతకర్మసారఘనమును దృష్టాలతాపరిగతమునై యొప్పారును. దానిఫలము లాశించి లుబ్ధులు ప్రాఁకి పడుదురు. బుధు లా వృక్షమును సమూలముగఁ దెగఁగొట్టి సుఖు లగుదురు.

పుత్త్రా! ఈ దేహము పురము. దానికి స్వామి బుద్ధి. సర్వార్థ చింతనములు సచివులు. మనస్సు, విషయాదులు పురోహితులు. శ్రోత్రా దులగు నింద్రియములు పౌరజనములు. ఈ రాజ్యభోగమునకు దూషకులైన దొరలు రజస్తమములు. బుద్ధిరాజు పరివారమును నమ్మకమనసుతో నేమైన పను లొనర్చిన దుష్టు లడఁగుదురు. భోగ మవ్యయ మగుమ. లేనినాఁడు వారితో నశించును.

బిడ్డా! నీ మనము ప్రాకృతజలముల వర్తనములవెంట జరా మరణముల కలిమిఁ దలఁపక యేమఱి మెలఁగకుండ నీకు వైరాగ్య ప్రకారము నుడువుదును. గ్రహింపుము. మనసు నింద్రియములను మర్దింపుము. అక్రోధసత్యమార్జవములఁ దపోదమాహింసాదులఁ బాలింపుము. సుతా! ఏఁడులుఁ బూఁటలు చూచుచుండఁగఁ బరుగిడుచున్నవి. ఆయువు తోడ్తోడఁ దఱుఁగు చున్నది. మాంసశోణితవివర్ధన మగు నైహికమునఁ దత్పరు లల్పులు, నిర్భాగ్యులు, అస్థిరములైన యింద్రియములను జలములతో నిండి కామరోషాదులగు మొసళ్ళతో గూడి భయంకరమైన సంసారసాగరమును ధైర్య మను నావనెక్కి దాఁటుము. జరామరణములు జన్మముతో జనుని వెన్నాడుచుండును. వానికి నిను మ్రింగు నవకాశ మీయక వెంటనే జయించు తెఱఁగుఁ గనుము. వెఱ్ఱిమానవుఁడు చుట్టములని జ్ఞాతు లని మమతఁ బెంచును. ఈ చుట్టములు శ్మశానమువఱకే వత్తురు. అగ్నిఁ గలిపి జ్ఞాతు లగుదురు. కావున, జనన మరణములను జయింపవలెను. ఒకవేళ నవి తప్పనిచోఁ దుదకుఁ దపోవనముననే యవి విచ్చిపోవలయును. అదియును గొంత మేలే. కాన, నాకు నేనే కలను. నే నెవ్వరివాఁడను

గాను. ఆత్మఁదలఁతును. నాయంతవాని నెందును జూడను. ఎవరును నాకుఁ గారని నిర్ణయింపు" మని బోధించెను. యోగమార్గమునం దుదకు శ్రీ శుకుఁ డంతర్హితుఁడైన పిమ్మట వేదవ్యాసున కీశ్వరుఁడు ప్రత్యక్షమై, పుత్ర సదృశియైన నీడ వ్యాసు నెప్పు డనుసరింప నాతఁ డద్దానిఁ జూచుటకు వరమిచ్చెను.

## వ్యాససంహిత:

వ్యాససంహిత యను పేర రెండధ్యాయములలో నొక స్మృతి కాననగుచున్నది. దీనినే లఘువ్యాసస్మృతి యందురు. ఇందు స్నాన విధి, తత్ఫలవర్ణనము, సంధ్యాకర్తవ్యము, తత్ఫలవర్ణనము ప్రథమా ధ్యాయమునను; కర్తవ్యకర్మవిశేషవర్ణనము, శరీరశుద్ధివర్ణనము, నిత్యకర్మవర్ణనము, పంచమహాయజ్ఞవర్ణనము, భోజనాద్యనేకప్రకార వర్ణనము రెండవ యధ్యాయమునను గలవు. ప్రాతఃకాలమున బ్రహ్మముహూర్తమున స్నానము చేయవలయును. అంతకుఁ బూ ర్వము దంతధావనకు యోగ్యము లని చెప్పఁబడిన చెట్లపుల్లలతోఁ బలు దోముకొనవలయును. సూర్యోపస్థానసంధ్య ప్రతిదినము నాచ రింప వలయును. సంధ్యోపాసన చేయనిదే చేసిన పూజాదానవ్రతము లన్నియు నిష్ఫలములని యిందుఁ గలదు. నిత్యకర్మవిధానము దేవ యజ్ఞ పితృయజ్ఞాది పంచయజ్ఞములు చేయు తెఱఁగు; జపవిధి, జప మాలావర్ణనము, తీర్థస్నానవిధి, అఘమర్షణమంత్ర ప్రభావము, శివ పూజనమంత్రము, వైశ్వదేవకర్మ, భూతబలి, అతిథిపూజ, భోజన నియమములు, నిషేధములు, శయననియమములు మున్నగు మాన వాచార వివరణము లిందుఁ గలవు.

## వ్యాస స్మృతి:

ఇది వేదవ్యాస స్మృతి యనియుఁ బిలువఁబడుచున్నది. ఇందు ధర్మాచరణ దేశప్రయుక్తవర్ణ షోడశసంస్కారవర్ణనము గర్భాధానాది

షోడశసంస్కారవర్ణనము, వివాహవిధి, గృహస్థధర్మము, స్త్రీధర్మము, స్త్రీల నిత్యకర్మ, రజస్వలాధర్మనిరూపణము, పూర్వాహ్ణకృత్యముల నిర్ణయము, తర్పణాదివిధులు, గృహస్థాశ్రమ ప్రశంస, దానధర్మ ప్రకరణము, సత్పాత్రనిరూపణము, బ్రాహ్మణప్రశంస మున్నగునవి గలవు. స్త్రీ ధర్మములలో;

పత్యుః పూర్వం సముత్థాయ దేహశుద్ధిం విధాయ చ,
ఉత్థాప్య శయనాద్యాని కృత్వా వేశ్మవిశోధనం.

అన్నది, దాన విషయమున:

యద్దదాతి యదశ్నాతి తదేవ ధనినాం ధనమ్,
అన్యే మృతస్య క్రీడంతి దారైరపి ధనైరపి.

అన్నది, యీ స్మృతియందలి శ్లోకరత్నములకు మచ్చుతునుకలు.

వ్యాసభగవానుఁడు కారణజన్ముఁడు; పరమేశ్వరస్వరూపుఁడు; ఆ మహర్షివరేణ్యు నెంత స్తుతించినను దనివి తీఱదు.

వివిధామ్నాయలతాలవాల ధిషణా విఖ్యాత విజ్ఞానదీ
పవిఖాలోకితలోకవర్తనుఁ గృపాపారంగతున్ సాంఖ్యయో
గవిదున్ భారతసంహితావిరచనాకల్పున్ దపోనిత్యు సా
త్యవతేయుం గృతకృత్యుఁ గొల్చెద మునీంద్రస్తుత్యు
నత్యుత్తమున్.

(మార్కండేయపురాణము)

సంసారార్ణవపారగుం బరమహంసవ్రాత చూడావతో
త్తంసంబున్ శ్రుతిసంకరోద్ధనళపాథః క్షీర భేదక్రియా,
హంసంబున్ జగదేకవంద్యుజలదశ్యాముస్ మహాపాతక
ధ్వంసాభారతు భారతామృతనిధిన్ వ్యాసుం బ్రశంసించెదన్.

(గంగాధరుని బాలభారతము)

# మహర్షుల చరిత్రలు

## శుకమహర్షి

స్తుతి

ప్రతినిమేషముఁ బరబ్రహ్మంబు నీక్షించి
    మదిఁజొక్కి వెలువల మఱచువాఁడు
కమలంబుమీఁది భృంగముల కైవడి మోము
    పై నెఱసిన కేశపటలివాఁడు
గెఱ వ్రాసి మాయ నంగీకరింపని భంగి
    వసనంబు గట్టక వఱలువాఁడు
సంగి గాఁ డని వెంటఁ జాటు భూతములు నా
    బాలుర హాసశబ్దముల వాఁడు

మహితపదజానుజం ఘోరుమధ్యహస్త
బాహువక్షోగళాననఫాలకర్ణ
నాసికాగండమస్తకనయనయుగళుఁ
డైనయవధూతఁ గొల్తు బ్రహ్మణ్యు శుకుని.

(భాగవతము)

పరమపావను లగు భారత బ్రహ్మర్షులలో శ్రీశుకుఁ డగ్రేసరుఁడు. అతఁడు వేదవ్యాసమునీంద్రుని తపఃఫలము; యోగీశ్వరుఁడు, అవధూతమూర్తి. శ్రీశుకమహర్షినిఁ బోలిన తత్త్వజ్ఞుఁడు యోగీశ్వరుఁడు త్రిభువనముల నెక్కడను లేఁడు.

## శ్రీశుకుని జన్మవృత్తాంతము :

తొల్లి యొకప్పుడు వేదవ్యాసమహర్షి మేరుపర్వతాగ్రమునఁ గల కర్ణికార మను వనమున నీశ్వరుని గురించి ఘోరతపమొనరింపఁ జొచ్చెను. ఆ కర్ణికార వనముననే పార్వతీ సహితుఁడై పరమేశ్వరుఁడు తన్ను సకలప్రమథగణములు గొలువ విలాసముగాఁ గాలము పుచ్చుచుండెను. వ్యాసుఁ డూర్జిత యోగబలమున విశిష్టబోధనుఁడు కాఁగా శివుఁ డాతనికిఁ బ్రత్యక్షమయ్యెను. అంత వ్యాసమహర్షి భయభక్తి సంభ్రమముల నాతని పాదారవిందములఁ బడి స్తుతించెను. శివుఁ డానందించి వత్సలుఁడై యాతనిని లేవనెత్తి "మునీంద్రా! నీ శక్తి సామర్థ్యములకు భక్తితాత్పర్యములకు నెంతయు నానందించితిని. నీ కేమి కావలయునో కోరుకొను"మని పలికెను. వ్యాసుఁ డానందియై "పరమశివా! జలపవనాంబరవసుధానలసమవీర్యుఁ డగు సుపుత్త్రుని నా కొసంగు" మని ప్రార్థించెను. అంత శివుఁ డట్లే యగు నని యనుగ్రహించి యదృశ్యుఁ డయ్యెను. వ్యాసమహర్షి యథాపూర్వముగా దినములు పుచ్చుచుండెను.

ఒకనాఁడు సాత్యవతేయుఁ డగ్నికార్యపరుఁడై యరణి పుచ్చుకొని మథింపఁ దొడఁగు సమయమున ఘృతాచి యను నప్సరోవనిత యాతనికి లోచనగోచర యయ్యెను. అంత నాతఁడు కామవశుఁడు కాఁజొచ్చెను. అతఁడు చలింపుటఁ జూచి ఘృతాచి శాపభయమున వంచనఁ జిలుకయైయుండెను. వ్యాసుఁడు ధైర్య మవలంబించినను నంగజుని బలిమిచే ఘృతాచీరూపాతిశయసక్తచిత్తుఁ డయి యుండఁగా నాతని వీర్యము స్ఖలితమై యా యరణియందుఁ బడియెను. ఐన నాతఁడు నిర్వికారమగు నంతఃకరణముతో నరణి మథించిన నందుండి తండ్రిపోలికయు, దివ్యతేజస్సును గలిగి యొకపుత్త్రుఁ డుదయించెను. శుకరూప యగు ఘృతాచివలన స్ఖలిత మైన వ్యాసునివీర్యమున జనించుటచే నాతనికిఁ గొంత శుకరూపము నలవడ శ్రీశుకుఁ డని యాతని నామ మయ్యెను.

అప్పు డాకాశగంగ సాకారయై వచ్చి యీ బాలుని మంగళ స్నానసమన్వితు నొనరించెను. ఆకసమునుండి కృష్ణాజినదండము లాతని యెదుటఁ బడెను. దివ్యదుందుభుల మ్రోఁతయు, దేవాంగనా గానముల రవమును సర్వజన ప్రమోదకరముగ వినవచ్చెను. పుష్ప వర్షము కురిసెను. ఇంద్రాది దేవతలు సగౌరవముగా విచ్చేసిరి. పార్వతీ సహితుఁడై పరమేశ్వరుఁ డరుదెంచి శ్రీశుకున కుపనయన మొనరించెను. అపుడు దేవేంద్రుఁ డాతనికి మహోజ్జ్వలముగఁ బ్రకాశించు కమండలు వొసఁగెను. దేవత లెన్నఁడును మాయని దివ్య వస్త్రము లాతని కొసఁగిరి. మృగపక్షిసమూహములన్నియుఁ బ్రమోద భరితములై శ్రీశుక జన్మదినోత్సవ మొనర్చెను.*

## శ్రీ శుకుని బాల్యము:

తండ్రికివలెనే శ్రీశుకునకును జన్మింపఁగనే వేదములువచ్చెను. ఐన నాతఁడు తండ్రియనుమతిని బృహస్పతిని గురువుగాఁ జేసికొని దేవతలతో పాటుచటనే యుండి వేదవేదాంగములు, ధర్మశాస్త్రములు, రాజనీతి మున్నగు సకలవిద్యలుఁ జదువుచు బ్రహ్మచర్యవ్రతమున మహానిష్ఠుఁడై యుండెను. దేవత లంద ఱాతనిని మంత్రణీయుఁడు మాననీయుఁడుగఁ బూజించుచుండిరి. కొంతకాలమట్లు చనినపిమ్మట నాతనికిఁ బిత్రాశ్రమమున కేగు సంకల్ప ముదయించెను. బృహస్పతి యానందించి "వత్సా! నీ వెఱుఁగవలసిన శాస్త్రము లిఁక నెవ్వియును లేవు. నీవు మీ జనకునికడ కేగి యథేచ్ఛముగా నుండవచ్చును. పోయి ర"మ్మని యాశీర్వదించెను. దేవతలచే నామంత్రితుఁడై శ్రీశుకుఁడు తండ్రి యాశ్రమమున కరుదెంచి సాత్యవతేయునకు సాష్టాంగ నమస్కారము లొనరించెను. వేదవ్యాసుఁడును బుత్త్రుని గ్రుచ్చి కౌఁగిలించి యాదరించెను. అతఁడును దండ్రి ననుసరించి ప్రవర్తించుచు నటనే యుండెను.

* భారతము. శాంతిపర్వము. దేవీభాగవతము.

ఇట్లుండఁగా శుకుఁడుతోడి మునిబాలురతో నాటపాటల మఱఁగి కాలము వ్యర్థముగాఁ గడపఁ జొచ్చెను. వ్యాసుఁ డాత్మజుఁ డాత్మానుసంధానము చేయ నెఱుంగక క్రీడాపరుఁ డగుట గుర్తించి యాతనికి సాంఖ్యయోగశాస్త్రములను బోధించెను. మఱియు దేహమునందలి యహంకారము, బంధుమిత్రుల యందలి మమత్వము మున్నగునవి పాయునట్టి వాక్యము లుపదేశించెను. ఇవి విన్న శ్రీశుకునకు బ్రహ్మచర్య గార్హస్థ్య వానప్రస్థాశ్రమముల నెందును బుద్ధిపుట్టక "తండ్రీ! దయయుంచి నాకు మోక్షమార్గ ముపదేశింపు" మని కోరెను. వ్యాసుఁ డాతని మనోభావము తెఱిఁగి "వత్సా! నీవు జనకనరేంద్రుని కడకేగి యీ విషయముఁ దెలిసికొనుము. అతఁడు పూజ్యుఁడు. అహంకార మమకారము లాతనియెడఁ బనికిరావు. నీవు పాదగమనుఁడవై యాతనిఁ గాంచి మోక్షమార్గ మెఱిఁగి రమ్మని కుమారునిఁ బుత్తెంచెను.

### శ్రీశుకుఁడు జనకుని కడ కేగుట :

అంత శ్రీశుకుఁడు తండ్రియాజ్ఞ ననుసరించి మేరువు మున్నగు పర్వతములు, అనేక నదులు, వివిధ తీర్థములు గడచి భరతఖండమున కరుదెంచి దారిలో నే పదార్థములు చూచినఁ జూడనివాఁడై విదేహదేశమునఁ గల మిథిలానగరమునకుఁ జని జనకరాజభవనప్రాకారద్వారదేశమును జేరెను. ఆ సమయమున నచటి ద్వారపాలురు వానిని వారించిరి. అతఁడును బ్రశాంతుఁడై యూరకున్న వా రాతనికి వెఱచి నృపగృహమున కనిపిరి. అచటఁ బ్రతీహారు లాతనినాఁపి యీ వృత్తాంతము జనకున కెఱిఁగించిరి. జనకుఁడు పురోహితుని వలన నాతని శ్రీశుకునిగా నెఱిఁగి మంత్రిజనసహితుఁడై యర్ఘ్యపాద్యములఁ గొని వచ్చి శ్రీశుకుని సగౌరవముగా లోపలి సౌధమునకుఁ గొనిపోయి కాంచనసింహాసనమునఁ గూర్చుండఁ జేసి యక్షతములఁ గుసుమముల నాతనిఁ బూజించెను. పిమ్మట వారాంగనలు

గీతనృత్యరీతి శుకు నారాధింప నాతఁడు జితేంద్రియుఁడై యుండెను. నాఁటికి జనకుఁడు పురోహితుని నియోగించి మజ్జన భోజనాదు లొనరింపఁ జేసి మఱునాఁడు సూరిజన సమేతముగా నాతనిని దర్శించి స్తుతించి భయభక్తులతో నాతఁడు వచ్చిన పని యడిగెను. శ్రీశుకుఁడెంతయు నానందించి "రాజా! మా తండ్రిపంపున మోక్షమార్గబోధార్థినై వచ్చితిని. విప్రునకుఁ గర్తవ్య మేది? అతఁడు మోక్ష మెట్లు వడయఁ గలఁడు? ఈ ప్రశ్నములకు సమాధాన మి" మ్మనికోరెను.

### శుకునకు జనకుఁడు మోక్షమార్గము నుపదేశించుట:

జనకమహారాజు సాదరపూర్వకముగ శుకుని కిట్లు చెప్పెను. "విప్రోత్తమా! బ్రాహ్మణుఁ డుపవీతుఁడై బ్రహ్మచర్యము వేదాధ్యయనము నడపి వివాహ మాడి సంతానముఁ బడసి యధ్వరము లొనరించి దేవపితృతిథి పూజాపరుఁడై యుండి, వానప్రస్థాశ్రమమున కరిగి యందు హుతవహాశ్రయయుతముగ వ్రతపాలన మొనర్చి యా తరువాత సన్న్యాసస్వీకారమున బ్రహ్మాశ్రమపదము నందవలయును." అంత శుకుఁడు "రాజా! నీవు చెప్పినది సక్రమమే. కాని జ్ఞానోదయమై యుండఁగ నాశ్రమత్రయముఁ గ్రమముగ నడపవలెనా? జ్ఞానియైన నాశ్రమముల విడువ రా దని వేదములు చెప్పునా?" యని యడిగెను. అంత జనకుఁడు "మునీంద్రా! జ్ఞానవిజ్ఞానములు మోక్షసాధనములు. గురూపదేశమున నవి లభింపఁగా మోక్షము నందినవాఁడు వానిని విడుచును. కాని, లోకోచ్ఛేదము, కర్మవ్యాకులత వాటిల్లకుండుటకై పూర్వమునులు చతురాశ్రమములు క్రమముగా నడపిరి. ప్రథమాశ్రమముననే సుస్థిరజ్ఞానము లభించినవానికి మిగిలిన యాశ్రమములతోఁ బనిలేదు. సమాహితాత్ముఁడైన ముని యొరుల వలనఁ దనకుఁ దనవలన నొరులకు భయములేకుండనున్న మోక్షము గాంచును. కోరికయు, నొల్లమియు లేకున్న నకామవృత్తి దపోరతి నున్నవాఁడు బ్రహ్మము నందును. మఱియు, నినుముఁ గనకము;

నింద వినుతి వీనియందు సముఁడై యింద్రియము లడంచు నతఁడు శివునిఁ గనును. ఈ విశేషము లన్నియు నీయందుఁ గలవు. జ్ఞాన విజ్ఞానములు నీ గుణములు. నీవు మోక్షబోధుఁడవు. కాని, నీ మనమున సంశయము, భయము, లౌల్యము నివి మూఁడు నాశ్రయించుటచే నీవు వీని నెఱుఁగకున్నావు. నిజముగా నీవు ముక్తపురుషుఁడవని బోధించెను.

అంత శుకుఁడు విగతసంశయుఁడై శాంతి నిరూఢిఁ బరమ సౌఖ్యము నంది యాత్మావలోకనమున నానందించుచు మారుతముతో సమానధర్మము నంది తండ్రి యాశ్రమమున కేగెను. వ్యాసుఁ డానందియై పుత్త్రుఁడు చెప్పిన జనకరాజ సంభాషణము విని యాతనిఁ దనకడనే యుంచుకొని శిష్యుల కధ్యాపన మొనరించు చుండెను.*

## శ్రీశుకుఁడు తండ్రికడ వేర్చిన విషయములు :

ఒకప్పుడు శ్రీశుకుఁడు తండ్రినిజేరి తనకుఁ గాలావయవనిరూపణము, చతుర్యుగసంవత్సరపరిమితి ప్రకారము, చతుర్యుగధర్మములు మున్నగు విషయములెల్ల నెఱిఁగింపు మని యడిగెను. వ్యాసభగవానుఁ డంగీకరించి సుతున కన్ని విషయములు తెలిపెను. పిమ్మట బ్రహ్మము, తద్విజ్ఞానము, సర్వవర్ణధర్మములు, దానగుణప్రాశస్త్యము, మైత్రీగుణలాభము, మున్నగునంగతు లన్నియుఁ దెలిపెను. అంత యోగ సాంఖ్యాధ్వరప్రజ్ఞావిశేషములలో దేనివలనఁ బరబ్రహ్మము నందవచ్చు నని శ్రీశుకుఁ డడిగెను. ఇంద్రియనిగ్రహము, కామక్రోధలోభమోహమదమాత్సర్యములఁ బోఁద్రోలుట, దృఢవిద్య,

---

* భారతము, శాంతిపర్వము. దేవీభాగవతము. ప్రథమస్కంధము శుకుఁడు జనకరాజుకడ నుండి తిరిగివచ్చి పీవరి యను నామెను పెండ్లాడి బిడ్డలఁ గనె నని దేవీభాగవతమునఁ గలదు. ఈ విషయమునకు మఱే యాధారము లేదు. కాన నిది నమ్మఁదగినది కాదు.

కలవాఁ డేమార్గముననైన బ్రహ్మపదప్రాప్తి నందఁగలఁడని వ్యాసుఁడు బోధించెను. ఐనను బ్రహ్మచర్యము బ్రహ్మ విద్యావ్యాప్తికి ముఖ్య కారణ మని చెప్పి వ్యాసుఁడు సుతున కంతర్యాగప్రాశస్త్యమును విశదీకరించెను. పిమ్మట నింద్రియ నిగ్రహమే యుత్తమోత్తమధర్మ మగుట శుకునకుఁ దెల్పి వ్యాసమహర్షి గోప్రభావప్రకారముఁ దెల్పుటకు సుమిత్రుఁడను రాజువృత్తాంతమును గపిలగోమహానుభావమును దెలిపెను.

## శ్రీ శుకుఁడు పరీక్షిత్తును గటాక్షించుట:

ఈ ప్రకారము శుకుఁడు తండ్రిచే సమస్త విషయము లెఱిఁగి జనకచక్రవర్తితోడి సంభాషణమున విగతసంశయుఁడై పరబ్రహ్మను సంధానమున నవధూతమూర్తియై బ్రహ్మర్షి గణమాన్యుఁడై యొప్పారెను. అతఁడు తండ్రియాజ్ఞఁగొని భూభాగమం దెల్లెడల సంచరించుచు నెచ్చటను జిరకాలము నిలువక యావును బిదుకుట కెంత కాలము పట్టునో యంతకాలము మాత్రమే యున్నచోట నుండుచు నుండెను. ఆత్మవిద్యానవద్యుఁడగుట ననుక్షణము శుకుఁడు బాహ్యస్మృతివీడి యంతరవలోక నానందమగ్నుఁడై యుండెను. బట్టకట్టుట కూడ నాతఁడెఱుఁగని మహోన్నతస్థితి నంది మందహాససుందరవదనారవిందుఁడై ప్రపంచమున నెవ్వరితోడను సంబంధము లేక యే విషయలౌల్యమును లేనివాఁడై తిరుగుచుండ నాతనిఁ జూచి బాలురు కేకలు వేయుచు వెంట నంటువారు. అతని షోడశాబ్దవయో రూపగమనవముఁ గాంచి సమ్మోహితలు గాని స్త్రీలు, మోహింపనిపురుషులు లేకుండిరి. ముక్తికాంతయే యాతనిని మోహించెనన్న నితర స్త్రీలఁ బేర్కొననేల? ఐన నాతఁ డెవ్వరిని సరకు గొనక బ్రహ్మర్షియై పరగుచుండెను.

ఇట్లుండి యొకనాఁ డాతఁడు సప్తమదినాంతములోపుననే తక్షకవిషాగ్నిదగ్ధుఁ డగునట్లు శాపము నంది కింకర్తవ్యతామూఢుఁడై

యేడుదినములలో నెవ్వఁడు తనకు ముక్తి నీయఁగలఁ డని యాలోచించుచున్న పరీక్షిన్నరేంద్రుని కడ కేతెంచెను. పరీక్షిత్తు బ్రహ్మానంద భరితుఁడై యాతనికిఁ బ్రత్యుత్థానము చేసి యర్ఘ్యపాద్యాదివిధుల నతిభక్తిఁ బూజించి యేడు దినములలోఁ దనకు ముక్తి లభించు తెరు వెఱింగింపు మని ప్రార్థించెను. శ్రీశుకుఁ డాతని కభయ మిచ్చి సర్వాత్ముఁడైన హరిని సంభజించుటచే సాంఖ్యయోగమువలన ముక్తి నందవచ్చు నని తెలిపి ద్వాపరవేళఁ దన తండ్రి యగు కృష్ణద్వైపాయనుఁడు భాగవతము రచించి, తనచేఁ జదివించిన వృత్తాంతముఁ జెప్పి యా భాగవతకథను దాను వినిపింతు నని వినిపించి యాతనిఁ గటాక్షించెను.

## శ్రీశుకుఁడు పరీక్షిత్తునకు ముక్తిమార్గముఁ దెల్పుట :

"రాజా! విష్ణుసేవాబుద్ధితో భాగవతము వినుచో మోక్షార్థికి మోక్షము లభించితీరును. తొల్లి ఖట్వాంగుఁడను రాజు దేవలోకమున కేగి యందుఁ దన యాయువు ముహూర్తమాత్రకాలమే యున్నదని విని వెంటనే మహికి వచ్చి దారపుత్త్రరాజ్యములువిడిచి గాఢవైరాగ్య భావమున గోవిందనామకీర్తన మవలంబించి కైవల్యముఁ జూఱ గొనెను. నీ యాయుః కాలమింక నేడు దినము లున్నది కదా! నీవు చేయవలసిన పనులు దెల్పెదు వినుము. దేహపుత్త్రకళత్రాదులవలని మోహవృక్షమును నిష్కామ మను గొడ్డంట నిర్మూలింపుము. పుణ్య తీర్థజలావగాహనమున నేకాంతశుచిప్రదేశమున నిష్ఠాననమున నుండి ప్రణవమంత్రముఁ బఠించుచు విషయములఁ వెంటఁ బాఱెడి యింద్రియములను శేముషీబలమున నిరోధించి భగవత్పాదాంగములఁ గ్రమముగ ధ్యానము చేయుచు ధారణావశమునఁ జిత్తకల్మషములఁ బోఁ ద్రోలి భక్తిలక్షణమైన యోగము నాశ్రయింపుము. దానివలన సర్వమయుఁడైన పరమేశ్వరుని విగ్రహము ననుసంధానము చేయుము.

తపోయోగాదు లైన ముక్తిమార్గము లనేకములు కలవు. కాని, వీని యన్నిటిలో భక్తిమార్గమే యుత్తమోత్తమమగు ముక్తిమార్గము. ఏలనఁ, దొల్లి బ్రహ్మ వేదములు ముమ్మారు తలపోసి జనార్దను నాత్మకృత భక్తిమార్గముననే చింతచేసెను. కావున నీ వద్దానినే యాశ్రయింపు" మనిచెప్పి శుకమహర్షి పరమేశ్వరధ్యానపూర్వకముగాఁ బరీక్షిత్తునకు భాగవతగ్రంథమును వినిపించి మహోపకృతి యొనరించెను. పరీక్షిన్న రేంద్రుఁడును శుకయోగిమూలమునఁ బరబ్రహ్మమును బ్రాపించెను. *

## శ్రీశుకుఁడు నారదోపదేశము నందినవృత్తాంతము :

పిమ్మట శ్రీశుకుఁడు తండ్రి యాశ్రమముననే యుండుచు సుమంతప్రభృతులతో వేదాధ్యయన మొనరించుచుండెను. కొంతకాలమునకు సుమంతాదులు వ్యాసానుగ్రహమునంది వేదముల నెల్ల నెల్ల విప్రులకును బోధింపఁ ద్రిలోకములంతటను వర్తింప నేగిరి.

అంత నొకనాఁడు నారదమహర్షి వ్యాసాశ్రమమున కేతెంచెను. శ్రీశుకవ్యాసు లాతని కాతిథ్య మొసఁగి యర్చించిరి. అంత నాతఁడచట వేదనినాదము వినరాకుండుటకుఁ గారణ మేమని వ్యాసు నడిగెను. శిష్యు లట లేనికారణమున నని వ్యాసుఁడు పలుకఁగా నాతఁడు "మునీంద్రా! నీవును నీ సుతుఁడైన నా వ్రతము చెల్లింపవలయును. ఇట్లు బ్రహ్మనాద మిచట వినరాకుండుట మంచిదికాదని నా యభిప్రాయ" మని పలికెను. నారదవచన మంగీకరించి వ్యాసశుకులు భువన మంతయు నాదాపూరిత మొనరించిరి. అపు డనధ్యయన సమయ మగుట గుర్తించి యధ్యయన మాపుచేసి వ్యాసుఁడాకాశగంగాప్రపాతప్రదేశమునకు స్నానార్థ మరిగెను. ఇట శ్రీశుకుఁ

* భాగవతము.

దధ్యయనసమయము కాఁగాఁ గొంతసేపు నారదుఁడు విన నధ్యయన మొనర్చి యాతని రంజింపఁజేసెను. నారదుఁడానందించి శ్రీశుకు నేదేని వరముఁ గోరుకొనుమని చెప్పెను. అంత నాతఁడు లోకమునఁ బుట్టినవానికి హిత మేదియో తెలుపు మని కోరుకొనెను.

నారదుఁడు శుకునిఁ జూచి "శ్రీశుకా! తొల్లి సంయము లీ ప్రశ్నమునే సనత్కుమారు నడిగిరి. అతఁడు చెప్పిన సమాధానమే నీకుఁ జెప్పెదను. తపము, సత్యము, విద్య యివి పరమసుఖప్రద ములు. వీని నందుటయు, ముక్తి కుత్సహింప కుండుటయు జరిగిన ముక్తి యే పుట్టువునను లభింపదు. ఈ ముక్తి సాధించుటకుఁ గామ క్రోధముల రెండింటిని జయింపవలయును. అపరిగ్రహము; సర్వా రంభపరిత్యాగము, అహింస, యింద్రియజయము వీని నందినచో ముక్తి కరతలామలక మగును. పిమ్మట ధర్మాధర్మములు సత్యాసత్య ములు విడువలయును. అదెట్లనిన సంకల్పవర్జనముచే ధర్మము, అహింసవలన నధర్మము పోవును. బుద్ధిఁ గొని సత్యాసత్యములను ద్రోవవలయు. ఆత్మవిభావనమున బుద్ధి విలీనత నందినను బదివేలను మించి శోకభయహేతువులు గాననైనను వీనిని నరకుగొనరా"దని బోధించెను.

శ్రీశుకుఁడు విగతసంశయుఁడై తండ్రియగు వ్యాసమహర్షిని గాంచి తాను యోగసిద్ధి నందుదునని చెప్పి యాతని యనుమతినంది తండ్రికిఁ బ్రదక్షిణించి బయలుదేఱెను. అంత వ్యాసుఁ డొక్కపటి నిలువు మన నాతఁడు నిస్స్నేహము, నిస్సంశయము గలవాఁడగుట నాఁగక సిద్ధచారణసేవితమగు కైలాసపర్వతముపై కేగి యందు వియుక్తప్రదేశమునఁ బ్రాఙ్ముఖాసీనుఁడై పరమయోగనిరతిఁ బద ప్రభృతిగాత్రములఁ గ్రమమున నాత్మధారణ మొనరించి యినుఁ డుదయింపఁగా నాతని నాశ్రయించి నిర్విషయమగు సర్వాత్మతత్త్వ ముఁ గాంచి విశిష్టయోగక్రమ మందెను.

### శ్రీశుకమహర్షి యోగమార్గమున నదృశ్యుఁ డగుట :

పిమ్మట నారదుఁ డాతనిఁ జూడరాఁగా నాతని కాత్మయోగసిద్ధి నెఱిఁగించి శ్రీశుకుఁడు విగతసంగత్వమున విమలయోగావలంబనమున గరుత్మంతునివలె నాకసమున కెగసిపోయెను. తోడిసిద్ధసాధ్యాదు లచ్చెరు వందిరి. శ్రీశుకుఁడు మృగపక్షిశైలసరిత్సరసీతరుగుల్మలతలఁ గనుఁగొని తన తండ్రివచ్చి తన్నుఁ బిలిచిన నవి యెల్ల 'ఓ' యన వలయు నన నవి యంగీకరించెను. పిమ్మట నాతఁడు తమోరజస్సత్త్వములఁ గ్రమమున విడిచి యుత్తరాభిముఖమ్ముగాఁ బోవుచుండఁగా నొక్కట మహాపర్వతశృంగములు రెండు పెచ్చుపెరిఁగి యాతని మార్గమున కడ్డు తగిలెను. అపు డాతఁ డప్రతిహతగమనమున ముందునకేగ నవి పిండిపిండియై నేలరాలె. అపు డాసిద్ధపురుషునిపై దేవతలు పుష్పవృష్టిఁ గురిపి బహువిధములఁ గీర్తించిరి.

తరువాత శ్రీశుకుఁ డటు చని యాకాశగంగానదిపై నాకాశయానమునఁ బోవుచుండఁగా నందు నగ్నలై జలక్రీడలాడు నప్సరసలాతనిఁ గాంచియు నెప్పటియట్ల నగ్నలయియే యుండిరి. అంత వెనుకనుండి వ్యాసమహర్షి నిజసుతునికై మహాయోగగమనమున వచ్చుచుండఁగా శ్రీశుకుఁడు వాయుమార్గమును దాఁటి సర్వభూతాత్మకుఁడయ్యెను. వ్యాసభగవానునకు సిద్ధులు పర్వతశృంగములు ఛిన్నాభిన్నము లగుటఁ దెలుప నాతఁడు 'శుకా' యని పిలువ సకలజంగమస్థావరజంగములును 'ఓ' యని పలికెను. అతఁడు క్షణమాత్రమట నిలువఁబడ నాకాశగంగానదీతోయముల జలక్రీడలాడు నప్సరసలు సిగ్గుపడి వలువలు ధరించిరి. ఇది చూచి సాత్యవతేయుఁడు నిజ సుతునసక్తతయుఁ దనసక్తతయు నిరూపించుకొని లజ్జవొడమ నిలిచియుండెను. అపుడు సిద్ధచారణగంధర్వగణములు గొలువ గంగాధరుఁడు వ్యాసునకుఁ బ్రత్యక్షమై యాదరించి "మునీంద్రా! నీవు తొల్లి జలపవనాంబరవసుధానల సమవీర్యుఁ డగు పుత్త్రు నడిగితివి.

K. Dayanand



అట్టి వానిని నేను నీ కిచ్చితిని. అతఁడు నా ప్రభావమునను నీ తపో విశేషమువలనను బ్రహ్మతేజోమయుఁడై దేవతలు నందరాని పరమగతి నందెను. కావున, నీవు ఖేదమువీడి మోదము నందుము. మఱియు, నీ సుతుని కీర్తియు, నీ యశోవిభూతియు నాచంద్రతారార్కము విశ్వజనుల వీనులకు విందై విలసిల్లగలవు. ఐనను, నీకు వలయునేని నీ పుత్ర సదృశమైన ఛాయ నిన్నెప్పుడు ననుగమింప నీవు చూడఁ గల" వని యాతని సంప్రీతునిఁ జేసి వీడుకొల్పి విజయము చేసెను. వ్యాసుఁడు పుత్రునిమహోన్నతి కానందించి యాశ్రమమున కరిగెను.*

ఈ ప్రకారము శ్రీశుకమహర్షి యోగమార్గావలంబియై పరబ్రహ్మస్వరూపుఁడై భవ్యవిఖ్యాతి నార్జించెను. ఆ మహామహుని పవిత్ర స్మరణము భవభయనాశకము, ఇహపర సాధకము.

ఓం తత్సత్ బ్రహ్మార్పణ మస్తు.

---

* భారతము శాంతిపర్వము.

# శ్రీమహర్షిజీవితకథామృతము

# 3

★

★

బులుసు వేంకటేశ్వరులు, బి. ఏ.,
విద్వాన్, పి. ఆర్. కాలేజీ,
రామారావుపేట, :: కాకినాడ.

# విషయసూచిక.


| | | | |
|---|---|---|---|
| i తొలిపలుకు | | 4. కణ్వుఁడు | 58 |
| i అంకితము | | 5. కర్దముఁడు | 68 |
| 1. అంగిరసుఁడు | 1 | 6. గర్గుఁడు | 77 |
| 2. ఔర్వుఁడు | 37 | 7. గౌరముఖుఁడు | 88 |
| 3. కండుఁడు | 50 | 8. జాబాలి | 98 |


---

# తొలిపలుకు

శ్రీమహర్షిజీవితకథామృత మనుపేర నిదివఱకు అగస్త్యుఁడు, అత్రి, అష్టావక్రుఁడు, ఋశ్యశృంగుఁడు, కపిలుఁడు, కశ్యపుఁడు, గౌతముఁడు, చ్యవనుఁడు, జమదగ్ని, దత్తాత్రేయుఁడు, దధీచి, దుర్వాసుఁడు అనుమహర్షులజీవితచరిత్రలు ప్రథమభాగముగాను ; నారదుఁడు, పరాశరుఁడు, భరద్వాజుఁడు, భృగుఁడు, మార్కండేయుఁడు, యాజ్ఞవల్క్యుఁడు, వసిష్ఠుఁడు, విశ్వామిత్రుఁడు, వ్యాసుఁడు, శ్రీశుకుఁడు అను మహర్షులజీవితచరిత్రలు రెండవభాగముగను రచించి ప్రకటించితి.

ఇపు డీయెనమండుగురుమహర్షులజీవితచరిత్రలు మూఁడవ భాగముగ రచించి ప్రకటించితిని. ఇటులే యింకను జైమిని దేవలుఁడు, పిప్పలాదుఁడు, బకదాల్భ్యుఁడు, మరీచి, మాండవ్యుఁడు, ముద్గలుఁడు, మైత్రేయుఁడు, రైభ్యుఁడు, వామ

దేవుఁడు, వాల్మీకి, వైశంపాయనుఁడు, శాండిల్యుఁడు, శౌనకుఁడు, కౌశికుఁడు, సనత్సుజాతుఁడు, సారస్వతుఁడు, హారీతుఁడు మొ॥ ఋషిమహర్షుల చరిత్రలు మూఁడింటిని భాగములుగ విభజించితిని. దైవకృప గలదో వానిని ద్వారకాలోఁ బ్రకటింపఁగలను.

ప్రాచీన భారతీయ మహర్షుల చరిత్రలు వ్రాయుట సామాన్యమహర్షులకే దుర్లభము. నా యీ సాహసమును మన్నించి సహృదయులు నా యుద్యమమందలి గుణలేశమును గ్రహించి ఆశీర్వదింతురుగాక !

... రఘు ...,                    ... రావు.

అంకితము

శ్రీమద్భారతవర్షపూజ్యుఁడవు
పుణ్యుఁడవు మహాత్ముఁడవు
నియమమున యమమున శమమున గుణమున
నికముగ నైకొన్న ని
ష్ఠాగరిష్ఠ! గుణాత్ముఁడా! పరమ
జ్ఞానప్రదా! కృపా
శ్రీమూర్తీ! కయికొమ్ము మత్కృతి మహా
సద్భక్తి హర్షంబుగా.

# అంగిరసుఁడు

జననము

శ్రీవిష్ణుమూర్తి నాభికమలమునుండి జన్మించిన బ్రహ్మదేవుఁడు సృష్టికార్యమునకు తనకు సహాయులుగా నుండుటకు తనమానసమునుండి కొందఱుమానసపుత్త్రులను గాంచెను. తనముఖమునుండి యాతఁ డిచ్ఛామాత్రమున నొకసుపుత్త్రుని గాంచి యాతనికి 'అంగిరసుఁ' డనునామకరణము చేసెను. అమ్మహా పరమేష్ఠి బహుకాల తపోమహిమముచే దీప్తుఁడైన అంగిరసునిని సకలలోకములను ప్రకాశింపఁజేయు దివ్యతేజస్వి యగున ట్లనుగ్రహించి, “వత్సా! నీవు లోకానుగ్రహార్థము మహాతప మొనరింపుము. నీవు నామానసపుత్త్రులలో మూఁడవవాఁడవు. నీవు నాదయకుఁ బాత్రుఁడవై నేఁ గోరినట్లు నడచి నేను చెప్పినను టెల్ల నిర్వహించుచు లోకసంరక్షణ మొనరింపుము. నీవు సుగుణఖని యగు నొకసుందరిని బరిగ్రహించి వంశవర్ధన మొనరింపఁగలవు. మఱియు నీ వగ్నికల్పుఁడవై విశ్వవిఖ్యాతి నార్జించి వెలుఁగొందుము” అని పలికెను. అంగిరసుఁడు బ్రహ్మకు నమస్కరించి “తండ్రీ! సమస్తలోకములకు సృష్టికారకుఁడ వగు నీవు శాసించిన నేను సంసిద్ధుఁడను. లీలామాత్రముగా నీవు మమ్మెటులు సృజించి మాచేఁ బనులుగొనునట్లు కాననగుదువు కాని, కమలాసనుఁడ వగు నీ వొనర్పఁజాలనిది కలదే? నీనిర్హేతుకవాత్సల్యమునకుఁ

దానిం జూచి గాయత్రిచ్ఛందస్సు ఏమి కిది దా!'' యని యాతని మనికి కొరకు బ్రహ్మ యాతని హోమాగ్ని గోపతి తపోగమనము చేయుమనెను.*

నిరుక్తి

అంగిరసుడు శిల్పశాస్త్రవిదుడై పరబ్రహ్మ స్వరూపమును సంస్తుతించుచు, శాస్త్రసాధనకై దేహమును నగలుమనమునకు ... ల నూతనమాయ మొసంగుచుండుటచే, నింద్రియార్థములకు ... యుక్తముగా మొసంగి యనుపాదు ... సర్వోత్తము మైనమహావిద్య నిష్ఠతో ... సర్వశక్తిమయుడై సర్వేంద్రియనిగ్ర

---

* ఈ కథ ... ఈయంగిరసుడు ఐతరేయ బ్రాహ్మణమున నిట్లు కలదు: ప్రజాపతి ... బ్రహ్మ సరస్వతిని ... రమించెను ... దేవతలు ... అగ్నిదేవుడు ... ప్రజ్వరిల్లెను. అయగ్ని దేవునియందు ... ఇతండే అంగిరసుడు. (ఐతరేయబ్రాహ్మణము 3-34.) ఈకథయే స్వల్పభేదముతో శతపథబ్రాహ్మణమునను గలదు. 4-5-1-8.)

గోపథబ్రాహ్మణమున, అంగిరసుని జన్మవృత్తాంత మిట్లు కలదు: బ్రహ్మదేవుడు లోకసృష్టి కొరకై తనను సంకల్పించి మహాతపస్సు చేయదొడంగెను. ఆతనితీవ్రతపస్సువలన గలిగిన శ్రమ కారణముగా నాతని శరీరమునుండి దివ్యరసము ముద్భవించెను. ఈవిధముగా వరుణాని యంగము-దేహము-నుండి యుద్భవించిన రసమే మానవాకృతిం గాంచి యంగిరసుం డయ్యెను. ఈయంగిరసుడు మహాతపశ్శాలియై 'అంగిరసవేదము'నకు ద్రష్ట యయ్యెను.

(గోపథబ్రాహ్మణము 1. 1. 7-8.)

ణుండు నై యాతఁడు సర్వేశ్వరసదృశుఁ డన వెలుఁగొందుచుండెను.

తండ్రి యగుబ్రహ్మదేవునికృపచేతనే యంగిరసునకు దివ్యతేజము పుట్టుకతోడనే లభించెను. నిష్ఠాగరిష్ఠుఁడై యాతఁ డొనరించుచున్నమహాతపస్సువలన నాతఁ డింకను దేదీప్యమానముగా వెలుఁగొందుచుండెను. ఆతనితపశ్శక్తివలన నాతనికి సర్వశక్తులు లభించుచున్నను నాతఁ డిసుమంతయైన గర్వము నందఁ డయ్యెను. సర్వలోకప్రకాశమానం బగునాతనితేజోవిశేషమునను నాతనికి నహంకారము లేశమాత్రమైనఁ బొడమదాయెను. నిరంతరతపోధ్యానాసక్తుఁడగు మునకుఁ బ్రపంచమాయ లాతనికిఁ దపోవ్రతధర్మమునకు నిచ్చ పుట్టుచయ్యె నన్న నచ్చెరువే మున్నది! బుద్ధిమత్వతో సర్వమూర్ఖించుటవలనఁ గలుగుసంతోషమునకన్న సర్వత్యాగమువలని సంతోష మెంతయు నుత్కృష్టము! దేహబంధుమమకారములకును దానిని వద్ధి మొందు సచ్చాచలతపోనిష్ఠునును నెంతదవ్వ!

### వివాహము

ఈప్రకార మంగిరసుఁడు తపోమూలమున మహర్షిత్వ మందఁ గని జ్ఞాననిధియు వివేకఖనియు నై యనేకము లగు వేదమంత్రములకు ద్రష్టయు బహుముఖము లగుధర్మములకు శాసకుఁడు నై విలసిల్లుచుండెను.

అంతకుమున్నే విశ్వసృష్టికై బ్రహ్మచే నియోగింపఁబడి కర్దమప్రజాపతి సరస్వతీనదీతీరమునఁ బదివేలసంవత్సరములు దివ్యతప మొనరించి విష్ణుమూర్తికటాక్షముచే కళ, అనసూయా, శ్రద్ధ,

హవిర్భువు, గతి, క్రియ, ఖ్యాతి, అరుంధతి, శాంతి యనెడి తొమ్మండ్రు కూఁతుండ్రను, కపిలాచార్యుఁడను పుత్త్రుని నిజసతియగు దేవహూతి యందుఁ గాంచెను. కాలక్రమమున నీతనికూఁతులు త్రిలోకసుందరులు, సర్వలోకసద్గుణసంపన్నలు, మహాశక్తిప్రభావాన్వితలు నయి యుక్తవయస్సుఁ గాంచి వివాహయోగ్యలై కమలాకరమున విలసిల్లుపద్మములవలెఁ గర్దమప్రజాపతిగృహమున నత్యంత శోభాయమానలు కాఁజొచ్చిరి.

అంతఁ గర్దమప్రజాపతి సుతలకుఁ దగినపతుల నన్వేషింపఁ దలంచి, తనదివ్యదృష్టిచే మరీచి, అత్రి, అంగిరసుఁడు మున్నగు బ్రహ్మర్షులే తన కల్లుండ్రగుట బ్రహ్మలిఖితముగాఁ గని, తా నొనర్చుకన్యాదానమును స్వీకరించి తన్ను ధన్యు నొనర్పుఁడని తగినవారిని మరీచి, అత్రి, అంగిరసుఁడు, పులస్త్యుఁడు, పులహుఁడు, క్రతువు, భృగుఁడు, వసిష్ఠుఁడు, అథర్వుఁడు నను నవ బ్రహ్మలను బిలువ నంపెను. కర్దమునియాహ్వానమును మన్నించి యాఋషులు విచ్చేసిరి. అంగిరసోమహర్షి కూడ నీతరుణముననే కర్దమగృహమునకు విచ్చేసి యాతనికన్యను బరిగ్రహించుట కంగీకరించెను. అంతఁ గర్దముఁ డమితానందమున దేవహూతిసహితుఁడై మరీచికిఁ గళను, అత్రికి ననసూయను, అంగిరసునకు శ్రద్ధను, పులస్త్యునకు హవిర్భువును, పులహునకు గతిని, క్రతువునకుఁ గ్రియను, భృగువునకు ఖ్యాతిని, వసిష్ఠున కరుంధతిని, అథర్వునకు శాంతిని నొసఁగి నిజకులాచారానుసారముగ నిరుపమవైభవముతో నిఖిలదేవర్షిసంఘములు నిర్మలవేదమంత్రనినాదములు నింగిముట్టింప వివాహము లొనరించెను. సర్వలోక

సంప్రాప్తము లగుపేరిని వివాహములను విడచి సర్వసర్వదేవ నాయకులును నీకి నాశీర్వదించి రావెను. దేవమహాత్రికర్మములు కాలములు కల్పురత్తో సంభావనానంభావనాలంగం కేసి, యుద్ధశ్వర మగునాత్మాసనసింహాసనముల సమర్పించి యుద్ధరామపత్నేయు నండను, అత్యంతప్రియనముల సఖులలోనముల కాదర్శ ప్రాయులు కాంగను, అఖిలలోకప్రతిభాశాలు రగు పుత్రులను అత్యుత్తమపతిప్రతాశిరోమణు లగుపుత్రికలను గాంచి సంతానాభి వృద్ధి నొందింపను, ఆశీర్వదించి వారివారియిండ్లకు బంపివేసెను.

ఈవిధముగా నంగిరోమహర్షి శ్రద్ధను ధర్మపత్నిగా గ్రహించి యుత్తమాముల యమోఘాశీస్సులతో దంపతుల్యాశ్రమ ముచను వచ్చెసి గృహస్థాశ్రమము సద్వృత్తముగా నిర్వహింపం జొచ్చెను.

## సంతానము

బ్రహ్మర్షి యగు నంగిరసునకు విద్యాగుణ యువతి సౌశీల్య యగు శ్రద్ధయందు పరమపవిత్రవంశమునై తేజస్సారమాత్ర మోక్షలక్ష్మిని కేరుటకుం జేసినసద్భాగ్యప్రభావం కాని సంసారము నటిపిన సారము కాదు. కాలకర్మములకు నింద్రియవాంఛా ప్రవృత్తులకు వారకేతులై నియమధర్మము, విగ్రహానంవనము, నిరుపమదివ్యసిద్ధులను వారు సంసారయాత్రలో సంపాదించుకొనిరి. ఈశ్వరప్రియులు సర్వేశ్వరోద్దిష్టములు నగుపాత్రకార్యములలో నియుక్తులై, జగమంతయు నీశ్వరమయముగా గనుచు, మనో వాక్కాయకర్మములు పరమేశ్వరపాదాంబుజములయందే నిశ్చల ముగా నిలుపంగలిగి, నిత్యానందాబ్ధిలో వారోలలాడుచుండిరి.

ఇట్లు గృహస్థజీవనమును సైతము తపోమయజీవితముగా నిర్వహించుచు అంగిరసుఁడు పరమేష్ఠియగు తన తండ్రియాదేశమును శిరసావహించి తనధర్మపత్ని పతివ్రతాతిలకము నగు శ్రద్ధయందు బృహత్కీర్తి, బృహజ్జ్యోతి, బృహద్బ్రహ్మ, బృహన్మనసుఁడు, బృహన్మంత్రుఁడు, బృహద్భానుఁడు, బృహస్పతి యను నేడ్వురుపుత్రులను; భానుమతి, రాక, సినీవాలి, ఏకానేక, అర్చిష్మతి, హవిష్మతి, మహామతి యను నేడ్వురుపుత్రికలను గాంచెను.* వీరిలో బృహత్కీర్తియే యుతథ్యుఁ డను నామాంతరమునను బృహజ్జ్యోతియే సంవర్తుఁ డనుమఱియొకపేరుతోడను గూడఁ బిలువఁబడుచుండెడివారు. కాలక్రమమున నంగిరసుని పుత్త్రికలు బహుపుత్రులు వారిపుత్రికలుఁ బుత్రులు నెందఱో జనించుటచే నాతనివంశము తామరతంపరయై విశ్వమంతయు నలముకొనెను. అంగిరసునిపుత్రులను పౌత్రులను బ్రపౌత్రులను గూడ అంగిరసు లనియు, అంగిరులనియు, ఆంగిరసు లనియు శ్రుతిస్మృతిపురాణములు పేర్కొనియున్నవి.

వీరిలో అయాస్యుఁ డనువాఁ డొకమహర్షియై యనేకవేదమంత్రములకు ద్రష్టయయ్యెను. ఆతనినే అయాస్యాంగిరసుఁ డని పిలుతురు. ఈతనిసంతతివారే ఆయాస్యులు. ప్రస్తుతము గౌతమసగోత్రులు అంగిరస, అయాస్య, గౌతము లన్ త్రయార్షేయులు. ఈవంశమునకు మూలపురుషుఁడైన బ్రహ్మర్షిచంద్రుఁడే అంగిరసుఁడు.

* కాని, అంగిరసునకు ఉతథ్యుఁడు, బృహస్పతి, సంవర్తుఁడు అను ముగ్గురుకొడుకులు, సునాశ్రయ యోగసిద్ధి, యనుకూఁతురుమాత్రమే పుట్టె నట్లు భారతము ఆదిపర్వము (3 అ. ౬౬) నఁ గలదు.

### అంగిరసుఁ డగ్నియగుట

పూర్వ మొకప్పు డగ్నిహోత్రుఁడు దేవతలపైఁ గోపించి తనవిధ్యుక్తధర్మములు నిర్వర్తింప మాని రహస్యముగ నేకాంతవాసమున నొకయడవిలోఁ దపస్సుచేయుచు నుండఁదొడఁగెను. అప్పుడు దేవతలీవిషయము బ్రహ్మకుఁ దెలిపి నిత్యకృత్యముల కాటంకము కలుగకుండుటకై ప్రతివిధాన మేదైనఁ గావింపు మని కోరిరి. అంత, బ్రహ్మదేవుఁ డాలోచించి యగ్నిదేవునికన్నఁ దేజస్వియు నుత్తమవ్రతసంపన్నుఁడు నగుఅంగిరసుఁడే యగ్నికృత్యములు నిర్వర్తింపఁగలఁ డని యూహించి యామహర్షి యాశ్రమమునకేతెంచెను. శ్రద్ధాంగిరసు లాతని నతిశ్రద్ధాభక్తులతోఁ బూజింప నాతఁడు వచ్చినపనిఁ దెలిపి యనంతతపోబలము న మహాతేజస్వియై యెల్లలోకములను బ్రకాశింపఁజేయు నంగిరసు నగ్నిపదమున నిలిపి యగ్నివిధు లెల్ల నిర్వర్తింప నియమించెను. అంగిరసుఁడు వినయమున నంగీకరించి యాతనిని వీడ్కొలిపెను.

అప్పటినుండి యంగిరసుఁడే యగ్నియై దేవతలకు సర్వలోకములందును జరగుయజ్ఞములనుండి హవ్యభాగములను మోసికొనిపోయి వారియాదరగౌరవముల కెంతయో పాత్రుఁడై యగ్నిలేనిలోపమును జక్కఁగాఁ బూరించి యాతనికన్న మిన్నగా నగ్నిపనులు నిర్వర్తించుచుండెను. ఇట్లుండ నంగిరసునిప్రభావసంపన్నతచేఁ దనపేరును జనులు విస్మరించుచుండుట నెఱింగి యగ్నిహోత్రుఁడు తనయవివేకమునకు వగచి యిఁక నేమఱినచోఁ దననామరూపములే నశించిపోఁగల వని భయపడి మరల నిజ

స్థానమును గైకొన నరణ్యమునుండి దేవలోకమునకు విచ్చేసెను. కాని, యంగిరసుఁ డత్యద్భుతముగాఁ దనపనులను నిర్వర్తించుచు దేవతలకుఁ బ్రీతిపాత్రుఁడు నత్యంత తేజోవిలసితుఁడునై యుండుటఁ గాంచి మిక్కిలి వెఱఁగంది యాతనిముందు నిలువనైన నిలువలేక తేజోవిహీనుఁడై తిరిగి వనభూములకేఁగ మఱలెను. ఆతనిని గాంచినయంగిరసుఁడు సగౌరవముగాఁ బిల్చి "మహాత్మా! చరాచరప్రపంచమున కంతకును భుక్తిముక్తిప్రదాతవు నీవు. నీవు లేనిచోఁ బ్రపంచ మొక్కక్షణమైన నిలువఁగలదా? మహాతేజస్వివైననీవు నీకార్యము లొనర్చుచు లోకసంగ్రహ మొనరింపుము. నీవు లేనికారణమున బ్రహ్మచే నియోజితుఁడనై యీకార్యములు నేను చేయుచున్నాను. కాని, నీతో నే నణుమాత్రము సరిపోలను. నీయగ్నిపదవిని నీవే స్వీకరించి నన్నును లోకములను గటాక్షింపు" మని వేఁడుకొనెను.

సర్వశక్తిసంపన్నుఁ డైనను సంతతవినయగరిమ వివేకబుద్ధి కనఁబఱచినయంగిరసునకు భయభక్తులతోఁ బ్రణామము లొనరించి యగ్నిదేవుఁడు "మహర్షీంద్రా! నీతేజోగరిమవలన నా యూరుఁబేరులన్నియు నశించినవి. ముల్లోకములందు నీప్రభావ మనంతముగా నలముకొన్నది. అగ్నిస్థానమున సర్వశక్తిసంపన్నుఁడవగునీవే యుండవలయునుగాని తేజోవిహీనుఁడ నగు నేనుండ నర్హుఁడనుగాను. మఱి నీవు కాదుకూడ దందువేని నీవు ప్రథమాగ్నివై యుండి నాకు రెండవ యగ్నిస్థానము నొసంగుము. అంతియే కాని నిజముగా నీకంటె నెన్నఁడును మిన్నఁ గాఁజాలని నన్ను

నీ విట్లు కోరుట ధర్మముకా"దని పలికెను. అందుల కంగిరసుఁడు "దేవా! కాలకర్మవశమున నొకొక్కప్పు డెంతవారైనఁ దేజోవిహీను లగుచుందురు. కాని, యచిరకాలముననే వారు మరల నిజప్రభావము నందఁగలరు. క్రోధకారణమున నీ విట్లు కొంత కాలము తేజోహీనుఁడ వైన నై యుండవచ్చును. అంతమాత్రమున నీనిజప్రభావము శాశ్వతముగాఁ గోలుపడదుకదా! కావున, నీవే ప్రథమాగ్నివై యథాపూర్వముగా నీవిధుల నిర్వర్తించి లోకహితము చేయుము. మఱి యింకఁ గాను కూడ దండువా నన్నుఁ బుత్త్రవాత్సల్యమున రెండవయగ్నిస్థానమున నిలుపుము. నీకు విధేయుఁడనై నీయాజ్ఞలను శిరసావహింతు" నని చెప్పెను. అందుల కగ్నిదేవుఁడు వల్లె యని తాను ప్రథమాగ్నిస్థానమున నిలిచి యంగిరోమహర్షిని ద్వితీయాగ్నిస్థానమున నుంచి యాతని మహానుభావత కనురూపముగా నాతనిపుత్రుఁ డగుబృహస్పతికి సంభావనపూర్వకముగాఁ దృతీయాగ్నిస్థానము నొసంగి వారిరువు రను దనతోడివారి నొనర్చుకొనెను.

ఇట్లు సర్వోత్కృష్ట మగుతపోధ్యానలబ్ధతేజోబలమున నంగిరసుఁడు సకలజగత్పావన మగునగ్నిదేవతాస్థానము నంది వెలుఁగొందుటయే కాక తనపుత్త్రుఁ డగుబృహస్పతికి నట్టిస్థానమును సంపాదించి యది వంశక్రమాగత మగునట్లు చేసికొనెను.

### అంగిరసుఁడు చిత్రకేతు ననుగ్రహించుట

తొల్లి శూరసేనదేశమును చిత్రకేతుఁ డనురాజు పరిపాలించుచుండెను. ఆతఁ డైశ్వర్యమున దేవేంద్రునిఁ బోలి, కుమాది

సుగుణంబుల కాటపట్టయి,ప్రజారంజకముగ రాజ్యమేలుచుండెను. గుణమండనుఁడు,అంచితకీర్తికాముఁడు నగునాతనికిఁ దారుణ్యమదనతురంగాలు,కందర్పవిజయఖడ్గలతలు, మదనమోహనమంత్రదేవతలు,పంచశిలీముఖునిబాణకత్తెలు నాఁ జెలువొందుకోటిమంది నలినాక్షులు భార్య లుండిరి. అతఁ డమితకీర్తివైభవములతోఁ జెలువారుచుండియుఁ గోటిమందిభార్యలను గలిగియుండియు సంతానమునుమాత్రము కనఁజాలఁడయ్యెను. రూపము,ప్రతాపము, భోగము, యౌవనము, యోగ్యవర్తనము, దిగ్విజయము, సత్యము, కీర్తి, సతులు మున్నగునైశ్వర్యము లెన్నియున్నను నాతనికి సంతతిలేనిదుఃఖమును మాన్పఁజాలవయ్యెను. ఇట్లు నిరంతరదుఃఖమానసుఁడైన చిత్రకేతునిపై దయగొని యొకనాఁ డంగిరసుఁ డీతనియింటికి విచ్చేసెను.

చిత్రకేతుఁ డంగిరోముని కెదురేఁగి యాతని కతిథిసత్కారము లనేకము లొనరించి యుచితాసీను నొనర్చి భార్యాసహితుఁడై యాతని నెంతయో సేవించెను. అంగిరసుఁడు నాతని కుశల మడిగి "రాజా! రాజ్యచక్ర మంతయు నీయధీనమే కదా? పృథివి, జలము, తేజము, వాయువు, ఆకాశము, మహత్తు, అహంకారము—అను నీయేడింటిచేతను సంరక్షితుఁ డగుజీవునివలె అమాత్యజనము, జానపదులు, దుర్గములు, ద్రవిణము, సంచయము, దండము, మిత్త్రము అనుసప్తవిధప్రకృతులచేతను సురక్షితుఁడవై ప్రకృతిపురుషులపై సమస్తభారమును విడిచి నిర్మమత్వమున నిరుపమరాజ్యసుఖము లనుభవింతువుగదా? మఱియు

భార్యలు, ప్రజలు, మంత్రులు, భృత్యులు, పౌరులు, జానపదులు నీకు వశవర్తులై యున్నారా? ఏమిది! సర్వమును గలిగినసార్వభౌముఁడ వయ్యు నీముఖమున దుఃఖచిహ్నములు, తాండవమాడుచున్న వేల?" యని యడిగెను. చిత్రకేతుఁడు "మహర్షీంద్రా! మీతపోబలమున మీ కెఱుఁగరాని దేమున్నది?" యని తలవాల్చి యూరకున్నఁ జూచి యంగిరోమహర్షి సర్వముఁ దెలిసి దయాళువై యారాజుచేఁ బుత్రకామేష్టిఁ జేయించి యజ్ఞశేషము నాతనిప్రథమభార్య పట్టమహిషి యగుకృతద్యుతి యను నామె కొసంగి "దేవీ! నీకు పుత్త్రుఁడు కలుగును. అతనివలన నీవు సుఖదుఃఖము లనుభవింతు" వని చెప్పి వెడలిపోయెను.

తరువాత, కృతద్యుతి గర్భమును ధరించి నవమాసములు నిండినంత నొకకుమారునిఁ గాంచెను. చిత్రకేతుఁ డపరిమితానందము నంది కృతస్నాతుఁడు సకలభూషణభూషితుఁడు నై సుతునకు జాతకర్మాదు లొనరించి సర్వవర్ణములవారిని మహాదానముల రంజిలఁజేసి సుఖ ముండెను. ఆకుమారుఁడును దినదినప్రవర్ధమానుఁ డగుచుండ రాజు సుతుని గన్న కృతద్యుతియందే బద్ధానురాగుఁడై యుండెను. ఇది గని మిగిలినభార్య లసూయ చెంది రాజునకుఁ గృతద్యుతియం దిట్టిమహానురాగమునకుఁ గారణ మాపుత్త్రుఁడే యని గ్రహించి దారుణచిత్తలై యాతనికి విష మిడిరి. ఆబాలుఁడు సుఖనిద్రితునివలె వెంటనే మరణించెను. రాజును రాణియు నీదుఃఖవార్తను విని యాతనిపైఁ బడి తలమొల యెఱుఁగక పెద్దపెట్టున విలపించుచుండిరి.

ఈసంగతియంతయు నెఱింగి కరుణాళుఁడై యంగిరసుఁడు నారదునితోఁ గూడి యట కేతెంచి దుఃఖమూర్ఛితుఁడైన చిత్రకేతుని గనుంగొని "రాజా! ఏ మిట్లు మతిదొరఁగి విలపింతువు? నీకు వీఁ డెవఁడు? నీ వెవ్వనివాఁడవు? ఈనీపుత్త్రమిత్త్రాదులు పూర్వజన్మమున నెవరిపుత్త్రమిత్త్రాదులో నీ వెఱుంగఁగలవా? నదీవేగమునఁ జేరి తొలఁగుచున్న యిసుకరేణువులవలెఁ బ్రాణులు పుట్టుచుఁ జేరుచుఁ జచ్చుచుండును. విష్ణుమాయవలన భూతములకు భూతములు పుట్టి నశించును. దీని కింత విచారించుట ప్రాజ్ఞలక్షణము కాదు. నీవు, మేము, తక్కినవారు కూడ ఈకాలమున జన్మించితిమి. మఱి మృత్యువువలన విరామ మొందుదుము; అచిరముననే చచ్చినవార మగుదుము. చావుపుట్టుకలు సత్యములు కావు. ఈశ్వరుఁడు లీలాలోలుఁడై భూతములచే భూతములఁ బుట్టించు. వానిచే వానిని బెంచు. వానిచే వానిని నశింపఁజేయు. అతనిచే సృజింపఁబడిన దేనికిని స్వతంత్రత లేదు. అతఁడు బాలునివలె నిరపేక్షుఁడు. దేహి యైనపితృదేహముచేత దేహి యైనపుత్త్రదేహము మాతృదేహమువలనఁ గలుగుచుండును. ఈరీతినే బీజమువలన బీజము పుట్టుచుండుట దేహికి శాశ్వతముగా జరుగుచుండును. సామాన్యవిశేషములు సన్మాత్రవస్తువునకుఁ గల్పింపఁబడినట్లే దేహమునకు జీవునకు నన్యోన్యవిభాగ మజ్ఞానమునఁ గల్పింపఁబడెను. దహనక్రియల నగ్ని యొక్కఁడయ్యుఁ బెక్కురూపంబులఁ గానఁబడునట్లు ఒక్కఁడైనజీవుఁడు పెక్కుభంగులఁ గాననగుచుండును. ఆత్మజ్ఞానరహితులు దీని

నెఱుంగలేరు. దేహి దేహసంయోగము కలలో భయమునుగొలుపు ప్రయోజనమును నడపి మేలుకని యాకలలో జరిగినది తనకుఁ గాదని యెఱుంగురీతిని జీవుఁడే తా నని జ్ఞానగోచరుఁ డెఱుంగును. కావున, అన్నియు మనోమాత్రములే యని మోహతమమును విడిచిపెట్టి భగవంతుఁ డైన వాసుదేవునిపైఁ జిత్తము నిలిపి నిర్మలాత్మకుఁడ వగు'' మని బోధించెను.

చిత్రకేతుఁ డీయుపదేశామృతమునఁ దెలివొందియు దుఃఖభారమున వారిని గుర్తింపఁజాలక మీ రెవ్వరని యడిగెను. అందులకు అంగిరసుఁ డిట్లనియె. ''ఓరాజా! పుత్త్రకాము వైన నీకుఁ బుత్త్రు ననుగ్రహించిన యంగిరసుఁడను నేను. ఈతఁడు నారదమహాముని. దుస్తరపుత్త్రశోకమున మునిఁగిననిన్నుఁ గరుణించి పరమజ్ఞాన ముపదేశింప వచ్చితిమి. నీదుఃఖమును మాన్పఁ బుత్త్రుని బ్రదికించితిమేని పుత్త్రవంతు లగువా రనుభవింపవలసినమహాతాపము నీ వనుభవింపవలసి వచ్చును. లోకమున సతీసుతులు, సర్వసంపదలు, భోగభాగ్యములు, అతిచంచలములు. రాజ్యము, భూమి, బలము, ధనము మొదలగున వెల్ల శోకము, మోహము, భయము, బాధ వీని నెడతెగక కలిగించుచుండును గాని సుఖముల నీయఁజాలవు. మఱియు నివి గంధర్వనగరమువలెఁ గలలోఁ గననైనసంపదఁబోలి కానఁబడుచుండునే కాని మనోభవము లగునర్థములఁ గూడి స్వార్థంబులై కానఁబడవు. కర్మములచే ధ్యానము చేయుమనములు నానాకర్మములు గలిగించుచుండును. ఈదేహి దేహము ద్రవ్యము, జ్ఞానము

క్రియ అనుమూఁడింటితోఁ గూడుకొని దేహికి అనంతము లగు దుఃఖములను గలిగించుచుండును. కావున, నీవు నిర్మల మగుమనస్సుతో నాత్మగతిని వెదకుకొని శాశ్వతపదవి నందుము.'' అని బోధించెను. చిత్రకేతుఁ డీయుపదేశమునఁ దెలివందియుండ నారదుఁడు తనప్రభావమునఁ జచ్చినపుత్త్రుని బ్రదికించి యాతని చేతనే యాలినికిని చిత్రకేతునకు లవమాత్రము సంబంధము లే దనియు:

''సతు లెవ్వరు సుతు లెవ్వరు
పతు లెవ్వరు మిత్త్రశత్రుబంధుప్రియసం
గతు లెవ్వరు సర్వాత్మక
గతుఁడై గుణసాక్షి యైనఘనుఁ డొక్కనికిన్.''

అనునాత్మజ్ఞానమును బోధింపఁజేసెను. అపుడు చిత్రకేతుఁడు వగ లుడిగి సర్వసంపదలు త్యజించి నారదోక్తమార్గమున మోక్షపద మంది వెలుఁగొందెను. ఇట్లు అంగిరోమహర్షి భక్తితత్పరులు సంసారార్ణవములో మునిఁగి వివేకహీను లైనపుడఖండజ్ఞానబోధామృతమున నెందఱనో తరింపఁజేయుచుండెడివాఁడు. అనంతరము నారదాంగిరసులు సరససల్లాపములతో నాత్మజ్ఞానరహస్యములను బెక్కు వక్కాణించుకొనుచు యథేచ్ఛాగమనమున బ్రహ్మలోకమున కేఁగిరి.

### అంగిరసుని తీర్థయాత్ర

అంగిరసుఁ డొకానొకప్పుడు కశ్యపమహర్షి వలన సమస్త తీర్థములప్రభావము నెఱిఁగి యెల్లతీర్థముల నోలలాడి విచ్చేసెను.

అపిమ్మటఁ గొంతకాలమునకు గౌతమమహర్షి యంగిరసునిపాలికి విచ్చేసి "మహాత్మా! పరమార్థసారము కడముట్ట నెఱింగిన పుణ్యపురుషుడవు నీవు. నీమానసము నిష్కల్మషము. శాంత్యాసుఖములు నీపాలికొంపులు. నీవు నాయందు దయయుంచి సర్వతీర్థరహస్యములను దేటతెల్ల మొనరింపవే" యని ప్రార్థించెను. అంగిరసుఁ డానందియై యాతనితో "గౌతమా! నీ వడిగినవిషయము మహోన్నత మైనది. శ్రద్ధాభక్తులతో దీనిని విన్నవారిమహత్త్వముఁ గిన్నవారే. కావున, వినుము:

'చంద్రభాగ' యనుతీర్థమున వరుసగా నేఁడుదినములు స్నానము చేయువారు సర్వపాపములు పోఁగొట్టుకొని పరమపుణ్యు లగుదురు. అందలిజలములు తరంగపరంపరలచే నృత్యము సలుపుచుండును. నరుఁ డందు సుస్నాతుఁడై యుపవసించి యేఁడుదినము లాజలములఁ గ్రుంకు లిడినచో నాతనిసద్గతిని వర్ణింప శేషునికైన నలవి కాదు.

కాశ్మీరదేశమున నెన్నియో నదులు జనించి సింధునదిలోఁ గలియుచున్నవి. ఈతీర్థముల నోలలాడిననరులు సత్ప్రవర్తనము కలిగి ఈలోకమున సమస్తైశ్వర్యములు గని తుదను ముక్తి నందుదురు.

పుష్కరతీర్థమునను, ప్రభాసతీర్థమునను, నైమిషతీర్థమునను, దేవిక, ఇంద్రమార్గ, స్వర్ణబిందు అనుతీర్థములందును నోలలాడినవారు స్వర్లోకము నంది యప్సరోవనితలనృత్యగానముల నానందింతురు.

‘హిరణ్యబిందు’ వనుతీర్థమునఁ బ్రశాంతచిత్తముతో స్నానము చేసినను, దానిని బహుముఖములఁ గొనియాడినను, ‘కుశేశయ’ ‘దేవాంతము’ లనుతీర్థముల నోలలాడినను మానవుఁడు సమస్తపాపరాసులను క్షాళన మొనర్చుకొనఁగల్గును.

గంధమాదనపర్వతప్రాంతమునఁ గల ‘ఇంద్రతోయ’ మనుతీర్థమున మునుక లిడినచో ముక్తి కలుగును. మఱియుఁ గురంగదేశమునఁ గల ‘కరతోయ’ తీర్థమున స్నానము చేసిన నరుఁడు మూఁడుదినము లుపవసించి మఱల స్నానము చేసినచో అశ్వమేధయాగఫలము నందఁ గాంచును.

గంగాద్వారమునను, నీలభూధరణమునను, కుశావర్తమునను, కనఖలమునను, బిల్వకతీర్థమునను స్నాన మాచరించిన నరుఁడు పాపదూరుఁడై పుణ్యగతి నందును.

బ్రహ్మచర్యవ్రతపాలనము, ఇంద్రియనిగ్రహము, క్రోధవిజయము, సత్యదీక్ష కలిగినమానవుఁడు ‘అపాంహ్రదము’నఁ గ్రుంకు లిడుచో నశ్వమేధయాగఫల మందఁగనును. గంగానదియుత్తరమున శివస్థానమునుండి చనుచోట స్నానము చేసినవారమృతాశను లగుదురు. మఱియు ‘మహాశ్రమ’ మనుతీర్థముల కడ నరుఁ డాహారము మాని యొకనెల యున్నచో సకలసిద్ధులు కాంచును. ‘భృగుతుంగ’ మనుమహాహ్రదముదగ్గఱ మూఁడు దినము లుపవసించిన బ్రహ్మహత్యాదోషము తొలఁగును. ‘కన్యాకూప’ మనుతీర్థమున నగ్నిహోత్రముతోఁ గూడ నున్న వాఁడు భూలోకమునను, స్వర్లోకమునను గూడఁ గీర్తి కాంచును.

'సుందరికాహ్రద' మనుతీర్థమున స్నానము చేసినచో నరుఁడు సుందరుఁడై జన్మించును. 'వైమానిక' మనుతీర్థమున మునిఁగిన స్వర్గము లభించును. 'విపాశ'తీర్థమున మునుక లాడినవారికి సమస్తపాపములును బోవును. మూఁడుదినములు 'కాళికాశ్రమము'న బ్రహ్మచర్యదీక్షతో నున్ననరుఁడు జన్మరాహిత్యమును గాంచును. 'కృత్తికాశ్రమమున' స్నానము చేసి పితృతర్పణ మిచ్చిననరుఁడు శివలోక మందు నని మునీశ్వరులు తెలిపిరి. 'ద్రోణశర్మపదము', 'శరస్తంబము', 'దేవదారువనము' అను తీర్థములు తమ్ము సేవించినవారికి స్వర్గసుఖము లొసంగును. 'చిత్రకూటము', 'జనస్థానము' ననుతీర్థసేవవలన రాజ్యలక్ష్మి లభించును. 'శ్యామాశ్రమ' మనుతీర్థమున శుచియై పక్షముదినము లుపవసించిననరుఁడు ధ్యానయోగఫలమును గాంచును. 'కౌశికవాల' మనుతీర్థమున నుపవాసము చేసి మౌనముతో నిరువది యొక్కదినము లున్ననరుఁడు పరమగతి నందును. 'మతంగవాపిక' యనుతీర్థమున నొక్కనాఁడు నిలిచినవాఁడు సిద్ధుఁడగును. నెల యున్నచో 'నైమిశము' మహాయజ్ఞఫలము నిచ్చును. 'ఉత్పలావనమున' నున్నవాఁ డశ్వమేధఫలము, నైశ్వర్యము గడించును.

గంగాయమునాసంగమమున నరుఁడు స్నానము చేసి కాలాంజన మనుశైలమున నియతితో నిలచినచో ముక్తి గాంచును. "వైవస్వతి" యనుతీర్థమును సేవించినచో మానవుఁడు తీర్థభూతత్వముఁ గాంచును.

మఱియు, ప్రయాగ కెన్నియో తీర్థములు వచ్చి చేరుచుండును. అందు నెలదినము లున్ననరుఁడు ముక్తిలక్ష్మిని సునాయాసముగా సంపాదింపఁగలఁడు.

అష్టావక్రము, కలవింకము, దేవహ్రదము, మున్నగు తీర్థములసంసేవ నరునకు బ్రహ్మభావము నొసంగును. ఊర్వశీ కృత్తికాయోగసిద్ధకీర్తి యైన "లౌహిత్య" మనుతీర్థమును సేవించి మానవుఁడు పుండరీక మనుయాగమును జేసినఫలము నందును. "రామహ్రదమునఁ బండ్రెండుదినములు నిరాహారుఁడై యున్ననరుఁడు సకలపాపములను బోఁగొట్టుకొనును. "మహాహ్రద" మనుతీర్థమున నెలదినము లుపవసించినవాఁడు జమదగ్ని మహర్షి కన్నపుణ్యలోకమును గాంచును.

వింధ్యమున నెలదినము లేకాగ్రతతోఁ దపముచేసిన మహాత్ముఁడు ధర్మజ్ఞుఁడై వెలసిల్లును. "నర్మద"లో స్నానము చేసి చక్రవర్తిత్వమును, "జంబూనదీ" మార్గమున సంయతచిత్తముతో మూఁడుమాసములయొక్క దిన ముండి సర్వసిద్ధులను మానవుఁడు పొందఁగనును.

"కోకాముఖ" మనుతీర్థమున మునిఁగి "తండులికాశ్రమమున" కేఁగి యట వల్కలములు ధరించి శాకాహారియై ప్రశాంతమనస్కుఁడై యున్ననరుఁ డట నున్న దశకన్యకామణుల కధిపతియై యజరామరత్వము నందును.

"కుల్య" యనుతీర్థమున మూఁడురాత్రు లుపవసించి శౌచియై యఘమర్షణజపము చేసినమానవుఁడు మహాశ్వమేధ

యాగఫలము నందును. "ఆర్ష్టిసేనాశ్రమమున" నున్న మనుజుఁడు సర్వపాపములను బోఁగొట్టుకొనును. "పిండారకమున నొక్కరాత్రి నిలిచిననరుఁ డగ్నిష్టోమయాగఫలముఁ గాంచును. "ధర్మారణ్యము"నఁ గల "బ్రహ్మసరస్సు"న నోలలాడినవాఁడు పౌండరీకమహాయజ్ఞఫలమును గడించును. పార్వతికిఁ దండ్రియుఁ బరమేశ్వరునకు మామయు, సర్వరత్ననికరవిశ్వపుణ్యస్థానమునైన హిమాలయపర్వతమున శాంతచిత్తుఁడై మునిసేవ తపము చేయఁగలిగిన నరుఁడు సిద్ధపురుషుఁడై బ్రహ్మలోకమును గాంచి చెలువొందును.

ఓగౌతమా! కామక్రోధలోభమోహమదమాత్సర్యములను విడిచిననిర్మలచిత్తముతోఁ జేసినతీర్థసేవయే పురుషునకు ఫలసిద్ధి నొసంగును. కాని, యొండువిధమున నేప్రయోజనమును గలుగదు. పుణ్యతీర్థసంసేవవలన నరునకు దమము, తపము, అహింస, శమము, శౌచాతిశయము నలవడును గాని వ్యర్థజలములవలన శుచిత్వము కలుగదు.

కాని, గౌతమా! ఒక్కరహస్యము కలదు. అలభ్యపదార్థములయం దావంతయును గోరిక లేక, లభించినపదార్థములు స్వల్పములైనను వానియెడ నసంతృప్తి కాని మమత్వము కాని లేక నిస్పృహు లగునీవంటివారు నిత్యశుచులు. వారికి నేఁ జెప్పినతీర్థసేవలతోఁ బనియే లేదు. మఱియు నింకొక రహస్యము చెప్పుచున్నాను. వినుము, దుర్గమములు అతివిషమ

ములు నగుతీర్థములను బోయి సేవింప లేకున్నను వాని నధికభక్తి యుక్తులతో నాత్మఁ దలంచినఁ జాలును. మానవునకుఁ గలసర్వ పాపములు నశించిపోవును.

సర్వతీర్థమహిమాశంసన మనుఈవాక్యరత్నములు మహా పవిత్రములు, అనుపములు, మాననీయములు, స్వర్గదములు, పరమరహస్యములు. శ్రద్ధాభక్తివిధేయుఁ డగుశిష్యునకు, నిజ సుతునకు, ఆప్తమిత్రునకు, ఉత్తములకు దయతో నీవిషయములు తెలుపఁదగినవి. ఈతీర్థయాత్రాకథనము నిర్మలచిత్తముతో బఠించినను, శ్రద్ధతో విన్నను నరునకు జాతిస్మరణము తోడిజన్మమును, అతిపుణ్యపురుషసంతతియును గలుగును." ‹

ఈమాటలు గౌతము నానందవార్ధిని ముంపఁగా నాతఁ డంగిరసు నెంతయు స్తుతించి నిజాశ్రమమున కేఁగెను. అంగిర సుఁడు బోధించినయీతీర్థసేవాప్రసంగమే మహాపుణ్యప్రదమై విలసిల్లెను.

### అంగిరసుఁ డగ్నిని ఋషిపత్నులను శపించుట.

తొల్లి యొకప్పుడు స్తవనీయరూపసౌందర్యయుతలు, భువనమోహినులు, మంగళగుణాఢ్యలు, శృంగారవతులు, నవ యౌవనాంగలు నగుసప్తర్షి పత్నులు వహ్నిమందిరమున వర్తిల్లుచుండిరి. అపు డగ్ని వారలఁ గనుంగొని కామమోహితుఁడై రతికాంక్ష కలుగ వారియంగములు ముట్టి భయపడి వారిసౌంద ర్యమున కచ్చెరు వందుచు వారిని గాంచుచుండెను. ఆయతివలు పతిపదసరోజసమర్పితస్వాంత లగుటచే అగ్నిసంపర్కము నెఱుంగఁ జాలరైరి. కాని, పరస్త్రీవాంఛాకల్మషుఁ డగుఅగ్నియంతరంగము

నాతనికాంతివిహీనతచే వెంటనే కనిపెట్టఁగలిగిన యంగిరసుఁడు కోపించి సర్వభక్షకుఁడవు కమ్మని యగ్నిని శపించెను. అగ్ని యచేతనుఁడై భయముచేతను లజ్జచేతను భక్తిచేతను అంగిరసుని స్తుతించి యథాపూర్వము వెలుఁగుచుండెను.

కాముకుఁ డగుపరపురుషునిస్పర్శవలన నపవిత్ర లైన ఋషిపత్నులఁ గనుంగొని యంగిరసుఁడు "ఓ కాంతలారా! మీదోషము లేకపోయినను, కాముకుఁ డగుఅగ్నిస్పర్శవలన మీకును బరపురుషస్పర్శదోషము కలిగినది. ఆదోషమునకు మీరు ఫలమందనినాఁడు మీసంపర్కమున మాకు మహాదోషము కలుగును కావున,మీరు విప్రకులమున సుందరులై జన్మించి విప్రులభార్యలు కఁ" డని శపించెను.

అంత ఋషికాంతలు సంతాపస్వాంతలై రోదనము చేయుచు "మునికులతిలకా! మేమెన్నఁడును బరపురుషస్పర్శ మెఱుంగనివారము. పాప మెఱుంగనిపరమసతులము. అనఘమతులు, బ్రహ్మనిష్ఠులు, ఘోరతపఃప్రభావయుతులు, మహనీయచరితులు నగుమాపతులను విడిచి భూలోకమున కేఁగి యెట్లు జన్మముఁ గాంచి మనఁగలము?" అని పలికిరి. అంగిరసుఁ డాపలుకు లాదరించి దయార్ద్రుఁడై వారిముఖపద్మములఁ గాంచి తాను సర్వజ్ఞుఁడు వేదవేదాంగపారగుఁడు జ్ఞానయోగసంపన్నుఁ డయ్యు శోకపరవశత మూర్ఛిలి కొంతవడికిఁ దెలివంది సోదరఋషులతో నాలోచించి యాపడఁతుల కిట్లనియెను.

"కాంతలారా! పుడమిలో నిజకర్మభోగులభోగము ఆకర్మాంత మని శ్రుతులు పలుకును. మాతోడిభోగము మీకు

గతమయ్యెను. గతభోగము మరలఁ గలుగఁబోదు. ఎవరికైనను శుభాశుభకర్మఫలము కుడువక పోరాదు. మీకు నా శాపము శుభప్రతిపాదకమే కాఁగలదు. మీరు భూలోకమున కరిగి విప్రభార్యలై వెలయుచు రాధారమణుని గాంచి గోలోకమునకుఁ బోఁగలరు. అప్పై శ్రీకృష్ణయోగమాయానిర్మితము లైనమీ ఛాయలు మూర్తిమంతములై విప్రమందిరములకుఁ జని యచటఁ గొన్నిదినము లుండి మామాగృహములకుఁ జనుదెంచును. మీరు నిజాంశములచే మరల మాకుఁ బత్నులగుదురు” అని పలికెను.

అప్రకారము మునిపత్నులు భూతలమునఁ బుట్టి విప్రభార్యలై భక్తిచే శ్రీహరికి భోజనమిడి యత్యుత్తమ మైనహరిమందిరమునకుఁ జనిరి. వారిసిరి పూర్వమున కంటె నధికతర మయ్యెను. నీచలబ్ధసంపత్తికంటె ఘనలబ్ధవిపత్తి చాల మేలుకదా! నిజముగా సత్పురుషులకోపము మిక్కిలియుపకారమే యగును. పతిపరిత్యాగ మనువిపత్తు ఋషిపత్నులకుఁ గలిగినను మోక్షసంపద కలిగినకారణమున నాఋషిపత్నులచరిత్రము మహిమాస్పద మయ్యెను. ఆత్మపత్నులయెడ నల్పాల్పదోషమైనను మహర్షులు క్షమించి విడువరుకదా!

### అంగిరసుని బ్రహ్మవిద్యాబోధ

తొల్లి యొకప్పుడు శౌనకమహర్షి అంగిరసునికడ కరుదెంచి తనకు బ్రహ్మజ్ఞానము నుపదేశింపు మని శ్రద్ధాభయభక్తులతోఁ బ్రార్థించెను. అపు డంగిరసుఁడు శ్రద్ధ లేనివారికి బ్రహ్మ

విద్య బోధించు టెంతదోషమో శ్రద్ధగలవారికి అడిగినప్పుడైనను బోధింపకుండుట అంతదోష మని యిట్లు బోధించెను:

"పరవిద్య యనియు, అపరవిద్య యనియు విద్య రెండు విధములు. ఋగ్యజుస్సామాథర్వవేదములు, శిక్ష, వ్యాకరణము, కల్పము, నిరుక్తము, జ్యోతిషము, ఛందస్సు అనువేదాంగములు— ఇవన్నియు అపరవిద్యలోఁ జేరును. అక్షరస్వరూపుఁడైన పరమాత్మను గూర్చినజ్ఞానమే పరవిద్య. పరమాత్మ కంటికిఁ గానరానివాఁడు, ఇంద్రియములచే గ్రహింప నను వు కానివాఁడు, నిత్యుఁడు, సర్వవ్యాపకుఁడు, సర్వాంతర్యామి, అతీంద్రియుఁడు, నాశనరహితుఁడు. ఈపరమాత్మవలననే చైతన్యజడవిశిష్టమైన ప్రపంచము సృజింపఁబడినది. అతనియాజ్ఞచే బ్రహ్మ తపస్సంపన్నుఁడై అన్నమును సృజించెను; అందుండి ప్రాణాదులను సృజించెను.

ముక్తి నందుటకుఁ గర్మమార్గము, జ్ఞానమార్గము, నని రెండుమార్గములు కలవు. కర్మమార్గము త్రేతాయుగమున నెక్కువ ఫలప్రదముగా నుండెను. బహునియమనిష్ఠాపరులై యీశ్వరార్పణబుద్ధితో నిష్కామముగ సద్రూపపరమాత్మజ్ఞానమునకై కర్మము లాచరించి చిత్తశుద్ధివలన మోక్షమునార్జించినవారిమార్గ మిది. యజ్ఞమూలమున జరుపురోడాశాదిద్రవ్యములను శ్రద్ధాభక్తులతో మంత్రపూతముగ నగ్నియందు హోమము చేయుట, అమావాస్య పౌర్ణములయందు ఇష్టులు చేయుట, చాతుర్మాస్యవ్రతములు చేయుట, నూతనముగా ధాన్యము వచ్చినపుడు 'ఆగ్రాయణము' చేయుట, అతిథ్యభ్యాగతపూజ చేయుట.

వైశ్వదేవాదుల నొనరించుట, సకాలమున కాళి, కరాళి, మనోజవ, సులోహిత, సుధూమ్రవర్ణ, స్ఫులింగిని, విశ్వరూపి యను సప్తజిహ్వలు గలయగ్నిని ఉపాసించుచుండుట—ఇవి కర్మమార్గ క్రియలు. దీనివలన నింద్రలోకము బ్రహ్మలోకము సంప్రాప్తము లయి నరునకు ముక్తి కలుగును.

శ్రద్ధాభక్తియుతముగా మహాతపస్సు చేయుచు, విరక్తులై అమనస్క-యోగము, అస్పర్శయోగముల నభ్యసించుచు, శమదమాదిషట్క-సంపత్తి కలిగి, గురుసేవామూలమున జ్ఞానమార్జించి సూర్యద్వారమున బ్రహ్మలోకము నట సమ్యగ్దర్శనమున మోక్షము నందుట జ్ఞానమార్గము.

పాంచభౌతికప్రపంచ మంతయు పరమాత్మచేతనే సృజింపఁబడి ఆయనయందే లయ మగును. ఆపరమాత్మ ప్రకాశము రూపుదాల్చినవాఁడు, అంతట వ్యాపించినవాఁడు, సమస్తజీవరాసులందు, బయటలోపల నుండువాఁడు, జన్మజరాదిమస్వాభావవికారములు లేనివాఁడు, క్షరాక్షరముల కతీతుఁడు*, స్థూలసూక్ష్మకారణశరీరరహితుఁడైనయుత్తముఁడు.

ఈపరమాత్మునినుండియే ప్రాణము, మనస్సు, ఇంద్రియములు, పంచభూతములు జనించుచున్నవి. అగ్ని యీతనిశిరస్సు. సూర్యచంద్రు లీతనినేత్రములు. దిశలే చెవులు. వాగ్వ్యాపారమే

---

* కదలుచున్న జలములో కదలుచున్నట్లు కనఁబడుచంద్రుఁడు క్షరుఁడనఁబడును. స్తిమిత మైననీటిలో నిశ్చలముగా నున్నచంద్రుఁడు అక్షరుఁడనఁబడును.

వేదము. వాయువు ప్రాణము. ప్రపంచము హృదయము. పృథివి పాదములు. అనఁగా నీతఁడు సర్వవ్యాపి. ఇతని నెఱుఁగువారే ముక్తులు.

ఈపరమాత్మజ్ఞానము నందుటకై ఉపనిషత్తులను ధనుస్సుగాఁ జేసి, అంతఃకరణవృత్తిని బాణముగాఁ జేసి, ఉపాసనయనుపదును పెట్టి, పరమాత్మయం దేకాగ్రత కలమనస్సును బ్రహ్మముగా భావించి దాని నేయవలయును. అపుడు పరమాత్మయొక్క అపరోక్షజ్ఞానము కలుగును. అదియే మోక్షము.

దీనివలన సమస్తసంశయములు నశించును. అవ్యయానందము కలుగును. అజ్ఞానము దూ పడఁగును. ప్రారబ్ధము, ఆగామి, సంచితము అనురూపములు గలకర్మము లన్నియు ఈ జ్ఞానమువలన నశించును.

శరీర మనునది వృక్షము. దీనిపై రెండుపక్షులు గలవు. అవి జీవేశ్వరులు. జీవుఁడు వేఱు శరీరము వేఱు అనునట్లు కనఁబడును గాని యది సత్యము కాదు. కదలుచున్ననీటిలోఁ గదలుచున్నట్లు కనఁబడినను, కదలనినీటిలో నిశ్చలముగాఁ గనఁబడినను, ఆకాశమునందలిచంద్రుఁ డొక్కఁడే యైనట్లు, ఉపాధిదోషముచేఁ బరమాత్మ జీవేశ్వరభేదమునఁ దోఁచినను నిజమున నొక్కఁడే.

పరమాత్మ యాకాశముకంటె నధికపరిమాణము కలవాఁడై, ప్రకాశస్వరూపుఁడై, అవాఙ్మానసగోచరుఁడై అజ్ఞానుల కతిదూరుఁడు జ్ఞానుల కతిసన్నిహితుఁడు నగుచున్నాఁడు. హృదయాకాశ మాతని కుపలబ్ధిస్థానము.

ఈశరీర మందలిహృదయాకాశ ముపలబ్ధిస్థానముగాఁ గల పరమాత్మ నెఱింగినవారు జన్మరాహిత్యము నందుదురు. ఈ యెఱుక కోరికలు గలవారికి లభింపదు. నిత్యతృప్తుఁ డగువానికే అపరోక్షజ్ఞానము కలుగును. అతఁడు శుద్ధసత్త్వసంపన్నుఁడై దేహపతనకాలమందు సూర్యమండలముఁ జేరి యటనుండి బ్రహ్మలోకముఁ జేరి పునరావృత్తిరహిత మగు కైవల్యము నందును.”

ఇట్లు బోధింప శౌనకుఁ డానందభరితహృదయుఁడై యంగిరసు నెంతయుఁ గొనియాడి యాతనికడ సెలవు గైకొని నిజాశ్రమమున కరిగెను. అంగిరసుఁ డిట్లు శౌనకునకు బోధించినవిషయములే ముండకోపనిషత్తునఁ బ్రతిపాదితము లయియున్నవి.

### ఆంగిరసస్మృతి.

అంగిరసుఁడు మహాతపశ్శాలి, మహాభక్తుఁడు, మహావిజ్ఞాని, బ్రహ్మనిష్ఠాగరిష్ఠుఁడగ నేకాక మహాధర్మప్రవక్తగఁగూడఁ బ్రఖ్యాతి గాంచెను. అతఁడు బోధించినధర్మశాస్త్రరహస్యములే “అంగిరస్స్మృతి” యనుపేర వెలసిల్లినవి. నేఁ డాస్మృతి పూర్తిగా లభ్యము కాలేదు. కాని, విశ్వరూపుఁడు మున్నగుధర్మశాస్త్రవ్యాఖ్యాతలు దీనినుండి పెక్కుదాహరణము లిచ్చియుండుటచే అంగిరస్స్మృతియొక్కస్వరూపస్వభావములు మనకుఁ జాలవఱకుఁ దెలియుచున్నవి.

“ఉత్తము లగు నూటయిఱువదియొక్కమందిబ్రాహ్మణులు కూడినసభయే పరిషత్తు. మానవుఁడు శాస్త్రములు విధించినకర్మములు కాక యథేచ్ఛముగాఁ దనబుద్ధి ననుసరించి చేసిన

కర్మములు బాలుని క్రీడాకర్మలవలె నిరుపయోగములు.* బ్రాహ్మణుఁడై మహాదోషము లొనరించినవ్యక్తి శుంఠవ్యుఁడు కాఁడు. కాన, ఆదోషపరిహారమున కతికఠోర మైన 'వజ్రవతము' నాతఁడనుష్ఠింపవలయును. పశుపక్షిసంతతిలో నేనిని జంపినను బ్రాయశ్చిత్తము చేసికొనవలయును. పతితో సహగమనము చేసినసతి చిరకాలము భర్తతోఁ గూడి స్వర్గసుఖ మనుభవింపఁగలదు.‡ కాని, బ్రాహ్మణస్త్రీ సహగమనము చేయరాదు. మనుధర్మశాస్త్రమే సర్వోత్తమ మైనది. అంతకుఁ బూర్వపుధర్మశాస్త్రము లనుత్తమములు. దీని నతిక్రమించినవచనము లాత్మహితములు కావు.§ ఇట్టి వనేకము లగువాక్యార్థములు 'అంగిరస్స్మృతి'లోని వని పలుతావుల నుదాహరింపఁబడి యున్నవి. 'బృహదంగిరస్స్మృతి' 'మధ్యమాంగిరస్స్మృతి' 'అంగిరస్స్మృతి' యనిమూఁడు విధముల నీస్మృతి వ్యవహారమునఁ గలదు. మొదటిదానికి రెండు మూళ్ళు సంక్షేపగ్రంథములుగాఁ దోఁచుచున్నవి.

అంగిరసుఁ డిట్లు ధర్మశాస్త్రప్రవర్తగాఁ బేరందెను. మహాతపోధనుఁడు, విజ్ఞాననిధి, జ్ఞానవిరాగఖని, గృహస్థరత్నము, ఋషిసత్తముఁడు నగు నంగిరోమహర్షి పుణ్యస్మరణము భారతీయునిభాగ్యవిశేష మనుటలో సందేహము లేదు.

---

* శ్లో. స్వాభిప్రాయకృతం కర్మ యత్తు ధర్మవివర్జితమ్
క్రీడాకర్మేవ బాలానాం తత్సర్వే నిష్ప్రయోజనమ్.

‡ శ్లో. తిస్రః కోట్యోర్ధకోటీచ యానిలోమానిమానుషే
తావత్కాలం వసే త్స్వర్గే భర్తారం యానుగచ్ఛతి.

§ శ్లో. యత్పూర్వం మనునా ప్రోక్తం ధర్మశాస్త్ర మనుత్తమమ్
నహి తత్సమతిక్రమ్య వచనం హిత మాత్మనః.

## అంగిరసుల మహోన్నత్యము

అంగిరోమహర్షిని వేదఋషులు మహామహుఁడుగ మహావైభవముగాఁ గీర్తించిరి. అంగిరసుఁడును, నతనిసంతతివారును ఆంగిరసు లనుపేరఁ బెక్కుసారులు ప్రబలగౌరవపురస్సరముగా వేదవాఙ్మయమునఁ బ్రశంసింపఁబడియున్నారు. వసిష్ఠుఁడు, భరద్వాజుఁడు, అత్రి, వామదేవుఁడు, విశ్వామిత్రుఁడు, గృత్సమదుఁడు మున్నగుమహర్షు లెల్లరు అంగిరసులను స్తుతించిరి. అంగిరసులు అథర్వవేదద్రష్టలు. యజ్ఞయాగాదిసమస్తకర్మలకు అంగిరసులవాక్యములే పరమప్రమాణములు.

ఋగ్వేదము అంగిరసు ననేకదేవతలతో నందు ముఖ్యముగా నింద్రాగ్నులతోఁ దుల్యునిగాఁ బేర్కొన్నది. కొన్నిచోట్ల అగ్ని యంగిరసుఁ డని, మఱికొన్నిచోట్ల అంగిరసుఁ డగ్ని యని కలదు.* దీనినిబట్టి అగ్నిదేవుని కంగిరసు లన్న మిక్కిలి గౌరవమనియు, నంగిరసుఁడే మొదట నగ్నిని ఆవాహనము చేసి మథించి గౌరవించినట్లును స్పష్టము. ఇందుచేతనే యజ్ఞయాగాదులలో అంగిరసులచేఁ బ్రోక్తమైనపద్ధతి నావాహనము చేసిననే అగ్ని తృప్తుఁ డగు నని ప్రతీతి.

పరాశరమహర్షి అంగిరసులు తనపితృదేవత లని పేర్కొనెను. అగ్ని, ఉషస్సు, సోముఁడు, సావిత్రి, మరుత్తులు, యముఁడు

* అగ్ని కొండొకకారణమున నరణ్యముల కేఁగి చెట్లనడుమ దాఁగుకొనె ననియు, నాతనిని అంగిరసుఁడే పట్టుకొని మథించి తీసుకొనివచ్చె ననియు, నందుచే నాతని నంగిరసుఁ డందు రని కలదు. (ఋగ్వే 5. 11-6.)

మున్నగువారెల్లరు అంగిరసుల స్తుతించిరి. అంగిరసులు దేవతలను స్తుతింపఁగా వారు సంతోషించి అంగిరసుల యజ్ఞావసరముల కొకకామధేనువు నిచ్చిరి. దానిని అంగిరసులకై అర్యముఁడు పిదికెను. (ఋగ్వేదము 1. 139_7.) ఇంద్రుఁ డంగిరసులు చేసినస్తుతికి, వారు తనకుఁ జేసినసాయమునకు వారికి ఋణపడియుండెను. వారిస్నేహము నాతఁడు కోరెను.

అంగిరసులు మొదట నగ్ని నారాధించినవారు. వారు పుణ్యమూర్తులు. వారి గొప్పతనమును మహాతపస్సుచే వృద్ధిచేసికొనిరి. వారి తపశ్శక్తివలన ననేకము లగుగోవులను వారు సృష్టించిరి. (10. 169_2.)

అంగిరసులు పూజనీయు లైనపితృదేవు లనియు, వారు న్యాయపథవర్తు లనియు, మహాఋషు లనియు, యజ్ఞయాగాదికర్మకాండను సృష్టించినమహనీయు లనియు, అయాస్యాంగిరసుఁడు పేర్కొనెను. (ఋగ్వే. 10. 67_2.) బృహస్పతి, అయాస్యుఁడు, ఘోరాంగిరసుఁడు, కుత్సాంగిరసుఁడు, విరూపాంగిరసుఁడు మున్నగుమహనీయు లంగిరసులలో శ్రేష్ఠులు.

యజుర్వేదసామవేదములలోఁ గూడ అంగిరసులప్రస్తావన, ప్రశంస, పలుతావులఁ గలదు. అంగిరసులే యజ్ఞకర్మవిధాయకు లనియు, వారివచనములే తరువాతివారి కెల్లరకు నాదర్శప్రాయములు ననుసరణీయములు ననియు, తైత్తిరీయసంహితయందుఁ గలదు. ఇంతే కాదు. ఆతరువాతివారు "అంగిరసులు తమ యజ్ఞములలో నిట్లు చేసినారు. కావున, మనము నిట్లు చేయ

వలయును, అంగిరసు లిట్లు చేయలేదు కావున మనము నిట్లు చేయరా" దను భావముతో అంగిరసులను వరవడులుగా నుంచుకొనువారు.

అంగిరసు లాదిత్యునితోఁ గూడి దర్శపూర్ణమాసయజ్ఞమును జేసి స్వర్గము నందిరి. మఱియు వారు సత్రయాగము, అహీనయాగము, దశరాత్రయాగము చేసి స్వర్గమున కేఁగి వారి యజ్ఞఫలమును భూలోకవాసు లగుఋషులకు ధారపోసిరి.* నాఁటినుండి స్వర్గకాము లెల్లరు నాంగిరసులవరవడినే యజ్ఞయాగములు చేసి స్వర్గమును జూఱగొనిరి.‡

అధర్వవేదములో అంగిరసులు.

అంగిరసు లధర్వవేదములో దైవములుగను, పితృదేవతలుగను, మహర్షులుగను మూఁడువిధములఁ బేర్కొనఁబడిరి. ఆదిత్యులతోపాటు అంగిరసులకును మధుఘృతము లెల్లరు నర్పించెడివారు.♦ వసురుద్రాదులతో సమానముగా వీరిని బేర్కొనుచు, వీరిని స్వర్గలోకదేవత లనియు, కష్టపరంపరలను నిర్మూలము చేయుశక్తియుక్తు లనియు ఋషులు కీర్తించువారు.

సోమమును స్వీకరించుట కర్హులైనపితృదేవతలుగా వీరిందుఁ బరిగణింపఁబడిరి. దుర్మార్గులను శాపమూలమున నాశనముచేయుటకై వీరిని బ్రార్థించెడివారు. (ii. 12.5). ఆదిత్య వసువులతోడను, ఇష్టాపూర్తముమూలముననను, అంగిరసులు తమయాశ్రితులకష్టపరంపరలను బాఱఁద్రోలువారు. (ii. 12.4).

*(తైత్తిరీయసంహిత V 4.2.3) ‡ (V 7. 2.2) ♦ అధర్వవేదము (xii. 3.4)

వారు స్వర్గలోకప్రభువులై యమాపాదులతోఁ గలిసి తమ కిష్టులగుమానవులు చనిపోయినపుడు వచ్చి వారిని దమమార్గమున స్వర్గమునకుఁ దీసికొనిపోవుదురు.*

మహర్షులుగా నంగిరసులు యజ్ఞకర్మవిధాతలుగను, మంత్రతంత్రప్రవీణులుగను, తాంత్రికయజ్ఞనిర్వాహకులుగ నిందు స్తుతింపఁబడియున్నారు. ఆంగిరసులు భవరోగవైద్యులే కాక సర్వరోగనివారకులుగఁ జేరొందిరి. వారు కనుఁగొన్న "కుష్ఠ" మనునోషధివలన నెట్టిరోగమైనఁ గుదిరిపోయెడిది.‡ అంగిరసులు ప్రయోగించినకృత్యలు శత్రునిర్మూలనము క్షణములోఁ జేసివైచెడివి. ఈకృత్యలమూలముననే అంగిరసులు దస్యుల బలదుర్గములను భేదించి విజయము నందఁగనిరి.♦ అగ్నివైశ్వానరుఁడు వీరియెడ మిక్కిలి ప్రీతుఁడై వారివేదమంత్రములకు విశేషఫలశక్తు లనుగ్రహించువాఁడు.† వీ రన్న నెక్కువ మక్కువ కలిగి మిత్రావరుణు లెప్పుడును వీరిని గాపాడువారు.§ అంగిరసులకు ఆదిత్యులకు చాలస్నేహము. అధర్వవేదద్రష్ట లంగిరసులే యగుట నందుఁ బలుతావుల వారిప్రశంస కలదు.

' బ్రాహ్మణములలో నంగిరసులు

ఐతరేయబ్రాహ్మణమున నంగిరసులప్రశంస కలదు. ఆంగిరసుని జన్మవృత్తాంత మందుఁ గలదు. ఇంద్రునికిఁ బట్టాభిషేకమైనపుడు సర్వశక్తిసంపన్ను లగు అంగిరసులే మరుత్తులతోపాటు

* (అ వే. XIX. 1–10). ‡ (అధర్వవేదము XIX. 33–5). ♦ (10.6–2).
† (VI. 35–3). § (IV. 29–8.)

దివ్యసింహాసనమును బంపిరి.* వీరు దేవతాతుల్యులు. అంగిరసులయు ఆదిత్యులయు సంబంధ మీబ్రాహ్మణమునఁ గలదు. ఆదిత్యు లొకప్పుడు యజ్ఞము చేయుచుండఁగా వారిపక్షమున అంగిరసులు యజ్ఞకృత్యములు నిర్వర్తించిరి. అందుకు మెచ్చి ఆదిత్యు లంగిరసులకు భూమిని దానము చేసిరి. అంగిరసులు గ్రహించిరి. కాని, ఆభూమి తప్త మగుచుండుటచే వారు దానిని విడిచివేసిరి. అపుడు భూమిస్వరూపము వారు మార్చివేసిరి. తప్త మగుటయు నుడిపిరి. నాఁటినుండి భూమి యిప్పు డున్నట్లుండుటకు అంగిరసులే కారకులు.‡ ఋగ్వేదమునఁ గొన్ని మంత్రములకు ద్రష్ట యైనశునశ్శేపుఁ డీబ్రాహ్మణమున అంగిరసుని వంశీయుఁడుగాఁ జేర్కొనఁబడెను.

తైత్తిరీయబ్రాహ్మణమున అంగిరసులనుగుఱించి యొక కధ కలదు. అంగిరసు లొకప్పుడు సత్రయాగము చేయుచుండిరి. వారి కొకతెల్లనియావు గలదు. దానిపాలు వా రాయాగమున నుపయోగింపఁదలఁచిరి. కాని, వానలు లేనికారణమున ఆయావు తినుటకు గడ్డి లేకపోయెను. వెంటనే అంగిరసులు 'కరీరి' యాగము నారంభించిరి. వెనువెంటనే దివ్యవర్షము కురిసి భూమిపై గడ్డి స్తోమము మొలచెను. కాని, వీరిపై నీర్ష్య వహించినపితృలా గడ్డిని విషపూరితము గావించిరి. అది తెలిసికొని యాంగిరసులు పితృలఁ బిలిచి యట్లు చేయఁ గారణ మడిగిరి. "మీరు చేయు నగ్నికర్మములలో మాకును బాలుఁగొన నవకాశ మిందు. అంత

* (ఐతరేయబ్రాహ్మణము 8_12).) ‡ (తైత్తిరీయబ్రాహ్మణము II.-11.)

కన్న మా కేమియు వల" దనిరి. అది యాంగిరసు లాదరమున నంగీకరించి వారి కధ్వరకర్మములందు లేపమార్జనక్రియాకలాపముల నిర్వర్తింప ననుజ్ఞ యిచ్చి సంతోషపెట్టిరి. ఆపితృలును సంతోషించి గడ్డినుండి విషమును దీసివైచిరి.* ఆగడ్డి తిని యావు పాలిచ్చెను. దానివలన యజ్ఞకర్మము నిర్విఘ్నసమాప్తిఁ గాంచెను.

అంగిరసులు సామమంత్రప్రవీణులు. వారు స్వర్గమున కేఁగునపుడు వారితోఁ గూడఁ గొందఱు రాక్షసులు పోఁజూచిరి. కాని, అంగిరసులు హారివర్ణసామమంత్రములు చదువఁగా నా రాక్షసులు పరాజయమంది పాఱిపోయిరి.‡ ఇట్లెన్నియో విశేషములు చెప్పుసామవేదము అంగిరసులగొప్పతనము నంగీకరించి వారి నాదర్శప్రాయులనుగాఁ జెప్పినది.

శతపథబ్రాహ్మణము అంగిరసులే ప్రథమమున అగ్నిని మథించి జ్వలింపఁజేసి రని తెలుపుచున్నది. (1. 4. 1_25). అంగిరసులు మహామహు లని వారి నీబ్రాహ్మణ మెంతయు స్తుతించును. వారు యజ్ఞకర్మవిధాతలనియు, యజ్ఞకర్మములలో నూతనవిధానములను సృష్టించి రనియు నిందుఁ గలదు. అగ్నిష్టోమయాగమున యజ్ఞ మేఖల ధరించుటకుఁ గారణ మిం దొక కథ కలదు. అంగిరసు లొకయజ్ఞమున 'వ్రతాశను'లై (స్వల్పమాత్ర మగుక్షీరపానము తప్ప నిం కేమియుఁ దినఁగూడ దను వ్రతము కలవారై) యున్నపుడు వారికి నీరసము వచ్చెను.

* తైత్తిరీయబ్రా. (II. 1. 1.) ‡ తాండ్యమహాబ్రాహ్మణము (II. 2.3.5.7)

వారు వ్రతభంగము కాకుండ బలము సంపాదించుటకై మేఖల ధరించి బలవంతులై నిర్విఘ్నయాగసమాప్తిఁ గాంచిరి. మేఖల అంగిరసులకు బలకారణ మగుటచే నంతనుండి యెల్లరు యజ్ఞ సమయములలో దానిని ధరింప మొదలిడిరి.*

ఈబ్రాహ్మణముననే అంగిరసులఁగూర్చి యింకొక చిత్రమైనకథ కలదు. బ్రహ్మసృష్టిలో మొట్టమొదటివారు అంగిరసులు. తరువాతివారు ఆదిత్యులు. మొట్టమొదట యజ్ఞము చేసినవారు అంగిరసులు. అంగిరసులు సోమయాగము చేయఁబూని అగ్ని చిలికి ఆదిత్యులను దమపక్షమున నాహ్వానింపు మని కోరిరి. ఆదేసమయమున ఆదిత్యులుకూడ సోమయాగము చేయఁబూని అంగిరసులను అధ్వర్యులనుగాఁ బిలువు మని వారును అగ్నిని గోరిరి. అగ్ని వారియాహ్వాన మంగీకరించి అంగిరసులను వారియాగమున నధ్వర్యులుగా నుండుఁ డని కోరెను. అగ్నికోరి కనుబట్టి అంగిరసు లంగీకరించి య ట్లొనరించిరి. యాగ మైన వెనుక వారికి దక్షిణగా ఆదిత్యులు 'వాగ్దేవత' నీయఁబోఁగా వా రామెను గ్రహింపక సూర్యుని బరిగ్రహించి తమయున్నతిని జాఁటిరి.

అశ్వమేధయాగమున అథర్వవేదమును అంగిరసులు పఠించెడివారు. అందుచే ఆవేదభాగమునకు అంగిరోవేద మని పేరు వచ్చెను. ఈబ్రాహ్మణమున భృగువంశము, అంగిరసునివంశము నొక్కటే యని చ్యవనుఁ డాంగిరసుఁ డని కలదు.

* శతపథ బ్రాహ్మణము. III. 2-1-10; III. 2-1-14.

గోపథబ్రాహ్మణమున వరుణదేవునివీర్యమున నంగిరసుఁడు జనించె నని కలదు. ఈయంగిరసునివలనఁ బదిమంది యంగిరసులు జనించి రనియు వీరే యంగిరోవేదమునకు ద్రష్ట లనియుఁ గలదు. (1. 1. 7-8). అంగిరోవేదమే ప్రపంచ మాక్రమించిన దనియు నందుచే నంగిరోవేదమును జదువువిద్యార్థి శిరము నెత్తియుంచుకొనవలె ననియుఁ బరిపాటి యయ్యెను. మహాతపోజాతమగు అంగిరోవేదమే అన్నివేదములలో నధిక మనియు నిదియే బ్రాహ్మణయాతువుల నశింపఁజేయు ననియు ఈబ్రాహ్మణము పేర్కొనెను. అథర్వవేదము జదివినవాఁ డన్నివేదములను జదివినవాఁడే. సోమయాగములు, పాకయాగములు, హవిర్యజ్ఞములు, తదితరవిధయజ్ఞము లన్నియు అంగిరసులచేఁ బ్రతిపాదితములైనవే. భృగువు, అథర్వణుఁడు, అంగిరుఁడు ఏకవంశీయులే. కాని, అంగిరసుఁడు పైయిరువురికంటెఁ బెద్దయగుటచే మిగిలినవారు అథర్వాంగిరసుఁడు, భృగ్వాంగిరసుఁ డను పేర్లతో వ్యవహరింపబడిరి. వీరు ద్రష్టలైనవేద మగుటచేతనే భృగ్వాంగిరోవేద మని, అథర్వవేద మని, అంగిరోవేద మని ఈయొక్కవేదమే త్రివిధములఁ బిలువఁబడుచున్నది. కాని, అథర్వాంగిరులు భృగుమహర్షి నేత్రము లని (గో. బ్రా. 1. 2_22.) కలదు. అథర్వవేద మందలి శౌనకశాఖ, పిప్పలాదశాఖ అను రెండుశాఖలకుఁ గూడఁ దొలుత అంగిరోమహర్షి ద్రష్ట యనియుఁ తరువాత అథర్వుఁడు ద్రష్ట యనియుఁ జెప్పవచ్చును.

### ఉపనిషత్తులలో అంగిరసులు.

వేదవేదాంగవేదులు, బ్రహ్మవిద్యాబోధకులుగా అంగిరసులు ఉపనిషత్తులలో విఖ్యాతి గాంచియున్నారు. అంగిర

సుఁడు శౌనకునకు బోధించినబ్రహ్మవిద్యాదికము ముండకోపనిషత్తునఁ గలదు. వేదపురుషునకు అథర్వవేదము పాదాదినాభిపర్యంత మగుప్రధానభాగ మని పేర్కొనఁబడినది. సామవేదోపనిషత్తులలో అంగిరసుఁడు ప్రాణవాయువును ఉద్గీథరూపమున నుపాసించె ననియు అందుచే అంగిరసుఁడే ఉద్గీథ యని పిలువఁబడె నని కలదు. ఘోరాంగిరసుఁడు శ్రీకృష్ణునకు ఆత్మ యవినాశ మని తెలిపెను. బృహదారణ్యకోపనిషత్తునందుఁ జెలుపఁబడిన మధువిద్యాబోధకులలో గౌతముఁడు, అగ్నివేశ్యుఁడు, భరద్వాజుఁడు, అయాస్యుఁడు మున్నగుఅంగిరసులు కలరు. ప్రశ్నోపనిషత్తులో అంగిరసుఁడే ప్రాణముగా నిరూపింపఁబడెను. మఱియు, నిందు పిప్పలాదాంగిరసుఁడు బ్రహ్మవేత్తగాఁ జేర్కొనఁబడెను. పిప్పలాదాంగిరసునిమోక్షవిద్యామహోపదేశము గర్భోపనిషత్తునఁ గలదు. పరబ్రహ్మోపనిషత్తులో పిప్పలాదుఁడే యోగమును గూర్చి ఓంకారమును గూర్చి చెప్పియున్నాఁడు.

పురాణములలోఁ గలఅంగిరసువృత్తాంతమును మనము తొలుతనే పఠించియున్నాము. కాలక్రమమున, మహారాజులకుఁ బురోహితులుగా బ్రహ్మవిద్యాబోధకులుగా అంగిరసులు విఖ్యాతిగడించిరి. కొందఱుక్షత్రియులు తమకుటుంబనామములుగా అంగిరసులను గైకొనిరి. * గౌతమబుద్ధుని తండ్రి యగుశుద్ధోదనుఁడు తనకొడుకునకు సిద్ధార్థుఁ డనియు అంగిరసుఁ డనియుఁ బేరిడియుండె నని క్రిందఁ బేర్కొన్నగ్రంథమునఁ గలదు. ఇట్లు అంగిరసులు జగదంతర్యాము లైరి.

---

* Life and legends of the Buddha by Thames, page 22-23.

# ఔర్వుఁడు

## జననము

భృగుమహర్షి పులోమ యనుభార్యయందు చ్యవనుని గాంచెను. చ్యవనమహర్షి సుకన్య యనుసాధ్వియందు దధీచి, ప్రమతి, ఆప్రవానుఁడు, అనుపుత్రులను గాంచెను. ఆప్రవానుఁడు ఋచి యనుకన్యకను భార్యగాఁ గైకొని గృహస్థధర్మమును నిర్వహించుచుండెను.

ఇట్లుండగ హైహయవంశీయుఁడు, కార్తవీర్యార్జునుని తండ్రియు, నగుకృతవీర్యుఁ డనుమహారాజు భార్గవవంశజు లగు మహాబ్రాహ్మణులను బిలిచి వారియాధ్వర్యవమున ననేకయజ్ఞము లొనరించి గురుదక్షిణగా వారికిఁ దనసర్వస్వమును ధారవోసి కాలక్రమమున స్వర్గమున కేఁగెను.

తరువాతఁ గృతవీర్యునిపుత్రులు తమతండ్రిని మోసగించి భార్గవవంశీయు లగుబ్రాహ్మణులు తమసర్వధనములు నపహరించిరని భార్గవులనెల్లరను దూలనాడ మొదలిడిరి. అంతేకాక, తమకుఁ గోపమువచ్చినపుడెల్ల భృగువంశవిప్రులగృహములు చొచ్చి కొల్లగొట్టి వారిని బాధింపఁ దొడఁగిరి. అంతతో నూఱకుండక రాజధనాపహారు లని భృగువంశజులఁ బసిపిల్లలనుసైతము రాజకుమారులు మూర్ఖులై వెదకి వెదకి చంపఁదొడంగిరి.

ఈసంగతి విని భృగువంశ్యు లగువిప్రస్త్రీలు తమపతు లిండ్ల లేనిసమయమున బిడ్డలనుగూడఁ జంపుటకు రాజాధములు

వచ్చుచున్నా రని తెలిసి భయసంజాతులై హిమవత్ప్రదేశమునకుఁ బాఱిపోఁజొచ్చిరి. వారిలో గర్భవతి యగుఋచికూఁత నుండెను. పశుతుల్యు లగునారాజకుమారు లాస్త్రీలవెంట నంటిరి. దారిలో ఋచి ప్రసవవేదన మారంభము కాఁగా నిఁకఁ బరుగిడలేక యొకచోఁ గూరుచుండి తనయూరువున గర్భమును ధరించి యుండెను.

రాక్షసు లనఁబరఁగునారాజకుమారు లామెగర్భమును భేదింప దగ్గఱ కేఁగిరి. ఆసమయమునఁ బ్రళయకాలసూర్యుని తేజమును మించినతేజముతో ఋచి కొకకుమారుఁ డుదయించెను. ఆతని యుదయముతో దిశ లెల్లఁ దేజోభరితములై యా మూర్ఖరాజశ్రేష్ఠుల కన్నుఁగవలు గ్రిప్పవేయ వారెల్ల రంధులై దారి తెన్ను గానక దీనులై యుండిరి. ఋచి యూరువు మఱుఁగునఁ బుట్టినబిడ్డఁ డగుటచే ఆబాలునికి ఔర్వుఁ డనునామము కలిగెను.

పశ్చాత్తాపమును నొందఁ దెలిఁగిన యారాజకుమారులు తడవ్రణొనుచు ఋచిని సమీపించి "తల్లీ! పరమమూర్ఖుల మగు మాతప్పు సైరింపుము. మహాశక్తిసంపన్ను లగుభృగువంశవిప్రుల ఘనత యెఱిఁగినమాతండ్రి తనసర్వస్వము వారికి ధారపోసి తాను బుణ్యాగతు లందఁగనెను. భృగువంశవిప్రుల కలిఁగి వారియెడఁ గీడుచేసిన మే మిట్టిదుర్గతిఁ గాంచితిమి. అమ్మా! అధర్మవర్తుల కెప్పుడును దుర్గతులు ప్రాపించుననుట సత్యమేకదా! మాకు బుద్ధి వచ్చినది. ఇఁక, భృగువంశజు లగుమీబిడ్డలు సైతము మావంశజు లెల్లరికి నారాధనీయులే యగుదురు. కావున,దయదలఁచి యార్తు

లము నర్థులము నగుమాకు దృష్టిదానముఁ బ్రసాదింపుము. నిన్ను మాకన్నతల్లిగాఁ బూజింతుము. క్షమింపు" మని చెంపలు వేసి కొని దండప్రణామములతో బ్రార్థించిరి.

అంత ఋచి "రాజకుమారులారా! మిమ్ము నిగ్రహించు టకుఁ గాని యనుగ్రహించుటకుఁ గాని నేను శక్తురాలను గాను. భార్గవవంశదీపకుఁ డగునీబాలుఁడే మీ కీశిక్ష విధించియుండును. కావున మీ రాతనినే శరణువొచ్చి ప్రార్థింపుఁ" డని పలికెను. వారు నంతఁ "దల్లీ! ఇప్పుడు పుట్టినబాలున కింతశక్తి యెక్కడిది? ఇది యంతయు నీమహాత్త్వమే యని మాకు స్పష్టముగఁ దోఁచు చున్నది. కావున, మాతప్పు సైరించి రక్షింపు" మని కోరిరి.

ఋచి వారితో "కుమారులారా! అట్లు కాదు. ఈతఁడు నూఱుసంవత్సరములు నాయూరుగర్భమున నుండి సకలవేదవేదాం గములు నేర్చినవాఁడు. మహాతపోనిధి. సర్వశక్తిసంపన్నుఁడు. కావున నాలసింపక యాతనినే వేఁడికొం" డని ఔర్వునితో "వత్సా! పశ్చాత్తప్తు లగునీరాజకుమారులు తమ్ము క్షమింప నిన్నుఁ గోరుకొనుచున్నారు. దుర్మార్గులను శిక్షించుటయుఁ బశ్చాత్తాపమంది క్షమాభిక్షనుఁ గోరువా రెంతయధము లైనను క్షమించుటయు భృగుకులధర్మము. కావున వీరికి దృష్టిదానముఁ బ్రసాదింపు" మని పుత్త్రునితోఁ జెప్పెను. హైహయులు నాతని పాదములఁ దడఁతడవి కనుల కద్దుకొని తమ్ము రక్షింపఁ గోరుకొనిరి. ఔర్వుఁ డప్పటికి శాంతచిత్తుఁడై మాతృవచనములను మన్నించి యారాజకుమారులెల్లరికి దృష్టిదానము చేసెను. వా

రెల్ల రాతనికి మరలమరల నమస్కరించి యింక బుద్ధికలిగి యుం దుమని యాతని సెలవుగైకొని తమతమగృహముల కరిగిరి.

ఔర్వుని ప్రళయతపము.

ఔర్వుని దల్లి యాశ్రమమునకుఁ దీసికొనిపోయి యట నల్లారుముద్దుగాఁ బెంచుకొనుచుండెను. అతఁడు బాల్యముననే తనపితృబంధుజను లెందఱో దుష్టరాజులమూలమునఁ బరలోక గతు లైరన్న సంగతి విని దుఃఖించి సకలలోకప్రళయము సంక ల్పించి మహాతపస్సు చేయఁదొడఁగెను.

తదేకనిష్ఠతో నిద్రాహారములు మాని పంచాగ్నిమధ్య మున నాతఁడు చేయుమహాతపస్సువలన ముల్లోకములు నల్లాడఁ జొచ్చెను. చరాచరప్రపంచ మంతయుఁ జలించిపోఁదొడఁగెను. ప్రాణిసంతతులు భయవిహ్వలము లయ్యెను. ఇది పితృలోక నివాసు లైనయౌర్వుని పితృదేవతలు బంధుజనములు విని భూ లోకమునకు విచ్చేసి మహాతేజశ్శాలియై వెలుఁగుచున్న యౌర్వుని సమీపించి శాంతచిత్తులై యాతనికిఁ దమ్మెఱుకపఱుచుకొని యిట్లు పలికిరి. 'వత్సా! నీతపోబలమహత్త్వమున లోకములు భయ విహ్వలము లయ్యెను. నీవు కోపము విడువుము. మే మసమర్థుల మై క్షత్త్రియులచే నిహతులము కాలేదు. మేము ధనలుబ్ధులమై వారిధనములు గ్రహించినవారము గాము. మాకు ధనమే వల సినచోఁ గుబేరుఁడే వచ్చి మాయడుగులకు మడుఁగులొత్తి యెంత ధనమైన నిచ్చిపోయెడివాఁడు. తపోమహత్త్వమున మా కపరిమిత మగునాయుష్యము కలిగెను. కాని,మాకు మనుష్యలోకమున

నుండుట కష్టము లేదు. మరణించినపిదపఁ గాని స్వర్గమునకేఁగ నవకాశము లేదు. ఆత్మహత్య చేసికొంటిమా యదిమహాదోషము. దానివలనఁ బుణ్యలోకప్రాప్తి లేదు. అందుచే హైహయవంశ క్షత్త్రియులతో వైరము కల్పించుకొని వారిమూలమున మరణించితిమి. అంతేకాని భార్గవులతేజ మెవరు తెప్పించినను బరిహరింపఁజాలరు. కావున దానికై నీ విట్లు లోకోపద్రవము కలుగఁ జేయుట మా కిష్టము లేదు! నీవు శాంతచిత్తుఁడవై మాకోరికఁ దీర్పుము."

అపు డౌర్వుఁడు వారికి సాష్టాంగ మెరఁగి "మహాత్ములారా! మీదర్శనమున నాజన్మము ధన్యమైనది. మీరుచెప్పినది సమంజసమే కాని నాతపస్సునఁ ద్రిలోకపరాభవము కావింపఁగాఁ బ్రతిజ్ఞఁ బూనితిని. నాప్రతిన యమోఘము. మఱియు, నాకోపము నుపసంహరించితినేని యది నాదేహమునే దహించివైచును. తగిన నిమిత్తమునఁ గలిగినయలుకను విడిచి శాంతుఁ డగునాతనివలన ధర్మార్థకామములు సమరక్షితములు కావు. పాపులగుక్షత్త్రియులు భార్గవుల హింసచేయుచుండ వారియార్తనాదము మాతృగర్భస్థితుఁడనగు నాకు వినిపించినప్పుడే నాకు వారిపైఁ గోపము కలిగెను. అది యిప్పు డసహ్యమై యీతపనికి దింపినది. ఇంతకుఁ దెలిసి శక్తియుతుఁడయి యొకరొకరికి హింస గావింపఁ జూచి యూరకున్నవాఁడు హింసాత్మకుఁడై దుర్గతికిఁ బోవును. అందుచే నేఁ దలఁచితిని. కాని మీరు హితులరు. మీమాట కాదననోప. నాకును లోకములకు సర్వహితమగునట్లు మీరు చెప్పిన చొప్పున నొనరింతు" నని పలికెను.

అంత నా కానందించి "వత్సా! జలములలో సర్వలోకములు నుండును. కాన, నీకోపవహ్ని యందు విడిచి సత్ప్రతిజ్ఞుఁడ వగుము. అది జలధిజలముల దహించు" నని పలికిరి. ఔర్వుఁ డట్లే యని తనకోపానలమును సముద్రమున విడువ నది ఔర్వానల మనుపేర నశ్వముఖమున నబ్ధిజలములు త్రాగుచుండెను. పితృదేవతలు సంతసించి ఔర్వు నాశీర్వదించి వెడలిరి. ఇట్లు ఔర్వుఁడు ధర్మాత్ముఁడు, పితృదేవతాభిధేయుఁడు, మహాతపశ్శక్తిసంపన్నుఁడు, అతిలోకతేజస్వి, నిగ్రహానుగ్రహసమర్థుఁడు నని పేరుగాంచెను.

ఔర్వుని బ్రహ్మచర్యవ్రతము.

పిదప, ఔర్వుఁడు బ్రహ్మచర్యవ్రతపరిపాలనము నతినిష్ఠాగరిష్ఠుఁడై యొనరించుచు మహాతపోనిమగ్నుఁడై యుండెను. ఆతపమువలన మరల సకలలోకములు సంచలింపఁగా మహర్షులను బురస్కరించుకొని దేవతాధిపులు, హిరణ్యకశిపుని బురస్కరించుకొని రాక్షసాధిపులు ఔర్వమహర్షి కడకు వచ్చి యిట్లు పలికిరి. "ఓ ఋషివర్యా! నీ విచిఱుతతనమున నింతదీక్షఁ బూని బ్రహ్మచర్యవ్రతుఁడవై యుండ నూర్ధ్వరేతోగతుఁడ వగుటవలన సంతతిచ్ఛిన్నమై భార్గవకులము నశించును. కావున, నీవు ధర్మమూలమగుగృహస్థాశ్రమమును స్వీకరించి సుపుత్రులను గనుము. సిద్ధమును లెల్లరు పత్నీసమేతులై పుత్త్రులను గాంచిరికదా! కావున నీవును మామాట విని వెంటనే వివాహమై సంతతిఁ గనుము." ఆమాటలు విని ఔర్వుఁడు మందహాసము చేసి;

"బ్రహ్మయోని సంజాతుఁడై బ్రహ్మవిద్య
నలవరించుచు బ్రహ్మంబు నాత్మఁ జూచు
బ్రాహ్మణుఁడు బ్రహ్మచారియై పరగవలదె?
బ్రహ్మమైనఁ జాలునె యట్టిభవ్యుఁ గలఁప?
(హరివంశము, పూర్వభాగము, ౮ ఆ. ౧౦౭.)

అదికాక, వేదాధ్యయనము, యజనము, పుత్త్రోత్పాదనము నీమూఁడను ఋణత్రయమును బాయుటకు గృహస్థునకు విధింపఁబడినవి. మేము వనస్థులము. నిరాహారులు, పవనజలాదిభోజులు, అశ్మకుట్టాశులు, దంతోలూఖలులు, పంచతప్తులు నగుట వానప్రస్థధర్మము. మేము బ్రహ్మచర్యమును మున్నిడుకొని బ్రహ్మగతిఁ బ్రాపింతుము. బ్రహ్మచర్యము లేనివాని కేదియు లభింపదు. అజితేంద్రియుఁ డగుదుశ్చరితుని యోగము దంభసంజ్ఞమే కాని నిక్కువము కాదు. మఱియు బ్రహ్మదేవుఁడు బ్రహ్మచారియై మానసపుత్త్రులను గాంచెను. బ్రహ్మచర్యము కా దని మీ రనరాదు. నన్ను సంతతిఁ బడయుమని మీరన్న నట్లే చేసెద" నని తపోబలమున నపాయ నిరూఢ మగుశరీరముతో నగ్నిహోత్రునియందుఁ దనతొడ యొకటి యిడి కుశకాండములతో మథించెను. అంత నాతనితొడనుండి యగ్నిహోత్రుఁడు తనయుఁడై జనించి ప్రజ్వరిల్లి యాకసముఁ దాకుచు నినుమిక్కిలి పెరుఁగుచు నౌర్వునియెదుట నిలిచి:

"కమఁ బెల్లగునాఁకలి నా
యొడ లెరియఁపంగఁదొడఁగె నొక్కట జగముల్

పాడిపాడిగా దరికొనియెద
నెడపక యించుక యనుజ్ఞ నిమ్ము మహాత్మా!"

(హరివంశము. ౪ఆ. ౧౦౪)

అని పలికెను. అంతలో బ్రహ్మ తత్క్షణ మచటకుఁ బరుగున వచ్చి యౌర్వునిచే నభివాదనము లంది 'ఔర్వఋషీ! నీపుత్త్రున కాహారము విహారస్థానము నే నొసంగెద. నీవు దయదలంచి జగద్దాహము నారంభింపనీయ కితని నాఁపుము" అని కోరెను. ఔర్వుఁడంగీకరించెను. అంత బ్రహ్మ "ఈమహాగ్ని ప్రస్తుతము సముద్రమున నున్ననీకోపానల మగుచౌర్వాగ్నిఁ జేరుగాక. పిదప, ప్రళయసమయమున నాకౌద్రతేజము నీనిఁ గూడ మహోదధిలో నిది సర్వలోకములను నీఱుచేయుఁగాక!" యని పలికెను. ఔర్వుఁడజునిపైఁ గలయాదరమున నట్లే జరుగుఁగాక యని పలికెను. అంతే నాయగ్నియుఁ దనతేజము లోకబాధకము కాకుండున ట్లుపసంహరించుకొని సాగరమున కేఁగెను. బ్రహ్మాదు లౌర్వుని గీర్తించి తమతమ నెలవుల కరిగిరి.

ఔర్వుఁడు హిరణ్యకశిపు నను గ్రహించుట.

అపుడు హిరణ్యకశిపుఁ డాఁగిపోయి ఔర్వునికి సాష్టాంగ నమస్కారము లొనర్చి యతిభక్తివిధేయతలతో సౌర్వునిమనసున కెక్క నాతనిం గొనియాడి

"అజుఁడు చనుదెంచి ప్రార్థించునట్టితపము
లోకమున నెవ్వరికిఁ జెల్లు నీకకాక!

ఏను భవదీయ శిష్యుఁడ నెవరు వొందు
నప్పటికి రక్ష యగువిద్య యానతిమ్ము"

(౮ ఆ. ౧౧౭.)

అని ప్రార్థించెను.

ఔర్వుఁడు సంతోషించి "రాక్షసేశ్వరా! నీవు సర్వభువనములను జయించినవాఁడవు. మిత్త్రుఁడవై నీవు నన్నాశ్రయించితివి. ఆశ్రితులు కోరినకోరిక లీఁజాలి యీ మునివాఁడు దుర్గతి పొందును. అందుచే నాకుఁ బుత్త్రిరూపమున నిర్మితమైనయనింధనాగ్నిరూపయగువిద్య మాయ నీ కిచ్చితిని. చంద్రస్సూర్యచేఁ దక్కఁ దక్కినదేనిచేతను దీనికిఁ దిరుగులేదు. నీవంశమున జన్మించినవారి కెల్లరకు శత్రువులచే నోడిపోయినప్పటికి నీవిద్యమాయ వశగతమై యుండును." అని కనికరమున వర మొసంగెను. హిరణ్యకశిపుఁడు కోరినకోరిక తీరినవాఁడై ఔర్వుని సంస్తుతించి నిజస్థానమున కరిగెను.

ఈమాయపెంపుననే హిరణ్యకశిపుఁడు, మయుఁడు మున్నగువారు శత్రువులకు భయంకరమై వారిని దహించుప్రళయకాలాగ్నిజ్వాలలఁ బేర్చి యేర్చుచుండెడివారు.

## ఔర్వుఁడు పుత్త్రిఁ గని వివాహము చేయుట.

ఔర్వుఁడు మఱియొకప్పుడు బ్రహ్మచర్యవ్రతమున నుండియే యొకపుత్త్రిఁ గన సంకల్పించెను. అతఁడు తపోబలమున నాతనిమోఁకాలినుండి యయోనిజ యగునొకకూఁతుం బుట్టించి యామెకు 'కందని' (కందళి) యనునామకరణము చేసి పెంచెను.

కాలక్రమమున నామె చక్కనిచుక్కయై తండ్రిహృదయమునకమితానంద మొనరించెను. కాని, యామె యెంతసౌందర్యవతియో యంత కటుభాషిణి యయ్యెను. ఆమె యెంత సుగుణఖనియో యంతకలహప్రియ యయ్యెను. బ్రహ్మదేవుఁడు అమృతము నుంచినయబ్ధిగర్భముననే కాలకూటవిషము నుంచినాఁడు. విషజ్వాలలు గ్రక్కుపాముతలపై మణి నుంచినాఁడు. విధివిధానము లత్యాశ్చర్యకరములు.

కందని పెరిగి యౌవనవిలాసము లందినసమయమున నామె యత్రినేత్రసంభవుఁ డగుదుర్వాసోమహర్షి ప్రజ్ఞాప్రాభవముల విని యాతనినే పెండ్లాడఁ దలఁచి తండ్రికిఁ దనహృదయము నెఱిఁగించెను.

వయసు వచ్చినపుడు సర్వలోకారాధ్యుఁ డగుమహర్షిని వలచియుండుట కానందించి యౌర్వుఁ డామెను దీసికొని దుర్వాసుని యాశ్రమమునకుఁ బోయి యాతని కామె నర్పించి రాఁ బయనమయ్యెను. బ్రహ్మతేజోవిరాజితుఁ డగునౌర్వమహర్షియుఁ బలు గడిగినముత్తెమువలె బహుళసౌందర్యశోభిత యగుకందనియు నట్లు బయలుదేఱి పోవుచుకడ దశదిశలు తేజోమయము లయ్యెను. వా రట్లు పోయి పోయి గంధమాదనపర్వతకంధరమును జేరుసరి కచట వారికి దుర్వాసుఁ డెదురయ్యెను. దుర్వాసుఁడు బ్రహ్మనిష్ఠుఁ డగునౌర్వమహర్షి కెదురేఁగి సముచితనమస్కారములతో నాతనిఁ బూజించెను. ఔర్వుఁ డాతని నాశీర్వదించి యిట్లు పలికెను. "మునివర్యా! కందని యనునీమె

నాపుత్రిక. నీగుణగణముల నెల్ల విని యీమె నిన్నే పరిణయమాడఁ గృతనిశ్చయయై యున్నది. ఈమె లోకాతీతసౌందర్యవతి, గుణవతి. కాని, ఈమెకోపినియై కలహముఁ గోరుచుఁ గటువచనములు పలుకును. ఐనను, ఏదోషముచేత వివిధగుణవస్తువు విడువరాదు కదా! కావున, నీ వీమెను బరిగ్రహించి నన్ను ధన్యునొనర్పు" మని కోరుకొనెను.

అంత దుర్వాసుఁడు నవయౌవనాంగి, మహాసుందరి యగుకందలిం గని యామె తన్నే తప్పవాల్చక కనుటయుం గని యౌర్వునితో నిట్లనెను. "మహాత్మా! స్త్రీ సందర్శనము రుద్రాదులకైనను ముక్తినిరోధకము, తపస్సాభంగకరము, మోహశోక నిధానము, పుణ్యనాశనము, రాగద్వేషమూలకము, జ్ఞానవిద్వేషకము ననుటలో సందియము లేదు. సంయమీశ్వరా! సంజ్ఞ, ఛాయ, భోగము, ఇంద్రియము, దేహము, విద్య, మతి, జగమున దేహికిఁ గల్గును. ఇందు సంజ్ఞయు, ఛాయయు, దేహపతనకాలమున దేహిని విడుచును. భోగ మనుభవించినంతనే పోవును. దేహేంద్రియములు జీవత్వవిముక్తితోఁ బోవును. విద్య, జ్ఞానోదయముతోఁ బోవు. కాని మతి జన్మజన్మమునందును గూడవచ్చును. స్త్రీనిగూడి దేహి యెంతకాలము వర్తించునో యంతకాలము దేహికి జన్మనాశనము లేదు. అంతకాలము శుభాశుభములు కలుగుచునే యుండును. కాని, నే నిపుడే తిలోత్తమా సాహసికుల రహఃక్రీడఁ గాంచి కామసంతప్తుఁడనై యున్నాను. దానిఫలముగా విధాత యీనీకన్నియను సమకూ

ర్చెను. కావున, నే నీమె కటూక్తుల సహించి యీమెను బరిగ్రహించెదను.'' అని తనయంగీకృతిఁ దెలిపెను.

ఔర్వుఁడు దుర్వాసునివచనములకు సంతసించి తన కూఁతు నమ్మునిపతి కిచ్చి విధ్యుక్తప్రకారమున వివాహముఁ గావించి యాశీర్వచనమే యరణముగా నొసంగి తిరిగి తనయాశ్రమమునకు వెడలిపో నున్నతఱి విరహదుఃఖమున మూర్ఛిల్లిన నిజపుత్రి ననునయించి యిట్లు పలికెను. ''తల్లీ! నిగమసూక్తము నీతిసారము నగునామాట వినుము. కులసతికి పతికంటె నెక్కుడు దైవము, బంధువు, గురువు లేఁడు. పతిసేవ చేయుపరమసాధ్వి పుణ్యముతో నేపుణ్యమును సాటిరాదు;

''పతిసేవకంటె ధర్మము
సతులకు శ్రుతులందు లేదు సతతము పతి శ్రీ
పతిఁగా మదిలోఁ దలఁచుచు
సతిభక్తి భజింపు తత్పదాంబుజయుగళిన్.

భ్రమసియైనఁ జాన పరిహాసముననైన
మంచియైనఁ గోపగించియైన
సరగ నెదుటనైనఁ జాటుమాటుననైన
వల్లభునిఁ గటూక్తి పలుకరాదు.
ఎన్నినోములు నోచిన నేమిఫలము
పతిని గోపించి పరుషోక్తిఁ బలికెనేని
దానిశతజన్మకృతసుకృతంబు తత్త్
ణంబ నశియించు నింత నిక్కంబు పుత్రి!''

(బ్రహ్మవైవర్త పురాణము)

ఇట్లు హితవచనము లనేకములు పలికి యౌర్వమహర్షి కూఁతు నల్లున కొప్పగించి నిజాశ్రమమునకు వెడలిపోయెను.

ఔర్వుఁడు దుర్వాసుని శపించుట.

దుర్వాసుఁడు భార్యాసహితుఁడై యాశ్రమమున కరిగి శుభముహూర్తమున నేకాంతస్థలమున మృదుతల్పమున నయ్యం గనం గూడి కామినీరసం బెఱుంగనివాఁడయ్యుఁ దపోమహిమ మునఁ గామశాస్త్రవిశారదుఁడై యిష్టోపభోగము లనుభవిం చుచు భార్యం దనుపుచుఁ దాను దనియుచుఁ జాలకాలము గడ పెను. ఆతరువాత, కందని కోపస్వభావమును గటూక్తులను జాల కాలము సైఁచియు నొక్కనాఁ డామెపైఁ గోపించి తీక్ష్ణముగాఁ జూచెను.

వెంటనే యాతనితపోగ్నిచేఁ గందని భస్మమై పోయెను. ఈసంగతి విని యౌర్వుఁడు వచ్చి దుర్వాసుని నిందించి త్వరలో ఘోరపరాభవానలదందహ్యమాన మానసుఁడవు కమ్మని శపించి నిజాశ్రమమున కేఁగి విరాగసంపన్నుఁడయ్యెను.

ఇట్లౌర్వమహర్షి నిగ్రహానుగ్రహసమర్థుఁడు, అస్ఖలిత బ్రహ్మచర్యుఁడు, మహాతపోనిధియై యాచంద్రార్కఖ్యాతి నందెను.

# కండుఁడు

కండుని తపోరతి.

తొల్లి కండుఁ డనుముని బాల్యమునుండియు మహాతపశ్శాలియై గోమతీతీరమున నొకయాశ్రమమును నిర్మించుకొని వసించుచుండెను. జనశూన్యమైనయాయాశ్రమవనము కందమూలఫలాదులు, పుష్పలతాగుల్మములు, సువాసనలఁ గొనిపోవుమందమలయవాయువులు, శీతలకాసారాదులు మిక్కుటములై చాల మనోహరముగా నుండెను. అనేకమృగములు సేవచేయుచు మైత్రిపాటించుచుండ, శుకపికాదులు కలస్వనములచే మనస్సున కానందము కలిగించుచుండఁ బ్రశాంతమనస్కుఁడై కండుముని తపముచేసికొనుచుండఁగా నట నిత్యము వసంతశోభయే చెలువారుచుండెను.

కండుమహాముని కఠినవ్రతము లవలంబించియు, మహోపవాసము లుండియు, స్నానసంధ్యానియమము లూనియు, గ్రీష్మకాలమునందైనను, పంచాగ్నిమధ్యమునఁ దపించియు, శీతకాలమున మంచువలె గడ్డకట్టినజలములమధ్యమున నుండియు, నుగ్రతపస్సు చేసెను. ఆతనితపోనిరతికి దేవతలు, గంధర్వులు, సిద్ధులు, విద్యాధరులు మున్నగువారు పరమాశ్చర్యభయముల నందిరి. క్రమముగా ముల్లోకములందు నీతనితపోగ్రతఁ గూర్చి జనులు చెప్పుకొనుచు నచ్చెరువందుచుండిరి. ఇంతధైర్యము, ఇంత నియమపరత, ఇంతనిష్ఠాగరిష్ఠత, ఇంతసాధుతపము నెక్కడను

గనియున్నవారము కామునకదా యని యెల్లరు నాతని వినుతింపఁ దొడఁగిరి.

### తపోభంగమునకై ఇంద్రుఁడు ప్రమ్లోచనను బంపుట

ఇట్లుండఁగా సంక్రందనుఁడు దేవతలతో నాలోచించి కండు మహామునితపస్సునకు విఘ్నముకలిగింప నెంచెను. వెంటనే యాతఁడు సుందరాంగియు దేవవేశ్యయు నగు ప్రమ్లోచన యను దానిఁ బిలిపించి యామెతోఁ గండుముని తపోగ్రతఁ దెలిపి, యాతనికిఁ గామరాగముఁబుట్టించి తపోవిఘ్నముఁ గలిగింపు మనికోరెను.*

అంత నామె "దేవా! బ్రహ్మచర్యనిష్ఠుఁడు మహోగ్ర తేజస్వి యగుకండుమునిని వశపఱుచుకొన నా కలవి యగునే? ఊర్వశి, మేనక, రంభ, ఘృతాచి, పుంజికస్థల, విశ్వాచి, సహజన్య, పూర్వచిత్తి, తిలోత్తమ, అలంబుస, మిశ్రకేశి, శశిలేఖ, వామన మున్నగుత్రిదశవేశ్యలు రూపయౌవనగర్వమున నలరుచు సుందరవదనారవిందలు, సుమధ్యలు, సుస్తనోన్నతలు, కామప్రచారకుశలలు నైయున్నారు. వారలలో నొకతెఁ బంపు" మని పలికెను. "కాంతా! వారెవ్వరు నీపనిలో నీకుఁ జాలరు. కామవసంతమలయానిలముల నీకుఁ దోడుగా నిచ్చెదను. నీ వేగి యీకార్యము నిర్వర్తింపక తప్పదు. పోయిరమ్మని యింద్రుఁ డామెను శాసించెను.

ఇఁక మాఱుమాటాడనేరక ప్రమ్లోచన మన్మథవసంతమలయానిలులు తోడురాఁగా భూతలమునకు బ్రయాణ మయ్యెను. అపుడు

---

* కండుఁడని బ్రహ్మపురాణము. కంధుఁడని విష్ణుపురాణము.

"పరఁగి బింకపుగుబ్బపాలిండ్లు కంతుని
గిరిదుర్గములతోడఁ గ్రీడసేయ
కమలాక్షి నిడువాలుఁగన్నులు కుసుమాస్త్రు
క్రొవ్వాఁడి తూపులఁ గొంతవలుప
అలివేణినూగారుచెలువు శంబరవైరి
నిడువాలు వాలుతో నెయ్యమాడ
చిగురాకుబోఁడి భ్రూయుగ మంగజాతుని
చెఱకుసింగిణివింటి కొఱఁపు గఱప
సరసిజాయతలోచనజఘనయుగము
మరునిరథచక్రములతోడ మాఱుమలయ
మేఘమండలిలో నుండి మెఱుఁగుఁదీఁగె
చెలఁగివచ్చిన క్రైవడిఁ బుడమి కిడిగి" (విష్ణుపురాణము. ఆ ౨౦౩)

ప్రమ్లోచన కండుమునియాశ్రమముఁ జేరెను. అచట నాశ్రమము పరమశాంతముగా నుండెను. కాని, యామెయట నడుగుపెట్టఁగనే గండుఁగోయిలలు మనోహరముగాఁ గూయఁదొడఁగెను. వసంతుఁడుకూడ వెంటనే విజృంభించెను. ప్రమ్లోచన సఖీసహితయై పూలుకోయఁ జొచ్చెను. అంత

"మలయక్ష్మాధరకూటదంతురశిలామార్గంబులన్ దప్పి తి
ద్విలసన్నిర్ఝరవారిశీకరములలో విశ్రాంతిఁ గావించి పు
ష్పలతామంజులకుంజపుంజముల నిచ్ఛాప్రీతి సంచరించుచున్
బొలసెన్ దక్షిణవాతపోతములు సంపూర్ణప్రవాహంబునన్."
(వి. పు. ౨. ౨౦౨)

ఆగాలికి వనలతలనుండి పుష్పము లెల్ల భూమిపైఁ బడి పుష్పశయ్యలుగా నేర్పడెను. మన్మథుఁడు నిదే సమయమని కండుమునిపై సుమబాణము లేసి యాతనిధైర్యకంచుకమును జెండాడి

వైచెను. ముని కన్నులు తెఱచి ప్రమ్లోచను గని మోహపరవశుఁడయ్యెను.

### ప్రమ్లోచన కండుమహర్షిని చేఁజిక్కించుకొనుట

అంత

"తనశరీరము కమ్మతావిమూర్కొనునట్లు
గా వినోదమునఁ బైగాలిఁ బొలయు
తన మోహనాకృతిఁ గనుఁగొనునట్లుగాఁ
ముందర నిబ్బెకముగ నటించు
తనకింతగసములు వినవచ్చునట్లుగాఁ
బరివాదినులు మీటి పాడుచుండు
తన మోవిరుచికిఁ బైకొనిపచ్చునట్లుగాఁ
దివ్యఫలములు తెచ్చి యిచ్చు
తనకరాలింగనమునకుఁ దగులునట్లు
గా శరీరంబు మోవంగఁ గదిసి మ్రొక్కు
నిత్తెఱంగున నమ్ముని చిత్తవృత్తిఁ
గలఁచి మదనాతురునిఁ జేసెఁ గమలనయన." (వి.పు. ౨. ౨౧౮.)

వెంటనే కండుమునీశ్వరుఁడు సమస్తనిష్ఠలు తన్ను విడిచిపోఁగా నామెఁ జేరి యిట్లని ప్రార్థించెను.

"తరుణి! నీ చేత మదనతంత్రంబు తెలియఁగఁ
గోరియున్నాఁడ నా యాస కొంచెపడక
యుండ సురతసుఖాంబుధి నోలలార్చి
యింపుసొంపార నన్ను మన్నింపవలయు" (౨. ౨౧౫.)

వెదకఁ బోయినతీఁగ వ్రేలికిఁ దగిలిన ట్లామె యానందించి యాతనిఁ జెట్టపట్టెను. కండుమునీశ్వరుఁడును దనయపారతపోబలమున నవయౌవనుఁడు, నవమన్మథసదృశుఁడు, సర్వభూషణ

భాసిల్లుచు, తేజశ్శోభాసముజ్జ్వలము, దృఢవీర్యము నై ప్రమ్లోచ యతనియాశ్రమమునకుఁ గొనిపోయి యానందాంబుధి నోలలాడఁ దొడఁగెను.

తరువాత నాతఁడు తనసఖప్రేయసితోఁగూడి మందరగిరి కందరంబులయందు దివారాత్రము లెఱుఁగక యయ్యప్సరస తోడికందర్పరతిక్రీడానందంబుల నూఱుసంవత్సరంబులు వినోదించెను. ఆపిదప నామె యనేకదినములు తాను త్రిదశలోక ననియు నన్నుసాఁగఁ బంపుమనియుఁ గా ననియుఁ దనకు స్వర్గమునకుఁ బోవ ననుమతి యిమ్మనియు నాఋషిఁ గోరెను. కాని, యాతఁడు నప్పుడు విడువలేక యంగీకరింపఁ డాయెను. అటుని యాసతిఁగొనక యామె యరిగినచోఁ దనకు శాప మొసంగు నని వెఱచి యామె నెన్నియో యేండ్లు తనసన్నిధిని నుంచెను.

ఒకనాఁడు కండుముని యొడలెఱింగి యాత్మదృష్టిని జూచి తాను చిరకాలమునుండి వనితావ్యామోహములఁ జిక్కి తపోమహాత్త్వముఁ గోలుపోవుచుండుటఁ గనిపెట్టి ప్రమ్లోచను బిలిచి "ఓసీ! నీ వింతకాలము నన్ను మోసపుచ్చితివి కాని నిన్ను శపింపను. నీవు వెనువెంటనే నీయిష్టము వచ్చినచోటికిఁ బొమ్ము. పోకుందువేని క్షణములో భస్మ మగుదువు" అని హుంకరించెను. ప్రమ్లోచ గడగడ లాడుచు నాఋషిపాదపంకజముల కెఱఁగి సెలవుగైకొని గగనమున కెగసి వెడలిపోవునపు డామె యంతకుమున్న గలగర్భము స్రవింప నామెశరీరావయవములనుండి యాఋషివీర్యము చెమట రూపమున బయలువెడల నామె చంచలించి బాలతరుపల్లవములఁ

దుడుచుకొనుచు దేవలోకమున కరిగెను. ఆలేఁతయాకులనుండి యామునివీర్యము వాయువశమునఁ జంద్రకిరణములఁబరివృతమై క్రమముగ నొకస్త్రీస్వరూపమును జన్మముఁ గాంచెను. ఈస్త్రీయే మారిష. ఈమెను ప్రచేతసులు భార్యగాఁగైకొనిరి. ఈమెకే దక్షప్రజాపతి జన్మించెను.

కండుఁడు పశ్చాత్తప్తుఁడై మరల తప మొనరించుట

కండుమహర్షి యుగ్రమనికోపటమునఁ దాను తపోమహాత్త్వమును గోల్పోవుటను విచారించి యటనుండి బయలుదేఱి పురుషోత్తమక్షేత్రమునకుఁ బోయెను. మునిపతు లగుభృగ్వాదులకు, మోక్షమార్గప్రదర్శకులు, సద్ధర్మయుతాదులు, తపోమహిమాన్వితులు నగువారికి నివాసస్థాన మగునాప్రదేశమునఁ గండుమహర్షి యూర్ధ్వబాహుఁడై, మహాయోగనిరతుఁడునై బ్రహ్మపారమను జపము * తపోనిష్ఠ నొనర్చెను.

---

* ఈ బ్రహ్మపారజపభాగమున బ్రహ్మాత్మరూపుఁ డగువాని స్తుత్యున్నది. అపారుపారుఁడు, బ్రహ్మపారుఁడు, పరపారభూతుఁడు, బ్రహ్మ యాతనే యందురు. పరమేశ్వరులకుఁ బరమేశ్వరుఁ డగుట పారపారుఁ డని యాతనిని మునులు కీర్తింతురు. కాలాంతకుఁ డగువాఁడే కారణము, అతఁడే పరహేతుహేతువు. స్వకార్యములయందు వాఁడే కర్తృకర్మరూపములచే సర్వముఁ బాలించుచుండును. ఆబ్రహ్మమే ప్రభు వని పిత యని సర్వభూతుఁ డని, అవ్యయము, నిత్యము, అజము ననుశబ్దములకుఁ బాత్రుఁడై అసంగుఁడై వెలుఁగును. బ్రహ్మము, అక్షరము, అజరము, నిత్యము నగువాఁడే పురుషోత్తముఁడు. అతనిదయచే రాగాదు లగునాసర్వదోషములు నశించుఁ గాక యని చేయుప్రార్థనముతోఁ గూడినజపమే బ్రహ్మపారజపము. ఇది విష్ణుప్రీతికరము. (బ్రహ్మపురాణము.)

ఆతనిభక్తి మెచ్చి పురుషోత్తముఁడు ప్రత్యక్షమై మధు
రముగ "మునివరా! నీతపమునకు మెచ్చి వచ్చితిని. వర
మేదైనఁ గోరుకొనుము. ఇచ్చెద" ననెను. అంత, కండుమహర్షి
యాతనికి సాష్టాంగనమస్కారము లొనరించి భయభక్తిశ్రద్ధలతో
నాతని నిట్లు స్తుతించెను. "నారాయణా! సర్వలోకప్రభూ! నీకు
నమస్కారములు. నీవు విశ్వకర్మవు. శంభుఁడవు, వృషాకృతివి,
శంకరుఁడవు, ఉశనసుఁడవు, సత్యస్వరూపుఁడవు, జపస్వరూపుఁ
డవు, తపస్స్వరూపివి, ఆదిత్యుఁడవు, ఓంకారుఁడవు, ప్రాణరూపుఁ
డవు, పర్జన్యప్రథితవేధోసురేశ్వరనామధరుండవు, ఋగ్యజుస్సామ
సమ్మతుఁడవు, పరమాత్మవు.

దేవదేవా! నీవు దశాంగుళమాత్రరూపుఁడవు, మృతా
మృతశబ్దములు నీవు. నీవలన జగము లుదయించు. మహా
యాసుఁడవు, దశధాస్థితిం గాంచి నీవు నవభాగంబులుగ దివి
యందును, నవభాగములుగ సంతతేక్షుఁబునందు నివసింతువు.
భాగద్వయంబున భూమి నుందువు. చతుర్భాగంబులఁ బురుషో
త్తమక్షేత్రమున నుందువు. మహాభాగా! నీకు నమస్కారములు"
అని పెక్కువిధంబులఁ గండుమహర్షి చేసినస్తుతి కానందించి విష్ణు
మూర్తి వరము కోరుకొ మ్మని మరల నడిగెను. అంత, కండుఁడు
"దేవా! అతిదుస్తరము, నతివిస్తరము, భయావహము, శ్రేయో
రహితము నగుసంసారసాగరమును దరింపఁజేసి పరమపద మను
గ్రహించి రక్షింపు" మని ప్రార్థించెను. విష్ణు వట్లే యగు నని
వరమిచ్చి యంతర్హితుఁ డయ్యెను.

అనంతరము కండుమహర్షి రాగద్వేషాదులనెల్ల వర్జించి కామక్రోధాదులు తన్ను విడిచి పారిపోఁగా శమసత్త్వసంపన్నుఁడై యహంకారమును విడిచి, యింద్రియముల నిర్జించి, యేకాగ్రత శ్రీహరిని ధ్యానించి ధ్యానించి యమరుల కైన సాధ్యముకాని మోక్షపదము నంది దివ్యతేజోలీనుఁడై సిద్ధిఁ బొందెను.

ఇట్లు కండుమహర్షి బాల్యమునుండియుఁ దపస్సంపన్నుఁడై యుండియుఁ గామమోహితుఁడై కాంతాసుఖముల మఱిఁగి కాలమును వ్యయించియుఁ బశ్చాత్తప్తుఁడై నిరుపమనిష్ఠాగరిష్ఠత మరల మహోగ్రతప మొనరించి బ్రహ్మపారమంత్రసిద్ధుఁడై యోగీశ్వరులు గాంచుదివ్యపదవిఁ జూఱగొనెను.

# కణ్వుఁడు

"పరమార్థ తత్త్వానుభవము సక్కాఁ జెంచు
సమధిక బ్రహ్మవర్చసమువాని
కైవల్యవాంఛానుకలనంబు వివరించు
వ్యాఘ్రాజినోత్తరీయంబువాని
వెలిచూడ్కి లోలక్ష్య మలర బాహ్యంబుగా
మునుకొన్న శాంభవీముద్రవాని
వేదముల్ మూర్తీభవించుమేఁ దలపించు
సముచితాధ్యయనఘోషంబువాని
హుతహుతాశనతేజుఁడై యొప్పువాని
హరిచరణభక్తి పుంభావమైనవాని
దయయు ధర్మంబుఁ దానయై తనరువాని"
కణ్వమౌనీంద్రుఁ గొల్తు నస్ఖలితభక్తి.

(కృష్ణకవి శకుంతలాపరిణయము 3-23)

కణ్వుని మంత్రద్రష్టృత్వము.

కశ్యపప్రజాపతివంశమున జనించినమహనీయులలో మునికులసార్వభౌముఁ డనఁదగినకణ్వమహర్షి యొకఁడు. ఈతఁడు బాల్యమునుండియు మహాతపోనిష్ఠలో నుండి యాజన్మబ్రహ్మచారి యైనఋషివర్యుఁడు. ఈతఁడు కొన్నిసామవేదమంత్రములకు ద్రష్టయై కాణ్వశాఖీయు లగువేదవాదులకు మూలపురుషుఁడైన మహాత్ముఁడు.

ఈతఁడు బాల్యమునఁ దనకుఁ దోఁచినసామములకు నిదానము కానరాక వ్యాకులపడుచున్నసమయమున నీతనిసమీప

మున నున్నయొకపిల్లి మెల్లఁగా నొకతుమ్ము తుమ్మెను. ఆతుమ్మునే యాతఁడు నిదానముగాఁ గైకొని సామమంత్రమునకు ద్రష్టయై మహర్షులమన్ననలఁ గాంచెను. ఇట్లే కణ్వుఁడు పెక్కుసామ ఋక్కులకు నిదానముఁ గనిపట్టి జగజ్జేగీయమానుఁ డయ్యెను.

### కణ్వుని యాశ్రమము.

కణ్వముని నిరంతరతపోవృత్తి వేదగోష్ఠి మునిజనసహవాసము ముఖ్యములుగా నెంచుకొని మాలిని యనునదీతీరమున మహాప్రభావశీలయ మగునొకవనమునఁ దనయాశ్రమమును నిర్మించుకొని యందు నివసించెను. ఆతనియాశ్రమవనము దేవేంద్రునిఖాండవవనమునకుఁ గుబేరునిచైత్రరథమునకు సరిపోలుచుఁ గొన్నియెడల వానికి మిన్నగా నిలువ భూలోకమున దీనిని సృష్టించినాఁడా యన్న ట్లుండెను. ఆయడవియందలితీఁగలను స్త్రీలు మందపవమానములవలన రాలినపూవు లనుఅక్షతలను అందుండి బయటపడి తుమ్మెదలుచేయుఝంకార మనుఆశీర్వాదముతో నచటి కరుదెంచినవారికి, నట నున్నవారికి నెల్లప్పుడు నొసంగుచుండుట పరిపాటి. ఆయాశ్రమప్రదేశమున నొత్తుగాఁ బెరిగి మనోహరముగాఁ గాననై చక్కఁగాఁ బుష్పించినయొజ్జ గోరఁటలు, పూలతో వానిశౌరభముతో నెంతోసంతోషము కలిగించునశోకవృక్షములు, పొన్నచెట్లు మున్నగునవి చక్కఁగాఁ గాచి పండినతీయమామిడి, యరఁటి, మున్నగుఫలజాతివృక్షములు లెక్కకు మిక్కిలియై యట నుండెను. వేయేల! ఆయాశ్రమమే భూలోకస్వర్గము.

కణ్వమహర్షి యాశ్రమమున నిరంతరము పదను క్రమము పఠించు వేదవిదుల వేదనినాదము నింగిముట్టుచుండెను. ఎడతెగని యగ్నిహోత్రమున నాజ్యము సమిధలు కర్మిష్ఠు లగుఋషులు "స్వాహా" యనుశబ్దములతో వేల్చుచునే యుండిరి. అంతే కాదు. ఆయాశాస్త్రములలో నిష్ణాతు లయినఋషీశ్వరులు రచించిన న్యాయాదిశాస్త్రముల ప్రవచనములవలన విద్వత్సభాసంభాషణఘోష నట నెప్పుడును వినఁబడుచుండెడిది. మఱియు వేదార్థమీమాంసకగోష్ఠీవివాదనాదములు నట వినఁబడుచునే యుండెను. ఇంకను, యజ్ఞప్రయోగప్రవీణు లయినయాజ్ఞికులకును, విహితానుష్ఠానాసక్తు లయినయనుష్ఠాతలకును, అధికతపోనిరతు లయినమహాతపోనిధులకును కణ్వునియాశ్రమము నివాసస్థానమయ్యెను. మఱియు నీయాశ్రమము గంగాతీరమునందలి నరనారాయణదివ్యాశ్రమమువలె జగత్పావనమై యలరారెను.

కణ్వమునియాశ్రమముపొంత శుకపికములు శ్రవణసుఖముగా సామగానములు చదువుచుండెడివి. అవి వినుచుఁ గదలక నిలుచునేనుఁగులు, ఆయేనుఁగులతొండములచల్లనినీడను జల్లనిగాలికొఱకై చేరి సుఖముగా సింహములు నుండెడివి. అచటి ఋషివరులు భూతబలులుగాఁ బెట్టునీవారన్నపిండములుతినుటకై చేరవచ్చి పరస్పరస్నేహముతో నెలుకలు పిల్లులు వంతులు పంచుకొని కుడుచుచుండెడివి.

ఇట్టిపవిత్రాశ్రమమునఁ గణ్వమహర్షి యేకైకధర్మస్వరూపుఁడని జగమునందలిసమస్తజనులు తన్నుఁ బ్రశంసించుచుండఁగా

జగదారాధ్యుఁడై, దయామయుఁడై, యూర్ధ్వరేతుఁడై, మహామహుఁడై విలసిల్లుచుండెను. సహస్రసంఖ్యాకు లగుశిష్యు లాతనిఁ జేరి శుశ్రూషాపరత భయభక్తియుక్తులై యుండఁ గణ్వమహర్షి కులపతియై వారలకుఁ దోడునీడగాఁ గన్నతండ్రిగాఁ బరమహితుఁడుగా వర్తించుచు నెల్లరిమానసములను వశమొనరించుకొని వారెల్లరకు నారాధ్యదైవ మయ్యెను.

### కణ్వమహర్షి కారుణికత్వము.

అఖండబ్రహ్మచర్యవ్రతుఁడు, జ్ఞానసంపన్నుఁడు, యోగారూఢుఁడు, మునిగణసేవితుఁడు నగుకణ్వమహర్షి యపారభూతదయాపరుఁడై యుండెను. అచట నివసించునాతనిశిష్యగణమే కాక యావనమందలి పశుపక్షిక్రిమికీటకములు సైత మామహనీయుని దయావిశేషమునకుఁ బాత్రములై యుండెను. ఆప్రాంతములకు వచ్చినరాజర్షి బ్రహ్మర్షి మునిపుంగవు లెల్లరును గణ్వునియాశ్రమమును దర్శించి యాతనిసాదరగోష్ఠీవిశేషమును గన్నులఁ గట్టుకొని యాతనిని సన్నుతించి యాతిథ్యసన్మానము లంది యరుగుచుండిరి.

### కణ్వమహర్షి శకుంతలఁ గాంచి పెంచుట.

ఒకనాఁడు కణ్వమహర్షి యుదయవేళ మాలినీనదీస్నానమునకై బయలుదేఱి వెడలుచుండఁగా మార్గమధ్యమున నొక్కబాలికరోదన మాతనికి వినఁబడెను. ఆధ్వని ననుసరించి కణ్వుఁడు వెదకఁగా నట నొకచోట, తామరపాకుపాన్పుపైని యం దొకబాలిక చేతులు కాళ్లు కదుపుచు నేడ్చుచుండుటఁ గాంచెను. కరుణారసభరితమైనయామహనీయునిహృదయము వెంటనే ద్రవించి

పోయెను. చలిచీమపైనైన జాలిపడునాకరుణాసముద్రుఁడుని కాబాలికపై ననుకంప జనింప యోగదృష్టిని బోనించి యామెజన్మాది వృత్తాంత మంతయుఁ దెలిసికొనెను. ఇంతలో నశరీరవాణి “మునీంద్రా! ఈమె మేనకావిశ్వామిత్రుల కుదయించిన బాలారత్నము. నీ వీబాలికభయముం బాపి పెంచుము. ‘భయత్రాతా తండ్రి’ యనునుడివలన నీ వీమెకుఁ దండ్రి వగుదువు. ఈమెకు జనించుపుత్రుఁడు చక్రవర్తి యగును. విశ్వామిత్రతపఃప్రభావమునఁ గ్రవ్యాదగోచరము కాక శకుంతరక్షితయై నవపల్లవపలాశతల్పమునఁ బొరలు నీమె శకుంతల యనుపేరఁ బరగుఁగాక యని పలికెను.

ఇది విని కణ్వమహర్షి యానందించి యంగీకరింప నాబాలికపై నాతనికిఁ బుత్త్రికామోహ ముదయించెను. వెంటనే యతఁ డాబాలికను దనపొదిఁగిటఁ బొదివికొనెను. అంతేకాదు:

“పుట్టుబ్రహ్మచారి పుత్రమిత్రకళత్ర
యోగభోగరహితుఁ డూర్ధ్వరేతుఁ
డహహా! దైవఘటన మాపిన్నపాప మేం
వలచికొనదు మూర్ఖమునఁ గొన్నఁగె.

(కృష్ణకవి శకుంతలాపరిణయము. [illegible])

కణ్వమహర్షి యాబాలికను దీసికొనిపోయి తనపర్ణశాలయందు లలితకుశశయ్యపై బరుండఁబెట్టి తానే తల్లియుఁ దండ్రియు దాదియునై పెంచఁదొడఁగెను. అహా! విధివైదములు విచిత్రములుకదా! ఆలుబిడ్డ లెఱుఁగని యాజన్మబ్రహ్మచారిని శకుంతలకు దాదిం జేసినవిధి యిఁక నేమి చేయఁగలదు!

### శకుంతలావివాహము

కాలక్రమమున శకుంతల యల్లారుముద్దుగాఁ బెరుగుచుఁ గణ్వమహర్షిని దండ్రిగాఁ జూచుకొనుచు నాతనివలన విద్యావినయవివేకాది సుగుణసంపదల నన్నిటినో యలవఱుచుకొని యవనీతలమున కవతరించిన చిరుశశిరేఖవలె దినదినప్రవర్ధమాన యగుచుండెను.

కాలప్రవాహమున కెట్టియాతంకములు కలుగఁబోవు. పసిపాపల బాలురఁగా బాలుర యువకులఁగా యువకుల వృద్ధులఁగాఁ గాలపురుషుఁడు మార్చివేయుచు జరామరణములఁ గూర్చుచు లోకము నేలుచుండెను. మూర్ఖమానవులు కాలప్రభావ మెఱుఁగక సౌదశ కాదశయే శాశ్వతమనుకొని క్రీడాపరులై యిహపరములకు రెండిటికి దవ్వగుచుందురు.

కాలక్రమమున శకుంతల యువతియై నవలావణ్య విలాసహాసముల నొప్పారెను. సఖీజనముతో నామె యుద్యానవనములఁ బెంచుట, తండ్రి దేవపూజకు వలయుపుష్పపత్త్రాదులఁ దెచ్చుట, ఆశ్రమమృగముల నాదరించుట మున్నగుపనులు నిత్యకృత్యములుగాఁ జరిగెను.

ఒకప్పుడు కణ్వుఁడు నిజాశ్రమ ప్రదేశమున లేనిసమయమున దుష్యంతమహారాజు వేటకై వచ్చి వేటాడి డస్సి కణ్వమహర్షిని జూచి పోవుద మని కణ్వాశ్రమమున కేతెంచెను. అప్పు డాతనికి శకుంతల లోచనగోచర కాఁగా నామె సౌందర్యమున కచ్చెరువంది యామె ఋషికన్య యైనచోఁ దన కామెపై

నట్లు వలపు కలుగుట సంభవింపదనియు నామె క్షత్త్రియకన్యయై యుండవలయుననియు నిశ్చయించుకొనెను. తదనంతర మామె వృత్తాంతముఁ దెలిసికొని యామెను జెట్టవట్ట నుంకించెను. శకుంతలయు నవమన్మథుఁ డగునారాజేంద్రుని మక్కువఁ దగిలెను. ఆతఁడు గాంధర్వవిధిని వివాహమయి సంగమసౌఖ్య మిమ్మని యామెను వేగిరపెట్టెను. శకుంతలయుఁ దనకుఁ బుట్టఁబోవుపట్టి యువరాజు కావలయు నని కోరెను. దుష్యంతుఁ డందుల కంగీకరించి గాంధర్వవిధి నామెఁ బరిణయమై యిష్టోపభోగము లందె నామెకు గర్భము నిలిచెను. పిదప, దుష్యంతుఁడు తనప్రధానవర్గమును గణ్వమునిపాలికిఁ బుత్తెంచి యామెను దీసికొనిపోయి పట్టమహిషిం జేసికొందు నని చెప్పి యామె నూఱడించి నిజనగరమునకు వెడలిపోయెను.

### కణ్వుఁడు శకుంతలకు వర మిచ్చుట

శకుంతలయు జరిగినదానిని విని కణ్వమహర్షి యేమనునో యేమినింద వచ్చునో యని భయపడుచుండెను. ఇంతలోఁ గణ్వమహర్షి విచ్చేసి తన కెదురు వచ్చి నమస్కరించినకూఁతుం జూచి లలిత శృంగారభావమున లజ్జావనతవదనయు, అతిభీతచిత్తయు నై నశకుంతలసంగతి దివ్యదృష్టిని దెలిసికొని యది యంతయు విధివిలసితముగాఁ దలపోసి శకుంతల నూఱడించి యిట్లని పలికెను.

"తల్లి! నీకులగోత్రసౌందర్యములకుఁ
దగినపతిఁ గంటి వానికిఁ దగఁగ గర్భ
మయ్యె నీదుగర్భమునవాఁ డఖిలభువన
మహామహీయుఁ డగుచక్రవర్తి సుమ్ము." (భాగ. ఆది. ౪-౬౨)

నీధర్మచరితమునకు మెచ్చితిని. నీవు కోరినవర మిచ్చెదను వేఁడు" మని పలికెను. అంత నామె మిక్కిలి సంతసించి "తండ్రీ! నీదయకన్న నాకు వలసిన దేమున్నది? నాచిత్త మెప్పుడును ధర్మమునందే తగిలియుండునట్లు, నాకుఁ బుట్టునట్టిపట్టి దీర్ఘాయురారోగ్యైశ్వర్యబలసమన్వితుఁడు, వంశకర్త యగున ట్లనుగ్రహింపు" మని కోరెను. కణ్వుఁ డావర మనుగ్రహించి యామెకు యథాకాలవిధుల గర్భసంస్కారరక్షణములు చేయించియుండ మూఁడేండ్ల కామె యొక్క సుపుత్రుని గాంచెను.

కణ్వమహర్షి యాబాలునికి భరతుఁ డనునామకరణము చేసి జాతకర్మక్రియాకలాపముల నెల్ల నొనరింప నాబాలుఁడు శుక్లపక్షచంద్రునివలెఁ బెరుఁగుచుఁ గరతలాలంకృత చక్రుఁడు, చక్రవర్తిలక్షణలక్షితుఁడు, సింహసంహననుఁడు, దీర్ఘబాహుఁడు, అనంతజనసత్త్వసంపన్నుఁడునై పెరుగుచుండెను.

భరతుఁడు వనములోనిక్రూరమృగముల నెల్లఁ దనబలమునం జేసి దమియించుచుండుటఁ జూచి ఋషు లాతనికి సర్వదమనుఁ డని పేరిడిరి.

### కణ్వుఁడు శకుంతలను బుత్రుని బంపివేయుట.

కణ్వమహర్షి భరతునియుదారతేజోరూపవిక్రమగుణములకు సంతోషించి యాతఁ డఖిలభువనయౌవరాజ్యాభిషేకమునకు సమర్థుఁ డగుసమయ మరుదెంచిన దని యెంచి యాలోచించి యొకనాఁడు శకుంతలతో నిట్లనెను. తల్లీ!

"ఎట్టిసాధ్వులకును బుట్టినయిండ్లను
బెద్దకాల మునికి తద్ద తగదు

పతులకడన యునికి సతులకు ధర్మువు
సతుల కేడుగడయుఁ బతుల చూవె.

(భార. ఆది. ౪-౬౬.)

కావున,నిన్ను దుష్యంతుపాలికిఁ బంపుదునని యనఁగానే దుష్యంతప్రణయవశంవద యగుశకుంతలకు మహానందమయ్యెను.

ఇది కని కణ్వమహర్షి షడ్రసోపేత మగువిందు గావించి యాశ్రమవాసులకు సంతర్పణము గావించి మనుమనిఁ గూఁతు నలంకరించుటకుఁ బ్రియంవదాదులఁబిలిచి ప్రయాణసన్నాహము చేసెను. అపుడు సాలంకృత యగుశకుంతలను భూషణభూషితుఁడగుమనుమనిఁ గాంచి వారిమ్రొక్కు లంది యాశీర్వదించి వియోగభరమునఁ గన్నులనీరు క్రమ్మ నెట్లో వారించుకొని శిష్యచూడామణులవెంట వారిని దుష్యంతునింటికిఁ బంపివేసెను.

తదనంతరము, తొలుత దుష్యంతుఁడు నిరాకరించియుఁ బిదప నాకాశభాషితమున శకుంతలఁ జేరఁదీసి పట్టమహిషి నొనర్చి భరతునికి యావరాజ్యాభిషేకముఁ గావించినసంగతి విని కణ్వమహర్షి బ్రహ్మానంద మందెను. ఇఁక,నాతఁడు మమకారబంధములను బటాపంచలు చేసి యోగనిష్ఠుఁడై దివ్యతపస్వి యయ్యెను.

## కాణ్వధర్మశాస్త్రము.

కణ్వమహర్షి మహాధర్మోపదేశకుఁడుగా విశ్వవిఖ్యాతి నార్జించెను. ధర్మప్రవక్తలలో నొకఁడుగా నీతనిని ఆపస్తంబాదులు పేర్కొనిరి. ఆహ్నికశ్రాద్ధధర్మసందర్భమున స్మృతిచంద్రికలోఁ గణ్వధర్మశాస్త్రమునుండి కొన్నియుదాహరణములు కలవు.

ఇట్లే గౌతమయాజ్ఞవల్క్యస్మృతిభాష్యకారులు కణ్వుని ధర్మశాస్త్రమునుండి మఱికొన్ని వాక్యము లుదాహరించియున్నారు: "అధ్వరే వేదేతిహాసపురాణానీతిధ్యాయన్ బ్రాహ్మణ తీర్థే నోష్ఠయోః సలోమదేశమున్మృజేత్" (స్మృతిచంద్రిక) "సంవత్సరేణ పతతి పతితేన సమాచరన్, యానాశనాసనైర్నిత్య మిత్యాహుర్బ్రహ్మవాదినః" (హరదత్తుని గౌతమధర్మశాస్త్రవ్యాఖ్య.) మున్నగునవి కాణ్వధర్మశాస్త్రమునందలివి.

మహాతపస్వి, బ్రహ్మనిష్ఠుఁడు, ధర్మప్రవక్త, మహర్షియైన కణ్వమహాముని మనకు నిత్యస్మరణీయుఁడు.

# కర్దముఁడు

బ్రహ్మ సర్వదేవతలను గంధర్వాప్సరోగణములను సిద్ధకిన్నరకింపురుషమనుష్యాదులను సృష్టించి యనంతరము తపోయోగవిద్యాసమాధియుక్తుఁడు, ఋషివేషధరుఁడు, హృషీకాత్ముఁడునై యాతఁడు ఋషిగణములఁ బుట్టించెను. వెంటనే యాతఁడు సమాధియోగైశ్వర్యతపోవిద్యావిరక్తియుక్త మగు తనశరీరము నుండి ఆయాయంశలు వారెల్లరకు నిచ్చి ప్రజాసృష్టి యొనరింప వారిని నియమించెను.

### బ్రహ్మ నియోగము.

కృతయుగమున నొకప్పుడు బ్రహ్మ తపోవిద్యానవద్యుఁడై యోగీశ్వరుఁ డైన కర్దముని బిలిచి వివాహమాడి సంతానమును బడసి సృష్టికార్యమునఁ దనకు సాయము కమ్మని కోరుకొనెను. కర్దముఁ డాతనిమాట కాదనఁజాలక యట్లే యని యాతనిఁ బంపివేసెను.

### కర్దముని తపస్సు.

పిదప ధైర్యస్థైర్యవిరాజితుఁ డగుకర్దముఁడు సరస్వతీనదీతీరమున కేఁగి యట నొకయాశ్రమమును నిర్మించుకొని యందుండి మహాదీక్షతోఁ బదివేలసంవత్సరములు తప మొనరించెను. అనంతర మొకనాఁ డాతఁడు జపసమాధినుండి యేకాగ్రచిత్తుఁడై వరదుఁడు ప్రసన్నుఁడు మనోరథవరదానశీలుఁడు రమేశుఁడు నగు

హరిం బూజించిన నాతఁడు కరుణాళుఁడై ప్రత్యక్ష మయ్యెను. శంఖచక్రగదాపద్మహస్తుఁడు, పీతాంబరధరుఁడు, శబ్దబ్రహ్మశరీరవంతుఁడు, సదాత్మకుఁడు, జ్ఞానైకవేద్యుఁడు, వైనతేయవాహనుఁడు నయినహరిని గనుఁగొని కర్దముఁడు సాష్టాంగదండప్రణామము లాచరించి యమితానందుఁడై యిట్లని స్తుతించెను.

"అబ్జాక్షా! యోగీశ్వరేశ్వరులు నీదర్శనముఁ గోరి కడముట్టఁ గందురు. కాని, నాభాగ్యమున నీపాదారవిందదర్శనముఁ గంటిని. భవవార్ధిఁ గడగంటిని. దేవా! నీమాయావలన మోహితులై మేధ నశింప నానారసముద్రమునుండి నిలువఁజాలనిపాదపద్మములను భజింపఁజాలక తుచ్ఛులై నరకమునఁ గూలువారి నేమందును? తండ్రీ! అట్టి కోరికలు గలవాఁడని నిందించు నేనును గృహమేధధేనువు, అశేషమూల్య, త్రివర్గకారిణి, సమానశీల యగు భార్యను బరిణయమునకుఁ దలంచి కల్పవృక్షసదృశములైన నీపాదారవిందముల సేవించితిని. ఐనను, ఒక్కవిశేషము కలదు. కాలాత్మకుఁడవైన నీయభిమతము సిద్ధింపఁజేయుటకే కాని కాముకుఁడనై వివాహ మాడఁగోరుట లేదు. దేవా! నీమాయచే నిర్మితమై కాలవేగముతోఁ గూడి యక్షరమైన బ్రహ్మమునందుఁ గాలచక్రము సకలజీవనికరములయాయువు మ్రింగివేయఁజాలును గాని కామభూతము సోఁకనపశుప్రాయు లగుమానవుల పిడిచి సంసారదుఃఖములను బోఁగొట్టునీచరణముల నాశ్రయించి నీగుణకథన మనునమృతముఁ ద్రావుచు బ్రహ్మజ్ఞానమత్తులై నభగవద్భక్తులయాయువునుమాత్రము హరింపఁజాలదు. సర్వేశ! నీవు సృష్టి

స్థితిలయకారకుఁడవు. విశ్వేశ్వరుఁడవు. శబ్దాదివిషయసుఖకర మగు నీరూపము నా కిట్లు విస్తరింపఁజేయుట న న్ననుగ్రహించుటకే కాని,నీకొఱకుఁగాదు. నీమాయచే లోకతంత్రము నడపించుచు నాకోరిక దీర్ప నిట్లు విచ్చేసితివి కిదే నానమస్కారములు.

### హరి కర్దమునకు వరమిచ్చుట.

ఈపలుకులు విని విష్ణుమూర్తి "మునివరా! ఏకోరికతో నీవు నన్ను భజించితివో యాకోరిక నీకు సిద్ధించుఁగాక! బ్రహ్మపుత్రుఁడు, సమ్రాట్టు, నగుస్వాయంభువమనువు బ్రహ్మావర్తదేశముఁ బాలించుచున్నాఁడు. ఆమహాత్ముఁ డపరదివసమున భార్యాసహితుఁడు, భర్తృకామ యగుతనూజాయుతుఁడు నై నీకడకు వచ్చి యనురూపవయశ్శీలసంకల్పగుణాకర యగుకూఁతు నిచ్చి నీకుఁ బరిణయముచేయును. ఆమనుకన్యయం దతిసౌందర్యయుతలై నవకన్యలు నీ కుదయింతురు. వారియందు మునీంద్రులు పుత్రులం బడయుదురు. నీవు నాశాసనమును బాలించి సర్వకర్మములు నాయం దర్పించి ఏకాంతికుఁడవు, భూతభయరహితుఁడవు, జ్ఞానివి నై నాయందే జగములు కల వనియు నీయందు నేను గల ననియు నెఱిఁగి నన్ను సేవించుచుండుము. అట్లుండి చరమకాలమున నన్ను నీవు పొందఁగలవు. మఱియు, నాకళాంశమున నీభార్యయందుఁ బుత్రుఁడనై జనించి నీకుఁ దత్త్వసంహితి నుపన్యసింతు" నని చెప్పి యంతర్హితుఁ డయ్యెను.

### కర్దముని వివాహము.

కర్దముఁ డాపిమ్మట బిందుసరోవరతీరమున కేఁగి తప మొనరించుచుండెను. అపుడు బంగరురథ మెక్కి శతరూప యను

భార్యతోడను దేవహూతియనుపుత్రికతోడను స్వాయంభువుఁడు విచ్చేసి కర్దమమహర్షి దివ్యాశ్రమమును బ్రవేశించి ద్వారమునఁ గర్దమహర్షిని గాంచెను. కర్దమమహర్షి బ్రహ్మచర్యవ్రతమున మహాతపోమూలమున దివ్యతేజస్వియై యుండెను. అతనిశరీరము కృశించినను అతఁడు హరికథాపూరితుఁడగుటచేఁ గృశీభూతుఁడు కాక జటావల్కలాజినలక్ష్మితోఁ బద్మదళములవంటివిశాలనేత్రము లొప్పుచుండ సానపెట్టనిదివ్యరత్నమువలె నాతఁడు మెఱయుచుండెను. స్వాయంభు వాకర్దముని సమీపించి సమస్కరించి స్తుతించి తనవృత్తాంతమును గర్దమునిదక్క నన్యుని వరింప నను తనతనయవృత్తాంతమును దెలిపి యామెను వివాహ మాడుమని కోరెను.

కర్దముఁ డంగీకరించి "అయ్యా! ఈమెను వివాహ మాడుట నా కంగీకారమే కాని యొక్కసమయము గలదు. ఈమెకు బిడ్డలు పుట్టువఱకు నే నీమెతోడనే యుందును. ఆపిదప నేను సన్న్యసించెద"నని పలికెను. స్వాయంభువు భార్యాపుత్రికల కీవార్తఁ దెలిపి వా రంగీకరింపఁ దాను నంగీకరించి విధ్యుక్త ప్రకారమున దేవహూతి నిచ్చి కర్దమునికి వివాహము చేసెను. శతరూప బార్హిసంజ్ఞకములై సవివాహోచితదివ్యాంబరాభరణములను దంపతుల కొసంగెను. ఆపిమ్మట శతరూపాస్వాయంభువులు పుత్రికను విడువలేక కౌఁగిలించుకొని చుబుకము పుడుకుచుఁ జెక్కిలి ముద్దుగొని శిరము మూర్కొని ప్రేమాతిశయమునఁ గన్నీరు మున్నీరై కాఱ, "తల్లీ! పోయి వచ్చెద"

మని చెప్పి కూఁతు నల్లున కొప్పగించి కర్దమునిచే నామంత్రితులై రథ మెక్కి తమదేశమునకు వెడలిపోయిరి.

### దేవహూతీ కర్దముల సంసారయాత్ర.

పిదప, దేవహూతి పతిభక్తి కలిగి భవునికి భవాని పరిచర్య చేయువిధమునఁ గర్దమునికిఁ బరిచర్య చేయుచుండెను. ఆతఁడే తనకు సమస్తము నని యెఱిఁగి యాతనిచిత్తవృత్తిని బట్టి యాతని కనుసన్నల మెలఁగుచు, పదపద్మములఁ గొలుచుచు, దినదినము భక్తితాత్పర్యస్నేహములు రెట్టింపఁ బతిశుశ్రూష చేయుచుండెను. అందుచే నామె యనూనతేజోవిరాజితయు, కామక్రోధాది గుణవిరహితయు, నయి శరీరశుద్ధి పొంది శౌచలక్ష్మి యన నొప్పుచు, చతురసౌహార్దస్నేహములు కలిగి పతియే దైవముగా భావించి మృదుమధురవచనముల నాతనిమనస్సును రంజింపఁ జేయుచుండెను.

ఇట్లుండ, దైవయోగము నైనను దప్పింపఁ సమర్థుఁడైన కర్దముఁడు తన సేవలోఁ గృశించినశరీరము గలదేవహూతిపతిభక్తికిఁ బరిచర్యకు మెచ్చి దయాసముద్రుఁడై యామెతో నిట్లనెను. "తరుణీ! దివ్యభోగములు, సమస్తశోభములు నాసేవవలన నీకుఁ లభింపఁగలవు. నీకు దివ్యదృష్టి నిచ్చెదను. దానివలన నీకు సమస్తము గోచరించును. క్షణమాత్రమున నశించు తుచ్ఛభోగములు మన కేల ? మహారాజాధిరాజులై చక్రవర్తులైనవారు నెఱుఁగనిదివ్యభోగములు నీపాతివ్రత్యనిష్ఠవలన సిద్ధించును. నీవు వాని ననుభవింపు" మని పలుక నామె యిట్లనెను.

“దేవా! అమోఘయోగమాయావిభవుఁడ వగునీ కెందు సమర్థత లేదు? అనుపమదివ్యభోగములు నీశక్తిని సమకూరు నని నే నెఱుఁగుదును. నాకు సమస్తాభరణమాల్యానులేపనమందిరారామాదుల నెల్ల ననుగ్రహించి శరీరసౌందర్యవర్ధకసమస్తభోజనములు సమకూర్చి యాపిదప నీతనుసౌఖ్య మొసఁగు” మని కోరెను.

### కర్దమునియోగబలము

కర్దముఁ డంత యోగమాయబలంబున వెంటనే యనేకదివ్యభవనములతోఁ గూడి, అనేకదివ్యవస్తుసంచయముతో నొప్పి, లలితోద్యానవనయుతమై, దివ్యసుందర నగరముల నొప్పునొకదివ్యవిమానరాజము నాతఁడు సృష్టించెను. అది యామె భౌతికనేత్రములకుఁ గానరాకపోవ వెంటనే కర్దముఁడు బిందుసరోవరమున స్నానము చేయు మనియు నపుడు దివ్యదృష్టి కలిగి యన్నియుఁ గానవచ్చు ననియు భార్యకుఁ దెలిపెను. ఆమె యట్లు చేయ సమకట్టి యానీటిలో దిగుసరి కందు రుచిరసూక్ష్మాంశుకధారిణులు, కిశోరవయఃపరిపాకశోభితలు, ఉత్పలగంధులు నగుకన్యాసహస్రములు కానవై యామె కభ్యంజనాదులు దీర్చి షడ్రసాన్నభక్ష్యములఁ దనిపి కనకపాత్రికలఁ గర్పూరనీరాజనము లిచ్చి యాసనమున నునిచి యద్దము చేతి కిచ్చిరి. ఆమె యచ్చెరువడి తన్నుఁ జూచుకొని యది యంతయు భర్తయోగవిభవ మని యుప్పొంగి భర్తఁ దలఁచెను. కర్దముఁ

డటఁ గాసనై ఆకన్యలతో దేవహూతితో విమానము నెక్కెను.

అనంతర మావిమానము దేవతోద్యానములకు సమస్త భూభాగదివిభాగసమస్తదివ్యప్రదేశములకు వాయువేగమునఁ గొనిపోయి వారల నానందాబ్ధి నోలలాడించెను. మోక్షదాయకుఁడును, తీర్థపాదుఁడు నగుపుండరీకాక్షునిఁ గొలిచినవారికిఁ బొందరాని పదార్థములు కలవే?

అనంతరము వారు నిజనివాసమునకుఁ జనుదెంచి సమస్త భోగము లనుభవించిరి. శతవత్సరములు వార లిట్లు క్రీడించిన పిదప నొకనాడు కర్దముఁడు తనవీర్యమును నవవిధముల భార్య గర్భమున నిలిపెను. దేవహూతి గర్భము ధరించి కాలక్రమమునఁ దొమ్మండ్రుకూఁతుండ్రను గనెను.

కర్దముఁడు వివాహకాలమునందలిసమయమును స్మరించి తాను సన్న్యసింపఁ దలఁచెను. దేవహూతి దీనవదనయై పుత్త్రికలకుఁ బెండ్లిండ్లయి వార లత్తవారిండ్లకేఁగు వఱకును, ఒక సుపుత్త్రుఁడు జనించి తన్నుద్ధరించువఱకును సన్న్యసింప వల దని ప్రార్థించెను. కర్దముఁ డంగీకరించి విష్ణుమూర్తిని నియమవ్రతముల సేవింపు మనియు నాతఁ డామెగర్భమున నర్భకుఁడై పుట్టఁగలఁడనియుఁ దెలిపెను. ఆమె యానందించి హరిపరతంత్రయై దివ్యదీక్షఁ దేజరిల్లఁ జొచ్చెను.

ఇట్లుండఁ గొంతకాలమునకుఁ గర్దమవీర్యమున దేవహూతి మరల గర్భము ధరించి విష్ణుమూర్తినే సుతునిగాఁ గనెను.

అపుడు దివ్యదుందుభులు దేవతూర్యములు మ్రోఁగి పుష్పవర్షములు కురిసి శుభములు సూచించెను. మరీచిప్రముఖు లైన మునిజనములతోఁ గూడి బ్రహ్మదేవుఁ డచటికి విచ్చేసి యీ పుట్టినబిడ్డఁడు దేవదేవుఁ డని దేవహూతీకర్దములకుఁ దెలిపి యాతఁడు సాంఖ్యతత్త్వమును లోకములఁ జాటి యెల్లర నుద్ధరింపఁ గలఁ డని తెలిపి కర్దమునిపుత్రికలను ఋషివరుల కిచ్చి పెండ్లి చేయు మని చెప్పి వెడలిపోయెను.

బ్రహ్మ చెప్పినప్రకారము కర్దముఁడు మరీచిమహర్షి కిఁ గళను, అత్రి కనసూయను, అంగిరసునకు శ్రద్ధను, పులస్త్యునకు హవిర్భువును, పులహునకు గతిని, క్రతువునకుఁ గ్రియను, భృగువునకు ఖ్యాతిని, వసిష్ఠున కరుంధతిని, అథర్వునకు శాంతిని నొసంగి నిజకులాచారము ననుసరించి దివ్యవైభవముతో వివాహములు చేసివైచెను. పిదపఁ దొమ్మండ్రుకూఁతుండ్రను దొమ్మండ్రల్లుండ్రకు నొప్పఁ జెప్పి సకలసత్కారములతో వారి వారిని వారివారియిండ్లకుఁ బంపివేసి దేవహూతీకర్దములు సుతుఁడగుకపిలుని గనిపెట్టుకొని యింట నుండిరి.

### కర్దముఁడు మోక్షమునందుట

కర్దముఁడు కొంతకాలమునకు దేవోత్తముఁ డగువిష్ణుఁడు తనమందిరమున నవతరించి వసించియుండుట తన చిత్తమున నెఱింగి వివిక్తస్థలమునకుఁ జని యచటఁ గపిలునకు వందన మాచరించి యిట్లు పలికెను. "దేవాదిదేవా! ఆదివిష్ణుఁడ వగునీవు నాయింటఁ బుట్టితివి. సంసారచక్రమునఁ బడి తిరుగుచు గ్రా

మ్ముల మయినమావర్తనములను గణింపక తొల్లి నీ వానతిచ్చి నట్లే నాయింటఁ బుట్టితివి. నీవు నాకుఁ బుట్టుటచే నేను ఋణత్రయము నీఁగఁగంటిని. నీపాదారవిందములు నాడెందమునఁ జేర్చి దుఃఖములఁ బోఁద్రోలి యేకాంతికుఁడ నగుదును.” కపిలుఁడది విని “మునీంద్రా! నావచనము తప్పక నీ కిట్లు జనించితిని. తత్త్వజ్ఞానము సకలమునులకుఁ దెలిపెదను. నీవు సన్న్యస్తచిత్తుఁడవై మోహముఁ బాసి భక్తిచే మోక్షము నందుము. పరమేశుఁడను పరంజ్యోతిని నగునన్ను మనమున నిలిపి మోక్షము నందెద”వని బోధించెను.

కర్దముఁడు కపిల దేవునికిఁ బ్రదక్షిణము చేసి నమస్కరించి యిలు వెడలి మునిగణసేవిత మగువనమునకుఁ జని మౌనమున నిస్సంగుఁడై, ఆత్మైకశరణతత్పరుఁడై పరబ్రహ్మమునఁ జిత్తము నిలిపి సర్వసముఁడై సర్వము వాసుదేవమయముగాఁ దెలిసి భక్తియోగమున భాగవతగతి నందెను. ఇట్లు కర్దమ ప్రజాపతి దేవదేవుని కరుణచే మోక్షలక్ష్మిని జూఱగొని యాచంద్రార్క-విఖ్యాతి నార్జించెను.

# గర్గుఁడు

సీ. తప్తకాంచనవర్ణ తతజటాజూటుండు
బహుతేజశ్శోభాంగసౌభాగుండు
గౌరవర్ణుండు శరత్కాంతనేత్రుండు
శారదాంబుదసన్నిభ ఘనారమ్యముఖుండు
బ్రహ్మతేజుండు ప్రజ్వలితవహ్నిశిఖ్యాంశుడు
బహుశిష్యసంకోటిపరివృతుండు
కమనీయసాక్షాత్సరస్వతీకంఠుండు
హరిభక్తుండు పరమయోగి
సకలసిద్ధాంతశాస్త్రవిశారదుండు
మాధవపదాంబుజాసక్తమానసుండు
సర్వజ్ఞుండు సిద్ధేశుండు సర్వదర్శి
గర్గఋషిఁ గొల్వ నరు నపవర్గసుఖము.

(బ్రహ్మవైవర్తపురాణము. కృష్ణజన్మఖండము, ౭ అ.)

*గర్గుఁడు బాల్యమునుండియు శివునిఁ గొలిచి యాతని కటాక్షము గడించి యాతనినే గురువుగా వరించి సకలవిద్యలు నేర్చెను. ఆతఁడు మూర్తిగైకొన్న తేజస్సమూహమువలెఁ గరడుగట్టిన శ్రుతిసారమువగిది దశదిశలు వెలుఁగఁజేయుచుఁ దన్నాశ్రయించినవారి కెల్లరకు సంసారతాపత్రయములఁ బోఁగొట్టుచు విరాజిల్లుచుండెను.

---

*గర్గుఁడు బ్రహ్మమానసపుత్రులలో నొకఁడు. అంగిరసుఁ డగు భరద్వాజుని కొడుకని కల్పద్రుమకోశము.

"గర్గుఁడు సతతారాధిత
భర్గుఁడు దూరీకృతారివర్గుఁడు మునిసం
సర్గుఁడు కలితశ్రేయో
మార్గుఁడు" అనఘుఁడై గని యాతఁడు

వేలకువేలు శిష్యులు వచ్చి తన్నాశ్రయింపఁగా వారికి వేదశాస్త్రములు చెప్పుచుఁ బోవుచు మహామహుఁడై యుండెను.

ఇట్లుండ హైహయవంశీయు లగుక్షత్రియులు, సమస్త యాదవులు, మఱెందఱో క్షత్రియవంశజులు తమకుఁ గులగురువుగ నుండుమని వచ్చి గర్గు నర్థించిరి. గర్గుఁ డంగీకరించి యుం యావంశజుల కెల్లరకును గులగురువై వారిక్షేమముఁ గోరుచు వారిచే మన్నన లందుచుండెను.

గర్గుఁడు కృష్ణబలరాములకు జాతకర్మాదు లొనరించుట

దేవకీవసుదేవులచే రహస్యముగా నియుక్తుఁడై గర్గమహర్షి శిష్యసమేతుఁడై వ్రేపల్లెకుఁ జని నందునిమందిరమున కరిగెను. అపుడు యశోద శ్రీకృష్ణునకుఁ బాలిచ్చుచు నొకకనకాసనమునఁ గూర్చుండి యుండెను. సశిష్యుఁ డగుమహర్షిని జూచి యశోద యమితానంద మంది వారికర్ఘ్యపాద్యాదులను, ఆసనములను సమకూర్చి తనచిన్నబిడ్డనిచే నాతనికి మ్రొక్కించి తాను వందనశతము లర్పించి యిట్లని పలికెను. "ఓఋషివర్యా! చెప్పఁదగుచోఁ దమనామధేయముఁ జెప్పి నన్నుఁ గటాక్షింపుము. నీవు నరరూపము ధరించిననారాయణుఁడవో శ్రీశుకుఁడవో యని నే ననుకొనుచున్నాను.

“నగజామోహాంఘ్రి రేణుసంస్పర్శనమున
జన్మకోట్యార్జితాఘంబు సంక్షయించె
సంయమీంద్ర! నా పుట్టువు సఫలమయ్యె
ధన్య సఫలమాన్య సఫల సౌజన్య నైతి.

భవదంఘ్రి జము సోకిన
వసనీతల మతిపవిత్ర మగుఁ దక్షణమే
భవదాగమనముచే
భువి మద్గేహంబు తీర్థభూతం బయ్యెన్.

శ్రుతులయం దెవ్వ రధిక విశ్రుతి వహించి
రట్టి శ్రుతిసారభూతమహాజనంబు
లందు నీ వొక్కరుని గంటి నరిది నాదు
ప్రాగ్వపుణ్యమహోదయంబున మహాత్మ!”

(బ్రహ్మవైవర్తపురాణము. కృష్ణజన్మఖండము.)

మహాత్మా! బ్రాహ్మణాశీర్వచనము పూర్ణస్వస్త్యయనము కావున, నీవును శిష్యులును నాయీచిన్నికుమారుని దీర్ఘాయురుపేతునిగా నాశీర్వదింపుఁ” డని ప్రార్థించెను. గర్గుఁడు “తల్లీ! నేను గర్గుఁ డను ఋషిని. వసుదేవునిపురోహితుఁడను. నీ కేకాంతముగా సర్వవిషయములు చెప్పెద” ననెను. ఇంతలో నందుఁడు వచ్చి సశిష్యుఁ డగుఋషివరునకు సాష్టాంగనమస్కారము లొనరించి సన్మానించెను. పిదప నందుని యశోదను రహస్యముగఁ బిలిచి వారితో గర్గమహర్షి యిట్లనెను: “మీచిన్నకుమారుఁడు వసుదేవునిపుత్త్రుఁడు. రోహిణీపుత్త్రుఁ డీతని కన్న. కంసభయమున నితనిఁ దెచ్చి వసుదేవుఁడు రహస్యభంగి నిట నుంచి నీకుఁ బుట్టిన పుత్త్రి నెత్తుకొని మధురాపురి కేఁగెను.

ఇపుడు వసుదేవుఁడు నన్నీబాలునికి విధివిధానముగ అన్నప్రాశన, జాతకర్మనామకర్మాదు లొనరింపఁ బంపినాఁడు. ఈబాలుఁడు పరబ్రహ్మము. ఈరూపమున దుష్టసంహారార్థము శిష్టసంరక్షణార్థము నుద్భవించినాడు. రాధేశ్వరుఁడు, భార్గవీకాంతుఁడు, నలినాథుఁడు, నరనారాయణులు, కపిలాదికనారాయణాంశజాతులందఱు నొకరాశియై మూర్తీభవించి యీబాలుఁ డయిరి. ఈతఁడు పుట్టఁగనే దేవకీవసుదేవులకు నిజరూపముఁ జూపియున్నాఁడు. ఈతనికిఁ బ్రతియుగమున వర్ణభేదము, నామభేదము నుండును. కృతయుగమున శ్వేతవర్ణుఁడై త్రేతాయుగమున రక్తవర్ణుఁడై ద్వాపరమునఁ బీతవర్ణుఁడై యుండును. ఇపుడు కృష్ణవర్ణముఁ దాల్చుటచేఁ గృష్ణుఁ డనఁ బరగు. మఱియు నోనంద నుతోదలారా! కకారము బ్రహ్మవాచకము, ఋకార మనంతవాచకము, షకారము శంకరవాచకము, ణకారము ధర్మవాచకము, అకారము విష్ణువాచకము, విసర్గము నరనారాయణార్థవాచకము. మఱియు, కృషి యనునది నిర్వాణవచనము. ణకారము మోక్షవాచకము, అకారము విమలాత్మధాతృవచనము. ఇంకను, కృషి నిశ్శ్రేష్టవాచకపరము, ణకారము భక్తివాచకము, అకారము ధాతృవచనము. ఇంతేకాదు. కృషి కర్మనిర్మూలవచనము. ణకారము దాస్యవాచకము, అకారము ప్రాప్తివచనము. ఇన్నివిధములఁ గృష్ణనామము సర్వశక్తియుతము. ఈనామము నుచ్చరించుట వలనిఫల మనంతము.

వల్లవేంద్రా! ఈబాలునకు శ్రీకృష్ణుఁడు, పీతాంబరుఁడు, కంసధ్వంసి, విష్టరశ్రవుఁడు, దేవకీనందనుఁడు, శ్రీమంతుఁడు,

యశోదానందనుఁడు, హరి, సనాతనుఁడు, అచ్యుతుఁడు, విష్ణుఁడు, సర్వేశ్వరుఁడు, సర్వరూపధరుఁడు, సర్వాధారుఁడు, సర్వగతి, సర్వకారణకారణుఁడు, పరిపూర్ణతముఁడు, పరబ్రహ్మ, గోవిందుఁడు, గరుడధ్వజుఁడు, రాధాబంధుఁడు, రాధాకాంత కాత్మ, రాధికాజీవనుఁడు మున్నగుశుభనామములు వేదములందు వినఁబడును. ఈనామములు సర్వమంగళప్రదములు. సర్వపాప ప్రణాశకములు, జన్మమృత్యుజరావ్యాధినివారకములు.

మఱి నీజ్యేష్ఠపుత్రునినామము తెలియఁజేసెద. వినుము. గర్భసంకర్షణమున నీతనికి సంకర్షణుఁ డనిపేరు. వేదములం దీతని కంతము లేకపోవుటచే అనంతుఁడు. బలవిశేషము బలదేవుఁ డనియు, హలధారణమున హలియనియు, నీలచేలధారి యగుటచే నీలాంబరుఁ డనియు, ముసలమును ధరించువాఁ డగుటచే ముసలి యనియు, నీతనికిఁ బేళ్లు. రౌహిణేయుఁడు, రేవతీనాథుఁడు మున్నగు నామములు నీతనికిఁ గలవు."

పిదప, గర్గుఁడు రాధాకృష్ణులు గోలోకవాసులగు శ్రీదామ రాధిక లనియు నాకే యిప్పు డిటు జనించి రనియుఁ జెప్పి కృష్ణుఁ డాజన్మమునఁ జేయఁబోవుసమస్తకార్యములను బూస గ్రుచ్చినట్లు తనదివ్యదృష్టిచేఁ దెలిసికొని వారికి వినిపించెను. పిదప బలరామకృష్ణులకు నిర్వర్తింపవలసినజాతకర్మములకు శుభ ముహూర్తమును నిశ్చయించి రహస్యమందిరము నుండి బాహ్య మందిరమునకు వచ్చి గర్గుఁడు సుఖాసీనుఁ డయ్యెను.

గర్గమహర్షి రాక విని నందవ్రజమునఁ గలగోపగోపికలు బాలకబాలికాసహితముగా గర్గుని దర్శనము చేసికొనుటకై నంద మందిరమునకు వచ్చిరి. వచ్చి వారు:

సీ. అలలిత బ్రహ్మతేజంబున గ్రీష్మపు
ధ్యాహ్న భాస్కరుభంగి నలరువాని
చెలువొప్పఁ గాంచనసింహాసనంబుపై
యోగముద్ర ధరించి యున్నవాని
జ్ఞానదృష్టిచే నెస భూతభవ్యభ
విష్యద్గతజ్ఞుఁడై వెలయువాని
సస్మితుండై సంది సదనపరిచ్ఛందం
బంచితంబుగ నీలోకించువాని
సిద్ధమంత్రప్రభావవిశేషకలనఁ
గాంతితో మది గోపించుఁ గాంచువాని
నఖిలశిష్యగణాన్వితుం డైనవాని
గను విచితాఖిలార్షసువ్యుఁ గనిరి.

ఆపిదప వా రెల్లరు నాతనికి నమస్కరించి యాతనిదీవనలుగొని తమతమగృహముల కరిగిరి.

నందుఁడు గర్గమహర్షి యేర్పఱచిన శుభముహూర్తమున సమస్తరాజబంధుమిత్రులను విప్రులను బిలిపించి సమస్తవైభవోపేతముగా శ్రీకృష్ణునకు నామకరణాన్నప్రాశనాదులు చేయించి సర్వసత్కారపరంపరలచే నెల్లరను సంతోషపఱిచెను.

గర్గుఁడు శ్రీకృష్ణుని స్తుతించుట

ఒకనాఁడు గర్గమహర్షి శ్రీకృష్ణు నేకాంతమునకుఁ గొని పోయి ప్రదక్షిణపూర్వకముగా నమస్కరించి హర్షపులకలు పొడమ భక్తిసమాత్మకధరుఁడై నిటలమున నంజలి ఘటించి బాహ్యాభ్యంతరములయం దమ్మహనీయమూర్తినే యవలోకించుచు నిట్లు స్తుతించెను. "శ్రీకృష్ణా! జగదీశా! శ్రితజనమం

దారా! నీపదములయందు నిశ్చలమైనభక్తిని నీదాస్యమును నాకు నిత్యమొసంగుము. అంతకుమించి ధనధాన్యసంపదలు నాకేమియు వలదు. నాకు సాలోక్యసామీప్యముక్తులే వలదు. నాకు వలసినది నీదివ్యపాదార్చనము. ఈశ్వరుఁడు నిన్ను భజించియే సర్వజ్ఞుఁడై మృత్యుంజయుఁడై విలసిల్లెను. బ్రహ్మదేవుఁడు నీపాదపద్మములను భజించియే సృష్టికర్త యయ్యెను. ధర్ముఁడు నీపాదములు గొల్చియే కర్మసాక్షియై యఖిలలోకసంరక్షకుఁ డయ్యెను. శేషుఁడు నీపాదసేవ చేసి భర మోపఁ గలిగెను." అని పెక్కుభంగుల స్తుతించు గర్గునిఁ గని కృష్ణుఁడు భక్తవత్సలుఁడై "ఋషీంద్రా! నీకోరినట్లే నీమనసెల్లప్పుడు నాపాదపద్మములందే లగ్నమగుఁగాక" యని కటాక్షించి ప్రసాద మొసంగెను.

పిదప గర్గుఁడు కృష్ణునిచేతను నందయశోదలచేతను సెలవు గైకొని శిష్యసహితుఁడై స్వీయాశ్రమపదమును బ్రవేశించి సుఖముండెను.

## గర్గుఁడు రామకృష్ణుల కుపనయనముఁ జేయుట

కొంతకాలమునకు గర్గమహర్షి తపము చాలించి కంసవధానంతరము శ్రీకృష్ణబలరాముల కుపనయనము చేయింప సమకట్టి దేవకీవసుదేవులకడకు సశిష్యుఁడై విచ్చేసెను. దేవకీవసుదేవులాతని నెంతయుఁ బూజించి యర్ఘ్యపాద్యాదులు, మధుపర్కము, కామధేనువుమున్నగువాని నొసంగిరి. గర్గుఁ డానందించి రామకృష్ణుల కుపనయనకాలము సమీపించుటచే నది నిర్వర్తింప విచ్చేసితి ననియు ముహూర్తము చెప్పి యాకాలమునకు సమస్తపదా

ర్థములు సిద్ధము చేయు మని వసుదేవునికిఁ జెప్పెను. తదనంతరము శ్రీకృష్ణుఁడు స్మరించినంతమాత్రమున సర్వదేవతలు ఋషిపుంగవులు బంధుమిత్రులు నెల్లరు విచ్చేసిరి. గర్గుఁడు వసిష్ఠభరద్వాజాదిఋషిపుంగవుల యనుమతిఁ గొని బలరామకృష్ణుల కుపనయనసంస్కారము నిర్వర్తించి వారిని సాందీపని యనునుత్తమవిప్రునికి శిష్యుల నొసంగెను. ఉపనయనమహోత్సవము నిర్విఘ్నముగా నెఱవేఱినపిదప గర్గమహర్షి శిష్యసహితుఁడై సంభావన లంది నిజాశ్రమమున కేఁగి తపోధర్మము నిర్వర్తింపఁ దొడఁగెను.

### గర్గమహర్షి కార్తవీర్యార్జునుని మేలు కోరుట

హైహయవంశీయులు తమ కులగురు వగుగర్గమహర్షిని మిక్కిలి మన్నించి దైవముగాఁ జూచెడివారు. కార్తవీర్యార్జునుఁడు రాజ్యమునకు వచ్చినపిదప నాతనికి గొప్పవైరాగ్యము జనించెను. వనమున కరిగి తప మాచరించి యధ్యాత్మయోగసిద్ధి బొందెద నని యతఁడు నిశ్చయించుకొనెను.

కార్తవీర్యుని నిశ్చయ మెఱిఁగినగర్గమహర్షి యాతఁ డెవ్విధమునఁ జెప్పినను రాజ్యము చేయనొల్లఁ డని తెలిసి యాతని క్షేమముఁ గోరి యిట్లుపలికెను. "ఓయీ! నీనిశ్చయమువట్ల నీకుఁ జలనము లేనిచో హరియవతారము, యోగిశ్రేష్ఠుఁడు నిరంతరమునిసేవితుఁడు నగుదత్తాత్రేయమహర్షిని ఏమఱక సేవింపుము. అతఁడు నీకు సమస్తవరములు ప్రసాదింపఁగలసమర్థుఁడు. ఆతని నాశ్రయించియే తొల్లి రాజ్యభ్రష్టుఁడైన యింద్రుఁడు

తిరిగి స్వారాజ్యము నందఁగనెను." అని యింద్రునివృత్తాంత మంతయుఁ బూసగ్రుచ్చినట్లు గర్గుఁ డాతనికిఁ జెప్పెను. గర్గుని యీయుపదేశమును వినియే కార్తవీర్యుఁడు దత్తాత్రేయునవర ప్రసాద మందఁగనెను.

దిగ్విజయియైన కార్తవీర్యార్జునుఁ డొకడు తెలియఁగని గర్వమున జమదగ్ని హోమధేనువును బలాత్కారముగాఁ గొనిరా సైన్యములఁ బంపునప్పుడును గర్గమహర్షి యాతనిని వారించెను. కాని, యాతనికిఁ గీడుమూడుకాల మాసన్న మయియుండుటచే గర్గవచనములు వినక కార్తవీర్యార్జునుఁడు తుదకు పరశురామునిచేతిలో మృతుఁ డయ్యెను. గర్గమహర్షి యాదవులకు కులగురువై మేలుకోరి చెప్పినమాట వినకపోయిన నెంతవాఁడైన నెంతవాఁడైన నగుఁగాక యనియెల్లరు ననుకొనిరి.

### గర్గునకుఁ గాలయవనుఁడు కలిగినవిధము

ఒకప్పుడు గర్గమహర్షి యాదవులలో నుండఁగా నొక యాదవుఁడు మిడిసిపాటున నాతనిఁ బరిహసించెను. గర్గుఁ డది సహింపఁజాలక "మూర్ఖులారా! మీమేలు కోరి మీకడ నున్న నన్నుఁ దెలిసికొనలేక పరిహసించుచుంటిరా?" యని యడిగెను. అందుల కాయాదవుఁడు "నీవు మాకు గురువవై యుండియుఁ బలుమారు జరాసంధాదులవలన మాకు బాధకలుగ నిచ్చుచుంటివి. నీవు స్త్రీవి కాని పురుషుఁడవు కా"వని పరుల నిందించెను. యాదవు లెల్లరు నది విని నవ్విరి. అపు డాగర్గుఁడు

వారిగర్వమును హరించు కాలయవనుఁడు తనవలన జన్మించు ననియు నాతనివలన వారికి బహుబాధలు కలుగుననియు శపించెను. యాదవులు భయపడి యాతనిపాదములపైఁబడి క్షమింపఁ గోరిరి. అతఁడు దయదలఁచి కృష్ణుఁ డుపాయాంతరమున నాతనిఁ ద్రుంచి వారికి మేలుకూర్చునని పలికి తనదారిఁ బోయెను. ఈసంగతి విని యాదవులపై శత్రుత్వము వహించియొక యవనరాజు గర్గుని సేవించి యాతనిఁ దనయాలయమందలో నుంచి పూజించుచుండెను. ఆకాలమున నొక యప్సరస గర్గునికిఁ గానవై యాతనిమనసు హరించెను. గర్గుఁడు తాను యాదవుల కిచ్చిన శాపమును బురస్కరించుకొని తనకుఁ బరిచర్యచేయుచున్న యప్సరస కొకపుత్త్రు ననుగ్రహించెను. పిదప గర్గుఁడు నిజాశ్రమమునకు నప్సరస నిజలోకమునకుఁ బోయిరి. ఆయప్సరసకుఁ గల్గిన పుత్త్రుని యవనరాజు తనపుత్త్రునిగాఁ బెంచుకొని రాజ్యమొసంగెను. అతఁడే కాలయవనుఁ డనఁ బరగి నారదప్రేరితుండై యాదవులద్వారకానగరమును ముట్టడించి వారి ననేకవిధముల బాధించి తుదకుఁ గృష్ణుని మాయోపాయమునకు గురియై ముచికుందునికోపమున భస్మీభూతుఁ డయ్యెను.

గర్గసంహిత

గర్గమహర్షి మహాధర్మప్రతిపాదకుఁడుగా ధర్మశాస్త్రముల వలనఁ దెలియుచున్నది. మహాధర్మప్రవక్తగా వృద్ధయాజ్ఞవల్క్యమున గర్గప్రశంస కలదు. గర్గునిధర్మసంహితకే గార్గ్య*

---

*గర్గుఁడు వేఱు గార్గ్యుఁడు వేఱు నని నిత్యాచారప్రదీప మనుధర్మశాస్త్రగ్రంథమునఁ గలదు. కాని ఇది పొరపాటు. ఇరువురు నొకరే యని కాణేగా రభిప్రాయపడిరి.

మని పేరు. మఱియు, మితాక్షరము, స్మృతిచంద్రిక, గర్గసంహితనుండి యనేకశ్లోకము లుదాహరించియున్నవి.

“పతితాః స్త్రియస్త్యాజ్యా భర్తృవధప్రతిజ్ఞాయాం చ” మున్నగువాక్యములు గర్గసంహితనుండి విశ్వరూపుఁడు పేర్కొనియుండెను. ఇంతేకాక, గర్గమహర్షి యొకఖగోళశాస్త్రగ్రంథకర్తగా అపరాదిత్యుఁడు అపరార్కయాజ్ఞవల్క్యవ్యాఖ్యానమునఁ బేర్కొనియున్నాఁడు. *ఈవిషయములన్నిటివలన గర్గమహర్షి కిఁ గలబహుశాస్త్రనేతృత్వము తేటతెల్లమగుచున్నది.

“గర్గుఁడు పరివేష్టితముని
వర్గుఁడు సంపాదితాఖవర్గుఁడు భవసై
సర్గుఁడు పరతత్త్వకళా
మార్గుఁడు” రక్షించుఁగాక! మహిత్ప్రభుడున్.

(విష్ణుపురాణము, ౭. ౧౨౯)

---

*ఋతసంతుఁ డను ఋషి తనకుఁ గలిగినకుమారుఁడు దుశ్శీలుఁడై తన కవమానము గాని తెచ్చుటకుఁ గారణ మేమని గర్గమహర్షి నడిగెను. గర్గుఁడాతని నక్షత్రముఁ దెలిసికొని యది రేవతి యని రేవతీనక్షత్రమున నాతఁడు జనించుటచే నక్షత్రదోషమున నట్లయ్యెనని చెప్పినట్లు మార్కండేయపురాణమునఁ గలదు. దీనివలన గర్గుఁడు జ్యోతిశ్శాస్త్రమునను దిట్టయని తెలియుచున్నది.

“గర్గ ఉవాచ : చతుష్షష్ట్యంగ ముదదాత్ కాలజ్ఞానం మమాద్భుతమ్,
సరస్వత్యాస్తటే తుష్టో (శివః) మనో యజ్ఞేన పాండవ.”

అని వ్యాసభారతానుశాసనికపర్వమునఁ గలదు. దీనినిబట్టి గర్గమహర్షి చతుష్షష్ట్యంగ జ్యోతిష జ్ఞాని యని నిస్సంశయముగాఁ జెప్పవచ్చును.

# గౌరముఖుఁడు

గౌరముఖుఁడు శమీకమహాముని శిష్యరత్నము. బాల్యము నుండియు శమీకముని నాశ్రయించి యాతఁడు సమస్త వేదశాస్త్రములు నభ్యసించి తపోధ్యానపరాయణుఁ డయ్యెను. తండ్రిమెడలో మృతసర్పమును బడవైచి పోయినాఁ డని శమీకపుత్రుఁ డగు శృంగి పరీక్షితుని శపించినపిదప శమీకుఁ డావృత్తాంత మెఱిఁగి విచారించి పరీక్షితున కావర్తమానము తెలిపి రమ్మని గౌరముఖుని బంపెను. గౌరముఖుఁడు పరీక్షిత్తున కావార్తఁ దెలిపి తక్షకవిషాగ్నిపాలుగాకమున్నే మోక్షసామ్రాజ్యమును జూఱగొను నుపాయ మూహించుకొమ్మని చెప్పి వచ్చివేసెను.

### గౌరముఖుని పుణ్యాశ్రమము

కాలక్రమమున గురుసపర్యచే బ్రహ్మవిద్యానిధియై గురు ననుమతిని వేఱొక యాశ్రమమును నిర్మించుకొని తనకడఁ జేరిన మునికుమారులను శిష్యులుగా సంగీకరించి తపోజీవనమున గౌరముఖుఁడు దివ్యతేజోనిధియయ్యెను.

గౌరముఖుని పుణ్యాశ్రమము మోక్షలక్ష్మికిఁ బుట్టినయిల్లైన సుధాసముద్రమువలె నుండెను. ఆయాశ్రమవనముల మునికుమారులు వచ్చి గురువులుచేయు యజ్ఞయాగములకు సమిధలు కావలయునని కోరఁగనే చెట్లమీఁదనుండి శాఖామృగ

ములు సమిధ లందిచ్చును. చల్లని చెట్టునీడలఁ గూర్చుండి బ్రహ్మచారులు వేదములందలి పనసలు చెప్పుకొనుచుండఁగా నెట్లనైన వారు మొదలు మఱచిన నందలి చిలుకపలుకు లందిచ్చును. అచటి యుద్గాతలతోఁగూడి చక్కని స్వరములతోఁ గోయిలలు దేవతాహ్వానము లొనరించును. అచటి మునిపత్నులు తమ్ముఁ జూచి బెదరి తల్లులవెనుకఁ జేరు లేడిపిల్లలకు లేత తృణకణము లందిత్తురు. ఆమునిపత్నులు బిందెలతో బృందావనములకు నీరుపోయునప్పుడు భూదేవి వారి యడుగులకు మడుఁగు లొత్తుచున్నదో యన్నట్లు వారి పాదములందలి వ్రేళ్ళగోళ్ళ కాంతులు ముందు ప్రసరించుచుండును.

అచ్చటి వృక్షములయాకులు పానపాత్రములుగ బహిరాకుండఁ బోదు మనుభయమున ముడుచుటకు వెనుదీయును. తమసౌరభము గ్రహింపవచ్చునని దేవతాపూజాసమయము వచ్చువఱకు సంపెంగపూలు వికసింపనే వికసింపవు. అచటి చెట్ల కొమ్మలకు ఋషిపత్నులు కట్టిన మడిచీరలు చిరిఁగిపోవు నను భయమున నవి యాఱి ఋషిపత్నులు విప్పుకొనిపోవువఱకుఁ జెట్లు కదలనే కదలవు.

అందలి మునీశ్వరులు నిష్కామకర్మములే చేయుచుఁ బ్రత్యక్షాగ్నులవలె, జగత్ప్రాణిమిత్రులై, తేజోభరితులై, సదాశివతనులై విహరింతురు. అందలిమును లందఱకును గౌరముఖమహర్షి పెద్ద, గురువు, దైవము.

గౌరముఖుఁ డొకచల్లనిచెట్టునీడను వనహృదయమను మతిలో మొలచి నలువైపుల విస్తరించిన కారుణ్యలతల విధ

మునఁ గెంజడలు మనోహరములై యుండ, సత్త్వగుణమే మొత
తెల్ల దట్టముగా నావరించి యున్నట్లు దేహమంతయుఁ దెల్లని
విభూతి కానవచ్చుచుండ, నిరంతరము పురశ్చరణ చేసి మంత్ర
దేవతను మెప్పించి యామె కంఠహారమును బహూకృతిగాఁ
గైకొన్నట్లొప్పు రుద్రాక్షమాలికాభరణము మెఱయుచుండ,
మిక్కుట మగు తపమునఁ గోటికిఁ బడగయెత్తినట్లు ప్రక్క బద్ధ
కౌపీన మగుచుండ మున్ను, సకలపుణ్యతీర్థములు సంగ్రహించి
సూక్ష్మరూపము వహించి వచ్చిన బ్రహ్మాండమురీతిఁ గమండ
లువు దండ నుండ, శిష్యులకుఁ బరతత్త్వము బోధచేయుచుండెను.

### దుర్జయుఁ డనుమహారాజు ససైన్యుఁడై వచ్చుట

ఆసమయమున దుర్జయుఁ డనుమహారాజు సైన్యసమేతుఁ
డై యావనమున [illegible] వచ్చి వివిధజంతువుల వేఁటాడి యలసి
మునిసందర్శనము చేసికొని పోదమని యాశ్రమప్రదేశమునకు వచ్చెను.
సైన్యపరివారములను దూరమున నిలిపి దుర్జయుఁడు ముందుకు
వచ్చి గౌరముఖునికి సాష్టాంగవందనములు చేసి నిలిచెను.

గౌరముఖుఁ డాతని నెంతయు నాదరించి యర్ఘ్యపా
ద్యాదు లొసఁగి నాఁటికిఁ దనయాశ్రమమున నిలిచి స్నానపాన
ముల నేదదేఱి పోవలసినదని కోరెను. దుర్జయుఁ డసూయవడి
యాముని యొక్కఁడ ససైన్యుఁ డగు తనకు విందు చేయఁగలుగు
టెక్కఁడ యని యాతనిపస దెలిసికొని పరాభవింప మనుకొని
యట్లే యనెను.

## గౌరముఖునకు విష్ణువు మణి నిచ్చుట

గౌరముఖుఁడు తాను గంగ కేఁగి స్నానము చేసి వచ్చుదను విడిసియుండు మని రాజుతోఁ జెప్పి గంగానది కేఁగి యట శ్రీహరి నిట్లు ప్రార్థించెను.

"జలరూపాయ చరాచరాత్మక జగత్సంస్థాయ లక్ష్మీమహీ
లలనేశాయ కరాళకాళియఫణాలాస్యాయ దేవోత్తమా
య లయోత్పత్తి వివర్జితాయ సుజనాయత్తాంతరంగాయ తే
వల కారుణ్యకటాక్ష వీక్షణ పరీవాహాయ తుభ్యం నమః.

(వరాహ పురాణము. ౯.౧౦౬.)

దేవా! ఓంకారము నీవ. భూర్భువస్స్వరాదిలోకములు నీవ. విశ్వప్రపంచము నీవ. నీవలననే ఋగ్యజుస్సామాథర్వణములు మున్నగు సమస్తము జనించె. నన్నుఁ గృపఁజూచి సైన్యసమేతుఁడగురాజున కాతిథ్య మీఁగల సామర్థ్యమి"మ్మని కోరెను. దయాసముద్రుఁడగు శ్రీహరి ప్రత్యక్షమై గౌరముఖుని దీవించి యొక రత్నమిచ్చి దానివలన నన్నియు సమకూరునని చెప్పి యదృశ్యుఁ డయ్యెను.

గౌరముఖుఁ డామణినిఁ గైకొని పూజించి యాశ్రమమునకు వచ్చుసరి కది యొక గొప్ప పట్టణమయ్యెను. అందుఁ గని విని యెఱుఁగనంత మనోహరములైన భవనములు మహాభోగములతో నలరారెను. గౌరముఖుఁడు రాజును సైనికులను ఆభవనముల విడియుఁ డని కోరెను. దుర్జయుఁ డాశ్చర్యమంది సైనికులతో నాయా మందిరముల నాక్రమించెను.

పిదప గౌరముఖుఁడు మణిని వలఁచినంతనే సంపెఁగ నూనెలు, గంధానులేపనములు, దివ్యాంబరాభరణములు, నీరాజనభాజనములు, రత్నకంబళ్లు మున్నగు సమస్తవస్తుసంచయములు గొని వేలకు వేలుగా నప్సరసలవలె సుందరీమణు లగు యువతు లవతరించి యరుదెంచి సమస్తజనులకు సమస్తవిధములైన స్నానపానకృత్యములు శరవేగమున నిర్వర్తించిరి. తదనంతరము చీఁకటిపడినవెనుకఁ బ్రతివానికి నొకదివ్యపర్యంకము, ప్రతివానికి వలపులు గులుకు నొక్కచిగురుబోణి యమరెను. దుర్జయుఁడు, నాతనిపరివారములోఁ బ్రతివ్యక్తి నారీతి రేయెల్ల సరససంభాషణములతోడను, యిష్టోపభోగములతోడను బ్రహ్మానందమంది నిద్రించిరి.

మఱునాఁ డుదయమున లేచి కాలకృత్యముల నెఱవేర్చి దుర్జయుఁడు గౌరముఖమహర్షికడకు వచ్చి నమస్కరించి నిలిచినంతనే యాసమస్తసౌధాదికములు నంతర్హితములై పోయెను.

### దుర్జయుఁడు మణికొఱకు యుద్ధము చేయుట.

తరువాత దుర్జయుఁడు సైన్యపరివారసమేతుఁడై గౌరముఖునికడ సెలవు గైకొని తన పట్టణమున కేఁగ నాశ్రమము బయటికి వచ్చెను. అపు డాతని కాఋషిమణిని గొనిపోవ నుత్కంఠ జనించెను. వెంటనే యాతఁడు తన మంత్రిని బిలిచి ఋషికడ కేఁగి నీ వడిగిన నది యిచ్చెదను, ఆమణిని మాకిమ్మని నామాటగా నడిగి రమ్మని పంపెను. మంత్రి గౌరముఖునికడ కేఁగి వినయమున భయమున మణి నడిగెను. ఈయ

నీతో ముని కనేకబాధలు కలుగు నని హెచ్చరించెను. అంత గౌరముఖుఁడు :

"దుష్టచరిత్రులైన నృపతుల్ ధర యేలుటకంటెఁ గల్గునే
కష్టము శిష్టలోకము సుఖస్థితి నుండదు గాన నిట్టి ప
ాపిష్టక మెట్టు పుట్టె నకటా వికటాలపితంబు లేటికిన్
భ్రష్ట! పోకాలి పో" ... ...

మ్మని పలికిన మంత్రి భయపడి పోయి దుర్జయునితో జరిగినసంగతి విన్నవించెను.

దుర్జయుఁడు కోపించి నీలుఁ డను సేనాపతిఁ బిలిచి సైన్యముతో నేఁగి మునికడనుండి రత్నమును బలవంతముగాఁ గొని తెమ్మని పంపెను. నీలుఁడు బయలుదేఱి వెళ్లి మునియాశ్రమమును సమీపింపఁగనే రత్నము వలన నిర్యత్నముగ ననేకసైన్యము లుద్భవించి నీలుని నీలునిసైన్యమును క్షణములో నశింపఁజేసెను. ఇది విని దుర్జయుఁడే సమస్తసైన్యములను దీసికొని స్వయముగా యుద్ధమునకు బయలుదేఱి వచ్చి రత్నసంభవసైన్యములను జెల్లా చెదరు చేయుచు ఘోరయుద్ధ మొనరించుచుండెను.

అప్పుడు గౌరముఖ మహర్షి తనయిలవేలుపు నాత్మనెంచుకొనెడు నగు విష్ణుమూర్తిని దలఁపఁగా నాతని యాజ్ఞవలన విష్ణుచక్రము వచ్చేసి క్షణమాత్రలో దుర్జయుని నాతని సమస్త సైన్యములను నాశనముచేసి తిరిగి విష్ణుమూర్తిం జేరెను. విష్ణు వచటికి విచ్చేసి గౌరముఖునితో "మునీశ్వరా! నిమిషమాత్రలో నాచక్ర మిచట శత్రువుల నఱుమాడినకారణమున నీప్రదేశము నైమిష

మనఁ బరగు. నే నిచట యజ్ఞపురుషుఁడనై నివసింతును." అని చెప్పి యంతర్హితుఁ డయ్యెను. గౌరముఖుఁ డానందించి శిష్య సమేతుఁడై యథాశక్తి తపమొనరించుచుండెను.

### గౌరముఖుఁడు మార్కండేయుని బోధఁ గాంచుట

ఇట్లుండ కొంతకాలమైనపిదప గౌరముఖమహర్షి విష్ణుపూజానిమిత్తము తపఃఫలదకల్పభూజ మనఁదగు ప్రభాస మను సోమతీర్థరాజమున కేఁగి యటఁగల విష్ణుమూర్తిని బూజించుచుండఁగా నొకనాఁడు మార్కండేయమహర్షి యచటికి విచ్చేసెను. గౌరముఖుఁ డాతని కెదు రేఁగి సాష్టాంగనమస్కారము లొనరించి తనయాశ్రమమునకుఁ దెచ్చి దర్భాసనమునఁ గూర్చుండఁ జేసి నానావిధములగు నతిథిపూజలు చేసి ముకుళితహస్తుఁడై ముందట నిలిచి "మహామహా! నన్నిట్లు కటాక్షించి విచ్చేసినపని యేమి" యని యడిగెను. మార్కండేయుఁ డానందించి "ఋషీంద్రా! మీవంటి ఋషివరులను గాంచుటయే మాకార్యము. నీకేమైన సందేహము లున్న నడుగుము. వానిం దీర్చి పోవుదునని దయతోఁ బలికెను. గౌరముఖుఁడు నమస్కరించి "అయ్యా! వేదవేదులు పితరులు కల రందురు. వా రెవరు? ఎట్టివారు? దయతోఁ దెలుపు" మని కోరెను.

మార్కండేయుఁ డిట్లు సమాధానమిచ్చెను. "ఆర్యా! విశ్వమునకు విష్ణువు తండ్రి. అతనివలన బ్రహ్మ జనించెను. బ్రహ్మ యేడుగురు ఋషుల సృజించి వారిఁ గని నన్నుఁ బూజింపుఁ డని కోరెను. వారటుచేయక ఆత్మలోఁ బరమాత్ముఁ

గనుచుండిరి. బ్రహ్మ వారిపైఁ గోపించి మీబ్రహ్మ విజ్ఞాన గర్వము పదటిపాలగుఁగాక యని శపించెను. ఆయేడుగురు ఋషులు వంశకరులగు తనయులఁ గాంచి విమానస్థులై స్వర్గమునకుఁ బోయిరి. వారి తనయులు వారికి శ్రాద్ధమూలమునఁ దృప్తిఁ గూర్చుచుండిరి. ఇట్లు సుపుత్రమూలమున నాయేడ్వురు స్వర్గమున సుఖముండిరి. వీరిలో అమూర్తులు మువ్వురు. సమూర్తులు నలుగురు. వీరు దేవతలకుఁ బితరులై యాదేవతలు పూజించు నాలుయుగములు సనాతనలోకమున వసించి పిదప బ్రహ్మవాదులై జనించి తమపూర్వసాంఖ్యయోగమునఁ గొంత కాలము వర్తించి పునరావృత్తిరహిత మగు యోగసిద్ధిం గని యోగబలమున సకలయోగులను యోగాభివృద్ధిఁ గాంచుచుందురు. అందుచే వారికి శ్రాద్ధము లొనరించుచుండవలయును. ఇది ప్రథమ పితృసర్గము. మఱి యనేకవిధములఁ బితరులు సప్తలోకముల నిలిచియుందురు. భూలోకవాసు లగుజనులు భువర్లోకవాసు లగుపితరులను పూజింతురు. భువర్లోకవాసులు మరీచ్యాదు లైన సువర్లోకవాసులు కల్పోపవాసిసంజ్ఞు లైన మహాలోకవాసులు సనకాదు లైనజనలోకవాసు లగుపితరులను గొలుతురు. జనలోకవాసులు వైరాజు లైనతపోలోకవాసులు సత్యలోకవాసులగు పితృగణములను సేవించెదరు.

వసుసాధ్య రుద్రాదిత్యాశ్విమరు దృషులు, వాగి కూఁతుం ద్రకుఁబుట్టినవారు, వసిష్ఠ బ్రహ్మపితరులైన అగ్నిష్వాత్తాదులు బ్రహ్మక్షత్రవైశ్యులకు సమానపూజనీయులు. భట్టారకా! ఎట్టి

వారికైనను బితృసర్గము సమస్తము వివరించుట సాధ్యముకాదు. కాన, నేను సంక్షేపముగాఁ జెప్పితిని.

ఆయాపితృదేవతల నెప్పుడెప్పుడు పూజింపవలెనన్న— వ్యతీపాతము, అయనము, విషువత్తు, చంద్ర సూర్యగ్రహణములు, సంక్రమణము మున్నగు పుణ్యవేళలందు, నక్షత్రగ్రహపీడాసమయములందు, చెడ్డకలలు వచ్చినపుడు, నూతనధాన్యములు వచ్చినపుడు, విశిష్ట ద్రవ్య పాత్ర లాభంబులు కలిగినపుడు, గంగాదిమహాతీర్థముల కేఁగినయపుడు యథాశక్తి శ్రాద్ధకర్మలు చేయవలెను. ధనము లేని వారు తిలతర్పణము లిచ్చిన శ్రాద్ధఫలము వారికి లభించును. అదియు సాధ్యముకానివారు ఆవున కొకపూఁటకు సరిపడు గడ్డి నొసఁగినచో శ్రాద్ధఫలము సిద్ధించును. అదియుఁ జేయలేనివారు వనమున కేఁగి సూర్యాది లోకపాలురు సాక్షులుగాఁ జేతులు పైకెత్తి బిగ్గఱగాఁ దమ యసమర్థతఁ దెలుపుకొన్నఁ బితృదేవతలు తృప్తులగుదురు.

యోగి, యతి, శిష్యుఁడు, సోమయాజి, ఋత్విజుఁడు, సోదరీసుతుఁడు, అల్లుఁడు, మేనమామ మున్నగువారు పైతృకకర్మకు యోగ్యులు. నపుంసకుఁడు, దొంగ, నిందితుఁడు, రోగి, గ్రామయాచకుఁడు మున్నగువా రిందుల ‘అనర్హులు’’.

పిదప, మార్కండేయుఁడు గౌరముఖునకు గౌరముఖుఁ డొనర్చిన పితృదేవతాపూజాఫలముగా గత మూఁడుజన్మముల వృత్తాంతముఁ దెలియఁ జేసెను. అపుడు గౌరముఖుఁడు బ్రహ్మచే శాపమునందిన మరీచ్యాదిమానసపుత్రు లేడ్వురలో

భృగుఁ డొకఁడనియు, ఆభృగునివంశము వాఁడే గౌరముఖుఁ డనియుఁ దెలిసికొనెను. అనంతరము మార్కండేయుఁ డాతని నాశీర్వదించి క్షణములోనే విష్ణుమూర్తిలో నైక్యమై ముక్తిఁ గను నుపాయముఁ దెలిసి వెడలిపోయెను.

### గౌరముఖుని సాయుజ్యప్రాప్తి

గౌరముఖుఁ డధికానందముచేఁ బితృదేవతాప్రాజ లనేక సంవత్సరము లొనరించి ప్రభాసతీర్థవాసుఁ డగు శ్రీహరినే మనమునఁ దలఁచుచు మహాతప మొనరించెను. పిదప నొకనాఁడు గౌరముఖుఁడు :

“జలజగర్భుని చదువుల చెఱ వీడ్కొల్పు మంథానపర్వతసంధరుండు
కౌపథి మునింగిన విశ్వంభరను దేవ సుమనోవిభవతుష్టిని విదారి
కుంభినీ నభములు కొలిచిన కొలగోల పార్థివరుధిరతర్పణ పరుఁడు
లంకాధిపతితలలను గండక సైర రేవతీహృదయరాజీవ హేళి
త్రిపురవనితల ఋజువు తెరపు చేయుఁడు ఖురఖురట్ట విఘట్టితక్షోణితలుఁడు
చింతితఫలప్రదాత రక్షింపఁగాత! నన్ను నుచు భక్తి రెట్టింప సన్నుతింప.
(వరాహపురాణము ౫. ౫౬)

దయామయుఁడు, భక్తవత్సలుఁడు నైన శ్రీహరి కోటిసూర్య దివ్య ప్రభతో నాతనియెదుటఁ బ్రత్యక్షమయ్యెను. వెంటనే గౌరముఖుఁడు యోగబలమున శ్రీహరిలో నైక్యమై పోయెను. శ్రీహరి భక్తాగ్రగణ్యు నట్లు తనలోఁ గలుపుకొని దివ్యతేజమున నదృశ్యుఁ డయ్యెను.

# జాబాలి

సామవేదోపనిషత్తులలో జాబాల మనునొకయుపనిషత్తు గలదు. ఈ యుపనిషత్తును బ్రతిపాదించిన మహానుభావుఁడే జాబాలి. జాబాలినిబట్టి దీనికి జాబాల్యుపనిషత్తనియుఁ బేరు. మఱియు నీతఁ డుపస్మృతికర్తలలో నొకఁడు. దశరథునిక్షేమముఁ గోరిన యాప్తగురువులలో నీతఁ డొకఁడు.

## జననము

మహాత్ములయు, మహాపురుషులయు జన్మవృత్తాంతములు చిత్రములుగా నుండును. జబాల యనువిప్రస్త్రీకి దేవతావర ప్రసాదమునఁ గన్యాత్వదశయందే యీతఁడు జన్మించెను. తల్లి పేరునుబట్టి యీతనికి జాబాలి యనునామకరణ మయ్యెను.

జబాల తనకుమారుని యుక్తవయసు రాఁగానే హారిద్రుమతుఁ డనుగురువున కొప్పగించెను. ఆగురువును గొంతకాల మాతనిఁ దన శుశ్రూషలో నుంచుకొని పిదప నాతనికి బ్రహ్మవిద్యాబోధ కర్హునిఁ జేయు నుపనయనము నొనరింపఁ దలఁచి యాతని కులగోత్రనామము లడిగెను. ఆతఁడు తనకుఁ దెలియదని చెప్పెను. పోయి మీయమ్మ నడిగి తెలిసికొని రమ్మని గురువు పంపెను. జాబాలి తల్లి నడుగ నామె తనకుఁ బతియే లేనిసంగతిఁ దెలిపి తనపేరు సత్యకాముఁ డనుజాబాలి యని చెప్పు మనెను. జాబాలి గురువునొద్ద కేగి తల్లి చెప్పినరీతినే చెప్పెను. గురువు దివ్యదృష్టి నాతని జననకథఁ దెలిసికొని యాతని

ఉపనయన మొనరించి గాయత్రీమంత్రోపదేశముఁ జేసెను. బ్రహ్మవిద్యాబోధ కర్హత గడించువఱకుఁ దన గోవులను మేఁపుచుండుమని గురువు జాబాలి కాదేశించెను.

### జాబాలి దేవతలవలన బ్రహ్మజ్ఞాన మందుట.

జాబాలి గురుధేనువులఁ దోలుకొని వనమున కేఁగి యట సత్యసంధుఁడై గోసేవఁ జేయుచు గురుభక్తితత్పరుఁడై యుండెను. కొంతకాలమున కాగోవులు సహస్రసంఖ్యాకములై జాబాలిరక్షణమునఁ బుష్టియుఁ దుష్టియు నందెను. ఈతని సత్యనిష్ఠను, గురుభక్తిని, గోసంరక్షణపరతను దేవత లీతనిని మెచ్చుకొని యీతనికి మహోపకృతిఁ జేయఁ దలంచిరి.

ఒకనాఁడు వాయుదేవుఁ డొకవృషభమున నావేశించి జాబాలితో ని ట్లనెను: "ఆర్యా! నీవు న మ్రమితదయతోఁ గాపాడుటవలన మేము సహస్రసంఖ్యాకుల మైతిమి. మ మ్మిఁక మాటి గురుగృహమునకుఁ దోలుకొని వెళ్లుము. మేము నీకుఁ జేనైన యుపకృతి నొనరింతుము. మీగురువు నిన్నుఁ గని సంతోషించు" నని చెప్పెను. జాబాలి యట్లే యని గోవులను మరలించుకొని గురుగృహమున కేఁగుచుండెను.

దారిలో వాయుదేవుఁ డావేశించినవృషభ మాతనికి బ్రహ్మజ్ఞానప్రబోధక మగునొకదివ్యమంత్రపాదమును దెలిపెను. మఱియొకవృషభము నావేశించి యగ్నియు, నింకొకవృషభము నావేశించి సూర్యుఁడు, మఱియు మనువక్షియు నాతనికి మిగిలిన మంత్రపాదములు బోధింపఁగా నాతఁడు బ్రహ్మజ్ఞానసంపన్నుఁడై దివ్యతేజస్వి యయ్యెను.

### గురూపదేశము.

జాబాలి యింటికి వచ్చునరికి హారిద్రుమతుఁ డానందించి గోవులను స్వీకరించి "వత్సా! నీవు దివ్యతేజస్వి వైతివి. నీ ముఖమువలననే నీవు బ్రహ్మజ్ఞాని వైతి వని స్పష్ట మైనది. కావున, నీకు బోధింపఁగల దేమియు లేదు. నీవు యథేచ్ఛ మేఁగి యాశ్రమమును నిర్మించుకొని దివ్యజీవితమును గడపు" మని పలికెను. అంతలకు జాబాలి యి ట్లనెను: "గురుదేవా! నీ కటాక్షమున దేవతలు ప్రసన్నులై నాకు బ్రహ్మజ్ఞాన ముపదేశించిరి. కాని, గురుముఖమున నేర్వని బ్రహ్మజ్ఞానము శాశ్వతముగ నిలఁబడదు. కావున, నీముఖమున నేను బ్రహ్మజ్ఞానముఁ బడసినచో యది నిశ్చలము, శాశ్వతము నగును. కావున నన్ను గ్రహించి యుద్బోధింపు" మని కోరెను. గురు వాతని నిగర్వతకును, గురుభక్తికిని సంతోషించి యుక్తకాలమున నాతనికి బ్రహ్మజ్ఞానము నుపదేశించి పంపివేసెను.

### జాబాల్యుపనిషత్తు

తరువాత జాబాలి చిత్రకూటపర్వతప్రాంతమున నొక యాశ్రమమును నిర్మించుకొని యందు జపతపస్స్వాధ్యాయప్రవచనపరుఁడై యుండి కాలక్రమమున సుబ్రహ్మణ్యస్వామి నారాధించి పరతత్త్వరహస్యముల నెన్నిటినో గ్రహించి యాతనిదయకుఁ బాత్రుఁ డయ్యెను. పిదప నొకనాఁడు పిప్పలాదమహర్షికుమారుఁ డగు నొకమహర్షి వచ్చి జాబాలి నాశ్రయించి బ్రహ్మజ్ఞానసంశయములఁ దీర్పు మని కోరెను. పరమజ్ఞానార్థుఁ డగు

పైప్పలాదికి జాబాలిమహర్షి సర్వమును బోధించెను. ఈబ్రహ్మజ్ఞానబోధనమే జాబాల్యుపనిషత్తు.

[1] పైప్పలాది యనుమహర్షి భగవత్స్వరూపి యగుజాబాలి మహర్షిం జూచి యిట్లు పలికెను. "భగవానుండా! పరమతత్త్వ రహస్యమును నాకుం జెప్పవేండెదను. తత్త్వ మేది? జీవుం డెవండు? పశు వేది? ఈశానుం డెవ్వండు? మోక్షోపాయ మేది?"

జాబాలి:—[2]మంచిప్రశ్న మడిగితివి. నేను తెలిసికొన్నరీతినే నీకుం జెప్పెదను.

పైప్పలాది:—[3]నీ వెవనివలనం దెలిసికొంటివి? అని మరల నడిగెను.

జాబాలి:—[4]నేను సుబ్రహ్మణ్యస్వామివలనం దెలిసి కొంటి నని మరలం జెప్పెను.

పైప్పలాది:—[5]సుబ్రహ్మణ్యస్వామి యెవనివలనం దెలిసికొనెను?

జాబాలి:—[6]ఆ యీశానునివలనం దెలిసికొనెను.

---

1 మూలము: "అథ హైనం పైప్పలాదో భగవంతం జాబాలిం ప్రపచ్ఛ. భగవన్మే బ్రూహి పరమతత్త్వరహస్యం. కిం తత్త్వం? కో జీవః? కః పశుః? క ఈశః? కో మోక్షోపాయః? ఇతి. స తం హోవాచ."

2 మూలము: "సాధు పృష్టం. సర్వం నివేదయామి యథాజ్ఞాతమ్ ఇతి."

3 "పునస్తమువాచ. కుతస్త్వయా జ్ఞాతమితి."

4 "పునస్తమువాచ. షడాననాదితి."

5 "పునస్తమువాచ. తేనాథ కుతో జ్ఞాతమితి."

6 "పునస్తమువాచ. తేనేశానాదితి."

పైప్పలాది:___"ఈశానునివలన నెట్లు తెలిసికొనెను?

జాబాలి:___"ఈశానోపాసనమున.

పైప్పలాది:___"భగవంతుడా? నాకు దయతో నది యెల్లఁ దెలుపుము.

జాబాలి:___""అట్లే. నీ వడిగిన సకల తత్త్వములను నివేదింతును. పశుపతి యగు నీశ్వరుఁ డహంకారముచే వ్యాపింపఁ బడియున్నవాఁడు సంసారియై జీవుఁ డగుచున్నాఁడు. అతఁడే పశువు. సర్వజ్ఞుఁడు, సృష్టిస్థితిలయతిరోభావానుగ్రహము లను పంచకృత్యములు గలవాఁడు సర్వేశ్వరుఁడు నగు నీశ్వరుఁడే పశుపతి. జీవులు పశువులు, జీవులకుఁ బతియగుటంబట్టి పశుపతి యగుచున్నాఁడు."

పైప్పలాది:___"జీవులు పశువులెట్లగును? వానికీశ్వరుఁ డెట్లు పతి యగును?

---

7 "పునస్స త మువాచ. అథ కస్మాత్ జ్ఞాత మితి."

8 "పునస్స త మువాచ. తదుపాసనాదితి."

9 "పునస్స త మువాచ. భగవన్ కృపయా మే రహస్యం సర్వం నివేద యేతి."

10 "స తేన పృష్ట స్సర్వం నివేదయామాస తత్త్వం. పశుపతి రహంకారావిష్ట స్సంసారీ జీవ స్స ఏవ పశుః. సర్వజ్ఞ పంచకృత్య సంపన్న స్సర్వేశ్వర ఈశః పశుపతిః. కే పశవ ఇతి పునస్స త మువాచ. జీవాః పశవ ఉక్తాః. తత్పతి త్వా త్పశుపతి స్స పునస్తం హోవాచ."

11 "కథం జీవాః పశవ ఇతి కథం తత్పతి రితి స త మువాచ."

జాబాలి:—[12]గడ్డితినుచు వివేకములేక పశులచే గృషి మున్నగు కర్మములందు ప్రేరేపింపబడి సర్వకష్టములు సహించు చు యజమానిచే బశువులెట్లు కట్టబడునో యట్లే జీవులు సర్వే శ్వరునిచే గట్టువడుటచే బశువులన బడును. వాని యజమాని వలె సర్వజ్ఞుడైనయీశ్వరుడు జీవులకు బతి. కాన బశుపతి.

పైప్పలాది:—[13]అట్టి జ్ఞాన మెట్లు కలుగు నని మరల నడిగెను.

జాబాలి:—[14]విభూతిధారణమువలననే.

పైప్పలాది:—[15]విభూతి యెట్లేయేతావుల ధరింప వలయును?

జాబాలి:—[16]సద్యోజాతాది పంచబ్రహ్మమంత్రముల చేత భస్మము గ్రహించి 'అగ్నిరితి భస్మ' అనుమంత్రముచే నాభస్మము నభిమంత్రించి 'మానస్తోకే తనయే' అనుమంత్రమున

---

12 "యథా తృణాశినో వివేకహీనాః పరప్రేష్యాః కృష్యాది కర్మసు నియుక్తాః సకల దుఃఖసహాః స్వస్వామి బధ్యమానా గవా దయః పశవః యథా తత్స్వామిన ఇవ సర్వజ్ఞ ఈశః పశుపతిః."

13 "తద్ జ్ఞానం కేనోపాయేన జాయతే పున స్త మువాచ."

14 విభూతి ధారణాదేవ."

15 తత్ప్రకారం. కథమితి కుత్ర కుత్ర ధార్యమ్."

16 "సద్యో జాతాది పంచబ్రహ్మ మంత్రైః భస్మసంగృహ్య 'అగ్ని రితి భస్మ' ఇత్యనే నాభి మంత్ర్య 'మానస్తోక' ఇతి సముద్ధృత్య జలేన సంసృజ్య శిరోలలాటవక్షస్కంధేష్వితి తిసృభిస్త్రియాయుషై స్త్ర్యంబకై స్తిసృ భిస్త్రిపుండ్రాన్ ధారయేత్ వ్రతమేతచ్ఛాంభవం సర్వేషు వేదేషు వేదవాదిభి రుక్తం భవతి. తత్సమాచరే న్ముముక్షు ర్న పున ర్భవాయ!

జలమునఁ గలిపి, శిరస్సు, లలాటము, వక్షము, భుజములు వీని యందు 'త్ర్యాయుషం జమదగ్నేః, త్ర్యంబకం యజామహే' అను మంత్రముల చేత అడ్డముగా మూఁడు రేఖ లేర్పడునట్లు ధరింప వలయును. ఇది శాంభవ వ్రతము. వేదవాదు లందఱు నిట్లు వేదములలోఁ జెప్పియున్నారు. దీనిని జక్కఁగా ననుష్ఠించినవాఁడు పునర్జన్మము నందఁడు. [17] ఈ భస్మధారణమునకుఁ బ్రమాణము సనత్కుమారులు చెప్పిరి.

[18] త్రిపుండ్రధారణము యొక్క మూఁడు రేఖలు లలాటము మొదలు కనుబొమల మధ్యవఱకు నుండవలయును.

[19] వీనిలో మొదటిరేఖ గార్హపత్యాగ్ని, అకారము, రజోగుణము, భూలోకము, స్వాత్మ, క్రియాశక్తి, ఋగ్వేదము, ప్రాతస్సవనము, బ్రహ్మ అధిదేవత.

[20] రెండవరేఖ దక్షిణాగ్ని, ఉకారము, సత్వగుణము, ఆకాశము, భువర్లోకము, అంతరాత్మ, ఇచ్ఛాశక్తి, యజుర్వేదము, మధ్యాహ్నసవనము, విష్ణువు అధిదేవత.

---

17. "అథ సనత్కుమారం ప్రమాణం వదతి."

18. "త్రిపుండ్ర ధారణస్య త్రిధా రేఖా ఆలలాటా దచక్షుషో రాభ్రువో ర్మధ్యతశ్చ."

19. "యాఽస్య ప్రథమరేఖా సా గార్హపత్య శ్చాకారో రజో భూర్లోక స్స్వాత్మా క్రియాశక్తి ఋగ్వేదః ప్రాతస్సవనం ప్రజాపతి ర్దేవో దేవతా."

20. "యాఽస్య ద్వితీయా రేఖా సా దక్షిణాగ్ని రుకార స్సత్వ మంతరిక్ష మంతరాత్మా చేచ్ఛాశక్తి ర్యజుర్వేదో మధ్యందినం సవనం విష్ణు ర్దేవో దేవతా."

[21]మూడవ రేఖ అహవనీయాగ్ని, మకారము, తమోగుణము, స్వర్గలోకము, పరమాత్మ, జ్ఞానశక్తి, సామవేదము, సాయంసవనము, మహాదేవుడు అధిదేవత.

[22]ఇట్లు త్రిపుండ్రమును దెలిసికొన్న విద్వాంసుడు బ్రహ్మచారి, గృహస్థుడు, వానప్రస్థుడు, సన్న్యాసి – వీరిలో నెవడైనను, విభూతి ధారణము చేసినయెడల మహాపాతకముల నుండియు, ఉపపాతకములనుండియు విముక్తి కలుగును. త్రిపుండ్ర ధారణము చేయువాడు సకలవేదాధ్యయనము చేసినవాడగుచున్నాడు; సకలదేవతలను ధ్యానించినవాడగుచున్నాడు; సమస్తతీర్థములయందు స్నానము చేసినవాడగుచున్నాడు; సకలరుద్రమంత్రములను జపించినవాడగుచున్నాడు. వాడు మరల జన్మించుట కాని, జన్మదుఃఖము ననుభవించుట కాని యుండదు."

### జాబాలి శ్రీరాముని రాజ్యము చేయ మనుట

తొల్లి సీతారామలక్ష్మణులు చిత్రకూటాద్రిం జేరినతరువాత భరతశత్రుఘ్నులు వసిష్ఠాదులతో నచటికి విచ్చేసిరి.

---

21. "యాఽస్య తృతీయా రేఖా సా ఆహవనీయో మకారస్తమః స్వర్లోకః పరమాత్మా జ్ఞానశక్తిః సామవేదస్తృతీయసవనం మహాదేవో దేవతేతి."

22. "త్రిపుండ్రం భస్మనా కరోతి యో విద్వాన్ బ్రహ్మచారీ గృహీ వానప్రస్థో యతిర్వా స మహాపాతకోపపాతకేభ్యః పూతో భవతి. స సర్వాన్ వేదానధీతో భవతి. స సర్వాన్ దేవాన్ ధ్యాతో భవతి. స సర్వేషు తీర్థేషు స్నాతో భవతి. సకలరుద్రమంత్రజాపీ భవతి. న స పునరావర్తతే. న స పునరావర్తత ఇతి. ఓం సత్యమిత్యుపనిషత్."

భరతుండు రాముని పాదములపైఁ బడి తిరిగి యయోధ్యకు వచ్చి రాజ్యముస్వీకరించి తన్నుఁ బ్రజలను రక్షింపు మని కోరెను. అపుడు రాముఁ డాతని నోదార్చి యింటికేఁగి రాజ్యము చేయుచుండుమనియుఁ బదునాలుగేండ్లయినపిదప వచ్చెదననియుఁ జెప్పెను.

ఆసమయమున నట నున్న జాబాలిమహర్షి శ్రీరాముని చిత్తశుద్ధి పరీక్ష చేయుటకును, ఏమాత్రము వీలైనను రాముఁ డయోధ్య కేఁగి రాజ్యము స్వీకరించుట లోకశ్రేయ మగునని చెప్పుటకును శ్రీరామునితో నిట్లనెను: "రామా! బుద్ధిమంతుఁడవు, ధైర్యశాలివి, నీవే యిట్లు సామాన్యునివలె మాటాడుట యేల? ఈ జగమున నెవని కెవరు? తల్లిదండ్రు లన నెవరు? వారి రాజ్య పాలించుట యెట్టిది? ఒకనరుఁ డొకగ్రామమును నుండి మఱియొక గ్రామమున కేఁగుచు దారిలో నొక చెట్టు నీడను క్షణము నిలిచి మరలఁ బయనమై పోవునట్లు భూమిపై జీవులు సంసారయాత్ర సాగించెదరు. చెట్టునీడలవలె నాశ్రయ మొసంగిన జననీజనకులఁ గూర్చి ప్రేమ చూపుట సజ్జనలక్షణము కాదు. చక్కఁగా రాజ్యము చేసి ప్రజాసుఖముఁ గూర్చుటకు బదులు నీవు దుర్మార్గమును బట్టినావు. ఇట్టివె చెడిపోక అయోధ్య కేఁగి హాయిగా రాజ్యసుఖము లనుభవింపుము. నీతండ్రి నీకు బీజమాత్ర సంబంధియే. అంతకు మించి నీకు నాతనికి సంబంధము లేదు. అతనిగతి యతనిది. నీగతి నీది. ప్రత్యక్షసుఖముల ననుభవింపక చచ్చినవానిఁ గూర్చి చింతిల్లుట వట్టి కష్టములకుఁ

బొల్పడుచున్నావు. శ్రాద్ధాదులందుఁ జనిపోయినవారి నుద్దేశించి యింకొకరి కన్నము పెట్టుదురు. ఇది యెంత తెలివి తక్కువ పని?

కాన, నీవు పరోక్షసుఖ మనుకొను పితృపాలన మను చేతకానిమాట మాని ప్రత్యక్షసుఖకర మగు రాజ్యమును స్వీకరింపుము."

రాముఁ డందుపై జాబాలితో నిట్లనెను: "అయ్యా! నీవు చెప్పినది హితమువలెఁ దోఁచునే కాని యది హితము కాదు. అమార్గము దుఃఖప్రదము. సత్పురుషు లెన్నఁడు గౌరవములను, రాజ్యములను స్వీకరింపరు. ఎవఁ డెంత యోగ్యుఁడో వానియాచారమును బట్టియే తెలియును. వైదికక్రియలు మాని విశ్వసంహారకర మైన నీ చార్వాకమతము నే నంగీకరింపఁజాలను. వనవాస నియమ ప్రతిజ్ఞను మాని నేను నీవు చెప్పినట్లు వర్తింతునేని నే నొరులకు ధర్మము బోధించుహక్కుఁ గోల్పోవుదును. ధర్మరీతి నేను విడువక యితరులను ధర్మముగా నడువుఁ డని నేను బోధించిన నామాట వినువా రెవరు? 'యథారాజా తథాప్రజా' కదా!

సత్యమే పరమధర్మము. సత్యమే స్వర్గహేతువు. సత్యమునే లక్ష్మి యాశ్రయించును. సత్యవంతున కైహికాముష్మిక సుఖములు సమకూఱు. నేను సత్యవాక్పాలనమే పితృాజ్ఞాపాలనమే నియమముగాఁ గలవాఁడను.

కర్తవ్యమేదియో అకర్తవ్యమేదియో నే నెఱుఁగుదును. నాకుఁ గృత్రిమబుద్ధి లేదు. కావున, శ్రద్ధాయుక్తుఁడనై శుద్ధ

చిత్తుఁడనై వనవాస మొనరించుచు, పితరులకు దేవతలకుఁ దృప్తి గూర్చుచు జనకునివాక్యము గావించి జీవయాత్ర గడపెదను. నీకంటె శ్రేష్ఠులైన ఋషులు చెప్పిన వైదిక మార్గమునే నే ననుసరించెదను. నీవు చెప్పిన యవైదిక మార్గము దుష్టము. దానిని నే నిరసించెదను."

ఆమాటలు విని జాబాలి రామునికి నమస్కరించి రామా! నేను నాస్తికుఁడను గాను. ఆస్తికుఁడనై నాస్తిక మతముల ఖండించుచుందును. కాని. ఈతరుణమునఁ గార్యసిద్ధికై నాస్తిక్యబుద్ధి గలట్లు నటించి నీ హృదయము నెఱుఁగఁగంటిని. నీవు నగరమున కేఁగి రాజ్యము స్వీకరించిన నెల్లరు సంతసింతు రని యిట్లంటిని" అని పలికెను.

అప్పుడు రాముఁ డింకను బ్రసన్నుఁడు కాకుండుటఁ గని వసిష్ఠమహర్షి యాతనితో నిట్లనెను: "రామా! జాబాలి మహర్షి యిహపరములు కల వని వైదికమార్గమును నమ్మిన వాఁడే. అతనివంటి యాస్తికుఁడు లేఁడు. నాయూహ నెఱిఁగి తన ధర్మమును దాను నిర్వర్తించుటకే యిట్లు నీతోఁ బలికి నాఁ" డని చెప్పఁగా రాముఁడు జాబాలికి నమస్కరించి యాతనియెడఁ బ్రసన్నుఁడయ్యెను. జాబాలియు రాముని బూజించి వీడ్కొనియెను.

ఈవిధముగా జాబాలిమహర్షి జగద్విఖ్యాత చరిత్రుఁడు, పూజనీయుఁడు నయ్యెను.

---

శ్రీ సత్యమాంబా ముద్రణాలయము, కాకినాడ.

# మహర్షుల చరిత్రలు

## నాలుగవ భాగము

డా॥ బులుసు వెంకటేశ్వర్లు

# విషయసూచిక.


i అంకితము

ii పీఠిక

iii నివేదనము

iv అభిప్రాయములు

| | |
|---|---|
| **1. జైమినిమహర్షి** | 1 |
| జైమిని: సామవేదప్రచారము | 8 |
| జైమిని మార్కండేయునిదర్శించుట | 5 |
| జైమిని ధర్మపక్షులకడ సందేహములు తీర్చుకొనుట | 11 |
| జైమిని భారతము | 11 |
| జైమినీయదర్శనము | 12 |
| ప్రత్యక్షము | 14 |
| అనుమానము | 15 |
| ఉపమానము | 15 |
| శాబ్దము | 16 |
| అర్థాపత్తి | 16 |
| అభావము | 16 |
| పూర్వమీమాంసా సూత్రములు | 17 |
| జైమినీయ గ్రంథములు | 19 |
| **2. దేవలమహర్షి** | 20 |
| జననము | 20 |
| బాల్యము | 21 |
| దేవలుఁడు; జైగీషవ్యుఁడు | 21 |
| దేవల జైగీషవ్యసంవాదము | 26 |
| దేవలుఁడు హూహూనామగంధర్వుని శపించుట | 27 |
| దేవలుఁడు : వస్త్రోత్పత్తి | 28 |
| రంభాశాపము | 29 |
| దేవలస్మృతి | 81 |
| **3. నరనారాయణమహర్షులు** | 33 |
| ఇంద్రుఁడు తపోవిఘ్న మొనరింపఁ దలఁచి విఫలుఁడగుట | 34 |
| బదరికాశ్రమమున అకాలవసంతము | 35 |
| ప్రహ్లాదనరనారాయణయుద్ధము | 38 |
| నరనారాయణులు సహస్రకవచుని జంపుట | 40 |
| నారదనారాయణ సంవాదము | 41 |
| నరనారాయణులు విశాలుఁడను రాజును గనికరించుట | 48 |
| **4. పిప్పలాదమహర్షి** | 45 |
| జననము | 45 |

బాల్యము 47
తపస్సు 47
క్షమ 49
వివాహము 50
వరప్రాప్తి 53
సంతానము 55
బ్రహ్మజ్ఞానబోధ 56

5. పులస్త్యమహర్షి 64
జననము 64
తపస్సు 65
వివాహము 65
పులస్త్యుడు తృణబిందుని యాశ్రమమునం దపమొనరించుట 66
పులస్త్యుని శాపము 68
తృణబిందునపుత్రి గర్భిణియగుట 68
విశ్రవోబ్రహ్మజననము 70
పులస్త్యబ్రహ్మ రావణుని విడిపించుట 72
పులస్త్యుడు పరాశరునికి వరమిచ్చుట 73
భీష్మపులస్త్యసంవాదము 75
పులస్త్యస్మృతి 77

6. బకదాల్భ్యమహర్షి. 79
జననము 79
ఉపాసన 80
తపస్సు 80
పాండవానునయము 81
చిరంజీవిత్వము 82
కృష్ణార్జునలరాక 82
విష్ణుమహిమ 87
అశ్వమేధయాగము చేయించుట 90
బకదాల్భ్యతీర్థము 92

7. మరీచిమహర్షి 95
జననము 95
వివాహము 98
సంతానము 99
మరీచిస్మృతి 101

8. మాండవ్యమహర్షి 102
తపము 102
మాండవ్యుడకారణ శిక్షకు గురియగుట 103
మాండవ్యుడు కౌశికుని శపించుట 105
మాండవ్యుని విడుదల 107
యమమాండవ్యసంవాదము 109
మాండవ్యుడు యముని శపించుట 110
జనకరాజమాండవ్య సంవాదము 111
యుధిష్ఠిరమాండవ్య సమాగమము 113

9. ముద్గలమహర్షి 114
ముద్గలుని ఉంఛవృత్తి 115
ముద్గలుడు దుర్వాసుని కాతిథ్యమిచ్చుట 116

దుర్వాసుఁడు ముద్గలు ననుగ్రహించుట 117
దివ్యవిమానమున దేవదూత వచ్చుట 119
ముద్గలదేవదూతల సంవాదము 119
ముద్గలుఁడు స్వర్గముఁ దృణీకరించుట 122
ముద్గలుని కైవల్యప్రాప్తి 122
మౌద్గల్యుని కథ 123

10. మైత్రేయమహర్షి 125
బాల్యము 125
పరాశరుఁడు మైత్రేయునికి విష్ణుపురాణము చెప్పుట 126
మైత్రేయుఁడు ధృతరాష్ట్ర దుర్యోధనులకు హితము చెప్పుట 129
మైత్రేయుఁడు దుర్యోధనుని శపించుట 130
విదురమైత్రేయ సంవాదము 131
వ్యాసమైత్రేయ సంవాదము 134

11. రైభ్యమహర్షి. 136
రైభ్యుని విద్యార్థిదశ 136
రైభ్యబృహస్పతి సంవాదము 138
రైభ్యుని గృహస్థాశ్రమము 141
రైభ్యభరద్వాజ వృత్తాంతము 142
వేదగీతలు 143
రైభ్యుఁడు యవక్రీతుని జంపించుట 144
రైభ్యభరద్వాజుల మరణము, పునర్జీవనము 145
రైభ్యుని తీర్థయాత్ర 146
రైభ్యసనత్కుమార సంవాదము 147
రైభ్యుఁడు మోక్షమందుట 148

12. రోమశమహర్షి. 149
ఇంద్రుఁడు రోమశుని బ్రార్థించుట 150
రోమశధర్మరాజ సమాగమము 151
రోమశుఁడు ధర్మజునిచేఁ దీర్థయాత్రలు చేయించుట 152
రోమశుఁడు వేదనిధిం గాపాడుట 155
దేవద్యుతికథ 157
గంధర్వకన్యకల వివాహము 159

అనుబంధము.

దేవలనారద సంవాదము 161
దేవలుని వివాహ వృత్తాంతము 164
దేవలుని కూఁతురు సువర్చలకథ 167
శౌనకనారాయణ సంవాదము 169
పిప్పలాదమోక్షశాస్త్రము 172

# అంకితము

" శ్రీగురుచరణద్వంద్వం
వందేహం నిహతనిఖిలసందేహం
భ్రాంతి గ్రహోపశాంతిం
పాంసుమయం యస్యభసిత మాతను తే."

౧

శ్రీరమ్యగురుపదంబులు
స్మేరాననమున్ గటాక్షశీతలదృక్కుల్
కారుణ్యమయహృదబ్జ ము
నారత మౌఁగాక ! మన్మనఃప్రియతమముల్.

౨

గురుదేవా ! పరమేశ్వర !
వరమంత్రద్రష్టవైనబ్రహ్మర్షీ ! నా
సురుచిరకావ్యసుమంబిది
బరమం బగు భక్తి యుతము భవదంకితమౌ.

౩

బ్రహ్మర్షికావ్యసుమమున
బ్రహ్మర్షీ! పూజగొనుము భవదంకితమై
బ్రహ్మార్పణ మగు సు
బ్రహ్మణ్యా ! నాకు సకలభాగ్యము లొసఁగున్.

" దేశికవరం దయాళుం
వందేహం నిహతనిఖిలసందేహం
యచ్చరణద్వయ మద్వయ
మనుభవ ముపదిశతి తత్పదస్యార్థం."

# పీఠిక

మన పెద్దలు చదివిన చదువు లన్నియు మహర్షులు పోఁత పోసినవి. వ్యాకరణమున కొజ్జ పాణిని. తర్కమునకు గౌత ముఁడు. వైశేషికమునకు కణాదుఁడు. సాంఖ్యమునకు కపిలుడు. యోగమునకు హిరణ్యగర్భుఁడు. వేదాంతమునకు బాదరాయ ణుఁడు. సాహిత్యమునకు భరతుఁడు.

ఇంతియకాక మననిత్యకర్మలను నైమిత్తికకర్మలను వ్యవహారములను నడపించినవారు మహర్షులు. నీతినే కాక రాజ నీతిని నేర్పినవారు మహర్షులు. గృహములు రాజగృహములు పల్లెలు పత్తనములు కట్టించినవారు మహర్షులు. ఈరీతిగా మన ఐహికాముష్మికములకు మార్గదర్శులు మహర్షులు. మహర్షుల చరిత్రమే భరతవర్షచరిత్రము.

అలెగ్జాండరు చెంఘిస్ ఖాన్ మొదలగు అన్యదేశస్థు లడుగుపెట్టుటతో పాటు మనఋషిసంప్రదాయమున పురుగు ప్రవేశించెను. ఇయ్యెడ భగవత్సంకల్పము బలవత్తరముగాఁ గనఁబడి దానికి 'యత్ర విశ్వం భవత్యేకనీడమ్'ఫల మని తోఁచు మాట యటుండె. నాఁటఁగోలె నెయ్యెడలను కయ్యములే. ఎటుఁ బట్టిన నట-మార్పు, మార్పు, మార్పు !

మన మిపుడు మనమహర్షుల చదువులను మఱచు చున్నాము, మఱచితిమి. వారు చెప్పిన ఆచారములు వేఱు; మన

ఆచారములు వేఱు. వారిపునాది ధర్మము; మనపునాది కామము. వారిచూపు ఆముష్మికమునకు సమర్థకమగు ఐహికసంపద లేక పరవైరాగ్యము; మనచూపు ఆముష్మికము నతికరించు ఐహికసమృద్ధి లేక పరమలోభము.

మనము మఱచిపోయిన మనపితామహులను శ్రీ బులుసు వేంకటేశ్వరులు గారు వేదములనుండియు ఉపనిషత్తులనుండియు పురాణములనుండియు ప్రబంధములనుండియు వెకలించి మన యెదుటఁ బెట్టుచున్నారు. వీరి పుట్టుపూర్వోత్తరము లన్నియు మనకు తెలుపుచున్నారు. వాఙ్మయశాఖ లన్నింటియందును చేయి తిరిగిన వేంకటేశ్వరులుగారు ఈమహర్షుల చరిత్రములను రచించుటలో విశేషించి బులుసువా రనిపించిరి. బులుసు లేని యజ్ఞమును పులుసు లేనివిందును లే దని ఆంధ్రావని ఆంధ్రావళి యెఱుఁగునుగదా !

వీరీమహర్షులను మనముం దుంచిరి. వీరిని సాంగోపాంగముగా చదివి వారిపనులను ఆచరణలో పెట్టుకొని వారిసంతాన మని అనిపించుకొనుట మనవిధి.

చిరివాడ, కృష్ణా.
౧౩–౭–౫౩.

వేలూరి శివరామశాస్త్రి,
శతావధాని.

# నివేదనము

భారతవర్షబ్రహ్మర్షులు సర్వకాలసర్వలోక భద్రంకరులు. 'లోకాస్సమస్తా స్సుఖినో భవంతు' అన్నది వారి పవిత్రాశయము. ఇంత విశాలహృదయులైన మహనీయులు భారతమాత గర్భశుక్తిముక్తాఫలము లని మన మెంత గర్వపడవలయును! తలఁచినకొలఁది, తఱచినకొలఁది మనమహర్షులమహౌన్నత్యము అపారమహాసముద్రమువలె, అనంతాకాశమువలె, అఖండ బ్రహ్మానందమువలె అంతుపంతులు, లోఁతుపాఁతులు, మనకు దొరకనీయ కున్నది. రాగమున విరాగము, విషమున అమృతము, దుఃఖమున సుఖము, దారిద్ర్యమున మహైశ్వర్యము, నన్నిట బ్రహ్మానందము చుబ్బనచూఱలాడిన మనమహర్షులఁ దలఁచుకొన్నకొలఁది మన మెంతపరవశుల మగుచుందుమో! వారిబిడ్డలమై పుట్టియుండుటకు మన మెట్టినోములు నోఁచియుంటిమో! ఆహా! ధన్యుల మన్న మనమే ధన్యులము.

ఐననేమి! మనవంటి యదృష్టవంతులును లేరు. నేఁటి మనవంటి నిర్భాగ్యులును లేరు. మనమహానిధుల నొరులకుఁ జూఱయిచ్చితిమి. మేలిమి బంగారము జాఱవిడిచి ముత్తెపు బంగారమున కఱ్ఱులు సాఁచుచుంటిమి. రత్నరాసులను గాలఁ దన్ని చెత్తలోని కృత్రిమరత్నముల నేఱదొరకొనుచుంటిమి. దేశస్వాతంత్ర్యముతోపాటు స్వరాష్ట్రప్రాప్తితోపాటు మనకు మనలోని దురూహములు నశింపవలయును. ఆత్మోన్నత్యమును మనము గ్రహింపవలయును. పిదప, మనము బాగుపడవలయును.

మనమహర్షుల యున్నతికిఁ బ్రధానకారణములు
అస్ఖలిత బ్రహ్మచర్యము, అచంచలదీక్ష, అద్వితీయ విరాగ
అహంకార మమకార వివర్జనము, అనుపమాన తపోనిరతి,
సునిశిత నియమపరిపాలనము, ఆత్మానందము మున్నగు
'నీటికొలఁది తామరచుమ్మీ' యన్నట్లు వీనిని మన మెం
యలవఱచుకొన్న నంతంత ఆత్మసౌఖ్యము ననుభవించి
సౌఖ్యముఁ గూర్పవచ్చును.

ఈయుద్దేశముతో నెంతయో కష్టించి ఋషిచరిత్రము
గూర్చితిని. ఇది నాలుగవభాగము. ఐదవభాగము సిద్ధ
చున్నది. ఈయుద్యమము సముద్రమున కేతా మెత్తుటవంటి
ఇందలి గుణలేశమునే గ్రహించి చదువరులు నన్నాశీర్వదింత
గాక !

నేను కోరినయంతనే అవకాశముఁ గల్పించుకొని
గ్రంథమునకు పీఠిక వ్రాసియిచ్చిన శతావధాని, మహా
విద్వద్వతంసము, ఆర్షధర్మజ్ఞుఁడు, నగు శ్రీవేలూరి శివరా
శాస్త్రిచరణుని కెంతయుఁ గృతజ్ఞుఁడను. నాపై నాదరాభి
నము లుంచి యభిప్రాయము లనుగ్రహించిన అనంతక
సుబ్రహ్మణ్యశర్మలకు శ్రీమతి లీలావతికి నేను ఋణపడియున్నా
ఈగ్రంథమును సుందరముగ ముద్రించి నాపై ననురాగ
జూపుచున్న శ్రీపట్టమట్ట శేషగిరిరావుగారును నాకృతజ్ఞ
పాత్రులు.

కాకినాడ
౧౫-౭-౫౩

విధేయుఁడు,
బులుసు వేంకటేశ్వరు

# అభిప్రాయములు

1. "అనేకప్రణామములు. తమపుస్తక మందినది. సాంతముగా చదివితిని. తాము వ్రాఁతలో సిద్ధహస్తులు. విషయము చాల ఉదాత్తమైనది. కనుక, చదివి సంతోషించినాను."

రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ, తిరుపతి. ౧౧-౬-౫3.

2. "శ్రీ మహర్షి జీవితకథామృతము నాలుగవభాగము చదివితిని. శ్రుతి స్మృతీతిహాసపురాణములనుండి యనేకవిషయములు మీరు సేకరించితిరి. బహుప్రయాస లభ్యమైన యీ విజ్ఞానమును చవులొలుకు ధారాళమైన శైలిలో ఆంధ్రుల కందఁజేయుచున్నందులకు మిమ్ము అభినందించుచున్నాను."

'మహోపాధ్యాయ' 'అభినవ తిక్కన'
దుర్భా సుబ్రహ్మణ్య శర్మ. నెల్లూరు. 23-6-'58.

3. "అతిశయోక్తి కాదు. ఈగ్రంథము చాల అపూర్వమైనది. ఇతర దేశభాషలలో నిట్టిగ్రంథములు వెలువడినవో లేవో చెప్పఁజాలము. కాని, తెలుఁగుభాషలో వెలసినగ్రంథములలో ఈ శ్రేణికి చెందినవానిలో ఇవే మొట్టమొదటి వని తలంతుము. ఈగ్రంథముయొక్క ఉత్కృష్టతను పాఠకలోకము గ్రహించురీతి ఎటులు వ్రాయఁగల మనునది ఒకసమస్యగా నేర్పడినది. గ్రంథమా చిన్నది. అందులోనివిషయములా! చాల గొప్పవి. భారతీయసంస్కృతికి విజ్ఞానమునకును చలింపని పునాదిరాళ్ళగు ఆర్యమహర్షులజీవితచరిత్రము లిందు వర్ణింపఁబడినవి.

ఈఋషులచరిత్రము నిదివఱకు మూఁడుభాగములు ప్రచురించిరి. ఇది నాలుగవభాగము. ఇంతవఱకు ఆధునికమహాపురుషుల జీవితములు, స్వీయ చరిత్రలు, ఆంధ్రకవులచరిత్రలు, రాజకీయ నాయకులచరిత్రలు, గద్యరూపమున తెలుగుభాషలో వెలువడినవి. కాని, ప్రాచీనవిజ్ఞాన మని భారతదేశసంస్కృతి అని భారత దేశఆధ్యాత్మిక విద్య అని బహువిధములుగా ఏమహర్షుల పేళ్ళను ఈదినమునకుఁ గూడ హిందువులు చెప్పుకొనిగర్వించుచున్నారో అట్టిమహర్షి చంద్రుల జీవితచరిత్రలను ఎవరును ప్రచురింపలేదు. శ్రీబులుసు వేంకటేశ్వరులుగారు సమర్పించినవే మొట్టమొదటి రత్నములనిచెప్పనగును. ఈమహర్షులు ఏకాలమున ఈభారత భూమిపై జన్మించిరో సిద్ధాంతీకరించుటకు తగుఆధారములు లేవు. కొన్ని మహాయుగములకు ముం దుండియుండవచ్చును. వీరు మానవశరీరముతో ఈభూమిపై సంచరించిరా? లేదా? అని చర్చించుట అనవసరము. ఈదినము మనము జీవించియున్నామా? లేదా? మనతండ్రితాతలు పుట్టియున్నారా? లేదా? అనునది ఎంతసత్యమో ఎంతసత్యముకాదో ఇదియును అంతే. వేద యుగమునుండి ఈదినమువఱకును ఈమహర్షులపేళ్లు భారతదేశమున నలుదెసలలోను ప్రతిధ్వనించుచున్నవి. దేశకాలమతముల కతీతమైనసత్యములను ప్రతిపాదించుఉపనిషత్తులకును, ధర్మశాస్త్రములకును ఈమహర్షులు కర్త లనుట నిర్వివాదాంశము. వారినామములతో నవి వెలుగొందుచున్నవి.

ఋషు లనినను తపోనిష్ఠులనినను కొందఱికి లేనిపోని అభిప్రాయము లున్నవి. మనమతములో మనకు విశ్వాసము లేక పోవుటయే దీనికి కారణము.

ఈమహర్షులు అఖండబ్రహ్మచర్యదీక్షావ్రతులు. యమనియమాదియోగములలో క్రమశిక్షను పొంది కర్మేంద్రియ, జ్ఞానేంద్రియములను లోఁబఱచుకొనినమహామహులు; నిరాహారులై వాయుభక్షకులై వేలకొలదిసంవత్సరములు తపములాచరించి ప్రకృతిని వశపఱుచుకొని అతీంద్రియజ్ఞానమార్జించుకొన్న ధీరులు; అణువులో నణువుగా తమశరీరములలో నిమిడియున్న సూక్ష్మశక్తితో విశ్వమంతయు ఆవరించియున్న మహాశక్తిని చూడగలిగినదివ్యపురుషులు; తపోజ్ఞానమునంతయు మానవోద్ధరణమునకు లోకకల్యాణమునకు వినియోగించిన త్యాగధనులు.

వేదములలోను, ఉపనిషత్తులలోను, ధర్మశాస్త్రములలోను, అష్టాదశపురాణములలోను, ఇతిహాసములలోను, ఈ మహాఋషుల ప్రస్తావనలు కాననగును. సమగ్రమగు వారిజీవితగాథ లొక్కచోఁ గానబడవు. వివిధగ్రంథములలో వివిధరీతులుగను, సందర్భానుసారముగను సంక్షిప్తముగను నివి తెలుపబడియున్నవి. వాని నన్నింటిని శోధించి ఒకటిగా చేర్చి ప్రత్యేకజీవితచరిత్రలుగా వ్రాయుట సామాన్యమైనపని కాదు. సంపూర్ణమైన సంస్కృతభాషాజ్ఞానము అత్యవసరము. భాషాజ్ఞానమే చాలదు. విజ్ఞానముకూడ అవసరము. అన్నిటికన్న ముఖ్యముగ ఓపిక, పట్టుదల, పరిశోధనాదృష్టి ఎక్కువగా నుండవలెను. ఇట్టి సంపత్తుతో వేదశాస్త్రపురాణములను ఆమూలాగ్రము శోధించి హిందూవిజ్ఞానమునకు ఆర్యసంస్కృతికిని బీజాంకురములు నాటిన ఈమహర్షిచంద్రులయొక్క పావనచరిత్ర

లను మంచి శైలిలో సులభమైన వచనరూపముగా తెలుగు
జలయెదుటఁ బెట్టిన శ్రీబులుసు వేంకటేశ్వరులుగారు ఎం
న్యులోకదా! ఈఋషులచరిత్రలన్ని భాగములు చద
తర్వాత కాని వీరు కావించిన మహోత్కృష్టసేవ ప్రజలు
్తిగా అర్థము చేసికొనలేరు. తెలుగు మాటలాడు ప్రతి
దూస్త్రీ, పురుషుఁడు అప్పుడు కాని శ్రీవేంకటేశ్వరులుగా
ఎంతగా ఋణపడియున్నారో తమంతతాము గ్రహింపఁజా

భారతదేశమునకు సర్వసంపూర్ణస్వాతంత్ర్యము
చినతర్వాత భారతాధ్యక్షులైన డా. రాజేంద్రప్రసాదు మా
గునాయకులెల్లరు సంస్కృతవిజ్ఞానమును ప్రాచీనసంస్కృ
పునరుద్ధరింపవలె నని చెప్పుచున్నారు. మన దేశముయొక్క
నమును ఆధ్యాత్మికసంపదను తెలిసికొనవలె నని పాశ్చాత్యు
కుతూహలపడుచున్నారు. ఇట్టి తరుణములో ఈమహర్షుల
త్రలు కాలానుగుణ్యముగా నున్నవి. వీనిని ప్రతిహిందూవి
ర్థియు, విద్యార్థినియు చదువుట అతిముఖ్యము. విద్యాశా
కారులు వీనిని నిర్బంధపఠనీయగ్రంథములుగా నిర్ణయించ
చాల అవసరము. అమెరికా జర్మనీ మొదలయిన విదేశీయ
ఉపయోగార్థమై ఈగ్రంథములను ఆంగ్లజర్మనీభాషలలో
భాషాంతరీకరించి ప్రచురించుటకూడ అవసరము. ఈఋషి
త్రములు అమూల్యరత్నములు. ఇవి ప్రతిహిందూగృహమును
అలంకరించునుగాక!

శ్రీమతి లీలావతి నారాయణ, బి. యస్. సి. ఇ

(27-5-53 "భారతజ్యోతి" నుండి.)



అఘహారంబు 'శ్రీమహర్షి జీవితకథా
మృతము' సకలలోకహితముఁ గోరి
శాశ్వతముగఁ దెలుఁగుజగమున విలసిల్ల
బులుసు వేంకటేశ్వరులు రచించె.

కోట్లజన్మము లెత్తి యెత్తఁబోవుజీవియొక్క నికృష్టదైనందినవ్యవహారములు కాని, నశ్వరములగు వివిధదేహసంపర్కములు కాని వారిదృష్టి నాకర్షించినవి కావు. అందుచే, ఆయావిషయముల వారు తూష్ణీభావము వహించి యసలు పరమార్థమును విడిచి పెట్టినవారు కారు. నేఁటి మనదృష్టి వేఱు. అసలువిషయము తప్ప నన్నివిషయములు మనకుఁ గావలయును. బోధ మల్పము, గర్వ మధికము, శాంతి నిప్పచ్చరము, మచ్చరము మాత్రము ఘనము. ఇవి మనజీవితవిశేషములు. వెఱ్ఱివాఁడు లోకమంతయు వెఱ్ఱివారితో నిండిన దనుకొనునట్లు, బహుముఖవ్యర్థవిషయములలో మగ్నులమయి యనేకనికృష్టగుణముల కాలవాలములమయి, యివి లేనివారు నికృష్టు లని నిందించుస్థితిలో మన ముంటిమి. అందుచే మనజీవితచరిత్రలను మనము వ్రాసికొందుము. ఇతరులను బతిమాలి వ్రాయించుకొందుము. అచ్చువేసి విచ్చలవిడి ప్రచారము చేసికొందుము. మనము గొప్పవారమగుట కాదు మనకుఁ గావలయునది. మనము గొప్పవారము కా మని మనకుఁ దెలియును. కాని, పైవా రందఱు మనము గొప్పవార మనుకొనవలయును. మనలను స్తుతింపవలయును. సమ్మానింపవలయును. ఊరేగింపవలయును. ఆరాధింపవలయును. ఇవి మనకోరికలు. వీని కనుగుణముగా మన బ్రతుకులు తీర్చుకొనుచున్నాము. తుద కివియు లభింపక యిహమునకుఁ జెడి పరమునకుఁ జెడి కన్నుమూయుచున్నాము.

ఇంతకుఁ జెప్పవలసినది జైమినిమహర్షి జననవిశేషములు మనకుఁ దెలియవు. తల్లిదండ్రులపేళ్లైనను దెలియవు. ఈతఁడు తాను వ్యాసశిష్యుఁడ ననియే చెప్పుకొన్నాఁడు. అట్లే మనకుఁ

దెలియవచ్చును. కాని యితరవిషయములు తెలియవు. వ్యాస మహర్షి యీతనిని శిష్యునిఁగా గ్రహించి తనకడ నుంచుకొని శిక్షణ మొసఁగి ఋషిచంద్రు నొనరించినాఁడు.

## జైమిని : సామవేదప్రచారము

తొలుదొలుత బ్రహ్మహృదయమం దొకనాదము జనించెను. అది వృత్తినిరోధమువలన మూర్తీభవించి వ్యక్తముగాఁ గానవచ్చెను. ఆనాదోపాసనవలన యోగీశ్వరులు నిష్పాపులై ముక్తి నొందుదురు. అందు ఓంకారము జనించెను. అదియే సర్వమంత్రసర్వోపనిషన్మూలభూత యగు వేదమాత. ఆఓంకారము త్రిగుణాత్మకమై అకారోకారమకారము లనెడుత్రివర్ణరూపమై ప్రకాశించుచుండెను. అంత బ్రహ్మదేవుఁ డాప్రణవమువలన స్వరము, స్పర్శము, ఊష్మము, అంతస్థము మున్నగు లక్షణములు గలిగినఅక్షరసముదాయమును గల్పించి వానిసాయమునఁ దననాలుగునోళ్లనుండి నాలుగువేదములు కలుగఁ జేసెను. ఆతనిపుత్రు లగుబ్రహ్మవాదు లావేదములను ఆతఁడు చెప్పినరీతి నభ్యసించి ఆక్రమముననే వారివారిశిష్యుల కుపదేశించిరి. ఇట్లు వేదములు సమగ్రముగాఁ బ్రతియుగమున మహర్షు లభ్యసించిరి. అట్టివేదములను సమగ్రముగాఁ బఠింపలేనివారల యుపయోగమునకై ద్వాపరయుగాదియందు భగవంతుఁడు సత్యవతీదేవియందుఁ బరాశరమహర్షికిఁ బుత్త్రుఁడై జన్మించి వేదరాశిని క్రమముగా ఋగ్వేదము, యజుర్వేదము, సామవేదము, అథర్వవేదము నని నాలుగువిధములుగా విభజించి తనశిష్యరత్నము లగు పైల వైశంపాయన జైమిని సుమంతులకుఁ గ్రమముగా నావేదముల నుపదేశించెను.

పైలమహర్షి నేర్చినఋగ్వేద మనేకఋక్కులతోఁ గూడి యుండుటచే నది "బహ్వృచశాఖ" అని పేరందెను. పైలుఁ డీ వేదమును ఇంద్రప్రమితి, బాష్కలుఁడు ననుతనశిష్యాగ్రణుల కుపదేశించెను. ఇంద్రప్రమితి తనసంహిత మాండూకేయున కుపదేశించెను. మాండూకేయుఁడు దేవమిత్రుఁ డనువాని కది యుపదేశించెను. ఆతఁడు సౌభరి మున్నగు తనశిష్యుల కుపదేశించెను. సౌభరి తనకొడు కగుశాకల్యున కుపదేశించెను. శాకల్యుఁడు తా నభ్యసించినశాఖ నైదువిధములుగా విభజించి వాత్స్యుఁడు, మౌద్గల్యుఁడు, శాలీయుఁడు, గోముఖుఁడు, శిశిరుఁడు ననెడుతనశిష్యుల కుపదేశించెను. వారు జాతుకర్ణిమహర్షి కుపదేశించిరి. ఆతఁడు బలాకుఁడు, పైంగుఁడు, వైతాళుఁడు, విరజుఁడు ననువారి కుపదేశించెను. బాష్కలుఁడు తాను నేర్చిన సంహితను నాలుగువిధములుగా విభజించి బోధ్యుఁడు, యాజ్ఞవల్క్యుఁడు, పరాశరుఁడు, అగ్నిమిత్రుఁడు అనుతన శిష్యుల కుపదేశించెను. బాష్కలునికుమారుఁ డగుబాష్కలి వాలఖిల్యాఖ్యసంహితను బాలాయని, గార్గ్యుఁడు, కాసారుఁ డనువారల కుపదేశించెను.ఈవిధముగా ఋగ్వేదమును బెక్కురు ఋషులు ధరించిరి. ఇట్లే వైశంపాయనుఁడు నేర్చినయజుర్వేదము యాజ్ఞవల్క్యాదులమూలమున, కాణ్వమాధ్యందినాదులచే నభ్యసింపఁబడి లోకవ్యాప్తి గాంచెను.

ఇఁక, జైమినిమహర్షి తాను నేర్చినసామవేదమును దన కుమారుఁ డగుసుమంతుని కుపదేశించెను. ఆతఁడు సుకర్ముఁ డను తనసుతునకుఁ దెలిపెను. సుకర్ముఁ డావేదమును సహస్రశాఖలుగా విభజించి తనకుమారుఁ డగుపౌష్యంజికిని, కోసలుని

కుమారుఁ డగు హిరణ్యనాభునికి నుపదేశించెను. వారిరువురు బ్రహ్మవేత్త లగు ఆవంత్యులు, ఉదీచ్యులు నగు నైదువందలమం దికి నేర్పి వారిని సామవేదపారగులఁ జేసిరి. ఈవిధమున సామ వేదము జైమినికతమున లోకవ్యాప్తి గాంచెను. ఇట్లే యథర్వ వేదమును సుమంతుఁడు తనప్రియశిష్యున కుపదేశింప నతఁడు దానిని వేదదర్శుఁడు, పథ్యుఁడు ననుశిష్యులకును వారు శౌల్కా యని, బ్రహ్మబలి, నిర్ఘోషుఁడు, పిప్పలాదుఁడను వారి కుప దేశించిరి. ఈవిధమున నథర్వవేదమును వ్యాప్తిగాంచెను.*

## జైమిని మార్కండేయుని దర్శించుట

ఒకప్పుడు జైమిని బహుపుష్పఫలభరితములైన మహా వృక్షములతోడను, మనోహరలతలతోడను, అట విహరించు నెమలి,కోయిల,చిలుక,మున్నగు చక్కనిపక్షుల మనోహరస్వన ములతోడను, నిరంతరము వ్యాపించుహోమధూమముచే నల్ల పడిన ఆకాశమండలముతోను, ఎడతెగక జరుగునధ్యయనఘో షమువలనఁ జెవుడుపడినదిశలతోడను, నిత్యకల్యాణము పచ్చ తోరణముగా దినదినము పరివర్ధమాన మగు యజ్ఞోత్సవముల! అనేక దేవతాగణములతో వచ్చియుండుచున్న యింద్రాదుల తోడను, సమిధలు దర్భలు పూవులు పండ్లు తెచ్చుటకు మృదు మధురము లగుమాటలతో బయలువెడలు మునికుమారుల మనోహరకోలాహలముతోడను, శాస్త్రగోష్ఠి, పురాణకాలక్షే పము, ఇతిహాసకథనము మున్నగువానితోఁ గాలక్షేపముచేయు పరిషత్తులతోడను, చక్కగనొప్పుచున్న మార్కండేయాశ్రమ

---

*భాగవతము ౧౨స్కంధము.

మునకు విచ్చేసి నిరుపమనిష్ఠాపరుఁ డయి తపమొనర్చు మార్కం-డేయునికి నమస్కరించి యాతనియతిథిసత్కారము లంది యిరువురు సుఖగోష్ఠిలో నున్నపుడు జైమిని యిట్లు బలికెను. "మునీంద్రా! మద్గురువరుఁ డగువ్యాసమహర్షి రచించిన మహాభారతములోని కొన్నినిగూఢార్థముల నెఱుఁగుటకై నీకడకు వచ్చియున్నాను. నాసంశయములఁ దీర్ప నీవే యర్హుఁడవు. కాన, దయతోఁ దెల్పుము."

అంత, మార్కండేయుఁడు "సంయమివర్యా! నీయడిగినయర్థములకు సవిస్తరముగా సమాధాన మిచ్చుటకుఁ జాల కాలము పట్టును. నేను కఠోరనియమవ్రతుఁడనై యున్నాను. నియమవిధులకు సమయ మగుచున్నది. నే నేఁగవలయును. వింధ్యపర్వతమున పింగాక్షుఁడు, విరాటుఁడు, సుపుత్రుఁడు, సుముఖుఁడు ననుపేళ్ళతో నలువురు పక్షిరాజులు గలరు. నీవు వారి కడ కేఁగి యీయర్థము లెఱిఁగికొ"మ్మని జైమినికి ధర్మపక్షుల చరిత్రము నిట్లు తెలిపెను:

"తొల్లి వపువు అనునప్సరసను దుర్వాసుఁడు పక్షివై పుట్టి భూమిపైఁ బదునాఱుసంవత్సరము లుండి నలువురు పుత్త్రులఁ గని తుదకు బాణఘాతమునఁ జచ్చి పూర్వరూపము నందు మని శపించెను. కందరుఁ డనువాఁడు విద్యుద్రూపుఁ డనురాక్షసుని జంపి యాతనిభార్యయు మేనకకూఁతురు నగు మదనికను భార్యగా స్వీకరించి తనయింటికిఁ దీసికొనిపోయెను. మదనిక కామరూపిణియై కందరుని కెన్నివిధములుగనో ఆనందము నొసఁగుచుండెను. ఒకనాఁ డామె పక్షిరూపముఁ దాల్చి

యుండ, కందరుఁడు కూడ పక్షిరూపముఁ దాల్చి యామెతో రమించెను. వీరియీరతివలన వపువు పుత్త్రికయై యీపక్షిదంపతులకు జన్మించెను. కందరుఁ డీపక్షికి తార్క్షి యనుపేరిడి పెంచెను. ఈతార్క్షిని మందపాలుఁ డనుపక్షిరాజు నాలవకొమరుఁడగుద్రోణుఁ డనువాఁడు పెండ్లాడెను. కాలక్రమమున, తార్క్షి యాతనివలన గర్భము ధరించెను. పిదప, మూఁడునెలల పదునైదుదినములు చనినపిమ్మట తార్క్షి కురుపాండవులు సంగరముచేయుచున్న భారతయుద్ధమునఁ దిరుగుట సంభవించెను. అపుడు భగదత్తునియేనుఁ గగుసుప్రతీకముపై నర్జునుఁడు నిశితాస్త్రమేయఁగా నది తగిలి తార్క్షికడుపు తెగి దానిగ్రుడ్లునాలుగు నొకమెత్తనిచోటఁ బడెను. ఈగ్రుడ్లమీఁద నదృష్టవశమున సుప్రతీకము గంట యొకటి తెగి యాగ్రుడ్లకు హాని కలుగకుండఁ బడి వానికి రక్షక మగుదివ్యభవనముగా నొప్పెను. తార్క్షిశాపవిముక్తత నంది తిరిగి వపు వనునచ్చరయై తనలోకమునకుఁ బోయెను. ఈగ్రుడ్లు కాలక్రమమునఁ జిట్టి పక్షులయ్యెను. అంతలో భారతయుద్ధము పూర్తియైనపిదప, ధర్మరానకు భీష్ముఁడు చెప్పినసర్వధర్మములు ఈనాలుగుపక్షిపిల్లలు శ్రద్ధగా వినెను. ఒకనాఁ డటకు శమీకమహాముని విచ్చేసి పక్షికూఁతలు విని శిష్యులచే పైగంట తొలఁగింపఁజేసి యాపక్షులఁ జూచి యాశ్చర్యభరితమానసుఁడై “ఆహా! ఈరణరంగమెక్కడ? ఈపక్షు లెక్కడ? ఈగంటలో నుండి యివి యెట్లు బ్రతుకఁగలిగినవి? ఏమి చావుబ్రతుకులచిత్రము!

సమర మొనరించినంతనే చావు రాదు
పారిపోయినయంతనే బ్రతుకు రాదు
జీవితంబును మరణంబు దైవకల్పి
తములు వానికి ముదమందఁ దలఁకవలదు.

... ... ...

దైవంబు చక్కఁజూచిన
నేవిధమునఁ గీడుపొంద దెయ్యెడ నున్నన్
దైవంబు తప్పఁజూచిన
నేవిధమున మేలుపొంద దెయ్యెడ నున్నన్.

(మార్కండేయపురాణము)

అని తొల్లి శుక్రాచార్యుఁడు చెప్పినమాట లెంతసత్యములు !" అనుకొని యాపక్షిపిల్లలకు నకులశ్యేన మార్జాల మూషికాదుల వలన భయము లేకుండ రక్షింప వలయునని దయగొని తన శిష్యులకు వానిని జాగ్రత్తగాఁ గొనిరం డని యాజ్ఞాపించి నిజాశ్రమమునకుఁ దీసికొనిపోయి యట వానిని దాను సురక్షిత స్థానముల నుంచి దినదినము పాలు పండ్లు మున్నగునాహార పదార్థములను స్వయముగాఁ బెట్టుచుఁ బోషించెను.

ఈవిధముగా నొక్కనెల యగుసరికి యాపక్షులు చక్కగాఁ బెరిగి ఱెక్కలు విచ్చి యొక్కపరి ఆకస మంట నెగిరి దిగివచ్చి శమీకమహాముని పాదముల కెఱఁగి యిట్లనెను: "మహాత్మా ! మాకు మరణముఁ దప్పించి దయచే మమ్ముఁ బెంచి పెద్దలఁ జేసితివి. నీవే మాకుఁ దల్లివి తండ్రివి దైవమవు సమస్తమును. నీ ఋణము మేము తీర్చుకొనఁజాలము. ఐనను, నీసేవ చేయ మే మభిలషింతుము. మాచే నేదైనఁ బనులుగొను"మని యాపక్షులు మనుజస్వరములఁ బలుక ముని యచ్చెరువడి "మీ రెవ్వరు ?

ఎవనిశాపమున నిట్లైతిరి ? చెప్పుఁ" డనెను. అంత నాపక్షులు "అయ్యా ! సుకృశుఁడు, తుంబురుఁడు నని యిద్దఱు ఋషులు గలరు. వారిలో సుకృశునకు మేము నలువురము బిడ్డలము ఒకనాఁడు మేము తండ్రిశుశ్రూష చేయుచుండ నింద్రుఁడు మాతండ్రి సత్యనిష్ఠఁ బరీక్షింపఁ దలఁచి పక్షిరూపమున వచ్చి మాంసాహార మర్థించెను. మాతండ్రి వల్లె యని మమ్ముఁ బిలిచి యాపక్షి కాహారము కండని కోరెను. మేము నిరాకరించి

'ప్రాణములు గల్గ శుభములు పడయవచ్చు
ధర్మములు సేయనగుఁ గానఁ దన్నుఁ గీడు
చెందకుండంగ నరుఁడు రక్షించుకొనుట
ధర్మ మని చెప్పుదురు ధర్మతత్త్వవిదులు'

(మార్కండేయపురాణము)

అని మే మాతనికి హితబోధచేయ నాతఁడు కోపించి పక్షులు కండని మమ్ము శపించి యాపక్షికిఁ దానే యాహారమై నిలువ నది "నీవు ప్రాణముతో నుండఁగఁ దినలేను. కాన, చనిపొ"మ్మని కోరెను. అంత మాతండ్రి యోగాగ్నిఁ గల్పించుకొని ప్రాణములు పోఁగొట్టుకొన నుండ నింద్రుఁడు నిజరూపమున నిలిచి మాతండ్రి సత్యవ్రతనిష్ఠకు మెచ్చి వరములొసఁగి పోయెను. మేమును దండ్రిపాదములఁ బడి "తండ్రీ ! ప్రవిమలజ్ఞాన మను ప్రాకారము, శల్యము లనుకీలకము, చర్మ మనుగోడ, రక్తమాంసము లనుసున్నపుఁబూఁత, నానాస్నాయువు లనువేష్టనము, మహామాయ యనుముఖము కల దేహ మనుపురమునకుఁ బురుషుఁడు రాజు. ఈరాజునకు మనస్సు బుద్ధి యను పరస్పరవిరోధులు మంత్రులు. కామక్రోధలోభమోహములు

మిక్కిలిబలవంతులైన శత్రువులు. ఈనల్వురు శత్రు
చొరఁబడకుండ రాజు వీటివాకిళ్లు మూసియుంచుకొనవ
అప్పుడతఁడు నిరాతంకుఁడు, సమాధిసుఖబలవంతుఁడు
మానురాగుఁడు నగును. ఆరాజు వాకిళ్ళు గట్ట నశక్తుఁ
కాముఁ డనుశత్రువు నేత్రాదిపంచద్వారములనుండి
వ్యాపించును. అతనివెనుకనే మిగిలినముగ్గురుశత్రువులు
శింతురు. ఆనలువురు కలిసి యింద్రియమనంబులతో
మొనరించుకొని వాని నన్నిటిని, వాకిళ్ళను వశపఱచు
జయింపరానివారై కోటఁ గొల్లఁగొట్టి మంత్రులఁ జంపి రా
నశింపఁజేయుదురు. ఈరీతిఁ గామాదిశత్రువులు మా
స్మృతి నశింపఁజేయువా రగుట మేము మోహావృతచిత్త
ప్రాణలోభమున జ్ఞానముఁ బోఁగొట్టుకొని నీమాట
యపరాధము చేసితిమి. మమ్ముఁ గనికరింపు" మని ప్ర
తిమి. మాతండ్రి దయదలఁచి "వత్సలారా! నామాట
కాని, మీకు నిర్మలబోధ నిలిచియుండునట్లు, పక్షులయ్యు
విద్యాపరులై, మనుష్యవాక్ప్రభావము నంది వఱలుఁ
మే మిట్లు పక్షులమై యాతనికృప నీవి శేషములఁ బడసితి
అని చెప్పఁగా శమీకుఁ డానందించి వానిని దీవించి వీడ
పెను. ఆపక్షులు వింధ్యపర్వతప్రాంతముల కేగిరిపోయి
శిఖరమున నధ్యయనప్రవిష్టము లయి యున్నవి. పోయి
యముల వానివలనఁ దీర్చుకొమ్మని చెప్పి మార్కండేయు
జైమినిని వీడ్కొలిపెను.

## జైమిని ధర్మపక్షులకడ సందేహములు తీర్చుకొనుట

జైమిని మార్కండేయుఁడు చెప్పినచొప్పున వింధ్యగిరికి జితనిశ్వాసము, అవిస్వరము, అతివిస్పష్టము, సౌష్ఠవసహితము, వివర్జితదోషము నగు వేదస్వనముల నొప్పుపక్షీంద్రులఁ గని నమస్కరించెను. ఆపక్షులు నాతని నాదరించి రెక్కల విసరి యతనికి సేదదీర్చి స్తుతించి వచ్చినపని యడిగెను. జైమిని తనభారతసంశయముల నడుగ నాతని కాపక్షులు శ్రీనారాయణవ్యూహచతుష్టయము, పాంచాలీభర్తృపంచకవిషయము, ఇంద్రుఁడే యైదువిధములై పాండవులుగ జన్మించుట, బలరాముని తీర్థయాత్ర, హరిశ్చంద్రోపాఖ్యానము, క్రోష్టుకిమార్కండేయసంవాదము మున్నగువిషయము లెన్నియో తెలిపెను. ఈయావద్వృత్తాంతము మార్కండేయపురాణ మనుపేరఁ బరగుచున్నది.

ఈవిషయము లన్నియుఁ దెలిసికొని జైమిని ధర్మపక్షులను స్తుతించి వీడ్కొని నిజాశ్రమమునకు వెడలి సుఖముండెను.

## జైమిని భారతము

ఒకప్పుడు జనమేజయమహారాజు చక్రియాగము నిర్విఘ్నముగా సమాప్తము చెందినపిదప సుఖాసీనుఁడై జైమినిమహర్షిని గనుఁగొని "మహాత్మా! కలిదోషముల నెల్ల క్షణమాత్రలో భస్మము చేయఁజాలుకురుక్షేత్రమున నజాతశత్రుఁ డగుధర్మపుత్త్రుఁడు ధార్తరాష్ట్రబలములఁ బదునెనిమిదిదినములలో ధూళిధూసరితములఁ గావించి శాశ్వతైశ్వర్యధుర్యుఁడై విశ్వజగన్నుతముగా నశ్వమేధముఁ జేసినవిధానమును దయతోఁ దెల్పు" మని ప్రార్థించెను. అంత జైమినిమహర్షి జనమేజయునకు ధర్మ

జునికడకు వ్యాసమహర్షి విచ్చేసి యశ్వమేధముచేయ ననుజ్ఞ యిచ్చుట మొదలుకొని భీమాదులు యజ్ఞాశ్వమునకు భద్రావతీపురమున కరుగుట, మేఘవర్ణునితో యుద్ధము, అనుసాళ్వుఁడు మఖాశ్వము నపహరించుట, నీలధ్వజునితో యుద్ధము, అర్జునుని గంగ శపించుట, ప్రమీలార్జునీయము, బభ్రువాహన చరిత్రము, శ్రీరామచరిత్రము మున్నగు నెల్లవిషయములు, చంద్రహాసునివృత్తాంతము, కృష్ణుఁడు, కరిపురమున కేఁగుట ధర్మజునశ్వమేధవిధి, తుదివఱకు సవిస్తరముగాఁ దెలిపెను. ఈ కథాభాగము జైమినిభారత మనుపేరఁ బ్రశస్తి కెక్కినది.

## జైమినీయదర్శనము

సామవేదప్రచారకుఁ డగుజైమినిమునీంద్రుఁడు షడ్దర్శనములలో నొకదానికి ప్రవక్త. ఈతనిదర్శనము † జైమినీయదర్శనమనియు ధర్మదర్శన మనియు వక్కాణింపఁబడుచున్నది. పూర్వమీమాంసకే కర్మమీమాంస యనియు ధర్మమీమాంస యనియుఁ బేళ్లు. పూర్వమీమాంసాప్రణేత జైమిని. ఉత్తరమీమాంసాప్రణేత వ్యాసమహర్షి. ఉత్తరమీమాంసాప్రతిపాదకులు, వ్యాసానుయాయులు, నగువారే వేదాంతులు. వీరిసిద్ధాంతము కేవలపరబ్రహ్మాద్వైతప్రతిపాదనము. ద్వాదశాధ్యాయములు గలపూర్వమీమాంసాశాస్త్రము జైమిని రచించెను. ఇందు మూలభూతము లగుజైమినిసూత్రములు ఏకరూపములైనను, పూర్వమీమాంసానుయాయులు ప్రాభాకరమతస్థులు, భాట్టమతస్థులు నని రెండువిధముల నున్నారు. ప్రాభాకరమతస్థులు ఐదుప్రమాణముల నొప్పుకొందురు. భాట్టమతస్థులు

† పురుషార్థములను వాని సాధనములను దెలియఁజేయునది దర్శనము.

ఆఱుప్రమాణములఁ జూపుదురు. సత్తుయొక్క-వివర్తముతే కార్యము లన్నియు నని వీరివాదము. అందుచేతనే వీరిని వివర్త వాదు లందురు.

సంక్షేపముగా వీరి మత మిది: "సర్వజ్ఞాదివిశేషణములు గలయొక దేవుఁడు లేఁడు. వేదవచనమే ప్రమాణము. సర్వజ్ఞత్వము, విభుత్వము, నిత్యత్వము, చిదాత్మకత్వము, మున్నగు గుణములు కలవాఁడు దేవుఁడు కాఁజాలఁడు. త్రైలోక్యసామ్రాజ్యపాలనాదికమును సూచించు ఛత్రచామరాదులు గల యొకవిభుఁడు భగవంతుఁ డనుట సరి కాదు. అట్టివిభుత్వము, ఐశ్వర్యములు మాయావు లగుమానవులయందే కలవు. * ఈశ్వరుఁడు ప్రత్యక్షప్రమాణసాధ్యుఁడు కాఁడు. అనుమాన ప్రమాణమునకును సాధ్యుఁడు కాఁడు. ఇంతేకాదు ఆగమోపమానార్థాపత్తిప్రమాణములు వేనికిని ఈశ్వరుఁడు సాధ్యుఁడు కాఁడు.

నేత్రగోచరము కానిపదార్థములను సాక్షాత్తుగా నెఱుఁగఁగలవాఁడు లేఁడు కావున, నిత్యములు, అపౌరుషేయములు నగువేదముల వాక్యములమూలమున వచ్చినపదార్థధర్మాదిస్వరూపమును వివేచించుటే ముఖ్యతత్త్వము. కావున,ముందు ఋగ్యజుస్సామాథర్వవేదములను బఠించి పిదప సద్విద్య నెఱుఁగవలయు నను జిజ్ఞాస నలవఱుచుకొని వేదోక్తవిధానమునఁ జరింప

---

* "దేవాగమ నభోయాన చామరాదివిభూతయః
మాయావిష్వపి దృశ్యన్తే నాతస్త్వమసి నో మహాన్."

వలయును. ఈవేదోక్త విధ్యుక్త ధర్మమునకే 'నోదన'* యని పేరు.

ఈమతమునఁ బ్రత్యక్షము, అనుమానము, ఉపమానము, శాబ్దము, అర్థాపత్తి, అభావము నని యాఱుప్రమాణములు గలవు.

## ప్ర త్య క్ష ము

ఇంద్రియార్థసన్నికర్షోత్పన్నము, అవ్యభిచారికము, వ్యవసాయాత్మకము, వ్యపదేశవివర్జితము, అగుజ్ఞాన మేది కలదో అదే ప్రత్యక్షము. ఇంద్రియార్థసన్నికర్షోత్పన్న మనఁగా ఇంద్రియముయొక్కయు వస్తువుయొక్కయు సంయోగమువలనఁ బుట్టినది జ్ఞానము అని యర్థము. అవ్యభిచారిక మనఁగా మఱియొక జ్ఞానముచే మఱియొకవిధముగా భావింపఁబడనిది యని యర్థము. ఉదాహరణకుముత్యపుఁజిప్పముక్కను వెండియే యని భ్రమించుట వ్యభిచారికము. ఇట్టిభావనలేనిది అవ్యభిచారికము. వ్యవసాయాత్మక మన వ్యవహారసాధకము, వ్యవహారమున కుపయోగించునది. వ్యపదేశవివర్జిత మనఁగా విపర్యయరహితము-మార్పులేనిది-అని యర్థము. ఈలక్షణము లన్నియుఁ బట్టినజ్ఞానమే ప్రత్యక్షము.*

---

*వేదోక్తము స్వర్గాదిసుఖసాధకము నగు వ్యాపారము నొకవచనము ప్రవర్తింపఁజేయునో దానికే 'నోదన' యని పేరు. ఉదా:—"స్వర్గకామో ఽగ్నిం యజేత్"=స్వర్గమును కాంక్షించువాఁడు అగ్నికార్యము చేయవలయును. ఇదే నోదన.

*ఆత్మా మనసా సంయుజ్యతే మన ఇంద్రియేణ ఇంద్రియ మర్థేన తతః ప్రత్యక్ష ముత్పద్యతే" న్యాయకారిక.

## అనుమానము

ఈఅనుమానము ముత్తెఱఁగులు. పూర్వవదనుమానము, శేషవదనుమానము, సామాన్యతోదృష్టానుమానము. కారణముచేఁ గార్యము ననుమానించుట పూర్వవదనుమానము. తుమ్మెదలు, ఎనుఁబోతు, పాము, తమాలవృక్షము, ఇవి సహజముగా నల్లనిపదార్థములు. ఇట్టినలుపు కలమేఘములనుబట్టి వర్షము కలుగు నని యూహించుట పూర్వవదనుమానము.*
దీనికి విరుద్ధముగా కార్యముచేఁ గారణము నూహించుట శేషవదనుమానము. ఉదాహరణము: ఈనది వఱదలతో నున్నది. బహుశః కొండలమీఁద మెండుగ వర్షించియుండవచ్చును. ఇఁక, సామాన్యతోదృష్టానుమాన మనఁగా మనము సర్వసామాన్యముగాఁ జూచువిషయములఁబట్టి కార్య మూహించుట. ఉదా: దేవదత్తునియందు దేశాంతరప్రాప్తి యెట్లో సూర్యునియందుఁ నట్లే. అనఁగా దేవదత్తుఁ డనువాఁడు మాహిష్మతీపురమునుండి బయలుదేఱి ఉజ్జయని చేరినట్లే తూర్పున సూర్యుఁ డుదయించి సాయంకాల మస్తాద్రిఁ జేరుచున్నాఁడు. సూర్యగమనమును మనము కనలేము. ఐనను, సామాన్యముకా నిట్టులూహింతుము.

## ఉపమానము

తెలియఁబడనియర్థమును ప్రసిద్ధధర్మసాధర్మ్యమువలన జ్ఞాపనము చేయునది ఉపమానము. స్త్రీలకుఁ బురుషులకు, పిన్న

---

* "రోలంబ గవల వ్యాల తమాల మలినత్విషః,
వృష్టిం వ్యభిచరంతీహ నైవం ప్రాయః పయోముచః"

నాలు అధ్యాయములలోఁ గలవు. కాని, యందు మొదటి పండ్రెండధ్యాయములే ప్రసిద్ధము లగుటఁ గొందఱు తుది నాలుగధ్యాయములు జైమినికృతములు కావందురు కాని, 'సంకర్షకాండ' యనుపేరఁ బరగునీనాలుగధ్యాయములు కూడ జైమినికృతములే యని యంగీకరించి ఉపవర్షుఁడు, భావదాసుఁడు, దేవస్వామి, రాజచూడామణిదీక్షితుఁడు, భాస్కరరాయమఖి మున్నగువ్యాఖ్యాతలు వీనికిని వ్యాఖ్యానములు రచించియున్నారు. కుమారిలభట్టాదులు మొదటిపండ్రెండధ్యాయములకే నిబంధనల రచించియుండిరి.

ప్రథమాధ్యాయమున ధర్మమునకుఁ గల ప్రమాణము లన్నియు వివరింపఁబడినవి. రెండవయధ్యాయమున భేదము (ధర్మాధర్మభేదనిరూపణము) నిరూపింపఁబడినది. మూఁడవయధ్యాయమున అంగత్వము, నాలవయధ్యాయమున ప్రయోజ్యప్రయోజకభావము, ఐదవయధ్యాయమున క్రమము (కర్మకుఁ గర్మకుఁ గల సంబంధము) ఆఱవయధ్యాయమున అధికారము (యజ్ఞకర్తకుండవలసినయర్హతలు మున్నగునవి) ఏడవయధ్యాయమున నెనిమిదవయధ్యాయమున అతిదేశము (కర్మసాదృశ్యము, కర్మసమన్వయము మున్నగువానివివరణము) తొమ్మిదవయధ్యాయమున ఊహ, పదవయధ్యాయమున బాధ, పదునొకండవయధ్యాయమున తంత్రము, పండ్రెండవయధ్యాయమున ప్రసంగము వివరింపఁబడినవి. సంకర్షణకాండ యను తుదినాలుగధ్యాయములలోను వైదికయాగములందలి దేవతాదిక వివరణము కలదు. అందుచే నీభాగమును దేవతాధ్యాయ మందురు.

పూర్వమీమాంస, ఉత్తరమీమాంస, ఇవి రెండేకాక ఉపాసనామీమాంస యనుమూఁడవమీమాంసయుఁ గలదు. ఇది అంగిరోమహర్షిప్రణీతము. ఇందు జీవతత్త్వము చిజ్జడగ్రంథ్యాత్మకము. అనాదిజీవునకు విభుత్వము, కర్తృత్వము, భోక్తృత్వము, ఇవి సత్యములు. గ్రంథులనుండి విడివడుటే మోక్షము. జడగ్రంథిసంబంధమే సంసారము. జీవునకు జడసంబంధమును వీడుటవలననే ముక్తి కలుగును. ఈశ్వరునకు మాయాసంబంధమువలనఁ గర్తృత్వము వ్యవహారముగ వచ్చినది. మాయ పరమేశ్వరుని శక్తిస్వరూపమే. ఇది యీశ్వరుని కంటె భిన్నము. ఇది సృష్టికాలమున భేదభావ మంది, అఘటనఘటనాసమర్థమై విచిత్రజగత్తును సృష్టించుచున్నది. సృష్టికాలమందు ఈశ్వరునకును మాయకును భేదము. తదభావమునం దభేదము. జీవనానాత్వము, జీవేశ్వరభేదము నివి కల్పితములు. సాలోక్య, సామీప్య, సాయుజ్య, సారూప్యము లని ముక్తి నాలుగువిధములు. ఈమతమున సృష్టి, ప్రళయము నంగీకృతములు. ప్రత్యక్షము, అనుమానము, ఉపమానము, శాబ్దము, అర్థాపత్తి, అనుపలబ్ధి, యని ప్రమాణము లిం దాఱు గలవు.

## జైమినీయగ్రంథములు

జైమినిమహర్షి చతురధ్యాయసంయుత మగునొకయపూర్వజ్యోతిషగ్రంథమునకు, ఛాందోగ్యానువాదము అనునొకతంత్రగ్రంథమునకు, జైమినీయశ్రౌతసూత్రము, జైమినీయగృహ్యసూత్రము అను ధర్మశాస్త్రగ్రంథములకుఁ గర్త యని తెలియుచున్నది. "స్మృతిమీమాంస" యనుధర్మశాస్త్రమున కీతఁడు కర్త యని అపరార్కునియాజ్ఞవల్క్యబ్రహ్మసూత్రనిబంధనమునఁ గలదు.

# శ్రీమహర్షి జీవితకథామృతము

## దేవలమహర్షి

### స్తుతి

అష్టవసువులలో నొకఁ డైనయట్టి
ఘనుఁడు ప్రత్యూషుఁ డనువాఁడు కన్నపట్టి
ధర్మశాస్త్రప్రవక్త యుత్తమతపస్వి
దేవలుని గొల్తు నతిభక్తిభావమునను

### జననము

తొల్లి దేవుఁ డనుమను వొకఁ డుండెను. అతనికుమారుఁడు ప్రజాపతి. ఈతఁడు ధూమ్ర, బ్రహ్మవిద్య, మనస్విని, రతి. శ్వసశాండిలి, ప్రభాత అనునేడుగురు కన్యలను వివాహమై వారివలన ధరుఁడు, ధ్రువుఁడు, సోముఁడు, అహుఁడు, అనిలుఁడు, అగ్ని, ప్రత్యూషుఁడు, ప్రభాసుఁడు అనునెనమండుగురు పుత్త్రులను గాంచెను. వీరే కాలక్రమమున అష్టవసువులై కీర్తి గాంచిరి. వీరిలో ప్రజాపతికి ప్రభాత యనునామెవలన జనించినకుమారుఁ డగుప్రత్యూషుఁ డొకచక్కనిచుక్కను బెండ్లాడి కాలక్రమమున నామెయందిరువురుపుత్త్రులను గాంచెను. వారిలో మొదటివాఁడే దేవలుఁడు. రెండవవాఁడు విభువు. దేవలుఁడు నల్లనిశరీరము కలవాఁ డగుటచే నాతనికి అసితుఁ డనియుఁ బేరువచ్చెను.

## బాల్యము

దేవలుఁడు కాలక్రమమునఁ బెరిగి యుక్తవయస్సు కాంచఁగనే తండ్రి యగుప్రజాపతి యాతనిఁ దీసికొనిపోయి వ్యాసమహర్షికి శిష్యునిగా నొప్పగించెను. వ్యాసుఁడు నీతని నంగీకరించి తనయాశ్రమమున నుంచుకొని విద్యాబుద్ధులు గఱపి బ్రహ్మచర్యతపోదీక్ష లలవఱిచి కాపాడుచుండెను. దేవలుఁడు గురువునెడ నధికశ్రద్ధాభక్తులు ప్రదర్శించుచు నాతనియనుగ్రహమునకుఁ బాత్రుఁడై తపస్వి,బ్రహ్మచర్యదీక్షితుఁడు, విద్వాంసుఁడు నగుటేకాక చక్కనిపౌరాణికుఁడు నయ్యెను. వ్యాసమహర్షి తాను వ్రాసినమహాభారతము నీతనిచేఁ జదివించి యాతనికిఁ గలవాచకత్వము, పురాణగౌరవము, పఠనాచమత్కృతి వీనిని గనిపెట్టి మెచ్చుకొని పితృలోకమున భారతమును వ్యాప్తి గావింప నీతనిని నియమించెను. దేవలుఁడు గుర్వనుగ్రహమువలన గురునాజ్ఞఁ దలధరించి పితృలోకమున కేఁగి యట వ్యాసభారతమును బఠించి భారతగౌరవము నట నినుమడింపఁజేసెను. బాల్యముననే యాతఁ డింతటివాఁ డగుటకు వ్యాసగురుకృపయే కారణ మనియు, దేవలుఁడు గురువునకుఁ దగినశిష్యుఁ డనియు నెల్లరును మెచ్చుకొనిరి.

## దేవలుఁడు : జైగీషవ్యుఁడు

దేవలుఁడు మహాతపస్వియై సత్యవ్రతులలో మొదటివాఁడుగ నెల్లరుఁ గొనియాడుచుండ బ్రహ్మనిష్ఠుఁడై యుండెను. ఒకానొకప్పుడు జైగీషవ్యుఁ డనుముని యాతనికడకు విచ్చేసెను. దేవలుఁ డాతని కతిథిసత్కారములు చేసి యాదరించెను. జైగీషవ్యుఁడు దేవలునికడనే యుండి తపస్సు చేసికొందు నని చెప్పఁ

గా దేవలుఁ డాతనికి సమస్తసౌకర్యములు కల్పించి
రించెను. జైగీషవ్యుఁడు మౌనవ్రతమును దాల్చిఁ
మొనరించుచుండెను. దేవలుఁ డామునికి భోజనవేళ
ఫలపుష్పాదులఁ గొని యాతనికడ కేఁగి పూజించి ప
జేసి తిరిగి తనతపోవృత్తిలో నుండువాఁడు. ఈవిధముగ
కతిథిసేవాభాగ్యము, జైగీషవ్యునకు మౌనవృత్తిఁ
రించు నవకాశము కలిగెను.

ఇట్లు కొన్నిసంవత్సరములు గడచెను. జై
మౌనము విడువలేదు; కఠోరతపోదీక్షచే దివ్యతేజస్వి
డెను. దేవలుఁడు నిదివఱకే యనేకసిద్ధులను గాంచి
గతుఁడు కాక పరబ్రహ్మనిష్ఠయందే యుండుచు వచ్చె
నాఁడు జైగీషవ్యునకుఁ దనశక్తులు చూపఁదలఁచి యా
చుచుండఁగ దేవలుఁ డాకాశమార్గమున నేఁగి స
స్నానముచేయ నొక్కచో దిగెను. అప్పటికప్పుడే య
ముచేసి జైగీషవ్యుఁడు జపము చేసికొనుచుండుట
కాంచి యాశ్చర్యమందెను. తరువాత నాతఁడు స్నా
ద్యనుష్ఠానములు నిర్వర్తించుకొని తిరిగి తనయాశ్రమ
చేరెను. ఆసరికే జైగీషవ్యుఁడు తనస్థానమునఁ గ
యుంటఁ జూచి దేవలుఁ డింకను ఆశ్చర్యపడెను. ది
లుఁడు "ఆహా ! జైగీషవ్యుఁ డత్యంతస్తుతిపాత్రముగు
కలవాఁడే కాని సామాన్యుఁడు కాఁడు. ఈతనికి
చూపి భ్రమగొల్పుద మని యనుకొన్ననాకే యాత
క్తులు చూపి యచ్చెరువందఁజేయుచున్నాఁడు. ఐనను,
యింకను బరీక్షించెదను." అని తలపోసి మంత్రపార

నాతఁడు శరవేగమున నాకాశమున కెగిరిపోయి సిద్ధలోకముఁ జేరెను. అప్పటికే అక్కడ నున్న జైగీషవ్యుని సిద్ధు లెల్లను భయభక్తిశ్రద్ధలతో సేవించుచుండుటఁ గాంచి దేవలుఁ డాశ్చర్యపోయి యటనుండి పితృలోకమునకుఁ బోయెను. అచటను జైగీషవ్యుఁ డధికపూజల నందుట దేవలుఁడు కాంచెను. అంత, దేవలుఁడు యామ్యలోకమునకుఁ బోయెను. జైగీషవ్యుఁ డటకూడ దేవలునకుఁ గానవచ్చెను. దేవలుఁడు మఱింత యచ్చెరువడి సోమలోకమున కేఁగెను. ఆతఁ డేఁగుసరికి జైగీషవ్యుఁడు నట నెల్లరిచే నారాధింపఁబడుచుండెను దేవలుఁ డింకను నద్భుతమంది అగ్నిలోకమునకు, తపోధనలోకమునకు, మిత్రావరుణలోకమునకు, ఆదిత్యలోకమునకు, రుద్రలోకమునకు, వసులోకమునకు, బృహస్పతిలోకమునకు, గోలోకమునకు, బ్రహ్మసత్రిలోకమునకు, పతివ్రతాలోకమునకు, శరవేగమునఁ బోయి యెల్లలోకములను దనకంటె ముందుగా నేఁగి పూజలందుచున్న జైగీషవ్యునిఁ జూచి పరమాశ్చర్యభరితుఁడై యుండ నంత జైగీషవ్యుఁ డదృశ్యుఁ డయ్యెను. ఇఁక, దేవలుఁడు ముందులోకమున కేఁగలేక యచట నున్న సిద్ధపురుషులం బిలిచి "మహాత్ములారా! యోగమూర్తి యైన జైగీషవ్యుఁ డెట కేఁగెను? ఆతని మహాత్త్వము మీ రెఱుఁగుదురా? ఆతఁ డిప్పు డేలోకమున నుండునో చెప్పుఁ"డని కోరెను. వారు దేవలునితో "మునీశ్వరా! జైగీషవ్యుఁడు యోగీశ్వరేశ్వరుఁడు. ఆతఁడు శాశ్వతబ్రహ్మలోకమున కరిగినాఁడు. నీ వింకను గొన్ని వేలసంవత్సరములు తప మొనరించి కాని యాలోకమును జేరఁజాలవు. ఆతనికి నీ యందెంతయో యాదరము కలదు. అందుచేతనే యాతఁడు

నీపూతాశ్రమమునకు విచ్చేసియున్నాఁడు. నీ కతనివలన నింక నెన్ని యోగసిద్ధులు లభింపఁగలవు. పోయి ర మ్మని" వీడ్కొలిపిరి. దేవలుఁడు పరమాశ్చర్య మంది జైగీషవ్యునియందు భక్తి విధేయత లినుమడింపఁ దిరిగి యొక్కొక్కలోకమునుండియుఁ గ్రిందికి దిగుచుఁ దనయోగశక్తి ప్రభావమునఁ దనయాశ్రమమునకు వచ్చిచేరెను. ఆతని కచ్చట సుఖాసనాసీనుఁడై మౌనవ్రతమున నున్న జైగీషవ్యుఁడు కానవచ్చెను.

దేవలుఁడు వెంటనే జైగీషవ్యునికి సాష్టాంగనమస్కార మొనరించి "మహాయోగీ! నీవు సామాన్యునివలె నాయాశ్రమమున కరుదెంచి యాతిథ్యము స్వీకరించితివి. నీమౌనవ్రతనిష్ఠకు మెచ్చి నాయోగశక్తి నీకుఁ జూపి నీకు వలసినశక్తు లనుగ్రహింత మనుకొంటిని. కాని, నాయీయనుభవమున నీవు సర్వసిద్ధుఁడ వనియు, యోగీశ్వరుఁడ వనియు. మహామహుఁడ వనియుఁ దెలిసికొంటిని. నాయందుఁ గటాక్షముంచి నాకుఁ గార్హ్యకార్యస్వరూపము, సన్న్యాసయోగము నెఱిఁగింపు"మని ప్రార్థించెను. జైగీషవ్యుఁడు సంతోషించి మౌనమును విడిచి "దేవలా! నీవు సామాన్యునివలె నన్ను స్తుతించితివి. నీవు తక్కువవాఁడవు కావు. నామౌనవ్రత మింతటితోఁ బూర్తి యైనది. మౌననిష్ఠకు యోగ్యమగుతావు కనుఁగొనలేక నీపూతాశ్రమమునకు వచ్చితిని. నీవు న న్నతిథిసత్కారముల నాదరించి శ్రద్ధాభక్తులఁ బూజించితివి. అందువలన, నాశక్తు లెల్ల నీకును సంక్రమించినవి. శ్రద్ధాభక్తులతో విబుధుల నెవరు పూజింతురో వారికిఁ గోరకుండఁగనే సర్వసిద్ధులు లభించును. అందుచేతనే సాధుసజ్జనసాంగత్యము, పవిత్రజనసేవ, విబుధా

రాధనము వ్యర్థముగాఁ బోవు. అవి సేవించువానియోగ్యతను బట్టి బహుగుణవర్ధిత మగుప్రతిఫలము నాతని కిచ్చితీరును. నీవు కోరినవిషయము లెల్లఁ జెప్పెద" నని యేకాంతమున దేవలునికిఁ గార్యాకార్యస్వరూపము, సన్న్యాసయోగము, మోక్షధర్మములు సవిస్తరముగాఁ దెలిపి దేవలుని కృతార్థు నొనరించెను. అంత, దేవలుఁడు గృహస్థాశ్రమము స్వీకరింప నొల్లక సన్న్యసింపఁ బూని తననిశ్చయమును జైగీషవ్యుని కెఱుకపఱచెను. అంతలో భూతజాతము, పితృవర్గము, నటఁ బ్రత్యక్షమై "దేవలా! మునిశ్రేష్ఠుఁడ వగునీవు గృహస్థాశ్రమమును స్వీకరించి ఆయా కర్మపాలనమున మాకు హవ్యకవ్యము లొసంగుదు వని మేము గంపెడాస నీపైఁ బెట్టుకొని యుండఁగా, నీవు గృహివి కాక సన్న్యసింపఁదలఁచుట మాకు దుఃఖహేతువు కాదా? వంశమున నేమూలనైన నొక్కఁడైన మహానుభావుఁడు పుట్టి భక్తిశ్రద్ధాతాత్పర్యములతో భూతతృప్తి,పితృదేవతారాధనము చేయకపోవునా? మనము తృప్తులమై తరింపకపోవుదుమా? యని మేము చిరకాలమునుండి కనిపెట్టుకొని యున్నాము. మా కిఁక గతి యే"మని యొక్కసారిగా నాక్రోశించెను. అపుడు దేవలుఁడు వారికి నమస్కరించి జైగీషవ్యు ననుమతిఁ గొని మహోత్తమ మగుతనతపస్సును ధారపోసి భూతములకుఁ దృప్తియుఁ బితృదేవతల కుత్తమగతులు చేకూర్చి వారిని సంతుష్టులఁజేసి తాను తుష్టుఁడై పిదప గార్హస్థ్యధర్మమును వెంటనే పరిత్యజించి సన్న్యాసియై మోక్షధర్మమును స్వీకరించెను.

అపుడు బృహస్పతిప్రముఖు లచ్చోటికి వచ్చి దేవల జైగీషవ్యుల నెంతయో స్తుతింపఁదొడఁగిరి. అపు డట నున్న

గాలవముని జైగీషవ్యుఁడు యోగియే కాని తపస్వికాఁ డనియు నాతనిఁ గని దేవలుఁడు మోసపోయె ననియుఁ దపోయోగజ్ఞానములుగలవారే కాని యందే యొక్కటైనఁ గన్నవారు మోక్షార్హులుకారనియు నేమేమో చెప్పఁదొడఁగెను. అప్పుడు బృహస్పతి గాలవునిమాట లర్థరహితము లనియు దేవలజైగీషవ్యు లిరువురు తపోయోగజ్ఞానులే యనియుఁ బేర్కొని జైగీషవ్యదేవలఋషి నివాసస్థానమైన యాప్రదేశము దివ్యతీర్థ మయ్యెనని ప్రశంసించి తక్కుదేవతలతో నిజస్థానమున కేఁగెను.*

జైగీషవ్యునికడ సెలవుగైకొని దేవలుఁడు సింధునదీతీరమునకుఁ జని యటఁ బ్రశాంతముగా మోక్షధర్మమును బాటించుచుండెను.

## దేవల జైగీషవ్యసంవాదము

మఱియొకప్పుడు దేవలుఁడు జైగీషవ్యునితో "మహాత్మా! ఏయాచార మవలంబించుటవలన, నెట్టిశీల మలవఱచుకొనుట వలన, నెటువంటివిద్య నభ్యసించుటవలన, ముక్తి లభించునో తెలుపుము" అని కోరెను.

జైగీషవ్యుఁ "డయ్యా! శాంతిమతు లగుసౌమ్యుల స్థితియే అవలంబింపవలసిన యాచారము.

వినుతించిన నిందించిన
ననఘా! మనమునఁ బ్రియంబు నప్రియమును లే
కునికియు వ్రేసిన నైనను
గనలు వొడమమియుఁ బ్రబుద్ధగణ్యగుణంబుల్
(భార. శాం. ౫. ౨౨)

---

* భారతము. శల్యపర్వము.

ఈగుణము లలవఱచుకొన్న శీలసంపదయే ముక్తిహేతువు. దేనిని గోరుకొనక, యేది లభించిన దానితోఁ దృప్తినంది, లభింపని దానికోసము వగవకుండుటే గొప్పగుణము. ఆర్షమైనయాచార మునందు లాభనష్టములు, మానావమానములు, ఆదరానాదర ములు సమానముగా నిరాదరింపఁబడును. అవమానము లభిం చినపు డమృతముఁ ద్రావినట్లు తృప్తిపడి, గౌరవము లభించు నపుడు మిక్కిలిదుఃఖమందుట శమరతుని స్వభావము. ఇతఁడు చుట్టము ఇతఁడు శత్రుఁడు అనుభావ మెవ్వరియందు నుండక, ఏ సమయమందైనను సంతోష హాని నందక పరిబుద్ధాత్ముఁడు వెలుఁగొందును ఇంద్రియములను జయించి హృదయమునిండ శాంతిసుఖామృతముఁ ద్రావి వికారరహిత మైనవృత్తి నవలం బించిన మహనీయునిపొందు దేవతలకైన నంద సాధ్యముకాదు." అని దేవలుని వీడ్కొని జైగీషవ్యుఁడు యథేచ్ఛముగాఁ జనెను.

## దేవలుఁడు హూహూనామగంధర్వుని శపించుట

'హూహూ' అనుపేరు గలయొకగంధర్వుఁడు తనప్రియ కాంతలతో నొకసరోవరమున జలక్రీడలాడుచునుండెను. ఆసమ యముననే దేవలమహర్షి యాచెఱువులో దిగి స్నానముచేయ నుఁకించిన, హూహూ నీటిలో మునిఁగివచ్చి దేవలునిపాదము పట్టుకొని బాధించెను. దానితో దేవలునికిఁ గోపమువచ్చి "మొస లివలెఁ దన్నుబాధించినహూహూ మొసలియై"పుట్టుఁ గాక !

యని శపించెను. ఆశాపము విని హూహూ భయపడి దేవలుని పాదములపైఁ బడి తన్ను క్షమించి రక్షింపు మని ప్రార్థించెను. అంత నాతఁడు దయదలఁచి "ఓయీ! గంధర్వరాజా! నీవు మొసలివై యొకగజరాజును బట్టుకొని బాధింతువు. అప్పు డా గజరాజు ప్రార్థనమున విష్ణుమూర్తి వచ్చి తనచక్రమున నీతల దునుమును. అపుడు నీవు శాపవిముక్తి నంది నిజరూపమును గాంచి గంధర్వలోకమునకు వచ్చెద'వని చెప్పి వెడలిపోయెను. హూహూ మొసలియై పుట్టి త్రికూటపర్వతప్రాంతమందలియొక సరస్సులో నుండి యందు నీరుద్రావ విచ్చేసినగజరాజును బట్టుకొనెను. ఆగజరాజు సర్వవిధముల దానిపట్టు తప్పించుకొన యత్నించి విఫలుఁడై తుదకు "లావొక్కింతయు లేదు ధైర్యము విలోలంబయ్యె ప్రాణంబులుఁ ఠావుల్ దప్పెను మూర్ఛవచ్చెఁ దనువుఁ డస్సెఁ శ్రమం బయ్యెడిఁ రావే యీశ్వర కావవే వరద సంరక్షింపు భద్రాత్మకా" యని విష్ణుమూర్తిని బ్రార్థించిన నాతఁడు ప్రత్యక్షమై తనచక్రమున మొసలితలఁ దునిమెను. వెంటనే ఆమొసలిరూపమును విడిచి హూహూ అనుగంధర్వుఁడు నిజరూపముఁ దాల్చి తనకట్లుశాపవిమోచనము గావించినవిష్ణుమూర్తిని బరిపరివిధములఁ బ్రస్తుతించి గజరాజును గౌరవించి తిరిగి గంధర్వలోకమునకుఁ బోయి సుఖముండెను.

## దేవలుఁడు వస్త్రోత్పత్తి

దేవలునిగుఱించి దేవాంగపురాణమున నొకకథ కలదు ఇది యెంతవఱకు విశ్వసనీయమో తెలియదు. తొల్లి బ్రహ్మ

దేవుఁడు సర్వమును సృజించి వస్త్రములనుమాత్రము సృజింప
లేకపోయెను. ఆతఁడు శివునికడ కేఁగి వస్త్రములఁ జేయునుపా
యముఁ జెప్పుమని కోరెను. కాని, శివుఁడు తా నాపని చేయ
నిచ్ఛగింపక తనభక్తుఁ డైనదేవలమహర్షికి వలయుశక్తి నిచ్చి
యందులకు నియోగించెను. దేవలుఁడు బయలుదేఱి విష్ణుమూ
ర్తి నాభియందు మెఱయుదారములను గొనివచ్చుటకు విష్ణులోక
మునకుఁ బోవుచుండఁగా దారిలో నెందఱో రాక్షసు లెదురైరి.
వారిబాధలు పడలేక దేవలుఁడు శక్తిని దలఁచుకొనఁగ నామె
వచ్చి యారాక్షసు లెల్లర నొక్కుమ్మడిఁ జంపి యాతనిఁ గాపా
డెను. దేవలుఁడు విష్ణుమూర్తిని బ్రార్థించి దారములను గొని
వచ్చి మేరుపర్వతప్రాంతముల కేఁగి మిగిలినపరికరమునను సం
పాదించి వచ్చి వస్త్రములను దయారు చేసి దేవతల కొసంగెను.
అప్పుడు బ్రహ్మాదిదేవతలెల్లరు దేవలుని స్తుతించిరి.

## రంభాశాపము

దేవలమహర్షి యొకప్పుడు కఠోరదీక్షతో నుండి తపము
చేసికొనుచుండఁగా నచ్చటికి రంభ వచ్చి యాతనిఁజూచి యా
తని దేహసౌందర్యమున కచ్చెరువడి యాతని జేరి 'ఆర్యా! సుం
దరు లగుబృందారకుల నెందఱినో చూచితిని కాని, నీవంటినవ
మోహను నెందును గనియుండలేదు. నాపొందు డొందంబులఁ
గోరి యెందఱో మహానుభావులు తపస్సులు, యాగములు, వీర
కృత్యములు చేసియు నన్నందఁజాలక కుందుచుందురు. నేను నీ
కలభ్యయోగముగ నీమక్కువఁ దగిలి యిక్కడికి వచ్చియు
న్నాను. నీమనోహర మగుశరీరము తపోదీక్షలో నవయఁజేయక

నన్నుఁ జెట్టవట్టి బిగికౌఁగిట గారవించి చిరకాలము మన్మథ మహాసామ్రాజ్యము నేలుమని నిన్నుఁగోరుచున్నాను." అని పలికెను. అందులకు దేవలుఁడు 'అచ్చరమచ్చెకంటీ! నీయంద చందములఁ దగిలి నీయందే డెందములు పొందుపఱచువా రెందఱోయుండఁగా ముక్కుమూసికొని మూలఁగూర్చుండు నన్నేల వలచి వాదులాడెదవు? మేడిపండు చూడ నెంత మేలిమి వలె మిసమిసలాడుచున్నను పొట్ట విచ్చి చూచిన పురుగులే కదా యుండునవి! శరీరము రక్తమాంసాస్థికల్పితము కదా! ఎంతసుందరికైనను రక్తము, మాంసము, ఎముకలు, లేనిశరీరము కలుగునా? నీవు రంభవైనఁ గావచ్చును గాని పరమ జుగుప్సాకరము, మలమూత్రసంయుతము, కర్ణమలనేత్రమల నాసికామలసర్వమలనివాసస్థానమైనపాడుబొందితోడితగులాటము నా కేల? పొమ్మని హుంకరించెను. రంభ యామాటల కెంతయుఁ గనలి రంభ నగు నేను వచ్చి వలచిన నిట్టినిష్ఠురోక్తుల నదలించుట నీబ్రాహ్మణత్వ ఋషిత్వములవలన లభించినగర్వమునఁగదా! కనుక, నీవు శూద్రయోనిం బుట్టు"మని శపించి రంభ వెడలిపోయెను.

రంభశాపముప్రకారము దేవలమహర్షియే శూద్రజన్మముఁదాల్చి దేవాంగకులమున జన్మించి తనకుఁ బూర్వజన్మమున లభ్యమయిన వస్త్రోత్పాదనశక్తిని బలుతెఱఁగుల వృద్ధి చేసి దేవాంగకులమునకు మూలపురుషుఁడై చిరకాలము నివసించెను. దివ్యాంగుఁడు, విమలాంగుఁడు, ధవళాంగుఁ డనువా రీతనికిఁ బుత్రులై పుట్టి నేఁతపనిశ్రమను లోకమున వ్యాపింపఁజేసిరి.

పిదప, శాపవిమోచన మైనపిదప దేవాంగుఁడు ఊర్ధ్వలోకమున కేఁగి దేవలఋషియై దివ్యర్షి యయ్యెను. శేషుఁడు తనకుమారి యగుచంద్రరేఖను, సూర్యుఁడు తనసోదరి యగుదేవదత్తను ఈతనికిచ్చి వివాహముచేసిరి. వీరివలన దేవలుఁడు సంతానముఁ బడసి వంశవర్ధనము జరిగినపిదప సన్న్యసించి మోక్షసామ్రాజ్యమును జూఱగొనెను.

## దేవలస్మృతి

దేవలమహర్షి మహాధర్మశాస్త్ర ప్రతిపాదకుఁడు. ఈతని ధర్మశాస్త్రము బృహద్గ్రంథ మొకటి లభింపవలసియున్నది. ఆనందాశ్రమప్రచురణ మగుదేవలస్మృతిలో ౯౦ శ్లోకములే కలవు. ఇందు మ్లేచ్ఛసంపర్కదోషమునకుఁ బ్రాయశ్చిత్తభాగము మాత్రమే కలదు. ఇదికాక యొకబృహద్గ్రంథము కలదనుటకు యాజ్ఞవల్క్యస్మృతికి వ్యాఖ్యానగ్రంథమగు మితాక్షరమున 1.120 లో శూద్రధర్మములు, వృత్తులు పేర్కొన్నయొకసూత్రము దేవలస్మృతిలోని దని యుదాహరింపఁబడియున్నది.*గృహస్థులిరుతెఱఁగు లని 1.128 లో మఱియొకదేవలసూత్ర ముదా

* తాని చ దేవలోక్తాని. శూద్రధర్మో ద్విజాతిశుశ్రూషా పాపవర్జనం కలత్రాదిపోషణం కర్షణపశుపాలన భారోద్వహనపణ్య వ్యవహార చిత్రకర్మ నృత్యగీతవేణు వీణామురజ మృదంగవాదనాదీని.”

హృతమయియున్నది.‡ అపరార్కమునను స్మృతిచంద్రికలోను మఱికొన్ని దేవలవాక్యములు గలవు. ఇవి యేవియు ప్రస్తుత ముద్రిత దేవలస్మృతిలో లేవు. అందుచే దేవలస్మృతి నిజస్వరూపములో మన కింకను లభింపవలసియున్నది. ఇందు దేవలమహర్షి సర్వధర్మములను బ్రతిపాదించియున్నాఁడు. ఒక్క స్మృతిచంద్రిక యుదాహరించిన శ్లోకములవలననే దేవలమహర్షి ధర్మశాస్త్ర నిష్ణాతుఁడని తేట తెల్లమగుచున్నది.

ఇట్లు దేవలమహర్షి దివ్యర్షి, మహాతపస్వి, యోగీశ్వరుఁడు, ధర్మశాస్త్రప్రవక్త, మహాపురుషుఁడు నయి భారతవర్ష మహర్షులలో మొదటి శ్రేణికిఁ జెందిన వాఁడాయెను.

---

‡ "యథాహి దేవలః ద్వివిధో గృహస్థో యాయావరః శాలీనశ్చ తయోర్యాయావరః ప్రవరః యాజనాధ్యాపన ప్రతిగ్రహారిక్థ సంచయ వర్జనాత్. షట్కర్మాధిష్ఠితః శ్రేయ్యచతుష్పద గృహగ్రామధనధాన్యయుక్తో లోకానువర్తీ శాలీన ఇతి."

† "పతిపత్నీప్రియా సహధర్మచర్యా తత్పూజ్యమాన పూజనమ్" ఇతి స్త్రీధర్మాః.

# శ్రీమహర్షి జీవితకథామృతము

## నరనారాయణమహర్షులు

### స్తుతి

నరనారాయణు లనఁగా
ధర ధర్మునివలన నతనిసరళాక్షికి భూ
భర ముడుపఁ బుట్టె విష్ణువు
పరమం బగుభక్తి వారి భజియింతు నెదన్

### జననము

భగవంతుని యేకవింశత్యవతారములో నరనారాయణావతారము నాల్గవది. ఆదివిష్ణువు భూమిపై నవతరించి యద్వితయమగుతప మొనరించి తత్ప్రభావమున రాక్షసవినాశము లోకసంరక్షణము చేయఁబూని ధర్ముఁడనుమహామహునిభార్య యందుఁ గవలుగా నుదయించెను. ఈకవలకు నరనారాయణు లనుపేరు వచ్చెను.

### తపస్సు

ఒక్కఁడైనవిష్ణువు రెండురూపములఁ దాల్చుటచే వీరిరువురు మనోవాక్కాయకర్మములఁ బరమమిత్రులై బాల్యము నుండియుఁ బరమపవిత్ర మగుబదరికావనమును దమయాశ్రమ ప్రదేశముగాఁ జేసికొని తపోధ్యానానురక్తులై వెలయుచుండిరి. వీ రిట్లు వేయిసంవత్సరములు మహోగ్రమగుతపస్సు చేయఁగా వీరితపశ్శక్తి కింద్రుఁ డసూయపడి మనఃక్షోభ మందెను. పిదప

నిందు్రడు వీరికిఁ దపోవిఘ్న మొనరించి వారిని గామక్రోధ లోభములకుగురి గావింపఁ దలఁచెను.

## ఇంద్రుఁడు తపోవిఘ్న మొనరింపఁదలఁచి విఫలుఁ డగుట

ఇట్లూహించి ఇంద్రుఁడు వెంటనే యైరావతము నెక్కి బదరికాశ్రమముఁ బ్రవేశించి నరనారాయణులఁ జేరి, "ధర్మసుపుత్రు లగుమునులారా! మీ కేకోరిక కోరి యిట్లు తప మొనరించుచున్నారో చెప్పుఁడు. మీకు నేను వర మొసఁగి యాకోరికఁ దీర్తు"నని పలికెను. కాని, ధ్యానస్థితులు,దృఢచిత్తుల వగునామహర్షులు కన్నెత్తిచూడరైరి. ఒకపలుకైనఁ బలుకరైరి. అందుల కింద్రుఁడు కోపించి, వారిధ్యానాసక్తి నశింపఁ జేయ నొకమాయ ఘటించెను. ఆమాయాకారణమునఁ బులులు సింహములు, తోడేళ్లు, చిఱుతపులులు, పాములు, తేళ్లు, వేలకొలఁది బయలుపడెను. ఆకసమునఁ బుష్కలావర్త మేఘములు చేరి గర్జింపఁదొడఁగెను. అడవి యంతయుఁ గార్చిచ్చున నశించుచున్నట్లు కానవచ్చెను. నలుదెసలు నంధకారబంధురము లయ్యెను. ఆకాశమునుండి ఱాళ్ళవాన కురియ నారంభించెను. ఎంతప్రళయముగా నచటఁ గన్పట్టినను నరనారాయణులకుఁ దపోభంగ మించుకంతయైనఁ గలుగదాయెను. ఇందు్రఁడు తన యత్నమంతయు విఫలమయ్యెనే యని విచారించి క్రోధము, అసూయ, పగ మనస్సును గలఁప స్వర్గమున కేఁగెను.

అట నింద్రుఁడు వసంతుని మన్మథుని బిలిచి నరనారాయణులదారుణతపము,తత్తపోభంగ మొనరింపఁ దాను జేసిన ప్రయత్నములు విఫలము లగుటయుఁ దెలిపి మన్మథునితో నిట్లనెను

"హరిహరబ్రహ్మముఖులు నీయంపగముల
దాడి కోర్వక దాసానుదాసులైరి
జగము లన్నియు గెల్చినజాణ వీవు
మనుజు లన నెంతవార లోమదన! నీకు.

(శ్రీ. వెం. కవుల దేవీభాగవతము.)

నీవు మనవసంతునిఁగూడి యప్సరసల నెల్లరఁ గొనిపోయి కార్యసిద్ధి నంది రావలయును. నీయంతవాని కిది యెంత?" యని పలికెను. మన్మథుఁడు "దేవా! నీయానతి తలదాల్ప నసఁజాలను కాని, యామహాత్ములదరిఁ జేరి బ్రదుక సాధ్యము కాదు" అని పలికెను. ఇంద్రుఁ డాతనిని మఱిమఱి బతిమాలుకొనెను. ఇఁక వల్లె యని మన్మథుఁ డంగీకరించెను.

## బదరికాశ్రమమున నకాలవసంతము

ముందు వసంతుఁ డేఁగి బదరికాశ్రమమును బ్రవేశించెను. వెంటనే చిగురుఁగొమ్మలతోఁ దియ్యమామిళ్లు దట్టముగాఁ బుష్పించెను. తుమ్మెదలు పూగుత్తులపై ఝంకారములతో వ్రాలఁ దొడఁగెను. గండుఁగోయిలలు మనోహర మగు కుహూకుహూరావ మొనరించెను. పొగడలు, తమాలములు, మోదుగలు మున్నగునవెల్ల చిగిర్చి పుష్పించెను. లతలన్నియుఁ బుష్పవతులై వృక్షములఁ గౌఁగిలించుకొనెను. మందమారుతములు మంచిగంధపుఁదావితోఁ జెలరేఁగెను. రాలముగ్గినపండ్లు పొడిచి తినుచుఁ జిలుకలగుంపులు కూయఁదొడఁగెను. పండుటాకులమీఁద రాలినపూలగుంపులు పండువెన్నెలభ్రాంతి

నొడఁగూర్చెను. అలుమగలు మల్లెపూల నుల్లసిల్లుచు మదన మంత్రములు పఠింపఁదొడఁగిరి.

ఇట్లుండ మన్మథుఁడు పంచబాణములు నించువిల్లు ధరించి యప్సరసలు తన్ననుసరింప నరనారాయణులయాశ్రమమును బ్రవేశించెను. వెంటనే యప్సరసలు ఱాళ్లు కరఁగునట్లు, మోళ్లు చిగుర్చునట్లు, పుట్టలలో నుండి బయటికి వచ్చి త్రాచులు తలలూఁచునట్లు, కోయిలలు ప్రతిరవ మొనరించునట్లు రమ్యముగా లయతాళధ్వనులఁ బాడఁదొడఁగిరి.

ఈయకాలవసంతోదయమునకు, మంజులగీతములకుఁ, గోకిలారావములకుఁ గన్నులు తెఱచి నలుదెసలు పరికించి నరనారాయణులు విస్మయపడిరి. అంతఁ బదియాఱువేల యేఁబదిమంది మేనకాదు లగునప్సరసలు వెనుకముందు నడవ, తుమ్మెదలనారితోఁ గూడినచెఱకువిల్లు భుజమున విలసిల్ల, తేనె విరజిమ్ము పుష్పబాణము లమ్ములపొదిలో నిండియుండ, కోయిలదండు చిల్కతేజీబారు కలకలమనుచుండ, మన్మథుఁడు వచ్చి కట్టెదుట నిలువఁగా నరనారాయణులు తపము చాలించి కన్నులుపూర్తిగాఁ దెఱచి పరికింపఁదొడఁగిరి. ఇదే సమయ మని యచ్చరమచ్చెకంటులు పాటలుపాడుచు నర్తింపఁదొడఁగిరి. అంత నారాయణుఁడు "ఓయచ్చరలారా! మిమ్ము మాతపోభంగమున కింద్రుఁడు పంపియుండఁబోలును. మీకు స్వాగతము. రండు. అలసితిరి కాఁబోలు. మావిందులు గుడిచి డెందంబులు కందళింపఁ మరలిపొవుదురుగాక" యని పలికి తనకుడితొడఁ గొట్టెను. వెంటనే కోటియప్సరసలచెలువముతో నొక్కచెలువ చెలికత్తెలతోఁ బుట్టెను. ఊరువునుండిపుట్టిన దగుటచే నామెకు "ఊర్వశి" యను

పేరు వచ్చెను. ఊర్వశి చెలికత్తెలతో మునులకు నమస్కరించి యున్నంత, మేనకాదు లగునచ్చరలెల్లను సిగ్గుపడి మునిమహిమకు మెచ్చి వారిపాదములఁ బడి తపోభంగ మొనరింపఁ దలఁచి వచ్చి సినతప్పిదమును క్షమింపుఁ డని ప్రార్థించిరి.

అంత, నారాయణమహర్షి చిఱునవ్వు ముఖపద్మమునఁ జెలువొంద నరుఁడు విన వారితో "కాంతలారా! మీరు వెం టనే ఈయూర్వశిని జెలికత్తెలను దీసికొని మీలోకమున కేఁగి మాకానుకగా మీయింద్రునకు వీరి నొప్పగింపుఁడు. దేవతలకు శుభము లగుఁగాక యనియు దేవేంద్రునకు సుఖమగుఁగాక యనియు మే మాశీర్వదించితి మని చెప్పుఁడు" అని పలికెను. అంత, వారు "మహాత్మా! మీపాదసేవ చేసికొనవచ్చిన మమ్ముఁ బొమ్మనుట ధర్మమా? ఈయూర్వశ్యాదులను స్వ ర్గమునకుఁ బంపి యంతకన్నఁ గోటిరెట్లెక్కువ యగుమీచరణ సమీపదేశమున మే ముందుముః అనుగ్రహింపుఁ" డని కోరిరి. అంత, నారాయణుఁడు 'మీకోరిక యే' మని యడిగెను. వారు 'మహానుభావు లైనమీరు మాకుఁ బతులు కావలయు'నని కో రిరి. అపుడు నారాయణుఁడు నవ్వి "మీచెలువము వమ్మగునట్లు తపఃకృశాంగుల మగు మమ్ముఁ గోరుట యెట్టి వివేకము?" అని పలుకనాయచ్చరలు ముచ్చటలు మీఱఁ జనవుగైకొని సరసా లాపములాడఁదొడఁగిరి. అంత, నారాయణుఁడు తనలో "ఆహా! అహంకారము సంసారవృక్షమునకు మూలము, ధర్మనాశనము నకుఁ దొలికారణము. ఈవేశ్యలు నాతపమునకు భంగ మొనరింప వచ్చి రని యెఱిఁగియు వీరితో నా కీప్రసంగము లేల? ఊర్వశీ సృష్టి యేల చేసితిని? కోపము నటించి హుంకరించి వీరి నవ

లకుఁ బోఁద్రోలుదును. లేక శపింతు"ననుకొని మరలఁ గోపము విడిచి వారితో "ఓయతివలారా! వ్రతనియమమున నున్న మా కతివలతోఁ బొందు వలదు. మీరు వెంటనే మీవచ్చినచోటికిఁ బొండు. మీరు నన్నుఁ బతిగా వలచితిరి. మీకోరిక కాదనలేను. నేను ద్వాపరయుగమునఁ గృష్ణుఁడనై జన్మించెదను. అపుడు మీరు రాజకన్యలై పుట్టి నన్ను వరించెదరు గాన అపుడు మీ వాంఛ లీడేర్తును. పొం" డని పలుక వారు భయభక్తిసంతోషములు ముప్పిరిగొన సెలవుగైకొని స్వర్గమునకుఁ బోయి దేవపతికి జరిగిన దెల్ల వినిపించి యూర్వశ్యాదుల నొప్పగించిరి. ఇంద్రుఁ డామహర్షులతపఃప్రభావమున కచ్చెరువంది వారిని శ్లాఘించి యూర్వశ్యాదులకు స్వాగతమిచ్చెను. ఆనరనారాయణఋషులు నెప్పటియట్లు మహోగ్రతపోనిష్ఠలో నుండిరి.*

## ప్రహ్లాద నరనారాయణ యుద్ధము

తొల్లి యొకప్పుడు ప్రహ్లాదుఁడు తీర్థయాత్రాచరణాశీలుఁడై పుణ్యనదీనదములఁ గ్రుంకులిడుచు సరస్వతీనదీస్నానమునకు విచ్చేసెను. అతఁ డటఁ దీర్థకృత్యములు నెఱవేర్చి నదీతీరముగఁ బోవుచుండ దారిలో నొకపెద్దమఱ్ఱి, యామఱ్ఱిపై నొకరూపమున నున్న యెన్నో బాణములు గాంచి "ఆహా! ఈప్రాంతము ఋష్యాశ్రమప్రాంతముకదా! ఇచటికీబాణాపరంపర లెట్లు వచ్చినవి! చిత్రముగ నున్న దే!" అని యనుకొనుచుండఁ జెంతఁ గృష్ణాజినములపై యోగధ్యానాసక్తులై, పరతత్త్వైకధ్యానపరులు, ఉన్నతజటాభారవహులు, నగు నిరువురు

* దేవీభాగవతము.

ఋషులం గాంచి "ఓయయ్యలారా! ఈదంభజప మేల? ఇది ధర్మమార్గమా? తపముచేఁత, విల్లుధరించుట, రెండును బరస్పరవిరుద్ధకార్యములుగదా! చాలుఁ జాలును. "మీతపములిఁకఁ గట్టిపెట్టుఁ"డని పలికెను. ఆమాటల కాఋషు లోయీ! మాతపముగొడవ నీ కేల? మేము బ్రాహ్మక్షాత్త్రముల నిష్ణాతుల మగుట నిట్లుంటి మని యనుకొనరాదా? పో పొమ్ము, మిన్నక విప్రవైరమునకు రాకు"మని పలికిరి. ప్రహ్లాదుఁ డలుకతో "ఏమేమీ! మీరే విప్రులు మీదే తపము ననుకొనుచుంటిరా? అంత బ్రాహ్మక్షాత్రముల నిష్ణాతులే రైనచో, ఏదీ చూతము. మీక్షాత్త్రము నాపైఁ జూపఁగలరేని చూపుఁడు. మీపస తెలియును. ముక్కు మూసికొని మూలఁ గూర్చుండుమునుల కీవిల్లమ్ము లేల యని యన్నమాత్రమున మీ కింత చులకనైతినా? మగవారైన మగువలవలెఁ గూర్చుండక లెం"డని హుంకరించెను. అంత నరుఁడు సరే కాచికొమ్మని విల్లందుకొనెను. ప్రహ్లాదుఁడు ధనుష్టంకారము కావించి బాణము తొడిగి నరునిపైఁ బ్రయోగించెను. నరుఁ డాబాణమును నడుమనే త్రుంచెను. ఇటు లారంభమైనయుద్ధము క్రమముగాఁ జిలికిచిలికి గాలివానయై మహాయుద్ధముగాఁ బరిణమించెను. ప్రళయకాలమేఘములవలె గర్జనములు, తీక్ష్ణాస్త్రశస్త్రప్రయోగములు, మాయాకల్పనములు నొకటొక్కటిగా నారంభమై పోరు ఘోర మయ్యెను. దేవత లాకసమునుండి పుష్పవృష్టిఁ గురిపింపఁ దొడఁగిరి. నారాయణుఁడు కూడఁ జేయి చేసికొని ప్రహ్లాదునిపై ననేకబాణములు ప్రయోగించి యాతఁడు ప్రయోగించినబాణముల నుదుమాడుచు వీరవిహార

మొనర్చెను. ఇట్టియుద్ధ మపూర్వము, అసదృశము నని దేవ గంధర్వు లాకసమున నగ్గించిరి. ఇట్లు సహస్రవర్షములు వారి పోరు జరిగెను. ఎవరికిని జయము కలుగదాయెను. ఇంతలో శంఖచక్రగదాపాణియై శ్రీవిష్ణు వచటికి విచ్చేసెను. ప్రహ్లాదుఁడు పోరు మాని భక్తివశంవదుఁడై శ్రీహరిపాదములపై వ్రాలిపోయెను. విష్ణు వాతని లేవనెత్తి "వత్సా! వీరు నా వారు. నీ వెన్నిజన్మములు పోరినను, వారిని గెలువ లేవు. వారిమైత్రి నంది సుఖముండు"మని చెప్పి యదృశ్యుఁ డయ్యెను. ప్రహ్లాదుఁ డాఋషులను నరనారాయణులుగా నెఱిఁగి వారి పాదముల వ్రాలి క్షమాభిక్షముఁ గోరెను. వారు నాతని గ్రుచ్చి కౌఁగిటఁ జేర్చి "ఇది విలాసార్థ మైనపోరుకాని విమనస్కృదయపూరిత మగుపోరు కాదు. నీవు మాభక్తుఁడవు. మిత్రుఁడవు. నీకు శుభ మగుఁ బోయి ర"మ్మని వీడుకొలిపి వారు యథాపూర్వము తపోమగ్నులైరి.*

## నరనారాయణులు సహస్రకవచునిఁ జంపుట

తొల్లి సహస్రకవచుఁ డనురాక్షసుఁ డొకఁ డుండెను. ఆతనికిఁ బుట్టుకతోడనే వేయికవచములు సహజముగా నేర్పడెను. ఆతని జయించుట కెవ్వరికిని సాధ్యము కాకుండెను. ఆతఁడు విజృంభించి లోకముల కుపద్రవము కలిగింపఁజొచ్చెను. ఆతనిఁ జంపుటకు నరనారాయణులు కృతనిశ్చయులైరి. వేయి సంవత్సరములు మహాతప మొనరించినఁగాని యారాక్షసుని జయించుట సాధ్యము కాదని నరనారాయణు లెఱిఁగి సహస్ర కవచుని వధించి లోకక్షేమముఁ గలిగింప మనమున సంకల్పించి

* దేవీభాగవతము

బదరికాశ్రమమునఁ దపమొనరింపఁ జొచ్చిరి. ఈసంగతి విని యారాక్షసుఁడు వీరిపైఁ జనుదెంచెను. అపుడు నరనారాయణు లొకొకొకఁడీతనితో యుద్ధముచేయుచుండఁగా రెండవయాతఁడు తపోనిష్ఠ నుండుచు వచ్చెను. బహువర్షములు వారు మహాతప మొనరించి సహస్రకవచునితో యుద్ధ మొనరించి యాతనికవచ ములలోఁ దొమ్మిదివందలతొంబదితొమ్మిది కవచములనుమా త్రము భేదించిరి. ఇంతలో నాతఁడు చనిపోయి యొంటికవచ ముతోఁ గర్ణుఁడై పుట్టెను. ఈతనిఁ జంపుటకై నరనారాయణులు మరలఁ ఫల్గునకృష్ణులై జనించిరి. తుద కర్జునునిచేతిలో నీతఁడు చనిపోయెను. **నారద నారాయణ సంవాదము**

పూర్వ మొకప్పుడు నారదుఁడు బదరికాశ్రమమునకేతెం చి అవ్యయుఁడు, సనాతనుఁడు, విశ్వాత్ముఁడు నగునారాయణ మహర్షిని భక్తితో సేవించి "మహాత్మా! సిద్ధి నందుటకు దేని నారాధింపవలయునో సెల వి"మ్మని యడిగెను. నారాయణ మహర్షి నారదు నాదరించి "నారదా! ధ్రువము, అచలము, ఇంద్రియాగోచరము, సూక్ష్మము, అనుపమము, అన సర్వము నకు నంతరాత్మయై వెలుఁగు తత్త్వమునే యారాధింపవలయును. అంతకుమించి సేవింపఁదగిన దేదియు లేదు. బ్రహ్మ మొదలు సకలభూతములు ఆతత్త్వమునే పూజింపవలయు"నని చెప్పెను.

అంత, నారదుఁడు "లోకేశ్వరా! నీవు ధర్మలక్ష్మి కావలిగా నిటు జనించితి వని చెప్పుదురు. అసలు మూలాకృతి యెటు లుండునో దయతోఁ దెలుపుము. మూలప్రకృతిఁ గను నట్టి యుపాయ మెఱిఁగింపుము. నేను శ్రోత్రియుఁడను, గురు

* దేవీభాగవతము.

భక్తుఁడను, గదా ! నాకర్హత గల దనుకొందు"నని పలికెను. అందుల కామహర్షి "ఓయీ ? నీకిప్పు డది సాధ్యము కాదు. నీవు చిరకాలము పరమ ఏకాంతికుఁడవై ధ్యాన మొనరింపుము. తరువాత నీ కాపెంపు సంపాదించిపెట్టెద. పొ"మ్మని వీడు కొలిపెను. నారదుఁడు ఆకాశవీధి నేఁగి మేరుపర్వతమున నియతాత్ముఁడై యుండి పాలసముద్రము నుత్తరభాగమున నున్న శ్వేతద్వీపమునందు నిరాహారులు, నింద్రియవృత్తిరహితులు, అస్వేదులు, సుగంధిశ్వేతాంగులు నగుమహనీయులం గాంచి వారు తన్నాదరింపఁ దాను వారికి నమస్కరించి పరమైకాంతికు లగువారికి దవ్వున నిలిచి వారివలెనే తాను నేకాంతికుఁడై దుష్కరతపోనిష్ఠఁ బూని, ఊర్ధ్వబాహుఁడై కదలక మెదలక వివిధనామముల విష్ణుస్తుతి చేయుచుఁ దాను బరవశుఁడై యితరులఁ బరవశులఁజేయుచు ననేకసహస్రవర్షము లట్లుండ శ్వేతద్వీపవాసి యగునారాయణుఁ డాతనికిఁ దోఁచి యాతని సంశయములఁ దీర్చి తత్త్వ ముపదేశించి యట నున్న యేకాంతికులకుఁ దపోభంగము గావింపక పొ"మ్మని యదృశ్యుఁ డయ్యెను.

నారదుఁడు పరమసంతోషభరితుఁడై శరవేగమున బదరికాశ్రమమునకుఁ జనుదెంచి నరనారాయణులకు నమస్కరించిన వా రాతని కాతిథ్య మిచ్చి గౌరవించిరి. పిదప, నారదుఁడు నరనారాయణులతో నిట్లనెను. "మహాత్ములారా ! శ్వేతద్వీపమున నేను గాంచినవిష్ణువు మీవలెనే యుండుటే కాక మీచంద మే యాతనికడ నేను గంటిని. ఆవిష్ణుమూర్తి దయకుఁ బాత్రులైన మహనీయులు తెల్లనివారు, ఇంద్రియములను జయించినవారు,

మానమును దాల్చినవారు. విష్ణువు వారితోడఁ బ్రీతి విహరించు చుండును. ఆ దేవదేవుఁడు నాపైఁ గృపచూపి క్షేత్రజ్ఞప్రకారము సమస్తము తేటతెల్లముగాఁ దెలిపెను. రాఁబోవునాతని యవతారచరిత్రము వినిపించెను. శ్వేతద్వీప మనునది శాంతిస్వరూపము. అచట సూర్యచంద్రులవ్యాప్తియు వాయుదేవునిసంచారము లేవు. ఆలోకనాథునకు ఏకాంతికులకన్నఁ బ్రియతములు లేరు. ఇది యెఱిఁగి నే నేకాంతికుఁడనై యుంటిని. నన్నాతఁడు వీడుకొలుప నిటకు వచ్చితిని. ఇచట మీదయకుఁ బాత్రుఁడనైతిని."

ఆమాటలు విని వారు నారదునితో "నీవు పుణ్యుఁడవు. అచట దేవదేవునిదయఁ బడయుటయు, నాతనితోడిసంభాషణము నన్నియు మే మిట నుండియే కాంచఁగంటిమి. నీవు ధన్యుఁడవు. నీ విచట నుండుము. ఏకాంతివై విష్ణువు నారాధింపు" మని పలికిరి. నారదుఁ డట్లు వేయిదివ్యవర్షములు ఘోరతప మొనరించి యత్యంతశాంతి నంది నరనారాయణుల వీడ్కొని హిమవత్పర్వతమున కేఁగి తనయాశ్రమమునందు బృందారకాదివిశిష్టపూజితుఁడై యుండెను.*

**నరనారాయణులు విశాలుఁ డనురాజుఁ గనికరించుట**

తొల్లి విశాలుఁ డనురాజు సమస్తరాజ్యమును గోలుపోయి శత్రులు నగరము నాక్రమించి తన్నుఁ గెంటివేయ, కాశిచేరి యటనుండి గంధమాదనపర్వతమునందలి యగ్రశిఖరమునఁ గల బదరికావనమున విష్ణుమూర్తి నిగూర్చి ఘోరతప మొనరింపఁజొచ్చెను. కొంతకాలమునకు నరనారాయణు లిరువురు నటకుఁ జను

*భారతము శాంతిపర్వము.

డెంచి యాతనిం గాంచి వరము వేఁడు మనిరి. అంత నాతఁ "డయ్యలారా? నాకువరమను గ్రహింపఁగలవాఁ డొక్క-విష్ణువుతక్క-నన్యులు లేరు మీబోటులతో నాకుఁ బనియే" మని పలికెను. అంత వారు "ఓయీ! నీతపమునకు మెచ్చి నీకోరిక లీడేర్ప విష్ణుమూర్తియే మమ్ముఁ బంప మేము వచ్చినారము. నీకోరికఁ జెప్పిన దీర్తుము. లేకున్న నీకర్మము పో' మ్మనిరి. విశాలుఁడు "ఐనచో శ్రీహరికిఁ బ్రియమగుసమస్తయజ్ఞములు నిర్వర్తించుటకు సరిపడుసమస్తసంపదలు నాకుఁ గావలయు'' నని కోరెను. అంత నరుఁడాతనిఁ జూచి నారాయణుఁ జూపి "రాజా! నారాయణమహర్షి యనునీతఁడు బదరికావనమున మహోగ్రతపము చేయు విష్ణుమూర్తియే. సర్వజ్ఞత్వమును గోరినవా రీతనిని మత్స్యావతారునిగను, కులవృద్ధిఁ గోరినవా రీతనిని కూర్మావతారునిగను, ముక్తికాములు వరాహావతారునిగను, పాపహరణకాములు నృసింహావతారునిగను, పరిజ్ఞానకాములు వామనావతారునిగను, ధనకాములు బలరాముఁడైనయీతని, శత్రుజయకాంక్షులు రామావతారుఁడగు నితని, తనయకాములు బలకృష్ణులైనయీతని, అఖిలజగదపూర్వసౌందర్యకాములు బుద్ధుఁడగునీతని, ఆధిపత్యకాములు కల్కియగునీతనిని సేవింతురు. కావున, నీవు కల్కివ్రతముఁ జేసి కామ్యసిద్ధి నందు" మని చెప్పి నారాయణమహర్షితోఁ గూడి యదృశ్యుఁ డయ్యెను. విశాలరాజు కల్కివ్రత మొనరించి నరనారాయణులకృపవలన సమస్తరాజ్యమును సంపదలను బడయఁగల్గెను. అప్పు డాతఁడు కోరినవిష్ణుయజ్ఞము లొనర్చి సిద్ధినందెను.*

---

*వరాహపురాణము.

# శ్రీమహర్షి జీవితకథామృతము

## పిప్పలాదమహర్షి

### స్తుతి

భారతత్యాగధనులలోఁ బ్రథముఁడగుచు
దివ్యకీర్తిని గన్న దధీచివరుని
యాత్మపత్ని సువర్చయం దలరఁ గన్న
పిప్పలాదమహర్షి సంప్రీతిఁ గొలుతు.

### జననము

సుకన్యాచ్యవనుల పుత్త్రరత్నము దధీచిమహర్షి. దధీచి దేవకార్యమునకై బ్రహ్మేంద్రాదులప్రార్థనము ననుసరించి యోగాగ్నిఁ గల్పించుకొని తనశరీరమును దేవతలకు విడిచి వేసెను. దేవతలు గోగణమును బ్రార్థించి వానిచేఁ బవిత్రము లైనదధీచియెముకలను బ్రహ్మచక్రము, వజ్రాయుధము మున్నగు నాయుధములు చేసికొని వానిమూలమున రాక్షసుల నెల్లర నోడించిరి.

దధీచిమహర్షి చనిపోవుసరి కాతనిభార్య సువర్చ గర్భవతియై యుండెను. అతఁడు దేహత్యాగము చేయుటకుముందే ప్రియపత్నిఁ బిలిచి "సతీ! దేవతాప్రార్థనమున నేను నాదేహమును త్యజించుచున్నాను. నేను నాశరీరమును విడిచినఁ గాని

నాయెముకలు దేవతల కాయుధములు కాఁజాలవు. కానినాఁడు, వారు రాక్షసులను జయింపలేరు. రాక్షసులు నాశనము కానిచోఁ ద్రిలోకములకు ముప్పు తప్పదు. అందుచే లోకహితార్థమై నేను జనిపోవుచున్నాను. లోకక్షేమ ముపేక్షించి రక్తమాంసాస్థికల్పిత మగు ఈ నీచశరీరముపై మమతఁ దగులుటకంటె అవివేక మింకొకటి లేదు. కావున, నేను పెండ్లికిఁ బోవుచున్నట్లు మహోత్సాహముతో ఈపాంచ భౌతిక శరీరమును విడిచి పోవుచున్నాను. ఈశుభసమయమున నీవు కంటఁ దడిపెట్టుకొని దుఃఖపడుట ధర్మము కాదు. ఉత్తమపత్ని వగు నీవు నా కుత్సాహముతో ననుజ్ఞ యిచ్చుటే నాకును నీకును లోకములకును శ్రేయస్కర" మని యామె నొప్పించి యేచని పోయెను. కాని, సువర్చ మహాపతివ్రత కాన నాతఁడు మరణించిన వెనువెంటనే తానును బతితో సహగమింపఁ దలపోసి యొకపిప్పలవృక్షమునీడఁ గూర్చుండి తనగర్భమును జీల్చుకొనెను. అంత నామెకు మహాతేజస్వియై యొకపుత్త్రుఁడు జనియించెను. సువర్చ యాతనిం జూచి "బిడ్డా! వంశోద్ధారకుఁడవగు నీవు జనించుటతో నిఁక నేను జీవించియుండవలసినపని తీరినది. నీవు దానవీరులలో దయావీరులలో నగ్రగణ్యుఁడగు దధీచి మహర్షికి జనించిన పుణ్యపురుషుఁడవు. నీ కిఁక ఈపిప్పల వృక్షమే తల్లియై నిన్నుఁ బెంచును. వత్సా! ఆశీస్సులు. ముద్దుబిడ్డా! నీకు దీవనలు. ఏకారణముచేతఁ గానిమ్ము మన కీస్థితిఁ గొనితెచ్చిన దేవతలు సంతానశూన్యు లగుదురుగాక! నీవు జ్ఞానమూర్తివై వంశగౌరవమును నిలుపుదువుగాక!" యని

చితిలోఁ బడి యసువులఁ బాసి పతివెంట బ్రహ్మలోకమున కేఁగి దివ్యస్థితిఁ గాంచెను.

## బాల్యము

ఇట్లు జనించినబాలుని ఆపిప్పలవృక్షము సువర్చసాఖ్య తన కొప్పగించినట్లు భావించి రాత్రివేళఁ జంద్రునిఁ బ్రార్థించి యాతనివలన నమృతముఁ గొనితెచ్చి యాబాలుని కుగ్గుఁబాలుగాఁ బోసి యాతని కాఁకలిదప్పులు లేకుండఁజేసెను. ఆహా! అచేతనము లైనవస్తువులు సైతము సచేతనములై కన్నతల్లికన్న నెక్కువమేలు చేకూర్చుట మనపవిత్రభారత చరిత్రమున వింత కాదు. ప్రకృతిమాత చల్లగఁ జూడనినాఁడు కన్నతల్లి యేమి చేయఁగలదు? ప్రకృతిమాతశక్తి యట్టిది. ఆమహాశక్తిలో మాతృశక్తి నిబిడీకృతము. ఈవిధముగఁ బిప్పలవృక్షము నీడఁ బిప్పలవృక్షమాత యుగ్గుఁబాలతోఁ బెరిగినవాఁడగుట ఈబాలునికి "పిప్పలుఁడు," "పిప్పలాదుఁడు" అను పేళ్లు వచ్చెను.*

అమృతాస్వాదనమున ఆఁకలిదప్పి తెఱుఁగక శుక్లపక్షక్షపాకరునివలె పిప్పలాదుఁడు చక్కఁగాఁ బెరుగఁజొచ్చెను. తాను బుట్టినచోటగు నావృక్షచ్ఛాయనే ఆశ్రమముగాఁ జేసికొని యామునికుమారుఁడు తపోజీవనమున కలవాటుపడి దివ్యతేజము దివ్యశక్తి నందఁగాంచెను.

## తపస్సు

పిప్పలాదుఁడు కాలక్రమమునఁ దనతల్లిదండ్రులు చనిపోవుటకుఁ గారణము నెఱిఁగి దేవతలపై మిక్కిలి కోపించెను. రాక్షసవధనిమిత్తము ఉపాయాంతరములాలోచింపవలయునే కాని

* స్కాందపురాణము, మాహేశ్వరఖండము, కేదారము.

మహాతపస్వి మహాయోగి యగుతనతండ్రిని ఆతనిమూలమున మహాసాధ్వి యగుతనతల్లిని బొట్టఁబెట్టుకొని తనకుఁదలిదండ్రులు లేనిలోటు కలిగించిరని యాతఁడు దేవతలను గఠినముగా శిక్షింపఁ దలఁచెను.

ఇటులెంచి యాతఁడు తన కమృతమునొసఁగి రక్షించినచంద్రుని బ్రత్యక్షముచేసికొని తనయభిప్రాయ మాతనికిఁ దెలిపి తనకోరిక తీరునుపాయమును జెప్పు మని ప్రార్థించెను. చంద్రుఁడానందించి "వత్సా! నీవు పరమపవిత్ర మగుగోదావరీనదీతీరమున కేఁగి యట శివునిగుఱించి తప మొనరింపుము. ఆతఁడు నీకోరిక తీర్చు"నని యుపాయము చెప్పి వెడలిపోయెను.

పిప్పలాదుఁడు చంద్రుఁడు చెప్పినచొప్పున గోదావరీతీరమున కేఁగి మహాతపస్సు చేసెను. అట ననుక్షణము శివధ్యానము, శివస్తోత్రము, శివోచ్చారణము, శివారాధనము, తప్ప నొం డెఱుంగక యాతఁడు తదేకదీక్షతో నుండెను. అంతఁ గొంతకాలమునకు శివుఁడు ప్రత్యక్షమై "వత్సా! ఏమికోరి నన్నుగుఱించి తపించితి"వని యడిగెను. పిప్పలాదుఁడు "మహేశ్వరా! ఎంతవారికైనను మాతాపితృవియోగము మహాబాధాకరముగదా! అందును గనుతెఱవనిపసికందున కంతకంటె దుఃఖప్రద మేమున్నది? నాకీమహాదుఃఖమును గలిగించినసర్వదేవతలను సమయింపఁ గలయొకకృత్యను బంపి నన్నుఁ గటాక్షింపు" మని కోరెను. శివుఁ డట్లే యని యదృశ్యుఁ డయ్యెను.

## క్షమ

ఈశ్వరునిపంపున నొకకృత్య చనుదెంచి పిప్పలాదుని యాజ్ఞపరికారము దేవతావధోద్యోగ మారంభించెను. ఈసంగతి విని యశేషదేవతాగణములు బ్రహ్మాదిపురస్కృతులై యీశ్వరునికడకుఁ బరుగున విచ్చేసి యాతనిపాదములపైఁ బడి రక్షింప వేఁడుకొనిరి. ఈశ్వరుఁడు వారెల్లర కభయమిచ్చి తాను స్వయముగాఁ బిప్పలాదునికడ కరుదెంచి యనునయించి "వత్సా! దేవతలు లోకపూజ్యులు. వారివినాశమువలన నీ తలిదండ్రులు బ్రతికి రారుకదా! నీతలిదండ్రులు మహాత్యాగనిధులై ఉత్తమలోకములఁ జూఱగొన్నారు. కావున, నీవు వారికై విచారింపకు. వెంటనే సర్వదేవతావధోద్యోగము మానుకొ"మ్మని హితముపదేశించెను. ఆమాటలు విని పిప్పలాదుఁడు "మహాదేవా! సర్వలోకేశ్వరుఁడ వగునీయుపదేశము నేను దప్పక విందును. కాని, ఉత్తమలోకముల నున్ననాతలిదండ్రులఁ జూచి మాటాడఁగలశక్తి ననుగ్రహింపు"మని భయభక్తులతోఁ బ్రార్థించెను. ఈశ్వరుఁ డట్లే యని యాతని కాశక్తి నొసఁగి కృత్య నుపసంహరింపు మనెను. అందులకుఁ బిప్పలాదుఁడు సమర్థుఁడుకాక శివునే యుపసంహరింపఁ గోరెను. శివుఁ డాకృత్యను హిరణ్మయపాత్రముల గంగాదినదులమూలమున సముద్రమునఁ జేర్పుఁ డనియు నది యందు బడబానలముఁ జేసు ననియు దేవతలతోఁ జెప్పి యదృశ్యుఁ డయ్యెను.

పిప్పలాదుఁడు దివ్యశక్తియుతుఁడై పితరు లున్నయుత్తమలోకముల కేఁగి సువర్చాదధీచులతో మాటాడి వారియాశీ

స్సుల నందుకొని వారు వాత్సల్యమునఁ దన్నుఁ బ్రబోధింపఁ దిరిగి తనయాశ్రమమునకు విచ్చేసెను. శివునికృత్యయు గంగాది నదులమూలమున సముద్రమును జేరి యందున్నబడబానలముతోఁ గలిసిపోయెను.

ఈరీతిని పిప్పలాదుఁడు బాల్యముననే శివుని మెప్పించి తలిదండ్రుల నుత్తమలోకములఁ జూచి మాటాడుశక్తి సంపాదించి వారితో మాటాడి వారిప్రబోధమున శాంతచిత్తుఁడై నిజాశ్రమమున మహాతపస్సు చేసికొనుచుండెను. *

## వి వా హ ము

పిప్పలాదుఁడు తపస్సువలన బ్రహ్మజ్ఞానమును సంపాదించి మహోత్తమ మగునాధ్యాత్మవిద్యారహస్యముల నెఱింగి దివ్యతేజస్వియై వెలుంగుచుండెను. ఆతనికి జన్మముతోడనే బంధుమిత్రమమకార మంతరించెను. లోకమంతయు సర్వేశ్వరమయముగా భావించి యాతఁడు సదాశివు నారాధించెను. సంకల్పసిద్ధి నంది యామహర్షి యొకనాఁడు నిజాశ్రమప్రాంగణమున నుండ నిలింపదంపతులు వనవిహారముచేయుచు రమింపుటఁ గాంచెను. ఆక్షణమున నాతనికి వివాహేచ్ఛ కలిగెను. తిరిగి యాతఁడు పుష్పభద్ర మనునదిలో స్నానముచేయ వెడలుచుండెను. దారిలో నాతని కొకజగదేకసుందరి యగుకన్య వనవిహారము చేయుచుఁ జెలికత్తెలతోఁ గానవచ్చెను. పిప్పలాదుఁడు చెలికత్తెలవలన నామె పద్మ యనుపేరు గలఅనవద్య మహీపాలునికూఁతు రని తెలిసికొని స్నానజపాదికములు నిర్వ

* శివపురాణము.

ర్థించుకొని అనవన్యమహీపాలునిగృహమున కేఁగెను. అనవన్యుఁడు స్వాయంభువమను వంశమువాఁడు. ఆతఁడు జితేంద్రియుఁడు, జితాహంకారుఁడు, విష్ణుభక్తుఁడు. భృగుమహర్షి యాధ్వర్యవమున నాతఁ డనేకయజ్ఞము లొనర్చి యింద్రపద మల్పమని తృణీకరించెను. ఇంద్రాదిదేవతావిభులను, బలి మున్నగు రాక్షసేశ్వరులను సంగ్రామముల జయించినమహావీరుఁ డతఁడు. ఆతనికి నూఱుగురుకొడుకులు. ఒక్కతయే కూఁతురు. ఆమె పేరు పద్మ. ఆమె చక్కనిచుక్క. సుగుణములకుఁ జోటు. సౌభాగ్యతకుఁ బెట్టినది పేరు. అన్నివిద్యలలోను అందెవేసినచేయి. అందచందములకు ఆకరము.

అనవన్యుఁడు సపరివారముగా నెదురేఁగి పిప్పలాదమహర్షిని షోడశోపచారములఁ బూజించి యాతఁడు వచ్చినపనిఁ దెలుపు మని ప్రార్థించెను. పిప్పలాదుఁడు సంభాషణాదికముచేఁ గాలముపుచ్చక "నేను కన్యాభిక్షార్థము వచ్చితిని. నీయేకైకపుత్త్రి యగుపద్మను నా కిచ్చి వివాహముచేసి కృతార్థునిఁ జేయు"మని కోరెను. అనవన్యుఁ డాశ్చర్యము, భయము, భక్తి, సంకోచము, నొక్కసారిగాఁ గలుగ నేకైకపుత్రిక యగుసౌందర్యరాశి నొకమునిముచ్చున కిచ్చి యెట్లు పెండ్లిచేయుదు నని వెనుకంజవేసెను. అంతఁ బిప్పలాదుఁడు "ఓయీ! నీకును నాకును లోకమునకును దీనివలన మే లగును. నీపుత్త్రికను నా కిచ్చుటకు సంశయించితివా తరువాత నీవు విచారపడవలసి వచ్చును. భూతభవిష్యద్వర్తమానవేది నగునామాట బొంకఁజేసి నాశముఁ గొనితెచ్చుకొనవల" దని హితబోధ చేసెను.

లివా క్షణమాత్రలో భస్మమై పోదువు. తపఃపూతవిగ్రహుఁడగు పిప్పలాదమహర్షిని అనరానిమాట లంటివి. గుణసౌందర్యము లేని దేహసౌందర్యము మేడిపండువంటిది. అది మూర్ఖులను భ్రాంతి పఱచునే కాని విజ్ఞానుల నాకర్షింపఁజాలదు. స్త్రీలోలుఁడగు వానిస్పర్శమాత్రమున సర్వపుణ్యములు నశించును. పరదారాభిమర్శనునికంటెఁ బాపాత్ముఁ డెవ్వఁడును లేఁడు. నీతోఁ బ్రసంగించుటే నాకుఁ బాపహేతువు. తల్లి నగునాయందు దుష్టభావమున దుడుకులాడితివి. ఆపాపమున నీకుఁ గాలాంతరమున క్షయము కలుగుఁగాక !”యని పలికెను. ఆపతివ్రతాశాపమునకు భయపడి ధర్ముఁడు నిజరూపమునఁ గాననై “సాధ్వీ! పరకాంతలను మాతృభావమునఁ జూచువారిలో మొదటివాఁడను, సర్వశాస్త్రగురుఁడ నగుధర్మదేవుఁడను. నీవు నేను పతివ్రత నని యెఱిఁగి విధిచోదితుఁడనై నినుఁ బరీక్షించుట కిట్లు పలికితిని. అంతేకాని నేను బరస్త్రీలోలుఁడను గా”నని వాక్రుచ్చెను.

పద్మ జగద్గురుఁడైనధర్ముని జూచి నమస్కరించి “దేవా! నీవు సర్వకర్మసాక్షివి. సర్వాంతర్యామివి. సర్వజ్ఞుఁడవు. నీవు నన్నుఁ బరికించుట కట్లంటి వని యెఱుఁగక శాపానలదగ్ధు నొనర్చితిని. పంచభూతములకైన వినాశము కలదుకాని పతివ్రతాశాపమునకు లేదు. నీవు నశించిన సృష్టియే నాశమగును. దీని కొకయుపాయముఁ జెప్పెదను. నీవు కృతయుగమున నాలుగుపాదములతోడను, త్రేతాయుగమున మూఁడుపాదములతోడను, ద్వాపరమున రెండుపాదములతోడను, గలియుగమున నొంటిపాదముతోడను సంచరించెదవు. మరలఁ గృతయుగము రాఁగా నీవు పరిపూర్ణుఁడ వౌదువుగాక! వినను. హరి

భక్త, హరభక్త, యతి బ్రహ్మచారి వానప్రస్థ భిక్షుక పాతివ్రత్య వ్రతులయందును, ధర్మపాలకు లగు రాజులందును, సన్మార్గు లగు వైశ్యులయందును, విప్రసేవకు లైనశూద్రులయందును, నీవు పరిపూర్ణుండవై యుందువు. ప్రతియుగమున నట్టివారే నీ కాధారులై యుందురు. మహాత్మా! అశ్వత్థవటబిల్వతులసీచందన దేవార్చనా పుష్పములయందును, దేవాలయతీర్థ పుణ్యస్థలవేద వేదాంగశ్రవణస్థల, శ్రీకృష్ణనామోక్తశ్రుతిగీతస్థల, వ్రత పూజా తపో యజ్ఞ దీక్షాగోదేహములయందును నీవు నివసించి యుందువు. తండ్రీ! నీకు రక్షణము నొసంగితిని. ఇఁకఁ బతిసేవా స్థలము గృహమున కేఁగెద. సెల విమ్మని కోరిన ధర్ముఁడు సంతోషించి "కాంతా! నీపాతివ్రత్యమునకు మెచ్చితిని. నీకు వర మిచ్చెదను. నీభర్త మార్కండేయమునికన్న నెక్కుడాయుష్మంతుఁడు. కుబేరునికన్న ధనవంతుఁడు, ఇంద్రునికన్న నైశ్వర్యవంతుఁడు. కపిలునికన్న సిద్ధుఁడు, శివసముఁడు, నిత్యయౌవనుఁడు, అధిక సౌందర్యయుతుఁడు నయి వెలయుఁగాక! నీవు సుస్థిరయౌవన భాగ్యము,పతిసేవాభాగ్యము,సత్పుత్రభాగ్యము నంది శాశ్వత కీర్తి నందుదువుగా!"కని యాశీర్వదించి యదృశ్యుఁ డయ్యెను.

## సంతానము

పద్మ పతి కిట్లు మహావరములు గడించి యాశ్రమము నకు విచ్చేసి స్నానజపతపాదులఁ దీర్చి కూర్చుండియున్నభర్త కెఱిఁగి జరిగినయావద్వృత్తాంతమును నివేదించి నిలిచెను. పిప్పలాదుఁ డమితానంద మంది యాలావణ్యసీమ నంకతలమున కాహ్వానించి గౌరవించి "సాధ్వీ! అనుకూలవతి, అభిమానవతి, పతియే సమస్తమని త్రికరణములఁ బూజించువత్ని లభించుట

కంటె నుత్తముఁ డగుమానవునకుఁ గావలయున దేమున్నది? నీకతమునఁ గలిగినయీవరప్రసాదమునకు నేను ఋణపడియున్నా" నని యామెకు మన్ననఁ జూపెను.

తరువాతఁ గాలక్రమమున పిప్పలాదునికృపవలనఁ బ్రహ్మవచోవిశారదులు, పితృతుల్యతేజులు నగుపుత్త్రులను బదుగురఁ బడసి కడుపుచల్లనికాంతగా ఖ్యాతి గాంచెను.

అపిదపఁ బిప్పలాదమహర్షి వానప్రస్థాశ్రమమును స్వీకరించి ఆయాశ్రమవిధుల నిర్వర్తించుచు బ్రహ్మవిద్యాపారంగతుఁడై బహుశిష్యగణ పరివృతుఁడై కాలముపుచ్చుచుండెను. అనేకు లతనికడకు వచ్చి తమతమ సంశయములఁ దీర్చుకొని పోయెడివారు.

## బ్రహ్మజ్ఞానబోధ

ఒకనాఁడు కాత్యాయనమహర్షి సంతతివాఁ డగు కబంధుఁ డనుఋషియు, భృగువంశమువాఁడగు వైదర్భి యనుఋషియు, ఆశ్వలాయన వంశస్థుఁ డగుకౌసల్యుఁ డనుఋషియు గర్గమహర్షి వంశజుఁ డగుసౌర్యాయణిఋషియు, సత్యకాముని సంతతివాఁ డగుశైబ్యుఁ డనుఋషియు, భరద్వాజునివంశజుఁ డగుసుకేశుఁ డనుఋషియుఁ దమకుఁ గలసంశయములఁ దీర్చుకొనుటకై పిప్పలాదునికడకు సమిత్పాణులై వచ్చి యాచించిరి. వారు సగుణబ్రహ్మోపాసన చేసి చిత్తశుద్ధి కలిగి వాసనాత్రయముల నడంచి బ్రహ్మజ్ఞానసంపాదనకై సద్గురువు నన్వేషించి వచ్చి రని యెఱింగియు, పిప్పలాదుఁడు వారితో 'వత్సలారా! మీరు నాకడ నొక్కసంవత్సరము తపస్సు బ్రహ్మచర్యము నవలంబించి శుశ్రూష చేయవలయును. అపిదప మీకుఁ

గలిగినసంశయముల నన్నిటిని నాకుఁ దెలుపవచ్చును. నే నెఱిఁగినంతవఱకు వానిని దీర్ప యత్నించెదను." అని పలికెను. ఆయా ఋషులును సత్యమగు జిజ్ఞాసతోడనే యాతనికడకు దరలేంచిన వారుకాన, నట్లే యని పిప్పలాదునియాశ్రమమున, తపోబ్రహ్మచర్యవ్రతదీక్షాపరులై సంవత్సరకాల ముండి శుశ్రూషలు చేసి యాతనియాదరమునకుఁ బాత్రులైరి.

ఆపిదప నొకనాఁడు స్నానసంధ్యాద్యనుష్ఠానములు తీర్చి సుఖముగాఁ గూర్చుండి యాయాఋగురను సన్నిధికిఁ బిలిచి యొక్కొక్కరే తమకుఁ గలిగినసంశయము లడుగుఁ డని పిప్పలాదుఁడు వారిని గోరెను. తొలుత, కబంధుఁ డిట్లడిగెను. "దేవా! ప్రజాసంసృష్టి యెట్లు జరుగుచున్నది?" దాని కిట్లు పిప్పలాదమహర్షి సమాధానము చెప్పెను. 'సృజింపఁబడవలసిన జీవుల యదృష్టముకతన బ్రహ్మదేవుఁడు సృష్టిచేయ సంకల్పించి మహాతపస్సు చేసి యొకమిథునమును సిద్ధముచేసెను. రయి ప్రాణములే యామిథునము. రయి యనఁగాఁ జంద్రుఁడు; ప్రాణ మనఁగా సూర్యుఁడు. వీరికతముననే సమస్తసృష్టియు జరుగుచున్నది. సూర్యుఁడు తూర్పున నుదయించి యన్నిదిశలకు వ్యాపించి ప్రాణస్వరూప మగునాతఁడు సర్వజీవరాసులప్రాణములను గాపాడచున్నాఁడు. ఈసూర్యుఁడే వైశ్వానరస్వరూపుఁడై సర్వవ్యాపకుఁడు విశ్వరూపుఁడు నగుచున్నాఁడు. ఈతనివలనఁ బ్రాణాగ్నులుదయించుచున్నవి. ఇవి యీతనితేజోమూలమున నెల్లెడల వ్యాపించి జీవుల నుజ్జీవింపఁజేయుచున్నవి.

పరబ్రహ్మము పురుషుఁడై అంతర్యామిగాను గాలరూపమై బహిర్గతముగాను నున్నాఁడు. అంతర్ముఖమునఁ గర్మ

సాక్షి గను, బహిర్గతముగాఁ గాలస్వరూపుఁడుగను నుండియీతఁడు చరాచరప్రపంచమునకు సృష్టిస్థితిలయహేతుభూతుఁ డగుచున్నాఁడు. ఆతఁడు సంవత్సరస్వరూపుఁడై దక్షిణాయనమునఁ బితృయానమార్గమునఁ జంద్రమండలప్రాప్తి, ఉత్తరాయణమున అర్చిరాదిమార్గమున బ్రహ్మలోక ప్రాప్తి కలిగించుచున్నాఁడు. మొదటిది పునరావృత్తి సహితము రెండవది పునరావృత్తిరహితము. మొదటిదానికి యజ్ఞయాగాదులు, వాపీకూపతటాకాది నిర్మాణము మున్నగు ఫలాపేక్షణీయములగు కర్మములు మార్గములు. రెండవదానికిఁ దపోబ్రహ్మచర్య శ్రద్ధాభక్తులు, ఆత్మజ్ఞానము మార్గములు.

సంవత్సరమున నైదుఋతువులు. (హేమంతశిశిరములిటు నొకేఋతువు) పండ్రెండుమాసములు. మాసము ప్రజాపతిస్వరూపము. శుక్లపక్షము ప్రాణస్వరూపము. ఇది శ్రేష్ఠము. దినము ప్రజాపతిస్వరూపము. పగటిభాగము ప్రాణస్వరూపము; ఇది శ్రేష్ఠము. పగటివేళ సంసారప్రవృత్తికి మూలమగు రతికాంక్ష గనువారు ఆయుక్షయము నందుదురు. రాత్రివేళఁ గనువారు బ్రహ్మచర్యఫలమునే కాంతురు. అన్నము ప్రజాపతిస్వరూపము. ఇది ప్రాణస్వరూప మగుపురుషుని శుక్రమును స్త్రీశోణితమునఁ జేర్చినపుడు ప్రజాసంసృష్టి హేతు వగుచున్నది. ఇట్టిప్రజాపతివ్రతానుష్ఠాను లగుసత్యశౌచతపస్సంపన్నుల వలన నుత్తమసంతానము, అది లేనివారివలన నీచసంతానము కలుగుచు మొత్తము ప్రజాసృష్టి యగుచున్నది."

పిదప, భృగువంశ్యుఁ డగువైదర్భి యిట్లు ప్రశ్నించెను. "దేవా! ఈశరీరమును భరించువా రెవరు? దానిని ప్రకాశింపఁ

జేయువా రెవ రెవరు? వారిలో శ్రేష్ఠుఁ డెవరు?" దీనికి మహర్షి పిప్పలాదుఁ డిట్లు బదులుచెప్పెను. "ఈశరీరమును భరించునది ప్రకాశింపఁజేయునది ప్రాణమే. ఒకప్పుడు పంచభూతములు, జ్ఞానేంద్రియకర్మేంద్రియములు వేని కవియే శ్రేష్ఠములనియు తమవల్లనే శరీరము రక్షితమగుచున్న దని యనఁగాఁ బ్రాణ మది కాదనియుఁ దానే యైదువిధముల విభాగించుకొని శరీరమును గాపాడుచున్నా ననెను. కాని, ఇంద్రియము లీమాట నమ్మని కారణమునఁ బ్రాణము శరీరమును విడిచి పోఁబోఁగా దాని వెంట నన్నియుఁ బోవలసివచ్చెను. ఈప్రాణప్రాధాన్యమును బట్టి యింద్రియములు దానిని "నీవలననే అగ్ని తపించుట, సూర్యుఁడు ప్రకాశించుట, ఇంద్రుఁడు పాలించుట, వరుణుఁడు వర్షము గురియుట, వాయువు వీచుట, భూమి భరించుట, అన్నము బలము నిచ్చుట, స్థావరజంగమము లన్నియును జీవించుట జరుగుచున్న' దని స్తుతించెను. సమస్తము ప్రాణముపై నాధారపడి యున్నది. ప్రజాపతి ప్రాణరూపియై దేహమునఁ గలఁడు. ఇంద్రియము లన్నియుఁ బ్రాణవశములు. అగ్నియందుండి యాహారము సమర్పించువాఁ డతఁడే. స్వధాస్వరూపి, తపఃఫలప్రదాత ప్రాణమే. ప్రాణాధారముననే యింద్రుఁడు స్వర్గ మేలుచున్నాఁడు; రుద్రుఁడు లయింపఁజేయుచున్నాఁడు; ప్రాణాధారముననే సూర్యాదిజ్యోతిస్స్వరూపములు ప్రకాశించుచున్నవి; లోకమును ప్రకాశింపఁజేయుచున్నవి. వేయేల? సర్వము ప్రాణవశమే. కావున, ప్రాణమే శరీరమును నిలుపునది; ప్రకాశింపఁజేయునది; శ్రేష్ఠమైనది."

అంత, ఆశ్వలాయనవంశజుఁ డిట్లు ప్రశ్నించెను.
"దేవా ! ప్రాణ మెట్లు పుట్టును? శరీర మెట్లు చొచ్చును ?
ఎట్లు విభజింపఁబడి తనపనులు నెఱవేర్చును ? దానిస్థానస్వరూ
పము లేవి ?" పిప్పలాదుఁ డిట్లు బదులుచెప్పెను. "ఆత్మనుం
డియే ప్రాణముపుట్టును. పురుషునియిచ్ఛనుబట్టి మనస్సు కోరు
టనుబట్టి, అది శరీరముఁ బ్రవేశించును. ప్రాణము, అపానము,
వ్యానము, ఉదానము, సమానము ననునైదు తెఱఁగుల నిది
విభజ్యమానము. ప్రాణము చక్షుశ్శ్రోత్రజిహ్వాఘ్రాణముల
నుండును. అపానము గుహ్యేంద్రియములనుండి శరీరానవస
రము లగుస్థూలపదార్థములను ద్రోసివేయును. సమానము
మధ్యప్రదేశమున నుండి తిన్నయన్నమును జీర్ణింపఁజేసి యారస
మును శరీరమునకుఁ బంచుచున్నది. వ్యానము హృదయము
నుండి బయలుదేఱునూటొక్కనాడులు నొక్కొక్కటి డెబ్బది
రెండువేలుగా మాఱి శరీరమంతటను వ్యాపించియుండుటకుఁ
దోడ్పడుచున్నది. ఉదానము శరీరకర్మవాసనలను దనలోఁ
గలుపుకొని ఆయాజీవులపుణ్యపాపముల కాయాపుణ్యపాపలోక
ములకుఁ గొనిపోవుచున్నది. సూర్యుఁడు ప్రాణమునకు బాహ్య
నివాసస్థానము. ఈతఁడు చక్షురింద్రియమూలమున శరీరమం
దలిప్రాణము ననుగ్రహించును. భూమియందలి దేవత అపా
నము ననుగ్రహించును. భౌతికవాయువు వ్యానమును, మధ్యా
కాశము సమానమును అనుగ్రహించును. ఉదానము దేహ
పతనసమయమునఁ బైకి లేచి పోయి జీవుఁడు సంకల్పించినలోక
మునకుఁ గొనిపోవును. ప్రాణము నిట్టిదానినిగాఁ దెలిసికొని
యుపాసించువారికిని వారిసంతానమునకు నకాలమృత్యుబాధ

లుండవు. ఈప్రాణస్థానస్వరూపములఁ దెలిసినవారు ముక్తి నందుదురు."

అనంతరము గర్గమహర్షిసంతతివాఁ డగుసౌర్యాయణి యిట్లు ప్రశ్నించెను. "దేవా శరీరమున నిద్రించున దేది? మేల్కొనున వేవి? స్వప్న మనునేమి? సుఖమెట్లు కలుగును? దేనియం దన్నియుఁ బ్రవేశించి శాంతినందును?" పిప్పలాదు డిట్లు సమాధానమిచ్చెను. "సూర్యుఁ డస్తమించునపు డాతని కిరణములన్నియు నాయనలో సంతర్భూతమై యదృశ్యమైనట్లు, మరల ఉదయించినపుడు సూర్యునినుండియే వెలువడునట్లు ఇంద్రియములన్నియు మనస్సులో నైక్యమై మనస్సునుండి బయలు వెడలును. మనస్సునం దేకీభావమును బొందుస్థితికే నిద్ర యని పేరు. అపు డింద్రియము లేపనియుఁ జేయవుకాన నిద్రించిన వని యందురు. శరీరమున మేల్కొనునవి ప్రాణాగ్నులు. ఇవి దేహమున నెప్పుడును బనిచేయుచునే యుండును. స్వప్న మనఁ గా మనమిదివఱలోఁ జూచినవానిని, విన్నవానిని, అనుభవించిన వానిని, మఱియితరములను ఉదానము యజమానియైనమనస్సు నకుఁ గనఁబఱచుట. స్వప్నమునుండి గాఢసుషుప్త్యవస్థ పొం దిన ఆత్మసుఖానుభవము కలుగును. స్వప్నమునుండి మెలఁకువకలి గిన, స్వప్నవస్తువు లన్నియు మిథ్యయని తెలియునట్లు సంసార కూపమునుండి గుర్వనుగ్రహమువలన బయటపడ్డ జగన్మిథ్యా త్వము తేటతెల్లమగును. సర్వమును పరమాత్మయందుఁ బ్రవే శించుటవలనే మహాసుఖము కలుగును. పంచభూతములు, తన్మా త్రలగుశబ్దాదులు జ్ఞానేంద్రియకర్మేంద్రియములు, తద్వ్యవహా రము, అంతఃకరణచతుష్టయము, తేజస్స్వభావము, ప్రాణస్వ

భాసము పరమాత్మయందు లయించియుండును. ఈపరమాత్మ
జ్ఞానేంద్రియకర్మేంద్రియాంతఃకరణచతుష్టయ పంచభూతసప్త
ధాతురహితము. ఈయాథార్థ్యమును దెలిసికొనువారే మోక్ష
స్థితి నందుదురు. పరమాత్మ యింద్రియములతోఁ గలిసి తెలి
విగా వ్యాప్తమై సర్వలయస్థాన మగును. ఇది తెలిసినవారు ప
రమాత్మభావమును దెలిసినవారు.'

ఆతరువాత సత్యకామవంశీయుఁ డగు శైబ్యుఁడు "దేవా!
అంత్యకాలమువఱకు ఓంకార ముపాసించినవారేలోకమునకుఁ
బోవుదు''రని ప్రశ్నించెను. పిప్పలాదుఁ డిట్లు సమాధానము
చెప్పెను. "ఓంకారము నొక్కసారియైన నుపాసించువార
ఋగ్వేదాభిమానదేవతకృపవలన మరల మనుష్యులై జన్మి
తురు; ద్విమాత్రికాల ముపాసించువారు యజుర్వేదాభిమా
దేవతవలన చంద్రమండలమున కేఁగి తిరిగి నరలోకమున జన్మి
తురు. త్రిమాత్ర ముపాసించువారు పాపవిముక్తులై సామవేద
భిమానదేవతచే సూర్యమండలమార్గమున బ్రహ్మలోకము
చేరుదురు.''

అనంతరము భరద్వాజవంశీయుఁ డగును కేశుఁ డిట్ల
ప్రశ్నించెను." దేవా! షోడశకళాపురుషుఁ డెవడు? ఆతనిస
్థితి యేమి? పిప్పలాదుఁ డిట్లు బదులుచెప్పెను. "షోడశకళా
పురుషుఁడు శరీరమునందే యున్నాఁడు. షోడశకళలను ప్రకాశి
ంపఁజేయువాఁడు కావున నాపురుషునికి షోడశకళాపురుషుఁ డను
పేరు వచ్చెను. దేహము స్వస్థముగా నుండుట కాధార మ
ప్రాణమునుండి శ్రద్ధ, ఇంద్రియములు, పృథివ్యాదులు, మనస్సు
అన్నము, వీర్యము సమస్తము జనించుచున్నవి. నదు లన్ని

సముద్రమువంకకే ప్రవహించి సముద్రములోఁ గలిసి నామరూపరుచిభేదములు గోలుపోవునట్లు, షోడశకళలు సర్వసాక్షి యగుపురుషునియందుఁ బ్రవేశించి యస్తమించి నామరూపములు గోల్పోయి పురుషునిలో లీనమగును. ఆపురుషుఁడే అమృతస్వరూపుఁడు."

ఈరీతిఁ బిప్పలాదమహర్షి ఆయార్గురుఋషులు నడిగిన సంశయములకుఁ దగినరీతిని సమాధానము చెప్పఁగా వారు సంతసించి సంశయరహితమైనబ్రహ్మజ్ఞానము నాతనివలన గడించి యాతనిని నుతించి వీడ్కొనిపోయిరి.*

బ్రహ్మవేత్త యగు పిప్పలాదమహర్షి చేసిన మోక్షవిద్యామహోపదేశము గర్భోపనిషత్తునందు, యోగమును గూర్చి ఓంకారమునుగూర్చి వెల్లడించినతత్త్వము పరబ్రహ్మోపనిషత్తునందుఁ గలవు.

ఇట్లు పిప్పలాదమహర్షి బ్రహ్మజ్ఞానులలో నగ్రేసరుఁడు, యోగీశ్వరులలో మొదటివాఁడు, మహర్షులలో నుత్తముఁడునై వెలుఁగొందెను.

---

* ప్రశ్నోపనిషత్తు.

# శ్రీ మహర్షి జీవిత కథామృతము

## పులస్త్యమహర్షి

### స్తుతి

"అకలంకసుగుణవరాశ్రితకజన్య దేశ్యమై
యేమౌనిహృదయాబ్జ మింపుగులుకు
త్రిభువనవిమలవారిజవనీహంసమై
యేతపోధనుకీర్తి యెమ్మెఁగాంచు
అజమనఃకమలహర్షాపాదియై యేమ
హర్షిమహాతపం బతిశయిల్లు
సకలమౌనివతంసులకు మేలుబంతియై
యేపుణ్యుదినచర్య యొప్పుఁజెందు
వినతదేవకిరీటభావితసరోజ
రాగరుచిచక్రచక్రచంక్రమణగతుల
నేమునిపదాంబుజము లొప్పు నామహాత్ము"
సంస్తుతింతుఁ బులస్త్యు విశ్వప్రసిద్ధు.

(ఉత్తరరామాయణము. ౧. ౧౧౮.)

### జననము

తొలుదొలుత విష్ణుమూర్తి నాభికమలమునుండి జనించిన బ్రహ్మ యాతనిశాసనమున విశ్వమును సృజింపఁ జిరకాలము మహాతప మొనరించెను. పిదప నాతఁడు సనకసనందనసనాతన సనత్కుమారులను దనసంకల్పముచే సృష్టించెను. వారు సంసార

మొల్లక బాల్యమునుండియు హరిపరతంత్రులై భక్తాగ్రగణ్యులై యుండిరి. తరువాత, బ్రహ్మ వామభాగమునుండి స్వాయంభువ మనువును,శతరూప యనుసుందరిని బుట్టింప వారికి క్రమముగా సమస్తక్షత్రియకులమును జనించెను. పిదప, బ్రహ్మ నుదుటి నుండి యేకాదశరుద్రులను సృజింప వారు క్రోధమూర్తు లైరి. అనంతరము బ్రహ్మ నేత్రములనుండి అత్రిక్రతువులను, నాసిక నుండి అరుణిని, ముఖమునుండి అంగిరసుని, దక్షిణవామపార్శ్వ ములనుండి భృగుదక్షులను, మెడనుండి నారదుని సృజించి కుడిచెవినుండి పులస్త్యుని, ఎడమచెవినుండి పులహుని బుట్టిం చెను.

## తపస్సు

పులస్త్యుఁడు సత్త్వగుణసంపదతో నలరారుచుఁ దండ్రి యగుబ్రహ్మ కన్ని విధముల సమానుఁడై యుండెను. పులస్త్యుఁడు ధర్మతత్పరుఁడై లోకహితముఁ గోరి తండ్రియాజ్ఞచొప్పునఁ దప స్సుచేయుచు మునిముఖ్యులకు మొదటివాఁడు, జ్ఞానసంపదలకు స్థానము, శాంతమునకు నెలవు, కృపకు నివాసస్థానము నయి సూర్యునితో సమాన మగుతేజమున వెలుఁగొందుచుండెను. ఆతఁడు మేరుపర్వతప్రాంతమున నొకయాశ్రమమును నిర్మించు కొని యందుఁ దమోగుణమును పాఱఁదోలి, స్త్రీముఖముఁ గాంచుట కిచ్ఛగింపక, క్రోధమును గామముతోఁ గూడ జయించి అపరశివునివలె నుగ్రమగుతప మొనరింపఁ జొచ్చెను.

## వివాహము

ఈసమయమునఁ గర్దమప్రజాపతి తనకు జనించిన పుత్రి కలను దొమ్మండుగురను బ్రహ్మదేవుని యాజ్ఞచే నవబ్రహ్మలకు

నొసంగ నిశ్చయించి హవిర్భువు అనుతనకూఁతును పులస్త్య మహర్షి కిచ్చి పాణిగ్రహణ మొనరించెను. తపోధ్యానానురక్తుఁ డయ్యుఁ బులస్త్యుఁడు బ్రహ్మయాజ్ఞఁ దలదాల్చి హవిర్భువును వివాహమాడినవెంటనే యత్తమామలయాశీర్వచనము లంది భార్యాసహితుఁడై తనయాశ్రమమునకు వెడలి గృహస్థధర్మ మును నిర్వహించుచుండెను. కాలక్రమమున హవిర్భువు గర్భముఁ దాల్చి అగస్త్యుఁ డనుసుపుత్రునిఁ గాంచెను. ఈపుత్త్రుఁడు కొంతె కాలము పెరిగినపిదప మరణించి మఱియొకజన్మమునుగని తుదకు జఠరాగ్నిరూపియై ప్రవర్తించెను. *

**పులస్త్యుఁడు తృణబిందునియాశ్రమమునఁ దప మొనరించుట**

పిమ్మట, పులస్త్యబ్రహ్మ సంసారమును విడిచి సర్వసంగత్యాగియై తీవ్రతప మొనరింపఁ దృణబిందునియాశ్రమమునకు వచ్చెను. అచట, నాతఁడు మహోగ్రతప మారంభించెన అపుడు :

“వలరాజుకోసమై యలవసంతుఁడు గుంపు
చేసినచిలుక తేజీ లనంగ
వనరాశి నావరించినకరంజక మేఘ
తతి మించుచంచలాలత లనంగ
భువనముల్ భ్రమియించి పూవిల్తు నెలయింప
రతి దాల్చురూపాంతరంబు లనఁగ
మునిచిత్తముల నొంప మనసిజుం డపు డంప
వచ్చుమంత్రాధిదేవత లనంగ

* భాగవతము. చతుర్థస్కంధము. ౨౬

బెళుకుఁజూపులు నొయ్యార మొలుకునడలుఁ
జళుకుఁ దొడలును సిబ్బెంపుఁగులుకుగుబ్బ
లమరునమరాహిఖచరకన్యలు సఖీస
మాజములతోఁ బులస్త్యాశ్రమంబుఁ జేరి.

పాటపాడుదు రొక్కచోట మోడులు పల్ల
వించి కోయిలలకు విందుసేయ
ఆట లాడుదు రొక్కచోటఁ గాంచీఘంటి
కలు మ్రోయ మరుమదావళము లనఁగ
మాటలాడుదు రొక్కచోటఁ జక్కెరవింటి
జాణతేజికిఁ దియ్యఖాణ మొసఁగ
నీటుసేయుదు రొక్కచోటఁ గేళిని మనో
హరుఁ డేడ వలచునో యని చలింప

నగుదు రొకచోటఁ గుముదసంతతులు విరియ
నిలుతు రొకచోట మెట్టతమ్ములు జనింప
ఖచరగంధర్వకిన్నరాంగనలు మీఱి
బ్రహ్మకొడుకుతపోవనాభ్యంతరమున."

(ఉత్తరరామాయణము. ౧. ౧౧౭, ౧౧౮)

అంతేకాక, వా రొండొరులు చూపుకొనుచు ఉద్యాన వన మనోహరతను మించుమునితపోవనమునఁ గలగోరంట, సురపొన్న, తియ్యమామిడి, జాజి, మల్లె, సంపంగి, మున్నగు పూవులను స్తుతించుచు నచట విహరింపఁ జొచ్చిరి.

## పులస్త్యుని శాపము

ముద్దులమూటగట్టునాయువతు లట యౌవనమద ముట్టిపడ విలాసహాసములతో విచ్చలవిడి విహరించుచుండఁ గాంచిన పులస్త్యునికి మనస్సు చలింపఁజొచ్చెను. వెంటనే యాతఁడు తపోవిఘ్నమున కిష్టపడక, ఆకాంతలతో బిగ్గఱగా నిట్లు పలికెను: "ఓలీలావతులారా! ఇదిమొదలు నాకంటఁ బడినస్త్రీకిఁ గన్యాత్వము దూషితమై వెంటనే గర్భము కలుగు" నని శపించెను. ఈమాటలు విన్నిమచ్చెకంటిలు భయపడి వెంటనే యట నుండి వెడలిపోయిరి.

## తృణబిందునిపుత్త్రి గర్భిణియగుట

ఈసంగతి యెఱుఁగక తృణబిందుఁ డనురాజర్షి పుత్త్రి యొకతె, ఒప్పులకుప్పయై చెలికత్తెలతోఁ గూడి వనవిహారము చేయుచుండెను. ఆమెశరీరసౌరభము గుమగుమలాడుచు వాయుదేవునకు గంధవహుఁ డనుబిరుద మిచ్చెను. ఆమెకాంతి లతలు అల్లుకొన్నచెట్లు బంగారుచెట్లుగాఁ దోఁచెను. ఆమె మందహాసకుందములకై మన్మథుఁడు వెదకఁజొచ్చెను. ఆమె కరతలకాంతులు తీఁగలఁ జేరి యెఱ్ఱచిగుళ్ళను బుట్టించునట్లుండెను. ఆమెపలుకులు చిలుకపలుకులవలెను, ఆమెనడలు నెమ్మికొమ్మలనృత్యభంగిమలవలెను, ఆమెనఖరోచులు భూదేవికి గంధముపూయురీతి నుండెను. ఆమెచెలికత్తె యెటకో పోఁగా నామెను వెదకుచు వచ్చి కంచుగీసినకంఠమువంటికఁఠమున జటాశ్రుతి పాఠముచేయుచున్నపులస్త్యబ్రహ్మను, రక్తజటాధరుని, దర్భాసనమునఁ గూర్చుండి, లేడిచర్మమును ధరించియున్నమహనీయుని గాంచెను.

వెంటనే యామెకు నడుము బలిసి, చనుమొనలు నల్లనై,ముఖము తెల్లనై,నడలు మందగించి, మేను కృశించి,అరుచి మించి, నూగారు ఉల్లసించి, ఆయాసము అతిశయించి గర్భసంపద తోఁచెను. అప్పడా చిహ్నములు గాంచి యామె "అయ్యో పరమచిత్రముగ నిట్లగుటకుఁ గారణమేమి ? ఉత్తమరాజర్షికడుపునఁ బుట్టినపట్టి యిట్టిరట్టడిఁ గట్టుకొన్న దని నలుగురు తిట్టిపోయరే ? నే నిచ్చటికి వచ్చినవేళావిశేషమో ? ఓషధులమహిమయో ? అయ్యో ! లేఁబ్రాయపుఁగన్నెనై యిట వచ్చిన నే నిపు డీగర్భముతో నింటి కేఁగుచోఁ గన్నయ్య యేమనును ? కన్నయ్య లేమన్న నేమి చెప్పఁగలను ?" అని చింతించుచు, నింటి కేఁగి తండ్రిముందు నిలిచి కన్నులనీరు కాలువలైపాఱ తలవంచి నిలుచుండ నామెను గాంచి తండ్రి యిట్లనెను. "ఓసీ ! నీ విట్లు కన్యాత్వముననే గర్భవతి వైతివి ? ఏకతెనుఁడు నీకిటు చేసెను ? కులమున కపకీర్తిఁ దెచ్చి తలిదండ్రు లేడ్వ, నలుగుర నవ్వ,బంధువులు తలవంప,ఎవఁడునుబెండ్లాడక జన్మమునష్టియగ నిట్టిపని యెట్లు జరిగినది ?" అని యడుగఁ బుత్రి తా నేపాప మెఱుఁగకపోవుట, చిత్రగతిని జరిగినసంగతి చెప్పెను. తృణబిందుఁ డంత దివ్యదృష్టిఁ గాంచి పులస్త్యబ్రహ్మశాపము, ఆమె యెఱుఁగ కాతనిఁ గాంచుట, అందుచే గర్భమగుట తెలిసి వెంటనే పుత్రికను గైకొని పులస్త్యబ్రహ్మకడ కేఁగి నమస్కరించి కూఁతును జూపి "దేవా ! ఈమె నాపుత్రి. నీకతమున గర్భవతి యయ్యెను. నీ వీమెను బరిగ్రహించి మమ్ముఁ గాపాడు" మని ప్రార్థించెను.

ఇది విని యామహర్షి హర్షించి యామెను భార్యగాఁ బరిగ్రహించెను. తృణబిందుఁ డానందించి పుత్త్రి నాతని కొప్ప గించి డెందమునందలికుందు మాని మందిరమున కరిగెను.

## విశ్రవోబ్రహ్మజననము

నాఁటినుండి యాసతీతిలకము పులస్త్యమహర్షికి సర్వోప చారములు చేయుచు నుండెను.

"స్నానంబు గావించి చనుదెంచునంతలో
జపవేది తగురీతిఁ జక్కఁ జేయు
జపనిష్ఠ యొనరించి చాలించునంతలోఁ
జక్కఁగా దేవపూజకు నమర్చు
దేవపూజ యొనర్చి తిలకించునంతలో
షడ్రసాపూర్ణభోజనము పెట్టు
భోజనంబైకరంబులు కడ్గునంతలోఁ
బర్ణాజినములచేఁ బాన్పొనర్చు
పాన్పుపైఁ జేరునంతలో బడలి రని మ
నంబునఁ దలంచి తాలవృంతమున విసరి
తొడలపై నంఘ్రు లుంచి యొత్తుచు ననేక
సేవ లొనరించుఁ దపసి కచ్చిగురుఁబోఁడి."

(ఉ.రా. ౧.౧౪౫)

ఆమె చెప్పినచో అడిగినదానికి సమాధానము చెప్పుటే కాని ఒకమాటక్కువలాడి యెఱుఁగదు. ఎపు డేది యుచితమో యది భర్త చెప్పకుండఁగనే మనస్సున గ్రహించి యామె మెలఁగు-

చుండెను. ఆమెదీమసము, తాలిమి, వినయము పతియెడ నలరించెను. అందులకుఁ బులస్త్యుఁ డెంతయు సంతసించి యామె కడుపున విశ్రవోబ్రహ్మ జనించు ననియు, నాతనివలన నుభయ వంశములు జగద్విఖ్యాతి నందు ననియుఁ జెప్పి యామె నాదరించెను. పిదప, నొకసుముహూర్తమున తృణబిందునిపుత్త్రి యొక్కసుపుత్త్రుని గాంచెను.

ఆబాలుఁడు మాతృగర్భమున నున్నప్పటినుండియుఁ దండ్రి చదువుశ్రుతులు విన్నవాఁ డగుట నాతనికిఁ బులస్త్యుఁడు 'విశ్రవసుఁ'డని పేరుపెట్టెను. ఈబాలుఁడు శుక్లపక్షచంద్రుని వలెఁ బెరుగుచుఁ దండ్రిని బోలినవిద్యావైదుషి, తపశ్శక్తిఁ గాంచి బాల్యముఁ గడపి:

"పూరుషాకారంబు పొందుత్రయీవిద్య
బాలత్వ మొందినబ్రహ్మచర్య
మాలోకగోచర యాధర్మదేవత
ప్రాణంబు లూనినభవ్యనియమ
మవయవంబులు దాల్చినట్టివైరాగ్యంబు
జంగమస్థితిఁ గన్న శాంతరసము
వైయాత్య మొందినవైదికాచారంబు
బ్రాహ్మణ్య మెనయుకృపాగుణంబు
తానె యన విశ్రవోబ్రహ్మ తల్లిదండ్రు
లనుమతి యొసంగ నొకతపోవనముఁ జేరి
ఆశలు జయించి వెలయు భూమీశులీల
ఆశలు జయించి తపము చేయంగఁ దొడఁగె."

(ఉ. రా. ౧. ౧౫౬.)

ఆతరువాత నీతఁడు దేవవర్ణిని యనునామెను బెండ్లాడి యామె యందుఁ గుబేరుని గాంచెను. విశ్రవుఁడు తరువాతఁ గైకసిని బరిణయమాడి యామెయందు రావణ కుంభకర్ణ విభీషణులను శూర్పణఖను గాంచెను.

## పులస్త్యబ్రహ్మ రావణుని విడిపించుట

రావణుఁడు కాలక్రమమున బ్రహ్మవరగర్వితుఁడై కార్తవీర్యార్జునితో యుద్ధమొనర్ప నాతఁ డీతనిఁ బట్టి చెఱఁబెట్టెను. రావణుఁ డిట్లు చెఱఁబడి యుండఁగా నీవృత్తాంతమంతయు విని పులస్త్యబ్రహ్మ దయదలఁచి మనుమని విడిపింపఁ బూని కార్తవీర్యార్జునివీటి కేఁగి మొగసాల నిలిచెను. ద్వారపాలు రేఁగి తమప్రభువుతోఁ బులస్త్యునిరాక దెలుపఁ గార్తవీర్యార్జునుఁడు సపరివారముగా నెదురేఁగి యాతనిని స్వీకరించి యర్ఘ్యపాద్యాదు లిచ్చి గౌరవించెను. పిదప నాతఁడు పులస్త్యునితో "దేవా! మీ రిచటికి విచ్చేయుటవలన నేను ధన్యుఁడనైతిని. నాకుల మదృష్టముఁ గాంచెను. మిమ్ము సేవించి నేను మహాప్రభవ మందఁగంటి" నని "ఇదిగో. వీరు నాపుత్త్రులు. వీరు మిత్త్రులు. వీ రమాత్యులు. వీరు బంధువులు, వీరు భటులు. మే మందఱము మీయాజ్ఞ నిర్వర్తించెదము. మీవచ్చినపని సెలవీయుఁడని" విన్నవించెను. పులస్త్యుఁ డానందించి "రాజా! నీప్రియోక్తికి భక్తికి యుక్తికి శక్తికి సంతసించితిని. నీవు దేవేంద్రవైభవము ననుభవించుపుణ్యాత్ముఁడవు. రావణుని బట్టి చెఱఁబెట్టితి వని విని యాతనిబంధవిముక్తిఁ గోర నీకడకు వచ్చితిని. అట్లొనరించి నన్నానందింపఁ జేయు"మని పలికెను. కార్తవీర్యార్జునుఁడు వెంటనే రావణుని చెఱనుండి విడిపించి

గౌరవించి యాతని కనేకభూషణముల నొసఁగి సాగనంపెను. పులస్త్యుఁ డిట్లు మనుమని చెఱఁబాపి తాను యథేచ్ఛముగాఁ బోయెను.

**పులస్త్యుఁడు పరాశరునికి వరమిచ్చుట**

తొల్లి విశ్వామిత్రుఁడు వసిష్ఠునితోఁ జిరవైర మూని యాతనిపుత్త్రుల నూర్వురఁ జంపించెను. ఆనూర్వురలో శక్తి మహర్షి మరణించినవేళనే యాతనిభార్యగర్భమునఁ బరాశరుఁడు జన్మించెను. ఈతఁడు తల్లిగర్భమున నున్నప్పుడే వేదశాస్త్రపురాణాదివిద్య లెల్ల నేర్చెను. పిదప నీతఁడు తల్లివలనఁ దండ్రిదారుణమరణవృత్తాంతమును విని కోపపరీభూతచిత్తుఁడై సర్వరాక్షసవధార్థమై యొకమహాసత్ర మారంభించెను. ఆసత్రమున ననేకశతసహస్రసంఖ్యలు గలరాక్షసులు నశించిరి. మిగిలినరాక్షసులు వశిష్ఠునికడ కేఁగి యాతనిపాదములపైఁ బడి రక్షింప వేఁడుకొనిరి. వశిష్ఠుఁడు వారికోరిక మన్నించి మనుమని కడకు వచ్చి "వత్సా! నీ విట్లు జీవహింసచేయుట ధర్మము కాదు దీనికిఁ గారణము నీకోపముకదా:

"కోపము గల్గినచోటన
పాపము వర్తిల్లుఁ బాపపరులకుఁ గోప
వ్యాపారంబులె తోఁచును
గోపము పాపంబు నొక్కకుదురై నడచున్.
అపవర్గము స్వర్గంబును
దపమును సుకృతంబు యశము ధర్మముఁ బాపున్
విపులక్రోధము కావునఁ
దపసులకుం గ్రోధ మింత తగునే? తండ్రీ!

(విష్ణుపురాణము. ౧. ౧౭, ౧౯)

అని చెప్పి "నాయనా! నీతండ్రి దివ్యసుఖము లనుభవింపఁ దలఁచి నిమిత్తమాత్రి మగువధమూలమున మరణించెను. ఆతనిఁ జూచుశక్తి నీకు నే నను గ్రహించెదను. కాన, నీవు పరమశాంతుఁడవై నిరపరాధులై దైన్యముతో నున్న రాక్షసుల రక్షింపు"మని కోరెను. ఆమాటలు విని పరాశరుఁడు యాగము నాపివేసి శాంతచిత్తుఁ డయ్యెను. అప్పుడు పరాశరునిపాలికి దైత్యదానవచోదితుఁడై మహామునిగణసమేతుఁడై పులస్త్య బ్రహ్మ విచ్చేసెను. వసిష్ఠుఁ డాతనిఁ గాంచి పలు తెఱఁగుల నర్చించెను. పులస్త్యుఁ డానందించి కూర్చుండి రాక్షసవధహేతు వగు సత్రము మాని ప్రశాంతచిత్తుఁడై యున్నపరాశరుని జూచి "వత్సా! పరమకోపివై యుండియు నీతాత చెప్పినయంతనే వినయవివేకవిలసితుఁడవై యజ్ఞము నాపి నాకెంతో సంతోష మొదవించితివి. నీ కేదైన వర మొసఁగ వలయు నని యుల్లము వ్విళులూరుచున్నది. కాన, నీ కేమి కావలయునో కోరు కొమ్మ"ని పలికెను.

పరాశరుఁడు శ్రద్ధాభక్తివిధేయుఁడై "ఆర్యా! నా మనస్సు నిరంతరము వేదపురాణశాస్త్రక్రియలం దత్యంతాసక్తమై యున్నది. నీవు దయతో నాకు భవ్యజ్ఞానసంసిద్ధియు, వాచామాధురియు, మహాప్రతిభ, వైదగ్ధ్యము, నిచ్చి సంతృప్తు నొనరింపు"మని కోరెను, పులస్త్యుఁ డావర మిచ్చి యాతని వీడ్కొని యేఁగెను. వసిష్ఠుఁడు మనుమని నాశీర్వదించి వెడలెను. నాఁటినుండి పరాశరమహర్షికి సకలవేదపురాణశాస్త్రములు కరతలామలకములై పెంపొందెను.

## భీష్మపులస్త్య సంవాదము

తొల్లి భీష్ముఁడు గంగాద్వారమున నధ్యయన వ్రతపరుఁడై తండ్రికి సకలశుభములు సమకూర్చుటకు శుభకర్మము లొనరించుచు నుండెను. అతని పితృదేవతాభక్తికి, పరమధర్మ చరితమునకు మెచ్చి పులస్త్యమహర్షి యాతనిఁజూడ నేతెంచెను. అతిభక్తితో నాతెనికి భీష్ముఁ డతిథిసత్కారము లొనరించి పూజించి యాతనిపాదపద్మములను శిరమున నిడుకొని "మహర్షీ! నేను భీష్ముఁడను. నీదాసుఁడను. ఆజ్ఞాపింపు"మనెను. పులస్త్యుఁ డాతని వినయవిధేయతలకు మెచ్చి యాతనిపితృభక్తి, వ్రతదీక్ష నభినందించి "భీష్మా ! నే నమోఘుదర్శనుఁడను. నారాక వ్యర్థము కారాదు. నీకుఁ గావలయునది కోరుకొమ్ము, ఇచ్చెద" ననెను. అంత భీష్ముఁడు "దేవా ! నామనస్సు తీర్థసేవాపరాయణమై యున్నది. కావున, నీవు దయయుంచి తీర్థసేవాఫలమును సర్వతీర్థకీర్తనములతో నెఱిఁగింపుము. నీకన్న నుత్తమ తీర్థప్రియుఁడు, తీర్థదర్శి, తీర్థవిజ్ఞాని మఱియొకఁ డేఁడీ ?" అని పలికెను.

పులస్త్యుఁడు ప్రమోదభరితుఁడై యిట్లు చెప్పెను. "భీష్మా ! వినుము. సర్వేంద్రియములను జయించినవారు, అహంకారము, ప్రతిగ్రహాపేక్ష లేనివారు, అల్పభోజనులు, ఆరంభరహితులు నయ్యు నిత్యసంతోషులైనవారు, సత్యవ్రతులు, శుభాచారులు, క్రోధరహితులు, ధర్మతత్త్వవిదులు సర్వతీర్థసేవాఫలమును, సర్వయజ్ఞక్రియాఫలమును బడయుదురు. ఇఁకఁ బుణ్యతీర్థములు వానివానిఫలములు తెలిపెద వినుము. పుష్కర మనుతీర్థము సర్వతీర్థములందును శ్రేష్ఠము.

దీనిని సేవించువారికి సర్వక్రతుఫలము లభించును. బ్రహ్మ
లోకప్రాప్తి కలుగును. జంబూమార్గము, తండులికాశ్రమము,
అగస్త్యసరము, మున్నగుతీర్థములాడిన అశ్వమేధఫల మగు
కణ్వాశ్రమము, ధర్మారణ్యము మున్నగుతీర్థములఁ గన్న వార
సర్వపాపవిముక్తు లగుదురు. నర్మద, దక్షిణసింధు, చర్మణ్వ
వీనియందు స్నానమొనరించినచో అగ్నిష్టోమఫలము కలుగును
వసిష్ఠాశ్రమము, పింగళతీర్థము, ప్రభాసతీర్థము,సరస్వతీసాగ
సంగమము, ద్వారవతీపురమునఁ గలపిండారకతీర్థము మున్నగు
తీర్థములు మిక్కిలిఫలప్రదములు. శంకుకర్ణేశ్వరమున నీశ్వరు
సేవించిన దశాశ్వమేధఫలమగు. శక్రకుమారి, శ్రీకుంజరము
విమలము, మలహరము, దేవిక, రుద్రతీర్థము, వినశనము,
రూపపుష్కరము, రుద్రకోటి యనెడుతీర్థములు మహాఫలప్ర
ములు. కురుక్షేత్రము సర్వతీర్థఫల మొసంగును. అశ్వినీతీర్థ
సోమతీర్థము,రామహ్రదము, మున్నగు ననేకతీర్థములు కల
ఇవి యన్నియుఁ బాపహరములు. తుదకు బ్రహ్మలోకప్రా
కరములు. పృథూదకము వ్యాసాదిమహాయోగుల కాస్
మైన పరమపుణ్యతీర్థము." ఈవిధముగఁ బులస్త్యుఁడు భీష
నకు సర్వతీర్థములను, వానివానిఫలములను సవిస్తరముగా
పించెను. పిదప "వ్రతహీనులు, ఉపవాసపరాఙ్ముఖులు, దు
తులు, శుచిహీనులు తీర్థసేవచేయలేరు. చేసినను వారికి ఫల
లేదు. నీవు గుణశాలివి. ధర్మరతుఁడవు. కాన, సర్వ
యాత్ర చేసి యభీష్టసిద్ధు లందు"మని చెప్పి వెడలిపోయెను
భీష్ముఁడు పులస్త్యుఁడు చెప్పినచొప్పునఁ దీర్ఘయాత్ర లొనరిం
పరమప్రశాంతి గాంచెను.

## పులస్త్యస్మృతి

పులస్త్యమహర్షి ధర్మశాస్త్రవేత్త. ఈతనిస్మృతికే "పులస్త్యస్మృతి"యని పేరు. ఈస్మృతి మనకింకను సమగ్రముగా లభింపలేదు. అటనట భాష్యకారు లుదాహరించిన శ్లోకములను బట్టియే ఈస్మృతి స్వభావమును మనము గ్రహింపవలసియున్నది. శారీరశౌచ ప్రకరణమున విశ్వరూపుఁడు పులస్త్యస్మృతిలోని యొకశ్లోక ముదాహరించెను.* శ్రాద్ధకాలమున బ్రాహ్మణులు శాకాహారదానము, క్షత్రియవైశ్యులు మాంసాహారదానము, శూద్రులు మధుప్రదానము చేయవలయునని పులస్త్యస్మృతిలోఁ గలదని మితాక్షరమునఁ గలదు.* అందే పండ్రెండువిధములైన మద్యములు పులస్త్యస్మృతిలో వివరింపఁబడెనని కలదు.† మఱియు అపరార్కమున సంధ్య, శ్రాద్ధ అశౌచ, విషయములపై పులస్త్యస్మృతినుండి యుదాహరణములు కలవు. ఇందే, జ్ఞానకర్మలు రెండునుగలిసిననే ప్రయోజనకరము లని పులస్త్యస్మృతినుండి యుదాహరింపఁబడినది. పక్షియొక్క ఱెక్కతో నెగురలేనట్లు, జీవి జ్ఞానకర్మలలో

---

* "స్నాతకస్యత్రయోమాసే, పంచామాసేన్ని హోత్రిణః [illegible]
సర్వా నేవం గృహస్థేషు, శౌచకల్పాన్ని యోజయేత్." 1-17

* "మున్యన్నం బ్రాహ్మణస్యోక్తం మాంసం క్షత్రియవైశ్యయోః
మధుప్రదానం శూద్రస్య సర్వేషాం చావిరోధి యత్." 1-261.

† "పానసం ద్రాక్ష మాధూకం ఖార్జూరం తాల మైక్షవమ్.
మధూత్థం సైరమారిష్టం మైరేయం నారికేళజం
సమానాని విజానీయా న్మద్యా న్యేకాదశైవతు,
ద్వాదశంతు సురామద్యం సర్వేషామధమం స్మృతమ్." 111-253

నొక్కదానినే యాశ్రయించి మోక్షమందలేఁడు. ‡ ఇట్లే స్మృతి చంద్రికలోను సుమారు నలువది యుదాహరణములు గలవు. వీనివలన పులస్త్యస్మృతిస్వభావస్వరూపములు కొంతవఱకు మనకు గోచరించుచున్నవి.

ఇట్లు, పులస్త్యుఁడు స్మృతికర్త, బ్రహ్మర్షి, మహర్షి, సర్వజ్ఞుఁడు, సర్వదేవపూజనీయుఁడునై వన్నెకెక్కెను.

---

‡ "జ్ఞానకర్మసమాయోగాత్పరం ప్రాప్నోతి పూరుషః
పృథగ్భావాన్న సిధ్యన్తి ఉభే తస్మాత్ సమాశ్రయేత్.
జ్ఞానం ప్రధానం నతు కర్మహీనం కర్మప్రధానం నతుబుద్ధిహీ
తస్మాదుభాభ్యాంతు భవేత్ప్రసిద్ధిర్న హ్యేకపక్షో విహగఃప్రయా
111-57 పుట 911

# శ్రీ మహర్షి జీవిత కథామృతము

## బకదాల్భ్యమహర్షి

### స్తుతి

వింశతిబ్రహ్మకల్పజీవితు వివేక
పారగుని జీర్ణతరవటపర్ణధారి
నాత్మవిజ్ఞాననిస్సంశయక్రియాతి
చతురు బకదాల్భ్యు గొల్తుఁ సంస్తుతుల నతుల

### జననము

అనేకయుగములకుఁ బూర్వ మొకప్పుడు దల్భుఁ డను నొకమహర్షి యుండెను. ఆతఁడు విష్ణుమూర్తిని బ్రార్థించి కల్పాంతకాలములనైన మరణము లేనిచిరంజీవి యగు సుపుత్త్రుని గాంచెను. ఈబాలుఁడు బకపుష్పపేశల మగుమేనితోడను మహాసౌరభముతోడను విరాజిల్లుటచే నీతనికి బకుఁ డని తండ్రి పేరుపెట్టెను. ఈతఁడు బకుఁ డనియు దాల్భ్యుఁ డనియు బకదాల్భ్యుఁ డనియుఁ బిలువఁబడుచుండెను. ఈతనిని మిత్ర యను నొకఋషిపత్నియు గ్లావుఁ డను నామెభర్తయుఁ బెంచుటచే నీతనికి ద్వ్యాముష్యాయణుఁ డనియుఁ బేరువచ్చెను. అనఁగాఁ గన్నతండ్రికిని బెంపుడుతండ్రికిని బుత్త్రుఁడుగా వ్యవహరించువాఁ డనియర్థము. ఇంతేగాక గ్లావుఁ డనియు గ్లావమైత్రేయుఁ డనియు నీతఁడు తన్నుఁ బెంచినతండ్రివలనఁ బేర్లుగాంచెను.

హ్మణసాహాయ్యమున ననంతలక్ష్మీసముపేతులయి సముద్రనేమిభూచక్రమును రక్షించి అక్షయసుఖము లనుభవించిరి. వినీతుఁడయి విప్రులచే ననుశాసితుఁడైనరాజు అలబ్ధలాభము, లబ్ధద్రవ్యపోషణము, దానిని వృద్ధినందించుట యనుమూఁడులాభములను పొందఁగల్గును. సమరరంగమునందలి యేనుఁగున కంకుశమువలె యథేచ్ఛాదృష్టి గలరాజునకు విప్రుఁ డంకుశమై రాజును ధర్మమార్గమునకుఁ ద్రిప్పును. బ్రాహ్మణరహితుఁడయి హీనుఁ డయినరాజును బ్రజ వలవదు. ప్రజానురాగము లేనిరాజురాజ్యము సుస్థిరము కానేరదు. మీరు స్వయము ధర్మాత్ములు; ధౌమ్యాదు లగుమహర్షులు మీకు సహాయులు. అందుచే ధర్మనిత్యులు బ్రాహ్మణప్రియులు నగుమీకు నిరంతరాభ్యుదయపరంపర కలుగు" నని పలికెను. ధర్మరాజాదులు సంతోషించి యామహర్షికి సాష్టాంగ మెఱఁగిరి. ఆతఁడు వారి నాశీర్వదించి వెడలిపోయెను, *

## చిరంజీవిత్వము

బకదాల్భ్యమహర్షి దైవప్రసాదమునఁ జిరంజీవులలో నొకఁడై వివాహ మొల్లక బ్రహ్మచర్యదీక్షానవద్యుఁడై మహాతపస్విగా జీవితమును గడపుచు ననేకయుగములు జీవించెను. ఆతఁడు తరువాత సాగరమధ్యమందలి యొకదీవియందు సర్వమును రోసి మహాజ్ఞానమూర్తియై నివసించుచుండెను.

## కృష్ణార్జునులరాక

ధర్మరా జశ్వమేధయాగము చేయఁబూని యజ్ఞాశ్వమును విడిచినప్పుడు దానిరక్షణకై కృష్ణార్జునులు వెడలిరి.

---

* భారతము అరణ్యపర్వము.

ఆయజ్ఞాశ్వ మనేక దేశములఁ దిర్మ్మరి, యాయాదేశముల రాజులు నయమునఁ గొందఱు భయమునఁ గొందఱు యుద్ధమున నోడి కొందఱు నర్జునునకుఁ గప్పములు కానుకలు సమర్పింపఁగా, తుద కుత్తరసముద్రతీరమునకుఁ జని సాగరమధ్యమున నుఱికెను. అపుడు కృష్ణుఁ డర్జునుని, గిరివనసముద్రాదుల నడ్డులేక నడవఁగలుగురథములు గలమయూరధ్వజ, ప్రద్యుమ్న, హంసధ్వజ, బభ్రువాహనులఁ బురస్కరించుకొని రథముతో సాగరగర్భముం జొచ్చెను. ఆరథమునఁజని వారు సముద్రమునందలి యొకదీవిఁ గని యందుఁ బ్రవేశించిరి. ఆదీవియందే బకదాల్భ్యమహర్షి అనేకయుగములనుండి పెరుఁగుచు వచ్చిన శరీరముతోను, గడ్డముతోను, జడముడులతోను నున్నను కోటిసూర్యులదివ్యతేజముతోఁ బ్రకాశించుచుండెను. ఆతఁడు తనతలపై నెండి వాడి పండిపోయినమఱ్ఱియాకుల నడ్డముగా వైచికొని నిరంతరహరిచరణారవిందభజనానంద నిర్మగ్నుఁడై కోటిచంద్రప్రభాశోభిత మగునగు మొగ మొప్ప, ఆఁకలిదప్పులు, శీతవాతాతపములు, లాభనష్టములు మున్నగునట్టివానివలననైన నించుకైన సంచలన మెఱుంగక బ్రహ్మాసనమున బ్రహ్మనిష్ఠుఁడై యపరబ్రహ్మవలెఁ గూర్చుండియుండెను. ఆమహామహుని దూరమునఁ జూచి కృష్ణార్జునులు, మయూరహంసధ్వజులు ప్రద్యుమ్నబభ్రువాహనులు రథము దిగి యమితశ్రద్ధాభయభక్తులతో మెల్లమెల్లనఁ బాదచారులై శిరములఁ గరములు మొగిడ్చి యాంజలిఁ జేసి సాష్టాంగదండప్రణామము లాచరించిరి. బకదాల్భ్యుఁ డందుల కానందింపక శ్రీకృష్ణుఁ జూచి "ఈవెన్నుని కెన్నివింతలు ? ఈమాఱుమూల నున్న నాకిన్నిగొడవ

లేందులకు? వీరందఱి నిట కేల కొనివచ్చె" నని యసహ్యించుకొనెను.

అంత నర్జునుఁడు నెమ్మదిగా మరల నమ్మహర్షికిం బ్రణమిల్లి "మహాత్మా! కటాక్షింపుఁడు. పాండవేయుఁడ ననుగ్రహింపుఁడు. దేవా! మీశరీరమున నెన్నివింతలు పుట్టినవి! దేహము నలుసందులఁ బుట్టలు మొలిచినవి. ఆపుట్టలలో నెన్ని తోఁపడగలు గలపాము లనేకములు తిరుగుచున్నవి. మీమోఁకాళ్లనుండి మోఁచేతులనుండి యనేకవృక్షములు పుట్టి పెరుగుచున్నవి. ఆచెట్టుకొమ్మలపైఁ బెక్కుపక్షిసంతానములు గూండ్లు కట్టుకొని సుఖజీవనముఁ జేయుచున్నవి. మీరు చివికిపోయిన మట్టియూకులఁ దలమీఁద నిడుకొని హాయిగాఁ గూర్చుండియున్నారు. ఈవింతల పరమార్థమును దెల్పి నన్ననుగ్రహింపుఁడు. ఇవే మీకు నావేఁడికోళ్లు. కోటిమ్రొక్కులు" అని పలికెను. అందుల కామహాత్ముఁడు నవ్వుచు "అర్జునా! నిన్ను నే నెఱుఁగనివాఁడఁ గాను. తొలుత మిమ్ము ద్వైతవనమునఁ గలిసికొని సంభాషించితినిగదా! అప్పు డీజీర్ణశరీరమును దీర్ఘశ్మశ్రుజటావళిని సవదరించి కావరూపమున సామాన్యమునివలె మీసమీపమునకు వచ్చి మిమ్మాశీర్వదించితిని. మీరు ధర్మపరాయణులు. కనుక, మీ రన్న నా కిష్టము. మఱి యిప్పటినా స్థితి యడుగుచుంటివి. వత్సా! శరీరములు క్షణభంగురములు. నీటిలోఁ బొడమినబుడగ లెంతలో నశించుచున్నవో మన మెఱుఁగుదుము. అట్లేకదా మానవదేహములు! ఏక్షణములో నివి నశించునో మన మెఱుఁగము. ఈమూఁడునాళ్ళముచ్చటకై భార్య లని బిడ్డ లని మిత్రు లని బంధువు లని యెందుల కీసంగ

తములు ? ఈసంగములు పెరిగినకొలఁది తఱుఁగని దుఃఖములం గలుగుచునే యుండును. ఈశరీరమే కడు నశాశ్వత మన్నప్పుడు దీనిని బాలపాన్పునఁ బూజించుటకుఁ దూఁగుటూయెలల నూఁగఁ జేయుటకు గృహారామక్షేత్రములను బెక్కుడుముల కిక్కు లగు వానిని సంపాదించుటలో జీవితమును వ్యర్థపుచ్చుటకంటె నవివేక మున్నదే ? మూఁడునాళ్ళపట్టపగ లగుజీవితమున కీరెండునెండు మఱ్ఱియాకులుఁ జాలవా ?" అని పలికెను.

అర్జునుఁ డాశ్చర్యభయభక్తులతో "దేవా ! మీ కెన్ని సంవత్సరములు గడచినవో తెలుపుఁ"డని కోరెను. అంత నామ హాత్ముఁడు "పార్థా ! నేను బుట్టినతరువాత నెందఱో రోమశులు గతించిరి. మార్కండేయు లెందఱు గతించిరో లెక్కచెప్ప లేను. నేను జ్ఞానమెఱిఁగినవెనుక నిరువదిమంది బ్రహ్మలు కడ చనిరి. నీ కొకవిచిత్రవిషయముఁ జెప్పెదను. సావధానుఁడవై వినుము. మున్నొకప్రళయకాలమున నేడుసముద్రములు పొంగిపాఱఁగా పుల్లోకములు నిచటికిఁ దేలి వచ్చినవి. అప్పు డట నొకమఱ్ఱిచెట్టుండెను. దానికొమ్మలు వేయికిఁబైగాఁ గల వు ఒక్కొక్కకొమ్మను వేయేసిబ్రహ్మాండములు వ్రేలాడుచుం డెను. ఆమఱ్ఱిచిటాలురెమ్మను జివరిచిగురున నొక్కచక్కని బాలుఁడు పవ్వళించి తనకుడికాలిబొటనవ్రేలిని నోటఁ బెట్టుకొని చీకుచుచుఁ గెవ్వున నవ్వుచుఁ జివ్వున నేడ్చుచు మరలఁ గెవ్వున నవ్వుచు నాబాలుఁడు నన్నుఁ బ్రియమారఁ జూచి నాభయముఁ బాపి యభయ మొసఁగి రక్షించెను. ఆబాలునిదయవలన నప్ప టిప్రళయకాల ఝంఝామారుతమునఁ గొట్టువడక, సముద్రపు సుడిగుండములలోఁ జిక్కువడక సుఖముగ నుండఁగంటిని. ఆ

గోడవ లన్నియు నిప్పుడు తడవిన మహాగ్రంథము లగును. అర్జునా! కడమాట చెప్పుచున్నాను. దీర్ఘబాహుఁడు, నీలమేఘశ్యామలుఁడు, కమలనేత్రుఁడు, కౌస్తుభాభరణుఁడు, వనమాలికాధారి, పీతాంబరుఁడు మీ బావ యైనయీతఁడే ఆబాలుఁడు. మీసంసర్గమున నిట్టివాఁ డయ్యెను. రమ్మనువారు కాని పొమ్మనువారు కాని లేక సర్వమునకుఁ దానే నాథుఁడై హాయిగాఁ బవళించినయీతనినాభియం దొకపద్మము కలిగెను. దాని నుండినాలుగు మొగములతో నొకబ్రహ్మ పుట్టెను. ఆబ్రహ్మవలన, ఈచరాచరప్రపంచము కలిగెను. దానికిఁ దోడు సర్వకర్త యగు నాచిన్నబాలుఁడు తానే యదువంశమునఁ బుట్టి పదియాఱు వేల నూటయెనుబదిమందిభార్యలను బరిగ్రహించి మీవంటివారిసా విధ్యము లంది సంసారపారావారమునుండి సనకాదుల నుద్ధరించిన సచ్చిదానందస్వరూపుఁడే యీసంసారమునఁ జిక్కుపడి మీవంటివారివెనుకఁ దిరుగుటే కాదు సమయము వచ్చినపుడు సచివుఁడై సారథియై. సేవకుఁడై యీబాధలు కోరి తెచ్చుకొన్నాఁ డని పరిహాసపూర్వకముగాఁ బలికి భక్తిపారవశ్యమున "త్రైలోక్యకుటుంబీ! రావోయి" యని కృష్ణుని జేరఁదీసికొని కౌఁగిటఁ జేర్చి మూర్ధాఘ్రాణ మొనరించి బ్రహ్మానందపరవశుఁ డయ్యెను.

శ్రీకృష్ణుఁ డాఋషితల్లజునకు నమస్కరించి, "మహాభాగా! ఇరువదిబ్రహ్మకల్పములు చూచినపరమేశ్వరుఁడవు నీవు. విశ్వకర్తాగ్రేసరుఁడవు. నీవు కాక విష్ణుదేవుఁ డెవరు? ఒక్కటి నన్నుఁ గోరెద. నీవు ధర్మజునియశ్వమేధయాగము సఫల మగుటకు విచ్చేయవలయును. నీవు వచ్చిననే ఆయాగము ఫలవం

తము. లేనిచో నిష్ఫల"మని పలికెను. అంత నామహర్షి "కృష్ణా! నీవు నన్నీరీతి స్తుతింపకుము. సంస్తుతివలన నెట్టిసత్పురుషుఁడైనను గర్వపర్వత మధిష్ఠించును. అట్టివాని కెప్పుడో యొకప్పుడు పతనము తప్పదు. నేను లెక్కయేమి? బ్రహ్మాదులకే గర్వ ముదయింపఁజేసి వారిగర్వమును జెఱచినపుణ్యపురుషుఁడవు నీ వని నే నెఱుంగుదును" అని పలికెను.

ఆకథ విన సజ్జనుఁడు కుతూహలపడఁగా బకదాల్భ్యు డిట్లు చెప్పెను.

## విష్ణుమహిమ

తొల్లిటియొకబ్రహ్మకల్పమున నెండి చివికినయొక మఱ్ఱియాకుమాటున నుండి నేను దపము చేసికొనుచుండఁగా నొక చతుర్ముఖబ్రహ్మ నాయెదుటఁ బ్రత్యక్షమై "మునీంద్రా! నీతపమునకు సంతోషించితిని. నీకుఁ గావలసినవర మిచ్చెద. కోరుకొ"మ్మని పలికెను. నే నంత "అయ్యా! నే నిరువది బ్రహ్మకల్పములలో నిరువదిబ్రహ్మలను గన్నాఁడను. నీ వందులోఁ గట్టకడపటివాఁడవు. నీ వేమి వరమిచ్చెదవు? నే నేమి కైకొందును? వెఱ్ఱివై వరమిచ్చెద నంటివి కాని" అనఁగా నాతనికిఁ గోపము వచ్చెను. నేను నవ్వుచుంటిని. ఇంతలో మాయిరువురినడుమఁ గలభూభాగము బ్రద్దలు కాఁగా నందుండి యొకమహోత్పాతవాయువు బయలువెడలి మ మ్మిరువురను వేఱొకబ్రహ్మాండమున నెండుటాకులఁ బాఱవైచినట్లు పాఱవైచెను. మే మిరువుర మాశ్చర్యపడుచుండఁగా మాకడ కెనిమిదిముఖములు గలబ్రహ్మ వచ్చి "వత్సలారా! మీ రెవరు? ఎందుండి యెందుఁ బోవుచు నిందులకు వచ్చి

నా"రని ప్రశ్నించెను. నాలుగుముఖములబ్రహ్మ యిట్లు సమాధాన మిచ్చెను. "అయ్యా! నేను సత్యలోకపాలకుఁడను. చతుర్ముఖబ్రహ్మను. ఈముని నాశిష్యుఁడు" ఆమాటలు విని యాతఁడు "ఓరీకర్త్రా! నీబ్రతుకునకు నీ వేమి? బ్రహ్మ వౌటేమి? సత్యలోకము నేలు టేమి? వెఱ్ఱిమొఱ్ఱివేసములు మాని మీ యిరువురు నాకు శిష్యులై సేవచేయుఁడు. లేదా నాపరితాపము గందు"రని గర్వియై పలికెను. అంత వెనుకటికంటెఁ బెక్కురెట్లు భయంకరమైనమహావాయువు వీచి మమ్ము ముగ్గురను గడ్డిపరకలవలె నెత్తుకొనిపోయి మఱియొకబ్రహ్మాండమునఁ బడవేసెను. అందు మహోన్నతాకారులు మహాత్ములు నగుకొందఱు దివ్యపురుషులు మమ్ముఁ జూచి "మీ రెవ్వ?"రని యడిగిరి. మాలోనియెనిమిదిముఖములబ్రహ్మ 'నేను జగద్విధాతనగుబ్రహ్మ'నని సమాధానము చెప్పఁగా వారు నవ్వుకొని మమ్ము ముగ్గురను దీసికొనిపోయి పదునాఱుముఖములు గల బ్రహ్మముందు నిలిపిరి. ఆతఁడును తీవి మెఱయఁ దనపరిచారకులఁ జూచి ఈముగ్గురు మనకొత్తదాసులు. వారిసేనలఁ గొనుఁడు. వారు మీరుచెప్పిన చొప్పునఁ జేయక మఱుమాటాడిన నాకడకుఁ గొనితెం'డని యాజ్ఞాపించెను. ఇంతలో నతివిత్రముగా మఱియొకమహామారుతము వీచి మమ్ము నలువురను దూదిపింజలనువలె నెత్తుకొనిపోయి మఱియొకబ్రహ్మాండమున ముప్పదిరెండుమోములు గలబ్రహ్మకడఁ బడవైచెను. ఆతఁడును దనపరిచారకులఁ బిలిచి ఈనలువురు మనకుఁ గొత్తదాసులు. వీరిని శిక్షించి పనిగొనుఁ'డని పలికెను. ఇంతలో మఱియొకమహావాయువు వీచి మమ్మైదుగురను మోచుకొనిపోయి

మఱియొకబ్రహ్మాండమున నఱువదినాలుగుమోములు గలబ్రహ్మముందు పాఱవైచెను. అతఁ డీయైదుగురుమూర్ఖులను నేలఁ బెట్టి కాల ఱాచి పనులుగొనుఁ డని యాజ్ఞాపించెను. మేము భయగ్రస్తులమై యుండఁగా మఱియొకమహామారుతము మమ్ముఁ గొనిపోయి నూటయిరువదియెనిమిదిముఖములు గలబ్రహ్మముందు పడవైచెను. ఈప్రకారము బహుముఖబ్రహ్మ లెందఱి కడనో పడవైచి తుట్టతుదకు సనకసనందనాదిసర్వఋషిసేవితుండును సహస్రముఖుండును దుర్నిరీక్ష్య తేజోరాశియు నైన వేయిమోములు గలవానిముందు పడవేసెను. మ మ్మందఱఁ జూచి యాతఁ డెదురువచ్చి యాహ్వానించి యర్ఘ్యపాద్యాదుల గౌరవించి యోగక్షేమము లడిగి 'మహాత్ములారా! మీకృపచే నీలోకమున నధికారము చేయుచుంటిని. నేను నాపరివారము నాసర్వస్వము మీయధీనములే. న న్నేదేని మీ సేవలో నియోగించి ధన్యుని జేయుఁడు' అని వారికి మ్రొక్కెను. అంత బ్రహ్మ లందఱు సిగ్గుపడి తమతమగర్వము లుడిగి లెంపలు వైచుకొని యహంకారము నశింప నాతనికి సాష్టాంగ మెఱఁగి "మహాపురుషా! దేవాదిదేవా! నీవు విష్ణుమూర్తివి. నీయైశ్వర్య మపారము. నీమహిమ మనంతము. మహాసముద్రమున నురుఁగు,బుడగలు, పుట్టునట్లు నీయందు సమస్తబ్రహ్మాండములు పుట్టుచు గిట్టు చుండును. మామాయహంకారము నడంచి రక్షించినతండ్రివి. మమ్ము క్షమించి వీడ్కొలుపు" మని ప్రార్థించిరి. ఆతఁడు వారివారిని వారివారిస్థానములకుఁ బంపివేసి నన్ను మిక్కిలి మక్కువఁ జూచి యిటకుఁ బంపెను. అర్జునా! గర్వ మెవ్వరికిని గలిసిరాదు. గర్వపర్వత మెక్కి బ్రహ్మ

దుతే పూచికపుల్లకైనఁ గొఱకాకపోయి రన్న నీక నస్మదాదులఁగూర్చి పలుకనేల ? ఈయనుభవముఁ గన్న నన్నివెన్నఁడెంతపొగడినను నాకు గర్వ ముదయింప దని పలికెను. కృష్ణార్జును లాతని నెన్నివిధములనో స్తుతించి ధర్మజునియశ్వమేధమునకు రాక తప్ప దని ప్రార్థించిరి. వారిమాట కాదనఁజాలక యామహాత్ముఁ డంగీకరించెను.

## అశ్వమేధయాగము చేయించుట

అంతఁ గృష్ణార్జును లామహాత్ము నొకదివ్యసుందరసనరత్నస్థగిత మగుపల్లకియందుఁ గూర్చుండఁజేసి యాగాశ్వమును దరలించుకొని సముద్రము వెలువడి చతురంగసేనాసమేతులై ముందునకుఁ బోయిరి. తదనంతరము యాగాశ్వమును విడిచి సంవత్సరకాలము పూర్తియగుటచేఁ గృష్ణార్జునులు సేనానీకమును యాగాశ్వమును హస్తినాపురివైపు మరల్చిరి. ముందుగా శ్రీకృష్ణుఁ డేఁగి ధర్మజునితో యావద్వృత్తాంతముఁ దెల్పి యాగహయముతో బకదాల్భ్యమునీశ్వరునితో నర్జునుఁడువచ్చుచుండుటఁ దెలిపెను. అంతఁ గరిపురము సమస్తోత్సవములతోడను విలసిల్లుచుండ యాగహయసమేతము అర్జునాదులెల్లరుఁ బురప్రవేశము చేసిరి. భీమసేననకులసహదేవముఖ్యులు బకదాల్భ్యమహర్షి కెదురేఁగి మహానమస్కారసముచితసత్కారసముపేతముగా నాతని నొకప్రత్యేకసౌధమున విడియించి సర్వసత్కారములు చేయఁదొడఁగిరి.

పిదప, యజ్ఞసుముహూర్త మేతెంచిన ద్రౌపది బంగరుపుటికలలో నానావిధములైనవిత్తనములు గొని, కృష్ణుఁడు తన వెనుక వచ్చుచుండఁగా, ధర్మరాజు బంగరునాఁగలికి ఆఱుదివ్య

వృషభములఁ బూన్చి యాగభూమి దున్నఁగా విత్తనములు మహామునీంద్రమంత్రపూతము లైనపిదప నాయాతావుల నుంచెను. అంత ధర్మనందనుని బహుపుణ్యజలములచే కుంతీ, దేవకి, యశోద అభిషేకించిరి. ఋత్విజులు శాస్త్రోక్తముగా వేదిక లమర్చి యజ్ఞపాత్రముల నుంచి సర్వము సిద్ధము చేసిరి. అంత సర్వ ఋషిగణసర్వజనప్రార్థితుఁడై బకదాల్భ్యమహర్షి బ్రహ్మత్వము వహించి వ్యాసమహర్షిని అధ్వర్యువుగను, వసిష్ఠవామదేవగోమశగాలవాదులను ఋత్విజులుగను అరుణీపులహపులస్త్యాదులను మంత్రపాఠకులుగను నియమించి ధర్మజుఁ గుశాసనాసీనుడొనర్చెను. అంత, వ్యాసమహర్షియాజ్ఞచొప్పున అనసూయాత్రిలు, అరుంధతీవసిష్ఠులు, రుక్మిణీకృష్ణులు, హిడింబాభీమసేనులు, సుభద్రార్జునులు, మాయావతీప్రద్యుమ్నులు, ఉషానిరుద్ధులు, ప్రభద్రావృషకేతులు, ప్రభావతీయౌవనాశ్వులు, సునందానీలకేతులు, ధమ్మిల్లానుసాల్వులు మొదలుగా నఱువదినలు పురుదంపతులు పంచపల్లవములతోఁ గూడినకలశములు గైకొని గీతవాద్యనృత్యములతోఁ గుంతీదేవకీయశోదలఁ బురస్కరించుకొని యరిగి బంగరుబిందెలతోఁ బవిత్రోదకములు గొని తెచ్చి ఋత్విజులు వేదమంత్రములు చదువుచుండ ధర్మరాజు నభిషేకము చేసిరి. అంత ధర్మజుఁడు లేచి యాగాశ్వము నభిషేకించి మహామునులం బూజించి సింహాసనములఁ గూర్చుండఁ జేసి యథోచితశాస్త్రీయకర్మముల యాగము నిర్వర్తించెను. బకదాల్భ్యమహర్షి బ్రహ్మ యగుటచే ధర్మజుని యశ్వమేధయాగము నిర్విఘ్నముగా దివ్యవైభవముతోఁ బూర్తి యయ్యెను.

అనంతరము శ్రీకృష్ణాదులు ధర్మజుని, ధర్మజుఁడు బక దాల్భ్యవ్యాసాదిమహర్షులను మిక్కిలి స్తుతించిరి. పిదప, బక దాల్భ్యమహర్షికి బ్రహ్మదక్షిణగా రత్నమయవృషభమును సమర్పించి ధర్మరాజాతనియాశీర్వచనము లందెను. ఈప్రకా రము ధర్మజునియశ్వమేధము నిర్విఘ్నసమాప్తిఁ గావించిన పిదప బకదాల్భ్యమహర్షి యెల్లర వీడుకొని నిజస్థానమున కేఁగి యథాపూర్వముగాఁ దపోజీవనమున నుండెను.

## బకదాల్భ్య తీర్థము

తొల్లి నైమిశారణ్యమందలి మహాఋషులు విశ్వజి ద్యాగ మనుమహాయాగ మొనరించి పిదప ద్వాదశవర్షసత్రి యాగ మొకదాని నారంభించిరి. ఆయాగమునకు వారికిఁ జక్కఁగఁ బెరిఁగి లక్ష్మీసంపన్నము లయినయిరువదియొక్క- కోడెదూడలు కావలసివచ్చెను. అందుకొఱకై యాఋషులు తిరిగితిరిగి పాంచాలదేశము నేలురాజుకడ కేఁగి యాతని నర్థిం చిరి. ఆరాజు ఋషిభక్తుఁ డయ్యు వారుకోరినకోడెలు లేనివాఁ డగుట మిక్కిలి వగచి వారిని క్షమాభిక్షము కోరెను. అపుడు బకదాల్భ్యమహర్షి యాల మందలో నట్టికోడె లెన్నియో యుం డెను. ఆమహర్షి నైమిశారణ్యఋషులఁ బిలిచి వారికి భక్తిపెం పున నాకోడెల సమర్పించి వారిసత్రయాగము నిర్విఘ్నముగా సాఁగుటకు మిక్కిలి తోడ్పడెను. ఋషు లెల్లరు భక్తిశ్రద్ధల నాతని యుపకృతి కెంతయో స్తుతించిరి

కొంతకాలమునకు బకదాల్భ్యుఁడు తనయాలమందలోఁ గోడెలు చాలినన్ని లేనికారణమున నేరాజునైన నడిగి కొన్నిటిఁ దెచ్చుకొందమని యాలోచించెను. ధృతరాష్ట్రుఁ డనురాజున

కెన్నియో యాలమందలు కల వని విని బకుఁ డా రాజుకడ కేఁగి
యాచించెను ఆరాజు మూర్ఖాగ్రేసరుఁడై యట్లే యొసఁగెద
నని చెప్పి యూరకుండెను. తుదకు బకుఁ డడుగఁగాఁ జచ్చి
పడియున్న కోడెమాడలఁ జూపి వానిని గొనిపొమ్మని రాజు
వానిని జూపెను. బకుఁ డందుల కాతనిపైఁ గినిసి "ఓరీమూర్ఖా!
బ్రహ్మవిద్వర్యులతోఁ బరిహాసములఁటరా! నైమిశ ఋషుల
ద్వాదశవార్షికసత్రమునకు విఘ్నము కలుగకుండఁ జూడవలయు
నను సత్సంకల్పముతో నా కున్నకోడెల వారికొసఁగి కోడెలు
లేక ఆలమందలు క్షీణించుచుండఁగా పోనిమ్ము గోసంరక్షణార్థ
మెవరినైన నడిగినఁ దప్పు లే దని వచ్చి నిన్నడుగఁగా నీవు
నన్ను క్షుద్రమార్గమున వెక్కిరింతువా? ఇఁక, నీగతి యే
మగునో కాచికొ"మ్మని చెప్పి సరస్వతీనదీతీరమున కేఁగి యగ్ని
హోత్రునిఁ బ్రజ్వలింపఁజేసి ధృతరాష్ట్రుని దేశమంతయు నశిం-
పఁజేయుటకై యొకగొప్పఆభిచారికహోమ మారంభించెను.
వెనువెంటనే గొడ్డలివ్రేటులఁ గూలువనమువలె ధృతరాష్ట్రుని
రాష్ట్ర మంతరింపఁ జొచ్చెను. వెంటనే తనతప్పిదమును
గ్రహించి సద్బ్రాహ్మణపురస్కృతుఁడై ధృతరాష్ట్రుఁడు బక
దాల్భ్యునిపాలికి శరవేగమునఁ జని "మహాప్రభూ! క్షమిం
పుము. క్షమింపు" మని భూనభోంతరాళములు మాఱుమ్రోఁ
గున నెలుఁగెత్తుచు నాతనిపాదములపైఁ బడి ప్రార్థించెను.
దయామయుఁ డగునాఋషి యాతనిలేవనెత్తి "రాజా! మద
గజములప్రమాదమును వారింప నంకుశ మెట్లో రాజ్యమదాం
ధులైన రాజేభములను మావంటిఋష్యంకుశములే సరిదిద్దవల
యును. లేనినాఁడు మీకుఁ బట్టపగ్గము లుండునే? మూర్ఖా

గ్రేసరుఁడవై యీపేదబాపఁ డేమి చేయఁ గలఁ డనుకొంటివా? మఱికొంతసే పూరకున్నచో నీసర్వస్వము నేమై యుండెడిదో తెలిసికొనియుండెడివాఁడవు. నీ కిప్పటి కైనను బుద్ధివచ్చి వచ్చి పడితివి. క్షమించితిని. నాకోప ముపసంహరించి నీకు మే లొనగూర్తు" నని సర్వశాంతిహోమము జేసి ధృతరాష్ట్రుని నాతని రాష్ట్రమును మహావిపత్తునుండి సంరక్షించెను. ధృతరాష్ట్రుఁడు బ్రతుకు జీవుఁడా యని బకదాల్భ్యమహర్షి కనేక గోసమూహాముల నొసఁగి యాతనియనుమతి నిజనగరమున కరిగి సుఖముండెను. బకదాల్భ్యమహర్షి తపశ్శక్తియుతుఁ డైనయాప్రదేశమే బకదాల్భ్యతీర్థ మని ప్రసిద్ధి గాంచెను. ఆహా! మన మహర్షులప్రజ్ఞాప్రాభవము లెంతని కొనియాడవచ్చును! దుష్టశిక్షణకై యాభిచారికహోమ మొనరించుచు, ఆదుష్టుఁడు శిష్టుఁ డైనంతనే, సర్వశాంతిహోమము చేసి బకదాల్భ్యుఁ డాతనిఁ గటాక్షించెను. దుష్టశిక్షణ శిష్టరక్షణ యొనరింప నవతరించిన పరమేశ్వరస్వరూపులే కదా మనభారతబ్రహ్మర్షులు !

# శ్రీమహర్షి జీవిత కథామృతము

## మరీచి మహర్షి

### స్తుతి

తనసుజ్ఞానమయూఖమాలికలచేతన్ లోకభాస్వంతుఁడై
తనధర్మప్రతిపాదకత్వమున సద్ధర్మప్రతిష్ఠాపకా
గ్రణియై దివ్యతపోధనుం డయి జగత్కర్తృత్వవిఖ్యాతి గాం
చినవరౌనీంద్రుని బావనాత్ముని మరీచిన్ గొల్తు భక్త్యున్నతిన్.

### జననము

తొల్లి బ్రహ్మదేవుఁడు ప్రజాపతిత్వమున రాజసగుణ ప్రధానుఁడై సృష్టిని గూర్చి చింతింపఁదొడఁగెను. అప్పు డాతని బుద్ధిపూర్వకము కాని ధ్యానమువలన, తమోమయము, తమోమోహము, మహామోహము, తమిస్రము, అంధతమిస్రము ననునవైదును బుట్టి జగములకు ముఖ్యభూతము లయ్యెను. కాని, యివి బ్రహ్మకు సృష్టిసాధనములు కావాయెను. ఆపై, బ్రహ్మ ఆత్మజ్ఞానాజ్ఞానములఁ దామస మగుతిర్యగ్ధ్యానమువలన లోకమునఁ బశుమృగసంతతి జనించెను. పిదప, ఆతని సాత్త్విక గుణమున నూర్ధ్వమైనప్రకాశప్రవాహ మొకటి బయలువెడలఁగా నందుండి దేవతలు జనించిరి. రాజసగుణముచే నుద్రిక్తమై, తమోగుణముచే రంజితమైనబ్రహ్మ ప్రకాశబాహుళ్యముతో నొప్పునాతనితలఁపు అధోగతిని వర్తించిన నందుండి

మనుష్యులు పుట్టిరి. అనంతరము బ్రహ్మదేవుని నిఖిలావయవములనుండియు, దేవతలు, పితరులు, అసురులు, మనుజులు, అనేకభూతములు మున్నగువానితో సచరాచరమగుప్రపంచము జనించెను. నానావిధములగు ఈచరాచరభూతజాలములు పూర్వసృష్టియందు జరిగినవిధముననే వారివారికర్మములు కారణములుగాఁ బుట్టి హింసాహింసలు, మార్దవకాఠిన్యములు, నిందానిందలు, ధర్మాధర్మములు, సత్యాసత్యములు, జ్ఞానాజ్ఞానములు కలిగి యింద్రియవ్యవహారములందుఁ దగిలి నానావిధము లగు రూపములు, వర్తనములు, జాతులు, స్వభావములు, చేష్టలు, గుణములు, ఆయాప్రకారములఁ నేర్పడునట్లుగా బ్రహ్మ వానిని సృష్టించెను. ఆపిమ్మట నాతఁడు దేశములు, వనములు, పర్వతములు, దుర్గములు, సముద్రములు, పురములు, ఆవరణములు, గృహములు, అస్త్రశస్త్రాదులు, మున్నగుసమస్తము సృష్టించెను. శీతవాతోష్ణబాధలచేఁ బ్రజలు బాధపడకుండుటకై తగినయుపకరణములు సృజించి, భూషణాంబరవిలేపనాదుల నేర్పఱిచెను. ఒక్కపని సాధించుటకుఁ బెక్కువిధములు గలసాధనములు తనబుద్ధికుశలతవలన నాతఁడు సృజించెను. సేద్యము, వాణిజ్యము, గోరక్ష, యాచనము, కూలి, సేవ, పౌరుషము మున్నగుకారణములవలన జనులకుఁ బ్రతుకుఁదెరువులు కల్పించెను. మఱియు మనుష్యులకు జీవనోపాయములుగా వ్రీహులు, గోధుమలు, యవలు, అణువులు, తిలలు, ప్రియంగువులు, ఉదారములు, కోద్రవములు, సతీనకములు, మాషములు, ముద్గములు, మసూరములు, నిష్పావములు, కులుత్థములు, ఆఢక్యకములు, చణకములు, శణములు, మున్నగు

పెక్క తెఱఁగులధాన్యములు కల్పించెను. ఈధాన్యాదికమున యజ్ఞకర్మములు నడచునట్లు, ఈయజ్ఞకర్మములవలన ధాన్యాభివృద్ధి యగునట్లు నాతఁ డేర్పఱిచెను.

ఇన్నివిధముల సృష్టిచేసియు బ్రహ్మదేవుఁడు తన కొక్క సమయమందు నూఱట లేకపోవుటకు, తాను సృష్టించినజీవరాశి వంశపరంపరలకు జగముపైఁ బరిపూర్ణత్వము లేకపోవుటకు దుఃఖించి తనతో సరియగువారలఁ గొందఱ సృష్టించి వారిని సృష్టివ్యాప్తికి నియోగింపఁదలఁచెను. అందుచే నాతఁడు తన్నుఁ బోలినవారలు, తనయంతటిఘనులు, ప్రజాపతులు, మునిశ్రేష్ఠులు, జగములఁ బ్రజాపరిపూర్ణతకు హేతుభూతులు కాఁజాలువారు నయినమహామహులను దనమానససృష్టిని బుట్టించెను. వారే భృగువు, పులస్త్యుఁడు, పులహుఁడు, క్రతువు, అంగిరసుఁడు, మరీచి, దక్షుఁడు, అత్రి, వసిష్ఠుఁడు అను మహాత్ములు. వీరినే నవబ్రహ్మ లని యందురు. *

ఇట్లు సృష్టికార్యమునఁ దనకు సహాయులై తనపరిపూర్ణతకుఁ దోడ్పడఁ గలశక్తిసంపన్ను లగువారిగా బ్రహ్మ తనమానసమునుండి జనింపఁజేసిన తొమ్మండుగురలో మరీచిమహర్షి యొకఁడు. మరీచి తనయనుజులతోఁ గలిసి తండ్రిపంపున మహాతపస్సుచేయుచు బ్రహ్మదేవుని గనిపెట్టుకొనియుండి యాతఁడు పిలిచినపు డెల్ల వచ్చుచు నాతనిసేవ చేయుచు నాతని యాదేశములఁ దలఁదాల్చుచు నుండెను.

---

*ఈ గాథ యంతయు శ్రీవిష్ణుపురాణములోనిది.

## వివాహము

అనంతరము కర్దమప్రజాపతికి దేవహూతియందు తొమ్మండుగురుకూఁతుండ్రును విష్ణుమూర్తి కపిలుఁడను పేర పుత్త్రరత్నముగను జనించిరి. కపిలుఁడు జన్మించినసమయమున సర్వలోక మహోత్సవమయ్యెను. అట్టిమహోత్సవమున దేవహూతికిఁ దత్త్వబోధ యొనరించుటకు, ఆమెగర్భమున నుదయించినపరబ్రహ్మస్వరూపుఁడైన నారాయణుని దర్శించుటకును నారదసనకసనందన మరీచిప్రముఖు లగుమునిగణములతో బ్రహ్మదేవుఁడచటికి విచ్చేసెను. అచట బ్రహ్మ కర్దమదేవహూతులఁ గనుంగొని "ఓపుణ్యదంపతులారా! మీయోగమే మహాయోగము. మీరు నిష్కల్మషులై చేసినవిష్ణుపూజ యీపుత్త్రరూపమున సత్ఫలము నొసంగెను. మీరు ముమ్మాటికిఁ జరితార్థులు. సాక్షాత్పుణ్యరూపిణు లగు మీతొమ్మండుగురుకూఁతుండ్రను శీలవ్రతాచారసంపన్నలు, సకలలోకమునివరేణ్యులు, మహామహులు, నగునవబ్రహ్మలకు నిచ్చి వివాహములు చేయుఁడు. వారివలనఁ బ్రజాసృష్టి బహువిధముల వృద్ధిపొందును." అని హితోపదేశము చేసెను. పిదప నాతఁడు విష్ణుమూర్తియే కపిలరూపమున వారికి బిడ్డఁడై పుట్టుట విశదీకరించి యామహాత్ముఁడు చేయుభవిష్యత్కృత్యములఁ దేటతెల్ల మొనరించి కపిలుని సంస్తుతించి మరీచిమహర్షిని కర్దమునింట వివాహార్థము నిలిచి బ్రహ్మదేవుఁడు నారదసనకసనందనాదులతో నిజధామమునకుఁ బోయెను.

పిదప, కర్దమప్రజాపతి బ్రహ్మదేవునియాదేశముచొప్పునఁ దనకూఁతుండ్రకు వివాహమహోత్సవము నిర్ణయించి

నవబ్రహ్మలకుఁ దెలియపఱచెను. భూతభవిష్యద్వర్తమాన వేదు లగునామహామహులు పెండ్లికొడుకులై కర్దమునింటికి విచ్చేసిరి. ఆపిమ్మట దివ్యవైభవోపేతముగా కర్దమప్రజాపతి తనకడ విడిసియున్న మరీచిమహర్షికిఁ దొలుతటిపట్టి యగుకళ యనుదివ్యసుందరిని, అత్రికి అనసూయను, అంగిరసునకు శ్రద్ధను, పులస్త్యునకు హావిర్భువును, పులహునకు గతిని, క్రతుమహర్షికిఁ గ్రియను, భృగువునకు ఖ్యాతిని, వసిష్ఠునకు అరుంధతిని, అథర్వునకు శాంతిని ఇచ్చి నిజకులాచారసరణిఁ బరిణయము లొనరించి కృతదారపరిగ్రహు లగుఅల్లుండ్రను సకలగౌరవపురస్సరముగా వారివారియాశ్రమదివ్యప్రదేశములకుఁ బంపివైచెను. ఈరీతిని మరీచిమహర్షి కళను ధర్మపత్నిగాఁ బరిగ్రహించెను.

## సంతానము

మరీచిమహర్షి కళాయుతుఁడై రోహిణితో నొప్పుచంద్రునివలె, సువాసన యబ్బినబంగారమువలె మఱింతప్రకాశించుచుఁ దనయాశ్రమమునకుఁ జనుదెంచి గృహస్థధర్మమును నిర్వర్తించుచునే నిరంతరతపోధ్యానానురక్తుఁడై ఆదర్శగృహస్థాశ్రమనిర్వహణకుఁ గడంగెను.

కళ భర్తకనేకవిధముల శుశ్రూషచేయుచు మానవుని నీడవలె నాతని నెన్నఁడును విడిచి యెఱుఁగక పతివ్రతాతిలకమై తపస్వినీజీవితము నలవఱుచుకొనెను. ఇట్లుండఁ గొంతకాలమునకు మరీచిమహర్షి "సాధ్వీ ! నాతండ్రియు నీకు మామయు నగుబ్రహ్మ నిరంతరాయ మగుప్రజాసంసృష్టి యొనరించుటకే మమ్ముఁ బుట్టించి మిమ్ములను భార్యలఁగాఁ గూర్చెను. కావున, నీ కెట్టిసంతానము కావలయునో కోరుకొను" మనెను.

కళ భర్తతో "మనకన్న మిన్నయై సర్వజీవరాసులను సృష్టింప సామర్థ్యము గలయొక్కయుత్తమపుత్త్రుని, సమస్తలోకములం దును కీర్తనీయ కాఁ దగునొక్కపుత్త్రికను నాకుఁ బ్రసాదింపు" మని పలికెను. మరీచి యట్లే యని నిరుపమనిష్ఠాతిశయమునం దాను తపస్సుచేయుచు భార్యను దనపరిచర్యలో నిలుపుకొని పరమపవిత్రశరీర నొనరించి యాపిదప నొక్కసుముహూర్త మున నామెకుఁ గామకేళివలనఁ బరమసంతృప్తి నొనగూర్చి యామెకు గర్భముఁ బ్రసాదించెను. కళ పరమసంతోషభరి తయై పవిత్రగర్భమును ధరించి మహోత్సాహమునసుండి కాల క్రమమున నొక్కపుత్త్రునిఁ గనెను.

అనంతరము మరీచి తనపుత్త్రునకు జాతకర్మాదిక మెల్ల నొనరించి కశ్యపుఁ డని నామకరణ మొనరించెను. కశ్యపుఁడు శుక్లపక్షచంద్రునివలెఁ బెరిగి పెద్దవాఁడై దక్షప్రజాపతిపుత్త్రికలఁ బెండ్లాడి సర్వభూతసంసృష్టి యొనరించెను.

మఱికొంతకాలమునకు మరీచిదయవలనఁ గళ మరల గర్భమును ధరించి నవమాసములు మోసి యొకముద్దుబిడ్డఁ గనెను. ఆమెమోము పుట్టినప్పటినుండియు సంపూర్ణపూర్ణి మాచంద్రబింబమువలె నలరారుచుండుటచేతనే మరీచి యామెకు పూర్ణిమ యను నామధేయము నుంచెను. కాలక్ర మమున, పూర్ణిమ జన్మాంతరమున హరిపాదప్రక్షాళనజలము కారణముగా గంగ యనుపేరఁ బుట్టి పెరిగి దేవకుల్య యను నొక్కకూఁతును,అఖిల విష్టపవ్యాపకుఁడయి విరజుఁ డనునొక్క కొడుకును గాంచెను. వారివలనను భూతసంతతి జనించి వృద్ధి

పొందెను. ఈరీతి మరీచి కళనలన సంతానవంతుఁడు, చరితార్థ జీవనుఁడు, నయి విలసిల్లెను. *

## మరీచి స్మృతి

మరీచిమహర్షి మహాజ్ఞాని, విరాగి, మహాతపస్వి యగుటే కాక స్మృతికర్తయు. మరీచిమహర్షి పేర నొకధర్మశాస్త్రము "మరీచిస్మృతి" గా ననగుచున్నది. ఆహ్నిక, అశౌచ, శ్రాద్ధ ప్రాయశ్చిత్త, వ్యవహారవిషయములలో మరీచిస్మృతికి మహోన్నతస్థానము నొసంగినవి. మితాక్షరము, అపరార్కము, స్మృతిచంద్రిక మున్నగునవి. "సప్తమ్యాం రవివారేచ గృహీ జన్మదినే తథా, భృత్యపుత్రకళాత్రార్థీ నకుర్యా త్తిలతర్పణమ్." "నభోనభస్యయోర్మధ్యే సర్వానద్యో రజస్వలః తాసు స్నానం నకుర్వీత దేవర్షిపితృతర్పణమ్." అని తర్పణాధికవిషయమున; "స్థానరే విక్రియాధానే విభాగే దానవేవచ, ప్రతిగ్రహేచ క్రీతేచ నాలేఖ్యా సిద్ధ్యతిక్రియా" "అవిజ్ఞాతనివేశత్వాద్యత్ర మూల్యం నలభ్యతే, హానిస్తత్ర సమాకల్ప్యా క్రేతుదాప్రికయోర్ద్వయే" మున్నగుశ్లోకములు వ్యవహారాధ్యాయమునను మరీచిస్మృతినుండి అపరార్కము స్మృతిచంద్రిక మున్నగునవి పేర్కొన్నవి. భోగ్యము, గోప్యము, ప్రత్యయము, ఆజానాధియని ఆధి (తాకట్టు, కుదువ) నాలుగువిధములుగా మరీచిస్మృతిలోఁ గలదు. మరీచిస్మృతి గద్యశ్లోకసమన్విత మని అపరార్కమున నుదాహరింపఁబడినకొన్ని గద్యోదాహరణములఁబట్టి చెప్పవచ్చును. అంతేకాని, నేఁటికిని "మరీచిస్మృతి" పూర్తిగా మనకు లభింపకపోవుట నిజముగా మనదురదృష్టము.

---

* శ్రీమద్భాగవతము చతుర్థస్కంధము.

# శ్రీ మహర్షి జీవితకథామృతము

## మాండవ్య మహర్షి

### స్తుతి

ధర్మనిరతితోడఁ దపమొనరించెడి
తనకు శిక్షవేయు దాసు యముని
చండకోపి యగుచు శపియించె మాండవ్యుఁ
డట్టి ఋషివతంసు నాత్మఁ గొలుతు.

### తపము

తొల్లి మాండవ్యుఁ డనుమునికుమారుఁడు బాల్యము నుండియు నిష్ఠాగరిష్ఠుఁడై తపమొనరించుచు బ్రహ్మవిద్యాపరుఁడై యుండెను. కాలక్రమమున నాతఁడు తపఃప్రభావము వలన బ్రహ్మర్షియై భూమండలమునఁ గల సర్వతీర్థములను ఒంటరియై సేవించి వచ్చి యొకపట్టణమునకు సమీపమునఁ గల యడవిలో నాశ్రమము నిర్మించుకొని యాశ్రమద్వారమునఁ గలవృక్షమూలమున నూర్ధ్వబాహుఁడై మౌనవ్రతుఁడై మహాతప మొనరింపఁ జొచ్చెను. ఆతఁడు మొదటినుండియు మనోధైర్యము కలిగి స్థిరచిత్తుఁ డైనమహనీయుఁడు. ఆతఁడు సమస్త ధర్మములను, ధర్మమర్మములను గరతలామలకముగా నెఱిఁగిన పుణ్యపురుషుఁడు. ఇంతేకాక, ఆతఁడు నిత్యసత్యవ్రతుఁడు. ఇంద్రియాశ్వముల విచ్చలవిడి పోనీక, అదుపులో నుంచి యాముని

వైరాగ్యశమదమాదులచే శిక్షణమందినబుద్ధి యను సారథికత మునఁ దనజీవితరథమును బ్రహ్మానందప్రద మగుఉన్నతమార్గ ముననే పోనిచ్చుచుండెను. ఈమహాత్ముఁ డిట్టితపోనిష్ఠలో నుండఁగా నెన్నియో సంవత్సరములు గతించెను. ఐనను, ఆతఁడు శీతోష్ణములకు, సుఖదుఃఖములకు, జరాజాడ్యములకు, లాభనష్టములకు వేనికిని లక్ష్య మిసుమంత యైనఁ జూపక నిశ్చితార్థము విడువనినిపుణమతి యై, నిరాహారి, నిర్జితేంద్రియుఁడు. నిఖిలపాపదూరుఁడై నెగడుచుండెను.

### మాండవ్యుఁ డకారణశిక్షకు గుఱియగుట

ఈశ్వరవిలాస మతిచిత్రముగా నుండును. ఏపాప మెఱుఁగని మహనీయు లొకప్పు డతికఠోరమగుశిక్ష ననుభవింప వలసివచ్చును. మహాపాపియగు నిందితుఁడు శిక్ష తప్పించుకొని సుఖజీవనము గడపుచుండును. విధివిలసిత మన్నది తప్ప మఱే యొక కారణము మనమిందులకుఁ జెప్పఁజాలము. ఇట్లే నిత్యసత్యవ్రతుఁడు, తపోవిద్యానవద్యుఁడు, నిర్దగ్ధసర్వపాపుఁడు నగు మాండవ్యమహర్షిపై నొకనిరాపనింద వచ్చిపడెను.

ఆవనసమీపమందలినగరమున నొకరాత్రి కొందఱు దొంగలు రాజుగారింటిలోఁ బడి రక్షకభటులకంట దుమ్ము కొట్టి రాజుగారిధనము, ఆభరణములు మున్నగున వెన్నియో దొంగిలించుకొని పారిపోయిరి. రక్షకభటు లీసంగతి తెలిసికొని యనేకులుకలిసి దొంగలవెంటఁ బరుగిడి వారిని దఱిమి యడవిలోనికి వచ్చిరి. ఆదొంగలు పరుగుపరుగున వచ్చి మాండవ్యుఁడు తపము చేసికొనుఆశ్రమమునకు సమీప మగుప్రదేశమున వస్తువులఁబాఱిపెట్టి దట్టముగ నలముకొన్న పొదలమాటున

దాఁగుకొనిరి. వారిని తఱుముకొనివచ్చిన రక్షకభటులు తలారులు మాండవ్యమహర్షికడ కరుదెంచి "అయ్యా! రాజధనమును దొంగిలించినదొంగలు కొంద ఱిటు పాఱి వచ్చిరి; వారెటు ప్రక్క కేఁగి"రని యాతని నడిగిరి. మౌనవ్రతదీక్షితుఁడైనయామహనీయుఁ డేమియు బదులుపలుకఁ డయ్యెను. అంత రాజభటులు తలవరులు సమీపప్రాంతములం దెల్ల వెదకి యనుమానముపై భూమిని ద్రవ్వి దొంగలు పాతినరాజధనభూషణములను బట్టుకొనఁ గలిగిరి. ఇంతలోఁ బొదలమాటునఁ గల దొంగలుకూడ వారి కంటఁబడ రాజభటులు దొంగల నెల్లరఁ బట్టుకొని బంధించిరి. పిదప, దొంగలకెల్ల రాజయినగజదొంగ మునివేషమున గొంగజపము చేయుచున్నాఁ డని సంశయించి రాజభటులు మాండవ్యు నాడరానిమాట లాడి కాలుసేతులు కట్టి దొంగలతోఁ గూడ రాజుకడకుఁ దీసికొనిపోయి రాజున కొప్పగించిరి. పోయినధనము దొరకిన దని సంతసించి రాజు చోరు లెల్లరకుఁ గ్రూరదండనము విధించి వారినెల్లర వధింపుఁడని తలవరుల కాజ్ఞాపించెను. పిదప, యుక్తాయుక్తవిచారణ లేని యామూర్ఖరాజు మాండవ్యుని ఋషిగాఁ దెలిసికొనలేక దొంగలరా జని భావించి యాతని నూరివెలుపలఁ గొఱుతవేయుఁడని తలవరుల కాజ్ఞాపించెను.

రాజాజ్ఞ యైనవెంటనే వివేకవిహీను లైనతలవరులు మునిమూర్ధన్యుని లాఁగుకొనిపోయి యూరిబయట నొకశూలము పాతి యం దాతనిఁ గొఱుత నుంచి పోయిరి. శూలప్రోతుఁడైనను మాండవ్యమహర్షి యాత్మవేది యగుట పరమప్రశాంతుఁడై దూషణభూషణతిరస్కారము లెల్ల తనకు సమానములు,

అమృతమయములుగాఁ దోఁప, నిదియుఁ దనమేలునకే వచ్చిన దని సంతసించి వాయుమాత్రభక్షకుఁడై మఱింతనియమతో మఱింత భక్తితో మఱింత శాంతితో నాతఁడు తప మొనరించుచుండెను. ఇట్లు చిరకాల మాతఁడు కొఱుతనుండియే దేహబాధను లక్ష్య పెట్టక దేహస్మృతియే మఱచి పరమేశ్వర పాదారవిందనిస్రుత మగుదివ్యామృతముఁ ద్రావుచు దివ్యశరీరియై దివ్యతేజస్వియై యేమాత్రము శరీరకార్శ్యము, దైన్యము, క్షీణత, భీతి, యెఱుఁగక నిశ్చలబ్రహ్మనిష్ఠుఁడై నెగడుచుండెను.*

## మాండవ్యుఁడు కౌశికుని శపించుట

మాండవ్యు డిట్లు కొఱుత నున్న సమయమున నొకనాఁటి రాత్రి యొకచిత్రము జరిగెను. ఆవనప్రాంతమునఁ గలప్రతిష్ఠాన మనునొకపురవరమునఁ గౌశికుఁ డనునొకబ్రాహ్మణుఁడు పూర్వజన్మపాపఫలమునఁ గుష్ఠరోగపీడితుఁ డయ్యెను. ఐనను ఆతనిభార్య పతివ్రతాతిలకమై యసహ్యించుకొనక భర్తయే పరమేశ్వరుఁ డని భావించుచు నాతనికి సకలోపచారములు నొడఁగూర్చుచుండెను.

ఇట్లుండ నాకుష్ఠరోగి యొకనాఁడు రాజమార్గమున నేఁగునొక్క వేశ్యారత్నముఁ గాంచెను. భూలోకమునకు దిగి వచ్చిన రంభయో, ఊర్వశియో యైయుండు ననఁదోఁచుమహా సౌందర్యమున విరాజిలు నామె నీకురూపి మిక్కుటముగ వలచెను. ఆహా! ఒడలెల్ల పుచ్చి పురుగులోడుచు, రసి కాఱి కాలువలు గట్టు కురూపికిని స్త్రీరూపమును గాంచఁగనే మరులు పురులు గొలుపు మదనమహనీయునిమహిమ మెవరు

* భారతము వనపర్వము

వర్ణింపఁగలరు ? పుత్తడిబొమ్మవంటిధర్మపత్ని తన్నుఁ గని రో
యక సకలోపచారములు సలుపుచున్నను, కౌశికునికి రూపాజీ
వపై మనసు తగులుట ఆశ్చర్యముల కెల్ల నాశ్చర్యము. కౌశి
కుఁడు భార్యను బిలిచి తనకామరాగముఁ జెప్పి యారేయి
యాగణికాంగనపొందుఁ దనకుఁ గూర్పు మని బతిమాలెను.
వినయవివేకభయభక్తియుక్తులతో నామాటలు విన్నకౌశికపత్ని
యట్లే యని లెక్కలేనిరొక్కము మూటగట్టుకొని రాత్రివేళఁ
బతిని వీపుపై నెక్కించుకొని యాసాధ్వీతిలకము చిమ్మచీకటిని
మిట్టపల్లము లేర్పఱుపరాక, కన్నుఁ గన్ను కానరాకయున్న
సమయమున వేశ్యాగృహమున కూరిబయటనుండి పోవుచుం
డెను. అపుడు కొఱ్ఱున నున్నమాండవ్యునికిఁ బత్నివీపుపై నున్న
కౌశికునిశరీరము రాచుకొనిపోఁగా నొక్కపెట్టున మాండవ్యునికి
శూలబాధ యధికమయ్యెను. అపు డాతఁ "డయ్యో ! మూలు
గుచున్ననక్కపైఁ దాటిపండు పడ్డట్లు,నా కీఘోరబాధ నినుమడిం
పఁజేయ నన్ను రాచుకొనిపోయినమూర్ఖుఁ డుదయ మగుసరికిఁ
జచ్చియుండుఁగా" కని శపించెను.

మాండవ్యుని శాపముసంగతి విని కౌశికపత్ని సూర్యుఁ
డుదయింపకుండఁ జేసెను. తుదకు, అనసూయాసాధ్వి కౌశిక
పత్ని నోదార్చి సూర్యుఁ డుదయ మగునటొనరఁ జేసి, చనిపో
యిన కౌశికునిఁ దనపతివ్రతాత్వమున బ్రతికించి వరము లొసఁ
గెను. *

---

*మార్కండేయపురాణము.

## మాండవ్యుని విడుదల

ఇట్లు శరీరదుఃఖ మణుమాత్రమును దలఁపక తపము చేయుచున్న మాండవ్యుని తపఃప్రభావమునకు మెచ్చి మహామునులు పక్షుల లయి రాత్రి వచ్చి "మునీంద్రా! ఇట్టిమహాతపస్వి వైన నీ కిట్టిదుఃఖప్రద మగుశిక్ష విధించిన దెవరు? నీయంత నీవు తప్పించుకొన శక్తి గలవాఁడవయ్యుఁ జూపఱులకు జాలివలనఁ గన్నులనీరు జలజల కాఱునట్లు ఈ కొఱుతపై నుండుటకుఁ గారణ మే?" మని యడిగిరి. అంత, మాండవ్యుఁడు వారితో "మిత్రులారా! మీ యనునయమునకుఁ గృతజ్ఞుఁడను. కాని:

"ఎఱిఁగి యెఱిఁగి నన్నడుగంగనేల దీని
సుఖము దుఃఖంబు ప్రాప్తించుచోట నరుఁడు
తగిలి తనకర్మవశమునఁ దనకుఁ దాన
కర్త కా కన్యులకు నేమికారణంబు?"

(భా. ఆది. ౪-౨౬౭.)

నే నెవ్వరికిని దప్పు చేయలేదు. ఒరు లెవ్వరు నాకుఁ జేయరే" దని ప్రశాంతమనస్కుఁడై పలికెను. ఈమాటలు చాటున నుండి యిన్నాళ్లుగాఁ గొఱుతనుండియుఁ జావకపోవుటే కాక, దినదిన ప్రవర్ధమాన మగు తేజస్సుతో నొప్పుమాండవ్యుని యథాస్థితిఁ గనిపెట్టుటకై పొంచియున్న తలవరులు విని శీఘ్రమే పోయి ఈజరిగినవృత్తాంతము తమరాజునకు నివేదించిరి.

తాను ఋషికులతిలకుని యెడఁ గావించినమహాపరాధమునకుఁ బశ్చాత్తప్తుఁడై మంత్రిపురోహితపురస్కృతుఁడై యారాజు పరుగుపరుగున వచ్చి మాండవ్యునిపాదములపైఁ బడి "మహాత్మా

యుక్తాయుక్తజ్ఞానము లేనిమూర్ఖుఁడనై దొంగ యని భ్రమపడి నీ కీఘోరాతిఘోరమగుశిక్ష విధించినమహాపాపాత్ముఁడను నేను. నన్నుఁ దగినవిధమున శిక్షించి క్షమించి దయచూడు" మని పరిపరివిధముల బతిమాలుకొనఁ జొచ్చెను. అంత మాండవ్యుఁడు మహనీయగుణగరిష్ఠుఁడు మూర్తీభవించినశాంతిపుంజము, దయాసముద్రుఁడు, ఆత్మజ్ఞాని, వివేకనిధి యగుటచే "ఓయీ! ఇందు నీదోష మేమియు లేదు. ప్రాణికోటులకుఁ బురాకృతకర్మ మనుభవింపక తీరదు. ఎవనికర్మఫలము వానికి గట్టికుడుపును, దాని కొరులు కారణము కానేరరు. కావున, నాకు శత్రువుకాని ద్రోహికాని నీవుకావు."అని పలికెను. ఆతనిశాంతగుణమునకు క్షమాభిక్షమునకు సంతసించి రాజు నెంటనే యాతనిఁ గొఱ్ఱనుండి తప్పించెనుకాని యాశూలాగ్రమొన యాతనికంఠమునుండి యూడిరాదయ్యెను. అంత రాజు మునియనుమతిని మెత్తన దానిమొదలు తునిమించెను. ఈశూలశేషము మునికంఠమున నొకమేకువలె నిలిచిపోయెను. దీని నూడఁదీయ నెవ్వరికిని దరము కాకపోయెను. నాఁటినుండి యాతనికి "అణిమాండవ్యుఁ"డని పేరువచ్చెను. (అణి=చీల, మేకు.)

అందుచే మాండవ్యుఁ డప్పటినుండి కంఠమునకు రెండు ప్రక్కలకును నడుమ నాశూలప్రమొనను దాల్చియే తిరుగుచు దానియందు పూలపాత్రి మున్నగునవి తగిలించుకొనుచుండెను. తపోవిశేషముచే మాండవ్యమహర్షి యితరులకు దుర్లభమైన సమస్తలోకసంచారశక్తి గడించెను. కాని, యేపాప మెఱుఁగని తనకు యముఁ డిట్టిశిక్ష నేల విధించె నని యిట్లు యమధర్మ

రాజే సత్పురుషులను శిక్షించినచో నిక లోకములందు సత్పు
రుషులగతి యేమగు నని వంతనొంది తనశక్తికతమున యమ
లోకమునకుఁ బోయి యందు యమగృహమున మహాసనమున
గూర్చుండి యున్నయము నవలోకించి యిట్లనెను.

యమమాండవ్య సంవాదము

"ఓయీ! నేను మాండవ్యుఁడను, నిరంతరసత్యతపో
వ్రతముల నస్యమెఱుఁగనినాకుఁ గొఱుత మహాదుఃఖ మనుభ
వింపవలసినదుఃస్థితి నీవు కల్పించుటకుఁ గారణ మేమి?

దండధర! యిట్టిదారుణ
దండమునకు నేమిదుష్కృతముఁ జేసితి సు
గ్రుండ నయి తగనిదండము
దండింపఁగ బ్రాహ్మణుండఁ దగునే నన్నుక

భార. ఆది. ౮:౨౭

దీనికిఁ దగినసమాధానము చెప్పుము. లేకున్న నాతపశ్శక్తి నీ
వెఱుఁగుదువుకదా?" యని యడిగెను.

అంత, యముఁ డాతనితో "మహాత్మా! నీ వింతగాఁ
గోపింపవలసినపని లేదు. నాసంగతి నీ వెఱుఁగుదువుకదా!
జీవులకర్మఫలముల ననుసరించి యాయాకష్టసుఖములను గల్పిం
చుచుందును. అంతకంటె నేను స్వతంత్రించి చేయున దేమియు
లేదు. ఈసంగతి యెఱిఁగినమీవంటిఋషులు నాకు దోషా
రోపణము చేయుట ధర్మమా? నీ వీబాధ యేల నందితివో
చెప్పెద వినుము. నీవు బాల్యమునఁ దూనీఁగలఁ బట్టుకొని
వానినిగొఱ్ఱులఁ బెట్టితివి. దానిఫలితము నీ విట్లనుభవింపవలసివచ్చె

నది. బ్రహ్మర్షీ ! దానము స్వల్పమైనదైనను, ఎన్నియో రెట్లధిక ఫలము నిచ్చునట్లు, పాపముకూడఁ గొంచెమైనను అధిక దుఃఖమునే కూర్చు"నని పలికెను.

**మాండవ్యుఁడు యముని శపించుట**

దానికి మాండవ్యుఁ "డయ్యా! నీచెప్పినది నిజము కాని, నే నాపాపము నేవయసునఁ జేసితినో చెప్పు" మనెను. దానిపై యముఁడు "నీబాల్యమున" ననెను. మాండవ్యుఁడు "ధర్మరాజా ! పుట్టినది మొదలు పండ్రెండేడులవఱకు నుండు బాల్యమనునవస్థలో జీవుఁడు చేసినపాపము పాపముగా గణింపఁబడదుకదా ! ఏలన, బాలుఁ డాకాలమున శాస్త్రోపదేశము తెలియఁడు. మంచిచెడ్డలు తెలిసికొనలేఁడు. మఱి యట్టి బాలుని కపకృతి చేసినవానికే పాపము కాని తనకృత్యములకు బాలుఁడు పాపమందఁ డన్నధర్మసూక్ష్మము మఱచిపోయితివా? ధర్మప్రభుఁడవైన నీవే యిట్లొనరించుచో నిఁక లోకములందలి సత్పురుషులగతి యేమి ? సమస్తప్రాణుల శిక్షించుటకంటె బ్రహ్మజ్ఞానసంపన్నుఁ డగువానిని శిక్షించుట యెంతవానికైనను నెన్నియో రెట్లు మహాపరాధము. ఔచిత్యానౌచిత్యము తెలియఁగక, ధర్మసూక్ష్మముల నేమఱి పరిశాంతుఁడ నగునాకు మహాక్రూరదండనమును నీవు విధించితివి. నీ వీదోషమునకు శిక్ష ననుభవింపక తప్పదు. నిన్ను శిక్షింపఁ గలుగువా రెవ రని నీ వనుకొనియుండవచ్చును. బ్రహ్మను లెవ్వరినైన నేమైనఁ జేయఁ గలసమర్థు లని నీ వెఱుఁగుదువుగాక ! మఱియు, ఏధర్మశిక్షణము పనిగాఁ గలుగుటవలన నీ వింతటివాఁడవైతివో అట్టి ధర్మమును సరిగా నీవే యమలుజరుపనిచో లోకశ్రేయము నశిం

షును. కావున, నీవు మర్త్యలోకమున శూద్రుడవై పుట్టుదువు గాక"యని శపించెను. ఈమాండవ్యశాపముననే యముడు విదురుడై పుట్టెను.

## జనకరాజ మాండవ్య సంవాదము

జనకమహారాజు జ్ఞానప్రవిష్టుడై యనేకు లగుమహర్షులు వచ్చుచుఁ బోవుచు నుండ వారితో గోష్ఠులు నెఱపుచు వారివలనఁ దాను దనవలన వారు పరస్పరజ్ఞానానుభవములను, ధర్మసూక్ష్మవిషయములను దెలిసికొనుచుండ సర్వలోకసర్వకాలాదర్శపురుషుఁడై వెలుఁగొందుచుండువాఁడు. ఒకప్పుడు జనకరాజర్షికడకు మాండవ్యమహాముని విచ్చేసెను. జనకుఁ డాతని నెంతేయు నాదరించి యతిథిసత్కారము లొనరించెను. పిదప, వా రుభయులు గోష్ఠిలో నున్నతఱి కోరికలు పోఁగొట్టుకొనుట కెట్టిశిక్ష కావలయు ననుప్రశ్న ముదయించెను.

అపుడు మాండవ్యుఁడు జనకుని వితృష్ణత్వశిక్ష విషయమున నీయనుభవమును నాకు బోధింపు మని కోరెను. జనకుఁ డానందించి "ఋషీంద్రా! దుఃఖమునకు దోషమునకు నిలయము లేవి? యని మన మాలోచింపవలయును. నాయనుభవమునుబట్టి అర్థములే యీరెండిటికి మూలములు. నాకు వీనిపై రవంతయైన ఆశ లేకపోవుటచేతనే నే నిపుడీసుఖము ననుభవించుచున్నాను. నేను తృష్ణ విడిచితిని. మిత్రమా! కామసుఖమే కాదు. ఎంతదివ్యసుఖమైనను కోరికను విడుచుటవలన వచ్చుసుఖముతో సరికాదు. నే నీసుఖానుభూతి నందుచుండుట చేతనే మిథిలానగరము కాలిపోయినసమయమునఁ గూడ నా కేమియుఁ గాలనియట్లే యుండెను. మఱియు, కోరికలు

తీయుట మొదలుపెట్టి అర్థములు సులభముగా లభించుచున్న వాా యిదకఁ జెప్పఁదరము కాదు. ఆవుకోఁ బెరుగుకొమ్ములవలెఁ గోరికలు పెరుగుచునే యుండును. తృష్ణ దినదిన మభివృద్ధి పొందుచునే యుండును. దీనితో మమకార మన్నిటియెడఁ గలిగి పెరిగి యట్టులు గట్టుకొనిపోవును. ఈతృష్ణ యను సముద్రము నింకఁజేయుటకై "మాబంధువులు", "మాధనములు", "మాయిళ్లు, మావాకిళ్లు" అనుభావములు మనస్సున స్థిరపఱుచుకొనక యుండవలయును. వ్యవహారప్రపంచమున నట్లుచుకొనకతప్పదు కాని యవి మనస్సున స్థిరపడరాదు.

మఱియు:

'దొరకొన్న ననుభవించుచు
దొరకొనమికిఁ జింత నొంది దురపిల్లక ని
ర్జరుఁడై యున్నను దృష్ణకుఁ
జొరవచ్చునె యతనిమనసు సువ్రతశీలా!'

శరీరమునకు ముసలితనము వచ్చును గాని ఆశకు ముసలితన మున్నది లేదు. దుర్మతులు దాని నెన్నఁడును విడువలేరు. తృష్ణా రోగము ప్రాణము తీసి కాని పోదు. అది యంతగడ్డురోగము. కాని, కోరికలను విడిచిన మహనీయుఁడు దానిని బోఁదోలి పరమసుఖ మనుభవించును. నీవంటివారు మహానుభావులు. నీకు శోకముకాని సంతోషముకాని లేవు. అందుచే నీవు ద్వంద్వా తీతుఁడవు. అంతఃకరణ మనులక్ష్మికి శాంతి యనురక్షణము నీ వుంచితివి. అందుచే నీవు వితృష్ణత్వసౌఖ్య మందినావు. అందఁ గలవు. ఎవనికైనను, అనుభవించినకొలఁది పెరుగుతృష్ణను

మొదలంటఁ గోయక సుఖము లేదు. కోరికలేమియు లేకుండుటే తృష్ణారోగమునకుఁ దగినమందు'' అని పలికెను.

మాండవ్యుఁడు జనకరాజర్షిమాటలచే కమితానందము నంది తనయనుభవమున కవి యన్నియు సరిపడ నాతని నభినందించి యిదివఱకే తన్ను వీడిపోయినతృష్ణ యింకను గడుదూరమునకుఁ బాఱిపోఁగా దివ్యశాంతియుతుఁడై తేజరిల్లెను.*

## యుధిష్ఠిర మాండవ్య సమాగమము

తొల్లి కృష్ణుఁడు ధర్మజునకు శివసహస్రనామస్తోత్రమొసఁగించి దానిని నిత్యము పఠించుటవలన సర్వపాపవిముక్తియై మనశ్శాంతి కలుగు నని తెలిపెను. అట నున్న మహర్షులు కూడ నొక్కరొక్కరే శివస్తుతిమహాత్త్వమును, శివప్రసాదమునఁ దమకుఁ గలిగినమేళ్ళను వివరించిరి. అపుడు మాండవ్యుఁడు ధర్మరాజుతో నిట్లనెను. "యుధిష్ఠిరా! నే నింతవఱకెవరికిని దెలుపనియొకరహస్యమును నీకుఁ దెలిపెద. వినుము.- మున్ను నే నకారణముగా శూలమునఁ గొఱ్ఱతపడి యున్నపుడా ఘోరరాత్రి శివస్తుతియొనరించి భక్తిపరవశుఁడ నైయుంటిని. అపుడు శివుఁడు వెంటనే ప్రత్యక్షమై 'మునీంద్రా! నీవు పుణ్యుఁడవు. ఈశూలమునుండి విడివడి యర్బుదవత్సరములు జీవింతువు. శూలకృత మగుపీడ నీ కేమాత్రమును గలుగకుండుటకు, ఆధివ్యాధివివర్జితుఁడవై నీవు సకలతీర్థస్నానఫల మందుటకు, నిత్యసత్యవ్రతుఁడ వగునీకు శాశ్వతానందప్రద మగుమోక్షసిద్ధి యగుటకు వరము లిచ్చుచున్నా' నని యంతర్హితుఁడయ్యెను. నాఁటినుండి నేను వజ్రశరీరుఁడనై జరాజాడ్యజననమరణరహితుఁడ నైతి" నని పలికెను.†

---

* భారతము. శాంతిపర్వము. † అనుశాసనికపర్వము.

# శ్రీమహర్షి జీవితకథామృతము

## ముద్గల మహర్షి

### స్తుతి

అతిథిప్రియుని విశిష్ట
వ్రతుని విమత్సరుని సత్యవచనాత్ము విని
ర్జితవిషయేంద్రియుని సము
న్నతపుణ్యుని ముద్గలర్షి నమియింతు నెదన్.

దానము, ధర్మము, పరోపకారము ఇవి యెప్పుడును మానవుఁడు చేయుచునే యుండవలయును. దానతపములలోఁ దపముకన్న దానమే దుష్కర మని పెద్దలు చెప్పుదురు. ఊర్జిత మగుఫలము నొసఁగుదానము అర్థసాధ్యము. కాన, నది దుష్కరము. అర్థము ప్రాణములకన్నను దీపికదా! ఏలన, ఉగ్రము లగునాయుధముల మొనలపై నఱుకుట, సముద్రములఁ దఱిసి చనుట, కృషి, పశుపాలనము, వీనివలనఁ గలుగు నెల్ల క్లేశముల నోర్చుట, అడవులలోఁ గొండలలో నిడుమలు గుడుచుట, అవసిపోవసి యనుదినము పరప్రేష్యులై యుండుట యివన్నియు అర్థము కోసమే. అట్టిదుఃఖలబ్ధమైన యర్థమును విడుచుట చాలఁ గష్టము. మఱియు, అన్యాయార్జితవిత్తమునఁ జేయుదానము మూర్ఖన్యాయమున ఫలపాక మొసఁగకపోవుటే కాక దుష్ఫలము నొసంగును. యుక్తన్యాయార్జితధన మించు

కంతయైనను దేశకాలపాత్రములఁ బట్టి దానము చేసిన మహాఫలవంత మగును. ఈవిషయమునకు ముద్గలమహర్షి చరిత్రమే నిదర్శనము.

ముద్గలుఁడనునొకముని బ్రహ్మచర్యాశ్రమమున విద్యాబుద్ధులు గఱచినపిమ్మట సకాలమున యుక్తవయోరూపముల నొప్పుకన్యను వివాహమాడెను. కాలక్రమమున నాతఁడు పుత్త్రవంతుఁడై పుత్త్రదారసహితముగాఁ గురుక్షేత్రమున వసించుచు గృహస్థ ధర్మము నిర్వర్తించుచుండెను. ఆతఁడు మహావ్రతియై, నిత్యసత్యవచనుఁడై, మచ్చరము మాని, మద ముడిగి, అహంకారము వీడి, ఉత్తమతపోధ్యానానురక్తుఁడై యుండెను. ఆతఁడాలుబిడ్డలను బోషించుటకై ఉంఛవృత్తి నవలంబించెను.

## ముద్గలుని ఉంఛవృత్తి

ఆమహనీయుఁడు ఆహారనిద్రాసుఖ స్త్రీసుఖములే సుఖము లని కలనైనఁ దలపోయక త్యాగమే ధన మనియు, భోగమే రోగమనియు, తపమే ధర్మమనియు నిరుపమ నిష్ఠయే నిత్యోత్సవ మనియు, ఉపవాసవ్రతపాలనమే మహాభోగ మనియు దృఢనిశ్చయుఁడై దివ్యజీవితముఁ గడపుచుండెను. ఆతనియాలుబిడ్డలు కూడ నాతనియడుగుజాడఁ నడచుచు, ఆతనితత్త్వ మవగాహనము చేసికొని అంతకన్న నదృష్టము లేదని యామహనీయునికి వ్రతపాలనమున కఠోర దీక్షతో, నియమనిష్ఠలలోఁ జేదోడువాదోడై యాతనియున్నత జీవితమునకు దోహదమునే యొసఁగుచుండిరి. ఆధ్యాత్మిక జీవితమునందలికఠోరదీక్షలలో నాలుబిడ్డలు కలిసివచ్చుట యందఱకుఁ బట్టునదృష్టము కాదు. 'ఎద్దె మన్నుఁ దెద్దె' మనుబిడ్డఁడు.

అదుపాజ్ఞల నవలఁబెట్టి చెప్పినది పెడచెవిని బెట్టుభార్యామణిఁ కలిగిన వానిజీవితమునుగూర్చి వేఱె చెప్పనేల !

ముద్గలమహర్షి ఉంఛవృత్తిపరాయణుఁడై పాడ్యమినాఁడు ప్రారంభించి పదునాలుగుదినము లొక్కొక్కగింజ చొప్పుననే ప్రోగుచేసి తూమెడువడ్లయినపిదపఁ బర్వదినమునఁ బాకము చేయించి తొలుదొలుత దేవపితృపూజనము లొనరించి పిదప నతిథుల కన్నము పెట్టి యాపిమ్మట మిగిలినయన్నమును దాను బుత్రకళత్రములతోఁ బంచుకొని దేహయాత్ర యెట్లో నడపుచుఁ బరమేశ్వరధ్యానైకపరాయణుఁడై యుండెను. ఈవిధమునఁ బక్షోపవాసవ్రతదీక్షాదక్షుఁడై ముద్గలుఁడు దైన్యమన్నది తనమొగమునఁ గాని యాలుబిడ్డలమొగములఁ గాని కనరాకుండుటకు సంతసించి 'తిండికొఱకు జీవించుట కాక జీవించుటకుఁ దిండి' అనుమహోన్నత మగుఆర్షధర్మమునకు ఉత్తమ నిదర్శనముగా నుండెను. ఇట్టి వ్యక్తి యొక్కఁడైనను సర్వలోకములను బూతము చేయఁజాలుఁగదా !

## ముద్గలుడు దుర్వాసుని కాతిథ్య మిచ్చుట.

ఇటు లుండఁగా నొకనాఁడు చూడ నసహ్యాకరమైన పిచ్చివేషముతో, నొంటిపై బట్ట లేనివాఁడు, జడముడి వీడినవాఁడు, బండబూతులు తిట్టువాఁడు నగుచు దుర్వాసోమహర్షి ముద్గలునియింటి కతిథియై వచ్చెను. దుర్వాసునిమొగము ముడుతలు పడి యెన్నఁడు నన్నము మొగ మెఱుఁగక యుపవాసములతోడనే యున్నట్లుండెను. ఆతనికడుపుప్రేగు లంటుకొనిపోయి పుట్టినది మొదలంతవఱకు నన్నరసము వంటఁబట్టన

ల్లుండెను. 'అన్నమో రామచంద్రా! ఆఁకలి ఆఁకలి' యని యాతఁ డఱచుచుండెను.

ఈస్థితిలో వచ్చినమునిచంద్రుని గాంచి ముద్గలుఁ డావంతయు నసహ్యించుకొనక భయభక్తిభరితుఁడై యాలుబిడ్డలతోఁ గూడి యర్ఘ్య మొసఁగి పాద్యమిచ్చి యాతఁడు కూర్చున్నపిదప భార్య విసనకఱ్ఱతో విసరుచుండ నాతనిపాదము లొత్తి యనేకవిధసేవల నొనరించెను. అతఁడు "నా కీవిసన లేల? పాదసేవ లేల' అన్నమున కలమటించి చచ్చువాని కన్నముపెట్టి రక్షింపుఁ"డని పలికెను. నాఁడు పర్వతిథియగుటచేఁ గక్షమునఁ బోగుచేసి యుంచిన ధాన్యము దంచి వండి ముద్గలునికుటుంబము తినఁబోవుసమయమున కీయతిథి వేంచేసెను. అందుచే ముద్గలుఁడాతనికి భక్తితో నన్నముపెట్టి యాదరము చూపి యట్టిమహానీయుఁడు తన కతిథిగా వచ్చుట తనయదృష్ట మని యానందాంబుధి నోలలాడెను. దుర్వాసుఁడు ఉన్నయన్న మంతయుఁ దానే తిని శేషించినమెతుకు లెల్లెడలఁ జల్లి కోపము నటించుచు లేచిపోయెను. ఇట్లు పర్వము పర్వము దుర్వాసుఁడు వచ్చుచుండుటయు ముద్గలునకుఁ గాని యాలుబిడ్డలకుఁ గాని యొక్కమెతుకైన దక్కకుండఁ దిసిపోవుటయు జరుగుచుండెను.

## దుర్వాసుఁడు ముద్గలు ననుగ్రహించుట.

ఇట్లు దుర్వాసుఁ డాఱుపర్వదినములు వరుసగా వచ్చి యాతిథ్యమును స్వీకరించెను. ఎన్నాళ్ళకైనను దాము కుడుచుటకుఁ గూడు లేకపోయినను, ముద్గలుఁడు, భార్య, బిడ్డ మువ్వురును దుర్వాసునియందు లవలేశమైన నిరాదరణము చూపరైరి. పైఁగా, ఆతనిమనస్సు రంజిల్లునట్లు సమస్తోపచారములు చేసిరి.

ఎంతయత్నించినను దుర్వాసుఁడు వారియెడఁ దప్పుపట్ట లేఁడయ్యెను. పరమకోపి యని ప్రసిద్ధిగాంచిన దుర్వాసోమహర్షియే వారిభక్తిశ్రద్ధలకుఁ దృప్తిగాంచె నన్న వారొనర్చినసేవ, చూపిన భయభక్తిగౌరవములు, వెల్లడించిన క్షమాగుణము, ప్రకటించిన దేహానిర్మమత్వము వర్ణనాతీతము లని చెప్పకచెప్పుచున్నవి.

తుదకు దుర్వాసుఁ డద్భుతప్రమోదమానసుఁడై అనునయపూర్వకముగా ముద్గలమునిఁ జేరఁబిలిచి "మునీంద్రా! నీయట్టి దానశీలుని నే నెన్నఁడును గని విని యెఱుఁగను. నీవు సత్త్వమతివి, సాధువిధేయుఁడవు. పుణ్యతేజుఁడవు. నేఁ బెట్టిన యిక్కట్టులకు మనమునందైన నేవగించుకొనక, లవమైన నవమానముచేయక, యించుకంతైనఁ గినియక, సోలమందక, కృత్రిమరహిత మైనభక్తి నాయెడఁ జూపితివి. సజ్జనస్తుత్యుఁడవగు నీకు అన్నదానము, ప్రసాదము, సత్యము, ధైర్యము, దమము, అపరిగ్రహత్వము, ఇవియే ధనము లయ్యెను. నరుని నాలుక యెల్లప్పుడు రుచుల కెదురుచూచును. తాలిమి, ధర్మము శమము వీని నాఁకలి దూరము చేయును. నీ వీరెండిటియందుఁ దగులక, జీవితస్థితివిధాయక మగునన్నము నతిథిసేవాపరాయణత విడిచివేసితివి. అనఁగా జీవితేచ్ఛ విడిచివేయఁ గలిగితివి. ఇంతకన్న ఘనుఁడెవఁడు? తనకు మాలినధర్మము ధరణిఁగలదా యనుకొనువాఁడే యుండును. కాని, నీవంటివాఁడు లేఁడు. నీ వీకఁ బ్రశంసాతీతుఁడవు. మనస్సును, ఇంద్రియముల వర్తనమును సరిగా నొనర్చుధర్మమే తప మని పెద్ద లందురు. అట్టి తపమును నీయందే నేను గాంచఁగంటిని. నీవలన నేను బరమసంప్రీతుఁడ నైతిని. పుణ్యపదము లెల్ల నీకుఁ గరతలామలకము

కాఁగలవు. నీప్రసిద్ధ మగుతపోవిభవమును మెచ్చినదేవతలు నీకు సశరీర స్వర్గసుఖము సమకూర్పఁ జేయుటకు దివ్యవిమాన మున వచ్చి నిన్నుఁ గొనిపోవుదురు. నేనికఁ బోయివచ్చెద" నని వెడలిపోయెను.

## దివ్యవిమానమున దేవదూత వచ్చుట

అనంతరము కొంతసేపటికి హంససారసయుక్తము, కింకిణీమాలికామనోహరము, కామగమనము నయినయొక్క విమానముతో దేవదూత యొకఁడు ముద్గలునికడకుఁ జనుదెంచి యిట్లని పలికెను. "ఓముద్గలమునీంద్రా! నీపుణ్యపరిపాకమున నీకు బొందితోడికైలాసము ప్రాప్తమయ్యెను. నీసచ్చరితమునకు మెచ్చి నిన్నీవిమానమునఁ గొనిరమ్మని సకలదేవతలయభి మతమున దేవేంద్రుఁడు నన్ను నీకడ కనిపి యున్నాఁడు. ఇంతటి మహాభాగ్యమునకు యోగ్యు లగునరు లరుదు. కావున, సంతోష స్వాంతుఁడవై యాలుబిడ్డలతో నీవిమాన మధిష్ఠించి యమర పదసుఖ మనుభవింప విచ్చేయుము."

## ముద్గల దేవదూతలసంవాదము

ఈపలుకులు విని ముద్గలుఁడు దేవదూతకు నమస్కరించి "మహాత్మా! నీదర్శనమునఁ బునీతుఁడనైతిని. నీపలుకులు అమృతపుఁజిలుకులై నామనసుకు ముద మొదవించినవి. కాని, వ్రతదీక్షాపరుఁడ నగునన్ను భూలోకము విడిచి మీలోకము నకు రమ్మని యాహ్వానించిన దేవతలకు వారిదూత వగునీకు నమస్కారములు. నే నటకుఁ జనుదెంచుటకుఁ బూర్వము మీలోక మెట్లుండునో తెలిసికొనఁ గుతూహలపడుచున్నాను. ఈలోకమునకన్న నాలోకమున, విశేష మున్నఁ దప్పక విచ్చే

యుదును. సత్పురుషులతోడి మైత్రి సాప్తపదీనము. కావున, మీ
లోకమునందని గుణదోషవిశేషములఁ దెలుపు"మని కోరెను.

దాని కా దేవదూత "ఋషీంద్రా! ఈ భూలోకము
నకు మీఁదుగా స్వర్లోకము వెలుఁగొందుచున్నది. అది చాల
మనోహర మైనలోకము. అది యనేకాలంకారయుతము.
ఒక్క దేవతలకే సంచరించుటకుఁ జూచుటకు యోగ్యమైనది.
ఇతరు లందుఁ జొర ననర్హులు. మఱియు, మహాతపస్వులు,
మహాయజ్ఞశీలురు, నిత్యసత్యవ్రతులు, ఉత్తములు, జితేంద్రి
యులు, సర్వసములు, దానపరులు, రణశూరులు, అందు
సంతోషమున నుందురు. అందే, అప్సరసలు, సాధ్యులు,
దేవర్షులు, మరుద్వసుప్రముఖులు, వేఱువేఱ తమతమయోగ్య
ప్రదేశములలో మహాసుఖులై వసింతురు. ఇంతేకాక, ముప్పది
వేలయోజనములవిస్తీర్ణత గలమేరుపర్వతశిఖరమున నందనము
మున్నగుమహోద్యానవనములు పుణ్యపరులకుఁ గ్రీడాస్థాన
ములై విలసిల్లును. అచట ఆఁకలి, దప్పిక, శీతోష్ణభయములు,
జరాజాడ్యవికృతులు, నెవ్వరికిని గలుగవు. ఏప్రదేశమును
జూచినను, అతిమనోహరమై సర్వేంద్రియసౌఖ్యకరమై యుం
డును. ఇట్టిలోకమునకుఁ బుణ్యపురుషులు విధినియోగపక్వము
లైనమానుషశరీరములు విడిచి తేజోమయము లగుదివ్యదేహ
ములు ధరించి వివిధాంబరభూషణభూషితులు, వాడుట యెఱుఁ
గనిచక్కనిపూలమాలలు ధరించినమనోహరులు నై కనకవిమా
నములందుఁ దమ్ము దేవదూత లిటకుఁ గొనిరాఁగా వచ్చెదరు.
వా రచట శోకము కాని శ్రమము కాని, ఆయాసము కాని
లేక మహాసుఖము లనుభవింతురు. దీనినే యింద్రలోక మం

మురు. ఇంద్రలోకముపైని బ్రహ్మలోక మొప్పారుచుండును. బ్రహ్మలోకము నిశ్శోకము, అనన్యదీప్తిసదనము. బ్రహ్మలోకమే తన దీప్తివలన సమస్తలోకములను వెలుఁగొందఁజేయుచుండును. బ్రహ్మలోకమున మనువులు, ధాతలు, మునులు నుందురు. అందు లోభము, కినుక, పగ, తాపము, పాపము, దుఃఖవికృతులు మందునకైనఁ గానరావు. అన్నిభువనములు నాశమైనను బ్రహ్మలోకమునకు నాశనము లేదు. ఇంద్రాది దేవవిభులుసైత మాలోకముననే యుండ నాసపడుచుందురు." అని పలికెను.

ముద్గలుఁ డాతనితో "అయ్యా! స్వర్గమునందలి గుణములను జెప్పితివి. ఇఁక, నందలిదోషము లేవో వివరింపు"మని యెను. దేవదూత ముద్గలునితో "సంయమీంద్రా! స్వర్గలోకము పుణ్యానుభవప్రదేశము. ఇందుఁ జేసినపుణ్యము లం దనుభవించుటే కాని మనుష్యుఁ డందుఁ బుణ్యములు చేయ లేఁడు. పుణ్యావసాన మైనపిదప నతనిని దేవతలు మరల భూమిపైఁ ద్రోయుదురు. సుఖములు మరఁగినస్వర్గమును విడిచి భూమిపైఁ బడుటకు నరుఁడు కొట్టుమిట్టాడును. కాని, దుఃఖభూతుఁడై తేజోహీనుఁడైన యాతనిని దేవతలు బలవంతముగ భూమికి గెంటివేయుదురు. స్వర్గలోకమందలి జనులకుసైతము తమతక్కువతనము,ఒకరలయున్నతత్త్వము అనుభావములు, వాని వలని మదమాత్సర్యములు కలుగును. ఒక్క బ్రహ్మలోకమునఁ దక్కఁ దక్కినపుణ్యలోకములం దన్నిట నిదియే పరిపాటి. పుణ్యలోకపరిభ్రష్టుఁ డీలోకమున సుఖశీలుఁ డయియే పుట్టుట మాత్రము నిక్కము. ఒక్కమాటలోఁ జెప్పవలయునన్న, ఈ

లోకము కర్మభూమి. ఆలోకము ఫలభూమి యని యెఱుంగుము. నీవలనియాదరంబునఁ జేసి యింతవివరముగా నీకుఁ జెప్పితిని. నీ వింక నాలసింపకుము. వేగిరము విమాన మెక్కుము. పోవుద" మని పలికెను.

## ముద్గలుండు స్వర్గముఁ ద్రుణీకరించుట

అంత ముద్గలుఁడు దేవదూతతో "మహాత్మా ! నీ వింత వట్టు చెప్పితివి. నీకుఁ గృతజ్ఞుఁడను. ఇట్టి దివ్యసుఖములు నా కక్కఱ లేదు. వానిని మీ దేవతలే యుంచుకొనుఁడు. మీకు మీస్వర్గమునకు నొక్కనమస్కారము. నా కేమిచ్చినను నే నట నడుగుపెట్టను. నాలోకమే నాకుఁ బదివేలు. పునరావృత్తి రహిత మగుశాశ్వతబ్రహ్మలోకమే నాకుఁ గావలయునది. అది లభించువఱకు నే నిటనే యుందును. ఇఁక, నీవు నీయిచ్ఛ వచ్చినచోటునకుఁ బోవచ్చును. నీకు నమస్కారము"లనిచెప్పెను.

ఈవాక్యములు విని దేవదూత మిక్కిలి యక్కఱనుండి "ఆహా ! సశరీరస్వర్గసుఖము సమకొనియుండ దానిని ద్రుణీకరించిన మహనీయుఁ డింకొకఁ డేఁడీ" అని యాతని నభినందించి తిరిగి విమానములోఁ దనలోకమునకుఁ బోయెను.

## ముద్గలుని కైవల్యప్రాప్తి

ఆపిమ్మట ముద్గలమహర్షి శిలోంఛవృత్తిని విడిచి పరమ శాంతిని బడసి నిర్వికల్ప మైనజ్ఞానయోగమును గాంచి యాపైఁ దన్మహాయోగమునఁ జేసి కష్టసుఖములు, నిందాస్తుతులు, అవమానగౌరవములు, ఇట్టివానియం దెల్ల సమత్వదృష్టిఁ గలవాఁడై, మంటిబెడ్డయు బంగారమును, కుళ్ళినశవము పరమసుందరి, చండాలుఁడు మహాపండితుఁడు, బిచ్చగాఁడు మహా

రాజు తనదృష్టిలో నొక్కవిధముగనే తోఁచి స్థిరపడఁగా దేహపతనకాలమువఱకుఁ గాలము గడపి తుదకుఁ బునరావృత్తిరహిత శాశ్వతబ్రహ్మలోక మను పరమసిద్ధిం గాంచి నిత్యోజ్జ్వలుఁడై నిర్వికల్పుఁడై నెగడొందెను.

## మౌద్గల్యునికథ

ముద్గలునికుమారుఁడు మౌద్గల్యుఁ డనఁ బరగి పెరిగి పెద్దవాఁ డగుచు నిత్యతపోవృత్తిలో నుండెను. ఆతఁడు పితృభక్తియుతుఁడై యుండి తండ్రి గతించినపిమ్మట, ఇంద్రసేన యనునొకకన్యను వివాహమై గృహస్థాశ్రమము నిర్వర్తించుచుండెను. ఆతఁడును మహామునియై చిరకాల మట్లు జీవించెను.

కొంతకాలమునకుఁ బూర్వజన్మప్రారబ్ధమున నతనికి మహారోగము పొడచూపెను. ఆవ్యాధికతమునఁ గ్రమముగా మౌద్గల్యుఁడు త్వగస్థిభూతకష్టశరీరుఁడు,దుర్గంధవదనుఁడు, దుఃఖజీవుఁడు, అతికోపనుఁడు, విశీర్యమాణనఖత్వచుఁడు నయి వార్ధక్యదశఁ గాంచెను. కాని, యాతనిపత్ని యగునింద్రసేనమాత్రము మహాపతివ్రతయై యాతనిని భక్తిభావమున నారాధించుచు నసహ్య మెఱుఁగక యెడతెగనిశుశ్రూషల నొనరించుచుండెను. ఆహా! పరమపవిత్రమగు జీవితమున బ్రహ్మభాజనుఁడై యున్నపరమర్షికిఁగూడ కర్మఫలము కట్టికుడుపక విడువదుకదా! ఆతఁడు నిజతపోమహత్త్వమున నట్టిమహావ్యాధిని దుదముట్టించుకొనఁ గలిగియుఁ దపోధనమును వ్యయింప నొల్లక, ప్రారబ్ధ మనుభవముచేతనే నశించుట యెఱిఁగినమహనీయుఁ డగుట ఆత్మప్రశాంతి విడువక దేహబాధల నోర్చుకొనుచుండెడివాఁడు. అట్టి మహనీయునిభార్యయు జాడ్యగ్రస్తుఁడు

గదా యని భర్తను విడనాడిననీచురాలు కాదు. వివాహ మన్నది యొక్కనేఁటియనుబంధము కాదు. అనేకజన్మాగతమైనది. ఏమహాదోషముననో తనపతి కట్టికూ్రరరోగము కలిగినంతమాత్రమున భర్తను విడిచివేయుచో వివాహబంధ పవిత్రత నశించిపోవునుగదా !

ఇట్లుండ మౌద్గల్యునివే్రలు అన్నము తినునపు డందుఁ దునిసిపడెను. అది చూచి యింద్రసేన యసహ్యించుకొనక తీసివైచి యాపతిభుక్తశేషమును బరమప్రసాదముగా భుజించెను. చిరకాలమునుండి తా నున్నమహారోగదుఃస్థితి, భార్య పాతివ్రత్యము గాంచిమౌద్గల్యుఁ డమితానందమున భార్యను బిలిచి "సాధ్వీ ! నీపతిభక్తికి మెచ్చితిని. నీ కేవరము కావలయునో కోరుకొను" మనెను. అంత నామె "దేవా ! నాకుఁ గామోపభోగేచ్ఛ యమితముగాఁ గలదు. నీవు తపశ్శక్తిని మనోహరాకారము ధరించి పంచధా విభక్తుఁడ వయి నన్ను రమించి కామభోగములఁ దనుపు" మని కోరుకొనెను.

మౌద్గల్యుఁడు నిజతపశ్శక్తికతమున క్షణమాత్రములో దివ్యసుందరాకారము లైదు ధరించి మర్త్యదేవలోకములందు బ్రహ్మర్షి దేవర్షిపూజితుఁడై సూర్యరథ మెక్కి చని యాకాశగంగాజలముల స్నానము చేసి చంద్రకిరణములలో నివసించి మేరుకైలాసములఁ గ్రీడించుచు ననేకసహస్రవర్షము లనేకస్థానముల నింద్రసేనతో నుపభోగించి పరితృప్తి నంది యామెను విడిచిపెట్టి ఘోరతప మొనరించి బ్రహ్మమయుఁడై బ్రహ్మలోకమునకు జనెను. ఈయింద్రసేనయే జన్మాంతరమున ద్రౌపదియై పుట్టి భర్తృపంచకమును బడసెను.*

---

* భారతము. ఆదిపర్వము—(పంచేంద్రోపాఖ్యానము)

# శ్రీ మహర్షి జీవిత కథామృతము

## మైత్రేయ మహర్షి

### స్తుతి

శ్రద్ధాభక్తి నుతింతు స
మిద్ధపరిజ్ఞాను సుజనహితు మైత్రేయున్
వృద్ధజనసేవ్యుఁ దాపస
వృద్ధశ్రవు యోగిగేయు వినుతాచారున్.

### బాల్యము

మైత్రేయుఁ డనుమునికుమారుఁడు బాల్యమునండియుఁ బరాశరమహర్షి నారాధించి యాతనికి శిష్యుఁ డయ్యెను. మాతృగర్భమున నుండియే వేదశాస్త్రపురాణవిద్యలు నేర్చిన మహనీయుఁడు, బాల్యమునందే నిజతపస్సామర్థ్యమున సర్వరాక్షసవినాశకర మగుయజ్ఞముఁ జేసినశక్తివంతుఁడు, పులస్త్యబ్రహ్మకతమున దివ్యజ్ఞానసిద్ధి గాంచినమహాత్ముఁడు, మునిలోకచక్రవర్తి, రమ్యతేజోధనుఁడు నగుపరాశరమహర్షి మైత్రేయు నధికవాత్సల్యమున నాదరించి, కన్నబిడ్డనువలెఁ గాంచి, యనేక ధర్మశాస్త్రములు, వేదవేదాంగములు నేర్పెను. మైత్రేయుఁ డనేకవత్సరములు క్షణమాత్రమైన నేమఱక గురుశుశ్రూష లొనర్చుచుఁ బరాశరునిహృదయముఁ జూఱకొనెను.

## పరాశరుఁడు మైత్రేయునకు విష్ణుపురాణము చెప్పుట

ఒకనాఁడు ప్రభాతకాలోచితకృత్యములు తీర్చి సుఖాసనమునఁ గూర్చుండి యున్నగురువర్యునకు నమస్కరించి మైత్రేయుఁడు "మునినాథా ! నీయవ్యాజకటాక్షమువలన సాంగములైనవేదములు, శాస్త్రములు, సంశయరహితముగా నేర్చితిని. నీప్రసాదమున మనస్సు సుప్రసన్నమై యున్నది. నాకు సర్వమును నీవే కాన, నిన్నుఁ గొన్నివిషయము లడిగెదను. దయతో సెలవిమ్ము, ఎల్లవేల్పులకు మూలమైనవేల్పును గూర్చి, యాతనిమహత్త్వముఁ గూర్చి వినఁగోరెదను. మఱియుఁ బృథివ్యాదిభూతప్రమాణములు, సప్తసాగరవిస్తారములు, సప్తద్వీపప్రకారము, సప్తకులపర్వతములస్థానములు, సూర్యాది గ్రహతారకసంచారము, దేవాది చతుర్విధభూతనిర్మాణము, చతుర్దశమన్వంతరములప్రమాణములు, చతుర్యుగప్రమాణములు, కల్పకల్పవిభాగములు, యుగధర్మములు, దేవర్షిచరితములు, రాజవంశానుకీర్తనము, వేదశాఖాప్రమాణములు, బ్రాహ్మణాది వర్ణధర్మములు, బ్రహ్మచర్యాది చతురాశ్రమములు, మొదలగుసర్వమును దెలుపు"మని కోరెను.

పరాశరుఁ డందుల కానందించి పులస్త్యబ్రహ్మకతమునను, తనతాతయైనవశిష్ఠునిమూలమునను దనకు దేవరహస్యకార్యము లెల్ల దీపముపెట్టినట్లు, వేదవిద్యావిషయము లెల్ల కరతలామలకములుగను, అనేకధర్మశాస్త్రము లాటపాటలుగను, దోఁచుటఁ దెలిపి యవి యన్నియు మైత్రేయునకుఁ బ్రియమార వినిపించెను. ఈయావద్విషయములు పరాశరసంహిత

లేక విష్ణుపురాణ మను పేర జగమునఁ బ్రసిద్ధిగాంచెను. మఱియు మైత్రేయునితోఁ బరాశరుఁడు:

"పుట్టును జావును జావును
బుట్టకయును గాని జీవముల కొకచోటన్
నెట్టుకొని యుండఁ జెల్లదు
ముట్టినకర్మములు మారి మోచినకతనన్.

అర్థ మార్జించునప్పుడు నది సురక్షి
తంబు గావించునప్పుడుఁ దద్వియోగ
మైనయప్పుడు దుఃఖంబె కాని తనకుఁ
గలిమి సుఖ మని చెప్పినఁ గానిపలుకు.

ప్రాప్తి లేమి మేలు పడయుదు నని ప్రియా
సంబుతోడఁ దిరిగి సంఘటింప
కున్న దుఃఖపడుచు నుండుఁ గోరనినాఁడు
కోర నైతి ననుచుఁ గోరుచుండు.

వనితలుఁ జెలులున్ జుట్టలుఁ
దనయులు క్షేత్రములు నిల్లు ధనధాన్యములున్
దనకును బోయిన వచ్చిన
ఘనదుఃఖమె కాని మేలు కలుగదు సుమ్మీ.

పరమ దుఃఖపాదపమునకు బీజముల్
కర్మచయము లిట్టుగాన నుభయ
కర్మమయ శరీర కార్పాస బీజంబుఁ
బోలె నవధి లేక పుట్టుఁ బొలియు.

గర్భ జన్మ జరామృత్యుకాలముల శ
రీరి సంసారమార్తాండ ఘోరతాప
ములకుఁ జిక్కక ఘనమైన మోక్షతరువు
నీడ నుండక సుఖ మేల నివ్వటిల్లు ?
ఈయాత్యంతిక దుఃఖముఁ
బాయ నుపాయంబు వినుము పరమం బగుపా
రాయణ భగవన్నామము
ధ్యేయం బని జ్ఞానవిదులు తెలిపిరి మొదలన్."

(విష్ణుపురాణము.)

అని చెప్పి యాతనిసంశయముల నెల్లఁ దీర్చెను.

మైత్రేయుఁడు బ్రహ్మానందమంది "మహాత్మా ! నీదయ వలన సమస్తముఁ దెలిసికొంటిని. ఇఁక నొక్కటియు నే నడుగ వలసినది లేదు. నామనస్సు మిక్కిలి విశదమై వివేకలక్ష్మీయుతమై యున్నది. ని న్నింతవట్టు శ్రమపెట్టి దోషము చేసితిని. దయతో నన్ను క్షమింపు"మని సాష్టాంగ మెఱఁగెను. పరాశరుఁ డాతనిని లేవనెత్తి "వత్సా ! నీవు నాకొనరించిన సేవలకు నాచిత్తము ప్రసన్నమయియుండుటచే నీకింతవట్టు చెప్పితిని. ఇది వేదమూలము, పరమపుణ్యప్రదము. నీ వింక యథేచ్ఛ మేఁగి సుఖముండు" మని వీడుకొలిపెను. మైత్రేయుఁడు విష్ణుస్మరణాపూర్వకముగ నటనుండి బ్రహ్మానందనిష్యందమధుపానమత్తుఁడై వెడలిపోయెను.*

---

* విష్ణుపురాణము.

## మైత్రేయుఁడు ధృతరాష్ట్ర దుర్యోధనులకు హితము చెప్పుట

మైత్రేయుఁడు మహావిజ్ఞానియై సర్వతీర్థములను సందర్శించుటకు నిశ్చయించుకొని ఆయాతీర్థముల నొకటి తరువాత నొకటిఁ గాంచుచుఁ దిరుగుచుండెను. ఆపరిభ్రమణములో నాఁతఁడు కురుజాంగలమునఁ గామ్యకవనమున ధర్మజాది పాండవులఁ గాంచి వారిసంగతి యెఱిఁగి ధృతరాష్ట్ర దుర్యోధనులకు బుద్ధిచెప్పు తలంపు పొడమ నటనుండి ధృతరాష్ట్రుని కడకు విచ్చేసెను.

అంతకుమున్నే వ్యాసమహర్షి ధృతరాష్ట్రునకు మైత్రేయుఁడు హితవచనములఁ జెప్ప విచ్చేయనున్నాఁ డని చెప్పి వెడలెను. అందుచే ధృతరాష్ట్రుఁడు మైత్రేయు నుచితరీతిఁ బూజించి సుఖవిశ్రాంతుఁ గావించెను. పిదప, ధృతరాష్ట్రుఁ డాతనిని "మహాత్మా! మీ రెందుండి వచ్చితి"రని యడిగెను. అందుల కాతఁడు పరమతపోభారమున జటాజినములు ధరించి, నారబట్టలు కట్టి, కాయగూరలు తినుచు, కామ్యకవనమునఁ దిరుగు పాండవులకడనుండి వచ్చితి నని చెప్పెను. ధృతరాష్ట్రుఁడు వెంటనే వారియోగక్షేమము లడిగెను. అంత, మైత్రేయుఁడు "రాజా! పాండవులు ధర్మమతులు. మహామునులు వారికడకు వచ్చుచు దీవించుచు వారన్నఁ బ్రియముతో నుందురు. అట్టి వారికిఁ గుశలముకా కన్య మెట్లగును? వారు ధర్మము కాని ప్రతిజ్ఞ కాని తప్పినచో సూర్యచంద్రులు గతులు తప్పుదురు. అట్టివారి కకారణముగా నీకొడుకు నికారము గావించెను. నీవును నీకుమారుఁడును బుద్ధిగలిగి పాండవులతో విరోధ

ముడిగి సుఖింపుఁడు. దానివలనఁ గురుకులమునకు మేలగు. నామాట వినుఁడు. పాండుపుత్త్రులు మహాపరాక్రమవంతులు. ఇంద్రసమానులు. ఒక్కొక్కఁడు నూఱేనుఁగులపెట్టు. వారు రణధీరులు, ఉగ్రాయుధులు,ఉత్సాహపరులు; వారిలోనొక్కఁడే బకహిడింబకిమ్మీరాదుల నుక్కడఁచెను. ఆతని నెదిరింపఁగల వీరుఁ డింకొకఁ డేఁడీ? యని" పలికెను.

## మైత్త్రేయుఁడు దుర్యోధనుని శపించుట

అంత దుర్యోధనుఁ డామాటలు వినలేక మైత్త్రేయుని నిర్లక్ష్యము చేసెను. మైత్త్రేయుఁ డాతనివంకఁ దిరిగి మఱియు నిట్లు చెప్పెను. "పాండవులకు వాసుదేవ దృష్టద్యుమ్నులు బంధువులు, సహాయులు. జరామరణవంతు లైనమనుజు లెవ్వరును వారిని మార్కొని జీవింపలేరు. వారితో నొడంబడి మేలు పొందుము. ఇదియే నాహితోపదేశము. ఇదియే నీవు చేయఁదగినకార్య" మని పలికెను. ఆమహర్షిమాట లాలింపక దుర్యోధనుఁడు నిర్లక్ష్యభావమునఁ గాలిబొటనవ్రేలితో నేల వ్రాయుచు బాహువు లెత్తి తొడలు చఱచి నవ్వుచుండెను. మైత్త్రేయుఁ డాతనివైఖరి నసహ్యించుకొని యాతని నిర్లక్ష్యబుద్ధికిఁ గోపించి "ఓయీ! దుర్యోధనా! నీవు నాయెడఁ జేసిన యీయపరాధము కారణముగా యుద్ధమగు. అందు నీవు భీమునిగదాఘాతమున నీతొడలు భగ్నము కాఁగాఁ జత్తు" వని శపించెను.

ధృతరాష్ట్రుఁడు మైత్త్రేయునిపాదములపైఁ బడి క్షమింపు మనియు శాపముఁ గ్రమ్మఱింపు మనియుఁ గోరుకొనెను. కాని మైత్త్రేయుఁడు దుర్యోధనునికి సమబుద్ధి కలిగిన శాపము ఫల

వంతము కా దనియుఁ గలుగనినాఁడు శాపఫలము కట్టికుడువు
ననియుఁ జెప్పి శీఘ్రముగా వెడలిపోవుచుండ ధృతరాష్ట్రుఁడు
తన కింక నేవియో విషయములు చెప్పు మన 'నే నొక్కనిమిష
మింట నుండును. విదురు నడుగుము. ఆతఁడు చెప్పు'నని వెడలి
పోయెను.

## విదుర మైత్రేయ సంవాదము

తరువాత, నొకప్పుడు విదురుఁడు జ్ఞాననిధియు, తాప
సేంద్రుఁడు, ఆశ్రితమందారుఁడు నగుమైత్రేయమహర్షిని జూడఁ
గోరి బయలువెడలెను. ఆతఁడు యమునానదిని దాఁటి మఱి
కొన్నిప్రయాణములు చేసి పుణ్యనదులను హరిక్షేత్రములను
దర్శించుచు నతిత్వరితగమనుఁడై గంగానదిని సమీపించి యందు
సుఖపుణ్యస్నాన మాచరించి తత్ప్రదేశమున నొకయిసుకతిన్నె
మీఁద యమనియమాదియోగనిష్ఠం బూని పద్మాసనాసీనుఁడై
హరిపాదపద్మములు చిత్తమునఁ జేర్చి బాహ్యేంద్రియవ్యాప్తి
నరికట్టి, ఉత్తమాచారము, ఉత్తమవ్రతము, ఉత్తమోపవాస
ములు వీనివలనఁ గృశించి యున్నపుణ్యపురుషుని, వయోవికార
విరహితుని, యోగిజనగేయుని మైత్రేయమహర్షిని బొడగాం
చెను. వెంటనే విదురుఁ డాతనిపాదపద్మములకుఁ బ్రణమిల్లి
ముకుళితహస్తుఁడై "మునీంద్రా! లోకమున జను లందఱు
మనముల నెన్నియో సౌఖ్యములఁ గోరి వానిని సమకూర్పఁ
జాలు కర్మము లాచరించి దైవోపహతులై యాకర్మములవలన
ఫలితములను గాంచఁజాలక వ్యర్థు లగుదురు. కర్మములు బంధ
కములు దుఃఖదములే కాని సౌఖ్యదాయకములు కావు. అవి

*భారతము. వనపర్వము.

పాపనివృత్తిఁ జేయఁజాలవు. సకలదుఃఖములకుఁ గారణమైన సంసారచక్రమునఁ బరిభ్రమించుచుఁ గామమోహితులై పూర్వకర్మానుగతము లైనశరీరములు దాల్చుచుఁ జచ్చుచు, మరలఁ బుట్టుచు నెంతకాలమున కైనను బాపనివృత్తిఁ గాంచక మాత్మ యాపవననవతారులై జనించి వర్తించుమూర్ఖులను రక్షించుటకు నారాయణపరాయణు లైనమీవంటిపుణ్యాత్ములే సమర్థులు. కాన, నీవు నన్నుఁ గటాక్షించి త్రిగుణాత్మకమాయానియంతయగుభగవంతుఁడు స్వతంత్రుఁడయ్యు నవతారములు దాల్చి యేయేకర్మల నొనరించెను ? ఏయేతత్త్వభేదముల నేయేరీతులఁ బుట్టించెను ? కర్మ నామరూపభేదము లెట్లు నిర్దేశించెను ? అన్నవిషయములు సవిస్తరముగాఁ దెలుపుము. పుండరీకాక్షుని చరిత్రశ్రవణమునఁ గాని జననమరణాది సకలదుఃఖాకరములు దుష్కర్మప్రాప్తములు, నగుభవబంధములు తెగవు.'' అని పలికెను.

మైత్రేయుఁ డానందించి ''అనఘా ! కృష్ణకథాశ్రవణతత్పరుఁడవై నీవు నన్నడిగినవిషయము లెల్లఁ జెప్పెదను. ఏలన నీవు భగవద్భక్తుఁడవు, హరికథాతత్పరుఁడవు. మాండవ్యశాపమున నిట్లు పుట్టిన ప్రజాసంయమనుండ వగుయముఁడవు. ఇంతే కాదు. నీవు పరమజ్ఞానసంపన్నుఁడ వగుట, నారాయణప్రియతముఁడ వగుటఁ గృష్ణుఁడు నిర్యాణకాలమున నన్నుఁ దనచెంతకుఁ బిలిపించుకొని విజ్ఞానమెల్ల నుపదేశించి నీ కెఱిఁగింపు'' మని యానతిచ్చెను. అందుచే నీవు కోరినసమస్తవిషయములు తెలుపుదును. సావధానుఁడవై విను''మని చెప్పి విష్ణు

మహాత్మ్యముఁ దెలిపి, సృష్టిక్రమ మెఱిఁగించి, జీవునికర్మబంధనాదికముఁ దేటపఱిచి

"హరిచరణారవిందయుగ
ళార్చనసన్నుతిభక్తియోగముల్
నిరతముఁ గల్గువారు భవ
నీరజగర్భుల కందరాని భా
సురపదమందుఁ జేరుదురు
సూరిజనస్తవనీయ! యట్టి స
త్పురుషుల పూర్వజన్మఫలముల్
గణుతింపఁ దరంబె యేరికిన్." (భాగ.3స్కం.౨౮౩)

అని చెప్పెను.

విదురుఁడు ముకుళితహస్తుఁడై శిరము వంచి మనమున శ్రీకృష్ణుని దలపోసి మైత్రేయునితో "మహాత్మా! నీవాక్యపరంపరలచే నాసంశయములు తీరినవి. లోకమున కీశ్వరుఁడు హరి యనియు, జీవుఁడు పరతంత్రుఁ డనియుఁ దలంతును. నారాయణభక్తిప్రభావము ప్రాణిగోచర మైనఅవిద్యకు నాశన కారణము. నారాయణుఁడు సమస్తాధారుఁడు. ఆతఁడు దేనిపైని నాధారపడఁడు. నారాయణభజనమున సమస్తదుఃఖములు నశించు నని నీదయవలన నెఱింగితిని." అని మఱియెన్నియో ప్రశ్నము లడుగ మైత్రేయుఁ డాతనికి భగవత్ప్రోక్తము, ఋషిసంప్రదాయానుగతము, పురుషోత్తమస్తోత్రము, పరమపవిత్రము, భవలతాలవిత్రము, నగుభాగవత మెల్లఁ దెలిపెద వినుమని పుండరీకాక్షుఁడు తనుదానె విశ్వభేదమును గల్పించినవిధమును సవిస్తరముగాఁ దెలిపి, కాలలక్షణ మెఱిఁగించి కాలా

త్ముఁడు, ఈశ్వరుఁడు నైననూర్యుఁడు, పురుషుల కాయురాదివ్యయంబులం జేసి విషయాసక్తినివర్తింపఁజేయుచుండు. అట్టిమార్తాండునికిఁ బూజ గావింపు మని చెప్పెను. అనంతరము కాలాహ్వయుఁడై తనరినహరిమహిమఁ దెలిపి, సృష్టిమహిమ విశదపఱిచి, స్వాయంభువమనుచరిత్రము వినిపించి, యజ్ఞవరాహవృత్తాంతముఁ దేటతెల్లము చేసి, హిరణ్యాక్షహిరణ్యకశిపులకథలు మున్నగునవి విస్తరించి చెప్పెను.

ఇట్లన్నియు విన్నవిదురుఁడు మైత్రేయునికిఁ బరమభక్తి నమస్కరించి "మునినాథా! నీవలన భక్తవత్సలుఁ డగుశ్రీకృష్ణునితత్త్వ మెల్ల నెఱుఁగఁగంటిని. ఇఁక,నాకు సెలవిమ్ము. పోయి వచ్చెద" నని యాతనిచే నామంత్రితుఁడై కరిపురమున కరిగెను.

## వ్యాసమైత్రేయ సంవాదము

విద్యాతపోదానములలో నేది విశేష మనుప్రసంగము వచ్చినపుడు భీష్ముఁడు ధర్మరాజుతో వ్యాసమైత్రేయసంవాదమును దెలిపెను.

తొల్లి యొకప్పుడు మైత్రేయమహర్షి కాశీనగరమున నున్నసమయమున వ్యాసమహర్షి రహస్యముగా విచ్చేసెను. మైత్రేయుఁ డపరిమితానందమంది వందన మొనరించి భక్తితోఁ బూజించి యుత్కృష్టభోజనమునఁ దృప్తి చేసె నంత వ్యాసమహర్షి ముఖమున నానందము తాండవమాడెను. అది చూచి మైత్రేయుఁడు "మహాత్మా! నీవు విచ్చేసి నన్ను ధన్యు నొనర్చితివి. నీ వీనాఁ డపూర్వానంద మనుభవించుచున్నట్లు నీముఖము చెప్పక చెప్పుచున్నది. దీనికిఁ గారణ మెఱిఁగింపు" మని

కోరెను. అంత నాతఁడు "మునీంద్రా! తపము, శ్రుతము మున్నగుధర్మకోటిలో దానమే యగ్రగణ్యము. ఆదానవస్తువులలో నెల్ల అన్నమే యెక్కుడు. ఏలన, అసువులు అన్నమయములు. శరీరమునకు బలము దాననే లభించును. కావున, బుధు లన్నదాన మన్నిటికన్న మిన్న యందురు. మనస్సునఁ గలకల్మషములను దపము పోఁగొట్టును. అవుడు మనస్సు విద్య కాస్పదమగును. తపస్సు మహితదానముతోఁ గూడిన విద్యవలన మిక్కిలి రాణించును. కావున, తపము, విద్యయు దానముయొక్క ఉదాత్తను వృద్ధిపొందఁ జేయును. విద్యోన్నతి వ్రతపరాయణులకు అచ్యుతుని జూపుచక్కనిదీపము. నీవు చేసినయన్నదానవిశేషమున నే నింతయానంద మనుభవించుచున్నా" నని బదులుచెప్పెను. ఇంతటిమహానీయుఁ డగువ్యాసునికిఁ దృప్తిఁ గూర్చిన మైత్రేయునిభిక్ష మిక్కిలి శ్లాఘ్యమై వెలసెను. పిదప, వ్యాసుఁడు మైత్రేయునుచితవచనముల వీడుకొని యథేచ్ఛము వెడలిపోయెను.

---

* భాగవతము.

# శ్రీమహర్షి జీవితకథామృతము

## రైభ్యమహర్షి

### స్తుతి

బ్రహ్మసుతుఁ డైన రైభ్యుండు పరమయోగి
అధ్యయనశూరుఁ డార్యగృహస్థవరుఁడు
బ్రహ్మవిజ్ఞాని మునిలోకపారిజాత
మతనిపదపద్మములఁ గొల్తు నధికభక్తి.

రైభ్యుఁడు బ్రహ్మసుతుఁ డని వరాహపురాణమునఁ గలదు. అంతకంటె రైభ్యునిజననమును గూర్చినవృత్తాంత మేమియుఁ గానరాలేదు. అనేకు లగునితరఋషులవలెనే యీ మహర్షి జననవిశేషములు మాతాపితృవృత్తాంతముఁ దెలిసికొనుటకు మనము నోచుకొనలేదు.

### రైభ్యుని విద్యార్థిదశ

రైభ్యుఁడు బాల్యముననే యుపవీతుఁడై యొకమహర్షి కడఁ జేరి శిష్యుఁడై యధ్యయన మారంభించెను. రైభ్యుని గురుభక్తి యద్వితీయమైనది. ఎంతయల్పవిషయమున నైనను గురువాక్యప్రకారము తు, చ తప్పక యాతఁడు వర్తించుచుండెను. గురుఁడు మేలుకొనుటకుముందే వేకువ నీతఁడు లేచి కాలకృత్యాదికముఁ దీర్చి పరిశుద్ధహృదయుఁడై గురుఁడే పరమేశ్వరుఁ డనుస్థిరవిశ్వాసము కలిగి గురుజపము, గురునామస్మరణముఁ

వేఱొక నన్య మెఱుఁగక గురునాజ్ఞను దలదాల్చి దినకృత్యములు నడపి గురుశుశ్రూషా పరవశుఁడై గురుఁడు నిద్రపోవునప్డుఁ బాదపద్మారాధన మొనరించుచు గురుఁడు నిద్రాముద్రితుఁడైనవెనుక నాతఁడు వట్టినేలమీఁద నొకనిద్ర తీయువాఁడు, మరల వేకువవేళఁ బెందలకడ లేచి యీప్రకారమే మెలంగుచు గురుహృదయమును జూఱగొనెను.

ఈవిధముగా రైభ్యుఁడు గురుశుశ్రూష చేయుచు మహాక్లేశదాయక మగువిద్యార్థిదశను నిశ్చలుఁడై, నిరుపమానవ్రతదీక్షితుఁడై కడపుచుండ నీతనిపై నమితవాత్సల్యము కలిగిన గురుదేవుఁ డీతనికి విన్నమాత్రనే సుస్థిరముగా హృదయమున నెలకొనునట్లు సర్వవేదశాస్త్రములను నేర్పెను. రైభ్యుని గురుభక్తికి గురుకటాక్షలబ్ధమైన విద్యావినయసంపత్తికి దేవతలు మెచ్చి వచ్చి యాకసమునుండి యీతనిపైఁ బుష్పవర్షముఁ గురిపించుచుఁ దమ యాహ్లాదమును వెల్లడించుచుండువారు. ఆహా! గురుకృపవలన సమకూరనిదిగలదే! గురుకటాక్షమే సర్వదేవతాకటాక్షసాధక మనుటకు, సంప్రదాయసిద్ధముగ గురుముఖమున శుశ్రూషాధన మనుదక్షిణ యిచ్చి నేర్చుకొన్న విద్యయే బ్రహ్మవిద్యాసాధక మనుటకు రైభ్యమహాము విద్యార్థిదశయే సాక్షిభూతము.

రైభ్యమహర్షి సర్వవిద్యలు నిట్లు నేర్చి బ్రహ్మజ్ఞానము నవి తనకుఁ బ్రసాదింప హృదయమందలికలంక దేఱి గురునాజ్ఞ నాతని వీడుకొని బ్రహ్మజ్ఞానము సుస్థిర మొనర్చుకొనుటకై బృహస్పతికడ కేఁగి యాతనికటాక్ష మర్థించెను.

## రైభ్య బృహస్పతి సంవాదము

బృహస్పతి రైభ్యుని మిక్కిలి యాదరించి యాతనికిఁ గలిగినసంశయము లెల్లఁ దీర్చి యెప్పు డేసంశయము కలిగినను దనకడకు యథేచ్ఛముగా విచ్చేసి తీర్చుకొనవచ్చు ననియు రైభ్యునియంతటి గురుభక్తుని, విద్యావినయసంపన్నుని దా నొం డెడఁ జూడలే దనియుఁ బలికి యాతనిఁ గటాక్షించెను. నాఁడు మొదలు రైభ్యమహాముని భూలోకమున నొకచక్కనియాశ్రమము నిర్మించుకొని బృహస్పతికడకు దివికి వచ్చి పోవుచు నాతనికటాక్షమునకుఁ బాత్రుఁడయ్యెను.

ఒకప్పుడు రైభ్యున కొకసంశయము కలిగెను. మోక్ష సంపద కర్మలు చేయుటవలన లభించునో లేక విజ్ఞానము గడించుటవలన లభించునో దేనివలన సులభముగా లభించునో యాతనికి విస్పష్టము కావలసియుండెను. సంశయములను దర్క సాధనమునఁ దీర్చుకొనవచ్చును గాని సంశయరహితులు సమ్యక్ జ్ఞానులు నగుపెద్దలు లభ్యులగునపుడు వారి నడిగి తెలిసికొనుట కంటె నుత్తమమార్గము లేదు. ఇటు లెంచి రైభ్యుఁడు బృహస్పతికడకుఁ బోవఁ దలఁచి బయలుదేఱి వసుమహారాజుకడకు విచ్చేసెను. వసువు రైభ్యుని భక్తిశ్రద్ధలఁ బూజించి యాతఁడు పోవలసినపని, తావు తెలిసికొని యిరువురును గలిసి బృహస్పతి బ్రహ్మలోకమున బ్రహ్మతో మాటాడ నేఁగినట్లు విని బ్రహ్మలోకమున కేఁగి నలువహజారముముందువాకిట నిలఁబడి యుండిరి.

కొంతసేపటికి బ్రహ్మ వీడ్కొలుప బృహస్పతి శిష్య సమేతుఁడై బయటికి వచ్చి ముందువాకిటఁ జొచ్చి యట నున్న

వసురైభ్యుల నాదరించి వారిసాష్టాంగ నమస్కారములు నుప చారములు నంది వారినిగూడి బృహస్పతి స్వర్గలోకమున కేఁగి యటఁగల తనదివ్యమందిరము లోపలిభాగమునఁ జంద్రశిలాస నముల వారిని గూర్చుండ నియమించి తాను లోని కేఁగి వచ్చి సుఖాసీనుఁడై యాదరమేదుర వచనముల వారి క్షేమము లడి గెను.

అపుడు రైభ్యుఁడు "దేవా! మోక్షము కర్మవలననో సుజ్ఞానముననో దేనివలన సులభముగ లభించునో తెలియఁజెప్పు" మని ప్రార్థించెను. అంత బృహస్పతి "మునీంద్రా! తామర పాకు నీటినిఅంటనివిధమున, మానవుఁడు సత్కర్మములను గాని దుష్కర్మములను గాని కర్తృత్వము గనక యీశ్వరార్పణ ముగా నొనరించుచో వానివానిఫల మాతని నంటదు. దీని కొకపూర్వగాథఁ దెలిపెద వినుము. అత్రిగోత్రిసంభవుఁడైన సంయమనుఁ డనుమహర్షి తీర్థయాత్రాపరుఁడై భాగీరథికిఁ బోయి యాతీరవనమున సంచరించుచుండఁగా విష్టరకుఁ డను నొకబోయవాఁడు విల్లమ్ములఁబూని లేడిగుంపులవెనుకఁ బరుగె త్తుకొని యమునివలె వచ్చుచుండుటఁగనిదయార్ద్రహృదయుఁడై "ఓయీ! నిషాదా! బాణము మేయకుము మేయకుము. ఈలేడి పిల్లలు నీ కేమియపకారము చేసినవి? పాపము వానిసి జంపకు"మనెను. అంత నాతడు "అయ్యా వీనిని జంపుటకుఁ గాని చంపకపోవుటకుఁ గాని నే నెవ్వఁడను? శిశువు మట్టితో నెద్దుఁ జేసి వెంటనే చెడఁగొట్టునట్లు, ఇసుకతో బొమ్మరి ల్లొనర్చి వెంటనే కూల్చునట్లు ఈశ్వరుఁడు సర్వసృష్టి యొనర్చి లీలాత్ముఁడై చెఱచును. ఆత్మవ్రీణితమై ప్రపంచము

వికృతిఁ బొందును. మన కహంభావ మనుచితము. ఇది యెఱింగినవివేకులు మనవలె నహంకరింప” రనెను. సంయమనుఁ డాశ్చర్యపడి “ఓయీ! నీ విట్లు పలుకుటకుఁ గారణ మే”మని యడిగెను. అంత నాతఁడు పీపున నున్న లోహాపువలఁ దెచ్చి ముందర వైచి దానిలో అగ్ని నెలకొల్పు మనెను. సంయమనుఁ డది చేయలేకపోయెను. పిదప, బోయవాఁడు మంటలు పుట్టించి వాని నార్పి “మహాత్మా! అగ్నిహోతుఁడు మూలనాశనము నందిన బహుముఖశిఖలు మాయమగువిధమున, పరమాత్ముఁడు ప్రకృతిస్థితుఁడైన భూతములు క్షయించును. ఆతఁడు వికృతుఁడయిన మరల నవి పుట్టును. ఇదియే సకలప్రపంచస్థితి. శరీర గ్రహణకర్మమున నెవ్వని కేది విహితమో యాకర్మము చేసి పరమాత్మునకి సమర్పించెనేని వాఁడు ఫలము నందఁ” డని చెప్పెను. అప్పుడు తత్క్షణమే విష్టకునితలపై దేవత లాతని తత్త్వజ్ఞతకు మెచ్చి పుష్పవర్షముఁ గురిపించిరి. పిదప దివ్య విమానములతో సిందాద్రిదు లాయద్వైతవివేకనిధానునిఁజూడ విచ్చేసిరి. అనంతరము పరమతత్త్వ మగువిష్ణు ననేకమూర్తిగా నెఱుఁగు మని చెప్పినట్లు అన్నివిమానములలోను బోయువాఁడు పెక్కురూపుల నధిష్ఠించెను. ఇది చూచి సంయమనుఁ డమితా శ్చర్యమంది నిజాశ్రమమున కేఁగెను.

కావున అట్లు సుజ్ఞానమంది స్వజాతీయకర్మతత్పరుఁడైన వాఁడు మోక్షమందును. అని బృహస్పతి బోధింప విని బృహస్పతివలన నద్వైతజ్ఞానాభ్యాసము చేసి బ్రహ్మానందులై రైభ్యవసువులు తమతమయిక్కల కేఁగిరి. పిదప, వసుమహారాజు

అఖిలవేదాంతవేద్య మహం భజామి
సంభవక్షయరహిత మహం భజామి
సాసిచక్రాబ్జశార్ఙ్గ మహం భజామి
కుంభసాగరశయన మహం భజామి.

నమామి మధుసూదనం నవపయోదనీలత్విషం
నమామి పరమేశ్వరం నఖరభిన్నరాత్రించరం
నమామి పురుషోత్తమం నలినగేహినీనాయకం
నమామి కరుణాస్పదం నగధురీణతా దక్షిణం

అను పుండరీకాక్షపారస్తవమున మోక్షమందెను.*

### రైభ్యుని గృహస్థాశ్రమము

ఇట్లు బ్రహ్మజ్ఞాని యైన రైభ్యమహర్షి పితరులఋణముఁ దీర్చుటకై యొకయుత్తమకన్యను వివాహమాడి గృహస్థాశ్రమము నిర్వహింపఁజొచ్చెను. కాలక్రమమున మహాపతివ్రతయగు నామెవలన రైభ్యమహర్షి యిరువురుపుత్రులను గాంచెను. వారి కాతఁడు 'అర్వావసువు' 'పరావసువు' అను పేళ్లిడి పెంచి యుక్తవయస్సు రాఁగానే వారి కుపనయన మొనరించి తన కడనే యుంచుకొని వేదాధ్యయనసంపన్నుల నొనరించెను వారును దండ్రిమాట జవదాటక శీఘ్రమే తండ్రిదయవలనఁ గృతాధ్యయనశూరు లైరి. రైభ్యుఁడు పుత్త్రులిరువురతో వేదములు చదువునపుడు బ్రహ్మాదులు, బృహస్పతిప్రముఖులు వచ్చి వీరిని మెచ్చుకొని యాశీర్వదించి వెడలుచుండెడివారు. వీరికి సర్వవిద్వల్లోకపూజ్యతయును మిక్కిలి లభించెను. ఆహా!

* వరాహపురాణము.

ఉత్తముఁ డగుతండ్రి యడుగుజాడల నడిచి తమకీర్తిచంద్రికల నాతనికీర్తిచంద్రికల రెట్టింప నిగర్వచూడామణులై పితృపూజ చేయుపుత్త్రులఁ బడసినతండ్రియే తండ్రికదా ! అట్టియదృష్టము రైభ్యమహర్షికిఁ గలిగెను.

## రైభ్య భరద్వాజ వృత్తాంతము

సమీపాశ్రమమున నున్న భరద్వాజమహర్షి రైభ్యమహర్షితో సఖ్యము నెఱపి, యనఘులైనయిరువురు నన్నదమ్ముల వలె మెలఁగుచు సుహృదులై, విశుద్ధతపోనిశ్చితమతులై యావనమున దివ్యదీక్షతోఁ దప మొనరించుచుండిరి. కాలక్రమమున విద్వత్పూజితులై వెలయుచున్న అర్వావసువు, పరావసువులను జూచి భరద్వాజపుత్త్రుఁ డగుయవక్రీతుఁడు మిక్కిలి యసూయ చెందెను. అసూయాపిశాచము సామాన్యమానవులనే కాక ఉత్తమఋషిపుత్త్రులనుసైత మావరించి ముప్పతిప్పలఁబెట్టును గదా !

ఇట్లు యవక్రీతుఁ డసూయపడి రైభ్యపుత్త్రులకంటెఁ దా నెక్కువ విద్వాంసుఁ డ నని యనిపించుకొనఁదలఁచి తపోబలమున దానిని సాధింప నెంచి యగ్నిని వేల్చి మహాతపమునకుఁ గడంగెను.

కొంతకాలమున కాతని కిందుఁడు ప్రత్యక్షమై చదువ కుండ సర్వవేదశాస్త్రములు తనకు రావలయు నన్నయాతని యుద్దేశ మెఱిఁగి "ఓయీ! గురుముఖమునఁగాక తపమునఁబడసినవిద్య యెట్టిసత్పురుషులకైన నుమదమాత్సర్యములఁబుట్టించును కాననిదివిద్యోపార్జన కుపాయముకా"దని నిరసించిపోయెను. కాని

యవక్రీతుఁడు తపము మానఁడాయెను. కొంతకాలమునకు మరల దేవేంద్రుఁడు ముసలిబ్రాహ్మణరూపమున నాతనికడకు వచ్చి బక్కచిక్కినశరీరముతో గుప్పెడిసుకఁ దీసికొని నదికి సేతువు గట్టవలె ననుచు నుండెను. ఆతనిం జూచి నవ్వి యవక్రీతుఁడు పరిహసించెను. ఇంద్రుఁడు నిజరూపముం జూపి నీతపము నిట్టిదే యనెను. ఏమన్నను యవక్రీతుఁడు మాత్రము పట్టు విడువక తప మొనరించుచుఁ దుదకు దేవేంద్రునివలన వరము వడసి యింటికిఁ బోయి తండ్రి కెల్ల వినిపించెను.

## వేదగీతలు

మహానీయ గుణగరిష్ఠుఁ డగుభరద్వాజుఁడు పుత్త్రునివిద్యాగర్వ మెఱింగి యతనికి మంచి బోధింపఁ దలఁచి "వత్సా! తొల్లి బాలధి యనుముని మహాతప మొనరించి దేవతలదయఁ బడసి చిరంజీవి యగుమేధావియను కొడుకును గాంచెను. ఆతఁ డాయుష్యగర్వమున మునుల నెవ్వరిని లక్ష్యపెట్టక ధనుషాక్షుఁ డను మహర్షిని జేరి గర్వోక్తు లాడెను. ఆమహానీయుఁడు తపఃప్రభావమున మేధావిని భస్మపటల మొనర్చెను. కావున గర్వ మెవ్వరికిని బనికిరాదు, గర్వము విడిచినవాఁడే యుత్తముఁ" డని వేదగీతల యర్థమును బోధించెను. యవక్రీతుడు బుద్ధి తెచ్చుకొంటి ననెను. భరద్వాజుఁడు సంతసించి యిఁక నీవు పరమశాంతు లైన రైభ్యపుత్త్రులయెడ నిర్మత్సరుఁడవై రైభ్యమహర్షిని నాకన్న నెక్కుడుగాఁ జూడవలెనని బోధించెను. అట్లే యనెను గాని యవక్రీతుఁడు మునిసభల గర్వియై యుండెను. ఒకప్పుడాతఁడు రైభ్యునియాశ్రమమున కేతెంచెను.

## రైభ్యుఁడు యవక్రీతుని జంపించుట

రైభ్యుని యాశ్రమవనము మనోహరములైన కీరమయూర కోకిల నినాదములతోడను, బహుపుష్పభరితములగు లతలతోడను, ఫలసహితములగు వృక్షములతోడను నుండెను. ఆ యారామమున యవక్రీతునకు రైభ్యునికోడలు, పరావసువు భార్య యగునొక చక్కనిచుక్క కానవచ్చెను. ఆతఁ డామెఁ జూచి మన్మథపీడితుఁడై సమీపించి తనవాంఛఁ దెలిపెను. ఆమె శాపభయమున నంగీకరించినట్లు నటించి యేదో నెపమునఁ దప్పించుకొనిపోయి మామయగు రైభ్యునితోఁ జెప్పెను.

అనాయాస పిశాచగ్రస్తుఁడగు యవక్రీతుఁడు దన కేదో యపకృతిచేయుచునే యుండుననియుఁ దానూఱకున్న నాతఁడు నిరంతరము తనకు మనఃఖేద మొదవించుచునే యుండునని యెంచి రైభ్యుఁడు అగ్నినివేల్చి యొకజట యందు వేల్చి తనకోడలి కంటె సుందరి యైనయొక కాంతను, మఱియొకజట వేల్చి యొక క్రూరరాక్షసుని బుట్టింప వారు రైభ్యునికి నమస్కరించి తమ పని యేమని యడిగిరి. యవక్రీతుని వధించి రండని రైభ్యుఁ డనెను. వెంటనే యాతరుణి యవక్రీతుం జేరి యాతనిచేతిలోని కమండలువుఁ గైకొనెను. అపు డపవిత్రుఁడైన యవక్రీతుని రాక్షసుఁడు తాఁకెను. యవక్రీతుఁడు భయపడి పాఱి చెఱువులు, నదులు, చొచ్చిన నవి యెండిపోయెను. ఆతఁడు పాఱి వచ్చి తండ్రి యగ్నిహోత్రమున దాగెను. కాని వెంటనే రాక్షసుఁడాతనిం జంపివేసెను.

ఆరాక్షసుఁడు, ఆస్త్రీ మరల రైభ్యునికడకు వచ్చియుండ నాతఁ డామె నారాక్షసుని కిచ్చి యిరువురు యథేచ్ఛము పొం డని పంపివేసెను.

**రైభ్య భరద్వాజుల మరణము, పునర్జీవనము**

భరద్వాజుఁడు చచ్చిపడియున్న పుత్త్రిం జూచి విలపించి యాతనిగర్వమే యాతని నింత చేసెనని పలికి పుత్త్రినకు దహన సంస్కారాదుల నిర్వర్తించి పుత్త్రిదుఃఖము భరింపలేక తానును దేహత్యాగము చేసికొనెను.

ఇట, రైభ్యునిపుత్త్రిలగు అర్వావసు పరావసువులం బృహద్ద్యుమ్నుఁ డనురాజుసత్త్రియాగమునఁ దండ్రియనుజ్ఞచే ఋత్విజులై యుండిరి. ఒకరాత్రివేళ పరావసువు తనతండ్రి యింటికి వచ్చుచుఁ గన్నుఁ గన్నుఁగాననిచీకటిలో నొకమృగము తనపైఁ బడిపాటిపోఁగా నదియే యను తలంపున దండము విసర నది నిద్రించు తనతండ్రియగు రైభ్యునకే తగుల నాతఁడు వెం టనే మరణించెను.

పిదప అర్వావసువు తపోవ్రతదీక్షాదులకు ధర్మతత్పరతకును మెచ్చి అగ్నిని ముందుంచుకొని దేవతలు విచ్చేసి వలసినవర ములు కోరుకొమ్మని యాతనిని వేఁడిరి.

అర్వావసు వానందించి రైభ్య భరద్వాజ యవక్రీతులుం తిరిగి బ్రతికివచ్చునట్లు యవక్రీతుని యనూయాగుణము మాయు మగునట్లు వరము కోరెను. దేవత లాతని హృదయశుద్ధతకును మెచ్చి యట్లే యొనరించిరి.

అపుడు యవక్రీతుఁ డాదేవతలకు నమస్కరించి "దేవతు లారా! నేను మహాతపస్సు చేసి యింద్రుని మెప్పించి సర్వవేద

శాస్త్రపారంగతుఁడనైతిని. అనేకవ్రతము లొనరించితిని. ఐనను వానికి రైభ్యునిముందు తక్కువగుటయు నాతనివలన నేను మృతినందుటయు నెట్లుజరిగె" నని యడిగెను. అంత వారు "*ఓయీ! గురుశుశ్రూష యొనర్చి మహాక్లేశము లనుభవించి పొందినవిద్యలు వన్నెకెక్కును గాని వేఱువిధమున సంపాదించిన విద్యలు సత్ఫలము నీయవు. నీవు గురుముఖమునఁ గాక యన్యవిధమున విద్య లార్జించితివి. రైభ్యుఁడు మహాభక్తుఁడై సంప్రదాయసిద్ధముగా గురుశుశ్రూషచేసి విద్యలు నేర్చెను. కావున నీవిద్యలు వ్యర్థములయ్యెను. గురుశుశ్రూషాసంతోషకరుఁడైన రైభ్యుఁడు బ్రహ్మజ్ఞానసిద్ధిఁ గాంచి దివ్యశక్తిఁ బడసి మహానుభావుఁ డయ్యె" నని తెలిపి యదృశ్యులైరి. యవక్రీతుఁడు జ్ఞానము కలిగి రైభ్య భరద్వాజులకు మ్రొక్కి అర్వావసు పరావసువులఁ గౌఁగిటఁజేర్చి యేకోదరప్రేమ మలవఱచుకొని సుఖముండెను.

## రైభ్యుని తీర్థయాత్ర

తరువాత రైభ్యమహర్షి తీర్థయాత్రల నారంభించి అనంతశాయి నారాధించి, రంగధామునకు నమస్కరించి, కంచి వరదరాజును దర్శించి, వేంకటాద్రీశు సేవించి, అహోబలేంద్రునకు మ్రొక్కి, సింహాచలనాయకుని సేవించి, శ్రీకూర్మపతిని బొడగాంచి, పురుషోత్తముని బూజించి ఆయాస్థానములఁగల నదుల పోలనాడి భాగీరథిని సేవించి, ప్రయాగ కేఁగి, పిదప పితౄణమోచనకై గయ కేఁగెను. గయలో నాతఁడు ఫల్గునీనదిలో స్నానముచేసి గదాధరుని గొల్చి పితృపర్వతముఁజేరి కులగోత్ర

*భారతము వనపర్వము.

నామములఁ బేరెలుంగునఁజెప్పి పితరులఁబూజించి ఉపవాసమున నాదిన మటఁ గడపి సూర్యోదయమగుసరికి నిత్యనైమిత్తికములు తీర్చి పిండప్రదానముచేసి యొకయక్షయవటము క్రింద బ్రాహ్మణోత్తములకుఁ బితృదేవతల నుద్దేశించి యపరాహ్ణమునఁ బిండప్రదానము లొనరించి పిదప జిహ్వోలోల రామగయాదులందుఁ బైతృకక్రియలు నిర్వర్తించి కృతకృత్యుఁడై యట నొకచో నుండి ఘోరతప మొనరించుచుండెను.

అంతఁ గొంతకాలమున కొకదివ్యవిమానమునఁ బరమాణుసమాన దేహుఁ డగునొకదివ్యపురుషుఁడు ప్రత్యక్షమయ్యెను.

### రైభ్యసనత్కుమారసంవాదము

అతఁ డట్లు ప్రత్యక్షమై రైభ్యునితో
"బ్రహ్మవిజ్ఞానసూనసౌరభ్య! రైభ్య!
యిట్టి ఘోరతపోనిష్ఠ నేల యుంటి?"

యని యడిగి క్షణమాత్రిలో సూక్ష్మాకృతి వీడి బ్రహ్మాండమైన రూపము ధరించి సప్తసముద్రమధ్యభూభాగము నిండెను; ఆకాశము నతిక్రమించెను. దశదిశలు వ్యాపించెను. అట్టియామహనీయుని కాశ్చర్యభయభక్తియుక్తుఁడై రైభ్యుఁడు మ్రొక్కి- "మహాత్మా! నీసూక్ష్మాతిసూక్ష్మరూపము నింతటిమహారూపముఁ జూపిన నీవెవఁడవో తెల్పి కటాక్షింపు"మని కోరెను. ఆతఁడు "వత్సా! నేను జనలోకవాసిని రుద్రసితమ్ముఁడను. బ్రహ్మమానసపుత్రుఁడను. సనత్కుమారుఁడను. నీవు మిక్కిలి కృతార్థుఁడ వగుట నిన్నుఁ జూడఁ జనుదెంచితి" ననెను. అంత

రైభ్యుఁ డాతనికి సాష్టాంగనమస్కారము లొనరించి "మహాత్మా!
నేను కృతార్థుఁడ నైతిని? జపతపములు చేసితినా? యజ్ఞ
యాగము లొనరించితినా? మీవలెఁ బరతత్త్వ మెఱిఁగితినా?"
యని యడిగెను. సనత్కుమారుఁడు "నీవు గయాక్షేత్రమునఁ
బిండప్రదానము లీయఁగంటివి. ఇంతకంటెఁ గృతార్థత యేది?"
యని రైభ్యునకు గయామాహాత్మ్యముఁ దెలిపి మేలగు నని
యాతని దీవించి యదృశ్యుఁ డయ్యెను.

## రైభ్యుఁడు మోక్షమందుట

పిదప రైభ్యుఁడు భక్తియుక్తుఁడై ఘోరపాపము లను
మహారణ్యములకుఁ గార్చిచ్చును, తమోగుణ మను పిశాచతతికి
పిడుగుతునుకయు, సంసారజరామరణము లను దూదిపింజల కగ్ని
హోత్రుఁడును భయరోగదుఃఖపక్షులకు సాళువమువంటివాఁ
డును తన పాదములు గొల్చువారికిఁ గల్పవృక్షమైనవాఁడు నగు
గదాధరుని గఠోరదీక్షఁబూని సేవించెను. కొంతకాలమునకు
విష్ణు వాతనికిఁ బ్రత్యక్షమై యభీష్టము వేఁడు మని పలికెను.
రైభ్యుఁ డమితానందమున నాతనిపాదపద్మముల వ్రాలిపోయి,
"దేవాదిదేవా! నన్నుఁ గటాక్షించి నాకు సనకాదులు వసిం
చులోకముఁ బ్రసాదింపు"మని కోరెను. విష్ణు వట్లే యని యా
తనిఁ గటాక్షించి యదృశ్యుఁ డయ్యెను. మఱుక్షణముననే
రైభ్యమహర్షి శౌరివరమునఁ దత్త్వవిజ్ఞానఘంటాపథము వెంటఁ
గైవల్యకోకిలోద్యాన మగు సనకాదులలోకమునకు దివ్యవిమాన
మున నేఁగి మోక్షసామ్రాజ్యమును జూఱగొనెను.

# శ్రీమహర్షి జీవితకథామృతము

## రోమశ మహర్షి

### స్తుతి

సర్వతీర్థాభిగమనంబు సర్వతీర్థ
తత్త్వవిజ్ఞతఁ గన్నయుత్తమతనుండు
అమరపూజితుఁ డైనమహాతపస్వి
యైనరోమశు దేవర్షి నభినుతింతు.

రోమశుఁ డనుముని బాల్యమునుండియు బ్రహ్మచర్యవ్రతముఁ బూని మహాతపస్సు చేసి ఆత్మజ్ఞానమును సంపాదించెను. ఆపిదప నాతఁడు భూభాగమునఁ గలసర్వతీర్థములను సేవించి యనంత మగుపుణ్యము నార్జించెను. రోమశుఁడు సంపాదించినపుణ్యవిశేషమువలన నాతఁడు సమస్తదేవతాపూజితుఁడై భూలోకమునఁ గొంతకాలము స్వర్లోకమునఁ గొంత కాలము నివసింపఁజొచ్చెను. సర్వలోకములందును స్వేచ్ఛగా సంచరించుశక్తి యీతఁడు సంపాదించెను. నాఁటినుండి యీతఁడు దేవర్షిగనే పరిగణింపఁబడుచు నింద్రాదులపూజ లందుచు ధర్మతత్పరుఁడు, అస్ఖలితబ్రహ్మచర్యుఁడు, అతిపవిత్రజీవనుఁడు, అజరామరుఁడు, అనంతశక్తిసంపన్నుఁడు, అమరహితుఁడునై యింద్రునికిఁ దలలో నాలుకవలెఁ బరమమిత్త్రుఁడై యుండెను.

## ఇంద్రుఁడు రోమశుని బ్రార్థించుట

ఒకనాఁడు లోకసంచారము చేసి రోమశమహాముని సుధర్మ యనుపేరు గలయింద్రసభకు విచ్చేసెను. వచ్చుటతోడనే యాతఁడు ఇంద్రునిసింహాసనమున నాతనితోపాటు అర్జునుఁడు కూర్చుండియుండుటఁ జూచి మిక్కిలి యాశ్చర్యపడి నిలచియుండెను. అప్పు డింద్రుఁడు రోమశమహామునిని బూజించి యర్ఘ్యాసనమునఁ గూర్చుండ నియమించి "మునీంద్రా! ఈతఁడు పాండురాజుక్షేత్ర మగుకుంతియందు మదంశమున జనించిన పుత్రరత్నము. ఈతఁ డన్నయగు యుధిష్ఠిరునాజ్ఞఁ బాలించి యింద్రకీలపర్వతమున నన్నుఁ గాంచి నాయనుజ్ఞఁ గొని హిమశైలశిఖరముఁ జేరి యీశ్వరునిగుఱించి మహాతప మొనరించెను. తుద కీతఁ డాతనియనుగ్రహమున సర్వలోకసంహారసాధన మగు పాశుపతాస్త్రమును బడసెను. ఆపిదప లోకపాలురచే వారివారి దివ్యాస్త్రములను, నావలన ననంతమహిమాస్పదము లగునస్త్రములను బొందెను. చిత్రసేనుఁ డనుగంధర్వునివలన నృత్తగీతముల నేర్చెను." అని చెప్పి యర్జునునకు రోమశమహర్షిమహిమను వివరించి చెప్పెను. వెంటనే యర్జునుఁ డాసనము దిగి వచ్చి రోమశునకు సాష్టాంగనమస్కార మొనరించెను. రోమశుఁ డాతనిని గ్రుచ్చికౌఁగిలించుకొని లేవనెత్తి పాండవులధర్మతత్పరత, అర్జునునిశక్తిసంపదను శ్లాఘించెను. అనంతర మాతని యాదేశమున నర్జునుఁడు మరల నింద్రపీఠ మలంకరించెను.

పిదప నింద్రుఁడు రోమశునితో "మునివర్యా! ని న్నొకటి యర్థించెద. నీవు భూలోకమున కేఁగి ధర్మజాదులకు అర్జునునిక్షేమవార్తఁ దెలిపి యిదివఱకే శుద్ధుఁడయి యున్నను

ధర్మజు నింకను దీర్ఘయాత్రలు చేయించి పరమపరిశుద్ధు నొనరింప వలయును, శుద్ధసువర్ణమున కే కదా పుటములు పెట్టుటవలన నిత్యోధిక మగుకాంతి కలుగును? నీవు సర్వతీర్థములు చూచి తీర్థ తత్త్వమును గడదాఁక మథించి తీర్థనవనీతమును జబ్బనమూజ లుగా గడించినమహనీయుఁడవు. కావున, మా కీయుపకృతి నొనరింప నిన్నుఁ బ్రార్థించుచున్నా"నని పలికెను. రోమశుఁ డాపలుకు లాదరించి "ఇంద్రా! నీవింతవట్టు చెప్పవలయునా? నే నట్లే తప్పక చేసెదను. ధర్మమార్గమునఁ జరించుచు ధర్మ తత్పరు లైయున్న పాండవులకు హితము చేయుటకంటె మనకుఁ గావలసిన దేమున్నది? నామనస్సు కూడ నింకొకపరిఁ దీర్థయా త్రలుచేయ నువ్విళులూరుచున్నది."అని యుద్జను నాశీర్వదించి యింద్రునివీడు కొని యాతఁడు భూలోకమునకు దిగి వచ్చు చుండెను.

## రోమశధర్మరాజసమాగమము

అంతకుఁ బూర్వమే ధర్మజాదులకు దర్శనమిచ్చిననారద మహాముని తీర్థపరమార్థమును బోధించి దేవర్షి యగురోమ శుఁడు వచ్చు ననియు నాతనితో నెల్లతీర్థముల నోలలాడి తరిం పుమనియుఁ జెప్పిపోయెను. అందుచే ధౌమ్యాదులతో నున్న ధర్మజుఁడు రోమశమహామునిదర్శనము నెదురుచూచుచునే యుండెను.

అంత రోమశమహర్షి రాఁగానే సర్వదేవతలు దేవేం ద్రునివలె ధర్మజుఁడు సపరివారముగా నామహర్షి కెదు రేగి యర్ఘ్యపాద్యాదుల నధిక భక్తిని సేవించి కుశలమడిగి సుఖాసీనుఁ గావించెను. పిదప, రోమశుఁ డాతనితో నింద్రసభనుండి తాను

వచ్చుటయు, నర్జునుని పాశుపతప్రాప్తి, ఇంద్రునియర్ధాసనమున నాతఁడు క్షేమముగ నుండుట తెలిపి "యుధిష్ఠిరా! అర్జునుని క్షేమవార్త నీకుఁ దెలుపుటకును, తీర్థయాత్రోన్ముఖుఁడవైన నీచే సలక్షణముగా సర్వతీర్థసేవలఁ జేయించుటకు, నింద్రుని పంపున, నీతమ్ముని ప్రార్థనమున నే నిచటికి వచ్చియున్నాను. నే నిదివఱ కెన్ని పర్యాయములో తీర్థముల సేవించితిని. తీర్థసేవా పరులకును శాంతాత్ములకును, తపస్వులకును దుష్కరమున్న దే లేదు, నీవు తీర్థయాత్రవలన మహాపుణ్యము సంపాదింపఁగలవు. సుకృతులకే కాని తీర్థయాత్రపై బుద్ధిపుట్టదు. కాలమును వ్యర్థము చేయక త్వరలో యాత్రోన్ముఖుఁడవు కమ్మ"ని చెప్పెను. ధర్మజుఁడు మిక్కిలి సంతసించి రోమశునిపలుమాఱు స్తుతించెను.

## రోమశుఁడు ధర్మజునిచేఁ దీర్థయాత్రలు చేయించుట

పిదప, ధర్మరాజు క్షేత్రతీర్థదర్శనమునకు బయలుదేఱి, తనతో వచ్చెద మన్న కామ్యకవనవిప్రులను గూడఁ బెట్టుకొని రోమశునితో ధౌమ్యమునితో సోదరులతో, ద్రౌపదితో ముందునకుఁ బోయెను. అపుడు పర్వతనారదులు వ్యాసుఁడు వారికిఁ గానసై వారితీర్థయాత్ర నభినందించి రోమశమహర్షి కతమునను నది సఫలీకృత మగు నని చెప్పి వెడలిపోయిరి.

ధర్మరాజు రోమశునితో "మహాత్మా! అధార్మికులైనవారికి, దుర్మార్గులకు లోకమునఁ బెంపు గలుగుచున్నది. మఱియు దేవా! అచేతనము లైన జాలు లప్పులు, నదీసరములు పుణ్యతీర్థములై జగత్పావనములై జనులకుఁ బాపపరిహారము

చేయ సమర్థములై యున్నవి. ఈచిత్రగతికిఁ గారణము దయతోఁ జెప్పు" మనెను.

రోమశుఁ డిట్లనెను. "ధర్మనందనా ! అధర్మవర్తులయు, దుర్మార్గులయుఁ బెంపు క్షణభంగురము. అది యల్పకాలముననే వినాశము నందును. అధర్మవర్తు లగురాక్షసులు స్వర్గాదు లాక్రమించుట, త్వరలో వారు నాశమై ధర్మవర్తు లగుదేవతలు వృద్ధినందుట మన మెన్నిపర్యాయములు చూచియుండలేదు ? అధర్మవర్తులకుఁ గామక్రోధలోభమోహమదమాత్సర్యము లావహించి త్వరలోనే వారిని జెఱచును. మీరు దేవతలవలె ధర్మసత్యులు. కౌరవులు రాక్షసులవలె నధర్మవర్తులు. అందుచే మీకు విజయము వారికిఁ బరాజయము కలిగితీరును.

ఓధర్మజా ! ధర్మవర్తు లగుఋషులు, దేవతలు నాశ్రయించినకారణమునఁ దీర్థములు పవిత్రము లైనవి. తీర్థసేవవలనఁ గ్రతువులవలన, దానధర్మములవలన, బ్రాహ్మణాశీర్వచనములవలన జనులు సర్వదుఃఖవిముక్తు లయి శుభము లందుదురు."

ఇట్లనేకధర్మములు చెప్పుచు రోమశుఁడు పాండవులను నైమిశము, అశ్వతీర్థము, గంగాఘోషము, కన్యాతీర్థము, గోమతి, బాహుద, మహానదులను, ప్రయాగ, గంగాయమునాసంగమము మున్నగుతీర్థముల నోలలాడించి యందు బ్రాహ్మణులకు గోహిరణ్యాదానములు చేయించెను. అనంతరము రోమశుఁ డాయాతీర్థములప్రభావముల వివరించుచు ముందునకుఁ దీసికొనిపోయెను.

అగస్త్యాశ్రమమున రోమశునివలన ధర్మజాదులు అగస్త్యచరిత్రము, వాతాపీల్వలమర్దనము, వింధ్యగర్వాపహరణము, అగస్త్యుడు సముద్రోదకముల నాపోశించుట, సగరసుతులు కపిలకోపాగ్నిచే భస్మమగుట, ఋశ్యశృంగుచరిత్రము, మాంధాతృచరిత్రము, సుకన్యోపాఖ్యానము, సోమకుండను రాజర్షిచరిత్రము, శిబిచరిత్రము, అష్టావక్రచరిత్రము, యవక్రీతచరిత్రము, మున్నగున వెన్నియో తేటతెల్లముగాఁ దెలిసికొనిరి.

పిదప, గంధమాదనప్రాంతమున భీమునికోరికపై ఘటోత్కచుఁడు చనుదెంచి ధౌమ్యపాండవ ద్రౌపదులను దా నెత్తుకొని మిగిలినవిప్రుల నెత్తుకొనిఁచ్చుటకుఁ దనరాక్షసబలముల నియమించి వారికి బహుబాధాకరమైన యామార్గమున నడువవలసినశ్రమఁ దప్పించెను. అప్పుడు రోమశమహర్షి సిద్ధగతిని బయనించెను. ఇట్లు వీరందఱు ఆకాశమార్గమునఁ జని గంగాతీరమునఁ గల నరనారాయణాశ్రమమున దిగిరి. అచట, తియ్యని మనోహరమైన ఫలములతోడను, చక్కనియాకులతోఁ బూవులతో నొప్పుబదరీవృక్షములక్రింద సేదదీర్చుకొని గంగానదిలో స్నానపానాదికృత్యములఁ దీర్చుకొని నియమవ్రతులై మైనాకశైలము, హిరణ్యశిఖరము, బిందుసరస్సు మున్నగునవి చూచియందాఱుదినములు వారు నివసించిరి.

అనంతరము వా రనేకదివ్యస్థలములు గాంచి ఆర్ష్టిషేణుఁడను ఋషియాశ్రమమునఁ గొంతకాలము వసించిరి. ఆతరువాత నింద్రుఁ డర్జునుని దీసికొనివచ్చి ధర్మజాదుల కొప్పగించి వెడలిపోయెను. అర్జునుఁడు వారెల్లరకు ధర్మరాజాదులను విడిచి యాతఁ

జేగినది మొదలు తిరిగి యట్టి జేరువఱకు జరిగిన యావద్వృత్తాంతము ప్రసంగువ్రచ్చినట్లు చెప్పెను.

పాండవులు రోమశునితో గంధమాదనపర్వతమున నాలు గేండ్లు గడపిరి. అంతకుఁ బూర్వము వా రరణ్యముల నాఱేండ్లు గడపిరి. అపుడు రోమశ మహర్షి పాండవేయుల కనేకధర్మ రహస్యములు బోధించి వారిని వీడుకొని స్వర్గలోకమునకుఁ బోయెను.*

## రోమశుఁడు వేదనిధిం గాపాడుట.

తొల్లి వేదనిధి యనునొక యుత్తమవిప్రుని కుమారుని గంధర్వకన్యలు వలచిరి. కాని, యాతఁడు నిశ్చలబ్రహ్మచర్య వ్రతమున వారి కొడంబడకుండెను. ఆకన్యలు నవయువతులు, అధికసౌందర్యశోభితలు, మనోహర విలాసవతులు నైనను, ఆ విప్రకుమారుఁడు వారిని జేకొనఁడయ్యెను. సామదాన భేదోపాయములు వ్యర్థములు కాఁగా నాగంధర్వ కన్యారత్నములు ఆనవమోహానునిపై మక్కువ విడువఁజాలక బలవంతముగ నాత నిపైఁబడి యాతనికి మరులుగొలుప యత్నించిరి. అంత నాతఁడు వారిని వెంటనే పిశాచస్త్రీలు కండని శపించెను. వారును దమ కోరిక నమ్మగుటకు, శాపప్రాప్తికి, వగచి యాతఁడును బిశాచ పురుషుఁడగుఁ గాకని తిరిగి శపించిరి.

ఇట్లు వా రన్యోన్యశాపగ్రస్తులై పిశాచరూపములఁ జరించుచుండిరి. తనకుమారుని వెదకుకొనుచు వేదనిధి, తమ కన్యల వెదకికొనుచు గంధర్వదంపతులు వచ్చి యొకరి నొకరు

* భారతము. వనపర్వము.

తెలిసికొని యాక్రందించుచుండిరి. ఇంతలో నచటికి రోమశ మహర్షి తీర్థయాత్రాకారణమున విచ్చేయఁగా నాపిశాచము లేతనిని మ్రింగివేయ విచ్చేసి రోమశమహర్షి బ్రహ్మతేజోమహాత్త్వమున దందహ్యమానశరీరులై దూరమునకుఁ బాఱిపోయిరి. అప్పుడు వేదనిధి యామహర్షిని జేరఁ జని పాదపద్మములపైఁ బడి తనకుమారునియు గంధర్వకన్యలయు వృత్తాంతము నాతని కెఱింగించి రక్షింపు మని ప్రార్థించెను.

రోమశమహర్షి వేదనిధిం గని కరుణించి, "విప్రా! విచారింపకుము. వీరి కీపిశాచరూపములు పోవునుపాయము నేను చెప్పెదను. నాతో వచ్చి మీ రందఱును మాఘస్నానము చేయుఁడు. మాఘమాసమునఁ దీర్థస్నానము చేయఁగలిగిన వారికి సప్తజన్మములనుండి వచ్చుచున్నమహాపాపము లైనను క్షణమాత్రములో నశించిపోవును. హిమశైలోపరిభాగతీర్థము, బదరీవనతీర్థము సమస్తపాపములఁ బాపును. నర్మద, యమున, సరస్వతి, వీనిజలముల స్నాన మొనరించిన స్వర్గ మొసంగును. భాగీరథి, విష్ణులోకము, గౌతమి, కృష్ణవేణి మున్నగునదులు స్వర్గమును, నైమిశము విష్ణుసారూప్యమును,పుష్కరము బ్రహ్మసారూప్యము, కలిగించును. కురుక్షేత్రము దేవలోకమును, దేవహ్రదము దేవత్వమును, ప్రభాస రుద్రగణత్వము, హేమకూటము, మహాకాలము, ఆహతామరము, నీలకంఠము, అర్బుదము మున్నగుతీర్థములు రుద్రలోకమును,కలుగఁజేయును. ప్రయాగ యింకను ఫలప్రదము." అని చెప్పి ప్రయాగమహాత్త్వమును దెలుపువీరసేన భద్రకుల చరిత్రము నాతనికి వినిపించెను.

## దేవద్యుతి కథ

పిదప రోమశమహాముని వేదనిధికి దేవద్యుతి కథ యిట్లు చెప్పెను. "తొల్లి సరస్వతీనదీతీరమున 'యక్షప్రస్రవణ' మను పర్వత ముండెను. ఆప్రాంతవనమున నిరుపద్రవమైనపుణ్యాశ్రమము లు కలవు. అందు సుమిత్రుఁ డనుమునిపుత్త్రుఁ డగు దేవద్యుతి తపస్సు చేయుచుండెను. ఆతఁడు మండువేసవిని బంచాగ్నిమధ్యమున నిలిచి, శీతవాతదారుణసమయమున మొల బంటి నీట నిలిచి, గాలి, నీరు, కందమూలములు తిని కాల క్షేపము చేయుచు మహానిష్ఠాగరిష్ఠుఁడై తపము చేసెను. ఆ కఠోరదీక్షలో నాతని కస్థిచయము తక్క నొండు మిగుల దయ్యెను

తపఃప్రభావమునఁ గలిగినయాతని తేజము త్రిలోకము లకు వ్యాపించెను. ఆమహాత్ముని జూచి దేవమునిసంఘములు తల్లడిల్లెను. అధికశాంతియుతుఁడై తప మొనరించునామహా నీయుఁడు నిత్యము నుత్తమపుష్పములచే నారాయణుఁ బూజిం చుచుఁ బురుషసూక్తమునఁ గలరీతిని షోడశోపచారము లర్పిం చుచు నుండ వైశాఖశుద్ధయేకాదశినాఁడు శంఖచక్రగదాపాణి యై యాతనికి విష్ణుమూర్తి ప్రత్యక్ష మయ్యెను. వెంటనే దేవద్యుతి సమ్మదాశ్రుకణకలిత లోచనుఁడు, పులకితశరీరుఁడునై సాష్టాంగప్రణామము లాచరించి లేచి నిలిచి నిటలతట ఘటి తాంజలియై యానందరస ప్రవాహమునఁ దేలియాడుచు నిట్లని స్తుతించెను. "వాసుదేవా! మురాంతకా! వనజనాభా! భక్త వత్సలా! కృష్ణా! కృపాసముద్రా! శ్రీహరీ! జగన్మయా! కేశవా! పరమపురుషా! నన్ను దయచూడుము. స్తుతి, స్తోత్ర, సంస్తు

త్యుఁడు సర్వము నీవే. వేదములు నీనిశ్వాసములు. బ్రహ్మ యనుపేర జగముల సృజించు శుద్ధసద్బ్రహ్మ నివాసభూతమగు బ్రహ్మపదార్థము నీవే. పరమతత్త్వవిదులు నిన్నుఁ బరతత్త్వ మని కీర్తింతురు. హరిహరబ్రహ్మలన్న నీవే. నీవు నిర్గుణుఁడవు. నీవు శుద్ధబుద్ధాత్ముఁడవు. చిన్మయుఁడవు. దేవాదిదేవా! భూతయోగజమైన చైతన్య మని నిన్నుఁ జార్వాకులు నుతింతురు. ఆనందసత్త్వవిధాద్వైతుఁడని నిన్నద్వైతులు శ్లాఘింతురు. సేవ్య సేవకభావవర్తనమున నిన్ను వేదవాది వర్ణించుచుండును. అహింస పరమధర్మమను జైనుఁడు నిన్నహింసారూపునిగా స్తుతించును. మహాదేవా! నీవు నన్నెప్పుడును గాపాడుచుండుము."

ఇట్లు యోగసార మనుపేరుగలస్తుతి యొనర్చిన విప్రుని గరుణించి హరి యదృశ్యుఁడయ్యెను. అట్లు హరికృపఁగన్న దేవ ద్యుతి పిశాచరూపమున దుఃఖించు చిత్రసేనుఁడను వానిని గరు ణించి ప్రయాగస్నానముఁ జేయించి యాతనిపిశాచజన్మ ముడి గించెను.

కావున, ఈకన్నియలు నీకొడుకు నీవు నేను బ్రయాగ స్నానము చేయుదము. దానితో వీరిశాపము లన్నియు వీడి పోవును." అనిచెప్పెను. వెంటనే వేదనిధి పేరెలుంగున పుత్త్రుని తోడను గంధర్వకన్నియలతోడను ఈసంగతి చెప్పి రోమశుని కడకుఁ దీసికొనివచ్చెను. అప్పుడు రోమశమహర్షి నిజశక్తికత మున వారి నెల్లరిని గగనమార్గమునఁ బ్రయాగకుఁ దీసికొని వచ్చెను. అచట వారి కాయాపుణ్యస్థలములు చూపుచు రోమ శుఁడిట్లనెను. "ఈప్రయాగతీరవేదిపై మున్ను బ్రహ్మ యజ్ఞము చేసెను. ఇది అసితతోయ వేణి. ఇందలిజలములు గ్రోలినవారికి

స్వర్గము లభించును. ఇది పరమపవిత్రము. విష్ణు వీందుఁ గ్రుంకి లక్ష్మిని బొందెను. ఊర్వశి యిందు స్నానమాడి శాపవిమోచనమంది స్వర్గమున కేఁగెను. ఇంద్రపదవి నధిష్ఠించిన నహుషుఁ డిందు స్నానముచేసి సుపుత్రుని గాంచెను. తొల్లి నరనారాయణు లిందుఁ గ్రుంకి యాఁకలిదప్పులు పోఁగొట్టుకొనిరి. కశ్యపుఁడు శంకరునిగూర్చి యిచటనే తపముచేసెను. భరద్వాజుఁడు నిటనే కొంతకాలము తపమొనరించెను. సనకాదులు యోగసిద్ధులు పడయుట కీతీర్థస్నానమే కారణము. ఇందు మోక్షార్థులకు మోక్షము, కామ్యశీలురకుఁ గామితార్థములు, సాధకులకు సిద్ధి లభించును." అని చెప్పెను.

రోమశమహర్షిమాట లాలించి వేదనిధి, పిశాచరూపముల నున్నయాతనిపుత్త్రుఁడు గంధర్వకన్యలు నందు స్నానము చేసి లేచినతోడనే పరమాశ్చర్యభరితముగా వారు దివ్యసుందర యౌవనవిరాజితదేహములను ధరించిరి.

## గంధర్వకన్యకల వివాహము

అపుడు వేదనిధి పుత్త్రుని బ్రియమారఁ గౌఁగిలించుకొని మూర్ధాఘ్రాణ మొనరించి యాతనిచేతను, గంధర్వకన్యలచేతను రోమశమహర్షికి భక్తిశ్రద్ధలతో మ్రొక్కించెను. గంధర్వదంపతులును దమకన్నియలకు శాపాంతమైన దని విని వచ్చి పుత్రికలఁ గౌఁగిలించుకొని రోమశమహర్షిని స్తుతించి యాతనికి మ్రొక్కించిరి.

అపుడు రోమశమహర్షి వారి నాశీర్వదించి వేదనిధి పుత్త్రుఁ డాకన్నియలఁ బాణిగ్రహణముచేసికొనవలె నని యాదేశించెను. గంధర్వకన్య లామాటలు విని బ్రహ్మానంద మంది

యిప్పటికైనఁ దమవాంఛ ఫలించినందులకు ఆ ఋషివర్యుని స్తుతించిరి. వేదనిధిపుత్త్రుఁడును దండ్రియాజ్ఞ రోమశుని యను శాసనము తలధరించి యాకన్నెలఁ బెండ్లాడుట కంగీకరించెను.

పిదప, విధ్యుక్తప్రకారమున దివ్యవైభవోపేతముగా గంధర్వకన్యావిప్రకుమారవివాహములు జరిపించి రోమశమహర్షి వారి నాశీర్వదించి వారెల్లరుఁ దనపాదము లంటి కన్నులకద్దుకొని మ్రొక్కఁగా సంతసించి, మేరుపర్వతప్రాంతమునకు వెడలిపోయెను.

వేదనిధియు గంధర్వదంపతులును వియ్యపునెయ్యముల నానందాంబుధి నోలలాడిరి. వేదనిధి కొడుకును కోడండ్రను దీసికొని యలకాపురమున కేఁగెను. గంధర్వదంపతులు తమ నివాసముల కేఁగి సుఖముండిరి. (పద్మపురాణము)

ఇట్లు రోమశమహర్షి తీర్థతత్త్వజ్ఞుఁడు, తీర్థయాత్రాపరులకుఁ గల్పభూజము, తీర్థమహత్త్వమును దీర్థపరమార్థమును లోకవ్యాప్త మొనరించినదివ్యర్షిగా మనకుఁ గనుపట్టుచున్నాఁడు. ఈతని బాల్యజీవితాదికము, తలిదండ్రులవృత్తాంతము, వివాహసంతానాదికవిషయము లేవియుఁ దెలియరావయ్యెను. అస్ఖలితబ్రహ్మచర్యుఁడై, బ్రహ్మజ్ఞానసంపన్నుఁడై, సర్వసిద్ధిసంయుతుఁడై సర్వలోకసంచారి, సర్వదేవపూజితుఁడుగా నీతఁడు కాననగుచున్నాఁడు. ఈతనిశిష్యులై కాని యీతనిమార్గ మవలంబించి కాని తీర్థజ్ఞులై తీర్థసేవాపరులై తీర్థపరమార్థమును బోధించుమహనీయులకు నాఁటినుండి రోమశు లను పేరు వచ్చి యుండవచ్చును. బకదాల్భ్యమహర్షి యనేకరోమశులను జూచితి ననుట యిందులకు నిదర్శనము.

# అ ను బం ధ ము

i

# దేవల మహర్షి

## దేవల నారద సంవాదము

పూర్వ మొకప్పుడు నారదమహర్షి దేవలమహర్షి యాశ్రమమునకు విచ్చేసి "ఋషీంద్రా! స్థావరజంగమాత్మకమైనయీప్రపంచము దేనినుండి పుట్టినది? ప్రళయకాలమున నెందు లయించుచున్నది? నా కిది చెప్పు" మని కోరెను. దేవలుఁ డిట్లు సమాధానము చెప్పెను. "నారదా! బ్రహ్మకు సృజించుకోరిక కలిగినపుడు పంచమహాభూతములనుండి ప్రాణులను సృష్టించును. బుద్ధిప్రేరితమైనకాలము పంచభూతములనుండి సర్వభూతములను గలిగించుచున్నది. పంచభూతములు, బుద్ధి, కాలము ఇవియే ప్రపంచసృష్టికి హేతుభూతములు. ఈ పంచభూతములు శాశ్వతములు, అచలములు, ధ్రువములు. కాలముతోఁ గూడి యివి మిక్కిలి తేజస్వంతము లగును. పృథివి, జలము, తేజము, వాయువు, ఆకాశము, కాలము, పూర్వకర్మవాసనలు,అజ్ఞానము అనునీయెనిమిది శాశ్వతములు. సకలభూతసృష్టి వినాశములకుఁ గారణములు. దేహము పృథివినుండి చెవులు ఆకాశమునుండి, కన్ను తేజమునుండి,ప్రాణము వాయువునుండి, రక్తము జలమునుండి కలుగును. రెండు కన్నులు, ముక్కు, రెండుచెవులు, తోలు, నాలుక, యివి

పంచేంద్రియములు. వీనికి విషయము లైదు: కనుట, వాసన చూచుట, వినుట, తాఁకుట, రుచి చూచుట. ఇంద్రియముల కీవిషయములు తెలియవు. జీవుఁడే ఈయింద్రియములవలన ఈవిషయములు తెలిసికొనుచున్నాఁడు. చిత్తము, మనస్సు, బుద్ధి, జీవుఁడు ఇవి ఒకదానికంటె నొకటెక్కువ. ఇంద్రియము లైదు, చిత్తము, మనస్సు, బుద్ధి ఈయెనిమిది జ్ఞానేంద్రియ ములు. పాణి, పాదము, పాయువు, మేహనము, ముఖము ఈయైదును గర్మేంద్రియములు. ఆహారాదులు కైకొనుట, నడచుట పురీషవీర్యాదులు విడచుట, మాటాడుట అన్నవి వీనిపనులు. ఇంద్రియములు తమవ్యాపారములను విరమించినపుడు నిద్ర యనునవస్థ. ఇంద్రియములు విరామమంది మనస్సు పనిచేయు నపుడు స్వప్నావస్థ. ఇందుసాత్త్విక, రాజసిక, తామసికము లగు వాసనారూపకము లగుసూక్ష్మవిషయములు పుణ్యపాపములఁ గూడుకొని యుండును. వీనిలో సాత్త్వికములే శ్లాఘాపాత్ర ములు. ఆనందము, కర్మసిద్ధి, జ్ఞానము, నిస్సంగత్వము మున్నగు నవి సాత్త్వికములు. ఆయామానవులకర్మముల ననుసరించి జాగ్రదవస్థలోఁ గలిగినత్రిగుణావస్థలు స్వప్నమున స్మృతికివచ్చు చుండును. జాగ్రత్స్వప్నవిషయములు, సుషుప్తియందుఁ బ్రత్య క్షముగాఁ దెలియుచున్నవి. జ్ఞానేంద్రియము లైదు, కర్మేంద్రి యము లైదు. ప్రాణశక్తి, మనస్సు, బుద్ధి, చిత్తము, తమస్సు, రజస్సు, సత్త్వము కలిసి పదునేడు. దేహి పదునెనిమిదవవాఁడు. దేహి నిత్యుఁడు. దేహ మనిత్యము. దేహి దేహమునుండి తొలఁగి నపుడు పైపదునేడు, అవిద్యకూడ నందు వసింపవు. అవిద్యావ లగుపదునెనిమిది, దేహి, జఠరాగ్ని– ఈయిరువది పాంచభౌతిక

సంఘాత మగును. మహత్తు అనునది ప్రాణములతోఁ గూడి యీసంఘాతమును నిర్వహించుచున్నది. దేహనాశనమునకు ప్రాణవాయువు మహత్తునాజ్ఞనే తలధరించును. పుట్టినప్రాణి పుణ్యపాపములు క్షీణించినపిదప మరలఁ బంచభూతములుగా విభక్తమగును. పిదప, ఈజన్మమునఁ జేసినపుణ్యపాపముల ప్రేరేపణచే వానివలన సిద్ధించిన మఱియొక దేహమును జొచ్చుచున్నది. అవిద్యాకామకర్మలచే సిద్ధించు దేహస్థితులవలన ప్రాణి కాలప్రేరణమున నొక దేహమునుండి మఱియొక దేహమును జేరుచుండును. జీవికిఁ గలుగు ఈదేహాంతరప్రాప్తులఁ గన్నజ్ఞానులు నిర్వికారులై దుఃఖము నందరు. పామరు లన్ననో మిక్కిలి పరితపించుచుందురు. జీవుఁ డెవ్వనివాఁడు గాఁడు. ఎవ్వఁడు వీనివాఁడు కాఁడు. వీఁ డొక్కఁడే. తానే తనదేహమును సుఖదుఃఖములను సృజించుకొనుచు పుట్టుక కాని. మరణము కాని లేక, తుదకు దేహబంధమును వీడి పరమగతి నొందును. పుణ్యపాపకర్మములమూలమునఁ గలిగిన ఆయా దేహములందుఁ గావించిన కర్మములు క్షీణించినంత, జీవి దేహమును వీడి బ్రహ్మమయమగుచున్నది. పుణ్యపాపకర్మవినాశనమునకు జ్ఞానమే కారణము; మార్గము. ఇదియే సాంఖ్యమతము. పుణ్యపాపములు క్షీణించి జీవుఁడు బ్రహ్మభావము నందుటే పరమగతిఁ జేరుట యని విద్వాంసులు దీనిఁగనఁ జాలుదురు."

ఈవాక్యములు విని సంతసించి నారదుఁడు దేవలుని వీడుకొని యథేచ్ఛముగాఁ బోయెను *

---

*భారతము శాంతిపర్వము.

## దేవలుని వివాహవృత్తాంతము

దేవలుఁడు వేదవిద్యాశాస్త్రవిశ్రుతుఁడు, నిత్యవైదికకర్మక్రియానియతుఁడు, హరిపాదభక్తుఁడు, పరమతపోధ్యాన పారగుఁడునైయుండి బ్రహ్మచర్యము తీర్థయాత్ర నడపుచుండెను. అతఁడు వయఃపరిపూర్ణుఁడయ్యుఁ గామక్రోధమదలోభమోహములఁ దగులువడక అసిధారావ్రతమున భిక్షాశనము నడపుచు భాగీరథీతీరమున వసించుచుండెను. ఒకనాఁడాతఁడు గంగాస్నాన మొనరించి నిత్యకృత్యములుతీర్చి విష్ణుస్మరణపూర్వక మగుజపమున నుండఁగా నటఁగల యొకసాలవృక్షము కొమ్మను వ్రేలాడుచు శవాకారములఁదాల్చి యేడ్చు నరనారీజనములఁ గాంచి దయాళుఁడై దగ్గఱకేఁగి మీరెవ్వరని వారి నడిగెను. వారిట్లు సమాధానము చెప్పిరి. "ఓయీ! మేము దేవలుఁడను నొక మహావహుని పితృదేవతలము. అతఁడు సద్గుణసంపన్నుఁడే కాని వివాహమాడనొల్లక-యస్ఖలితబ్రహ్మచర్యమునన్నాఁడు. అతఁడు వివాహ మాడి మాఋణముఁదీర్చినఁ గాని మాకు ముక్తిలేదు. ఏలన, నరుఁడు ఋణత్రయమున సంభవించును. బ్రహ్మచర్యవ్రతమున మునిఋణమును, అగ్నిహోత్ర క్రియాకలాపమున దేవఋణమును, పరమసాధ్వియగు కులపత్నియందు సంతానముగాంచి పిత్ర్యాణమును మానవుఁడు తీర్పవలయును. అనంతరము తురీయాశ్రమమును గని ముక్తినంద వలయును. ఋణత్రయ విముక్తునికే కాని యన్యునకు జ్ఞానము పునరావృత్తిరహితలోకనివాస సౌఖ్య మొసంగదు. అది యెట్లన, వృక్షమున్నదన్న నది క్రమక్రమముగాఁ జిగిర్చి, మొగ్గ దొడిగి, పుష్పించి ఫలించునే కాని యెంతదోహదక్రియ యొనరించినను

పొలుతనే ఫలింపదుగదా ! వర్ణాశ్రమసమేతు లగువారు కర్మ కాండ ప్రతిపాదించిన పదునాలుగు సంస్కారముల సాధనము చేయవలయును. అది శరీరజనకకారణ మగును. అట్లు కలిగి శరీరి కర్మములవలన సంస్కృతుఁడై విప్రుఁ డనఁబరగు. అతఁడు ఋణత్రయములఁ దీర్చి మోక్షమందును." అని చెప్పిరి.

అంత దేవలుడు నిజనామగోత్రములు తెలిపి "ఓపితృదేవతలారా ! కలుషాయత్త మగుసంసారమును దపోవైఫల్య బీజముగా బ్రహ్మ సృజించెను. స్త్రీ లన్న మాయామృగరూపములు. కాయని బీఱెండలు. ఆత్మఘాతుకలు. ఏయని నిశితాస్త్రములు. పాయనికర్మవాగురలు. అందుచేఁ గర్మయోగమునుబట్టి సంసారజలధి దాఁట నెవ్వరితరము ? కాంతమూలమునఁ గామ క్రోధ లోభ మోహముల కాకరమై నరుఁడు నశించును. ఇఁకఁ బుత్త్రులందమా వారు నిత్యదుఃఖప్రదులు. అందుచే సమ్యక్ జ్ఞానసమేతుఁ డగునరునకు బ్రహ్మచర్యమే కైవల్యప్రాప్తికారణ" మని పలికెను. అంత, వారు "ఓయీ ! నీవన్నది నిజమే కాని మాకోరికఁ దీర్చి మా కుత్తమగతులు కలిగించుటకైనను మా మాట పాటించి పరిణయమాడి ధర్మమార్గమున గృహస్థాశ్రమము నడపి ఋణత్రయము నీఁగి యాపై నీయిచ్చవచ్చినట్లు చేయు" మని కోరిరి. ఆతఁడు "ఆర్యులారా ! నేను పెరిగి పెద్ద వాఁడనైతిని. వార్ధక్యము పొడచూపినది. ఇపుడు నాకుఁ బిల్ల నిచ్చువా రెవరు ? ఇచ్చిన, నన్నుఁ గట్టుకొన్న యామెకుఁగాని నాకుఁగాని యేమిసుఖము కలుగును ? నా కీబలవంతపు బ్రాహ్మణార్థమేల ! నాతపస్సు ధారపోసి మీకుత్తమగతులు కల్పించెద" నని చెప్పెను. వారు "వత్సా ! కౌండిన్యుఁ డనునొక మహా

మునికడ నొకకన్య గలదు. ఆమె నీకు భార్యగా విధి యామె నొసట వ్రాసియున్నాఁడు. నీవును విధిని దప్పింపఁ దలఁపవు గదా! కావున, మఱుమాటాడక మాపం పొనర్పు" మని ప్రార్థించిరి.

అనంతరము దేవలుఁ డిఁక వారిమాట కాదనఁజాలక దివ్యదృష్టిని జూచి కౌండిన్యసుత తనభార్యగా జనించుట నిక్కముగా నెఱిఁగి యామె పతివ్రతయై సత్సంతతి నొసఁగు నని తెలిసికొని, వారియాజ్ఞఁ దలఁదాల్తు నని విన్నవించెను. పితృదేవతలు నాతని నాశీర్వదించి యానందపరవశులై యదృశ్యులైరి.

దేవలుఁడు బయలుదేఱి వెళ్లి కౌండిన్యుని యింటి కేఁగి యాతని మన్ననలఁ గాంచెను. దేవలుని జూడఁగనే యాతఁడును దివ్యదృష్టిని దనపుత్రిని వివాహమాడ వచ్చేసినాఁ డని తెలిసికొని వివాహమేర్పాటు చేసెను. దేవలుఁడు నిజతపశ్శక్తి వలనఁ గామరూపము ధరించి దివ్యసుందరుఁడుగాఁ దేజరిల్లెను. అనంతరము వేదోక్తముగాఁ గౌండిన్యుఁడు తనబిడ్డ నిచ్చి దేవలునికి మహావైభవముగాఁ బెండ్లిచేసెను.

అత్తమామల యనుజ్ఞఁ గైకొని దేవలుఁడు దివ్యసుందరి యగుకన్య నట్లు పరిణయమై యామెఁదీసికొని నిజాశ్రమమునకుఁ బోయి గృహస్థాశ్రమమును నిర్వహించుచుండెను.

ఆపుణ్యదంపతు లట్లు పవిత్రజీవితమును త్రిలోక వినుతముగాఁ గడపుచు నతిథ్యభ్యాగతసేవ, వైదికకర్మ పాలనము నడపి కాలక్రమమున సువర్చలయను పుత్రికారత్నమును, కొందఱు పుత్రులనుబడసి ఋణత్రయమునుండి విముక్తిఁగాంచిరి.*

---

* మత్స్యపురాణము.

## దేవలుని కూఁతురు సువర్చలకథ.

బ్రహ్మర్షి, సదాచారసంపన్నుఁడు, ధార్మికశ్రేష్ఠుఁడు, విప్రపూజితుఁడు నగు దేవలమహర్షి చక్కనికూఁతు రగుసువర్చల తండ్రికడ సర్వధర్మములు, సకలవిద్యలు నేర్చి గొప్పవిదుషీమణియయ్యెను. శుభలక్షణ సంపన్నయు, సుందరాంగియు నగు నామెకు యుక్తకాలము రాఁగానే తండ్రి వివాహప్రయత్నము చేయఁదొడఁగెను. ఇది తెలిసి సువర్చల తండ్రితో "తండ్రీ! నీవు ప్రాజ్ఞులలోఁ బ్రాజ్ఞుడవు. నాయెడ నమితవాత్సల్యముగల వాఁడవు కనుక, నా కొక్కకోరిక కలదు. అది తీర్పుము. నాభర్త యేకకాలముననే గ్రుడ్డివాఁడు, గ్రుడ్డివాఁడుకానివాఁడు గావలయును. అట్టివానినే నాకై వెదకు"మని చెప్పెను. దేవలుఁ డామె మాటలకు నవ్వి "తల్లీ! అట్టిపతిని నీకై నే నరయఁజాలను. ఉత్తము లగుఋషిపుత్త్రుల నెందఱనో యిటకు రప్పించెదను. నీవే వారిలో నీకుఁ గావలసినలక్షణములు గలవాని నేఱుకొ"మ్మని పలికెను. ఆమె యట్లే కా నిమ్మనెను.

పిదప, దేవలుఁడు శిష్యులం బిలిచి వేదవిదులు సదాచారసంపన్నులు, శీలయుతులు, యువకులు, సౌందర్యనిధులు, సత్సంప్రదాయయుతులు, బ్రహ్మచర్యవ్రతులు, వివాహేచ్ఛగలవారు నగువారిని బిలుచుకొని రం డని పంపెను. దేవలశిష్యు లాప్రకారము సర్వాశ్రమములందు దేవలుని యభిమత మెఱింగించి తమతోఁ గూడ నెందఱనో వటువులను దీసికొనివచ్చిరి.

దేవలుఁడు వా రందఱ నాదరించి కూర్చుండ నియమించి సుపుత్త్రి యగుసువర్చలకు వారినెల్లరఁ జూపి వారివారి గుణాగణము లగ్గించి వలయువానిని వరింపు మని చెప్పెను. సువర్చల

ముందుకు వచ్చి “ మహాత్ములారా ! మీలో నేకకాలమున నంధుఁడు, అంధుఁడు కానివాఁడు నున్నచో నాతఁడు నన్ను వివాహమాడ నర్హుఁడు. ఆతఁడే యుండిపోయి మిగిలిన వారెల్లరు పోవచ్చు”ననెను. ఆమెమాటలు విని యెల్లరు ఆశ్చర్యపోయి యామె వివేకహీన యనియు, దేవలుఁడామెమాటలు విని యట్లుచేయుట ధర్మమా యనియు ననుకొనుచు వెడలిపోయిరి. కాని, ఉద్దాలకుని పుత్త్రుఁడగు శ్వేతకేతుఁడు ముందుకు వచ్చి “కల్యాణి! నీవు కోరినట్టిలక్షణములను గలవాఁడను నేను, నేను గ్రుడ్డిని. గ్రుడ్డితనము లేనివాఁడను.నీవు నన్నుఁ జెట్టపట్టు” మనెను. సువర్చల “ఆర్యా ! నీ వెట్లు రెండు నగుదువో వివరింపు”మని కోరెను. అంత, శ్వేతకేతుఁడు “తరుణీ! ఏకంటిచేతఁ బ్రపంచమును జూచుచు, ధర్మములు చేయుచు మనస్సు సంకల్పించుచు బుద్ధినిజము తెలియునో ఆత్మజ్ఞానమను ఆకన్ను లేనివాఁడు పుట్టుగ్రుడ్డివంటివాఁడు. ఏకన్ను భ్రాంతినిలయము, నశ్వరము నగునో అజ్ఞాన మనుఆకన్ను లేనివాఁడను గాననేను గ్రుడ్డివాఁడను. ఆత్మానాత్మవివేకము గలజ్ఞాననేత్రమునాకుఁ గలదు. కాన,నేను గ్రుడ్డినికాను.”అని పలికెను. సువర్చల యంగీకరించి తండ్రికి తనసమ్మతిఁదెలిపెను. పిదప దేవలుఁడు విధ్యుక్త ప్రకారము సువర్చలా శ్వేతకేతులకుఁ బరమవైభవోపేతముగా వివాహముచేసి యాశీర్వచనములతోఁ బంపివేసెను. సువర్చలా శ్వేతకేతులు బ్రహ్మజ్ఞానసంపన్నులై దివ్యమగు గృహస్థజీవనమును గడపి తుదకు మోక్షలక్ష్మిని గాంచిరి.*

---

*భారతము. శాంతిపర్వము.

# నరనారాయణమహర్షులు

## శౌనక నారాయణసంవాదము

తొల్లి శౌనకమహర్షి విష్ణురాతునివలన నాలుగు వేదములు నేర్చి వానియర్థము లెఱిఁగి తదనుష్ఠానక్రమములు తెలిసికొని మహావిజ్ఞాని యయ్యెను. తరువాత నొకప్పు డాతఁడు శిష్యసమేతుఁడై బయలుదేఱి దేశములు గడచి పుణ్యవనములు దాఁటి శైలము లతిక్రమించి మేరుపర్వతప్రాంతమున కరిగి యచట భోగవతీనదీతీరమునఁ బల్లవితములు కోరకితములు పుష్పితములు నగునగములనడుమ విలసిల్లుచు, అనేకఫలవృక్షములకు, మృగపక్షిసంతతులకు,సరోవరములకు నిలయమై,మునికుమారులతోఁ గలిసి చదువుశుకపికశారికల వేదాంతవాక్యరచనావిశేషములతో మనోహరమయి, అన్యోన్యవైరము లేక పర్ణశాలాంగణముల యథేచ్ఛము సంచరించుమృగములచే నొప్పినదై చిన్నమొక్కలకు లతాగుల్మములకుఁ బాదులు త్రవ్వి యందుఁ బోయుటకు నీటికై పోయి జలపూరితము లగుకలశములఁ గొని వచ్చుచు నుద్యానవనదేవతలో యననొప్పుయువతు లగుమునికన్యలచేఁ గన్నులపండువై, వివిధయోగిజనసంకులము,హరిభక్తసమేతము, సకలమంగళాశ్రయము, సర్వపుణ్యనిలయము నగు నారాయణమహర్షి యాశ్రమమునకు విచ్చేసెను.

అప్పుడు నారాయణమహర్షి జపతపోధ్యానాదులు నిర్వర్తించి సుప్రసన్నుఁడై యుండి శౌనకునిపైఁ గటాక్షవీక్షణం

ములఁ బఱపి రమ్మని యాహ్వానించెను. శౌనకుఁడు వచ్చి, సాష్టాంగనమస్కారములొనర్చి నారాయణమహర్షిని భక్తిభరితుఁడై స్తుతించి యాతనియనుజ్ఞఁ బడసి యిట్లడిగెను. "దేవా! నేను సర్వవేదశాస్త్రములు చదివితిని. కాని, అగాధము లైన యందలియర్థములలోఁ బరమార్థ మెఱుఁగఁజాలకుంటిని. నాకు దయతో సంశయరహితమైన పరమవిజ్ఞానమును బోధింపు" మని యడిగెను. అంత, నారాయణమహర్షి శౌనకునకు బ్రహ్మ నారదునకు వినిపించినసర్వవిషయములు వినిపించెను. సర్వవేద సార మగుచక్రిమతము తేటపఱిచి హరిభక్తితక్క నన్య మగు తరణోపాయము లే దని యాతఁడు బోధించెను.

శౌనకుఁడు పిదప నారదజన్మ మెఱిఁగింపు మని కోర నారాయణుఁ డిట్లు చెప్పెను. "విష్ణువు వామనావతారముఁ దాల్చి యొకపాదమున భూతల మెల్ల నాక్రమించి రెండవపాదమును సకలదిఙ్మండలమున సందులేకుండ నాకాశమునఁ జాచి యుండ బ్రహ్మ భక్తిపరవశుఁడై విష్ణుపాదముఁ గడుగ జలము తెచ్చుటకై తనమనసునుండి యొక్కని సృజించెను. జలము తెమ్మని యనుశాసించి తనకమండలువును బ్రహ్మ యాతనికిఁ జూపెను. ఆతఁడు వెంటనే ఆకమండలువుఁ గొని యేఁగి హేమపుష్కరిణినుండి జలమును దీసికొనివచ్చెను. బ్రహ్మ యా జలముతోఁ బురుషసూక్తమంత్రపఠనమున విష్ణుపాదముఁ గడిగెను. ఆపాదతీర్థము భూమిపైఁ బడకుండ శివుఁడు వచ్చి ఫాలభాగమున సంతోషముతో ధరించెను. నార మనఁగా నుదకము నార ద అని బ్రహ్మ తనమానసపుత్రునితో ననెను. కాన నాతనికి నారదుఁ డని పేరువచ్చెను. ఆనారదుఁడు సరస్వతిదగ్గఱ

సంగీత మభ్యసించి వాయులోకమున కేఁగి వాయుదేవతాదత్తమగు మహతి యనువీణ ధరించి సర్వస్వరయుక్తముగా సర్వజన మనోహరముగా గానము చేసి తండ్రిని మెప్పించెను. బ్రహ్మ యానందించి నారదునకుఁ గోరినవిషయము లెల్లఁ దెల్పి యాత నికి విష్ణుభక్తి పాదుకొలిపి విష్ణుమంత్ర ముపదేశించి యాతనిని విష్ణుభక్తులలో నగ్రేసరు నొనరించెను."

వేదవిద్యాధికారము లేనివారికి ముఖ్యకర్మము లేవి యని శౌనకుఁ డడుగఁగా నారాయణమహర్షి యిట్లు చెప్పెను. "అట్టివారికి దానధర్మములు,సత్యవ్రతములు, వాపీకూపతటాక ప్రతిష్ఠ, వనదేవతాలయబ్రహ్మప్రతిష్ఠ, తనయుఁడు, కృతి యనుసప్తసంతానములు ముఖ్యకర్మములు. వారికి భూసురో పనయనవివాహాదికర్మముల సాయపడుట, స్వవిత్తమూలమున విప్రరక్ష చేయుట, విప్రుని ఆపత్తునుండి కాపాడుట, ఉపకరణ పూర్వకముగా విప్రునికి గృహము కట్టి యిచ్చుట ఇవి-బ్రహ్మప్ర తిష్ఠ లనఁబరగు – విష్ణుసదనప్రాప్తి నొసంగును. పుత్రుఁడు పున్నామనరకమునుండి రక్షించును. ఉత్తమకవియొక్క ఉత్త మకృతిని గైకొన్నకృతిభర్తకుఁ బుణ్యలోకములు కలుగును. జ్ఞానమహాత్త్వమును దెలుపుటకొఱకే వేదములు కర్మయోగ మును స్తుతించును. నీకుఁ దుదిమాట చెప్పెద వినుము. నే యేల ? విష్ణుస్మరణమే సర్వోత్తమధర్మము. విష్ణువే శాశ తుఁడు. విష్ణువే గతి. విష్ణుమూర్తియే తనభక్తుల కెల్లఁ గైవ మొసంగును. కావున, నితరచింతలు మాని విష్ణుమూర్తి యారాధింపవలయు.

నిత్యం డవ్యయుఁ డమలుం
డత్యంతము చక్రహస్తుఁ డాఢ్యుఁడు జగతిన్
సత్యం బిది సత్యం బిది
సత్యం బిది మునివరేణ్య ! సంశయురహితా!”

అని తెలిపెను. ఇది విని శౌనకుఁడు బ్రహ్మానందియై నిజాశ్రమమున కేఁగెను. ఈయాపద్విషయము మత్స్యపురాణమునఁ గలదు.

---

iii

# పిప్పలాద మహర్షి

## పిప్పలాద మోక్షశాస్త్రము

పరమబ్రహ్మర్షి యైనపిప్పలాదుఁడు శిష్యులను గటాక్షించి వారికి మోక్షశాస్త్రము నిట్లుపదేశించెను. “మానవ శరీరము పృథివి, జలము, తేజము, వాయువు, ఆకాశము నను నైదింటిచే నేర్పడి యీయైదింటిలో నున్నది. గట్టిగ నుండుప్రదేశము పృథివి; ద్రవప్రదేశము జలము; వెచ్చగ నుండునది తేజము; సంచరించునది వాయువు; ద్వారమై యుండునది ఆకాశము. ఇందుఁ బృథివి ధరించుటకు, జలము ముద్దగాఁ జేయుటకు, తేజము రూపములఁ గనఁబఱుచుటకు, వాయువు పోవు-

నిత్యం దవ్యయుఁ డమలుం
దత్యంతము చక్రహస్తుఁ డాఢ్యుఁడు జగతిన్
సత్యం బిది సత్యం బిది
సత్యం బిది మునివరేణ్య ! సంశయరహితా!"

అని తెలిపెను. ఇది విని శౌనకుఁడు బ్రహ్మానందియై నిజాశ్రమమున కేఁగెను. ఈయావద్విషయము మత్స్యపురాణమునఁ గలదు.

---

iii

# పిప్పలాద మహర్షి

## పిప్పలాద మోక్షశాస్త్రము

పరమబ్రహ్మర్షి యైనపిప్పలాదుఁడు శిష్యులను గటాక్షించి వారికి మోక్షశాస్త్రము నిట్లుపదేశించెను. "మానవ శరీరము పృథివి, జలము, తేజము, వాయువు, ఆకాశము నను నైదింటిచే నేర్పడి యీయైదింటికో నున్నది. గట్టిగ నుండుప్రదేశము పృథివి; ద్రవప్రదేశము జలము; వెచ్చగ నుండునది తేజము; సంచరించునది వాయువు; ద్వారమై యుండునది ఆకాశము. ఇందుఁ బృథివి ధరించుటకు, జలము ముద్దగాఁ జేయుటకు, తేజము రూపములఁ గనఁబఱుచుటకు, వాయువు పోవు-

టకు, ఆకాశము అవకాశము నొసఁగుటకు నుపయోగించుచు న్నవి. మఱియు, త్వక్చక్షుశ్శ్రోత్రజిహ్వాఘ్రాణములు వరుసగా స్పర్శ, రూపము, శబ్దము, రసము, గంధము వీనియందును; వాక్పాణిపాదపాయూపస్థములు వరుసగా మాటాడుట, గ్రహించుట, నడచుట, విడుచుట, ఆనందించుట వీనియందును వర్తించుచున్నవి. బుద్ధి, మనస్సు, చిత్తము, అహంకారము, ఈనాలుగు వరుసగాఁ దెలిసికొనుట, నిశ్చయించుట, సంకల్పించుట, సంశయించుట; చక్కఁగా గ్రహించుట, గర్వించుట వీనియందు వర్తించుచున్నవి. మఱియు శరీరము తీపి, పులుపు, చేదు, ఉప్పు, కారము, ఒగరు అనుషడ్రసముల నాశ్రయించి, వాని కాశ్రయమై ఉండుట, కలుగుట, పెరుగుట, పక్వమగుట, తగ్గుట, నాశమొందుట అనుభావవికారము లాఱింటిచే వికారము నందుచున్నది. మూలాధారము, స్వాధిష్ఠానము, మణిపూరకము, ఆగ్నేయము, అనాహతము, విశుద్ధము అనుఆఱుచక్రములు వానివానినాడుల నాశ్రయించి దేహమున నుండును. కామక్రోధలోభమోహమదమాత్సర్యము లనుఆఱుదుర్గుణములు, శమము, దమము, తితిక్ష, ఉపరతి, శ్రద్ధ, సమాధానము, అనుఆఱుసుగుణములు వానివాని నిష్ఠఁబట్టి దేహము నాశ్రయించి యుండును. షడ్జము, ఋషభము, గాంధారము, పంచమము, మధ్యమము, దైవతము, నిషాదము అనుఇష్టానిష్టశబ్దసంజ్ఞ లేడును శుక్ల, రక్త, కృష్ణ, ధూమ్ర, పీత, కపిల, పాండురము లను ఏడుధాతువులు, వానివర్ణములు గలవు. రసమునుండి రక్తము, రక్తమునుండి మాంసము, మాంసమునుండి మేదస్సు, మేదస్సునుండి యెముకలు, ఎముకలనుండి మజ్జ, మజ్జనుండి పురుషునకు శుక్ర

ము స్త్రీకి శోణితము కలుగుచున్నవి. ఈశుక్లశోణితముల సంయోగమువలననే గర్భోత్పత్తి యగుచున్నది. తిన్నపదార్థములనుండి యగ్ని, అందుండి పిత్తము, అందుండి వాయువు, అందుండి హృదయము, బ్రహ్మనిర్మిత మైనరీతిని బోయి యవి చేరుచున్నవి. శుక్లశోణితసంయోగానంతర మొకరాత్రి గడచిన కలలము, ఏడుదినములకు బుద్బుదము, పదునైదుదినములకుఁ బిండము, మాసమునకుఁ గఠినము, రెండునెలలకు శిరస్సు, మూఁడుమాసములకు పాదములు, నాలుగుమాసములకు జఠరకటి ప్రదేశములు, ఐదునెలలకు వెన్నెముక, ఆఱునెలలకు ముక్కు, కన్నులు, చెవులు, ఏడవనెల ప్రాణము, ఎనిమిదవనెల శరీరావయము లన్నియు నేర్పడి తొమ్మిదవనెల సంచరించుచు, పిదపఁ బుట్టును. శుక్ల మధికమైనపుడు పురుషుఁడు శోణితమధికమైన స్త్రీ సంతతి కలుగును. సాధారణముగా స్త్రీ సంతతియే యధికమగును. కారణమునకుఁ దగినకార్యము కలుగుఁగాన, తలిదండ్రుల చిత్తవృత్తుల ననుసరించి వారికిఁ దగినశిశువులు కలుగుదురు. సంభోగసమయమునఁ జిత్తచాంచల్యము గలవారికి, చంద్రసూర్య గ్రహణవేళలఁ గూడెడివారికి, దేశకాల ద్రవ్యభోగములందలి లోపములనుబట్టి, ఆయా యీ అవకరములుగల బిడ్డలు పుట్టుదురు. ఉచితకాల దేశాదులఁ గలిగినబిడ్డలు సత్సంతానముగాఁ బరిగణింపఁబడుదురు.

గర్భస్థ మగుశిశువు పంచభూతస్వరూపము సమర్థమునై పంచేంద్రియములతోఁ బంచతన్మాత్రల నెఱుంగుచున్నది. సుజ్ఞానమువలన ధ్యానమువలన ఓంకారమును జింతించును. పరబ్రహ్మస్వరూప మైనప్రణవమును దెలిసికొనుచుండును.

ఈ శరీరమునందుఁగల అష్టప్రకృతులు, షోడశ వికారములు తొమ్మిదవ నెలలలో సమగ్రము లగును. అప్పు డాజీవి తాను వెనుకటిజాతిని, కర్మమును, తెలిసికొనుచున్నది.

గర్భస్థ మగుజీవి అప్పు డిట్లు విచారించును. "అయ్యో! నేను లెక్కలేనన్ని స్త్రీమర్మావయవములను జూచితిని. వివిధాహారములను భుజించితిని. పెక్కురు స్త్రీలపాలు త్రాగితిని. సమస్తము జన్మభూమి, సమస్తభూమి స్మశానముకాఁగా నేను ఎనుబదిలక్షల యోనిభేదములందుఁ బుట్టితిని. పలుమఱు జన్మించుచు, పెక్కుసారులు చచ్చుచు, నిట్లు పుట్టుచావులతో నా కాలము గడచినది. తల్లికడుపున నున్నప్పుడు గొప్పదుఃఖము, జన్మమోహమున మఱింత దుఃఖము, బాల్యమున నింకింత దుఃఖము, ఇట్లు శోకపారవశ్యతలవలన మూఢత్వ మందితిని. యౌవనమున విషయాసక్తిచే సత్కార్యములు చేయక సోమరితనమున దుష్కార్యము లొనర్చి తాపత్రయములచేఁ జీకాకువడితిని. వార్ధక్యమున రోగము, బెంగలు అనుభవించి తుదకు మరణమునందితిని. ఆమరణవేళ విపరీతమైన భయము ననుభవించితిని. ఆశ, అభిమానము, తీవ్రకామము, క్రోధాదులు దీనివలనఁ బొందినకష్టనష్టము లిన్నిన్ని కావు.

జన్మమే దుఃఖకారణము. దుఃఖస్వరూపము. ఇది పరమ దుస్సహము. అని యెఱిఁగియు జన్మనివృత్తికై ధర్మముఁ గాని యోగజ్ఞానసాధనలేమియుఁ గాని చేయనైతిని. అక్కటా! దుఃఖసాగరమున మునిఁగి దీనికిఁ బ్రతీకారమే చేయఁజాలకుంటిని. అయ్యయ్యో! అజ్ఞాన మెంత దారుణము! కామక్రోధ సంకటములెంత బాధాకరములు! వీనిని గాల్చి భస్మము చేయ

వలదా ? సంసార మనుసంకెళ్ళను బిండిపిండి చేయవలదా ? ఇందుకై సద్గురువుసేవ చేసి జ్ఞానము సంపాదించి సాంఖ్యయోగమును సమాశ్రయింపవలయుఁగదా ! ఈసారి, ఈయోని నుండి బయలువెడలి యట్లొనరించెదను. ఈపరి, భూమిపైఁ బడినతరువాత పాపనివృత్తికి మోక్షప్రాప్తికి ఈశ్వరుని శరణుచొచ్చెదను. ఈపట్టు జగదీశ్వరుని దప్పక సేవించెదను. ఈసారి ఈగర్భనరకమునుండి బయలుపడినతరువాత సర్వశక్తిమయుఁడు, చిదాత్ముఁడు, సర్వకారణకారణుఁడు, భర్గుఁడు, పశుపతి, రుద్రుఁడు, మహాదేవుఁడు, జగద్గురుఁడు నగుఈశ్వరుని శరణొందెదను. ఈ పిదప, మహాతపస్సు చేసెదను. ఈగర్భవాసమునుండివెలువడిన పిదప, తప్పక అమృతపరుఁడు, ఆనందస్వరూపి, నారాయణుఁడు అనామయుఁడునగుభగవంతుని భజించితీరెదను. ఈముందు మూర్ఖుఁడుగాను. తప్పక వాసుదేవుని స్మరించిభజించి యాతనికృపకుఁ బాత్రుఁడనయ్యెదను. అయ్యయ్యో! ఇదివఱలో మూర్ఖుఁడనై యితరులకొఱకు శుభాశుభకర్మముల నొనరించితిని. వా రెవ్వరు కానరాకుండఁ బోయిరి. ఈదుఃఖము లన్నియు నేనే యనుభవించుచున్నాను. మొదట నాస్తికుఁడనై నేను జేయనిపాపములే లేవు కదా ! ఇఁకముందు ఆస్తికుఁడనై తప్పక దేవుని భజించెదను."

ఇటు లనేకవిషయములు పలుమఱు స్మరించి దుఃఖించి నిర్వేదమును బొందియు గర్భస్థుఁ డగుజీవుఁడు అజ్ఞానము, కామము, కర్మము వీనివలన మరల మోహము నందును. ఇట్లుజీవి వందలకొలఁది స్త్రీయోనులయం దుండి బయలుపడినది. ఇప్పుడు మరల నింకొకయోనిద్వారమం దుండి తద్విమోచనకై పరితపించుచున్నది. విమోచనమందుటకు శక్తిలేనిదై యంత్ర

పీడ, అధికక్లేశము, ప్రసవవాయుపీడనము నంది బయటపడి వైష్ణవమాయ క్రమ్మఁగా నన్నియు మఱచి పోయి మరల నజ్ఞాన చైతన్య మగుచున్నది. ఇట్లు పుట్టి భూమిపైఁ బడినతరువాత, వాతపిత్తశ్లేష్మము లనుధాతువుల న్యూనతాధికతలఁ బట్టి జీవి రోగగ్రస్త మగుచుండును.

మఱియు, మనస్సులో జ్ఞానాగ్ని, ఇంద్రియముల దర్శనాగ్ని, దహరమునఁ గోష్ఠాగ్ని అనుమూఁడగ్ను లున్నవి. ప్రాణాపానములతోఁ గూడి తిన్నయన్నమును జీర్ణముచేయుచుండునది కోష్ఠాగ్ని. నేత్రములే దర్శనాగ్ని. హృదయమున దక్షిణాగ్ని, ఉదరమున గార్హపత్యాగ్ని, ముఖమున ఆహవనీయాగ్ని యుండును. కావున, పురుషుఁడు యజమానియై బుద్ధిని భార్యగను, సంతోషమును దీక్షగను, జ్ఞానేంద్రియములను యజ్ఞపాత్రలుగను, కర్మేంద్రియములను ఉపకరణములుగను జేసికొని ఆత్మయజ్ఞముఁ జేయవలయు. ఈశరీరము యాగముకొఱకే యాగమునుండి కలిగినది. ఈశరీరమునందు ముప్పదిరెండుదంతములు, పదునైదుసుషిరములు, పదునాలుగునాడీస్థానములు నూటయొనిమిదిమర్మములు, డెబ్బదిరెండునాడులు, గలవు. వీనిలో ఇడాపింగళాసుషుమ్నలు ప్రధానములు. నాలవది పురీతతి. ఐదవది జీవుఁడు. దేహమున సంచరించునట్లు చేయు వాయువు ప్రాణము. దీనివలననే శరీరమందలి సర్వాంగములు పనిచేయుచున్నవి.

పాకముచేయఁబడినరసము తల్లిగర్భమునందు నాడీద్వారమున గర్భాశయము చేరి పిదప శిశువుశిరఃకపాలముమూఁమునఁ బ్రవేశించి సుషుమ్నానాడినుండి గర్భకోశములో నున్న

జీవప్రాణమును సృష్టిపఱచుచున్నది. ఈప్రాణవాయువును యోగముచే నిరోధించి భ్రూమధ్యమందున్నసుషుమ్నా నాడి వఱకుఁ గొనిపోయినఁ బరమాత్మవస్తుదర్శన మగును.

ఈశరీరమున అంతర్యామిగా, అమృతముగా, ఆత్మసాక్షిగా నుండునది పురుషుఁడు. ఇతఁ డవిద్యచే నావరింపఁబడి జీవుఁ డగుచున్నాఁడు. వానికి మఱుఁగైయుండుఅజ్ఞానము బీజము. దానిమొలక అంతఃకరణము. దానిచెట్టు శరీరము. ఇది నశించునదే యని తెలిసికొని ముక్తిఁ గాంక్షింపవలెను. అది పొందినచో మరల జన్మమే యుండదు.

అట్లుగాక మూఢతవలన సంసారమగ్ను లైనవారికి, నిత్యము మలమూత్రాదులందుఁ బెరుగుచు, వానినే తినుచుఁ ద్రాగుచు నందే నరకయాతన లనుభవించు పురుగువలె, ఈ శరీరములే మహానరకములై వారినిబట్టి పొలార్చుచు బహుదుఃఖమగ్నుల నొనరించుచుండును. ఈపరిణామమును జాగ్రత్తగా నెఱిఁగిన బుద్ధిమంతుఁడు వైరాగ్యము నాశ్రయించి ఆత్మజ్ఞానము నంది మోక్షము నందును." ఇదియే గర్భోపనిషత్తు సారాంశము.

ఆంగిరసుఁ డగుశౌనకునకు భగవంతుఁ డగుపిప్పలాదుఁడు బ్రహ్మవిద్యయే వరిష్ఠ, బ్రహ్మప్రాప్తి కుపాయములు, అంతర్బాహ్యశిఖాదిలక్షణములు, నిర్విశేషబ్రహ్మస్వరూపము, ముముక్షువులకర్తవ్యములు అన్నవిషయములు సవిస్తరముగా బోధించెను. ఈవిషయము లన్నియుఁ బరబ్రహ్మోపనిషత్తునఁ గలవు.

ACC. NO- 19664

# మహర్షుల చరిత్రలు

## ఆరవభాగము

విద్వాన్ బులుసు వేంకటేశ్వర్లు ఎం. ఏ.

ప్రచురణ

కార్యనిర్వహణాధికారి

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

1988.

# ముందుమాట

మహర్షులు మంత్రద్రష్టలు; మంత్రపతులు. పవిత్రమైన భారతావనిలో ఎందరో మహర్షులు అవతరించి బ్రహ్మనిష్ఠాగరిష్ఠులై లోకోపకారకములైన ఎన్నో ఘనకార్యాలు నిర్వర్తించారు. ప్రజాసముదాయం ఆ మహర్షుల ఋణాన్ని ఎన్నటికీ తీర్చుకోలేదు. యుగయుగాల భారతీయ సంస్కృతినీ, విజ్ఞానమునూ విశ్వమునకు చాటిన ధర్మస్వరూపులు వారు. తపస్స్వాధ్యాయ నిరతులై, నిగ్రహానుగ్రహ సమర్థులై, త్రికాలజ్ఞులైన మన మహర్షుల గుర్తించిన విషయములెన్నో, శ్రుతి స్మృతి పురాణేతిహాసాలలో కనిపిస్తాయి. వారు స్వయంగా ధర్మమును ఆచరించి లోకానికి ఆదర్శప్రాయులైనారు. అనేక ధర్మశాస్త్రాలు రచించి ప్రపంచానికి ఉపకరించారు.

నారదుడు సంగీతమునకు, పరాశరుడు స్మృతికీ, హోరా శాస్త్రమునకూ పెట్టిన భిక్షయే ఈ నాటి మేటి విద్వాంసు లందరికీ శరణ్యం. నేటికీ మన భారత భూమిలో అసమాన మహిమాన్వితులైన యోగి పుంగవులు తమ ధర్మప్రబోధముతో భక్తులను తరింప జేస్తున్నారు.

"మహర్షుల చరిత్రలు" అను ఈ పుస్తకములో ఆరణ్యకమహర్షి, ఉదంకమహర్షి, జైగీషవ్యమహర్షి, ధౌమ్యమహర్షి, బృహస్పతిమహర్షి, మృగశృంగమహర్షి, వ్యాఘ్రపాదమహర్షి, శుక్రమహర్షి మున్నగు వారి చరిత్రలు సాకల్యంగా పౌర్వాపర్య సందర్భ సమన్వితంగా విచారింపబడినవి. ప్రతి మహర్షి జీవితాన్ని గూర్చి చదివినపుడు పఠితలు ఎన్నో అమూల్య విషయాలు ఆకళింతకు తెచ్చుకొని ప్రయోజనం పొందగలరు. భారతీయు లందరికీ మహర్షుల జీవితచరిత్రలు అవశ్య పఠనీయాలే.

అనేకములైన ఇతిహాస పురాణాలను చక్కగా అవలోడనముచేసి సర్వజనావబోధకమైన శైలిలో శ్రీ బులుసు వేంకటేశ్వరులుగారు రచించిన మహర్షుల చరిత్రలలో ఇది ఆరవ సంపుటము.

సనాతన ధర్మప్రచారమునకై శ్రీ తిరుమల తిరుపతి దేవస్థానముల వారు వెలువఱుచుచున్న ధార్మికగ్రంథ పరంపరలో ఈ మహర్షుల చరిత్రలుకూడ ఆంధ్రపాఠకుల ఆదరాభిమానాలు సంపాదించుకొనగలవని మా విశ్వాసము.

తిరుపతి.
20 – 6 – 88.

సి. హెచ్. వేంకటపతిరాజు, I.A.S.,
కార్యనిర్వహణాధికారి,
తిరుమల తిరుపతి దేవస్థానములు,
తిరుపతి.

# విషయసూచిక


| | | |
|---|---|---|
| అరణ్యక మహర్షి | .... | 1 |
| ఉదంకమహర్షి | .... | 9 |
| జైగీషవ్యమహర్షి | .... | 27 |
| ధౌమ్యమహర్షి | .... | 36 |
| బృహస్పతిమహర్షి | .... | 49 |
| మంకణమహర్షి | .... | 68 |
| మృగశృంగమహర్షి | .... | 74 |
| వ్యాఘ్రపాదమహర్షి | .... | 81 |
| శుక్రమహర్షి (ఉశనసుఁడు) | .... | 85 |
| శ్వేతకేతుమహర్షి | .... | 106 |

# మహర్షుల చరిత్రలు

## అరణ్యకమహర్షి

శ్రీ రామనామోపాసకు లయి పరమేశ్వరసాయుజ్యము నందిన మహనీయులలో అరణ్యకమహర్షి యొకఁడు. అరణ్యమునఁబుట్టి యరణ్యమునఁ బెరిఁగి యరణ్యమున మహాతప మొనరించి యరణ్యముతక్క నొం డెఱుఁగని యీమహనీయునికి ఆరణ్యకుఁడను పేరు వచ్చెను. ఈతని జననీజనకులయు మాతామహ పితామహులయు చరిత్ర మేమియుఁ దెలియరాదు.

## ఆశ్రమము

అరణ్యకమహర్షి రేవానదీతీరమున నొక యాశ్రమమును నిర్మించుకొని యందుఁ దప మొనరించుచుండెను. ఆతని యాశ్రమము పరమపవిత్రమై యొప్పారుచుండెను. ఆశ్రమమునకు దశదిశలను ఆమడ మేర మహాప్రశాంత వాతావరణము వెల్లివిరియుచుండెను. ఆ మహర్షి తపఃప్రభావమున మహాక్రూరజంతువులు సైత మా యామడ మేర పరమ శాంతితోఁ బ్రవర్తించును. రామనామోపాసకుఁడగు నా మహర్షి ధ్యానానంతరము చేయు రామస్మరణముతోఁ బ్రకృతి యంతయు శ్రుతిగలుపును. పండుటాకులు రాలినను, ఎండుకట్టెలు విఱిగినను, చీమచిటుక్కుమన్నను రామశబ్దముగనే యా యరణ్యమున ధ్వనించును; ప్రతిధ్వనించును; రామమంత్రము, రామధ్యానము, రామస్మరణము, రామపూజనము, రామచింతనము, రామమననము - వీనితోఁ గూడిన యారణ్యకమహర్షి యాశ్రమము శ్రీరామ మయముగఁ జెలఁగుచుండెను.

## శత్రుఘ్నుని రాక

ఇట్లుండ శ్రీరాముఁ డశ్వమేధయాగ మొనరించి యశ్వమును విడిచినపిదప దానివెంట శత్రుఘ్నుఁడు పరివారసహితుఁడై యుత్తరప్రాంతారణ్యములకు విచ్చేసెను. ఆతని దిగ్విజయయాత్రలో యజ్ఞా

శ్వము అరణ్యకమహర్షి యాశ్రమ ప్రాంతమునకు వచ్చెను. దాని వెన్నంటి వచ్చు శత్రుఘ్నుఁడును అరణ్యకమహర్షి యాశ్రమోపాంతమునకు వచ్చి, యది యారణ్యకమహర్షి యాశ్రమ మని యెఱింగి పాదచారియై తగువారుమాత్రమే కూడ రాఁగా, అరణ్యకుని దర్శించి స్వనామగోత్రములు చెప్పుకొని మహర్షికి సాష్టాంగ నమస్కార మొనరించెను.

## ఆనందపారవశ్యము

ఆరణ్యకమహర్షి యపరిమితానందమున నాతని కర్ఘ్యపాద్యాదులొసఁగి యాదరించి క్షేమ మడిగి వచ్చినపని యడిగెను. శత్రుఘ్నుఁడన్న శ్రీరాముఁడు చేయు నశ్వమేధయాగము సంగతిఁదెలిపి యశ్వమీ ప్రాంతమునకు వచ్చుటచేఁ దాను వచ్చుటయు ఋషిసందర్శనాశీర్వచన కుతూహలమునఁ బాదచారియై వచ్చి ప్రణమిల్లుటయుఁ జెప్పెను. శత్రుఘ్నుఁడు పలికిన రామనామమును విన్నంతనే యానందబాష్పములు ప్రవాహములై కన్నుల వెంటఁ బ్రవహింప దేహమును మఱచి, కన్నులు మూసి మ్రోడువలెఁ గదలిక లేక అరణ్యకమహర్షి శత్రుఘ్నాదుల కాశ్చర్యభయ సంభ్రమములు గల్గించెను. కొంతకాల మట్లు సమాధి నిమీలితాక్షుఁడైన మహర్షి పిదపఁ దెలివంది కన్నులు తెఱచి గద్గదస్వరమున రామనామశ్రవణము, రామసోదరదర్శనము, రామస్మరణసమాధి కలిగినందుల కానందించి

"అల్పపుణ్యప్రదంబు లైనట్టియాగ
ములును యోగంబులును వ్రతంబులును సరియె ?
తెగని సంసారబంధంబు త్రెంచివైచి
క్షేమ మొనగూర్చు శ్రీరామనామమునకు."

అని పల్కెను.

## ఆరణ్యకునిఆత్మకథ

అంత శత్రుఘ్నుఁడు "మహాత్మా ! నేను రామసోదరుఁడనై యున్నను నీ వందిన యానందములో వందవవంతైన నందలేనైతిని.

ఇంత మహాభక్తుఁడవు నీ కెట్లు రామనామము లభించెనో తెలుపు'' మని వేఁడుకొనెను.

శత్రుఘ్నకుమారా! చెప్పెదను. వినుము. "నేను బాల్యము నుండియుఁ దత్త్వజ్ఞానమును సంపాదింపఁ గోరి లెక్కలేనన్ని తీర్థములకుఁ దిరిగితిని. ఎక్కడను ఒక్కఁడును నాకు జ్ఞాన ముపదేశింప లేఁడయ్యెను. ఇట్లుండ నా పూర్వపుణ్యమున లోమశమహర్షి దేవలోకము నుండి వచ్చుచు నా కంటఁ బడెను. నే నాతని నెఱిఁగి పాదముల కెఱఁగి ''మహాత్మా! సంసారసాగరమును దరించు నుపాయమును జెప్పి యనుగ్రహింపు'' మని ప్రార్థించితిని. దాని కాతఁడు "వత్సా! మార్గము లనేకము లున్నవి. కాని, రామమంత్రముకంటె సంసారమునుండి దాటించు మంత్ర మింకొకటి లేదు. ఇది వేదశాస్త్ర పరమ రహస్యము. ఇంతకంటె వేఱు వ్రతములు, క్రతువులు, యోగము, యాగము, దానము, మౌనము లేవు. రామస్మరణమున చండాలుఁడైనను ముక్తిపొందు నన్న వేదశాస్త్రవివేకము గల బ్రాహ్మణునిగూర్చి చెప్పనేల? నీవు న న్నతివిధేయుత నడిగితివి గానఁ జెప్పితిని. నీ వీ పరమరహస్యమును నాస్తికులకు, శ్రద్ధాహీనులకు, భక్తిహీనులకు, కామక్రోధాదిదూషితులకు, భక్తనిందకులకు, శాంతిరహితులకు, దురహంకారులకు నెన్నఁడును జెప్పకుము.'' అని పలికెను.

నే నపరిమితానంద మంది యాతని పాదపద్మములను విడువక ''తండ్రీ! నాకు రామధ్యానపద్ధతిఁ దెలిపి కరుణింపు'' మని వేడితిని. అంతఁ గరుణారసము వెల్లివిరియ నా మహామహుఁ డిట్లు చెప్పఁదొడంగెను.

## లోమశమహర్షి ప్రబోధము

అయోధ్యలోఁ జిత్రమండపముతో నొప్పు కల్పవృక్షము మూలమున నవరత్నస్థగిత మగు బంగారుసింహాసనమునఁ గూర్చుండి పూర్ణచంద్రుని బోలు ముఖపద్మముతోడను, దూర్వాదళ శ్యామ మగు దేహముతోడను, మణికిరీటముతోడను, నీలకుంతలములు, మకర కుండలములు, వైడూర్యమణులవంటి పలువరుసలు, పూవువంటి నాలుక, శంఖమువంటి

కంఠము, సింహోన్నతములు నగు బుజములు, శుభలక్షణములుగల నాసిక, వివిధభూషణములతో నొప్పు ఆజానుబాహువులు, లక్ష్మీయుతము, శ్రీవత్సాంకితము నగు విపుల వక్షఃస్థలము, గంభీరనాభి, గొప్ప ఉదరము, రత్నకాంచివంటి నడుము, మనోహరము అగుతొడలు, జంఘలు, వజ్ర యవాంకుశరేఖలు గల కోమలచరణములు గలిగి దేదీవ్యమానుఁడగు శ్రీరామచంద్రుని మనసార ధ్యానించి, చేతులారఁ బూజించి నోరార భజించి, పరమ సులభముగ మోక్షము నందవచ్చును. ఇంతకంటెను సులభోపాయ మిం కెక్కడను లేదు.''

"దేవా! వీనుల విం దగు శ్రీరామకథ నాకు సంక్షేపముగాఁ దెలుపఁగదవే'' యని నేను ప్రార్థించితిని. నాకోరిక మన్నించి యాతఁ డిట్లు తెలిపెను.

## రామకథా సంగ్రహము

"వత్సా! సంసారమగ్ను లగు సజ్జనుల నుద్ధరింప విష్ణుమూర్తి త్రేతాయుగమున సూర్యకులమున నాలుగు రకముల యాకారములతో జన్మించి పూర్ణాకృతి యగుతాను రాముఁ డనుపేరు వడసెను. రాముఁడు తండ్రి యానతిఁ దలఁదాల్చి లక్ష్మణసహితుఁడై విశ్వామిత్రునివెంట నరిగి తాటకను జంపి కౌశికుని యజ్ఞభూమినిజేరి మారీచునిగొట్టి సుబాహునిఁ జంపి యహల్యాశాపవిమోచనముఁ గావించి మిథిల కేఁగి శివధనుస్సు విఱిచి సీతను బెండ్లాడెను. రామునకుఁ బదునైదవ వత్సరము సీత కాఱవవత్సరము, పండ్రెండేండ్లయినపిదప దశరథుఁడు రామునకు యౌవరాజ్యాభిషేకము చేయఁదలఁ పెట్టెను; అది కైకేయీ వరద్వయమున జరుగకపోఁగా, రామునిఁ బదునాలుగేం డ్లరణ్యవాసము చేయుటకు, భరతుని యౌవరాజ్యము ననుభవించుటకు నేర్పఱచెను.

రాముఁ డంత సీతాలక్ష్మణసమేతుఁడై బయలుదేఱి మూఁడు దినములు జలాహారము, నాలుగవ దినమున ఫలాహారము గైకొని యైదవ నాఁడు చిత్రకూటముఁ జేరి యందు పండ్రెండేండ్లు నివసించి పదుమూఁడవసంవత్సరమునఁ బంచవటియందు కాముకురాలగు శూర్పణఖను

విరూపను గావించెను. పిదప జ్యేష్ఠకృష్ణాష్టమినాఁడు రావణుఁడు వచ్చి సీతను గొనిపోవుచుండ నామె యింటలేని రామునికై రామ రామ యని యేడ్చెను. ఆ యేడుపువిని జటాయువు రావణుని కడ్డువెళ్ళి యాతఁడు ఱెక్కలు నఱుకఁ గ్రిందఁబడిపోయెను. సంపాతి వానరులకు సీతజాడ చెప్పెను. మార్గశిరశుద్ధ యేకాదశినాఁడు హనుమంతుఁడు మహేంద్ర పర్వతమునుండి యెగిరి రాత్రికి లంకనుజేరి తెల్లవాఱుకట్ట సీతను గని సంచార ముడిగి విశ్రమించి, ద్వాదశినాఁడు శింశుపావృక్షము నెక్కినాఁటి రాత్రి చేతులు జోడించి సీతకు నమస్కరించి నమ్మకము కలుగునట్లు పలికి త్రయోదశినాఁడు అక్షకుమారుఁడు మున్నగురాక్షసులఁజంపి చతుర్దశినాఁడు ఇంద్రజిత్తు ప్రయోగించిన బ్రహ్మాస్త్రమున బద్ధుఁడైనట్లు నటించెను. రాక్షసు లానందించి యాతనితోఁకకు మానెగుడ్డలుచుట్టి యంటింప దానితో నాతఁడు లంకాదహనము కావిఁచెను. పూర్ణిమనాఁటికి హనుమంతుఁడు తిరిగి మహేంద్రగిరికివచ్చి వానరులతోఁ గూడి యైదు దినములు నడచి యాఱవ దినమున మధువనముఁ జొచ్చియందు మధువుఁ గ్రోలి చెట్లఁ జెల్లాచెదరుచేసి పయనించి యేడవ దినమున రామునిజేరి యానవా లొసంగెను.

శ్రీరాముఁడు ఉత్తరఫల్గునీనక్షత్రయుక్తమగు అష్టమినాఁడు బయలుదేఱి యేడుదినములు సముద్రతీరమున స్కంధావారముననుండి పుష్యశుద్ధప్రతిపత్తుమొదలు తదియవఱకు సేనలు నడపి సముద్రముఁ జేరి చవితినాఁడు విభీషణునకు శరణొసఁగి పంచమినాఁడు మొదలు నాలుగు దినములు ప్రాయోపవేశము గావించెను. సముద్రుఁడు వర మొసఁగ దశమినాఁడు సేతువును గట్ట నారంభించి త్రయోదశికిఁబూర్తి చేసి చతుర్దశినాఁడు సైన్యమును సువేలాద్రిఁజేర్చెను. పూర్ణిమమొదలు విదియవఱకు రాముఁడు సపరివారముగా సముద్రము దాఁటి దశమివఱకు నెనిమిది దినములు లంకావరోధము గావించెను. ఏకాదశినాఁడు శుక సారణులరాకయు ద్వాదశినాఁడు సైన్యసమీకరణము త్రయోదశిమొదలు అమావాస్యవఱకు మూఁడు దినములు సైన్యము లెక్కించుటజరుగ నుత్సాహము నందెను. మాఘశుద్ధ ప్రతిపత్తునాఁడు అంగద రాయ బారము, విదియ మొదలు అష్టమి వఱకు యుద్ధము, మాఘశుద్ధనవమి

నాఁటి రాత్రి ఇంద్రజిత్తు రామలక్ష్మణుల నాగపాశమున బంధించుటయు, దశమినాఁడు వాయువు శ్రీరాముని చెవిలో స్వరూపము జపించుటయు వెంటనే నాగపాశములు వదలుటయు, గరుడుని రాక, ఏకాదశీ ద్వాదశు లందుఁ ధూమ్రాక్షవధ, త్రయోదశిని అకంపనవధ, మాఘశుద్ధచతుర్దశి మొదలు కృష్ణప్రతిపత్తువఱకు ప్రహస్తవధ, మఱిమూఁడు దినములు సంకులయుద్ధము, పంచమి మొదలు అష్టమివఱకు కుంభకర్ణుని మేలుకొలుపు, పిదప నాలు దినములలో కుంభకర్ణునివధ, అమావాస్యనాఁడు శోకమున యుద్ధవిరామము, ఫాల్గునశుద్ధ ప్రతిపత్తు మొదలు నాలుగుదినములు బిసతంతుఁడు మున్నగు రాక్షసులవధ, పంచమి మొదలు సప్తమివరకు అతికాయవధ, అష్టమి మొదలు ద్వాదశివరకు కుంభనికుంభులవధ, పిదప మూఁడు దినములలో మకరాక్షాదుల చావు, ఫాల్గునబహుళప్రతిపద్ద్వితీయలలో ఇంద్రజిత్తు విజృంభణము, తదియ మొదలు సప్తమివఱకు విషాదకారణమున యుద్ధవిరామము, త్రయోదశి నాఁ డింద్రజిద్వధ, చతుర్దశిని యుద్ధవిరామము, అమావాస్యనాఁడు రావణుఁడు యుద్ధమునకు బయలుదేఱుట, చైత్రశుద్ధప్రతిపత్తు మొదలు పంచమివఱకుఁ బెక్కురు రాక్షసులవధ, షష్ఠి మొద అష్టమివఱకు మహాపార్శ్వాది రాక్షస సంహారము, నవమినాఁడు లక్ష్మణశక్తిభేదనము రావణ పలాయనము, ఆంజనేయుఁడు ద్రోణాద్రిని దెచ్చుట, దశమినాఁడు రాముఁడొక్కసారి పెక్కురురాక్షసులఁ జంపుట, ఏకాదశినాఁ డింద్రుని పంపున యాతని దివ్యరథమును దెచ్చి శ్రీరాముని కర్పించుట, శుక్లద్వాదశి మొదలు కృష్ణచతుర్దశివఱకు ఘోరాతిఘోరయుద్ధము జరుగుట. ఆనాఁడే రావణవధ శ్రీరామ విజయము సంభవించెను. మాఘశుద్ధ ద్వితీయ మొదలు చైత్రబహుళ చతుర్దశివరకు జరిగిన యుద్ధములో యుద్ధవిరామదినములు పదునైదు తీసివేయఁగా డెబ్బదిరెండు దినములు మహాయుద్ధము జరిగెను. వైశాఖశుద్ధ ప్రతిపత్తునాఁడు శ్రీరామచంద్రుఁడు సకల సురజేగీయమానుఁడయ్యెను. విదియనాఁడు శ్రీరాముఁడు విభీషణపట్టాభిషేకముఁ గావించెను. తదియనాఁడు సీతాపాతివ్రత్యశుద్ధి యయ్యెను. చవితినాఁడు సీతాసహితుఁడై రాముడయోధ్యకుఁ బుష్పకవిమానమున బయలుదేఱెను. పంచమినాఁటికిఁ బదునాలుగుసంవత్సరములు నిండఁగా శ్రీరాముఁడు సపరివారుఁడై

భరద్వాజాశ్రమముఁ బ్రవేశించెను. షష్ఠినాఁడు నందిగ్రామమున భరతసమావేశము జరిగెను. సప్తమినాఁడు శ్రీరాముఁ డయోధ్యలోఁ బట్టాభిషిక్తుఁడయ్యెను. రామున కపుడు నలువదిరెండు సంవత్సరములు సీతకు ముప్పదిమూఁడుసంవత్సరములు. సీత రావణునింట నున్నది పదునొకండు నెలల పదునాలుగు దినములు.

వత్సా! రాముఁ డయోధ్యఁ బాలించుచుండఁగా అగస్త్యమహర్షి విచ్చేసి యాతనిచే నశ్వమేధయాగము చేయించును. ఆ గుఱ్ఱము నీ యాశ్రమమునకు వచ్చును. దానివెంట వచ్చిన రామపరివారము నీ వయోధ్య కేగి శ్రీరాముని దర్శింతువు. నాఁటికి నీ కర్మపూర్తియై నీతపము ఫలించును. నీవు శ్రీరామసాయుజ్యమునంది మోక్షమందఁ గలవు."

## ఆరణ్యకతపఃఫలాగమము

ఈ విధముగా సెలవిచ్చిన లోమశమహర్షికి నేను సాష్టాంగనమస్కారము చేసి యాతని యాజ్ఞ గైకొని నాఁటినుండి శ్రీరామమంత్రజప భజన పరాయణుఁడనై యుంటిని. లోమశ మహర్షి వాక్రుచ్చినట్లే అశ్వము వెంబడి మీరు వచ్చితిరి. నాకును గర్మఫల సమాప్తి పరిపూర్ణము కానున్నది. నా తపఃఫలమును త్వరలోనే నేను గనం గందునుగదా" యని పలికి యారణ్యకమహర్షి యానందపరవశుఁ డయ్యెను.

శత్రుఘ్నుఁ డామహర్షికథ యంతయు విని మిక్కిలి యాశ్చర్య పడి యాతని నయోధ్యాపురికిఁ దగుపరివారముతోఁ బంపి తాను అశ్వము వెంట ముందునకుఁ బోయెను.

## రామదర్శనము: సాయుజ్యప్రాప్తి

అయోధ్యాపురము సమీపింపఁగనే ఆరణ్యకమహర్షి రథమును దిగి పాదచారియై సరయూనదీతీరమున యజ్ఞదీక్షితుఁడై యున్న శ్రీరామచంద్రుని సమీపించి యాతని రూపమును గనులారఁగాంచెను. తత్క్షణ మాతఁడు పులకితశరీరుఁడై జలజల మని యానంద బాష్పములు

రాలుచుండఁ, గన్నులు మూఁతపడ, భక్తివశమున దేహమును మఱచి పోయెను. కరుణాసముద్రుఁడగు శ్రీరాముఁడు లేచి యాతని కెదురేఁగి, కౌఁగిలించుకొని చేతులు పట్టుకొని తీసికొని వచ్చి యుచితాసనమునఁ గూర్చుండఁబెట్టి పాదములు కడిగి యా జలములు తలపైఁ జల్లుకొని, గంధపుష్పాదులచే ఆ మహర్షిని పూజించి, పాఁడియావు నొసంగి, మార్గ శ్రమము పోవున ట్లుచితోపచారము లొనర్చి "స్వామీ! నీ సందర్శనమున నా యిల్లు పవిత్ర మయ్యెను. నేను ధన్యుడ నైతిని. నేఁటితో నాయశ్వమేధ యాగముకూడఁ బూర్తి కానున్నది. మహదాగమనము సకలఫలప్రదముగదా!" యని యాతని ననేక విధముల సంప్రీతు నొనర్చెను.

అంత, ఆరణ్యకమహర్షి శ్రీరాముని పాదపద్మములపై సాష్టాంగపడి "దేవ దేవా! పరమేశ్వరా! నీ నిర్వ్యాజకటాక్షవీక్షణమున నా జన్మము ధన్య మయ్యెను. నా తపస్సు పండెను. నేను తరించితిని. సంసార సాగరమును దరించితిని. పరంధామా! నీ సాయుజ్యప్రాప్తి నా కొసంగి రక్షింపుము. జననమరణదుఃఖ పరంపర నుండి నన్ను శాశ్వతముగా రక్షింపుము. ఈ సుదినమునకై యెదురు చూచుచుంటిని. పాంచభౌతిక మగు నా యీ పాడుదేహమును విడిచి పుచ్చి తత్క్షణమే నీలో నైక్యమై బ్రహ్మజ్ఞానసంపన్నులు, యోగీశ్వరేశ్వరులు, భక్తిసంపన్నులు, పొందు నపునరావృత్తి రహిత శాశ్వతబ్రహ్మలోకనివాససిద్ధి నందుదు" నని పలుకఁగనే యా మహర్షి బ్రహ్మకపాలము పగిల్లున బద్దలై యందుండి యొకదివ్యతేజ మా శ్రీరామచంద్రునిం గలిసెను. దేవతలు పుష్పవర్షము గురిసిరి. కిన్నరకింపురుషులు గంధర్వులు "జయజయ! సాయుజ్యమోక్షము నందిన ఆరణ్యకా! జయ జయ" అను ధ్వను లొనర్చిరి. సెలయేఱు వచ్చిచొచ్చిన మహాసముద్రునివలె శ్రీరామచంద్రుఁ డతిగంభీరప్రశాంతదివ్యతేజస్వియై మెఱసెను. *

---

* పద్మపురాణము, పాతాళఖండము.

# మహర్షుల చరిత్రలు

## ఉదంక మహర్షి

భృగువంశమున జనించిన మహర్షులలో ఉదంకమహర్షి యొకఁడు. ఈతఁడు బాల్యమునుండియు గౌతమమహర్షికడ శిష్యుఁడై గురుశుశ్రూషా తత్పరుఁడై యాతని సేవించుచుండెను. గౌతమునికడ శిష్యులుగఁ జేరిన యనేకులలో నీతఁ డొకఁడు. అందరికన్న మిన్నగా గురునింటి పనులు శ్రద్ధతోను, భక్తితోను, ఓరిమితోను నీతఁడు చేయుచుండెను. ఇటు లుండ ననేకసంవత్సరములు గడచుచుండెను. గౌతముఁడు విద్యాపరిపూర్తి యైనశిష్యులను గ్రమక్రమముగాఁ బిలుచుచు వారు వారు కోరినవరము లిచ్చి యాశీర్వదించి పంపుచుండెను. కాని, యెన్ని సంవత్సరము లైనను, ఉదంకునివలన సేవ కొనుటయే కాని యాతనిం బిలిచి యేమికావలయు నని యడుగుట కాని, విద్యాపరిపూర్తియైనది: ఇంకఁ బోవచ్చునని కాని, యెన్నఁడును బలుకకుండెను. బాల్యమున శిష్యుఁడుగాఁ జేరిన యుదంకునకు గుర్వాశ్రమముననే కౌమార యౌవనములు గడచి గురుశుశ్రూషలోనే వార్ధక్యము పైఁబడెను. ఐనను, నిత్య మాతఁడు అడవులలోని కేఁగి కట్టెలు కొట్టితెచ్చుట, గురుగృహిణి యగు అహల్యాసాధ్వికిఁ దలలోనినాలుకవలె నుండి సమస్తగృహకృత్యములు నిర్వర్తించుచుండుట మానకుండెను.

ఆ దినములలోని గురుశిష్యసంబంధ మట్టిది. గురు సేవలో నిమగ్నులై శిష్యులు దేహస్మృతి యెఱుఁగకుండెడివారు. ఉదంకుఁ డెన్నఁడును తనవయస్సునుగుఱించి లెక్కించుకొనుట కాని, తనముఖ మెట్లున్నదని యద్దమును జూచుకొనుటకాని తా నెన్ని విద్యలు నేర్చినను గురు వింకను వీడ్కో లీయఁడే యని యాతురత కనఁబఱచుట కాని లేకుండెను. ఒకనాఁడు వనమున కేఁగి యెండుకట్టెలమోపు నెత్తిని బెట్టుకొని యింటికి వచ్చి క్రిందఁబడవేసెను. మోపు చాల పెద్ద దగుటచేతను, మిక్కిలి బరువగుటచేతను, అది క్రిందఁ బడునపుడు ఉదంకునిజుట్టు కొంత కట్టెలకుఁ జెనఁగొని మోపుతోపా టదియు నేలఁబడెను. ఎండు కట్టెలను

జిక్కుకొని యూడిపడిన తనతలవెంట్రుకలు తెల్లనికాంతుల నీనుచుఁ దన వార్ధక్యదశను జెప్పకచెప్పెను. వెంటనే యాతఁడు "అయ్యో! నా శిరోజము లిప్పుడే తెల్లపడిపోయినవే! నా బాల్యకౌమారయౌవనదశ లన్నియు గురుశుశ్రూషలోఁ గడచిపోయినవే? నేను జేరినతరువాతఁ జేరిన శిష్యు లనేకులు విద్యాపరిపూర్తియై గుర్వాజ్ఞ వెడలిపోయిరే! నా కింక విద్యాపరిపూర్తి కాదా? గుర్వనుగ్రహమే కలుగదా! గురుని యాశీర్వచనము, గురుపరప్రసాదము, గురుసతియు మిచ్చి వీడ్కొలుపుటయు నా కీజన్మమునఁ గలుగవా? నే నేమియు గురుద్రోహము చేయలేద? అహల్యాసాధ్విని గన్నతల్లిగా భావించి యామెసేవ నెన్నఁడేమఱక చేయుచునే యుంటినే? కోటానఁ గోటులు శిష్యులు వచ్చి చదివి కృతార్థులై పోవుచుండ నేను శాశ్వతముగా నిట్లుండిపోవలసినదేనా? నా జన్మ మంతయు వ్యర్థ మైనదా?" అని యెన్నోయూహలు కలుగ నొక్కసారిగఁ బెల్లుబికివచ్చిన దుఃఖము నాపుకొనలేక వెక్కివెక్కి యేడ్వఁదొడఁగెను.

దయాసముద్రుఁ డగు గౌతమ మహర్షి యిది యంతయు దివ్యదృష్టిని గ్రహించి తన కొమార్తెయుఁ జక్కని చుక్కయు నగు తరుణిని ఉదంకుని యశ్రువులు భూమిపైఁ బడనీయక దోసిటఁబట్టుమని పంపించెను. ఆమె వరుగున వచ్చి ఉదంకుని కన్నీరు దోసిటఁ బట్ట సలసల క్రాఁగునావేఁడికన్నీటిచే నామె చేతులు వేఁడెక్క భరింపలేక యామె నేల విడిచెను. నేలఁబడిన యామేర యంతయుఁ దుకతుక నుడికిపోయెను.

వెంటనే గౌతమమహర్షి యుదంకుని బిలిచి "వత్సా! నీ దుఃఖమునకుఁ గలకారణ మేమి? నిస్సంకోచముగాఁ జెప్పు" మని యడిగెను. ఉదంకుఁడు "మహాత్మా! కోటానఁగోటులగు మీ శిష్యులపై మీకుఁ గల దయలో నాపై సహస్రాంశమైనను లేకపోవుటకు నేఁ జేసినదోష మే మని దుఃఖించితిని. అంతకన్న నేమియు లేదు. క్షమించి రక్షింపుఁ" డని గురుని వేఁడుకొనెను.

గౌతముఁ డంత "వత్సా! నీ గురుభక్తికి నేను మిక్కిలి సంతసించితిని. శిష్యు లెల్లరకు నేను వీడుకో లిచ్చి నీ కీయకుండుటకుఁ

గారణము నిన్నందఱికంటె నధికునిఁ జేయుటకే యని గ్రహింపుము. ఆలస్యమైనదీ వార్ధక్యము వచ్చినదీ యని విచారింపకుము. శరీరము పరిణామపేశలమే కాని, వలసినపుడు యౌవన మీయఁగల శక్తిగల మాకడ నీ వందులకు దుఃఖింపఁ బనిలేదు. మఱి నీ శ్రద్ధకు మెచ్చితిని. నీ బుద్ధికి సంతసించితిని. నీ వృద్ధిని గోరెదను. ఇదిగో నీకు నిత్య యౌవన మొసంగితిని. నవయువతియు, శ్రద్ధావినయవివేకవతియు నగు నా ముద్దుకూతు నిచ్చెదను. పెండ్లాడి యౌవనసుఖము ననుభ వించి గృహస్థాశ్రమమును నిర్వహింపుము. చిరకాలగురుసేవాగ్ని సంతప్తమగు నీ శరీరమును భరింప మానవ కాంతలకు సాధ్యము కాదు. గురుసుత తోఁబుట్టువుతో సమానురాలు, దీని నెట్లు పెండ్లాడుదు నని సందేహింపకుము. ఈమెకు శరీరాంతరముఁ గల్పించెదను. అది జన్మాంతరసమానమే యగుట ధర్మదూష్యము కాదు. ఇది అధర్మము కాకుండునట్లును నీకు యౌవనము లభించునట్లును వరము లొసంగితిని" అని పలికెను.

గౌతమమహర్షి వరప్రసాదమున ఉదంకునకు నూతన యౌవనము, గౌతమునికూఁతునకు దివ్యసుందర నూత్నశరీరమును లభించెను. ఉదంకుఁడు గురునాజ్ఞ నౌదల ధరించి యాకన్యారత్నమును బెండ్లాడెను.

పిదప, ఉదంకుఁడు గౌతముని పాదములకు మ్రొక్కి "గురుదేవా! నన్నిన్ని విధముల ననుగ్రహించిన నీకు గురుదక్షిణ యొసంగఁ గుతూ హలపడుచున్నాను. నా యందు వాత్సల్య ముంచి యేదేని కోరి నా కా యవకాశము నొసంగఁ బ్రార్థించెదను. సర్వ శక్తిసంపన్నులగుతమకు నే నీయఁగలది లేదు. ఐనను, మీ కరుణకు నిదర్శనముగా నా కొసఁగుం" డని ప్రార్థించెను. దానికి గౌతముఁడు "వత్సా! నీవు నా కేమియును గురుదక్షిణ నీయవలసిన పని లేదు. లోకమునందలి గురు లకు దక్షిణ కావలయును. నీవు సత్ప్రవర్తనమున నుత్తమగృహస్థ ధర్మమును పాలించుటే నాకిచ్చు గురుదక్షిణ" అని బదులుచెప్పెను. ఉదంకుఁ డూరకుండక అహల్యాసాధ్వీపాదములకు నమస్కరించి యేదైన వస్తువుఁ గోరుకొమ్మనియు గురుదక్షిణకన్న గురుపత్నీదక్షిణ యధిక

మనియుఁ బలికెను. అహల్య "వత్సా! నీవు పై వాఁడవు గావు. ఏ దక్షిణయు వలదు. నీ గురువులు చెప్పిన చొప్పున నడచుకొను" మని పలికెను. ఉదంకుఁడు మఱిమఱి యామెను విడువక ప్రార్థింపఁగా నామె "వత్సా! మిత్రసహుఁ డను రాజుభార్య ధరించు కుండలములు నాకుఁ గొనితెమ్ము. అవి ధరింప నాకు ముచ్చటగ నున్నది. దాన నా ముచ్చటతీరును. నీకుఁ బెంపు కలుగును" అని పలికెను.

'ఇది యెంతపని?' యని యుదంకుఁడు బయలుదేఱి వెడలెను. పిదప నొకనాఁడు గౌతముఁ డుదంకునిం గానక యాతఁడే మయ్యె నని యహల్య నడిగెను. అంత నామె జరిగిన సంగతి నెఱింగించెను. "అయ్యో! మిత్రసహుఁ డనురాజు శాపకారణమున రాక్షసుఁడై చరించు చున్నాఁడు. మనుష్యమాంసమును దినుచున్నాఁడు. ఉదంకుఁ డీసంగతి యెఱుఁగఁడు. ఆ రాజుకడ కితఁ డేఁగుచో నేమి కీడు వాటిల్లునో కదా!" యని గౌతముఁ డనెను.

ఈ మాటలు విని యహల్య భీతచిత్తయై "నా కా సంగతి తెలి యదు. ఏదైనఁ గోరక తప్ప దని నన్ను మఱిమఱి బలవంత పెట్టు టచేఁ బంపితిని. కన్నతల్లికన్న మిన్నగా నన్నుఁ బూజించు నుదం కున కే యుపాయమును బాటిల్లకుండునట్లనుగ్రహింపు" మని భర్తను బ్రార్థించెను. అంత గౌతముఁ డాపరాయత్తచిత్తుఁడై యుదంకున కేప్రమాదమును కలుగకుండునట్లును, అతఁడు పోయిన కార్యము సిద్ధించునట్లును, అతని కణిమాదు లగు అష్టసిద్ధులు కలుగునట్లును, మనమున దృఢముగఁ దలపోసెను.

ఉదంకుఁ డట్లు పోయిపోయి యొక వనమున నొకగొప్ప వృషభము నెక్కి వచ్చుచున్న యొక మహాపురుషునిం గాంచి యాతఁ డొసంగిన వృషభ గోమయమును దిని యాతని యనుగ్రహ మంది ముందునకుఁ బయనమై పోయి మనుష్యరక్తసిక్తమగుశరీరము, కోరమీసములు, మిడిగ్రుడ్లు, భయంకరాకారము గలిగి యా శూన్యాటవిఁ దిరుగు మిత్రసహుఁ డనురాజును గాంచెను. అతఁడు "రా. రా. ఆఁకలి యగు చున్నది. మనుష్యమాంస మెట్లు దొరకునా యనుకొనుచుండ వచ్చితివి.

రా. రా." యని పలికెను. ఆ మాటల కదరక బెదరక యుదంకుఁడు "రాజా! నేను గురుకార్యమున వచ్చితిని. అందుచేత నీవు నన్నుఁ జంప వీలుకాదు. నీకు నా రక్తమాంసములే కావలసినచో నా గురుని కార్యము నెఱవేర్చిన పిదపఁ దిరిగి నీ కడకు వచ్చెదను. అపుడు నీవు నా రక్తమాంసములు గైకొనవచ్చు" ననెను. "ఓయీ! పగలు మూఁడవ జాము దాఁటినతరువాత నా భోజనకాల మని దేవతలు నా కాజ్ఞాపించిరి. నీవు సరియైన యా కాలమున వచ్చితివి కావున, నిన్నుఁ జంపి తినక విడువ" నని రాక్షసరూపమున నున్న రాజు పలికెను. "రాజా! నా మాట వినుము. నే నసత్య మాడను. నా పనియైన పిదపఁ దిరిగి వచ్చెదను. నీవు కోరికలఁ దీర్చెడి రాజ వని విని నా కోరినకోరిక నీవే తీర్పఁగల వని నేను వెదకి వెదకి నిన్నుఁ గనఁ గంటిని. నా కోరిక నాకై కాదు; గురువులకొఱకు. కావున, ముందు నీవు నా కోరికఁ దీర్చి తరువాత నీ యిష్టమైనట్లు చేసికొ"మ్మని ప్రార్థించెను. "అగుచో నీ కోరికయే?" మని రా జడిగెను. "నీ భార్య మదయంతీదేవి ధరించు కుండలములు నా కీయవలయు" నని యుదంకుఁ డర్థించెను. "ఏమిది? ఒరుల ధనము లిచ్చువా రెటులైనఁ గలరా? నీకుఁ గావలసిన నింకొక టేదైనఁ గోరుకొమ్ము ఇచ్చెద" నని రాజు పలికెను. ఉదంకుఁ డందుల కంగీకరింపక "నా కింకేమియు వలదు. నా కా కుండలములే కావలయు" నని పట్టుపట్టెను. "సరే నీవు పోయి నే నిమ్మంటి నని చెప్పి యామె నడిగి తెచ్చుకొను" మని రాజు తనభార్య యున్న ప్రదేశముం జూపెను.

ఉదంకుఁ డటు వెడలి యెంత వెదకినను ఆ దేవి కన రాదాయెను. విసివి యాతఁడు తిరిగి రాజుకడ కేతెంచి దేవి యెందునుగాన రాలే దని చెప్పెను. "అయ్యా! నా దేవి పతివ్రత, పవిత్ర. ఆమె యశుచులకుఁ గానరాదు. నీవు త్రిభువనపావనుఁడవు. నీ వశుచి వని యెట్లందును?" అని రాజు పలుక నుదంకుఁడు వృషభగోమయభక్షణంబున నశుచిత్వము తనకు కలిగియుండవచ్చు నని భావించి తూర్పుగాఁ దిరిగి పాదములు కడుగుకొని మంత్రజపముచేసి యాచమించి రాజు ననుమతిఁగొని మరల దేవికడ కాతఁడేగెను. ఈసారి యా మహాపతివ్రత కానవచ్చెను.

ఉదంకుఁ డామెకు నమస్కరించి తనవచ్చినపని రాజానుమతి రెండును దెలిపెను. రాజుకడనుండి యానవాలు తీసికొని వచ్చినఁ డనకుండలము లిచ్చెద నని యామె పలికెను. ఉదంకుఁడు మరల రాజుకడకు వచ్చి యామె పలుకులు తెలిపెను. "దీనివలన మేలుకలుగు నన రాదు; అది కాదన్న వేఱుమార్గము లేదు" అనుపలుకులు పలికి యానవాలుగాఁ దనభార్యకడఁ బలుకు మని రా జాయుదంకునకుఁ జెప్పెను. ఉదంకుఁడు తిరిగి దేవి కడ కేగి రాజు పలికిన పలుకులు తు చ తప్పకుండునట్లు పలికెను. ఆ మాటలు విని మదయంతి సంతోషించి "ఋషివర్యా! దేవతలు, గంధర్వులు, నాగులు ఈ కుండలములకోసమై వివిధోపాయములు పన్ని తస్కరింపఁ దలఁచుచుందురు. ఎంగిలి సోఁకినను, ఏమఱుపాటున నీవు నిద్రించినను, నేలమీఁద వీనిని బెట్టినను వారు వీనిని తస్కరింతురు. వీనిని భక్తితోఁ బూజించి ధరించినవారికి ఆఁకలిదప్పులుండవు; అగ్ని భయము కలుగదు. విషవికారము సోఁకదు. భూతభేతాళబాధలంటవు. పిన్నలైనఁ బెద్దలైన వీనిని ధరింప నివి ధరించువారి వయసును ననుసరించి చిన్నవి పెద్దవి యగుచుండును. వలసినపుడెల్ల బంగార మివి కురియుచుండును. కావున వీనినిఁ బదిలముగాఁ దీసికొనివెళ్ళి మహాసాధ్వి యగునహల్యకిమ్ము. గురుకార్యమును నిర్వర్తింపుము. నీకును మాకును మేలగు" నని భక్తిప్రీతి వినయంబులు ముప్పిరిగొన ఆ మహాదానముఁ జేసి నమస్కరించెను. ఉదంకుఁడపరిమితానందమంది యాదేవికి హృదయపూర్వకాశీర్వచనముల నొసంగి యా కుండలముల గ్రహించి రాజుకడ కేతెంచి "రాజా! నీవలనఁ గృతార్థుఁడ నైతిని. నీకు సకలభద్రము లగుఁగాక! నా కానవాలుగా నీవు చెప్పినవాక్య మతినిగూఢముగ నున్నది. దాని తాత్పర్యమును దెలిపిన సంతసించెద" నని పలికెను.

అందులకా రాజిట్లు తెలిపెను. "ఋషివర్యా! రాజులు బ్రాహ్మణులఁ బూజింతురు. నేనును విప్రులఁ బూజించుచునే యుండెడివాఁడను. నాకీ శాపము బ్రాహ్మణునివలననే కలిగెను. ఈ శాపపరిహారమునకై విప్రసేవ తప్ప వేఱుగతిలేదు. బ్రాహ్మణసేవ దుస్తరము, అసిధారా వ్రతమువంటిది. "దానివలన మేలుకందు మనరాదు, అది

కాదన్న వేఱుమార్గములేదు" అనుగుర్తు దేవికి నీతోఁ జెప్పి పంపితిని. అనఁగా నీ కుండలములు మహర్షికి దానము చేసినచో దానివలన మనకు మేలగునని నా తలంపామెకుఁ దెలియ జేసితిని. ఆమె పతివ్రత, ఉత్తమురాలు కావున నా భావ మెఱిఁగి నిరుపమాన మగురత్నకుండల దానమును ఉత్తమోత్తమ బ్రాహ్మణుఁడ వగు నీకు వెంటనే చేసినది." ఆ మాటలు పలుకుచుండు రాజునకు ఉదంకమహర్షి పుణ్యసాన్నిధ్యమున నొక మహాపుణ్యము సోఁకి శాంతవచనములు, కుండలదానశ్రద్ధ, నూతనసత్త్వ సంపద లభించెను. ఉదంకుఁ డతనికడ సెలవుగైకొని గురుపత్నికా కుండలము లిచ్చి తిరిగి వచ్చెద ననియు నప్పుడు తన్ను భక్షింపవచ్చు ననియుఁ బలికెను. రా జాతనిం జూచి "మహనీయ తపోనిధీ! నీ పెంపు నాకుఁ గానవచ్చినది. చంపెడువానికడకు మగిడి వచ్చెడివారు గలరా? నీవు దయయుంచి నీ తపశ్శక్తిచే నా యార్తింబాపి కాపాడవే" యని ప్రార్థించెను.

అపారకరుణ మెఱయు నుదంకుఁడు రాజుం జూచి "రాజా! ఏ కారణముచేత నైనను మహాత్ములకుఁ గోపము వచ్చినను అది వెంటనే యుపశమించును. నీ దోషమువలన నీ కీ కీడు వచ్చినది. నేను నీకడకు వచ్చుటయు, నీవు నా కోరిక తీర్చుటయు నివి యన్నియు నా గురువరు లగు గౌతమమునీంద్రుని చల్లనిచూపు వల్లనేయైయుండు ననుకొందును. వారి దయగలిగిన నీకును నాకును సకలలోకములకును మేలు కలుగు" నని పలికి తన కరకమలమున నా రాజు మేను నిమిరెను. వెంటనే రాజు రాక్షసత్వమును విడిచి శుద్ధసత్త్వుఁడై భక్తివినయ భరితుఁడై యాతనిం బ్రస్తుతించి నమస్కరించెను.

పిదప, మిత్త్రసహుఁ డాదరమేదురముగా "మహాత్మా! నీ వతిథివి. నా యింటఁ గుడిచి నన్ను ధన్యునిఁజేసి మఱి పొమ్ము" అని ప్రార్థించెను. ఉదంకుఁ డందుల కంగీకరించెను. భోజనసమయమున అన్నములో తల వెంట్రుకలు వచ్చెను. ఉదంకుఁ "డయ్యో! నీ కింకను పాపక్షయము పూర్తిగాఁ గాలేదు. ఐనచో నిట్టిదోషము నీకుఁ బట్టియుండె డిది కాదు. అపరీక్షిత మైనయన్నముఁ బెట్టితివి. కావున, నీ వంధుఁడ

వగుదు" వని శపించెను. "అల్పదోషమున నీవు నన్ను శపించితివి. నీ వనపత్యుఁడ వగుదు" వని రాజాతనికిఁ బ్రతిశాపమిచ్చెను. వెంటనే యుదంకుఁడు "రాజా! నా శాప ముపసంహరించెదను. నే ననపత్యుం డనుగా నోపను. నీ శాపము నుపసంహరింపు" మని కోరెను. అందుపై రాజు "ఋషీశ్వరా!

నిండు మనంబు నవ్యనవనీతసమానము పల్కు దారుణా
ఖండలశస్త్రతుల్యము జగన్నుత! విప్రులయందు నిక్కమీ
రెండును రాజులందు విపరీతము గావున విప్రుఁ డోపు నో
పం డతిశాంతుఁ డయ్యు నరపాలుఁడు శాపము గ్రమ్మఱింపఁగన్.
(భార. అది ౧. ౧౯.౧)

కావున శాపముఁ ద్రిప్పఁగలశక్తి లేని నన్ను మన్నించి శక్తి యుతుఁడవు గావున నీ శాపమునుండి నన్ను రక్షింపు" మని ప్రార్థించెను. ఉదంకుఁ డందుల కియ్యకొని రాజునకు శాపమోక్షము ననుగ్రహించి వెడలిపోయెను.

ఉదంకుఁడు కుండలములు కృష్ణాజినమున జాగ్రత్తగా దాఁచి గౌతమాశ్రమ మార్గమున వేగముగాఁ బోవుచుండెను దారిలోఁ బరిపక్వ ఫలములతోఁ గూడిన బిల్వవృక్ష మొకటి కానిపింప నాఁకలిబాధ వోఁగొట్టుకొనఁ దలంచి ఉదంకుఁ డా వృక్షమునెక్కి కృష్ణాజినము నొక కొమ్మకుఁ దగిలించి ఫలములు గోసికొనుచుండెను. ఇంతలో నొక పెద్ద గాలి వీవ, కృష్ణాజినము పట్టుదప్పి నేలపైఁ బడెను. వెంటనే తక్షకుఁడను పాములరాజు కుండలము అపహరించి నాగలోకమునకు భూ వివరమార్గమునఁ బోయెను. ఉదంకుఁ డది చూచి యొక్కపెట్టున భూమి కుఱికి ఆ పామును బట్టఁబోయి యొకపుట్టఁ ద్రవ్వ మొదలిడెను. ఆ మహనీయుఁ డట్లు తన్నుఁ ద్రవ్వుట భరింపఁజాలక భూదేవి భయపడెను. బ్రాహ్మణరూపమున నింద్రుఁ డచటికివచ్చి "అయ్యా! కొయ్యకోలతోఁ ద్రవ్వినచోఁ బాతాళమునకు మార్గ మేర్పడునా? ఎవ్వరైన నవ్వి పోదురు. పాతాళలోక మిక్కడకు వేయియోజనముల లోఁతున నున్నది. నీ కుండలము లపుడే పాతాళమును జేరిన" వని పలికెను. ఉదంకుఁ

డాతనితో "అయ్యా! ఏమైనఁ గానిమ్ము. పాతాళమైన గీతాళమైనను, నే నేఁగి నా కుండలములు తెచ్చుకొని తీరెదను. లేదా ఆ ప్రయత్నమునఁ బ్రాణములైన వీడెదను. అంతేకాని నా ప్రయత్నము విరమింప" నని శపథముచేసెను. ఆ పలుకులు విని యింద్రుఁ డాతని దృఢనిష్ఠ కలరి నిజరూపముం జూపి యాతఁడు త్రవ్వ కొయ్యగోలకే వజ్రాయుధమునకుఁ గలుగు వాఁడిమియు శక్తియునిచ్చి కృతకృత్యుఁడ వగు మని యుదంకు నాశీర్వదించి వెడలిపోయెను.

ద్విగుణితనిష్ఠతో నుదంకుఁడు భూమిని ద్రవ్వుచుండఁగా భూదేవి భయపడిపోయి ఉదంకునకుఁ బాతాళలోకమునకుఁ దెరు విచ్చెను. ఉదంకుఁడు పాతాళలోకమున కేగి యనేకవిధములగు ప్రాకారములచే నిండి, అనేకవిధముల రత్నముల కాంతులచే మిఱుమిట్లు గొలుపుచున్న యా లోక మాలోకించి పది యోజనముల వెడల్పు పంచ యోజనముల విస్తారము నగు పాతాళద్వారమును గని యుదంకుఁడు తన కెట్లు కుండలాహరణము సాధ్య మగునో యని తెల్లఁబోయి చేయునదిలేక నాగపతుల నిట్లని స్తుతించెను.

"బహువనపాదపాబ్ధికులపర్వతపూర్ణసరస్సరస్వతీ
సహితమహామహీభర మజస్రసహస్రఫణాళిఁ దాల్చి దు
స్సహతరమూర్తికిన్ జలధిశాయికిఁ బాయక శయ్యయైన య
య్యహిపతి దుష్కృతాంతకుఁ డనంతుఁడు మాకుఁ బ్రసన్నుఁ
డయ్యెడిన్.
అరిది తపోవిభూతి నమరాదులబాధలు వొందకుండఁగా
నురగుల నెల్లఁ గాచిన మహోరగనాయకుఁ డానమత్సురా
సురమకుటాగ్రరత్నరుచిశోభితపాదున కద్రినందనే
శ్వరునకు భూషణం బయినవాసుకి మాకుఁ బ్రసన్నుఁ
డయ్యెడున్.
దేవమనుష్యలోకములఁ ద్రిమ్మరుచున్ విపులప్రతాప సం
భావితశక్తిశౌర్యులు నపారవిషోత్కటకోపవిస్ఫుర
త్పావకతాపితాఖిలవిపక్షులు నైనమహానుభావు లై
రావతకోటిఘోరఫణిరాజులు మాకుఁ బ్రసన్ను లయ్యెడున్.

గోత్రమహామహీధరనికుంజములన్ విపినంబులం గురు
క్షేత్రమునం బ్రకామగతిఖేలన నొప్పి సహాశ్వసేనుఁడై
ధాత్రిఁ బరిభ్రమించుబలదర్పపరాక్రమదక్షుఁ దీక్షణ
శ్రోత్రవిభుండు తక్షకుఁడు శూరుఁడు మాకుఁ బ్రసన్నుఁడయ్యెడున్.”

భార. ఆది. ౧, ౧౦౫, ౧౦౬, ౧౦౭, ౧౦౮

పిదప, ఉదంకుఁ డందు తెలుపు నలుపు దారములతో వస్త్రమును నేయునిద్దఱు స్త్రీలను, ద్వాదశారచక్రముఁ ద్రిప్పుచున్న కుమారు లార్వురను, పెద్దగుఱ్ఱము నెక్కి మహాతేజస్వి యైన యొక దివ్య పురుషునిం జూచి యర్థవంతములైన వేదస్తుతులతో వారి నెల్లరిని సంతోషపెట్టెను. ఆ దివ్యపురుషుఁడు ఉదంకునిజూచి “వత్సా! నీ కేమి కావలయునో కోరుకొ” మ్మనెను. దాని కాతఁడు “దేవా! ఈ నాగు లందఱు నాకు వశులు గావలయు” నని కోరెను. “అగుచో నీవు వచ్చి నా గుఱ్ఱము చెవిలో నూఁదు” మని ప్రేరేచెను. ఉదంకుఁ డట్లొనరింపఁ గనే ఆ గుఱ్ఱపు ప్రతిరోమకూపమునుండి యనేకములగు మంటలు బయలుదేఱి పాతాళలోక మంతయు భయంకరముగా వ్యాపించెను. నాగకుల మంతయు మిక్కిలి భయపడెను. ప్రళయకాలవహ్నివలె వ్యాపించిన యగ్నిహోత్రములఁజూడ పాఁపరాజు గడగడలాడిపోయెను. ఇది యంతయు ఉదంకుని భయంకరకోపాగ్నియని తలపోసి యాతనిని శరణువేఁడుటకన్న గత్యంతరము లేదని కుండలములు తీసికొనివచ్చి యాతని కర్పించి తక్షకుఁడు తన్నుఁ గాపాడు మని శరణుచొచ్చెను.

ఈ విధముగాఁ గుండలములు తిరిగి గ్రహించియు ఉదంకుఁ డిట్లు తలపోసెను. “నేఁటినుండి నాల్గవదినమునకుఁ గుండలములు తీసికొని రమ్ము. నేను వ్రతముఁ బూర్తిచేసికొని సిద్ధముగానుందు” నని గురుపత్ని పంపినది. అయ్యో! నేఁడే నాల్గవదినము. నే నెట్లీ పాతాళము నుండి బయటపడఁగలను? ఎట్లు గౌతమాశ్రమము చేరఁ గలను? అంతయు నగమ్యగోచరముగా నున్నదే! నేఁడుపోయి కుండలము లహల్యాసాధ్వి కీయనినాఁడు నాశ్రమ మంతయు వ్యర్థమే యగునే?” అని చింతించు నుదంకుని యభిప్రాయ మెఱిఁగి యా దివ్య

పురుషుఁడు తన గుఱ్ఱమునిచ్చి దానిపై నెక్కి మఱుక్షణములో గౌతము నింట దిగఁగల వని చెప్పెను. ఉదంకుఁ డమితానంద మంది కృతజ్ఞుఁడై గుఱ్ఱమునెక్కి తలఁచిన యా క్షణముననే గౌతము నింటికి వచ్చి చేరెను.

అట గురుపత్నియగు నహల్యయు శుచిస్నాతయై నూతన వస్త్రముల ధరించి కుండలములు ధరించు సమయము నగుట నెదురుచూచుచుండెను. ఉదంకుఁడువచ్చి కుండలము లామె కర్పింపఁగనే యామె వానిని ధరించి పతికి నమస్కరించి బ్రాహ్మణులఁ బూజించి తాను దలపెట్టిన వ్రతము పూర్తిగావించెను.

గౌతముఁ డుదంకునిఁ గౌఁగిలించుకొని "వత్సా!

నీ చరితంబు చిత్రమహనీయము మిత్త్రసహక్షితీశ్వరున్
నీచతఁ బాప నాగ మహనీతము సేసినకుండలద్వయం
బా చతురత్వ మా బలిమి యా దృఢనిశ్చయ మట్టులొప్ప ధ
ర్మోచితశీలిఁ దీర నొరుఁ డోపునె యేను నిజంబ పల్కితిన్."

అని ప్రస్తుతించెను. ఉదంకుఁడు గురుపాదములకు మ్రొక్కి తాను గౌతమాశ్రమమునుండి బయలుదేఱి వెడలినది మొదలు కుండలములు తెచ్చునందాఁక జరగిన యావద్విషయమును బూసగ్రుచ్చినట్లు గురువులకు నివేదించి "దేవా! ఆ దివ్యపురుషుఁ డెవఁడు? ఎద్దేమిటి? గోమయమేమి? తెలుపు నలుపు నూలునేయు స్త్రీలెవ్వరు? ఆ యాఱుగురు కుమారులెవ్వరు? నాకు సాయపడిన యా దివ్యుఁ డెవ్వఁడు? ఇవి యన్నియు దివ్యజ్ఞానసంపన్నులరగు తామే నాకుఁ దేటతెల్లముగాఁ దెలుపుఁ" డని ప్రార్థించెను.

గౌతమమహర్షి యుదంకుని కిట్లు తెలిపెను. "వత్సా! ఆ దివ్య పురుషుఁ డింద్రుఁడు. ఆ యెద్దు ఐరావతము. గోమయము మమృతము. నాగలోకములోఁ గానసైన స్త్రీ లిద్దఱు ధాత, విధాత. వారు నేయు వస్త్రము అహోరాత్రము. ద్వాదశారములు గలచక్రము పండ్రెండు మాసములతోఁ గూడిన సంవత్సరము. ఆఱుగురు కుమారులు ఆఱు

ఋతువులు. ఆ గుఱ్ఱము అగ్ని. ఆ పురుషుఁ డింద్రసఖుఁ డగుపర్జన్యుఁ తొలుతనే యింద్రునిఁ గాంచి యమృతముఁ దిన్నవాఁడ వగుట కీ పను లన్నియు అవలీలగా జరిగినవి. నీ వలన మా కానందమైన గురుఋణము నిట్లద్భుతముగా నీవు తీర్పఁ గంటివి. నీవు నీ యిష్ట వచ్చినట్లుండుము.

"కర మిష్టము సేసితి మా
కరిసూదన! దీన నీకు నగు సత్ఫలముల్
గురుకార్యనిరతు లగు స
త్పురుషుల కగు టరుదె! యధికపుణ్యఫలంబుల్."

భార. ఆది. ౧. ౧

ఉదంకుఁడు సమితానందమున గురుని వీడ్కొని గురుపత్ని సెఁ గైకొని భార్యాసహితుఁడై యేఁగి స్వీయాశ్రమమును నిర్మించుక యటఁ దవోగృహస్థజీవన మారంభించెను.*

తక్షకుఁడు తన కకారణముగ నొనర్చిన యపకారము నుదంకు మఱవక దానికిఁ బ్రతీకారము చేయఁ దలఁచి జనమేజయునిపాలి కే "మహారాజా! తొల్లి నే గురుకార్యముఁ జేయఁ బూని వెళ్లఁగా కుటిలస్వభావుఁడు, వివేక విహీనుఁడు నగు తక్షకుఁ డకారణముగా న బాధించెను. మఱియు, నీ తండ్రి యగు పరీక్షిత్తు చనిపోవుట కా దు ర్గుఁడే కారణము. కావున, నీవు సర్పయాగము చేసి యా దుర్మా కాక యా దుర్మార్గవంశము నంతను నశింపఁజేసి పుణ్యము గట్టుకొన మని హెచ్చరించెను.

జనమేజయుఁడును గోపోద్దీపితుఁడై బ్రాహ్మణులఁ బిలిపించి త సర్పయాగము చేసెదనని ఋత్విజులఁ బిలిపించి కావలసిన యేర్పా లన్నియుఁ గావించెను. యాగ మారంభమై హోమము జర చుండఁగా సర్పరాజు లందఱు వచ్చి యందుఁ బడి చచ్చుచుం తక్షకుఁ డతిభీతుఁడై యింద్రునిఁ బ్రార్థించెను. తుదకు ఆస్తీకుఁ మహర్షి జనమేజయుని బ్రార్థించి నివారించుటచే యాగ మాగిపోయె

* భారతము; ఆదిపర్వము; అశ్వమేధపర్వము.

## ఉదంకునకు మహాశివుఁడు ప్రత్యక్షమగుట

తరువాత ఉదంకుఁ డొకమరుభూమిని జేరి యందనేక సంవత్సరములు మహాశివుని గుఱించి మహాతప మొనరించెను. చిరకాలమునకు దయకలిగి శివుఁ డుదంకునకుఁ బ్రత్యక్షమయ్యెను. ఉదంకుఁ డా మహాదేవునకుఁ బ్రదక్షిణసాష్టాంగనమస్కారము లొనరించి యిట్లని స్తుతించెను:

"దేవదేవ! శ్రుతిప్రమాణవిధేయ! మాధవ! జంగమ
స్థావరాత్మక మైనలోకము సర్వమున్ భవదీయ మా
యావిధేయము విశ్వరూపుఁడ వవ్యయుండవు నీవ స
ద్భావసుస్థితి నిన్నెఱింగినఁ బాయుఁ బాపము లచ్యుతా!

అనిమిషసిద్ధసంయమివిహంగభుజంగమముఖ్యు లెల్ల ని
న్ననిశముఁ గొల్చి నీదయఁ గృతార్థతఁ బొందుదు రెందు నీవు నె
మ్మనమున సంతసిల్లుడు సమస్తజగంబులు శాంతిఁ బొందు నీ
కినుకకు మాఱు లేదు శివకీర్తన! యీ భువనత్రయంబునన్.

విక్రమత్రయలీల నోలిన విష్టపత్రితయంబుఁ బె
ల్లాక్రమించితి క్రూరు లైనసురారివీరులఁ బ్రస్ఫుర
చ్చక్రవిక్రమకేళిఁ ద్రుంచితి సర్వయజ్ఞఫలావహ
ప్రక్రియాత్ముఁడ వీవు నిశ్చలభావభవ్య జనార్దనా!"

భార. అర. ౧. ౩౭౬, ౩౭౭, ౩౭౮.

అని పరిపరివిధములఁ జేసినయుదంకుని ప్రస్తుతి కలరి మహేశుఁడు "వత్సా! నీ కేమి కావలయునో కోరుకొను మనుగ్రహించెద" నని దయామయుఁడై వీనులవిందుగాఁ బలికెను. "దేవాదిదేవా! నీ దివ్యరూపము నిట్లు ప్రత్యక్షముగాఁ గనఁగల్గితిని. ఇంతకంటె నాకుఁ గావలసిన వరమే లేదు. ఐనను నా మనస్సు సత్యధర్మశమములయందు స్థిరముగా నుండునట్లు నాకు నీపై భక్తి స్థిరముగ నిలుచున ట్లనుగ్రహింపు" మని యుదంకుఁడు ప్రార్థించెను. శివుఁ డట్లే యని యాతని కోరినవర మనుగ్రహించి లోకహితార్థము సత్కృతు లాచరింపు మని దీవించి యంతర్హితుఁడయ్యెను.

TIRUPATI.

## ఉదంకుఁడు కువలాశ్వు ననుగ్రహించుట

తొల్లి యిక్ష్వాకువంశజుఁ డగు బృహదశ్వుఁ డనుమహారాజు కువలాశ్వుఁ డనుసత్పుత్త్రునిం గాంచెను. సంతానవంతుఁడును, సమర్థుఁడును, సర్వధర్మరతుఁడును నగుకుమారునికిఁ బట్టాభిషేకము చేసి రాజ్యమాతని కొప్పగించి బృహదశ్వుండు వనమునకుఁ బోయి తపస్సుచేసికొన నిశ్చయించుకొనెను. ఆ సమయమున ఉదంకమహర్షి యచటికి విచ్చేసి బృహదశ్వునిచే సత్కృతు లంది యాతని కిట్లు బోధించెను. "రాజా! నీవు ప్రజారక్షణము చేయుటే ధర్మము. అది మాని యడవికిఁ బోవలదు. రాజులకుఁ బ్రజాపరిపాలనము చేయుటకంటె నధికవ్రతము లేదు. ప్రాచీనరాజు లందఱును ధర్మపాలనముననే కీర్తి గాంచిరి. నీ వంటి మహారాజు బాహుబలమున నేల యేలుచుండుటచేతనే నా వంటి మునులు తపముచేసికొనుచు ధర్మకర్మము లాచరించుట సాధ్యమైనది.

మఱియు నొక విచిత్రవిషయముఁ జెప్పెదను. మధుకైటభు లని పేరువడ్డ రాక్షసులకుఁ గుమారుఁడై పుట్టిన ధుంధుఁడనువాఁడు బ్రహ్మదేవునిఁ దపమున మెప్పించి వరములు వడసి దేవదానవులకు గంధర్వులకు జయింపరానివాఁడై మదించి యున్నాఁడు. అతఁడిపుడు మా యాశ్రమసమీప ప్రదేశమున సముద్రమునందలి యిసుకతిప్పలోఁ బెద్దబిలము గావించుకొని యందుసుఖముగా నిద్రించుచున్నాఁడు. వాఁడు విడిచిన నిశ్వాసపు గాలి సంవత్సరమున కొకమాఱు పైకి వచ్చి పెద్దగాలిదుమారముఁ గల్పించును. దానివేగమున నచ్చటి భూమి, శిలలు, వృక్షములు ఏడు దినములదాఁక కంపించుచునే యుండును. వానిమూలమున మాకును మా యాశ్రమవాసులకును జాల భయముగ నున్నది. నీవు వానిని జంపి మాకును లోకమునకును మేలొనగూర్పుము. ఇంకొకరహస్యము. ఈ దుర్మార్గునిఁ జంపఁదలఁచిన వానికిఁ దాను సంపూర్ణసహాయుఁడ నగుదు నని పరమశివుఁడు నాకుఁ జెప్పియున్నాఁడు. నీవు తక్క ఈ పని యింకొకరు చేయలేరు. కావున, నీ వడ్డునర్చి లోకసంరక్షణ మొనర్పు" మని కోరెను. "ఋషీంద్రా! నేను అస్త్రసన్న్యాసము చేసి వనమున కేఁగ దృఢనిశ్చయుఁడనైతిని. నన్ను మన్నింపుము. నీవు కోరినపని నా తనయుఁ డగు కువలాశ్వుఁ

డొనరింపఁ గలఁడు. కాన, దయతో నా కనుజ్ఞ నిమ్మ"ని కోరి బృహదశ్వుఁ డడవికిఁ బోయెను.

తండ్రియాజ్ఞ ననుసరించి యుదంకమహర్షి కోరికఁదీర్ప నభిలషించి కువలాశ్వుఁ డుదంకునిఁ గూడ నిడుకొని ధుంధుని నెదిరించి ప్రచండయుద్ధమున నాతని నోడించెను. కువలాశ్వుఁడు బ్రహ్మాస్త్రముఁ బ్రయోగింప నది ధుంధుని గాల్చి బూడిదచేసి విడిచెను. ఇంద్రాదులు విచ్చేసి ధుంధుమారుఁ డని కువలాశ్వుఁ బ్రశంసించి యుదంకునికి నమస్కరించి వెడలిరి. ఉదంకుఁడు సంతోషించి కువలాశ్వు నాశీర్వదించి నిజాశ్రమమున కేగెను. *

## శ్రీకృష్ణుఁడు ఉదంకాశ్రమమునకు వచ్చుట

శ్రీకృష్ణుఁ డొకప్పుడు హస్తినాపురమునుండి ద్వారకానగరమున కేఁగుచు మార్గమధ్యమునఁ గల ఉదంకమహర్షి యాశ్రమమునకు విచ్చేసెను. ఉదంకుఁడు బ్రహ్మానందమున నాతని నెదుర్కొని షోడశోపచారములతో నతిథిసత్కారము లొనరించి యధికభక్తిఁ జూపెను.

ఆ పిమ్మట అన్నియు నెఱిఁగియు నేమియు నెఱుఁగనట్లు ఉదంకుఁడు "కృష్ణా! కౌరవపాండవులకు బంధుభావము నెలకొల్పి రాజు లందఱును సుఖముగా నుండునట్లు చేసితివికదా? కౌరవులన్నను బాండవులన్నను నీ కేమాత్రము భేదము లేదు. నీవు నిష్పక్షపాతబుద్ధివి" అని యొత్తిపొడిచెను. శ్రీకృష్ణుఁడు నన్నియు నెఱిఁగియు నేమియు నెఱుఁగనివానివలె "ఋషీంద్రా! నేను కురురాజుతో నెంతయో యుచితముగా మాటాడితిని. బెదరించితిని. నయమునఁ జెప్పితిని. భయమునఁ జెప్పితిని, భీష్మద్రోణులును జెప్పిరి. బలవంతపెట్టిరి. ఐన నాతఁడు సంధి కంగీకరింపఁడయ్యె. అతిలోభులై వంశధర్మము విడిచి యే విధముగను సంధి కంగీకరింపక కౌరవులు పాండవులతోఁ బోరి సపుత్రమిత్రపరివారముగా స్వర్గమునకుఁ బోయిరి. పాండవు లైదుగురు మాత్రము మిగిలిరి. కాలనియతిం గడవ నెవ్వరికిని శక్యము కాదు గదా" యని పలికెను.

---

* భారతము: అరణ్యపర్వము.

## ఉదంకుఁడు శ్రీకృష్ణుని శపింపఁబూనుట.

ఆ మాటలకుఁ గోపించి యుదంకుఁడు "కృష్ణా! నీవు దొంగవు. నీవు నిజముగఁ దలఁచిన సంధి జరుగకపోయెడిదా! నీవు మిథ్యాచారుఁడవై శక్తి గలిగియు సంధి చేయక కౌరవకులమును సర్వనాశనము చేసితివి. ఈ దోష మంతయు నీదే. ఈ దోషమునకు నిన్ను శపించెదను జూచుకొ"మ్మని హుంకరించెను. "మునీంద్రా! నీవు నన్ను శపించిన శపింపవచ్చును గాని ముందు నామాటలు వినుము.

సత్త్వరజస్తమోగుణములు నా వశమునఁ బ్రవర్తించును. మరుత్తులు వసువులు మున్నగువా రెల్లరు నా యందే పుట్టిరి. నే నన్నింటి యందు నుందును. అన్నియు నా యం దుండును. అపర మన్నము పర మన్నను రెండు తత్త్వములు నేనే. ఓంకారముతోఁ గూడిన వేదములు నేనే. నాలుగు వర్ణములు నేనే. నాలు గాశ్రమములు, వానివాని సర్వకర్మజాలములు, స్వర్గమోక్షములు అన్నియు నా వశము లని యెఱుంగుము. క్రతుపరులు నన్నే సంస్తుతించి ఫలమును బొందుదురు. దోషులు నన్నుఁ గీర్తించి ప్రాయశ్చిత్తములు చేసికొని కృతార్థు లగుదురు. మనోధర్మములకు నేనే కర్తను. బ్రహ్మవిష్ణుమహేశ్వరరూపము ధరించి సృష్టిస్థితిలయములు నేనే యొనరింతును. లోకసంరక్షణార్థమై అధర్మాత్ములఁ ద్రుంచి ధర్మముల నుద్ధరించెదను. ఐనను, అధర్ము లగు కౌరవులను ధర్మాత్ములగు పాండవులతోఁ గలుపుటకు శక్తివంచనలేక ప్రయత్నించితిని. దివ్యజ్ఞాన సంపన్ను లగువ్యాసాదిమహర్షుల కాసంగతి తెలియును. వారు నన్ను మెచ్చుకొనిరి. దురాత్ము లగుకౌరవులు మహాత్ములగు పాండవుల నెదుర్కొని ధర్మయుద్ధమున నశించిరి. ఇది నేఁ జేసినవని. ఇఁక నన్ను శపించిన శపింపుము. స్తుతించిన స్తుతింపుము అని కృష్ణుఁడుపలికెను.

ఉదంకమహర్షి యాతని పాదములకుఁ బ్రణమిల్లి లేచి "దేవా! తెచ్చిపెట్టుకొన్న యహంకారమున నీ వేమందువో యని యట్లలుక నటించితిఁ గాని సర్వమును నే నెఱుఁగుదునుగదా! ఆ యీ చనవుబలిమిని చేసిన యపరాధమును క్షమించి దయతో నీ విశ్వరూపము నొక్కసారి

చూపుము. దాన నా మనస్సు, చూపు, జన్మము ధన్యములు కాఁగా జన్మరాహిత్య మందెద" నని ప్రార్థించెను.

శ్రీకృష్ణుఁడు దయదలఁచి యర్జునునికిఁ జూపిన విశ్వరూపము ఉదంకునకుఁ జూపెను. వెంటనే ఉదంకుఁ డాశ్చర్యభయభక్తులతోఁ జేతులు మోడ్చి 'నమః పురుషోత్తమాయ తే' యని నిలిచి గద్గదస్వరముతో "దేవా! పుండరీకాక్షా! నీ పాదము లీ భూమియంతయు వ్యాపించినవి. నీ చేతు లాకసము నాక్రమించినవి. ఆకాశము నీ కడుపుతో నిండిపోయినది. దిశ లన్నియు నెచ్చటఁ జూచినను నీ చేతులతో నిండిపోయినవి. ఇన్నిచరణములు, ఇన్నితలలు, ఇన్నిహస్తములతో నన్నియు నీ వైతివి. ఈ నీ విశ్వరూపము నా కన్నులను మనస్సును దన్పినది. విశ్వరూపా! ఈ రూప ముపసంహరింపుము" అని కోరెను. "నీ కే వరము కావలయునో కోరుకొను" మని యా పరమేశ్వరుఁ డనెను. "నీ దివ్యరూపముఁ జూచితిని. జన్మము ధన్య మయ్యెను. ఇంక నా కేమియు వల" దని యుదంకుఁ డనెను. "అట్లు కాదు. నన్నుఁ గన్నవారికి శుభ మీయక పోను. ఏది కావలయునో వెంటనే కోరుకొను మిచ్చెద" నని యా దేవాదిదేవుఁ డత్యాదరముతోఁ బలికెను.

"అగుచో దేవా! లోకహితమే ఆత్మహితము. కానఁ గోరెద. ఇది మరుదేశము. ఇచట జల మెప్పుడును దుర్లభము. కావున, ఈ ప్రదేశమును జలయుక్తము చేయు" మని యుదంకుఁడు కోరెను. శ్రీకృష్ణుఁడు విశ్వరూప ముపసంహరించి "నన్నుఁ దలంచినపుడు నీకు జలములు లభించు" నని వర మిచ్చి యంతర్హితుఁ డయ్యెను.

ఒకనాఁ డుదంకుఁడు దప్పిగొని శ్రీకృష్ణుని స్మరించెను. వెంటనే యొకమాలవాఁడు బాణబాణాసనపాణియు, దిగంబరుఁడు, మలినాంగుఁడు నయి కుక్కలు తనచుట్టు చేరి రాఁగా, ఒడలెల్ల నీరు చిమ్ముచుండ నుదంకుని జేరి "అయ్యా! నీరు త్రావి దప్పి పోఁగొట్టుకొను" మనెను. వానిని "వలదు. పొమ్మని" యుదంకుఁ డదల్చెను. ఓయీ "నీ మీఁదిదయతో వచ్చితిని, త్రావు" మని మరల ననెను. ఉదంకుఁ డాతని నలుకతోఁ బో పొమ్మని కసరెను, వాఁడు కుక్కలతో నంతర్ధాన

మయ్యెను. ఇది యంతయు శ్రీకృష్ణమాయ యని యుదంకుఁడు తలపోయుచుండఁగాఁ గృష్ణుఁ డచటికి వచ్చెను. "అయ్యా! కృష్ణభగవానుఁడా! నీ విచ్చిన వరము వ్యర్థమైనది. మాలవాని యొడలి జలము నేను త్రావుదునా? ఇదియా నీవు నాకుఁ జేసినమేలు?" అనెను. శ్రీకృష్ణుఁ "డయ్యా! నే నింద్రునిఁ బ్రార్థించి నీ కమృత మిమ్మంటిని. అతఁడు దేవా! మానవుల కమృత మేల? మఱియొక టేదైన నిచ్చెద ననెను. అట్లు కా దా మహర్షి కమృతమే యిమ్మని నే నంటిని. 'సరే. నేను మాలవాని వేషమున నేఁగి యమృత మీఁ జూచెదను. అతఁడు వల దని తిరస్కరించిన నేను బోయెద' నని నాతోఁ జెప్పి నీ కడకు వచ్చెను. నీవు చేతులార నమృతముఁ జెడఁగొట్టుకొంటివి. పోనిమ్ము. నా దయ నీ వమృతుఁడ వైతివి. నీవు జీవించియున్నంతకాల మెప్పుడు తలఁచిన నపు డీమరుభూమిలో మేఘములు చాలినంత వర్షమిచ్చుఁ గాక! ఆ మేఘములు నీ పేర 'ఉదంకమేఘము' లనఁ బరఁగును. చిరకాలము నీవు తపోజీవనముఁ గడపి తుదకు మోక్షమందుదు"వని యాశీర్వదించి హరి యదృశ్యుఁ డయ్యెను.

ఉదంకమహర్షి చిరకాల మట్లు జీవించి భక్తిజ్ఞానవైరాగ్య సంపన్నుఁడై మోక్ష మందెను.*

---

* భారతము అశ్వమేధపర్వము.

# మహర్షుల చరిత్రలు

## జైగీషవ్య మహర్షి

జైగీషవ్యుఁడు మహాయోగీశ్వరులలో నొకఁడు. ఈతఁడు యోగ విద్యచే సాధింపనివిషయమే లేదు. అణిమాది సిద్ధులేకాక ఆకాశగమనము, అనేక లోక గమనము మున్నగు మహా యోగసిద్ధు లీతనికిఁ గరతలామలకములు. ఈ మహర్షి తల్లిదండ్రుల పవిత్రనామములు కాని చరిత్రలు కాని కానరావు. జిగీషువు అనఁగా జయింపనిచ్ఛగలవాఁ డని యర్థము. ఇంద్రియ జయము, యోగవిజయము, నపారముగఁ గన్నవాఁడగుటచే నీతఁడు జైగీషవ్యుఁడను సార్థకనామముఁ గన్నవాఁడయ్యెను. ఈ మహాత్ముఁ డాజన్మ బ్రహ్మచారి. కేవల పరబ్రహ్మ సంభూతులైన మహనీయులకు సంసారపు బంజాటము లేకపోవుటలో నాశ్చర్యములేదు. ఈతఁడు కపిలమహర్షితోడను దేవలమహర్షితోడను గలిసి తఱచు తిరుగుచుండువాఁడు. అంతేకాదు. ఈ యోగీశ్వరుఁడు కైలాసపర్వతమున నున్న పార్వతీ పరమేశ్వరుల సన్నిధానమున మెలఁగుచో వారికిఁ దలలో నాలుకయై తనరారువాఁడు. అవధూతవేషధారుఁడు, మహాయోగి, మహాజ్ఞానియగు నీతఁడు సర్వశక్తిసంపన్నుఁడు.

### కపిల జైగీషవ్యుల యోగశక్తి

జైగీషవ్యుఁడు కపిలమహర్షికి శిష్యుఁడు, మిత్రుఁడు, సమస్తమును. ఒకనాఁడు వీరిరువురు మహాభక్తుఁడగు అశ్వశిరుఁడను రాజును గటాక్షింప వాని గృహమున కేఁగిరి. యజ్ఞ దీక్షితుఁడై యున్న అశ్వశిరుఁడు వారిని గౌరవించి యతిథి సత్కారము లాచరించి సుఖాసీనులఁ జేసిన పిదప వారికి సాష్టాంగ నమస్కారములొనర్చి "మహానుభావులారా! మీ రాకచే నా గృహము పవిత్రమైనది. నేను ధన్యుఁడనైతిని. నా యజ్ఞము ఫలప్రదమైనది. దయయుంచి విష్ణుమూర్తి సత్వరకటాక్ష సంపాదనకు నే నేమి చేయవలయునో ఆనతిం" డని ప్రార్థించెను. అంత

కపిలమహర్షి "రాజా! నే నా విషయము నీకుఁ దెలుపుటకే వచ్చితిని. నన్ను విష్ణుమూర్తిగా నెఱిఁగి త్రికరణశుద్ధిగా సేవింపుము. నీకు సర్వ వాంఛలు సిద్ధించు" ననిపలికెను. రా జజ్ఞానియై యీవాక్యములు కపిలుని యహంకార వాక్యము లని తృణీకరించి "అయ్యో! విష్ణుమూర్తిని నే నెఱుఁగుదును. అతఁడు శంఖచక్రగదాపాణి, గరుడవాహనుఁడు. అవి లేని నీవు విష్ణుఁడవన్న నేను నమ్ముదునా?" యని పలికెను. వెంటనే యోగశక్తిచే కపిలమహర్షి శంఖచక్రగదాపాణియై విష్ణువై నిలిచెను. జైగీషవ్యుఁడును దనయోగశక్తిచే గరుడుఁడై విష్ణుమూర్తి వాహన మయ్యెను. అశ్వశిరుఁడు నమ్మఁజాలక "అయ్యా! విష్ణుమూర్తి కమల నాభుఁడు. బ్రహ్మ విష్ణు నాభి కమలమందుండి జన్మించెను. నీవు పద్మ నాభుఁడవా? నీ నాభి నుండి జన్మించిన బ్రహ్మ యేఁడీ?" అని కపిలుని ప్రశ్నించెను. వెంటనే కపిలమహర్షి యోగమహత్త్వమునఁ గమల నాభుఁ డయ్యెను. జైగీషవ్యుఁడును యోగశక్తిచే విష్ణునాభికమలము నుండి జన్మించిన బ్రహ్మయై నిలిచెను. ఐనను నమ్మఁజాలక అశ్వశిరుఁ "డిది యంతయు మోసమే. నీవు విష్ణుమూర్తి వన్న నేను జచ్చినను నమ్మను. పో"మ్మనెను. వెంటనే కపిలుని యోగశక్తిచే సభాసదు లెల్లరు నంతర్ధాను లైరి. యజ్ఞశాల యంతయు భయంకర వన మృగ ములతో నిండిపోయెను. అశ్వశిరుఁ డెటు చూచినను ఘోరభయానక దృశ్యములే కాననగుచుండెను. మృత్యుదేవి దంష్ట్రలు దీటుచు మీఁదఁ బడుచున్నట్లుండెను. అశ్వశిరుఁడు గజగజవణఁకిపోయి "మహాప్రభూ! రక్షింపుము. రక్షింపుము. నీవే విష్ణుమూర్తివి. నీతోడి జైగీషవ్యుఁడే బ్రహ్మ. మీ యిరువురకు సాష్టాంగవందనము" అని భూనభోంతరాళము లదరునట్లేడ్చుచుండఁగనే యాదృశ్య మదృశ్య మయ్యెను. సభాసదులు విచ్చేసిరి. యజ్ఞశాల సర్వమంగళసంభారములతో నిండిపోయెను. అశ్వశిరుఁ డా యోగిపుంగవుల పాదములపై వ్రాలెను. వా రాతనికి 'సర్వం విష్ణుమయం జగ'త్తను విషయమును విపులముగ బోధించి యాశీర్వదించి వెడలిరి. నాఁటినుండి కపిలభగవానునియు, జైగీషవ్యయోగీశ్వరునియు నద్భుత మహిమలు సర్వలోకములందు వ్యాపించెను *

* వరాహ పురాణము

## దేవలుఁడు జైగీషవ్యుని శిష్యుఁడగుట

దేవలుఁడు మహాయోగి. తాను మహాయోగి నను నభిమానము కూడ నాతని కుండెను. ఐన నాతఁడు సత్యవ్రతులలో నుత్తముఁడు. మహాతపస్వి. బ్రహ్మనిష్ఠుఁడు నని మహాఖ్యాతిగాంచెను.

ఒకనాఁడు జైగీషవ్యుఁడు దేవలునింటికి విచ్చేసెను. దేవలుఁడాతని కతిథిసత్కారము లొనరించి యాదరించెను. జైగీషవ్యుఁడు "అయ్యా! నీవు మహాతపశ్శాలివి. నీ కడనుండి నేను ప్రశాంతముగాఁ దపము చేసికొనఁ దలఁపు కలిగి వచ్చితిని. నాకాశ్రయ మిచ్చెదవా?" అని యడిగెను. జైగీషవ్యునంతటి మహా యోగీశ్వరుఁడు తనకడ కరుదెంచి యాశ్రయము కోరుట నిజముగాఁ దనయాధిక్యమును గుర్తించియే యని భావించి దేవలుఁ డానందమున నందుల కంగీకరించెను. పిదప దేవలుఁడు జైగీషవ్యునికి వలయుసౌకర్యములను గల్పించి యాతఁడందు మౌననిష్ఠ మహాతపస్వియైయుండ భోజనవేళ కాఁగానే పుష్పాదులఁ బూజించి ఫలాదుల నర్పించి యాతని నన్ని విధముల నాదరించుచు నుండెను.

ఇట్లు కొన్ని సంవత్సరములు గడచెను. జైగీషవ్యుఁడు మౌననిష్ఠ విడువక, ఉగ్రతపము సాగించుచు, ఉజ్జ్వలతేజమునఁ బ్రకాశించుచు దేవలుని నిందింపక, నందింపక, ఊలుకక, పలుకక, కలఁగక, అలుగక, కదలక, మెదలక, యుండెను. దేవలుఁడు తనయోగశక్తిని జైగీషవ్యునికిఁ జూపి యాతని మెప్పుపొందఁ దలఁచెను. ఒకనాఁ డాతఁడు జైగీషవ్యుఁడు చూచుచుండఁగనే యంతర్హితుఁడై సముద్రస్నాన కుతూహలుఁడై యొకపవిత్ర ప్రదేశమున దిగెను. అప్పటికప్పుడే యచట సముద్రస్నాన మాచరించి జపము చేసికొనుచు సికతాతలమునఁ గూర్చున్న జైగీషవ్యు నాతఁడు కాంచి తన కన్నులను దాను నమ్మలేక యాశ్చర్యభరితుఁడై తాను స్నానకృత్యమును నిర్వర్తించి యోగశక్తి నింటికి వచ్చి చేరెను. ఇంటియొద్ద యథాస్థానమున జైగీషవ్యుఁడు మౌననిష్ఠం గూర్చుండియే యుండుట దేవలుఁడు కాంచి ఆహా! నేనే యోగశక్తి సంపన్నుఁడ నన్న యహంకారము పటాపంచలైనది.

జైగీషవ్యుని ముందు నేనెంత?" యనుకొని సిగ్గువడెను. ఐన నహంకారము మరల వచ్చి యాక్రమించెను. అంత నాతఁడు తనగొప్పతనమును నిరూపింపఁ దలఁచి జైగీషవ్యుని కన్నులయెదుట మంత్రపారగుఁడగు నాతఁడు శరవేగమున ఆకాశమున కెగిరిపోయి సిద్ధలోకముఁ జేరెను. అప్పటికే యట నున్న జైగీషవ్యుని శిష్యులై సేవించుచున్న సిద్ధులను జూచి దేవలుఁ డాశ్చర్యపోయి యటనుండి పితృలోకమున కెగసి పోయెను. అంతకుముందే యక్కడను జైగీషవ్యుఁ డెల్లరచేఁ బూజింపఁబడుచుండుటఁ గాంచెను. దేవలుఁడు వెంటనే యామ్యలోకమున కేఁగెను. అచట కూడ నదియే జరుగుచుండెను. దేవలుని యాశ్చర్యమునకు మేర లేకుండెను. మఱియు నాతఁడు సోమలోకమున కేఁగెను. అక్కడను జైగీషవ్యునకు పూజలే జరుగుచుండెను. దేవలుఁడు తనయోగశక్తి నంతయు వినియోగించి అగ్నిలోకమున కేఁగెను. అక్కడ నంతే. దేవలుఁడు తపోలోకమున కేఁగెను. అక్కడ నంతే. మిత్రావరుణలోకమున కేగెను. అక్కడ నంతియే. ఆదిత్యలోకమున కేఁగెను. అక్కడ నంతియే. రుద్రలోకమున కేఁగెను. అక్కడ నంతియే. వసులోకమున కేఁగెను. అక్కడ నంతియే. బృహస్పతి లోకమున కేఁగెను. అక్కడనంతియే. గోలోకమున కేఁగెను. అక్కడ నంతియే. బ్రహ్మసత్రి లోకమున కేఁగెను. అక్కడ నంతే. పతివ్రతా లోకమున కేఁగెను. అక్కడ నంతే. ఇట్లెల్ల లోకములందుఁ దనకంటె ముందుగా నేఁగి పూజ లందుచున్న జైగీషవ్యుని దేవలుఁడు గాంచెను. పతివ్రతాలోకమున దేవలుఁడు ఱెప్పవాల్పక జైగీషవ్యునిజూడ మొదలిడ నాతఁడట నదృశ్యుఁడయ్యెను. దేవలుఁడు యోగశక్తిచే నెంత యత్నించినను, ఇఁక పై లోకమున కెగలేక, యటనున్న సిద్ధులం బిలిచి "మహాత్ములారా! జైగీషవ్య భగవానుఁ డెట కేఁగెను? అతనియోగశక్తి యెంతటిది? అతఁడిపు డేలోకమున నున్నాఁడు? దయతోఁదెలుపుఁడని ప్రార్థించెను.

సిద్ధులు దేవలు నాదరించి "మునీంద్రా! జైగీషవ్యుఁడు యోగీశ్వరేశ్వరుఁడు. అతఁడు శాశ్వతబ్రహ్మలోకమున కేఁగినాఁడు. నీ వది చేరుట కింకను పెక్కు వేలేండ్ల తపస్సు చేయవలయును. అతనికి నీపై

నెంతయో యాదరము కలదు. అందుచేత నీ యాశ్రమమునకు వచ్చి నాఁడు. అతనివలన నీ కెన్నియో శుభము లగును. కా" మ్మని పలికిరి. దేవలుఁడు, ఒక వంకనాశ్చర్యము మఱియొక వంక జైగీష వ్యునిపై భయభక్తిశ్రద్ధా గౌరవములు నిను మడించుచుండఁగా యోగ శక్తిచె నొక్కొక్కలోకముననుండియు దిగుచుఁ దనయాశ్రమమునకువచ్చి చేరెను. అచట మౌననిష్ఠతోఁ గదలక మెదలక జైగీషవ్యుఁ డాతనికిఁ గానవచ్చెను.

దేవలుఁడు జైగీషవ్యుని పాదములపై వ్రాలి "మహాత్మా! నీవు సామాన్య మానవునివలె వచ్చి నా యాతిథ్య మర్థించితివి. నేను నా యోగ శక్తులు నీకుఁ జూపి నీకు వలసినశక్తు లనుగ్రహింతమనుకొంటిని. నా యహంకార ముడిపి నన్ననుగ్రహింప విచ్చేసిన పరమేశ్వరుఁడవే నీవు. నాయందు దయయుంచి కార్యాకార్యస్వరూపము, సన్న్యాస యోగము, మోక్షధర్మములు, సవిస్తరముగా నెఱిగింపు" మని ప్రార్థించెను. జైగీషవ్యుఁడు "దేవలా! నీవు సామాన్యునివలె నన్ను స్తుతించితివి. నీవును చక్కనివాఁడవుకావు. మౌననిష్ఠకు యోగ్యమగు తావు నీ యాశ్రమమే యగుట నిచటికి వచ్చితిని. నీవు నన్నతిథిశుశ్రూషల నలరించినావు. నా మౌనవ్రత మింతటితో సరియైనది. నన్ను శ్రద్ధా భక్తుల నీవు సేవించితివి కావున నివు కోరినను కోరకున్నను నా శక్తులు నీకు రాఁగలవు. శ్రద్ధా భక్తులతో నెవరు విప్రుల సేవింతురో వారికి సర్వ సిద్ధులు లభించును. కావుననే, సాధుసజ్జన సాంగత్యము, విబుధారాధ నము, విప్రసేవ వ్యర్థముగఁ బోవు. అవి సేవించువారి యోగ్యతనుబట్టి బహుగుణవర్ధిత ప్రతిఫలము నిచ్చితీరును" అని యాతని నేకాంత మునకుఁ దీసికొనిపోయి యాతనికి సమస్త ధర్మములు బోధించి, సందేహ నివారణ కావించి యనుగ్రహించెను. దేవలుఁ డాతనిశిష్యుఁ డయ్యెను.

జైగీషవ్య ప్రబోధితుఁడగుదేవలుఁడు గృహస్థాశ్రమమెుల్లక సన్న్య సింపఁబూని తన నిశ్చయమును జైగీషవ్యుని కెఱింగించెను. అంతలో భూతజాలము, పితృదేవతావర్గము నాక్రోశించుచు వచ్చి గృహస్థాశ్రమ మును వీడవలదని యాతని నర్థించెను. దేవలుఁడు జైగీషవ్యు ననుమతి

గొని తనతపస్సు ధారపోసి భూతతృప్తి కలిగించి పితృదేవతల కుత్తమ గతు లొనగూర్చి పిదప సన్న్యసించి మోక్షధర్మ మవలంబించెను. బృహస్పతి ప్రముఖు లచటి కరుదెంచి దేవల జైగీషవ్యుల నభినందించిరి. దేవలజైగీషవ్య నివాసస్థానమగు నా ప్రదేశము దివ్యతీర్థ మయ్యెను.

మఱియొకప్పుడు పరమప్రాజ్ఞుఁడు పరమశాంతుఁడు పరమ సుఖియునగు జైగీషవ్యుని దర్శించి దేవలమహర్షి 'మహాత్మా! నీ యీ పరమప్రశాంతస్థితికిఁ గారణమేమి? ఏ యాచారమున, ఏ శీలమున, ఏ విద్యచే ముక్తికలుగును? తెలుపు" మని ప్రార్థించెను. అందులకు జైగీషవ్యుఁ డిట్లనెను. "దేవలా! శాంతిమంతు లైనసౌమ్యులు నిష్ఠా గరిష్ఠులైయుండు ద్వంద్వాతీతస్థితి యందు నేనుందును. ఆస్థితియందు-

"వినుతించిన నిందించిన
ననఘా! మనమునఁ బ్రియంబు నప్రియమును లే
కునికియు బ్రేసినసైనను
కనలు పొడమమియుఁ బ్రబుద్ధగణ్యగుణంబుల్.

ఒకటి కోరి దాని కుల్లంబు కుందంగఁ
జాలఁబడమి, యేమి సంభవించె
నేని దానఁ దృప్తి నూనుట తప్పిన
పనికి వగవకునికి భవ్యగుణము.

హర్షంబును మానంబు న
మర్షము నవరాధమును సమదభావము ను
త్కర్షాపకర్షచింతలు
అర్ష సమాచారమున నిరస్తగుణంబుల్.

అవమానమునకుఁ దృప్తుం
డవు నమృతముఁ ద్రావినట్లు, యంచితసమ్మా
నవిధికి నుద్వేగముఁ బొం
దు విషంబునఁబోలె, శమరతుఁడు మునినాథా!

చుట్టము పగ యనుభేదం
బెట్టి జనులవలనఁ దగుల దెల్లప్పుడు నె
వ్వట్టున నద్దానను మదిఁ
బుట్టదు సంతోషహాని బుద్ధాత్మునకున్.

ఇంద్రియముల గెల్చి హృదయంబు శాంతిసు
ఖంబుఁ బొంద నిర్వికారవృత్తి
యైనవానిబొందు మానితగతి దేవ
తలకుఁ బొంద నరిది ధర్మనిరత!”

(భార. శాంతి. ౫. ౨౩—౨౭.)

అని పలికెను. దేవలుఁ డిది విని ద్వంద్వాతీతస్థితి నంది చెలు వందెను.

## జైగీషవ్యుని పార్వతీపరమేశ్వరులు పరీక్షించుట

జైగీషవ్యుఁడు పార్వతీపరమేశ్వరులు మేరుపర్వత ప్రాంతమున విహరించుచున్న సమయమునఁ బోయి యీశ్వరసన్నిధిని గూర్చుండెను.

పరమేశ్వరుని పరివార మంతయు నట విడిసియుండెను. సిద్ధసాధ్యయక్షగంధర్వాప్సరోగణములు వారిని సేవించు నవకాశమున కెదురుచూచుచుండెను. ఆ సమయమున పార్వతీపరమేశ్వరుల ప్రసంగవశమున పార్వతి “దేవా! అర్థ మేది? అర్థశక్తి యేది? దయదలఁచి తెలుపు” మని భర్తను ప్రార్థించెను. పరమేశ్వరుఁ డిట్లనెను. “దేవీ! అర్థమును నేను. అర్థశక్తివి నీవు. నేను భోక్తను. నీవు భోజ్యమవు. నేను పరుఁడను. నీవు ప్రకృతివి. విష్ణుఁడను, బ్రహ్మను, యజ్ఞపురుషుఁడను నేనే.” “నాథా! అర్థము, అర్థశక్తి వీనిలో నేది యధిక” మని పార్వతి పరమేశ్వరు నడిగెను. అతఁడేమియు సమాధానము చెప్పక మిన్నకుండెను. అపుడు జైగీషవ్యుఁడు “తల్లీ! అర్థమే అధికమైనది. అర్థశక్తియర్థమునందు లయించియున్న” దని బదులుచెప్పెను. తాను తనభర్తను బ్రశ్నింపఁగా సమాధాన మిచ్చుటకు వీఁడెవఁ డనియు, త న్నడుగనిదే పలుకుట కాతని కెంతకండకావర

మనియు పార్వతి యాతనిపైఁ గోపించెను. అది గ్రహించి జైగీషవ్యుఁడటనుండి వెడలిపోయెను. అపుడు శివుఁడు పార్వతిని జూచి "దేవి! అతఁడు జైగీషవ్యుఁడు. మహాయోగి. మహా జ్ఞాని. మనపరమభక్తుఁడు. పరమ ప్రశాంత చిత్తుఁడు. అతని నట్లు కోపించితివి. అతఁడు నా భక్తుఁడు. సఖుఁడు. శిష్యుఁడును" అని పలికెను. అందులకు పార్వతి "దేవా! నీ నా సంభాషణమున నాతఁ డడ్డువచ్చి సమాధాన మిచ్చుట నన్నవమానించుట కాదా? మనల నాశ్రయించి వరములు గ్రహింప వచ్చిన యాతఁడు మనతో సమానస్థాయిని మాటాడి దోషయుక్తుఁడైనాఁ" డని పలికెను. దానిపై శివుఁడు "దేవీ! కాదు. కాదు. అతని కే వరము నక్కఱలేదు. అతఁ డట్టి వాశించి మనకడకు రాలేదు. అతఁడు ద్వంద్వాతీతుఁడు, సమలోష్టాశ్మ కాంచనుఁడు, నిరాశి. అతని కింద్రత్వము, బ్రహ్మత్వము, రుద్రత్వము తృణప్రాయములు. అతఁడు బ్రహ్మజ్ఞాని. అతని నీ వట్లు తృణీకరింపరా" దనెను. అందులకుఁ బార్వతి "ఐనచో నాతని ఆశారాహిత్యమును బరీక్షింప నా కనుజ్ఞ యి"మ్మని పరమేశ్వరునిం గోరెను. అతఁడంగీకరించెను. అపుడు పార్వతీపరమేశ్వరులు వృషభారూఢులై కొంతపరివారము వెంట రాఁగా, పరిశుద్ధాత్ముఁడు, మునిశ్రేష్ఠుఁడు నగు జైగీషవ్యుని యాశ్రమమునకు వచ్చి చేరిరి.

ఏ కోరికయు లేక గాలిలేనిచోటఁ బ్రకాశించు దీపమువలె వెలుంగుచు, చింపిబొంతఁ దాల్చి చిద్విలాసము ముఖమునఁ దాండవింప నానంద పరవశత్వమునఁ జిందులుద్రొక్కు జైగీషవ్య యోగీంద్రుని దగ్గఱ పార్వతీపరమేశ్వరులు నిలిచి "యోగీంద్రా! నీకుఁ గావలసినవర మేదైనఁ గోరుకొమ్ము. ఎట్టి యసాధ్యవరమైన ననుగ్రహింతు" మని పలికిరి. జైగీషవ్యుఁడు వారికి నమస్కరించి శంకరుని జూచి "దేవా! నీ దయ ఈయులేని దేమున్నది? నేను కృతార్థుఁడను. నాకు వలయున దేమియు లేదు" అని బదులుచెప్పెను. పార్వతీపరమేశ్వరు లాతని రెట్టించి రెట్టించి యడిగి యెన్నివిధములనో యాతనిని మభ్యపెట్టఁ జూచిరి; కాని, యాతఁడు తాను సూదియందలి బెజ్జము ననుసరించి పోవుదారమువలె నీశ్వరేచ్ఛాప్రవర్తిత జగమున నిరాశ, విజితేంద్రియుఁడునై గమించు వాఁడు గావున, నేమియుఁ గోరుకొన నొల్లఁడాయెను. నిజముగ నాత

నీకిఁ గావలసిన దేమైననున్నఁగదా కోరుట? ఏ కోరికలేనివాఁడే కోరిక కోరును? పార్వతీపరమేశ్వరు లెంత యత్నించిన నాతఁడు చలింపఁడాయెను. పరమేశ్వరుఁడు పార్వతివంకఁ జూచెను. ఆమె జైగీషవ్యుని బలుకరించి కనికరించి తాను బడ్డకోపమునకు బాధపడకు మనెను. అతఁ "డమ్మా! కోపతాప ప్రేమశాపము లన్నియు నాకు సమానమే" యని పలికి భక్తితో వారిని వీడ్కొలిపెను. ఈ పరీక్షలో పార్వతీపరమేశ్వరు లోడిపోయిరి. జైగీషవ్యుఁడు గెలిచెను.*

---

* భారతము అనుశాసనికపర్వము.

# మహర్షుల చరిత్రలు

## ధౌమ్యమహర్షి

తొల్లి ధర్మాత్ముఁడు, మహాతపశ్శాలి, పుణ్యచరిత్రుఁడు, వేద వేదాంగవేత్త, స్మృతికారుఁడునగు వ్యాఘ్రపాదుఁ డను మహర్షి యుండెను. ఆతనికి ధర్మపత్నియం దిరువురు కుమారులు కలిగిరి. వారిలో మొదటి వాఁడు ఉపమన్యువు, రెండవవాఁడు ధౌమ్యుఁడు.*

ఈ సోదరు లిరువురు బాల్యమునఁ దోడి ముని బాలురతో నాడు కొనుచు నొకమునియింటి కేగిరి. అక్కడ నొక యావుమ బాలు పితుకుట తొలిసారిగా వారు కాంచిరి. ఆ తెల్లనివేమని వారు తోడి బాలుర నడుగఁగా వా రవి ఆవు పా లనియుఁ జాల రుచికరములుగా నుండుననియు, అవి త్రావవచ్చు; వానితో క్షీరాన్నము చేసికొనవచ్చు. ఆ క్షీరాన్నము చాల బాగుండుననిచెప్పిరి. అది విన్న యా సోదరులకు క్షీరపాన, క్షీరాన్నభోజనకాంక్ష కలుగ వారింటికి వచ్చి తల్లిని బిలిచి "అమ్మా! మాకు క్షీరాన్నము పెట్టవే!" అని యడిగిరి.

అమాయకులగు బాలురను దల్లి కౌఁగిలించుకొని ముద్దుపెట్టుకొని వారి కోరిక దీర్పఁ దనయింటఁ బాలు లేమికి విచారించి, ఐనను బసి బిడ్డలమనస్సు నొప్పించుట కిష్టపడక, ఉపాయమూహించి యట్లే పెట్టెద నని వారి నూఱడించి మెత్తనిపిండి నీళ్ళలోఁ జిక్కగఁ గలిపి వారికిఁ బెట్టెను. ఆ పసికందు లదియే క్షీరాన్నమనుకొని తిని మునిబాలు రన్నంత రుచికరము కాదు క్షీరాన్న మనుకొనిరి. కొన్నాళ్లయిన పిదప, నొక నాఁడు బాలు రిరువురు తండ్రితోఁగూడ బంధువులింట యజ్ఞము జరుగు చుండ నచటికిఁ బోయిరి. అచట యజ్ఞకర్త వచ్చినవారి కతిమధుర మగు పాయసాన్నము వడ్డించెను. భోజనవేళ నది తిని క్షీరాన్న మన్న నది యని వారు గ్రహించి మునిబాలురు చెప్పినది నిజమే యనియుఁ దమతల్లి పెట్టినది క్షీరాన్నము కాదనియు వారు నిశ్చయించుకొని

* భారతము. అనుశాసనిక పర్వము. దేవలుని సోదరుఁడు ధౌమ్యుఁడని భారతాది పర్వమునఁ గలదు.

యింటికిఁ దిరిగి వచ్చిన తరువాతఁ దల్లిని జేరి "అమ్మా! మన బంధువు లింట క్షీరాన్నము పెట్టిరే. అది అమృతమువలె నున్నదే. నీవు పెట్టిన క్షీరాన్నము చప్పగ డోకు వచ్చినది. నీవు పెట్టినది క్షీరాన్నము కాదే!" యని పలికిరి. బిడ్డలతొక్కుఁ బల్కులకుఁ దల్లి సంతోషించి కౌఁగిలించు కొని ముద్దుపెట్టుకొని "బిడ్డలారా! నిజమే. ఆవును కొనుటకు మనము ధనవంతులము కాము. దానము పట్టుటకు మీ తండ్రి యంగీకరింపరు. ఆవు లేనిదే పాలు రావుకదా; పాలు లేనిదే క్షీరాన్నమెట్లుచేసి పెట్టఁ గలను? ఈ సంగతి చెప్పినచో మీరు బాధపడుదురని మీకు మెత్తని పిండి నీళ్ళలోఁ గలిపి పెట్టితిని" అని బదులు చెప్పెను.

తల్లిమాటలు విని పిల్లలు "అమ్మా! మాకు క్షీరాన్నము కావలెనే! అది మా కెట్లు లభించునో ఉపాయము చెప్పుము. అట్లుచేసి మేము సంపాదించి నీకును బెట్టుదు" మని పలికిరి. వారి మాటలకు సంతో షించి యా సాధ్వి "వత్సలారా! ఆకలములు, కాయకూరలు తినుచు, నదీజలములు త్రాగుచు, పర్వతారణ్యతీర్థ ప్రదేశములఁ గాఁపురముండు మనవంటి తపోజపపరాయణులకుఁ బరమశివుఁడే పరమగతి. మన కేది కావలసినను, ఇహమైనను బరమైనను, చిన్న కోరిక యైనను, పెద్ద కోరికయైనను ఆ మహా దేవునే మనము ప్రార్థింపవలయును. ఆతని దయకలిగినదా మనకు క్షీరాన్నమే యేల, ఇహపరముల నెవ్వి యేది కోరిన నది సిద్ధించును. ఏ కోరికలు లేని మీ తండ్రి యా పరమేశ్వరుని పాదపద్మములను మదిఁబట్టి నిర్వికల్పసమాధిలో నిర్మలానంద మనుభ వించుచు నిలిచియున్నారు. మీకుఁ గోరిక లున్నచోఁ గోరికలఁ దీరుపఁ గల శివునే భజింపుఁ" డని యా బాలుర కుపదేశించెను.

ఆ పుణ్య సాధ్వీగర్భశుక్తిముక్తాఫలములగు నా బాలురంత "అమ్మా! తప్పక మే మట్లు చేసెదము. కాని, ఆ పరమ శివుఁ డెట్లుండును? ఎచ్చట నుండును? ఏమి చేసిన మాకుఁ బ్రసన్నుఁడగును? తెలుపు" మని ప్రార్థించిరి. పరమేశ్వర పాదారవిందభజనోత్సుకము వారికి రేకెత్తించిన యాతల్లి వారికి ఈశ్వర రహస్యోదారవిజ్ఞాన మంతయు పూసగ్రుచ్చినట్లు, అరటిపండొలిచి చేతఁ బెట్టినట్లు సమగ్రముగ స్పష్ట ముగ నుపదేశించెను. ఆహా! ఆ సాధ్వి మాట లెంత పాటవములు!

నిజమాతృధర్మము నామె యెంత యద్భుతముగా నిర్వహించినది! "తల్లి హరిఁజేరు మని యెడి తల్లి తల్లి కదా!" మిగిలినతల్లులో-పిల్లులు, బల్లులు, నల్లులు!

ఆ తల్లిమాటల తుల్లములు పల్లవింప, ఉత్సాహము నూతగాఁగొని ఉపమన్యు ధౌమ్యు లుభయులు పరమేశ్వరునిగుఱించి యుగ్రతప మొనరింపఁ దొడంగిరి. నిష్ఠాగరిష్ఠులై వారు కొన్నేండ్లు వామ పాదాంగుష్ఠములపై నిలిచియు, కొన్నేండ్లు ఫలాహారులై యుండియు, కొన్నేండ్లు జీర్ణపర్ణాహారులై యుండియు, మఱికొన్నేండ్లు జలపాన మాత్రులై యుండియు. నిఁకఁ గొన్నేండ్లు వాయుభక్షులై యుండియు మహాతప మొనరించిరి.

పిదప నొకనాఁడు వీరినిష్ఠఁ బరీక్షించుటకై మహేశ్వరుఁ డింద్ర రూపమున వీరికడ కేతెంచి "మీ తపమునకు మెచ్చితిని. నే నింద్రుఁడను. ఏమికోరిన నది యిచ్చెదను. కోరుకొం" డని పలికెను. ఉపమన్యుఁ డా మాటలువిని "అయ్యా! నీ దారిని నీ వేఁగుము. నిన్ను గుఱించి మేము తపము చేయలేదు. నీ దర్శనము మా కక్కఱలేదు. నీ వరములు మా కంతకంటె నక్కఱలేదు. సర్వలోకేశ్వరుఁడైన శర్వుని గుఱించి మేము తప మొనరించితిమి. మా కోరికలఁ దీరుప నాతఁడే నేరుపరి. మమ్ముఁ గాపాడినను. కాపాడినను, రక్షించినను, శిక్షించినను ఆతఁడే మాకుఁ గావలయును. ఆతని దాసత్వముతక్క మా కింద్రత్వము వలదు. బ్రహ్మత్వము వలదు" అని పెక్కువిధములఁ దమ యనన్య భక్తిభావమును వెల్లడించెను.

ఇంద్రుఁ డిఁక నేమి చెప్పిన నేమి యడిగిన నాలింపక యుపమన్యువు నిరర్గళపరమేశ్వరభక్తి ప్రసంగ పారవశ్యమున సమాధిస్థితి నందెను. అపు డింద్రుఁ డంతర్హితుఁ డయ్యెను. ఆతని వెనుక నింద్రుని యైరావతము హంసకుందేందు సమానమగు ధావళ్యముతో రజత మృణాళ కాంతులు రమ్యముగ వెలుంగ ప్రత్యక్షమైన క్షీరసాగరమో యన్నట్లు మనోహర సర్వాంగములతోఁ గానవచ్చెను. ఆ సోదరు లిరువు రైరావతమును దిలకించుచుండఁగానది యైరావతముకాక హిమవత్పర్వత

శిఖరమంతయెత్తు గలిగి అతిస్వచ్ఛమైనతెల్లని మహామేఘమువలె నొప్పు మిగిలిన వృషభ వాహనము నెక్కి జగన్మాతాపిత లగుపార్వతీపరమేశ్వరులు విచ్చేయుచుండిరి. వారి దివ్యతేజము ఘనభోంతరాళములు గ్రమ్మి కోటి సూర్యబింబము లుదయించిన ట్లయ్యెను. వెంటనే శివుని మాయచే నా తేజమంతయు నుపసంహృత మయ్యెను. పిదప సర్వ సౌందర్యనిధు లగుపార్వతీపరమేశ్వరులు కానవైరి. వారి ననుసరించి దివ్యరూపు లగుననుచరు లుండిరి. బాలేందుకిరీటుఁడై తెల్లనిశరీర చ్ఛాయ వెలయ, ముగ్గురు సూర్యులట్లు ప్రకాశించు మూఁడు కన్ను లతో, పినాకపాణియై, సర్పహారుఁడై శివుఁడు కానవయ్యెను. ఆతని కుడిప్రక్క హంసవాహనారూఢుఁడై బ్రహ్మయు, నెడమప్రక్క గరుడ వాహనుఁడగు విష్ణువు నుండిరి. పార్వతిప్రక్క మయూరవాహనుఁ డగుకుమారస్వామి యుండెను. వారియెదుటనంది యుండెను. స్వాయంభువాదు లగుమనువులు, భృగ్వాదులగు మహర్షులు, ఇంద్రాదు లగుదేవతలు వారిని బరివేష్టించి యుండిరి. మఱియు సకలపరివార సమేతుఁడగు సర్వేశ్వరునిగాంచి ఉపమన్యుధౌమ్యు లమితభక్తి నాతనికి సాష్టాంగనమస్కారము లొనరించి వేదమంత్రములచే సహస్రనామ ములచే స్తుతించిరి.

పరమేశ్వరుఁ డుపమన్యుని భక్తి కెంతయు నలరియాతని నేదేని వరము కోరుకొను మనెను. ఉపమన్యువు నిత్య శివభక్తి, అతీతానాగతవర్తమాన సర్వవిషయ జ్ఞానము కోరుకొని "దేవా! గోక్షీరములు, క్షీరాన్నము వీనిపైఁ గలకాంక్ష కారణముగా సర్వలోకప్రభువవగు నీ దర్శనము లభించినది. కావున నాకే కాక నా వంశమువా రెల్లరకు గోక్షీర సమృద్ధి ననుగ్రహింపుము. న న్ననుసరించిన నా తమ్ముని ధౌమ్యుని గూడఁ గటాక్షింపు" మని ప్రార్థించెను.

పరమశివుఁడు పరితోష మంది "వత్సలారా! మీరు దుఃఖవర్జితులై జరామరణశూన్యు లగుదురు. సర్వజ్ఞులు ప్రియదర్శనులు నగుదురు. అక్షయ మగు యౌవనము, అగ్నిసమాన మగుతేజము, మీకుఁ గలుగును. మీరున్న ప్రదేశములం దెల్ల గో సంపద్వృద్ధి, క్షీరసమృద్ధియై క్షీరసాగరమే యటఁ బ్రవహించును. కల్పాంతమున మీరు బంధువు

లతో నన్నుఁ గలియుదురు. నీ తమ్ముఁ డగు ధౌమ్యుఁడు దేవగణ మునిగణమాననీయుఁడై హరిప్రియులగు పాండవులకు గురువై శ్రీకృష్ణ కటాక్షము నంది చెలువొందు" నని చెప్పి పరివారసమేతముగా నంత ర్హితుఁ డయ్యెను.

పిదప ఉపమన్యువు మహర్షిశ్రేష్ఠుఁడు, పరమ విజ్ఞాని, బ్రహ్మ భావసంపన్నుఁడు, సర్వజనపూజ్యుఁడై వెలుఁగొందెను. ధౌమ్యుఁ డన్న కడ సెలవుగైకొని పోయి భాగీరథిం దాఁటి యవ్వలియొడ్డునఁ గల "ఉత్కచ" మను తీర్థమున కరిగి యాశ్రమమును నిర్మించుకొని పరమతపోజీవితమును గడపుచుండెను.*

## పాండవులు ధౌమ్యుని బురోహితునిఁగా వరించుట.

అంగారవర్ణుఁడను గంధర్వరాజు అర్జునునిచే నోడి పాండవులతోఁ జెలిమి నెఱపి వారిక్షేమముఁ గోరి వేదవేదాంగ విశారదుఁడు, జపహోమ యజ్ఞ ప్రశస్తుఁడు, సత్యవచనుఁడు. విప్రోత్తముఁడు చతుర్వర్గసాధ కుఁడు, సదాచారుఁడు, సూరిజన స్తవనీయుఁడు నగునొకమహర్షిని బురో హితునింగా వరించి శుభంబులందుఁ డని సూచించెను. అగ్నిపరిగ్రహ ణము, బ్రాహ్మణ సంగ్రహము లేనియెడల నెంతటి మహారాజైన వంతలపాలు గాక తప్పఁ డనియు, అవి గలవాఁడు సర్వకష్టములను దాఁటి సుఖించి శుభముల నందునని యాతఁడు సోదాహరణముగాఁ జెప్పెను. అప్పు డర్జునుఁడు;

> "మాకు నతిప్రియుండవు సమస్తవిదుండవు చెప్పుమయ్య యీ
> లోకములోని వర్తనములుం దగువారి నెఱుంగు దెవ్వనిం
> బ్రాకటధర్మతత్త్వవిదు బ్రాహ్మణముఖ్యు పురోహితుండుగాఁ
> జేకొనువార మట్టిబుధసేవితుఁగానఁగ మాకు నెందగున్ ?"

(భార. ఆది. ౮. ౧౫౬.)

అని ప్రార్థించెను. త్రికాలవేది యగు నంగారవర్ణుఁ డాలోచించి తత్సమీ పమున 'ఉత్కచ' మను తీర్థమునఁ దపముచేయు ధౌమ్యమహర్షి

* భారతము అనుశాసనిక పర్వము.

యన్ని విధముల నుత్తమ బ్రాహ్మణుఁ డనియు నాతనిని బురోహితునిగా వరించినఁ బాండవులకు సర్వశుభములు సమకూడుననియు సూచించెను. పాండవు లాతఁడు చెప్పిన చొప్పున 'ఉత్కచ' తీర్థమున కరిగి జగత్పూత చరిత్రుడు, సాధుజన పూజితుడు, ధార్మికుఁడు, మహాత్ముఁడు, హితమితభాషణుఁడు, బ్రాహ్మణకుల భూషణుఁడు నగు ధౌమ్యమహర్షిని బొడగాంచి యాతనికి నమస్కారము లొనరించి తమవచ్చినపనిఁ దెలిపి తమకుఁ బౌరోహిత్య మంగీకరింపు మని ప్రార్థించిరి. ధౌమ్యుఁడు వారి నతిప్రీతి నాదరించి వారికిఁ బురోహితుఁడుగా నుండ నంగీకరించెను. ఇట్లు తేజోవచోరూప బుద్ధివిభవములచే బృహస్పతి సమానుఁడై, వేద వేదాంగవేది, ఋషిసత్తముఁడు నగు ధౌమ్యుని పాండవులు పురోహితుం గావించుకొనిరి.

## పాంచాలీపరిణయము

పిదప, పాంచాలాధిపతి వీటికి వ్యాసప్రేరితులు, బ్రాహ్మణజన చోదితులునై పాండవు లేగిరి. అట జరగు ద్రౌపదీస్వయంవరమునకు వా రేగిరి. అందు రాజన్యుఁ డెవనికిని సాధ్యముకాని మత్స్యయంత్రము నర్జునుఁ డేసి ద్రౌపదిని గడించెను. కుంతి యానతిని, వ్యాసభగవాముని యమమతిని పాంచాలిని బంచపాండవులకు నిచ్చి పరిణయము గావింప ద్రుపదుఁ డంగీకరించెను.

శుభలగ్నమున వివాహ మొనరింప ధౌమ్యుఁడు పౌరోహిత్యము వహించెను. పాండవులు మంగళ స్నానములు చేసి, వివాహోచిత వేషములు ధరించి, రత్నభూషణములఁ దాల్చి విచ్చేసిరి. ద్రౌపది పూర్ణేందువదనయై విదగ్ధ పుణ్యాంగన లలంకరింప లలితప్రసాధనాలంకృతాంగియై కమలాక్షి కమనీయ కాంతాసహస్రముతో నరుదెంచెను. అపుడు మహావిప్రుల పుణ్యాహరవము, మంగళగీత వాద్య మధురరవము పణవవేణు వీణారవము దిశలు మార్మోగునట్లు మ్రోయ వివాహమంగళ మారంభమాయెను. ధౌమ్యమహర్షి వివాహప్రయుక్తము లగుమంత్రాహుతులను బుధసమ్మతముగా నగ్నిహోత్రమున వేల్చెను. పెద్దల యనుమతిని ధౌమ్యుఁడు తొలుత ద్రౌపదిని ధర్మజునకుఁ బాణిగ్రహణము

చేయించెను. వెనువెంటనే యామె యీశ్వర వరప్రసాదమునఁ గన్యాత్వ దూషిత కాకుండఁ గౌమార దశ నందెను. అట్లామెను గ్రమముగా భీమార్జున నకులసహదేవులకును బాణిగ్రహణంబు చేయింప సర్వజన సమ్మోదకరముగా దేవతల పుష్పవృష్టియు, భూదేవతల యాశీర్వృష్టియు, దేవదుందుభినాద దివ్యవృష్టియుఁ గురిసెను.

పిమ్మట ద్రౌపదీసహితులై పాండవులు ధౌమ్య పురస్సరులై హస్తినాపురమునకు వచ్చి ధృతరాష్ట్రుఁ డర్ధరాజ్య మీయ విశ్వకర్మ యింద్రప్రస్థపురము నిర్మించియొసంగ వానిని స్వీకరించి రాజ్యపాలనము చేయుచుండిరి. తరువాత, నియమ భంగ మొనరించిన అర్జునుఁ డన్నల యనుమతిని ద్వాదశమాసికవ్రతము సలుపుచు తీర్థయాత్రలకుఁ బోయి ఉలూచి, చిత్రాంగదాదులఁ బాణిగ్రహణముచేసికొని ద్వారకాపురి కేఁగి కపటయతివేషమున సుభద్ర పరిచర్యఁ బడసి కృష్ణు ననుమతి నామెఁ బరిణయమై వ్రతాంతమున నామెం దీసికొని యింద్రప్రస్థపురమునకు వచ్చి యామెయందు వంశకీర్తికరుఁ డభిమన్యుఁ డనువీర పుత్రుం గాంచెను. ధౌమ్యమహర్షి యభిమన్యునికి జాతకర్మచౌలోపనయనాదు లొనరించి వేదవేదాంగములం దాతని నతిప్రవీణు నొనరించెను.

ధర్మరాజు నారద ప్రేరితుఁడై రాజసూయయాగమును జేయఁ దలపెట్టియు భయపడఁగా ధౌమ్యుఁ డాతని కభయ మొసఁగి శ్రీకృష్ణానుమతి రాజసూయ మొనర్పు మని ప్రేరేచెను. పిదప ధర్మరాజు అనంతవేదమూర్తులైన పైల ధౌమ్యులు హోతలుగా, యాజ్ఞవల్క్యుఁ డధ్వర్యుఁడుగా, కృష్ణద్వైపాయనుండు బ్రహ్మగా, సుసాముఁ డుద్గాతగా, వీరిపుత్రశిష్య గణములు మిగిలిన యాజ్ఞికులుగా, నారదాది బ్రహ్మర్షులు సదస్యులుగా, భీష్మాది రాజర్షులు సహాయులుగా, సర్వక్రియా సమగ్రముగా షడంగసమృద్ధిగా, సంపూర్ణ దక్షిణా సనాథముగా, సకలధనధాన్యసమన్వితముగా జగన్నాథ రక్షితముగా, సకలజనానంద కరముగా రాజసూయ మొనర్పి జగద్విఖ్యాతి నార్జించెను.

అనంతరము కపటద్యూతమున ధర్మజుఁ డోడి సోదరులతోడను ద్రౌపదితోడను అరణ్య వాసమునకుఁ బోవ వారితోఁగూడ రౌద్రయామ్య

సామగానములు చేయుచు ధౌమ్యమహర్షి వెడలెను. ధౌమ్యునితోపాటు వేలకొలఁది యుత్తమబ్రాహ్మణు లగ్నిహోత్రములఁ గైకొని యధర్మ పరుఁడగు దుర్యోధనుని రాజ్యమున నుండ నిచ్ఛగింపక పాండవుల ననుసరించిరి. అరణ్యమున వీరినందఱ నెట్లు పోషించుట యని ధర్మ రాజు దుఃఖింప శౌనకమహర్షి యాతని నోదార్చెను. పిదపఁ దమ్ము లతో ధర్మజుఁడు ధౌమ్యుని చరణముల వ్రాలి "మహాత్మా! రాజ్య మంతయుఁ గోల్పోయిననేను మహారణ్యమున బ్రాహ్మణప్రవరుల నెట్లు పోషింతు? ఉపాయముఁ జెప్పు" మని ప్రార్థించెను. ధౌమ్యుఁ డాలోచించి "ధర్మరాజా! మొదట భూతజాలములు పుట్టి యాఁకలితో బాధపడుచుండఁ జూచి సూర్యభగవానుఁడు దయకలిగి యుత్తరాయణ గతి నుర్వీరసము గైకొని దక్షిణాయనగతియై యోషధులఁ బడసి రాత్రులఁ జంద్రకిరణామృతమున వానిం దడుపుచు వర్ధిల్లఁజేసి యం దన్నము పుట్టించి ప్రజాప్రాణములను గాపాడఁ దొడఁగెను. ఇది యెఱిఁగి తొల్లిటిమహారాజులు యోగసమాధినిష్ఠులై యన్న మాదిత్య మయమని సూర్యుని భజించి యన్నముఁ బడసి ప్రజల నాపదలనుండి కాపాడిరి. కనుక, నీవును సూర్యోపాసన మొనరించి సూర్యానుగ్రహ మున భూసురులఁ బోషింపు" మని యాతనికి సూర్యస్తోత్రము అష్టోత్తర శత నామ మంత్రము నుపదేశించెను.

ధౌమ్యుని యుపదేశము తలధరించి ధర్మజుఁడు పవిత్ర భాగీరథీ జలస్నాతుఁడై పరమపూతుఁడై సూర్యు నారాధింప నాతఁడు ప్రత్యక్షమై పాండవు లరణ్యవాసము చేయు పండ్రెండ్లేండ్లును వన్యఫలమూలములు ద్రౌపది వంటచేయు అక్షయములు అనంతవిధము లగుశాకపాకములు చతుర్విధాహారములు నగు నని వర మొసంగి యంతర్హితుఁ డయ్యెను. దాన ధర్మరాజు భూసురశ్రేణి కభిమతార్థము లొసంగుచు, భోజనమునఁ దృప్తిపొందించుచు సేవించుచు నుండెను.

తదనంతరము నారదుఁడు పాండవులకడకు వచ్చి ధర్మరాజుం గాంచి ధౌమ్యానుమతమున రోమశమహర్షి చెప్పినట్లు తీర్థయాత్ర చేయు మని సూచించి వెడలెను. వెంటనే రోమశమహర్షి వచ్చి తా నింద్ర నియోగమునఁ బాండవులచేఁ దీర్ఘయాత్ర చేయింప వచ్చితి ననియుఁ

దాను ధౌమ్యునితోఁ బాండవులకడ నుండుననియుఁ జెప్పెను. ధర్మజుఁ డానందించి తీర్థయాత్ర లారంభించెను.

## ధౌమ్యుఁడు పాండవుల నోదార్చుట

పండ్రెండువత్సరము అరణ్యవాస మైనపిదప నొకయేఁడజ్ఞాత వాసము చేయవలసినసమయ మాసన్న మయ్యెను. అంతవఱకుఁ దనతో నగ్నిహోత్రములు తోడన కల్గి వర్తిల్లిన బ్రాహ్మణోత్తములఁ జూచి ధర్మజుఁ డిట్లనెను. "మహనీయులారా! మీతో అరణ్యవాసము ననాయాసముగాఁ గడపితిమి. ఇఁక మిమ్ము విడిచి యజ్ఞాతవాసము చేయవలసియున్నది. అందు మేము విఘ్నములు కలుగకుండ బయట పడుటకు మీ యమోఘాశీర్వచన మత్యంతావశ్యకము. కావున మ మ్మాశీర్వదించి యనుగ్రహించి సెలవొసంగుఁ" డని కోరి, విషణ్ణహృదయుఁడై డగ్గుత్తికవెట్ట ధౌమ్యమహర్షి ధర్మజుని కుత్సాహంబుఁ బుట్టింప నిట్లనెను.

"ధర్మనిరూపకత్వమున ధైర్యమునన్ మహనీయవృత్తి స
త్కర్మవిధిజ్ఞతం జతురతామహిమన్ దృఢబుద్ధి నెవ్వరున్
ధర్మజుపాటి గా రనఁగ ధాత్రిఁ బ్రసిద్ధుఁడవైన యట్టి నీ
పేర్మికి నీడె దుర్దశల పెల్లునకున్ దురపిల్లు టారయన్?"

భార. విరా. ౧. ౫౧.

"ధర్మజా! నీవే కాదు. దేవతలైన నొక్కొక్కప్పుడు శత్రువుల నోర్చుటకై తగినకాలమునకు వేచియుండ వలయును. నిషధ పర్వతమున దేవేంద్రు నంతటివాఁడు మాఱువేషమున మసలలేదా? విష్ణుమూర్తి యంతటివాఁడు అదితి గర్భమున వామనాకారత నణఁగి యుండలేదా? ఔర్వుఁడు తల్లి యూరు ప్రదేశమున నతి నిగూఢముగా డాఁగియుండ లేదా? మార్తాండుఁడు గోశరీరవిలీనుఁడై యజ్ఞాతముగా నుండలేదా? వీరు కష్టముల కోర్చి తుదకు సుఖసంపద అంది సుఖించిరిగదా! నీవు నట్లే యీ కష్టముల సహించి శుభము అందు" మని బోధించెను.

ధౌమ్యునిమాటలకు ధర్మజుని మనస్సు నందలి కలంక దీఱెను. అపుడు భూసురు లంద ఱొక్కస్వరమున "మీకు దైవమనుకూలించుఁ గాక" యని పాండవుల నాశీర్వదించి ధర్మజుచే ననుజ్ఞాతులై తమతమ యగ్నిహోత్రములం గైకొని పునర్దర్శనమగుఁ గాక యని తమ తమ కోరిన చోటుల కేఁగిరి.

## ధౌమ్యుఁడు పాండవులకు సేవాధర్మము లెఱింగించుట

ఆ తరువాతఁ బాండవు లైదుగురు ద్రౌపది విరాటరాజు పాలి కేగి తాము మెలఁగెడు తెఱఁగుల నేర్పఱుచుకొని కార్యనిర్ణయము చేసికొనిరి. పిదప ధర్మజుఁడు అగ్నిహోత్రములం గాపాడ ధౌమ్యుని, ద్రుపదు పురమునకుఁ బోయి నిలచునట్లు కొంచఱను, ద్వారకానగరమున కేఁగి యుండునట్లు ఇంద్రసేనాదులను, నియోగించి వారెవ్వరినైన నెవ్వరైనఁ బాండవు లేమైరని యడిగిన "ద్వైతవనమున మమ్ము విడిచిపోయిరి. తరువాత నేమైరో మే మెఱుఁగ" మని చెప్పుఁ డని కోరి యభ్యంతర పరివారము నెల్లఁ బంపివేసెను. అపుడు ధౌమ్యుఁడు పాండవుల కిట్లనెను. "మీ శుభము కోరినవాఁడ నగుట మీ రెఱిఁగిన వారైనను మీకుఁ గొన్ని విషయములు చెప్పెదను. మీ రొరులను గొలిచి యెఱుఁగరు. కావున, మీ ప్రవర్తనలో నేదైన తొందరవచ్చిన ముందు కార్యగతి తప్పును. కావున మీకు సేవాధర్మములను సంక్షేపముగాఁ జెప్పెదను. సావధాన మనస్కులై యాలకింపుఁడు.

రాజగృహము చొచ్చి యుచితమైన స్థానమున వికారరహిత వేషమునఁ గూర్చుండవలయును. సమయ మెఱిఁగి రాజును సేవింపవలయును. రాజాభిమానము పొంది 'నాకే' మని గర్వపడి మరియాద తప్పిన పురుషార్థమునకు హాని కలుగును. రాజగృహముకంటె నందముగా నిల్లుగట్టుట కాని రాజు చేసిన పనులు చేయుట కాని యాతని విహారముల ననుకరించుట కాని తగదు. రాజు అలిగినచొ పుత్ర పౌత్ర భ్రాతృ మిత్రు లనుభేదముఁ జూపరు. పూర్వపు మంచి చూడరు. రాజు మనసు చూరగొంటిమి కదాయని పలువురకు సంకటము కలుగు పను లేమి చేసినను ప్రాజ్ఞులు సంతసింపరు. అట్టివారు తప్పక తమ

చేటు తామే తెచ్చుకొన్నవా రగుదురు. కొలువులో రాజుముఖముననే దృష్టినిలిపి యాతని చూపులు చేష్టలు గ్రహింపవలయును. రాజగృహ మందలి వార్తలు పైని వినిపింపరాదు. అంతఃపురస్నేహ మెంతవారి కైనఁ బ్రమాదహేతువు. అంతకన్నఁ బ్రమాద హేతువు అందలి కుబ్జ వామన కాంతాదుల పొందు. ఉత్తమాసన వాహనాదులు రాజీయనిదే రాజసేవకులు తమంత దాము గ్రహింపరాదు. రాజు మన్నన నుబ్బక అవమానమునకు గ్రుక్కక మెలఁగిన శుభము లందుదురు.

ఆవులింత, తుమ్ము, నవ్వు, ఉమియుట ఇవి బహిరంగముగాఁ గాక గుప్తములుగా నొనరింపవలయును. వైరుల దూతలతో మనసిచ్చి మాటాడరాదు. రాజునకు సంబంధించిన యేనుఁగుతోఁ గాని దోమతోఁ గాని వైరము వలదు. తా మెంత బలవంతులైనను రాజుసేవకులకు జనులపొందు మేలు. కలిమికి భోగము ఫల మనుకొని విచ్చలవిడి భోగింపక తనకెంత యున్నను అడఁకువతో భోగము లనుభవింప వలయును."

ఇట్లెన్నియో సేవాధర్మములు ధౌమ్యుఁడు వినిపింప విని పాండవులు :

"తల్లియుఁ దండ్రియు దైవము
నెల్ల సుహృజ్జనము మీర యిట్లు గొలిచి వ
ర్తిల్లెడు తెఱంగు లెంతయుఁ
దెల్లము చేసితిరి బ్రదికితిమి మీకరుణన్."

భార. విరా. ౧. ౧౪౨.

అని కృతజ్ఞతఁ దెలిపిరి. ధౌమ్యుఁడు జాగ్రత్త యని వారిని హెచ్చరించి అజ్ఞాతవాస నిర్విఘ్నపరిసమాప్తికి హృదయ పూర్వకముగా నాశీర్వదించెను.

## పాండవులు ధౌమ్యుని వీడ్కొనుట

పిదప ధౌమ్యుఁడు శ్రద్ధతో పాండవుల ప్రయాణ సమయ మంగ ళార్థము లగుమంత్రములు జపించుచు నగ్నిని ప్రజ్వలింపఁ జేసి శామ్య

పూజ గావించెను. అంతఁ బాండవులు పాంచాలితోఁ గూడి అగ్నిహోత్రునకు, పురోహితునకు ప్రదక్షిణ నమస్కారము లొనరించి ధౌమ్యునితో బయలుదేరి వెడలిరి. వా రట్లు చని చని తుదకు విరాటరాజు పట్టణము పొలిమేరలు చేరఁగనే ధౌమ్యుని వీడ్కొని ముందున కేగిరి. ధౌమ్యుఁడును దన కర్తవ్యమును నిర్వర్తించి తన పుణ్యాశ్రమమున కేగి వసించెను.

## ధౌమ్యుఁడు ధర్మరాజు పట్టాభిషేకంబు గావించుట

తుదకు భారతఘోర రణమున విజయమును సాధించి కృష్ణుని నియోగమున బ్రాహ్మణ ప్రేరణమున ధర్మరాజు పట్టాభిషేకమున కంగీకరించెను.

పిదప సర్వసంభారములు సమకూరినతరువాత ధౌమ్యమహర్షి కృష్ణు ననుమతిఁ గొని తూర్పు పశ్చిమములకు వేదిక నలంకరించి నవరత్నఖచితము దృఢపాదము నగు భద్రపీఠమును బ్రతిష్ఠించి పులిచర్మముఁ గప్పి పూజించి దానిచుట్టు బంగారము, వెండి, రత్నములు మున్నగు వానితో నిండిన కుంభము లమర్చి వాని నిండ గంగాది పవిత్ర నదులనుండి కొనితెచ్చిన జలములనుబోసి యన్నింటికి రత్నమంగళ తరుత్వక్పల్లవ కుసుమములను, పంచగవ్యములను సమంత్రకముగా సంస్కరించి మహా మంత్రములు చదువు బ్రాహ్మణ పుంగవులతో ధర్మజుని దీసికొనివెళ్లి యా పీఠమునఁ గూర్చుండఁబెట్టి శుభాలంకృతులతో నభిరామమైయొప్పు ద్రౌపదీదేవిని బ్రక్కఁ గూర్చుండఁబెట్టి అగ్నిహోత్రు నాముఖము చేసికొని హోమమంత్రములు చదువుచు శుభముహూర్తవేళ కాఁగానే కృష్ణుని లెమ్మనెను. శంఖచక్రధరుఁడగు నతఁడు శంఖమెత్తి పృథివి కధిపతి వగుమని ధర్మరాజున కభిషేకము కావించెను. అంత వ్యాసభగవానుఁడు ముందునకువచ్చి ప్రతిష్ఠిత కలశములలో నుజ్జ్వలమైనదానిని ధౌమ్యుఁ డందీయఁగైకొని ధర్మరాజు నభిషేకించెను. తరువాతఁ బెద్దలగు రాజులు ప్రజలలోఁ దగినవారు వచ్చి ధర్మజు నభిషేకించిరి. అపుడు పట్టాభిషేకానంతరము ధర్మజుఁ డెల్లర బహూకరించి యందఱి యాశీస్సుల నంది

భీమసేనుని యువరాజపదంబున నిలిపెను. కర్తవ్యవిచార నిశ్చయములకు సంధివిగ్రహాదులకు విదురుని నియోగించెను. ఆయవ్యయాదు లెక్కింగించుటకు సంజయు నేర్పఱిచెను. భృత్యుల జీతనాతములకుఁ గర్మకలాపములకు నకులు నాజ్ఞాపించెను. దర్పితుల మర్దించుటకు, పర రాజుల జయించుటకు నర్జును నియోగించెను. బ్రాహ్మణ కార్యములకు శ్రౌతస్మార్త కృత్యానుష్ఠానములకు ధౌమ్యు నేర్పఱిచెను. నిరంతర పార్శ్వవర్తిగా సహదేవు నుంచుకొనెను. సమస్తవైదికకర్మ దానధర్మాదులకు ధౌమ్యునికి సర్వాధికారము లొసంగెను. అంతేకాదు. ధర్మరాజు ధౌమ్యునకు సగౌరవముగా సకల సంపదల నిచ్చి యాతనివలన దేవ పితృ పూజనములు, అతిథి తర్పణములు, వైదేశిక విప్రార్చనములు దీనానాథపోషణములు పరమసంతోషముతో నిర్వర్తింపఁ జేసెను.

ఈ విధముగా మొదటినుండి తుదివరకు ధౌమ్యమహర్షి పాండవ పౌరోహిత్య మద్భుతముగ నెఱపి సకలజన జేగీయమానుఁడై ముక్తి నందెను.*

---

* భారతము ఆదిపర్వము, అరణ్యపర్వము, విరాటపర్వము, శాంతిపర్వము.

# మహర్షుల చరిత్రలు

## బృహస్పతిమహర్షి

### జననము

కర్దమప్రజాపతి దేవహూతివలనఁ దొమ్మండుగురు కూఁతుంఁడ్రను గాంచి యా నవకన్యకామణులను నవబ్రహ్మలకిచ్చి వివాహ మొనరించెను. అందు శ్రద్ధ యనునామె అంగిరసునిఁ బెండ్లియాడి యాతని ధర్మపత్నియై చిరకాలము పతిశుశ్రూష యొనరించెను. ఆ పుణ్యదంపతుల కడుపునఁ బుట్టినమహనీయులు ఉతథ్యుఁడు, బృహస్పతి, సంవర్తుఁడును.

వీరిలో బృహస్పతి పుట్టుకతోడనే లోకాతీత మగు బుద్ధివైభవమును సంపాదించి మించెను. ఉతథ్యుఁడు తీర్థయాత్రా ప్రవణుఁడు, తపఃప్రియుఁడు నయ్యెను. సంవర్తుఁడు మహాయోగీశ్వరుఁడు, జ్ఞానసంపన్నుఁడు నయ్యెను.

### బృహస్పతి శాస్త్రవేదియైన విధము

తొల్లి కల్పాదియందు సప్తమహర్షులగు మరీచి, అత్రి, అంగిరుఁడు, పులహుఁడు, పులస్త్యుఁడు, క్రతువు, వసిష్ఠుఁడును స్వాయంభువమనువును విష్ణుమూర్తి నుద్దేశించి చిరకాలము మహాతపము చేసిరి. వారికి విష్ణువు అదృశ్యరూపమున నిట్లు చెప్పెను. "వత్సలారా! మీరు నన్ను ధర్మశాస్త్రబుద్ధులై యాశ్రయించితిరి. భారతి మీ యందు నిలిచి సకలలోకహితకరమును మర్యాదా ప్రవర్తకము నగు ధర్మశాస్త్రము మీకుఁ గరతలామలకము నొనరించును. దాని నెల్లలోకములవారు శిరసా వహింతురు. మీరు మహోత్తమ మగు నీ శాస్త్రసారమును అంగిరసునికిఁ బుట్టి మహామతియై వర్ధిల్లు బృహస్పతి యందుఁ బ్రతిష్ఠింపుఁడు. బృహస్పతి యీ శాస్త్రరహస్యములను నా భక్తుఁడై జనించు ఉపరిచరవసువునకు బోధించును. అతఁడు దానినిఁ జక్కగ ననుష్ఠించి లోకముల

నిలుపును." ఇట్లు చెప్పి విష్ణు వదృశ్యుం డయ్యెను. ఆ పిదప సప్త మహర్షులు ధర్మసంహితబుద్ధులైరి. కాలక్రమమున బృహస్పతి జన్మించినపిదప సప్తమహర్షులు విచ్చేసి విష్ణుమూర్తి యాజ్ఞ ననుసరించి సకలధర్మశాస్త్ర రహస్యములను బృహస్పతి కుపదేశించి వెడలిరి. బృహస్పతి ఇందువలన బుద్ధిమంతులనెల్ల బుద్ధిమంతుం డయ్యెను.*

## దేవగురుత్వము

సర్వశక్తిసంపన్నులు, ప్రజ్ఞానిధు లయ్యు దేవతలు తమకుం దగినగురువు లేకపోవుటవలనం దగినంతగా రాణింపలే కుండిరి. అపుడు దేవత లందఱును తమకు గురువును బడయ లోకము లెల్లగాలించిరి. భార్గవవంశమువాం డగు శుక్రాచార్యుండు, అంగిరసుం డగు బృహస్పతియు నిరువురే లోకమునం గల గురువులలో నగ్రేసరు లని తెలిసికొని, వారు చిరకాల మాలోచించి బృహస్పతియే యిరువురియందు మిన్న యని నిశ్చయించుకొనిరి. అపుడు వారందఱును శ్రద్ధాభయ భక్తి వినయవిధేయతలతో విచ్చేసి బృహస్పతి నాశ్రయించి కోటి మ్రొక్కులు మ్రొక్కి, "మహాత్మా! అజ్ఞానాంధకారమును విజ్ఞానప్రకాశమునం బటాపంచలు చేయు సుజ్ఞానభాస్కరుండే గురువు. గురుకృపాలబ్ధమగు విద్యయే శోభించును. ధర్మార్థకామమోక్షములకు, దైనందినవ్యవహార దక్షతకు గురువే పెన్నిధి. చుక్కానిలేని నావవలె గురువు లేని విద్యార్థి కాంక్షాపారమును గాంచనే లేడు. విబుధమణి వగు నీవే దేవతలకుం దగిన గురుడవు. కావున అవ్యాజకృపాయత్తచిత్తమున నుత్తమ గురుండవై నీవు మాకు శ్రేయ మొసగూర్పు" మని ప్రార్థించిరి.

బృహస్పతి యాలోచించి "బంగారపుం బళ్లెమునకైనను గోడ చేరుపు కావలయునుగదా! లేనినాం డది శోభింపదు. జగజ్జెట్టులగు దేవతాధిపతులకు గురుత్వము వహించుటకంటె నాకు వాంఛింపం దగిన దేమున్నది? నేను గురువు నగుదు నన్ను వా రంగీకరించి యుండక పోవచ్చును. వారంతట వారే వచ్చి ప్రార్థించినపు డంగీకరించుటే యుత్తమమార్గము. దేవగురుత్వము నా ప్రజ్ఞావైభవమునకుం దగిన స్థానము. సిరి రా మోంకా లొడ్డుట యవివేకము. కావున నంగీకరిం

* భారతము శాంతిపర్వము.

 35 M 88 

చెద" నని నిశ్చయించుకొని, యైనను వారిని గొంచెము పరీక్షింపఁ దలఁచి యిట్లనెను. "దేవతలారా! దిక్పాలుర వెంటఁబెట్టుకొని మీ యేలిక యగు నింద్రునితో నిట్లు చనుదెంచి సామాన్యుఁడనగు నాకు గొప్పతన మారోపించి గురుత్వము వహింపు మని నన్నర్థించుట నా యదృష్టము. ఐనను నా కించిద్జ్ఞతను నేను విన్నవించుకొనుచున్నాను. మీకుఁ దగిన గురువులు నా కంటె మిన్నలు ఎందఱో కలరు. భార్గవుఁ డగు శుక్రాచార్యునో భ్రాతృవ్యుఁ డగుసంవర్తమునినో మీ రెన్నుకొనుట యుత్తమము. కాని వారికంటె దీసికట్టును నన్నుఁ గోరుకొను టేమి వివేక?" మని వాదించెను. దేవత లంద ఱొక్కపెట్టున గురుత్వ సామ్రాజ్య సింహాసనము నధిష్ఠించుట కాతని కంటె నధికార్హత గలవారింకొక్కరు లే రని యందుల కంగీకరింపు మని యాతనిని మఱిమఱి బతిమాలుకొనిరి. తుద కాతఁడు వల్లె యన మహాప్రసాద మని దేవతలు జయజయధ్వానము లొనరించిరి. పిదప దేవతలు దివ్య వైభవముగా దిక్పాలకులు ఇరువైపులఁ గొలువ, అప్సరోవనితలు రాగతాళలయ సంయుక్తముగ నాట్యములు సలుపుచు నడువ, ఇంద్రుని యైరావతమున నింద్రునికి ముం దాసీనునిఁ జేసి మిగిలిన బృందారకులు మందార వృష్టిఁ గురియించుచు నడువ, బృహస్పతిని దేవనగరమునకుఁ గొనిపోయి గురుసింహాసనాసీను నొనర్చి పట్టాభిషేకముచేసి యొక రొకరే యాతని పాదములకు మ్రొక్కిరి.

బృహస్పతి తనకు దేవతలవలన జరిగిన నిరుపమాన గౌరవమున కలరి వారితలలో నాలుకవలె మెలఁగుచుఁ గంటిని ఱెప్పవలెఁ గాపాడుచుఁ దనబుద్ధివైభవమునకుఁ దార్కాణగా వారికిఁ దగుసమయములఁ దగు నాలోచన లొనరించుచు నుండెను.

ఇది యిటు లుండ భృగువంశజుఁ డగుశుక్రాచార్యుఁ డవక్రబుద్ధి విక్రమమున నధికుఁడ నని గర్వించి దేవతలు గురువు నన్వేషించుచున్నారని విని వారు తప్పక తన కడకే వచ్చి యర్థించి తననే గురువుగాఁ గైకొందు రని యాశించి యుండెను. ఇంతలో దేవతలు బృహస్పతిని గురువుగాఁ గైకొని దివ్యవైభవమున నమరావతికిఁ గొనిపోయి పూజించు

36313
TIRUPATI

చుండి రని యెఱిఁగి దేవతలపై మండిపడి వారి శత్రువులగు రాక్షసులకుఁ దాను గురువై యెల్ల దేవతలకును బృహస్పతికిని బ్రక్కలోని బల్లెమువలె నుండి తన కసి దీర్చుకొన నెంచి యుండెను. దేవతలు గురువును సంపాదించి యాతని యనుగ్రహమున గొప్పవారు కానున్నా రని విని రాక్షసులును గురుసంపాదనలో నిమగ్ను లైరి. వారును వెదకి వెదకి శుక్రాచార్యునిఁ జేరి ప్రార్థించి యాతనిని దమగురువుఁ జేసికొనిరి. శుక్రుఁడును దేవతలకుఁ దగినబుద్ధి చెప్పుట కిదియే మార్గ మనుకొని రాక్షసగురు వయ్యెను.

## బృహస్పతి ఉపరిచరవసువునకు గురు వగుట

పూర్వము వసు వను నొక రా జుండెను. అతఁడు సత్య శమ దమము లగు సుగుణములకుఁ బుట్టినిల్లు. విష్ణుభక్తికిఁ బెట్టినది పేరు. క్రతుకుతూహలమునకుఁ దావు. బ్రాహ్మణప్రియతకు నిధానము. అతఁడు రాజ్యము చేయనొల్లక వనమున కేగి మహాతప మొనరించు చుండ నింద్రుఁ డాతనికడ కేగి యాతనితోడి మైత్రి నెఱపి "రాజా! నీవు నాకు మిత్రుఁడ వగుము. మా వీటికి వచ్చుచుఁ బోవుచుండుము. భూపరిపాలన మానకుము. నీకు దివ్యత్వ మిచ్చితిని. నీకు రాకపోకల కొక రత్నవిమాన మిచ్చితి" నని యొసంగి యదృశ్యుఁ డయ్యెను. వసురాజు దానిని గైకొని భూమి నేలుచు స్వర్గమున కా విమానమున రాకపోక లొనరించుచుండి యింద్రమిత్రుఁడై "ఉపరిచరవసు" వనఁ బరఁగెను.

ఉపరిచరవసువు ధర్మపరిపాలన మొనరించుచు బృహస్పతికి శిష్యుఁడై యాతనివలన ధర్మశాస్త్రప్రపంచమును గరతలామలక మొనరించుకొనెను. గురుననుమతిఁ గొని యొకప్పుఁ డా రాజొక యశ్వమేధ యాగ మారంభించెను. ఆ యజ్ఞమున సప్తమహర్షులు వారితో సమానులైన మఱికొందఱు మహర్షులు ఋత్విక్కులైరి. బృహస్పతి ఉపదర్శనము నడపింపఁ జొచ్చెను. ప్రజాపతి పుత్త్రులగు ఏకతుఁడు, ద్వితుఁడు, త్రితుఁడు నను మునీంద్రులు సదస్యులైరి. రాజు పశుహింస మాని

యారణ్యకోద్గీతమైన వాక్యసముదాయమున విష్ణుమూర్తిని యాగభాగమును గొన నాహ్వానించెను. కరుణామయుఁ డగుహరి ఉపరిచరవసువున కొక్కనికే కానవచ్చి యాగభాగమును గొని చనెను. బృహస్పతి తనకుఁ గానరాకుండ హరి పోయె నని దుఃఖించి కన్నీరొలుక వాపోయెను. సదస్యులగు ఋషిసత్తములు రాజు నాతని నూఱడించి హరి యందఱకు లోచనగోచరుఁడు కాఁడనియు, ఐకాంతికభక్తులై యనేక వేలసంవత్సరములు భజించినవారికే యాతఁడు కానఁబడు నని తెలిపిరి. బృహస్పతి యూఱడిల్లి తనశిష్యుని యదృష్టమున కానందించి యా యాగము సుప్రయోగముగా నడపించెను.*

## బృహస్పతి యింద్రునికి బోధించిన ధర్మములు

సురాధిపుఁ డగునింద్రుఁడు సురగురు వగు బృహస్పతి నాశ్రయించి సర్వధర్మములు నెఱింగెను. ఆ సందర్భమున "మాట మంచి తనమే సమస్తప్రాణులను సంతోషపెట్టును. దానివలన యశము కలుగును. అది కలవానికి సర్వభూతజాలము సంతోషమున స్వాధీన మగును. చిఱునవ్వు ముఖమునఁ జిందులాడ హితముగను మితముగను మాటలాడ నేర్చినవాని కెల్లరును ప్రసన్ను లగుదురు. మృదు మధుర హితవచనముల నేమి చేసిన నెవ్వనికిని బాధ కలుగదు. మాటమంచి తనమున హింసించినను హింస పొందువాఁడును సంతసించు" నని తెలిపెను.

మఱియొకప్పు డింద్రుఁడు బృహస్పతిని "బ్రాహ్మణోత్తమా! నే నేమి చేసిన, నెట్లు ప్రవర్తించిన జయలక్ష్మి నన్ను విడనాడదో తెలుపు" మని ప్రార్థించెను. బృహస్పతి యిట్లు పలికెను. "ఇంద్రా! శత్రువుల నైనను గలహముచే నణంపఁ దలంపరాదు. కోపము, విరోధము అవివేకలక్షణములు. కోప భయసంతోషములను మనసులోనే యణంచుకొని పైకిఁ బ్రబల విశ్వాస మున్నట్లు ప్రవర్తించుచు లోపల నెప్పుడును నమ్మక యుండవలయును. శత్రువిషయముననుప్రియ

* భారతము ; శాంతిపర్వము.

మునే పలుకవలయును. గాని యప్రియము పలుక రాదు వ్యర్థవివాదముల నుండియు కొండెములు చెప్పుగుణము నుండియుఁ జాలదూరముగా వైదొలఁగ వలయును. వేఁటకాఁడు పక్షికూఁతల నేర్చి పక్షివలెఁ గూయుచు వాని నేమఱుపాటునఁ బట్టునట్లు రాజు శత్రువులను బట్టవలయును. శత్రువు లోడిపోయినను రాజు వారి విషయమున నేమఱి యుండరాదు. జయము సంశయమైన వేళల శత్రువులతోఁ దలపడరాదు. శత్రుబలమును సామదానభేదోపాయములచేతనే సాధ్యమైనంత వఱకు సమయఁ జేయవలయును. మెత్తగ మాటాడుట నిర్దయతో దండించుట, అలసత్వము, శత్రువంచన నెఱుఁగలేకపోవుట ఈ నాలుగు రాజ్యనాశన హేతువులు. ఒక్కవిషయమున కొక్క మంత్రియే కాని పెక్కురుమంత్రు లుండరాదు. శత్రువులు బలవంతులై యున్నపుడు వారికి నమస్కరించినను దప్పులేదు. నానావిధముల నడపడి కలవడిన వాని యైశ్వర్యమువలె, నానావిధ చిత్తచాంచల్యముగలరాజు రాజ్యము నిలువనేరదు. రా జెంతబలవంతుఁడైనను బెక్కురతో నొక్కసారి కలహింప రాదు."

మఱియొకప్పు డింద్రుఁడు బృహస్పతిని దుష్టలక్షణములను దుష్టుని దెలిసికొనువిధానమును తెలుపు మని కోరెను. బృహస్పతి యిట్లు తెలిపెను. "ఇంద్రా! పరోక్షమున దోషము లుగ్గడించుట, మంచిగుణముల కసూయపడుట, పరుల సుగుణములను వినలేక పెడమొగము పెట్టుకొనుట, అకారణముగ మాటాడకుండుట, తలపంకించుట, పెదవి విఱుచుట, అసంబద్ధముగ మాటాడుట, వ్యర్థ ప్రతిజ్ఞ లొనరించుట, ప్రతిజ్ఞ చేసినవిషయమును గూర్చి మరలఁ బ్రస్తావింపకుండుట మున్నగున వెన్నో దుష్టలక్షణములు గలవు. హితభాషణము, ప్రసన్నత, కృతజ్ఞతాగుణము, ఆనందము, తృప్తి, దయ, దానము, ధర్మము, సత్యము, మున్నగునవి శిష్టలక్షణములు. వీనికి విరోధగుణములే దుష్టలక్షణములు."

## బృహస్పతి వసుమనునకుఁ దెల్పినరాజధర్మములు

వసుమనుఁ డనురాజు తొల్లి బృహస్పతి నాశ్రయించి రాజధర్మము లాతనివలన నెఱుంగఁ గోరెను, బృహస్పతి యాతనిం గరుణించి యిట్లు

తెలిపెను, "లోకములు, లోకధర్మములు రాజమూలములు. ఇంకి పోయిన చెఱువునందలి జలజంతువులగతి యేమగునో రాజరహిత మైన రాజ్యమందలి ప్రజలగతి యట్లగును. ధర్మప్రభువుపాలన లేకపోవుచో, సూర్యచంద్రులు లేనపుడు దుష్టులెన్నిపాపములకుఁ గడంగుదురో, యన్నిదురితములు రాజ్యమును నాశనము చేయును. రాజు లేని రాజ్యమున ధనతరుణీమానప్రాణములుఁ దక్కవు. రాజు లేనిచో సర్వము లేనట్లే. రాజున్నచో సర్వము నున్నట్లే. ప్రజలకు యాగభోగత్యాగములు ధర్మములు రాజున్నపుడే కొనసాగును. రాజు లేనపుడు రాగరోగములే విహరించును. ఉత్తముఁడగురాజు చారచక్షువై జగముఁ గనునపుడు సూర్యుఁడు, అకార్యకరులఁ దునుమునపుడు యముఁడు, సాధుసజ్జనులఁ బ్రోచునపుడు దేవతాత్మకుఁడు. అట్టి వానినిగుఱించియే సమ్రాట్టు, విరాట్టు అనుశబ్దములు పుట్టినవి. రాజునకుఁ బ్రజ శరీరము ప్రజలకు రాజు ఆత్మ; రక్షార్చనలందు ఉభయులు అన్యోన్య విరాజితులైనపుడు రాజ్యము శోభించును; లేనినాఁడు క్షోభించును."*

## బృహస్పతి మాంధాతకుఁ దెలిపిన గోప్రదానప్రభావము

తొల్లి యొకప్పుడు మాంధాత యనుమహాచక్రవర్తి చక్కగ మేసి నీరు త్రావి మందలో నమందానందమునఁ బరుండియున్న గోవుల కడకు వచ్చి, ప్రదక్షిణించి, నమస్కరించి, పరమ భక్తితో బృహస్పతిని దలంచి కరకమలములు మొగిచి బహువిధములఁ బ్రస్తుతించి ధ్యానించెను. వెంటనే బృహస్పతి యాతని యెదుటఁ బ్రత్యక్షమయ్యెను. మాంధాత మహాభక్తి నాతనిపాదములకు మ్రొక్కి గోప్రదానవిధానముఁ దెలుపు మని ప్రార్థించెను. బృహస్పతి కరుణించి యిట్లు తెలిపెను. "రాజేంద్రా! భూదేవతల యనుజ్ఞ నంది పుణ్యదినమున నుపవాసము చేసి గోవులున్నమందకేగి నియమనిష్ఠలతో నొకరాత్రి యొకపగలు నివసించి మఱునాఁ డుదయమున గోవును పేరుపేరఁ బిలిచి బ్రహ్మచెప్పిన "తల్లి గోవు, వృషము తండ్రి, గర్భప్రదేశము స్వర్గము, ధరణి సంప్రతిష్ఠ" అను వాక్యముఁ బలికి పిదప, తనపాపము లన్నియుఁ బోవు

* భారతము, శాంతిపర్వము.

టకు బ్రాహ్మణునిచేత నుదకధార విడిచి గోదానము చేయవలయును. శిష్యుఁడు, వ్రతశీలుఁడు-శాంతుఁడు, దాంతుఁడు, అక్రోధనుఁడు నగు విప్రుఁడే యిందులకుఁ బాత్రుఁడు. ఇట్టి దానముఁ జేసినవాఁడు చంద్రలోకమున సకలసౌఖ్యములు చిరకాల మనుభవించును. ఆశ్వయుజ మాసమున బహుళాష్టమి మొదలు మూఁడుదినము లుపవసించి పుణ్య మగువసులసాల నుండి గోమూత్రము, గోమయము గ్రహించి సమస్త కామ్యసిద్ధిని బొందును.''

ఇది విని మాంధాత య ట్లనేకగోదానము లొనరించి యుభయ లోకములందు శాశ్వతకీర్తిచంద్రికల నింపెను.*

## బృహస్పతి మనువునకుఁ జేసిన జ్ఞానబోధ

ఒకప్పుడు మనువు తనగురువగు బృహస్పతిని జేరి కొలిచి తనకు జ్ఞానయోగముఁ దెలుపు మని ప్రార్థించెను. బృహస్పతి యిట్లు బోధించెను. "అనఘా! సత్కర్మయోగనిష్ఠ జ్ఞానయోగమునకుఁ గారణము. అనిష్టమును పాపుకొనుటకు, ఇష్టమును సంపాదించుకొనుటకు మానవుఁడు కర్మ మొనరించును. నిజమునకు, ఇవు దేవి సుఖములో అవియే కొంతకాలమునకు దుఃఖదాయకము లగును. ఇది తెలిసికొన్న ప్రాజ్ఞుఁడు ఫలవిషయమున నపేక్షలేనివాఁడై సుఖదుఃఖముల కతీతుఁడై కామాదులకుఁ గడుదవ్వగు జ్ఞానవిశేష బుద్ధివలనఁ బరమసిద్ధి నందును. మఱియు, పరమవస్తువు ఆలంబము లేనిది; శబ్దస్పర్శరూపరసగంధవిరహితము. అందుచే నది వ్యాప్త మగుచుండునింద్రియములకు వశపడదు. పరతత్త్వమునకు స్త్రీ పుం నపుంసకత్వములు లేవు. అందుచే నది వానివానివ్యాపారముల కతీతమై దేహగత మయ్యు బోధరూపమున దీపించును. వెలుఁగుచున్నదీప మితరవస్తువులఁ బ్రకాశింపఁ జేయునట్లు మహోత్తమమగు నిత్యబోధనజ్యోతి తనప్రభవలన నింద్రియమానసముల దోషములఁ బోఁగొట్టును. రాజునకు మంత్రులాయా కార్యముల నెట్లు సూచింతురో, అట్లే పురుషున కింద్రియములు క్రియలఁ

---

* భారతము, అనుశాసనిక పర్వము.

గల్గించును. కఱ్ఱ కఱ్ఱ రాపాడిన నగ్ని పుట్టును, అట్లని గొడ్డళ్ళతోఁ జెట్లఁ గూల్చి ముక్కముక్కలుగా చెక్కపేళ్ళుగాఁ గొట్టినచో అగ్ని కనిపించునా? అట్లే శరీరమును శుష్కింపఁ జేసినంతమాత్రమునఁ బర తత్త్వము కానిపింపదు. కఱ్ఱలకు మథన మవసరమైనట్లు జ్ఞానమునకు ఆగమోక్తమథన మావశ్యకము. ఆకాశమునఁ జూపు నిలువనంత మాత్రమున నాకాశమే లేదనుట యెంత యవివేకమో మనస్సునకు నింద్రియములకు నందనంత మాత్రమునఁ బరతత్త్వము లేదనుటయు నంతియే. వేఁటకాఁడు వల, ఉరి, ఓదము, గాలము మున్నగుసాధన ములఁగొని మృగమును, పక్షిని, ఏనుఁగును, చేఁపను, పట్టునట్లే జ్ఞానులు విజ్ఞానమునఁ బురుషునిఁ జూడఁ గందురు. పాముకాళులు పామునకే తెలియునట్లు బుద్ధివికారములను బోఁద్రోచు ప్రాజ్ఞుఁడు పరమపురుషు నెఱుంగును. అమావాస్యనాఁడు చంద్రుఁడు కానరానంతమాత్రమున నాతనికి నాశము లేనట్లే. మనస్సునకుఁ బట్టువడనంత మాత్రమునఁ బరవస్తువు లేదనుట బుద్ధిహీనత. రాహువు గ్రమింగినచో రవిబింబము కానరాదు. రాహువు విడువఁగనే యది యథాప్రకారము కానవగును. అట్లే ఆత్మకు అవిరతి, విరతి యనునవి అజ్ఞానమువలననే ఉన్నట్లు తోఁచును. తేటినీటఁ బ్రతిబింబము కనిపించును. కలఁగిననీట నది కనిపింపదు. అట్లే మనస్సు ప్రశాంతస్థితి నున్నపుడు పురుషుఁడు తన్నుఁ దాను గనును. అశాంతస్థితిని గానలేఁడు. ఇంద్రియములు యథేచ్ఛ ముగాఁ దిరిగినచో నవి యనంతదుఃఖములం గొనితెచ్చును. అవి కట్టు వడినచో సుఖ మొసంగును. కావున, ఇంద్రియము లను దొంగలబారి నుండి ఆత్మను గాపాడవలయును. మెఱుఁగుటద్దమున ముఖము బాగుగఁ గనఁబడునట్లే, పాపరహితమైన మనస్సున పురుషుఁడు తన్నుఁ దాఁ గనఁగలఁడు. ధ్యానయోగనిశ్చలమగు మనస్సు గుణములను విడిచి శాంతనిర్గుణవస్తువునందుఁ గలియును. అది పరమపదము. దాని కిఁకఁ బరము లేదు.

ఉత్తమజ్ఞానమునకు మాయ మాటగును. దానిని దొలఁగించు నుపాయముఁ జెప్పెద, వినుము. భూమిపైఁ బాదము మోపని జంతు వెటు లేగెనో చెప్పుట యెంత కష్టమో మాయ యిట్టి దని చెప్పుట

సాధ్యము కాదు. మాయ గుణముల రూపము. దానిని దూరము తొలఁగింపఁగా, దివ్యజ్యోతి కానవగును. అది కనుటయే తన్నుఁ దాను గనుట. సత్త్వము, రజస్సు, తమస్సు అను మూఁడుగుణములు పెన వేసికొని ఆత్మఁబట్టుకొనును. వానిని ద్రెంచుట వైరాగ్య మనుకొడవలి చేతనే కాని మఱి యొకవిధమున సాధ్యము కాదు.

మఱియు, మణులతోను, బంగారముతోను, వెండితోను, మట్టి మున్నగు వానితోను జేయఁబడినయనేకములగు పూసలలో దారమున్నట్లు భూతకోటు లన్నింటియందును పురుషుఁ డుండును. ఒకేభూమిమీఁద ననేక విధములగు ఓషధులు పుట్టునట్లే ఒకేబుద్ధివలన ననేకములగు కర్మలు కలుగును. జలము భూమికంటెఁ బెద్ద; తేజ మంతకంటెఁ బెద్ద; వాయు వంతకంటెఁ బెద్ద; దానికంటె నాకాశము పెద్ద; దానికంటె మనస్సు పెద్ద; దానికంటె బుద్ధి పెద్ద; పృథివ్యాదిపంచభూతములకంటెను మనోబుద్ధుల కంటెను కాలము పెద్ద. కాలాతీతుఁడై పురుషుఁ డీ జగములకుఁ బ్రభువై యుండును. ఆతని కాది మధ్యాంతములు లేవు. అతఁ డవ్యయుఁడు. వేదములు, నానావిధవాదములు నతనినే కీర్తించును. ఆతఁడు భవ నాశకుఁడు. అనుభవాతీతముగుశాంతమువలనఁ గనుపట్టునది. సత్ప్ర కాశము. అది తలఁపులకుఁ బలుకులకు దొరకదు. కర్మములకుఁ గాని పింపదు. ఈ ప్రకాశము అమృతము, అచ్యుతము, అమలము, అమే యము, అవ్యయము, అనంతము. యమాదుల కలవడినచిత్తము శమాతిరేకమును బొందగా దీనిని గాంచును.*

## బృహస్పతి అగస్త్యుని బ్రార్థించుట

ఇంద్రాదులకుఁ గాని దేవతలకుఁ గాని కష్టనష్టములు కలిగినపుఁ డెల్ల బృహస్పతి వారికై యెవ్వ రెవ్వరినైనఁ బ్రార్థించి వారికి క్షేమము నొనఁగూర్చువాఁడు. వింధ్యపర్వతము పెరిగి లోక వ్యవహారము తాఱు మాఱు చేయఁగా లోకోపద్రవము వాటిల్లెను. అప్పు డింద్రాదులను వెంటఁగొని బృహస్పతి బ్రహ్మకడ కేగి రక్షింపు మని కోరఁగా నాతఁడు

---

* భారతము; శాంతిపర్వము.

వారి నగస్త్యుని బ్రార్థింపు డని పంపెను. బృహస్పతివెనుక దేవత లెల్లరు భూలోకమునకు దిగి కాశీపట్టణముఁ జేరి యగస్త్యాశ్రమమును సమీపించి యా మహర్షికి మ్రొక్కి నిలిచిరి. అగస్త్యుఁడు వారిక్షేమ మడిగి బృహస్పతిని బహూకరించి వచ్చినపని యడిగెను. లోపాముద్రాపతిని బృహస్పతి స్తుతించి "ఋషివర్యా! నీవు ప్రణవమవు. లోపాముద్ర వేదవిద్య. నీవు తపస్సువు. లోపాముద్ర శాంతి. ఈమె సత్క్రియ. నీవు ఫలము, నీవు సూర్యుఁడవు. ఈమె చైతన్యలక్ష్మి. నీ యందు బ్రహ్మతేజము, ఈమెయందుఁ బతివ్రతాతేజము ప్రజ్వరిల్లుచు లోక క్షేమముఁ గూర్చుచున్నవి. ఈ రెండుతేజములు కలిసి మాకు క్షేమ మొసఁగుఁగాక" యని పలికి అగస్త్యునిచే వింధ్యగర్వాపహరణముఁ గావించి లోక శ్రేయముఁ గూర్చెను.*

## బృహస్పతి శుక్రాచార్యుఁ డగుట

తొల్లి యొకప్పుఁడు దేవతలకు విజయముపై విజయము రాక్షసులకు పరాజయముపైఁ బరాజయము కలుగుచుండుటఁ గని రాక్షసులు తమగురువగు శుక్రాచార్యునికడ కేఁగి మొఱ్ఱవెట్టిరి. శిష్యవత్సలుఁ డగు శుక్రుఁ డుపాయ మూహించి శంకరుని గుఱించి తప మొనరించి యాతని కరుణ వడసి మంత్రశక్తులు సంపాదించి వానివలన రాక్షసులకు విజయము దేవతలకుఁ బరాజయము సమకూర్ప నిశ్చయించు కొనెను. పిదప నాతఁ డేగి శివుని మెప్పించి యాతని సూచన ననుసరించి యుగ్రతప మొనరించుచుండెను. ఇంద్రుఁ డీసంగతి యెఱిఁగితపోభంగ మునకై తనకూఁతురగు జయంతినిఁ బుత్తెంచెను. మహాసౌందర్యవతి, యౌవనవతి, గుణవతి యగు జయంతి శుక్రాచార్యునిఁ జేరి యాతనికి శుశ్రూష లొనరించుచు ననేక సంవత్సరములు గడపెను. తుట్టుదుద కాతఁ డామెఁ గనికరించి కావలసినది కోరుకొను మనఁగా నామె యాతనితోడి చిరకాల సంగమసౌఖ్యముఁ గోరుకొనెను. అన్నమాట కాదనఁజాలక శుక్రుఁడు సంకేతమందిరమున నామెకోరికఁ దీర్చుచు వేలకొలఁది సంవత్సరము లుండిపోయెను.

---

* స్కాందపురాణము. కాశీఖండము.

ఈ లోఁగా బృహస్పతి శుక్రాచార్యరూపము ధరించి రాక్షసులకడ కేగి వారు తమగురువే యని నమ్మి సేవింప, వారికి వేదబాహ్య మగు అర్హతమతము ని ట్లుపదేశించెను. "వేదశాస్త్రములు వట్టిబూటకములు; వాదములకు భేదములకు నవి పనికివచ్చుఁ గాని ముక్తినీయఁజాలవు. యజ్ఞములపేరఁ జేయు ప్రాణిహింస, సురాపానము మిగుల గర్హ్యములు. యజ్ఞమునఁ జంపఁబడిన పశువునకు మోక్షము వచ్చునఁట. అగుచో, యజ్ఞకర్త తనతండ్రినో తల్లినో యజ్ఞపశువుఁ జేసి మోక్ష మిప్పింపరాదా? ఒకఁడు పెండ్లమును నెత్తి కెక్కించుకొన్నవాఁడు; ఇంకొకఁడు వక్షః స్థలమున నుంచుకొన్నవాఁడు; మఱొక్కఁడు నోటిలో నుంచుకొన్న వాఁడు. ఈ ముువ్వురు మోక్షప్రదాత లఁట! చిత్రము కాదా?

మీకు నేను గొప్పమత మొకటి బోధించెదను. దానిని మీ రనుస రించితిరా మీకు మోక్షము కలుగును. అదియే అర్హత మతము. ఇందు శిఖాయజ్ఞోపవీతము లెల్లరును త్యజింపవలయును. ఆచారము మాన వలెను. దిగంబరులై యథేచ్ఛముగ నుండవలయును. జాతి మతభేదము లుండరాదు."

ఇట్లు చెప్పి బృహస్పతి రాక్షసు లెల్లరకు అర్హతమతము నిప్పించి వారిని ధర్మబాహ్యులను వేదబాహ్యులను గావించెను. ఈ సందర్భ మున నిజముగ శుక్రాచార్యుఁడు తనశిష్యులకడకు వచ్చెను. కాని, బృహస్పతిమతము తల కెక్కినరాక్షసులు వానిని నమ్మక ద్రోహియని పాఱఁదోలిరి. బృహస్పతి రాక్షసులను సర్వభ్రష్టులను జేసి యరిగిన పిదప, రాక్షసులు తాము మోసపోయిన సంగతి గ్రహించి ప్రహ్లాదపుర స్కృతులై శుక్రాచార్యునిఁ బ్రార్థించి క్షమింప వేఁడుకొనిరి. ఎట్టకేల కాతఁడు శిష్యవాత్సల్యమున వారి కిచ్చినశాపమున కవధి యేర్పఱిచి యాదరించెను.*

## బృహస్పతి మమతం గూడుట

బృహస్పతి పన్నిన కుటిలనీతిమూలముగాఁ దనశిష్యులు తన్నుఁ దృణీకరించి యవమానించిరని దానికిఁ గారకుఁ డగు బృహస్పతి

* పద్మపురాణము, బ్రహ్మాండ పురాణము

యధర్మముగ మాతృసమానం గూడి శాపపాపహతుఁ డగుఁగాక యని శుక్రాచార్యుఁడు శపించెను. ఈ శాపము కారణముగా బృహస్పతి సర్వవిద్వద్వరేణ్యుఁ డయ్యు, సర్వధర్మవిదుఁడయ్యు సర్వము మఱచిన వాఁడై తిరుగుచుండెను. భూతము సోఁకిన మానవునివలె, సురాపానమున మదమెక్కిన త్రాగుఁబోతువలె బృహస్పతి వివేకవిహీనుఁడయ్యెను. ఆహా! సత్పురుష శాప మెంతవాని నెంత హీనుఁ జేయును!

ఇట్లుండఁగా నొకనాఁడు బృహస్పతి యన్నయగు ఉదథ్యునాశ్రమమున కేగెను. అట, ఉతథ్యుఁడు తీర్థయాత్రల కేగియున్న కారణమున నాతనిధర్మపత్నియు, అసమానలావణ్యవతియు, విశేషించి గర్భవతియు నైన మమతాదేవిని గాంచెను. శాపోపహతుఁ డగునా సురగురునకుఁ గామమోహము కలిగెను. ఏకాకినియై యున్న యా సాధ్వి మఱఁది కతిథిపూజ చేసి యాదరించెను. అంత బృహస్పతి మదనాతురుఁడై యామె కరముఁ బట్టి రతిసుఖ మిమ్మని బలవంతపెట్టెను. ఆమె నిశ్చేష్టయై తాను గర్భిణియై యున్నసంగతియు మాతృసమాన యైన సంగతియు నాతనికి గుర్తునకుఁ దెచ్చెను. ఐనను, శుక్రశాప తిమిరబద్ధుఁ డగు దేవగురున కిది యసమంజసముగఁ దోఁపలేదు. అందుచే నాతఁ డామెను బలవంతమున శయ్యకుఁ దార్చి రమించి కామోపశమనముఁ గావించుకొనెను. తత్పతితవీర్యమును మమతాగర్భస్థుఁ డగు శిశువు వెలికిఁ దన్ని వేసెను. అమోఘ మగుబృహస్పతి వీర్యము నేలపైఁ బడి తదనంతశక్తివలన వెనువెంటనే బాలుఁ డయ్యెను. ఈ బాలుని మమతాబృహస్పతు లిరువురును విడిచి వేయఁగా భరతుఁ డనురాజు తీసికొనిపోయి పెంచెను. ఈతఁడే భరద్వాజుఁ డయ్యెను.

## బృహస్పతికి ఉతథ్యుని శాపము

తీర్థయాత్రలనుండి తిరిగివచ్చిన ఉతథ్యునకు భార్యయగు మమత జరిగిన సంగతి యంతయుఁ దెలిపెను. అతఁ డాశ్చర్యపడి సోదరుని చేష్ట కసహ్యించుకొని బృహస్పతిభార్య నొరుఁడు రమించునట్లును, బృహస్పతి యవమానదందహ్యమానమానసుఁ డగునట్లును శపించెను.

బృహస్పతి అయోనిజ యగుతార యను సౌందర్యవతిని వివాహమై యామెతో గార్హస్థ్యసౌఖ్యము ననుభవించుచు నుండెను. కొంత కాలమునకు శశాంకుఁడు వచ్చి బృహస్పతికి శిష్యుఁడై తారాబృహస్పతుల కత్యంత ప్రేమపాత్రుఁ డయ్యెను. బృహస్పతి యేకసంధాగ్రాహి యగునాతనికి సమస్తశాస్త్రములు నేర్పుచుఁ బ్రాణసమముగాఁ జూచుచుండెను. ఇట్లుండ నింద్రుఁడు చేయు యాగమున కేగుచు బృహస్పతి తారాశశాంకుల నింటికడ విడిచి చనెను. పరస్పర కామోపహతు లగు న య్యిరువురకు యథేచ్ఛా వ్యభిచారమునకుఁ దగిన యదను లభించెను. మహాపతివ్రత యయ్యుఁ దార భర్తకుఁ దగిలినశాపము కారణముగా సుతసముఁ డగు శశాంకునిం గూడి యాతనివలన గర్భము ధరించెను. బృహస్పతి తిరిగివచ్చి జరిగిన సంగతి గ్రహించి యిరువురినిఁ జీవాటులుపెట్టి శశాంకుని బంపివేసెను. తరువాత నాతఁడువచ్చి యేకాంతముగ నున్నపుడు తారను దీసికొనిపోయెను. తార బుధుఁ డను కుమారునింగనెను. బృహస్పతి తన భార్యను దన కిప్పింపు డని ఇంద్రాదులతోడను బ్రహ్మాదులతోడను మొఱపెట్టుకొనవలసివచ్చెను. చంద్రుఁడు తార నిచ్చుట కంగీకరింపని కారణమున నిరుపక్షముల వారికి ఘోర మగుపోరు సంభవించెను. అపుడు బ్రహ్మ వచ్చి శశాంకు నొప్పించి అయోనిజ కావున అపవిత్ర కాని తారను తిరిగి బృహస్పతి కిప్పించి యిరువక్షములవారికి సఖ్యము నెఱపెను.

## బృహస్పతికిఁ దారవలన సుతుఁడు కలుగుట

ఈ ప్రకారము పరహస్తగతయైన తార తిరిగి బృహస్పతిహస్తమునఁ బడెను. శాపతిమిరము పైతొలఁగినకారణమున నామె మహాపతివ్రతయై యిఁకఁ దప్పుదారులు ద్రొక్కక బృహస్పతినే సేవించుచుండెను. అసమానలావణ్యవతి యగునామెకు బృహస్పతి దయవలన గర్భము నిలిచెను. కాలక్రమమున నామెకు కచుఁ డను కుమారుఁ డుద్భవించెను.

కచుఁడు పెరిగి పెద్దవాఁ డగుచున్న సమయమున శుక్రాచార్యుని మృతసంజీవనీవిద్యవలన రాక్షసులకు విజయము, దేవతలకుఁ బరాజయము కలుగుచుండెను. ఉపాయాంతరమున మృత సంజీవనీవిద్య గ్రహింప వలె నని నిశ్చయించుకొన్న దేవతల కందులకుఁ దగినవాఁడు లభింపఁ డయ్యెను. తుదకు బృహస్పతియనుమతిం గొని సురలెల్లరుఁ గచుని బ్రార్థించి శుక్రాచార్యునికి శిష్యత్వము నెఱపి మృతసంజీవనీవిద్య పరి గ్రహించి రమ్మని పంపిరి. కచుఁడు దేవహితైషియై యేగి శుక్రా చార్యునికి మిగుల నిష్టుఁడై మెలఁగి యాతనికూఁతు రగుదేవయాని వలపునకు నిలయమై తుదకుఁ బోయిన పనిని సాధించుకొని వచ్చెను.

## బృహస్పతి యిచ్చినమాట దాఁటుట

మరుత్తుఁ డనురాజు యజ్ఞము చేయఁ దలఁచి బృహస్పతికడ కేగి భయభక్తియుక్తుల నమస్కరించి తన యజ్ఞమునకు యాజకత్వము వహింపు మని ప్రార్థించెను. బృహస్పతి తన యంగీకారమును దెలిపి యజ్ఞసంభారములను సమకూర్చుకొన మరుత్తున కనుజ్ఞ యిచ్చెను. మరుత్తుఁడును సురగురువు తన యజ్ఞమును నిర్వర్తింప నంగీకరించె నని యపరిమితానంద మంది సర్వసంభారములు సమకూర్చుకొనఁ దొడం గెను. ఇంతలో అసూయాగ్రస్తుఁడగు ఇంద్రుఁ డీవిషయ మెఱిఁగి గురువుకడ కేగి తానే యజ్ఞము చేయుదు ననియు నా యజ్ఞమున యాజకత్వము వహింపవలయునే కాని మానవుఁ డగు మరుత్తుని జన్నము నడపింప వల దని ప్రార్థించెను. శిష్యవత్సలుఁ డగుబృహస్పతి యాతని ననునయించి తాను మరుత్తుని యజ్ఞమునకుఁ బో ననియు, ఇంద్రుని యజ్ఞమునే నడిపింతు ననియు శపథము చేసెను.

ఇంతలో సర్వసన్నాహములు సమకూర్చుకొని మరుత్తుఁడు దేవ గురువునకు వచ్చి యజ్ఞ మారంభింపఁజేయు మని వర్తమాన మంపెను. దానికిఁ దాను రాఁజాల ననియు నింకొకనిం బిలిచి యజ్ఞము నడిపించు కొను మనియు బృహస్పతి మరుత్తునకు వర్తమాన మంపెను. బృహస్పతి ప్రతిజ్ఞాభంగమునకు మరుత్తుఁ డెంతయు వగచి కింకర్తవ్యతామూఢుఁడై

యుండఁగా నారదమహర్షి విచ్చేసి బృహస్పతితమ్ముఁడు మహాయోగి యగు సంవర్తుని బిలిచి యజ్ఞ మొనరింపు మని సూచించి సంవర్తునిఁ గనుంగొను తీరు, ఆతనిని వశపఱచుకొనువిధముఁ దెలిపి వెడలెను. మరుత్తుఁ డమితానంద మంది యటు లొనరించి సంవర్తుని బహుగౌరవ ముగాఁ దీసికొనివచ్చి యజ్ఞ మారంభించెను.

ఈ సంగతి తెలిసి యింద్రుఁ డసూయవడి యెట్లైన యజ్ఞవిఘ్నముఁ గావింపఁ దలఁచి బృహస్పతియే వచ్చి యజ్ఞము నడిపించు ననియు, సంవర్తునిఁ బంపివేయు మనియు మరుత్తునకు వార్తఁ బంపెను. మరుత్తుఁ డంగీకరింపఁ డాయెను. ఇంద్రుఁడు కోపించి వజ్రాయుధ మును బంపెను. మరుత్తుఁడు సంవర్తుని శరణుచొచ్చెను. సంవర్తుఁడు వజ్రాయుధము నాపివేసి గాలిపటమువలె గిరగిరఁ దిరుగుచు నొక్కచో నుండిపోవ శాసించెను. అది నిర్వీర్యమై నిలిచిపోయెను. పిదప, నింద్రబృహస్పతులకు బుద్ధివచ్చి తాము స్వయముగా వచ్చి సంవర్తుని క్షమాభిక్షముఁ గోరిరి. సంవర్తుఁడు వారి నాదరించి మరుత్తునియజ్ఞ మును నిర్విఘ్నముగను దివ్యముగను జరిపించెను. మరుత్తుఁడు వారిని బూజించెను. ఇంద్రబృహస్పతులు సంతోషించి వెడలిరి.*

## బృహస్పతి శనిపీడ నందినకథ

బృహస్పతి దయాళువై భూ జనులకు జ్ఞానముపదేశించి బాగుచేయఁ దలఁచి నర్మాదా నదీతీరమునఁ గల యొకపట్టణముఁ జేరి 'వాచస్పతి' యని తనవాఙ్నిపుణతకుఁ బేరువడసి, శిష్యప్రశిష్యులఁ జేరఁదీసి వారికి సమస్తసౌకర్యములు స్వశక్తివలన సమకూర్చుచు నుండెను. పెక్కురు జిజ్ఞాసువు లామహనీయుని శిష్యులై పెక్కు జ్ఞానరహస్యము లాతని వలన నెఱిఁగి సంతోషించుచుండిరి.

ఇట్లుండ, ఛాయాసూర్యతనయుఁ డగుశని తండ్రిని జేరి తనకు విద్యాబుద్ధులు గఱపువిబుధగురుఁ డెట నున్నాఁ డని ప్రశ్నించెను. సూర్యుఁడు "వత్సా! నీకు విద్యాబుద్ధులు గఱపఁ గలదిట్టయొక్క బృహస్పతియే. ఆతఁ డిపుడు నర్మదాతీరమందలి నగరమున గురుకులా

* భారతము, అశ్వమేధపర్వము

శ్రమమును నిర్మించి నిర్వర్తించుచు సకల జనులకు సర్వవిషయములు చెప్పుచున్నాఁడు. నీ వాతని నాశ్రయించి తగిన విద్యలను గ్రహించి ర" మ్మని పంపెను.

శని విద్యార్థియై విప్రబాలవేషమును ధరించి బృహస్పతి యున్న కడ కేతెంచి యాతనికి సాష్టాంగ మెఱఁగి తాను కపిలవంశీయుఁడ ననియు జ్ఞాన మాశించి వచ్చితి ననియుఁ దనకు సర్వవేదశాస్త్రములు బోధించి జ్ఞానము నొసంగు మనియుఁ బ్రార్థించెను. వాచస్పతి యానందించి శిష్యునిగాఁ జేర్చుకొని యాతనికి సర్వవిషయములు చక్కగ నేర్పెను. ఆతఁ డనతికాలముననే విద్యార్థుల కెల్ల మిన్నయై బుద్ధివిశారదతను గురుహృదయ మాకర్షించెను.

ఇంత బుద్ధిమంతుఁడు వీఁ డెవఁడా యని బృహస్పతి యొకనాఁడు దివ్యదృష్టిని జూడ నాతఁడు సూర్యతనయుఁ డగు శనైశ్చరుఁ డని స్పష్టముగాఁ గానవయ్యెను. బృహస్పతి యాతనిం బిలిచి "నీ వసత్య మాడి నా వలన విద్య అభ్యసించితివి. ఆ దోషమువలన నీకుఁ గ్రూర దృష్టియు, సర్వజనపీడాకరుఁ డను దుష్కీర్తియుఁ గలుగు నని శపించెను. అది విని శని ''నాపీడ నీకును దప్పు'' దని ప్రతిశాపమిచ్చి "ఏమైనను, నీవు నాకు గురుదేవుఁడవు. కావ, నాపీడ నీకుఁ బ్రమాద హేతు వెంతమాత్రము కాకుండు '' నని పలికి బృహస్పతిని బ్రీతునిఁజేసి వెడలిపోయెను.

బృహస్పతిశాపమువలన శని పాపగ్రహము, క్రూరదృష్టి యుతుఁడు నయ్యెను. శని ప్రతిశాపమువలన నొకనాఁడు బృహస్పతికి రాజశిశుహంత యను నిరాపనింద రాఁగా నాతని కా దేశపురాజు మరణ దండన విధింపవలసియు నేమియు నసలేక విచారించుచుండెను. ఇది యంతయు శనిగ్రహదోష మని బృహస్పతి మనమున శనిని ధ్యానింపఁగా నాతఁడు గురుని గౌరవించి యాతఁడు నిర్దోషి యనియు, రాజ శిశు వూయెలలో సురక్షితుఁడై యున్నాఁడనియు నశరీరవాణిచే వెల్లడింపఁజేసెను. బృహస్పతిని రాజు మంత్రులు నెల్లరు గౌరవించి క్షమాభిక్షము కోరిరి. "ఇది మీ తప్పుకాదు. ఎంతటివారికిని శనిపీడ

తప్పదు. నాకును దప్పతే"దని బృహస్పతి యందఱ నోదార్చెను. శని యటఁ బ్రత్యక్షమై గురుపాదములఁ బడి క్షమింప వేఁడుకొనెను. దేవగురు వాతని నాదరించి యుత్తముల జోలికిఁ బోవల దని హెచ్చరించి వీడుకొలిపెను.*

## బృహస్పతిస్మృతి

బృహస్పతి చెప్పినధర్మము లన్నియు "బృహస్పతిస్మృతి" యనుపేర విలసిల్లుచున్నవి. ఇంద్రుఁడు బృహస్పతిని జేరి భయభక్తులతోఁ దనకు ధర్మములు చెప్పు మని ప్రార్థించుటయు బృహస్పతి కరుణించి యాతనికి ధర్మములు వివరించె ననియు నిందుఁ గలదు.

## బృహస్పతిస్తుతి

"నమ స్సురేంద్రవంద్యాయ
దేవాచార్యాయ తే నమః,
నమ స్తేఽనంతసామర్థ్య
వేదసిద్ధాంతపారగ !
సదానంద నమ స్తేస్తు
నమః పీడాహరాయ చ,
నమో వాచస్పతే తుభ్యం
నమ స్తే పీతవాససే.
నమోఽద్వితీయరూపాయ
లంబకూర్చాయ తే నమః,
నమః ప్రహృష్ట నేత్రాయ
విప్రాణాం పతయే నమః.

---

* శివపురాణము, సనత్కుమారసంహిత.

నమో భార్గవశిష్యాయ
విపన్నహితకారిణే,
నమస్తే సురసైన్యానాం
విపత్త్రాణహేతవే.
బృహస్పతిః కాశ్యపేయో
దయావాన్ శుభలక్షణః,
అభీష్టఫలద శ్రీమాన్
శుభగ్రహ నమోస్తు తే."

---

# మహర్షుల చరిత్రలు

## మంకణమహర్షి

### జననము

తొల్లి మాతరిశ్వుఁ డను తపశ్శాలి సుకన్య యనుకన్యను బెండ్లి యాడి యామెవలన నొకసుపుత్త్రుని గాంచెను. అతఁడు మంకణుఁ డనియు, మంకణకుఁ డనియు నామముల నొప్పి, వయసు వచ్చినంతనే తలిదండ్రుల యనుజ్ఞ గైకొని వెడలి సప్తసారస్వత మనుతీర్థప్రదేశమున నాశ్రమమును తపోనిమిత్తము నిర్మించుకొనెను.

### ఆశ్రమము

సద్బ్రహ్మచారి, సత్తపః ప్రవణుఁడు నగుమంకణమహర్షి యాశ్రమము నానాద్విజగణ సమన్వితము. అందు బదరములు, ఇంగుదములు, కాశ్మర్య, ప్లక్ష, విభీతక, అశ్వత్థము లను వివిధ వృక్షములు, కంకోలములు, పలాశ, కరీరు, పీలుజాతుల చెట్లును బహుమనోహరభంగులఁ బెరిగి యా ప్రదేశము నతిమనోజ్ఞ మొనర్చెను. అందుఁ బెరిగిన కదళీవనములో జలవాయుఫలపర్ణాహారులు, దంతోలూఖలికులు, అశ్మకుట్టులు, వానేయులు నగుపెక్కు విధముల మునులు జపతపోధ్యానాసక్తులై నివసించుచుండిరి. వారి యునికి వలన ఆ ప్రదేశము నిరంతర స్వాధ్యాయఘోషతోను, సాధు మృగశతములతోడను, అహింసకులు, పరమ ధర్మపరులు నగుజనములతో నొప్పారుచుండెను.

### సప్తసారస్వతము

పూర్వ మొకప్పుడు బ్రహ్మ ఋషీశ్వరుల నెల్లరిని పిలిపించి సర్వకామసంసిద్ధిదమగు సత్త్రయాగము నొకదానిని జేయ సమకట్టెను. యజ్ఞదీక్షితుఁడై పితామహుఁ డుండఁగాఁ గొందఱు ఋషులు సరస్వతీనదియటఁ బ్రవహింపనిలోపము దక్క నింకేలోపము లేదనుకొనిరి. ఆ మాట

విన్న బ్రహ్మ ఋషులయెడ దయాళువై సరస్వతిని స్మరించెను. వెంటనే సరస్వతి ప్రత్యక్షమై 'సుప్రభ' యనుపేర నటఁ బ్రవహించెను. మహర్షు లెల్లరు నానంద భరితులై రి.

తరువాత, నైమిశారణ్యమునులు సత్త్రయాజులై తన్నుఁ బ్రార్థింపఁగా సరస్వతి వచ్చి 'కనకాక్షి' యనుపేర నటఁ బ్రవహించి వారికి సంతోషమును సమకూర్చెను.

మఱియొకప్పుడు గయుఁ డనుమహారాజు యజ్ఞముచేయుచు యాగదీక్షితుఁడై యా సరస్వతిని బ్రార్థింప నామె విచ్చేసి కరుణా కటాక్షము మెఱయ గయదేశమునఁ దడుపుచు 'విశాల' యనుపేరఁ బ్రవహించెను.

ఇంకొకప్పుడు ఉద్దాలకుఁ డనుమహర్షి యజ్ఞముచేయుచు మునీంద్రులకుఁ జేతోమోదము కలిగించుకొఱ కామెఁ బ్రార్థింప సరస్వతివిచ్చేసి వల్కలాజినధారు లగు మునివరుల కోరికచొప్పున 'మనోరమ' యనుపేర నటఁ బ్రవహించెను.

తదుపరి, కురుక్షేత్రమున కురువు చేయు యాగవేళఁ బ్రత్యక్షమై సరస్వతి 'సురేణువు' లేక 'సురతన్వ' అనుపేరఁ బ్రవహించెను.

మఱియొకప్పుడు వసిష్ఠమహర్షి చేయు యజ్ఞమునకుఁ బిలువఁబడి సరస్వతి 'ఓఘవతి' లేక 'ఓఘమాల' యనుపేరఁ బ్రవహించెను.

ఇంకొక్కవేళఁ బరమేష్ఠి చేయు యజ్ఞవేళల విచ్చేసి సరస్వతి 'విమలోదక' 'సువేణి' యను పేళ్ళతో రెండువిధములఁ బ్రవహించెను. ఈ యేడునదులు కలిసినతావే సారస్వతతీర్థము. అదియే మంకణ మహర్షి యేర్పఱచుకొన్న ఆశ్రమోపాంతప్రదేశము.

## మంకణునిమహిమ

మంకణమహర్షి యస్ఖలితవీర్యుఁడై కౌమార బ్రహ్మచర్యమున నుండఁగా నొకనాఁడు సరస్వతీనదిలో స్నానము చేయుచుండఁగా

సమీపమున నొకయప్సరస అతిమనోహరదేహసౌందర్యము దిశలఁ బ్రకాశింప దిగంబరయై కానవచ్చెను. ఆమెను జూడఁగనే మంకణునికి వీర్యస్ఖలనము గా నుండెను. మహాతపుఁ డగునాతఁడు వీర్యము నొక కలశమున విడిచి తీసికొనిపోయి కాపాడెను. ఆ కలశమున నా వీర్య మేడు శకలము లయ్యెను. క్రమముగా నందుండి వాయువేగుఁడు, వాయుబలుఁడు, వాయుఘ్నుఁడు, వాయుమండలుఁడు, వాయుజ్వాలుఁడు, వాయురేతుఁడు, వాయుచక్రుఁడు అను నేడుగురు మహర్షులు జనించిరి. వీరే తరువాత మరుద్గణములకు జనకు లయి విలసిల్లిరి. దీనితో మంకణుని మహిమ ముల్లోకముల వ్యాపించెను.*

## మంకణుని మహిమ నృత్యము

తపః ప్రవణుఁ డగుమంకణుని శరీరమున కొకప్పుడొక దర్భ గ్రుచ్చుకొనెను. దానినుండి యాశ్చర్యకరముగా శాకరసము స్రవింపఁ దొడఁగెను. అది చూచి యాతఁడు మిగుల సంతోషించి తన తపము మిక్కిలి శక్తివంత మైనదని యానందాతిరేకమున గంతులు వేయుచు నృత్యము చేయఁ దొడఁగెను. ఆతనితోపాటు జంగమస్థావరము లన్నియు నొక్క పెట్టున ముగ్ధమై నృత్యముచేయ మొదలిడెను. దానితో గొప్పకోలాహలము బయలుదేఱెను. తెగతెంపు లేని యీ మహర్షినృత్యము, దాని ననుసరించిన యావజ్జంగమస్థావర కోటినృత్యము కారణముగా లోకములు తల్లడిల్లఁజొచ్చెను. దేవతలు గజగజలాడిరి. అపుడు బ్రహ్మాదులు మహర్షులఁ దీసికొని మహాదేవుఁ డగుశివుని దర్శించి యీ మహర్షి నృత్యము నాతనివెంట సకలస్థావర జంగమనృత్యము, దానివలనఁ గలిగిన లోకోపద్రవము విన్నవించుకొని యీనృత్య మాఁగిననే కాని లోకమున స్తిమిత ముండదని ఘోషించిరి.

మహేశ్వరుఁడు వారి కభయ మిచ్చి వెంటనే మంకణుఁడు తపము చేయుప్రదేశమునకు విచ్చేసి దేవహితముఁగోరి "మహాత్మా! తపః

* భారతము అరణ్యపర్వము, శల్యపర్వము.

ప్రధానజీవనుఁడగు నీ కీనృత్య మేల? నీ వింతహర్షభరితుఁడ వగుటకుఁ గారణమేమి"? యని యడిగెను. "మహాత్మా! నాచేతినుండి శాక రసము స్రవించినది. అదియే నానృత్యమునకుఁ గారణ" మని మంకణుఁడు బదులు చెప్పెను. వెంటనే మహేశ్వరుఁడు "ఇది యెంతటి విశేషము? తపము లిట్టివే? చాలు నర్తనము మాను" మని యా ముని యంగుష్ఠమును తన వ్రేలితో గీఱెను, ఆ గాయమునుండి మంచువు మించిన బూడిద రాలెను. తత్క్షణము మంకణుఁడు మహేశ్వరుని పాద ములపై వ్రాలి తనతపోగర్వ మణఁగిన దనియుఁ దన్ను క్షమించి తనకుఁ దపః పతనము కలుగకుండఁ జేయు మని–

"దైవమెల్లఁ దలఁప నీవ సమస్తజ
గంబులకును నేడుగడయు నీవ
కర్మఫలదుఁడవును గర్మప్రదుండవు
నీవ కరుణ నన్నుఁగావు మభవ!"

భార. శల్య. ౨ ఆ. ౧౬౨.

అని మఱిమఱి ప్రార్థించెను.

అంత శివుఁడు ప్రసన్నుఁడై మంకణుని తపఃప్రభావ మక్షీణ మగు నట్లు తాను సప్తసారస్వతమున నిలిచి దానిని సేవించువారి కిహపరము లిచ్చెదనని వరమిచ్చి చనెను. అంతట మంకణ మహర్షి నృత్యము మానెను. ఆతనితో స్థావరజంగమ ప్రకృతి యంతయు నృత్యము మానెను. జగముల సంక్షోభము శాంతించెను.*

## మంకణుని కుమారునికథ

మంకణమహర్షి పరమగుణోత్తరుఁడయి కాలక్రమమున నొక కన్యం బెండ్లాడి గృహస్థధర్మముల ననుపమానముగా జరిపి యొక

* భారతము. పద్మపురాణము అదిఖండము.

సుపుత్రుని గాంచెను. అతఁడు ఆకథుఁ డనుపేరఁ బెరిగి యుక్త వయస్కుఁ డయ్యెను.

ఆకథుఁడు వయసు గన్నంతనే సుశోభన యనుకన్యామణిని గాంతగా గ్రహించి తపోజీవనము గృహస్థజీవనము సమ్మిళిత మొనర్చి కపోతవృత్తిని జీవించుచుండెను. ఆ పుణ్యదంపతులకు యదృచ్ఛా లాభసంతుష్టి న్యాయపథ గమనము రెండే సంసారమున ముక్తిసాధనము లయ్యెను. అన్యాయ మార్గమున లభించినది మేరువంత బంగారమైనను వారు ముట్టరైరి.

ఒకప్పుడు న్యాయమార్గమున నా దంపతుల కన్నము దొరకదాయెను. అందుచే వారైదుదినము లుపవసించిరి. ఆఱవ నాఁడించుక యన్నము వారికి లభించెను. అదియే పదివే లనుకొని ఆకథుఁ డా యన్నమును దేవతార్చన మైనపిదప రెండుభాగములుచేసెను. సుశోభన పతి కాకు వైచి యందులో సగ మన్నమును వడ్డించి యారగింపు మనువేళకు "అమ్మా! అతిథిని" అను కేక వారికి వినఁబడెను. ఆకథుఁడు వెంటనే లేచి ద్వారముకడ కరిగి అతిథి నతిగౌరవమునఁ దీసికొనివచ్చి తనకయి వడ్డించుకొన్న యాకునఁ గూర్చుండఁబెట్టి యాతని చేత నాపోశన వడ్డించెను. ఆ యతిథి ఆ యన్న మారగించి యా దంపతుల నాశీర్వదించి వెడలెను.

ఇంతలో నింకొక యతిథి యంగవికలుఁడయ్యు ననుపమతేజస్వియై వచ్చి యాఁకలి గొన్నవాఁడ; నన్న మిడుఁ డని ప్రార్థించెను. ఆకథుఁడు వెంటనే లోని కరిగి తన కాంతను బిల్చి "కాంతా! మిగిలిన సగ మన్నము రెండుభాగములు చేసి యొకభాగ మతిథి కిడి రెండవ భాగమును నీవు తిని ప్రాణములు నిలుపుకొను" మని పలికెను. అంత నాసాధ్వి "నాథా! ప్రాణబంధువైన అతిథిని, ప్రాణాధిపుఁడైన పతిని విడిచి నేను తిందునా? మీ యుభయులకు వడ్డించెదను. కుడువుండు. అది పతివ్రతనగు నా ధర్మము!

"తాను జేసిన ధర్మంబె తన్నుఁ గావ
వలయుఁగాని మఱొక్కఁ డెవ్వఁడును రాఁడు
కంఠమునఁ జుట్టి పాశంబుఁ గాలభటులు
కనికరము లేక లాగెడి కాలమందు"

పద్మ. పాతాళ. ౨౨౪౫

అని పలికెను.

అతఁడా పలుకుల కానందించి "గృహస్థ ధర్మమతిథి పూజ. కావున, ముందు మన మతిథికిఁ గడుపునిండఁ బెట్టి తద్భుక్తశేషాన్న మేమైన నున్నచో మనసంగతి చూచుకొందము. నీవు సర్వము సిద్ధము చేయు" మని భార్య కాదేశించి యతిథిని లోనికిఁ గొనివచ్చి పీఁట వేసి కూర్చుండఁ బెట్టఁగా నామె పాత్ర యుంచి యం దన్న మంతయు వడ్డించి భుజింపఁ బ్రార్థించెను. ఆ దంపతుల యతిథిపూజావిధానమున కత్యంత మలరి యా యతిథి శివుఁడై నిలిచెను. ఆ దంపతు లాతని పాదములఁ బడి యాతని పదపంకజభక్తి నిమ్మని ప్రార్థించిరి. శివుఁడు వారి కా వర మనుగ్రహించి యదృశ్యుఁడయ్యెను.*

---

* పద్మపురాణము, పాతాళఖండము.

# మహర్షుల చరిత్రలు

## మృగశృంగ మహర్షి

### (వత్సమహర్షి)

#### వత్సుని జననము

తొల్లి కృతయుగమున రథంతరకల్పమందు కుత్సుఁడను విప్రోత్తముఁడు విరాజిలుచుండెను. వేదశాస్త్రాదివిద్యల నేర్చి యాతఁడు శాలక్రమమున కర్దమప్రజాపతికన్యకలలో నొకతెను ధర్మపత్నిగాఁ బరిగ్రహించి గార్హస్థ్యధర్మముల నద్వితీయముగా నడపించుచుండెను. ఇట్లుండ నా మహనీయుని దయవలన గర్భము ధరించి యాతనిపత్ని నవమాసములు నిండినంత నొకసుపుత్రుని గాంచెను. ఆతనికి వత్సుఁ డను పేరిడి తల్లిదండ్రులు పెంచిరి. ఆతఁడు యుక్తవయస్సు గన్నంతనే ఉపనయన మొనరించి కుత్సుఁడు బ్రహ్మచర్యాశ్రమమును నడప నాతని నియోగించెను.

#### వత్సునితపశ్చర్య

వత్సుఁడు బ్రహ్మచర్యాశ్రమధర్మముల నతిశ్రద్ధాభక్తుల నిర్వహించుచు దైవికముగా నొకనాఁడు కావేరీతీరమునకు వచ్చెను. సముద్రముఁ జేరునదులలో ఉదగ్వాహినులు పశ్చిమవాహినులు ప్రశస్తము లనియు, అవి పవిత్రముచేయు భూభాగములు నివాసయోగ్యము లనియు నెఱింగినకారణమున, పశ్చిమముఖముగాఁ బ్రవహించుకావేరీ పవిత్రతీరమున నాతఁడు నివసింపఁ దొడఁగెను. అతఁ డట నుండి శాస్త్రవిధుల ననుసరించి స్నానజప తపోధ్యానపరాయణుఁడై మూఁడు మాసము లుండి తత్త్వజ్ఞానసంపన్నుఁ డై నంత మనుష్యమును విడనాడి బయలుదేఱి పోయి సహ్యజానది కుత్తరభాగమునఁ గలనారాయణాద్రియందు నివాస మేర్పఱుచుకొని తపశ్చర్యకుఁ గడంగెను.

## వత్సునకు మృగశృంగుఁ డనుపేరు కలిగినవిధము

నారాయణాద్రికి సమీపమునఁ గల్యాణతీర్థ మనుపవిత్ర తీర్థముండెను. ఆ తీర్థమునఁ బ్రతిదినము స్నానము చేసి యాతఁ డుగ్రతపమునకుఁ గూర్చుండి ఆత్మజ్ఞానసంపన్నుఁడై యానందమున సర్వము మఱచి సమాధి నిమాలితాక్షుఁడై యుండెను. ఇట్లు కొంతకాల మగుసరి కాతనికి దేహస్మృతియే పోయెను. ఆతనిశరీర మొండుకట్టెవలె నిలిచియుండెను. ఆ ప్రాంతమున విహరించు లేళ్ళు ఆ తీర్థమునందలి నీళ్ళు త్రాగి తమశృంగములచే మ్రోడువలె నున్న ఋషిశరీరమును రాయుచుండెడివి. ఆ మహనీయున కిది తెలియనే తెలియదు. ఇట్లను దినము మృగశృంగముల రాపుడుపడుచున్నను తెలియనిస్థితిలో నాతఁడు పెక్కేండ్లుండెను. సమీపమునఁ గల ఋషు లీచిత్రముఁ జూచి యాతనికి మృగశృంగుఁ డనుపే రిడిరి.

## వత్సునకు విష్ణువు ప్రత్యక్ష మగుట

ఇట్లనేకవత్సరములు గడచినపిదప వత్సునితపమునకు మెచ్చి విష్ణుమూర్తి వచ్చి యాతనిసహస్రార మంటఁగనే వత్సుఁడు కన్నులు తెఱచి యెదుటఁ బ్రత్యక్షమైననారాయణునికి భయభక్తి శ్రద్ధావినయవిధేయతలతో సాష్టాంగనమస్కార మొనరించి, ఆనందవిశేషమున నొడలంతయు గగుర్పొడువ ఆనందబాష్పములు జలజల రాలఁ గడుభక్తితో నాతని నిట్లు స్తుతించెను. "దేవాదిదేవా! ధర్మసంస్థాపనార్థము నీవు భూమి నవతరించుచుందువు. విశ్వసృష్టిస్థితిలయములు నీచేతిలోనివి. ఒక్కఁడ వయ్యుఁ బెక్కురూపములఁ జెలువారు చిత్స్వరూపుఁడవు. నీవు అణువుకంటె నణువవు; మహత్తుకంటె మహత్తువు. అమేయుఁడవు. నిర్వికారుఁడవు. నిర్గుణుఁడవు. నిన్ను నేను శరణుచొచ్చెదను. నన్ను నీవు కాపాడుము."

హరి కరుణించి యాతనితో నిట్లనెను: వత్సా! నీ భక్తికి మెచ్చితిని. నీ తపశ్శక్తికి దర్శన మొసంగితిని. నీవు భవిష్యజ్జన్మమున ఋభు వనుమహర్షివై జన్మించెదవు. అది నీకుఁ గడపటిజన్మ. నేఁటివఱకు నీవు

బ్రహ్మచర్యమున ఋషుల సంతోష పెట్టితివి. అట్లే యజ్ఞములచే దేవతలను సంతానముచే పితృదేవతలను సంతోషపెట్టుము." వత్సుఁ డమితానందమంది పరమేశ్వరుని యవ్యాజవాత్సల్యమున కంజలి ఘటించి యాతని నా తీర్థమున నిలిచియుండఁ బ్రార్థించెను. శౌరి యట్లే యని యాతని ననుగ్రహించి యదృశ్యుఁ డయ్యెను.

మృగశృంగుఁ డింటి కేఁగి తలిదండ్రులకు జరిగిన సంగతి యంతయుఁ దెలియఁజెప్పి వారి నానందపఱచి వారికి సేవచేయుచుండెను. కుత్సుఁ డొకనాఁడు తనమిత్రుఁడైన ఉతథ్యునకుఁ దన పుత్రుని వృత్తాంతమును వినిపించెను. ఆతఁ డమితానంద మంది తన కూఁతురు సువృత్త యనునామె మూఁడు సంవత్సరము లట్లే మాఘ మాసస్నాన మాచరించి వ్రతము సలిపె నని వివరించి సువృత్తను వత్సున కిచ్చి వివాహముచేయ నూహించెను. కుత్సుఁ డాతనియూహ గ్రహించి తనపుత్త్రున కాతనిపుత్త్రిక నిమ్మని ప్రార్థించెను. ఉతథ్యుఁడు తప్పక యిచ్చెద నని వాక్రుచ్చెను. ఆనందాతిశయమునఁ గుత్సుఁ డింటి కేఁగి సుతుఁ డగువత్సునకు జరిగిన సంగతిఁ దెలిపెను. వత్సుఁడును దనయంగీకారమును దెలిపెను.

కాని, దైవవశమున నింతలో నొకమహావిపత్తు సంభవించెను. ఒకనాఁ డరుణోదయమున సువృత్త మువ్వురు చెలికత్తెలతోఁ గూడి కావేరీస్నాన మొనరించి తిరిగి వచ్చుచుండఁగా, నొకమదగజము పరుగు పరుగున వారిపైకి రాఁజొచ్చెను. దానిం గని యదలిపోయి పరుగెత్తుచుండఁగాఁ బ్రమాదవశమున నొక పాడునూతఁ బడి సువృత్త చెలికత్తెలతోఁ గూడ మరణించెను. ఈ దుర్వార్త శరవేగమున వచ్చి కొందరు వత్సునకుఁ దెలిపిరి. వత్సుఁడు వారిని బ్రదికింతు ననియు వారిశరీరములను జాగ్రత్తగాఁ గాపాడుచుండుఁ డనియుఁ దెల్పి యా వార్త దెచ్చినవారిని బంపి తాను సహ్యజ కేఁగి యందు కంఠముదాఁక నీటిలో నిలఁబడి యేకాగ్రతతో మృత్యుదేవతనుగూర్చి జప మొనరించుచుండెను.

ఇంతలో మదగజము పరుగుపరుగున వచ్చి యా మునిని సమీపించి తనతొండముతో నాతని నెత్తుకొని నెత్తి నిడుకొనెను. వత్సుఁ డద

లత తనమాఘస్నానపుణ్యము నా యేనుఁగుతొండమున ధారవోసెను. వెంటనే ఆ యేనుఁగు తనశరీరమును విడిచి దివ్యశరీరమున నాకాశమున కెగిరి తనపూర్వజన్మవృత్తాంత మాతని కెఱింగించి వెడలిపోయెను.

తనపట్టు విడువక వత్సుఁడు నీటిలోఁ దపము కొనసాగించుచు మృత్యుదేవత నిట్లు ప్రార్థించెను: "ఓసంజ్ఞాతనూభవ! క్రియాసాక్షీ! ధర్మస్వరూపా! అధర్మశాస్తా! వైవస్వత! కరాళవదన! ప్రలంబోష్ఠ! దక్షిణదిఙ్నాథా! దండధారీ! మహిషవాహనా! దీప్తాగ్నినేత్రా! సాధుప్రసన్నా! అంజనపర్వతసంకాశా! అప్రమేయా! సంయమనీ పురీశ! శమనా! యమునా సహోదరా! నాకుఁ గన్పట్టుము." ఇట్లు ప్రార్థింపఁ బ్రార్థింప యముఁడు ప్రత్యక్షమై "వత్సా! నీ తపమునకు మెచ్చితి. నీ కేమి కావలయునో కోరుకొను" మనెను. వత్సుఁడు "దేవా! చని పోయిన సువృత్త చెలికత్తెలతోఁ గూడ తిరిగి జీవించునట్లనుగ్రహింపు" మని ప్రార్థించెను. యముఁ డట్లే యగు నని వర మిచ్చి యంతర్హితుఁ డయ్యెను.

వత్సుఁడు వెంటనే బయలుదేఱి సువృత్తాదుల శరీరము లున్న కడకు వచ్చి చేరెను. అతఁడు వచ్చుసరికి వారు లేచి కూర్చుండిరి. వారిబంధువు లెల్లరు చనిపోయినవారు తిరిగివచ్చుట వింతలకెల్ల వింత యని యపరిమితానంద మందిరి. అప్పు డాకన్యకలు తాము యమలోకమున కేగి తిరిగి వచ్చుటఁ జెప్పి యమలోకమును సవిస్తరముగ వర్ణించి యెల్లరి కానందాశ్చర్యములఁ గలిగించిరి.

## మృగశృంగుని వివాహ వృత్తాంతము

పిదప, ఉతథ్యుఁడు మునీశ్వరుల నెల్లర నాహ్వానించి తనపుత్త్రి యగుసువృత్తను మృగశృంగమౌని కిచ్చి పరిణయము గావించు ప్రయత్నమున నుండఁగా, ఆమె చెలికత్తెలు మువ్వురునువచ్చి "మునీంద్రా! మేము మువ్వురమును నిన్నే భర్తగా భావించితిమి. మమ్మును నీవు పరిణయమాడ నీకు క్షేమము కలుగును. నీ వందు కంగీకరింపనియెడల మేము ప్రాణత్యాగము చేయుదు" మని మృగశృంగునితో వాక్రుచ్చిరి.

వత్సుఁ డాశ్చర్యభయవిహ్వలుఁడై యేమిచేయుట యని డోలాందోళిత మానసుఁడై యుండ వ్యాసమహర్షి విచ్చేసి యందు దోషములేని దని నల్వురను వివాహమాడి సుఖింపుమని యాదేశించి సౌభరిమహర్షి మాంధాతృచక్రవర్తి కూఁతుండ్ర నేఁబదమందిని వివాహ మాడుట, చంద్రుఁ డిరువదియేడ్గురను పెండ్లిచేసికొనుటయు నుదాహ రించెను. వత్సుఁ డాతని పాదములకు మ్రొక్కి యానల్వురు కన్యకా మణులను వేదోక్తవిధిని వివాహమాడెను.

అనంతరము మృగశృంగుఁడు నలువురు భార్యలను దీసికొనిపోయి యాశ్రమము నిర్మించుకొని యందు వారితో గార్హస్థ్యధర్మము లాచ రించుచు వారితో నిష్టోప భోగము లనుభవించుచుండెను.

## మృగశృంగుని సంతానము

ఇట్లు కొంతకాల మగుసరికి మృగశృంగుని కృపవలన గర్భము ధరించి సువృత్త నవమాసములు నిండినపిదప నొక్కపుత్త్రు నిం గాంచెను. భూతభవిష్యద్వర్తమానవేది యగు మృగశృంగుఁడు తపో నిష్ఠాగరిష్ఠుఁడై యుండు నా బాలుని దేహంబును మృగములు రాచుకొను ననెడియర్థము సూచితముగా నాతనికి మృకండుఁ డని నామకరణము చేసెను.

ఇదేవిధముగా మృగశృంగమహర్షి దయవలన కమల విమల. సురస యనుమిగిలినముగ్వురు పత్నులును గర్భములుదాల్చి కాలక్రమ మున మువ్వురు సుతులను గాంచిరి. వారిలో కమలకు జనించిన కొమరుఁడు ఉత్తముఁ డనియు, విమలకు జనించిన పుత్రుఁడు సుమతి యనియు, సురసకుఁ గలిగినకొడుకు సువ్రతుఁడనియు నన్వర్థ నామ ధేయముల ధరించిరి.

కొంతకాల మైనపిదప యుక్తవయస్సు రాఁగానే మృకండుమౌని ముద్గలమహర్షికూఁతు రగు మరుద్వతిని బెండ్లాడి తపోగృహస్థజీవనము గడప నారంభించెను. ఉత్తముఁడు కణ్వముని పుత్రిక యగుకుశను,

సుమతి సుమతి యనుమునికూఁతురగు సత్యను, సువ్రతుఁడు వృథు పుత్త్రిక యగు, ప్రియంవదను బరిణయమాడి గృహస్థులైరి.

## మృగశృంగుఁడు మోక్షమందుట

మృగశృంగమహర్షి యట్లు పుత్త్రస్నుషా సహితుఁడై సకల సౌఖ్యము లనుభవించి మాఘమాసములం దుషఃస్నానములంజేయుచుఁ దపోవ్రతమును నడపెను. ఆ పిదప విరక్తి జనింప నాతఁ డెల్లరను విడిచి తపోవనమున కేఁగి సర్వభూతములను ఆత్మసామ్యమునం గనుచు మృగములతోఁ గలిసి నిర్భయముగఁ జరించుచుఁ బరమశాంతి యుతుఁడై కాలము గడపెను.

అంత్యకాలమున మృగశృంగమహర్షి ఆశ్రమమునఁ దనశరీర మును ద్యజించి బ్రహ్మపదమును గాంచి ప్రళయకాలము వఱకు సుఖ ముగా నుండి యా పిదప శ్వేతవరాహకల్పమున అజపుత్రుఁడుగ ఋభు వనుపేర భూలోకమున జనించి నిదాఘుఁ డనువాని నుద్ధరించి తుదకు మోక్షసామ్రాజ్యమును జూఱగొనెను.

ఆపిమ్మట మృకండుఁడు తనకు సంతానము కలుగని కారణమునఁ దల్లులతోడను భార్యతోడను బయలుదేఱి విశ్వేశ్వర రాజధాని యగు కాశీపట్టణమును జేరి గంగాస్నానాదికృత్యములను యథావిధిగ నొనర్చి ఢుంఠివిఘ్నేశ్వరునిముందుఁ దనపేర శివలింగమును బ్రతిష్ఠించెను. దానిముందు సువృత్త సువృత్తేశ్వరలింగమును, దానికిఁ దూర్పు దెసను కమల కమలేశ్వరలింగమును, విమల విమలేశ్వరలింగమును. సురస సురసేశ్వరలింగమును, మరుద్వతి మణికర్ణికకుఁ బడమటి దిక్కుగా మరుద్వతీశ్వరలింగమును బ్రతిష్ఠాపించిరి.

మృకండీశ్వరుని దర్శించుటవలన సర్వకార్యసిద్ధి, కాశీవాసమును; సువృత్తేశ్వరుని దర్శించుటవలన సద్వృత్తి, నిర్విఘ్నతయును; కమ లేశ్వరదర్శనమున సర్వకామసిద్ధియు; విమలేశ్వరదర్శనమున విమలజ్ఞాన ప్రాప్తియు; సురసేశ్వర దర్శనమున సుర సామ్రాజ్యలాభమును కాశీ

మృతియు; మరుద్వతీశ్వర దర్శనమునఁ బునర్జన్మరాహిత్యము సిద్ధించును.

అట్లు కాశిని సేవించి మృకండుమాతలు వృద్ధ లగుటమణికర్ణికా తీర్థమున మాధ్యాహ్నికస్నానము లాచరించి శ్రీవిశ్వేశ్వరాలయమున కేగి ప్రదక్షిణము లొనర్చుచుఁ గన్నులు తిరుగ నేలపైఁ బడిపోయిరి. అపుడు విశ్వేశ్వరుఁడు వారికర్ణములఁ బ్రణవమంత్రమును జపింపఁగా వారు తనువులు వీడి కైలాసమున కేగిరి.

మృకండుఁడు మాతలకు శ్రద్ధాభక్తులతో నూర్ధ్వదైహికక్రియ లాచరించి తన భార్యతో నచ్చటనే యుండిపోయెను. అట నాతఁడు దినదినము గంగాస్నానము, విశ్వేశ్వరసేవ యొనరించుచుండ కాశీశున కాతనిపైఁ గరుణగలిగి వలసినవర మొక్కటి కోరుకొమ్మనెను. అతఁడు విశ్వేశ్వరునకు మ్రొక్కి యొక్క పుత్రు నిమ్మని ప్రార్థించెను. అంత శివుఁడు షోడశవర్షములు మాత్రమే బ్రదుకు సత్పుత్రుఁడు కావలయునా లేక చిరకాలజీవియగు దుష్పుత్రుఁడు కావలయునా యని యడిగెను. మృకండుఁ డప్పుడు షోడశసంవత్సరజీవి యైనను సత్పుత్రుఁడే కావ లయు నని కోరుకొనెను. విశ్వనాథుఁ డాతనికిఁ గోరిన వర మిచ్చి యదృశ్యుఁ డయ్యెను.

తరువాత మరుద్వతి మృకండుని కతమున గర్భముధరించి నవ మాసములు నోసి యొక్కపుత్రునిం గనియెను. అతఁడే మార్కండేయ మహర్షి. ఈతఁడు తరువాత మృత్యువును జయించి సర్వలోకారాధ్యుఁడు చిరంజీవి యయ్యెను. ఈ విధముగ జగద్విఖ్యాతి గాంచిన మార్కం డేయమహర్షి మృగశృంగమహర్షి పౌత్రుఁడు.

# మహర్షుల చరిత్రలు

## వ్యాఘ్రపాదమహర్షి

పూర్వము కృతయుగమున మహాతపశ్శాలియు, వేద వేదాంగ విదుఁడును, ధర్మప్రవచనదక్షుఁడు నగునొక మహాముని యుండెను. అతఁడు కామక్రోధమదమాత్సర్యాదు లనుజంతువులయెడ భయంకర వ్యాఘ్రమువలెఁ జరించువాఁడు. అందుచే నాతనికి వ్యాఘ్రుఁ డను పేరు కలిగెను. అంతేకాక, ఆతనిపాదములు వ్యాఘ్రపాదములవలె నుండుటచేత నాతఁడు వ్యాఘ్రపాదుఁ డనియుఁ బేరందెను.

### వి వా హ ము

వ్యాఘ్రపాదుఁడు యుక్తవయస్సు రాఁగానే తపశ్శూరుఁడు, అధ్యయనశీలుఁడు, శమదమాదిగుణాన్వితుఁడు నయి యొకమునికన్యకను వివాహమాడి గృహస్థధర్మములను నిర్వర్తింపఁ గడంగెను. గృహస్థాశ్రమమున నాతఁడు యజనయాజనాధ్యయనాధ్యాపనముల తోడను, అప్రతిగ్రహవ్రత పాలనముతోడను కాలము గడపుచుండెను.

### స ం తా న ము

ఇట్లుండ నాతని ధర్మపత్ని యాతనిదయకుఁ బాత్రురాలై తొలిచూలున ఉపమన్యు వను కుమారుని, మలిచూలున ధౌమ్యుఁ డనుకుమారుని గాంచి వారి నల్లారుముద్దుగాఁ బెంచుకొనుచుండెను. వారు బాల్యముననే తల్లి యనుమతిం గొని పరమేశ్వరుని గుఱించి ఘోరతప మొనరించి యాతనిం బ్రత్యక్షము చేసికొనిరి. పరమశివు కరుణ వడసి ఉపమన్యువు మహాజ్ఞాని మహాయోగి యయ్యెను. ధౌమ్యుఁడు మహర్షియై పాండవ పురోహితుఁ డయ్యెను.

## వ్యాఘ్రపాదుఁడు కాశీవిశ్వేశ్వరుని కరుణవడయుట

ఒకప్పుడు వ్యాఘ్రపాదుఁడు కాశికాపట్టణముఁ జేరి విశ్వేశ్వరుని సందర్శించి నిరుపమాన మగుభక్తితో నిట్లు స్తుతించెను:

"గంగాతరంగ కమనీయ జటాకలాపం
గౌరీ నిరంతర విభూషిత వామభాగమ్,
నారాయణప్రియ మనంగ మదాపహారం
వారాణసీ పురపతిం భజ విశ్వనాథమ్.

వాచామగోచర మమేయ గుణస్వరూపం
వాగీశవిష్ణు సురసేవిత పాదపీఠమ్,
వామేన విగ్రహవరేణ కళత్రవంతం
వారాణసీపురపతిం భజ విశ్వనాథమ్.

రాగాదిదోషరహితం సుగుణానురాగం
వైరాగ్య శాంతినిలయం గిరిజా సహాయమ్,
మాధుర్యధైర్య నిలయం గరళాభిరామం
వారాణసీ పురపతిం భజ విశ్వనాథమ్.

తేజోమయం సకలనిష్కళ మద్వితీయం
ఆనందకంద మపరాజిత మప్రమేయమ్,
నానాత్మకం సగుణనిర్గుణ మాదిదేవం
వారాణసీపురపతిం భజ విశ్వనాథమ్.

భూతాధిపం భుజగపుంగవ భూషితాంగం
వ్యాఘ్రాజినాంబరధరం జటిలం త్రినేత్రమ్,
పాశాంకుశాభయ వరప్రద శూలపాణిం
వారాణసీపురపతిం భజ విశ్వనాథమ్.

ఆశాం విహాయ పరిహృత్య పరస్వనిందాం
పాపే రతిం చ వినివార్య మనస్సమాధౌ,
ఆధార హృత్కమలమధ్య గతం పరేశం
వారాణసీపురపతిం భజ విశ్వనాథమ్.

శీతాంశుశోభిత కిరీట విరాజమానం
ఫాలేక్షణానల వినాశిత పంచబాణమ్,
నాగాధిపారచిత భాసుర కర్ణ పూరం
వారాణసీపురపతిం భజ విశ్వనాథమ్.

పంచాననం దురితమత్తమతంగజానాం
నాగాంతకం దనుజపుంగవ పన్నగానామ్,
దావానలం మరణశోక భయాటవీనాం
వారాణసీపురపతిం భజ విశ్వనాథమ్."

[వారాణసీపురపతేః పరమేశ్వరస్య
వ్యాఘ్రోక్త మష్టక మిదం పఠతే మనుష్యః,
విద్యాశ్రియం విపులసౌఖ్య మనంతకీర్తిం
సంప్రాప్య దేహవిలయే లభతే చ మోక్షమ్.]

వ్యాఘ్రపాదుని భక్తిభరితసంస్తవమున కలరి విశ్వేశ్వరుఁ డాతనికి సాక్షాత్కరించి కోరినవరము లొసంగి యనుగ్రహించెను.

## వ్యాఘ్రపాదస్మృతి

ఒకప్పుడు మహర్షు లనేకులు వ్యాఘ్రపాదుని కడకు విచ్చేసి వేదవిదులలో నగ్రగణ్యుఁడు, హుతాగ్నిహోత్రుఁడు, సర్వశాస్త్రవిదుఁడు నగు నాతనిని "మునీంద్రా! సర్వలోకహితముఁ గోరి మాకు ధర్మసంగ్రహమును వివరింపుము" అని కోరిరి. అందులకు వారి నభినందించి "ఋషులారా! మీకు నేను యథాశక్తి సర్వముఁ దెలిపెదను. సావధానులై వినుఁడు" అని యిట్లు చెప్పఁదొడంగెను:

"ఏ యే యుగములం దే యే ధర్మము లు చెప్పఁబడినవో వాని నన్నిటిని శ్రద్ధగాఁ బరిశీలింపవలయునే కాని యా ధర్మములను గాని యా ధర్మప్రవక్తలను గాని యెంతమాత్రము నిందింపరాదు. వైశ్వదేవ మొనర్పక భుజించు బ్రాహ్మణుఁడు కాకియై పుట్టును. బ్రహ్మచారి, గృహస్థుఁడు, యతి, వానప్రస్థుఁడు - వీరికొఱకై నే నీ ధర్మశాస్త్రమును ప్రవ

చించెదను. ఎవఁడు బ్రాహ్మణుఁడై పుట్టి వేదవిద్య నాదరించి పఠింపఁడో వాఁ డాజీవితము శూద్రసముఁడే యగును. ఏబ్రాహ్మణుఁడు పితృ ప్రీతికై పిండదానము, తిలతర్పణము నొనరింపఁడో, వాఁడు శూద్రుఁడే యగును.

తూర్పుగాఁ దిరిగి కాని ఉత్తరముగాఁ దిరిగి కాని బ్రాహ్మణుఁ డాచమింపవలయును. పశ్చిమముగాఁ దిరిగి మరల నాచమించి దక్షిణ ముగాఁ దిరిగి స్నానము చేయవలయును. గోకర్ణకృతహస్తమున మాషమాత్రజలమునే అచమనమువేళఁ గైకొనవలయును. అంత కెక్కు వైనను, దక్కువైనను ఆ జలము జలముకాదు: రుధిరసమ మగును. మిక్కిలి చల్లనివి, వేఁడివి, నురుఁగులతోఁ గూడినవి కాని జలమును బ్రాహ్మణుఁడు బ్రహ్మతీర్థముగా భావించి దృష్టిపూతముఁ గావించి యాచ మింపవలయును. త్రాగఁగా మిగిలిన జలము, కాళ్ళు కడుగుకొనఁగా మిగిలిననీరు, వీని నాచమింపరాదు." శ్రాద్ధవిషయిక విధివిధానముల ననంతముగా నాతఁడు తెలిపెను. ఈధర్మము లన్నియు "వ్యాఘ్రపాద స్మృతి" యనఁ బరగుచున్నవి.

———

# మహర్షుల చరిత్రలు

## శుక్రమహర్షి

### (ఉశనసుఁడు)

### జననము

భృగుమహర్షి నవబ్రహ్మలలో నొకఁడై మహోత్తమ వంశమూల పురుషుఁడై ప్రఖ్యాతినందెను. అతఁడు కర్దమప్రజాపతి కూఁతు రగు ఖ్యాతి యనునామెను బెండ్లాడి ధాత, విధాత యను నిరువురుకుమారులను శ్రీ యనుకూఁతును గనెను. అతఁడు పులోమ యనునామెను బెండ్లాడి చ్యవనమహర్షిని గాంచెను. ఉశన యను నామెను బెండ్లాడి యామె కొక కుమారుని బ్రసాదించెను. ఇతఁడే ఉశనసుఁడు. ఈతనికి శుక్రుఁ డను పేరు తరువాత కలిగెను.

ఉశనసుఁడు బాల్యమునుండియు సర్వవిద్యలును సంపాదించి మహాతపస్సు చేసి "మృతసంజీవని" (చచ్చినవారిని బ్రదికించునది) అను గొప్పవిద్యను సంపాదించెను. ఈ లోకోత్తరశక్తివలన ఉశనసుఁడు మహావిఖ్యాతి నార్జించెను.

### శుక్రుఁ డను పేరు వచ్చినవిధము

ఉశనసుఁడు తపోబలముచేతను యోగబలముచేతను సర్వశక్తులు సంపాదించి విఱ్ఱవీఁగుచుండెను. ఒకప్పు డాతఁడు ధనార్థియై కుబేరుని కడ కేగి యాతని నవలీలగా మోసపుచ్చి యాతనిధననిక్షేపముల నపహరించెను. కుబేరుఁడు చేయునది లేక యీశ్వరునికడ కేగి యాతనితో మొఱపెట్టుకొనెను. తనభక్తునకు ద్రోహము చేసినభార్గవవంశజుఁ డగు ఉశనసునిపైఁ గోపించి యీశ్వరుఁడు శూలమెత్తి యా దుర్మార్గుఁ డెచట నున్నాఁ డని ప్రళయగర్జ చేసెను. అది విని ఉశనసుఁడు గడగడలాడి పోయి పోయిపోయి మాఱుమూలల సందుగొందుల తుప్పలలో దూఱి

యుండి యందు నక్కియున్నను దనకు శివకోపమునఁ జావు తప్పదని భయపడిపోయి శరవేగమున శివునికడకే చేరి యాతనిహస్తమునఁ బ్రవేశించెను. ఉగ్రమూర్తి యగుశివుఁడు ఉశనసునిఁ జూచి కోపముతో మ్రింగివేసెను. శివునికడుపులో నుండి యిటునటు తిరుగుచు బయటఁ బడఁ దలఁచిన ఉశనసుని తలంపెఱింగి శివుఁడు తనదేహరంధ్రముల నన్నిఁటిని మూసివైచి తనమూత్రమార్గమును మాత్రము మూయ కుండెను. ఉశనసుఁ డిఁక గతిలేక శివునిమూత్ర ద్వారమునుండి బయట పడెను. అప్పుడును శివుఁ డాతని నింకను శిక్షింప హుంకరించెను. ఉశనసునియదృష్టవశమునఁ జెంత నున్నపార్వతి "దేవా! ఈతఁ డెట్టి వాఁడైనను నీకడుపునఁ బుట్టుటచే నాకుఁ గొడుకైనాఁడు. ఈతనితప్పు లన్నిఁటిని మన్నించి దయదలఁచి యీతనిని సుఖవంతు నొనర్పు" మని ప్రార్థించెను. ఆ సుందరీలలామవదనారవిందముఁ గనుసరికి నామె మృదుమధుర శుకాలాపములు వినుసరికి శివుని కెక్కడికోప మక్కడకుఁ బోయెను. చిలుకలకొలుకు లగు కలుకులపలుకు లెవనికోపముఁ బాపలేవు?

శివుఁ డప్పుడు ఉశనసునికి గొప్పతేజస్సు నిచ్చి పార్వతితో నిట్లనెను. "దేవీ! వీని యోగము గొప్పది. నీ దయ యీతనిపైఁ గలిగినది. నీ దయ నా దయ. నీ కోపము నా కోపము. నీప్రీతి నాప్రీతి. ఈతఁడు శుక్రరూపమున బయటపడుటచే నిఁక నీతఁడు శుక్రుఁ డనుపేరఁ బరఁగును. ఉపరిమార్గమునుండి కాక అధోమార్గమునుండి వచ్చినవాఁ డగుట నీతఁడు సన్మార్గులకుఁగాక దుర్మార్గులగు రాక్షసులకు గురువయ్యెడు" నని పలికి ఉశనసుని విడిచిపుచ్చి కుబేరుని నిధులు కుబేరునికిఁ జేర్చెను.

"సజ్జనులవలనికోపమైనను క్షేమదాయకమే. దుర్జనులవలని ప్రేమయైనను బ్రమాదహేతువే" అన్నవాక్యము ఉశనసునివట్ల ధ్రువ మయ్యెను.*

## రాక్షసగురుత్వము

కాలక్రమమున రాక్షసరాజు లెల్లరు విచ్చేసి తమకులగురువై తమ క్షేమము నరయుచుండు మని ఉశనసునిఁ బరిపరివిధములఁ బ్రార్థించిరి.

---

* భారతము : శాంతిపర్వము.

ఎట్టకేలకు, తాను దేవగురువు కాఁదలఁచియు దేవతలు తన్నుఁగాక బృహస్పతిని గురువుగా వరించియున్న కోపముకతమున, ఉశనసుఁడు రాక్షసలోకగురువుగా నుండ నంగీకరించెను. నాఁటినుండి యాతఁడు శుక్రాచార్యుఁ డని యెల్లరచేఁ బిలువఁ బడుచుండెను. అసలుపేరు మూలఁబడి యాపేరే అతనికి శాశ్వత మయ్యెను.

## శుక్రుఁడు అసురులను శపించుట

శుక్రాచార్యుని గురుత్వమహత్త్వమున హిరణ్యకశిపుఁడు డెబ్బది రెండు నియుతంబుల రెం డర్బుదంబుల యెనుబదివేల సంవత్సరములు (726160000) మూఁడులోకములను ఏకచ్ఛత్రాధిపతియై తన్నుఁ గాదనఁ గలుగువాఁడు లేక పరిపాలించెను.

తరువాతఁ జిరకాలమునకు రాక్షసులను విడిచి యజ్ఞపురుషుఁడు దేవతలకడకుఁ బోయెను. నాఁటినుండి దేవతలకు విజయము, శుభము, సౌఖ్యము పరంపరలుగాఁ గలుగుచుండెను. రాక్షసులకు పరాజయము, అశుభము, అసౌఖ్యము అవిచ్ఛిన్నముగాఁ గలుగుచువచ్చెను. మూఁడు లోకములందును పరాజయ మందిన రాక్షసులు తమకులగురు వగు శుక్రాచార్యునిఁ జేరి తమకష్టనష్టములు తెలుపుకొని రక్షింపఁ బ్రార్థించిరి. శుక్రాచార్యుఁడు వారి కభయమిచ్చి శౌరిసాయమున దేవతలు జయించుచుండి రనియుఁ దాను శివునిసాయము సంపాదించి యాతనివరముల మహత్త్వమున రాక్షసులు మరల మూఁడులోకములు నేలునట్లు చేయఁగలనని శపథముచేసి వారిని పంపివేసెను. వెంటనే తనమాటప్రకారము శుక్రుఁడు కైలాసపర్వతమున కేగి పరమశివుని భజించి "దేవదేవా! దేవతల పరాజయమునకు రాక్షసుల విజయమునకు బృహస్పతి యెఱుంగనిమంత్రరహస్యములను నాకు బోధింపు" మని ప్రార్థించెను. "భార్గవా! నీవు తలక్రిందులుగ కణధూమపానముచేయుచు వేయిసంవత్సరములు తపస్సుచేసినయెడల నీకోరిక సిద్ధించు" నని చెప్పి పొమ్మనెను.

పరమశివునియనుగ్రహ మట్లు పొంది యాతఁడు చెప్పిన చొప్పున శుక్రాచార్యుఁడు తదేకనిష్ఠాగరిష్ఠుఁడై "కణధూమవ్రత" మను గొప్ప వ్రతము నవలంబించి తలక్రిందులుగాఁ దపసుచేయ నారంభించెను.

ఇట్లుండ దేవతలు విజృంభించి యొక్కపెట్టున రాక్షసుల నుక్కడఁగింపఁ దొడంగ వారు గతి లేక శుక్రాచార్యుఁడు లేమి విచారించి యాతని తల్లియు భృగుపత్నియు నగు ఉశనకడ కేగి మొఱపెట్టుకొనిరి. ఆమె వారి కభయ మిచ్చి యాదరించెను. ఈ సంగతి విని యింద్రుఁడు దేవతలతో నామెపైకి యుద్ధమునకు వచ్చెను. ఉశన వెంటనే యోగబలమున నిద్రాదేవత నింద్రునిపైకిఁ బంపెను. ఆ కారణమున నింద్రుఁడు మోహబద్ధుఁడై కదలలేక మెదల లేక కునికిపాటులు పడుచుఁ గూర్చుండిపోయెను. దేవత లెంత యత్నించిన నాతనికి తెలివి కలుగకుండెను. అపుడు దేవతలంద ఱాలోచించి పరుగుపరుగునఁబోయి హరిని శరణుఁ జొచ్చి జరిగినసంగతి విన్నవించి కాపాడు మని ప్రార్థించిరి. హరి వారి కభయమిచ్చి వారివెంట భృగుపత్నికడ కేగి యచటఁ బడియున్న యింద్రునిఁ దనలోఁ బ్రవేశింపు మనఁగా నాతఁ డాహరియందుఁజేరి తెలివంది శుక్రమాతతో యుద్ధమునకుఁ దలపడెను. శుక్రమాతయు, భృగుపత్నియు నగు ఉశనాదేవి కన్నుల నిప్పులు గ్రక్కుచు "ఓరీ! ఇంద్రా!

"అగణితమాహాత్మ్యం డగు
భృగుమౌనికి నేను బత్ని నెవ్వనిలో గ్రము
చ్చుగ నీవు చొచ్చితివొ యా
భగవంతుని నిన్నుఁ గూడ భస్మ మొనర్తున్."

అని యా మహాసాధ్వి పలికినవెంటనే ప్రమాద మాశంకించి విష్ణువు తన చక్రమున నామెతల నఱికెను. భృగుపత్నిశిరము వెంటనే నేలఁబడెను. ఇంద్రుఁడు ఉపేంద్రుఁడు వెడలిపోయిరి.

ఆ సమయముననే భృగుమహర్షి యాశ్రమమునకు వచ్చెను. రాఁగానే యాతనికి నేలపైఁ దలతెగి పడియున్నపత్ని గోచరించెను. దివ్యదృష్టి పాటించి సంగతియంతయుఁ దెలిసికొని తోకఁద్రొక్కిన త్రాచువలె లేచి "ధర్మ మెఱిఁగియుఁ దరుణిని జంపినదోషమునకు విష్ణువు భూమిపై నేడుమారులు నరుఁడై పుట్టుఁగాక" యని శపించి భృగుమహర్షి భార్య తలతీసి మొండెముకడ నుంచి యతికి "నేను ధర్మస్థిరు

డనే యైనచో నాపతి తక్షణమే బ్రదుకుఁగాక!" యని పలికినంతనే దివ్యసాధ్వియై యా మహాసాధ్వి లేచి నిలిచి భర్తకు మ్రొక్కెను.

ఈ సంగతి తెలిసి యింద్రుఁడు భయపడిపోయి శుక్రాచార్యుఁడు తపమున శివుని మెప్పించి వచ్చినచో నింకను గొంపమునుఁగు నని యెంచి యాతనితపోభంగ మొనరింప నిశ్చయించెను. చక్కని చుక్కయు, సర్వశుభలక్షణయు నగు జయంతి యను తనకూఁతును బిలిచి శుక్రాచార్యుని కుపచారములు చేసి యెట్టైన నాతనిని వలలో వేసికొమ్మని నియోగించెను.

జయంతి తండ్రియాజ్ఞ నౌదలధరించి పోయి శుక్రాచార్యునికిఁ బరిచర్యలు చేయుచుండెను. ఆతఁడు కోరకున్నను దనపాణిపద్మము లచే నాతని పదపద్మము లొత్తుచుండెను. తపోగ్ని మధ్యమున ముచ్చె మటలు పోసినపు డాతనిస్వేద మామె తనమనోహర చీనిచీనాంబరముచేఁ దుడుచుచుండెను. అతఁడు కనువిప్పినవేళఁ దనకడకంటి చూడ్కు లాతనిపై గ్రుమ్మరించెడిది. అగ్నిహోత్రము కూర్చుచు, పూలు కోసి కొని వచ్చియిచ్చుచు, పైఁటకొంగుతో విసరుచు, ఆ యిందువదన మంద గమనముఁ జూపుచు నాతని వశపఱచుకొనునెడరు వేచియుండెను. కాని, వ్రతనిష్ఠాగరిష్ఠుఁడై యాతఁడు వేయిసంవత్సరములు నచంచలుఁడై గడపెను.

శుక్రునిమహానిష్ఠకు సంతసించి శివుఁడు ప్రత్యక్షమై "భార్గవా! ఇంతవఱకు ఈ 'కణధూమవ్రత' మాచరించి తుదనెగ్గిన వాఁడెవ్వఁడును లేఁడు. నీ విందు నెగ్గుటచే నీకోరినకోరిక తీరుటయే కాక నిన్ను జయించు వాఁడే యెవఁడు నుండఁడు. ధనము, ప్రజ, విజయము, నిన్ను వరింప నీవు మహానుభావుఁడ వయ్యెద" వని వరము లిచ్చి యదృశ్యుఁ డయ్యెను.

పిదప శుక్రాచార్యుఁడు తనకు నిరుపమాన మగుసేవ యొనరించిన జయంతిని ముద్దులుమూటఁగట్టునవయౌవనవిరాజితను గాంచి "తరుణీ! నీ వేకోరికఁ గోరి న న్నర్చించితివో నీ కా కోరిక సిద్ధింపఁజేసెదను. చెప్పు"

మని యడిగెను. "దేవా! నిన్ను భర్తగ వరించి యీసేవలు చేసితిని. పదివేలసంవత్సరములు నీవు నాతో సుఖించువర'' మిమ్మని ప్రార్థించెను. శుక్రుఁ డందుల కంగీకరించి యామెకొక మనోహరకేళిగృహము నిర్మించి యొరు లెవ్వరికిని గానరానివిధమున నామెతోఁ గామసుఖము ననుభ వించుచుఁ బదివేలసంవత్సరము లుండిపోయెను.

ఈలోఁగా శుక్రుఁ డెంతటికిని దిరిగిరాకపోవుటకుఁ గారణ మెఱుంగక రాక్షసు లందఱు ధైర్యహీనులై తేజోహీనులగుచుండిరి. వారి నింకను జెఱుప నిదే సమయమని యెంచి బృహస్పతి శుక్రవేషమును ధరించి రాక్షసులకడకు వచ్చిచేరెను. అతఁడు నిజముగఁ దమగురువే యనుకొని రాక్షసు లపరిమితానందమున నాతనిని స్వీకరించి కులగురువుగాఁ బూజించుచుండఁగా వేయిసంవత్సరములు గడచెను. అప్పటికి శుక్రుఁడు జయంతికిఁ గామసంతృప్తి పరిపూర్ణముగా నొసంగి యామెవలన నలువురుకుమారులను, ఒక కొమార్తెను గాంచెను. చండుఁడు, అమర్కుఁడు, త్వష్ట, ధరాత్రుఁడు అను నలువురుకొడుకులను, దేవయాని యనుకూఁతును దీసికొని జయంతిని బంపివేసి శుక్రుఁడు రాక్షసనగరమునకు విచ్చేసి తనయాగమనవార్త శిష్యులకుఁ దెలిపెను. ఎవ్వరును వచ్చి యాతనిని గౌరవింపరైరి. ఇదేమని యాతఁడు రాక్షససభ కేగి చూడ నచట శుక్రవేషమున నున్నబృహస్పతి కనిపించెను. శుక్రుఁ డాతనిమోసమును గ్రహించి కోపముతో "ఓరీ! నేను లేని సమయముఁ గనిపెట్టి నా శిష్యుల నిటులు మోసగింతువా? వారు నిన్ను గుర్తెఱిఁగినతక్షణము నిన్నుఁ జీలికలు వాలికలు చేయుదురు. ఆసనము దిగి వెంటనే పొ"మ్మని హుంకరించెను. బృహస్పతి యాతనిం జూచి "ఓరీ! ఇదివఱకు ధనతస్కరులనే మే మెఱుఁగుదుము కాని రూపతస్కరుల నెఱుంగము. ఇపుడు నిన్నుఁ జూచితిమి. చాలు. నిన్ను నమ్మువా రెవరును లేరు. పొ''మ్మని చెప్పెను. అపుడు నిజమైనశుక్రుఁడు రాక్షసుల నుద్దేశించి జరిగినమోస మంతయు వివరించి చెప్పెను. కాని వా రందఱు దొంగశుక్రుని నిజమైనశుక్రునిగాఁ దలఁచినవా రగుట నీతని మాటలను బాటింపరైరి. అంతేకాదు. బృహస్పతిమాటలను బట్టి యాతని మెడపట్టి గెంటివేసిరి.

ఇట్లు శుక్రాచార్యుఁడు నిజశిష్యులచేతనే ఘోరావమానమునకుఁ బాల్పడి రాక్షసవంశములు నాశనము అగుఁగాక యని శపించి తనబిడ్డలతోఁ దపోవనమునకు వెడలిపోయెను. "పిల్లి శాపమునకు ఉట్లు తెగి క్రిందఁ బడునా? దొంగవాఁడు కపట నాటకమాడి మనలను శపించిన, ఆ శాపము మనకు సోఁకునా?" యని బృహస్పతి రాక్షసులకు నమ్మఁ బలికి వారిని విజయవంతముగా మోసగించెను.

రాక్షసులకు వైదికమతవిశ్వాసముఁ బోఁగొట్టినఁగాని వారు శాశ్వతముగా నాశము కా రని యెంచి యిదే యదనుకొని బృహస్పతి రాక్షసు లందఱఁ బిలిచి వేదబాహ్య మగు అర్హత మతమును వారికిఁ జక్కఁగా బోధించి వారి కది బాగుగా నొంటఁబట్టినపిమ్మట వారి నందఱను యమునాతీరమునకుఁ గొనిపోయి స్నాతులఁ జేయించి అర్హమత వేషముల ధరింపఁజేసి "అర్హతాయ నమో" అన్న మంత్ర ముపదేశించి వారిని వేదబాహ్యులను, కర్మభ్రష్టులను పరిపూర్ణముగా నొనరించి రహస్యముగా దేవలోకమునకుఁ బోయెను. దేవతలు వెంటనే యుద్ధము ప్రకటించి రాక్షసులను ముప్పుతిప్పలఁబెట్టి మూఁడుచెఱువులనీళ్ళు త్రాగించి తుక్కుతుక్కుగ నుక్కడఁగించిరి. అప్పటికి వారికి జరిగిన మోస మంతయుఁ దెలియవచ్చెను. చేతులు కాలినపిదప నాకులు పట్టిన నేమిలాభము?

రాక్షసు లందఱును శుక్రాచార్యుని వెదకికొనుచుఁ బోయిపోయి తుద కాతనిఁ గాంచి పాదములఁ బడి తమ్ము క్షమించి పురికి విచ్చేయుమని ప్రార్థించిరి. ఆతఁడు వారిని గంటనైనఁ గనక, మాటయైన మాటాడక గర్హించి పాఱఁదోలెను. "ఉభయ భ్రష్టత, ఉపరి సన్న్యాసము" అన్ననానుడి రాక్షసులకుఁ బూర్తిగా వర్తించెను. అపుడు వారు గోలుగోలున నేడ్చుచుఁ దాము పడ్డ మోసమునకుఁ జేసినమోసమునకు లెంపలు వైచుకొని పశ్చాత్తాపపడి ప్రహ్లాదునికడ కేగి రక్షింపుమని యాతనిపాదములపైఁ బడిరి. దయార్ద్రహృదయుఁ డగు నా మహానుభావుఁడు రాక్షసపురస్కృతుఁడై శుక్రాచార్యులపాలి కేగి రాక్షసకులమొనరించిన మహాపరాధమును మన్నించి కాపాడుమనియు, బృహస్పతి

పన్నినకుట్రచే నిజము తెలిసికొనలేకపోయిరే కాని గురుద్రోహబుద్ధికాని గురుగౌరవరాహిత్యముకాని రాక్షసుల కెంతమాత్రము లేదనియు, తన్నుఁజూచియైన వారిని క్షమించి కాపాడుమని పదేపదే ప్రార్థించెను. రాక్షసలోకమంతయు వచ్చి శుక్రునిమ్రోల సాష్టాంగపడెను. సహజ దయార్ద్ర హృదయుఁ డగు శుక్రాచార్యుని కప్పటికి వారిపై జాలికలిగి నిజ శివతపశ్చర్యావృత్తాంతము, వరగ్రహణము వారికి సవివరముగాఁ దెలిపి ప్రహ్లాదునిమనుమఁడు, సకలగుణసంపన్నుఁడు, బలవిద్యాతేజస్వంతుఁడు, భక్తిసంపన్నుఁడు నగు బలిని వారికి నాయకు నొనరించి యాతనిచే ముల్లోకములు మరల నేలింతు నని చేసిన ప్రతిజ్ఞ మరలఁ జేసి తాను గడించినమంత్రరహస్యములను బలికి మిగిలినరాక్షస నాయకులకుఁ దెలిపెను.

శుక్రాచార్యుని కారణమున రాక్షసు లందఱు మహావీర్యవంతులై యుద్ధసన్నద్ధులై బలియాజమాన్యమున నవలీలగా ముల్లోకములను జయించిరి. వెంటనే శుక్రుఁడు బలిని చక్రవర్తి నొనరించి యింద్రాది దేవతలను బృహస్పతిని బాఱఁదోలించి పరిభవించి యిరువది నియుతముల యొక యర్బుదము నఱువదివేల సంవత్సరములు (20,[illegible]0,64,0000 అతనిచే రాజ్య మేలించెను.*

## శుక్రునికూఁతురు దేవయానివృత్తాంతము

వృషపర్వుఁ డనురాక్షసరాజు ఆచార్యుఁ డగుశుక్రుని మహాభక్తి గౌరవములతో భజించుచు, నాతనిం దనపురమున రాజప్రాసాదమునఁ బెట్టుకొని యాతనిఁ దనకంటె నెక్కుడుగాఁ బూజించుకొనుచుండెను ఇంత వినయవిధేయతలఁ జూపుశిష్యునివల్ల గురువగు శుక్రాచార్యుఁడు న ॰దయాపరుఁడై యాతనితలలో నాలుకవలె మెలఁగుచుండెను. వృషపర్వుఁడు మహాయుద్ధముల నొనరించి దేవతల నేడ్పించుచుండెను యుద్ధములో మృతులైనరాక్షసుల నెల్లరను మృతసంజీవనీవిద్యచే గురువు బ్రదికించుచుండుటచే రాక్షసుల జయింప దేవతలకు సాధ్యము కాదయ్యెను.

---

* పద్మపురాణము, సృష్టిఖండము, బ్రహ్మాండ పురాణము

అప్పుడు దేవత లందఱు నాలోచించి యెట్లైన శుక్రాచార్యునివలన మృతసంజీవనీవిద్య గ్రహించి తేఁగలవాఁ డెవఁ డని యాలోచించి బృహస్పతిపుత్త్రుఁ డగు కచుఁడుదక్క నన్యుల కది సాధ్యము కాదని గ్రహించి యాతని నందులకై ప్రార్థించిరి.

దేవహితార్థియై కచుఁడు బయలుదేఱి వృషపర్వునినగరుచేరి యందు వేదాధ్యయనశీలుఁడై సకలదైత్యదానవగణోపాధ్యాయుఁడయి యున్నశుక్రాచార్యునిం గని సాష్టాంగనమస్కార మొనరించి "ఆచార్యా! నేను బృహస్పతిపుత్త్రుఁడను, నన్నుఁ గచుఁ డందురు. నేను నీకడ శిష్యుఁడనై యుండి విద్యలు నేర్వ వచ్చితిని. నీవు నన్ను గ్రహింపు" మని ప్రార్థించెను. బాలుఁడయ్యును నియమవ్రతశీలుఁడైన వాఁడు, సుకుమారుఁడు, ప్రకాశవంతుఁడు, ప్రశాంతుఁడు, విశేషించి బృహస్పతియంతవాని పుత్త్రుఁడు వచ్చి శిష్యత్వ మంగీకరింపుమని ప్రార్థించిన నంగీకరింపకుండు టెట్లని శుక్రుఁడు పరమప్రీతి నాతని నాదరించి యభ్యాగతపూజ లొనరించి యాత్మశిష్యు నొనర్చుకొనెను.

అది మొదలు శుక్రాచార్యుఁ డేపని చెప్పినను వెంటనే చేయుచు మనోవాక్కాయకర్మలచే గురుసేవ చేసి యాతనిమనస్సును, అంతకన్న మిన్నగా నాతనికన్నకూఁతురగు దేవయాని సున్నితహృదయమును కచుఁ డపహరింపఁ గలిగెను. కచుఁడు దేవయాని గీచినగీఁతదాటఁడు. ఆతడామెను హితమిత భాషణములచేతను, పుష్పఫలాదిదానములచేతను, నిరంతరము సంతోషపెట్టుచుండెను. ఇట్లు కొన్ని సంవత్సరములు జరిగెను. గురుశుశ్రూషాకౌశలమునఁ గచుఁడు గురునకుఁ బ్రియశిష్యుఁడు. గురుతనూజకుఁ బ్రియమిత్త్రుఁడు నయ్యెను.

ఇది చూచి రాక్షసులు సహింపలేరైరి. అందుచే నొకనాఁడు వనములో హోమధేనువులంగాచు కచుని బట్టుకొని చంపి రాక్షసులు వాని శవము నొకచెట్టునకుఁ గట్టిపోయిరి. నాఁడు చీఁకటి పడుసరికి ఆవు లింటికి వచ్చినవి కాని, కచుఁడు రాఁడయ్యెను. కచుఁ డన్నఁ బంచప్రాణములుగా నున్న దేవయాని యాతనికొఱ కేడ్చుచుఁ దండ్రితో మొఱ పెట్టుకొనెను. శుక్రాచార్యుఁడు దివ్యదృష్టిని జూచి జరిగినదెల్ల గ్రహించి

యాతనిం బ్రదికించి తీసికొనిరమ్మని తన మృతసంజీవనీవిద్యం బంపెను. మహాప్రసాద మని యా విద్య శరవేగమున నేగి కచుని సంజీవితు - నొనర్చి తీసికొని వచ్చెను. తండ్రికూఁతు లిరువురు నాతనింజూచి సంతోషించిరి.

ఈ సంగతి నెఱింగిన రాక్షసు లీసారి యట్లు కాదని యడవికిఁ బువ్వుల కరిగినకచునిఁ బట్టుకొని చంపి కాల్చి బూడిదచేసి యా బూడిద కల్లులోఁ గలిపి యా కల్లు తెలుపకుండ శుక్రునిచేఁ ద్రాగించిరి. సురాపానమోహితుఁడగు శుక్రాచార్యుఁ డేమియు నెఱుఁగఁ డయ్యెను. దేవయాని కచునిం గానక వెక్కివెక్కి యేడ్వఁదొడంగెను. "ఓసీ! ఏల యేడ్చెదవు? ఇంక నెన్నిసారులు బ్రదికించినను రాక్షసు లాతనినిఁ జంపక మానరు. అతఁడు సుగతికే పోయియుండును. ఇఁక నతని కొఱ కేడ్వకు" మని శుక్రాచార్యుఁడు దేవయానితో ననెను. అంత దేవయాని కన్నులనీరు వఱదలై చన్నులవెంటఁ బ్రవహింప:

"మతిలోకోత్తరుఁ డైనయంగిరసుమన్మం డాశ్రితుం డా బృహ
స్పతికిం బుత్రుఁడు మీకు శిష్యుఁడు సురూపబ్రహ్మచర్యాశ్రమ
వ్రతసంపన్నుఁ డకారణంబ దనుజవ్యాపాదితుండైన న
చ్యుతధర్మజ్ఞ! మహాత్మ! యక్కచున కే శోకింప కెట్లుండుదున్!

భార. ఆది. ౩. ౧,౧,౮.

వానినిఁ జూచి కాని నే భుజింప; నిద్రింప; జీవింప" నని యేడ్చెను. శుక్రాచార్యుఁడు కొంతసేపటికిఁ గూఁతుమీఁదఁగల మమత్వము, అనుంగు శిష్యునిపైఁ గలవాత్సల్యము స్మరించి దివ్యదృష్టి సారించి లోకాలోక పర్వతపర్యంతభువనాంతరమున నెక్కడను గచుని గానఁ డయ్యెను. తుదకు బూడిదయై సురతోఁ గలిసి తన కడుపుననే యున్నకచుఁ డాతనికి గోచరించెను. సురాపాన దోషము, అసురాపకారావమానము హృదయమును దహింప శుక్రాచార్యుఁ డిట్లు తలపోసెను. "అయ్యో! ఎన్నిజన్మములందో యెంతో శ్రమపడి సంపాదించినపుణ్య మంతయు నొక్క క్షణములో సురాపానదోషమునఁ బోవుటకాక మహాపాపము పైఁబడుఁగదా! ఇట్టిదోషభూయిష్ఠ మైనసురాపానము బ్రాహ్మణులకు

క్షంతవ్యమగునా? సర్వరాక్షసలోకగురుఁడను; సర్వవిద్యా వివేకకోవిదుఁడను, నేనే యీ దోషమున నింత యవివేకముగా మోసపోతినే? ఇఁకఁ బ్రపంచముగతి యేమి?'' ఇట్లు తలపోసి శుక్రాచార్యుఁడు సురాపానము మహాపాప మనియు విశేషించి విప్రుల కది సర్వవినాశహేతు వనియు శపించెను.

శుక్రుఁడు విద్యావినయవివేకసంపన్నుఁడు, విశేషించి ప్రియశిష్యుఁడు నగుకచుని బ్రదికింప కెట్లుండు నను కొని యాతనిం దనసంజీవనీ మంత్రముచేఁ గడుపులోనే బ్రదికించెను. కచుఁడు కడుపులోనుండి "జయ గురుదేవా! కృతజ్ఞుఁడను. నీ దయవలన శరీరము, ప్రాణము, బలమును బొందితిని. బయటపడు నుపాయముఁజెప్పి రక్షింపవే" యని మిక్కిలిప్రార్థించెను. అందులకు శుక్రాచార్యుఁ డిట్లనెను. "వత్సా! నా కడుపు బ్రద్దలైనఁగాని నీవు బయటపడలేవు. నా కడుపు బ్రద్దలైనచో నేను చనిపోవుదును. నన్ను బ్రదికించు విద్య మృతసంజీవని నీకు బోధింపవలయును. నే నట్లు చేసినచో నీ వచ్చినపనియై దేవతలకు మేలగును. నా శిష్యులగు రాక్షసులకుఁ గీడగును. ఐనఁ గానిమ్ము. విద్యావినయవివేకములు, శ్రద్ధాభయభక్తులుగలిగి, గురుశుశ్రూషాపరాయణులు, లోకోపకారకులు, నియమవ్రతశీలురునగు ఆత్మీయప్రియశిష్యులకుఁ బరమరహస్య విద్యయైనను బోధింపక దాచుకొనుగురువు గురువు కాఁడు, నిరయవాసి యగును. కావున, ఏదియేమైనను నీకీ విద్య బోధించెదను. నీవు నాకడుపు వ్రక్కలుచేసికొనివచ్చి చచ్చిన నన్ను బ్రదికింపుము."

ఇట్లు పలికి శుక్రాచార్యుఁడు లోకోత్తర మగుసంజీవనీ విద్యను లోకోత్తరుఁడగు కచునకు లోకోత్తరపద్ధతిని బ్రసాదింపఁగనే కచుఁడు గురునికడుపు బ్రద్దలు చేసికొని బయటికివచ్చి వెనువెంటనే తాను నేర్చిన విద్యచే విగతజీవుఁడై పడియున్న వేదమూర్తిని బ్రదికించెను. ఆ గురుశిష్యులను సర్వదేవతలు నభినందించి పుష్పవృష్టి వారిపైఁ గురియించిరి. దేవయానియానందమునకుఁ బట్టపగ్గములు లేకుండెను.

ఇట్లు శుక్రాచార్యుఁడు సమస్తము నెఱిఁగియు శిష్యరత్నమగు కచునకుఁ దనకు ప్రాణప్రదమగువిద్యను బోధించి తన యుదారతను,

నిష్కలుషతను, విద్యావిషయమున శత్రుమిత్రభేదభావ రాహిత్యమును జూపి లోకోత్తరపురుషుఁ డయ్యెను.*

## శుక్రాచార్యుఁడు యయాతిని శపించుట

కచుఁడు దేవలోకమున కేగ తన్ననుమతింపు మని కోరఁగా దేవయాని తన్నుఁ బెండ్లాడు మని కోరెను. కచుఁడు ధర్మరహిత మని దాని కంగీకరింపకపోఁగాఁ దనతండ్రివలన గ్రహించిన మృతసంజీవని కచునకుఁ బనిచేయకుండుఁగాక యని యామె శపించెను. "నాకది పని చేయకపోయినను నావలన గ్రహించినవారికది పనిచేయుఁగాక! నన్ను కారణముగ శపించితివి కావున నిన్ను బ్రాహ్మణుండు వివాహమాడకుండుఁ గాక" యని కచుఁడు ప్రతిశాపమిచ్చి వెడలిపోయెను.

వృషపర్వునికూఁతురగుశర్మిష్ఠ తన వేయి మందిచెలికత్తెలతో దేవయానితో వనవిహారమున కేగి యందు దేవయానితో మాట పట్టింపు వచ్చి దేవయానిని బాడునూఁతం ద్రోయించి చెలికత్తెలతో నింటికివచ్చి చేరెను. యయాతిమహారాజు వేఁటకువచ్చి డస్సి దప్పికచెంది దైవికముగా ఆ నూఁతికడకువచ్చి జలములు తీయ లోనికిఁజూడ నాతనికి సర్వాంగ సౌందర్యవతి, యువతి యగుదేవయాని పడియుండి కనిపించెను. యయాతి యామెను బలుకరించి యాయమచరిత్ర అడిగి తెలిసికొని తన కుడిచేతితో నామెను బట్టుకొని నూఁతినుండి బయటికిఁదీసి యోదార్చి వెడలిపోయెను. దుర్మార్గురాలైనశర్మిష్ఠఁ గన్నతండ్రినగరము చూడ నని దెవయాని యటనే యుండి తండ్రికి వార్తపంపెను. శుక్రుఁడు వెంటనే కూఁతు రున్నచోటుచేరి యామెవలన జరిగినసంగతి యంతయు విని "తల్లీ!

అనుపమనియమాన్వితులై
అనూనదక్షిణలఁ గ్రతుసహస్రంబులు చే
సినవారికంటె అక్రో
ధనుఁడ కరం బధికుఁ డండ్రు తత్త్వవిధిజ్ఞుల్.

---

భారతము ఆదిపర్వము.*

అలిగిన నలుగక యెగ్గులు
పలికిన మఱి విననియట్లు ప్రతివచనంబుల్
పలుకక బన్నమువడి యెడఁ
దలఁపక యున్నతఁడ చూవె ధర్మజ్ఞుఁ డిలన్.

భార. ఆది. ౧౯౬, ౧౯౮

కావున, బుద్ధిహీనులే కాని బుద్ధిమంతులు ఎవరిమీఁదను గోపింపరు. ఇంతకు శర్మిష్ఠ రాజుకూఁతురు. చిన్నపిల్ల. దాని తెలివితక్కువ తనముఁ జూచి జాలిపడవలయునే కాని కోపింపఁ జనదు'' అని బోధించెను. కాని, దేవయాని వినక "తండ్రీ!

కడు నసురక్తియు నేర్పును
గడఁకయుఁ గలవారి నుఱక కడవఁగ నెగ్గుల్
నొడివెడి వివేకశూన్యుల
కడ నుండెడు నంతకంటెఁ గష్టము గలదే.

(భార. ఆది. ౩. ౧౯౯.)

నేనేమైన నా నగరు త్రొక్క'' నని భీష్మించి యుండ శుక్రాచార్యుఁడు నటనే నిలిచిపోయెను. ఈ సంగతి యంతయుఁ జారులవలన విని వృషవర్వమహారాజు త్వరితగతి వచ్చి తండ్రికూఁతుళ్ళ కెఱఁగి "ఆచార్య! నీవలననే రాక్షసకుల ముద్ధరింపఁ బడినది. నీ ఋణము మే మెట్లును దీర్పుకొనలేము. మా సమస్తైశ్వర్యములు, పుత్రమిత్ర పరివారము, ధనధాన్యసంపదలు అన్నియు నీవే. నీ వెట్లు చెప్పిన నట్లు నడచుకొందుము. దేవయాని యేమి చేయుమన్న నది చేయుదును క్షమింపు'' మని ప్రార్థించెను.

అట్లైన "నీకూఁతును వేయిమందికన్యకలతో నాపాద దాసి నొనర్పు" మని దేవయాని వృషవర్మునిఁ గోరెను. అతఁడు మహాప్రసాద మని యట్లే యొనరించెను. శర్మిషయుఁ దనతప్పిదము నెఱింగి క్షమింపఁ బ్రార్థించి తండ్రియానతి తలధరించి దేవయానికి వేయిమంది కన్యలతో సేవచేయుచుండెను.

ఒకనాఁడు శర్మిష్ఠయు నామె పరివారమును దన్ను సేవించుచుండ దేవయాని వనవిహారమున కేగెను. దైవికముగా నచట యయాతిమహారాజు తటస్థపడెను. అతఁడు దేవయానిం బలుకరించి మిగిలినవారంద ఱెవ్వ రని యడిగెను. దేవయాని సమస్తము నాతనికిఁ జెప్పి తన్నుఁ బెండ్లాడు మని ప్రార్థించెను. అంత యయాతి క్షత్రియుఁడు బ్రాహ్మణకన్యను బరిగ్రహించుట ధర్మవిరుద్ధ మని తా నధర్మమునకుఁ బాలుపడుచో లోకప్రవృత్తి విపరీత మగు నని వాక్రుచ్చెను. "ఐనచో, నాతండ్రి చెప్పిన నంగీకరింతువా?" యని యయాతి నడుగ నాతఁ డంగీకరింతు ననెను. వెంటనే దేవయాని తండ్రిని బిలిపించి విషయ మంతయుఁ జెప్పెను. శుక్రాచార్యుఁడు వారివివాహ మధర్మము కాకుండునట్లు వర మనుగ్రహించి వారికి వివాహ మొనరించి తన కూఁతుతోపాటు శర్మిష్ఠను సఖులను రాజున కొప్పగించి వధుక తక్కఁ దక్కిన సమస్తసుఖములు నామె కొసంగు మని చెప్పి యయాతి నొప్పించి శుక్రాచార్యుఁడు వా రందరిని యయాతితోఁ బంపివేసెను. కాలక్రమమున యయాతి దేవయానివలన యదుతుర్వసు లను కుమారులం గాంచెను.

శర్మిష్ఠ యౌవనవతియై తనయంద మంతయు నడవిని గాచిన వెన్నెల కాఁగా దుఃఖించుచుఁ దనకుఁ బతి లేఁడయ్యె నని కృశించుచు యయాతితోడి సంగమము మనసునఁ గోరి యుండఁగా నొకనాఁడు దైవికముగా నామె యొంటరియై యున్నప్పుడు యయాతి యొంటరిగా నరుదెంచెను. అపుడు శర్మిష్ఠ చేతులు జోడించి నమస్కరించి తనకు సంగమసుఖ మిమ్మని ప్రార్థించెను. "శయన సుఖముతక్క మిగిలిన సుఖములు నీ కిమ్మని శుక్రుఁడు నా కాదేశించినాఁడు. దానికి విరుద్ధ మొనరించిన నసత్యదోషము నాకువచ్చు" నని యయాతి పలుక శర్మిష్ఠ "దేవా! ప్రాణవిత్తమాన భంగములందు వివాహవధాసమయములను బొంకవచ్చు ననుట ధర్మబద్ధము కావున నన్నేలు" మని పైఁబడెను. అసదృశరూప యౌవనవిలాసిని యగునామె కా మహారాజటనే యపుడే యామె కోరిన కామసుఖము నపారమొసంగి గర్భము నిలిపి చనెను.

కాలక్రమమున శర్మిష్ఠకుఁ గొడుకుపుట్టి పెరుగుచుండ దేవయాని చూచి యా కొడుకెట్లు పుట్టె నని శర్మిష్ఠ నడిగెను. ఒకమునీశ్వరుని దయచేఁ గలిగె నని శర్మిష్ఠ బొంకెను. దేవయాని యది నిజమని నమ్మి వెడలిపోయెను. యయాతి యతి రహస్యముగా శర్మిష్ఠాసంగమ మొనరింప నామెకుఁ గ్రమముగా నాతనివలన మువ్వురుపుత్రు లుదయించిరి.

కాలక్రమమున నొకనాఁడు శర్మిష్ఠాయయాతుల గుట్టు బట్టబయలు కాఁగా దేవయాని సమస్తము నెఱింగి తండ్రికడకుఁ బోయి తనభర్తయగు యయాతి యధర్మమున ధర్మమునకుఁ గీడు కలిగించి, అసురపద్ధతి నాసురియందు ముగ్గురుకొడుకులఁ గని తన కవమానము కల్గించెనని యేడ్చెను. శుక్రుఁడు కోపముతో వచ్చి యయాతిం జేరి "నీవు యౌవనగర్వమున రాగాంధుఁడవై నాకూఁతున కప్రియము చేసితివి. జరాభారపీడితుఁడవు కమ్మని శపించెను. యయాతి ఖేదపడి తనకుఁ గామసుఖము తీరలే దని శాపముఁ బాపుమని ప్రార్థించెను. శుక్రాచార్యుఁడు "నీ ముదిమి నీ కొడుకునకిచ్చి యాతని యౌవనము నీవు తాల్చి రాజ్యసుఖంబు లనుభవింపవచ్చు. తుదిని నీముదిమి నీవు తాల్చి నీ కుమారునియౌవన మాతని కీయవచ్చు. అహ్లాదంబడిన కుమారునికే నీవు రాజ్య మీయవలయు. అతఁడే వంశకర్త యగు" నని శాపము మార్చి కూఁతు నూఱడించి యయాతిఁ దృప్తిపఱచి వెడలిపోయెను.*

## శుక్రాచార్యుఁడు బలిచక్రవర్తికి నీతి బోధించుట

శుక్రుడు బలికి సమస్త నీతులను బోధించి యాతనినిఁ జక్రవర్తి నొనరించి దేవతలయు, ఇంద్రునియు, దిక్పాలకులయు గర్వ మణఁపఁ జేసి యాతనిచే శతాధికములగు యజ్ఞములు చేయించి దానము లొనరింపఁజేసి సత్యము, దయ, ధర్మము, త్యాగము, యోగము పంచప్రాణములుగా నొనరించి జగజ్జేగీయమానముగాఁ దనయాచార్యత్వము నిర్వహించెను.

* భారతము ఆదిపర్వము భాగవతము, నవమస్కంధము.

ఇట్లుండ విష్ణుమూర్తి వామనుఁడై బలిని యాచింప వచ్చుటయు, బలి వామనుఁడు కోరిన మూఁడడుగులభూమిని దానముచేయ నంగీకరించుటయు జరిగెను. అపు డీసంగతి విని తన దివ్యదృష్టిని జరుగఁబోవున దెఱిఁగినవాఁ డయ్యు శుక్రాచార్యుఁడు తనవిధి తాను నిర్వర్తింపఁ దలఁచి బలిని జేరి యిట్లు పలికెను. "దనుజేంద్ర! ఈ పొట్టివాఁడు చాల గట్టివాఁడు. బడుగు బాపనయ్య కాఁడు. దేవకార్యము సాధించుటకై యీవటువు రూపమున నీకడకు వచ్చినాఁడు. ఈ సంగతి నీ వెఱుంగక యీతనికి నీవు దాన మిచ్చెద నంటివి. ఇచ్చితివా రాక్షసలోకమున కంతకు ముప్పు తెచ్చినవాఁడవే యౌదువు. ఈతఁ డీ మూఁ డడుగులగు దానము మిషచే నీ లక్ష్మి, నీ తేజము, నీ యిల్లు, నీ యైశ్వర్యము, నీ సమస్తముఁ గొనిపోయి యింద్రుని కిచ్చును. మూఁడుపాదములతో మూఁడు లోకముల నాక్రమించి నిన్నుఁ బాతాళమునఁ గూల్చును. ఇచ్చెదనని యీయకున్న చో నరకమే వచ్చును. కాని, దానిని దప్పించుకొన నీవు సమర్థుఁడవు. ఏ దానమున వినాశము సంభవించునో యది దానమే కాదని పెద్ద లందురు. గృహస్థుఁ డగువాఁడు తనయింటఁ గలధన మైదుభాగములుగాఁ జేసి కామము, అర్థము, ధర్మము, యశము, ఆశ్రితజనము అనునై దిటికి సమముగాఁ బంచవలయును. అంతేకాని తనకు మాలినధర్మము ధరణి లేదు. "బహ్వృచగీత" ఈభావమునే తెలుపును. వినుము. అంగీకరించినను, అఖిలము పోవునపుడు లే దనిన అసత్యము కాదు. ఆత్మ యనువృక్షమునకు అసత్యము మూలము. ఐనను ఆత్మ చెడదు. ఆత్మ యనువృక్షమునకు సత్యము పుష్పఫలములు. మ్రాను చెడుటతో పుష్పఫలములును పోవును. ఫలపుష్పములు లేకపోయినను వృక్షము మూలముతో వృద్ధిపొందును. కావునఁ దాను నశింపకుండు పక్షమున దానము చేయవలయును గాని తానే పోవునపుడు దానము చేయుట తెలివిగలపని కాదు. మఱియును

వారిజాక్షులందు వైవాహికములందుఁ
బ్రాణవిత్తమానభంగమందుఁ
జకితగోకులాగ్రజన్మరక్షణమందు
బొంకవచ్చు నఘము పొందఁ డధిప!

నేఁ జెప్పినమాటలు పాటించి కులము, రాజ్యము, తేజము నిలుపుకొనుము. ఈ దానము గీనము మానుము."

ఆ మాటలు విని బలిచక్రవర్తి "ఆచార్య! నీవు నిజము చెప్పితివి. గృహస్థులకు నీవు చెప్పినదే పరమధర్మము. కాని, నే నీదాన మిచ్చి తీరెద" నని పలికి శుక్రుని పలుకులు పాటింపఁ డయ్యెను. కాని, శుక్రాచార్యుఁ డొనరించిన హితబోధవలన నాతఁ డాగతానాగతవర్తమానవేది యాచార్య ధర్మనిర్వహణబుద్ధి యని వెల్లడియైనది.

## ఔశనససంహిత

ఉశనసుఁడు అనులోమప్రతిలోమజాత్యంతర వివాహములనుగూర్చి చెప్పినధర్మములు ఔశనస సంహిత యని ప్రసిద్ధిగాంచినవి. ఈ సంహిత పూర్తిగా లభింప లేదు. లభించిన సంహితలో ఆరంభమున "అతఃపరం ప్రవక్ష్యామి జాతివృత్తివిధానకం, అనులోమవిధానం చ ప్రతిలోమవిధిం తథా" అని కలదు. [ఇంతకుఁ బూర్వ మేదియో చెప్పి యుండవచ్చు. ఈ సంహితనే ఔశనసధర్మశాస్త్రమనియు, ఔశనసస్మృతి, శుక్రస్మృతియనియు నందు రని తుదిఁగలదు.] ఇందు ౫౧ శ్లోకములు మాత్రమున్నవి ౫౧ వ శ్లోకము:

> "ఏతత్సంక్షేపతః ప్రోక్తం జాతివృత్తివిభాగశః,
> జాత్యంతరాణి దృశ్యంతే సంకల్పాదిత ఏవ తు."

## ఔశనసస్మృతి

ఇదియే ప్రధాన మగు శుక్రధర్మశాస్త్రము. శౌనకాది మహామునులు భార్గవుఁడగు ఉశనసునిఁజేరి ధర్మశాస్త్ర వినిర్ణయ మొనరింపు మని ప్రార్థించిరి. ధర్మతత్త్వవిదుఁ డగు ఉశనసుఁడు ధర్మార్థకామమోక్షహేతువు, పాపనాశనకరము నగుధర్మశాస్త్రమును మొదటఁ దండ్రికి నమస్కరించి ప్రారంభించి చెప్పెను. మొదటి అధ్యాయమున బ్రహ్మచారిధర్మసారవర్ణనము, రెండవ అధ్యాయమున బ్రహ్మచారిశౌచాచారవర్ణనము,

మూఁడవఅధ్యాయమున బ్రహ్మచారికి సంబంధించిన యనేకవిషయములవర్ణనము, గాయత్రీమంత్రసారవర్ణనము, నిత్యనైమిత్తిక విధివర్ణనము, నాలుగవ అధ్యాయమున శ్రాద్ధవిషయవర్ణనము, ఐదవయధ్యాయమున అదేవిషయముయొక్కవివరణము, ఆఱవఅధ్యాయమున అశౌచవర్ణనము, ఏడవఅధ్యాయమున గృహస్థు లొనరింపఁదగిన ప్రేతకర్మవిధివర్ణనము, ఎనిమిదవఅధ్యాయమున ప్రాయశ్చిత్తవర్ణనము, తొమ్మిదవఅధ్యాయమున ఆ విషయముయొక్కవిపులీకరణము అనువిషయములు ఔశనసస్మృతిలోఁ గలవు. మచ్చు శ్లోకములు:

"కృతోపనయనో వేదా నధీయీత ద్విజోత్తమః,
గర్భాష్టమే వ్యష్టమే వా స్వ సూత్రోక్తవిధానతః
దండే చ మేఖలా సూత్రే కృష్ణాజినధరో మునిం
భిక్షాహారో గురుహితే వీక్షమాణో గురోర్ముఖమ్

.... .... .... ....

.... .... .... ....

ఉపాసనే గురూణాం చ సాంధ్యయో రుభయోరపి,

ఉపవీతీ భ వేన్నిత్యం విధి రేషః సనాతనః.

.... .... .... ....

.... .... .... ....

అమావాస్యాయాం యో బ్రాహ్మణం సముద్దిశ్య పితామహమ్,
బ్రాహ్మణీస్త్రీం సమభ్యర్చ్య ముచ్యతే సర్వపాతకైః.
అమావాస్యాం తిథిం ప్రాప్య యమమారాధయేద్భవమ్,
బ్రాహ్మణానాం భోజయిత్వా స్సర్వపాపైః ప్రముచ్యతే.
కృష్ణాష్టమ్యాం మహాదేవం తథా కృష్ణచతుర్దశీం,
సంపూజ్యబ్రాహ్మణముఖైః సర్వపాపైః ప్రముచ్యతే.
త్రయోదశ్యాం తథా రాత్రౌ సోపహారం త్రిలోచనమ్,
దృష్ట్వైవ ప్రథమే యామే ముచ్యతే సర్వపాతకైః.
సర్వత్ర దానగ్రహణే ముచ్యతే సోమయాగతః.

శాంత్యాచ దక్షిణాం గృహ్ణన్ హిరణ్యప్రతిమా మపి,
అయుతేనైవ గాయత్ర్యా ముచ్యతే సర్వపాతకైః.

## శుక్రధ్యానము

శ్లో. జటిలం సాక్షసూత్రం చ
వరదండ కమండలుమ్,
శ్వేతవస్త్రావృతం శుక్రం
ధ్యాయేద్దానవపూజితమ్."

## శుక్ర స్తుతి

శో. శుక్ర శ్శుభగ్రహ శ్శ్రీమాన్
వర్షకృద్వర్ష విఘ్నకృత్,
తేజోనిధిః జ్ఞానదాయీ
యోగీ యోగవిదాంవరః

దైత్యసంజీవన శ్శాంతో
దైత్యనేత్రోశనాః కవిః,
నీతికర్తా గ్రహాధీశో
విశ్వాత్మా లోకపూజితః.

శుక్లమాల్యాంబరధరః
శ్రీ చందన సమప్రభః,
అక్షమాలాధరః కావ్యః
తపోమూర్తి ర్ధనప్రదః."

⁂

## శుక్రాష్టోత్తరశతనామస్తుతిః

"శ్లో॥ శుక్ర శ్శుచి శ్శుభగుణ శ్శుభద శ్శుభలక్షణః,
శోభనాక్ష శ్శుభ్రరూప శ్శుద్ధ స్ఫటిక భాస్వరః.
దీనార్తిహారకో దైత్యగురుర్దేవాభినందితః,
కావ్యాసక్తః కామపాలః కవిః కల్యాణదాయకః.
భద్రమూర్తి ర్భద్రగుణో భార్గవో భక్తపాలనః,
భోగదో భువనాధ్యక్షో భుక్తిముక్తి ఫలప్రదః.
చారుశీల శ్చారురూప శ్చారుచంద్ర నిభాననః,
నిధి ర్నిఖిల శాస్త్రజ్ఞో నీతివిద్యా ధురంధరః.
సర్వలక్షణసంపన్నః సర్వావగుణవర్జితః,
సమానాధిక నిర్ముక్తః సకలాగమపారగః.
భృగు ర్భోగకరో భూమీసురపాలనతత్పరః,
మనస్వీ మానదో మాన్యో మాయాతీతో మహాశయః.
బలిప్రసన్నో ఽభయదో బలీబల పరాక్రమః,
భవపాశ పరిత్యాగో బలిబంధ విమోచకః.
ఘనాశయో ఘనాధ్యక్షో కంబుగ్రీవః కళాధరః,
కారుణ్యరససంపూర్ణః కల్యాణగుణవర్ధనః.
శ్వేతాంబర శ్శ్వేతవపుః చతుర్భుజ సమన్వితః,
అక్షమాలాధరోఽ చింత్యో అక్షీణగుణభాసురః.
నక్షత్ర గణ సంచారో నయదో నీతిమార్గదః,
హర్షప్రదో హృషీకేశః క్లేశనాశకరః కవిః.
చింతితార్థప్రద శ్శాంతమతిశ్చిత్తసమాధికృత్,
ఆధివ్యాధిహరో భూరివిక్రమః పుణ్యదాయకః.
పురాణపురుషః పూజ్యః పురుహూతాదిసన్నుతః,
అజేయో విజితారాతిః వివిధాభరణోజ్జ్వలః.

కుందపుష్పప్రతీకాశో మందహాసో మహామతిః,
ముక్తాఫలసమానాభో ముక్తిదో మునిసన్నుతః.
రత్నసింహాసనారూఢో రథస్థో రజత ప్రభః,
సూర్యప్రాగ్దేశసంచారః సురశత్రుసుహృత్ కవిః.
తులావృషభరాశీశో దుర్ధరో ధర్మపాలకః,
భాగ్యదో భవ్యచారిత్రో భవపాశవిమోచకః.
గౌడదేశేశ్వరో గోప్తా గుణీగుణవిభూషణః,
జ్యేష్ఠానక్షత్ర సంభూతో జ్యేష్ఠః శ్రేష్ఠః శుచిస్మితః.
అపవర్గప్రదోఽనంత స్సంతానఫలదాయకః,
సర్వైశ్వర్యప్రద స్సర్వగీర్వాణగణసన్నుతః. ''

———

# మహర్షుల చరిత్రలు

## శ్వేతకేతు మహర్షి

### జననము

పూర్వము మహాతపస్వియు, మహాతేజస్వియు, మహాస్వాధ్యాయవేత్తయు నగుఉద్దాలకుఁ డనుమహర్షి యుండెను. ఆతఁడు మంత్రద్రష్టయు, మంత్రవేత్తయు, మంత్రమహితుఁడును. ఆతనికి ధర్మపత్నియందుఁ దొలుత సుజాత యనుకూఁతురు కలిగెను. యుక్తవయసు వచ్చినపిదప నుద్దాలకుఁ డామెను ఏకపాదుఁ డనుమహనీయతపోనిధి కిచ్చి వివాహముఁ గావించెను. ఆ పుణ్యదంపతులకే అష్టావక్రమహర్షి యుద్భవించెను. సుజాతకు అష్టావక్రుఁడు జనించిన వేళనే సుజాతతల్లియు ఉద్దాలకునిభార్యయు నగు సాధ్వికి నొక కుమారుఁడు కలిగెను. ఆతఁడు స్వచ్ఛధావళ్యయుత మగుశరీరముతోఁ బుట్టుటచేఁ దండ్రి యాతనికి శ్వేతకేతుఁ డనునామము నొసంగి జాతకర్మాదుల నొనరించెను.

### మాతుల భాగినేయులు

సమానవయస్కులు సమానబుద్ధియుతులు నగు శ్వేతకేతుఁడు, అష్టావక్రుఁడు మాతులభాగినేయు లగుట సుజాతచేతను సుజాతతల్లిచేతను మిగుల లాలింపఁ బడుచుండిరి. జనకమహారాజు నాస్థానమున కేగి వందితోడి వాదమున నోడి యేకపాదుఁడు జలమజ్జితుఁడై యుండుటచే అష్టావక్రశ్వేతకేతు లిరువురు ఉపనీతులై ఉద్దాలకునికడనే సమస్త వేద శాస్త్రములు నభ్యసించుచుండిరి. అష్టావక్రుఁడు బాల్యముకతమున ఉద్దాలకుఁడే తండ్రి యనియు శ్వేతకేతుఁడు భ్రాత యనియు భావించుచుండెను. ఒకనాఁడు అష్టావక్రుఁడు చనవుబలిమిని ఉద్దాలకునియొడిలోఁ గూర్చుండెను. అదిచూచి శ్వేతకేతుఁ "డోరీ! నాతండ్రియొడిలో నీ

వేల కూర్చుంటివి? నీవు నీ తండ్రికడకుఁ బొమ్ము" అని యాతనిని గెంటివేసి తాను దండ్రియొడిలోఁ గూర్చుండెను. అష్టావక్రుఁ డేడ్చుచుఁ దల్లికడ కేఁగి జరిగిన సంగతి చెప్పి తనతండ్రి యెక్కడఁ గలఁడో తెల్పుమని కోరెను. ఆమె జనకసభలో వాదమున నోడి జలమజ్జితుఁడై యాతని తండ్రి యుండె నని చెప్పెను. "ఐనచో నే నేగి నాతండ్రిని విడిపించి తెచ్చుకొందును. అనుమతింపు" మని తల్లినిగోర నామె "బాలవాక్యము బ్రహ్మవాక్యము. ఏమో! తేజస్వియగుబాలుఁ డంతకుఁ సమర్థుఁడు కాఁడనుకొననేల?" యని యాతని కనుమతి నొసంగెను.

వెంటనే అష్టావక్రుఁడు మేనమామయగు శ్వేతకేతుని కడకుఁ బరుగునఁ బోయి యాతఁడు తన్ను గెంటివేసి యవమానించినసంగతి యప్పుడే మఱచి, "మామా! మన మిద్దఱము జనకచక్రవర్తిసభ కేగి వంది నోడించి నా తండ్రిని విడిపించుకొని వత్తము. రమ్ము. వందిని గిందిని వందిని జయింపలేమా మనము?" అనెను. ఆతఁడును తప్పక పోదము రమ్మనఁగా ముక్కుపచ్చలారని యా ముద్దుబిడ్డ లిరువురుఁ బొట్టాపట్టాలు వేసికొని బాలసూర్యులవలెఁ బయలుదేఱి జనకసభను జేరి వారి వాక్చమత్కృతులచే ద్వారపాలురను జనకుని రంజింపఁ జేసిరి. అష్టావక్రుఁడు వాదమున వంది నోడించి జనకుని గౌరవము లంది తండ్రిని విడిపించుకొని తండ్రియాజ్ఞచే సమంగానదిలో మునిఁగి నిర్వక్రుఁడు దివ్యసుందరుఁడునై తనతోఁ దుల్యుఁ డని జనకాదులచే ననిపించుకొన్న మేనమామ యగుశ్వేతకేతునితో విజయియై యింటికి విచ్చేయఁగా నెల్లరు మాతులభాగినేయుల లోకాతీతశక్తుల కచ్చెరువందిరి.

శ్వేతకేతుఁ డచిరకాలముననే సర్వవేదశాస్త్రములను తద్రహస్యములను, ధర్మమర్మములను దెలిసికొని పున్నమచంద్రునివలె షోడశకళాపరిపూర్ణుఁడై ప్రకాశింపఁ జొచ్చెను.

## శ్వేతకేతునివిజ్ఞానము

శ్వేతకేతుఁడు బ్రహ్మచర్యదీక్ష వహించి మహాతపస్సు చేసెను. ఆ పిమ్మట నాతఁడు బ్రహ్మజ్ఞానమును గడించి వేదతత్త్వము, క్రియా

స్వరూపము, కర్మఫలత్యాగము లను, ఆత్మజ్ఞానమును సంపాదించెను. అతఁడు ప్రాజ్ఞులలో ప్రాజ్ఞుఁడు, పండితులలో పండితుఁడు, జ్ఞానులలో జ్ఞాని, నిష్ఠాగరిష్ఠులలో నిష్ఠాగరిష్ఠుఁడు తపస్వులలో తపస్వియై బ్రహ్మవర్చసము, జ్ఞానతేజము, విజ్ఞానప్రకాశము తన్నావరింప బాలసూర్యునివలెఁ బ్రకాశించుచుండెను.

ప్రాజ్ఞుఁ డగునుద్దాలకుఁడు రూపగుణవిజ్ఞానసంపన్నుఁ డగు కొడుకును జూచి "నాయనా! నీవు వివాహయోగ్యుఁడవై యున్నావు. బ్రహ్మచర్యము, తపస్సు, విద్య, విజ్ఞానము, రూపము, గుణము– వీనిని సంపాదించినపిదప ఆత్మజ్ఞానమును గుర్తెఱిఁగిన విప్రుఁడు వినయవివేకగుణశాలిని యగుకన్యను బరిణయమాడి యుత్తమగృహస్థధర్మమును పాటించి సర్వఋణములను దీర్చి సన్న్యస్తచిత్తుఁడై సర్వేశ్వరసాన్నిధ్య మందుట సద్బ్రాహ్మణలక్షణము కావున, నీవును పావనముగ జీవనము గడప గృహస్థుఁడవు కమ్ము" అని పలికెను. శ్వేతకేతుఁడు తండ్రిని గాదనఁజాలక యుత్తమకన్యక లభింపఁగనె తాను దప్పక పరిణయమాడుదు ననిచెప్పి తండ్రి నలరించి బ్రహ్మచర్యవ్రతమును బరిపాలించుచునుండెను.

## శ్వేతకేతుని వివాహము

ఆ కాలమున మహాతపస్వి, వేదవేత్త, శాస్త్రవిజ్ఞుఁడు, ఆచారవంతుఁడు, ధర్మజ్ఞుఁడు నగుదేవలమహర్షి యా పరిసరప్రాంతముననే నివసించుచుండెను. ఆ మహర్షికి ధర్మపత్నివలన సువర్చల యను నొక కూఁతురు జనించి చక్కనిచుక్కగాఁ బెరుగుచు పుత్తడి బొమ్మవలెఁ బొలుపాఱుచుండెను. ఆమె తండ్రికడ సర్వవిషయములందును జక్కని వైదుష్య మార్జించెను. అందచందములతో నద్వితీయముగ నలరారు నామెకు విద్యావినయవిజ్ఞానసంపద బంగారమునకుఁ దావి యబ్బిన చందమున నబ్బెను. ఇంతచక్కని చుక్కకు నింతవిజ్ఞానరాశికిఁ దగిన వరు నెక్కడనుండి తెత్తునా యని దేవలమహర్షి తలపోయుచుండెను. తండ్రితలపోఁత తనయ గుర్తెఱింగి "తండ్రీ! నీవు నాకుఁ దగినవరు నన్వేషింపఁ దలపోయుచుండుట నే నెఱింగితిని. కాని, నాకొక్కకోరిక

గలదు. అది నీవు తీర్చుకతప్పదు. గ్రుడ్డివాఁడు గ్రుడ్డివాఁడు కాని వాఁడు నేకకాలముననేయైన మహాత్ముఁ డెవఁడో యాతనికే నీవు నన్నీయ వలయును. అన్యున కీయవలదు" అని పలికెను. అందులకు దేవలుఁడు "బిడ్డా! నీ కోరిక లోకవిరుద్ధము. అంధుఁడై కానివాఁడు, అంధుఁడు కాక యైనవాఁడు-చిత్రమైనమాటలు. అట్టివానిని నీవే చూచుకొనుము. వేదవిదులు, ఆచారవంతులు, ధర్మపరులు, తపశ్శీలురునగు వటువరులను నేను బిలిపింతును. నీ కోరిక ననుసరించి వారిలో నొక్కనిని నీవే యెంచుకొను" మని పలికెను. సువర్చల యట్లే యొనర్పు మని తండ్రికిఁ జెప్పెను.

దేవలమహర్షి తనశిష్యుల నెల్లరినిఁ బిలిచి "వత్సలారా! జన్మకులరూపగుణప్రవర్తనలచే, నుత్తములై వేదాధ్యయనపరులై, బ్రహ్మచర్య వ్రతనిష్ఠులై, తల్లిదండ్రు లుండి వివాహేచ్ఛ గలిగిన వటువరులను సగౌరవముగాఁ దీసికొని రండు. వారిలో నొక్కనిని నాపుత్రిక యగు సువర్చల పరిణయమాడు నని చెప్పి యందుల కంగీకరించిన వారినే తీసికొని రం" డని పంపెను. దేవల శిష్యు లాశ్రమముల కేఁగి సువర్చలావృత్తాంతము, దేవలునికోరిక యెఱిఁగించి పెక్కురు వటువరులను దీసికొని వచ్చిరి.

దేవలుఁడు వారిని సమాదరించి సువర్చలం బిలిచి "తల్లీ! వీరు వేదవేదాంగవేత్తలు, విద్యాసంపన్నులు, సత్కులీనులు, సచ్ఛీలయుతులు, వివాహసంతానేచ్ఛ గలవారు. మహావ్రతు లగువీరిలో నొక్కనిని నీవు వరింపుము" అని పలికెను. అందచందములతో నలరారు నా యిందువదన, బంగారమువంటి యొడలికాంతులు విరాజిల్ల, విద్యావినయవివేకవతియై వా రెల్లరికి నమస్కరించి "వటువరులారా! మీలో నంధానంధుఁ డేకకాలముననే యైనమహనీయుఁ డెవఁడైన నున్న నాతనిని నేను వరించెదను. అన్యులను వరింపఁజాలను. మన్నింపుఁ" డని పలికెను. ఆమెమాటలు విని పెక్కురు తబ్బిబ్బై "యిది యేమి? అంధుఁ డనంధుఁ డెట్లగును? అనంధుఁడంధుఁ డెట్లగును? కన్య లక్షణ వతియే కాని, వక్రబుద్ధి యని యామెఁగొంతెను

కోరిక చెప్పక చెప్పుచున్నది. ఈమెతో మనకేల?" యని ముని కుమారు రెల్లరు వచ్చిన త్రోవఁబట్టి పోయిరి. కాని, తండ్రిపనుపున వచ్చి శ్వేతకేతుఁడు దేవలుని సమీపించెను.

దేవలుఁడు శ్వేతకేతు నధికముగ నాదరించి సువర్చలం బిలిచి "అమ్మా! ఈతఁ డుద్దాలకపుత్రుఁ డగుశ్వేతకేతువు. ప్రాజ్ఞుఁడు, విద్యావినయవివేకనిధి, తపస్వి, ధర్మజ్ఞుఁడు. బ్రహ్మనిష్ఠుఁడు. ఈతఁడు నీకుఁ దగినపతి యని నాకుఁ దోఁచుచున్నది. తరువాత నీయిష్ట" మనెను. సువర్చల యాతనిపైఁ దీవ్రదృష్టి పాఱించెను. ఆమె మాటాడకుండఁ గనే శ్వేతకేతుఁడు "సుందరీ! యెందుల కీసందియము? నేను నీకొఱకే వచ్చితిని. నీవు నా దానవే. సందియ మందకుము. నేను లోకవాసనలఁ దగులక లోకవిషయముల నంధుఁడనై యున్నాను. కాని సంశయరహిత మగుజ్ఞాన చక్షువుఁ గలవాఁడ నగుటఁ బద్మపత్రములవలె నాకను లెంత విశాలములో తిలకింపుము. ఇందువదనా! నీవ న న్నందుము. నిన్ను నా డెంపమునకు హత్తుకొందును. మఱియు వినుము. జగమంతయు మిథ్య. ఇందు కనుట, వినుట, తాకుట, మూర్కొనుట, మాటాడుట, కర్మలు చేయుట, మనస్సుచే సంకల్పించుట, బుద్ధిచే సత్యము నెఱుంగుట మున్నగుకార్యకలాప మంతయు మిథ్య యని యే జ్ఞానసేత్రమునకుఁ దెలియునో ఆ జ్ఞానసేత్రము లేని వాఁడు గ్రుడ్డివాఁడు. అది నాకుఁ గలదు, కనుక నేను గ్రుడ్డిని కాను. మఱి గ్రుడ్డిని! ఎట్లన, లోకులదృష్టిలో వారికివలె నేను వస్తువులఁ జూచుట లేదు. అనఁగా వారియజ్ఞానదృష్టి నాకు లేదు. కావున, వారి భావనలో నేను గ్రుడ్డివాఁడను. ఈ విధముగ నొకేక్షణమున నేను గ్రుడ్డి వాఁడను, గ్రుడ్డివాఁడను గానివాఁడను. ఇంకను వినుము. లోకదృష్టిని నేను నిత్యనైమిత్తికకర్మ లాచరించుచునే యున్నాను. కాని, ఆత్మ దృష్టిని నేను నిష్క్రియుఁడను. ఆ కర్మలఫలము న న్నంటదు. కార్య మగుప్రపంచమునకుఁ గారణ మగుపరమాత్మను నేనే యని యెఱింగిన వాఁడ నగుట నేను బరమశాంతుఁడనై యున్నాను. మఱియు నేను గర్మాచరణమునను గర్మఫలత్యాగమునను మృత్యువును జయించి యమృతుఁడనై జ్ఞానప్రాప్త మగునాత్మానందమున మదమాత్సర్యకామ

క్రోధాదులు లేక ప్రశాంతస్థిరచిత్తుఁడనైతిని. నీకు నేనే భర్తను. నీవే నాభార్యవు. అది నా కిదివఱకే విదిత మగుట నింతదూరము వచ్చితిని. వచ్చితివా ?" యని యూరకుండెను.

సువర్చల సిగ్గుపడి వెనుకకుఁ దగ్గెను. దేవలుఁ డానందించి "సువర్చలా! వచ్చెనా ? తథాస్తనవచ్చునా!" యని వలుకరించెను. సువర్చల మఱింత సిగ్గుపడి లోనికేఁగి సిగ్గుపెందెరలఁ జీల్చుకొని వచ్చిన వరుఁ డని తండ్రిని హెచ్చరించెను. దేవలమహర్షి వెంటనే సగౌరవముగా ఉద్దాలకుని, బంధువర్గమును, ఋషివర్గమును, శిష్యవర్గమును బిలిపించి ముహూర్తనిశ్చయ మొనరించి సర్వసంభారములను సమకూర్చి శాస్త్రోక్తముగ సర్వమునిజన సమక్షమున సువర్చలను శ్వేతకేతున కిచ్చి వివాహమహోత్సవము నిర్వర్తించెను. ఆ దివ్యమంగళ సమయమున "హృత్పుండరీక నివాసుఁడు, సర్వభూతాత్మకుఁడు, సర్వశోభా సముపేతుఁడు నగుశ్రీహరియే యీ శ్వేతకేతురూపమున నిల్చియున్నాఁడా ? ఆ చల్లనితల్లి మహాలక్ష్మి భూలోకవాసుల లోచనములకుఁ బర్వము గావింప నిటు సువర్చలారూపమున విచ్చేసియున్నదా ? లేనిచో ఈదంపతుల ఆ రూపమునకు దివ్యమంగళవిగ్రహత్వ మెట్లులు వచ్చు ?" నని యెల్లరు సమకొనఁ జొచ్చిరి.

అంత దేవలుఁడు "శ్రీధవుఁ డగుమాధవుని ప్రీతికొఱ కీకన్యాదానముఁ జేసితిని. ఆతఁడు సంతోషించుఁగాక! నాపుత్రియు నీపత్నియునగు సువర్చల పతివ్రతయై పుట్టినయింటికి మెట్టినయింటికి ఖ్యాతి గొనితెచ్చుఁగాక!" యని యామెను శ్వేతకేతునకుఁ దలిదండ్రులకు నొప్పగించెను.

## ఆశ్రమనిర్వర్తనము

శ్వేతకేతుఁడు విధ్యుక్తవివాహకార్యకలాప మంతయు ముగిసిన పిమ్మట భార్యను దీసికొని తల్లిదండ్రులయు, అత్తమామలయు దీవెన అంది వేఱుచోట నాశ్రమమును నిర్మించుకొని యందు గృహస్థధర్మము నవలంబించెను.

తొలుత నాతఁడు పత్నితో "కాంతా! వేదోక్తవిధులాచరించి మనము దేవపితృఋషి ఋణములను దీర్పవలయును. నేను నీవు నను భావములతో నున్నాము కనుక మనకీ కర్మకలాపము తప్పదు. నీవు నాతోను నేను నీతోను వీని నాచరించి పిదప జ్ఞానాగ్నియందు వానిని భస్మమొనరింతము. ఉత్తము లేది చేయుదురో సామాన్యు లది చేయుదురు. అందుచేతనే జ్ఞానులును గర్మమానరు. జ్ఞానముచేతనే వారు మానినను అజ్ఞానులు కర్మమానుటలో మాత్రము వాని ననుసరింతురు. దానివలన లోకము కర్మభ్రష్టమై సర్వభ్రష్ట మగును. కావున, మనము లోకశ్రేయమునకు ఆత్మశ్రేయమునకును సద్గృహస్థకర్మము లాచరింత" మని పలికెను. ఆమె సర్వవిధముల నాతనియడుగుజాడలనుబట్టి నడచుచు నుత్తమ సాధ్వియై యుండెను. రత్నముప్రక్క రత్నముచేరిననే శోభించునుగాని మసిబొగ్గు చేరిన శోభింపదుగదా!

## జ్ఞా న బో ధ

ఈ విధముగా సువర్చలాశ్వేతకేతు లనుపమాన ధర్మము లాచరించుచు నుత్తమపుత్త్రసంపదఁ బడసి పితరులను, అనేకయజ్ఞము లొనరించి దేవతలను, తపస్స్వాధ్యాయసత్ప్రవర్తనలచే ఋషులను సంతోషపఱిచి యా పుణ్యదంపతు లాత్మజ్ఞానమున ద్వంద్వాతీతులై భువిపై దివి చూచుచుఁ జూపుచు, అన్నిటికి సాక్షిభూతులై మాత్రము తా ముండి, మానవలోకమున నున్నను మాధవలోకమున నున్నట్లు వర్తించి యపూర్వదంపతులై యలరారిరి.

ఒకనాఁడు సువర్చల భర్త నిట్లడిగెను. "బ్రహ్మజ్ఞా! నీ వన నెవరు? పాంచభౌతికమై కంటికిఁ గనఁబడు నీ శరీరమా నీవు? కానిచో నీ వను దానితత్త్వమును నిపుణముగఁ దెలుపుము." ఆమెకు శ్వేతకేతుఁ డిట్లనెను. "కాంతా! నీవు నన్ను బ్రహ్మజ్ఞా యని పిలిచితివి. అందులోనే నీవు నన్నెఱిఁగినట్లు స్పష్టము. ఇఁక వేఱే యడుగనేల?" "నీ దేహాంతర్గత మగుఆత్మ నడుగుచున్నాను" అని సువర్చల యనెను "అగుచో, ఆత్మ మాటాడదు, తినదు, కనదు, వినదు, పుట్టదు, చావదు.

శరీరసంబంధమునఁ జేసి ఆత్మకు జననము కలదని యనుకొనునాఁడు దానికి బంధమును గలదు. నీవు నేను, నేను నేను సర్వముః నేను అని యనుకొనునాఁడు శరీరమే లేదు." అని శ్వేతకేతుఁడు చెప్పెను. ఆ మాటలు విని యామె "మహాత్మా! నీ వింతప్రాజ్ఞుఁడవై యుండియు నజ్ఞానివలె సమస్త కర్మలు నొనర్చుచున్నావు. సహధర్మచారిణి నగుట నేను నిన్ననువర్తించుచున్నాను. ఇందు గీఖావ మేమి? దయతో సెల విమ్ము" అని కోరెను. అతఁ డిట్లనెను. "సుదతీ! పెద్ద లాచరించినది పిన్నలకు ఒరవడి యగును. లోకవ్యవహారము సక్రమముగ నడచుట కెల్లరును గర్మ లాచరింపవలయును. కర్మహీనతవలన జాతి నిర్వీర్యమై లోకము చిందరవందర యగును. ధర్మము నశించును. చిన్నచేఁపను మ్రింగుపెద్దచేఁపవలె బలవంతుఁడు బలహీనునిఁ గబళించును. సర్వలోక కర్త భర్త హర్త యగు పరాత్పరున కది యనిష్టము. మఱియు సర్వ జగత్సృష్టియు భగవంతునికిఁ గ్రీడామాత్రము. అతని విభూతు లనంత ములు. అతని శక్తు లపారములు. సృష్టిస్థితిలయము లను పెనుగహ్వర ముల జీవి చిక్కుకొని యున్నది. జననమరణసంసారరూప మగు బంధ ములఁ దెగద్రెంపుకొని యెవఁ డాత్మజ్ఞానము నందుచున్నాఁడో వాఁడు భగవంతునికిఁ బ్రియుఁడు. అట్లుగాక జనన మరణసంసారప్రవాహ మధ్యమునఁ గొట్టుకొనిపోవుచు దుర్మార్గుఁ డగునిర్భాగ్యుఁడు నరకకూప మున మ్రగ్గుచుఁ దనచుట్టునుగల బంధములఁ ద్రెంచుకొనుటకు బదులు పెంచుకొనుచుండును. ఇట్లముగ నలముకొన్న యజ్ఞానతిమిరమునఁ బడి యది తన యదృష్టవిశేష మని యహంకరించుచు నిర్భాగ్యుఁ డగు నరుఁడు నిత్యపతనము నందుచునే యుండును. కావున, దేహశుద్ధి కొఱకు ఆత్మజ్ఞానవికాసముకొఱకు, లోకమువారికి ఒరవడి యగుట కొఱకు నేను సత్కర్మాచరణముఁ జేయుచున్నాను. దేహపతనపర్యంతము నట్లొనరించుచునే యుండవలయును."

ఆ మాటలకు మిగుల నానందించి సువర్చల "దేవా! శబ్దము, అర్థము వీనిని వివరింపు" మని కోరెను. "అక్షర సంపుటి నుచ్చరింపఁగా వెలువడునది శబ్దము. ఆ శబ్దముచేతఁ దెలుపఁబడున దేదియో అది యర్థము. శబ్దార్థములకు నిత్యసంబంధము లేదు. ఉచ్చారణనుబట్టి

పరిస్థితులను బట్టి శబ్దార్థము మాఱుచుండును. కావున, వానికిసంబంధ మున్నది, లేదు'' అని శ్వేతకేతుఁ డనెను. "ఐనచో నది పరస్పర విరుద్ధముగాలేదా ?'' యని సువర్చల పలికెను. "కాదు. వైరుద్ధ్యమే మియు లేదు. నే ననుశబ్ద మాత్మపరమైనపుడు సత్యము, అనాత్మపర మైనపు డసత్యము. అందుచే నది సత్యము నసత్యమును. మఱియు బ్రహ్మ సత్యము. జగత్తు మిథ్య. మిథ్య యగు జగత్తు లేదా? ఉన్నది. నిజమున కున్నదా? లేదు. ఇది తథ్యమిథ్యాతత్త్వము. ఇది తెలిసికొనుట కష్టము. కావున, ఆత్మవాచ్యశబ్దార్థము పరమేశ్వరుఁడు, అనాత్మాశ్రితశబ్దార్థములు రెండును మిథ్య" అని శ్వేతుకేఁతువు బదులు చెప్పెను.

"ఆత్మ, అహంకారము వీనినిగూర్చి తెలుపు" మని సువర్చల యడుగఁగా శ్వేతకేతు విట్లు తెలిపెను. "కాంతా! మట్టియందు ఘట మనుభావ మున్నట్లు, ఆత్మయందు అహంకారము కల్పితమైయున్నది. అచింత్యము, పరము నైనది, ఆత్మవస్తువు. దీనియందు 'నేను నాది, నీవు, నీది, ఇది' అనునవి కల్పితములు. ఈ భావమే అహంకారము. లోకమున నాకాశ మున్నది. కాని రెండింటికి సంబంధములేదు. అదే విధముగాఁ బరిశుద్ధ మగుపర బ్రహ్మము (తెలుప, చూప, శక్యము కానిది) —నుండి జగ ముద్భవించినను దానికి దీనికిని సంబంధము లేదు. మఱియు, ఆకాశమును ముట్టి, పట్ట వీలు లేకపోయినను, వాయువును త్వగింద్రియము చేతను, వాసనను ఘ్రాణేంద్రియముచేతను, చీఁకటి, వెలుఁగు, మేఘములు, నక్షత్రములు మున్నగువానిని చక్షురింద్రియము చేతను మానవుఁడు తెలిసికొనఁగలుగుచున్నట్లు సద్రూప మగు పర బ్రహ్మము ఆకాశమున కాకాశ మని చెప్పఁబడుచున్నది విష్ణ్వాద్యవతారములచేఁ జూడఁబడుచు, బుద్ధిచేఁ జింతింపఁబడుచు నున్నది. జల మొక్కటి యైనను, అది ప్రవహించు తావులను బట్టి రుచి భేదములను బొందుచున్నట్లే ఆత్మవస్తువుకూడఁ బ్రకృతిసంబంధమువలన వివిధములుగాఁ దోఁచుచున్నది. ఎచ్చటిపరిశుభ్రజలమైనను త్రావి మానవుఁడు తృప్తిపడునట్లు, ఏరూపమున భావింపఁబడుచున్న పరమాత్మను సేవించియు నరుఁ డుత్తమఫలితమును బొందఁగలుగును. పర

మాత్ముఁడు అవాఙ్మనసగోచరుఁ డయ్యు–సాధనోపదేశమార్గసూచక ఉపలక్షణవ్యాకృతిపద్ధతులచే నాతఁడు వేదవేద్యుఁ డగుచున్నాఁడు. పరిశుద్ధజ్ఞానము ఆత్మవిషయికధ్యానముచేఁ గలుగును. దానివలన నుత్తమగతి కలుగును. పరమాత్మ విభూతులు బహుళములు. వాయుదేవుఁడు, అగ్నిహోత్రుఁడు, సూర్యభగవానుఁడుకూడఁ బరమాత్మునెఱుంగరు. ఆ పరమాత్ముఁడు జగద్వ్యాపి. బ్రహ్మజ్ఞానసంపన్నులు మాత్రమే పరమాత్మ నెఱింగి యది తా మగుచున్నారు ''

శ్వేతకేతుఁ డీ విధముగా నాయా బ్రహ్మజ్ఞానవిషయములు సమయోచితముగా భార్యకుఁ దెలుపుచు నామెను జ్ఞానవంతురాలినిగావించెను. జ్ఞానసౌభాగ్యమును గాంచిన యా పుణ్యదంపతులట్లు చిరకాలము గృహస్థాశ్రమమున నుండి తుదకు సన్న్యస్తచిత్తులై గోవిందునిపదపద్మముల మనస్సులు నిలిపి మరణానంతర ముత్తమగతులను మోక్షసామ్రాజ్యమును జూఱగొనిరి.*

## శ్వేతకేతుతీర్థము

సమంగానది చెంత సోమకశిబి తీర్థముల సామీప్యమున శ్వేతకేతు మహర్షి తపము చేసినచోటు 'శ్వేతకేతుతీర్థ' మని జగత్ప్రసిద్ధిగాంచెను. ఈ తీర్థప్రదేశమున సకలవృక్షములు సర్వకాల సర్వావస్థలయందు సకలఫలపుష్పసహితములై బహు రమణీయములై యుండును. ఈ పవిత్రాశ్రమముననే వాగ్దేవత యగు సరస్వతి మానుషదేహధారిణియై శ్వేతకేతునకు దర్శన మొసంగి యాతనికడ నుండి కరుణించెను.*

---

* భారతము; మోక్షధర్మపర్వము.

* భారతము ; ఆరణ్యపర్వము.

36313

# మహర్షుల చరిత్రలు-7

# ముందుమాట

మహర్షులు మంత్రద్రష్టలు; మంత్రపతులు. పవిత్రమైన భారతావనిలో ఎందరో మహర్షులు అవతరించి బ్రహ్మనిష్ఠాగరిష్ఠులై లోకోపకారకములైన ఎన్నో ఘనకార్యాలు నిర్వర్తించారు. ప్రజా సముదాయం ఆ మహర్షుల ఋణాన్ని ఎన్నటికీ తీర్చుకోలేదు. యుగయుగాల భారతీయ సంస్కృతినీ, విజ్ఞానమునూ విశ్వమునకు చాటిన ధర్మస్వరూపులు వారు. తపస్స్వాధ్యాయ నిరతులై, నిగ్రహానుగ్రహ సమర్థులై, త్రికాలజ్ఞులైన మన మహర్షుల గురించిన విషయము లెన్నో శ్రుతిస్మృతి పురాణేతిహాసాలలో కనిపిస్తాయి. వారు స్వయంగా ధర్మమును ఆచరించి లోకానికి ఆదర్శప్రాయులైనారు. అనేక ధర్మశాస్త్రాలు రచించి ప్రపంచానికి ఉపకరించారు.

నారదుడు సంగీతమునకు, పరాశరుడు స్మృతికీ, హోరా శాస్త్రమునకూ పెట్టిన భిక్షయే ఈ నాటి మేటి విద్వాంసులందరికీ శరణ్యం. నేటికీ మన భారత భూమిలో అసమాన మహిమాన్వితులైన యోగిపుంగవులు తమ ధర్మప్రబోధముతో భక్తులను తరింప జేస్తున్నారు.

"మహర్షుల చరిత్రలు" అను ఈ ఏడవ సంపుటంలో ఉపమన్యు మహర్షి, ఋభుమహర్షి, కాత్యాయన మహర్షి, గృత్సమహర్షి, తండి మహర్షి, మృకండు మహర్షి, వాత్స్యాయన మహర్షి, విపుల మహర్షి, సాందీపని మహర్షి, ఆస్తీక మహర్షి, కౌశికమహర్షి, దక్షమహర్షి, మున్నగు వారి చరిత్రలు సాకల్యంగా పౌర్వాపర్య సందర్భ సమన్వితంగా విచారింప బడినవి. ప్రతి మహర్షి జీవితాన్నిగూర్చి చదివినపుడు పఠితలు ఎన్నో అమూల్య విషయాలు ఆకళింతకు తెచ్చుకొని ప్రయోజనంపొందగలరు. భారతీయు లందరికీ మహర్షుల జీవిత చరిత్రలు అవశ్య పఠనీయాలే.

అనేకములైన ఇతిహాస పురాణాలను చక్కగా అవలోకనము చేసి సర్వజనావబోధకమైన సరళసుందర శైలిలో శ్రీ బులుసు వేంకటేశ్వరులు గారు రచించిన మహర్షుల చరిత్రలలో ఇది ఏడవ సంపుటం.

సనాతన ధర్మప్రచారమునకై శ్రీ తిరుమల తిరుపతి దేవస్థానముల వారు వెలువరచుచున్న ధార్మికగ్రంథ వరంపరలో ఈ మహర్షుల చరిత్రలుకూడ ఆంధ్రపాఠకుల ఆదరాభిమానాలు సంపాదించుకొనగలవని మా విశ్వాసము.

తిరుపతి,<br>5–6–89.

సి హెచ్ వేంకటపతిరాజు,<br>కార్యనిర్వహణాధికారి, తి. తి. దే. తిరుపతి.

# విషయసూచిక


| విషయము | | పుట |
|---|---|---|
| ఉపమన్యు మహర్షి | .... | 1 |
| ఋభు మహర్షి | .... | 18 |
| కాత్యాయన మహర్షి | .... | 31 |
| గృత్సమద మహర్షి | .... | 45 |
| తండి మహర్షి | .... | 57 |
| మృకండు మహర్షి | .... | 70 |
| వాత్స్యాయన మహర్షి | .... | 81 |
| విపుల మహర్షి | .... | 105 |
| సాందీపని మహర్షి | .... | 111 |
| సారస్వత మహర్షి | .... | 118 |
| ఆస్తీక మహర్షి | .... | 124 |
| ఉతథ్య మహర్షి | .... | 138 |
| ఋచీక మహర్షి | .... | 156 |
| కామందక మహర్షి | .... | 165 |
| కౌశిక మహర్షి | .... | 172 |
| దక్ష మహర్షి | .... | 184 |
| దీర్ఘతమో మహర్షి | .... | 203 |
| సౌభరి మహర్షి | .... | 228 |


* రచయితచే పూర్వముద్రితములైన ఏడు, ఎనిమిది భాగములను కలిపి ఒకే సంపుటముగా ముద్రించుట జరగినది.

ప్రకాశకులు

తిరుమల తిరుపతి దేవస్థానములు.

# మహర్షుల చరిత్రలు

## ఉపమన్యు మహర్షి

### జననము

శ్రీమంతమగు భారతదేశమునఁ గృతయుగమున మహా తపశ్శాలియు మహాత్ముఁడు నగు వ్యాఘ్రపాదుఁ డను మహర్షి యుండెను. అతఁడు గృహస్థాశ్రమమును నిర్వహించినపు డాతని ధర్మపత్నియం దిరువురు పుత్రులను గాంచెను. పెద్దవాఁడు ఉపమన్యువు. చిన్నవాఁడు ధౌమ్యుఁడు. వేదవేదాంగవేత్తయు, మహాతత్త్వవేత్తయు నగు వ్యాఘ్రపాదుఁ డనవరతము నిరుపమ నిష్ఠాగరిష్ఠుఁడై నిత్యతపోధ్యాన సమాధిస్థితుఁడై యుండుచుండెను.*

ఉత్తమపతివ్రతాతిలక మగు నా మహర్షి యిల్లాలు పిల్లల నల్లారు ముద్దుగాఁ బెంచుచుఁ బతి యడుగుజాడలలో నడచుచు వివేకవతియు విజ్ఞానఖనియు నై యుండెను. పుత్రు లిరువురు పెరిగి పెద్దవా రగుచు నొకనాఁడు బంధువులింటఁ బాయసాన్నముఁ దిని రుచిమరఁగి యట్టి పాయసాన్నము వండి పెట్టు మని తల్లిని గోరిరి. ఆ తల్లి పాయసాన్నము లేదన్నఁ బిల్లలయుల్లము నొచ్చునని చింతిల్లి పిష్టరసమును దయారుచేసి బిడ్డల కిచ్చెను. కాని, యది రుచింపమిఁ బాయసాన్నమే కావలయు నని వారు మారాము చేసిరి. అప్పుడు తల్లి పిల్లల చుబుకములు పుడుకుచు మూర్ధము లాఘ్రాణించి ముద్దు పెట్టుకొని "యావులేనిదే పాలురావు. పాలు లేనిదే పాయసాన్నము రా"దని వారికిఁ జెప్పెను. వారంత "నావు నెవరిత్తురు? మా కోరిక తీర్చువా రెవ"రని యడిగిరి. అనంతర మా మహాసాధ్వి యీశ్వరు నర్చించిన సర్వకామ్యములు సమ

---

* ఇది భారతానుశాసనికపర్వమునఁ గలదు. ఈ కథ తిక్కన భారతానుశాసనికమున లేదు. కారణము తెలియదు. సంస్కృతవాచస్పత్యమున నుపమన్యుఁ డాయోదధౌమ్యశిష్యుఁ డని కలదు. "ధౌమ్యోనామాయోదస్తస్య త్రయశ్శిష్యాః బభూవుః, ఉపమన్యు రారుణిర్వేద శ్చేతి..."

కూరు ననియు నంతకు మించి కోరికలఁ దీరుపఁ గలవా రెవరును లే రని నుడివెను. ఆ మాట లాలించిన యా బాలురలోఁ బెద్ద ముద్దులు మూటగట్ట "నీశ్వరుఁ డెట నుండునో తెలుపుము. నే నాతనికడ కేగి కోరికలఁ దీరుపు మని యడుగుదు" నని పలికెను.

## మాతృోపదేశము

ఈశ్వర ప్రేరిత యైనయామె యీశ్వర రహస్య విజ్ఞానవంతురా లగుటచే నీశ్వరభక్తి పొంగిపొరల నమృతపు జడులఁ బోలిన నుడులతో నిట్లు పలికెను. "బిడ్డా! ఉపమన్యూ! ఈశ్వరు నెఱుఁగ నెవ్వరికిని శక్యము కాదు. అతఁడు పుణ్యాత్ములకే గోచరించును. ఆతనిరూపములు పెక్కు లని పెద్దలు పలుకుదురు. ఆతనిదయ పలుతెఱఁగులు. అతఁ డుండుచోటు లనంతములు. ఆతని శుభచరిత్ర మిది యిది యని తుదముట్ట నెవ్వరును బలుక లేరు. ఇంతకు నాతఁ డన్నిజీవులకు నంతరాత్మయై యుండును. భక్తులకుఁ బరమదయతో దర్శన మొసంగును. మహాత్ములగు మునులాతని దివ్యరూపములను గుఱించియుఁ జిత్రచరిత్రములను గుఱించియుఁ జెప్పుకొనుచు నానంద మందుచుందురు. ఆతఁడే బ్రహ్మవిష్ణుసురేంద్రులయు రుద్రాదిత్య విశ్వేదేవులయు, నరదేవనారదులయు, భూత ప్రేత పిశాచాదులయు, దైత్యదానవులయు, సింహవ్యాఘ్రాదులయు, హంస కాకమయూరాదులయు, ఋషిగంధర్వ సిద్ధచారణాదులయు, అండజ, స్వేదజ, ఉద్భిజ్జములయు రూపములు ధరించును. ఏకముఖుఁడు, ద్విముఖుఁడు, త్రిముఖుఁడు, షణ్ముఖుఁడు, బహుముఖుఁడు నగు చుండును. ఒక్కతల. పెక్కుతలలు, ఒక్కపాదము, పెక్కుపాదములు పెక్కుచేతులు నొక్కట ధరించును. నవ్వుట, ఏడ్చుట, కోపించుట. శాంతుఁడగుట, గంతులువేయుట, మున్నగు పను లాతఁడు చేయును, ఒకపుడు బాలుఁడు, మఱొకపుఁడు యువకుఁడు, ఇంకొకపుడు వృద్ధుఁడు నగును. అన్నా! ఎన్నని చెప్పఁగలను! ఉపమన్యూ! నీ వాతని నాశ్రయింపుము. నీ కోరిక సిద్ధించును."

## తపస్సు

తల్లిమాటలు విని యుపమన్యుఁడు బయలుదేఱి వెడలి యొక యేకాంత ప్రదేశమున నెడమకాలిబొటనవ్రేలిపై నిలిచి మహాతపస్సు చేయ

నారంభించెను. నూఱేండ్లు పండ్లుమాత్రము తిని, మఱినూఱేండ్లు రాలిపడిన యాకులుమాత్రము తిని, ఇంకొక నూఱేండ్లు నీరుమాత్రము త్రాగి, యింకొక నూఱేండ్లు గాలిమాత్రము పీల్చి మొత్తము వేయిసంవత్సరము లుపమన్యువు పరమశివు నారాధించెను.

ఈశ్వరుని కాతనిపై దయకలిగి యాతనిం బరీక్షింప నెంచి యింద్రునిరూపముతో దేవత లెల్లరును సేవింప నచటికి విచ్చేసెను. వేయికన్నులతో, వీర్యవంత మగు వజ్రాయుధముతో, నొక భయంకర మగు నేనుఁగు నెక్కి వచ్చిన యాతఁడు "మునీంద్రా! నీ తపమునకు మెచ్చితిని. నీకుఁ గావలసినవర మనుగ్రహింతును. కోరుకొను" మనెను. అంత నుపమన్యుఁ డాతని నిరాకరించి పశుపతినిదక్క నే నొండొరు నర్థింపను.

"పశుపతివచనా ద్భవామి సద్యః
క్రిమి రథవా తరు రప్యనేకశాఖః,
అపశుపతి వర ప్రసాదతో మే
త్రిభువనరాజ్యవిభూతి రప్యనిష్టా.

ఈశ్వరునియాజ్ఞ యైనచో నొకకీటకము నయ్యెదను. లేదా నిట్టల మగు చెట్టు నయ్యెదను. అంతేకాని త్రిభువన సామ్రాజ్య మిచ్చినను ఇంకొకని వరము నా కక్కఱ లేదు.

"న నాకపృష్ఠం న చ దేవరాజ్యం
న బ్రహ్మలోకం న చ నిష్కళత్వమ్
న సర్వకామా నఖిలాన్ వృణోమి
హరస్య దాసత్వ మహం వృణోమి.

నా కా మహేశ్వరుని దాసత్వమే కావలయును. స్వర్గము వలదు. దేవ రాజ్యము వలదు. బ్రహ్మలోకము వలదు. మోక్షమే వలదు. నా కే కామ మును వలదు.

"యావ చ్ఛశాంకధవళామలబద్ధమౌళి
ర్న ప్రీయతే పశుపతి ర్భగవాన్ మహేశః,
తావ జ్జరామరణజన్మశతాభిఘాతై
ర్దుఃఖాని దేహనిహితాని సముద్వహామి.

శశాంకుఁడు, పశుపతి, భగవానుఁడు నగు మహేశుఁ డెంతవఱకుఁ బ్రీతుఁడు కాఁడో, అంతవఱకు జరామరణ జన్మశతముల దెబ్బలను తినవలసినవాఁడ నగుచున్నాను. నేను చేసినపాపములకు జన్మము లింకను దప్పనిసరి యగుచో నాకు జన్మజన్మమునను నీశ్వరభక్తి యక్షయముగ నలవడును గాక!" అని పలికెను. ఇంద్రుఁ "డోయీ! ఈశ్వరుఁ డనుచున్నావు. ఆతఁ డెట్టివాఁడో తెలుపు" మని యడిగెను.

అందుల కుపమన్యు వపరిమిత శివభక్తి పారవశ్యమున నిట్లు పలికెను.

"సదసద్వ్యక్త మవ్యక్తం య మాహుః బ్రహ్మవాదినః,
నిత్యమేక మనేకం చ వరం తస్మా ద్వృణీమహే.
అనాదిమధ్యపర్యంతం జ్ఞానైశ్వర్య మచింతితమ్,
ఆత్మనాం పరమం యస్మాద్వరం తస్మాద్వృణీమహే.
ఐశ్వర్యం సకలం యస్మా దనుత్పాదిత మవ్యయమ్,
అబీజాద్బీజసంభూతం వరం తస్మా ద్వృణీమహే.

బ్రహ్మవాదు లెవనిని సత్, అసత్, వ్యక్త, అవ్యక్త రూపుఁ డని భావింతురో, నిత్యునిగను, కేవలునిగను అనేక రూపిగను భావింతురో ఆతనినుండి నేను వరము కోరుచున్నాను. ఆదిమధ్యాంతశూన్యుఁడు, జ్ఞానాత్ముఁడు, అచింత్యుఁడు, పరమాత్మ యెవఁడో వానినుండి నేను వరము గోరుచున్నాను. సమస్తైశ్వర్యము లెవనినుండి కలుగునో, అవ్యయుఁడు, అనుత్పాదితుఁడు, అబీజ బీజ సంభూతుఁ డెవఁడో అతని నుండి నేను వరము గోరుచున్నాను.

నీతో నాకు హేతువాద మేల? ఏమైనను నేనా సర్వేశ్వరునుండియే వరము కోరుదును కాని నీకడ నుండి కాదు సుమా" యన్నను.

## ఈశ్వర సాక్షాత్కారము

అపు డామహర్షికి హంస కుందేందుసదృశము, మృణాళరజతప్రభ గలది, వృషభరూపమున నైరావతము ప్రత్యక్ష మయ్యెను. అది క్షీర సాగరమువలెఁ దెల్లనై నల్లనితోఁక, పర్వతమంత మేను, మధుపింగళ వర్ణముగల కన్నులు, వజ్రములవంటి కొమ్ములు, మేలిమిబంగారు కాంతి గలిగి యుండెను. దానియొడలి నిండుగ సువర్ణమాలిక అలంకరింపఁబడి యుండెను. చక్కని మూతి, చక్కనిడెక్కలు, చక్కనిముక్కు, చక్కని చెవులు మున్నగువానితో నది యతిమనోహరముగ నుండెను. తుషారగిరికూటమువలె, సితాభ్రశిఖరముభంగి నొప్పు నావృషభమును బార్వతితో నెక్కినశివుఁడు పున్నమ చంద్రునివలెఁ బొలుపొందెను. అతని తేజము వేయిసూర్యులకాంతివలె వ్యాపించెను. ప్రళయకాలభానునిభంగి ఆ పరమేశ్వరుఁడు చూడ శక్యుఁడు కాకుండెను. ఉపమన్యువిది యేమని పరికించుచుండఁగా నా దివ్యతేజ మెల్లెడల మిఱుమిట్లుగొలిపి యంతర్ధాన మయ్యెను. అచట మహేశ్వరుఁడు వృషభారూఢుఁడై, సౌమ్యుఁడై పార్వతీసహితుఁడై యాతనికిఁ బొడగట్టెను. ఇది యిట్టిదని చెప్పరాని రూపము, ఇంతింతనరానిమహాతేజము వెలయ నీలకంఠుఁడు అష్టాదశ భుజుఁడు, సర్వాభరణభూషితుఁడు, శుక్లాంబరధరుఁడు, శుక్లమాల్యానులేపుఁడు, శుక్లధ్వజుఁడు, శుక్లయజ్ఞోపవీతుఁడు నయి యా దేవుఁడు కానవచ్చెను. ఆతనిచుట్టు నతనివంటిపరాక్రమము, రూపము గలిగిన యనుచరు లుండిరి. వా రాతనిస్తోత్రగీతము పాడుచు నానందమున నాడుచుండిరి. ఆతఁడు బాలేందుశేఖరుఁడై తెల్లని శరీర కాంతులు కలిగి ముగ్గురు సూర్యులవలె మూఁడు కన్నులు తేజఃకాంతులు చిమ్మ నొప్పారుచుండెను. తెల్లనగు నాతనిమేన రత్నములతోను బద్మములతోను గూర్పఁబడిన మనోహరమాలిక యుజ్జ్వలకాంతి నీనుచుండెను. ఆతని యస్త్రములు సర్వతేజోమయములై మూర్తిమంతములై యుండెను. ఆతనిధనువు ప్రళయాగ్నితుల్యమై సూర్యసన్నిభమైనయొకబాణము, మహాఘోరమై దివ్యమైనపాశుపతాస్త్రము, ఏడు తలలు, తీక్ష్ణదంష్ట్రలు, విషోల్బణము గలిగి యావింటిపై కంఠముంచిన యొకమహాసర్పము ఉపమన్యునకుఁ గానిపించెను. పరమేశ్వరుని

శూలము, తీక్ష్ణాగ్రమై భయంకరమై, రోమహర్షణమై, అనిర్వాచ్యప్రభావమై, రుద్రునిసన్నిధి నాతనికిఁ గానవచ్చెను. తళతళలాడుపిడి గలిగి, రౌద్రమగునగ్రము కలిగి, సర్పకంఠమువలె ముందున్నతభాగము కలిగి, దీప్తాగ్నిశతమువలె వెలుఁగొందు పరమేశ్వరునిపరశువు ఉపమన్యువునకు స్పష్టముగాఁ గానవయ్యెను. ఆతనికుడిప్రక్క లోకపితామహుఁ డగు బ్రహ్మ హంసయుక్తమై మనోవేగము గల విమానము నెక్కియుండెను. ఆతనియెడమప్రక్క గదాశంఖచక్రములతో నారాయణుఁడు, గరుడారూఢుఁడై యుండెను. మయూర వాహనుఁడగు కుమారస్వామి తల్లి దగ్గర నుండెను. శక్తిఘంటలతో రెండవయగ్నివలె నాతనియెదుట నంది యుండెను. స్వాయంభువాదు లగు మనువులు, భృగ్వాదులగు మహర్షులు, ఇంద్రాదులగు దేవతలు, శివుని జుట్టియుండిరి. సర్వభూతగణములు, సప్తమాతృకలు, నాతనికి నమస్కరించుచు నలువంకల నిలిచిరి. సురలు మహాస్తోత్రముల శంకరుని నుతించిరి. బ్రహ్మయాతనిని రథంతరసామమున స్తుతించెను. నారాయణుఁడు నాతని సామములచేఁ గీర్తించెను. ఇంద్రుండు శతరుద్రీయమున నాతనిఁ బరబ్రహ్మ యని కొనియాడెను.

అప్పు డుపమన్యు వా మహేశ్వరునికి సాష్టాంగ మెరఁగి ఆనంద బాష్పములతో నిట్లని స్తుతించెను.

"నమో దేవాదిదేవాయ మహాదేవాయ వై నమః
శక్రరూపాయ శక్రాయ శక్రవేషధరాయ చ.

నమస్తే వజ్రహస్తాయ పింగళాయారుణాయ చ
పినాకపాణయే నిత్యం శంఖశూలధరాయ చ.

నమస్తే కృష్ణవాసాయ కృష్ణాకుంచితమూర్ధజే,
కృష్ణాజినోత్తరీయాయ కృష్ణాస్వభిరతాయ చ.

శుక్లవర్ణాయ శుక్లాయ శుక్లాంబరధరాయ చ,
శుక్లభస్మావలిప్తాయ శుక్లకర్మరతాయచ.

నమోస్తు రక్తవర్ణాయ రక్తాంబరధరాయ చ,
రక్తధ్వజపతాకాయ రక్తస్రగనులేపినే.

నమోస్తు పీతవర్ణాయ పీతాంబరధరాయ చ,
నమోస్తు పీతచ్ఛత్రాయ కిరీటవరధారిణే.

అర్ధహారార్ధకేయూర స్వర్ణకుండలకర్ణినే,
నమః పవనవేగాయ నమోదేవాయవై నమః.

సురేంద్రాయ మునీంద్రాయ మహేంద్రాయ నమోస్తుతే,
నమఃపద్మార్ధమాలాయ ఉత్పలైర్మిశ్రితాయ చ.

అర్ధచందనలిప్తాయ అర్ధస్రగనులేపినే,
నమ ఆదిత్యవక్త్రాయ ఆదిత్యనయనాయ చ.

నమ ఆదిత్యవర్ణాయ ఆదిత్యప్రతిమాయ చ,
నమస్సోమాయ సౌమ్యాయ సౌమ్యవక్త్రధరాయ చ.

సౌమ్యరూపాయ ముఖ్యాయ సౌమ్యదంష్ట్రా విభూషిణే,
నమ శ్శ్యామాయ గౌరాయ అర్ధపీతార్ధపాండవే.

నారీనరశరీరాయ స్త్రీ పుంసాయ నమోస్తు తే,
నమో వృషభవాహాయ గజేంద్రగమనాయ చ.

దుర్గమాయ నమస్తుభ్య మగమ్యగమనాయ చ,
నమోస్తు గణగీతాయ గణబృంద రతాయ చ.

గణానుయాతమార్గాయ గణనిత్యవ్రతాయ చ,
నమశ్శ్వేతాభ్రవర్ణాయ సంధ్యారాగప్రభాయ చ.

అనుద్దిష్టాభిధానాయ స్వరూపాయ నమోస్తు తే,
నమోరక్తాగ్రవాసాయ రక్తసూత్రధరాయ చ.

రక్తమాయావిచిత్రాయ రక్తాంబరధరాయ చ,
మణిభూషితమూర్ధాయ నమ శ్చంద్రార్ధభూషిణే.

విచిత్రమణిమూర్ధాయ కుసుమాష్టధరాయ చ,
నమోగ్నిముఖనేత్రాయ సహస్రశశిలోచనే.

అగ్నిరూపాయ కాంతాయ నమోస్తు గహనాయ చ,
ఖచరాయ నమస్తుభ్యం గోచరాభిరతాయ చ.

భూచరాయ భువనాయ అచరాయ చరాయ చ,
నమో దిగ్వాససే నిత్య మధివాస సువాససే.

నమో జగన్నివాసాయ ప్రతిపత్తిసుఖాయ చ,
నిత్యముద్బద్ధమకుట మహాకేయూరధారిణే.

సర్పకంఠోపహారాయ విచిత్రాభరణాయ చ,
నమస్త్రినేత్రనేత్రాయ సహస్ర శతలోచనే.

స్త్రీపుంసాయ నపుంసాయ నమస్సాంఖ్యాయ యోగినే,
శంయోరభిస్రవంతాయ అథర్వాయ నమోనమః.

నమ స్సర్వార్తినాశాయ నమ శ్శోకహరాయ చ,
నమో మేఘనినాదాయ బహుమాయాధరాయ చ.

బీజక్షేత్రాభిపాలాయ సృష్టిస్థిత్యంత హేతవే,
నమ స్సర్వసురేశాయ విశ్వేశాయ నమోనమః.

నమః పవనవేగాయ నమః పవనరూపిణే,
నమః కాంచనమాలాయ గిరిమాలాయ వై నమః.

నమ స్సురారిమాలాయ చండవేగాయవై నమః.

బ్రహ్మశిరోపహర్త్రాయ మహిషఘ్నాయవై నమః,
నమస్త్రిరూపధారాయ సర్వరూపధరాయ చ.

నమ స్త్రిపురహర్త్రాయ యజ్ఞవిధ్వంసనాయ చ,
నమః కామాంగనాశాయ కాలదండధరాయ చ.

నమ స్స్కందవిశాఖాయ బ్రహ్మదండాయవై నమః,
నమో భవాయ శర్వాయ విశ్వరూపాయవై నమః.

ఈశానాయ భవఘ్నాయ నమో స్త్వంధకఘాతినే,
నమో విశ్వాయ మాయాయ చింత్యాచింత్యాయవై నమః.

త్వంనో గతిశ్చ శ్రేష్ఠశ్చ త్వమేవహృదయం తథా,
త్వం బ్రహ్మ సర్వదేవానాం రుద్రాణాం నీలలోహితః.

ఆత్మా చ సర్వభూతానాం సాంఖ్యేపురుష ఉచ్యతే,
నమ స్తే భగవన్ దేవ నమ స్తే భక్తవత్సల,
యోగీశ్వర నమస్తేస్తు నమస్తే విశ్వసంభవ." *

---

* ఉపమన్యుకృత శివస్తోత్రము (పాఠాంతరము)

జయశంకర! పార్వతీపతే
మృడ శంభో శశిఖండమండన,
మదనాంతక భక్తవత్సల
ప్రియకైలాస దయాసుధాంబుధే.

సదుపాయ కథాస్వపండితో
హృదయే దుఃఖశరేణ ఖండితః,
శశిఖండశిఖండమండనం
శరణం యామి శరణ్య మీశ్వరమ్.

మహతః పరితః ప్రసర్పత
స్తమసో దర్శనభేదినో భిదే,
దిననాథ ఇవ స్వతేజసా
హృదయ వ్యోమ్ని మనా గుదేహి నః.

నవయం తవచర్మచక్షుషా
పదవీ మప్యుపవీక్షితుం క్షమాః,
కృపయాభయదేన చక్షుషా
సకలేనేశ విలోకయాశు నః.

మధురం హి పయస్స్వభావతో
నను కీదృక్సితశర్కరాన్వితమ్,
సవిశేష్యమృతాయ తే భవాం
ఛ్ఛమముండాభరణోపి పావనః.

అంతఁ జల్లనై సుగంధము వెల్లివిరియుపుష్పవర్ష ముపమన్యువుపైఁ గురిసెను. దేవదుందుభులు మ్రోఁగెను. పరమేశ్వరుఁడు దేవతలను జూచి యుపమన్యుని భక్తిభావమును గాంచితిరి గదా! యని పలికెను. వారెల్ల రొక్కపెట్టున నుపమన్యుమహర్షి యాప్సితార్థముల నందుఁగాక యని పలికిరి. అంతఁ బరమశివుఁడు పరమానందమున నుపమన్యు

---

భవ ఏవ భవాంతక స్సతాం
    సమదృష్టి ర్విషమేక్షణో౽పి సన్,
అపిశూలధరో నిరామయో
    దృఢవైరాగ్యరతో౽పి రాగవాన్.

అపిభైక్ష్య చరో మహేశ్వర
    శ్చరితం చిత్రమిదం హి తే ప్రభో,
వితరత్యభివాంఛితం దృశా
    పరిదృష్టః కిల కల్పపాదపః.

హృదయే స్మృతిరేవ ధీమతే
    నమతే౽భీష్టఫలప్రదో భవాన్,
సహసైవ భుజంగపాశవాన్
    వినిగృహ్ణాతి న యావదంతకః.

అభయం కురు తావదాశు మే
    గతజీవస్య పునః కిమౌషధైః,
సవిషైరివ భీమపన్నగైః
    విషయైరేభిరలం పరిక్షతమ్.

అమృతైరివ సంభ్రమేణ మాం
    అభిషించాశు దయావలోకనైః,
మునయో బహవో౽ద్య ధన్యతాం
    గమితాస్స్వాభిమతార్థదర్శినః,
కరుణాకర యేనతేన మాం
    అవసన్నం నను పశ్య చక్షుషా.

నుపలాలించి "వత్సా! నీ భక్తికి సంతసించితిని. నీవు నావాఁడవు. నీ కేమి కావలయునో తెలుపు" మనెను.

ఉపమన్యుఁ డమితానందమున "మహాదేవా! నాకు నిత్యము నీయందు భక్తి నెగడునట్లు మొదటివర మనుగ్రహింపుము. రెండవ వరము భూతభవిష్యద్వర్తమానవేది నగుశక్తి నా కిమ్ము. నాకును నా

---

ప్రణమామ్యథ యామి చాపరం
శరణం కం కృపణాఽభయాప్రదమ్,
విరహీ వ విభో ప్రియామయం
పరిపశ్యామి భవన్మయం జగత్.

బహవో భవతానుకంపితాః కిమితీశాన నమానుకంపసే
దధతా కిము మందరాచలం పరమాణుః కమఠేన దుర్ధరః.

అశుచిం యది మానుమన్యసే కిమిదం మూర్ధ్నికపాలదామతే,
ఉతశాఠ్యమసాధుసంగినం పవలక్ష్మాఽపినకిం ద్విజిహ్వాధృక్.

క్వదృశం విదధామి కింకరో, మ్యనుతిష్ఠామి కథం భయాకులః
క్వనుతిష్ఠసి రక్ష రక్షమాం, అయి శంభో శరణాగతోఽస్మి తే.

విలుఠామ్యవనౌ కిమాకులః కిమురోహన్మి శిరశ్ఛినద్మి వా,
కిమురోదిమి రారటీమి కిం కృపణం మాం నయదీక్షసే ప్రభో.

శివ సర్వగ శర్మద్ప్రణతో దేవ దయాం కురుష్వ మే
నను ఈశ్వర నాథ దిక్షుతే పునరేవేశ నమో నమోఽస్తు తే.

శరణం తరుణేందుశేఖర శ్శరణం మే గిరిరాజకన్యకా,
శరణం పునరేవ తావుభౌ శరణం నాన్య దుపైమి దైవతమ్.

ఉపమన్యుకృతం స్తవోత్తమం జపత శ్శంభుసమీపవర్తినః,
అభివాంఛితభాగ్యసంపదః పరమాయాః ప్రదదాతి శంకరః.
ఉపమన్యుకృతం స్తవోత్తమం ప్రజపేద్యస్తు శివస్య సన్నిధౌ,
శివలోక మవాప్య సోచిరా త్సహతేనైవ శివేన మోదతే.

కుటుంబమువారికి నక్షను మఱగుక్షీరోదన ప్రాప్తిఁ గలిగించి నీవు నా యాశ్రమమున నుండిపొ" మ్మని ప్రార్థించెను.

పరమేశ్వరుఁ డాతని కోరిక లెఱిఁగి యిట్లు పలికెను. "వత్సా! దుఃఖము, జన్మమృత్యువులు నీ కిఁక నుండవు. నీవు కీర్తిశాలివి, తేజోనిధివి, దివ్యజ్ఞానయుతుఁడవు నయి సర్వమహర్షి సన్నుతుల నంద గలవు. సుశీలసుగుణసంపద, సర్వజ్ఞత్వము, ప్రియదర్శనత నీ కక్షయ మగుఁగాక! నిత్యయౌవనము నిరుపమతేజము నీలో నిలుచుఁగాక! నీకోరినపుడెల్ల క్షీరసముద్రము నీముందుఁ బ్రవహించుఁగాక! నీవు బంధుమిత్రసమేతముగాఁ గల్పాంతమున నన్నుఁ జేరుదువు గాక! నీకు నాపయి నిరంతర భక్తి నిలుచును గాక! నీవు తలఁచినంతనె వచ్చి పిలిచి నంతనె పలుకుదు నని నీకు వర మిచ్చుచున్నాను."

పరమేశ్వరుఁ డనంతరము దివ్యతేజముఁ జిమ్ముచు నంతర్హితుఁ డయ్యెను. ఉపమన్యునకు సర్వసిద్ధులు సమకూరి దివ్యప్రభావము వచ్చి వరించెను. అతఁ డింటి కేగి జరిగిన సంగతి తలిదండ్రులకుఁ జెప్పి వా రపరిమితానందమందఁ గొంతకాలము కడచిన పిమ్మట నెల్లరిని వీడి యొక యాశ్రమమును నిర్మించుకొని యుందుండెను.

## ఉపమన్యుని యాశ్రమము

హిమవత్పర్వత సానువులందు ఉపమన్యుఁడు నిర్మించుకొన్న యాశ్రమము మిక్కిలి యద్భుతము, దివ్య ప్రభావ సంయుతము నయి యుండెను. అది బ్రాహ్మలక్ష్మితో నిండి దేవగంధర్వులచేఁ బూజింపఁ బడుచుండెను. అయ్యది ధవ, కకుభ, కదంబ, నారికేళ, కురవక, బదరీ పున్నాగాది బహుళ ఫలవృక్షములతోడను, వివిధ రమణీయ పుష్పలతల తోడను గూడియుండెను. ఆ వనము మృగ, వానర, శార్దూల, సింహ, ద్వీపికా సమూహములతో నిండి యుండెను. నెమిళ్ళ నృత్యములు, పక్షుల కిలకిలారావములు, పుష్పముల సుగంధములు, గంధర్వ కాంతా గానము, జలధారల స్రోఁత, ఏనుఁగుల ఘీంకారరవము, కిన్నరులగీత

ములు, సామగాన పరుల స్వనములు, వీనుల విందు, కన్నులపండువు గావించుచుండెను. ఆ వనము సరోవరాలంకృతమై, విశాలములు కుసుమాదులతోఁ గూడినవియు నగునగ్ని గృహములతో శోభిల్లుచు, పరమ పవిత్ర గంగాతోయముల భాగ్యమున విలసిల్లుచు, అగ్నితుల్యులు మహాత్ములు నగు మహర్షుల పవిత్ర ప్రసంగములచే భాసిల్లుచు నుండెను. అందున్న తపస్వి జనులు వాయుభక్షులు, పర్ణభక్షులు, జలభక్షులు, ధూమాహారులు, క్షీరపాయులు నయి ధ్యాననిష్ఠులు, యోగవంతులు నయి యుండిరి. మఱియు నందున్నవా రెల్లరు గోచారులు, అశ్మకుట్టులు, దంతోలూ ఖలికులు, మరీచిపాయులు, ఫేనపాయులు, మృగచారులు, అశ్వత్థ ఫలభక్షులు, జలశాయులు, చీర చర్మాంబరధరులు, వల్కలవసనులు. వారెల్లరుఁ దపోధను లగు మహర్షులు, నియమనిష్ఠాగరిష్ఠు లగు యతులు. ఉపమన్యుని యాశ్రమము మహాత్ములు పుణ్యకర్ములు, నగు శివగణముల చేతను, దేవగణముల చేతను సేవింపఁబడుచు నాకాశమందలి చంద్రమండలమువలె నతి మనోహరముగ నుండెను. అందు ముని మహత్త్వముచేఁ బాములును ముంగిసలును ప్రబల స్నేహమున నాడుకొనుచుండును. లేళ్ళును, పెద్దపులులును ప్రీతిసమ్మిళితములు. ఇట్లే సాధారణముగాఁ బరస్పర విరోధముచేఁ బ్రవర్తింపవలసిన నరపశుపక్షి సమూహములు పరస్పర సుహృద్భావములతోఁ బ్రవర్తిల్లుట జగదాశ్చర్యకరముగా నుండెను. అందుచే నాయాశ్రమము సకలప్రాణి మనోహరమై, సకల జంతు సంవర్ధితమై, సకల శోభానివాసమై, సకల ముని సమ్మతమై భూలోక స్వర్గమై యలరారుచుండెను.

## శ్రీకృష్ణుఁ డుపమన్యువి దర్శించుట

తొల్లి యొకప్పుడు శ్రీకృష్ణుని యష్టమహిషులలో నొకతె యగు జాంబవతి భర్త యాదరాభిమానములను జూఱఁగొని తన కొకసుపుత్రు నిమ్మని ప్రార్థించెను. శ్రీకృష్ణుఁడు తాను పండ్రెండేండ్లు పరమేశ్వరుని గూర్చి తపస్సు చేసినఁగాని సుపుత్రుఁడు లభించుట దుర్లభ మని పలికెను. అంత నామె తనకుఁ బుత్త్రి నిచ్చుటకై కృష్ణుఁడు పండ్రెండేండ్లు తపస్సుచేయుట కంగీకరించెను. కృష్ణుఁడు జాంబవతికిఁ బ్రియము

గావింప నెంచి గద, సాంఖాదులతోఁ జెప్పి గరుత్మంతు నెక్కి హిమవత్పర్వతసానువు లందు బ్రహ్మలోకము వలె నొప్పారు నుపమన్యు నాశ్రమముకడ దిగి గరుత్మంతునిఁ బంపివేసెను. పిదపఁ గృష్ణుఁడు కాలినడకను దపస్తేజముచే అగ్నిహోత్రుని వలెఁ బ్రకాశించుచు, శిష్యజనపరివృతుఁడు, పరమశాంతుఁడు, ప్రజ్ఞానిధి, యోగశక్తిచే యువకుఁడు నగు ఉపమన్యు మహర్షిని దర్శించెను.

ఉపమన్యుఁ డాతని నధికభక్తి తాత్పర్యములతో నాదరించి పూజించి ప్రసన్నునిఁ జేసికొని యాతఁడు వచ్చినపని తన దివ్యదృష్టిచేఁ దెలిసికొని "కృష్ణా! సర్వలోకద్రష్టవగు నీవు నన్ను దర్శింప వచ్చితివా! సర్వతపస్సార ఫలప్రదుఁడవగు నీకుఁ దపమా! సర్వలోకపిత వగునీకుఁ బుత్రుఁడా! ఏమి చిత్రము! ని విలాసము లెవఁ డెఱుఁగఁ గలఁడు? సరే. కానిమ్ము. నీ విట శర్వుని గుఱించి తప మొనరింపుము. ఆతఁడు నీకుఁ గానసై యభీష్టము లీయఁ గలఁడు. తొల్లి దేవతలు, మహర్షులు పరమేశ్వరు నిట భజించి బ్రహ్మచర్యతపస్సత్యశమదమములచేఁ బ్రీతునిఁ జేసి యభీప్సితములను బడయఁగాంచిరి మేరుపర్వతము నుఱ్ఱూఁత లూగించిన హిరణ్యకశిపుఁ డిందే శివు నారాధించి సర్వశక్తులు సర్వైశ్వర్యము లందఁగలిగెను. మందరుఁ డను హిరణ్యకశిపుని పుత్రుఁడు పరమేశ్వరు నిట నారాధించి యర్బుదవత్సరము లింద్రుని ముప్పుతిప్పల బెట్టి మూఁడుచెఱువుల నీళ్ళు త్రాగించెను. వాని శరీరమున విష్ణుచక్రము, నింద్రుని వజ్రాయుధము గడ్డిపఱక లయ్యెను. జలాంతర్గతుఁడై బలగర్వితుఁ డైన యాతని నుక్కడఁగింప దీప్తజ్వలనతుల్యము దుర్ధరము నగు చక్రమును సృజించి శివుఁడే నీ కొసఁగుచు నిది నీకు సుదర్శన మగుఁ గాక యని పలికిన నీ వా చక్రమును బరిగ్రహించి సుదర్శనచక్ర మని పేరిడితివి గదా! ఈశ్వరప్రీతిఁ గూర్చిన యా రాక్షసునిమీన నీ సుదర్శనచక్రము కూడ వ్యర్థమయ్యెను గదా! మఱియుఁ దనను భక్తిచే మెప్పించిన విద్యుత్ప్రభు నా సర్వేశ్వరుఁడు త్రిలోకేశ్వరు నొనరించెను. శతముఖుఁడను రాక్షసుఁడు సర్వేశ్వరు నర్చించి నూఱేండ్లు తన దేహమందలి రక్తమాంసములను అగ్నిలో హోమముచేసి తన యనన్యభక్తిని జూపినంతనే శివుఁ డాతని కోరికల నన్నిఁటిని దీర్చెను.

స్వయంభు వను మహనీయుఁడు పుత్రార్థియై పరమేశ్వరునిఁ బ్రార్థించి నూర్వురు పుత్రులను గాంచెను. పరమధార్మికుఁ డగు యాజ్ఞవల్క్యుఁడు పరమర్షియైన వ్యాసభగవానుఁడు నీశ్వరు నారాధించి కామితార్థము లందిరి. ఇంద్రునిచే నవమానితులైన వాలఖిల్యులు శివు నారాధించి యింద్ర శత్రువగు సుపర్ణుని జన్మమునకు హేతువులైరి. ఒకప్పుడు శివునికోపమున లోకములందలి జలమెల్ల నింకిపోవ దేవతలు సప్తకపాల క్రతువుచే నీశ్వరునే యారాధించి మరల జలములు గడించిరి. పరమేశ్వరు నారాధించియే వికర్ణుఁ డనువాఁడు పరమసిద్ధి గడించెను. శాకల్య మహర్షి తొమ్మిదివేలేండ్లు మనోయజ్ఞముచే మహేశ్వరు నారాధించి మహనీయత గాంచెను. సావర్ణిమనువు శంకరు నారాధించియే సర్వకామ్యములనంది పోయినయింద్రత్వమును మరలఁ బొందెను. నారదుఁ డీశ్వరు నర్చించియే దివ్యర్షియై తేజరిల్లెను. నే నింతవాఁడ నగుట కా మహేశ్వరకృపయే కారణము" అని పలికి శ్రీకృష్ణుని కెనిమిదిదినము లెనిమిది క్షణములవలెఁ గడచునట్లీశ్వర మాహాత్మ్యమునుగూర్చి తెలిపెను.

శ్రీకృష్ణుఁ డుపమన్యునికి శిష్యుఁడై యాతనివలన యథావిధిగాఁ దపోదీక్షితుఁడై దండము ధరించి, ముండియై, కుశచీరధరుఁడై యొక నెల పండ్లు తినియు, మఱియొకనెల నీరు త్రావియు, క్రమముగా గాలిని మాత్రమే పీల్చుచు నూర్ధ్వబాహుఁడై మహాతపము చేసి శివునిఁ బ్రత్యక్షము చేసికొని —

"నమోస్తు తే శాశ్వతపుణ్యయోని
బ్రహ్మాధిపాం త్వామృషయో వదంతి,
త్వమేవ నారాయణ శబ్దసంజ్ఞం
పరం చ సత్యం ప్రవదంతి సంతః."

అని పెక్కువిధముల స్తుతించి పార్వతీపరమేశ్వరులచేఁ బెక్కువరము లంది నెగ డొందెను.

ఉపమన్యు వది కాంచి —

“నాస్తి శర్వసమో దేవో నాస్తి శర్వసమో గతిః,
నాస్తి శర్వసమం దానం నాస్తి శర్వసమో రణే.”

అని శివభక్తి యుక్తుఁడై తాండవమాడెను.

పిదప శ్రీకృష్ణుఁ డుపమన్యునివలన తండిమహర్షి చరిత్ర మెఱిఁగి సెలవు గైకొనిపోయి యీప్సితార్థముల నందెను. *

---

* ఉపమన్యుఁ డొనర్చిన “అర్ధనారీశ్వరస్తోత్రము”

శ్లో. అంభోధరశ్యామలకుంతలాయై
తటిత్ప్రభా తామ్రజటాధరాయ,
నిరీశ్వరాయై నిఖిలేశ్వరాయ
నమ శ్శివాయై చ నమ శ్శివాయ. ౧

ప్రదీప్తరత్నోజ్జ్వలకుండలాయై
స్ఫురన్మహాపన్నగభూషణాయ,
శివప్రియాయై చ శివాప్రియాయ
నమ శ్శివాయై చ నమ శ్శివాయ. ౨

మందారమాలా కలితాలకాయై
కపాలమాలాంకిత కంధరాయ,
దివ్యాంబరాయై చ దిగంబరాయ
నమ శ్శివాయై చ నమ శ్శివాయ. ౩

కస్తూరికాకుంకుమలేపనాయై
శ్మశానభస్మాంగవిలేపనాయ,
కృతస్మరాయై వికృతస్మరాయ
నమ శ్శివాయై చ నమ శ్శివాయ. ౪

పాదారవిందార్పితహంసకాయై
పాదాబ్జరాజత్ఫణినూపురాయ,
కళామయాయై వికలామయాయ
నమ శ్శివాయై చ నమ శ్శివాయ. ౫

ప్రపంచసృష్ట్యున్ముఖ లాస్యకాయై
సమస్తసంహారకతాండవాయ,
సమేక్షణాయై విషమేక్షణాయ
నమ శ్శివాయై చ నమ శ్శివాయ. ౬

ప్రఫుల్ల నీలోత్పలలోచనాయై
వికాస పంకేరుహలోచనాయ,
జగజ్జనన్యై జగదేకపిత్రే
నమ శ్శివాయై చ నమ శ్శివాయ. ౭

అంతర్బహిశ్చోర్ధ్వమధశ్చ మధ్యే
పురశ్చ పశ్చాచ్చ విదిక్షుదిక్షు,
సర్వంగతాయై సకలం గతాయ
నమ శ్శివాయై చ నమ శ్శివాయ. ౮

ఉపమన్యుకృతం స్తోత్రం అర్ధనారీశ్వరాహ్వయమ్,
యః పఠేచ్ఛృణుయాద్వాపి శివలోకే మహీయతే.

# మహర్షుల చరిత్రలు

## ఋభు మహర్షి

### జననము

మృగశృంగుఁడని పేరుగాంచిన వత్సుఁడను మహర్షి చేసిన తపమునకు మెచ్చి విష్ణుమూర్తి ప్రత్యక్షమై యాతనికి వరము లొసంగుచు నాతఁడు ఋభు వనుపేరఁ గడపటిజన్మముఁ గాంచి తత్త్వజ్ఞానియై యిఁక జన్మముఁ గాంచక మోక్ష మందునని వాక్రుచ్చి యదృశ్యుఁ డయ్యెను. వత్సుఁడు బ్రహ్మచర్యమున మహర్షులను, యజ్ఞముచే దేవతలను, సంతానముచేఁ బితృదేవతలను, తపస్సుచే భగవంతుని సంతోషపెట్టి చిరకాలము మహాయోగియై జీవించి తుదకు యోగమార్గమున శరీరమును త్యజించి బ్రహ్మపదమును గాంచెను. ఆ తరువాత నాతఁడు ప్రళయకాలపర్యంత మటు పరమసుఖమున నుండి యనంతరము శ్వేత వరాహకల్పమున బ్రహ్మమానస పుత్రుఁడై పుట్టి ఋభువను పేరు గాంచెను.

### జ్ఞానము

ఋభువునకు బాల్యమునుండియు బ్రహ్మజ్ఞానసంపద వెల్లివిరిసెను. అతని పూర్వజన్మసుకృత మట్టిదగుట నాతఁడు బ్రహ్మచర్యమును జేయుచు బ్రహ్మవిజ్ఞానము నార్జించి పరమపవిత్రుఁడై యుండెను. భగవంతుఁడు వరాహావతార మెత్తినప్పు డాతనిశిష్యుఁడై ఋభుఁడు:

"ఏకవ్యాపకమై సమస్తగతమై హేవాకమై శ్రీకరం
బై కల్యాణవిహారమై నిబిడమాయాతీతమై నిర్గుణం
బై కైవల్యవిహారమై జనన నాశాతీతమై యుత్తమ
శ్లోకంబై పరమార్థతత్త్వము నటించున్ నిత్యశుద్ధస్థితిన్."

అనియు, బ్రహ్మాదిభేదరూపములు పరమాత్మునికంటె వేఱు కావనియు, ఏకపదార్థమునకు అనేక రూపభేదములు బాహ్యాభ్యంతర ప్రవృత్తులవలననే

కలుగును కాని పరమాత్మునికి భేదములేదని తెలిసికొని దృఢనిశ్చయుఁడై దివ్యానందము నందుచుండెను.

## నిదాఘుఁడు శిష్యుఁ డగుట

ఇట్లు ఋభువు తత్త్వమెఱిఁగి బ్రహ్మనిష్ఠాగరిష్ఠుఁడై బహువర్షములు మహాతపస్సు చేయుచునుండ పులస్త్యమహర్షి పుత్రుఁడును బ్రహ్మచర్యవ్రతపాలకుఁడు, బహుశ్రద్ధాభయభక్తి వినయవిధేయతలకు నిలయుఁడు నగు నిదాఘుఁడనువాఁడు ఉత్తమ మగుబ్రహ్మజిజ్ఞాస కలిగి తగిన గురువు నరసికొనుచు ఋభుమహర్షి కడకు విచ్చేసెను.

ఉత్తముఁ డగుగురువును బడయుటకొఱ కుత్తముఁ డగుశిష్యుఁ డెంత యాతురపడునోయట్లే యుత్తముఁ డగు శిష్యునిఁ బడయుట కుత్తముఁ డగుగురువు నంత యాతురత నందుచుండును. అతివిపుల సామ్రాజ్యమును నిజశక్తిచే సంపాదించి సుస్థిరము గావించి దానిని వినయ వివేకవంతుఁ డగు నిజపుత్రునిచేతిలోఁ బెట్టి తాను విశ్రాంతి గైకొనఁ దలఁచు చక్రవర్తి వలె, తన తపశ్శక్తిని ధారవోసి సంపాదించిన జ్ఞానఫలమును దా ననుభవించి తనయంతటి వాఁ డగుశిష్యుని కద్దాని నొసంగి జ్ఞానజ్యోతి నిత్యోజ్జ్వలముగ నిలిపియుంచుటకే నిజ మైనగురు వెదురుచూచు చుండును. కావున, సర్వవిధములఁ దనశిష్యుఁ డగుటకుఁ దగియున్న నిదాఘునిరాకఁ గాంచిన ఋభువు, ఆనందమున కంతు లేకుండెను. అట్లే, ఇన్నాళ్లకుఁ దనకుఁ దగిన గురువు లభించినాఁ డని పులస్త్యబ్రహ్మపుత్రుఁడును బ్రహ్మానంద మందెను. అడిగినదే తడవుగా గురువు శిష్యుని స్వీకరించెను. అంగీకరించినదే తడవుగా శిష్యుఁడు గురువునకు సేవకుఁ డయ్యెను.

## విజ్ఞానబోధ

కాలక్రమమున ఋభువు నిదాఘునకు సర్వశాస్త్ర విజ్ఞానమును బోధించి యొక్కయద్వైతమును మాత్రము బోధింపక మాని వేయి

గృహస్థాశ్రమమును స్వీకరించి గార్హస్థ్యధర్మములను జక్కఁగ నిర్వర్తింపు చుండు మని పంపివేసెను. శిష్యుఁడగు నిదాఘుఁడు గురునానతి గైకొని యేగి వివాహమాడి యాలినిగూడి దేవికానదీతీరమునఁ గల వీరనగర మనుపేరి పట్టణముఁ జేరియున్న యొకవనమును జేరి యందు గృహస్థాశ్రమమున నిర్వర్తింపఁ దొడఁగెను. పంచయజ్ఞములను జేయుచు, జపతపము లేమఱక, అతిథిసేవ యభాగ్యతసేవ మనోవాక్కాయ కర్మలచే నొనరించుచు, గురువును స్మరించుచు, భగవంతుని భావించుచు నిదాఘుఁడు ధర్మపత్నితోఁ గాఁపురము చేయుచుండ వేయిసంవత్సరములు గడచెను.

ఇట్లుండ నొకనాఁడు శిష్యుని కద్వైతవాసనఁ దెలుపఁ దలఁపు గలిగి ఋభుమహర్షి శిష్యుఁడగు నిదాఘు నింటిముంగలకు వచ్చి నిలిచి యుండెను. వేయిసంవత్సరము లగుటచే నిదాఘుఁడు తన గురువని గుర్తుపట్టలేక యెవ్వఁడో యతిథి యనుకొని పిలిచి లోనికిఁ గొనిపోయి, అర్ఘ్యపాద్యాదు లిచ్చి పూజించెను. ఋభువు తాను జెప్పలేదు. నిదాఘుఁడు గ్రహింప లేదు కాని, పరిపాటి ప్రకారము అతిథిని లేచివచ్చి పక్వాహారమును భుజించి బడలికలు పాయు మని నిదాఘుఁడు ప్రార్థించెను. తన కన్నముపై హితవు లే దని తెల్పి యిఁకఁ జేయించిన పదార్థము లే వని ఋభువు నిదాఘు నడిగెను. అతఁ డాయితము చేయించిన పిండివంటల పే ళ్ళెల్లఁ దెలిపెను. కాని, యవి యేవియుఁ దనకు రుచింప వనియు షడ్రస సమన్విత మగుమృష్టాన్న భోజనముఁ దనకుఁ బెట్టింపు మనియు నా యతిథి గృహస్థునిఁ గోరెను. అతఁ డట్లే యని భార్యకుఁ జెప్పఁగా నామె యతిథికి, భర్తకు షడ్రసోపేత మగుభోజనము వండి వడ్డించెను. వాని నన్నిఁటిని దృప్తికరముగఁ దిని కూర్చుండి యున్న ఋభువును నిదాఘుఁడు "మహాత్మా! బడలిక తీఱినదికదా! శాకపాకములు రుచించినవా? ఎటనుండి యెటకుఁ బోవుచు నిట కేతెంచినారు? తమ దేయూరు? నామధేయ మేమి?" అని ప్రశ్నించెను. దానికి ఋభు విట్లు బదులు చెప్పెను. "అయ్యా! ఆఁకలి వేయువాఁ డన్నము తిన్నఁ దృప్తి చేకూరును. అస లాఁకలియే యెఱుఁగని నన్నీప్రశ్నలతో ముంచఁ బనియేమి? భూమిపైఁ బుట్టినధాతువులను

దేహమున నున్న జలమును జఠరాగ్ని కాల్చును. ఆఁకలి, దప్పిక దేహధర్మములు. ఇదివఱలో కాని యిపుడు కాని నా కా దేహవికారములు లేనే లేవు. కావున, నేను నిత్యతృప్తుఁడను. సుఖము, తృప్తి – యివి మనోధర్మములు. మనోవికారములు గలవారి నీప్రశ్న అడుగుము. పర మాత్మునకు మనోధర్మము లంటవు. తత్త్వజ్ఞుఁ డాకాశమువలె నెల్లప్పుడు నెందును నుండును. నేను వచ్చువాఁడను ఉండువాఁడను గాను. నీవు తప్ప నితరులు తత్ త్వం (అది నీవే) అను వచనమునకుఁ దగరు. నేను తప్ప నితరులు సోఽహమ్ (వాఁడే నేను) అనుటకుఁ దగరు. అన్నము నందుఁ గల మృష్టామృష్టభేదము నీ వలన నెఱుఁగఁగోరి నిన్నుఁ బ్రశ్నించితిని. మృష్టాన్న మమృష్టము, అమృష్టాన్నము మృష్టమునై దేహమునకు బాధ, బాధ లేకుండుట కల్పించును. అంతే కాని అన్న మెన్నఁడును రుచి కాదు. మట్టిగోడలు మెత్తినచో గట్టిపడురీతిని పంచ భూతములతోఁ గూడిన దేహము పంచభూతములవలనఁ బుట్టిన పదా ర్థములచేఁ బోషింపఁబడి బలము కలిగినదగును. ఏది రుచికరము, ఏది అరుచికరము అనువ్యర్థవాదములు మాని ముక్తిమార్గము నరసి చిత్త ముఁ బరతత్త్వమునఁ దగిల్చి యిహలోకవిధుల నింక విడిచిపెట్టుము."

నిదాఘుఁ డంత నాతనికి నమస్కారముచేసి మనస్సు ప్రసన్న మైన దని పలికి కృతజ్ఞతాపూర్వకముగా నాతనిపే రడిగెను. అతఁ "డోయీ! నేను నీగురుఁడను. ఋభువును. నీ కీరహస్యముఁ దెలిపి వివేకముఁ గలిగింప వచ్చితిని. వచ్చినపని యైనది. పోయివచ్చెదను. నీ వీఁకఁ బ్రపంచ మంతయుఁ బరమేశ్వరాధీనముఁ జేసి సుస్థిరగతి విల సిల్లు" మని పలికి వెడలిపోయెను.

## పునర్దర్శనము

మరల వేయి దివ్యసంవత్సరములు కడచినపిదప ఋభువు నిదా ఘుఁ డున్న నగరమునకు విచ్చేసి నగరసమీపమున నుండెను. ఆ పుర మేలురాజు సైన్యము వెంబడినుండ నేనుఁగు నెక్కి రాజప్రా[illegible] బోవుచుండెను. ఆ సందడివలన జనుల రాకపోకల[illegible] ప్రతిబంధ మేర్పడెను. నిదాఘుఁడు సమీపమునఁ గలయడవి [illegible] పండ్లు, సమి

TIRUPATI.

ధలు, కుశలు మున్నగునవి తానే మోసికొని వచ్చుచుండఁగా రాజాగమనమువలని ప్రతిబంధమునం బోలేక ఆ నగర బాహ్యప్రదేశమున నొకచోఁ గూర్చుండెను. ఈతనిని జూచి ఋభువు సమీపమునకు వచ్చి "ఒంటరివై యిచటఁ గూర్చుంటి వేమి?" యని యడిగెను. చూచి చిరకాలమగుట నిదాఘుఁ డాతని నానవాలు పట్టలేక "అయ్యా! ఈ బరువు మోసికొని యింటి కేగుచుండఁగా నీ రాజబలఁగము తెరువున కడ్డు వచ్చుటచే నిచటఁ జదికిలఁ బడితి" నని చెప్పెను. "వీరిలో రా జెవఁడు? అతని బలమేది?" యని ఋభువు నిదాఘునిఁ బ్రశ్నించెను. "ఏనుఁగు మీఁద నున్నవాఁడు రాజు" అని నిదాఘుఁ డనెను. "ఏనుఁ గేది? రా జెవఁ" డని యాతఁడు మరలఁ బ్రశ్నించెను. "అయ్యా! మీఁద నున్నవాఁడు రాజు. క్రింద నున్న దేనుఁగు. చూడఁగనే చంటిపిల్లవాఁ డైన నిది గ్రహింపఁ గలఁడు. నీ విట్లు ప్రశ్నించుచుంటి వే" మని నిదాఘుఁ డనెను. "క్రిందేది? మీఁ దేది? నాకుఁ జెప్పు" మని ఋభువు మరలఁ బ్రశ్నించెను. అందులకుఁ గోపించి నిదాఘుఁడు ఋభుని మెడ వంచి వీపుపై నెక్కి నేను రాజువలె మీఁద నున్నాఁడను. నీ వేన్గువలెఁ గ్రిందనున్నా" వని నిరూపించెను. "నీ వెవరు? నే నెవఁడను? చెప్పు" మని ఋభు వడిగెను. తత్క్షణమే తత్త్వంసోహం వాక్యములు రెండును నేకమైన యద్వైతవాసన నాతఁ డెఱింగి వెంటనే క్రింది కుఱికి సాష్టాంగపడి "మహాత్మా! నీవు నా గురుఁడ వగు ఋభుఁడవు గావుగదా? కానిచో నొరున కిట్టి యద్వైతవాసనాసంస్కారము కలుగునా యనుకొను చుంటి" నని పలికెను.

"ఓయీ! నేను ఋభుఁడనే. నీవు నాకుఁ జేసిన పూర్వసేవవలన నానందించి నీకు బ్రహ్మవిద్య తేటతెల్లముగ నుపదేశింప వచ్చితిని. నీ కేమైన సంశయము లున్నచో నడుగుము. తీర్చి పోవుదును. పోయిన నిఁక మరల రా" నని చెప్పెను. అప్పుడు శ్రద్ధాభయభక్తులతో "మహాత్మా! సంసారసాగరము ననాయాసముగా దాఁటించు నాత్మానాత్మవివేకమును నాకుఁ దెలిపి కరుణింపు" మని నిదాఘుఁడు ఋభువును బ్రార్థించెను. సకలార్థ విదుఁడు, సర్వవేదాంతసారజ్ఞుఁడు, సర్వపూజ్యుఁడు, మహాత్ముఁడు నగుఋభు విట్లు తెలిపెను; "వత్సా!

సర్వవాక్యములకు నవధిభూత మగుబ్రహ్మము, సర్వచింతావధియగు గురువు, సర్వకారణకార్యములకు నాత్మ, కార్య కారణవర్జితుఁడు, సర్వసంకల్పరహితుఁడు, సర్వనాదమయుఁ డగుశివుఁడు, సర్వమాయావర్జిత చిన్మాత్రస్వరూపుఁడు, సర్వానందమయుఁడు, పరుఁడు, సర్వతేజఃప్రకాశాత్ముఁడు, నాదానందమయాత్మకుఁడు, సర్వానుభవనిర్ముక్తుఁడు, సర్వధ్యానవివర్జితుఁడు, సర్వనాదకళాతీతుఁడు, అవ్యయుఁడు నగుఆత్మనే నేను. ఆత్మానాత్మవివేకాది భేదాభేదవివర్జితుఁడు, శాంతాశాంతాది హీనాత్ముఁడు, నాదాంతర్జ్యోతిరాత్మకుఁడు, తత్త్వమస్యాదిమహావాక్యార్థదూరుఁడు, బ్రహ్మాస్మిమున్నగువాక్యముల కతిదూరుఁడు, తచ్ఛబ్దవర్జ్యుఁడు, త్వంశబ్దహీనుఁడు, అసివాక్యాంత వర్జితుఁడు, క్షరాక్షరవిహీనుఁడు, నాదాంతర్జ్యోతి యగు నాత్మను నేనే. ఆత్మ యనెడిశబ్దము లేనివాఁడు, ఆత్మ శబ్దార్థము లేనివాఁడు, సత్యజ్ఞానానందస్వరూపము లేనివాఁడు నగుఆత్మయే సనాతనుఁడు. నిర్దేశింప శక్యముకానివాఁడు, వేదవాక్యములకైన నగమ్యుఁడు, బాహ్యాభ్యంతరములు లేనివాఁడు, ప్రపంచమంతయుఁ దనస్వరూపమైనవాఁడు నగుఆత్మను నేనే. నామరూపాదికము కాని, భోజ్యము భోగ్యము భుక్కు కాని, సదసద్స్థితి కాని క్షరాక్షరస్థితి కాని లేనియాత్మనే నేను. గురుశిష్యాది భేదరహితము, దేవలోకము, సురాసురులు ననుభావము లేనిది, ధర్మాధర్మములు శుద్ధాశుద్ధములు లేనిది, కాలాకాలములు, నిశ్చయసంశయములు, మంత్రామంత్రములు, విద్యావిద్యలు లేనిది, ద్రష్టృదృశ్యము లనుప్రసంగము లేనిది అగునాత్మను నేను. దేహత్రయము కాని కాలత్రయము కాని లోకత్రయముకాని నాకు లేదు. నాకుఁజిత్తము లేనందునఁ జింతలేదు. దేహము లేనందున జరలేదు. పాదములు లేనందున గమనము లేదు. హస్తములు లేనందునఁ గ్రియలు లేవు. జర లేనందునఁ జావు లేదు. బుద్ధి లేనందున సుఖాదికము లేదు. ధర్మములేదు. శుచి లేదు. సత్యము లేదు. భయము లేదు. అక్షరోచ్చారణము లేదు. గురుశిష్యాదికము లేదు. ఒకభావమే లేదు. కాన రెండవభావ మంతకంటెను లేదు. సత్య మున్న దన్నఁగొంచె మసత్య ముండవచ్చును. కనుక, సత్యమే లేదు. అసత్య మున్న దన్నను సత్యముండును. కనుక, అసత్య

త్వము లేదు. శుభాశుభములు, అశుభాశుభములును లేవు. భయము, అభయము, బంధము, మోక్షము ఇది అది యనెడివ్యవహారము ఉండుట, లేకుండుట, కార్యము, కారణము, ద్వైతము, అద్వైతము దృక్కు, దృశ్యము, అంతరము, బాహ్యము, పూర్ణత్వము. నీవు, నేను ఇది అది అనువ్యవహారము—ఇవి యెంతమాత్రము నాకు లేవు. అట్లే నీవును జగత్తంతయు బ్రహ్మమాత్రమే. నేనును బ్రహ్మస్వభావమాత్రుఁడను. కేవలచిన్మాత్రస్వరూపుఁడ నని యెఱుంగుము.

ఈప్రపంచము లేనే లేదు. ఇది పుట్ట లేదు. పుట్టఁ బోదు. చిత్తమునే ప్రపంచ మందురు. అది యెన్నఁటికిని లేనేలేదు. ప్రపంచము లేదు. చిత్తము లేదు. అహంకారము లేదు. జీవుఁడు లేఁడు. మాయ లేదు. దేహము లేదు. భయము లేదు. కర్త, క్రియ, శ్రవణము, మననము, సమాధి, ప్రమాత, ప్రమాణము మున్నగున వేమియును లేవు. అజ్ఞానము, అనుబంధము, అవివేకము, బంధత్రయము ఏమియును లేవు. గంగ లేదు. గయ లేదు. సేతువు లేదు. భూతము లేదు. భూమి లేదు. నీరు లేదు. నిప్పు లేదు. గాలి లేదు. ఆకాశము లేదు. దేవతలు లేరు. దిక్పాలకులు లేరు. వేదము లేదు. గురువు లేఁడు. దూరము లేదు. దగ్గఱ లేదు. తుది లేదు. మొదలు లేదు. అంతము లేదు. అద్వైతద్వైతసత్యములు, బంధమోక్షములు లేవు. జాతి లేదు. గతి లేదు. వర్ణము లేదు. లౌకికము లేదు. సర్వం బ్రహ్మ మను వ్యవహారము లేదు. బ్రహ్మ మను వ్యవహారము లేదు. చిత్తనెడివ్యవహారము, నేను చిత్తుననెడిమాట, బ్రహ్మాస్మియనుపలుకు, నిత్యశుద్ధుఁడ నను ట యేమియు లేవు. వాక్కుచే నే లవమో చెప్పఁబడునది, మనసుచే నే లవమాత్రమో యోచింపఁబడునది, బుద్ధిచే నే లవలేశమో నిశ్చయింపఁబడునది లేనే లేదు. చిత్తముచే నెఱుఁగఁబడునది లేదు. యోగియోగాదికము లేదు. సర్వదా సర్వము లేవు. అహోరాత్రమాస సంవత్సర యుగకల్పాదికము లేదు. స్నానధ్యానజపాదికము లేదు. భ్రాంతి అభ్రాంతి లేవు. వేదశాస్త్రపురాణములు, కార్యకారణములు, ఈశ్వరుఁడు, లోకము, భూతము, జనము ఐక్యము మున్నగున వెల్లమిథ్యాత్మకములు. వాక్కుచేఁ జెప్పఁబడునది, సంకల్పముచేఁ గల్పితమైనది,

మనస్సుచేఁ జింతింపఁబడునది, బుద్ధిచే నిశ్చయింపఁబడునది అన్నియు మిథ్య. శాస్త్రములవలనఁ దెలుపఁబడునది, నేత్రములచేఁ జూడఁబడునది, చెవులచేఁవినఁబడునది, ఇంద్రియములచే గ్రహింపఁబడునది - సమస్తమును మిథ్య. సర్వము సంకల్పసంభవమే. నాది నీది, నాకు నీకు, నాకై నీకై, నాచే నీచే - ననువ్యవహారాదిక మెల్ల మిథ్య. "విష్ణువు రక్షకుఁడు, బ్రహ్మసృష్టికర్త, రుద్రుఁడు సంహారకుఁడు." ఇట్టి భావనావ్యవహారమంతయు మిథ్య. స్నానజపతపోహోమస్వాధ్యాయదేవపూజనము, మంత్రతంత్రసత్సంగగుణదోషవిజృంభణము, అంతఃకరణము, అవిద్య అనేక కోటిబ్రహ్మాండము లనున వెల్ల మిథ్యలు" అని యెన్నో విషయములు తెలిపెను.

అప్పుడు నిదాఘుఁ డానందమున "స్వామీ! మీ చెప్పినయరూప బ్రహ్మపదార్థమువలన నాకుఁ గలిగెడిమేలు లేదు. ఎఱుఁగఁదగిన ధర్మాదికము లెని బ్రహ్మమును నే నెట్లెఱుంగఁగలను? ఎఱిఁగినఁ గలుగుఫలమేమి? మఱియుఁ దాము సెల విచ్చినట్లు నడచుకొన్నచో సర్వవర్ణాశ్రమధర్మసంకరము కలుగుచున్నది. మీరు చెప్పినబ్రహ్మ విజ్ఞానము గొప్పదే యగుఁగాక! అది యటుంచి నాకు సంసారబంధమునుండి విముక్తిఁ గలిగించుజ్ఞానము నుపదేశింపుఁ"డని ప్రార్థించెను. అపుడు ఋభుఁడు నవ్వి "వత్సా! విన, వినుము. బ్రహ్మము సగుణ మనియు, నిర్గుణ మనియు, నిష్ప్రతియోగిక మనియు మూఁడు విధములు. అందు సగుణము మాయోపాధిసహితము, తత్త్వమస్యాదివాక్యవాచ్యార్థమైనది, వర్ణనీయస్వభావముగలదియు, జీవేశ్వరవిభాగముచే ద్వివిధమునగుటను, జీవుఁడు త్రివిధవంతుఁడు. ఈశ్వరుఁడు త్రివిధవంతుఁడు గనుకను సగుణబ్రహ్మవిషయము దురవగాహము. రెండవ దగునిర్గుణబ్రహ్మము తత్త్వమస్యాదివాక్యలక్ష్యార్థ మగుట ముముక్షువుల కుపాదేయము. మూఁడవ దగు నిష్ప్రతి యోగికబ్రహ్మము నెఱుంగనిదే ముముక్షువునకు స్వగత భేదము నశింపదు.

సంసారమోక్షసిద్ధికి నిర్గుణబ్రహ్మస్వరూపమును జెప్పెదను వినుము. ఆ నిర్గుణబ్రహ్మము నీవే!

"త్వమేవ పరమాత్మాఽసి త్వమేవ పరమోగురుః,
త్వమేవాకాశరూపోఽసి సాక్షిహీనోఽసి సర్వదా.
త్వమేవ సర్వభావోఽసి త్వంబ్రహ్మాఽసి న సంశయః,
కాలహీనోఽసి కాలోఽసి సదా బ్రహ్మాఽసి చిద్ఘనః."

నీవే పరమాత్మవు. నీవే పరమగురుఁడవు. నీవే ఆకాశస్వరూపుఁడవు. నీవే సాక్షిహీనుఁడవు. సర్వభావములును నీవే. నీవే బ్రహ్మము. సందేహము లేదు. కాలహీనుఁడవు, కాలరూపివి, చిద్ఘనుఁడవు నగునీవే బ్రహ్మస్వరూపుఁడవు.

నీవు సత్యము, సిద్ధుఁడవు, సనాతనుఁడవు, ముక్తుఁడవు, మోక్ష స్వరూపుఁడవు, ఆనందరూప అమృతుఁడవు, దేవుఁడవు, శాంతుఁడవు, నిరామయుఁడవు, బ్రహ్మస్వరూపుఁడవు, పూర్ణుఁడవు, పరాత్పరుఁడవు.

దేహము నే ననెడిసంకల్పమునే అంతఃకరణమందురు. ఈ దేహము నే ననెడి సంకల్పమే మహాసంసార మనఁబడును. ఇదియే బంధము, దుఃఖము, నరకము. దేహము నే ననెడిబుద్ధియే అవిద్య. ద్వైతము, పరిచ్ఛిన్నము. ఇట్టి సంకల్పమే మహాపాపము. మనస్సే సమస్త ప్రపంచమును, మహాశత్రువు, మహాసంసారము. శబ్దస్పర్శరూపరస గంధాదు లన్నియు మనస్సువలనఁ బుట్టినవి. మనస్సే సర్వమును గల్పించును. మనసే పాలించును. మనసే స్మరించును. కనుక, మనస్సే సంసార కారణమైనది. మనస్సే సర్వమును స్మరించును, విస్మరించును. మనసుచేతనే సర్వము భావింపఁబడుచున్నది. లేదనఁబడుచున్నది. దూషణ భూషణ తిరస్కారములు, సుఖదుఃఖములు నివి మనోకల్పితములు. సర్వమునకు నిదానమైన సూక్ష్మమైన మనస్సు సత్యజ్ఞానానందస్వరూప మనుసముద్రమునందు మాయచేఁ గల్పింపఁ బడినది. నీ వజ్ఞానవిరోధి వగు నిత్యబోధ స్వరూపుఁడవు. సూర్యోదయముతోఁ జీకఁటి నశించునట్లు జ్ఞానోదయముచే నజ్ఞానము నశించును. నీవు సర్వవ్యాపకమై సత్యజ్ఞానానందముఖ్యలక్షణ మైన నిస్సంశయమైన అద్వితీయబ్రహ్మవు. సత్యజ్ఞానానందలక్షణ మైన నిర్గుణబ్రహ్మము ముక్తినిమిత్త మెఱుఁగఁదగును. తదన్యము అలక్షణవంతము కాదని చెప్పఁబడుట మఱవ వలదు.

ఓయీ, నిదాఘా! జాగ్రదాదివిలక్షణమై తురీయ బ్రహ్మరూప మగు నే జ్ఞానము నెఱిఁగి సంసారమునుండి తరింతువో ఆజ్ఞానమును మరలఁ జెప్పెద, వినుము. సాలెపురుగు నూలుపోగుల నెట్లు సృజించి నాశనము చేయునో అట్లే జీవుఁడు జాగ్రత్స్వప్నములనుగూర్చి పోవుచుఁ దిరిగి వచ్చుచున్నాఁడు. జీవుఁడు నేత్రమందున్నపుడు జాగ్రదవస్థ యనియు, కంఠమం దున్నపుడు స్వప్నావస్థయనియు, హృదయమం దున్నప్పుడు సుషుప్తి యనియు, శిరమున నున్నపుడు తురీయ మనియు గ్రహింప వలెను.

యతో వాచో నివర్తంతే అప్రాప్యమనసా సహ,
ఆనందమేతజ్జీవస్య యజ్జ్ఞాత్వా ముచ్యతే బుధః.
సర్వవ్యాపిన మాత్మానం క్షీరే సర్పిరివార్పితమ్,
ఆత్మవిద్యాతపోమూలం తద్బ్రహ్మోపనిషత్పదమ్.

ఏ నిర్గుణబ్రహ్మస్వరూపమునుండి వచస్సు మనస్సుతోఁ గూడ బ్రహ్మము నందక వే అగుచున్నదో, మఱి యే యానందము నెఱిఁగి పండితుఁడు బంధవిముక్తుఁ డగుచున్నాఁడో ఆ యానందమే జీవునిది. పాలయందలి నేయివలె దేహమునఁ గల సర్వవ్యాపి యైనయాత్మను ఆత్మ విద్యకును తపమునకును మూలమైన ఉపనిషత్ప్రానభూతమైన బ్రహ్మమునుగా నెఱుంగుము."

## నిదాఘుఁడు మరలఁ బ్రశ్నించుట

ఇది విని నిదాఘుఁడు "దేవా! 'యతోవాచో నివర్తంతే' అన్న శ్రుతివలన నానందము బ్రహ్మమునకుఁ జెప్పఁబడెను. ఇపుడు జీవునకుఁ జెప్పితిరి. ఆనందమయ సంజ్ఞ గలజీవునకు శ్రుతియం దానందము చెప్పఁబడినను, ఆ యానందమయము హేయగుణక మగుటవలన నది జీవునిది కాదు. అందలి యవాఙ్మనసగమ్యత జీవునకుఁ గాదు. ఆ శ్రుతి యందలి యానందమునకు వేద్యత్వము చెప్పఁబడినది. అది బ్రహ్మము నకుఁ జెప్పుట యుక్తముకాదు గదా?" అని ప్రశ్నించెను. ఋభువు చిఱునవ్వు నవ్వి యిట్లుపలికెను. "ఓయీ! ఏ కారణమున మోక్షాతీత

దశయందు జీవుఁడు బ్రహ్మత్వమును పొందునో ఆ కారణమున అవాఙ్మనసగోచర మగుబ్రహ్మము జీవశబ్దముచె చెప్పఁబడినది. కనుక, పంచకోశవికారి యగుజీవునకు స్వయంశబ్దార్థభూతమై ఆత్మస్థానీయ మగు నానందము వేద్యము. ఈ పంచకోశములే జాగ్రదాదు లగుమూఁడవస్థలు. జాగ్రత్స్వప్నసుషుప్తులు. తదన్యము జ్ఞానానందమయస్వరూపము తురీయము. పై మూఁడవస్థలకు విశ్వుఁడు, తైజసుఁడు, ప్రాజ్ఞుఁడు నను వారు వరుసగా అభిమానులు. తదన్యుఁడు ప్రభువై నకూటస్థుఁడు. విశ్వుఁడు బహిఃప్రజ్ఞ గలవాఁడు; తైజసుఁ డంతఃప్రజ్ఞ గలవాఁడు. ప్రాజ్ఞుఁడు ఘనప్రజ్ఞగలవాఁడు. ఒకేజీవుఁ డిట్లు త్రివిధముగ నున్నాఁడు. విశ్వుఁడు కుడికంటి చివర, తైజసుఁడు మనస్సున, ప్రాజ్ఞుఁడు హృదయాకాశమున నొకే జీవుఁడు త్రివిధముగ నున్నాఁడు. విశ్వుఁడు స్థూలప్రపంచమును, తైజసుఁడు సూక్ష్మప్రపంచమును; ప్రాజ్ఞుఁ డానందమును ననుభవించును. స్థూలప్రపంచము విశ్వుని, సూక్ష్మప్రపంచము తైజసుని, ఆనందము ప్రాజ్ఞుని తృప్తిపఱుచును. కూటస్థుఁడు జీవునిమూలమున కర్మఫలభోగానుభవము నందుచున్నట్లు చెప్పఁబడినను అవి వాని నంటవు. కూటస్థుఁ డగుపురుషుఁడు విశ్వతైజసప్రాజ్ఞులకుఁ గారణము. సూర్యుఁడు జలమునఁ బ్రతిబింబించి యనేకవిధములఁ దోఁచినట్లు ప్రాణుఁ డనుపురుషుఁడు చైతన్యాత్మక జీవులను సర్వప్రపంచమును బ్రత్యేకించి పుట్టించుచున్నాఁడు. విశ్వతైజసులు స్వప్ననిద్రలు కలవారు. ప్రాజ్ఞుఁడు స్వప్నము లేని నిద్రతోఁ గూడినవాఁడు. సత్యవస్తువు నన్యవిధమునఁ గాంచుట స్వప్నము. తత్త్వము నెఱుంగక పోవుట నిద్ర. ఆ రెండిటి క్షీణతయే తురీయము. అనాది యగుమాయచే నిద్రించి యుండుజీవుఁడు జాగ్రత్స్థితిం జెందినపుడు పుట్టుక లేని ద్వైతశూన్య మైనస్వప్నము కాని నిద్ర కాని తురీయస్వరూపము నెఱుంగును. తురీయాత్మ జ్ఞానోదయమైనను దేహేంద్రియాదిప్రపంచ మున్నదా యున్న నది మాయాస్వరూపము. పరమార్థ మరయ నద్వైతమే కాని ద్వైతము లేదు."

నిదాఘుఁడు "దేవా! బ్రహ్మము ద్వివిధ మని మీరు పేర్కొనిరి కదా! అట్టి మీ కద్వైతశబ్ద మిపు డెట్లు సమ్మతమైనది?" అని ప్రశ్నించెను. అంత ఋభుమహర్షి 'వత్సా! ద్వైతప్రపంచశూన్యమై పూర్ణ చిద్ఘనమైన

నిర్గుణ బ్రహ్మమం దేకారణమున నద్వైత సంసిద్ధి కలుగుచు తదితరము నందు కలుగదో ఆ కారణమువలన సరూపారూపము లచే బ్రహ్మము ద్వివిధ మని వాదించునాకే అద్వైత వాదిత్వ మర్హముకాని అరూపాద్వైతవాదికి అద్వైత వాదిత్వమున కర్హతలేదు. ద్వైతాద్వైత మిశ్రమముల కతీతమై వ్యవహారాదుల కగోచర మైనయరూపబ్రహ్మమం దద్వైతవాదము కలుగదు.

ఓయీ! జాగ్రదవస్థయం దుండుస్థూలదేహము నన్నమయకోశము గను, స్వప్నావస్థయం దుండుసూక్ష్మదేహము ప్రాణమనోవిజ్ఞానమయ కోశముగను గ్రహింపుము. సుషుప్త్యవస్థయం దుండుకారణదేహమును ఆనందమయ కోశముగను, తురీయమం దశరీర మైనకోశవర్జితమును కూటస్థునిగను నెఱుంగుము. ఆ కూటస్థుఁడే మాయచే మోహితాత్ముఁడై చిదాభాసరూపమున దేహమునందుండి సర్వకర్మలు చేయుచున్నాఁడు; స్త్రీఅన్నపానాది విచిత్రభోగములచే జాగ్రదవస్థయందుఁ దృప్తిపడు చున్నాఁడు. జీవుఁడు మాయచేఁ గల్పిత మగుసంసారరూప స్వప్నావస్థ యందు సుఖదుఃఖభోక్త యగుచున్నాఁడు. సుషుప్తివేళ నింద్రియము లెల్ల లయింప నజ్ఞానాంధకార తిరస్కృతుఁడై సుఖరూపము నందు చున్నాఁడు. ఆ జీవుఁడే పూర్వజన్మకర్మ సంబంధమువలన సుషుప్తినుండి జాగ్రదవస్థ నందుచున్నాఁడు. శరీరత్రయమున క్రీడించుజీవునివలనఁ జిత్రాతిచిత్రకృత్యములు చేయఁబడుచున్నవి. ఏ చిదాత్మ యందు శరీరత్రయము లయ మందునో, ఏది సర్వవేదాంత రహస్యతత్త్వమో, ఏది పరిపూర్ణచైతన్యరూపమున చిదాభాసుని నిజస్వరూపమో అది సర్వా ధారానందాఖండ బోధస్వరూపము. ఈ చిదాత్మవలననే ప్రాణమనస్స ర్వేంద్రియములు పంచభూతములు పుట్టుచున్నవి. ఏ చిదాత్మ పరబ్రహ్మ స్వరూపమో, సూక్ష్మాతిసూక్ష్మమో, నిత్యమో అదే నీవు. నీవే అది. జాగ్ర త్స్వప్న సుషుప్త్యాది ప్రపంచము నే చిద్రూపము ప్రకాశింపఁజేయు చున్నదో ఆ బ్రహ్మము నే నని యెఱిఁగిన సర్వసంబంధములు నశించును.

మూఁడు శరీరములందలి భోజ్యభోక్తృభోగాదు లన్నిఁటికిని విలక్ష ణుఁడను, సాక్షిని, చిన్మాత్రుఁడను, సదాశివుఁడను నేనే. నా యందే సర్వము పుట్టి యంటి నశించు చున్నది. నే నణువుకంటె నణువును,

మహత్తును, విశ్వరూపిని, పురాణపురుషుఁడను, పరమేశ్వరుఁడను, హిరణ్మయుఁడను, శివరూపిని. నేను పాణిపాదములు కలవాఁడను గాను. అచింత్య శక్తుఁడను. కన్నులులేక చూచెదను. చెవులు లేక విందును, తెలిసికొందును. నేను నిస్సంగుఁడను. చిద్రూపుఁడను. నేనే వేదవేదాంతవేద్యుఁడను. వేదవేత్తను. వేదకర్తను. నాకుఁ బుణ్య పాపములు లేవు. నాశము లేదు. జన్మములేదు. దేహబుద్ధి లేదు. పృథివ్యప్తేజో వాయ్వాకాశములు నాకు లేవు.

ఇట్లు జీవుఁడు పంచకోశాత్మకగుహయందు శయనించిన నిష్కళాద్వయపరమార్థస్వరూపము నెఱింగి —

" అఖండమాద్యంతవిహీనమేకం
తేజోమయానంద ఘనస్వరూపమ్,
సమస్తసాక్షిం సదసద్విహీనం
ప్రయాతి శుద్ధం పరమాత్మతత్త్వమ్. "

అఖండమై, యాద్యంతములు లేని, అద్వితీయమైన, తేజోమయానంద ఘనస్వరూపమైన, సకలసాక్షియైన సత్యాసత్యవ్యవహారము లేని స్వరూపము కలిగిన శుద్ధపరమాత్మ తత్త్వమును పొందుచున్నాఁడు."

ఇట్లు ఋభుమహర్షి చేసిన నిర్మలబోధమును విని నిదాఘుఁడు సంశయరహితుఁడై బ్రహ్మజ్ఞుఁడై వెలింగెను.

# మహర్షుల చరిత్రలు

## కాత్యాయనమహర్షి

### వంశము

కాత్యాయనమహర్షికి మూఁడువిధము లగు వంశోత్పత్తి కాననగుచున్నది. కాత్యాయనుఁడు విశ్వామిత్ర వంశజుఁ డనున దొకటి; గోభిల పుత్రుఁడనున దింకొకటి. కతవంశమునఁ బుట్టినసోమదత్తుఁ డను బ్రాహ్మణునకు వసుదత్త యను భార్యయందుఁ గలిగినపుత్త్రుఁడు కాత్యాయనుఁ డనియు నీతఁడే వరరుచి యనుపేరఁ బ్రఖ్యాతిగాంచె ననియు మూఁడవది *

మంత్రద్రష్టగా ధర్మశాస్త్రస్రష్టగా పాణినీయ వ్యాకరణవార్త్తిక కర్త్తగాఁ గాత్యాయనమహర్షి పేరు ప్రఖ్యాతమై యున్నది. ఈ మువ్వురును వేఱు లేక యొక్కరా యన్నది పరిశీలనార్హము. స్కాందపురాణోత్తరఖండమున బుధకవచస్తోత్ర మహామంత్రమునకు ద్రష్ట కాత్యాయన మహర్షి యని కలదు; కాత్యాయన స్మృతియందుఁగాత్యాయనస్మృతి గోభిలప్రోక్తమని యున్నది; కాత్యాయన మహర్షి వాక్యకారుఁ డగువరరుచియేయని కథాసరిత్సాగరాదులయం దున్నది.

---

* "కతస్యగోత్రాపత్యం స చ త్రివిధః ।

1. విశ్వామిత్ర వంశ్యః
2. గోభిలపుత్రః
3. కతవంశ్య సోమదత్త ద్విజపుత్రః

వసుదత్తా గర్భజః వరరుచినామ్నాఖ్యాతశ్చ..." సంస్కృత వాచస్పత్యము.

## జననము

తొల్లి పార్వతీపరమేశ్వరులను భయభక్తి యుక్తులతోఁ బుష్పదంతుఁ డను మహనీయుఁడు పూజించుచుండెను. కాలక్రమమున నాతఁడు శివకింకరులలో నగ్రేసరుఁడై శివునికి మిగులఁ గూర్చువాఁడై యుండెను.

కాని, దురదృష్టవశమున నాతఁ డంబశాపము నంది భూలోకమున మర్త్యుఁడై పుట్టవలసివచ్చెను. శివుఁ డాతని నాదరించి "వత్సా! విచారింపకుము. ఉత్తముల కోపానుగ్రహములు రెండును లోకహితంకరములే యగును. నీవు కాత్యాయనుఁడు వరరుచి యనునామములతో నొకయుత్తమ విప్రుని కాతని ధర్మపత్నియం దుద్భవింపఁగలవు. నీవు శాస్త్రకర్తవై లోకహితమును గూర్చిన పిదప నాయంశమునకు శరీరము నొసఁగి నీశాపవిమోచనకై పంపఁగలను. అపుడు నీవు నన్నుఁ జేరఁగలవు. కావున విచారింపకు" మని యోదార్చి భూలోకమునఁ బవిత్ర బ్రాహ్మణవంశమునఁ బుట్టనమజ్ఞ నొసంగెను. పుష్పదంతుఁడు శివుని పాదపద్మములకు మ్రొక్కి "మహాదేవా! నీ పాదభక్తితో నిలువఁగలిగిన వాఁడు నే నెన్నిజన్మము లెత్తుటకైనను వెనుదీయను. దయచూడు" మని యంతర్హితుఁ డయ్యెను.

ఆ కాలమున భారతదేశమునఁ గౌశాంబి యను నొక మహానగర ముండెను. దానిని జేరి యొకపవిత్రమగు బ్రాహ్మణాగ్రహార ముండెను. అందు కతుఁడను వంశమువాఁడు సోమదత్తుఁ డనుమహాతపశ్శాలి యుండెను. ఆతనికి 'అగ్నిశిఖుఁ' డని మఱియొకపేరు గలదు. ఆతఁడు ఋగ్యజుర్వేదములు సంపూర్ణముగా నేర్చి ఋజువర్తనమున మిక్కిలి ప్రసిద్ధి నంది కౌశాంబీపుర మేలురాజు తనన్ను దేవుఁడని భావించి సేవించుచుండ నెడతెగని శివభక్తిగలవాఁడై విలసిల్లుచుండెను. కాలక్రమమున నాతఁడు వసుదత్త యను పేరు గల కన్యకారత్నమును భార్యగాఁ బరిగ్రహింపఁ వివాహమాడెను. ఆ పుణ్యదంపతులు పదునాఱు సంవత్సరము లతిపవిత్ర మగుదాంపత్య జీవితమును గడపిరి. సత్పుత్రు నొకనిఁ బడయుటకై వారు నోచిన నోములు, చేసినవ్రతములు, కావించిన

యుపవాసములు లెక్కకు మిక్కిలి యయ్యెను. ఇట్లుండ నంబశాపము ఈశ్వరునోదార్పు గన్న పుష్పదంతుఁ డను శివకింకరుఁడు సోమదత్తుని జేరి వసుదత్త గర్భమును బ్రవేశించెను. శుక్లపక్ష చంద్రునివలె నామె గర్భమునఁ బెరిగి నవమాసములు నిండినపిదపఁ బుష్పదంతుఁడు కుమారుఁడై జన్మించెను. ఆ పుణ్యదంపతుల యానందమున కవధి లేకుండెను. సోమదత్తుఁ డాతనికి జాతకర్మాదు లొనరించి కాత్యాయనుఁ డనియు వరరుచి యనియుఁ బేరిడెను. కతునివంశమువాఁ డగుటచేఁ గాత్యాయనుఁ డని మంచితేజస్వి యగుటచే వరరుచి యనియు రెండు పేళ్లు నాతనిపట్ల నన్వర్థ నామధేయము లయ్యెను. అప్పు డాకాశవాణి యానందాతిశయమున "వీఁడు శ్రుతధరుఁడగును. వర్షుని శిష్యుఁడై వ్యాకరణశాస్త్రమును వృద్ధిచేయును. కాత్యాయన వరరుచి నామముల నపారఖ్యాతి నార్జించు" నని ఘోషించెను.

సోమదత్తుఁ డట్టి పుత్త్రుఁ డుద్భవించినందుల కమితానంద మంది యుండెను. కాలక్రమమున బాలుని కైదవయేఁడు రాఁగానే సోమదత్తుఁడు మరణించెను. పాపము తనయుని యున్నతి కనులారఁ జూచు భాగ్య మాతనికి లేకపోయెను. అవివేకి యగు మానవుఁడు మృత్యుముఖమున నివాసమున్న మాట మఱచి ధనములపైఁ దనయులపైఁ దరుణులపై నడియాసలు పెట్టుకొని "మీఁదటి కింతలాభము వచ్చును. ఏఁడాదిలో నాకొడు కింతవాఁ డగును. పదేండ్లలో నే నింత భాగ్యవంతుఁడ నగుదు" నని యేమేమో యాకాశ సౌధములు నిర్మించుకొనుచుండునంతలో నే రాత్రియో యిహలోకమును విడిచినవాఁ డగును.

చేయునది లేక చిన్నారిబిడ్డను బెంచుకొనుచు వసుదత్త భర్తృమరణదుఃఖమును దిగమ్రింగుకొని కాలముఁ గడపుచుండెను. ఇంతలోఁ గాత్యాయనున కుపనయన కాల మేతెంచెను. కాని, వసుదత్త యాకాశవాణి చెప్పిన వర్షుఁ డను గురు వెవరో యెట నుండునో యెఱుఁగక పుత్త్రుని కుపనయనము చేయలేక యింటనే యుంచుకొనెను.

ఆ కాలమున వేతస మనుపురమున నిద్ద ఱన్నదమ్ము లుండెడివారు. వారు మహావిద్వాంసులు. ఒకఁడు దేవస్వామి. రెండవవాఁడు కరంభుఁడు.

దేవస్వామికి ఇంద్రదత్తుఁడు కరంభునకు వ్యాడి యనునిరువురు పుత్రు లుదయించిరి. తదనంతరము కరంభుఁడు కాలగతినందెను. ఆ యెడఁ బాటు సహింపలేక యన్నయగు దేవస్వామియు మహాప్రస్థాన మొనర్చి దేహత్యాగము చేసెను. వారిద్దఱి భార్యలు వెంటనే సహగమనముచేసిరి. ఆ బాలు రిరువురు ననాథులై తమ తండ్రుల విద్యావిశేషములను విని తామును బండితులు గాఁ దలఁచి కుమారస్వామిని గూర్చి తపస్సు చేయ మొదలిడిరి. కొన్నాళ్ళ కాతఁడు వారికిఁ బ్రత్యక్షమై పాటలీపుత్రమునఁ గల వర్షుఁ డను గురువువలన సకలవిద్యలు లభించు నని చెప్పి యంతర్హితుఁడయ్యెను. ఆ మాటలు విని యా బాలు రిరువురు బయలుదేరి పాటలీపుత్రముఁ జేరిరి. అచట వారు వర్షుఁడను నుపాధ్యాయునిఁగూర్చి వాకబు చేయఁ దొడఁగిరి. "వర్షోపాధ్యాయు లెచట నున్నారు. వర్షోపాధ్యాయు లెచటనున్నా?" రని వారు పౌరుల నడుగ నందుఁ గొందఱు "వర్షుఁ డనుమూర్ఖుఁ డొకఁడు మా యూర నున్నాఁడు. కాని వర్షోపాధ్యాయుఁ డెవఁడు మా వీట లేఁ" డని పలికిరి. ఆ బాలు రామాటలు విని "పోనిండు. మూర్ఖుఁడో జ్ఞానియో అతనియిల్లెక్కడ?" అని యడిగి వా రొక జీర్ణపర్ణశాలఁజూప బాలు రందుఁ జొచ్చి వర్షునిభార్యను గాంచి "అమ్మా! వర్షోపాధ్యాయుల యిల్లిదియేనా?" అని యాతురతతో నడిగిరి. ఔ నని యామె తెలుప నా బాలురమితానంద మంది తమ సంగతి చెప్పి వర్షునిగుఱించి పౌరులు మూర్ఖుఁడని పలికినపలుకులకుఁ గారణ మేమని యడిగిరి. ఆమె యిట్లు చెప్పఁ దొడంగెను.

"వత్సలారా! వినుఁడు, ధర్మాత్ముఁడై నందుఁ డనురాజు పరిపాలించు పాటలీపుత్ర మనుపురమును జేరిన దీ యగ్రహారము. ఇందుఁ దొల్లి శంకరస్వామి యనునొక బ్రాహ్మణోత్తముఁ డుండెను. ఆయన మా మామగారు. వర్షుఁడు, ఉపవర్షుఁడు నని ఆయన కిరువురు కొడుకులు. తొలియాయన నా భర్త. ఉపవర్షుఁడు నా మఱఁది. మఱఁది మహావిద్వాంసుఁడు. నా భర్త జడుఁడు. అది కర్మ మనుకొని నే నాతనినే భగవంతునిగాఁ బూజించుచుంటిని. ఉపవర్షుఁడు వివాహమాడి మా దారిద్ర్యమునకు వగచి భార్య కిష్టము లేకున్నను మా దంపతులను దన యింట నిడుకొని పండ్రెండేఁడులు పోషించెను. ఇట్లుండ నా తోడికోడలు

నన్నును నా భర్తను నెన్నోవిధములఁ బరాభవించెను. నే నొకనాఁడు పట్టలేక భర్తను నిందించి తరువాతఁ బశ్చాత్తప్తనై క్షమింపవేఁడుకొంటిని. నా భర్త దిగులుపడి నాతోఁ జెప్పక విద్యానిమిత్తము హిమగిరి కరిగి పరమశివుని గుఱించి తపస్సు చేయఁదొడఁగెను. భర్త యెడఁబాటునకుఁ బరమదుఃఖితురాల నగునన్ను మఱఁది యూఱడించి యాదరించుటచే నెట్లో కాలము గడపుచుండ నై దేండ్లకు నా భర్త తిరిగివచ్చెను. తమ్ముఁడు, భార్యయు నాతనిం బూజించిరి. నేను సంతోషించితిని. అపుడు నా భర్త తనకు హిమగిరిపై గుమారస్వామి ప్రత్యక్షమై "శ్రుతధరుఁ డనుశిష్య రత్నము నీకడకు వచ్చును. ఆతనికి నీవు ఓంకారముతో వేదము చెప్ప నారంభించినంతనే నీకు సకల విద్యలు కరతలామలక మగు" నని చెప్పి యంతర్హితుఁడయ్యె నని తెలిపెను. ఆ శిష్యుఁడింతవఱకు రాలేదు. ఆతని రాకఁ గోరి యీ శిథిలగృహమునఁ గాలక్షేపము చేయుచున్నాము. మీరు విద్యకై యాతనిఁ గని కొనివచ్చి యాతనితోఁ జదువవచ్చును."

ఆ మాటలు విని యా బాలురు కుమారస్వామివరము పొల్లుకాదని ధైర్య మవలంబించి లోని కరిగి సమాధి ప్రతిష్ఠితుఁ డగు వర్షునిఁ గని నమస్కరించి నిశ్శబ్దముగ మరల బయటికి వచ్చి యాతనిభార్యతో "అమ్మా! మే మాతనిఁ గొనివత్తుము. సెలవొసఁగు" మని యామె యానఁ గాంచి బయలుదేఱిరి. వారు తిరుగనినేల లేదాయెను. ఎక్కడను శ్రుతధరుఁడు కనరాఁడాయెను. తుదకు వారు విసిగి వేసారి తిరుగుచు నొకరాత్రి కీర్తిశేషుఁడగు సోమదత్తునింటికి వచ్చి యాతిథ్యమును గోరిరి. వసుదత్త వారి నాదరించి యన్నము పెట్టెను. వారు తిని యరుగుపైఁ బరుండిరి. ఇంతలో నెటనుండియో యొకపెద్దమద్దెల మ్రోఁత విన వచ్చెను. ఆ ధ్వని విని లోన వసుదత్త బిడ్డనితో "నాయనా! నందుఁడను నట శేఖరుఁడొకఁ డీ పేట నీ రాత్రి నాట్యమాడును. అతఁడు నీ తండ్రికిఁ బ్రియమిత్త్రుఁడు. అతఁ డీయూరెపుడు వచ్చినను మనయింటికే వచ్చెడి వాఁడు. కాని, ఈసారి మీతండ్రి లేకపోవుటచే రాలే" దని కన్నీరు మున్నీరుగా భర్తను గూర్చి యేడ్చెను. అపుడామె కొడుకు "తల్లీ! విచారింపకుము. నేను నందునినాట్యము చూడ నేఁగెదను. అతఁడాడిన నాట్యము నెల్ల రేపుదయము నీ కడ నేను 'తు' 'చ' తప్పకచూపఁగల"

నని పలికెను. ఈ సంభాషణమును వినుచున్న వ్యాడీంద్రదత్తులకు శ్రుతధరుఁడు (=ఏకసంథాగ్రాహి) అతఁడే కానోపు నని తోఁచెను. వెంటనే వారు లోని కేఁగిరి. వ్యాడి బాలుఁడగు కాత్యాయనునిఁ జూచి "ఏదైన నొకసారి విన్న నొప్పగింపఁ గలవా?" అని యడిగెను. "ఆఁ" యని యాతఁడు బదులుచెప్పెను. అతని తల్లి యాతఁడు బాల్యము నుండి ఏకసంథాగ్రాహిగనే యున్నాఁడని చెప్పెను. వ్యాడి యొక ప్రాతిశాఖ్యమును జదివి యొప్పగింపు మన బాలుఁ డగు కాత్యాయనుఁడు తడవుకొనకుండఁ దప్పకుండ నొప్పగించెను. వ్యాడీంద్రదత్తులు మనోరథము తీరనున్న దని యానందించి కాత్యాయనుని గూడి యా రాత్రి నాట్యమున కేఁగిరి. నాట్యమైనంత మువ్వురును దిరిగి యింటికి వచ్చిరి. మఱునాఁ డుదయమే కాత్యాయనుఁడు రాత్రి నాట్యవాద్య సంగీతముల నన్నిఁటిని 'తు' 'చ' తప్పకుండఁ దల్లి యెదుటఁ బ్రదర్శించెను. రాత్రి నందుని నాట్యమునకు నీతని నాట్యమునకు నీషద్భేదము లేనికారణమున వ్యాడీంద్రదత్తు లమితానంద మంది తమసంగతి యంతయు నా తల్లికిఁ బిల్లవానికిఁ జెప్పి యా మెవలన వారి యావద్వృత్తాంతము విని యాతనిం దమతోఁ బంపుమని యామెనుఁ గోరిరి. ఆమె వల్లె యనెను. వారట నాఁగి మఱునాఁడు కాత్యాయనునికి యథాశాస్త్రీయముగా నుపనయన సంస్కార మొనరించి యాతని తల్లియనుమతిఁ గొని కాత్యాయనునితో బయలుదేఱి పూవులలోఁ బెట్టిన ట్లాతనిఁ దీసికొని వర్షుని గృహమునకు వచ్చుచుండిరి. దూరమునుండియే వర్షుని భార్య యా మువ్వురను గాంచి స్వాగత మిచ్చి బ్రహ్మానందురాలై వారి నాదరించెను. వ్యాడీంద్రదత్తులు కాత్యాయనుని దీసికొని వచ్చి గురుపత్నికి గురునకు మ్రొక్కించి తాము మ్రొక్కిరి.

పరమచిత్రముగా వర్షుఁడు తన కున్న జడిమ యంతయు విఱియఁగా వారల మువ్వురను జేరఁదీసి వారిచరిత్ర లెఱిఁగి యానందమున నొక శుభముహూర్తమునఁ దాను ప్రాతఃకృత్యముల నెల్ల నిర్వర్తించి దర్భాసనమునఁ గూర్చుండి తామును సర్వము నిర్వర్తించినశిష్యుల నెట్టయెదుటఁ గుశాసనములఁ గూర్చుండఁబెట్టుకొని ప్రక్క భార్య మిక్కిలి కుతూహలమున నిలువ, తూర్పుగఁ దిరిగి పవిత్రమును ధరించి

గురువులను గుమారస్వామిని భజించి తత్కరుణ శ్రుతిస్మృతిజ్ఞానము కలుగ "అగ్నిమీడే పురోహితమ్" అను ఋక్కును సస్వరముగ సుస్వరమున నొక్కసారి పఠించెను. వెంటనే కాత్యాయనుఁడు దానిని గ్రహించి యొప్పగించెను. తరువాత వ్యాడి యొప్పగించెను. పిదప నింద్రదత్తుఁడు దానిని జదివెను. ఏకసంథాగ్రాహి కాత్యాయనుఁడు, ద్విసంథా గ్రాహి వ్యాడి, త్రిసంథాగ్రాహి యింద్రదత్తుఁడు నైరి. ఇట్లు రెండు గడియలలో నిరువది సూక్తములు వారు పఠించిరి. ఈ సంగతి విని వచ్చి చూచి యుపవర్షుఁ డన్నకు సాష్టాంగ నమస్కారము లొనరించెను. పిమ్మట వా రట్లొక సంవత్సరములో మూఁడువేదములు శాఖలతోఁ గూడ గ్రహించిరి.

ఆ మహనీయులఖ్యాతి యెల్లెడల క్షణములో వ్యాపించెను. పాటలీపుత్ర మేలునం[illegible]రా జానందమున వారిని జూడవచ్చి పాదచారియై సమీపించి మ్రొక్కి వర్షోపాధ్యాయునియు నేకసంథా, ద్విసంథా, త్రిసంథా గ్రాహులగు శిష్యరత్నములయు ప్రజ్ఞా విభవమునకుఁ బరవశుఁడై తాను గావించిన పరీక్షలలో వారు సునాయాసముగ గెలువ వర్షు నేనుఁగంబారిపై నెక్కించి ప్రక్క శిష్యులం గూర్చుండఁ బెట్టి తాను మంత్రులు పరివారము పాదచారులై దారిలో పౌరస్త్రీలు లాజ లక్షతలు వర్షునిపైని శిష్యులపైనిఁ జల్లుచుండఁగాఁ దన యాస్థానమునకు సగౌరముగాఁ దీసికొనివచ్చెను. పిదప సర్వాలంకృతమైన యా యాస్థానమున నున్నత పీఠమున రాజు వర్షోపాధ్యాయుని గూర్చుండఁబెట్టి కవిగాయకగాయనీ స్వనములు మిన్నుముట్టుచుండఁ గనకాభిషేకము చేసెను. తదనంతరము రాజవీథి నొక శ్రేష్ఠరాజ మందిరమును వర్షోపాధ్యాయుని కొసంగి యందు శిష్యులకుఁ బాఠము చెప్పుచు నుండవలసినదనియు వారికి దిన దినము నొకనిష్కము నుపాయనముగను సర్వసంభారములను బంపెదనని యేర్పాటుచేసి ఉపవర్షుని శిష్యుల నెల్లరను బహుభంగుల సమ్మానించి తాను వర్షోపాధ్యాయుని ప్రియశిష్యుఁ డయ్యెను.

పిదప శుభవేళ వర్షుఁడు పూరిగుడిసె విడిచి రాజభవనమునఁ బ్రవేశించెను. బంధుమిత్రులు వచ్చి యాతనిం జేరిరి. వర్షునిభార్య తనకు

ముప్వురుపుత్రు అని కాత్యాయనవ్యాడీంద్రదత్తుల జూపుచుఁ వారిని గన్నతల్లికి మిన్నగాఁ గంటికి ఱెప్పవలెఁ గాపాడుచుండెను.

ఇట్లుండ నొకనాఁడు వర్షుఁ డింద్రకృతమగు శబ్దశాస్త్రమును శిష్యులకుఁ జెప్ప నారంభించెను. ఒక్క నెలలో శిష్యులా శాస్త్ర మెల్ల నేర్చిరి. పిదప గురుఁడు వారికి జ్యోతిషము నిరుక్తము సంపూర్ణముగా నేర్పెను. వారు నిగర్వులై యింద్ర, చంద్ర, కాశకృత్స్న, పిశలి, శాకటాయనాదు లగుపూర్వశబ్ద శాస్త్రవేత్తలను సాంగోపాంగముగా విమర్శింపఁ దొడంగిరి. దేశవ్యాప్తముగ వర్షుని కీర్తిచంద్రికలు వ్యాపించుటవలనఁ బెక్కురువేలు శిష్యులు వచ్చి యర్థింప వా రెల్లరి కాదరమేదురత నా యా శాస్త్రములఁ జెప్పి శిష్యులచేఁ జెప్పించి వర్షోపాధ్యాయుఁ డపరిమిత ఖ్యాతి నందెను. అతని ధర్మపత్నియు శిష్యవాత్సల్యమున, బంధు ప్రీతిని, పాతివ్రత్యమున, యోగ్యతాగుణమున నమస్కారపాత్రురాలయ్యెను.

## కాత్యాయనుఁడు పాణిని నోడించుట

గాంధార దేశమందలి శలాతుర గ్రామమున పాణినుఁ డనునొక సదాచారసంపన్నుఁ డగుబ్రాహ్మణుఁ డుండెను. అతనికి దాక్షి యను ధర్మపత్నియందు పాణిని యనునొక కొడుకు కలిగెను. ఆతనికి యుక్త కాలమున నుపనయన మొనరించి తండ్రి విద్యనిమిత్తము వర్షోపాధ్యాయునికడకుఁ బంపెను. పాణినివచ్చి యితరశిష్యులతోఁ జదువ మొదలిడెనుగాని, యాతని కొక్కయక్కరమైన రాదయ్యెను. చాలబుద్ధి మంతుఁడు, శ్రద్ధాభయభక్తియుతుఁడే. కాని, యాతనికి చదివిన పాఠము చదివినట్లే యుండెను. ఈ చెవి విన్న దా చెవిఁ బోవుచుండెను. తన జడత్వమున కాతఁడు మిక్కిలి దుఃఖపడఁ జొచ్చెను. ఇట్లుండ నొకనాఁడు కాత్యాయనవ్యాడీంద్ర దత్తులు పాణిని పలికిన పలుకు లందలి యపస్వరములకుఁ బకపక నవ్విరి. గురుఁడు వారిని మందలించి పాణినిని మన్నించెను. పాణిని బెంగగొని యాత్మహత్యా ప్రయత్నమున నుండ గురుపత్ని యాతనిని వారించి గురునివలెనే కుమారస్వామినిగూర్చి తపస్సు చేసి విద్యలు సంపాదింపు మని బోధించెను.

పాణిని యా తల్లిమాటలు పాటించి హిమాలయమున కరిగి కుమారస్వామిని గుఱించి మహాతపము చేయఁగాఁ జేయఁగా గుహుఁడు ప్రత్యక్షమై యాతనికిఁ బంచాక్షరిమంత్ర ముపదేశించి ప్రయాగయందలి యక్షయవటము క్రింద భగవంతుఁ డగు శివుని భజించిన నాతఁడు సమస్త మొసంగఁ గలఁడని చెప్పి యదృశ్యుఁ డయ్యెను. పాణిని యా మాటలఁ బాటించి గయ కేగి యక్షయవటముక్రిందఁ దప మాచరించు మునీంద్రులఁ జేరి వారియాజ్ఞ నంది తాను దప మాచరించుచు నుండెను. ఇటుండ నీతని దీక్షకుఁ దీవ్ర తపశ్చర్యకు మెచ్చి శివుఁ డనుగ్రహింపఁ బాణినికి విద్య అలవడెను. మఱింతభయభక్తులతో నాతఁ డింకను భజింప శివుఁడు ప్రత్యక్షమై సనకాదుల నొకవంక, పాణిని నొకవంకఁ జూచి తనచేతియందలి ఢక్కను పదునాల్గుసారులు మ్రోయించెను. అంతఁ బదునాలుగు శబ్దము లుద్భవించినవి. వాని కంత మున ణ క ఙా దివర్ణములు చేర్పఁగా 'అ ఇ ఉ' ణాదికసూత్రము లయ్యెను. వానిని వ్యాకృతికై పాణినికి, బ్రహ్మవిద్యకై సనకాదులకు శివుఁ డొసంగెను. వారివారి సంశయములను దీర్చుటకై నందికేశు నేర్పఱిచి శివుఁ డంతర్హితుఁ డయ్యెను.

శివునికరుణ వడసి పాణిని వ్యాకరణము రచించెను. విజయుఁడై తిరిగివచ్చినశిష్యుని గురు వభినందించెను. గురుపత్ని పరమానంద మందెను. కాత్యాయనవ్యాడీంద్రదత్తుల నాతఁడు కూర్చుండఁబెట్టి తనవ్యాకరణమును వినిపించెను. అంతటఁ గాత్యాయన మహర్షికిని పాణినికిని వాగ్వాద మయ్యెను. ఏడుదినము లిట్లు వాగ్వాదమైన పిదప నెనిమిదవదినమునఁ గాత్యాయనుఁడు పాణిని నోడించెను. పాణిని తన యోటమికి మిక్కిలి దుఃఖించి తన్నుఁగాపాడఁ బరమశివుని బరమభక్తిని ప్రార్థించెను. అతనిపై దయ కలిగి భవుఁ డొకహుంకారధ్వని నొనరించెను. ఆ ధ్వని యింద్రునిశబ్దశాస్త్రము నెల్లను మ్రింగివేసెను; దానితో భూమిపై నింద్రుని వ్యాకృతి యంతయు నంతరించిపోయెను. కాత్యాయన మహర్షి యిపు డోటమిచే ఖిన్నుఁడై యెటకో వెడలిపోయెను.

ఈ పరిణామమునకు వర్షోపాధ్యాయుఁ డత్యంత దుఃఖితుఁడై యుండ నా రాత్రి కుమారస్వామి యాతనికిఁ గలలోఁ గానన "ఓయీ!

విచారింపకుము. నీవును నీ శిష్యులును పాణినియొద్ద నొక్కసారి వ్యాకరణమును వినుఁడు. మీ మీ పూర్వవిద్యలు మీకు వచ్చును. పాణిని పరమేశ్వరాంశావతారము. ఆతని వ్యాకృతి సదాశివదత్తము. దానిని మించువారు కాని యోడించువారు కాని యుండలేరు" అని పలికి యదృశ్యుఁ డయ్యెను.

మఱునాఁడుదయము తన స్వప్నము పాణినికిఁజెప్పి యతఁడును శిష్యులును నాతఁడు చెప్పిన యష్టాధ్యాయియగు వ్యాకరణమును శ్రద్ధగా వినిరి. వెంటనే వారందఱు వ్యాకరణవిద్యానిష్ణాతులైరి. పాణిని గురునికిఁ గురుబత్నికి వందనము లొనరించి సెలవుగైకొని హిమాలయ ప్రాంతమున నాశ్రమము నిర్మించుకొని శిష్యులకుఁ బాఠములు చెప్పుచు నం దుండిపోయెను.

కాత్యాయనమహర్షి వెడలిపోయి యీశ్వరుని గుఱించి యుగ్రతప మొనరించెను. శివుఁడు ప్రత్యక్షమై వరమడుగు మన్న నాతఁడు శబ్దశాస్త్రము నర్థించెను. వల్లెయని శివుఁ డది యిచ్చి యంతర్హితుఁడయ్యెను. కాత్యాయనుఁ డట్లు శివునివరముఁ బడసి పాణిని గ్రంథమంతయుఁ జదివి యాతఁడు చెప్పనిది చెప్పుచు, మరలఁ జెప్పినదానికింక మరలఁ జెప్పుట సాధ్యముకాని భంగి వార్తికములను రచించెను.

ఈ సంగతి యొక శిష్యునివలన విని పాణిని దన్నుఁదలదన్నిన కాత్యాయనమహర్షిపై నసూయ జనింప దుఃఖించి బయలుదేఱి కాత్యాయన మహర్షి యాశ్రమమును జేరెను. కాత్యాయనుఁ డాతనిరాకం గని లేచి యెదురేఁగుదెంచి యర్ఘ్యపాద్యాదులీయఁ బాణిని యంగీకరింపక నిప్పులు గ్రక్కు కన్నులతో "ఓరీ! నీవు పరమేశ్వరాంకితముగా నేను రచించిన వాక్యమునకు నిందలు రచించితివి. నీ శిర మీ రాత్రి శతధా భిన్నములై పడుఁగా" కని శపించెను. అపుడు కాత్యాయనుఁడు "ఓరీ! మూర్ఖా! బ్రహ్మచర్యము గావించి పొందిన విజ్ఞాన మేమైనది? ఆచార్య సేవాలబ్ధ మగుశమ మంతయు నే గంగఁ గలిసినది? వేదవేదాంగ విద్యల ఫలిత మిదియా? నీతోడిపూర్వవైర మావంతయు గడింపక, అతిథివని యర్ఘ్యపాద్యము లిచ్చి గౌరవింప వానిని గైకొనక యిట్లు దుందుడుకున నన్ను

పింతువా? నేను శివునాజ్ఞఁ దలధరించియే వార్త్తికములను వ్రాసితిని. శాపము నా యెడ సత్యమగుచో నదే నా శాపము నీ యెడను సత్య గుఁగాక!" అని పలికెను.

అపు డిరువురు తమ తమ యాశ్రమముల కరిగి శిష్యుల నెల్లరఁ లిచి తమకుఁ గలిగిన శాపోదంతము వారలకుఁ జెప్పి యిఁకఁ దప్పదని కాము యోగ మవలంబించి యా రాత్రి తమ శరీరములను విడిచివేసిరి. దప వా రిరువురును బరమశివునిలోకముఁ జేరినంతనే పరమశివుఁడు పరి కారములోని వారందఱకు వారిని గుఱించి చెప్పి కాత్యాయనుఁడు దేవి పమునందిన పుష్పదంతుఁడను శివకింకరుఁడే యనియు నాతని శాప వృత్తికిఁ దనతేజోంశమునకు రూప మొసంగిన నది పాణినియై పుష్ప ంతుని శాపముఁ బాపిన దనియు వెల్లడించి తన తేజమును దనలోఁ లుపుకొనెను. పుష్పదంతుని మరల నిజకింకరప్రధాను నొనర్చి యాద ంచెను.

ఈ ప్రకారము కాత్యాయనమహర్షి యవతారమును జాలించి శాశ్వత వసాన్నిధ్యము నంది ధన్యుఁడయ్యెను. *

## కాత్యాయన స్మృతి

కాత్యాయనమహర్షి విరచిత మగుధర్మశాస్త్రమునకు "కాత్యాయన ృతి" యని పేరు. ఇందు:

"అథాతో గోభిలోక్తానాం
అన్యేషాం చైవ కర్మణామ్,
అస్పష్టానాం విధిం సమ్యక్
దర్శయిష్యే ప్రదీపవత్."

---

* 1. కథాసరిత్సాగరము.
2. పతంజలిచరిత్ర.
3. లఘ్వృత్తిమునికల్పతరువు. (సిద్ధాంతకౌముదిలో)

అని ప్రథమఖండమున ఆచారాధ్యాయ మారంభింపఁబడినది. స్మృతి చివర "ఇతి కాత్యాయనవిరచితే (గోభిలప్రోక్తే) కర్మ ప్రదీపే తృతీయః ప్రపాఠకః. ఇత్యేకోన త్రింశఃఖండః" అని కలదు.

ప్రథమఖండమున ఆచారాధ్యాయము యజ్ఞోపవీత ప్రకరణవర్ణనము శీర్షిక కలదు. ద్వితీయఖండమున నిత్యనైమిత్తిక కర్మవర్ణనము కలదు. తృతీయఖండమున త్రివిధక్రియావర్ణనము, చతుర్థఖండమున శ్రాద్ధకర్మవర్ణనము, పంచమఖండమునఁ దద్విశేషములు, షష్ఠఖండమున అనేక కర్మవర్ణనము, సప్తమఖండమున శమీగర్భాద్యనేక ప్రకరణవర్ణనము, అష్టమఖండమున సయజ్ఞస్రువ సమిధలక్షణము, నవమఖండమున సంధ్యాకాలకర్మవర్ణనము, దశమఖండమునఁ ప్రాతఃకాలికస్నానాది క్రియావర్ణనము కలవు. ఇది ప్రథమ ప్రపాఠకము; ఏకాదశఖండమున సంధ్యోపాసనవిధి, ద్వాదశఖండమున తర్పణవిధి, త్రయోదశఖండమున పంచమహాయజ్ఞవిధి, చతుర్దశఖండమున బ్రహ్మయజ్ఞవిధి, పంచదశఖండమున యజ్ఞవిధి, షోడశఖండమున శ్రాద్ధవిధి విశేషవిధి, సప్తదశఖండమున శ్రాద్ధవర్ణనము, అష్టాదశఖండమున వివాహాగ్నిహోమవిధానవర్ణనము, ఏకోనవింశతిఖండమున వికర్తవ్యతాస్త్రీధర్మవర్ణనము, కలవు. (ఇతి కాత్యాయన (వా-గోభిలే) విరచితే కర్మప్రదీపే ద్వితీయఃప్రపాఠకః.) వింశతిఖండమున ద్వితీయాదిస్త్రీకృతవైదికాగ్నివర్ణనము, ఏకవింశఃఖండమున మృతదాహసంస్కారవర్ణనము, ద్వివింశఃఖండమున దాహసంస్కార వర్ణనము, ఇందు:

మా శోకం కురుతానిత్యే సర్వస్మిన్ ప్రాణధర్మణి
ధర్మం కురుత యత్నేన యో వః సహ గమిష్యతి
మనుష్యే కదళీస్తంభే నిస్సారో సారమార్గణం
యః కరోతి స సమ్మూఢో జలబుద్బుదసన్నిభే
గంత్రీ వసుమతీ నాశం ఉదధిర్దైవతాని చ
ఫేనః ప్రఖ్యః కథం నాశం మర్త్యలోకో న యాస్యతి.
పంచధా సంభృతః కాయో యది పంచత్వమాగతః
కర్మభిః స్వశరీరోత్థైః తత్రకాపరిదేవనా.

సర్వేక్షయాన్తా నిచయాః పతనాంతాః సముచ్ఛ్రయాః
సంయోగా విప్రయోగాంతా మరణాంతంహి జీవితమ్.
శ్లేష్మాశ్రు బాంధవైర్ముక్తం ప్రేతో భుంక్తే యతో ఒవశః
అతో న రోదితవ్యం హి క్రియాః కార్యాః ప్రయత్నతః.

అను మహోపదేశములు కలవు. త్రయోవింశఃఖండమున విదేశస్థమృత పురుషదాహ సంస్కారవర్ణనము, చతుర్వింశః ఖండమున సూతకకర్మ త్యాగము షోడశశ్రాద్ధవిధివర్ణనము పంచవింశఃఖండమున నవయజ్ఞరహిత నవాన్నభోజన ప్రాయశ్చిత్తము, షడ్వింశఃఖండమున నవయజ్ఞకాలాభి ధానవర్ణనము, సప్తవింశఃఖండమున ప్రాయశ్చిత్తవర్ణనము అష్టవింశతి ఖండమున ప్రాయశ్చిత్తము, ఉపాకర్మ, ఫలనిరూపణవర్ణనము, ఏకోన త్రింశఃఖండమున శ్రాద్ధవర్ణనము గలవు. ఇది తృతీయప్రపాఠకము. *

## కాత్యాయన కృత బుధ స్తుతి

ఓమ్ అస్యశ్రీ బుధకవచస్తోత్రమహామంత్రస్య కాత్యాయనఋషిః ......ధ్యానమ్.

" బుధఃపుస్తకహస్తశ్చకుంకుమస్య సమద్యుతిః
బుధం జ్ఞానమయం సర్వం కుంకుమాభం చతుర్భుజమ్,
ఖడ్గశూల గదాపాణిం వరదాంకిత ముద్రితం
పీతాంబరధరం దేవం పీతమాల్యానులేపనం
వజ్రాద్యాభరణంచైవ కిరీటమకుటోజ్జ్వలం
శ్వేతాశ్వరథమారూఢం మేరుం చైవ ప్రదక్షిణం
బుధఃపుస్తకహస్తశ్చ కుంకుమస్య సమద్యుతిః
పీతాంబరధరః పాతు పీతమాల్యానులేపనః
బుధః పాతు శిరోదేశం సౌమ్యః పాతు చ ఫాలకమ్
నేత్రేజ్ఞానమయం పాతు శ్రుతీపాతు విధూద్భవః
ఘ్రాణం గంధధరః పాతు భుజౌ పుస్తకభూషితః

* స్కాందపురాణము : ఉత్తరఖండము.
స్మృతిసందర్భః తృతీయో భాగః.

మధ్యం పాతు సురారాధ్యః పాతు నాభిం ఖగేశ్వరః
కటిం తామాత్మజః పాతు ఊరు పాతు సురేశ్వరః
జానునీ రోహిణీసూనః పాతు జంఘే ఫలప్రదః
పాదౌ బాణాసనః పాతు పాతు సౌమ్యోఽఖిలం వపుః
ఏతోహి కవచః పుణ్యః సర్వోపద్రవశాంతిదః
సర్వరోగప్రశమనః సర్వదుఃఖ నివారకః
ఆయురారోగ్యశుభదఃపుత్రపౌత్రప్రవర్ధనః
యః పఠేత్కవచం దివ్యం శృణుయాద్వా సమాహితః
సర్వాన్కామానవాప్నోతి దీర్ఘమాయుశ్చ విందతి."

# మహర్షుల చరిత్రలు

## గృత్సమద మహర్షి

### జననము

శౌనకమహర్షివంశమున సునహోత్రుఁ డనుమహనీయుఁ డొకఁ డుదయించెను. ఆతఁడు నిత్యతపస్వి, శమదమాదిసంపన్నుఁడు. ఆతనికి నిజపత్నియందు మువ్వురు పుత్రు లుదయించి పరమధార్మికు లను ప్రఖ్యాతి నందిరి. వారు కాశుఁడు, శాల్ముఁడు, గృత్సమదుఁడు నను వారు. వారిలో గృత్సమదుఁడు మహాతపశ్శాలియై సునహోత్రుని పుత్రుఁ డగుట శౌనహోత్రుఁడనియే పిలువఁబడుచుండెను. ఈతఁడు ఋగ్వేదులకుఁ దర్పణీయర్షియై శ్రుతి స్మృతిపారగుఁడై బ్రహ్మచారి, విప్రర్షి, శ్రీమంతుఁడు నని విఖ్యాతి గడించెను. *

### అగ్ని వరము లిచ్చుట

గృత్సమదుఁడు వేదవేత్తయై భక్తిసంపన్నుఁడై అగ్నిదేవుని వేదమంత్రములతో స్తుతించెను. పిదప నాతఁ డగ్ని ప్రీతికర మగు యజ్ఞ మొనరించెను. తదనంతరము అగ్నిహోత్రునికిఁ బరమతృప్తికర మగు మంత్రసప్తకముతో వేనోళ్ళ నాతఁడు శ్లాఘించెను. అకళంక హృదయుఁడు, అనుపమభక్తుఁడు, అవిరళతపస్సంపన్నుఁడు నగు నాతనిపట్ల నగ్నిహోత్రుఁడు దయకలిగి యాతనికి దివ్యశరీర మొసం

---

* "గృత్సమదః, శౌనకగోత్రప్రవరే సునహోత్రస్యపుత్రభేదే.
సునహోత్రస్య దాయాదాః త్రయః పరమధార్మికాః కాశః
శాల్మశ్చ ద్వావేతౌ తథా గృత్సమదః.
ఋగ్వేదవర్తతే చాగ్ర్యా శ్రుతిర్యస్యమహాత్మనః యత్రగృత్సమదో బ్రహ్మన్
బ్రాహ్మణైస్సమహీయతే, సబ్రహ్మచారీ విప్రర్షిః శ్రీమాన్
గృత్సమదోఽభవత్" – వాచస్పత్యము.

గెను. మఱియు నాతఁడు త్రిలోకములందుఁ ద్రిశరీరములతో నొకేపరి తిరుగఁ గలమహాశక్తి యగ్నిహోత్రుఁ డనుగ్రహించెను. దానివలన, వెంటనే గృత్సమదుఁడు దివ్యశరీరధారియై స్వర్గమున కేఁగి రెండవ యింద్రునివలెఁ బ్రకాశించెను. అతఁడు భూమిపైని, ఆకాశమున, గాలి లోను మూఁడుచోట్ల మూఁడు శరీరములు ధరించి ప్రకాశించుచుండెను.

## ఇంద్రుని తోడి మైత్రి

ఇట్లుండ నింద్రశత్రువు లగు నిద్దఱు రాక్షసులు ధుని, చుమురి యనువారు స్వర్గమున రహస్యముగఁ దిరుగుచు నింద్రుని జంపుటకు యత్నించుచుండిరి. వారి క్రింద సమతేజుఁ డగు గృత్సమదుఁడు కాన వచ్చెను. ఈతఁడే యింద్రుఁ డనుకొని యా రాక్షసు లిరువురు సాయుధులై యాతనిపైఁ బడిరి. అతఁడు నిర్భయుఁడై వారి యాంతర్య మెఱిఁగి వారినాశనముఁ దన క్షేమముఁ గోరి "యోజాతః" అదియగు వేదమంత్రములతో నింద్రుని గుణగణప్రశంస యొనరించెను. ఇంద్రుని గుణముల నీరీతి విన్న యా రాక్షసుల కిదివఱకు లేని విపరీత మగుగుండె బెదరు సంభవించెను. ఆసమయమున కట కింద్రుఁడు విచ్చేసి భయంకరు లయ్యు పిఱికిపంద లయిన యా రాక్షసులను వెంటనే పిలుకు మార్చెను.

గృత్సమదుఁ డమితానంద మంది యింద్రుని మరల సంస్తుతించి యాతని గుణగణములను గొనియాడెను. అంత నింద్రుఁడు "మునీంద్రా! నీవు నాకుఁ బ్రియమిత్రుఁడ వైతివి. నీవు చేసిన ప్రశంస నిశ్చలమగు నీయంతఃకరణమునకు సాక్షి. అది నాకుఁ బ్రీతి పుట్టించినది. నేఁటి నుండి నీవు నాకుఁ బ్రియమిత్రుఁడవైతివి. నీతప మమోఘమై నీసమస్త వాంఛితములను ఈడేర్చునుగాక! నీ కేమివరము కావలయునో కోరు కొను" మని యాతనిని మిగుల బహూకరించెను. అంత నాతఁడు "మహేంద్రా! నీయీ కటాక్షమునకు నిత్యముఁ గృతజ్ఞుఁడను. ఓ మహా మహా! నీదయవలన నా శరీరమున కక్షయత యలరారుఁగాక! నాకు మనోజ్ఞ వాక్చమత్కృతి యలవడుఁగాక! సురేంద్రా! నీకరుణవడసి

నీవు సర్వైశ్వర్యముల నందుదువు గాక! నేను నిత్యము నాహృదయమున నిన్నే స్మరించుచుందును గాక! జన్మజన్మములను నీ పద భక్తి నాకుఁ గలుగుఁగాక! నీకటాక్షము నాపైఁ బ్రసరించుచుండుఁగాక! నా హృదయ మెల్లప్పుడు నీయందే నిమగ్నమై యుండుఁగాక! నీవు శారీరకముగా నా కెడదవ్వయినను, మానసికముగా మాత్రము నాహృదయ రథస్థితుఁడవై "రథితరుఁడ" వగుదువుగాక!" అని యాతని హస్తము దనహస్తములోనికిఁ దీసికొని యభినందించెను. తరువాత నాతనిని దనప్రాసాదమునకుఁ గొనిపోయి విధివిధానమున సమస్తమగు నతిథిమర్యాద జరపి యాతనిపైఁ బ్రబలాభిమానమును బ్రకటించెను.

అనంతరము గృత్సమదుఁడు మరల నింద్రుని "శ్రుధి" ఆదిగాఁ గలవేదమంత్రములతోఁ దనపై నాతఁడు చూపిన నిర్వ్యాజవాత్సల్యమునకుఁ గృతజ్ఞతతో మిగుల సంస్తుతించెను. ఆవేళ కచటి కింద్రగురు వగుబృహస్పతి విచ్చేయఁగా గృత్సమదుఁ డాతని నమితభక్తిని స్తుతించెను. పిదప, ఇంద్రబృహస్పతు లిరువురకు ననువర్తించువేద మంత్రములతో వారిని ఏకముగను ప్రత్యేకముగను స్తుతించెను. అంత వారిరువురు నాతనిశ్రద్ధాభక్తుల కలరి "ఓయీ! నీవు నేఁటినుండి నిజముగా గృత్సమదుఁడవైతివి.* ఎవఁడు విద్యావినయసంపదచే సురేశ్వరుని సురేశ్వరగురువును సంతసింపఁజేయునో యాతనికంటె మేధావి యింకొకఁడు లేఁడు!" అని యాతని నభినందించిరి.

మఱియొకప్పు డింద్రుఁడు గృత్సమదునిభక్తిని బరీక్షింపఁగోరి పక్షిరూపము ధరించి యాతనిభుజములపై వ్రాలెను. దివ్యజ్ఞాన సంపన్నుఁడగుగృత్సమదుఁడు తన దివ్యదృష్టిచే నావ్రాలినపక్షి యింద్రుఁడని గ్రహించి యాతనిని బక్షీంద్రునిగ, సురేశ్వరునిగాఁ బ్రస్తుతించి తన యనన్యభక్తిని జాటెను. అపు డింద్రుఁడు నిజరూపమున నాతనికిఁ

---

* 'గృత్సో మేధావీ' అని నిఘంటువు. గృత్సమదుఁడు—మేధానిధి యని యర్థము. గృత్సుఁ డనఁగా మేధావి. ఈశ్వరుఁడు మేధావులకు మేధావి, గృత్సపతి అని కీర్తితుఁడుఁ; గృత్సేభ్యో గృత్సపతిభ్యశ్చవో నమః.

ప్రత్యక్షమై "మిత్రమా! నీవిషయమున నాకింకెట్టిసంశయమును లేదు. నీవు సర్వకాలములందును నాకు మిత్రరత్నమవై యుందువుగాక! నీవలన నాకుఁ గలిగిన ప్రీతి యింకెవరివలనఁ గలుగలేదు. కావున, నీవు నాథ క్తతముఁడవు. మిత్రతముఁడవు. నీయిచ్ఛవచ్చినపుడు యథే చ్ఛగా వచ్చుచుఁ బోవుచుండు" మని ప్రబోధించి వీడ్కొలిపెను. *

## శి వ క టా క్ష ము

ఒకప్పు డింద్రుఁడు సహస్రసవర్షసత్రయాగ మొకటి యారంభించెను. అందు బృహస్పతిసమతేజుఁడై యింద్రుని ప్రార్థనమున గృత్సమదుఁడు బృహస్పతితోపాటు యజ్ఞ నిర్వహణమున సహాయుఁ డగుచుండెను. గృత్సమదున కింతగౌరవము లభించుట కసూయపడినవారలలో చాక్షుష మనువుపుత్త్రుఁ డగువసిష్ఠుఁ డనువాఁడు నాయజ్ఞమున నుండెను. యజ్ఞ విషయమున గృత్సమదుఁడు రథంతర సామగాన మతిమనోహరముగాఁ జేయుచున్నసమయమున వసిష్ఠుఁడు లేచి "ఓయీ! గృత్సమదుఁడా! శక్రక్రతువున రథంతరసామగాన మొనరించు సాహసము నీ కెట్లు కలిగినది? తగినశక్తి లేనిదే తగుదునమ్మా యని నీ వీవని కొడంగడినంత మాత్రముననఁ బ్రబుద్ధులు సంతసింతురా? నీ వుచ్చరించుచున్నసామమున నపస్వరము లనేకము లున్నవి. అపస్వరములతో మంత్రము చ్చరించినవానికిఁ గలుగు పాపమునకు మేర కలదా! అందును దేవేంద్రుని యజ్ఞమునన నా యిట్టి యపస్వరములు? ఏది తిరిగి యా సామము నుచ్చరింపు" మని హుంకరించెను. గృత్సమదుఁ డతిశాంతియుతుఁడై తా నుచ్చరించినమంత్రము సుస్వరయుతమే కాని యపస్వరసంయుతము కాదనియు, దానిబాధ్యత యంతయుఁ దనదే కాన నొరు లూరకొనవలసినదే యని వసిష్ఠుని హెచ్చరించెను. ఆ మాటలు విని వసిష్ఠుఁడు తోక ద్రొక్కినత్రాచువలె లేచి "ఓరీ! నీ కీయార్త్విజ్య మిచ్చినయింద్రు ననవలెఁ గాని నిన్నుఁ గాదు. అపస్వరయుతముగ సామమంత్రమును జదివి యజ్ఞమును మంత్రమును గలుషిత మొనర్చుట నేను సహింపఁ

---

* ఋగ్వేదము II. 2; 12.

జాలను. నీవు వెంటనే క్షమార్పణము చెప్పుకొని, యా సామమును మరల నుచ్చరించి నేను దిద్దినస్వరముప్రకారము మరల నుచ్చరింపుము. లేదా నీవు శాపగ్రస్తుఁడ వగుదు" వని గద్దింప నాతని నావంతయు లక్ష్యపెట్టక గృత్సమదుఁడు తనపని తాను జేయుచునే యుండెను.

అంత వసిష్ఠుఁ డతికోపియై శాపోదకములు చేతఁ గైకొని "ఓరీ! నీవు బుద్ధిహీనుఁడవై మేధావి నని గర్వించి యున్నావు. నీవు గృత్స మదుఁడవు (మేధావివి) కావు. గర్వోన్మదుఁడవు. నీవు ప్రజ్ఞాహీనుఁడవై నన్నుఁ దృణీకరించితివి. కావున, నీవు విద్యావిహీనుఁడవై క్రూర మృగమవై ఘోరవనమునఁ జరింతువు గాక! నీవు దుఃఖభాజనుఁడవై యాహారపానీయములైన లభింపక యలమటింతువు గాక! సింహభీకర మగు వనమున నీవు సహస్రాధికవర్షము అతినీచపరత నివసింతువు గాక!" యని విడిచెను.

వసిష్ఠుని యుగ్రశాపమున గృత్సమదుఁడు వెంటనే మృగమై శక్రక్రతువున నగ్రాసనమునఁ గూర్చుండి సర్వమును దిలకించుచున్న శంకరుని పాదములపైఁ బడి శరణుఁజొచ్చెను. ఇంద్రుఁడు తన మిత్రుని గాపాడుమని ఈశ్వరు నర్థించెను. పరమశివుఁ డాతనియందు దోషము లేని కారణమున వెంటనే యాతని ననుగ్రహించి యభయ మిచ్చి వసిష్ఠుని శాపముఁ గ్రమ్మరించి గృత్సమదుని మరల గృత్సమదు నొనరించి వసిష్ఠుని నిందించి యాతనిచే నితనికి మ్రొక్కించి "వత్సా! గృత్స మదా! నీవు నిష్కళంకుఁడవు. నిత్యోజ్జ్వలుఁడవు. ని న్నిఁక నెవ్వ రెవ్వ డేమియుఁ జేయఁజాలరు. నీవు జరామరణ వర్జితుఁడవై సత్య శౌచ శమదమాది సంపన్నుఁడవై సర్వదుఃఖదూరుఁడవై శాశ్వతత్వము నందుదువుగా" కని వర మొసంగి కాపాడెను.

గృత్సమదుఁ డిట్లు మహాశాపము బారినుండి తప్పించుకొని శివుని కటాక్ష మను మహాభోగమును నవ్యాజవత్సలుఁ డగు నాతని వరప్రసాద మును సంపాదించి ధన్యుఁ డయ్యెను. దేవత లాతనిపైఁ బుష్పవృష్టి గురిసిరి. యక్ష కిన్నర కింపురుషు లాటపాటలఁ దమహర్షమును దెల పఱచిరి. ఇంద్రుఁ డభినందించెను. వసిష్ఠుఁడు సిగ్గుపడి మైత్రి కోరెను.

ఆహా! భగవద్భక్తులకు వవి పుష్పము; అగ్ని మంచు; శాపము వరము నగునుగదా! *

## గణేశ భక్తుఁడు

గృత్సమదుఁడు గణేశభక్తులలో నగ్రేసరుఁడు. అతఁడు మానసిక పూజ, బాహ్యపూజ అనుద్వివిధపూజలు గావించి గణపతి యనుగ్రహము సైతము సంపాదించెను. అతఁ డిట్లు గణేశమానసికపూజ యొనరించెను. "ఓ విఘ్నేశ్వరా! వందిమాగధస్తుతులను విని నీవు బ్రాహ్మీముహూర్తమున లెమ్ము. జగన్మంగళకరుఁడవు కమ్ము. నీవు నా చిత్త పద్మమునుండి లేచి బహిర్గణేశుఁడవు కమ్ము. నా చిత్తమునుండి నీవు బయలువెడలి బహిర్గతుఁడ వగునపు డిదే దేవపతి, ఈశ్వర, మునిజనముల సన్నుతు లందుచున్నావు. నే నతిశుచిగా నీకు జలము లందించుచున్నాను. దంతధావనము చేసికొనుము. ఇదే దివ్యవస్త్రము నర్పించుచున్నాను. ముఖము తుడుచుకొనుము. సభను బ్రవేశింపుము. సర్వద్విజాతుల యభినందనములను, శుకాదుల సంభాషణమును గని విని నీవు లేచి సుమండపమును గల్పించుకొని యధిష్ఠింపుము. రత్నములందుఁ బ్రదీప్తమైన నీ ప్రతిబింబమును జూచుకొనుము. రత్నసువర్ణయుక్తమగు దివ్యాసనము నలంకరింపుము. నీకు నాబుద్ధిచే సిద్ధముచేసిన పాద్యము నర్పించుచున్నాను. సుఖోష్ణభావముగల సువాసితజల మిదే హృదయశుద్ధిగ నిచ్చుచున్నాను. పరిగ్రహింపుము. నీకు సువస్త్రముఁ గట్టి, సంప్రోక్షించి, దూర్వాదులచే నర్చించెదను. ఓ భావప్రియా! నీ పాదపద్మములందే నామనస్సు లగ్న మగునట్లుచేసి యనుగ్రహింపుము. కర్పూర తైలాదిసువాసిత మగు జలము నీకై కల్పించితిని. నీ వాచమించి కృపాకటాక్ష వీక్షణముల నాపైఁ బఱపుము. అంతరభావమునఁ బ్రవాళముక్తాఫలహాటకాదులచే సుసంస్కృత మయి నాచే నీయఁబడు ననర్ఘ మగు నర్ఘ్యమును సఫల మొనరింపుము. సుగంధయుక్తము, మధుపర్కశోభితము, భావ

---

* భారతము అనుశాసనిక పర్వము.

Q2.052N1
35M89



సంకల్పితము నగుదానిని గ్రహించి భక్త సంరక్షణార్థము పునరాచమన మొనరింపుము. సువాసితమగు చంపకాదిక పుష్పతైలము నీకొఱకై సిద్ధము చేసియున్నాను. దానిని నీసర్వాంగములకు రాయుచు సేవ చేసెదను. అనేక తీర్థజలములను సేకరించి వానిని సుఖోష్ణజలముల నొనరించి యందు శుద్ధస్నానము చేయించెదను. తరువాత నీచే పయస్స్నానము, దధిస్నానము, మచ్చిత్త దత్తమగు జలముచేఁ జేయించెదను. ఓ విఘ్నహరా! నీకటాక్షసంపాదనకై సుతీర్థజ మగు ఘృతస్నానము చిత్తకల్పిత మగుమధుస్నానము నీచేఁ జేయించెదను. మాయనుండి నన్నుఁ గాపాడుము. పరమవిశుద్ధుఁడ వగు నిన్ను మనస్సున వేదసూక్తులచేఁ బూజించెదను. వానిముందు దూర్వాదు లిప్పులుగదా! అపారబ్రహ్మాండ మండలభూత బ్రహ్మణస్పతి వగు నిన్నభిషేకించెదను. మనోదత్తమగు నమూల్యవస్త్రయుగ్మముచే నీ దేహము నలంకరించెదను. వ్రజలఁ గాపాడుము. ఓ విఘ్నేశ! భక్త ప్రతిపాలకా! నీ వాచమించి నే నిచ్చినయుత్తరీయమును గ్రహించి నా నమస్కృతులు స్వీకరింపుము. త్రిగుణస్వరూపము, సువర్ణనిర్మితము, అహినిందభూతము నగుయజ్ఞోపవీతమును భావముచే నీకు దత్తము చేయుచున్నాను. భక్తరక్షకా! పరిగ్రహింపుము. ఉదయించుచున్న సూర్యునికాంతి గల సిందూరముచే నీకుఁ దిలకము దిద్దెదను. సర్వాంగ సంసేవన మాచరించెదను. ప్రభూ! స్వీకరింపుము. సహస్రశీర్షము, సువర్ణనిర్మితము నగుదివ్యకిరీటమును మనస్సుచే నీ కర్పించుచున్నాను. అనేకరత్నశోభితమగు నది నీ మస్తకమునఁ బ్రకాశించుఁగాక! విచిత్ర రత్ననిర్మితము, హేమమయమునగు సరత్నకుండల ద్వయము నీ కర్పించెదను. స్వీకరింపుము. దేవా! నీకు సువర్ణకంచుకము, నీ దంత శోభనమునకై సువర్ణరత్ననిర్మితమగు దంతాభరణముల నిచ్చెదను. తండ్రీ! నీ నాలుగుభుజములకు నాలుగురత్నసువర్ణకృతములగు భుజకీర్తులఁ జేయించి యిచ్చెదను. ధరింపుము. నీయంగుళులకు రత్నాంగుళీయకములను భావసమర్పణ చేయుచున్నాను. స్వీకరించి రక్షింపుము. ప్రవాళము క్తాఫల రత్నములతో సువర్ణసూత్రమును జేయించి నీకుఁ గటిసూత్రముగా నర్పించుచున్నాను. మహాత్మా! అది నీ లంబోదరమునకు శోభ గలిగింపఁగలదు. దయతో ధరింపుము. నీ అలాభూషణావృద్ధి

36314

క్షయరహిత మగుపూర్ణ చంద్రాభరణము నర్పించుచున్నాను. ఓ భక్త ప్రియా! గ్రహింపుము. సదానందసుఖప్రదుఁడవగు నోవిఘ్నేశా! నీకు మానసికముగాఁ జింతామణిభూష నర్పించుచున్నాను. రత్న సువర్ణయుక్త మగు కాంచి నిచ్చుచున్నాను. కింకిణీనాదమేదురము లగు మణిమంజీరముల నిచ్చుచున్నాను. స్వామీ! స్వీకరించి వర ప్రదుఁడ వగుము. విచిత్రధాతు ప్రభావము లగు ననేకాలంకారములను నీకుఁ గావలసినన్ని నా హృదయముచే నీ కర్పించుచున్నాను, పరిగ్ర హింపుము. చంపకము, మాలతి, జలపంకజము, స్థలపద్మము, మల్లిక మున్నగు సమస్త పుష్పములతోడను గ్రుచ్చి సుమహారమును భక్తితో నీకు మానసికముగ నర్పించుచున్నాను. తరువాత, మందార శమీ దళాదులు, దూర్వాంకురములు, దీపము, ధూపము, షడ్రస సంయుత ములగు భక్ష్య, భోజ్య, లేహ్య, చోష్య, పానీయములను నీకు నైవేద్య మిడుచున్నాను. భోజన మధ్యపానీయముగా సువాసితమగు జలము కమండలువునుండి క్రోలుదువు గాక! నీ హస్తముఖములు కడుగుకొను టకు నీకు తీర్థజలము లొసంగుదును. ద్రాక్షాదిరంభా ఫలచూత ఫల ములు, ఖర్జూరకార్కంధుక దాడిమములు, సుస్వాదు యుక్తములగు ఫలములను నీకు సమర్పించుచున్నాను. ప్రభూ! స్వీకరింపుము. దేవా! అష్టాంగయుక్తమగు తాంబూలమును, మందార కూర్పాసక యుక్త వస్త్రముతోఁ గప్పఁబడిన రత్నసువర్ణయుక్తమగు దివ్యాసనము నర్పించితిని. మఱియు, నీప్రీతికొఱకై సర్వోపచారముల నొనరింతును. తండ్రీ! నీకు బంగారు కాసులు దక్షిణగా నిచ్చెదను. పుచ్చుకొని లోక ములఁ గాపాడుము. వివిధములగు రాజోపచారములు, అసంఖ్యాకము లగు హస్త్యశ్వచ్ఛత్రాదికములు నీకు మానసికముగా నర్పించుచున్నాను. పరిగ్రహింపుము. మందారపుష్పములు, శమీదళములు, దూర్వాంకుర ములు నీకుఁ బర్వతోపమానముగా నర్పింతును. దేవదేవా! నీకు శ్రీశుకా దులు, శివ విష్ణుముఖ్యులు, ఇంద్రాదులు, శేషాదులు, మునీంద్రులు సేవక భావయుక్తులయి నమస్కరించుచున్నారు. మాయాస్వరూప యగు శక్తి నీయెడమ కడనుండి నిన్నర్చించుచున్నది. నీ కుడిప్రక్క నిలిచి విద్యాదేవత నిన్నారాధించుచున్నది. ముద్గల శంభుముఖ్యులు, నీ వెనుక నిలిచియు, గంధర్వముఖ్యులు ముందు నిల్చియు నిన్నుఁ

గీర్తించుచున్నారు. అప్సరసలు నీ మోదమునకై విచిత్రనృత్యము నొనరించుచున్నారు. నాలుగుభుజములు, మూఁడుకన్నులు, కలిగి పాశహస్తుఁడవై అంకుశమువంటి యేకదంతముతో నొప్పుచు మహోదరుఁడవు, గజాస్యుఁడవు నగునోదేవా! నీకు నమస్కరింతును. నీవు సర్పోపవీతుఁడవు. గజకర్ణధారివి. నీకు వందనములు. నీకు మానసికమగు జపమున నా హృదయము నర్పించుచున్నాను. అజ్ఞానధ్వాంతాఘముల నపహరింపుము. వేదమంత్రములతో సుమంత్రితములగు పుష్పదళములతో నీకు మంత్రపుష్పము నొసంగుచున్నాను. దేవా! నీకుఁ గోటి ప్రదక్షిణము లొనరింతును. సంఖ్యాహీనములగు సాష్టాంగనమస్కారము లొనరించెదను. నాహృదయశుద్ధిగ మరల నీకుఁ బూజ గావించుచున్నాను. నా యపరాధముల నెల్ల క్షమించి భక్తిసంప్రార్థన మనుగ్రహించి సఫలీకృతమనోరథు నొనరింపుము."

గృత్సమదుఁడు గణేశబాహ్యపూజ యీవిధమునఁ గావించెను. "చతుర్బాహుఁడు, త్రినేత్రుఁడు, గజాస్యుఁడు, రక్తవర్ణుఁడు, పాశాంకుశయుతుఁడు, మాయాయుక్తుఁడునగు గణేశుని చింతించెదను:

"ఆగచ్ఛ బ్రహ్మణాం నాథ సురాసురవరార్చిత!
సిద్ధిబుద్ధ్యాదిసంయుక్త భక్తిగ్రహణలాలస!
కృతార్థోఽహం కృతార్థోఽహం తవాగమనతః ప్రభో!
విఘ్నేశానుగృహీతోఽహం సఫలో మేభవోఽభవత్."

ఓ గణనాయకా! ప్రభూ! ఈ రత్నసింహాసన మలంకరింపుము. భక్తులను బహుముఖములఁ గాపాడుము. శీతోష్ణసుఖదములగు నుత్తమపాద్యములను గ్రహించి దేవా! పాదప్రక్షాళన మొనర్పుము. వివిధ తీర్థములనుండి కొనివచ్చి సుగంధయుత మగునట్లు సువస్తుమిశ్రిత మగునట్లు చేసిన యీ జలముతో గణనాయకా! ఆచమింపుము. అనర్ఘరత్నప్రవాళముక్త సంస్కృతమైనఅర్ఘ్యమును గ్రహించి హేరంబా! ద్విరదాననా! సంతోషింపుము. దధిమధుఘృతయుక్తమగు మధుపర్కము నిదే భక్తితో సమర్పించుచున్నాను. స్వీకరింపుము. నమస్కారము. చంపకాదులచే సువాసితము కావింపఁబడిన యుత్తమ

మగు తైలమును రాచికొని లంబోదరా! అభ్యంగము నొనరింపుము; నీకు నమస్కారము. ఓ విఘ్నేశా! భక్తవత్సలా! యక్షకర్దమాదులతోఁ గూడిన యీ నలుఁగుపిండి యొడలంత రాచికొని స్నానముచేయుము. నానాతీర్థజలములు కొనివచ్చి సుఖోష్ణశీతలము గావించి నే నిచ్చు నీ జలములతో స్నానమొనరింపుము. కామధేనువు పిదికిన ఈ యుత్తమ మగు పయస్సును నీస్నానార్థ ముపయోగింపుము. పంచామృత స్నానముకూడ జలస్నానమధ్యమున నొనరింపుము. గంగాది నదుల నుండి కొనితెచ్చిన యీ జలముంచే మరల మరల స్నానము గావింపుము. పాపహరణమగు దధిధేనుపయస్సును స్నానార్థ ముపయోగింపుము. ఈ ఆవునెయ్యి పరమ సుఖప్రదము. దీనితో. స్నానమొనరింపుము. ఇదిగో మధువు. దీనినికూడ దానికొఱ కుపయోగింపుము. ఇక్షుకాండసముద్భూత మగు శర్కరాసవము కూడ స్నానార్థము వాడుము. మలహరము, శుద్ధము, సర్వసుగంధకారణమునగు ఈ యక్షకర్దమాదులను స్నానవేళ నుపయోగింపుము. దూర్వాంకురములు, గంధాక్షతములు నీ కర్పించెదను పరిగ్రహింపుము. "బ్రహ్మణస్పతే" అను మంత్రమున నిన్ను ఇరువదియొక్కసారి అభిషేకించెదను. ఓ ద్వర దానవా! కటాక్షింపుము. సర్వతీర్థభవమగు ఈ జలముతో నాచమింపుము. ఇది వస్త్రయుగ్మము. విఘ్ననాథా! పరిగ్రహింపుము. నభస్తారాంకితము, సుచిత్రమునగు నుత్తరీయమును సభక్తికముగ నీ కర్పించెదను. సర్వసిద్ధిద! స్వీకరింపుము. త్రైగుణ్యమయరూపము, ప్రణవగ్రంథి బంధనమునగు ఈ యుపవీతమును ఓ గణపతీ! గ్రహింపుము. సదానందవర్ధనము, అంగలేపన భావార్థమునగు ఈ సిందూరమును గైకొనుము. నీ యంగములకు స్వర్ణరత్నములతో ననేకాభరణములు చేయించితిని. వీని నంగీకరింపుము. అష్టగంధయుక్తమగు నిద్దానిని దేవా! నీ ద్వాదశాంగములకు నలఁదుకొనుము. రక్తచందన కుంకుమ యుతములగు ఈ అక్షతలను నీ ముఖమండలమున విరాజిల్లనిమ్ము. చంపకాదులగు సుమములచేతను శమీమందారదూర్వాదిదళములచేత నిన్నుఁ బూజింతును. మహోదరుఁడవగు వినాయకా! సర్వసౌరభకారకము దశాంగ గుగ్గులుధూప మర్పించెదను. గ్రహింపుము దేవా! జ్యోతి రూపక మగు ఈ దీపమును

గ్రహించి నా నానాజాతి జన్మదుఃఖములను హరింపుము. చతుర్విధాన్న సంపన్నమగు మధురలడ్డుకాదికమును నీకు నైవేద్యము పెట్టెదను. విఘ్నపా! భుజింపుము. సువాసితము, తీర్థసమాహృతమునగు ఈ పవిత్ర జలమును మధ్యమధ్యమునఁ ద్రావుము. భోజనానంతర మీ యక్ష కర్దమముచేఁ జేయి కడిగికొని సువాసితజలమును గ్రోలుము. దాడిమ, ద్రాక్షా ఖర్జూర రంభాదిఫలములను దేవదేవేశా! గ్రహింపుము. దేవా! అష్టాంగతాంబూలమును భక్తితో నర్పించుచుంటిని. విఘ్నరాజా! వేసికొనుము. కాంచనాది నానాధాతురూపకమగు రత్నాదికమును దక్షిణగా నిచ్చుచుంటిని. అంగీకరింపుము. నే నొనరించు రాజోపచారాదికమున సంతుష్టి నందుము. ఇరువదియొక్కవిధము లగు దూర్వాంకురములను పరిగ్రహించి పాలింపుము. అఘాపహము, నానాదీపసమాయుక్తము నగు నీరాజనమును గ్రహించి సమస్తాజ్ఞానమును బోఁగొట్టుము. "గణానాంత్వా" అనుమంత్రమును వేయి సారు ఉచ్చరించెదను. దేవా! సర్వసిద్ధి ప్రదాయకుఁడవు కమ్ము. సుకర్పూరము, నానాదీపమయము నగు నీరాజనము నీ కర్పించెదను. దేవా! పరిగ్రహింపుము. నీ నాలుగు పాదములందు, నాభియందు, రెండు మొగములందు, చతుర్వేద మంత్రములతో నేడేసి మారులు పుష్పపత్రాదులతోఁ బూజించెదను. పంచప్రకారస్తోత్రము లొనరించెదను. స్వామీ! సంతోషించి కటాక్షింపుము. బ్రహ్మేశుఁడ వను భావముతో నీచుట్టు నిరువదియొక్కసారులుకాని ముమ్మారుకాని ప్రదక్షిణ మొనరించి సాష్టాంగముగా నమస్కరించెదను. సర్వపూజ్యుఁడవగు హేరంబా! న్యూనాతిరిక్తభావదోష నివృత్త్యర్థమై మరల నీకు దూర్వాంకురపూజ గావించెదను. దేవా! నా పూజ సాంగ మని యనుగ్రహింపుము. నీ నిర్మాల్యమును కనుల కద్దికొని శిరసున ధరించెదను. అది సదా సర్వప్రదమగుఁగాక! అసంఖ్యాకము లగు నా యపరాధములనెల్ల గణనాథా! క్షమింపుము. నీ పాదప్రియుఁడను, భక్తప్రవరుఁడనుగా న న్నాశీర్వదింపుము. నీవే తల్లివి, నీవే తండ్రివి, నీవే మిత్రుఁడవు, నీవే బంధుఁడవు. నీవే కులదైవమవు. సర్వము నాకు నీవే. జాగ్రత్స్వప్నసుషుప్త్యవస్థలయందు మనోవాక్కాయకర్మలచే నేఁ గావించిన సాంసర్గిక కర్మ మంతయు గణేశుఁడవగు నీకే

యర్పించెదను. నానావిధ పాపములను నాశనము గావించుకొనుటకై నీ పాదతీర్థమును దలపై ధరించెదను. నీ పాదోదకముఁ బానముచేసి సర్వాంతర్గతపాపములను నశింపఁజేసికొందును. ఓ విఘ్నేశా! నీ ద్వాదశాంగములను నామమంత్రములతో నర్చించెదను. నీ మూర్ధమున, లలాటమున, దక్షిణకర్ణమూలమున, వామకర్ణమూలమున, కంఠమున, హృదయమున, దక్షిణబాహువున, వామబాహువున, నాభిదేశమున, కుక్షియందు, వామకుక్షియందు, పృష్ఠమున ని న్నర్చించి నీప్రసాదము స్వీకరించి తరించెదను."

ఈ విధముగా మహాయోగి సంతతభక్తి సమన్వితుఁడు నగు గృత్సమదుఁడు దినదినము మూఁడు కాలములయందు గణేశబాహ్యపూజ చేసి తరించెను.

# మహర్షుల చరిత్రలు

## తండిమహర్షి

### తపస్సు

పూర్వము తండి యనునొకబ్రాహ్మణుఁ డుండెను. అతఁడు బ్రహ్మచర్యనిష్ఠతో సకలవేదశాస్త్రములను జదివి యోగ మెఱిఁగి జ్ఞానియై మహర్షియై ప్రఖ్యాతి గాంచెను. అతఁడు పదివేలసంవత్సరము లేకాగ్రచిత్తుఁడై సమాధిస్థితి నుండి పరమశివు నారాధించెను. అంత నాతని యాంతరదృష్టికి పరమేశ్వరుఁడు కానరాఁగా నాతఁ డాతని నిట్లు ధ్యానించెను. "ఓపరమేశ్వరా! సాంఖ్యవిదులు, యోగీశ్వరులు నెవ్వని నెల్లప్పుడు పరుఁడని ప్రస్తుతించి, ప్రధానుఁడని భావించి పురుషుఁడని పూజించి, అధిష్ఠాత యని యర్చించి, ఈశ్వరుఁడని యెన్ని, ఉత్పత్తి వినాశహేతు భూతుఁ డని యూహింతురో అతఁడే నీవు. దేవాసుర మహర్షులలో నిన్ను మించినవాఁడు లేఁడు. నీ వజుఁడవు. అనాదినిధనుఁడవు, విభుఁడవు. ఈశానుఁడవు, అత్యంతసుఖివి, అనఘుఁడవు. అట్టి నిన్ను నే నమితభక్తియుక్తి శరణుచొచ్చెదను."

### శివసాక్షాత్కారము

ఇట్లు నిర్మలముగ ధ్యానించిన తండిమహర్షికి శివుఁడు ప్రత్యక్షమయ్యెను. మహోగ్రతపస్సంపన్నుఁ డగు తండి యీశ్వరుని పదకమలములపై ప్రాలి శ్రద్ధాభయభక్తి యుక్తుఁడై "ఓ సర్వేశ్వరా! నీవు పవిత్రులలోఁ బవిత్రుఁడవు. దేవా! నీవు బుద్ధిమంతులలో బుద్ధిమంతుఁడవు. తేజోనిధివి. ఉత్తమతపోరూపుఁడవు. విశ్వావసు హిరణ్యాక్ష పురుహూతాదులకు నిత్యనమస్కారార్హుఁడవు. శుభప్రదుఁడవు. జననమరణ ప్రవాహమునుండి తప్పించుకొన యతులు నీ పాదము అను నావను బట్టి తరించి కృతకృత్యులై మోక్ష మందుదురు. బ్రహ్మేంద్రా

దులు, విష్ణ్వాదివిశ్వేదేవతలు, మహర్షులే నిన్నెఱుఁగఁజాల రన్న నా వంటివారికేమి తెలియును? సమస్తము నీ నుండి వచ్చి సమస్తము నీయందే ప్రతిష్ఠితమై యున్నది. నీవు కాలమను పేరి వాఁడవు; పురుషుఁడ ననఁబడుట నీవే. బ్రహ్మ మనఁగా నీవే. అధిపౌరుష, అధ్యాత్మ, అధిభూత, అధిదైవతములు నీ తనువులని దేవతలు మహర్షులు మాత్ర మెఱుఁగుదురు. అధిలోక, అధివిజ్ఞాన, అధియజ్ఞములు నీవే. స్వర్గమోక్షములు నీవే. కామక్రోధములు నీవే. సత్త్వరజస్తమములు నీవే. ఊర్ధ్వాధోభాగములు నీవే. బ్రహ్మవిష్ణుమహేశ్వరులు నీవే. స్కందేంద్ర యమ వరుణాదులు, సూర్యాచంద్రమసులు, ధాతవిధాతలు నందఱు నీవే. పంచభూతములు, బుద్ధిమతి స్థితులు, సత్యాసత్యములు, భావాభావములు నీవే. ఇంద్రియేంద్రియార్థములు నీవే. నీవే పరబ్రహ్మవు, నీవే పరమపదమవు. నిత్యానందుఁడవు, నిత్యానందదాయివి నీవే. సర్వాత్మవు నీవు. సర్వదర్శివి నీవు. సర్వగుఁడవు నీవు. సర్వవిజ్ఞుఁడవు నీవు. దేహకర్తవు నీవు. దేహభర్తవు నీవు, దేహివి నీవు, దేహభుక్కవు నీవు. ప్రాణకర్త, ప్రాణభర్త, ప్రాణి, ప్రాణదుఁడు, ప్రాణిగతి సర్వము నీవే. ఆత్మవిజ్ఞులై ధ్యానపరులైన భక్తుల కధ్యాత్మగతివి నీవే. సకలభూతములకు నీవు శుభాశుభగతిప్రదుఁడవు. నీవే జంతువులకు జననమరణములు కలిగించుచు, మహర్షులకు సిద్ధిప్రదుఁడవై, యోగుల కపవర్గదాతవై ఆత్మవేత్తలకుఁ గైవల్య మొసఁగువాఁడవై యున్నావు. భక్తియోగమున నిన్నుఁ దెలియువారలకు నిన్ను నీవ తెలుపు కొనుచున్నావు.

దేవాధిదేవా! నిన్నుఁ దెలిసికొన్నవారికి జననమరణములు కలుగవు. నిన్నుఁ దెలిసికొన్న నింకఁ దెలిసికొన వలసినదేయుండదు. నీ లాభమును గన్నపండితుఁ డేలాభమును గోరఁడు. సూక్ష్మమగు పరమగతివి నీవు. నిన్నుఁ బొందిన అక్షయము, అవ్యయము నగులాభమగును. సాంఖ్యులు, గుణతత్త్వజ్ఞులు, సూక్ష్మజ్ఞులు నిన్నుఁ దెలిసికొనియే బంధవిముక్తు లగుచున్నారు. వేదవిదులు వేదాంత ప్రతిష్ఠితుఁడ వగు వేద్యునిగా నిన్నెఱుంగుదురు. ప్రాణాయామపరాయణులు ఓంకార రథము నెక్కి నిన్నుఁ బొందుదురు. దేవయానములకు ద్వార

మగునాదిత్యుఁడవు నీవే. పితృయానము చేయువారికి ద్వారమగు చంద్రుఁడవు నీవే. దిక్కులునీవు. యుగములు నీవు. అయనములు నీవు. మున్ను ప్రజాపతి నిన్నర్థించి కృతార్థుఁ డయ్యెను. బహ్వృచులు తత్త్వకర్మమున ఋక్కులచే నిన్నే యనుశాసింతురు. అధ్వర్యు లధ్వరములయందు నిన్నే యుజుర్మయునిగను త్రిధావేద్యునిగను నెంచి హోమ మొనర్తురు. శుద్ధబుద్ధులగు సామగులు సామములచే నిన్నే గాన మొనర్తురు. అథర్వణులగు విప్రులు నిన్నే ఋతముగను, సత్యముగను, పరబ్రహ్మముగను కీర్తింతురు. రేయుంబవళ్లు శ్రోత్రనేత్రములుగా, పక్షమాసములు శిరోభుజములుగా, ఋతువులే వీర్యముగా, మాఘ మాసమే ధైర్యముగా, వత్సరములే గుహ్యోరుపాదములుగా కాల రూపుఁడవు, మృత్యు యమ హుతాశనరూపుఁడవుగా నున్నవాఁడవు నీవే. సూర్యా చంద్రమసులు, నక్షత్రగ్రహములు, సప్తర్షులు, పదునాలుగులోకములు, సత్తు, అసత్తు, అష్టప్రకృతులకుఁ బరమైనది నీ భాగమే. అదియే పరము, బ్రహ్మము, పరమపదము, పరమకాష్ఠ, పరమకళ, పరమసిద్ధి, పరమగతి, పరమశాంతి, పరమనిర్వృతి, తుష్టి, సిద్ధి, శ్రుతి, స్మృతి, భక్తుల కవ్యయ ప్రాప్తివి, అధ్యాత్మగతివి నీవే. జన్మమృత్యుజరాహీనులు కాఁగోరు విరాగధనులకు గతివి నీవే" అని నుతించెను.

ఈ విధముగా నుతించిన తండిమహర్షిభక్తికి మెచ్చి శివుఁడు "వత్సా! నీవు అక్షయుఁడవు, అవ్యయుఁడవు, దుఃఖరహితుఁడవు అగుదువుగాక! నీవు తేజశ్శాలివై, కీర్తియుతుఁడవై, జ్ఞానివై, ఋషిజన భూషితుఁడవు కాఁగలవు. నీ పుత్త్రుఁడు సూత్రకర్తయై నెగడొందఁ గలఁడు. ఇఁక, నీకు నావలనఁ గావలసిన దేమియో కోరుకొను" మని పలికెను. అపుడు తండి యానందపరవశుఁడై "మహాదేవా! నీ దయకంటె నాకుఁ గావలసిన దేమున్నది? సర్వకాలములయందును నాకు నీచరణ భక్తి యనుగ్రహింపు" మని ప్రార్థించెను. పరమేశ్వరుఁ డానందించి యట్లే యని యంతర్హితుఁడయ్యెను. శివకటాక్షము నందిన పిదప, తండిమహర్షి యొక యాశ్రమమును నిర్మించుకొని యందు తపోధ్యాన యుక్తుఁడై దినములు కడపుచుండెను.

## తండి ఉపమన్యు ననుగ్రహించుట

ఉపమన్యుమహర్షి యొకప్పుడు తండిమహర్షి యాశ్రమమునకు విచ్చేసి యాతనిచే నతిథిసత్కారము అంది "మహనీయా! నీవలనఁ బరమేశ్వరుని సహస్రనామములు తెలిసికొన విచ్చేసితిని తెలుపఁ గోరుదు" నని ప్రార్థించెను. అంతఁ దండి భక్తిశ్రద్ధలతో శివుని ధ్యానించి యిట్లు చెప్పఁదొడఁగెను.

"పరమేశ్వరుని నామములు తెలుపు మని మున్ను దేవతలు బ్రహ్మ నడుగ నతఁడు వారికి పదివేలనామములను దెలిపెను. వానినుండి వేయినామము లెన్ని బ్రహ్మ స్వర్గవాసుల కొసంగెను. నేను వాని నెఱింగి స్వర్గలోకమునుండి భూలోకమునకుఁ గొనివచ్చితిని. అందుచే భూలోకవాసు లీ స్తవరాజము తండికృత మందురు. ఇది సర్వమంగళ ములను సమకూర్చునది. సర్వకల్మషములను నశింపఁజేయునది. బ్రహ్మలకు బ్రహ్మ, పరులకుఁ బరుఁడు, తేజములకుఁ దేజము, తప ములకుఁ దపము, శాంతములకు శాంతము, ద్యుతులకు ద్యుతి, దాంతులకు దాంతుఁడు, ధీమంతులకు ధీ, దేవతలకు దేవత, మహర్షులకు యజ్ఞములకు యజ్ఞము, శివులకు శివుఁడు, రుద్రులకు రుద్రుఁడు, యోగులకు యోగి, కారణములకుఁ గారణము, నగు హరుని అష్టోత్తర సహస్రనామములు:

"స్థిరుఁడు, స్థాణువు, ప్రభువు, భీముఁడు, ప్రవరుఁడు, వరదుఁడు, పరుఁడు, సర్వాత్మ, సర్వవిఖ్యాతుఁడు, సర్వుఁడు, సర్వకరుఁడు, భవుఁడు జటి, చర్మి, శిఖండి, సర్వాంగుఁడు, సర్వభావనుఁడు, హరుఁడు, హరిణాక్షుఁడు, సర్వభూతహరుఁడు, ప్రభుఁడు, ప్రవృత్తుఁడు, నివృత్తుఁడు, నియతుఁడు, శాశ్వతుఁడు, ధ్రువుఁడు, శ్మశానవాసి, భగవంతుఁడు, ఖచరుఁడు, గోచరుఁడు, అర్దనుఁడు, అభివాద్యుఁడు మహాకర్మి, తపస్వి, భూతభావనుఁడు, ఉన్మత్తవేషి, ప్రత్యక్షుఁడు, సర్వలోక ప్రజాపతి...." మొదలుగాఁగలవి. *

---

* తండికృత శివసహస్రనామ స్తోత్రము:

శ్లో. స్థిర స్స్థాణుః ప్రభుర్భీమః ప్రవరో వరదో వరః,
సర్వాత్మా సర్వవిఖ్యాత స్సర్వ స్సర్వకరో భవః.

వీనిని జపించినవారు సర్వకామ్య సంసిద్ధిగాంచి ముక్తులగుదురు. తండి బ్రహ్మపదముఁ జేరి శివునారాధించి శివైక్యమునందెను.

---

జటీ చర్మీ శిఖండీ చ సర్వాంగ స్సర్వభావనః,
హరశ్చ హరిణాక్షశ్చ సర్వభూతహరః ప్రభుః.
ప్రవృత్తిశ్చ నివృత్తిశ్చ నియత శ్శాశ్వతో ధ్రువః,
శ్మశానవాసీ భగవాన్ ఖచరో గోచరోఽర్దనః.
అభివాద్యో మహాకర్మా తపస్వీ భూతభావనః,
ఉన్మత్తవేషః ప్రచ్ఛన్న స్సర్వలోక ప్రజాపతిః.
మహారూపో మహాకాయో వృషరూపో మహాయశాః,
మహాత్మా సర్వభూతాత్మా విశ్వరూపో మహాహనుః.
లోకపా లోఽంతర్హితాత్మా ప్రసాదో నీలలోహితః,
పవిత్రం చ మహాంశ్చైవ నియమో నియమాశ్రితః.
సర్వకర్మా స్వయంభూత ఆదిరాదికరో విధిః,
సహస్రాక్షో విశాలాక్ష స్సోమో నక్షత్రసాధకః.
చంద్ర స్సూర్య శ్శనిః కేతు ర్గ్రహో గ్రహపతి ర్వరః,
అది రంత్యో లయః కర్తా మృగబాణార్పణోఽనఘః.
మహాతపా ఘోరతపా అదీనో దీనసాధకః,
సంవత్సరకరో మంత్రః ప్రమాణం పరమం తపః.
యోగీ యోజ్యో మహాబీజో మహారేతా మహాబలః,
సువర్ణరేతా స్సర్వజ్ఞ స్సుబీజో బీజవాహనః.
దశబాహుస్త్వనిమిషో నీలకంఠ ఉమాపతిః,
విశ్వరూపస్స్వయం శ్రేష్ఠ బలవీరో బలోగణః.
గణకర్తా గణపతిః దిగ్వాసాః కామఏవ చ,
మంత్రవి త్పరమో మంత్రః సర్వభావకరో హరః.
కమండలుధరో ధన్వీ బాణహస్తః కపాలవాన్,
అశనీ శతఘ్నీ ఖడ్గీ చ పట్టిసీ చాయుధీ మహాన్.
స్రువహస్త స్సురూప శ్చ తేజ స్తేజస్కరో నిధిః,
ఉష్ణీషీ చ సువక్త్ర శ్చ ఉదగ్రో వినతస్తథా.
దీర్ఘశ్చ హరికేశశ్చ సుతీర్థః కృష్ణఏవ చ,
సృగాలరూప స్సిద్ధార్థో ముండ స్సర్వశుభంకరః.

అజశ్చ బహురూపశ్చ గంధధారీ కపర్ద్యపి,
ఊర్ధ్వరేతా ఊర్ధ్వలింగ ఊర్ధ్వశాయీ నభస్స్థలః.
త్రిజట శ్చీరవాసా చ రుద్ర స్సేనాపతి ర్విభుః,
అహశ్చరో నక్తంచర స్తిగ్మమన్యుస్సువర్చసః.
గజహా దైత్యహా కాలో లోకధాతా గుణాకరః,
సింహశార్దూలరూపశ్చ ఆర్ద్రచర్మాంబరావృతః.
కాలయోగీ మహానాథ స్సర్వకామ శ్చతుష్పథః,
నిశాచరః ప్రేతచారీ భూతచారీ మహేశ్వరః.
బహుభూతో బహుధరః స్వర్భాను రమితో గతిః,
నృత్యప్రియో నిత్యనర్తో నర్తక స్సర్వలాలసః.
ఘోరో మహాతపాః పాశో నిత్యో౽నీహో నిరాలయః,
సహస్రహస్తో విజయో వ్యవసాయో హ్యతంద్రితః.
అధర్షణో ధర్షణాత్మా యజ్ఞహా కామనాశకః,
దక్షయాగాపహారీ చ సుసహో మధ్యమస్తథా.
తేజో౽పహారీ బలహా ముదితో౽ర్థో౽జితో వరః.
గంభీరఘోషో గంభీరో గంభీరబల వాహనః.
న్యగ్రోధరూపో న్యగ్రోధ వృక్షకర్ణస్థితి ర్విభుః,
సుతీక్ష్ణదశనశ్చైవ మహాకాయో మహాననః.
విష్వక్సేనో హరి ర్యజ్ఞ స్సంయుగాపీడవాహనః,
తీక్ష్ణతాప శ్చ హర్యశ్వ స్సహాయః కర్మకాలవిత్.
విష్ణుప్రసాదితో యజ్ఞ సముద్రో బడబాముఖః,
హుతాశన సహాయశ్చ ప్రశాంతాత్మా హుతాశనః.
ఉగ్రతేజా మహాతేజా జన్యో విజయకాలవిత్,
జ్యోతిషామయనః సిద్ధి స్సర్వవిగ్రహఏవ చ.
శిఖీ ముండీ జటీ జ్వాలీ మూర్తిజో మూర్ధగో బలీ,
వైణవీ పణవీ తాళీ ఖలీ కాలకటంకటః.
నక్షత్రవిగ్రహమతిః గుణబుద్ధి ర్లయో౽ గమః,
ప్రజాపతి ర్విశ్వబాహు ర్విభాగ స్సర్వతోముఖః.
విమోచన స్సుసరణో హిరణ్యకవచోద్భవః,
మేఢ్రజో బలచారీ చ మహీచారీ స్స్రుతస్తథా.

సర్వతూర్యనినాదీ చ సర్వవాద్యపరిగ్రహః,
వ్యాళరూపో గుహావాసీ గ్రహమాలీ తరంగవిత్.
త్రిదశః కాలధృక్కర్మ సర్వబంధవిమోచనః,
బంధన స్త్వసురేంద్రాణాం యుధి శత్రువినాశనః.
సాంఖ్యప్రసాదో దుర్వాసా స్సర్వసాధుని షేవితః,
ప్రస్కందనో విభాగజ్ఞో హ్యతుల్యో యజ్ఞభాగవిత్.
సర్వావాస స్సర్వచారీ దుర్వాసా వాసవోఽమరః,
హైమో హేమకరో యజ్ఞః సర్వధారీ ధరోత్తమః.
లోహితాక్షో మహాక్షశ్చ విజయాక్షో విశారదః,
సంగ్రహో నిగ్రహః కర్తా సర్వచీరనివాసనః.
ముఖ్యోఽ ముఖ్యశ్చ దేహశ్చకాహళి స్సర్వకామదః,
సర్వకాలప్రసాద శ్చ సుబలో బలరూపభృత్.
సర్వకామవరశ్చైవ సర్వద స్సర్వతోముఖః,
ఆకాశనిర్విరూపశ్చ నిపాతో హ్యవశః ఖగః.
రౌద్రరూపోఽ ంశురాదిత్యో బహురశ్మి స్సువర్చసీ,
వసువేగో మహావేగో మనోవేగో నిశాచరః.
సర్వవాసీ శ్రియావాసీ ఉపదేశకరోఽ కరః,
మునిరాత్మా నిరాలోక స్సంభగ్నశ్చ సహస్రదః.
పక్షీచ పక్షరూపశ్చ అతిదీప్తో విశాంపతిః,
ఉన్మాదో మదనః కామో హ్యశ్వత్థోఽ ర్థకరో యశః.
వామదేవశ్చ వామశ్చ ప్రాగ్దక్షిణ ఉదఙ్ముఖః,
సిద్ధయోగీ మహర్షిశ్చ సిద్ధార్థ స్సిద్ధసాధకః.
భిక్షుశ్చ భిక్షురూపశ్చ విపణో మృదురవ్యయః,
మహాసేనో విశాఖశ్చ షష్టిభాగో గవాంపతిః.
వజ్రహస్తశ్చ విష్కంభీ చమూస్తంభన ఏవ చ,
వృత్తావృత్తకర స్తాలో మధు ర్మధుకలోచనః.
వాచస్పత్యో వాజసనో నిత్యమాశ్రితపూజితః,
బ్రహ్మచారీ లోకచారీ సర్వచారీ విచారవిత్.
ఈశాన ఈశ్వరః కాలో నిశాచారీ పినాకభృత్,
నిమిత్తస్థో నిమిత్తం చ నంది ర్నందికరో హరిః.

నందీశ్వరశ్చ నందీ చ నందనో నందివర్ధనః,
భగహారీ నిహంతా చ కాలో బ్రహ్మ పితామహః.
చతుర్ముఖో మహాలింగః చారులింగస్తథైవ చ,
లింగాధ్యక్షస్సురాధ్యక్షో యోగాధ్యక్షో యుగావహః.
బీజాధ్యక్షో బీజకర్తా అధ్యాత్మానుగతో బలః,
ఇతిహాసస్సకల్పశ్చ గౌతమోఽథ నిశాకరః.
దంభో హ్యదంభో వైదంభో వశ్యో వశకరః కలిః,
లోకకర్తా పశుపతిః మహాకర్తా హ్యనౌషధః
అక్షరం పరమం బ్రహ్మ బలవాన్ శక్త ఏవ చ,
నీతి ర్హ్యనీతి శ్శుద్ధాత్మా శుద్ధో మాన్యో గతాగతః.
బహుప్రసాదస్సుస్వప్నో దర్పణోఽథ త్వమిత్రజిత్,
వేదకారో మంత్రకారో విద్వాన్ సమరమర్దనః.
మహామేఘనివాసీ చ మహాఘోరో వశీకరః,
అగ్నిజ్వాలో మహాజ్వాలో హ్యతిధూమ్రో హుతోహవిః.
వృషణ శ్శంకరో నిత్యం వర్చస్వీ ధూమకేతనః,
నీలస్తథాంగలుబ్ధశ్చ శోభనో నిరవగ్రహః.
స్వస్తిదః స్వస్తిభావశ్చ భాగీభాగకరో లఘుః,
ఉత్సంగశ్చ మహాంగశ్చ మహాగర్భపరాయణః
కృష్ణవర్ణ స్సువర్ణశ్చ ఇంద్రియం సర్వదేహినాం,
మహాపాదో మహాహస్తో మహాకాయో మహాయశాః,
మహామూర్ధా మహామాత్రో మహానేత్రో నిశాలయః,
మహాంతకో మహాకర్ణో మహోష్ఠశ్చ మహాహనుః.
మహానాసో మహాకంబు ర్మహాగ్రీవః శ్మశానభాక్,
మహావక్షా మహోరస్కో హ్యంతరాత్మా మృగాలయః.
లంబనో లంబితోష్ఠశ్చ మహామాయః పయోనిధిః,
మహాదంతో మహాదంష్ట్రో మహాజిహ్వో మహాముఖః.
మహానఖో మహారోమా మహాకేశో మహాజటః,
ప్రసన్నశ్చ ప్రసాదశ్చ ప్రత్యయో గిరిసాధనః.
స్నేహనోఽ స్నేహనశ్చైవ అజితశ్చ మహామునిః,
వృక్షాకారో వృక్షకేతు రనలో వాయువాహనః.

గండలీ మేరుధామా చ దేవాధిపతిరేవ చ,
అథర్వశీర్ష స్సామాస్య ఋక్సహస్రామితేక్షణః.
యజుఃపాదభుజో గుహ్యః ప్రకాశో జంగమస్తథా,
అమోఘార్థః ప్రసాదశ్చ అభిగమ్యస్సుదర్శనః.
ఉపకారః ప్రియ స్సర్వః కనకః కాంచనచ్ఛవిః,
నాభి ర్నందికరో భావః పుష్కరః స్థపతిః స్థిరః.
ద్వాదశ స్త్రాసన శ్చాద్యో యజ్ఞో యజ్ఞసమాహితః,
నక్తం కలిశ్చ కాలశ్చ మకరః కాలపూజితః.
సగణో గణకారశ్చ భూతవాహనసారథిః,
భస్మశయో భస్మగోప్తా భస్మభూత స్తరుర్గణః.
లోకపాల స్తథాలోకో మహాత్మా సర్వపూజితః,
శుక్ల స్త్రిశుక్ల సంపన్నః శుచిర్భూతనిషేవితః.
ఆశ్రమస్థః క్రియావస్థో విశ్వకర్మమతిర్వరః,
విశాలశాఖ స్తామ్రోష్ఠో హ్యంబుజాల స్సునిశ్చలః.
కపిలః కపిశ శ్శుక్ల ఆయుశ్చైవ పరోఽ పరః,
గంధర్వో హ్యదితి స్తార్క్ష్య స్సువిజ్ఞేయ స్సుశారదః.
పరశ్వధాయుధో దేవో హ్యనుకారీ సుబాంధవః,
తుంబవీణో మహాక్రోధ ఊర్ధ్వరేతా జలేశయః.
ఉగ్రో వంశకరో వంశో వంశనాదో హ్యనిందితః,
సర్వాంగరూపో మాయావీ సుహృదో హ్యనిలోఽ నలః.
బంధనో బంధకర్తా చ సుబంధనవిమోచనః,
సయజ్ఞారి స్సకామారి ర్మహాదంష్ట్రో మహాయుధః.
బహుధా నిందితశ్శర్వ శ్శంకరః శంకరోధనః,
అమరేశో మహాదేవో విశ్వదేవ స్సురారిహా.
అహిర్బుధ్న్యోఽనిలాభశ్చ చేకితానో హరిస్తథా,
అజైకపా చ్చ కాపాలీ త్రిశంకు రజిత శ్శివః.
ధన్వంతరి ర్ధూమకేతు స్స్కందో వైశ్రవణస్తథా,
ధాతా శక్రశ్చ విష్ణుశ్చ మిత్ర స్త్వష్టా ధ్రువో ధరః.
ప్రభావ స్సర్వగో వాయు రర్యమా సవితా రవిః,
ఉషంగుశ్చ విధాతా చ మాంధాతా భూతభావనః.

విభు ర్వర్ణవిభావీ చ సర్వకామగుణావహః,
పద్మనాభో మహాగర్భ శ్చంద్రవక్త్రో ఽనిలో ఽనలః.
బలవాం శ్చో పశాంతశ్చ పురాణః పుణ్యచంచరీ,
కురుకర్తా కురూవాసీ కురుభూతో గుణౌషధః.
సర్వాశయో గర్భచారీ సర్వేషాం ప్రాణినాం పతిః,
దేవదేవ స్సుఖాసక్త స్సదసత్సర్వరత్నవిత్.
కైలాసగిరివాసీ చ హిమవద్గిరి సంశ్రయః,
కూలహారీ కూలకర్తా బహువిద్యో బహుప్రదః.
వణిజో వర్ధకీ వృక్షో వకుళ శ్చందనచ్ఛదః,
సారగ్రీవో మహాజత్రు రలోలశ్చ మహౌషధః.
సిద్ధార్థకారీ సిద్ధార్థ శ్ఛందోవ్యాకరణోత్తరః,
సింహనాద స్సింహదంష్ట్రః సింహగ స్సింహవాహనః.
ప్రభావాత్మా జగత్కాలః కాలో కోకహిత స్తరుః,
సారంగో నవచక్రాంగః కేతుమాలీ సభావనః.
భూతాలయో భూతపతిః అహోరాత్ర మనిందితః,
వాహితా సర్వభూతానాం నిలయశ్చ విభు ర్భవః.
అమోఘ స్సంయతో హ్యశ్వో భోజనః ప్రాణధారణః,
ధృతిమాన్ మతిమాన్ దక్షః సత్కృతశ్చ యుగాధిపః.
గోపాలీ గోపతి ర్గ్రామో గోచర్మవసనో హరిః,
హిరణ్యబాహుశ్చ తథా గుహాపాలః ప్రవేశకః.
ప్రకృష్టారి ర్మహాహర్షో జితకామో జితేంద్రియః,
గాంధారశ్చ సువాసశ్చ తపస్సక్తో రతిర్నరః.
మహాగీతో మహానృత్యో హ్యప్సరోగణసేవితః,
మహాకేతు ర్మహాధాతు ర్నైకసానుచరశ్చలః.
ఆవేదనీయ ఆవేశః సర్వగంధసుఖావహః,
తోరణ స్తారణో వాతః పరిధీపతి ఖేచరః.
సంయోగో వర్ధనో వృద్ధో హ్యతివృద్ధో గుణాధికః,
నిత్యఆత్మా సహాయశ్చ దేవాసురపతిః పతిః.
యుక్తశ్చ యుక్తబాహుశ్చ దేవో దివిసుపర్వణః,
అషాఢశ్చ సుషాఢశ్చ ధ్రువోఽథ హరిణో హరః:

వపురావర్తమానేభ్యో వసుశ్రేష్ఠో మహాపథః,
శిరోహారీ విమర్శశ్చ సర్వలక్షణలక్షితః.
అక్షశ్చ రథయోగీ చ సర్వయోగీ మహాబలః,
సమామ్నాయోఽ సమామ్నాయ స్తీర్థదేవో మహారథః.
నిర్జీవో జీవనో మంత్ర శ్శుభాక్షో బహుకర్కశః,
రత్నప్రభూతో రక్తాంగో మహార్ణవనిపానవిత్.
మూలం విశాలో హ్యమృతో వ్యక్తావ్యక్త స్తపోనిధిః,
ఆరోహణోఽధిరోహశ్చ శీలధారీ మహాయశాః.
సేనాకల్పో మహాకల్పో యోగో యోగకరో హరిః.
యుగరూపో మహారూపో మహానాగహనో వధః.
న్యాయనిర్వపణః పాదః పండితో హ్యచలోపమః,
బహుమాలో మహామాల శ్శశీహరిసులోచనః.
విస్తారో లవణః కూప స్త్రియుగ స్సఫలోదయః,
త్రినేత్రశ్చ విషణ్ణాంగో మణివిద్ధో జటాధరః.
బిందుర్విసర్గ స్సుముఖః శర స్సర్వాయుధస్సహః,
నివేదనస్సుఖాజాతః సుగంధారో మహాధనుః.
గంధపాలీ చ భగవాన్ ఉత్థానః సర్వకర్మణామ్,
మంథానో బహుళో వాయుః సకల స్సర్వలోచనః.
తలస్తాలః కరస్థాలీ ఊర్ధ్వసంహననో మహాన్,
ఛత్రం సుచత్రో విఖ్యాతో లోకస్సర్వాశ్రయః క్రమః.
ముండో విరూపో వికృతో దండీకుండీ వికుర్వణః,
హర్యక్షః కకుభో వజ్రీ శతజిహ్వ స్సహస్రపాత్.
సహస్రమూర్ధా దేవేంద్ర స్సర్వదేవమయో గురుః,
సహస్రబాహు స్సర్వాంగః శరణ్య స్సర్వలోకకృత్.
పవిత్రం త్రికకున్మంత్రః కనిష్ఠః కృష్ణపింగళః,
బ్రహ్మదండ వినిర్మాతా శతఘ్నీ పాశశక్తిమాన్.
పద్మగర్భో మహాగర్భో బ్రహ్మగర్భో జలోద్భవః,
గభస్తి ర్బ్రహ్మకృద్బ్రహ్మ బ్రహ్మ విద్బ్రాహ్మణో గతిః.
అనంతరూపో నైకాత్మా తిగ్మతేజా స్స్వయంభువః,
ఊర్ధ్వగాత్మా పశుపతి ర్వాతరంహా మనోజవః.

చందనీపద్మనాళాగ్ర స్సురభ్యుత్తరణో నరః,
కర్ణికారమహాస్రగ్వీ నీలమౌళిః పినాకధృత్.
ఉమాపతి రుమాకాంతో జాహ్నవీ భృ దుమాధవః
వరో వరాహో వరదో వరేణ్య స్సుమహాస్వనః.
మహాప్రసాదో దమనః శత్రుహా శ్వేతపింగళః,
ప్రీతాత్మా పరమాత్మా చ ప్రయతాత్మా ప్రధానధృత్.
సర్వపార్శ్వముఖ స్త్ర్యక్షో ధర్మసాధారణో వరః,
చరాచరాత్మా సూక్ష్మాత్మా అమృతో గోవృషేశ్వరః.
సాధ్యర్షి ర్వసురాదిత్యో వివస్వాన్ సవితాఽమృతః,
వ్యాసస్సర్గస్సుసంక్షేపో విస్తరః పర్యయోనరః.
ఋతు స్సంవత్సరో మాసః పక్ష స్సంఖ్యా సమాపనః,
కళా కాష్ఠా లవా మాత్రా ముహూర్తాహః క్షపాక్షణాః.
విశ్వక్షేత్రం ప్రజాబీజం లింగమాద్యస్తునిర్గమః,
సదసద్వ్యక్త మవ్యక్తం పితా మాతా పితామహః,
స్వర్గద్వారం ప్రజాద్వారం మోక్షద్వారం త్రివిష్టపమ్,
నిర్వాణం హ్లాదనం చైవ బ్రహ్మలోకః పరాగతిః.
దేవాసురవినిర్మాతా దేవాసురపరాయణః,
దేవాసురగురుర్దేవో దేవాసురనమస్కృతః.
దేవాసురమహామాత్రో దేవాసురగణాశ్రయః,
దేవాసురగణాధ్యక్షో దేవాసురగణాగ్రణీః.
దేవాదిదేవో దేవర్షి ర్దేవాసురవరప్రదః,
దేవాసురేశ్వరో విశ్వో దేవాసురమహేశ్వరః.
సర్వదేవమయోఽ చింత్యో దేవతాత్మా త్మసంభవః,
ఉద్భిత్త్రివిక్రమో వైద్యో విరజో నీరజోఽమరః.
ఈడ్యో హస్తీ శ్వరో వ్యాఘ్రో దేవ సింహో నరర్షభః,
విబుధోఽగ్రవర స్సూక్ష్మ స్సర్వదేవ స్తపోమయః.
సుయుక్త శ్శోభనో వజ్రీ ప్రాసానాం ప్రభవోఽవ్యయః,
గుహః కాంతో నిజస్సర్గః పవిత్రం సర్వపావనః.
శృంగీ శృంగప్రియో బభ్రూ రాజరాజో నిరామయః,
అభిరామస్సురగణో విరామస్సర్వసాధనః.

లలాటాక్షో విశ్వదేవో హరిణో బ్రహ్మవర్చసః,
స్థావరాణాం పతిశ్చైవ నియమేంద్రియ వర్ధనః
సిద్ధార్థ స్సిద్ధభూతార్థో౽ చింత్యసత్యవ్రత శ్శుచిః,
వ్రతాధిపః పరంబ్రహ్మ భక్తానుగ్రహకారకః
విముక్తో ముక్త తేజాశ్చ శ్రీమాన్ శ్రీవర్ధనో జగత్.

(మహాభారతము. — అనుశాసనికపర్వము.)

# మహర్షుల చరిత్రలు

## మృకండుమహర్షి

### జననము

మహానుభావుఁడగు మృగశృంగమహర్షి తపశ్శక్తిచేఁ జనిపోయిన సువృత్తను ఆమెచెలికత్తెలను మరల బ్రతికించెను. సువృత్తతండ్రి యగు సుచక్షుఁడు తనకూఁతును సువృత్త నాతని కిచ్చి పరిణయము చేయు సమయమున నామె మువ్వురు చెలికత్తెలు విచ్చేసి మృగశృంగునితో "మహాత్మా! నీవు మాకుఁ బ్రాణదానము చేసిననాఁడే నిన్ను మాకుఁ బతిగా మేము వరించియుంటిమి. మమ్మును నీవు వివాహ మాడుము. నీకు మేలు కలుగును. లేకున్న మేము మాప్రాణములు విడుతు"మని పలికిరి. మృగశృంగమహర్షి యేమి చేయుటకును బాలుపోక డోలాందోళిత మనస్కుఁడై యుండఁగా వ్యాసమహర్షి విచ్చేసి వారి నల్వురను బరిణయమాడు మని మృగశృంగుని హెచ్చరించెను. ఆతని యాదేశము ననుసరించి మృగశృంగుఁడు వారినల్వురను వివాహమాడి ధర్మయుక్తముగా గృహస్థధర్మమును నిర్వర్తించుచుండెను.

సువృత్తయు, నామెచెలికత్తెలు సవతులు నగు కమల, విమల, సురస యనువారును దోఁబుట్టువుల వలె మెలఁగుచు, నించుకయు నీర్ష్యాద్వేషములు లేక మృగశృంగమహర్షి నెల్లవిధముల సేవామూలమున సంతోష పెట్టుచుండిరి. ఆతఁడును వారియెడ సమానప్రేమను జూపుచు నందఱ నానందపఱచు చుండెను. సురూప సుగుణసుందరు లగు నా యిందువదనలఁ గూడి మహనీయ తపోనిధి యగు మృగశృంగుఁడు తపస్స్వాధ్యాయనిష్ఠ నేమఱక, అతిథ్యభ్యాగతపూజ గావించుచు, ఇష్టోపభోగములఁ దాను దనిసి భార్యలఁ దనుపుచు సారహీన మగు సంసారమును మిగుల సారవంత మొనరించుచుఁ గడపుచుండఁగా నాతనిభార్యలు నలువురు నొక్కసారిగా గర్భములు ధరించిరి. చెట్టునకుఁ

గాయు, మొక్కకుఁ బూవు, ఆవునకు దూడ మిక్కిలియంద మిచ్చును. అదేవిధమున నతిశయ రూప సౌభాగ్యములకుఁ బతిసేవాపరాయణతకు వినయవిధేయతలకు ఫలము స్త్రీకి సుపుత్రోదయమే. పవిత్ర వివాహ ధర్మము పావన సంతానమే కదా!

నవమాసములు నిండినపిదప సువృత్తాసాధ్వి యొక్క సుపుత్రుని గాంచెను. ఆతని జన్మకాల లగ్నాదులఁ బరిశీలించి త్రికాలవేది యగు మృగశృంగమహర్షి **భవిష్యత్కాలమున మృగములు కండూతి వాయఁ దపోనిష్ఠా గరిష్ఠుండగు నాతనిదేహంబును దమ దేహంబులతో రాచికొను ననెడి యర్థంబు సూచితంబుగా నాపుత్రునకు మృకండుఁడను నామకరణము చేసెను. అపుడే మిగిలిన మువ్వురు భార్యలు ప్రసవించి మువ్వురుపుత్రులను గాంచిరని విని మృగశృంగమహర్షి వారిలోఁ గమల కొడుకునకు ఉత్తముఁ డనియు, విమలకొడుకునకు సుమతి యనియు, సురస కొడుకునకు సువ్రతుఁ డనియు నామకరణముచేసెను.

## బాల్యము

కాలక్రమమున శుక్లపక్ష చంద్రునివలె నా బాలురు నల్వురు పెరిగి యుపనీతులైనపిదపఁ దండ్రి వారికి నాలుగువేదములు సాంగోపాంగముగా నేర్పి సకలవిద్యలు చదివించి విద్వాంసులఁ గావించెను. వారిలో మృకండుఁ డందఱికన్న నెక్కుడు మేధగలిగి గుణవిద్యాగురుశీలముల మిగిలినవారికి మిన్నయై యుండెను. విద్యావివేక వినయ విధేయులగు పుత్రులు నల్వురు తల్లులకుఁ దండ్రికి సేవచేయుచు విద్యావైభవమున వెలుఁగొందుచుండ మృగశృంగమహర్షి కాంచి తనజన్మము ధన్యమైనదిగా భావించెను.

మానవదేహములు కాలపరిణామ శీలములు. నేఁడు పొత్తిళ్ళలో నొదిఁగియున్న బిడ్డ రేపు క్రీడాసక్తుఁ డగు బాలుఁడు. నేఁటి బాలుఁడు రేపు తరుణీసక్తుఁ డగు యువకుఁడు. నేఁటియువకుఁడు రేపు జరాజాడ్య పీడితుఁడగు ముదివగ్గు. నిగనిగలాడు సోయగమున నెగడు నేఁటి కురులు రేపు చూడ నసహ్యకరము లగు పలిత కేశములు.

తనయునంగు బిడ్డలు పెరిగి పెద్దవారగుచు విద్యాబుద్ధులు గఱచి విలసిల్లుచుండఁ జూచిన మృగశృంగుఁడు వారికి వివాహములు కావించి వారిని గృహస్థుల నొనరింపఁ గాంక్షించెను. మానవకాంక్షలు చిత్ర విచిత్రములు. బిడ్డలు లేనిచో బిడ్డలకొఱకుఁ గాంక్ష, పుట్టినబిడ్డ పెరిగి పెద్దవాఁడై విద్యాబుద్ధులు గఱపవలయు ననుకాంక్ష, ఆ పిదపఁ గోడలిని జూడఁ గాంక్ష, పిమ్మట నాకోడలి కడుపున నొక కాయ కాచినఁ జూడఁ గాంక్ష. ఒక కాంక్ష కోటి కాంక్షలఁ బుట్టించుట కాంక్షాస్వభావము గదా!

## వివాహము

మృకండునకు యుక్తవయస్సు రాఁగానే యాతనికి ముద్గల మహర్షి కుమారిక యగుమరుద్వతిపై మక్కువ కలిగెను. ముద్గలుఁ డమితానంద మంది మరుద్వతిని మృకండుని కిచ్చి వివాహము చేయ నంగీకరించెను. మృగశృంగుఁ డానందించెను. పిదప నొక శుభ ముహూర్తమున మరుద్వతీమృకండులవివాహ మతివైభవముగా జరిగెను. అట్లే మృగశృంగమహర్షి యితరపుత్రులలో ఉత్తముఁడు కణ్వుఁ డనువానికూఁతు రగుకుశను, సుమతి సుమతి యనువానికూఁతు రగుసత్యను, సువ్రతుఁడు వృథుపుత్రికయగు ప్రియంవదను అగ్ని సాక్షిగా వివాహమాడిరి. ఇట్లు మృగశృంగుని పుత్రులు వివాహితులై గృహస్థాశ్రమములఁ బ్రవేశించి శమదమాదులు గలిగి సత్యవర్తనులై శాశ్వత కీర్తి గడించిరి.

ఇట్లుండఁగా మరుద్వతీమృకండులకుఁ దక్క మిగిలినవా రందఱకు సంతానము కలిగెను. మృగశృంగుఁడు కొడుకులపైఁ గోడండ్రపై సంసారభారమును మోపి తాను భార్యతోఁ గూడి తపఃపరుఁడు తీర్థ యాత్రాసక్తుఁడు నయి వానప్రస్థాశ్రమమును నడపి తుదకు శాంతి యుతుఁడు సర్వభూతాంతరాత్ముఁడు నయి జీవములు వాసెను.

## సంతతికై మృకండుని తపస్సు

మృకండుఁడు తనకు సంతతి కలుగ లేదని వంతచెంది భార్యను నలువురుతల్లులను వెంటఁ గొని తీర్థయాత్రకు బయలుదేఱెను. క్రమ

ముగా నాతఁడు వారితో విశ్వేశ్వరరాజధాని యగు కాశీపురమును జేరి గంగాస్నానాదికమును యథావిధిగ నెఱవేర్చి ఢుంఠివిఘ్నేశ్వర సమీపమునఁ దనపేర నొకశివలింగమును బ్రతిష్ఠచేసెను. అట్లే యాతని తల్లులు నల్వురును దమతమ పేర సువృత్తేశ్వర, కమలేశ్వర, విమలేశ్వర, సురసేశ్వరలింగములను బ్రతిష్ఠించిరి. మరుద్వతి తనపేర మరుద్వతీశ్వరలింగమును బ్రతిష్ఠించెను. వీర లంద ఱతిభక్తిశ్రద్ధాన్వితులై లింగప్రతిష్ఠాపన చేయుటచే నా లింగము లనంతశక్తి సంపన్నములయ్యెను. మృకండీశ్వరసందర్శనమున సర్వకార్యసిద్ధి యగును. సువృత్తేశ్వరదర్శనమున మంచిశీలము సర్వకార్యములయందు విఘ్నము లేకుండుట గల్గును, కమలేశ్వర దర్శనమున సర్వకామ్యసిద్ధియు, విమలేశ్వరలింగదర్శనమున విమలజ్ఞానము, మరుద్వతీశ్వరదర్శనమున జన్మరాహిత్యము సంభవించును.

ఈ ప్రకారము మృకండుమహర్షి కాశీనగరమున వారితో నొక్క సంవత్సర ముండి శివప్రీతికరముగా మహా తపస్సుచేసెను. అంత నొక నాఁడు మృకండుని తల్లులు వృద్ధ లగుట విశ్వేశ్వరునికిఁ బ్రదక్షిణములు చేయుచుఁ బడిపోయి ప్రాణములు విడుచువేళ విశ్వేశ్వరుఁడు వారికిఁ దారక మంత్రోపదేశము చేసి వారిని గైలాసమునకుఁ దీసికొనిపోయెను. మృకండుమహర్షి తల్లుల కూర్ధ్వదైహికక్రియలెల్లఁ గావించి మాతౄణ విముక్తుఁ డయ్యెను.

## వరప్రసాదము

పిదప మరుద్వతీమృకండులు కాశిలోనే యుండి నిత్యము గంగాస్నానము గావించుచు భక్తి తాత్పర్యములతో విశ్వేశ్వరునిగూర్చి మహాతపము చేసిరి. అంతఁ గొంత కాలమునకు విశ్వేశ్వరుఁడు మృకండునిపై దయ దలఁచి ప్రత్యక్షమై వరము కోరుకొను మనెను. మృకండుఁడు శివుని దన కొకపుత్రు నిమ్మని గోరుకొనెను. విశ్వేశ్వరుఁ డాతనితో "ఓయీ! మిక్కిలి గుణవంతుఁడై పదునాఱేండ్లుమాత్రము బ్రదుకుకొడుకు కావలయునా? లేక గుణహీనుఁడై చిరంజీవి యగుకొడుకు కావలయునా? తెల్పు" మనెను. అంత మృకండుఁడు "దేవా!

అల్పాయుష్పైనను సుగుణవంతుఁ డగుసుతునే యి" మ్మని ప్రార్థించెను. శివుఁడట్లే యని యంతర్ధాన మయ్యెను.

## మార్కండేయ జననము

అంతఁ గొంతకాల మైనపిదప మృకండుని దయవలన మరుద్వతి గర్భమును ధరించెను. పెన్నిధిఁ గన్న పేదలవలెఁ జిరకాలమున కా యదృష్టముపట్టిన యా జాయాపతుల యానందమునకు మేరలేకుండెను. నవమాసములు నిండినపిదపఁ గాలవిదులు స్తుతి యొనర్పఁ దగిన సుముహూర్తమున మరుద్వతి యొక సుపుత్రుని గాంచెను. అపు డాకాశము నుండి పుష్పవర్షము కురిసెను; దేవదుందుభులు మ్రోఁగెను. దశదిశలు, నదులు ప్రసాదము లయ్యెను; వ్యాసమహర్షి శిష్య సమేతుఁడై యచటికి విచ్చేసి, దేవతలు జయజయధ్యానము లొనరించుచుండ జాతకర్మాదికము నడపి యా బాలునికి మార్కండేయుఁడని పేరిడెను. మృకండుఁ డపరిమితానందము నంది వ్యాసభగవానుని పాదములపై వ్రాలి యలభ్యయోగ మగు నాతని దర్శనమునకుఁ గృతజ్ఞతఁ దెలిపి యాతని ననేక విధముల నర్చించెను. పిదప వ్యాసుఁడు బాలు నాశీర్వదించి యా మహనీయుని గన్న దంపతుల నభినందించి వెడలిపోయెను.

పిదప, బాలచంద్రునివలెఁ బెరుఁగు మార్కండేయున కైదవ యేఁడు రాఁగానే మృకండుమహర్షి యుపనయన మొనరించి వేద వేదాంగములను బోధించెను. పూర్వజన్మ సంస్కారము కతమున నాతఁ డఖిలవేదముల నచిరకాలముననే నేర్చెను. ఇట్లుండఁ గాలము పరుగిడెను. మార్కండేయునకుఁ బదునాఱవయేఁడు వచ్చెను. మరుద్వతీ మృకండు లిది కారణ మని తెలుపక కన్నీరు మున్నీరుగా నేడ్చుచు దిగులుపడుటఁ గాంచినమార్కండేయుఁడు తలిదండ్రులకు మ్రొక్కి వారివంతకుఁ గలకారణముఁ దెలుపుఁ డని ప్రార్థించెను. చెప్పలేక చెప్పలేక చెప్పఁ దప్పక మృకండుమహర్షి యావద్విషయము మార్కండేయునికిఁ జెప్పెను. మార్కండేయుఁ డావంతయుఁ జింతింపక ధైర్యయుతుఁడై చిఱునగవుతో "తండ్రీ! భయపడకుఁడు. నేను

శివుని గొలిచి చావు గెలిచెదను" అని పలుక దీనదృక్కులతో నాతలి దండ్రు లక్కుమారు నక్కులఁ జేర్చుకొని "తథా" స్తని పలికిరి.

మఱియు :

"కాలపాశంబుచేఁ గట్టఁగాఁ బడియున్న
శ్వేతకేతువును రక్షించినాఁడు
ప్రళయాగ్నివలెఁ బ్రజ్వరిలుకాలకూటంబుఁ
గ్రోలి ముజ్జగములఁ బ్రోచినాఁడు
ధట్టించి యరకాలఁ దన్ని మి త్తిని శిలా
దుని తనూజాతుని మనిచినాఁడు
జాలకారకుఁ డైన జాలంధరుని మక్క
డంచి దేవతలఁ బాలించినాఁడు

త్రిపురదైత్యుల భస్మీకరించి విష్ణు
బాణమున, సాధువులను గాపాడినాఁడు
దర్పితాంధక గర్వ విధ్వంసకుండు
శిక్షిత మనోభవుం డిందుశేఖరుండు.

అట్టిశరణాగత రక్షకుఁ డగు శంకరుఁడె నిన్ను రక్షించు" నని యాశీర్వ దించిరి.

## మృత్యు జయము

మార్కండేయుఁ డట్లు తలిదండ్రుల దీవనలఁ బడసి దక్షిణ సముద్రతీరమునఁ దనపేర శివలింగమును బ్రతిష్ఠించి యచట మాఘ స్నానము చేసి శుచియై మార్కండేయ లింగమునకుఁ ద్రికాలపూజ చేసి పూజావసానమున నానందపులకాంకిత గాత్రుఁడై నాట్య మొనర్చి శివ స్తోత్రము గావించుచుండెను. అంతలో నాతని కాయువు చెల్లుటచే నతి భయంకర మగు కోరలుగల నోటితో, అంజనపర్వతమువంటి మేనితో, భీకరాయుధపాణియై, సర్పవృశ్చిక రోమచయముతో, నిప్పులు రాలు కన్నులతో, క్రూరదృష్టితో, కోపముతో, మృత్యుదేవత భృత్యగణము తన్ను వెన్నంటియుండ యముఁడు విచ్చేసి తనకాలపాశమును మార్కండేయుని మెడకుఁ దగిలించి బలముగ లాగెను. అపుడు

మార్కండేయుఁ డాలింగమును గట్టిగాఁ గౌఁగిలించుకొని యముని జూచి "ఓయీ! శివస్తోత్రము పూర్తియగువఱకు నాఁగుము. తరువాత నేనే వచ్చెద" ననెను. అంత యముఁడు "ఓయీ! మూఢా! కాలముతీఱు లోపలనే నరుఁడు చేయవలసిన కృత్యములు చేసియుండవలెఁ గాని యముఁ డాపను లగువఱకు నాఁగునా? నరుఁడు పూర్వవయస్సుననే ధర్మము చేసికొనవలయును; అట్లు కాక వార్ధకమున మొదలుపెట్టిన నాఁడు తుది నెగ్గఁగలఁడా? మాసాష్టకము శ్రమపడినవాఁ డేఁడాది సుఖపడును. పగటివేళఁ గార్యము సాధించుకొన్న రాత్రి హాయిగా నిద్రింపవచ్చును. పూర్వవయస్సున ధర్మకర్మము లొనరించినయెడల వార్ధకమున సుఖింపవచ్చును. ఱేపటిపని నేఁడే చేసికొనవలయును. మధ్యాహ్నపుఁ బని ప్రొద్దుటే చేసికొనవలయును. కాలము మూఁడనివాఁడు కోటిబాణములచేఁ గొట్టఁబడినను జావఁడు. కాలము మూఁడినవాఁడు గడ్డిపఱక తగిలినను జచ్చును. కోటిమంది చక్రవర్తులు వేయిమంది యింద్రులు నాచేఁ జచ్చిరి. ఇఁక నీవు నాకొక లెక్కయా" యని తర్జింప మార్కండేయుఁ డాతని కిట్లనియెను. "ఓయీ! శంకర స్తవమున కడ్డువచ్చినవాఁడు మడియఁగలఁడు. మఱియు శివభక్తులకు శివుఁడే శాస్త. నీవు గావు. శివభక్తుల కావదలు రావు. శంకరుని కింకరులను దాఁకుటకు బ్రహ్మాదులకేని శక్యముకాదు పొమ్ము." ఆ మాటలు విని యముఁడు మండిపడి యాతనిని మ్రింగివేయ నోరు తెఱవఁగనే యాలింగమునుండి శివుఁడు ప్రాదుర్భవించి యము నొక్క తన్నుఁ దన్నెను. దానితో నాతఁ డామడదూరమునఁ బడిపోయెను.

## శివ స్తుతి

మార్కండేయుఁ డత్యంతభక్తి సంభరితుఁడై పరమేశ్వరు నిట్లు స్తుతించెను:

"మత్తకోకిల!

బాలచంద్రకళావిభూషణ భాసమాన కపర్దునిన్
వ్యాళరాజగుణోపపన్న సువర్ణశైల శరాసనున్
నాళికేక్షణబాణునిన్ గణనాథునిన్ త్రిపురఘ్నునిన్
గాలకాలుని జొచ్చితిన్ నను గాలుఁ డేమి యొనర్చెడిన్?

శైలరాజ సుతాపరిష్కృత చారువామ కళేబరున్
హేళిలోచనహారి నీక్షణ నిర్మితాఖిల లోకునిన్
కాలితావనపాత్రునిన్ మునిభావనీయ చరిత్రునిన్
గాలకాలుని జొచ్చితిన్ ననుఁ గాలుఁ డేమి యొనర్చెడిన్ ॥

వ్యాళభూషణ భూషితాంగుని నార్తలోక శరణ్యునిన్
ఫాలలోచన దగ్ధకాముని భస్మదిగ్ధ శరీరునిన్
శూలపాణి నశేషదుష్టనిషూదనవ్రత దీక్షితున్
గాలకాలుని జొచ్చితిన్ ననుఁ గాలుఁ డేమి యొనర్చెడిన్ ॥

నాళికాసన విష్ణు నిర్జర నాయకాద్యఖిలద్యు స
త్పాళిసేవిత పాదపద్ముని దక్షయజ్ఞ విభంజనున్
క్షాళితప్రణతాఘపంకుని సర్వలోక మహేశునిన్
గాలకాలుని జొచ్చితిన్ ననుఁ గాలుఁ డేమి యొనర్చెడిన్ ॥

నీలలోహితమూర్తి నుగ్రుని నిత్యునిన్ ప్రళయానలా
భీలరూప వినాశితాంబుజపేశికోటి సహస్రు ను
ద్వేలశక్తి ననశ్వరోర్ధ్వగతి ప్రదాత నమేయునిన్
గాలకాలుని జొచ్చితిన్ ననుఁ గాలుఁ డేమి యొనర్చెడిన్ ॥

బాలిశావిదిత ప్రభావునిఁ బంచవక్త్రుని రౌప్య గో
త్రాలయస్థితి సౌఖ్యవేది ననాది నవ్యయునిన్ విప
జ్జాలతూల సమీరునిన్ గజచర్మధారి నలభ్యునిన్
గాలకాలుని జొచ్చితిన్ ననుఁ గాలుఁ డేమి యొనర్చెడిన్ ॥

క్ష్వేళపాయిని మృత్యుజేతను సిద్ధిదాత నశేష రు
గ్జాల దాహదవాగ్ని నాశ్రితకల్పశాఖి నజున్ దిశా
చేలునిన్ భగవంతునిన్ గుణసింధువున్ బరమాత్మునిన్
గాలకాలుని జొచ్చితిన్ ననుఁ గాలుఁ డేమి యొనర్చెడిన్ ॥

కాళికాహృదయాబ్జ భానునిఁ గామితార్థదునిన్ మహా
కాలునిన్ భవరోగవైద్యునిఁ గర్మపాదపమూల ని

ర్మూలన క్షమునిన్ గుణత్రయ రూపునిన్ గరుణానిధిన్
గాలకాలునిఁ జొచ్చితిన్ నను౯ గాలుఁ డేమి యొనర్చెడిన్ ?

కాళ్లు పట్టుకొంటిఁ గాలకంఠునిఁ గలా
మూర్తి నఖిలగురుని మోక్షకరునిఁ
త్రిభువనాధిపతిని దేవాదిదేవుని
మృత్యు వేమి చేయు నింక నన్ను ?

కాళ్ళు పట్టుకొంటిఁ గాలాగ్ని రుద్రుని
వృషభవాహనుని గిరీశు నజునిఁ
జండికాంతరంగ సరసీరుహార్కుని
మృత్యు వేమి చేయు నింక నన్ను ?

కాళ్ళు పట్టుకొంటి గంగాధరుని మహా
నటుని శివుని దుష్టనాశకరుని
భక్తరక్షకునిఁ గపాలిని శూలిని
మృత్యు వేమి చేయు నింక నన్ను ?

కాళ్ళు పట్టుకొంటిఁ గైలాసనాథుని
సృష్టి రక్షణప్రణష్టికరుని
సర్వభూత పతిని సర్వేష్టదాతను
మృత్యు వేమి చేయు నింక నన్ను ? *

అని యెలుఁగెత్తి ప్రార్థించెను. శివుఁ డాతనిభక్తి మెచ్చుకొని యాత నికి దీర్ఘాయువు త్రికాలజ్ఞత దివ్యశక్తినొసంగి యదృశ్యుఁ డయ్యెను.

---

* ఈపద్యములు శ్రీ. శే. పిసుపాటి చిదంబరశాస్త్రిగారి పద్మపురాణము ఉత్తరఖండము లోనివి. వీనికి సంస్కృత మూల శ్లోకములు :

రత్నసాను శరాసనం రజతాద్రి శృంగ నికేతనం
శింజినీకృత పన్నగేశ్వర మచ్యుతానల సాయకమ్,
క్షిప్రదగ్ధ పురత్రయం త్రిదశాలయై రభివందితం
చంద్ర శేఖర మాశ్రయే మమ కిం కరిష్యతి వై యమః.

మార్కండేయుఁ డింటి కేఁగి తన్నుఁ దలపోయు తల్లిదండ్రుల కా వృత్తాంత మంతయుఁ దెలిపి వారి నానందాబ్ధి నోలలాడించెను. అట్టి మహామహుని బుత్రరత్నముగాఁ గన్నందుల కపరిమితానందమునఁ జిరకాలము జీవించి శివకటాక్షమున నాపుణ్యదంపతులు శివసాయుజ్య మందిరి.

---

పంచపాదప పుష్పగంధి పదాంబుజద్వయ శోభితం
ఫాలలోచన జాతపావక దగ్ధమన్మథ విగ్రహమ్,
భస్మదిగ్ధ కళేబరం భవనాశనం భవ మవ్యయం
చంద్రశేఖర మాశ్రయే మమ కిం కరిష్యతి వై యమః.

మత్తవారణ ముఖ్య చర్మకృతోత్తరీయ మనోహరం
పంకజాసన పద్మలోచన పూజితాంఘ్రి సరోరుహమ్,
దేవసింధు తరంగ సీకరసిక్త శీత జటాధరం
చంద్రశేఖర మాశ్రయే మమ కిం కరిష్యతి వై యమః.

కుండలీకృత కుండలేశ్వర కుండలం వృషవాహనం
నారదాది మునీశ్వర స్తుతవైభవం భువనేశ్వరమ్,
అంధకాంతక మాశ్రితామర పాదపం మదనాంతకం
చంద్రశేఖర మాశ్రయే మమ కిం కరిష్యతి వై యమః.

యక్షరాజసఖం భగాక్షహరం భుజంగ విభూషణం
శైలరాజసుతాపరిష్కృత చారువామ కళేబరమ్,
క్ష్వేళనీలగళం పరశ్వథధారిణం మృగధారిణం
చంద్రశేఖర మాశ్రయే మమ కిం కరిష్యతి వై యమః.

భేషజం భవరోగిణా మఖిలాపదా మపహారిణం
దక్షయజ్ఞ వినాశనం త్రిగుణాత్మకం త్రివిలోచనమ్,
భుక్తిముక్తి ఫలప్రదం సకలాఘ సంఘనిబర్హణం
చంద్రశేఖర మాశ్రయే మమ కిం కరిష్యతి వై యమః.

భక్తవత్సల మర్చితాం నిధి మక్షయం హరిదంబరం
సర్వభూతపతిం పరాత్పర మప్రమేయ మనూపమమ్,
సోమవారి నభోహుతాశన సోమపాద్యఖిలాకృతిం
చంద్రశేఖర మాశ్రయే మమ కిం కరిష్యతి వై యమః.

విశ్వసృష్టి విధాయకం పునరేవ పాలనతత్పరం
సంహరంత మపి ప్రపంచ మశేషలోక నివాసినమ్,
క్రీడయంత మహర్నిశం గణనాథయూథ సమావృతం
చంద్రశేఖర మాశ్రయే మమ కిం కరిష్యతి వై యమః.

కాలకంఠం కలామూర్తిం కాలాగ్నిం కాలనాశనమ్,
నమామి శిరసా దేవం కిం నో మృత్యుః కరిష్యతి. *

❋

* (పద్మపురాణము, భాగవతము.)

# మహర్షుల చరిత్రలు

## వాత్స్యాయన మహర్షి

### తపస్సు

వాత్స్యాయనమహర్షి బ్రహ్మచర్యవ్రతము నవలంబించి మనోవాక్కాయకర్మలచే మహాతప మొనరించిన తపశ్శాలురలో మేటి, యోగులలో నద్వితీయుఁడు, జ్ఞానులలో సుప్రసిద్ధుఁడు నయ్యెను. తపశ్శక్తి మూలమున నీతఁడు ముల్లోకములు తిరుగుచు ముముక్షువులఁ బ్రోచుచు మోదఖేదములు లేక దివ్యవర్చస్వియై యుండెను. అతఁడు మహాతప మొనరించి ఆదిశేషుని ప్రియభక్తుఁడై యాతని కృపాకటాక్షముల నత్యధికముగఁ జూఱగొనెను.

### ఆదిశేషుని ఆశ్రయము

ఒకప్పుడు వాత్స్యాయనమహర్షి శేషునికడ కేగి సాష్టాంగ నమస్కారము లొనరించి శ్రద్ధాభయభక్తుఁడై సృష్టిక్రమము సవిశేషముగా నెఱింగింపు మని ప్రార్థించెను. అనంతుఁ డాతని జిజ్ఞాసకు మెచ్చి బ్రహ్మాదిస్తంబ పర్యంత మగు సమస్తసృష్టిక్రమమును సవిశేషముగా నెఱింగించెను. పిదప నాతఁడు సూర్యవంశక్షత్రియుల చరిత్రలాదిశేషు నడిగి సవిస్తరముగాఁ దెలిసికొనెను. ప్రసంగవశమున రఘువంశకథ విని తనివితీరక వాత్స్యాయనుఁడు శేషునికి మ్రొక్కి "దేవా! భువనపావన మగు రామకథామృతముఁ గ్రోలి తనివి గనువాఁ డుండఁడు. రామచరిత్రము విన్నను, తలఁచినను, చెప్పుకొన్నను, కలుషముల నెల్ల నఱవఱలు చేయఁజాలును. మఱియు రామాశ్వమేధ వృత్తాంతము రామకథారత్నములలో నత్యుత్తమము. సకలభువనవహనమహనీయుఁడ వగు నీనోట నది వినఁ గుతూహలపడు

చున్నాను శ్రమ మిచ్చినందులకు క్షమించి నా కోరికఁ దీరుపు" మని సవినయముగాఁ బ్రార్థించెను.

## రామకథాశ్రవణము

ఆదిశేషుఁ డానందించి "మునీంద్రా! నీయదృష్టము మంచిది. నీ జన్మము ధన్యము. పుణ్యహీనునకు రామకథాసుధారసముఁ గ్రోలు సంకల్పమే కలుగదు. నీవంటిపుణ్యాత్ముల పుణ్యదాయక మగుకోరిక వలన నావంటివారికి పరమాత్ముని స్మరించుభాగ్య మబ్బును. రామకథాసముద్రము నీఁదుటకు నావంటి యత్యల్పుఁ డెంతయు నసమర్థుఁడు. ఐనను, నీ కోరిక దీరుప యథాశక్తిఁ దెలిపెదను. ఆకాశమువలె ననంతమైన రామకథ యెక్కడ? పక్షిసముఁడ నగునేను జెప్పఁగడఁగు టెక్కడ? అగ్ని సంపర్కమున సువర్ణము అమలమైన విధమున, అఖిల ఘోర పాపహరణ నిపుణ మగు రామకథాభిమర్శనమున నా బుద్ధి పరిశుద్ధి నందుఁగాక!" అని పలికి క్షణమాత్రము నిమీలిత నేత్రుఁడై పరమ విజ్ఞానబలమున రామకథ కనులకుఁ గట్టినట్లు గానిపింప హర్ష పులకితుఁడై యిట్లు చెప్పఁదొడఁగెను.

సర్వలోక వైరియగు రావణాసురుని దనబాణములనెడు నగ్నిచే దగ్ధముచేసి, గుణవంతుఁడగు విభీషణునకుఁ బట్టాభిషేక మొనరించి, ఇంద్రాదిదేవతలు భక్తిశ్రద్ధలతోఁ జేయు వందనోపచారములు స్వీకరించుచు మునీశ్వరబృందముల వేదోక్తాశీర్వచనములకు మోదమందుచు స్వకార్యము నిర్వర్తించి శ్రీరాముఁడు భువనాభిరాముఁడై జానకీలక్ష్మణులు పార్శ్వముల నుండ సాకేతమునకుఁ బోవ నెంచి పుష్పకవిమానము నధిష్ఠించెను. అతనివెంట బ్రహ్మాదులు, సుగ్రీవుఁడు, విభీషణుఁడు, వానరులు నాతని యాజ్ఞచేఁ బుష్పక మధిరోహించిరి. అంతఁ బుష్పక మెగిరి నందిగ్రామముఁ జేరెను. నందిగ్రామమున నున్న భరతునకుఁ దనరాక నెఱిఁగింప శ్రీరాముఁ డాంజనేయుని బంపెను.

హనుమంతుఁడు కడఁగంటనైనఁ గానుపీసములఁ దాఁకక, కలనైనఁ గాంతను దలఁచికొనక, మంచినీటి చుక్క యైనను గొంతునఁ

బోసికొనక, అన్నకణమైన దగ్గఱకు రానీయక, జడలుగట్టిన శిరోజములతో, క్షీణించు శరీరముతో భ్రాతృవిరహమున క్షణ మొకయుగముగాఁ గడపుచు రాముని రాకకై సూర్యదేవునికి వేయి మ్రొక్కులు మ్రొక్కుచుఁ బలవించుభరతునిఁ జూచి యాతని రామభక్తిముందుఁ దన భక్తి యేపాటి దనుకొని యాంజనేయుఁ డాతనికి రామాగమనవార్తఁ దెలుప నాతఁ డపరిమితానందమున రాముని కెదురేగి భక్తిపురస్సరముగాఁ గౌఁగిలించుకొని యాతని వాత్సల్యమునకు గురియై యాతని యానఁ బుష్పక మెక్కెను. విమానము అయోధ్య చేరెను. దిగి రామాదులు తల్లులకు మ్రొక్కి పెద్దలపాదము లంటి సర్వజన ప్రియులైరి. భరతుఁడు రాజ్యము రామున కొప్పగించెను. దేవతలు శ్రీరాము నిట్లు స్తుతించిరి.

“రామా!

త్రిలోకాభిరామా!

సహస్రాంశువంశాబ్ధిసోమా!

మత్స్యావతారము: త్వదీయప్రభావం బసామాన్య మాపన్నసంరక్షణా! వేదసందోహ చౌర్యంబు గావించి యంభోధిలోఁ దూఱి యుండన్ హయగ్రీవరాత్రించరగ్రామణిన్గూల్చి మత్స్యావతారంబునన్ వేదరాశిన్ బ్రసాదింపవే!

కూర్మావతారము: ధాతకున్ గూర్మరూపంబునన్ మందరగ్రావమున్ మోసి బర్హిర్ముఖశ్రేణి కెల్లన్ సుధాన్నంబు సంతృప్తిగాఁ బెట్టవే!

వరాహావతారము: ధాత్రిపై లోకసంతాపకారిన్ హిరణ్యాక్షరాత్రించరాధీశ్వరున్ దున్మి విశ్వంభరామండలోద్ధారమున్ జేయవే!

నృసింహావతారము: నారసింహుండవై యుద్భవంబంది కంబంబునం దద్ధిరణ్యాక్షరక్షోనుజుం జీల్చి చెండాడి యాపద్గతుండైన ప్రహ్లాదునిం బ్రోవవే!

వామనావతారము: వామనాకారముం దాల్చి పాదత్రయ క్ష్మాతలం బర్థివై కోరి, లబ్ధాఖిలామండవై సర్వలోకంబు వ్యాపించి రెం డడుగులన్, శిష్ట మైయున్న యేకాంఘ్రిచే దుష్టరక్షోధినాథున్ బలిన్ ద్రొక్కవే యంటఁ బాతాళమున్!

పరశురామావతారము : భార్గవాకారముంబెంది గర్వాంధ మై యున్న క్షాత్త్రింబుఁ గ్రోధాగ్నిలో వేల్చి, ముయ్యేడుమారుల్ మహీ భారముం దీర్పవే!

రామావతారము: రామచంద్రుండవై తాటకన్ మాపి. గాధేయు యజ్ఞంబు రక్షించి, చేపట్టి సీతాసతీరత్నమున్, రాజ్యమున్ వీడి, ఘోరాట వుల్ సొచ్చి, నానావిధ క్లేశముల్ సైఁచి, లోకాపకారిన్ మహాపాపకారిన్ సురారిన్ సమూలంబుగా రావణుం ద్రుంచి, లోకంబులన్ నిల్పవే! త్వత్కృతంబైన రక్షోవినాశంబు తత్కార్యసంజాత లోకైక కల్యాణమున్ వేయి నోళ్లన్ నుతింపంగ సాధ్యంబె!

కృష్ణావతారము: కృష్ణుండవై పుట్టి శాసించి కంసాదిహింసాపరస్వాంతులన్, గావవే ధర్మమార్గైక సంసక్తులన్ భక్తులన్.

బౌద్ధావతారము: బుద్ధరూపంబునన్ బౌద్ధమార్గంబు బోధించి, సాధింపవే దేవతాకార్యమున్!

కల్క్యవతారము: కల్కివై నాశ మొందింపవే పాపలోకంబు నెల్లన్.

భవల్లీల లక్షీయముల్; సృష్టి గావింప సంకల్ప ముత్పన్న మైనన్ సృజింపంబడున్; సర్వలోకంబులున్ స్వస్థతంబెంది యుండంగ నాకాంక్ష సంధిల్లినన్ స్వస్థతం బెందియుండున్; హరింపందలం పేర్పడంగన్ లయంబొందు; లోకత్రయారాధ్య! నీనామముల్ బ్రహ్మహత్యాది పాపంబు లన్ రూపుమాపన్ సమర్థంబు; లస్తోకమాహాత్మ్య! నిన్నంట వేనాఁటికైనన్ జరామృత్యు జన్మాది దుఃఖంబు; లప్రాప్య! నీతత్త్వ మెవ్వం డెఱుంగున్; గుణాతీత! నీభావ మెవ్వండెఱుంగున్; నిరాకార! నీరూప మెవ్వం

డెలుంగున్; సదాకార! నీ వెల్లెడన్ నిండియున్నాఁడ వంతర్బహిర్భేద శూన్యుండవై; త్వచ్చరిత్రంబు చిత్రంబు చిత్రంబు వాఙ్మానసాగోచరా! ధర్మభంగం, బధర్మోదయంబున్ దటస్థించు కాలంబునం దాత్మతేజంబుచే వ్యక్తరూపుండవై యుద్ధరింపంగదే శిష్టులన్, సంహరింపంగదే దుష్టులన్, సర్వశక్తుల్ త్వదాయత్తముల్; నీవు గాకున్న లోకంబు లెల్లన్ బ్రవర్తింపఁ జేయన్ సమర్థుండు వేఱొక్కఁ డెవ్వండు స్వామీ! భవన్మాయకున్ లోనుగాకుండువా రెవ్వ రీ మూఁడులోకంబులన్; యజ్ఞముల్ పూర్తముల్ దానముల్ ధర్మముల్ దేవ! నీ ప్రీతికై గాదె కావింతు రార్యుల్; తపస్వుల్ తపంబున్ త్వదర్థంబ కావింతు; రింతేల? తత్త్వజ్ఞులై నట్టివా రెల్ల కర్మంబులున్ నీకె యర్పింతు; రాద్యుండ; వీవప్రమేయుండ; వీవ ప్రణాతుండ; వీ వాత్మ; వీ వెల్ల కాలంబు; లోకత్రయస్తోత్రపాత్రంబు; నీపాద యుగ్మంబు; సర్వేప్సితార్థప్రదం; బస్మదీయాంతరంగంబులందుండుఁగా కెప్పుడున్; నిన్నె దర్శించుచున్ నిన్నె ధ్యానించుచున్ నిన్నె కీర్తించుచున్ ధన్యతం జెందుభాగ్యంబు మాకున్ బ్రసాదింపు మీశా! నమస్తే నమస్తే నమస్తే నమః." *

దేవతాప్రార్థనమును విని రాముఁడు వారి కభయహస్త మిచ్చి వీడ్కొలిపి తాను బరమ ధర్మముగా రాజ్యమును బాలించెను.

తరువాత నొకనాఁ డగస్త్యమహర్షి విచ్చేసి రాముఁ డడుగ నాతనికి రావణాదులచరిత్ర మెఱింగించెను. రాముఁడు రావణుని జంపుటచేఁ గలిగిన బ్రహ్మహత్యాపాపమును బాపకొన నుపాయ మేమని యడుగ నగస్త్యుఁ డశ్వమేధయాగమును జేయు మని సూచించెను. శ్రీరాముఁ డట్లశ్వమేధయాగము చేసి శత్రుఘ్నుని యాగాశ్వమువెంటఁ బంపెను. వీరాగ్రేసరులు పెక్కురు శత్రుఘ్నునివెంట నరిగిరి. యాగాశ్వము బహుప్రదేశములఁ దిరిగి చక్రాంకపురమును జేరఁగా నట దమనుఁ డద్దానిం బట్ట భరతసుతుఁ డగుపుష్కలుఁ డాతని నోడించెను. క్రతుహయము తేజఃపురముఁ జేరి పిదప నుత్తర దిశ కేగి యనంతరము రేవాహ్రదములో మునిఁగిపోవ హనుమత్పుష్కలులతో శత్రుఘ్నుఁడు

* శ్రీమత్పిసుపాటి చిదంబరకవిప్రణీత పద్మపురాణ పాతాళఖండము ౧౩.

పాతాళమునకేగి హయమును విడిపించి యది దేవపురము చేర రుక్మాంగదుఁ డద్దానిం బట్టుకొనెను. శత్రుఘ్నాదులకు రుక్మాంగదాదులకు నట ఘోరరణ మయ్యెను. ప్రతిపక్షమునఁబట్టి యీశ్వరుఁ డని చేయ రాఁగా శత్రుఘ్నుఁ డీశ్వరునితో యుద్ధ మొనర్చెను. శత్రుఘ్నాదులు సోలఁగా హనుమంతుఁ డీశ్వరు నెదిరించి యుద్ధము చేసెను. వారిరువురు మిత్రులైరి. శివునిపనుపున హనుమంతుఁ డేగి సంజీవనౌషధిని దెచ్చి చచ్చినవారిని బ్రదుకఁజేసెను. శత్రుఘ్నుఁడు మరల శూలితో యుద్ధ మొనరించి సోలిపోఁగా నట రాముఁడు ప్రత్యక్షము కాఁగా నీశ్వరుఁ డాతని నెంతయుఁ గీర్తించెను. ఉభయులు మైత్రి నెలకొలుపుకొనిరి. తరువాత యాగాశ్వము హేమకూటముం జేరెను. అట నది కదలక మెదలక నిలిచిపోవఁగాఁ గారణము తెలియరాదాయెను. శత్రుఘ్నుఁ డాప్రాంతమునఁ దప మొనరించు గౌతమమహర్షిని జేరి తత్కారణముఁ దెలుపు మని ప్రార్థింప నా మహర్షి యాతనికి సాత్త్వికుని చరిత్రఁ దెలిపి రామకథాశ్రవణమున నాతఁడు రాక్షసత్వవిముక్తుఁ డగుటఁ దెలిపెను. వెంటనే క్రతుహయము కదలి కుండలపురముఁ జేర సురథుఁ డనురాజు దానిని బట్టుకొనెను. శత్రుఘ్నాదులు సురథాదులతో ఘోరయుద్ధముచేయ సురథుఁడు హనుమదాదులను బంధించెను. రాముఁ డటఁ బ్రత్యక్షముకాఁగా సురథుఁడు నమస్కరించి రామదర్శనముకొఱకే తా నావని చేసితి నని చెప్పి హయమును విడిచి మైత్రిచేసికొనెను. తరువాత యాగాశ్వము వాల్మీక్యాశ్రమముఁ జేర లవుఁ డద్దానిం గట్టివైచెను."

ఈ కథ చెప్పుచుండ వాసుకిని వాత్స్యాయనుఁడు సీతాపరిత్యాగ కథఁ దెలుపు మని కోర నాతఁ డద్దాని నెల్లఁ జెప్పెను. "శ్రీరామచంద్రునంతటిమహనీయునికిని జనాపవాద మెట్లు వచ్చెనో తెలుప వేఁడుదు" నని వాత్స్యాయనుఁ డడుగ వాసుకి యిట్లు చెప్పెను. "తొల్లి సీతాదేవి బాల్యమున నుద్యానవనమున చెలికత్తెలతో విహారము సల్పుచుండ నొకచెట్టుమీఁద రెండుచిలుకలు కానవచ్చెను. అందలి మగచిలుక ఆఁడుచిలుకకు రామాయణకథ చెప్పి సీతవలె నీవు రామునివలె నేను నుంద మని పలికెను. ఆఁడుచిలుక యట్లే యని యానందాతిశయ

మున మగచిలుకను గౌఁగిలించుకొనెను. ఇది కని చిలుకలు పలుకు పలుకులు విని సీత సాదరముగా వానిని బట్టి తెం డని చెలికత్తెలను గోర వారు మెల్లగా నా చిలుకలను రెండింటిని బట్టుకొని సీతముందుఁ బెట్టిరి. సీత వానిని దువ్వి భయపడకుఁ డని హెచ్చరించి "రాముఁ డెవఁడు? సీత యెవతె? మీరు చెప్పుకొన్నకథ యెక్కడిది?" అని కుతూహలముతోఁ బ్రశ్నింప మగచిల్క యిట్లు చెప్పెను. "అమ్మా! ఇది నా భార్య. మే మిరువురము వాల్మీకిమహర్షి యాశ్రమముచెంత నుందుము. ఆ మహర్షి భావిరామాయణము వ్రాసి శిష్యులకుఁ జెప్పుచుండఁగా మేము వింటిమి. అది విన్న వారిపాపము లెల్ల హరించి తాపములను బాపును. కావున, నీవును వినుము చెప్పెద" నని భావి రామకథ యంతయును జెప్పి "మ మ్మిఁక విడిచిపెట్టుము. పోయెద" మని కోరెను. సీత "ఓచిలుకా! అంత తొందర పడకు, మీకు సర్వసత్కారములు చేసెదను. ఆ రాముఁ డెట నున్నాఁడు? ఆతనిరూపరేఖ లెటువంటివి?" అని ప్రశ్నించెను. ఆ చిలుక రామునిసౌందర్యము వర్ణించి చెప్పఁగా సీత పరవశయై విని తానే జనకునికూఁతు రగుసీత నని యా చిలుకకుఁ జెప్ప నా రెండుచిలుకలు నా మెకు నమస్కరించి సెలవు కోరెను. "రాముఁడు నన్నుఁ బరిణయ మాడువఱకు నేను మిమ్ము విడువ" నని సీత పలికెను. ఆ చిలుకలు భయపడి తాము బంధితులమై యుండలే మనియు వాల్మీకియాశ్రమమున స్వేచ్ఛగా సుఖముందు మని యెంత చెప్పినను సీత వానిని విడువదయ్యెను. అంత నా మగచిలుక "సీతా! నాభార్య గర్భవతి. బంధనప్రాప్తి కోర్వలేదు. కావలసినపుడు మరల వత్తుము. మమ్ము విడువుము. నీకుఁ బుణ్యముండు" నని ప్రార్థించెను. అంత సీత బాలికగాన బాల్యచాపలమున మగచిలుకను విడిచి "నీవు పొమ్ము. ఆడుచిలుకను ప్రసవమైనపిదప విడిచెదను" అని పలికెను. ఆ చిలుక యెగిరి చెట్టుపై కెక్కి "ఓ సీతమ్మా! నా యాలిని విడిచి నే మనఁజాలను విడువుము. అయ్యో! మౌనమే భూషణము. వాగ్దోషమున బంధము వచ్చెను. కనుక, నెవ్వరితోడను మాటలాడవల దని పెద్ద లన్నమాట నిజము. నేను మంచి కథ చెప్పినను నీవు బంధించితివి. విడువు" మని మరలఁ గోరినను సీత వినదయ్యెను. ఆఁడుచిలుకయు భర్తను విడిచియుండ లేను. పోనిమ్మన్నను సీత విడువదాయెను.

ఆ యాఁడు చిలుక గోడుగోడున నేడ్చుచు:

"తరినురాలా! నీవు గర్భిణి వగు నన్ను
భర్తతోడ నెడలువాపినట్ల
దైవ మింక గర్భధారిణి వగు నిన్ను
భర్తతోడ నెడలువాపుఁ గాక!"

అని శపించెను. వెంటనే యామె దుఃఖభారమున నసువులు విడిచెను. మగచిలుక యేడ్చి యేడ్చి గంగలోఁ బడి 'నేను మఱుజన్మమున సీతను రామునితో నెడఁబాపుదునుగా' కను తుదికోరికతో మరణించెను. ఆ మగ చిలుకయే అయోధ్యలోఁ జాకలియై పుట్టి శ్రీరామునకు జనాపవాదమును గల్పించి సీతాపరిత్యాగమునకు హేతుభూత మయ్యెను. ఇట్లు చిత్ర విచిత్రములు అదృష్టశ్రుత పూర్వములు నగు కథాపరంపరలతో వాత్స్యా యన మహర్షికి వాసుకి శ్రీమద్రామాయణమును సంపూర్ణముగా విని పించెను. వాత్స్యాయనుఁ డమితానందమున వాసుకిని వీడుకొని నిజాశ్రమమున కేగి హరిమహిమామృతమును గ్రోలి యితరులకుఁ బంచియిచ్చి యజరామరత్వ మందెను.*

## కామశాస్త్రము

వాత్స్యాయనమహర్షి కామశాస్త్రము నభ్యసించి లోకోపకారార్థము కామసూత్రములను సంధానించెను. వత్సుఁ డనురాజు వత్సదేశమును బాలించుచుండ మల్లనాగుఁ డనువాఁ డాస్థానవిద్వాంసుఁడై యుండి రాజును సక్రమ కామోపదేశమున సన్మార్గమున నిలిపె ననియు నందుచే మల్లనాగునకు వాత్స్యాయనుఁ డని (వత్సునకు జ్ఞాన మనుకన్ను నిచ్చినవాఁడు) యాతనికిఁ బేరువచ్చెనని యొక పుక్కిటిపురాణము కలదు. † ఇది సత్యము కాదు. వాత్స్యి యనుపేరుగల తనతల్లికి జ్ఞాననేత్ర మైనవాఁడు గనుక వాత్స్యికొడుకు వాత్స్యాయనుఁ డయ్యెను.

---

* శ్రీపద్మపురాణము: పాతాళఖండము.

† భాస్కరనృసింహకవివృత్తి.

అసలు వాత్స్యాయన మహర్షి రచించిన కామశాస్త్రము కాలగర్భమునఁ జిందరవందర యైనది. ఇది కామశాస్త్రమునకు మాతృక. ఇప్పుడు లభ్యమైనది భ్రష్టరూపమగు తత్ప్రతిక. ఇందలి తొలిభాగమందలి తొలియధికరణము సాధారణాధికరణము. ఇందు శాస్త్ర సంగ్రహము, త్రివర్గప్రతిపత్తి, విద్యాసముద్దేశము, నాగరకవృత్తము, నాయకసహాయ దూతీ కర్మవిమర్శ అను నధ్యాయములలోఁ బెక్కువిషయములు కలవు. రెండవ దగు సాంప్రయోగికాధికరణమున రతావస్థాపన, ఆలింగన విచారము, చుంబనవికల్పము, నఖరదనజాతి, దశనచ్ఛేద్యము, సంవేశన చిత్రరతము, సీత్కృతాది, పురుషోప సృప్తము, ఔపరిష్టకము, రతారంభావసానికము, అను నధ్యాయముల ననేకవిషయములు కలవు. మూఁడవ దగు కన్యాసంప్రయోగాధికరణమున వరణవిధానము, కన్యా విస్రంభణము, బాలోపక్రమము, ఏకపురుషాభియోగము వివాహ యోగము నను నధ్యాయములలో నాయా విషయములు కలవు.

రెండవభాగమందలి మొదటి యధికరణము భార్యాధికారి కాధికరణము. ఇందు ఏకచారిణీవృత్తము, సపత్నీ జ్యేష్ఠావృత్త కనిష్ఠావృత్తము, స్త్రీపురుష శీలావస్థాపనము, పరిచయకారణాది, భావపరీక్ష, దూతీకర్మ, ఈశ్వరకామితము, అంతఃపురదారరక్షితము, అను నధ్యాయములుకలవు. రెండవ దగు వైశికాధికరణమున కాంతానువృత్తము, అర్థాగమోపాయము, విశీర్ణప్రతి సంధానము, లాభవిశేషము, అర్థానర్థానుబంధ విచారము, సుభగంకరణము, నష్టరాగ ప్రత్యానయనము నను నధ్యాయములు కలవు.

వాత్స్యాయన కామ సూత్రములు : మూలము.

ప్రథమభాగము.

I. సామాన్యాధికరణము :

## 1. శాస్త్రసంగ్రహాధ్యాయము.

"ధర్మార్థకామేభ్యోనమః. శాస్త్రే ప్రకృతత్వాత్ తత్సమయావబోధకశ్చాచార్యేభ్యః తత్సంబంధాత్. ప్రజాపతిర్హి ప్రజాస్సృష్ట్వాతాసాం స్థితి నిబంధనం త్రివర్గస్య సాధనం అధ్యాయానాం శతసహస్రేణాగ్రే ప్రోవాచ.

తస్యైకదేశం స్వాయంభువో మను ర్ధర్మాధికారికం పృథక్చకార. బృహస్పతి రర్థాధి కారికమ్. మహాదేవానుచరశ్చ నందీ సహస్రేణాధ్యాయానాం పృథక్కామసూత్రం ప్రోవాచ. తదేవతు పంచభి రధ్యాయశతైః ఔద్దాలకి శ్వేతకేతు స్సంచిక్షేప. తదేవతు పునరధ్యర్థశతేన. సాధారణ సాంప్రయోగిక కన్యాసంప్రయుక్తక భార్యాధికారిక పారదారిక వైశికౌపనిషదికై స్సప్తభి రధికరణైః బాభ్రవ్యః పాంచాలః సంచిక్షేప. తస్య షష్ఠం వైశిక మధికరణం పాటలిపుత్రికాణాం గణికానాం నియోగా ద్దత్తకః పృథక్చకార. తత్ప్రసంగా చ్చారాయణః సాధారణ మధికరణం పృథక్ప్రోవాచ. సువర్ణనాభ స్సాంప్రయోగికమ్, ఘోటకముఖః కన్యాసంప్రయుక్తకం, గోనర్దీయో భార్యాధికారికం, గోణికాపుత్రః పారదారికం, కుచుమా ఔపనిషదికం. ఏవం బహుభి రాచార్యైః తచ్ఛాస్త్రం ఖండశః ప్రణీత ముత్పన్నకల్ప మభూత్. తత్ర దత్తకాదిభిః ప్రణీతానాం శాస్త్రావయవానాం ఏకదేశత్వాత్ మహదితి చ బాభ్రవీయస్య దురధ్యేయత్వాత్, సంక్షిప్య సర్వమర్థ మల్పేన గ్రంథేన కామసూత్రమిదం ప్రణీతవాన్. తస్యాయం ప్రకరణాధికరణ సముద్దేశః శాస్త్రసంగ్రహః త్రివర్గప్రతిపత్తిః విద్యాసముద్దేశః నాగరకీవృత్తం నాయకీ సహాయదూతీ కర్మ విమర్శః. ఇతి సాధారణ మధికరణం ప్రకరణాని పంచ. ప్రమాణ కాలభావేభ్యో రతావస్థాపనం ప్రీతివిశేషాః ఆలింగనవిచారాః చుంబన వికల్పాః నఖ రదన జాతయః దశనచ్ఛేద్యవిషయాః దేశ్యాఉపచారాః సంవేశన ప్రకారాః చిత్రరతాని ప్రహరణయోగాః తద్యుక్తాశ్చసీత్కృతో పక్రమాః పురుషాయితం పురుషోపసృప్తాని ఔపరిష్టకం రతారంభం అవసానికం రతవిశేషాః ప్రణయకలహః—ఇతి సాంప్రయోగికం ద్వితీయ మధికరణం. అధ్యాయాదశ ప్రకరణాని సప్తదశ. వరణవిధానం సంబంధ నిర్ణయః, కన్యావిస్రంభణం, బాలాయా ఉపక్రమాః, ఇంగితాకారసూచనం, ఏకపురుషాభియోగాః, ప్రయోజ్యస్యోపావర్తనం, అభియోగతశ్చ కన్యాయాః ప్రతిపత్తిః వివాహయోగాః ఇతి కన్యాసంప్రయుక్తకంతృతీయాధికరణం అధ్యాయాః పంచ. ప్రకరణాని నవ. ఏకచారిణీ వృత్తం ప్రవాసచర్యా సపత్నీషు జ్యేష్ఠావృత్తం కనిష్ఠావృత్తం పునర్భూవృత్తం దుర్భగావృత్తం ఆంతఃపురికం, పురుషస్య బహ్వీషు ప్రతిపత్తిః ఇతి భార్యాధికారికం చతుర్థ మధికరణం. అధ్యాయా

ద్వౌ. ప్రకరణా న్యష్ట. స్త్రీపురుష శీలావస్థాపనం వ్యావర్తన కారణాని స్త్రీషు సిద్ధాః పురుషాః అయత్నసాధ్యా యోషితః పరిచయకారణాని, అభియోగ్యాః, భావపరీక్షా దూతీకర్మాణి ఈశ్వర కామితం అంతఃపురికం దారరక్షితం-ఇతి పారదారికం పంచమ మధికరణమ్. అధ్యాయాః షట్ ప్రకరణాని దశ. గమ్యచింతా, గమనకారణాని, ఉపావర్తన విధిః, కాంతానువర్తనం, అర్థాగమోపాయాః, విరక్తలింగాని, విరక్తప్రతిపత్తిః నిష్కాసన ప్రకారాః, విశీర్ణ ప్రతిసంధానం, లాభవిశేషః, అర్థానర్థానుబంధ సంశయవిచారః, వేశ్యావిశేషాశ్చ ఇతి వైశికం షష్ఠ మధికరణం అధ్యాయాష్షట్. ప్రకరణాని ద్వాదశ. సుభగంకరణమ్, వశీకరణం, వృష్యాశ్చయోగాః, నష్టరాగ ప్రత్యానయనం, వృద్ధివిధయః చిత్రాశ్చ యోగాః ఇత్యౌపనిషదికమ్ సప్తమ మధికరణం అధ్యాయౌద్వౌ ప్రక రణాని షట్. ఏవం షట్త్రింశదధ్యాయాః. చతుష్షష్టిప్రకరణాని, అధి కరణాః సప్త సపాదం శ్లోకసహస్రం, ఇతి శాస్త్ర సంగ్రహః.

శ్లో॥ సంక్షేప మిమ ముక్త్వాథ విస్తరోతః ప్రవక్ష్యతే,
ఇష్టం హి విదుషాం లోకే సమాసవ్యాసభాషణమ్.

## 2 త్రివర్గ ప్రతిపత్త్యధ్యాయః

శతాయు ర్వైపురుషో విభజ్యకాల మన్యోన్యాను బద్ధం పరస్పర స్యానుపఘాతకం త్రివర్గం సేవేత. బాల్యేవిద్యాగ్రహణాదీ నర్థాన్. కామంచ యౌవనే. స్థావిరే ధర్మం మోక్షం చ. అనిత్యత్వా దాయుషో యథోపపదం వా సేవేత. బ్రహ్మచర్యమేవ త్వా విద్యాగ్రహణాత్. అలౌ కికత్వా దదృష్టార్థత్వా దప్రవృత్తానాం. యజ్ఞాదీనాం శాస్త్రాత్ప్రవర్తనం లౌకికత్వా ద్దృష్టార్థత్వా చ్చ. ప్రవృత్తేభ్యశ్చ మాంసభక్షణాదిభ్యః శాస్త్రాదేవ నివారణం ధర్మః. తం శ్రుతే ర్ధర్మజ్ఞసమవాయాచ్చ ప్రతి పద్యేత. విద్యా భూమి హిరణ్యం పశు ధాన్య భాండోపస్కర మిత్రా నా మార్జనం ఆర్జితస్య పరిరక్షణం అర్థః. తం అధ్యక్ష ప్రచారాత్ వార్తా సమయవిద్భ్యో వణిగ్భ్యశ్చేతి. శ్రోత్ర త్వక్చక్షుర్జిహ్వాఘ్రాణానాం ఆత్మ సంయుక్తేన మనసా అధిష్ఠితానాం స్వేషు స్వేషు విషయే ష్వానుకూల్యతః

ప్రవృత్తిః కామః. స్పర్శవిశేషవిషయే త్వస్యాభిమానిక సుఖానువిద్ధా ఫలవత్యర్థప్రతీతిః ప్రాధాన్యా త్కామః. తం కామసూత్రా న్నాగరక జన సమవాయా చ్చ ప్రతిపద్యేత. తేషు సమవాయే పూర్వః పూర్వోగరీయాన్. అర్థశ్చరాజ్ఞః, తన్మూలకత్వా ల్లోకయాత్రాయాః, వేశ్యాయాశ్చ, ఇతి త్రివర్గప్రతివత్తిః. ధర్మస్యాలౌకికత్వా త్తదభిధాయకం. శాస్త్రం యుక్తమ్. ఉపాయపూర్వకత్వా దర్థసిద్ధేః. ఉపాయప్రతివత్తి శ్శాస్త్రాత్. తిర్యగ్యోనిష్వపి తు స్వయం ప్రవృత్తత్వాత్ కామస్య నిత్యత్వా చ్చ న శాస్త్రేణ కృత్య మస్తీత్యాచార్యాః. సంప్రయోగ పరాధీనత్వాత్ స్త్రీపుంసయో రుపాయ మపేక్షతే. సా చోపాయప్రతివత్తిః కామసూత్రా దితి వాత్స్యాయనః.

తిర్యగ్యోనిషు పున రనావృతత్వాత్ స్త్రీజాతేశ్చ ఋతౌ యావదర్థం ప్రవృత్తేరబుద్ధిపూర్వకత్వా చ్చ ప్రవృత్తీనా మనుపాయః ప్రత్యయః, న ధర్మాం శ్చరేత్. ఏష్యత్ఫలత్వాత్. సాంశయికత్వా చ్చ. కో హ్యబాలిశో హస్తగతం పరగతం కుర్యాత్. వర మద్య కపోతశ్శ్వ మయూరాత్. వరం సాంశయికా న్నిష్కాద సాంశయికః కార్షాపణ ఇతి లోకాయతికాః. శాస్త్రస్యానభిశంక్యత్వా దభిచారానువ్యాహారయో శ్చ క్వచిత్ఫలదర్శనా న్నక్షత్ర చంద్ర సూర్యతారాగ్రహచక్రస్య లోకార్థం బుద్ధిపూర్వక మివ ప్రవృత్తే ర్దర్శనా ద్వర్ణాశ్రమాచారస్థితిలక్షణార్థత్వా చ్చ లోకయాత్రాయాః హస్తగతస్య చ బీజస్య భవిష్యత స్సస్యార్థే త్యాగదర్శనా చ్చరేద్ధర్మా నితి వాత్స్యాయనః నార్థాం శ్చరేత్, ప్రయత్నతోఽపి హ్యేతే మష్ఠీయ మానా నైవకదాచి త్స్యుః అననుష్ఠీయమానా అపి యదృచ్ఛయా భవేయుః. తత్సర్వం కాలకారిత మితి. కాల ఏవ హి పురుషానర్థానర్థయోః జయపరాజయయోః సుఖదుఃఖయో శ్చ స్థాపయతి. కాలేన బలి రింద్రః కృతః, కాలేన వ్యవరోపితః కాలఏవ పునరప్యేనం కర్తేతి కాలకారణికాః పురుషకారపూర్వకత్వా త్సర్వప్రవృత్తీనాం ఉపాయః ప్రత్యయః అవశ్యం భావినోప్యర్థస్య ఉపాయపూర్వకత్వా దేవ న నిష్కర్మణో భద్ర మస్తీతి వాత్స్యాయనః. న కామాం శ్చరేత్. ధర్మార్థయోః ప్రధానయో రేవ మన్యేషాం చ సతాం ప్రత్యనీకత్వాదనర్థజనన సంసర్గ మసద్వ్యవసాయ మశౌచ మనాయతిం చైతే పురుషస్య

జనయంతి తథా ప్రమాదం లాఘవ మప్రత్యయ గ్రాహ్యతాం చ. బహవశ్చ కామవశగా స్సగణా ఏవ వినష్టా శ్రూయంతే. యథా దాండక్యోనామ భోజః కామా ద్బ్రాహ్మణకన్యా మభిగమ్యమానః సబంధురాష్ట్రో వినవాశ. దేవరాజ శ్చాహల్యా, మతిబలశ్చ కీచకో ద్రౌపదీం, రావణశ్చ సీతా, మపరే చాన్యేచ బహవో దృశ్యంతే కామవశగా వినష్టా ఇత్యర్థ చింతకాః శరీరస్థితి హేతుత్వా దాహారసధర్మాణో హి కామః ఫలభూతాశ్చ ధర్మార్థయోః బోద్ధవ్యం తు దోషేష్వివ నహి భిక్షుకా స్సంతీతి స్థాల్యో నాధిశ్రీయంతే నహి మృగాస్సంతీతి యవానోప్యంతే ఇతి వాత్స్యాయనః .భవంతి చాఽత్రశ్లోకాః

శ్లో॥ ఏవ మర్థం చ కామంచ, ధర్మం చోపాచర న్నరః,
ఇహాముత్ర చ నిశ్శల్య మత్యంతం సుఖ మశ్నుతే.

కిం స్యాత్పరత్రేత్యాశంకాకార్యే యస్మి న్న జాయతే. న చార్థఘ్నం సుఖం చేతి శిష్టా స్తత్ర వ్యవస్థితాః త్రివర్గ సాధకం యత్స్యాత్ ద్వయో రేకస్య వా పునః కార్యం తదపి కుర్వీత నత్వేకార్థం ద్విబాధకమ్.

## 3. విద్యాసముద్దేశాధ్యాయః

ధర్మార్థాంగ విద్యాకాలా ననుపరోధయన్ కామ సూత్రం తదంగ విద్యాశ్చ పురుషోఽధీయీత. ప్రాగ్యౌవనా స్త్రీ ప్రత్తాచ పత్యురభి ప్రాయాత్, యోషితాం శాస్త్ర గ్రహణ స్యాభావా దనర్థక మిహ శాస్త్రే స్త్రీశాసన మిత్యాచార్యాః ప్రయోగగ్రహణం త్వాసామ్. ప్రయోగస్య చ శాస్త్రపూర్వకత్వాదితి వాత్స్యాయనః. తన్న కేవల మిహైవ సర్వత్రైవ హి లోకే కతిచిదేవ హి శాస్త్రజ్ఞాః సర్వజనవిషయశ్చ ప్రయోగః ప్రయోగస్య చ దూరస్థమపి శాస్త్రమేవ హేతుః. అస్తి వ్యాకరణ మిత్యవై యాకరణా అపి యాజ్ఞికా ఊహం క్రతుషు ప్రయుంజతే. అస్తిజ్యోతిష మితి పుణ్యాహేషు కర్మ కుర్వతే. తథాశ్వారోహాః గజారోహాశ్చ అశ్వాన్ గజాంశ్చ అనధి గతశాస్త్రా అపి వినయంతే. తథా స్తి రాజేతి దూరస్థా అపి జనపదా న మర్యాదా మతివర్తంతే తద్వదేతత్. సంత్యపి ఖలు

శాస్త్రప్రహతబుద్ధయో గణికా రాజపుత్ర్యోమహామాత్ర దుహితరశ్చ.
తస్మా ద్వైశ్వాసికా జ్జనాద్రహసి ప్రయోగాన్ శాస్త్ర మేకదేశం వా స్త్రీ
గృహ్ణీయాత్. అభ్యాస ప్రయోజ్యాంశ్చ చతుష్షష్టికాన్ యోగా న్కన్యా
రహస్యేకాకి న్యభ్యసేత్. ఆచార్యాస్తు కన్యానాం ప్రవృత్తపురుష సం
ప్రయోగా సహసంప్రవృద్ధా ధాత్రేయికా తథాభూతా వా నిరత్యయ
సంభాషణా సఖీ సవయాశ్చ మాతృష్వసా విస్రబ్ధా తత్స్థా నీయా వృద్ధ
దాసీం పూర్వ సంసృష్టావా భిక్షుకీ స్వసా చ విశ్వాస ప్రయోగాత్. గీతం,
వాద్యం, నృత్యమ్, ఆలేఖ్యమ్, విశేషకచ్ఛేద్యం, తండుల కుసుమ
బలివికారాః, పుష్పాస్తరణం, దశనవసనాంగరాగః మణిభూమికా కర్మ,
శయనరచనమ్, ఉదకవాద్యమ్, ఉదకాఘాతః, చిత్రాశ్చయోగాః,
మాల్యగ్రథనవికల్పాః శేఖరకాపీడయోజనమ్, నేపథ్య ప్రయోగాః
కర్ణపత్రభంగాః, గంధయుక్తిః, భూషణయోజనమ్, ఐంద్రజాలాః,
కౌచుమారాశ్చయోగాః, హస్తలాఘవమ్, విచిత్రశాక యూషభక్ష్య
వికారక్రియా, పానకరస రాగాసవయోజనమ్, సూచీవానకర్మాణి,
సూత్రక్రీడా, వీణాడమరుక వాద్యాని ప్రహేళికా, ప్రతిమాలా, దుర్వా
చకయోగాః, పుస్తకవాచనం, నాటకాఖ్యాయికా దర్శనమ్, కావ్యసమస్యా
పూరణం, పట్టికావాన వేత్రవికల్పాః, తక్షకర్మాణి, తక్షణమ్, వాస్తువిద్యా,
రూప్యరత్న పరీక్షా, ధాతువాదః, మణిరాగాకరజ్ఞానం, వృక్షాయుర్వేద
యోగాః, మేషకుక్కుటలావకయుద్ధవిధిః శుకసారికా ప్రలాపనం, ఉత్సా
దనే, సంవాహనే, కేశమర్దనే చకౌశలం, అక్షరముష్టికా కథనమ్, మ్లేచ్ఛి
తక వికల్పాః, దేశభాషా విజ్ఞానం, పుష్పశకటికా, నిమిత్త జ్ఞానం,
యంత్రమాతృకా, ధారణ మాతృకా, సంపాఠ్యం, మానసీకావ్యక్రియా,
అభిధానకోశః, ఛందోజ్ఞానం, క్రియాకల్పః, ఛలితకయోగాః, వస్త్ర
గోపనాని, ద్యూతశేషాః ఆకర్షక్రీడా, బాలక్రీడనకాని, వైనయికానాం,
వైజయికానాం, వ్యాయామికానాం, చ విద్యానాం జ్ఞానం. ఇతి చతుష్షష్టి
రంగవిద్యా కామసూత్ర స్యావయవిన్యః, పాంచాలికీ చతుష్షష్టి రపరా.
తస్యాః ప్రయోగా నన్వవేత్య సాంప్రయోగికే వక్ష్యామః. కామస్య
తదాత్మకత్వాత్. 'అభిరభ్యుచ్ఛ్రితావేశ్యా శీలరూపగుణాన్వితా' లభతే
గణికా శబ్దం స్థానం చ జనసంసది. పూజితాసా సదా రాజ్ఞాగుణవద్భిశ్చ
సంస్తుతా, ప్రార్థ నీయాభిగమ్యా చ లక్ష్యభూతా చ జాయతే. యోగజ్ఞా

రాజపుత్రీ చ మహామాత్రసుతా తథా, సహస్రాంతః పురమపి స్వవశే కురుతే పతిమ్. తథాపతివియోగే చ వ్యసనం దారుణంగతా, దేశాంతరేపి విద్యాభి స్సాసుఖేనైవ జీవతి. నరః కలాసు కుశలో వాచాల శ్చాటు కారకః, అసంస్తుతోపి నారీణాం చిత్తమాశ్వేవ విందతి. కళానాం గ్రహణాదేవ సౌభాగ్యముపజాయతే, దేశకాలౌ త్వపేక్ష్యాసాం ప్రయోగస్సంభవేన్నవా.

## 4. నాగరకవృత్తాధ్యాయః

గృహీతవిద్యః ప్రతిగ్రహ జయక్రయ నిర్వేశాధి గతైరర్థై రన్వయాగతై రుభయై ర్వా గార్హస్థ్య మధిగమ్య నాగరకవృత్తం వర్తేత. నగరే పత్తనే ఖర్వాటే మహతివా సజ్జనాశ్రయే స్థానమ్. యాత్రావశా ద్వా. తత్రభవనసమాసన్నోదకం వృక్షవాటికావత్ విభక్త కర్మకక్షం ద్విథా వాసగృహం కారయేత్. బాహ్యేచ వాసగృహే సుశ్లక్ష్ణ ముభయోపధానం మధ్యే వినతం శుక్లోత్తరచ్ఛదం శయనీయం స్యాత్ ప్రతిశయ్యికా చ....యక్ష రాత్రిః కౌముదీజాగరః సువసంతకః సహకార భంజికా అభ్యూషఖాదికా బిసఖాదికా నవపత్రికా ఉదకక్ష్వేడికా పాంచాలానుయానం ఏకశాల్మలీ యవచతుర్థీ ఆలోల చతుర్థీ మదనోత్సవః దమన భంజికాహోలాకా అశోకోత్తంసికా పుష్పావచాయికా చూతలతికా ఇక్షుభంజికా కదంబయుద్ధాని తాస్తాశ్చ మహిమాన్యః దేశ్యాశ్చక్రీడాః జనేభ్యో విశిష్ట మాచరేయురితి సంభూయ క్రీడాః. ఏక చారిణశ్చ. విభవసామర్థ్యా ద్గణికాయాః నాయికాయాశ్చ సఖీభి ర్నాగరకైశ్చ సహ చరిత మేతేన వ్యాఖ్యాతమ్. అవిభవస్తు శరీరమాత్రో మల్లికాఫేన కషాయమాత్ర పరిచ్ఛదః పూజ్యాద్దేశా దాగతః కళాసు విచక్షణః తదుపదేశేన గోష్ఠ్యాం వేశోచితేచ వృత్తే సాధయే దాత్మాన మితి పీఠమర్దః. భుక్తవిభవస్తు గుణవాన్ సకళత్రో వేశే గోష్ఠ్యాం చ బహుమతః తదుపజీవీ చ విటః. ఏకదేశ విద్యస్తుక్రీడనకో విశ్వాస్యశ్చ విదూషకః వైహాసికోవా. ఏతే వేశ్యానాం నాగరకాణాం చ మంత్రిణ స్సంధివిగ్రహనియుక్తాః తైర్భిక్షుక్యః విదగ్ధాః ముండా వృషల్యోవృద్ధ గణికాశ్చ

వ్యాఖ్యాతాః. గ్రామవాసీ చ సజాతాన్ విచక్షణాన్ కౌతూహలికాన్ ప్రోత్సాహ్య నాగరికజనస్య వృత్తం వర్ణయన్ శ్రద్ధాం చ జనయన్ తదేవానుకుర్వీత. గోష్ఠీశ్చ ప్రవర్తయేత్. సాంగత్యాజ్జన మనురంజయేత్. కర్మసుచ సాహాయ్యేన చానుగృహ్ణీయాత్ ఉపకారయేచ్చేతి నాగరకవృత్తమ్. భవంతి చాత్రశ్లోకాః

యా గోష్ఠీ లోకవిద్విష్టా యా చ స్వైరవిసర్పిణీ,
పరహింసాత్మికా యా చ నతా మవతరే ద్బుధః.
లోక చిత్తానువర్తిన్యా క్రీడామాత్రైకకార్యయా,
గోష్ఠ్యా సహచర న్విద్వాన్ లోకే సిద్ధిం నియచ్ఛతి.

## 5. నాయకసహాయదూతీకర్మవిమర్శాధ్యాయః

కామశ్చతుర్షువర్ణేషు సవర్ణతశ్చానన్యపూర్వాయాం ప్రయుజ్యమానః పుత్రీయో యశస్యో లౌకికశ్చ భవతి. తద్విపరీత ఉత్తమవర్ణాసు పరపరిగృహీతాసు చ ప్రతిషిద్ధః అవరవర్ణా స్వనిరవసితాసు వేశ్యాసు పునర్భూషు చ న శిష్టో న ప్రతిషిద్ధః సుఖార్థత్వాత్. తత్ర నాయికాస్తిస్రః కన్యా పునర్భూః వేశ్యా చ. పటుతా ధార్ష్ట్య మింగితాకారజ్ఞతా అనుకూలత్వం పరమర్మజ్ఞతా ప్రమాణతా ప్రతారణం దేశజ్ఞానం కాలజ్ఞతా విషహ్యబుద్ధిత్వం అక్ష్వి ప్రతిపత్తిః సోపాయ దూతగుణాః భవతి చాత్రశ్లోకః

ఆత్మవాన్ మిత్రవాన్ యుక్తః భావజ్ఞోదేశకాలవిత్,
అలభ్యా మప్యయత్నేన స్త్రియం సంపాదయే న్నరః.

## II సాంప్రయోగికాధికరణమ్.

### 1. రతావస్థాపనాధ్యాయః

శశో వృషోశ్వ ఇతి ఇంగితో నాయకవిశేషాః. నాయికా పునర్మృగీ బడబా హస్తినీ చేతి. తత్ర సదృశసంప్రయోగేన సమరతాని త్రీణి.

విపర్యయేణ విషమాని షట్. విషమేష్వపి పురుషాధిక్యం చే దనంతర సంప్రయోగే ద్వే ఉచ్చరతే. వ్యవహిత మేక ముచ్చతరరతమ్: విపర్యయే పునర్ద్వే నీచరతే. వ్యవహితమేకం నీచతరరతం చ. తేషు సమాని శ్రేష్ఠాని. తరశబ్దాంకితే ద్వే కనిష్ఠే. శేషాణి మధ్యమాని .... .... తస్మాచ్చోపాయం వైలక్షణ్యం పిభవతి. అభియోక్తాహ మితి పురుషో మన్యతే అభియుక్తాహ మనేనేతి యువతిరితి వాత్స్యాయనః .... ....

2. ఆలింగనవిచారాధ్యాయః

సంప్రయోగాంగం చతుఃషష్టి రిత్యాచక్షతే చతుః షష్టి ప్రకరణత్వాత్. శాస్త్రమేవేదం చతుష్షష్టి రిత్యాచార్యవాదః. .... .... ....

కృతే ప్రతికృతం కుర్యా త్తాడితే ప్రతితాడితమ్,
కరణేన చ తేనైవ చుమ్బితే ప్రతిచుంబితమ్.

3. నఖరదన జాత్యధ్యాయః.

రాగవృద్ధౌ సంఘర్షాత్మకం నఖవిలేఖనమ్. తస్యప్రథమసమాగమే ప్రధానప్రత్యాగమనే ప్రవాసగమనే క్రుద్ధ ప్రసన్నాయాం మత్తాయాం చ ప్రయోగో ననిత్య మచండవేగయోగః .... .... ....

నఖక్షతాని పశ్యంత్యా గూఢస్థానేషు యోషితః,
చిరోత్సృష్టా ప్యభినవా ప్రీతిర్భవతి పేశలా.

చిరోత్సృష్టేషు రాగేషు ప్రీతిర్గచ్ఛేత్పరాభవమ్,
రాగాయతన సంస్మారి యది నస్యాన్నఖక్షతమ్.

పశ్యతో యువతిం దూరాన్నఖోచ్ఛిష్ట పయోధరామ్,
బహుమానః పరస్యాపి రాగయోగశ్చ జాయతే.

పురుషశ్చ ప్రదేశేషు నఖచిహ్నైః వినిహ్నితః,
చిత్రం స్థిరమపి ప్రాయశ్చలయత్యేవ యోషితః.

నాన్యత్పటుతరం కించి దస్తిరాగ వివర్ధనమ్,
నఖదంత సముత్థానాం కర్మణాం గతయో యథా.

4. దశనచ్ఛేద్యాధ్యాయః.

ఉత్తరోష్ఠ మంతర్ముఖం నయన మితి ముక్త్వాచుంబనవద్దశన రదనస్థానాని .... ... ....

పరస్పరానుకూల్యేన తదేవం లజ్జమానయోః,
సంవత్సరశతే నాపి ప్రీతిర్న పరిహీయతే.

5. సంవేశన చిత్రరతాధ్యాయః.

రాగకాలే విశాలయంత్యేవ జఘనం మృగీ సంవిశేదుచ్చరతే. అవ హ్రాసయంతీవ హస్తినీ నీచరతే. .... .... ....
భవతశ్చాత్ర శ్లోకాః!

పశూనాం మృగజాతీనాం పతంగానాంచ విభ్రమైః,
తైస్తైరుపాయై శ్చిత్తజ్ఞో రతియోగా న్వివర్ధయేత్.
తత్సాత్మ్యాద్దేశసాత్మ్యాచ్చతైస్తైర్భావైః ప్రయోజితైః,
స్త్రీణాం రాగశ్చ స్నేహశ్చ బహుమానశ్చ జాయతే.

6. సీత్కృతాధ్యాయః.

కలహరూపం సురత మాచక్షతే వివాదాత్మకత్వా ద్వామశీలత్వా చ్చ కామస్య. తస్మాత్ప్రహరణస్థాన మంగంస్కంధౌ శిరస్తనాంతరం పృష్ఠం జఘనం పార్శ్వఇతిస్థానాని. తచ్చతుర్విధం అపహస్తకం ప్రసృతకం ముష్టిః సమతలకమితి తదుత్థవం చ సీత్కృతం. .... ....

నాస్త్యత్ర గణనా కాచి న్న చ శాస్త్రపరిగ్రహః,
ప్రవృత్తే రతిసంయోగే రాగ ఏవాత్రకారణమ్ ....
నచ సర్వదా న సర్వాసు ప్రయోజ్యాస్సాంప్రయోగికాః,
స్థానే దేశేచ కాలేచ యోగే ఏషాం విధీయతే.

7. పురుషోపస్పృపాధ్యాయః.

నాయకస్య సంతతాభ్యాసా త్పరిశ్రమ ముపలక్ష్య రాగస్య చాను పశమం అనుమతా తేన తమధోవపాత్య పురుషాయితేన సాహాయ్యం దద్యా స్వాభిప్రాయాద్వా వికల్పి యోజనార్థినీ నాయకకుతూహలాద్వా ....

ప్రచ్ఛాదితస్వభావాపి గూఢాకారాపి కామినీ,
వివృణోత్యేవ భావం స్వరాగా దపరివర్తినీ.
యథా శీలాభవేన్నారీ యథాచరతి లాలనా,
తస్యా ఏవ విచేష్టాభి స్తత్సర్వ ముపలక్షయేత్.
నత్వే వర్తౌ న ప్రసూతాం నమృగీం న చ గర్భిణీమ్,
న చాతి వ్యాయతాం నారీం యోజయేత్పురుషాయితే.

8. ఔపరిష్టకాద్యధ్యాయః.

ద్వివిధా తృతీయా ప్రకృతిః స్త్రీరూపిణీ పురుషరూపిణీ చ. తత్ర స్త్రీరూపిణీ స్త్రియా వేష మాలాం లీలాపం భావం మృదుత్వం భీరుత్వం ముగ్ధతామసహిష్ణుతాం వ్రీడాం చానుకుర్వీత .... ....

తస్మాద్దేశం చ కాలంచ ప్రయోగం శాస్త్రమేవ చ,
ఆత్మానం చాపి సంప్రేక్ష్య యోగాన్ప్యుంజీతవా నవా.
అర్థస్యాస్య రహస్యత్వా చ్చలత్వా న్మనస స్తథా,
కః కదా కిం కుతః కుర్యాదితికో జ్ఞాతు మర్హతి.

9. రతారంభావసాని కాద్యధ్యాయః.

నాగరక స్సహమిత్రజనేన సపరిచారకశ్చ కృతపుష్పోపహారే సంచారిత సురభిధూపే రత్యావాసే ప్రసాధితే వాసగృహే కృతస్నాన ప్రసాధనాం యుక్త్యాపీతాం స్త్రియం సాంత్వనైః పునఃపానేన చోప క్రమేత .... .... ....

కన్యాభిః పరయోషిద్భిః గణికాభిశ్చ భావతః,
వీక్ష్యతే బహుమానేన చతుష్షష్టి విచక్షణః.

III కన్యాసంప్రయుక్తకాధికరణమ్.

1. వరణవిధానాధ్యాయః.

సవర్ణాయాం అనన్యపూర్వాయాం శాస్త్రతోఽధిగతాయాం ధర్మోర్థః పుత్రాః సంబంధః పక్షవృద్ధిః అనుపస్కృతా రతిశ్చ .... ....

కృత్వాపి చోచ్చ సంబంధం పశ్చాజ్జ్ఞాతిషు సం నమేత్,
నత్వేవ హీన సంబంధం కుర్యాత్సద్భిర్వినిందితమ్.

2. కన్యావిస్రంభణాద్యధ్యాయః

సంగతయా స్త్రిరాత్ర మధశ్శయ్యా బ్రహ్మచర్యం క్షారలవణ వర్జన మాహార స్తథా సప్తాహం సతూర్యం మంగళస్నానం ప్రసాధనం సహ భోజనం చ ప్రేక్షా సంబంధినాంచ పూజన మితి సార్వవర్ణికమ్ ....

3. బాలోపక్రమాద్యధ్యాయః.

ధనహీనస్తు గుణయుక్తోపి మధ్యస్థగుణో హీనాపదేశో వా సధనోవా ప్రాతివేశ్యః మాతాపితాభ్రాతృషు చ పరతంత్రః బాలవృత్తి రుచిత ప్రవేశో వా కన్యా మలభ్యాత్వన్న వరయేత్ .... .... ....

బాలక్రీడనకై ర్బాలా కళాభి ర్యౌవనే స్థితా,
వత్సలాచాపి సంగ్రాహ్యా విశ్వాశ్యజన సంగ్రహాత్.

4. ఏక పురుషాభియోగాద్యధ్యాయః.

దర్శితేంగితాకారాం కన్యా ముపాయతోఽభియుంజీత ....

గుణసామ్యేభియోక్తృణా మేకో వరయితా వరః,
తత్రాభియోక్తః శ్రైష్ఠ్యం అనురాగాత్మకోహి సః.

5. వివాహయోగాధ్యాయః.

ప్రాచుర్యేణ కన్యాయాః వివిక్తదర్శనస్యాలాభే ధాత్రేయికాం ప్రియహితాభ్యా ముపగృహ్యోపసృశేత్ .... ....

సుఖత్వా ద బహుక్లేశా దపి చావరణా దిహ,
అనురాగాత్మ కత్వాచ్చ గాంధర్వంప్రవరో మతః.

## ద్వితీయభాగః

**I భార్యాధికరణమ్.**

1. ఏకచారిణీవృత్తాధ్యాయః.

భార్యా ఏకచారిణీ గూఢ విస్రంభా దేవవత్పతిమానుకూల్యేన వర్తేత తన్మతేన కుటుంబచింతా మాత్మని సంనివేశయేత్ .... ....

సద్వృత్త మనువర్తేత నాయకస్య హితైషిణీ,
కులయోషా పునర్భూ ర్వా వేశ్యావాప్యేకచారిణీ.
ధర్మమర్థం తథా కామం లభంతే స్థానమేవ చ,
నిస్సపత్నం చ భర్తారం నార్య స్సద్వృత్త మాశ్రితాః.

౭. జ్యేష్ఠావృత్తప్రకరణమ్.

జాడ్యదౌశ్శీల్య దౌర్భాగ్యేభ్యః ప్రజానుత్పత్తేరాభీక్ష్ణ్యేన దారికోత్పత్తే ర్నాయక చాపలాద్వా సపత్న్యధి వేదనమ్ ... ....

యువతిశ్చ జితక్రోధా యథా శాస్త్రప్రవర్తినీ,
కరోతి వశ్యం భర్తారం సపత్నీశ్చాధితిష్ఠతి.

II పారదారికాధికరణమ్.

1. స్త్రీపురుష శీలావస్థాపనాద్యధ్యాయః.

వ్యాఖ్యాత కారణా పరపరిగ్రహోపాయాః. తేషు సాధ్యత్వ మనత్యయం గమ్యత్వ మాయతిం వృత్తిం చాదిత ఏవ పరీక్షేత ....

శంకితాం రక్షితాం భీతాం సశ్వశ్రూ కాంచయోషితమ్,
నతర్కయే న్మేధావీ జానన్ప్రత్యయ మాత్మనః.

2. భావపరీక్షాధ్యాయః.

అభియుంజానో యోషితః ప్రవృత్తిం పరీక్షేతతయా భావపరీక్షితో భవతి. మంత్రమన్యథ్వానాం దూత్యైనాం సాధయేత్. .... ....

ధీరాయా మప్రగల్భాయాం పరీక్ష్యాయాంచయోషితి,
ఏష సూక్ష్మవిధిః ప్రోక్తం సిద్ధా ఏవస్ఫుటంస్త్రియః.

3. దూతీకర్మాధ్యాయః.

దర్శితేంగితేకారాం తు ప్రవిరళదర్శనా మపూర్వాం చ దూత్యోప సర్పయేత్. .... .... ....

అసంకల్పిత మప్యర్థ ముత్సృష్టం దోషకారణాత్,
పునరావర్త యత్యేవ దూతీవచన కౌశలాత్.

4. ఈశ్వరకామితాధ్యాయః.

న రాజ్ఞాం మహామాత్రాణాం వా పరభవనప్రవేశో విద్యతే. మహా జనేన హి చరితం ఏషాం దృశ్యతే అనువిధీయతే చ. .... ....

నత్వేవైత ప్రయుంజీత రాజా లోకహితేరతః,
నిగృహీతారిషడ్వర్గః తథా విజయతే మహీమ్.

5. అంతఃపురికా ప్రకరణమ్.

నాంతఃపురాణాం రక్షణయోగా త్పురుషసందర్శనం విద్యతే. పత్యు శ్చైకత్వా దనేకసాధారణత్వాచ్చ అతృప్తిస్తస్మా త్తాని యోగత ఏవ పరస్పరం రంజయేయుః .... .... ....

III వైశికాధికరణమ్.

1. సహాయగమ్యాగమ్యాది చింతాధ్యాయః.

వేశ్యానాం పురుషాదిగమే రవృత్తిశ్చ సర్గాత్. రతితః ప్రవర్తనం స్వాభావికం కృత్రిమ మర్థార్థం .... .... ....

2. కాంతానువృత్తాధ్యాయః.

సంయుక్తా నాయకేన తద్రంజనార్థ మేకచారిణీ వృత్త మనుతిష్ఠేత్ .... .... ....

కామయంతే విరజ్యంతే రంజయంతి త్యజంతి చ,
కర్షయంత్యోపి సర్వార్థాన్ జ్ఞాయంతే నైవయోషితః.

3. అర్థాగమోపాయాద్యధ్యాయః.

సక్తాద్విత్తాదానం స్వాభావిక ముపాయతశ్చ .... ....

పరీక్ష్యగమ్యైస్సంయోగః సంయుక్త స్యానురంజనమ్,
రక్తా దర్థస్య చాదాన మంతేమోక్షశ్చ వైశికమ్.
ఏవమేతేన కల్పేన స్థితా వేశ్యాపరిగ్రహే,
నాతి సంధీయతే గమ్యైః కరోత్యర్థాంశ్చ పుష్కలాన్.

4. విశీర్ణప్రతిసంధానాధ్యాయః.

వర్తమానం నిష్పీడితార్థ ముత్సృజంతీ విశీర్ణేన సహసం దధ్యాత్....

సక్తం తు వశినం నారీ సంభాష్యా వ్యన్యతో వ్రజేత్,
తతశ్చార్థ ముపాదాయ సక్త మే వానురంజయేత్.
ఆయతిం ప్రసమీక్ష్యాదౌ లాభం ప్రీతిం చ పుష్కలామ్,
సౌహృదం ప్రతిసందధ్యా ద్విశీర్ణం స్త్రీ విచక్షణా.

5. లాభవిశేషాద్యధ్యాయః.

గమ్యబాహుళ్యే ప్రతిదినం చ లభమానా నైకం ప్రతిగృహ్ణీయాత్. .... .... ....

6. అర్థానర్థానుబంధసంశయవిచారాద్యధ్యాయః.

అర్థా నాచర్యమాణా ననర్థా అన్యనూద్భవంతి అనుబంధా స్సంశయాశ్చ. .... .... ....

సంతి రాగపరా నార్యః సంతి చార్థపరా అపి,
ప్రాక్తత్ర వర్ణితో రాగః వేశ్యాయోగాశ్చ వైశికే.

VI ఔపనిషదికాధికరణమ్.

1. సుభగంకరణాద్యధ్యాయః.

వ్యాఖ్యాతం కామసూత్రమ్ తదుక్తైస్తు విధిరభిప్రేత మర్థ మనధిగచ్ఛన్ ఔపనిషదిక మాచరేత్ .... .... ....

తపోయుక్తాః ప్రయుంజీత శిష్టై రనుగతావిధీన్
బ్రాహ్మణైశ్చ సుహృద్భిశ్చ మంగళై రభినందితాన్.

2. నష్టరాగప్రత్యానయనాద్యధ్యాయః

చండవేగాం రంజయితు మనక్నువ న్వేగా నాచరేత్. .... .... .... ....

న శాస్త్ర మస్తీ త్యేతేన ప్రయోగాహి సమీక్ష్యతే,
శాస్త్రార్థా న్వ్యాపినో విద్యా త్ప్రయోగాం స్త్వైకదేశికాన్.
బాభ్రవీయాంశ్చ సూత్రార్థా నాగమ్య విమృశ్చ చ,
వాత్స్యాయన శ్చకారేదం కామసూత్రం యథావిధి.
తదేతద్బ్రహ్మ చర్యేణ పరేణచ సమాధినా,
విహితం లోకయాత్రార్థం నరాగార్థోస్యసంవిధిః.
రక్షన్ ధర్మార్థ కామానాం స్థితిం స్వా లోకవర్తినీమ్,
అన్యశాస్త్రస్య తత్త్వజ్ఞో భవత్యేవ జితేంద్రియః.
తదేతత్కుశలం విద్వాన్ ధర్మార్థా నవలోకయన్,
నాతిరాగాత్మికః కామీ ప్రయుంజానః ప్రసిద్ధ్యతి.

# మహర్షుల చరిత్రలు

## విపుల మహర్షి

### బాల్యము

పూర్వకాలమున భృగువంశమునఁ బుట్టిన విపులుఁడనునొక ముని కుమారుఁ డుపనీతుఁడై బ్రహ్మచర్యాశ్రమమునఁ బ్రవేశించి విద్యార్థియై దేవశర్మ యనునొకమునిసత్తమునికడ నివసించుచుండెను. దేవశర్మ యాతనిని గన్నకొడుకువలెఁ గాంచుచు నాతనిశ్రద్ధాభక్తులకు వినయవిధేయతలకు నుభయములకు మెచ్చి విద్యాబుద్ధులు గఱపుచుండెను. అచిరకాలమున నాతఁ డఖిలవిద్యలు నద్వితీయముగ నేర్చుటేకాక యోగవిద్యలో నప్రతిమానుఁ డయ్యెను. గురుకులవాసము, బ్రహ్మచర్యదీక్ష, శుశ్రూషాభాగ్యము, శ్రద్ధాభక్తులు, వినయవిధేయతలు, సుగుణసంపదలు గలయేవిద్యార్థి యేగురునికడఁ జేరి విద్యాబుద్ధులు నేర్వఁజాలఁడు? ఇట్టిబుద్ధిశాలి యగు విపులుఁడు గురు వగుదేవశర్మకుఁ బ్రియశిష్యుఁ డగుటలో నాశ్చర్యము లేదుకదా!

దేవశర్మకుఁ జక్కనిచుక్క, అన్నులమిన్న యగు రుచి యను భార్య యుండెను. ఆమె పతివ్రతయై భర్త యడుగులకు మడుగులొత్తుచు శిష్యజనవత్సలయై యుండెను. ఆమెసౌందర్యమునకు మహేంద్రాదులే ముగ్ధులై యామెను మోహింపఁజొచ్చిరి. ఇంద్రుఁ డామెను గాంక్షించి దేవశర్మయాశ్రమమునకు రాకపోకలు మొదలిడెను. ఇంద్రుని పూర్వచరిత్రము నెఱిఁగినదేవశర్మ యాతనిని వారించి తనయాలిని వేయి కనులతోఁ జూచుకొనుచుండెను. ఇంద్రుని యాస అడియాసలయ్యెను. ఐన నాతఁడు తరుణమున కెదురుచూచుచుండెనే కాని నిరాశుఁడు కాఁడయ్యెను.

## గురువియోగము

ఇటులుండ నొకమహారాజుచే నొకగొప్పయజ్ఞమును నిర్వర్తింపఁ జేయుటకు దేవశర్మ గ్రామాంతరము పోవలసివచ్చెను. భార్యారక్షణమున కాతఁ డేమిచేయవలయునో యాలోచించుకొని తుదకు విపులుని బిలిచి "ఓయీ! నీవు ఉత్తము మగు భృగుకులమునఁ బుట్టినవాఁడవు. వినయ విద్యలఁ బ్రియశిష్యుఁడవు. సర్వ సమర్థుఁడవు. కావున, నీ కొకముఖ్య మగుపని నొప్పగించి నేను గ్రామాంతర మేగవలయు" నని చెప్పెను. విపులుఁ డందుల కంగీకరించి యాజ్ఞాపింపుఁ డని కోరెను. అంత దేవశర్మ యాతనికి ఇంద్రుఁడు రుచిని మోహించి తరుణముకొఱ కెదురుచూచుచుండుటయు, రుచి పతివ్రతయే యైనను స్త్రీసహజమగు చపలత కతీతురాలు కాలేకపోవచ్చు ననియుఁ దాను తిరిగి వచ్చువఱకుఁ గోటికన్నులతో రుచిని గనిపెట్టి యుండవలసిన దనియు నామె నింద్రుని బారిఁ బడకుండఁ గాపాడవలయు ననియు హెచ్చరించెను.

ఉగ్రతపుఁడు, సూర్యేంద్రసమానతేజుఁడు, ధర్మజ్ఞుఁడు, సత్యవాది యగువిపులమహర్షి గురునానతి శిరమునఁ దాల్చి "దేవా! ఆ యింద్రుఁ డిట కెటు వచ్చును? అతనిరూప మెట్లుండును? తెలుపు" మని కోరెను. దేవశర్మ "వత్సా! ఇంద్రుఁడు మాయావి, కామరూపి. ఏ రూపముననైన నెపుడైనను రాఁగలఁడు. అతఁడు కిరీటి, వజ్రభూషణుఁడు, వజ్రాయుధధారి, కుండలాలంకృతుఁడు కాని, అతఁడు ధరింప లేనిరూపము లేదు. పశుపక్షినరరూపములలో నేదియైన ధరింపఁ గలఁడు. క్షణక్షణమున కాతఁడు తనరూపములను మార్చుకొనఁగలఁడు. దివ్యదృష్టికలవాఁడు తక్క నితరుఁ డెవ్వఁ డాతనిం బట్టుకొనఁజాలఁడు. నా కాశక్తి యున్న దని యాతనికిఁ దెలియును. అందుచే శాపభీతుఁడై నాకంటఁబడకున్నాఁడు. నేను లేనివేళఁ గనిపెట్టి తప్పక రాఁగలఁడు. కావున, నీవు కడు జాగరూకతతోఁ జూడవలయును" అని చెప్పి తాను బయనమై పోయెను.

## గురుపత్నీ సంరక్షణము

గురుఁ డరిగినపిదప విపులుఁడు గురుతరబాధ్యతను మోయవలసి వచ్చెను. ఇంద్రుని గనిపెట్టుట కాతఁ డెన్నియుపాయములనో యాలో

చించెను. కాని, వాని నన్నిఁటి నవలీలగా దాటి యింద్రుఁడు రుచిని గొని పోఁగలఁ డని యాతఁ డూహించెను. తుద కాతఁడు యోగమార్గ మవలంబించి గురుపత్ని యగురుచిశరీరమును జొచ్చెను. ఆమె కాసంగతియే మాత్రమును దెలియదు. అతఁడటు లామెలోఁ బ్రవేశించి తనకన్నుల కాంతి యాకాంతకన్నులకాంతిలోఁగలిపి వాయు వాకాశమునఁ గలిసి యుండున ట్లామెశరీరమును గలిసి యుండి యామెసంరక్షణమును బూనెను. అతఁ డామెశరీరమును జొచ్చుటకుఁ బూర్వము తనశరీరము నాయాశ్రమప్రాంతమున విడిచియుండెను.

ఇచ్చట నిట్లుండఁగా దేవశర్మ యజ్ఞార్థ మెటకో దూరగ్రామమున కేగె ననియు రుచి యొక్కతెయే యాశ్రమమునఁ గల దనియు విని యింద్రుఁడు చక్కగ నలంకరించుకొని యాశాబద్ధుఁడై దేవశర్మ యాశ్రమమునకు విచ్చేసెను. ఆశ్రమప్రాంగణమున విపులునిబొంది నాతఁడు కాంచెను. లోన పీనశ్రోణిపయోధర, పద్మదళ విశాలాక్షి, పూర్ణచంద్రవదన, రుచిరాపాంగ యగురుచి యాతనికంటఁబడెను. అతఁడు కామవశుఁడై యామెను సమీపించెను. మహాపతివ్రత యైనను రుచి యాతని అతి సుందరరూపమును గాంచఁగనే యాతని కెదురై “నీ వెవఁడవు? ఏల వచ్చితి?” వని యడిగెను. ఆమె నావేశించి యున్న విపులునిసంగతి యెఱుఁగక, ఇంద్రుఁ డామెతో “సుందరీ! నీ పొందుఁ గోరి చిరకాలమునుండి దిన మొకయుగముగాఁ గడపుచుంటిని. నీ పతి యున్నపుడు వచ్చిన నాగతి యేమగునో నే నెఱిఁగి యాతఁడు లేని యీ యవకాశమును బురస్కరించుకొని వచ్చితిని. ఒక్కనిమిషమైన నిఁకఁ దాళఁజాలను. నీబిగికౌఁగి లొసఁగి, అధరసుధ నందిచ్చి, కామకేళిఁ దేల్పు” మని ప్రార్థించెను. రుచి దేహము కామవశమై యింద్రుని పొందు గోరుట నెఱిఁగిన విపులుఁడు యోగబలమున దాని నతికట్టి యామెకు సర్వాంగబంధన మొనరించెను. దానితో నామె కదల లేదు. మెదల లేదు. పలుక లేదు. కులుక లేదు. ఇంద్రుఁడు కామత్వర హెచ్చి యామె కెన్నియో సంజ్ఞలు చేయుచుండెను. కాని యవి నిష్ప్రయోజనము లయ్యెను. నిశ్చేష్టయై యున్న రుచిని గాంచి యింద్రుఁడు సిగ్గుపడెను. కాని, యాతఁ డామెప్రేమ కొల్లగొన మరల

మరలఁ బలుకరించెను. తుద కామె నోటినుండి "నీ వేలవచ్చితివి? పొ"మ్మను శబ్దము పురుషకంఠమునుండి వచ్చినట్లు తోఁచుచు వినఁబడెను. అది విని యింద్రుఁ డనుమానపడి యిది యే మని దివ్యదృష్టిని జూచెను. అపు డాతనికి సర్వము గోచరించెను. కాని యింద్రునకు గురుసమశక్తి సంపన్నుఁ డగువిపులుఁడు తన్ను శపించునేమో యని చాల భయము కలిగెను. అందుచే నాతఁడు కాముకతఁ గట్టిపెట్టి నిశ్చేష్టుఁడై నిలిచెను. విపులుఁడు గురుపత్నిశరీరమును విడిచి తనశరీరమును బ్రవేశించి లేచి వచ్చి భయభ్రాంతుఁడై నయింద్రుని "ఓరీ! దేవసామ్రాజ్య మేలువాఁడ వయ్యు నింత యింద్రియ చాపల్యముఁ గాంచితివి. రక్తమాంసాస్థి కల్పిత మగు దుర్గంధభూయిష్ఠశరీరముపై నింత కామలాలసతయా? దుర్మార్గా! ఇట్టియకృత్యమునకేగదా గౌతమమహర్షి శాపమును గాంచి తేజోహీనుఁడవైతివి? నీ కింక నేల బుద్ధి రాలేదో. నీపై దయదలఁచి విడుచుచున్నాను. శీఘ్రమే వచ్చినదారిని బొమ్ము. లేదా క్షణములో నిన్ను భస్మము చేయఁగలను. ఇట్టి నీచపుఁబను లికఁ గట్టిపెట్టుము. బుద్ధి తెచ్చుకొని బ్రదికెద నని యొట్టుపెట్టుకొనుము. పతివ్రతలను, మహర్షులను సేవించి శుభములు పొందుము. ఋషిపత్నులపొందు గోరి వంశవినాశముఁ గొనితెచ్చుకొనకుము" అని పెక్కుగతులఁ జీవాట్లు పెట్టెను. ఇంద్రుఁడు హీనతేజుఁడై సిగ్గుపడిపోయి వెంటనే యంతర్ధాన మయ్యెను. భ్రష్ట కావలసినరుచి ఘోరప్రమాదమునుండి తప్పి తన్నుఁ దప్పించినవిపులు నెంతయు శ్లాఘించెను. గుర్వాజ్ఞఁ బాటింపఁగలిగితి నని విపులుఁ డపరిమితానంద మందెను. ఇది జరిగిన రెండుగడియలకే దేవశర్మ పని ముగించుకొని యాశ్రమమునకు వచ్చి చేరెను.

గురువునకు జరిగిన సంగతి యంతయుఁ జెప్పి శిష్యుఁ డగు విపులుఁడు గురుపత్నిని దిరిగి గురువున కొప్పగించెను. దేవశర్మ శిష్యుని మహత్త్వమునకు మిక్కిలి సంతసించి యాతనిగురుభక్తిని స్థిరధర్మమును మెచ్చి మేలుమే లని హెచ్చరించి "వత్సా! నీ వేదే నొకవరమును గోరుకొమ్ము. ఇచ్చెద" నని పలికెను. "దేవా! నిరంతరధర్మబుద్ధియు దైవచింతనము నాకనుగ్రహింపు"మని విపులుఁడు ప్రార్థింప దేవశర్మ యట్లే యని యాతనిని వీడుకొల్పి తనయాశ్రమమునఁ దానును భార్య యగు రుచియు యథాపూర్వము తపోవ్రతదీక్షలఁ గాలము గడపుచుండెను.

విపులుఁడు గురుననుమతిఁ గొని వెడలి వేఱొకచో నొకయాశ్రమమును నిర్మించుకొని యందు నిరంతరతపో నియమధనుఁడై నిర్విచారముగ నివసించు చుండెను. అతఁడు తపశ్శక్తికతమున భూలోకమునుండి స్వర్గలోకమునకు స్వర్గమునుండి భూలోకమునకు రాకపోకలు నిరాతంకముగ నొనరించుచుండెను.

## విపులుఁడు గురుపత్నికి దివ్యసుమములు తెచ్చియిచ్చుట

ఇట్లుండ దేవశర్మసతి యగురుచి ప్రభావతి యను తనయక్క యింటి కొకదినమునఁ బోవుచుండఁగా దారిలో నొకయప్సరస విడిచిన మనోహరకుసుమములఁ గొన్నిటిఁ జూచి వానిని దీసికొని తలలోఁ బెట్టుకొనెను. పిదప నామె ప్రయాణము సాగించి ప్రభావతియింటికిఁబోయెను. ప్రభావతి యంగదేశపురాజగుచిత్రరథుని భార్య. ఆమె యాప్యాయముగా నింటికి వచ్చినచెల్లెలిని రుచిని గౌఁగిలించుకొని యామెకొప్పులోఁ గలమనోహర కుసుమములఁ జూచి "చెల్లీ! నీ కీపూవు లెక్కడివే? చాల బాగున్నవి. నా కెట్లైన నిట్టివి కొన్ని తెప్పించిపెట్టవే!" అని మిక్కిలి మక్కువతోఁ గోరుకొనెను. రుచి యది యెంతపని యట్లే తెప్పించెదనని యక్కతోఁ జెప్పి జరిగినసంగతి పతి యగుదేవశర్మకుఁ జెప్పి యట్టి పుష్పములను దెప్పింపుఁ డని ప్రార్థించెను. దేవశర్మ శిష్యుఁ డగు విపులుని బిలిపించి తనయొక్కయు, తనయాలియొక్కయు, ప్రభావతియొక్కయుకోరికనెఱిఁగించి యెట్లైన వారికోరిక దీరుపు మని కోరెను. విపులుఁడు సరే యని యవి తొలుత రుచికి లభించినచోటికే పోయి యటఁ దన తపశ్శక్తివలన మఱికొన్ని పడియుండుట చూచి వానిని దీసికొని వచ్చుచుండఁగా నొకనిర్జనవనమున నొకరిచేయి యొకరు పట్టుకొని చక్రాకారముగాఁ దిరుగుచున్న యిద్దరు పురుషులను జూచెను. వారి కంతలో నేలొకోయేదో కలహము కలిగెను. వెంటనే వా రుభయులు నొట్టుపెట్టుకొనుచు "మనలో నసత్యమాడినవానికి విపులునకుఁ బట్టు దుర్గతి పట్టుఁగాక" యనుకొన విపులుఁ డామాట లాలించెను. తనమాట యంతనీచముగా వారు చెప్పుకొనుట కాశ్చర్యవిషాదము లందుచు నాతఁడు ముందునకుఁ బోవ నాలుగురువ్యక్తులు పాచికలాడుకొనుచుఁ

గానవచ్చిరి. వారును వివాద మేదో కలుగఁగా నొకఁ డొకఁడే తానసత్యద్యూత మాడినచోఁ దనకు విపులునికిఁ గలిగినదుర్గతి పట్టుఁగాక యనిశపథముపలుకుట నాతఁడు విని నిలువున నీరయిపోయెను. అతఁ డెటులో ఆ పూవులతో నింటికేగి గురునకు వాని నర్పించి నమస్కరించెను.

## గురు కటాక్షము

దేవశర్మ యాపూలను రుచి కిచ్చి విపులుని బిలిచి "ఓయీ! ఆ వనమున నీవు కన్నచిత్రము లేమో చెప్పు" మని యడిగెను. విపులుఁడు తాను గన్నవ్యక్తులనుగూర్చి వారన్నపలుకులఁగూర్చి విన్నవించి "అయ్యా! వా రెవరు? వా రట్లనుటకుఁ గారణ మేమి?" అని ప్రశ్నించెను. అంత గురుఁడు శిష్యునితో "ఓయీ! నీకు మొదటఁ గానఁబడ్డజంట అహోరాత్రములు. చక్రాకారమున నవి తిరుగుచు నీదుష్కృతమును నీ కెఱింగించెను. మఱి పాచికలాడు షట్కము ఋతువులు. అవి నీదోషము నెఱుఁగఁజాలినవి. ఇట్లహోరాత్రములు ఋతువులు మానవుఁ డొనర్చుపుణ్యపాపముల నరయుచునే యుండును. మూర్ఖుఁ డగునరుఁడు రహస్యముగాఁ బాపము లొనరించుచుఁ దన్నెవ్వఁడును జూడ లేదనుకొని మోసపోవును. పురుషుఁడు నిత్యము నొనర్చు పుణ్యపాపకర్మములను అహోరాత్రములు ఋతువులు నెఱిఁగి యాతని కాపుణ్యపాపములఁ దెలుపుచునే యుండును. నీవు గురుపత్ని నావేశించిన దోషము నవి యెఱిఁగి యా దోషమును నీముందుఁ బ్రదర్శించినవి. నీవు రుచిని దుర్వృత్తినుండి కాపాడితివి. దురుద్దేశముతో నీ వామెలోఁ బ్రవేశించి యావేశింపలేదు. కాన సమస్త మెఱిఁగిననేను నీ కావిషయమున దోషము లే దని యూరకుంటిని. కాని, యది దోషమే. ఆ దోషము కతముననే నీ కాయనుభవము కలిగినది. నీ కాదోష మెల్ల పోవునట్లు నేను వరమిచ్చెదను. నీ వికఁ మహోత్తముఁడవై తపస్సిద్ధి గాంచి తరించెదవు గాక!" అని యాశీర్వదించెను.

ఈ విధముగా విపులుఁ డజ్ఞానమున నొనరించిన దోషము నశింప నాశ్రమమున కేగి పెక్కువిధముల తపమొనరించి జ్ఞానసంపన్నుఁడై మోక్షము నందెను.

# మహర్షుల చరిత్రలు

## సాందీపనిమహర్షి

### జననము : బాల్యము

అవంతిపురము తొల్లి యఖిల సౌభాగ్యములకు నిలయమై యుండెను. అందులకుఁ గారణ మందు వేదజ్ఞులు, శాస్త్రజ్ఞులు, పురాణజ్ఞులు నగు బ్రాహ్మణోత్తములు నిరంతర తపోవ్రత పరాయణులు, సంతత స్వాధ్యాయప్రవచన దీక్షాదక్షులు నయి యుండుటయే. వారిలో సందీపనుఁ డను నొక మహర్షి జ్ఞానతేజమున బ్రహ్మవర్చసమున మిక్కిలి ప్రకాశించుచు సార్థకనామధేయుఁడై యుండెను. ఆ మహనీయుఁడు బ్రహ్మచర్యాశ్రమమును గురుకులవాసమునఁ గడపి వేదాది విద్యల నభ్యసించి తపోయోగముల నాఱితేరి గృహస్థాశ్రమమును స్వీకరించి యాదర్శబ్రాహ్మణుఁడై యలరారుచుండెను.

కాలక్రమమున సందీపనముని దయవలన నాతనిపత్ని గర్భము ధరించి నవమాసములు నిండినపిదప నొక శుభముహూర్తమున నొక పుత్రరత్నమును గాంచెను. సందీపనముని సంతోషమున నాతనికి జాతకర్మాదికమును నడపెను. ఆ బాలుఁడు సాందీపని (సందీపనుని కొడుకు) యని పిలువఁబడుచుండెను. సాందీపని బాల్యమును గడపి యుపనీతుఁడై సమస్త వేదశాస్త్రములను సాంగోపాంగముగా నభ్యసించెను. పిదప నాతఁడు సమస్తవేదరహస్యములను దెలిసికొని సత్యవాది, దయాశాలి, ప్రియదర్శనుఁడు, సాత్త్వికుఁడు, విష్ణుపూజారతుఁడు, వివేకధనుఁడునై వెలుఁగొందెను. విద్యాదేవితోపా టాతనిని దపోలక్ష్మి కూడ వరించెను. సాందీపని తపశ్శక్తికతమునఁ దండ్రికి దీటయిన తనయుఁ డనుఖ్యాతి నార్జించెను.

## వివాహము: సంతానము

కొంతకాల మైనపిదప సాందీపని బ్రహ్మచర్యాశ్రమమును విడిచిపెట్టి గృహస్థధర్మమును స్వీకరించెను. సద్గృహస్థుఁడై యీరాజిల్లు నామహనీయుఁడు ధర్మపత్ని యం దొక సుపుత్రునిం గాంచెను. అబాలుఁడు బాల్యమునుండియు విష్ణుభక్తుఁడు, విరాగసంపన్నుఁడు, విజ్ఞానరాశి, వివేకనిలయుఁడు నై వెలసెను. ముక్కుపచ్చ లారకముందే యాతఁ డేకసంథాగ్రాహియై తండ్రికడ సర్వవిద్యల నభ్యసించెను. విద్యకు తోడు వివేకము, వివేకమునుగూడి వినయము, వినయమును మించి విజ్ఞత, వీని నన్నింటిని మించినయాత్మా నాత్మవివేకము నాతని కలవడెను. ఆతనికి బాల్యముననే కలిగినయనుపమాన వైరాగ్యసంపద వలన జీవితము క్షణిక మనియు నందు సాధింపవలసిన దనంతమనియు సంసారబంధమునుండి చావుపుట్టుకల చక్రమునుండి తప్పించుకొను సత్వరయత్నమున నిమగ్నుఁడుకాని మానవుని జన్మ మెంతయు వ్యర్థమనియు నాతఁడు విశ్వసించెను. గతానుగతికముగాఁ దాను వివాహమాడి బిడ్డలఁ గని బంధములఁ బెంచుకొని త్రెంచుకొనుట కాతని మన స్సంగీకరింప దయ్యెను. దానికితో డాతనిమనస్సు విష్ణుకథాసుధారసమును వినుచు లేక త్రావుచు సర్వం విష్ణుమయం జగత్తను భావము వెల్లివిరియ నాతఁడు భక్తపుంగవుఁడై విష్ణుకథాలాపములఁ గాలము వెళ్ళఁబుచ్చఁజొచ్చెను.

## పుత్రమరణము

సాందీపనిపుత్రుఁడు బహుపురాణముల నవలోకించి యందలి సారము నాకళించినదిట్ట. ప్రభాసతీర్థ మహత్త్వమాతని కొంటఁబట్టెను. మాఘమాసమునఁ బూర్ణిమా దినమునఁ బ్రాతఃకాలమునఁ బ్రభాసతీర్థమున మునిఁగి దేహమును వీడఁగల్గు మహనీయుఁ డిహలోక బంధములఁ ద్రెంచుకొని సారహీన మగుసంసార కాంతారమున దారితప్పి చరించుదురవస్థఁ బడక తరించు నని యాతఁ డెన్నియో పర్యాయములు చదివి విని తన కట్టి యదృష్ట మబ్బునా యని యాతఁ డనుకొనుచుండెను. ఇట్లుండ నొకనాఁ డాతఁడు తోడిబాలురతో స్నానార్థము

ప్రభాస తీర్థమున కరిగెను. నాడు మాఘపూర్ణిమ. అందు దిగి యాతఁడు స్నాన మొనరించుచు నీపుణ్యకాలము నీఁక దాఁటఁ బెట్టరా దనుకొని "ఓవనజాక్ష! కృష్ణ! అచ్యుతా! నిన్ను స్మరించుచు నీపుణ్య దివసమున నిందు మునిఁగి బొంది వీడెదను. నన్ను నీలోఁ గలుపు కొమ్ము. ఈ జన్మ జరామరణ చక్రమునుండి నన్నుఁ దప్పింపుము. భవవార్థిని బడిపోకుండ రక్షింపుము. నీ పాదపద్మములకడ నాకుఁ గొంచెము స్థానముఁ గల్పించి నన్నటఁ బడియుండ ని" మ్మనిభక్తి ప్రపత్తితో నా బాలుఁడందు మునిఁగిపోయెను. స్నానార్థ మందు దిగిన విప్రబాలు రందఱును బైకి వచ్చిరి. కాని సాందీపనిపుత్త్రునిజాడ కానరా దయ్యెను. అతఁడు తన నిర్ణయము నెవ్వ డెవరికిని జెప్పి యుండని కారణమున నప్పని జరిగియుండు నని యెవ్వరు నెఱుఁగఁజాల కుండిరి. తోడిబాలురు చాలసే.పట వేచి వేచి వెదకి వెదకి వేసారి వేసారి తుద కింటి కేగి సాందీపని కా వృత్తాంత మెఱింగించిరి.

సాందీపని తనకొడుకు దివ్యమృతి నందె ననియు నాతఁడు విష్ణు రక్షితుఁడై వెలయుచుండు ననియు విశ్వసించి జన్మమృత్యువులసార మెఱిఁగిన మహనీయుఁ డగుట పుత్త్రవియోగదుఃఖమున బెంబేలుపడక ధైర్య మవలంబించి వైరాగ్యము నూతగాఁ గొని జ్ఞానము నాశ్రయించి చెక్కుచెదరక తన కేమియు జరుగనట్లు చిత్తశాంతియుతుఁడై చెలు వొందెను. కాని, యాతనిపత్ని స్త్రీసహజ మగు నేకైకపుత్త్రప్రేమను విడువఁజాలక యాతనికై విలపింపఁజొచ్చెను. సాందీపని యామెకు ధైర్యము చెప్పి చావుబ్రదుకుల మర్మములఁ జాటి జీవితముల యస్థిర త్వము నెఱింగించి యుత్తమమ్మృతుల నుదాహరించి తమ పుత్త్రుఁడు విష్ణుభక్తుఁ డగుట విష్ణుసంరక్షితుఁడై శాశ్వతసౌఖ్యము నందియుండు నని వినిపించెను. ఆమె యప్పటికి దుఃఖము వీడి భర్త తెలిపినగతిని బ్రహ్మానుసంధానమున సుఖముగా నుండెను.

## బలరామకృష్ణులకు గురుత్వము

బలరామకృష్ణులు కంసవధానంతరము తమ తలిదండ్రు లగు దేవకీవసుదేవులను విడుదల చేయించిరి. పిదప దేవకీవసుదేవులు గర్గాది

భూసురోత్తములచేఁ దమపుత్త్రుల కుపనయనమహోత్సవముఁ జేయించిరి. వసుదేవుఁడు బ్రాహ్మణులకు సదక్షిణముగా ననేక గోహిరణ్యదానము లొనరించి తొల్లి రామకృష్ణులజన్మసమయమందుఁ దన మనమున నర్పించిన గోవుల నుచ్చరించి యిచ్చవచ్చిన విప్రుల కెల్ల యిచ్చవచ్చినన్ని కామితముల నొసంగెను. అనంతరము వసుదేవుఁడు రామకృష్ణులకు గురువు నన్వేషింపఁ దొడఁగెను. గర్గాదిపురోహితులు కాశీప్రాంతమునఁగల యవంతిపురవాసి సాందీపనిమహర్షి యందులకుఁ దగినవాఁడని సూచించిరి. సర్వజ్ఞులు, జగద్గురువులు, సంపూర్ణులు నయ్యు రామకృష్ణులు గురుశుశ్రూషాలభ్య మగువిద్యయే విద్య యని లోకమునకుఁ జాటు నిమిత్తము గురువును జేరి చదువుకొన నంగీకరించిరి.

బలరామకృష్ణులు ప్రముదాంతఃకరణులై బ్రహ్మచారులై విద్యార్థనకై చని మహాపైభవరాశియైన కాశినిజేరి తత్తీరమునఁ గల యవంతిపురమున సకల విద్యావిలాసియు, సంతతభగవచ్చరణారవింద సేవామనీషియు నగు సాందీపని మహర్షిని జేరి సాష్టాంగనమస్కారము లొనరించి యా మహనీయుని శిష్యత్వ మాశించి శుద్ధభావవర్తనముల నాతని సేవింపఁదొడఁగిరి. కొన్నాళ్ల కాతఁడు వీరిసేవల కలరి సర్వజగన్నియంతలు తనకడ సాష్టాంగపడుట కచ్చెరువంది సంతుష్టాంతరంగుఁడై వారలకు విద్యలెల్ల బోధింపఁ దొడఁగెను.

"వేదశ్రేణియు నంగకంబులు ధనుర్వేదంబుఁ దంత్రంబు మ
న్వాదివ్యాహృత ధర్మశాస్త్రములు నుద్యన్న్యాయముందర్కవి
ద్యాదక్షత్వము రాజనీతియును శుద్ధప్రక్రియం జెప్పె నా
భూదేవాగ్రణి రామకృష్ణులకు సంభూత ప్రమోదంబునన్."

బలరామకృష్ణులు నొక్కనాఁ డొకొక్కవిద్య ఒకసారి విన్నంతనే నేర్చి యందుఁ బరిపూర్ణ పాండిత్యము సంపాదింపఁగల్గిరి. చిత్ర మేమనఁగా

"గురువులకు నెల్ల గురులై
గురులఘుభావములు లేక కొమరొందు జగ

ద్గురులు త్రిలోకహితార్థము
గురుశిష్యన్యాయలీలఁ గొలిచిరి వేడ్కన్."

భాగ. ౧౦ స్కం, పూ. భా. ౧౪౧౫

ఆహా! ఏమి యదృష్టము! త్రిమూర్తులను బరీక్షించుశక్తి భృగు మహర్షికిఁ గలిగినది. త్రిమూర్తులను బంటిబిడ్డలఁ జేయుశక్తి అన సూయా సాధ్వికిఁ గలిగినది. శ్రీరామునికి గురువగు నదృష్టము వసిష్ఠునకుఁ గలిగినది. విష్ణుమూర్తిని బుత్త్రునిగాఁ గనుయోగము కశ్య పాదులకే కలిగినది. పదునాలుగుభువనములకుఁ గుదురులగు బలరామ కృష్ణులకుఁ బాఠము చెప్పు నదృష్టము వేలాది విప్రులలో నొక్క సాందీప నికే గలిగినది. అదృష్టశ్రుత పూర్వమగు మహాయోగముఁ గన్న సాందీపని భాగ్య మెంతటిదో!

## గురుదక్షిణ

అచిరకాలముననే యన్నివిద్యలు నేర్చినబలరామ కృష్ణులను బిలిచి సాందీపని తా నింక నేర్పఁగలిగినవిద్య యేదియు లేదని పలికెను. బలరామకృష్ణులు గురువునకు గురుపత్నికి నమస్కరించి తమ్ముఁ గన్న బిడ్డలవలెఁ గాంచి విద్యాబుద్ధులు గఱపినందులకుఁ గృతజ్ఞత తెలిపి యేదేని గురుదక్షిణఁ గోరుకొమ్మని యర్థించిరి. సాందీపని సంతోష ముతోఁ దనసతివంకఁ జూచెను. ఆమె ప్రభాసతీర్థమున మరణించిన తన పుత్త్రుఁడు పునర్జీవితుఁడు కావలయు నను కాంక్షతక్క అన్యకాంక్ష తన కేమియు లేదని నుడివెను. బలరామకృష్ణులు సాందీపనిని మఱి మఱి యర్థింపఁగా నాతఁడు "వత్సలారా! మీరు జగదతీతప్రజ్ఞావం తులు. మీకు సాధ్యము కానిపనియే యుండదు. మాయేకైక పుత్రుఁడు మున్నుఁ బ్రభాసతీర్థమున మునిఁగి చనిపోయెను. నే నెన్ని చెప్పినను నాపతి పుత్రమరణఖిన్నయై వాపోవుచునే యున్నది. మీకు గురు దక్షిణ యీవలయునను గట్టిసంకల్ప మున్నయెడల మృతపుత్త్రుని దీసి కొనివచ్చి మాకిండు. అంతకుమించి మాకు దేనియందును వాంఛ లేదు" అని పలికెను. ఆ మాట లాలించి బలరామకృష్ణులు గురు

పుత్త్రిమరణవిధమును సవిస్తరముగాఁ దెలిసికొని మృతపుత్త్రిని దెచ్చి సమర్పించి గురుదక్షిణగా నొసఁగుదు మని చెప్పి బయలుదేఱి వెడలిరి. సాందీపని దంపతులకుఁ గలిగిన యానంద మింతింతన రాకుండెను.

బలరామకృష్ణులు రథారూఢులై బయలుదేఱిపోయి సముద్రము కడ కేగి "ఓ సముద్రరాజా! నీవు మాగురుపుత్త్రిని దీసికొనివచ్చి మా కొప్పగింపనియెడల నీ పని పట్టెదము. జాగ్రత్త" యని హెచ్చరించిరి. పరమభీతుఁడై సముద్రుఁడు వారిపాలి కేతెంచి "మహాత్ములారా! ఇందు నాదోష మేమియు లేదు. మీగురు పుత్త్రుఁడు ప్రభాస తీర్థమున మరణోద్యుక్తుఁడై దిగినంతనే యొక పెద్దయల యాతనిని లోనికి లాగుకొనిపోయెను. ప్రభాసతీర్థమధ్యమునఁ గల పంచజనుఁ డనురాక్షసుఁ డా బాలుని మ్రింగి నాలో వచ్చి దాఁగికొనియున్నాఁ" డని నివేదించెను. అపుడు కృష్ణుఁడు బలరాముని గట్టునఁ నుంచి తాను శంఖనాదము చేసి యా సముద్రమధ్యముం జొచ్చిపోయి యందు దాఁగియున్న పంచజనరాక్షసునిఁబట్టి వానిపొట్ట చీల్చి యందు గురుపుత్త్రిఁ గానక యొక దివ్యశంఖమున్నఁ గైకొని సముద్రము వెలికి వచ్చి యన్నయగు బలరాముని గూడి రథమెక్కి పోయి సంయమని అనుపేరు గల యముని పట్టమును జేరి ప్రళయకాల మేఘ గంభీరనినద భీషణ మగుశంఖము పూరించిన సకలలోక భయప్రదుఁ డైన యముఁడే భయపడిపోయి బయటికివచ్చి బలరామకృష్ణులను జూచి వారు లీలా మనుష్యులయినవిష్ణుమూర్తులని యెఱింగి భక్తితో సేవించి సర్వభూత మయుఁడగు కృష్ణునకు నమస్కరించి వచ్చినపని యడిగెను. శ్రీకృష్ణుఁ డాతనికి విషయ మంతయుఁ జెప్పఁగా విని యముఁడు శ్రద్ధాభయభక్తి యుక్తుఁడై సాందీపనిపుత్త్రి రత్నమును గొనితెచ్చి యిచ్చి సాష్టాంగ మెఱఁగెను. బలరామకృష్ణు లాతని మెచ్చలిగాఁ గైకొని గురుపుత్త్రిని రథ మెక్కించి తీసికొని వచ్చి గురుదంపతుల కొసంగ వారు —

"కాలుని వీటికిఁ జని మృత
బాలకుఁ దే నొరులవశమె? భవదీయకృపన్

మేలు దొరఁకొనియె మాకు వి
శాల మగుంగాక మీయశము లోకములన్"

అని సంస్తుతించి హృదయపూర్వక మగు ఆశీర్వచన పరంపరతో వారిని వీడ్కొలిపిరి. బలరామకృష్ణులు కృతార్థులై మధురాపురి కేగిరి.

సాందీపనిపుత్త్రుఁడు తాను స్వచ్ఛందముగనే చనిపోయితి ననియుఁ దనబ్రహ్మచర్యాదిఫలముగను వంశాను గతమహాపుణ్యము కతమునను దనకు యమలోకమున దివ్యగౌరవమే జరిగె ననియు నందలివిశేషములను దలిదండ్రులకు తెలిఁగించి వారి నానందాంబుధి నోలల నాడించెను. సాందీపని చిరకాలము ధర్మాత్ముండై గృహస్థాశ్రమము నిర్వర్తించి బహుశిష్యులకు విద్యాదాన మొనరించి తుదకు సన్న్యస్తచిత్తుఁడై సర్వేశ్వరపాద కమలములఁ జిత్తముఁ జేర్చి శ్రీకృష్ణకటాక్షమున మహాయోగులైన నందఁజాలనికైవల్య మంది చరితార్థుఁ డయ్యెను. *

---

* పద్మపురాణము, భాగవతము, హరివంశము.

# మహర్షుల చరిత్రలు

## సారస్వతమహర్షి

### జననము

దధీచిమహర్షి మహోగ్రతపస్సు చేసిన మహనీయుఁడగుటచే బ్రహ్మతేజ మాతని నావహించెను. అతఁడొక దివ్యతేజోగోళమువలెఁ బ్రకాశించుచు నద్వితీయ సౌందర్యస్వరూపి యయ్యెను. సరస్వతీ నదీతీరమున నాతఁడుండి సరస్వతీనదిలోనికి స్నానపానములకు రాక పోక లొనరించునపుడు చూచినసరస్వతి యాతనిని మోహించియుండెను.

దధీచి ధీశాలిత్వము, మహాతపస్సు, బ్రహ్మవాదిత్వము, జితేంద్రియత యింద్రునికిఁ గన్నెఱ్ఱ కలిగించెను. అతఁ డీతని నెట్లైన స్వాధీన పఱచుకొనఁ దలఁచి యివి యిచ్చెద, నవి యిచ్చెద నని యాతని నాశ పెట్టఁ జూచెను. కాని నిష్కామియు, నిరుపమ నిష్ఠాగరిష్ఠుఁడు నగు నాతఁడు వాని నన్నిటిని దృణీకరించెను. వేఱుపాయములేక యింద్రుఁ డలంబుస యనునప్సరసను బిలిచి "తరుణీ! ఆ దధీచిని నీవెట్లైన నొడఁ బఱచుకొని యాతని తపస్తేజమును హరింపవలయును. ఇం కొండు పాయము లేదు. నీకు నే నెల్లపుడుఁ గృతజ్ఞుఁడనై యుండు" నని బతిమాలుకొనెను. ఆమె యింద్రునికోరిక తీరుపఁ దలఁచి సర్వాంగ సుందరియై సరస్వతీ నదీతీరమునకు వచ్చి చేరెను.

దధీచి సరస్వతీనదియందు స్నానము చేయఁబోవుచున్న సమయమందు జగదేకసుందరి యగు నప్సరస యాతనిని సమీపించి మార వికారములను జూపెను. దివ్యసుందరవిగ్రహ యగు నామెనుఁ గాంచి నంతనే భావితాత్ముఁడగు నా మహర్షికి రేతఃపతనము కాకుండెను. అతఁ డామెపంకఁ జూడమాని నదిలో దిగినంతనే యాతని రేత మా నదీజలములఁ బడెను. సరస్వతీనది వెంటనే స్త్రీరూపమును ధరించి యా రేతమును గైకొని గర్భవతియై కాలక్రమమున నొకపుత్త్రునిగాంచెను. అతఁడే సారస్వతుఁడు.

## పితృదర్శనము

కొంతకాలమైన పిదప దధీచిమహర్షి నక్షత్రమధ్యమందలి చంద్రుని వలె ఋషులమధ్యఁ గొలువుదీరియున్న సమయమున సరస్వతీనదీదేవి తనయల్లారు ముద్దుబిడ్డ నెత్తుకొని దివ్యముగఁ దేజరిల్లుచు నటకు విచ్చేసెను. అపుడు సర్వమునిజననేత్రములు నాతల్లిబిడ్డలపైఁ బ్రస రించెను. దధీచి యంతధైర్యముగాఁ దనయాశ్రమమును బ్రవేశించి ఋషిమధ్యమున కట్లు నిర్భయముగాఁ జొచ్చునామె యెవ్వరని దివ్య దృష్టిని జూడఁగానే యామహనీయుని కంతయుఁ దెలిసెను. సరస్వతీనది దధీచిని సమీపించి నమస్కరించి "ఓ బ్రహ్మర్షీంద్రా! ఈ బాలచంద్రుఁడు నీపుత్రుఁడు. నీయందుఁ గలభక్తి శ్రద్ధలచే నీవుమున్ను అలంబుస యను నప్సరసను గాంచినంతనే నాజలములలో విడిచిన వీర్యమును బరిగ్రహించితిని. త్రిలోక సన్నుతుఁడవగు నీతేజము వ్యర్థము కారా దని నే నాఁడుదాననై దానిని గ్రహించి గర్భవతినై యీ పుత్త్రునిగాంచి నీ కొప్పగింపఁ దీసికొనివచ్చితిని. ఈతఁ డనిందితుఁడు. ఈ పుత్త్రరత్న మును స్వీకరించి న న్ననుగ్రహింపు" మని పలికెను.

దధీచి సంతోషముతో లేచి సరస్వతీనదిమతల్లికి మ్రొక్కి "మహా భాగా! నీవు తొల్లి బ్రహ్మసరోవరమున నుద్భవ మందితివి. సంశ్రిత వ్రతు లగుమునులు నీతత్త్వమెఱింగి ని న్నారాధింతురు. ప్రియదర్శన వగునీవు నా కతిప్రియ మొనరించితివి. నీకుఁ గృతజ్ఞుఁడను. ఈ నీ పుత్త్రుఁడు నీ పేరనే సారస్వతుఁ డని ప్రఖ్యాతి నందును. ఈతఁడు త్రిలోకారాధ్యుఁ డగుదివ్యమునియై లోకసంరక్షణ మొనరించి శుభ ప్రదుఁడు కాఁగలఁడు. నీవు నాకొనరించినయుపకారమునకుఁ బ్రత్యుప కారముగా నీకుఁ గొన్నివరము లనుగ్రహించెదను, స్వీకరింపుము. నీజలములలో స్నాన మొనరించి శుచియై నీ జలములచేఁ దర్పణమొన రించినవారికి విశ్వేదేవతలు, పితృదేవతలు, గంధర్వులు, అప్సరసలు మిక్కిలితృప్తినొంది సకలశుభములు సమకూర్తురుగాక! నీవు పావన లగు నదులలో కెల్ల పావనవై వందనార్హ వగుదువుగాక!" అని పలికి సారస్వతుని గైకొని మూర్ధాఘ్రాణ మొనరించి పరిగ్రహించి సరస్వతీ

నదీమతల్లి కొసంగుచు "నీవే యీతనిని బెంచి పెద్దవాని నొనరింపుము. నేనును వచ్చి చూచుచుందు" నని యామె కొప్పగించెను. సరస్వతి యా బాలుని స్వీకరించి దధీచి వీడ్కొలుప వెడలిపోయెను.

## దధీచిదివ్యార్పణము

అపుడు దేవదానవులకుఁ దీవ్రవిరోధము సంభవించెను. ఇంద్రుఁడరిబలము నవలీలగా జయించునొకదివ్యాయుధమునకై యెల్లెడలఁ బరిభ్రమించి యెందును గనలేఁ డయ్యెను. ఇంద్రుఁడు దేవతలతోఁ గూడి బ్రహ్మపనుపున దధీచిమహర్షిని జేరి త్రిలోకవిజయవంతము లగు నాయుధములకై యాతని యెముక లర్థించెను. దేవకార్యసిద్ధికన్నఁ దనదేహధారణఫల మింకొకటి లే దని యెంచిన దధీచి తనశరీరమును యోగాగ్నిచే విడిచివేసెను. దేవత లాతని యెముకలు కొనిపోయి త్వష్ట కీయ నాతఁడు వానిని శుభ్రపఱచి వానినుండి వజ్రాయుధము, చక్రములు, గదలు, దండములు మున్నగువానిని సిద్ధము చేసెను. వాని నుపయోగించి దేవతలు రాక్షసుల నవలీలగా నుఱుమాడఁదొడఁగిరి. మంత్రయుక్తమును బ్రహ్మతేజోద్భవమును నగువజ్రాయుధముచే నింద్రుఁడు తొంబదితొమ్మండుగురు దైత్యనాయకులను జంపివేయఁగలిగెను. పరమర్షియు, ప్రజాపతిపుత్రుఁ డగుభృగుమహర్షి మహాతపస్సు చేసి కన్నపుత్త్రుఁడును, లోకపావనుఁడును, అతికాయుఁడు, తేజస్వి, సకలలోకసారభూతుఁడు నయి వెలుఁగొందిన దధీచి మహాబలిష్ఠుఁడు, పర్వతోపముఁడు, విస్మయకరతేజోనిధి, మహాదీర్ఘవిగ్రహుఁడు. అట్టివాని యెముకల కట్టి యతిలోకశక్తి యబ్బుట కాని, యాతఁడు బ్రతికి యుండఁగా నాతఁడన్న నింద్రుఁడు భయపడుట కాని యాశ్చర్యకర విషయములు కావు.

## సారస్వతుని లోకసంరక్షణము

దారుణముగ దైత్యులమారణహోమ మైనపిదప నొక్కసారిగా సర్వలోకభయంకర మగుక్షామపీడ సంభవించెను. అనావృష్టిదోషము వలన అన్నపానములకు జనములు కఱవువాచి కాందిశీకులు కాఁజొచ్చిరి.

తపస్వులకుసైత మాబాధ తగిలెను. వారు నొకకడనుండి యొకకడకు వలసపోవఁ దొడంగిరి. దావానలమువలె వ్యాపించి యీక్షామము భీత్యావహ మయ్యెను.

సారస్వతుఁడు సరస్వతీకటాక్షమున లాలనమున పెరిగి పెద్దవాఁడగుచు సరస్వతీనదీతీరమునఁ జక్కని యాశ్రమము నిర్మించుకొని యందు మహాతపోజీవనముఁ గడపుచుండెను. అనర్ఘ మగునాతనిమహాతపస్సువలన నాతని కనేకదివ్యశక్తు లలవడెను. క్షామ మెంత తీవ్రతరమైనను నాతఁడు వేదములను పఠించుచు, అతిథ్యభ్యాగత సేవ చేయుచు, దేవపితృదేవతృప్తి గావించుచుఁ బ్రాణధారణముచేసికొని యటనే యుండిపోయెను క్రమముగ నాతఁడు తపశ్శక్తిని బారించి ద్వాదశవర్ష ప్రాయ యగు క్షామదేవత నెల్లలోకములనుండి పాఱద్రోలి లోకసంరక్షణము గావించెను. సూర్యాగమనమున విరిసినచీఁకటివలె సారస్వతతపోగ్నిచేఁ గఱవుదూదిపింజలపర్వతములు క్షణములో దగ్ధమయ్యెను. అపు డెల్లలోకములును నాశ్చర్యపడి తమతమదివ్యదృష్టివలన నిట్టియలోకమహత్త్వము దధీచిపుత్త్రున కలవడె నని గ్రహించి యానందించిరి. క్షామము పైతొలఁగినదని మునులు శిష్యులఁ బిలిచి మరల వేదాధ్యయన మారంభించిరి. కాని పండ్రెండుసంవత్సరములు క్షామపీడావృతులై యిల్లనక వాకిలి యనక, ఎండనక, కొండనక, దూర మనక, భార మనక పెక్కుచోట్ల పరిభ్రమించినవా రగుటచే వారు వేదవిద్య మఱచిపోయిరి. ఆ కారణమున వారి కధ్యయనాధ్యాపనశక్తి కుంటుపడెను.

దీనికి మునులెల్లరు భీతిచెంది పరస్పరము కలిసికొనుచు, చర్చించుకొనుచు,నెల్లరు నట్టి స్థితిలోనే యున్నారని గ్రహించుకొని కింకర్తవ్యతామూఢులై వేదవిహీనతకు ఖిన్నులై డోలాందోళితమనస్కులైరి. వారిలో నొకఁడు దైవవశమున సారస్వతమహర్షియాశ్రమప్రాంతమునఁ దిరుగుచు వీనులవిందుగ వేదస్వనములు వినవచ్చుటచేఁ బెన్నిధి గన్న పేదవలె నాశ్రమమును బ్రవేశించి సారస్వతమహర్షి బోధింప వేదములు వల్లించు శిష్యులఁ జూచి యత్యాశ్చర్యానంద పరవశుఁడై పరుగుపరుగునఁ బోయి ఋషులకెల్లర కీవిషయముఁ దెలిపెను.

వారెల్ల రానందాశ్చర్యపులకితులై బారులుతీరి గుంపులు గుంపులుగా సారస్వతమహర్షి దివ్యాశ్రమమును ప్రవేశించిరి. వారికిని ఉదాత్తానుదాత్తస్వరిత మనోహరమై సర్వపాపహరణసమర్థమై పూర్వమహాయోగభాగ్యసూచకమై వేదనాదము వినవచ్చెను.

## వేదప్రసాదము

ఋషు లెల్లరు సమీపించి సారస్వతునికి మ్రొక్కి "ఓ మహనీయా! లోకోపద్రవము సంభవించినది. నీకడదక్క నెయ్యెడల శాస్త్రసమ్మత మగువేదాధ్యయనము వినరా దయ్యెను. కాన మేము మిక్కిలి క్షోభ పడి వేదరాశి భూదేవిని విడిచిపోయినదా యని బెగ్గడిలుచు నీదగ్గఱకు వచ్చితిమి. వేదరాశి మూర్తీభవించినవిధమున నున్న నిన్నుఁ జూడఁగనే మా హృదయములు కుదుటఁబడినవి. దయదలఁచి మాకును వేదోపదేశ మొనరించి వేదముల నిలిపి విప్రులఁ దనిపి లోకోద్ధరణ మొనరింపు మని ప్రార్థించిరి. అంత సారస్వతుఁడు వారి నందఱ నాదరించి "అయ్యా! మీరు మాయాశ్రమమున విడిసి మా కంతేవాసులై మాకడ నభ్యసింప వలెను. అన్యథా మీకు వేదరాశి నొసఁగుట సాధ్యము కా"దని పలికెను.

ఆ మాటలు విని మునులు "అయ్యా! నీవు బాలుఁడవు. మేము వృద్ధులము. బాలగురువుకడ వృద్ధశిష్యులు వేదాభ్యాస మొనరించుట వింతలలో నెల్ల వింత యగునేమో? పోని; మ్మది ధర్మబాహ్యము కాదు గదా" యని పలికిరి. అంత సారస్వతమహర్షి "మహాత్ములారా! గురు ముఖగ్రహణమునఁ గాని వేదవిద్య నిలువదు. అధ్యాపన ధర్మవిరుద్ధ ముగా మీరు వేదములు గ్రహింపరాదు. నేను మీ కీయరాదు. దాన, మీకును మాకును ప్రమాదము సంభవించును. అధర్మబోధనము కాని యధర్మపరిగ్రహణము కాని యుభయవినాశహేతువో, ఉభయవైరకారణమో యగును. ధర్మసంపాదనా విషయమున ఋషులు వయోభేదము కాని వార్ధకచిహ్నములు కాని విత్తబాంధవ్యములుగాని నిమిత్తములుగాఁ దెలుపలేదు" అని పలికెను.

అపుడు ఋషు లెల్లరు మహాప్రసాద మని సారస్వతమహర్షికి శిష్యులైరి. సారస్వతమహర్షి శిష్యులసంఖ్య వారితో అరువదిమూఁడువే లయ్యెను. వా రెల్ల రతి శ్రద్ధాభయభక్తులతో గురుశుశ్రూషలు చేయుచు వేదాధ్యయనము మొదలిడిరి. సారస్వతమహర్షి శక్తిసంపదచే నెల్లర కనతికాలముననే వేదరాశి బోధిత మయ్యెను. దాని మూలమున ఋషు లెల్లరు ధర్మపరిగ్రహమును గని దానివలన వైదికవిప్రత్వమును నిలుపుకొని ధన్యులైరి.

సారస్వతమహర్షి యిట్లు సర్వలోక సంరక్షణ మొనరించి శాశ్వత కీర్తిచంద్రికలను సంపాదించెను.*

---

* భారతము : అనుశాసనికపర్వము.

# మహర్షుల చరిత్రలు

## ఆస్తీకమహర్షి

### వంశచరిత్ర

శ్రీమంతమగు భారతదేశమున నొకప్పుడు జరత్కారుఁ డనునొక మహర్షి యుండెను.* అతఁడు చతుర్వేదపారంగతుఁడై చతుర్ముఖుని వలెఁ జెలువొందుచుండెను. కఠోరబ్రహ్మచర్యదీక్షలోఁ గాలము గడపుచు మహోగ్రతపస్సంపన్నుఁడైన యా మహనీయుఁడు సర్వధర్మములను సమగ్రముగ నెఱింగెను. నిలచినచోట నిలువక, ఉన్నయూర నుండక, సూర్యాస్తమయవేళకుఁ జేరిన యూరనే సూర్యోదయవేళవఱకు మాత్ర ముండుచు, నాతఁడు సమస్త క్షేత్రములను సందర్శించి సకల తీర్థము లందును స్నానజపక్రియ లొనరించుచు, నాహారము వర్జించి, వాయువునే భక్షించుచు శరీరము శుష్కించుచున్నను సరకుగొనక సంచరించుచుండెను.

ఇట్లుండ సహస్ర కిరణునివలెఁ చక్కగాఁ బ్రకాశించుచున్న జరత్కారుమహర్షి యొకనాఁ డొక కాడమాత్రమే మిగిలియున్న వీరణ మనుపేరి తృణస్తంబమును బట్టుకొని సూక్ష్మరూపులై తలక్రిందుగఁ దపముచేయు కొందఱు ఋషులను జూచెను. మఱియు ఆ ఒంటికాడను అందలి కన్నములో దూఱియున్న యొక యెలుక కొంచెము కొంచెముగాఁ గొఱికివేయుచుండెను. ఆ కాడ నా యెలుక పూర్తిగాఁ గొఱికి వేసినచో దానిని బట్టుకొని వ్రేలాడు ఋషులు దానిక్రిందిభాగమున నున్న

---

*జరత్కారుఁ డనఁగా తపముచే దేహమును కృశింపఁజేసినవాఁ డని యర్థము. కారు = (కామాది మహాప్రమాదములకు మూలమై పాపాదులకు హేతువైన) దేహమును, జరయతి = (తపము, బ్రహ్మచర్యము మున్నగువానిచే) కృశింపఁజేయువాఁడు అని యర్థము.

లోతుతెలియని పెద్దగోతిలో పడి యధోలోకముల కేగవలసి యుండును. పైఁగా, వారు నిరాహారులై చిక్కి జీర్ణించి శల్యావశిష్టులై తమ్ముఁ గాచు దిక్కు గలదా యని యెదు రెదురు చూచుచుండిరి.

ఈ స్థితిలో నున్నవారిని సమీపించి జరత్కారుమహర్షి "మహనీయులారా! మీ రెవరు? మీ రీ గోతిలో నిట్టి దారుణ ప్రమాదస్థితిలో నుండఁ గారణ మేమి? ఎలుక సగము కొఱికిన యీ తృణ స్తంబముకూడ యూడిపడిన దాని నంటియున్న మీ రంద అధఃపతన మందవలసినదే కదా! ఈ గోయియా బ్రహ్మండమైనది, దానిలోతు తెలియదు. అది పాతాళమునుగూడ దాఁటిపోవున ట్లున్నది. ఈ దీనస్థితిలో నున్నమీకు నే నొనర్పఁగల సాయ మేమైన నున్నఁ జెప్పుఁడు. సాధుసజ్జనుల సంతాపమును దీర్చి సమయమునకు సాయపడని మానవుని జన్మ మేల? కాల్పనా! అతని తపమేల? జపమేల? నాతపమునందు నాలుగవభాగము కాని మూఁడవపాలుకాని లేదా సగమైనఁ గాని యవసరమైన సంపూర్ణముగఁ గాని ధారవోసి మీప్రాణములకు నాప్రాణముల నొడ్డఁగలను. ఆలసింపక నన్నాజ్ఞాపింపుఁడు" అని కరుణాతరంగిత హృదయాంతరంగుఁడై పలికెను.

ఆ యాపత్సమయమున నమృతోపమానములుగా వినవచ్చిన యాతని పలుకులకు వా రపరిమితానంద మంది "వత్సా! నీవు బ్రహ్మచారివివలె నున్నావు. ఐనచో మాకుఁ బ్రయోజనము లేదు. నీ తపస్సు మాకు ధారవోయ నక్కఱ లేదు. మాకు నపరిమిత తపము కలదు. ఏమున్నను సత్సంతానము లేనందున నరకోన్ముఖుల మయినాము. మేమీ దీనస్థితి నుండి తపస్వివి, దయాశాలివి, మహాత్ముఁడవు నగునిన్ను గుర్తుపట్ట లే కున్నాము. మేము యాయావర వ్రతసంపన్నులము, సంతానహీనుల మగుట మేము పుణ్యలోకములనుండి జాఱిపడితిమి. ఇంకను క్రిందికిఁ బడనున్నారము. మా తపస్సు మమ్ముఁ గాపాడలేక పోయినది. అల్పభాగ్యుల మగుమాకు మందభాగ్యుఁ డగునొకఁడు మా సంతతికి తంతువుగా నున్నాఁడు. వాఁ డుండియు లేనివాఁడే యైనాఁడు. వానిపేరు జరత్కారుఁడు. వాఁడు వేదవేదాంగవేత్త.

సర్వవిజ్ఞాని, మహాతపస్వి. కాని, యాతఁ డవివాహితుఁడై యుండి మా కీ దురవస్థఁ గల్పించినాఁడు. ఆతఁడు పెండ్లాడి సత్సంతానవంతుఁ డైనచో మా బాధలు తీఱు. మా కష్టములు గట్టెక్కు. నీ కాతఁ డొకవేళ నెచటనైనఁ దటస్థపడినచో జాలిగుండెలు కలవాఁడవు కావున నాతని మనస్సు కరఁగునట్లు మా దురవస్థ నాతనికిఁ దెలిపి శీఘ్రమే వివాహ మాడి సంతానముఁ గాంచి మాకు విముక్తి గల్గింపఁ బ్రబోధింపుము. నీవు మాకుఁ జేయఁగల మే లిదియే. మఱియు మా కులమున కా యొంటితంతువే మిగిలియున్నది. మిగిలిన వన్నియుఁ గాలుఁడను ఎలుక కొఱికియే వేసినది. ఈ యేకతంతువును గూడ సగము పైఁగాఁ గొఱికివేసియే యున్నది. ఈ యేకతంతువే కేవలతపస్వి యగుజరత్కారుఁడు. దీనిని గొఱుకు నెలుకయే మహాభయంకరుఁ డగుకాలుఁడు. మహాబలుఁ డగుకాలుఁడు జరత్కారునిఁ గృశింపఁజేయుచున్నాఁడు. ఇట్లు మూలము తెగి సద్గతినుండి జాఱిపడి మతిమాలియున్నము మ్మాతని తపము కాపాడలేదు. పుణ్యకర్ములమైనను మే మీయొక్కలోపముచే నధోగతికిఁ బోఁ బోవుచున్నాము. మేము పోయినపిదప వాఁడును కాల భక్షితుఁడై నిస్సంతు వగుట మాకంటె నధికదుర్గతి నందవలసినదే. తపో యజ్ఞాదులు కాని మఱియేమి కాని సత్సంతానమునకు సాటిగావు.

"తగియెడుపుత్త్రులం బడసి ధర్మువు తప్పక తమ్ము నుత్తముల్
పొగడఁగ మన్ మహామతులు పొందుగతుల్ గడు ఘోరనిష్ఠతో
దగిలి తపంబు సేసియును దక్షిణ లిమ్ముగ నిచ్చి యజ్ఞముల్
నెగడఁగఁ జేసియుం బడయనేర రపుత్త్రకు లైనదుర్మతుల్.

భార. ఆది. ౨. ౧౩౦.

ఈ సంగతు లన్నియు నీవు తప్పక మా జరత్కారునితోఁ జెప్పుము. మఱియు నాతఁ డెట్లు చెప్పిన మామాట విని మా దుర్గతులఁ దప్పించునో యటులే యుక్తియుక్తముగఁ జెప్పఁగల సమర్థుఁడవు నీవు. చెప్పి మాకు మేలు చేయు" మని కోరుకొనిరి.

అంత జరత్కారుఁ డెంతయు దుఃఖాందోళితమనస్కుఁడై యెలుఁగు డగ్గుత్తిక వడ "మహాత్ములారా! ఆ నిర్భాగ్యుఁడను జరత్కారుఁడను నేనే.

నే నూర్ధ్వ రేతస్కుఁడనై యుత్తమగతులనంద నస్ఖలితబ్రహ్మచర్యమును బాటించుచున్నాను. మీయీ దుస్థితిని గన్న నేను మీయీ మాటలుకాదన లేను. మీ కేది హితమో నా కది యాజ్ఞాపింపుఁ” డని నమస్కరించెను. వారందుల కానందించి “వత్సా! ఈ సమాగమము దైవికము, ఉభయ తారకము. నీవు మా మాట పాటించి కేవలధర్మపరిపాలనకు, పితృ ప్రీతికి, సత్సంతానసంపాదనకు మాత్రమే వివాహమాడుము. పుత్త్రపౌత్ర వంతులు సునాయాసముగాఁ బొందుసద్గతి నెట్టి తపశ్శాలియు బొంద లేఁడు. నీవు నిష్కామివి. నిర్లిప్తుఁడవు. నిష్ఠాగరిష్ఠుఁడవు. కాదు కూడ దనక నీవు మేము చెప్పి నట్లు చేయుట మాకుఁ బరమహితము” అని పలికిరి.

అపుడు జరత్కారుఁ డాలోచించి “పితరులారా! నేను నాకొఱకై కామినీకాంచనములఁ గాంక్షింపఁజాలను. అది నా దృఢవ్రతము. కేవ లము మీకొఱకై నేను వివాహ మాడుదును. అదియు నేను విధించిన నియమముల నంగీకరించి తనంతఁ దానే కన్యను గొనివచ్చి బిచ్చ మిచ్చిన ట్లిచ్చి యామెను నేను బోషింపవలసిన యవసరము గల్పింపక తానే పోషించువాఁ డెవఁడైన వచ్చిననే. ఇన్ని సమకూరినను, ఆ సంసా రము సంతానపర్యంతమే. అది కాఁగానే యా బంధమును బుటుక్కున త్రెంపివేయుదు ''నని వారికిఁ దెలియపఱచెను. వా రట్లే యగుఁగా కని యాశీర్వదించి వీడుకొలిపిరి. ఆతఁడు తిరిగి భూసంచారమున కేగెను.

తొల్లి కద్రూవినత లొండొరులు ఉచ్చైశ్శ్రవముతోఁక నలు పని తెలు పని పందెములు వేసికొనిరి. చూతము రమ్మని వినత యనఁగా కద్రువ పరాజయభీతిని వంక పెట్టి మఱునాఁడు చూతమని వినత నొప్పించి యింటి కేగెను. అనంతర మామె బిడ్డలగు పాములఁ బిలిచి సంగతి చెప్పి యెట్లైన వేగి యా గుఱ్ఱము తోఁకకుఁ జుట్టుకొని యున్నచో నది నలుపుగనే కనఁబడు నని తనకు విజయము కలిగి వినత తనకు దాసి యగును కాన నట్లొనరింపుఁ డని కోరెను. అట్టి యధర్మమునకుఁ దాము పాల్పడ లేమని నాగకుమారు లనిరి. అంతఁ గోపమున జనమేజయ

సర్పయాగమున వారు చచ్చునట్లు నిజపుత్త్రులను నిర్దాక్షిణ్యముగా నామె శపించెను. కర్కోటకాదులు భయపడి తల్లిచెప్పిన చొప్పునఁ జేసిరి. అట్లు దగాచేసి కద్రువ వినతను దనకు దాసిని జేసికొనెను. వైనతేయుఁడగు గరుడుఁ డమృతముఁ దెచ్చి మాతృదాస్యవిముక్తిఁ గావించెను.

అనంతరము సర్పశ్రేష్ఠుఁ డగు ఆదిశేషుఁడు బ్రహ్మయాజ్ఞచొప్పున భూభారము వహింప నంగీకరించి సర్వజనప్రియుఁ డయ్యెను. వాసుకి సముద్ర మథన సమయమునఁ దరిత్రాడై యెల్లరి మన్ననలఁ గాంచి బ్రహ్మాదుల వరములు గడించెను. ఐనను, ఆతనికి మాతృశాపము కారణముగా రాఁబోవు సర్పకుల వినాశము మిక్కిలి భయావహ మయ్యెను. ఒకనాఁ డాతఁడు బంధుమిత్త్రాదులను నిజసోదరులను బిలిచి తనయాందోళనము వ్యక్తపఱచెను. మఱియు శేషుఁడు బ్రహ్మకుఁ బ్రియుఁడై భూభారము వహించి తమ యోగక్షేమములు చూచుటయే మఱచెననియుఁ దన కట్లు కాక తా నెన్నివరము అంది యున్నను జననీ శాపమున సర్పకులప్రళయ మేతేర నున్నదన్న మాట తలఁచుకొన్నప్పుడెల్ల గుండె జల్లుమనుచున్న దనియు నందుచే నిఁక వెంటనే తాము తమ ముందుసంగతిఁ దలఁచుకొని తొందరగ జాగరూకత వహింపవలె నని హెచ్చరించెను.

నాగకుమారు లాతనిమాటలు విని మదాంధీభూతులై జనమేజయుఁడు చేయఁబోవు సర్పయాగమునకు విఘ్నములు కలిగింతమని కొందఱు, బ్రాహ్మణవేషములఁ బోయి యా యాగము ధర్మవిరుద్ధమని చెప్పి యుడుపుద మని కొందఱు, సభాసదుల భయకంపితులఁ జేసి పాఱద్రోలెద మని మఱికొందఱు నిట్లింక నెందఱో యెన్నో ప్రగల్భములను బలికి యుపాయములఁ జెప్పిరి. అందలి ప్రబుద్ధు లా యుపాయము అతిప్రమాదహేతువు అని నిరాకరించిరి. కశ్యపునిఁ బ్రసన్నునిజేసికొని యాతని యాజ్ఞచొప్పునఁ జేయుద మని వాసుకి పలికెను. ఏలాపుత్త్రుఁ డను నాగుఁడు వివేకవంతుఁ డగుట "సోదరులారా! ఏ యుపాయము చేతను మనము సర్పయాగము

నాఁపలేము. దైవోపహతుఁడగు పురుషుఁడు దైవమునే యాశ్రయించి కష్టములఁ గడతేరవలయును. మనము దైవోపహతులమై మాతృశాపము నందితిమి. దైవము నాశ్రయించి మన మా శాపవిముక్తి నందవలయును. ఇంకొక రహస్యము వినుఁడు. జననీశాపమునాఁ డామె యొడిలో నుండి నిద్ర నటించుచు నేను బ్రహ్మకును దేవతలకును జరిగిన సంభాషణము వింటిని. "కద్రూశాపమున సర్పకులము నశించును గదా! నీ వా శాపమేల నివారింపవైతి? వని బ్రహ్మను దేవతలు ప్రశ్నించిరి. క్రూరసర్పములు కొన్ని చావవలసియున్నవి. అవి చచ్చినవెనుక, వాసుకి చెల్లెలగు జరత్కారువునందు జరత్కారుఁ డనుఋషిపుంగవుని వలనఁ గలుగఁబోవు ఆస్తీకుఁడనువాఁ డీసర్పయాగ ముడిగించి మిగిలిన నాగులకు మేలు చేయఁగలవాఁ" డని విరించి వివరించెను. కావున, జరత్కారుఁ డిచ్చటికి భిక్షమునకు వచ్చినపుడు మచ్చెకంటియగు జరత్కారువును భిక్షముగ నిచ్చి యామెకుఁ గలుగు కుమారునివలన మన కష్టములఁ బాపుకొని శుభముల నందుట మే" లని పలికెను. ఏలాపుత్త్రి నందఱు మెచ్చుకొని యట్లు చేయ నిశ్చయించుకొనియుండిరి. ఇంకొక పర్యాయము బ్రహ్మకడ నీమాట వచ్చినపు డాతఁ డేలాపుత్త్రుఁడు పలికినది సత్యమనియు నంతకంటె వేఱే ఉపాయము లేదనియుఁ జెప్పెను. ఈ కారణమున వాసుకి జరత్కారువును జగత్కారునికే యిచ్చి పరిణయము చేసి తన్మూలమున వంశవినాశము నరికట్ట నిశ్చయించుకొని యా మహనీయుని యాగమమున కెదురెదురు చూచుచుండెను.

ఇట్లుండ జరత్కారుఁడు భూమండల మంతయుఁ దిరిగి తిరిగి ముదుసలి బ్రహ్మచారియై పితరులకు మేలుసేయఁగోరి స్థావరజంగమ ప్రకృతికి సర్వదేవతలకు నిట్లని విన్నవించెను: "నేను నిరపేక్షుఁడను. నిర్లిప్తుఁడను. సంసారసముద్రము నీఁదఁదలఁచితిని గాని యందుఁ బడి మునిఁగి యధోగతి నందఁదలఁచినవాఁడనుకాను. కాని కేవల పితృప్రీతికై సంతానార్థము జాయం గోరియున్నాఁడను. నాపేరు గలది, నా పోషణ మక్కఱ లేనిది, నే నడుగకుండ వచ్చునది, సత్సంతానార్హురా లగునది యెవతెయో యామెనే నా కడకుఁ బంపుదురు గాక!"

నాగు లా సంగతి యెఱింగి వాసుకికిఁ దెలుప నాతఁడు సాలంకృతయుఁ, జక్కనిచుక్కయు, సత్యభాషిణియు, సంతానార్థయు నగు తనసోదరిని గొని మునిసన్నిధి కేగి మ్రొక్కి "మహాత్మా! నీవు పెట్టిన నియమము లన్నిఁటికి నంగీకరించెదను. ఈమె నీపేరు గలది. జరత్కారువు. నీ వీమెను బోషింప నక్కఱలేదు. నీ యనుజ్ఞ నేనే పోషించెదను.

"ధన్యంబయ్యె భవత్కులం; బతికృతార్థం బయ్యె నస్మత్కులం
బన్యోన్యానుగుణాభిధానములఁ జిత్తానంద మొందెన్; వివే
కన్యాయాన్విత! భూసురోత్తమ! జరత్కారూ! జగన్మాన్య! యి
క్కన్యాభిక్షఁ బరిగ్రహింపుము జరత్కారున్ మదీయానుజన్.

భార. ఆది ౨. ౧౩౪

అని వినయవిధేయుఁడై వేఁడుకొనెను.

జరత్కారుఁ డంత "నే నీమెను బోషింపను. నా కిష్టము లేని పని నీమె చేయరాదు. చేసినయెడల వెంటనే యీమెను విడిచివేసెదను. ఈమె నా యడుగులకు మడుగు లొత్తుచు నుండవలయును. లేనిచో విడిచి పెట్టెదను. ఇష్టమా?" అని యడిగెను. జరత్కారువు, వాసుకి, యిరువురును మహాప్రసాదమని యెట్లయిన మీ రంగీకరించుటే మాకుఁ బదివే" లని సమాధాన మిచ్చిరి. ఆ ముసలిబ్రహ్మచారి యంగీకరించి విధ్యుక్తముగా నామెను వివాహము చేసికొని గృహస్థుఁ డయ్యెను.

## జననము

నాఁటినుండి యాతఁడు వాసుకి రమ్యభవనమునందు దాసదాసీజనముల సేవలు గొనుచు, మునిజనులు వచ్చి తన్నుఁ గీర్తించి పోవుచుండ, నాగు లందఱు తమ కులదైవ మని కీర్తించుచుండ రమ్యాతిరమ్యమగు పడుకటింట నవయౌవనవతియు, . నతిసుందరాంగియు, నతివిధేయయు, మహాపతివ్రతయు నగు జరత్కారువు సేవలుగొనుచు

నభినవ శృంగార పురుషుఁడై యుండెను. తన కిష్టము లేనిపని చేసినను, తనకుఁ బ్రతికూల మగుపలుకు పలికినను, తన్నవమానించినను, తనమాట వినకున్నను తత్క్షణము నామెను విడిచిపోయెద నని జరత్కారుఁ డామెకు ముందుగనే చెప్పివేసెను. ఆమె గడగడలాడుచు నాతని యడుగులకు మడుగు లొత్తుచు నిద్రాలస్యముల నెఱుఁగక మహాపతివ్రతయై యాతనికి సేవలొనరించుచు నాతని కటాక్షమునకుఁ బాత్రురాలయ్యెను. ఆ పుణ్యదంపతు లొకరేయి మదన మహాసామ్రాజ్యమును బాలింపఁ దొడఁగిరి. ఆ పుణ్యవేళ నగ్నితుల్య మగు నుత్తమగర్భమామెకుఁ గలిగెను. అది దినదినప్రవర్ధమాన మగుచుండ నొకనాఁడు జరత్కారుఁ డామె యొడిలోఁ దలనిడుకొని నిద్రాముద్రితునివలె నుండి "ఇఁక నాపనియైనది. ఉభయతారకుఁ డగుసుతుఁ డీమెకుఁ గలుగఁ గలఁడు. నే నిఁక నీబంధమును బటాపంచలు చేసికొని బయటపడుట మేలు. ఉపేక్షించితినా, బంధము బలమై ప్రమాదహేతువు కాఁగల" దనుకొని యేదోవంక చూచుకొని పోవలయు ననుకొనుచుండ సూర్యాస్తమయవేళ యయ్యెను. అపుడు జరత్కారువు "అయ్యో! ఇపుడేమి చేయుదును? సూర్యాస్తమయ మగుచున్నది. పతి నిద్రించుచున్నాఁడు. లేపుదునా? కోపము వచ్చునేమో? ఊరకుందునా? ఈతఁడు సంధ్యోచిత క్రియలు నడవనిచో ధర్మభంగమగునేమో? కోపఫలమునైన నను పైఁవ వచ్చును గాని, ధర్మలోపము సహింపరానిదేమో? ఏమి చేయుట?" అని యాలోచించి పతిని మెల్లఁగ లేపెను. అతఁడు లేచి కోపము నటించి "ఓసీ! ఏల నిద్రాభంగ మొనరించితివే?" యని యడిగెను. "దేవా! సూర్యాస్తమయవేళయైనది. సంధ్యాకృత్యములు నిర్వర్తింప సమయముగదా! యని లేపితిని, క్షమింపుఁడు" అని యామె బదులు చెప్పెను. ఓసీ! నీకు నాసంగతి తెలియదా? నే లేవకముందు సూర్యుఁ డస్తమింపలేఁడు. నీవు లేపి నాకప్రియము చేసితివి. నేను నిన్ను వీడిపోక తప్పదు. దుఃఖింపకుము. నీ గర్భమున సూర్యానలసన్నిభుఁడైన యర్భకుఁడు పెరుఁగుచున్నాఁడు. అతఁ డుభయకుల దుఃఖోద్ధరణ సమర్థుఁడు. నీ వేభయమును లేక నీ సోదరునికడనే యుండుము. నాకై నీ వించుకయు వగవకుము. బాంధవ్యము ఋణానుబంధ సంబంధము. ఆ ఋణానుబంధము తీఱినవెనుక నెవరి తెవరునుగారు.

నీపైఁ గోపముచే నేను బోవుట లేదు. ఋణానుబంధము తీఱుటచేఁ బోవుచున్నాను. మన సంబంధ మింతతో సరి. వనితా బంధము నన్ను బంధింపఁజాలదు. నీకు శుభమగుఁగాక! నే నేగినపిదప వాసుకితోఁ జెప్పుమని జరత్కారుఁడు నారీబంధము నవలీలఁ ద్రెంచివైచి మహోగ్రతప మొనరింప నచటినుండి వెడలిపోయెను. ఆహా! నిర్లిప్తుని నిర్మోహుని నెవరు బంధింపఁగలరు?

జరత్కారుఁడు వెడలిపోయినవృత్తాంతము జరత్కారువు సోదరుఁడగువాసుకికిఁ దెలుపఁ దమకార్యసిద్ధి యగునో కాదోయని జరత్కారువు గర్భధారణ మొనరించెనో లేదో యని యాతఁడు మిక్కిలి వగచెను. "నీ గర్భమున సూర్యానల సన్నిభుఁ డైన యర్భకుఁడు పెరుఁగుచున్నాఁడు. అతఁ డుభయకుల దుఃఖోద్ధరణ సమర్థుఁ" డని యాతఁడు చెప్పి తన్నూఱడించి పోవుట జరత్కారువు చెప్పఁగా విని వాసుకి మిగుల నానందించెను.

నవ మాసములు నిండినపిదప నొక శుభముహూర్తమున జరత్కారువు తేజస్సంపన్నుఁ డగు నొక సుపుత్త్రుని గాంచెను. నాగలోకమంతయు సంతోషమున నాట్య మొనరించెను. అతఁడు తల్లికడుపున నుండఁగనే తండ్రి 'అస్తి' అని చెప్పి యడవికిఁ బోవుటచే నాతనికి "ఆస్తీకుఁడు" అని పేరువచ్చెను. అతఁ డల్లారుముద్దుగాఁ బెరుఁగుచు నాగరాజగు వాసుకి వాత్సల్యమునకు గుఱియై యలరారుచుండెను బాల్యమునుండి యాతఁ డతిబుద్ధిమంతుఁడై యుండెను.

## బాల్యము

ఆస్తీకుఁడు వాసుకి పనుపున చ్యవనమహర్షిపుత్త్రుఁ డగు ప్రమతి కడ శిష్యుఁడై చేరి సర్వవేదవేదాంగపారంగతుఁ డయ్యెను. పరిపూర్ణ బ్రహ్మతేజస్వి, అపగతపాపుఁడు, అపాకృతభవానుబంధుఁడు, నిజ మాతాపితృ ప్రబల భయాపహుఁడు నగుఆస్తీకుఁడు కాలక్రమమునఁ జక్కగఁ బెరుఁగుచుండెను.

## సర్పయాగము

ఇట్లుండ జనమేజయచక్రవర్తి తనతండ్రి యగుపరీక్షిత్తు తక్షక విషాగ్ని దగ్ధుఁ డగుటఁ దెలిసికొని మంత్రిపురోహితుల నందఱిని బిలువ నంపి తక్షకునిపైఁ బగదీర్చుకొను నుపాయ మెఱిఁగింపుఁడని కోరెను. వారు "మహారాజా! నీవు

పెంచితి ధర్మమార్గమునఁ బ్రీతి యొనర్పుచు ధారుణీప్రజన్;
మంచి తనేకయాగముల మానుగ దక్షిణ లిచ్చి విప్రులన్;
నించితి సజ్జనస్తుతుల నిర్మల మైనయశంబు దిక్కులన్;
సంచితపుణ్య! సర్వగుణసంపద నెవ్వరు నీ సమానులే?

కాదన కిట్టిపాటియపకారముఁ దక్షకుఁ డేకవిప్రసం
బోధనఁజేసి చేసె నృపపుంగవ! నీవు ననేకభూసురా
పాదితసర్పయాగమున భస్మముసేయుము తక్షకాది కా
కోదరసంహతిన్ హుతవహోగ్రసముగ్రశిఖాచయంబులన్.

భార. ఆది. ౨, ౨౦౩, ౨౦౪.

అని హెచ్చరించిరి. జనమేజయుఁడు వెంటనే సర్పయాగముచేయ సమకట్టి పురోహితులను ఋత్విజులను బిలువనంపి సర్పయాగ విధానముఁ దెలుపుఁ డని కోరెను. వా రట్టియాగము పూర్వ మెవ్వరుఁ జేసియుండలే దని దేవతలే నీకై యిది కల్పించి రని విన్నవించిరి.

అపుడు జనమేజయుఁడు సర్పయాగము చేయ సమకట్టి కాశిరాజు కూతుఁ రగువపుష్ట యను మహాదేవి ధర్మపత్నిగా సర్పయాగ దీక్షితుఁడయి శాస్త్రోక్తముగ శిల్పాచార్యులచే నిర్మితమైనదియు, అనేక యజ్ఞోపకరణాదులతో నిండినదియు, ధనధాన్యాదులతో సంపూర్ణమైనదియు, తమతమ విధులను నిర్వర్తించుటకు విచ్చేసిన పెక్కురు విప్రులతోఁ గూడినదియు, నగుయజ్ఞగృహమున నున్న జనమేజయున కొక వాస్తువిద్యానిపుణుఁ డైనపౌరాణికుఁ "డయ్యా! ఈ యజ్ఞము మధ్యలో నొక బ్రాహ్మణుని మూలమున నాఁగిపోవునే కాని సాంతము కా"

దని చెప్పెను. రా జాతని మాటలు పెడచెవిని బెట్టెను. చ్యవన కుల విఖ్యాతుఁ డగుచండ భార్గవుఁడు హోతగా, పింగళుఁ డధ్వర్యుఁడుగా, శార్ఙ్గరవుఁడు బ్రహ్మగా, కౌత్సుఁ డుద్గాతగా, వ్యాస వైశంపాయన పైల జైమిని సుమంతు శుక శ్వేతకేతు లాదిగాఁగల మహామునులు సదస్యులుగా నీలాంబరపరిధానులు ధూమ్ర రక్త నయనములునై యాజ్ఞికు లగ్ని ముఖముచేసి వేల్వఁదొడఁగిన బ్రాహ్మణమంత్ర హోమ స్ఫురణమ వివశులై నాగరాజు లొండొరులఁ బిలుచుచు భయభ్రాంతులై వచ్చి యగ్నికుండమునఁ బడి చచ్చుచుండిరి. ఒక్కొక్కసారి సహస్రాయుత సంఖ్యలుగా నిట్లు చచ్చుసర్పములం జూచి తక్షకుఁడు వడవడ వడఁకి పోయి" రక్షింపుము, రక్షింపుము, రక్షింపు మనుకేకలతో నేగి యింద్రుని శరణుచొచ్చెను. ఇంద్రుఁ డాతని కభయమిచ్చి యాతనిని దనకడనే యుంచుకొనెను.

## ఆస్తీకుఁడు సర్పయాగముడిగించుట

ఇట్లుండ సర్పరా జగువాసుకి జనమేజయుఁడు సర్పయాగ మారంభించుటయు, పెక్కు సర్పము లప్పటికప్పుడే యగ్నికుండమునఁ బడి చచ్చుట కడలి సోదరి యగుజరత్కారువును జేరి సంగతి చెప్పి ఆస్తీకుని సర్పయాగ నివృత్తికిఁ బురికొల్పు మని కోరెను. ఆమె కుమారుని మొగము చూచి మేనమామలఁ గాపాడుమని యాదేశించెను. ఆస్తీకుఁ డట్లే యని వాసుకి కభయ మిచ్చి సకల వేద వేదాంగవిదు లగు విప్రవరులతోఁ జని జనమేజయు సర్పయాగ గృహమున కేతెంచెను. ఆతనిదేహకాంతి సభాంతరమెల్ల వెలుంగుచుండెను. అపుడు సరసోక్తి నిపుణుఁ డగుఆస్తీకుఁడు —

"రజనీనాథకులైక భూషణుఁడవై రాజర్షివై ధారుణీ
ప్రజ నెల్లన్ దయతోడ ధర్మచరితం బాలించుచున్ దొంటి ధ
ర్మజు నాభాగు భగీరథున్ దశరథున్ మాంధాతృ రామున్ రఘున్
విజయుం బోలితి సద్గుణంబుల జగద్విఖ్యాత ! పారీక్షితా !

కువలయంబున వారికోరినకోర్కి కిం దగ నీవు పాం
డవకులంబు వెలుంగఁ బుట్టి దృఢంబుగా నృపలక్ష్మితో
నవనిరాజ్యభరంబుఁ దాల్చినయంతనుండి సుఖంబులన్
దివిరి యిష్టధనంబు లిచ్చుటఁ దృప్తులైరి మహాద్విజుల్.

అమ్మనుజేంద్రుఁ డైననలుయజ్ఞము ధర్మజురాజసూయ య
జ్ఞమ్ముఁ బ్రయాగఁ జేసినప్రజాపతియజ్ఞముఁ శాశపాది య
జ్ఞమ్మును గృష్ణుయజ్ఞము నిశాకరుయజ్ఞము నీ మనోజ్ఞ య
జ్ఞమ్మును నొక్కరూప విలసన్మహిమన్ గురువంశవర్ధనా!

వితతమఖప్రయోగవిధివిత్తము లుత్తమధీయుతుల్ జగ
న్నుతసుమహాతపోధను లనుగ్రహనిగ్రహశక్తి యుక్తు లీ
క్రతువున ఋత్విజుల్ కమలగర్భసమానులు పూర్వదిక్పతి
క్రతువున యాజకోత్తములకంటెఁ బ్రసిద్ధులు సర్వవిద్యలన్.

విద్వన్ముఖ్యుఁడు ధర్మమూర్తి త్రిజగద్విఖ్యాతతేజుండు కృ
ష్ణద్వైపాయనుఁ డేగుదెంచి సుతశిష్యబ్రహ్మసంఘంబుతో
సద్వంద్యుండు సదస్యుఁడయ్యె ననినన్ శక్యంబె వర్ణింప సా
క్షాద్విష్ణుండవు నీవు భూపతులలోఁ గౌరవ్యవంశోత్తమా!

ఆర్తిహరక్రియాభిరతుఁడై కృతసన్నిధియై ప్రదక్షిణా
వర్తశిఖాగ్రహస్తముల వహ్ని మహాద్విజదివ్యమంత్ర ని
ర్వర్తితహవ్యముల్ గొనుచు వారిజవైరికులేశ! నీకు సం
పూర్తమనోరథంబులును బుణ్యఫలంబులు నిచ్చుచుండెడున్."

భార. ఆది. ౨. ౨౨౪-౨౨౮

జనమేజయుని, నాతనియజ్ఞమహిమను, ఋత్విజులను, సదస్యులను, అగ్నిభట్టారకుని, అనురూపశుభవచనముల స్తుతించిన నందఱును బరమానందమందిరి. జనమేజయుఁ డందఱియనుమతమున నాతనికి వర మొసఁగఁ దలఁచెను. ఇంతలో హోత "తక్షకుఁ డింకను వచ్చి యగ్నికుండమునఁ బడలేదే?" అనఁగా ఋత్విజులు "రాజా! తక్షకున కింద్రుఁ

రభయమిచ్చి దగ్గఱ నుంచుకొన్నాఁడు" అని మంత్రదేవతలు అగ్ని హోత్రుఁడు తెలుపుచున్నా" రనిరి. జనమేజయుఁడు "త్వరలో నాతనిని రప్పింపుఁడు. ఇంద్రుఁ డాతని కడ్డుపడెనేని ఇంద్రునితో వచ్చి తక్షకుఁ డగ్నిఁ బడి చచ్చుఁగా కని వేల్వుఁడు" అని తొందర చేసెను. హోత వెంటనే "సహేంద్ర తక్షకాయస్వాహా !" అని హోమము చేసెను. అప్పు డింద్రుఁడు తక్షకుని వెంటఁబెట్టుకొని వచ్చుచు నాకసమునుండి యజ్ఞమునుజూచి గడగడలాడి తక్షకుని విడిచివేసి పాఱిపోయెను. ఇంద్రపరిత్యక్తుఁ డగుతక్షకుఁడు బెగడుగుడుచుచు చేష్టలు దక్కి మేఘ మండలమునఁ దిరుగుచుండెను.

ఆ సమయమున జనమేజయుఁ డేమివరము కావలెనో కోరు మిచ్చెద నన నాతఁడు —

"మానితసత్యవాక్య ! అభిమన్యుకులోద్వహ ! శాంతమన్యుసం
తానుఁడవై దయాభినిరతస్థితి నీవు మదీయబంధుసం
తానమనోజ్వరం బుపరతంబుగ నాకుఁ బ్రియంబుగా మహో
ర్వీనుత ! సర్పయాగ ముడివింపుము కావుము సర్పసంతతిన్."

భార. ఆది. ౨. ౨౩౧

అని ప్రార్థించెను. జనమేజయుఁ డాకోరిక విడిచి మఱియొక టేది కోరినను నిత్తు నని యెంత చెప్పినను వినక ఆస్తీకుఁడు మరల మరల నదియే కోరెను. సభాసదు లెల్లరు నాతనికోర్కి దీర్పుటే మంచి దని యేకకంఠులై పలికిరి.

## ఆస్తీకుని మహాత్త్వము

అందఱియభిమతము ననుసరించి జనమేజయుఁడు సర్పయాగము నాపివేసెను. కొంచె మించుమించుగా నగ్నికుండమునఁబడి చావవలసిన తక్షకు నీ విధముగా ఆస్తీకుఁడు రక్షించెను. జననీ శాపపీడితు లగు సర్పేంద్రులనుఁ గాపాడిన ఆస్తీకమహర్షి నెల్లరు నేకకంఠమునఁ గీర్తిం

చిరి. జరత్కార జరత్కారుల తనయుఁ డగు ఆస్తీకమహర్షి చరిత్ర విన్నవారికి సకలపాపక్షయ మగును. అతనిఁ దలఁచినవారి కెవ్వారు నెట్టి సర్పభయము కలుగదు.

ఇట్లు లోకోత్తర చరిత్రుఁ డైనయాస్తీకుఁడు నాగజాతిని గాపాడి మహాతపస్వియై గృహస్థాశ్రమమును స్వీకరించి యుత్తమ పుత్రపౌత్ర వంతుఁ డయ్యెను. జరత్కారుని పితృదేవతలును పుత్రపౌత్రవంతు లయి సంతానతంతువు బలియ మగుట దుర్గతిఁ బాసి యుత్తమగతు లందిరి. ఆస్తీకుఁడు తపోజీవనమున ధన్యాత్ముఁడై యుత్తమ తపస్వు లలో మేటియయ్యెను.*

---

* భారతము : ఆదిపర్వము. ఆస్తీకపర్వము.

# మహర్షుల చరిత్రలు

## ఉతథ్య మహర్షి

### వంశచరిత్ర

విష్ణుమూర్తినాభికమలమునుండి పుట్టి సర్వసృష్టివిధాయకుఁడై బ్రహ్మదేవుఁడు సృష్టికార్యమునఁ దనకు సహాయులుగా నుందు ర
పెక్కురు మానసపుత్త్రులను బుట్టించెను. బ్రహ్మముఖమునుండి యాత
యిచ్ఛామాత్రమునఁ బుట్టి యగ్నికల్పుఁడైన యంగిరసుఁడు బ్రహ
మానసపుత్రులలో మూఁడవవాఁడు. అంగిరసుఁడు కర్దమప్రజాపతి కూఁ
లలో నొకతె యగుశ్రద్ధ యనునామెను బెండ్లాడి యామెవలన నుత్త
పుత్త్రిసంపద నందెను. ఉతథ్యుఁడు శ్రద్ధాంగిరసుల తొలిపుత్త్రుఁడ
బృహస్పతి రెండవవాఁడు. సంవర్తుఁడు మూఁడవవాఁడు. ఇంక
శ్రద్ధాంగిరులకు బహుసంతానమున్నట్లు కొన్నిపురాణములఁ గలద
భాగవతపురాణమున వారికి బృహత్కీర్తి, బృహజ్జ్యోతి మున్నగుపుత్త్రు
కాక, సినీవాలి మున్నగు పుత్త్రికలు కలరని కలదు.

వీరిలోఁ బెద్దవాఁ డగునుతథ్యుఁడు బాల్యము కడచినపిదప బ్రహ్మ
చర్యాశ్రమమున సర్వవేదశాస్త్రపారంగతుఁడై తపోధ్యాన తీర్థయాత్ర
చణుఁడై యుండెను. విద్య పరిపూర్తియై యుక్తవయస్సు వచ్చి
పిదప నాతఁడు మమత యనుకన్యను బెట్టవట్టి గృహస్థాశ్రమమున
స్వీకరించెను.

అంగిరసుని పుత్రులలో నుతథ్యుఁడు మహాసాత్త్వికసంపన్నుఁడు
తపశ్శీలి, తీర్థయాత్రాపరుఁడు నయ్యెను. బృహస్పతి బాల్యమున
బ్రహ్మపనుపున సప్తమహర్షులచే సర్వశాస్త్రజ్ఞానమును సంపాదించి దే
తలకు గురువై బహుప్రజ్ఞాశాలి యయ్యెను. మూఁడవవాఁ డగు సం
ర్తుఁడు బ్రహ్మచారి, మహావిరాగి, యోగీశ్వరుఁడునై నిరహంకారి, నిర్ద
ప్తుఁడు, నిష్ఠాగరిష్ఠుఁడు నన నెగడొందెను.

మమత పతిపరిచర్యాదీక్ష కలిగి యాతనిని భగవంతునిగా నారాధించుచుండెను. ఆమె పరిచర్యల కలరి ఉతథ్యుఁ డామెకు స్త్రీ సహజమగుసంతానకాంక్ష కల దని తెలుపఁగా నామె నానందపఱచి గర్భసంపద నొసఁగెను. ఆమె పతిప్రేమ కలరి తనకోరిక తీరినయానందమున నితోధిక పతిశుశ్రూషా పరాయణయై యుండెను. పిదప నుతథ్యుఁడు తీర్థయాత్రలకై మరల నిలువెడలి పోయెను.

## ఉతథ్యుని ప్రేరణ

తొల్లి దేవతలు బలవంతులై రాక్షసుల నోడించుచు వారి నష్టకష్టములపాలు చేయుచు నధికారమును జేఁబూని యుండిరి. రాక్షసులు తమగురు వగుశుక్రాచార్యునకు మ్రొక్కి తమకడగండ్లను దీర్పు మని ప్రార్థించిరి. శిష్యవత్సలుఁ డగుశుక్రాచార్యుఁడు రాక్షసులకు విజయము సంపాదించు వీర్యవంతము లగుశస్త్రాస్త్రములను శివు నర్చించి కొనివత్తునని వనమున కేగి శివునిగుఱించి ఘోరతపమొనరించి కొంతకాలమునకు సంకల్పసిద్ధి గాంచి యింద్రుని కూఁతు రగుజయంతి మోహమునఁ దగిలి యామెతో నిష్టోపభోగము లనుభవించుచు నింటికి రా నాలసించెను. ఈ సమయమును బురస్కరించుకొని బృహస్పతి శుక్రాచార్యరూపమును ధరించి రాక్షసుల మోసగించి వారి నందఱను అర్హతమతస్థుల నొనరించి భ్రష్టుల నొనరించెను. ఈలోగా శుక్రాచార్యుఁడు తిరిగి రాఁగా మాయాశుక్రుని రూపమున నున్న బృహస్పతి తనకు వశులై యున్నరాక్షసులచే నాతనిం బాఱద్రోలించెను. ఈ యవమానమును భరింపఁజాలక శుక్రాచార్యుఁడు దీని కంతకును గారణమగు బృహస్పతిని భ్రాతృపత్నీ సమాగమ పాపమునకుఁ బాల్పడు మని ఘోరశాప మొసంగెను. తరువాతఁ గొంతకాలమునకు బృహస్పతి శుక్రరూపమును విడిచి స్వర్గమునకుఁ బోయిన వెనుక రాక్షసులు తాముపడ్డ మోసమునకు వగచి తమగురువగు శుక్రాచార్యుని క్షమాభిక్షము గోరుకొనిరి.

ఇట్లు శుక్రాచార్యశాపము నంది బృహస్పతి యున్నతఱి నొకనాఁ డాతఁడు సోదరుఁ డగు నుతథ్యునిఁ జూడ నాతని యాశ్రమమున కేగెను.

ఆ సమయమున నుతథ్యుఁడు తీర్థయాత్ర కేగి యుండుటచే ఉతథ్యుని భార్య మమత యాతని నాదరించి యర్ఘ్యపాద్యాదు లొసంగెను. సహజ సౌందర్యసౌభాగ్యవతి యగు నామెను గాంచఁగనే బృహస్పతి రాగ నిర్మగ్నుఁ డయ్యెను. ఆతని ధోరణి చూచి పతివ్రతాతిలక మగుమమత భయభ్రాంతయై తాను గర్భవతి ననియుఁ దా నాతనికిఁ దల్లితో సమానురా లనియు సర్వదేవతా సార్వభౌముని కులగురు వగుబృహస్పతియే యిట్టి వికృతస్వభావముఁ జూపుట ప్రమాదభూయిష్ఠ మనియు నాతనికి బోధించెను. శాపోపహతుఁడు పాపనిర్మగ్నుఁడు నగునాతని కామాటలు రుచింపవయ్యెను. ఒంటరిక త్తెయు, సుజ్వలాంగియు నగుమమత నాతఁడు కామమోహితుఁడై కరములఁ బట్టి కామకేళినిదేల్పు మనియు దేవరన్యాయమున నద్దివని తప్పుపని కాదనియు బతిమాలఁదొడఁగెను. ఆ యువతి యాతని బిగికౌఁగిలి తప్పించుకొనలేక చాల కటకటంబడెను. ఆతఁడు వెంటనే యామెను శయ్యకుఁ జేర్చి బలవంతముగ రమించి వీర్యమును విడిచెను. మమతాగర్భస్థుఁ డగు బాలుఁడు దానిని గెంటి వేయ నది నేలపైఁ బడి వెంటనే బాలుఁడయ్యెను. మమత గర్భము నందియే యా బాలుఁడు బృహస్పతి భార్య నొరుఁడు రమించి పుత్త్రిని గను ననియు బృహస్పతి యవమానపరిభిన్నుఁ డగుఁగాక యనియు శపించెను. ఆ బాలుఁ డంధుఁ డగుఁగాక యని బృహస్పతి శపించెను. ఇంతలో సద్యోజనితుఁ డగు బాలుని విడిచిపోఁబోవు బృహస్పతి నాఁపి నీవే యీ యధర్మ సంతానమును గొనిపోయి పెంపు మని మమత పలికెను. నీవే పెంచు మని బృహస్పతి పలికి వేవేగ వెడలిపోయెను. అట్లు ఉభయులచేతను విడువఁబడిన బాలుని భరతచక్రవర్తి తీసికొని పోయి పెంచుకొనెను. ఆ బాలుఁడే భరద్వాజుఁడు.

ఉతథ్యమహర్షి యాత్ర ముగించుకొని యింటికి వచ్చిన వెంటనే మమత జరిగినసంగతి యంతయుఁ బూసగ్రుచ్చినట్లు తెలిపి యందుఁ దనత ప్పేమైన నున్న దండింపు మని ప్రార్థించెను. ఉతథ్యుఁడు దివ్య దృష్టిని జూచి యామె పాతివ్రత్యమును, బృహస్పతి శాపవృత్తాంతమును సర్వమును దెలిసికొని "సాధ్వీ! నీ దోష మించుకంతయును లేదు. బృహస్పతియు నంత బుద్ధిహీనుఁడు కాఁడు. అతఁడు శుక్రశాపోప

హతుఁడు, దైవోపహతుఁడై యీ పని యొనరించెను. కర్మప్రవాహగతి యెఱిఁగినవానికి శాపకోపతాపాదులతోఁ బని యుండదు. ఇం దెవరిని నిందింప వలసినపనిలేదు. జరిగినది జరిగినది. గర్భస్థుఁ డగుబాలుఁడే బృహస్పతికి శాపవ్యాజమున బుద్ధి చెప్పనే చెప్పినాఁడు. శాప తిమిర విముక్తుఁడైన బృహస్పతియు నింక నట్టిపని చేయుమన్నఁ జేయఁడు. జ్ఞానసంపన్నుల మగు మాయట్టివారికి సైరణ తప్ప నన్యము శరణ్యము కాదు. నీవు దినకరోపముఁ డగునుత్తమ పుత్రుని గని సాధ్వీరత్న మవుగా వెలుఁగొందుదువు, సంశయము లే" దని యామె నూఱడించెను.

జ్ఞానమూర్తియు మహాతపస్వియు నగుపతిదేవుని పరమశాంత మున కలరి యా సాధ్వి కాలము పుచ్చుచుండెను. పిదప నామె దినకర సదృశుని వంశోద్ధారకుని మహాతపశ్శాలిని దీర్ఘతముఁ డను కుమారునిఁ గని కడుపుచల్లనితల్లియై వ్రాలెను.

## ఉతథ్యునకు మాంధాత శిష్యుఁడగుట

తదనంతరము ఉతథ్యుఁడు తీర్థయాత్రలను జాలించి యాశ్రమ ముననే యుండుచు సాధ్వీరత్నమగు మమత సకలపరిచర్యలు చేయు చుండ తపఃప్రవచనదీక్షాసక్తుఁడై సర్వధర్మప్రబోధకుఁడై శాంతిసౌఖ్యము ననుభవించుచు నుండెను. ఆతనికడకు మునులే కాక పెక్కురు రాజర్షులు సైతము వచ్చి శిష్యులై యాతని సేవామూలమున సర్వధర్మముల నెఱిఁగి సంతృప్తులై వెడలుచుండిరి. షట్చక్రవర్తులలో నొకఁడై శాశ్వత యశస్సు నార్జించిన మాంధాత యనుచక్రవర్తి రాజర్షి ఉతథ్యునికడ కేతెంచి యా మహనీయునికి శిష్యుఁడై యాతనివలన సమస్తరాజధర్మ ములను కూలంకషముగ నెఱిఁగెను. ఈ గురుశిష్యుల రాజనీతిబోధనమే "ఉతథ్యగీత" యను పేర మిక్కిలి ప్రఖ్యాతి గాంచెను.

## ఉ త థ్య గీ త

ఉతథ్యమహర్షి మాంధాతృచక్రవర్తికిఁ దెలిపిన రాజధర్మ ప్రకార మిది:

## మూలము

"ధర్మాయ రాజా భవతి న కామకరణాయ తు,
మాంధాత రితి జానీహి రాజా లోకస్యరక్షితా. ౧

రాజాచరతిచేద్ధర్మం దేవత్వాయైవ కల్పతే,
న చే దధర్మం చరతి నరకాయైవ గచ్ఛతి. ౨

ధర్మే తిష్ఠంతి భూతాని ధర్మో రాజని తిష్ఠతి,
తం రాజా సాధు య శ్శాస్తి స రాజా పృథివీపతిః. ౩

రాజా పరమధర్మాత్మా లక్ష్మీవాన్ ధర్మ ఉచ్యతే,
దేవాశ్చ గేహే గ్గచ్ఛంతి ధర్మో నాస్తీతి చోచ్యతే. ౪

స్వధర్మే వర్తమానానా మర్థసిద్ధిః ప్రదృశ్యతే,
త దేవ మంగళం లోక స్సర్వస్సమనువర్తతే. ౫

ఉచ్ఛిద్యతే ధర్మవృత్త మధర్మో వర్తతే మహాన్,
భయమాహు ర్దివారాత్రం యదా పాపో నవార్యతే. ౬

మమేద మితి నైవైతత్సాధూనాం తాత ధర్మతః,
నవై వ్యవస్థా భవతి యదా పాపో నవార్యతే. ౭

నైవ భార్యా న పశవో న క్షేత్రం న నివేశనమ్,
సందృశ్యేత మనుష్యాణాం యదా పాపబలం భవేత్. ౮

దేవాః పూజాం న జానంతి న స్వధా పితరస్తదా,
న పూజ్యంతే హ్యతిథయో యదా పాపో న వార్యతే. ౯

న వేదా నధిగచ్ఛంతి వ్రతవంతో ద్విజాతయః,
న యజ్ఞాం స్తన్వతే విప్రా యదా పాపో న వార్యతే. ౧౦

వృద్ధానా మివ సత్త్వానాం మనోభవతి విహ్వలమ్,
మనుష్యాణాం మహారాజ యదా పాపో న వార్యతే. ౧౧

ఉభౌలోకా వభిప్రేక్ష్య రాజాన మృషయ స్స్వయమ్,
అసృజన్ సుమహద్భూత మయం ధర్మో భవిష్యతి. ౧౨

యస్మిన్ ధర్మో విరాజేత తం రాజానం ప్రచక్షతే,
యస్మిన్ విలీయతే ధర్మ స్తం దేవా వృషలం విదుః. ౧౩

వృషోహి భగవాన్ ధర్మో య స్తస్యకురుతేహ్యలమ్,
వృషలం తం విదుర్దేవా స్తస్మాద్ధర్మం వివర్ధయేత్. ౧౪

ధర్మే వర్ధతి వర్ధంతే సర్వభూతాని సర్వదా,
తస్మిన్ హ్రసతి హ్రీయంతే తస్మాద్ధర్మం న లోపయేత్. ౧౫

ధనాత్ప్రవతి ధర్మోహి ధారణాద్వేతి నిశ్చయః,
అకార్యాణాం మనుష్యేంద్ర న సీమాంతకరస్స్మృతః. ౧౬

ప్రభవార్థం హి భూతానాం ధర్మస్సృష్ట స్స్వయంభువా,
తస్మాత్ప్రవ ర్తయే ద్ధర్మం ప్రజానుగ్రహకారణాత్. ౧౭

తస్మాద్ధి రాజశార్దూల ధర్మః శ్రేష్ఠతరస్స్మృతః,
స రాజా యః ప్రజా శ్శా స్తి సాధుకృ త్పురుషర్ష భః. ౧౮

కామక్రోధా వనాదృత్య ధర్మ మేవానుపాలయ,
ధర్మశ్శ్రేయస్కరతమో రాజ్ఞాం భరతస త్తమ. ౧౯

ధర్మస్య బ్రాహ్మణో యోని స్తస్మాత్తాన్ పూజయేత్సదా,
బ్రాహ్మణానాం చ మాంధాతః కుర్యాత్కామా నమత్సరీ. ౨౦

తేషాం హ్యకామకరణా ద్రాజ్ఞః సంజాయతే భయమ్,
మిత్రాణి న చ వర్ధంతే తథా మిత్రీభవం త్యపి. ౨౧

బ్రాహ్మణానాం సదాసూయా ద్బాల్యాద్వైరోచనో బలీ,
అథాస్మా చ్ఛ్రీ రపాక్రామ ద్యాస్మిన్నాసీత్ప్రతాపినీ. ౨౨

తత స్తస్మా దపాక్రమ్య సాగచ్ఛత్పాకశాసనమ్,
అథ సోఽన్వతప త్పశ్చా చ్ఛ్రియం దృష్ట్వా పురందరే. ౨౩

ఏతత్ఫల మసూయాయా అభిమానస్య వా విభో,
తస్మాద్బుధ్యస్వ మాంధాత ర్మాత్వాం జహ్యాత్ప్రతాపినీ. ౨౪

దర్పో నామ శ్రియః పుత్త్రో జజ్ఞే ధర్మాదితి శ్రుతిః,
తేన దేవాసురా రాజన్ నీతా స్సుబహవో వ్యయమ్. ౨౫

రాజర్షయ శ్చ బహవః తథా బుధ్యస్వ పార్థివ,
రాజా భవతి తం జిత్వా దాస స్తేన పరాజితః. ౨౬

సయథా దర్పసహిత మధర్మం నానుసేవసే,
తథా వ ర్తస్వ మాంధాత శ్చిరం చేత్స్థాతు మిచ్ఛసి. ౨౭

మ త్తా త్ప్రమత్తా శ్పాషండా దున్మత్తాచ్చ విశేషతః,
తదభ్యాసా దుపావ ర్త సహితానాం చ సేవనాత్. ౨౮

నిగృహీతా దమాత్యాచ్చ స్త్రీభిశ్చైవ విశేషతః,
పర్వతా ద్విషమా ద్దుర్గా ద్ధస్తినోఽశ్వాత్సరీసృపాత్. ౨౯

ఏతేభ్యో నిత్యయు క్తస్స్యా న్న క్తం చర్యాం చ వర్జయేత్,
అత్యాగం చాభిమానం చ దంభం క్రోధం చ వర్జయేత్. ౩౦

అవిజ్ఞాతాసు చ స్త్రీషు క్లీబాసు స్వైరిణీషు చ,
పరభార్యాసు కన్యాసు నాచరే న్మైథునం నృప. ౩౧

కులేషు పాప రక్షాంసి జాయంతే వర్ణసంకరాత్,
అపుమాంసోఽంగ హీనాశ్చ స్థూలజిహ్వా విచేతసః. ౩౨

ఏతే చాన్యే చ జాయంతే యదా రాజా ప్రమాద్యతి,
తస్మా ద్రాజ్ఞా విశేషేణ వ ర్తితవ్యం ప్రజాహి తే. ౩౩

క్షత్రియస్య ప్రమ త్తస్య దోషస్సంజాయతే మహాన్,
అధర్మాస్సంప్రవర్ధంతే ప్రజాసంకరకారకాః. ౩౪

అశీతే విద్యతే శీతం శీతే శీతం న విద్యతే,
అవృష్టి రతివృష్టిశ్చ వ్యాధిశ్చాప్యావిశేత్ప్రజాః. ౩౫

నక్షత్రాణ్యుపతిష్ఠంతి గ్రహా ఘోరా స్తథాగతే,
ఉత్పాతాశ్చాత్ర దృశ్యంతే బహవో రాజనాశనాః. ౩౬

అరక్షితాత్మా యో రాజా ప్రజాశ్చాపి న రక్షతి,
ప్రజాశ్చ తస్య క్షీయంతే తతస్సోనువినశ్యతి. ౩౭

ద్వావాదదాతే హ్యేకస్య ద్వయోస్సుబహవో పరే,
కుమార్య స్సంప్రలుప్యంతే తదాహు ర్నృపదూషణమ్. ౩౮

మమేద మితి నైకస్య మనుష్యేష్వవతిష్ఠతి,
త్యక్త్వా ధర్మం యదా రాజా ప్రమాద మనుతిష్ఠతి. ౩౯

కాలవర్షీ చ పర్జన్యో ధర్మచారి చ పార్థివ.
సంప ద్యదైషా భవతి సా బిభర్తి సుఖం ప్రజాః. ౪౦

యో న జానాతి నిర్హర్తుం వస్త్రాణాం రజకో మలమ్,
రక్తానాం వా శోధయితుం యథానాస్తి తథైవ సః. ౪౧

ఏవమేత ద్ద్విజేంద్రాణాం క్షత్రియాణాం విశాం తథా,
శూద్ర శ్చతుర్థో వర్ణానాం నానాకర్మస్వవస్థితః. ౪౨

కర్మ శూద్రే కృషి ర్వైశ్యే దండనీతిశ్చ రాజని,
బ్రహ్మచర్యం తపోమంత్రాః సత్యం చాపి ద్విజాతిషు. ౪౩

తేషాం యః క్షత్రియో వేద వస్త్రాణామివ శోధనమ్,
శీలదోషాన్ వినిర్హర్తుం స పితా స ప్రజాపతిః. ౪౪

కృతం త్రేతాం ద్వాపరం చ కలిశ్చ భరతర్షభ,
రాజవృత్తాని సర్వాణి రాజైవ యుగ ముచ్యతే. ౪౫

చాతుర్వర్ణ్యం తథా వేదా శ్చాతురాశ్రమ్యమేవ చ,
సర్వం ప్రముహ్యతే హ్యేతద్యదా రాజా ప్రమాద్యతి. ౪౬

రాజైవ కర్తా భూతానాం రాజైవ చ వినాశకః,
ధర్మాత్మా య స్సకర్తాస్యా దధర్మాత్మా వినాశకః. ౪౭

రాజ్ఞో భార్యాశ్చ పుత్రాశ్చ బాంధవా స్సుహృద స్తథా,
సమేత్య సర్వే శోచంతి యదా రాజాప్రమాద్యతి. ౪౮

హస్తినోఽశ్వాశ్చ గావశ్చా ప్యుష్ట్రాశ్వతరగర్దభాః,
అధర్మభూతే నృపతౌ సర్వే సీదంతి జంతవః. ౪౯

దుర్బలార్థం బలం సృష్టం ధాత్రా మాంధాత రుచ్యతే,
అబలం తు మహద్భూతం యస్మిన్ సర్వం ప్రతిష్ఠితమ్. ౫౦

యత్ర భూతం సంభజతే యే చ భూతా స్తదన్వయాః,
అధర్మస్థే హి నృపతౌ సర్వే శోచంతి పార్థివ. ౫౧

యదా వృక్షః ఛిద్యతే దహ్యతే చ
తదాశ్రయా అనికేతా భవంతి. ౧౪

యదా రాష్ట్రే ధర్మ మగ్ర్యం చరంతి
సంస్కారం వా రాజగుణం బ్రువాణాః,
తైరేవాధర్మశ్చరితో ధర్మమోహా
త్తూర్ణం జహ్యాత్సుకృతం దుష్కృతం వా. ౧౫

యత్ర పాపా జ్ఞాయమానాశ్చరంతి
సతాం కలి ర్విందతే తత్ర రాజ్ఞః,
యదా రాజా శాస్తి నరా నశిష్టాం
స్తదా రాజ్యం వర్ధతే భూమిపస్య. ౧౬

యశ్చామాత్యా న్మానయిత్వా యథార్హం
మంత్రేచ యుద్ధే చ నృపో నియుంజ్యాత్,
వివర్ధతే తస్యరాష్ట్రం నృపస్య
భుంక్తే మహీం చాప్యఖిలాం చిరాయ. ౧౭

యచ్చాపి సుకృతం కర్మ వాచం చైవ సుభాషితామ్,
సమీక్ష్య పూజయన్ రాజా ధర్మమాప్నో త్యనుత్తమమ్. ౧౮

సంవిభజ్య యథా భుంక్తే నామాత్యా నవమన్యతే,
నిహంతి బలినం దృప్తం స రాజ్ఞో ధర్మ ఉచ్యతే. ౧౯

యదా సారణికాన్ రాజా పుత్రవత్పరిరక్షతి,
భినత్తి చ న మర్యాదాం స రాజ్ఞో ధర్మ ఉచ్యతే. ౨౦

యదాప్తదక్షిణై ర్యజ్ఞై ర్యజతే శ్రద్ధయాన్వితః,
కామద్వేషా వనాదృత్య సరాజ్ఞో ధర్మ ఉచ్యతే. ౨౧

కృపణానాథవృద్ధానాం యదాశ్రు పరిమార్జతి,
హర్షం సంజనయ న్నౄణాం స రాజ్ఞో ధర్మ ఉచ్యతే. ౨౨

వివర్ధయతి మిత్రాణి తథారీం శ్చాపకర్షతి,
సంపూజయతి సాధూంశ్చ సరాజ్ఞో ధర్మ ఉచ్యతే. ౨౩

సత్యం పాలయతి ప్రీత్యా నిత్యం భూమిం ప్రయచ్ఛతి,
పూజయే దతిథీన్ భృత్యాన్ స రాజ్ఞో ధర్మ ఉచ్యతే. ౭౪

నిగ్రహానుగ్రహౌ చోభౌ యత్ర స్యాతాం ప్రతిష్ఠితౌ.
అస్మిన్ లోకే పరే చైవ రాజా స ప్రాప్నుయాత్ ఫలమ్. ౭౫

యమో రాజా ధార్మికాణాం మాంధాతః పరమేశ్వరః,
సంయచ్ఛన్ భవతి ప్రాణా నసంయచ్ఛంస్తు పాతుకః. ౭౬

ఋత్విక్పురోహితాచార్యాన్ సత్కృత్యా నవమన్య చ,
యదా సమ్య క్ప్రగృహ్ణాతి స రాజ్ఞో ధర్మ ఉచ్యతే. ౭౭

యమో యచ్ఛతి భూతాని సర్వాణ్యేవాఽవిశేషతః,
తథా రాజ్ఞానుకర్తవ్యం యంతవ్యా విధివత్ప్రజాః. ౭౮

సహస్రాక్షేణ రాజా హి సర్వథై వోపమీయతే,
స పశ్యతి చ యంధర్మం స ధర్మః పురుషర్షభ. ౭౯

అప్రమాదేన శిక్షేథాః క్షమాం బుద్ధిం ధృతిం మతిమ్,
భూతానాం సత్త్వజిజ్ఞాసా సాధ్వసాధు చ సర్వదా. ౮౦

సంగ్రహ స్సర్వభూతానాం దానం చ మధురం వచః,
పౌరజానపదాశ్చైవ గోప్తవ్యాస్తే యథాసుఖమ్. ౮౧

న జాత్వదక్షో నృపతిః ప్రజాశ్శక్నోతి రక్షితుమ్,
భారో హి సుమహాం స్తాత రాజ్యం నామ సుదుష్కరమ్. ౮౨

తద్దండవి న్నృపః ప్రాజ్ఞః శూర శ్శక్నోతి రక్షితుమ్,
న హి శక్య మదండేన క్లీబే నా బుద్ధినాఽపివా. ౮౩

అభిరూపైః కులే జాతై ర్దక్షై ర్భక్తై ర్బహుశ్రుతైః,
సర్వా బుద్ధీః పరీక్షేథా స్తాపసాశ్రమిణా మపి. ౮౪

అత స్త్వం సర్వభూతానాం ధర్మంవేత్స్యసి వై పరమ్,
స్వదేశే పరదేశే వా నతే ధర్మో వినంక్ష్యతి. ౮౫

తస్మా దర్థాచ్చ కామాచ్చ ధర్మ ఏవో త్తరోఽభవత్,
అస్మిన్ లోకే పరేచైవ ధర్మాత్మా సుఖమేధతే. ౮౬

త్యజంతి దారాన్ పుత్రాంశ్చ మనుష్యాః పరిపూజితాః,
సంగ్రహాశ్చైవ భూతానాం దానం చ మధురా చ వాక్. ౮౭

అప్రమాదశ్చ శౌచంచ రాజ్ఞో భూతికరం మహత్,
ఏతేభ్య శ్చైవ మాంధాతః సతతం మా ప్రమాదిథాః. ౮౮

అప్రమత్తో భవే ద్రాజా ఛిద్రదర్శీ పరాత్మనోః,
నాస్య చ్ఛిద్రం పరఃపశ్యే చ్ఛిద్రేషు పర మన్వియాత్. ౮౯

ఏతద్వృత్తం వాసవస్య యమస్య వరుణస్య చ,
రాజర్షీణాం చ సర్వేషాం తత్త్వమప్యనుపాలయ. ౯౦

తత్కురుష్వ మహారాజ వృత్తం రాజర్షి సేవితమ్,
ఆతిష్ఠ దివ్యం పంథాన మహ్నాయ భరతర్షభ! ౯౧

ధర్మవృత్తం హి రాజానం ప్రేత్యచేహ చ భారత,
దేవర్షి పితృగంధర్వాః కీర్తయంతి మహౌజసః. ౯౨

## ఉతథ్య గీత: తాత్పర్యము

"మాంధాతృమహరాజా! రాజు ధర్మమార్గమున నడచుటకేకాని తన యిచ్చవచ్చినట్లు చేయుటకుఁ గాదు. లోకమును రక్షించువాఁడే రాజు. రాజు ధర్మము నాచరించునేని దేవతాసముఁ డగును. అతఁ డధర్మ పరుఁ డయ్యెనేని నరకముపా లగును. భూతము లన్నియు ధర్మము నందే యున్నవి. ధర్మము రాజునం దున్నది. ధర్మాత్ముఁ డగురాజు సర్వసంపదలు నందును. పరమధర్మాత్ముఁడు సంపన్నుఁడు నయిన రాజే ధర్మస్వరూపుఁడు. స్వధర్మ మందున్న రాజునకుఁ గలుగు సర్థసిద్ధి వలన లోకక్షేమము కలుగును. ధర్మము నశించి యధర్మము వృద్ధినందుచో రేయుంబవళ్లు ప్రజ లందఱు భయపడుచునే యుందురు. పాపము నివారితము కానిచో, సజ్జనుల యాస్తిపాస్తులకు క్షేమము కలుగదు. పాపబలము వృద్ధి యైనచో సజ్జనుల విత్తక్షేత్రకాంతాజన ముల యునికికే ప్రమాదము వాటిల్లును. పాపము నివారితము కానిచో దేవపితృపూజలుకాని అతిథిసేవలుకాని సాగవు. పాపము నివారితము

కానిచో బ్రాహ్మణులు వ్రతములు విడుతురు. వేదములు పఠింపరు. యజ్ఞము లాచరింపరు. పాపము నివారితము కానిచో వృద్ధులు బలహీనులు భయపడిపోవుచుందురు. మును అందుచే రాజులు ధర్మస్వరూపులై యుండి యుభయ లోకసంరక్షకు లగుదురు గాకని కోరిరి. ఎవనియందు ధర్మము పెంపొందునో యాతఁడు రాజువలె గౌరవింపఁబడును. ఎవరియం దధర్మము పెచ్చు పెరుగునో వారు దేవతలైనను వృషలు లనఁదగుదురు. వృష మనఁగా ధర్మము. దానిని లయము చేయువారు వృషలులు. ధర్మము వర్ధిల్లినపుడే సకల ప్రాణులకు సౌఖ్యము; ధర్మము నశించునపు డెల్లరకు నాశనమే. కావున, ధర్మహాని రా జెన్నఁడు నొనరింపరాదు. ధర్మవృద్ధివలన స్వర్గము ధర్మహానివలన నరకము నగును. భూతముల యుత్పత్తిస్థితులకే బ్రహ్మ ధర్మమును సృజించెను. రాజు ప్రజానుగ్రహకారణమున ధర్మాభివృద్ధి నొనరింపవలయును. కావున ధర్మ మన్నిటికన్న శ్రేష్ఠమైనది. ధర్మప్రభు వగురాజే నిజమగు రాజు. కామక్రోధములను గాక నిజమగు రాజు ధర్మమునే పెంపొందింపవలెను. రాజునకు ధర్మమే సర్వశ్రేయస్కరము. ధర్మము బ్రాహ్మణులవలనఁ గలిగినది. కావున రాజు సదా బ్రాహ్మణులను పూజింపవలయును. బ్రాహ్మణు లేమికోరినను మదమాత్సర్యములు దక్కి రాజు తీర్చుచుండవలెను. అట్లు చేయని నాడు రాజు భయావహుఁ డగును. మిత్రులు వృద్ధిపొందక పోఁగా శత్రులు వృద్ధిపొందుదురు. విరోచనసుతుఁ డగుబలిచక్రవర్తి బాల్యము నుండియు బ్రాహ్మణులన్న మాత్సర్యము వహించియుండెను. అందుచేతనే లక్ష్మి యాతనిని విడిచి యింద్రుని జేరెను. ఆ తరువాత బలి యా లక్ష్మి తన్ను విడచి యాతనిఁ జేరినందుల కెంతయో దుఃఖపడెను. అసూయాదురభిమానములే లక్ష్మి తొలఁగుటకుఁ గారణములు. మాంధాతా! ఇట్టి గుణములవలన లక్ష్మి నిన్నెన్నఁడు విడువకుండుఁగాక! దర్పము లక్ష్మి కధర్మమువలనఁ గలిగిన పుత్రుఁడని శ్రుతులు చెప్పుచున్నవి. దీనివలననే పెక్కండ్రు దేవతలు, రాక్షసులు, రాజర్షులు నాశన మందిరి. దీనిని జయించినవాఁడు రాజు. దీనిచే జయింపఁబడినవాఁడు దాసుఁడు. మాంధాతా! నీవు చిరకాలము చక్రవర్తిగ నుండఁదలఁచితివేని దర్పసహితమగు నధర్మమును దవ్వగఁ

ద్రోహము. మత్తుఁడు, ప్రమత్తుఁడు, పాషండుఁడు, ఉన్మత్తుఁడు ప్రయత్న పూర్వకముగా వీరికిఁ గడుదూరమున నుండ వలయును. పరాజితుఁడు, అమాత్యుఁడు, స్త్రీలు, పర్వతము, విషమ మయిన దుర్గము, ఏనుఁగు, గుఱ్ఱము, సర్పము, మున్నగు వానితో నెన్నఁడు చేరిక లేకుండవలయును. నిశాసంచారము కూడ విడువఁదగినది. అత్యాగము, అభిమానము, దంభము క్రోధము వీనిని విడిచివేయవలయును. ఇదివఱ కెఱుఁగనిస్త్రీని, పేడివలె నున్న స్త్రీని, జారిణియగుస్త్రీని, పరభార్యను, కన్యను కామమునఁ గూడరాదు. పాపములను పరిమార్చి స్త్రీలౌల్యమును ద్యజింపనియెడల వర్ణసంకర మగుటేకాక పాపు అగు రాక్షసులు, నపుంసకులు, అంగహీనులు, మూఁగలు, మూఢులు మున్నగువారు జన్మింతురు. ఇట్టి ప్రమాదములకు గుఱికాక రాజు కడు జాగరూకుఁడై యుండవలయును. అధర్మప్రాబల్యమున వర్ణసంకరకారకులు ప్రబలుదురు. కాలధర్మములు తాఱుమాఱై వేసవిని జలి, శీతకాలమున నుక్కపోఁత, వానకాలమున నెండలు, నెండకాలమున వానలు, అతివృష్టి, అనావృష్టి, వ్యాధిపీడ మున్నగునవి సంభవించును. తోఁకచుక్కలు కనఁబడుట, గ్రహములు క్రూరము లగుట మున్నగు రాజనాశనకరము లగు నుత్పాతములు ప్రబలును. తన్ను రక్షించు కొనలేనిరాజు ప్రజలనుసైతము రక్షింప లేఁడు. ఆతనిప్రజ లాతనితోపాటు నశింతురు. ఒకని ధన మిరువురు, ఇరువురి ధనము పెక్కురు కొట్టి దోఁచుకొందురు. యువతులగు కన్యల మానధనమును బలవంతులగు విటకాండ్రు కొల్లగొట్టుదురు. ఈ నింద లన్నిటికి రాజే బాధ్యుఁ డగును. రాజు ధర్మము నేమఱినపుడు ఆస్తిపాస్తులక్షేమమున కధికభంగము కలుగును.

మేఘుఁడు సకాలమున సువృష్టి గురిసి, ధర్మచారియై పార్థివుఁడుండి, సంపదలు పెంపుగలిగియున్నపుడు ప్రజలసుఖమునకు మేర యుండదు. రంగు వెలియనీక, అంచు మాయనీక బట్టమురికిని పోఁగొట్ట లేనివాఁడు చాఁకలివాఁడు కాఁడు. అట్లే బ్రాహ్మణక్షత్రియవైశ్య శూద్రులను స్వధర్మవర్తులఁజేసి దోషాదు లణఁపని రాజు రాజు కాఁడు. శూద్రునకు సేవ, వైశ్యునకుఁ గృషి, క్షత్రియునకు దండనీతి,

బ్రాహ్మణునకు బ్రహ్మచర్యాతపస్సత్యములు ధర్మములు. వారి వారి వర్ణ వ్యవస్థకు భంగములేనిభంగి వారివారి గుణశీలములను తీర్చిదిద్దఁగలరాజే ప్రజలకుఁ దండ్రి, ప్రజాపతి. కృతత్రేతాద్వాపరకలియుగములు రాజునడపడులు. రాజే యుగ మని చెప్పుదురు. రాజునకుఁ బ్రమాదము సంభవించినపుడు నాలుగువర్ణములవారికి, నాలుగు వేదములకు, నాలుగాశ్రమములకు నన్నిటికిని బ్రమాదమే. రాజునకుఁ బ్రమాదము కలుగునెడల మూఁడగ్నులకు, మూఁడువిద్యలకు, యజ్ఞయాగములకు నన్నిటికిని బ్రమాదమే. సర్వభూతములకు రాజే కర్త, వినాశకుఁడు. ధర్మాత్ముఁడై కర్తయగును, అధర్మాత్ముఁడై నాశకుఁడగును. రాజభార్యాపుత్రమిత్ర బాంధవులు మున్నగువా రెల్లరు రాజునకుఁ బ్రమాదము వచ్చినపుడు దుఃఖింతురు. అధర్మవర్తి యగురాజు రాజ్యమున నన్ని విధములగు పశువులుసైత మార్తిఁ గాంచును. దుర్బలులను రక్షించుటకొఱకే బలము కల్పింపఁబడినది. అందుచే అబలుల కదిమహద్భూతము. అందే సర్వము సంప్రతిష్ఠిత మయి యున్నది. రా జధర్మవర్తి యయ్యెనేని సర్వభూతములు సంతాపపడును. బలహీనులయు మునులయు పాములయు వీరిదృష్టిని భరించుట చాలకష్టము. బలహీనుల నవమానింపరాదు. అట్టి దుర్బలుల తీక్ష్ణనేత్రాగ్ని రాజవంశముల సమూలనాశనము చేయుటకు సమర్థము. బలహీనుల యుసురు తగులుటవలన దహింపఁబడిన వంశవృక్ష మింకఁ జిగిరింప లేదు. కావున, రాజెన్నఁడు వారిజోలికిఁ బోకూడదు. బలము కంటె బలము లేమియే చాల గొప్పది. అదియే అధికబలము. అబలులచే దగ్ధమైన బలమున నింక మిగులునది లేదు. అవమానింపఁబడినవాఁడు, కొట్టఁబడినవాఁడు, కష్టపెట్టఁబడినవాఁడు, – వీరిని గాపాడనిరాజును దైవదండము చంపును. నీవు బలవంతుఁడవుగదా యని దుర్బలుల హింసింపకుము. అగ్ని జ్వాలలు దగ్గఱనున్న వస్తువులను దహించి వేయునట్లు దుర్బలుల నేత్రాగ్ని నిన్ను దహింపకుండుఁగాక! చేయని తప్పు చేసిరని నిందమోపి శిక్షింపఁగా నట్లు శిక్షపడినవారేడ్వఁగాఁ గాఱు కన్నీటిబొట్లు, ఆ నింద మోపి యకారణముగా శిక్షించినవారి పుత్ర మిత్ర పశుక్షేత్రకళత్రసహితముగా వారిని దగ్ధముచేసివేయును. ఒక్కొక్కప్పుడు చేసినపాపము వెంటనే కట్టికుడుపదు. ఆ పాపి యా పాపఫలము

గుడువకమునుపే వచ్చినయెడల అతనిపుత్రులో పౌత్రులో ప్రపౌత్రులో అనుభవింపక తప్పదు. ఏ దేశమున దుర్బలుఁడు లేనినింద మోపఁబడి శిక్షపడి తన్నుఁగాచునాథుఁడు లేక యేడ్చునో ఆ దేశము మహాఘోరము దైవకృతము నగువంత మనుభవించును. (ఉదాహరణ : ఏ విప్రరూపముల బిచ్చమెత్తుకొనునట్లు నటించు శత్రులో యేమఱుపాటున రాజును బట్టి వధింతురు.) రాజోద్యోగు లెవ్వ రవినీతిపరులైనను గొప్పపాపము రాజునుపొందును. అశక్తులైన ప్రజలు దీనులై బతిమాలుకొనుచున్నను వినక యేదేశమున రాజోద్యోగులు కామలాలసులై కాని ధనాశాపరులై కాని దుష్కృత్యము లొనరింతురో ఆదేశ మేలురాజునకు మహాపాపము సంభవించును. చిన్నమొక్క పుట్టి పెరిగి మహావృక్షమై యలముకొనఁగా దాని నెన్నో భూతము లాశ్రయించినపుడు ఆ చెట్టునుగొట్టివేయ దాని నాశ్రయించిన భూతము లన్నియు నాశ్రయములేక గిలగిలలాడును. ఏ రాజు రాజ్యమందలి ప్రజలు ధర్మపరులయిన నా రాజు కీర్తి నలుదెసల నలముకొనును. అధర్మము పైతొలఁగి ధర్మము నిలచును. అట్లు గాక, ప్రజ అధర్మవర్తనులై పాపు లగుదురో ఆ పాపమా దేశ మేలురాజును రాజోద్యోగులను పొందును. ఏ దేశమందు రాజు తనబలిమిచే నధర్మ మణఁచి ధర్మమును నిలుపఁడో యా దేశ మభివృద్ధి చెందనేరదు. ఏ దేశమున రాజు తన యమాత్యుల నాదరించుచు మంత్రాలోచనవేళలను యుద్ధములందును దగురీతి నుపయోగించుకొనునో యా దేశ మభివృద్ధినందును. ఆ రాజు జనరంజకముగాఁ జిరకాలమాదేశము నేలును. సుకృతకర్మములను సుభాషితములను నాదరించు రాజు అత్యుత్తమ మగుధర్మమునందును. పంచి కుడుచుటయు, అమాత్యుల నవమానింపమియు, గర్వించియున్న బలవంతుల నణఁచుటయు రాజుప్రధానకర్మములు. మనోవాక్కాయకర్మములచే నెల్లరిని గాపాడుచు విరోధి యైనఁ బుత్రుసైనను సహింపమి రాజునకు ధర్మము. ఏ రాజు దుర్బలులగు తన ప్రజలతో పంచి కుడుచునో దాన నా దుర్బలులు బలవంతు లగుదురో అదియే రాజుధర్మము. రాష్ట్రమును గాపాడుచు దస్యులను బరిమార్చుచు, యుద్ధమున విజయము సంపాదించుట రాజుధర్మము. క్రియలచేతను, మాటలచేతను ఇష్టుఁడేయైనను పాపము చేయువాని నెవ్వని నోర్వకుండుట రాజుధర్మము. వణిజులను పుత్రులను

వలె రక్షించుచు, మర్యాద మీఱకుండుట రాజుధర్మము. కామద్వేషము లను వర్జించి శ్రద్ధాళువై సదక్షిణను యజ్ఞయాగములు చేయుట రాజు ధర్మము. కృపణులయు, అసాధులయు వృద్ధులయు సత్రువులు తుడిచి యెల్లరకు సంతృప్తి సమకూర్చుట రాజుధర్మము. మిత్రుల సంఖ్య పెంచుచు, శత్రుసంఖ్య తగ్గించుచు, సాధువులఁ బూజించుట రాజుధర్మము. ప్రీతితో సత్యమునే పలుకుచు, భూదానాదు లొనరించుచు, అతిథిపూజ, భృత్యప్రీతియుఁ గలిగించుట రాజుధర్మము. నిగ్రహాను గ్రహసమర్థుఁ డగురా జిహపరసుఖము లందును. రాజే యముఁడు. ధార్మికుల కాతఁడు పరమేశ్వరుఁడు. ఇంద్రియముల నణఁచి యాతఁడు పెంపును, అణఁపక లోటు గాంచును. ఋత్విజులను, పురోహితులను, గురు వులను అవమానింపక గౌరవించి హితులను జేసికొనుట రాజుధర్మము. యముఁడు నిష్పక్షపాతబుద్ధితో సర్వభూతముల నణఁచునట్లే రాజును సర్వసమత్వమున మెలఁగవలయును. అన్నివిధముల రాజింద్రునితో సమానుఁడు. ఏది ధర్మముగా భావింపఁబడుచుఁ జూడఁబడుచున్నదో అదే ధర్మము. నీవు ప్రమాదపతితుఁడవు కాక క్షమ, బుద్ధి, ధృతి, మతి కలిగియుండుము. సర్వభూతములందును సాధు అసాధు భేద ముల నెల్లపుడును దెలిసికొనుము. సర్వభూతములయెడ దానము, మధురవచనము నేర్చికొనుము. పురజములను, జానపదులను కన్న బిడ్డలవలెఁ గాపాడవలయును. అశక్తుఁ డగురా జెప్పుడు నీపని చేయఁ జాలఁడు. రాజ్యభారముఁ దాల్చుట యెవవానికిఁ గానివానికి సాధ్యము కాదు. అభిరూపము, కులము, జాతి, దక్షత, భక్తి, బహుశ్రుతత్వము గలమంత్రులఁగూడి మనుజుల మనస్సులను, మహర్షులకార్యములను స్వబుద్ధిచే గ్రహింపఁ గలిగియుండుట రాజధర్మము. దాన సర్వవర్ణ ధర్మములు తెలియును. అపుడు స్వదేశమున నున్నను పరదేశమున నున్నను బాధలేదు. ధర్మము అర్థము, కామము వీనిలో ధర్మమే ముఖ్యమైనది. ధర్మాత్ముఁడే ఇహపరముల సుఖించును. త్యాగము, మధురభాషణము నీకున్న యెడల నీకై ప్రజలు దారపుత్రాదులనైన విడిచివేయుదురు. అప్రమాదము, శౌచము రాజున కైశ్వర్యహేతు వులు. ఈ విషయముల నేమఱకుము. ఓ మాంధాతా! రాజు తనగుట్టు తెలియనీక శత్రువులగుట్టు తెలిసికొనఁగలుగుచుఁ దటితో వారిని జయింప .

వలయును. ఈ రీతినే యింద్ర, యమ, వరుణాదులు వర్తించిరి. రాజర్షు లెల్ల రిట్లే నడచుకొనిరి. ఈ దివ్యపద్ధతినే నీవు తప్పక అనుసరింపుము. ధర్మవర్తి యగురాజు నిహపరములఁ దేవతలు, ఋషులు, గంధర్వులుఁ గొనియాడుదురు." మాంధాత యట్లొనరించి రాజర్షులలో నుత్తముఁడయ్యెను.

ఉతథ్యమహర్షి యిట్లు ధర్మోపదేశకుఁడు, మహాతపస్వి, విజ్ఞానియై వినుతి కెక్కెను.

# మహర్షుల చరిత్రలు

## ఋచీక మహర్షి

### వంశ చరిత్ర

భృగుమహర్షి పులోమ యనుభార్యయందుఁ గాంచిన పుత్త్రుఁడు చ్యవనమహర్షి. చ్యవనుఁడు సుకన్య యనుసాధ్వియందు దధీచి, ప్రమతి, ఆప్రవానుఁడు ననుకుమారులను గాంచెను. ఆప్రవానుఁడు ఋచి యనునామె నర్ధాంగిగాఁ గైకొని గృహస్థుఁ డయ్యెను. కాలక్రమమున నామె యతనివలన గర్భము ధరించెను.

ఆ దినములలో హైహయవంశీయుఁడు, కార్తవీర్యార్జునుని తండ్రి యగుకృతవీర్యుఁ డనుమహారాజు భార్గవ వంశ విప్రులను కులగురువులుగాఁ జేసికొని అనేక యజ్ఞయాగాదు లొనరించి వారికిఁ బెక్కు భూరి దక్షిణ లొసఁగి వార్ధకమున స్వర్గమున కేగెను. ఆతని యనంతర మాతనిపుత్రులు భృగువంశజు లగుబ్రాహ్మణులపై నీర్ష్య వహించి వారు తమతండ్రిని వశపఱచుకొని యాతని సర్వస్వము నపహరించిరని నింద మోపి భృగువంశ విప్రుల నష్టకష్టములఁ బెట్టఁదొడఁగిరి. ఒకనాఁ డారాజకుమారులజట్టు వెంబడింప భయపడి భృగువంశస్త్రీలు కొందఱు హిమగిరి ప్రాంతములకుఁ బాఱిపోయిరి. వారిలో గర్భిణి యగు ఋచియు నుండెను. ఆమె కొంతవడి పరుగిడి యింకఁ బోలేక యొకచోఁ జదికిలఁబడి యోగశక్తిఁ దనగర్భమును దనయూరువునఁ జేర్చెను. రాక్షస ప్రవృత్తు లగురాజకుమారు లామెను బీడింప సమీపింపఁగనే ఋచి యూరువునుండి దివ్యతేజముతో నొక్కపుత్రుఁ డుదయించెను. ఆతని తేజముఁ గాంచుసరికే హైహయరాజకుమారు లంధులై దారితెన్ను గానక దీనులై పశ్చాత్తప్తులై యా తల్లిని క్షమింపఁ బరిపరివిధములఁ బ్రార్థించిరి. ఆమె తా నేమియుఁ జేయఁజాల ననియుఁ దనపుత్త్రుని దివ్యతేజమువలననే వా రంధులై రనియు నందుచే నాతనినే ప్రార్థింపఁ

డనియు వారికి సూచించెను. వారు తడవిఁ యాతని పాదములను బట్టుకొని లెంపలు వైచుకొని మ్రొక్కి మ్రొక్కి యిఁక తప్పిదారియైనను హైహయవంశీయు లెవ్వరు భృంగువంశీయుల జోలికి పోకపోవుటే కాక దైవములుగఁ బూజింతు రనియుఁ దమతప్పు సైఁచి తమకు దృష్టి దానముఁ జేయుమనియుఁ గోరుకొనిరి. ఆ బాలుఁడు కటాక్షింపఁగనే వారికిఁ గన్నులు వచ్చెను. వా రాతని నెంతయుఁగొనియాడి ఋచికి నమస్కరించి భీతావహులైన విప్రస్త్రీలను మాతృసమానలుగాఁ జూచి వారివారి యిండ్లకుఁ జేర్చి సుఖముండిరి.

ఋచి యూరువునుండి పుట్టిన యా బాలుఁడే ఔర్వుఁడు. దుష్టక్షత్రియనాశనార్థ మౌర్వాగ్నిని బుట్టించి పితరుల యాజ్ఞవలన దానిని సముద్రమున విడిచిన మహనీయుఁ డీతఁడే. ఈతఁడు బ్రహ్మచర్యదీక్షితుఁడై వివాహ మాడనొల్లక తన తపశ్శక్తిచే నయోనిజులగు నొకపుత్రిని, పుత్రుని గాంచెను. ఈతని పుత్రికయే కందళి యనుపేర దుర్వాసుని భార్యయయ్యెను. ఈతని పుత్రుని కీతఁడు తనతల్లి పేరు పెట్టెను. అతఁడే ఋచీకమహర్షి.

ఇ ట్లుత్తమోత్తమ మగు భృగువంశమున నుత్తమోత్తమముగఁ బుట్టి బ్రహ్మచర్యమున విద్యలార్జించి తపస్వియై యుక్తవయస్సు దాఁటినను వివాహ మాడకుండెను. తరువాతఁ గొంతకాలమునకుఁ దాను వివాహమాడి సత్సంతానమును బడయ నిశ్చయించుకొని దివ్యదృష్టిని కుశికపుత్రుఁడగు గాధియను భూపతి కూఁతురు సత్యవతి యనునామె తన భార్య కామెండు దెలిఁసి యుండెను.

## సత్యవతి చరిత్ర

తొల్లి పురూరవుఁ డను మహారాజువంశమున బలాశ్వుఁ డనురాజునకుఁ గుశుఁ డనువాఁడు పుట్టి రాజయ్యెను. ఆతనికిఁ గల్గినపుత్త్రులలో కుశనాభుఁడు శ్రేష్ఠుఁడు. అతఁడు పెరిగి పెద్దవాఁడై ఇంద్రసమానుఁడగుపుత్రుని గాంచఁగోరి యింద్రునిగూర్చి ఘోరతప మొనరించెను. ఇంద్రుఁ డాతనితపమున కిచ్చ మెచ్చి వచ్చి తనయంశమున నితనికి

సుపుత్రుఁడు కల్గు నని వరమిచ్చి చనెను. ఆ వరము ననుసరించి కాల క్రమమున కుశనాభునిభార్య పతివలన గర్భము ధరించి యింద్ర సమానుఁ డైనపుత్రుని గాంచెను. అతఁడు గాధి. గాధిరాజు మహా పరాక్రమశాలియై పరమధర్మాత్ముఁడై ప్రజారంజకముగఁ బరిపాలన మొనరించెను. ఆతనికి సంతానము కలుగకపోఁగా పెక్కునోములు, వ్రతములు పూని దేవతల నారాధించి వారిదయవలన సత్యవతి యను నొకపుత్రికను గనెను. చక్కనిచుక్క యగు అకన్య మిక్కిలి గారముగఁ బెరుగుచు సర్వసుగుణసుందరి యయ్యెను.

## వి వా హ ము

ఆ దినములలో ఋచీకమహర్షి గాధిరాజునింటి కరుదెంచి యాతని యతిథి సత్కారము లంది తన కొకకోరిక కలదనియు దానిని దీరుచు కొనఁ దా నచటికి విచ్చేసితి ననియుఁ దెలిపెను. గాధిరా జానందమున "మహాత్మా! ఏ కోరికలు లేని మహాఋషి కొకకోరిక కలుగుట లోకకల్యాణార్థము, ఏ కోరిక తెలియఁగని లోకేశతుల్యుఁ డగుమహర్షికిఁ గలిగిన యేకైకమగుకోరికఁ దీరుచు నదృష్ట మేపుణ్యపురుషునికిఁ బట్టునో! శక్తి వంచన లేక నీకోరిక దీర్ప యత్నింతును. దయదలఁచి తెలుపు" మని యాతనిఁ బ్రార్థించెను. అపు డాతఁడు గాధిరాజుకూతురగు సత్యవతిని దనకిచ్చి వివాహము చేయు మని యడిగెను. వయోవృద్ధు, తపోజీవి యగుఋచీకునకుఁ దనయేకైక పుత్రిక నెట్లిచ్చుట యని గాధి మిక్కిలి పరితపించెను. ఆ సంగతి గమనించిన ఋచీకుఁడు గాధిరాజా! నేను కామినై యోఁగాము తెలియఁగక నీపట్టిని జేపట్టు పట్టుదలతో నిప్పట్టున నుట్టి వడలేదు. నీ వంశక్షేమమును గోరి నే నిటకు వచ్చితిని. నీ పుత్రిక కేదైన నుంకువ కోరుదువేని యిచ్చెదను కోరుము. అంతేకాని నా కోరిక నీవు తృణీకరించుట ధర్మము కాదు. దూర మాలోచింపు" మని పలికెను.

గాధిరా జాతనిపలుకులు విని తనలో "అయ్యో! ఈతని నెట్లు తప్పించుకొనఁగలనో! తృణీకరించిన మహర్షి శాపమీయఁ గలఁడు. అంగీకరించుటకు మన సేమాత్ర మొప్పకున్నది. ఐనను, ఈతఁడు

సందిచ్చినాఁడు. మానవమాత్రునకు సాధ్యముకాని వస్తువుల నుంకువగాఁ దెచ్చి యిమ్మందును. దానితో నీతఁడే పోవును. ఒకవేళఁ దెచ్చెనా అంతశక్తిసంపన్నునకుఁ బిల్లనిచ్చుటకంటె నానంద మేమున్నది?" అనుకొని ప్రకాశముగా "మహాత్మా! చాల సంతోషము. మాకొకకోరిక కలదు. ఆ కోరికను నీవు దీర్చితివా నీకు బ్రహ్మానందమున నాపట్టి నిచ్చి మహావైభవముగ వివాహ మొనరింతును. మేము కోరు నుంకువ యేమందువా నల్లని చెవులు, తెల్లనిమేనులు కలిగి మహావాయువేగము లైనగుఱ్ఱములను వేయింటిని నీవు కొనివచ్చి యిమ్ము. నీవు మాకోరిక తీర్చితివా నీకోరిక మేమును దీర్తుము. తపశ్శక్తి సంపన్నుఁడవు, సర్వశక్తిమయుఁడవు, నీ కిది యొక్కలెక్కలోనిదా?" అని సవినయముగాఁ బలికెను.

ఋచీకమహర్షి యాతనిగొంతెమ్మకోరికను దృణీకరింపక యట్లే తెచ్చి యిచ్చి సత్యవతిని బెండ్లాడుదు నని చెప్పి వెడలిపోయెను. బ్రతుకు జీవుఁడా! ప్రస్తుత మీకష్టము దాఁటి గట్టెక్కితి నని గాధిరాజు సంతసించెను కాని, సత్యవతి యాతఁ డాయశ్వములు తెచ్చి యిచ్చుట నిక్కువ మనియుఁ దా నాతని భార్యయగుట తథ్య మనియు నిశ్చయించుకొనెను.

ఋచీకమహర్షి బయలుదేఱి వెడలి నల్లనిచెవులు తెల్లని మేనులు కలిగి గాలివలెఁ బరుగిడు గుఱ్ఱము లెచ్చట దొరకు నని లోకమంతయు గాలించి యట్టివాని నెచ్చటను గానఁడయ్యెను. ఎవ్వరి నడిగినను వారు నవ్వి యట్టిగుఱ్ఱములు సృష్టిలో నెక్కడను నుండ వనిరి. ఇదివఱ కెక్కడను నట్టిగుఱ్ఱములు లేనిచోఁ దనప్రీతికొఱ కట్టియశ్వములు పుట్టి పెరిగి తనకు లభింపవలయు నని యాతఁడు గాఢముగాఁ గోరెను. అతఁడు తిరిగితిరిగి తుద కట్టియశ్వములు వరుణ లోకమునఁ గల 'తురంగతీర్థ' మను మహాక్షేత్రమున లభించిన లభింపవచ్చు నని తెలిసికొని నిజతపోమహత్త్వమున వరుణలోకమున కేగి వరుణదేవునికిఁ దనరాక నెఱింగించెను. ఋషిప్రియుఁ డగు నాతఁ డమితానందమున నాతనికి స్వాగత మొసఁగి యతిథిమర్యాద లెల్ల నడపి యాతఁడు వచ్చినపని యడిగెను. ఋచీకమహర్షి తనసంగతి యంతయు నాతనితోఁ జెప్పి

నల్లనిచెవులు, తెల్లనిమేనులు, వాయువేగము కలిగిన గుఱ్ఱములు తన కొకవేయి కావలయు నని వరుణు నర్థించెను. వరుణుఁ డంత "మహాత్మా! సదా తపస్సంపన్నులు, సత్యసంధులు, సర్వకామవివర్జితులు నగు మహానుభావులు సాధింప లేని దేమి కలదు! భార్గవవంశప్రసిద్ధుఁడవు, బ్రహ్మచర్యదీక్షాపరిపాలకుఁడవు, తపస్స్వాధ్యాయనిరతుఁడవు, నీ రాక వలన మాలోకము పవిత్రమైనది. నీ వేకాకిచేతఁ గబురు పంపినను నీ యడుగులకు మడుగులొత్తుచు నివియేకాదు ఏమి యడిగినను గొనివచ్చి యిచ్చెడివాఁడనే కదా!" అని యాదరమేదురముగఁ బల్కి ఋచీక మహర్షిని దీసికొనిపోయి తురంగతీర్థమున నోలలాడించి యాక్షేత్రమును సందర్శింపఁజేసెను. అం దాతఁడు వేనకు వేలు వివిధములైన యశ్వ రాజములను గాంచెను. ఆతఁ డచ్చెరువందున ట్లచట నల్లనిచెవులు తెల్లనిమేనులు కలిగి వాయువేగములైన గుఱ్ఱములు కోటానఁగోటు లుండెను. అవి యన్నియు మహోన్నతములు, మహాసత్త్వములు, సర్వసౌందర్యసమన్వితములు. వానినుండి వేయిగుఱ్ఱములను లెక్కపెట్టి వరుణుఁడు ఋచీకమహర్షి కొసఁగి సత్కరించెను.

ఋచీకుఁ డా గుఱ్ఱముల వేయింటిని గొని శీఘ్రగమనమున గాధి రాజు నింటికి విచ్చేసెను. కలలోనైనను తాను జెప్పిన యశ్వముల వంటి యశ్వముల నాతఁడు తీసికొనిరాఁగలఁడని గాధి తలంపలేదు. అందుచే నొకటికాదు, రెండు కాదు వేయి దివ్యాశ్వములతో విచ్చేసిన ఋచీకునిఁ జూచి గాధి తన కన్నులను దాను నమ్మలేకుండెను. దాన ఋచీకుఁడు లోకాతీతప్రజ్ఞాన్వితుఁ డని యాతనికి బోధపడెను. అతనిని గుఱించిన సంశయము లేమియు నిఁక లేకపోఁగా నాతఁ డమితానందమున నొక సుముహూర్తమునఁ దనయేకైక పుత్రికయగు సత్యవతిని ఋషి తల్లజుఁ డగు ఋచీకుని కిచ్చి విధ్యుక్తముగా దివ్యవైభవముతో వివాహము గావించెను. భూతజాల మెల్ల అందుల కమితానందమును వెల్లడించెను.

## పుత్త్రోదయము చరువృత్తాంతము

తదనంతరము ఋచీకుఁడు ధర్మపత్ని యగుసత్యవతిని దీసికొని పోయి యొక యాశ్రమమును నిర్మించుకొని యందుండి గృహస్థాశ్రమ

మును నిర్వర్తించుచునే తపస్స్వాధ్యాయప్రవచనములతోఁ గాలము గడపఁ దొడఁగెను. ఇట్లు కొన్ని సంవత్సరములు గతించినపిదప నొక నాఁడు ఋచీకుఁడు సత్యవతికి సంతానముఁ బ్రసాదింప నిచ్ఛగించి ఋతుస్నాతయై పరమపవిత్రముగ నున్నసమయమునఁ దనసంకల్ప మామె కెఱిఁగించి విమల వేదమంత్రములతో నొక్కచరువు (అగ్నిదేవుని కాహుతిచేయుటకు తయారుచేసిన అన్నము) సిద్ధము చేసి సత్యవతి కీయఁబోయెను. అంత నామె భయభక్తులతోఁ బతికి నతు లొనర్చి "దేవా! నా కొక్కకోరిక కలదు. అది మీ రనుగ్రహింపవలయును. మా తల్లి దండ్రులకు నే నొక్కతెనే బిడ్డను, వారికిఁ బుత్రహీనుల మను దుఃఖ మొకటి కలదు. నాకును తోడఁబుట్టినవాఁ డొకఁడు లేకపోయెనే యనుచింత కొంతకలదు. కావున, దయయుంచి యీచరువులో సగము నాకు సగము మాతల్లికి నిచ్చి యిరువురకుఁ బుత్రులు కలుగునట్లు వర మనుగ్రహింపవేఁడుదు" నని కోరెను.

ఋచీకుఁ డట్లే యని ఋతుస్నాతయై పవిత్రయై పుత్రకాంక్షాన్వితయై యున్న సత్యవతిమాతను రప్పించి యిరువురను గూర్చుండఁ బెట్టి వారివారికిఁ దగినట్లు బ్రాహ్మణ క్షత్రియ పాత్రములైన సౌమ్యక్షాత్ర మంత్రములతో రెండుచరువులను సిద్ధముచేసి బ్రాహ్మణోచితము, సౌమ్య మంత్ర సంసిద్ధమునగు చరువును భార్యయగుసత్యవతికి, క్షత్రియోచితము, క్షాత్రమంత్రసంసిద్ధమునగు చరువును సత్యవతితల్లికి నిచ్చి వాని నుపయోగింపుఁ డని చెప్పి ఋచీకుఁడు సమిత్కుశఫలాదులను దీసికొనివచ్చుటకు వనమునకుం బోయెను.

అపుడు సత్యవతితల్లి సత్యవతిని బిలిచి "బిడ్డా! లోకములో నెవ రైనను దమబిడ్డలు చాల గొప్పవారు కాఁగోరుదురు. అందుచే నీ పతి నీకుఁ గలుగఁబోవు బిడ్డఁడు గొప్పవాఁ డగునట్లు తగిన మంత్రములను జదివి చరు వొనరించి యది నీ కిచ్చియుండును. నేను పైదానను గాన, నాకు సామాన్యుఁ డగుసుతుఁడు కలుగునట్లు సామాన్య మంత్రములతోఁ జరువును దయారుచేసి యిచ్చియుండవచ్చును. ఆఁడుబిడ్డ తనసోదరుఁ డఖిలగుణసమగ్రుఁడు గాఁగోరును. కావున, నీ కిచ్చిన

చరువు నా కిమ్ము, నా కిచ్చినది నీవు గ్రహింపుము" అని పలికెను. అందులకు సత్యవతి యాశ్చర్యపడి "అమ్మా! ఇంతవిడ్డూరముగ మాటాడితివేమే? అట్టి పక్షపాతముచూపు సామాన్యునిగా నీ జామాత నెంచితివే? నేను నీ కోసమై ఆయనను బతిమాలి నీకును పుత్రసంతానము కలుగునట్లు వరమును గ్రహించితిని. అట్టి మాపట్ల నీ కిట్టి సందేహము కలుగుట దురదృష్టము. రెంటను నొకటే. నీ సందేహము పోవుటకు పోనీ నాదే నీవు తీసికొనుము. నీది నేను గ్రహింతు" నని తన కుద్దేశింపఁబడిన చరువును దల్లి కిచ్చి తల్లి యుపయోగింపవలసినది తాను గైకొని యిరువురు వానిని మహాప్రసాదముగా స్వీకరించిరి. తరువాత సత్యవతితల్లి బిడ్డను వీడుకొని తనపట్టణమున కేగి సుఖముండెను.*

ఋచీకమహర్షి యింటికి వచ్చి చరు వుపయోగించినవెంటనే గర్భవతి యైనసత్యవతిని జూచి యామెగర్భము రౌద్రగతి వర్తిల్లుటయుఁ గాంచి "సతీ! నేఁ జెప్పినచొప్పునఁ జేయక నీవు గైకొన వలసినచరువు మీయమ్మ కిచ్చి యామె గైకొనవలసినది నీవు గైకొంటివి. అందుచే నీగర్భ మింత రౌద్రముగ నున్నది. ఈ బాలుమాటువలన:

"భయదక్షత్త్రియకర్మతుండును మహాభాగుండు శస్త్రాస్త్రపా
ణియుఁ గానున్నసుతుండు పుట్టెడుసుమీ నీయందు! వేదాంతవే
దియు సత్యంతతపోధనుండు నవనీదేవాన్వయాచారవ
ర్తియుఁ గానున్నతనూభవుండు కలుగున్ దెల్లంబు మీతల్లి కిన్."

విష్ణుపురాణము, ౪ ౧౩౩.

(నీకు భయంకర మగుక్షాత్త్రధర్మమును పాటించుచు శస్త్రాస్త్రపాణి యగు కుమారుఁడు పుట్టును. మీతల్లికి వేదాంతవేది, మహాతపస్సంపన్నుఁడు. బ్రాహ్మణాచారవర్తి సాధువు నగుపుత్త్రుఁడు కలుగును) అని పలికెను.

---

* ఇది శ్రీవిష్ణుపురాణకథ. భారతమున తల్లిబిడ్డ లిరువురు పొరపాటున నొక రుపయోగింపవలసిన చరువును మఱియొక రుపయోగించి రనియు నందుచే బ్రహ్మక్షత్రములు తడఁబడె ననియుఁ గలదు.

అందుకు సత్యవతి భయభ్రాంతయై భర్తపాదములపైఁబడి తనతప్పు క్షమింపు మని ప్రార్థించెను. దాని కాతఁడు "ఇది దైవకృతము. కర్మమునుబట్టి బుద్ధి పుట్టుచుండును. అది తప్పింప సాధ్యము కా" దనెను. సత్యవతి మిక్కిలి ఖేదపడి తనబిడ్డ యంత కఠిన క్షత్రధర్మముచే భీతావహుఁడైనఁ దాను భరింపఁజాలననియు ఆ గుణములు తనపుత్రుని యందుఁగాక పౌత్రునియందైనయెడల గొంత మనమున కూఱట కలుగును కనుక, నట్లైన ననుగ్రహింపుఁ" డని భర్తను గోరెను. ఎట్టకేల కతఁడు దాని కనుమతించి యట్లే యగుఁగాక యని వరమును బ్రసాదించెను. *

---

* త్రికాలజ్ఞుఁ డగుఋచీకుని కీ విషయము తెలియనిదికాదు. అట్లు జరుగవలసియున్న దని యాతఁ డెఱుఁగును. అది పూర్వము బ్రహ్మ విధించినది. చ్యవనుఁడు ప్రయత్నించి మాన్పలేకపోయినది. ఒకప్పుడు దేవతలు మునీశ్వరులు బ్రహ్మలోకమున సభ దీర్చియున్న సమయమునఁ బ్రసంగవశమున భృగు కుశిక వంశములకు బ్రహ్మక్షత్రములు తడఁబడి వర్ణసంకర మగునని బ్రహ్మ పలికెను. ఆ సమయమున నచట నున్న చ్యవనమహర్షి యీ మాట వినెను. నాఁటినుండి యాతఁ డెట్లైనఁ దనభృగువంశము కుశికవంశముతో సంకరము కాకుండున ట్లొనరించు నుపాయముల నెన్నిఁటినో పన్నఁదొడఁగెను. తానే కుశికవంశమును నాశన మొనరించినచో నీప్రమాదము కలుగ దని భావించి కుశికభూపాలుఁ డగు కుశనాభునియింటి కేగి యాతని పరిచర్య లందుచున్నను నాతని నెందయినఁ దప్పుపట్టి యాతనివంశము నాశనమగు నట్లు శపించి తీరవలయు నని పట్టుపట్టి యుండెను. భార్యాసహితుఁడై కుశికభూపాలుఁ డతిశాంతియుతుఁడై యాతనికి సకలపరిచర్య లొనరించుచుండెను. చ్యవనుఁడు యోగశక్తి నదృశ్యుఁ డగుచు వచ్చుచుఁ బోవుచు నా దంపతులను గొట్టుచుఁ దిట్టుచుఁ బెట్టరానిబాధలఁ బెట్టుచు గొడ్ల బాదినటులు బాదుచు, తాను రథ మెక్కి వారిని లాగుమని కశాహతుల రక్తము కాలువలుగట్టఁ జేయుచు వారిశాంతమునకు భంగము కలిగించి శపింపవలయు నని విశ్వప్రయత్నములు చేసెను. కాని, చ్యవనమహర్షియే ఓడిపోయెను. కుశికభూపతియు భార్యయు సత్త్వగుణసంపన్నులై సర్వోత్తమమగు శాంతిసహనశక్తులతుది చూచినవారై దిగ్విజయము సాధింపఁ గలిగిరి. ఇఁక, చ్యవనమహర్షి పరమప్రీతుఁడై వారికిఁ గోరినవరము లనుగ్రహించి భువిపై దివి చూపి కుశికభూపతికి మూఁడవతరమువాఁడు బ్రహ్మతేజోదీప్తుఁ డయి పుట్టుననియుఁ దవ

తరువాతఁ గొంతకాలమునకొకశుభలగ్నమున సత్యవతి జమదగ్ని యనుసుపుత్త్రునిం గాంచెను. ఆమెతల్లియు విశ్వామిత్త్రునిఁ గనియెను. తదనంతరము ఋచీకమహర్షి సర్వసంగపరిత్యాగ మొనర్చి తపోవనమునఁ బరమైకాంతికుఁడై యోగ మవలంబించి బ్రహ్మైక్యమందుటకుఁ బోవుచుఁ బత్ని యగుసత్యవతికి శాశ్వత మగుపుణ్యనదీత్వము కలుగునట్లు వర మొసఁగి యామెను సంతృప్తిపఱచి వెడలిపోయెను. సత్యవతి కొంతకాలమైనపిదప కౌశికీనదీమతల్లియై శాశ్వతత్త్వముఁ బడసెను. జమదగ్ని యిక్ష్వాకు వంశజుఁడైన రేణు వనుమహారాజపుత్త్రిక యగురేణుకను వివాహమాడెను. ఆమెయందు :

"సకలక్షత్త్రికులప్రభంజనకళాసంపన్నబాహాబల
ప్రకటీభూతసమస్తలోకుఁడు మహీభారావతీర్ణప్రభా
వకళాకర్మరవైష్ణవాంశజననవ్యాపారశౌర్యుండు శం
భుకుమారప్రతిమానుఁడై పరశురాముం డుద్భవించెన్ ధరన్."

(విష్ణు పురాణము ౪-౧౩౭.)

మనుమఁడు ఋచీకుఁ డనువాఁడు గాధి కూఁతును బరిణయమై జమదగ్నిఁ గని యాతనియందు సకల ధనుర్వేదమును నిలుపు ననియు, శ్రీహరి యాతని పుత్త్రుఁడుగాఁ బరశు రామావతారముఁ దాల్చి భూమి నిఃక్షత్త్ర మొనరించుననియుఁ దెలిపెను.

# మహర్షుల చరిత్రలు

## కామందక మహర్షి

### బాల్యము

కామందకుఁ డొకమహర్షి. అతఁడు మహాతపస్సు చేసి ధర్మశాస్త్రములను అధ్యయనము చేసి వేదాదివిద్యలను సంపాదించెను. అతఁడు ధర్మతత్త్వజ్ఞుఁడుగ, నీతిశాస్త్రజ్ఞుఁడుగ, భారతమునఁ గానవచ్చుచున్నాఁడు. ఆ మహనీయుని జన్మవృత్తాంతము కాని యితరచరిత్ర కాని యేమియు లభింపలేదు.

కామందకుఁడు తపోజీవనముఁ గడపుచు ధర్మమూర్తియు నీతిపారగుఁడునై యుండెను. అంగరిష్ఠుఁడు (అరిష్టుఁడని కొన్ని భారత ప్రతులలో కలదు) అనురాజు కామందక మునికి శిష్యుఁడై యాతనివలన ననేక ధర్మవిషయములను దెలిసికొనుచు నాతనిని గురువుగ భావించి పూజించుచుండెను.

### అంగరిష్ఠునికి బోధించుట

ఒకప్పు డంగరిష్ఠుఁడు ధర్మార్థకామమోక్షము అనుచతుర్విధ పురుషార్థముల విషయమునను కొన్ని సందేహములు కలిగి ఆ సందేహములను గురుముఖమున నివారించుకొనఁ దలఁచి కామందకమహర్షి యాశ్రమమునకు విచ్చేసెను. కామందకుఁ డాతని నాదరించి అతిథి సత్కారములు నెఱపి వచ్చినపని అడిగెను. అతఁడు శ్రద్ధాభక్తులతో కామందకునికి నమస్కరించి "మహాత్మా! ధర్మార్థ కామములను గూర్చిన కొన్ని సంశయములు నాకుఁ గలవు. ఈ త్రివర్గములో దేనియందు ప్రధానముగా లోకయాత్ర నెలకొనియున్నది? దీనికి మూల మేమి? కామమోహావృతుఁ డగురాజు చేసినపాపములకు విఱుగుడు

కలదా? ఏ సుకృతములచే ఆ దుష్కృతమును బోఁగొట్టుకొనవచ్చును? అజ్ఞానముచే అధర్మమైనదానిని ధర్మముగా భావించి చేసినవానికి ప్రాయశ్చిత్తమేమి? ఇట్టి సంశయములకు నాకు సమాధానము చెప్పి కటాక్షింపు” మని ప్రార్థించెను.

కామందకుఁ డారాజు నాదరించి సావధానుఁడవై విను మని హెచ్చరించి యిట్లు చెప్పఁదొడఁగెను. “రాజా! ధర్మార్థకామములకు పరస్పరసంబంధము కలదు. అర్థమునకు మూలము ధర్మము, ఫలము, కామము. వీనికి సంకల్పము కారణము. ధర్మేతర మగు దానివలన సైతము అర్థము లభింపవచ్చును. కాని, అట్టి యర్థమువలన ధర్మార్థములకు పరమయినమోక్షము లభింపదు. ఫలమును కోరనిదే ఉత్తమమైన ధర్మము. ఫలమును కోరుటే, ధర్మమును మలీమస మొనరించుట యగును. అట్లే ఇంద్రియసంతుష్టిఁ గోరుటయే కామమును మలీమస మొనరించుట యగును. ఈ విధముగ మలీమసము కానిధర్మకామములు చిత్తశుద్ధికి హేతువులై మోక్ష మొసంగును.

ధర్మార్థములను విడిచిపెట్టి కేవలము కామమునే ఆరాధించువాఁడు ప్రజ్ఞాహీనుఁడై నశించును. కామమోహములవలననే ప్రజ్ఞ నశించును. ప్రజ్ఞ నశించుటే నాస్తికములకు, దురాచారమునకు కారణము. రాజు తా నీ స్థితికి వచ్చినను, లేదా తనప్రజ లీ స్థితికి వచ్చినపుడు వారిని శిక్షింపక విడిచినను, అతని పతనము సమీపించుట సూచించును. ఉత్తములగు ప్రజలు, ధర్మాత్ములగు బ్రాహ్మణులు, సాధుసజ్జనులు, అట్టిరాజును జూచి యసహ్యించుకొందురు. అట్టివార లసహ్యించుకొనుట వలన రాజు అవమానమును, దుఃఖమును, పతనమును అనుభవింప వలసివచ్చును.

అట్టి ఆపత్కాల మెకప్పుడు రాజునకు సంప్రాప్తించినయెడల, అతఁడు వెంటనే మేలుకొని తన్నివారణోపాయముల నాచరింపవల యును. వేదములను, విప్రులను, ధర్మమును మిక్కిలి పూజింపవల యును. క్షమ కలిగి, శాంతి నిలిపి, సత్యము నారాధించి, ఆస్తిక్య మును పెంచి, సంతోషమున సజ్జనసాధుసేవల నాచరింపవలయును.

మఱియు రాజ్యమునందలి దుష్కర్ములను దూరమునకుఁ దొలఁగింప వలయును. ధర్మాత్ములను దరిఁజేర్పవలయును. మంచి మాటలచేతను, మంచిపనులచేతను ప్రజలను ప్రసన్నులను జేసికొనవలయును. తనకు శత్రువు అయినను, వరులయుత్తమగుణము లనే శ్లాఘించుచు రాజు తనమంచినడవడి నిరూపింపవలయును. గురువుల వచనములపై గుఱి నిలిపి, వానిని ఆలసింపక, తర్కింపక ఆచరించి వారియనుగ్రహ మును, తన్మూలమున రాజు తన శ్రేయమును సంపాదించుకొనఁ గలుగును."

ఈ మాటలు విని యంగరిష్ఠుఁ డానందించి కామందకునికి అనేక నమస్కారము లొనరించి యాతనిసెలవు గైకొని వెడలి ఆ ప్రకార మాచ రించి ధర్మప్రభు వయ్యెను. *

## కామందక నీతిశాస్త్రము

కామందకుఁడు అపుడపుడు రాజులకు బోధించిన ధర్మముల సంక లనమే కామందకనీతిశాస్త్రము. ఇది 'కామందకనీతి' 'కామందకనీతి సారము' అనుపేళ్ల వ్యవహరింపఁబడుచున్నది. ఇది రాజనీతి బోధించును.

ఇందు ముప్పదియాఱుప్రకరణములు కలవు. మొదటిది ఇంద్రియ విజయప్రకరణము, రెండవది విద్యావినయసంయోగప్రకరణము, మూఁడవది విద్యావిభాగప్రకరణము, నాలుగవది వర్ణాశ్రమ వ్యవస్థా ప్రకరణము. ఐదవది దండమాహాత్మ్యప్రకరణము. ఆఱవది ఆచార వ్యవస్థాప్రకరణము, ఏడవది ప్రకృతిసంపత్ప్రకరణము. ఎనిమిదవది స్వామ్యనుజీవనవృత్తప్రకరణము, తొమ్మిదవది కంటకశోధనప్రకరణము, పదియవది రాజపుత్రరక్షణప్రకరణము, పదునొకండవది ఆత్మరక్షణ ప్రక రణము, పండ్రెండవది మండలయోనిప్రకరణము, పదుమూఁడవది మండల చరితప్రకరణము, పదునాల్గవది సంధివికల్పప్రకరణము, పదునైదవది

* భారతము, శాంతిపర్వము.

విగ్రహవికల్పప్రకరణము, పదునాఱవది యానాసన ద్వైధీభావ సంశ్రయ వికల్ప ప్రకరణము, పదునెనిమిదవది దూతప్రచార ప్రకరణము, పందొమ్మిదవది దూతచరవికల్పప్రకరణము, ఇరువదవది ఉత్సాహ ప్రశంసాప్రకరణము, ఇరువదిఒకటవది ప్రకృతికర్మ ప్రకరణము, ఇరువదిరెండవది ప్రకృతివ్యసన ప్రకరణము, ఇరువదిమూఁడవది సప్తవ్యసన వర్గ ప్రకరణము, ఇరువదినాలుగవది యాత్రాభియోక్తృప్రదర్శ ప్రకరణము, ఇరువదియైదవది స్కంధావార నివేశన ప్రకరణము, ఇరువదియాఱవది నిమిత్తజ్ఞాన ప్రకరణము, ఇరువదియేడవది ఉపాయవికల్ప ప్రకరణము, ఇరువదియెనిమిదవది సైన్యబలాబల ప్రకరణము, ఇరువదితొమ్మిదవది సేనాపతిప్రచార ప్రకరణము, ముప్పదియవది ప్రయాణ వ్యసన రక్షణ ప్రకరణము, ముప్పదియొకటవది కూట యుద్ధ వికల్ప ప్రకరణము, ముప్పదిరెండవది గజాశ్వ రథ ప్రతికర్మ ప్రకరణము, ముప్పదిమూఁడవది పత్త్యశ్వ రథ గజ భూమి ప్రకరణము, ముప్పదినాలుగవది దానకల్పన ప్రకరణము, ముప్పదియైదవది వ్యూహ వికల్ప ప్రకరణము, ముప్పదియాఱవది ప్రకాశయుద్ధ ప్రకరణము.

ఈ ముప్పదియాఱుప్రకరణములు ఇరువదిసర్గలలో గలవు. మొదటి సర్గలో మొదటిరెండుప్రకరణములు కలవు. రెండవసర్గలో మిగిలిన మూఁడు ప్రకరణములు కలవు. మూఁడవసర్గలో ఆఱవప్రకరణ మొక్కటి కలదు. నాల్గవసర్గలో ఏడవప్రకరణము గలదు. ఎనిమిదవప్రకరణము కలది ఐదవసర్గ. తొమ్మిదవప్రకరణము కలది ఆఱవసర్గ. పది, పదు నొకండు ప్రకరణములు కలది ఏడవసర్గ. పండ్రెండు, పదుమూఁడు ప్రకరణములు గలది ఎనిమిదవసర్గ. పదునాలుగు, పదునైదు ప్రకరణములు కలది తొమ్మిదవసర్గ. పదునాఱవప్రకరణము కలది పదవసర్గ. పదునేడవప్రకరణము కలది పదునొకండవసర్గ. పదునెనిమిదవ ప్రకరణము గలది పండ్రెండవసర్గ. పందొమ్మిది, ఇరువదిప్రకరణములు గలది పదుమూఁడవసర్గ. ఇరువదియొకటి, ఇరువదిరెండు, ఇరువది మూఁడు ప్రకరణములు గలది పదునాల్గవసర్గ. ఇరువదినాల్గవ ప్రకరణము పదునైదవసర్గ. ఇరువదైదవప్రకరణము పదునాఱవసర్గ. ఇరువదియాఱు, ఇరువదియేడుప్రకరణములు గలది పదునేడవసర్గ. ఇరువది

యొనిమిదవప్రకరణము కలది పదునెనిమిదవసర్గ. ఇరువదితొమ్మిది, ముప్పది, ముప్పదియొకటి, ముప్పదిరెండుప్రకరణములు గలది పందొమ్మిదవసర్గ. ముప్పదిమూఁడు, నాలుగు, ఐదు, ఆఱు ప్రకరణములు గలది యిరువదవసర్గ.

ఇందలివిషయ మీ విధముగ నున్నది: చంద్రుఁడు సముద్రము నుప్పొంగఁజేయునట్లు రాజు ప్రజలను సంతోషపెట్టవలెను. నావికుఁడు లేని నావవలె మంచిరాజులేని రాజ్యము నశించును. రాజు ధర్మమార్గ మవలంబించి ప్రజలను రక్షింపవలయును. అపుడు వారివలన నాతఁ డభ్యుదయముఁ గాంచును. న్యాయమార్గమున రాజు ధర్మార్థకామ పాలనముతోపాటు ప్రజాపాలనము కావింపవలయును. ధర్మమార్గ మవలంబించి పైజవనుఁ డనురాజు చిరకాల మేలెను. అధర్మమార్గ మవలంబించి నహుషుఁ డింద్రాధిపత్యమును గోలుపోయెను. రాజ్య మనుచెట్టు ధర్మమనుతల్లి వేరుతో సంపదలనుపండ్లనొసంగును. స్వామి అమాత్యుఁడు, రాష్ట్రము, బలము, దుర్గము, మిత్రులు, కోశము అను సప్తప్రకృతులతో కూడినదే రాజ్యము; సన్మార్గవర్తియగురాజు ఈ సప్తాంగములకు లాభము చేకూర్పవలయును. న్యాయముగా ధన మార్జించుట, ఆ ఆర్జించినదానిని చక్కగా సంరక్షించుట మఱియు దానిని మిగుల వృద్ధిచేయుట, యోగ్యులకు దాన మొసంగుట అను ఈ నాలుగు రాజవృత్తము లనఁబడును, వీనిని రాజు పాటింపవలయును.

నయమునకు మూలము వినయము. అది శాస్త్రపరిశోధనాఫలము. వినయ మింద్రియవిజయ మొసంగును. దానివలన సిరి లభించును. ప్రజ్ఞ శాస్త్రము, ప్రగల్భత, ధృతి, ధారణాశక్తి, దాక్షిణ్యము, సత్యము, కష్టసహిష్ణుత, ఉత్సాహము, త్యాగము, మైత్రి, దార్ఢ్యము, వాక్పుణ్యము, ఆభిజాత్యము, ప్రభుశక్తి, సుస్వభావము, దమము, శౌచము, కృతజ్ఞత, ఇవి ఎప్పుడైనను, ఎక్కడనైనను సంపదలకు హేతువులు. రాజు తొలుత పంచేంద్రియములను వశపఱచుకొని పిదప మంత్రిభృత్యసుతప్రజలను వినయాన్వితులనుగాఁ జేయవలయును. ప్రజానురక్తి, వినీతి గలరా జెప్పుడును శుభములనే పొందును. విష

యము లనెడిఅడవులలో యథేచ్ఛముగాఁ దిరుగుచు తమ్ముఁ బట్టనచ్చు వారిని పరిపరివిధముల బాధించు నింద్రియము లనుఏనుఁగును జ్ఞానమనుఅంకుశముచే పొడిచి వశపఱచుకొనవలయును. ఆత్మ ప్రయత్నముచే మనస్సు నింద్రియములపై పునకుఁ ద్రిప్పి భోగకాంక్ష కలుగఁజేయును. యత్నమువలన నింద్రియనిగ్రహ మొనర్చి రాజు జితేంద్రియుఁడు కావలయును. త్వక్చక్షుశ్శ్రోత్రజిహ్వాఘ్రాణము లనునైదును జ్ఞానేంద్రియములు. పాయూపస్థహస్తపదవాక్కులు కర్మేంద్రియములు. శబ్దస్పర్శరూపరసగంధములు, ఉత్సర్గహర్షగ్రహణగత్యాలాపములు, నింద్రియములు చేయుపనులు. వీనిని అంతఃకరణ మందురు. ఆత్మమనస్సులప్రయత్నమే సంకల్పము. ఆత్మకుఁ గలశ్రవణేంద్రియాద్యర్థములను 'బహిష్కరణ' మందురు. ఈ అంతఃకరణబహిష్కరణములు రెండును ప్రయత్నమువలననే కలుగుచుండును. ఆ ప్రయత్నము చేయకుండుటే అమనస్కత. మనస్సును జయింపలేనివాఁడు ఏమియు జయింప లేఁడు. శబ్దస్పర్శరూపరసగంధాదులలో నేదైనను నాశహేతువే. అన్నియుఁ గూడిన నిఁక వేఱె చెప్పనక్కఱలేదు. శబ్దమాధుర్యమునకుఁ జిక్కి శాకాహారియయ్యు మృగము నశించును. గిరీంద్రసదృశమైనయేనుఁగు ఆఁడేనుఁగు స్పర్శ నాశించుటచే బంధముఁ గాంచును. దీపపురూపమునకు ఆశపడి మిడుత నశించును. గాలపు మాంసము నాశించి మీనములు వలలో పడి నశించును. గంధలోభముచే తుమ్మెదలు సుగంధగండస్థలము నాశించి దానిచెవులదెబ్బలచేఁ జచ్చును. ఈ విధముగా నేఒక్కటియైనను ప్రమాదహేతువే యగుచున్నప్పుడు అన్నియుఁ గలిసిన నరుని కెప్పుడును క్షేమము లేదు. ఇంద్రియములను కాలానుసారము సేవించినయెడల నష్టపోఁడు. అట్లుకాక, ఎప్పుడును స్త్రీలోలుఁడైనవాని సంపదలు హానియౌవనముతోడనే జారిపోవును. ధర్మమువలన అర్థము, దానివలన కామము, దానివలన సౌఖ్యము పొందువాఁడే ధన్యుఁడు. అన్యుఁడు తననాశనమును దానే తెచ్చుకొనును. అందుదానిపేరే వికారము కల్పించి ఆపదకు హేతువగును. అట్టిపట్టున అందగత్తెను జూచినవానితపమునకు సందేహ మేలయుండును? నిర్మలము, కాంతియుతము నగుసంధ్యాసమయచంద్రబింబమువలె ప్రసన్నవదనాంబుజములగు స్త్రీ మునులపైతము రాగయుక్త

అను జేసి వశపఱచుకొనును. హృదయంగమయైనస్త్రీ, మందయాన మొనర్చుమగువ, నీరు, పర్వతమును భేదించునట్లు మహాత్ములైన భేదించును. పాండురాజు, నలమహారాజు, యాదవు లగుసాంబాదులు మున్నగువారిని దలఁచి రాజు వేఁట, జూదము, పానము తప్పక విడువ వలయును. కామక్రోధములను లోభమోహమదమాత్సర్యములను గాంచినమహారాజు లెందఱో భ్రష్టులై పోయిరి. అరిషడ్వర్గమును జయించినవారు నాభాగాంబరీషభార్గవులవలె శాశ్వతకీర్తి నార్జింతురు. విద్యావినయసంయోగము గలరాజు తావి యబ్బినమేలిమి బంగారము వలెఁ జాలశోభించును.

# మహర్షుల చరిత్రలు

## కౌశిక మహర్షి

### జపతత్పరత

పిప్పలాదమహర్షి వంశమున కౌశికుఁ డనునొకమునికుమారుఁ డుదయించెను. అతఁడు బాల్యము కడచి ఉపనీతుఁడై సదా జపతత్పరుఁడై యుండెను. మఱియు నతఁడు వేదవేదాంగవిదుఁడు, ధర్మశాస్త్రజ్ఞుఁడు, మహాప్రాజ్ఞుఁడు అనుగొప్పకీర్తి సంపాదించెను. అపరోక్షజ్ఞానము షడంగములవలన సంపాదించి హిమవత్పర్వత పార్శ్వప్రదేశము నాశ్రయించి ఆ మహనీయుఁడు సంహితాజపము బ్రాహ్మ మగు జపము నిరంతరాయముగా నిష్ఠాగరిష్ఠుఁడై చేయుచుండఁగా వేయి సంవత్సరములు గతించెను. అగ్నిహోత్రునివలె నాతఁడు తేజఃపుంజ మయ్యెను. అతఁడు మూర్తీభవించిన బ్రహ్మమో యన వెలుఁగొందుచుండెను. శీతవాతాతపములకుఁ జీకాకుపడక, లాభనష్టములయెడఁ దగులువడక, జపతపము లొనరించుటకే జన్మించి నట్లు విసుగువిరామము లెఱుఁగక జపతపములే యొనరించి శాంతిదాంతియుతుఁడై సంతుష్టహృదయుఁడై సర్వజనరంజకుఁడై యలరారుచుండెను.

### సావిత్రి ప్రత్యక్షమగుట

ఇట్లుండఁ గొంతకాలమునకు ఆ మహర్షి నిరుపమనిష్ఠకు మెచ్చి సావిత్రీదేవి యాతఁనికిఁ బ్రత్యక్షమయ్యెను. అతఁ డామెను గన్నెత్తి చూడఁడయ్యెను. అంత నామె "వత్సా! నీ జపనిష్ఠకు మెచ్చితిని. నేను సావిత్రిని. నీ కేమి కావలయునో కోరుకొనుము ఇచ్చెద" నని పలికెను. ఐనను, తనజపము నిలుపుచేసి మాటాడుట కిచ్చగింపక ఆ మహనీయుఁడు జపమునే చేయుచుండెను గాని యామెకు మ్రొక్కనైన మ్రొక్కఁ డాయెను. సావిత్రీదేవి చల్లనితల్లి యగుటచేతను, అతని

యుల్లము నెఱింగిన పల్లవితహృదయ యగుటచేతను అతఁడు తన్నుఁ దృఢీకరించినను ఆమె యాతనిని దృఢీకరింపక పోవుటే కాక, అతని జపనిష్ఠ నభినందింపఁ దొడఁగెను. ఇట్లు చాలసేపైనపిదప కౌశికుఁడు తన నియమము ప్రకారము జపము పరిపూర్తి యైన పిదప, కన్నులు విప్పి గాయత్రీదేవిని కాంచి శ్రద్ధాభయభక్తివినయ విధేయతలతో లేచి వచ్చి యామెపాదములపైఁ బడి తల్లీ! సర్వలోకములు శాంతిసౌఖ్యముల నలరారుటకు నీవే కారణము, నీవే సర్వవేదసారము. నీ చలువ వల్లనే నిఖిలలోకములు నిలిచియున్నవి. నేను మిగులమందబుద్ధినైనను, నీ నిర్వ్యాజకటాక్షమును నాపైఁ బఱపి నాయెడ పుత్త్రవాత్సల్యముంచి యిటు విచ్చేసితివి. ఎంతటి తపశ్శాలురకు నీ దర్శనము లభించుటరిది. అట్టిపట్టున నీ దర్శనము లభించిన నా భాగ్యము నెంతగ గొనియాడుకొందునో కదా! అమ్మా! ఆదరించి నన్ను నీవు ఆశీర్వదింపుము" అని ప్రార్థించెను.

కౌశికుని నిష్కల్మషహృదయమును మెచ్చుకొని అతని నిరుపమనిష్ఠ కలిగిన సావిత్రి "వత్సా! నీ కేకోరిక కావలయునో కోరుకొమ్ము, సిద్ధింపఁ జేసెదను. ఇంతటి నిష్ఠాగరిష్ఠునికోరిక లీడేర్చుటకంటె మాకుఁ గావలసిన దేమున్నది? నీకోరిక యెంతదుష్కరమైనదైన నిచ్చెదము. సందేహ ముడిగి సవినయముగాఁ గోరుకొను" మని చెప్పెను. అంత నాతఁడు చేతులు జోడించి నిలిచి "తల్లీ! నాయెడ నీకు కటాక్షము కలిగినచో నాజపనిష్ఠ ఇనుమడించునటులు, అది నీకు మఱింతప్రీతికర మగునటులు ననుగ్రహింపుము. జపమునఁ బుట్టి జపమునఁ బెరిగి జపశరీరుల మైన మా కింతకంటె వేఱుకోరిక యేముండును?" అని పలికెను. ఆమె మిక్కిలి సంతసించి "విప్రోత్తమా! నీవు కోరినకోరిక కోరికయే కాదు. ఐనను, నీవు కోరినట్లే యగునట్లు వరమిచ్చితిని. అది కాక ఇంకొకకోరిక కోరుకొనుము. కోరికతోఁ జేసినజపము ఫలవంతము కాదని నీవు భయపడనక్కఱ లేదు. నీకు శాశ్వతమైనబ్రహ్మప్రాప్తి యగును. ఏకాగ్రచిత్తముతో నీ విట్లే జపించుచున్న, అనతికాలముననే ధర్మదేవత వచ్చి నీమ్రోల నిలుచును. అంతే కాదు కాలమృత్యువులు నీకడకు విచ్చేయుదురు. నీకు శుభ మగు" నని యదృశ్యమయ్యెను.

పిదప, కౌశికమహర్షి మిక్కిలియుత్సాహమున జపతపస్స్వాధ్యాయదీక్షాసన్నద్ధుఁడై మఱియొకనూఱుదివ్యసంవత్సరములు కడపెను. అతని హృదయము ప్రశాంతపరిపూర్ణ మయ్యెను. దమ మాతనిసొమ్మయ్యెను. క్రోధాదు లాతనినే కాదు ఆ పరిసరములనే వీడి మాఱుమూలల మాటు మణఁగెను. శమదమములతో పాటు అతఁడు సత్యము, జ్ఞానము, అనసూయ పెంపొందించుకొనెను. అతఁడు జపసిద్ధిని గాంచెను. జీవితసార్థక్యమును గడించెను, జ్ఞానస్వరూపుఁ డయ్యెను.

## ధర్మదేవత ప్రత్యక్షమగుట

ఇట్లుండ ధర్మదేవత కౌశికమహర్షి గొప్పతనమును విని వెదకుకొనుచు నాతని దర్శనమునకు విచ్చేసెను. అనంతర మాతఁడు కౌశికునితో "బ్రాహ్మణోత్తమా! నీ నిష్ఠాగరిష్ఠత విని మెచ్చి నీదర్శనము కోరి వచ్చియున్నాను. నేను ధర్మదేవతను. నీ జపమునకుఁ దగినఫల మందుదువు. నిరతిశయములైన పుణ్యలోకములన్నియు నీవు సాధించితివి. నీకుఁ గావలసినలోకమున కేగి సుఖముల నందుము. ముం దీశరీరమును విడిచివేయుము" అని చెప్పెను. దానిపై నాతఁడు "అయ్యా! నీ కొక్కనమస్కారము. నా కేలోకము ఏ సుఖము నక్కఱ లేదు. ఈ లోకము, ఈ సుఖము, ఈ జపము నాకుఁ జాలును. నీవు ధర్ముఁడవైనను నీతో నాకుఁ బనిలేదు. పోయి రమ్ము శుభము" అని జవాబు చెప్పెను. ధర్ముఁ డందుల కాశ్చర్యపడి "ఓయీ! వెఱ్ఱివిప్రుఁడా! సిరి రా మోఁకాలొడ్డువాఁ డుండునా? ఎంతటివారికైనను, ఏమైనను, లభింపని పుణ్యలోకము నీకు దయతో ననుగ్రహింప మహానుగ్రహ మని స్వీకరింపక తృణీకరించెదవు? నీ కేమైన మతిస్థిరత చెడినదా యేమి?" అని పలికెను. అంత నా బ్రాహ్మణుఁడు "పోనిమ్ము. నీ వేమనుకొన్నను నాకు సంతోషమే. నీవు నన్ను విడిచినఁ జాలును. పొ"మ్మని వాక్రుచ్చెను. అంత ధర్ముఁ "డోయీ! ఈ పాంచభౌతిక మగుదేహముపై మమకారము విడువలేక యట్లు పలుకుచున్నావు. దీనిని శీఘ్రముగా విడిచివేసి శాశ్వతము లగుపుణ్యలోకముల నందుము." అని మరల బోధించెను. కాని, కౌశికమహర్షి "ధర్మప్రభూ! నేను సశరీరస్వర్గసుఖ

మున కంగీకరించెదను. సర్వ సుఖదుఃఖములకుఁ గారణభూతమైన యీ దేహమును నేను విడువలేను. నీ వేమన్నను సరియే" అని బదులు చెప్పెను.

## యమకాలమృత్యువులు ప్రత్యక్ష మగుట

**అపుడు** ధర్మదేవత కౌశికునిపట్టుదలకు జపతత్పరతకు సక్కఁబడి "ఓయీ! నీ శరీరమును విడువకుండుటకు నీ యిష్ట మేనా? ఇదిగో! యమకాలమృత్యువు లేతెంచియున్నారు. నిన్ను నీ శరీరమునుండి తొలఁగించి తీసికొనిపోవుదురు. ఏమి చేయఁగలవో చూతును. నీ బాగు నీ వెఱుఁగనప్పుడు బలవంతముగనైన నీకు క్షేమమును మేము సంఘటింతుము" అని పలికెను.

అంతలో యముఁడు, కాలము, మృత్యువు–ఈ ముఖ్వురును మానవరూపములను ధరించి వచ్చి కౌశికమహర్షియెదుట నిలిచిరి. కౌశిక మహర్షి వారికి నమస్కరించి నిలువఁగా యముఁ డాతనిని సంబోధించి తాను యముఁడ ననియు, కౌశికునిజపతపములకు, నిష్ఠాగరిష్ఠతకు మెచ్చి యాతని కుత్తమఫల మొసఁగుటకు విచ్చేసితి ననియు వాక్రుచ్చెను. అట్లే కాలముకూడ తన్నెఱుకపఱచుకొని కౌశికుఁడు స్వర్గాదిపుణ్య లోకముల కేగుటకు సమయము వచ్చినదనియు జీవుల పుణ్యపాపముల ననుసరించి స్వర్గాదులకుఁ గాని నరకాదులకుఁ గాని తత్ యైనవెంటనే పంపుటే తనపని యనియుఁ జెప్పెను. పిదప మృత్యువుకూడ కౌశిక మహర్షికి తన్నెఱుకపఱచుకొని కాలప్రేరణచే జీవులను సమయమైన వెంటనే గ్రమింగి కొనిపోవుటే తనపని యనియుఁ దెలిపి కౌశికమహర్షిని గొనిపోవుటకు వచ్చినసంగతి తెలిపెను.

వారిని జూచి కౌశికమహర్షి యణుమాత్రమును భీతిల్లక యమకాల మృత్యువులకు ధర్మదేవతకు సాష్టాంగప్రదక్షిణనమస్కారము లొనరించి అర్ఘ్యపాద్యాదుల నిచ్చి యాదరించి "అహా! నేఁడుకదా నా జన్మము ధన్యమైనది! మీలో నే యొక్కరిని జూచుటకు నెంతటివానికిని సాధ్యము

కాదు. అట్టిపట్టున మీ నలువురిదర్శనము నాకగుట నిజముగా నా పూర్వజన్మ సుకృతము, మీరు నాకు ఉత్తమోత్తము లగు అతిథు లైనారు. నాయందు దయచూపి నన్నేమి చేయుమందురో ఆనతిండు. మీ యాజ్ఞ శిరసావహించి ధన్యుఁడ నగుదును" అని పలికెను.

## ఇక్ష్వాకుమహారాజు విచ్చేయుట

ఇట్లుండ పుణ్యాత్ముఁడు, ధర్మనిలయుఁడు, తీర్థయాత్రాపరుఁడు నగు నిక్ష్వాకుమహారాజు తీర్థయాత్రలు చేసికొనుచు కౌశికమహర్షి యాశ్రమ ప్రాంతమునకు వచ్చి యాతని మహత్త్వము విన్నవాఁ డగుటచే నాతని దర్శనము చేసికొని పోవుద మని యాతని యాశ్రమమునకు వచ్చిచేరెను. అతనిని కౌశికమహర్షి యాదరించి అతిథిమర్యాదలు జరిపి కుశలవార్త లడిగెను.

ఇక్ష్వాకుమహారాజు తనకుశలవార్తలు తెలిపి ధనధాన్యాదులేమైనఁ గావలసినఁ గోరుకొమ్ము. ఇచ్చెద నని కౌశికమహర్షితో మనవిచేసికొనెను. ఆ మాటల కానందించి కౌశికమహర్షి "మహారాజా! నీ యభిమానమునకుఁ గృతజ్ఞుఁడను. లోకమునందలి బ్రాహ్మణులు ముఖ్యముగా రెండు రకములవారు. ప్రవృత్తిమార్గపరులు, నివృత్తిమార్గపరులు. ప్రవృత్తిమార్గపరులు వారికిఁ దగినప్రవృత్తి ధర్మములనే అవలంబింతురు. అట్లే నివృత్తిమార్గవర్తనులు వారికిఁ దగిననివృత్తి ధర్మముల నవలంబింతురు. నేను నివృత్తిమార్గమునను౦డి నియమనిష్ఠలు నిలుపుకొనుచున్నాను. కావున, నేను నీ నుండి యేమియు వాంఛింపను. ఏమైన బలవంతముగ నిచ్చినను తృణీకరింతును. అదియును గాక, లోకమునఁ బ్రవృత్తిపరు లెందఱెందఱో గలరు. వారికి నీ వంటివారిచ్చుటయు వారు కైకొనుటయు సమంజసము. కాని, అస్మాదృశులపట్ల నీ వితరణము నిరుపయోగము. నీకుఁ గావలసినదేమే నున్న నడుగుము. ఈయఁగలిగిన ఇచ్చెదను. కాన, నీకిచ్చువాఁడనే కాని నీకడఁ బుచ్చుకొనువాఁడను గాను" అని పలికెను.

ఆ మాటలకు ఇక్ష్వాకుమహారాజు "మునీంద్రా! మే ముత్తమ క్షత్రియులము. ఒక్క యుద్ధము తప్ప మే మింక నొరుల నేమియుఁ గోరము. మఱియు, యజనయాజనాధ్యయనాధ్యాపన దానప్రతిగ్రహ షట్కర్మనిరతు లగుబ్రాహ్మణులు యాచించినను స్వీకరించినను తప్పు లేదు. కాని, మేము స్వీకరింప" మని బదులుచెప్పెను. ఆ మాటలు విని కౌశికమహర్షి చాల సంతోషించి "మహారాజా! ఇప్పుడు మన మిరువురము స్వధర్మపరిపాలనమున సమానులము. ధర్మక్రియులము కావున, నిపుడు నీవేమి చేసినను నాకు సంతోషమే. ఇచ్చినను పుచ్చుకొన్నను నాకు సమ్మతమే" అని బదులు చెప్పెను. "ఐనచో నీ జపమువలన లభించినఫల మంతయు నాకు ధారవోయుము. ఏ మడిగిన నిచ్చెదనని వాగ్దానము చేసితివి కాన, నీ వాగ్దానము చెల్లించుకొనుము" అని ఇక్ష్వాకుమహారాజు పలికెను. ఆ మాటలు విని కౌశికమహర్షి "మహారాజా! ఒక్కయుద్ధము కాని నొరుల నేమియు నెప్పుడును గోరనంటివి కదా!" అని పలికెను. ఇక్ష్వాకువు "విప్రర్షీ! నీకును నాకును వాగ్యుద్ధమైనదికదా! కావున, నేఁ గోరినదోషము లేదు. ఇపుడు నిజముగా నీజపఫల మొసంగ వేఁడుకొందును" అని మరలఁ గోరెను. కౌశిక మహర్షి "రాజా! నిస్సంశయముగ నిచ్చెదను. నా వాగ్దానమును నిలుపుకొనుటకు నీవు నాప్రాణములనే యడిగినను ఇచ్చెదను పుచ్చుకొనవచ్చు" నని బదులుచెప్పెను. "ఐన, నీజపఫల మిమ్ము" అని ఇక్ష్వాకువు మరల నడిగెను. "అట్లే యిచ్చెదను గ్రహింపుము. నా జపమువలనఁ గలిగిన ఫలమునం దర్ధభాగము నీకుఁ గావలయునా? లేక పూర్తి భాగము కావలయునా? తెలుపు" మని కౌశికమహర్షి యిక్ష్వాకుమహారాజు నడిగెను. "మునీంద్రా! సగమో పూర్తియో చెప్పుటకుముందు నీజపముఫల మేమో నాకుఁదెలుపుము. అది తెలిసినఁగదా నేను కోరుకొనుట" అని మహారా జనెను. దానికి మహర్షి "రాజా! జపముచేయుటే నా వంతు. దానిఫలిత మేమని నే నెప్పు డెవ్వరి నడుగ లేదు. నాకుఁ దెలియదు. నిజముగ దానిఫలితము నా కక్కఱ లేదు. జపము జపముకొఱకే చేసితి" నని బదులుచెప్పెను. ఆర్యా! ఫలిత మేమో తెలియనిజపమును నీవు నాకు ధారవోయుట యేమి? నేను గ్రహించుటేమి? ముందు ఫలితము చెప్పి పిదప ధారవోయు" మని యిక్ష్వాకు వడిగెను. దానికి కౌశికమహర్షి

"మహారాజా! నేను చేసినవాగ్దానము ప్రకారము నా జపఫలము నీ కిదె ధారపోసితిని. దానిఫలితమును జెప్పుమంటివి. నిజముగా దానిఫలితముమ నే నెఱుఁగ ననుటకు మానవాకారములు ధరించి వచ్చిన యీ ధర్మకాలయమమృత్యువులే సాక్షులు. వారిని నీవు కనుఁగొనవచ్చు" నని పలికెను.

## కౌశికేక్ష్వాకుల విచిత్రవాదము

దానిపై నిక్ష్వాకుమహారాజు "నాకు సాక్షులతోఁ బని లేదు. నీ జపముఫల మేమియో నీవు చెప్పని యప్పుడు నా కది యవసరమే లేదు. నీవు ధారపోసిన నీ జపఫలము నేను స్వీకరింప లేను. కావున, నీవే దానిని పరిగ్రహింపు" మని పలికెను. "రాజా! నా జపఫలము నీకు ధారపోయుట యైపోయినది. ఇచ్చివేసినది తిరిగిపుచ్చుకొనుట లేదు. ఏ ఫలమాశించియు నేను జపము చేయ లేదు. మఱియు దానిఫల మిది యని తెలిసి చేయ లేదు. విప్రుఁడనై జన్మించితిని. వేదవేదాంగము లభ్యసించితిని. నిష్కామినై నిరుపమజప మొనరించుటే నావిధి యని నేను జప మొనర్చితిని. కనుక, జపఫలము నాకెంతమాత్రము తెలియదు. నీ వడిగితివి ఇచ్చివేసితిని. నాకు వలదు, నీవే తీసికొను మని మరల నీ వనుటయు ధర్మము కాదు. నేను తీసికొనుటయు ధర్మము కాదు. నేను సత్యవాదిని. నీవు సత్యవాక్యపరిపాలకుఁడవు. కావునఁ బరిగ్రహింపుము. అసత్యమాడువారు తాము తరింపలేరు. ఒరులను తరింపఁజేయలేరు. యాగములుకాని త్యాగములుకాని సత్యమును బోలఁజాలవు. వేయితపము లైన నొక్కసత్యముతో సాటి గావు. సత్యమే పరబ్రహ్మము, సత్యమే తపము, సత్యమే యజ్ఞము, సత్యమే వేదము, సత్యమే వేదచోదితము, సత్యమే ఉత్తమఫలప్రదము, సత్యమే ధర్మమూలము. సత్యము ననుసరించియే అగ్ని ప్రకాశించుచున్నది. సూర్యుఁ డుదయించుచున్నాఁడు. గాలి వీచుచున్నది. తపోయజ్ఞాదిధర్మము లెన్ని కూడినను ఒక్కసత్యముతో సాటి కాఁజాలవు. నీ వసత్య మాడితివా అధర్మ కారణమున భ్రష్టుఁడ వయ్యెదవు. ఇచ్చెద నన్నవాఁ డీయకున్నను, పుచ్చుకొందు నన్నవాఁడు పుచ్చుకొనకున్నను దుర్గతి నందుదురు.

కావున, మన మనుకొన్న ప్రకారము నీవు నేను ధారవోసిన జపఫలమును గైకొని నీవు కృతార్థుఁడవై నన్నుఁ గృతార్థు నొనరింపు" మని వేఁడు కొనెను.

దానిపై నాతఁడు "దయామయా! నేను ఉత్తమక్షత్రియుఁడను. ధర్మ యుద్ధము, ప్రజారక్షణము, దానకర్మములు నాకుఁ జెల్లునే కాని విప్రో చిత మగుదానపరిగ్రహణము నాకుఁ జెల్లదు. క్షమించి విడిచి పుచ్చు" మని ప్రార్థించెను. అందుల కాతఁడు "రాజా! నేనై నీ యింటికి విచ్చేసి దాన మిచ్చెదను. పుచ్చుకొను మన లేదు. నీయంతట నీవు వచ్చి రెట్టించి రెట్టించి దాన మిమ్మంటివి. ఇచ్చెదనన్నఁ దీసికొనవైతివి. ఇదెంత న్యాయముగ నున్నదో నీ వొక్కఁడవే చెప్పుము" అని గద్దించి యడిగెను.

అపుడు ధర్మదేవత నిజరూపమునఁ గానవై వారియిరువురి ధర్మ నిష్ఠకు మెచ్చి తన్ను వారి కెఱుకపఱచుకొని ద్విజునకు జపదానఫలము రాజునకు సత్యఫలము లభించుఁగాక! యని పలికెను. అంతలో స్వర్గము సాకారమై వచ్చి కౌశికేక్ష్వాకులకుఁ దన్నుఁ గూర్చి తెలుపుకొని యిరువురు సమానఫలభాగు లయ్యెద రనియు వివాదమును జాలింపుఁ డనియు విన్నవించెను.

ఇక్ష్వాకుమహారాజు స్వర్గమును సైతము సరకుచేయక దానితోఁ దనకేమియుఁ బ్రయోజనములే దని తెలిపి తా నింతవఱకుఁ జేసిన సమస్తపుణ్యములఫలితము నావిప్రునకు ధారవోసెద ననియు దాన నాతనికి స్వర్గమునకుఁ గొనిపోవచ్చు ననియుఁ బలికెను. ఆ మాటలు విని కౌశికుఁడు తాను సంహితాజపపరాయణుఁడ ననియు, నిష్కామి నినియు, నిర్లోభిననియు నట్టి త న్నెవరుగాని యేమి చూపిగాని లోభ పెట్టలేరనియు నట్లు లోభపెట్టఁజూచువారు నెగ్గలేరనియుఁ దాను స్వాధ్యాయశీలిని, అపరిగ్రహవ్రతపాలకుఁడ ననియుఁ జెప్పివేసెను. అంత నిక్ష్వాకుమహారాజు "నీవు నీ జపఫలము నాకు ధారవోసినట్లే నేను నాయాగఫలమును పుణ్యఫలమును నీకు ధారవోసితిని పరిగ్రహింపుము. అప్పు డుభయులము సమానుల మగుదు" మని వాక్రుచ్చెను.

## విరూపవికృత రూపుల వివాదము

ఈ వివాద మిట్లు కొనసాఁగుచుండఁగా నచటికి కుత్సితవస్త్ర ధారులు, వికృతవేషులు నగు నిరువురు పురుషులు జగడమాడుకొనుచు ''నీవు నాకు ఋణపడి యుండలే'' దని యొకఁడును, ''ఋణపడి యున్నాను. నీవు పుచ్చుకొనకతప్ప'' దని రెండవవాఁడును పలుకు చుండిరి. వారిరువురు ఇక్ష్వాకుమహారాజుదగ్గఱకు వచ్చి "రాజా! నీవు మా వివాదము విని న్యాయ మగుతీర్పు నిమ్ము; దానిని మేము పాటింతు" మని విన్నవించుకొనిరి.

ఇక్ష్వాకుమహారాజు వారిని జూచి ''మీ వివాద మేమో తెలుపుఁడు, సంగతివిని తోఁచినది చెప్పెద" ననెను. దానిపై విరూపుఁడు "రాజా! నే నీతని కొక గోదానఫలమిచ్చెద నని ఋణపడియుంటిని. దాని నిప్పుడు తీర్చెద నని నేను రాఁగా నీతఁ డది యంగీకరింపఁడయ్యెను అని చెప్పెను.'' ఆ మాటలు విన్న రెండవవాఁడు "మహారాజా! అది నిజము కాదు. ఆతఁడు నాకేమియు ఋణపడియుండలేదు. కావున, ఆతనికడ నే నేమియు గ్రహింపను" అని బదులుచెప్పెను. ఇక్ష్వాకుమహారాజు విరూపుని జూచి "నీ వాతని కేమి యేల ఋణపడియున్నావో తెలుపు" మని యడిగెను. అతఁ డిట్లు సమాధాన మిచ్చెను. "మహారాజా! ఈతఁ డొకప్పు డొకస్వాధ్యాయశీలుఁడు. దేవసన్నిభుఁడు నగు బ్రాహ్మణ ప్రవరుని కొకగోవును దానము చేసియుండెను. నే నొకసారి యీతనిం జేరి గోవు నుత్తమబ్రాహ్మణునికి దానముచేసిన యా ఫలితము నాకు ధారవోయు మని కోరితిని. అతఁ డట్లే యని దానిని నాకు ధార వోసెను. నేను నాతనికి ప్రతిఫల మీయఁదలఁచితిని. రెండు శ్రేష్ఠము లగు కపిలగోవులను గొనితెచ్చి నే నొకయుత్తమ విప్రునికి దానముచేసి ఆ వచ్చినఫలము నీతనిని గైకొనుమంటిని. ఈతఁడు కైకొన నను చున్నాఁడు. ఈతనికడ నేను ప్రతిగ్రహించినపు డీతఁడు నాకడఁ బ్రతి గ్రహింపవలదా? ఆతఁడు ప్రతిగ్రహింపఁడట! నేనుమాత్రము ప్రతి గ్రహింపవలెనఁట! ఇది యేటి న్యాయము! నీ వాలోచించి చెప్పు'' మని తెలిపెను.

అంత రాజు "ఓయీ! నీవాద మేమి" అని వికృతరూపు
నడిగెను. అతఁడు "రాజా! నేను జేసినగోదానమువలని ఫలమిమ్మని
యాతఁడు నన్నిడిగినాఁడే కాని యది ఋణముగ నని, తరువాతఁ దాను
ద్విగుణముగఁ దీర్చెద నని, నాతోఁ జెప్పలేదు. నే నాతనికి దానము
చేసితినే కాని ఋణముగ నీయలేదు. కావున, అతనికడఁ బరిగ్రహించు
ప్రస్తావనమే రాదు" అని బదులుచెప్పెను. దానిపై రాజు వికృత
రూపుని జూచి విరూపునికడనుండి ద్విగుణ ఫలమును బరిగ్రహించుటయే
ధర్మమని వక్కాణించెను. అది ధర్మము కాదని వికృతుఁ డనెను.
విరూపుఁడు రాజు చెప్పినట్లు చేయుమని తనకోరికఁ దీరుపుమని వికృత
రూపుని మఱిమఱి ప్రార్థింపఁదొడఁగెను. అతఁడు తన్ను మన్నించి
విడువు మని తా నేమైనను ప్రతిగ్రహింపఁజాల నని యనుచుండెను.

ఈ సంభాషణము విన్న కౌశికమహర్షి యిక్ష్వాకుమహారాజునుజూచి
తనదానమును బరిగ్రహింపు మని ప్రార్థించెను. ఇక్ష్వాకుమహారాజు
చాల వగచి యాజాపకునిదాన మే విధమున నంగీకరింతును? అంగీ
కరింపకుండు టెట్లు? ఇది యెక్కడి వైపరీత్యము వచ్చిపడినదో యని
మనమున దురపిల్లఁదొడఁగెను. మఱియు నాతఁడు "అయ్యో!
రా జయిపుట్టుటకంటె జాయయిపుట్టుట మేలు కదా! ఉత్తమక్షత్రియ
కులమునఁ బుట్టి ఇపు డిట్టి విప్రధర్మమునకు లోను గావలసివచ్చినదికదా!
నా వంటియవివేకి యిఁక నెచటను నుండఁడు" అని వాపోవఁ
దొడఁగెను.

కౌశికుఁ డింకఁ దాళఁజాలక "రాజా! నామాట విని నా దానమును
గ్రహింపవేని, ఇఁక నేను నా శాపాయుధమును వాడవలసి వచ్చును.
ఏ మందువు?" అని యడిగెను. ఇక్ష్వాకువు చాల ఖిన్నుఁడై తనదుర
దృష్టమునకు వగచి "మహాబ్రాహ్మణా! నీ విచ్చినది నేను పరిగ్రహించె
దను కాని, దానిని తిరిగి నీకే యిచ్చివేయుటకే కైకొనుచుంటి నని
గ్రహింపుము. ఇమ్ము" అని సిద్ధపడెను. కౌశికమహర్షి యాతనికిఁ
దన జపముఫలమంతయుఁ బరమేశ్వరార్పణ మని ధారవోసెను.
ఇక్ష్వాకువు "బ్రాహ్మణోత్తమా! నీ చేతినుండి నాచేతిలోఁ బడిన యీదాన
ధారయే నాచేతినుండి నీ చేతఁబడిన నా యాగపుణ్యదానధారగఁ బరి

గ్రహింతువుగాక! పరస్పరదానక్రియవలన మన ముభయులము కీడు లేని ధన్యత నందుదుము గాక" అని పలికెను.

అంత నచ్చట నున్న విరూపవికృతరూపు లిరువురు స్వస్వరూపములతోఁ గామక్రోధములుగాఁ బ్రత్యక్షమై తా మావికృత రూపములను ధరించి వచ్చుట వా రిరువురను బరీక్షించుటకే యనియు, ఆ పరీక్షలో నుభయులు దిగ్విజయ మంది నా రనియు నుభయులు యథేచ్ఛగా నెపుడు కావలసిన నపు డేలోకము కావలసిన నాలోకము నందుదురుగాక యని యదృశ్యులైరి.

కౌశికమహర్షి యిక్ష్వాకుమహారాజుదాన మంగీకరించి యాతని కోరికఁ దీర్చి "రాజా" నీ వింక నుత్తమత్వము నందుము. నీ యను మతిని నే నింకను సావిత్రీదేవి నుపాసించి జపమును గావించెద" ననెను. రాజు "మన ముభయులము తుల్యఫలభాగుల" మనెను.

ఇట్లు వా రుభయులు పరస్పరగౌరవములతో నుండఁగా యమ కాలమృత్యువులు ధర్మువు వారి నభినందించెను. వా రుభయులు ఈ నలువురకు సాష్టాంగప్రదక్షిణనమస్కారము లొనరించి తముపైఁ గురి యించిన కరుణావర్షమునకుఁ గృతజ్ఞతఁ దెలిపిరి. ఇంతలో, వారి నభి నందించుటకై దేవతలు, లోకపాలకులు మున్నగువారితో దేవేంద్రుఁ డచటికి విచ్చేసెను. ఆతనితో శరీరములను ధరించి శైలసముద్రా దులు, మఱియు నారదపర్వతాదు లగుదేవర్షులు విచ్చేసిరి. ఈసంగతి తెలిసికొని సహస్రశీర్షుఁ డగువిష్ణుదేవుఁడుకూడ విచ్చేసి వారి నభినం దించెను. దేవతలు వారిపైఁ బుష్పవృష్టిఁ గురియించిరి. అప్సరసలు నాట్యమాడిరి. తుంబురునారదులు వీణాలాపము లొనర్చిరి. గంధర్వులు గీతములు పాడిరి. జయజయధ్వానములు మిన్నుముట్టెను. అపుడు సాకారమున వచ్చినస్వర్గము కౌశికేక్ష్వాకులను సిద్ధపురుష అని యభి నందించెను.

అనంతరము కౌశికేక్ష్వాకు లొక్కసారిగ నింద్రియములను నుపసంహ రించి యైదువాయువులను మనసున నిలిపి, యటనుండి భ్రూమధ్య

భాగమును జేర్చి యోగ మవలంబించి ఆత్మను మూర్ధగత మొనర్చిరి. కౌశికమహర్షి బ్రహ్మరంధ్రమునుండి బయలువెడలి మహాజ్యోతిర్జ్వాలా మాలుఁడు, ప్రాదేశమాత్రుఁడు నగుపురుషుఁడు స్వర్గమునకుఁ బోయెను. దశదిశలు జయజయధ్వానము లొనరించెను. అ ట్లేగిన యా పురుషుని జ్యోతిర్బ్రహ్మ మట్లే వెడలిన ఇక్ష్వాకుని తేజమునకు స్వాగత మొసఁగెను. ఈ రెండుతేజములు పోయి త మ్మాహ్వానించిన బ్రహ్మదేవునిముఖమునఁ బ్రవేశించెను.

దేవతలు, దిక్పాలకులు, దేవర్షులు బ్రహ్మ ననేకవిధములఁ గీర్తించి జాపకులయు, యోగులయు మహోత్తమగతులు తెలిసికొంటి మని యానందించిరి. బ్రహ్మవారిని జూచి "దేవతలారా! మహాజపపరునివలె మహాయోగియు, మహాస్మృతిపాఠకుఁడు, అను స్మృతిపాఠకుఁడు, వీ రందఱుకూడ నా లోకము నంది శాశ్వతముగ నుందురు. కౌశికేక్ష్వాకు లను మహాపుణ్యపురుషుల బ్రహ్మసాయుజ్యముఁ గాంచఁగల్గిన మీ రెల్లరు ధన్యులు. మీకు శుభము అగుఁగాక! పోయి రం" డని వారిని వీడ్కొలిపెను.

ఈ విధముగా కౌశికమహర్షి సావిత్రి నుపాసించి మహోత్తమ బ్రహ్మర్షియై బ్రహ్మసాయుజ్యము నందఁగలిగెను.

# మహర్షుల చరిత్రలు

## దక్షమహర్షి

### జననము

బ్రహ్మదేవుని మనస్సునుండి మరీచి, అంగిరసుఁడు, అత్రి, పులస్త్యుఁడు, పులహుఁడు, క్రతువు అనుకుమారు లాఱుగురు జన్మించిరి. అతని కుడిబొటనవ్రేలినుండి దక్షుఁ డను మహాత్ముఁడు జన్మించెను. అతఁడు తండ్రి యనుమతి నేగి మహాతపస్సంపన్నుఁడు, దివ్యతేజస్వి యయ్యెను.

### వివాహము — సంతానము

దక్షుఁడు సర్వవేదశాస్త్రము లభ్యసించి మహాతపస్సు చేయుచు సర్వలోకసంపూజ్యుఁ డయ్యెను. అతఁడు యుక్తవయస్సు గన్నపిదప మనువు మూఁడవకూఁతు రగు ప్రసూతి యనునామెను బరిణయ మాడెను.

కాలక్రమమున నామె యం దాతనికిఁ బదునాఱుగురు కొమార్తెలు జన్మించిరి. వారు శ్రద్ధ, మైత్రి, దయ, శాంతి, తుష్టి, పుష్టి, ప్రియ, ఉన్నతి, బుద్ధి, మేధ, తితిక్ష, హ్రీ, మూర్తి, స్వాహ, స్వధ, సతి అను వారలు. వారిలో మొదటిపదుమూఁవ్వురను దక్షుఁడు ధర్మదేవుని కిచ్చి వివాహము చేసెను. స్వాహను అగ్నిదేవునికి, స్వధను పితృదేవునికి, సతిని సర్వేశ్వరుఁ డగుశివునికి నిచ్చి పెండ్లిండ్లు గావించెను.

### సంతానమునకు సంతానము

ధర్మదేవుఁడు తనభార్యలను పదుమువ్వురను, అమితప్రేమమున లాలించుచు వారియందఱకు నుత్తమసంతానము ననుగ్రహించెను. శ్రద్ధాదేవికి శ్రుతము, మైత్రికి ప్రసాదము, దయకు అభయము, శాంతికి

సుఖము, తుష్టికి ముదము, పుష్టికి స్మయము, క్రియకు యోగము, ఉన్నతికి దర్పము, బుద్ధికి అర్థము, మేధకు స్మృతి, తితిక్షకు క్షేమము, హ్రీకి ప్రశ్రయము, మూర్తికి నరనారాయణులు జన్మించిరి. ఈ ఉత్తమసంతానమగు నరనారాయణులు కలిగిన సమయమున వాయు దేవుఁడు మందమలయానిలముల వ్యాపింపఁ జేసెను. దశదిశలు మిగుల ప్రశాంతము లయ్యెను. పదునాలుగు లోకములు సంతోషసంభరితము లయ్యెను. దేవదుందుభులు తుములములై మ్రోఁగెను. సప్తసాగర ములు కలఁక లుడిగి ప్రసన్నము లయ్యెను. నదులు స్వచ్ఛజలము లతో శాంతముగఁ బ్రవహించెను. గంధర్వకిన్నర కామినులు గాన మాధుర్యముల నెల్లెడల నింపిరి. అప్సరసలు నాట్య మొనర్చిరి. దేవ తలు పుష్పవృష్టిని గురియించిరి. మునిబృందములు మోదమున ముప్పిరి గొన్న హృదయములతో వేదసంస్తుతుల వినిపించిరి. ప్రపంచ మంతయుఁ బరమశుభప్రదముగాఁ బరిఢవిల్లెను. బ్రహ్మాదిదేవతలు వచ్చి వారిని స్తుతించి వారికరుణఁ గోరి వెడలిరి. ఆ నరనారాయణులు తండ్రి యనుమతి గొని గంధమాదనపర్వతమునకు వెడలి తపోనిరతు లైరి.

అగ్నిదేవునివలన స్వాహాదేవి పావకుఁడు, పవమానుఁడు, శుచి అనుముగ్వురు కొడుకులను గాంచెను. పితృదేవునివలన స్వధ వయున, ధారిణి అను నిరువురు కన్యకలఁ గాంచెను. వారు జ్ఞాన విజ్ఞానపారగలై ప్రఖ్యాతి నందిరి.

దక్షమహర్షి సతి యను తనకూఁతును ఈశ్వరుని కిచ్చి వివాహము చేసెను. ఈప్రకార మాతఁడు తన పుత్రికల నుత్తమవరుల కొసఁగి వారిచే వారు సంతానవతులు కాఁగా ప్రజాపతి యయ్యెను.

ఇది శ్రీమద్భాగవతము చతుర్థస్కంధమునఁ గల కథ. దీనికిని భారతాదిపర్వమునఁ గలకథకును గొంత భేదము కలదు. ఆదిపర్వమున నిట్లు కలదు; బ్రహ్మదేవుని కుడిబొటనవ్రేలినుండి శాంతాత్ముఁడు, మహా తపస్సంపన్నుఁడు, మహాత్ముఁడునై దక్షుఁడనుమహర్షి జన్మించెను. బ్రహ్మ యెడమబొటనవ్రేలినుండి పుట్టిన కన్యను దక్షుఁడు వివాహ

మాడెను. ఆ దంపతులకుఁ గాలక్రమమున నేఁబదిమంది కూఁతులు కలిగిరి. అందచందముల నలరారుచు నత్యంతమనోహర లైనవారలనే దక్షమహర్షి పుత్రులనుగా భావించెను. ఆ కన్యకలు యుక్తవయస్సుఁ గన్నపిదప వారిలోఁ బదిమందిని ధర్మదేవునికిని, కశ్యపమహర్షి కిఁ బదుమువ్వురు కూఁతుండ్రను, చంద్రునకు అశ్విన్యాదు లగు నిరువది యేడుగురు కూఁతుండ్రను, ఇచ్చి దేవతావిధుల ననుసరించి దివ్యవైభవముగా వివాహములు చేసెను. కీర్తి, లక్ష్మి, ధృతి, మేధ, పుష్టి, శ్రద్ధ, క్రియ, బుద్ధి, లజ్జ, మతి అను పదిమంది ధర్మదేవుని భార్యలు. వీరి వలన ధర్మదేవుని కెనమండుగురు పుత్రులు కలిగిరి. వారే అష్టవసువులు. వారిపేళ్ళివి: ధరుఁడు, ధ్రువుఁడు, సోముఁడు, అహస్సు, అనలుఁడు, అనిలుఁడు, ప్రత్యూషుఁడు, ప్రభాసుఁడు.

భృగువు, పులస్త్యుఁడు, పులహుఁడు, అంగిరసుఁడు, అత్రి, క్రతువు, వసిష్ఠుఁడు, దక్షుఁడు, మరీచి అను నవబ్రహ్మలను బ్రహ్మ తన మనస్సునుండి పుట్టించెను. పిదప సంకల్పుఁడు, ధర్ముఁడు అనుకొడుకుల నిరువురను బ్రహ్మ సృజించెను. అనంతర మాతఁడు స్వాయంభువుఁడను మనువును శతరూప యను కుమారిని గాంచెను. శతరూపాస్వాయంభువు లిరువురు దంపతు లయి ప్రియవ్రతుఁడు, ఉత్తానపాదుఁడు అనునిరువురు కుమారులను, సూతి, ప్రసూతి అనునిరువురు కూఁతుండ్రను గాంచిరి. అందులో సూతిని రుచి యనుమహర్షియు, ప్రసూతిని దక్షుఁడును వివాహమాడిరి. రుచిసూతులకుఁ బండ్రెండుగురు కుమారు లుదయించిరి. దక్షునకుఁ బ్రసూతియందు ఇరువదినలువురు కొమార్తెలు కలిగిరి. వారిలోఁ బదుమువ్వురను ధర్మునికి, ఖ్యాతి యను కూఁతును భృగునకు, సతి యనుకూఁతును శివునికి, సంభూతి యను కూఁతును మరీచికి, స్మృతి యనుకూఁతును అంగిరసునికి, ప్రీతి యను నామెను పులస్త్యునకు, క్షమ యనునామెను పులహునకు, సంతతి యను నామెను క్రతువునకు, అనసూయను అత్రికి, ఊర్జ యనునామెను వసిష్ఠునికి, స్వాహను అగ్నికి, స్వధ అనునామెను పితరులకు, ఇచ్చి వివాహములు చేసెను అని మార్కండేయపురాణమునందుఁ గలదు.

## దక్షుఁడు ప్రాచేతసుఁ డైనవిధము

అజుని దక్షిణాంగుష్ఠమునుండి జన్మించిన దక్షుఁడు నవబ్రహ్మలలో నొకఁడైన సంగతి విన్న మైత్రేయమహర్షి పరాశరమహర్షి తోడి సంభాషణమున "దేవా! అజుని దక్షిణాంగుష్ఠమునుండి దక్షుఁ డుదయించి నవబ్రహ్మలలో నొకఁ డయ్యె నని యిదివఱ కంటివి. అతఁడు ప్రచేతసులకుఁ దనయుఁడై యెప్పు డేలజనించెనో చెప్పు" మని ప్రార్థించెను. దానిపై నాతఁ డిట్లు చెప్పెను. "బ్రహ్మ మానసపుత్త్రుఁ డైనదక్షప్రజాపతి మహాతపోధనుఁడు కావున, నాతని కెన్నఁడును కల్మషములు లేవు. సృష్టినిమిత్తము ప్రతిమన్వంతరమునఁ బ్రతియుగమున నొక్కొక్క ప్రజాపతి దక్షనామమున జన్మించి సృష్టికిఁ గర్తయై యుండును. కావున, ప్రచేతస పుత్రుఁ డైన దక్షుని చరిత్రముఁ దెల్పెద వినుము" అని ఆ చరిత్రఁ దెలిపెను.

పుణ్యమూర్తియు సమంచితకీర్తియు నగుదక్షుఁడు చిరకాలము విష్ణుమూర్తిని గుఱించి ఘోరమగు తప మొనరించెను. తుద కాతఁడు ప్రత్యక్షము కాఁగా నాతనివలన సచరాచరభూత సృష్టి యొనరించుటకుఁ దన్ను దక్షు నొనరింపు మని ప్రార్థించెను. అట్లే యని విష్ణుమూర్తి వర మొసఁగి యంతర్ధాన మయ్యెను. పిదప దక్షుఁడు బ్రహ్మయనుమతిని కిన్నరులను, సిద్ధులను, సాధ్యులను, మునులను, ఖేచరులను, భూచరులను, దేవతలను, రాక్షసులను, పన్నగులను, మానవులను, మృగములను, పక్షులను, మానస సృష్టియందుఁ బుట్టించెను. కాని, ఆ సృష్టి బహువంశపరంపరలఁ బ్రవృద్ధి నంద దయ్యెను. అందుల కాతఁడు మిగుల వగచి బ్రహ్మ పాలి కేగి మొఱపెట్టుకొనెను. అప్పు డాతఁ "డోయీ! నీ మానస సృష్టి నిలువనేరదు. కావున, నీవు వివాహమాడి మిథునకర్మ మారంభింపుము. దానివలన సంసృష్టి యగు. అది వృద్ధిపొందు" నని హిత ముపదేశించెను.

దక్షుఁ డంత బ్రహ్మయానతిఁ దలఁదాల్చి వరుణప్రజాపతి పుత్రిక యైన అసిక్ని యనునామెను వివాహమాడి యామెతో మిథున కర్మ

మొనరింపఁ దొడఁగెను. కాలక్రమమున నామెకు హర్యశ్వు లనువారైదువేలమంది జన్మించిరి. ఆ కుమారులను దక్షుఁడు చేరఁ జీరి "మీ రందఱును వివాహములు చేసికొని ప్రజాసృష్టి యొనరింపుఁడు. మిమ్మందఱను బ్రజాపతుల నొనరించెద" నని చెప్పి వారి నందులకు నియోగించెను. వారును వల్లె యని దక్షునియాజ్ఞ శిరసావహించి తన్నిమిత్తమై తప మొనరింప నేగిరి.

దక్షపుత్రు లట్లు తప మొనరించుచోటి కేగి నారదమహర్షి వారి కిట్లు బోధించెను. "వత్సలారా!

జలజభవాండము సర్వముఁ
గలయంగాఁ జూచి దేశకాలక్రమముల్
తెలియక ప్రజఁ బుట్టింపన్
దలఁచుట మీ కెల్ల వెఱ్ఱితనమౌఁ గాదే!"

(విష్ణుపురాణము 2-288)

అని బోధించి చనెను. వా రంద ఱాతనిమాటలు పట్టుకొని తలొక దిక్కునకుఁ బోయి తిరిగి రారైరి.

అట్లు కసిమసంగిన కొడుకుల గతికి విచారించి దక్షుఁడు వైతరణి అనునామెను వివాహమై ఆమెకును మిథునకృత్యము జరపెను. దాని వలన నామెకుఁ గాలక్రమమున వేయిమంది కుమారులు జన్మించిరి. వారికి శబళాశ్వులను పేరిడి వారిని వివాహమాడి సంతానవంతులు కండనియుఁ బ్రజాపతుల నొనరింతు ననియు దక్షుఁడు నియోగించెను. వారును మహాతప మొనరించి వివాహమాడ నిశ్చయించుకొని వనముల కేగి తప మారంభించిరి. అప్పుడు నారదుఁడు విచ్చేసి వారిపూర్వులకుఁ జెప్పినట్లే వారికిని జెప్పి వెడలిపోయెను. శబళాశ్వులు వేయిమందియు బయలుదేఱి యన్నలజాడ నెఱుఁగఁ బోయిరి. పిదప, వారిజాడ వీరికిఁ గాని వీరిజాడ తరువాతివారికిఁ గాని నాఁటికి నేటికి తెలియకుండఁ బోయెను. అందుచే నాటినుండి—

పరదేశము చరియింపఁగ
నరిగిన యగ్రజుల వెదక ననుజన్ములు పో
యిరయేని వారు వారును
మరలక యెందైనఁ బోయి మడియుదు రనఘా!

(విష్ణుపురాణము 2-267)

ఈ విధమున మరల నష్టసంతానుఁడైన దక్షుఁడు నారదుని గోపించి తనభార్య యగుపైతరణికి మరల మిథునకృత్య మొనరించెను. దానివలన నామెకు అఱువదిమంది కన్యక లుద్భవించిరి. వారు పెరిగి పెద్దవారైన పిదప వారిలోఁ బదిమందిని ధర్మునకు, పదుమువ్వురను కశ్యపునకు, ఇరువదియేడ్గురను చంద్రునకు, నలుగురను అరిష్టనేమికి, ఇరువురను బహుపుత్రునకు, ఇరువురను అంగిరసునకు, ఇరువురను కృశాశ్వునకు వారువారు వీరి వీరిని వరింప నిచ్చి వివాహములు కావించెను. పిదప, వారివారెల్లరకు మిథున కృత్యమువలననే బహుళ సంతానములు కలుగ సృష్టి విస్తరించెను అని శ్రీ విష్ణుపురాణమునఁ గలదు. ఈ కథయే శ్రీమద్భాగవతమున నీ విధముగాఁ గలదు.

ప్రాచీనబర్హిషు అనుపేరుగల ప్రచేతసులు పెక్కురు మహాసముద్రమునుండి వెలుపడివచ్చి బహువృక్షములతోఁ గూడియున్న భూమిని జూచిరి. వారికి వృక్షములపై మిక్కిలికోపము వచ్చెను. అందుచే వారు తమ నోళ్లనుండి మహావాయుసంయుతమైన అగ్నిజ్వాలలను గల్పించి యా వృక్షముల నన్నిటిని గాల్పఁ దొడఁగిరి. అది చూచి వృక్షప్రియుఁ డగుచంద్రుఁడు విచ్చేసి "ఓ మహాత్ములారా! మీకోప మిట్లీ చెట్లపైఁ జూపఁదగునా? మీరు పుట్టఁగనే మిమ్ముఁ బ్రజాపతు లని మీతండ్రి పలికెను. మీరు ప్రజాసృష్టికై జన్మించినవారు. ఈ విధముగా వృక్షసంతతిని దహించుట భావ్యముకాదు. ఈ వృక్షాదులు ప్రాణుల కన్నాదిక మొసఁగి పోషింప భగవంతునిచే సృష్టింపఁబడినవి. మఱియు, ఆ భగవంతుఁడే మిమ్ము పాపరహితులుగను దయామయులుగను సృష్టించెను. కావున మీ రీ పాపకృత్యము మానుఁడు. వృక్షముల రక్షింపుఁడు.

“తప్పక యర్భకావలికిఁ దల్లియుఁ దండ్రియు; నేత్రపంక్తికిన్
ఱెప్పలు; నాతికిం బతియు; ఱేఁడు ప్రజావలి కెల్ల; నర్థి కిం
దొప్ప గృహస్థు; మూఢులకు నుత్తము లెన్న సమస్తబాంధవుల్
ముప్పునఁ గావలేని కడుమూర్ఖులు గారు నిజాల చుట్టముల్.

అఖిలభూతముల దేహాంతస్థ మగునాత్మ
యాతఁ డచ్యుతుఁ డని యెఱుఁగవలయు;
నెఱిఁగి సర్వం బైన ఇందిరారమణు లో
చూపునఁ దనివిగాఁ జూడవలయుఁ;
జూచిన చిద్రూపశుద్ధాత్ములగు మిమ్ము
నెనసిన వేడ్కతో నిచ్చ మెచ్చు;
మెచ్చిన సర్వాత్ము మీ రెఱింగినచోటఁ
గోపగుణంబులఁ బాపవలయుఁ;
బాపి దగ్ధశేషపాదపజాలంబుఁ
దియ్య మెసఁగ బ్రదుకనియ్యవలయు
ననఘులార! మీర అస్మదీయప్రార్థ
నంబు పరఁగఁ జేకొనంగ వలయు.

(భాగ. ౪, ౨౦౦, ౨౦౧)

ఈ వృక్షములనుండి జన్మించిన మారిష యను కన్యారత్నమును మీ కిచ్చి వివాహము చేయుదును. మీ రామెను గైకొని సంతోషించి వృక్షదహనము మానుఁడు” అని చెప్పి చంద్రుఁడు మారిష యనునామెను వారి కొప్పగించి వెడలిపోయెను.

ప్రచేతసులు దాని కంగీకరించి యామెను గ్రహించి శాంతచిత్తులైరి. కాలక్రమమున వా రామెను రమింపఁగా నామెకు దక్షుఁడు ప్రాచేతసుఁ డనుపేర బ్రహ్మసమానుఁడై జన్మించెను. పిదప నాతఁడు పెక్కువిధముల ప్రజాసృష్టి యొనరించెను. తన మనస్సునుండి కొందఱిని, అకుంఠితవీర్యముచేఁ గొందఱిని, భూచర, ఖేచర, వనచర, జలచర, దివాచరులను, నరసురగరుడోరగకిన్నర దానవయక్షపక్షిపర్వతవృక్షలతాదులతోఁ గూడినసమస్త జీవములను దక్షుఁడు సృష్టించెను. ఈ సృష్టితో

నాతఁడు సంతుష్టి నందక వింధ్యపర్వతప్రాంతమున కేగి విష్ణుమూర్తిని గుఱించి అఘమర్షణ మనుతీర్థమును సేవించుచు మహాతప మొనరించెను. కొంతకాలమునకు విష్ణు వాతనికిఁ బ్రత్యక్ష మయ్యెను; దక్షుఁడు హంసగుహ్య మను స్తోత్రమున విష్ణు నిట్లు స్తుతించెను.

“ నమః పరాయావితథానుభూతయే
గుణత్రయాభాసనిమిత్తబంధవే,
అదృష్టధామ్నే గుణతత్త్వబుద్ధిభి
ర్నివృత్తమానాయ దధే స్వయంభువే.

న యస్యసఖ్యం పురుషోఽవైతి సఖ్యు
స్సఖావసన్ సంవసతః పురేఽస్మిన్,
గుణో యథా గుణినోఽవ్యక్తదృష్టే
స్తస్మై మహేశాయ నమస్కరోమి.

దేహోఽసవోఽక్షా మనవో భూతమాత్రా
నాత్మానమన్యం చ విదుః పరం యత్,
సర్వం పుమాన్వేద గుణాంశ్చ తద్జ్ఞో
న వేద సర్వజ్ఞ మనంతమీడే.

యదోపరామో మనసో నామరూప
రూపస్య దృష్టస్మృతిసంప్రమోషాత్,
య ఈయతే కేవలయా స్వసంస్థయా
హంసాయ తస్మై శుచిషద్మనే నమః.

మనీషిణోఽంతర్హృది సన్నివేశితం
స్వశక్తిభిర్నవభిశ్చత్రివృద్భిః,
వహ్నిం యథా దారుణి పాంచదశ్యం
మనీషయా నిష్కర్షంతీహ గూఢమ్.

సవై మయాశేషవిశేషమాయా
నిషేధనిర్వాణసుఖానుభూతిః,
స సర్వనామా స చ విశ్వరూపః
ప్రసీదతా మనిరుక్తాత్మశక్తిః.

యద్యన్నిరుక్తం వచసా నిరూపితం
ధియాక్షభిర్వా మనసోతయస్య,
మాభూత్స్వరూపం గుణరూపబృంహితం
స వై గుణాపాయ విసర్గ లక్షణః.

యస్మిన్ యతో యేన చ యస్య యస్మై
యద్యోయథా కురుతే కార్యతే చ,
పరావరేషాం పరమం ప్రాక్ప్రసిద్ధం
తద్బ్రహ్మతద్ధేతు రనన్యదేకమ్.

యచ్ఛక్తయో వదతాం వాదినాం వై
వివాదసంవాదభువో భవంతి,
కుర్వంతి తేషాం ముహురాత్మమోహం
తస్మై నమోఽనంతగుణాయ భూమ్నే.

అస్తీతి నాస్తీతి చ వస్తునిష్ఠయో
రేకస్థయోర్భిన్నవిరుద్ధధర్మయోః,
అపేక్షితం కించ న యోగసాంఖ్యయో
స్సమం పరం హ్యనుకూలం బృహత్తత్.

యోఽనుగ్రహార్థం భజతాం పాదమూలం
హ్యనామరూపో భగవా ననంతః,
నామాని రూపాణి చ జన్మ కర్మభి
ర్భేజే స మహ్యం పరమః ప్రసీదతు.

యః ప్రాకృతైర్జ్ఞానపదైర్జనానాం
యథాశయం దేహగతో విభాతి,
యథానిలః పార్థివమాశ్రితో గుణం
స ఈశ్వరో మే కురుతాన్మనోరథమ్.

శ్రీమద్భాగవతము. ౬ స్కం. ౨౩-౩౪.

ఈ శ్లోకములకు శ్రీ పోతన్నగారి తెలుఁగు అనువాదము.

"పరమునికి వందనము సేతుఁ బరిఢవించి
మున్న వితథానుభూతికి మ్రొక్కికొందు
మెఱయ గుణములఁ దేలు నిమిత్తమాత్ర
బంధుడైనట్టివానికిఁ బ్రణుతిసేతు.

తవిలి గుణులచేతఁ దత్త్వబుద్ధులచేత
నిగిడి కానరానినెలవువాని
మొదలఁ దాన కలిగి ముక్తిమానావధి
రూపఁ మైన వాని ప్రాపుఁ గందు.

ఎల్ల తనువులందు నిరవొంది తనతోడఁ
బొందు సేసినట్టి పొందుకాని
పొందు పొంద లేఁడు పురుషుండు గుణము నా
గుణిని బోలునట్టి గుణి భజింతు.

పూని మనంబునుం దనువు భూతములున్ మఱి యింద్రియంబులున్
బ్రాణములున్ వివేకగతిఁ బాయక యన్యముఁ దమ్ము నెమ్మెయిం
గానఁగ నేర వా గుణనికాయములం బరికించునట్టి స
ర్వామగతున్ సమస్తహితు నాదిమపూరుషు నాశ్రయించెదన్.

మఱియు ననేకవిధ నామరూప నిరూప్యం బగు మనంబునకు దృష్టస్మృతుల నాశంబువలన గలిగెడును పరామం బగు సమాధియందుఁ గేవల జ్ఞానస్వరూపంబున దోఁచు నిర్మలప్రతీతిస్థానం బైన హంసస్వరూపికి నమస్కరింతు. దారువందు నతిగూఢం బైనవీతిహోత్రుని బుద్ధి

చేతం బ్రకాశంబు నొందించుభంగి బుద్ధిమంతులు హృదంతరంబున సన్నివేశుండయిన పరమపురుషుని నాత్మశక్తిత్రయింబులచేతం దేజరిల్లం జేయుదు రట్టిదేవుండు సకల మాయావిచ్ఛేదకం బయిననిర్వాణ సుఖానుభవంబులం గూడి యుచ్చరింపంగొలందికాని శక్తిగల విశ్వరూపుండు నాకుం బ్రసన్నుం డగుంగాక! వాగ్బుద్ధీంద్రియ మానసంబులచేతం జెప్పను, నిట్టిదని నిరూపింపను నలవి గాక యెవ్వని గుణరూపంబులు వర్తించు నెవ్వఁడు నిర్గుణుండు సర్వంబు నెవ్వని వలన నుత్పన్నం బగు నెవ్వనివలన స్థితిం బొందు, నెవ్వనివలనలయం బగు, నట్టిపరాపరంబులకుం బరమంబై, యనన్యంబై ప్రాక్ప్రసిద్ధంబై యదియు బ్రహ్మంబై, యాదికారణంబై యున్న తత్త్వంబు నాశ్రయింతు. ఎవ్వనిప్రభావంబు మాటలాడెడువారలకు, వాదంబు సేయువారలకు వివాదస్థలంబ లగుచు, నప్పటప్పటికి మోహంబునొందించుచుండు నట్టి యనంతగుణంబులు గల మహాత్మునకు నతిభక్తిం బ్రణామంబు సేయుదు; నస్తి నాస్తి యనువస్తుద్వయనిష్ఠలం గలిగి యొక్కటన యుండి విరుద్ధధర్మంబులుగాఁ గనఁబడు నుపాసనాశాస్త్ర సాంఖ్యశాస్త్రంబులకు సమంబై వీక్షింపఁ దగిన పరమంబు నాకు ననుకూలంబగుంగాక! ఎవ్వఁడు జగదనుగ్రహంబుకొఱకు జన్మకర్మంబుల చేత నామరూపంబు లెఱుంగంబడకుండియు నామరూపంబులు గలిగి తేజరిల్లు నట్టి యనంతుండయిన భగవంతుండు ప్రసన్నుండగుంగాక! ఎవ్వండు జనులకుఁ బురాకృతజ్ఞానపదంబులచేత నంతర్గతుండై మేదినిం గలుగు గంధాదిగుణంబుల నాశ్రయించిన వాయువుభంగి మెలంగుచుండు నా పరమేశ్వరుండు మదీయమనోరథంబు సఫలంబు సేయుంగాక!"

(భాగ. ౬స్కం-౨౧౩-౨౧౮)

## దక్షుఁడు నారదుని శపించుట

దక్షుఁ డాతని నతిభయభక్తులనిట్లు స్తుతింప విష్ణు వా దక్షునకు అసిక్ని యనుపంచజన ప్రజాపతి తనయ నిచ్చి యామెవలన సంతాన వృద్ధి నందు మని చెప్పి యదృశ్యుఁ డయ్యెను. దక్షుఁ డామెను

గ్రహించి యామెకు హర్యశ్వు లను పేరనొప్పు పదివేలమంది పుత్రుల నొసంగెను. వారు తండ్రియాజ్ఞ చొప్పున నారాయణసరస్సనుతీర్థ ప్రాంతమున కేఁగి యుగ్రతప మొనరించుచుండ నారదుఁ డటకు విచ్చేసి వారికి నివృత్తిమార్గము నుపదేశించి చనెను. వా రాతని మాటలు తలకెక్కి యాతనికి వందనము లొనర్చి తిరిగి యెన్నఁడురాని తెరువుఁ బట్టి పోయిరి.

ఈ సంగతి నారదుఁడే వెళ్ళి దక్షునికిఁ దెలుప నాతఁడు విచారించి బ్రహ్మప్రేరణచే మరల శబళాశ్వు లనువారిని గని వారిని సృష్టిచేయ నియమించి తపమునకుఁ బంపెను. వా రేఁగి నారాయణ తీర్థముననే తప మొనరింపఁ జూడ నారదుఁడేఁగి మరల వారినికూడ నివృత్తిపరుల నొనర్చెను. వారు తపముఁ మాని తిరిగి రాని తెరువునఁ బోయిరి. ఈ సంగతి యెఱిఁగి దక్షుఁడు నారదునిఁ గోపించి "భాగవతోత్తములలో లజ్జాహీనుఁడవై యశోహానిపొంది చరింతువుగాక! నీ వెల్లరిచేతను కలహభోజనుఁడ వని పిలువఁబడుదువుగాక! నీవలన మిత్రభేదమే కాని మిత్రలాభము కాకుండుఁగాక! నేఁటినుండి పురుషుఁడు విషయసుఖంబు లనుభవించిన పిదపనే కాని జ్ఞానము గ్రహింపకుండుఁగాక! నీ వేలోక మునను నిలుప నీడ లేక నిత్యసంచారముననే నిలుతువుగాక" అని శపించెను. పిదప, నాతఁడు, బ్రహ్మపనుపునఁ బ్రియభామ యగు అసిక్నియందుఁ బెక్కురు పుత్రికలం బుట్టించి వారిలో ధర్మునకుఁ బది మందిని కశ్యపునకుఁ బదునేడుగురను, చంద్రుని కిరువదేడ్వురను, భూతి, అంగిరసుఁడు, కృశాశ్వుఁడు అనువారి కిద్ద ఱిద్దఱి నిచ్చి వివాహ ములు చేయ వారు వారివారి భర్తలవలన సంతానము నందఁగా సృష్టి చక్కగా విస్తరించెను.

## దక్షుఁడు చంద్రుని శపించి కటాక్షించుట

చంద్రుఁడు తాను పెండ్లాడిన దక్షపుత్రికలం దందఱియందును సమానానురాగము చూపక రోహిణియందు మాత్రమే బద్ధానురాగుఁడై మిగిలినవారి నుపేక్షింపఁ దొడఁగెను. వారు తండ్రి యగు దక్షునితోఁ

దనుబాధ తెలిపికొనిరి. ఆ సంగతి విని దక్షుఁడు చంద్రుని బిలిచి యాతని దోషము చెప్పి తత్ఫలితముగా క్షయరోగము సంతానహీనత కలుగునట్లు శపించెను. చంద్రుఁ డాతని పాదములపైఁ బడి క్షమింపు మనియు నిఁక నెన్నఁడు సంతతి పత్నులను సమానముగనే చూతు ననియు మాట యిచ్చెను. అంత దక్షుఁ డందులకు సంతోషించి క్షయ పీడితము అగు షోడశకళలను మరల ననుగ్రహించెను. కాని, చంద్రు నకు దక్షశాపమున నిజభార్యలయందు సంతానము లేకపోయెను. ఈ సంతానకాంక్ష, బృహస్పతికిఁ గలిగిన శాపము, కారణములుగా నీతఁడు తారను రమించి బుధమహర్షిని బుట్టించి యీ విధముగఁ బరభార్య యందు సంతానము గలవాఁ డయ్యెను. *

## దక్షుఁ డీశ్వరునిపైఁ బగగొనుట

తొల్లి బ్రహ్మ యొనరించు సత్త్రయాగముఁ జూచు కుతూహలమున విష్ణుమహేశ్వరులు, ఇంద్రాదిదేవతలు, మహర్షులు వచ్చి కూర్చుండిరి. అంతఁ గొంతసేపటికి దక్షమహర్షి ఆ సత్త్రయాగము చూడ నేతెంచెను. ఆతఁడు రాఁగానే యెల్లరు లేచి నిలిచిరి. కాని, బ్రహ్మ, ఈశ్వరుఁడు ఇరువురు కూర్చుండియే యుండిరి. అపుడు దక్షుఁడు విష్ణుమూర్తికి నమస్కరించి భక్తిపరవశులై సభ్యులు తన కిచ్చినపూజలు గైకొని, ఉచితాసనమునఁ గూర్చుండి శివునివంకఁ గసుఱ్ఱుఁ జేయుచుఁ జూచి సభ్యులెల్లరఁ దిలకించి “ఓ దేవతలారా! దిక్పాలకులారా! సభ్య మహాశయులారా! ఈ శివునిపొగరు చూడుఁడు. ఈతఁడు క్రియాశూన్యుఁడు, సిగ్గు లేనివాఁడు, సావిత్రీసమానురా లగు నా కూఁతురగు సతీదేవిని నే నీతని కిచ్చినగర్వమునఁ గాఁబోలు నన్నుఁజూచి లేచి నిలువఁడయ్యెను. కానీ దానికేమనుకొంటిని. నోటితోఁ బలుకరింప నైనఁ బలుకరింపఁ డాయెను. ఈతఁడు మానహీనుఁడు, ఉన్మత్తుఁడు, దిగంబరుఁడు, భూతప్రేతపిశాచపరివృతుఁడు, శుచిహీనుఁడు, అస్థిమాలాధరుఁడు, దుష్టహృదయుఁడు, ఉగ్రుఁడు, శ్మశానవాసి. ఇట్టి శివునికి శివనామము కలుగుట ప్రవాదము. నేను తెలియక వేదము శూద్రుని

* బ్రహ్మవైవర్తపురాణము, భాగవతము, చతుర్థస్కంధము.

కిచ్చినటులు నాకూఁతు నీతని కిచ్చి పెండ్లి చేసితిని. నన్నీతఁడు చేసిన తృణీకారమున కీతనికి శాప మిచ్చుచున్నాను. ఈతఁ డింద్రాదులతో నున్నను యాగభాగముల కర్హుఁడు కాకుండుఁగాక!" అని శపించెను. సదస్యులలోఁ బెక్కురు లేచి దక్షుని నిందించిరి. అంత నాతఁడు కోపమున నట నుండనోపక లేచి వెడలిపోయెను.

అపుడు నందికేశ్వరుఁడు దక్షుఁడు చేసిన శివనిందకు, ఇచ్చిన శాపమునకు మండిపడి "ఈ మూఢాత్ముఁడు తత్త్వవిముఖుండగుఁగాక! ఈతఁడు కూటధర్మము అయిన గ్రామ్యసుఖకాంక్షలయందు సక్తుఁడై అర్థవాదము లైనవేదములచే బుద్ధిహీనుఁడై కర్మపరుఁడగుఁగాక! దేహాదికములు ఉపాదేయములుగా తలఁచుచు బుద్ధిచే ఆత్మతత్త్వ మెఱుఁగ లేక వర్తించుచుఁ బశుప్రాయుఁడు, స్త్రీకాముఁడు నగుఁగాక! త్వరలో నీతఁడు మేషముఖుండగుఁగాక! ఈతని ననుసరించినవిప్రులు విమోహితమనస్కులు, కర్మాధీనులు, దేహలంపటులు నయి యాచకు లగుదురుగాక!" అని శపించెను.

నందికేశ్వరునిమాటలు విని భృగుమహాముని యాతనిపై మండిపడి "ధూర్జటివ్రతులు, వారి ననుసరించువారు పాషండు లగుదురుగాక! సకలవర్ణాశ్రమాచారహేతువు, లోకమంగళకరము, సనాతనము, పూర్వఋషిసమ్మతము, జనార్దనము, నిత్యము, శుద్ధము, పరము, ఆర్యపథానుగము అగువేదమును విప్రులను ఈతఁడు నిందించినకారణమున, ఈతఁడు, ఈతని ననుసరించువారు భస్మజటాస్థిధారణములచే మూఢబుద్ధులై నష్టశౌచులై పాషండు లగుదురుగాక!" అని శపించెను.

ఇట్లన్యోన్యశాపము లందియు భగవత్కటాక్షము కలవారగుట నెవ్వరు నాశము నొందరైరి. జరిగినసంగతికి హరుఁడు మనస్సు చివుక్కుమన ననుచర సమేతుఁడై వెడలిపోయెను. ఈ విధముగా నాఁటుకొనిన విరోధబీజములు అల్లుఁడగుశివునియందు, మామ యగు దక్షునందు దినదినప్రవర్ధమానములు కాఁజొచ్చెను.

## దక్షాధ్వరవినాశము

రుద్రుఁడు లేనియాగము యాగము కాకపోవుట యెఱిఁగియు నాతనిపైఁ గల తనకోపము కారణముగా, సకలప్రజాపతి విభుఁడ నను గర్వకారణమునను, బ్రహ్మనిష్ఠు లగుఈశ్వరాదుల ధిక్కరించి, అరుద్రకముగా దక్షమహర్షి వాజపేయయాగముచేయు నారంభించెను. అది పరిసమాప్తి యైనవెనుక బృహస్పతియాగ మను పేర మఱియొకయజ్ఞమును దక్షుఁ డారంభించెను. ఆది చూచుతలంపున పరమమునులు, ప్రజాపతులు, మహర్షులు, దేవతలు సపరివారముగా విచ్చేసి దీవనలిచ్చి దక్షునిపూజ లందిరి. దక్షతనయయు, ఈశ్వరునిల్లాలు నగుసతీదేవి తనతండ్రి చేయు యజ్ఞమును గుఱించి గగనచరులు పొగడఁగా విని ఆకాశమువంకఁ జూడఁగా ఆ యజ్ఞమును జూడ నేఁగు ఖచర గంధర్వ కిన్నరాంగనలు కనఁబడఁ గాంచి, తనభర్తతోఁ దామును జనుట మంచిదని జనక, గురు, మిత్ర రాజులిండ్లకుఁ బిలువకున్నను బోవచ్చును. కనుకఁ బోవుద, మని పలికెను. అది విని శివుఁడు "కాంతా! నీవు చెప్పినది నిజమే కాని, విద్యావయోరూపవిత్తకులములు మంచివారియెడ మంచిగనే యుండును. కాని, ఇవి కుజనుల కున్నయెడల దోషహేతువులై వివేకము చెఱచును. మహాత్ములైనవారి గొప్పతనము గర్వులు చూడలేరు. కుటిలు లగువారిండ్లకు మంచివాఁడు పోరాదు. నీవు దక్షునికూఁతురవే యైనను నాభార్య వగుట నాతఁడు నిన్నాదరింపఁడు, పరాభవించును. లోకమున బంధువులవలనఁ బూజ నొందక తిరస్కారము ననుభవించుట చచ్చుటే యగును" అని చెప్పి యూరకుండెను.

కాని, సతీదేవి తల్లిని తోఁబుట్టువులను తండ్రిని చూచువేడుక తొందరచేయఁగా సపరివారముగా దక్షునియజ్ఞశాల కేతెంచెను. అపుడామెను జూచి తల్లియు అక్కసెల్లెండ్రును పలుకరించిరి. కాని దక్షుని భయమున మిగిలినవా రెవ్వరుఁ బలుకరింపరైరి. దక్షుఁడుకూడ అవమానించెనే కాని పలుకరింప లేదు. పైఁగా ఆ యజ్ఞమున నామె శివతిరస్కారమును గాంచి ఆ దక్షుని వధింత మని లేచిన భూతగణములను

వారించి దక్షుని జూచి "తండ్రీ! లోకమున శరీరధారులైన జీవులకుఁ బ్రియాత్మకుఁ డైనయీశ్వరునకుఁ బ్రియాప్రియులు, అధికులును లేరు. అట్టి యీశ్వరుని నీవు తృణీకరించితివి. నీకూఁతుర నని పిలువఁబడుటకు నాకు సిగ్గగు చున్నది. ఈ నాశరీరమును దహించి నేను స్వచ్ఛత నందెద" నని సతీదేవి యోగమార్గమున యోగాగ్నిచే తత్క్షణమే దగ్ధమయ్యెను. అది చూచిన శివానుచరులు దక్షుని దహింప నుద్రేకించిరి. భృగుమహాముని అభిచారికహోమ మొనర్చి దక్షిణాగ్నిని వేల్చిన ఋభు నామక దేవతలు విచ్చేసి రుద్రపార్షదు లైన ప్రమథగుహ్యకగణములను బాఱఁద్రోలిరి.

ఈ సంగతి విని శివుఁడు కోపించి తనజట నొక్కదానిని పెఱికి వైచిన నందుండి వీరభద్రుఁ డుదయించి శివునానతిఁ గొని దక్షాధ్వర వినాశనమునకు బయలుదేఱెను. అతని వెనుక శివపరివారము యుద్ధసన్నద్ధమై చనెను. వీరిని జూచి దక్షాధ్వరమున నెల్లరు తలయొక వంకకుఁ బోయి దాఁగుకొనిరి. వీరభద్రునితోడి శివసైన్యము దక్షాధ్వరమును సర్వవిధముల నాశనము చేసెను. నందీశ్వరుఁడు మును దక్షుఁడు భవుని దిట్టినప్పుడు కన్ను గీటిన భగునిఁబట్టి కన్నులు పెకలించెను. దక్షుఁడు భవునిశపించినపుడు పరిహసించిన పూషుని పండ్లూడఁగొట్టెను. దక్షునివక్షముఁ ద్రొక్కి వీరభద్రుఁడు మంత్రచర్మము గలదక్షుని జంప లేక తల నఱికి సపరివారముగా కైలాసమున కేఁగెను.

ఇది విని బ్రహ్మ విష్ణువు దేవతలు కైలాసపర్వతమున కేఁగి దక్షిణామూర్తి రూపుఁ డగునీశ్వరుని సమీపించి నమస్కరించిరి. శివుఁడు వారలక్షేమ మడిగి వారిప్రార్థనమున దక్షాదుల ననుగ్రహించెను. తల నఱుకఁబడిన దక్షుని మేషముఖునిఁ జేసిన నాతఁడు నిద్ర మేల్కనినట్లు లేచి యెదుట నున్నశివుని శరణుచొచ్చి యిట్లనెను. "దేవా! నీ కప రాధుఁడ నగు నను దండించుట రక్షణమే కాని శిక్షణము కాదు. నీవు, విష్ణువు బ్రాహ్మణాభాసులను దండింతురు. సర్గాదిని ఆమ్నాయసంప్రదాయ ప్రవర్తనము నెఱఁగించుటకు విద్యాతపోవ్రతపరాయణు లైన బ్రాహ్మణులను బుట్టించితివి. కాన గోపాలుఁడు గోవులను రక్షించు

నట్లు నీవు వారిని రక్షించుచుందువు. నీకు నే నెన్నియపచారములు చేసినను నన్నుఁ గాపాడితివి. నీకు నే నేమి ప్రత్యుపకారము చేయఁ గలను?" అని రుద్రదక్షమాపణంబు చేసి బ్రహ్మానుమతిని నేగి యజ్ఞమును పరిసమాప్తి చేసెను. అపుడు బ్రహ్మ విష్ణు మహేశ్వరులు, దేవతలు నచటికి విచ్చేసిరి. అందఱు విష్ణుమూర్తిని బూజించిరి. విష్ణువు సంతసించెను. విష్ణుదేవతాక మను ఆ యాగమున దక్షుఁడు విష్ణువును బూజించి తరువాత అంగప్రధానకయాగములచే శివుని బరితుష్టు నొనర్చెను. అపు డందఱు ధర్మబుద్ధి గలిగి సుఖవృత్తి నుండుమని దక్షుని దీవించి వెడలిపోయిరి.

దాక్షాయణి యగుసతీదేవి పూర్వకళేబరము విడిచి హిమవంతునకు మేనకయందుఁబుట్టి పూర్వదయితుఁడగు రుద్రుని వరించెను. *

## దక్షస్మృతి

దక్షమహర్షి రచించిన ధర్మశాస్త్రగ్రంథమునకు దక్షస్మృతి యని పేరు. ఇందు ఏడధ్యాయములు గలవు. మొదటి అధ్యాయములో చతురాశ్రమవర్ణనము కలదు.

సర్వధర్మార్థతత్త్వజ్ఞ సర్వవేదవిదాంవరః,
పారగః సర్వవిద్యానాం దక్షోనామప్రజాపతిః.

ఉత్పత్తిప్రళయశ్చైవ స్థితిసంహారఏవ చ,
ఆత్మాచాత్మని తిష్ఠేత ఆత్మాబ్రహ్మాద్యవస్థితః.

బ్రహ్మచారీ గృహస్థశ్చ వానప్రస్థోయతిస్తదా,
ఏతేషాంతు హితార్థాయ దక్షశ్శాస్త్ర మకల్పయత్.

---

* శ్రీమద్భాగవతము, చతుర్థస్కంధము, పద్మపురాణము సృష్టిఖండము విష్ణుపురాణము.

అని యీ ధర్మశాస్త్రము ప్రారంభింపఁబడినది. రెండవఅధ్యాయమున ప్రాతఃకాలమునఁ జేయవలసిన కర్మాదికమునుగూర్చి తదితర విషయములనుగుఱించి కలదు. ఈ అధ్యాయారంభ మిట్లున్నది:

> ప్రాతరుత్థాయ కర్తవ్యం యద్ద్విజేన దినే దినే,
> తత్సర్వం సంప్రవక్ష్యామి ద్విజానా ముపకారకమ్.

తృతీయాధ్యాయమున గృహస్థాశ్రమవర్ణనము కలదు. ఇందు:

> న క్లేశన వినా ద్రవ్యం ద్రవ్యహీనః కుతః క్రియా,
> క్రియాహీనే నధర్మస్స్యాత్ ధర్మహీనే కుతః సుఖమ్.

> సుఖం వాంఛతి సర్వోహి తచ్చ ధర్మసముద్భవమ్,
> తస్మాద్ధర్మః సదా కార్యః సర్వవర్ణైః ప్రయత్నతః.

> న్యాయాగతేనద్రవ్యేణ కర్తవ్యం పారలౌకికమ్,
> దానంచ విధినా దేయం కాలే పాత్రే గుణాన్వితే.

మున్నగు మనోహరధర్మములు చెప్పఁబడినవి. నాలుగవఅధ్యాయమున

> పత్నీమూలం గృహం పుంసాం యదిచ్ఛందోనువర్తినీ,
> గృహాశ్రమసమం నాస్తి యదిభార్యావశానుగా.

అను శ్లోకారంభముతో భార్యాభర్తృధర్మములు చక్కగావిశదీకరింపఁ బడినవి. పంచమాధ్యాయమున శౌచాశౌచములు క్రియాక్రియలను గూర్చిన సూక్ష్మధర్మములు కొన్ని గలవు. ఆఱవ అధ్యాయము జన్మమృత్యుసముద్భవ మగుసూతకమునుగూర్చి చెప్పి:

> స్వస్థకాలే త్విదం సర్వ మశౌచం పరికీర్తితమ్,
> ఆపద్గతస్య సర్వస్య సూతకే నచ సూతకమ్.

అని ముగిసినది. ఏడవఅధ్యాయమున యోగమును గూర్చిన ప్రశంస గలదు. ఈ ధర్మశాస్త్రమునందలి తుదిశ్లోకము లివి:

> దక్షశాస్త్రం యథాప్రోక్తం అశేషాశ్రమముత్తమమ్,
> అధీయంతే తు యేవిప్రాః తే యాన్త్యమరలోకతామ్.

ఇదంతు యః పఠేద్భక్త్యా శృణుయా దథవాஉపివా,
స పుత్రపౌత్రపశుమాన్ కీర్తించ సమవాప్నుయాత్.

శ్రావయిత్వా త్విదంశాస్త్రం శ్రాద్ధకాలేஉపివా ద్విజః
అక్షయం భవతి శ్రాద్ధం పితృభ్యశ్చోపజాయతే.

# మహర్షుల చరిత్రలు

## దీర్ఘతమో మహర్షి

### జ న న ము

అంగిరసుఁ డనుమహర్షి దేవహూతీకర్దముల కుమారి యగు శ్రద్ధను వివాహ మాడి ఆమెయందుఁ బెక్కురుపుత్రులను గాంచెను. వారిలో ఉతథ్యుఁడు, బృహస్పతి, సంవర్తుఁడు అను మువ్వురు జగత్ప్రసిద్ధులు.

ఉతథ్యుఁడు యుక్తవయసు గన్నపిదప మమత యనుకన్యకను వివాహ మాడి యామెతో గృహస్థధర్మములను నిర్వర్తించుచుండెను. నిరంతరతపోధ్యానాసక్తుఁడు, జ్ఞానసమన్వితుఁడు, తీర్థయాత్రాపరుఁడు నయి ఉతథ్యమహర్షి పేరుగాంచెను. సంవర్తుఁడు యోగీశ్వరుఁడు బ్రహ్మచారియై ఖ్యాతి గాంచెను. బృహస్పతి తన బుద్ధిబలమున దేవగురువై తారను భార్యగాఁ గైకొని దేవేంద్రునికిఁ బ్రధానాచార్యుఁడై వసించుచుండెను.

ఇట్లుండఁ గాలక్రమమున మమత ఉతథ్యునివలన గర్భము ధరించెను. కొంతకాలమునకు ఉతథ్యుఁ డామె నింట విడిచి తీర్థయాత్రలకై బయలుదేఱి పోయెను. ఆ సమయమున బృహస్పతి సోదరుని జూచుటకు దేవలోకమునుండి భూలోకమునకు విచ్చేసి ఉతథ్యునియాశ్రమముఁ జేరెను. అంట నున్నమమత యాతని కతిథిసత్కారములు చేసి గౌరవించి తనభర్త తీర్థయాత్రల కేఁగె నని తెలిపెను. మిక్కిలిబుద్ధిమంతుఁడును దేవగురుఁడు నగుబృహస్పతి దైవోపహతుఁడు, కామతిమిరబద్ధుఁడునై సౌందర్యవతి, పతివ్రతాతిలకము నగుమమతపై మరులుగొనెను.

మమత బృహస్పతిధోరణి గ్రహించి తాను గర్భవతి ననియు నంతకు మించి యాతనికి మాతృసమాన ననియుఁ దెలిపి యట్టితనయెడ నాతఁడు మరులుగొనుట ధర్మరహితమని హితముపదేశించెను. కామాంధులకు హితోపదేశములు తలకెక్కునా? వెంటనే యాతఁ డామెను జేరి దేవరన్యాయమునఁ దనయెడ దోషము లే దనియుఁ దన్ను స్వీకరించి కోరిక తీర్పు మనియు బలవంతము చేసెను. అందుల కీయకొనక యామె యాతని నెంతయుఁ దృణీకరింపఁగా నాతఁ డామెపైఁ బడి శయ్యకుఁ జేర్చి బలవంతముగా రమింపఁ దొడఁగెను.

అపు డామెగర్భమునఁ గలయర్భకుఁ డాతనినీచ కృత్యమున కసహ్యించుకొని "ఓయీ! తప్పుపని వెంటనే మానుము. ఈమె గర్భమున నర్భకుఁడను నే నున్నాను. నీ వీర్యమున కిచటఁ దావులేదు. నీవు చేయుపని మిక్కిలి యధర్మము. కావున, బుద్ధిగలిగి యీ పని విరమించి వెడలిపొమ్ము" అని బృహస్పతికి వినఁబడునట్లు పలికెను. ఐన, నాతఁ డీయర్భకునిమాటలు తృణీకరించి తన కామబాధ తీర్చుకొని మమతగర్భమున వీర్యము విడిచెను. తత్క్షణములోనున్న బాలుఁ డావీర్యమును బయటకుఁ దన్నివేయఁగా నదినేలపైఁ బడెను. అందులకుఁ గనలి బృహస్పతి యా గర్భమునఁ గల బాలుని దీర్ఘతముఁడ వగు మని శపించెను.

కాలక్రమమున నా బాలుఁడు పుట్టుగుడ్డియై జన్మించి దీర్ఘతముఁ డను పేరఁ బెరుగఁజొచ్చెను.

## వివాహము

శాపవశమున నిట్లు పుట్టుగ్రుడ్డియై జన్మించినను, వంశపరంపరాగత మగుతపోజ్ఞాన విద్యావివేకము నంది దీర్ఘతముఁడు వేదవేదాంగము లభ్యసించి పండితపుంగవుఁడు, విజ్ఞానవేత్త, తపస్వి, కీర్తిశాలి యయ్యెను.

తండ్రి నియోగమున నాతఁడు వివాహమాడి సంతానమునంద నిశ్చయించుకొనెను. యుక్తవయసు గన్నపిదప నాతఁడు ప్రద్వేషిణి

యనువిప్రకన్యకను వివాహమాడెను. ఆమె పేరునకుఁ దగినట్లే అందఱిని ద్వేషించుటలో అగ్రేసరురా లయ్యెను. ఐనను, ఆమెకుదీర్ఘతమునివలన గౌతముఁడు మున్నగుపేళ్ళతో నెందఱో పుత్రులు జన్మించి పెరుగుచుండిరి. తపస్స్వాధ్యాయపరుఁ డగు దీర్ఘతమోమునియు దేనిని పట్టించుకొనక కాలక్షేపము చేయుచుండెను.

## కామధేనువుకుమారునితో మైత్రి

ఇట్లు దీర్ఘతమోమహర్షి యొక్కఁడును తపోధ్యానాను రక్తుఁడై యుండెను. ప్రద్వేషిణి యాతనికి దూరమున నుండుచుఁ దనపుత్రులపై మమకారము పెంచుకొని భర్తను తృణీకరింపఁ దొడఁగెను. ధ్యానాసక్తుఁ డగుదీర్ఘతమునికడ కొకసారి కామధేనువు కుమారుఁడు విచ్చేసి తన్నె యిక పలుచుకొని "ఓ దీర్ఘతమోమహర్షీ ! నీవు జాత్యంధుఁడవైనను, సర్వశక్తి సంపన్నుఁడవు. అమోఘవీర్యుఁడవు. నీవు సంతానహీనులకుఁ బుత్ర దానము చేయఁగల సమర్థుఁడవు. మఱియు నీవు కారణజన్ముఁడవు. వంశవర్ధన నిమిత్తమే పుట్టితివి. కావున, ఎట్టిగోత్రాలికైనను నీవు పుత్ర భిక్ష పెట్టఁగల మైథునశక్తిని నీ కనుగ్రహించెదను. 'ప్రకాశమైథున' మను ఈ యమూల్యవిద్యను నీకు నేర్పెదను. దాన నీవు కొన్ని వంశము లకు ఉద్ధారకుఁడ వయ్యెదవు. మఱికొన్నివంశములకు మూలపురుషుఁడ వయ్యెదవు. పరశురామునిచే సర్వక్షత్రియకులము సంపూర్ణముగా నశించి యుండుటచే నీ యీశక్తి యవసరము కాఁగలదు. జాత్యంధుఁడ వగు నీవు వంశవర్ధన మొనరించుమహర్షి వయ్యెదవు. భౌతికాంధులు కాక పోయినను క్రోధాంధులై వంశవర్ధనము గాక వంశవినాశముఁ గావించు వారికన్న నీ వెన్నోరెట్లు మిన్నవు కాఁగలవు" అని చెప్పి దీర్ఘతమున కావిద్య నుపదేశించి వెడలిపోయెను.

నాఁటినుండి దీర్ఘతముఁడు తాను నేర్చిన యీ విద్యాఫలిత మెట్లుండునో యని చూడ వేఁడుకపడి తనభార్య కోపించి తనకడకు రాక పోవుటచే అన్యవిషయమునఁ దాను ప్రయోగము కావింప మొదలిడెను. తాను నేర్చినవిద్య యెల్లెడల సద్యఃఫలిత మొసఁగుచుండెను. కాని,

దీర్ఘతమోమహర్షి యీ ప్రవర్తనమును అర్థము చేసికొనలేక యాతనిని జారుఁ డని లజ్జా విహీనపశుకాముఁ డని నిందించి యాతనిని వెలివేయఁ దొడఁగిరి.

తనకుఁ గలలోపమునకుఁ దోడు ఈ సంగతి విన్న ప్రద్వేషిణి భర్తను పూర్తిగా ద్వేషించుచు నాతనివంక కేగుటే మానివేసెను. ఒకనాఁ డాతఁడు భార్యకడకు వచ్చి 'సతికిఁ బతిని ద్వేషించుటకన్న పాప మున్నదా? నీకు నే నేవిధ మైనలోపమును జేసి యుండలేదే! నన్నిట్లు ద్వేషించుటకుఁ గారణమే" మని యడిగెను. ఆమె నదురుబెదురు లేక:

"పతియు భరియించుఁ గావున భర్త యయ్యె
భామ భరియింపఁబడు గాన భార్య యయ్యె
పరగ నవి మనయందు వీడ్వడియె నిన్ను
నేన యెల్లకాలము భరియింతుఁగాన."

భార. ఆది ౪ ౨౨౮.

అని పలికి "ఇఁక నిన్నొకక్షణమైన నేను భరింపలేను. నీవు నాకు భర్తవు కావు, నేను నీకు భార్యను గాను. ఇటనుండి కదలి యెటకేని పొమ్ము. పోకున్న నేనే నిన్నుఁ ద్రోలివేసెద" నని యామె యాతని నిష్ఠురోక్తు లాడెను.

## దీర్ఘతముఁడు భార్యను శపించుట

అంత నాతఁడు "ఓసీ! నా విలువ తెలియని మూర్ఖురాలవై నన్నిట్లు నిష్ఠురోక్తులాడితివి. నీవును నీకుమారులును గలిసి నన్ను రాజగృహమునకుఁ దోడుకొని పొండు. నన్నుఁ దా నుంచుకొని యా రాజు మీకుఁ దగినధన మొసంగఁగలఁ" డని సూచించెను. కాని యామె యాతనిమాటలకుఁ జిరాకుపడి "నీవలన సంపాదించినధనము నీచము, దుఃఖకారణము" నని మఱింత నిందించెను.

దీర్ఘతముఁడపు డొడలుమండి "ఇది మొదలు పతి కొకఁడే పతి యగుఁగాక ! మఱియు

పతి హీనలైన భామిను
లతిధనవతు లయ్యుఁ గులజ లయ్యును నసలం
కృత లయ్యేడు మాంగల్య ర
హిత లయ్యేడుఁ గృపణవృత్తి నిదియు మొదలుగన్."

భార. ఆది. ౪. ౨౩౦.

అని యామెనే గాక స్త్రీల నందఱను శపించెను.*

## ప్రద్వేషిణి భర్తను గంగఁ ద్రోయించుట

ఈ శాపమును విన్న ప్రద్వేషిణి భర్తపై మండిపడి తనపుత్రులను బిలిచి "వత్సలారా! ఈతఁడు నోటికి వచ్చినట్లు కూఁతలు కూయు చున్నాఁడు. ఇఁక మీ రాలసించిన మిమ్ములను కూడ శపింపఁగలఁడు. కావున, వెంటనే మీ రీతనిని బట్టుకొని కట్టివేసి గంగలోఁ ద్రోసి రండు. గ్రుడ్డివాఁడు, జారుఁడు, క్రూరుఁడు నగు తండ్రి తండ్రి కాఁడు. నాయాజ్ఞ వెంటనే పాలింపుఁ" డని యామె యాజ్ఞాపించెను. లోభోప హతచేతసులు, అజ్ఞానులు నగునామె పుత్రులు వెంటనే యంధుఁ డగు తండ్రిని పట్టి కట్టి తెప్పలోఁ గూర్చుండఁబెట్టి గంగానదియందు విడిచి చేతులు కడిగికొని యింటికిఁ జేరిరి.

దీర్ఘతముఁడు తనకుఁ బట్టినదుర్గతికి వంత నొందక నిర్భాగ్యురా లగుభార్య బుద్ధిహీను లగుపుత్రులు గలవారి కట్టియోగముకాక మఱెట్టి యోగము కలుగు ననుకొని విజ్ఞాని, యోగి కావున నాతఁడాస్థితిలోనైతము ఉదాత్తానుదాత్తస్వరితప్రచయస్వరభేదంబు లేర్పడ-

---

* "అద్య ప్రభృతి మర్యాదా మయాలోకే ప్రతిష్ఠితా,
ఏకఏవపతిర్నార్యా యావజ్జీవం పరాయణమ్."

సలక్షణముగా వేదములు చదువుచు అల తేక్షైపునకు గెంటిన నా పైపునకే పోవుచు, ప్రారబ్ధచరిష్ణు వగుయోగియై గంగానదిలో ప్రయాణము చేయుచు పెక్కుదేశములు దాఁటి పోయెను.

## బలి యనురాజు మహర్షిని గొల్చుట

ధార్మికశ్రేష్ఠుఁడు రాజతిలకుఁడు నగు బలి యనువాఁడు గంగాభిషేకార్థము వచ్చి నదిలోఁ గొట్టుకొనివచ్చుచుఁ దనయున్నదరిని జేరవచ్చినవానిని దీరముఁ జేర్చి యాతని బంధనములు సడలించి యాతఁడు మమతాపుత్రుఁ డగుమహర్షి యని గ్రహించి సాష్టాంగ దండప్రణామము లాచరించి-

"ఎందుండి వచ్చి తిందుల
కెందుల కేఁగుదు మహామునీశ్వర! విద్వ
ద్వందిత! నాపుణ్యంబునఁ
జెందితి నిన్నిష్టఫలముఁ జెందినపాటన్.

భా॥ ఆది ౪, ౩౨౨

అని యడిగెను.

---

మృతే జీవతి వా తస్మి న్నాపరం ప్రాప్నుయాన్నరమ్,
అభిగమ్య పరం నారీ పతిష్యతి న సంశయః.
అపతీనాంతు నారీణా మద్యప్రభృతిపాతకమ్,
యద్యస్తి చేద్ధనం సర్వం వృథా భోగా భవంతు తాః.
అకీర్తిః పరివాదాశ్చ నిత్యం తాసాం భవంతు వై

సం. భా. ఆది. ౧౦౪, ౩౩-౩౬

ఇది మొదలు నేను శాసించుచున్నాను. స్త్రీకి యావజ్జీవము ఒక్కఁడే మగఁడు గతియగుఁగాక! వాఁడు మరణించినను బ్రతికి యున్నను స్త్రీ మఱియొక పతిని పొందరాదు. పొందినయెడల ఆమె పతితురా లగును. భర్తను విడిచినస్త్రీ యెంతధనవంతురాలైనను పాపిని యగును. ఆమెభోగము వ్యర్థమే యగును. అకీర్తి, నింద యామెకుఁ గలుగును.

దీర్ఘతమోమహర్షి తనవృత్తాంత మంతయు దాఁపక బలికిఁ జెప్పివేసెను. బలి యెంతయు సంతసించి తనకు సంతానలాభముఁ గలుగఁజేయు మని యాతనిఁ బ్రార్థించి పురమునకుఁ గొనిపోయి దివ్యసౌధమున నిడియించి పూజించెను.

పిదప, బలిమహారాజు మహర్షిని సమీపించి ఋతుమతియగుతన భార్యను సుదేష్ణయనుదానిని బంపెద ననియు నామెకుఁ బుత్రభిక్షఁ గటాక్షింపు మనియుఁ గోరెను. దీర్ఘతముఁ డందుల కంగీకరించెను కాని సుదేష్ణ:

"పుట్టుఁజీఁకు వృద్ధుఁ బూతిగంధానను
వేదజడునిఁ బొంద వెలఁది రోసి
తన్ను బోనిదానిఁ దన్విఁ గోమలిఁ దన
దాదికూఁతుఁ బంచెఁ దపసికడకు.

భార, ఆది, ౪. ౨౬౪

దీర్ఘతముఁ డాసంగతి యెఱిఁగియు నా దాదికూఁతు నదృష్టమునకు సంతసించి యామెకే పదునొకండుగురు పుత్రులను బుట్టించెను.

## దీర్ఘతమోమహర్షి వంశవర్ధనుఁ డగుట

కక్షీవంతుఁడు మున్నగుపేళ్ళు గల యాపదునొకండుగురు వేదము లభ్యసించుచుండుటఁ గని బలి యా పుత్రులు తన పుత్రులేయని భ్రమించి వారిని గొనివచ్చి మహర్షికిఁ జూపెను. దీర్ఘతముఁడు వారు దాసికూఁతు పుత్రు లని సత్యముఁ దెలిపెను. బలి చాల విచారించి తనపత్నియగుసుదేష్ణను మహర్షికడకుఁ బుత్రోత్పత్తికై పంపెను.

దీర్ఘతముఁ డారాణి యొడలు తడివి "దేవీ! నీకు సూర్య సమతేజులైనయైదుగురు కొడుకు లుదయింతు" రని యామెకు వరమిచ్చి యనుగ్రహించెను. సుదేష్ణ యా మహర్షి వలన నుత్తము లగునైదుగురు

పుత్రులను గనెను. వారు అంగుఁడు, వంగుఁడు, కళింగుఁడు, పుంఢ్రుఁడు, సుహ్మఁడు ననువారు. వారు పెరిగి పెద్దవారై వరుసగా అంగదేశము, వంగదేశము, కళింగదేశము పుండ్రము, సుహ్మము అనుదేశములకు రాజులై వంశాభివృద్ధి నందిరి. ఇట్లు దీర్ఘతమోమహర్షి పెక్కు రాజవంశములకు గారకుఁ డయ్యెను.

# మహర్షుల చరిత్రలు

## రురుమహర్షి

### జననము

భృగుమహర్షికి పులోమయందు చ్యవనమహర్షి జన్మించెను. చ్యవనమహర్షి సుకన్యయందు ప్రమతి యనుకుమారుని గాంచెను. ప్రమతి దివ్యతేజస్వియై మహాతపస్సంపన్నుఁడై విరాజిల్లుచుండెను. ఘృతాచి యనునప్సరస యాతనిని వలచి యాతని యాశ్రమమునకు వచ్చి సేవచేయుచుండఁగాఁ గొంతకాలమున కాతని కామెపై ననురాగ ముదయించెను. పిదప ఘృతాచియందు ప్రమతి యొకసుపుత్రుని గాంచెను. అతఁడు రురుఁడనుపేరఁ బెరుఁగుచు ధర్మాత్ముఁడు, తపశ్శాలి, విద్యావంతుఁడు, మన్మథోపముఁడు నయి యలరారుచుండెను.

### ప్రమద్వర

ఆ దినములలో మహాతపస్సంపన్నుఁడు, విద్యావంతుఁడు, అపార తేజుఁడు నయి స్థూలకేశుఁ డనునొకమహర్షి యుండెను. అతఁడు సర్వ భూతములయందు సమదృష్టి కలవాఁడై దయామయుఁడు తత్త్వ విదుఁడు నను విఖ్యాతి గడించెను. ఆతని యాశ్రమము నిర్మానుష్యమై పరమ పవిత్రమై ప్రశాంతనిలయమై యుండెను.

ఇట్లుండఁగా, విశ్వావసుఁ డనుగంధర్వరాజు అప్సరస యగు మేనకయందు మిక్కిలి మక్కువ కలిగి యామెపొందుఁ గోరెను. మేనక యాతని నినుమిక్కిలి వలచియుండెను. వా రుభయులు సందుచూచు కొని లేచి వచ్చి స్థూలకేశమహర్షి యాశ్రమప్రాంతమున మిథున కృత్య మొనరించి తమకోరికఁ దీర్చుకొనిరి. వారట్లాడ లెఱుఁగక కొంతకాల మచట విహరించిన మేనక గర్భవతి యాయెను.

ప్రసవసమయము వచ్చినంతనే మేనక చక్కనిచుక్కయగునొక కూఁతును గని యా పిల్లను స్థూలకేశమహాముని యాశ్రమప్రాంతమున విడిచిపెట్టి స్వర్గమునకు వెడలిపోయెను. విశ్వావసుఁడును కోరిక తీరినవాఁడై యా బిడ్డజోలికిఁ బోక తాను యథేచ్ఛముగా వెడలిపోయెను. ఏమి! సృష్టిచిత్రము! ఏయుగమునందైన నెంతటివారికైనఁ గామావేశము కలుగుట, అంత మిథునకృత్య మొనరించుట, గర్భము కలుగుట, దయారహితులై పుట్టిన బిడ్డను పారవేసి పోవుట పరిపాటియే యేమో! స్వర్గవేశ్య యట్లొనరించు టొకయాశ్చర్యమా!

స్థూలకేశమహర్షి యాశ్రమము విడిచి నది కేఁగి స్నానముచేసి తిరిగివచ్చుచు దేవతాకన్యవలె ముద్దులు మూటగట్టుచు అంద చందములతో నలరారు చిన్నిబిడ్డను గాంచి దివ్యదృష్టిని సర్వము తెలిసికొని దయామయుఁడై యింటికిఁ దీసికొనిపోయి యా పసికూనను పెంపఁ దొడంగెను. జ్ఞానసంపన్నులు, దయాసముద్రులు అగు మహర్షులు చలిచీమపై నైనను జాలిగొందురు. అట్టితఱి, ఏ పాపమెఱుఁగని యా పసికూనను గాంచిన స్థూలకేశమహర్షి యెట్లు విడిచి పోఁగలఁడు? కన్న తలిదండ్రులకు లేని జాలి కనులతోఁ గాంచిన కారుణికులకుఁ గలుగును కదా!

సర్వసంగములను విడనాడి సర్వేశ్వరునిదక్క నన్య మెఱుఁగని యా జడదారి యీ పసిపిల్లను బెంచి యథాశాస్త్రీయముగా జాతకర్మాదిక మొనరించి నామకరణ మొనరింపవలసినవేళ, ప్రమదలలోనెల్ల నుత్తమురా లగుట ఆ పిల్లకు 'ప్రమద్వర' అని పేరిడి యల్లారుముద్దుగాఁ జూచుకొనుచుండెను. ఆమె కాతఁడన్ని విద్యలు నేర్పుచు చక్కగా తీర్చి దిద్దుచుండెను.

## రురుఁడు ప్రమద్వరను వరించుట

ఇట్లుండఁగా రురుఁ డొకసారి స్థూలకేశమహామునిని దర్శించుట కాతనియాశ్రమమునకు విచ్చేసి యందతి మనోహరముగఁ బెరుఁగుచు దివినుండి భువి కేతెంచిన దేవకన్యయో, లేక సౌందర్యము మూర్తి

భవించిన సారసాక్షియో యన వెలుఁగొందు ప్రమద్వరను గాంచెను. పరమధర్మాత్ముఁడు సదా బ్రహ్మచర్యపరినిష్ఠితుఁడు నగు నామహనీ యుని కా కన్యపై ననురాగ ముదయించెను.

తరువాత రురుఁ డింటి కేఁగి ప్రియమిత్రులమూలమున తండ్రి యగు ప్రమతిమహర్షి కంతయు నెఱిఁగించి కర్తవ్య మాతనిపై విడిచి వేసెను. ప్రమతి యాలోచించి తగినవారిని వెంటఁగొని స్థూలకేశమహర్షి యాశ్రమమున కేఁగి యాతనివలన నుచితసత్కారము లంది పిదప తాను కన్యార్థినై వచ్చితి ననియుఁ దన కుమారుఁ డగు రురునకు స్థూల కేశుని యాశ్రమమునఁ బెరుఁగు ప్రమద్వరనిచ్చి వివాహము చేయు మని తనకుమారుఁ డామెను గాంచి వరించుటాది యగు వృత్తాంత మంతయు వినిపించెను.

స్థూలకేశుఁ డందుల కెంతయు నానందించి యంతకన్నఁదనకుఁ గావలసిన దొండులే దని యందుల కంగీకరించి ప్రమతిని గౌరవించి వివాహముహూర్త మేర్పఱచి పంపివేసెను.

## ప్రమద్వరను పాము కఱచుట

రురుప్రమద్వరల వివాహము కొలఁది దినములలో జరుగవలసి యుండెను. కాని, తా నొకటి తలఁచిన దైవమొకటి తలఁచుచుండును. పుట్టినజీవి నెల్ల మృత్యుదేవత వెన్నాడుచునే యుండును. కాల మాసన్న మైనంత నది యేదోరూపమున ఆ జీవిపైఁ బడి ఆ జీవిని తనపొట్టఁ బెట్టుకొనుచుండును. 'క్షణంచిత్తం క్షణం విత్తం క్షణం జీవిత మావయోః, యమస్య కరుణానాస్తి' అన్న దెంతయు సత్యము. సమయ మైనపిదప క్షణమైన జీవి బ్రతుకలేఁడు. 'అయ్యో! పెండ్లి కుదిరిన దని కాని, ఇంకను చిన్నవయసే యని కాని యేమి చూచియు మృత్యువు జాలిగొనదు. తనపని యది చేసికొనును. ప్రమద్వర పెండ్లి కుదిరినది. హస్తానక్షత్రయుక్త లగ్నమున నిఁక నొకటి రెండుదినము లలో పెండ్లి. కాని యీలోఁగా నామె చావవలసినకర్మ మున్నది. విధి బలీయము. దాని నెవ్వరును తప్పింపలేరు. అది జరుగువఱ కెవ్వరి కిని దెలియదు.

ప్రమద్వర యానాఁడు పూలుకోసికొనుటకు వనమునఁ దిరుగు చుండఁగా పొరపాటునఁ బరుండియున్న యొకత్రాచుపాము నామె త్రొక్కెను. అది బుస్సున లేచి ప్రమద్వర యుస్సు రనునట్లు వెంటనే యామెను గఱచెను. పాముకాటువలన ప్రమద్వర వెంటనే స్పృహ తప్పి యటఁ బడిపోయెను. అతిమనోహర మైనయామె వదనబింబము కాంతిదక్కెను. పద్మదళములవంటి యామెకన్నులు మూతవడెను. బంగారుచాయ గలమేను చల్లఁబడిపోయెను. క్రూరసర్పవిష మెక్కి ప్రమద్వర యిట్లు విగతజీవయై పడిపోఁగానే స్థూలకేశమహర్షి చూచి పరుగుపరుగున వచ్చిచేరెను. ఆ చుట్టుపట్లఁ గలయాశ్రమములనుండి స్వస్తి, ఆత్రేయుఁడు, మహాజానుఁడు, కుశికుఁడు, శంఖమేఖలుఁడు, ఉద్దాలకుఁడు, కఠుఁడు, శ్వేతుఁడు, భరద్వాజుఁడు, కౌణకుత్సుఁడు, ఆర్ష్టిషేనుఁడు, ప్రమతి, అతని పుత్త్రుఁ డగు రురుఁడు మున్నగు మహర్షులు, ఇంక నెందఱో తాపసులు వచ్చి సర్పదష్టయై మృతినొందిన ప్రమద్వరను జూచి దుఃఖావిష్టులై చేష్టలు దక్కి కూర్చుండిపోయిరి. కడచిన యాయువును మరల పోయఁగలవా రెవరు లేక యెల్లరు దీన వదనులై యుండిరి.

రురుఁడు దుఃఖావేశచిత్తుఁడై యచటినుండి పోయి యొక యేకాంతప్రదేశమునఁ గూర్చుండి ప్రమద్వరకై వాపోవుచుండెను.

"అలయక యేన దేవయజనాధ్యయనవ్రతపుణ్యకర్మముల్
సలుపుదునేని నేన గురుసద్ద్విజభక్తుఁడనేని నేన య
త్యలఘుతపస్వినేని దివిజాధిపభూసురులార! మన్మనో
నిలయకు నీప్రమద్వరకు నిర్విష మయ్యెడు నేఁడు మీదయన్

అపరిమితాజ్ఞఁ జేసియు మహాపురుషుల్ విషతత్త్వసంహితా
నిపుణులు మంత్రతంత్రములు నేర్పి విధించియు దీనికిన్ విష
వ్యపగత మైనజీవ మిది వచ్చునుపాయము సేయరొక్కొ! నా
తపముఫలంబు నధ్యయనదానఫలంబులు నిత్తు వారికిన్.

భార, ఆది. ౧, ౧౬౯, ౧౩౦

అని యాతఁడు పెక్కువిధముల నాక్రోశించుచున్న జాలిపడి యాతని కడకు వచ్చి యొక్కదేవదూత యిట్లనెను. ఓయీ! మానవుల యాయువు క్షయించిన దాని నెవ్వరు నీయఁలేరు. గంధర్వునకు అప్సరసకుఁ బుట్టిన యీకన్యకు ఆయువు తీరిపోయినది. కావున, నీవు వృథా విచారింపకుము. ఒక యుపాయము చెప్పెదను. చేతనైనఁ జూచుకొనుము. నీయాయువులో సగ మీమె కిచ్చితివేని ఈమె మరల జీవింపఁగలదు'' అని పలికెను. వెంటనే రురుఁడు తన యాయువులో సగము నామెకు ధారపోసెను.

వెంటనే ప్రమద్వర తొల్లిటికంటె నధికశృంగారసమన్వితయై విష వినిర్ముక్తయై నిద్రనుండి లేచినటుల లేచి కూర్చుండెను. అపుడచటి మునీశ్వరులు, ప్రమతి, స్థూలకేశుఁడు, పొందిన యానంద మింతింతన వీలులేకుండెను.

## రురు ప్రమద్వరల పరిణయము

అనంతరము శుభస్య శీఘ్ర మ్మని స్థూలకేశాదులు, ప్రమతి, హస్తానక్షత్రయుక్త లగ్నమున రురువునకుఁ బ్రమద్వరకుఁ గల్యాణ మహోత్సవముఁ గావించిరి. ఆ పుణ్యదంపతు లందఱి యాశీస్సులంది యిష్టోపభోగము లనుభవించుచు సుఖముగా నుండిరి.

నిజతపశ్శక్తివల్లను, త్యాగమువల్లను వలచినకాంత మరణింపఁగాఁ బునర్జీవింపఁ జేసికొని యామెను ధర్మపత్నిగాఁ బరిగ్రహించిన రురుఁడు, తనకొఱకై చూపిన నిష్కల్మషప్రేమము, నిరుపమానత్యాగము నెంతయో మెచ్చుకొని పునర్జీవితయై అపూర్వ సౌందర్యము నందినప్రమద్వరయు నుత్తమోత్తమ దాంపత్యధర్మమును పాటించుచు గృహస్థాశ్రమమును నిర్వర్తించుచుండిరి.

రురుఁడు తనకాంతను గఱచిన యా పాముమీదనే కాక పాఁపజాతి మీఁదనే పగగొని చేత నొకదండముఁ గొని కనిపించిన పాములనెల్లఁ జంపఁదొడంగెను.

## రురు డుండుభ సంవాదము

ఇట్లుండ రురుఁ డొకనాఁడు వనమునఁ దిరుగుచుండఁగా డుండుభ మను పేరు గలపామును జూచి దండము నెత్తి దానిని జంపఁబోయెను. అంత నది "అయ్యా! నేను నీ కేమియు నపకారము చేయలేదు. నీవు బ్రాహ్మణోత్తముఁడవు, విశేషించి భార్గవవంశజుఁడవు. అట్టినీవు నన్ను కారణముగ నేల చంపుదు" వని యడిగెను. దానికి రురుఁడు "తొల్లి నా భార్య నొక పాము కఱచి నమ్మొంటరియా తల్లడపెట్టినది. ఆ కారణమున నేను పాములనెల్ల వెదకి వెదకి చంపుదును గాక యని శపథము పూనితిని. ఇపుడు నీవు నా కెదురైతివి. కావున నిన్నుఁ జంప దండము నెత్తితి" నని పలికెను. దానికి డుండుభము తాను దుష్టవిషసర్పములవలె పీడ గలిగించెడు దానను గా ననియు నిందుచేఁ దన్నుఁ జంపుట న్యాయము కా దనియు వేఁడుకొనెను.

దాని ధోరణిఁ గనిపట్టి రురుఁ డది సర్పజన్మ మెత్తిన యొకఋషి యని గ్రహించి "ఓయీ! నీ వెవరు? ఏల యీ నికృష్ట జన్మము కలిగినది?" అని యాదరమేదురుఁడై యడిగెను. దాని కాపా మిట్లు బదులుచెప్పెను. "అయ్యా! నేను పూర్వజన్మమున సహస్రపాదుఁ డను ఋషిని. నే నొకబ్రాహ్మణుని శాపము కారణముగా ఈ సర్పజన్మము నందితి" నని చెప్పెను.

రురుఁడు జాలిగొని యావృత్తాంత మంతయుఁ దెలుపుమని కోరెను. డుండభ మిట్లు చెప్పఁదొడఁగెను. "అయ్యా! తొల్లి తపోధనుఁడు, నిగ్రహానుగ్రహసమర్థుఁడు, తీక్ష్ణకోపుఁడు గలవాఁడునగు ఖగముఁ డనునొక బ్రాహ్మణుఁడు నాకు మిత్రుఁడుగా నుండెను. అతఁ డగ్నిహోత్రగృహమున ధ్యానమగ్నుఁడై యున్నసమయమున నేను వానియింటి కేఁగి పరిహాసమునకు గడ్డిపఱకలతో నొకపామునుజేసి యాతనిపై వైచితిని. ఏమఱుపాటున నున్న యాతఁ డది పాముగా భ్రమించి గజిబిజి పడి మనఃఖేద మందెను. వెంటనే యాతఁడు కోపారుణితలోచనుఁడై నన్ను సర్పవ్యాజమున భయపెట్టితివి కావున, నీవు

నిజముగా సర్పమవై పుట్టుదువుగా" అని నన్ను శపించెను. నేను పశ్చాత్తప్తుఁడనై యాతని పాదములపైఁ బడి తప్పు క్షమించి మన్నింపుమని ప్రార్థించితిని. అతఁడు దయదలఁచి "ఓయీ! ప్రమతి కుమారుఁడగు రురుమహర్షి దర్శనమున నీకు శాపవిమోచన మగు" నని యభయమిచ్చెను. నేను వెంటనే సర్పమనై యీ వనమున విహరించుచు నుంటిని. నీ దర్శనమున నాపూర్వదేహము గనఁగందు" నని యన్నంతనే యాతఁడు సహస్రపాదఋషియై యాతని యెదుట నిలిచి యిట్లు పలికెను.

"భూమతకీర్తి! బ్రాహ్మణుఁడు పుట్టుడుఁ దోడనపుట్టు నుత్తమ
జ్ఞానము సర్వభూతహితసంహితబుద్ధియుఁ జిత్తశాంతియున్
మానపుదప్రహాణము సమత్వము సంతతవేదవిద్యను
ష్ఠానము సత్యవాక్యము దృఢవ్రతమున్ గరుణాపరత్వమున్.

భార. ఆది. 1-157

నీవు బ్రాహ్మణుఁడవు, భృగువంశవరిష్ఠుఁడవు. సర్వగుణసంపన్నుఁడవు. విద్యావినయవివేకివి. అట్టి నీ విట్టిహింసఁ బూనుట ధర్మముకాదు. బ్రాహ్మణు లహింసాపరులు. ఒరులు చేయుహింసలు వారించుపరమ కారుణ్యమూర్తులు. జనమేజయజనపాలుఁడు సర్పయాగము చేసి సర్పసంహారము చేయుచుండఁగా నీతండ్రి శిష్యుఁ డగు అస్తీకుఁడు దానిని నిలుపుచేసెను. కావున నీ కిట్టిపని మంచిదికా" దని సహస్రపాదుఁడు రురునకు సర్పఘాతమునం దుపశమన బుద్ధి పుట్టించి వెడలిపోయెను.

రురుమహర్షియు నాఁటినుండి సర్వభూత దయకలిగి ప్రమద్వరతోఁ గూడి సర్వసుఖము అనుభవించుచుఁ జిరకాలము గృహస్థ ధర్మములను నిర్వర్తించెను.

అట్లు గృహస్థాశ్రమమున నుండియు రురుఁడు తపస్స్వాధ్యాయ ప్రవచనదీక్షాపరుఁడై దివ్యతపస్విగాఁ దేజరిల్లుచుండెను. కాలక్రమమున

నాతని దయవలన ప్రమద్వర గర్భము ధరించి నవమాసములు నిండిన పిదప నొకయుత్తమ పుత్రునిం బడసెను. అతఁడే శునకమహర్షి. అతని కుమారుఁడే శౌనకమహర్షి. శునకుఁడు పెరిగి పెద్దవాఁడై భృగువంశీయుల కందఱకు నానంద దాయకుఁడై సత్త్వగుణసంపన్నుఁడై తీవ్ర తపము సలిపి శాశ్వతయశస్సును సంపాదించెను.

# మహర్షుల చరిత్రలు

## శతానందమహర్షి

### వంశము

గౌతమమహర్షి లోకాతీతసౌందర్యవతిగా బ్రహ్మచే సృష్టింపఁబడిన అహల్యను, గోప్రదక్షిణము భూప్రదక్షిణముకన్న ఎన్నోరెట్లు మిన్న యన్న శ్రుతివాక్యప్రమాణ బుద్ధిఫలితముగాఁ బరిగ్రహించి యామెతో నిజాశ్రమమున కేఁగి గృహస్థాశ్రమము నారంభించెను. మహాతపస్సంపన్నుఁ డగునామహర్షి పెక్కువేలేండ్లు తప మొనరించుచు, అహల్యాసేవ అంగీకరించుచు నిరుపమబ్రహ్మచర్య వ్రతమునే పరిపాలించెను. అతి దారుణ మగు ప్రపంచక్షామ మేతెంచినపుడు, త్రిలోకప్రజలను తన తపశ్శక్తిచే నన్నవస్త్రాదుల నఖండముగ నొసంగి కాపాడి వారు సర్వలోక బాంధవులైరి. తదనంతరము గౌతమమహర్షి గోహత్యా పాప నివృత్తికై పరమేశ్వరునిగుఱించి మహాతప మొనరించి యాతనికటాక్ష ఫలితముగా గంగను భూమికి గౌతమిగాఁ దీసికొనివచ్చి విశ్వకల్యాణ సంధాయకుఁడై వినుతి కెక్కెను.

ఇట్లు దాంపత్యబ్రహ్మచర్యమును బెక్కువేలేండ్లు నడపిన పిమ్మట గౌతమమహర్షి సాధ్వీరత్న మగునహల్య నాదరించి వలసినకోరికఁ గోరుకొను మని యనుజ్ఞ నొసఁగెను. ఆ తరుణీమణి "దేవా! నీ కృపకన్న నాకుఁ గావలసినది లేదు. ఐనను, ఆ సంగతి యెఱిఁగిన నీవు నన్నుఁ, గోరుకొను మనఁ గోరుకొనకుండుట తృణీకారభావ మగునని కోరుచున్నాను. స్త్రీసహజమగుమాతృత్వకాంక్ష నాకుఁ దీరలేదు. కావున, దయదలఁచి నలువురుబిడ్డలఁ గన్న చల్లనితల్లిగా నన్ననుగ్రహింప నర్థించుచున్నాను" అని వేఁడుకొనెను.

### జననము

గౌతముఁ డపరిమితానంద మంది నిజయోగబలమునఁ దాను నవయువకుఁడై అయోనిజ యగు అహల్యాకాంత నిండు యౌవనము

నకుఁ బండువెన్నెలలై సర్వలోకము లందలి మనోహర కేళివనముల నూఱుచోట్ల నూఱువిధము లగురత్యానందము నామె ననుభవింపఁ జేసి యామె కోరికఁ దీరిచెను. తత్ఫలితముగా నామె గర్భము ధరించి నవమాసములు మోసి నవమోహనాకారుఁ డగు నొకపుత్త్రరత్నమును గాంచెను. అహల్యాగౌతముల శతవిధానందఫల మగునాతనికి గౌతముఁడు "శతానందుఁ" డను సార్థకనామకరణము చేసెను. ఈతఁడే యహల్యాగౌతముల సంతానములో జ్యేష్ఠుఁడు.

## బాల్యము

శతానందుఁడు బాల్యమునుండియుఁ దండ్రిగుణసంపదలఁ బుణికి పుచ్చుకొని తండ్రికిఁ దగినకొడు కనుఖ్యాతిగాంచెను. తండ్రిచే నుపనీతుఁడై తండ్రికడనే సమస్తవేదశాస్త్రాదివిద్యల నభ్యసించి బ్రహ్మచర్యాశ్రమముఁ బాటించుచు మహాతపశ్శాలి యయ్యెను. శుక్లపక్షక్షపాకరునివలెఁ బెరుఁగొందు శతానందుఁడు బాల్యమునందే తనప్రజ్ఞాపాటవము వెల్లడిఁ జాటఁగలిగెను. ఈతని బుద్ధివైభవము, జ్ఞానసంపద, శీలగౌరవము, తపోనిరతి, విని, కని, జనకమహారాజు తన పురోహితునిగా నుండు మని యాతని నర్థించెను. గౌతమమహర్షి యానందించి శతానందుని కుచితగుణశీలసంపదల నొప్పు కన్యామణితో వివాహమొనరించి భార్యాసహితుఁ డగు శతానందుని జనకచక్రవర్తికిఁ గులగురువుగా నుండ మిథిలానగరము పంపివేసెను. జనకుఁ డపరిమితానంద మంది యా మహర్షిని విధ్యుక్తముగా గురువుగా గ్రహించి గౌరవించెను. ఈ విధముగా శతానందమహర్షి జనకరాజర్షి కులగురువై విరాజిల్లఁదొడఁగెను.

## రామలక్ష్మణుల మిథిలాగమనము

ఇట్లు కొన్నిసంవత్సరములు గతించెను. తదనంతరము గౌతముఁ డహల్యను శపించుట, ఆమె చిరకాలము రామపాదస్పర్శ కెదురుచూచుచు శిలారూపమున మహాతప మొనరించుచుండుటయు జరిగెను. శ్రీరామాదుల జననము, బాల్యము నయి విశ్వామిత్రుల

వెంట రామలక్ష్మణు లరుగుటయు, నాతనివలన వారు బలాతిబలవిద్య లెఱుంగుటయు, తాటకను దునుమాడి తపసి జన్నముఁ గాచుటయు, వారు సిద్ధాశ్రమమును జేరి మారీచాది రాక్షసుల జయించుటయు నయ్యెను. అనంతరము వారు విశ్వామిత్రుని వెంట మిథిలానగరము నకుఁ బోవుచు దారిలో శిలారూపమున నున్న నహల్యకు శాపవిమోచన మొనరించిరి. అందుల కహల్య భక్తి పురస్సరముగా శ్రీరాము నీ విధముగఁ గీర్తించెను.

"అహో కృతార్థాస్మి జగన్నివాస తే
పాదాబ్జసంలగ్న రజః కణా దహమ్,
స్పృశామి యత్పద్మజ శంకరాదిభిః
విమృగ్యతే రన్ధిత మానసై స్సదా.

అహో విచిత్రం తవ రామ చేష్టితం
మనుష్యభావేన విమోహయన్ జగత్,
చలస్యజస్రం చరణాది వర్జిత
స్సంపూర్ణ అనందమయోతి మాయికః.

యత్పాదపంకజపరాగపవిత్రగాత్రా
భాగీరథీ భవవిరించిముఖాన్ పునాతి,
సాక్షాత్సఏవ మమదృగ్విషయో యదాస్తే
కింవర్ణ్యతే మమ పురాకృతభాగధేయమ్.

మర్త్యావతారే మనుజాకృతిం హరిం
రామాభిధేయం రమణీయదేహినమ్,
ధనుర్ధరం పద్మవిశాలలోచనం
భజామి నిత్యం న పరాన్ భజిష్యే.

యత్పాదపంకజరజః శ్రుతిభిర్విమృగ్యం
యన్నాభిపంకజ భవః కమలాసనశ్చ,
యన్నామసారరసికో భగవాన్పురారి
స్తం రామచంద్ర మనిశం హృది భావయామి.

యస్యావతారచరితాని విరించిలోకే
గాయంతి నారదముఖా భవపద్మజాద్యాః,
ఆనందజాశ్రుపరిషిక్తకుచాగ్రసీమా
వాగీశ్వరీ చ తమహం శరణం ప్రపద్యే.

సోయం పరాత్మా పురుషః పురాణ
ఏష స్స్వయం జ్యోతి రనంత ఆద్యః,
మాయాతనుం లోకవిమోహనీయాం
ధత్తే పరానుగ్రహ ఏష రామః.

అయం హి విశ్వోద్భవ సంయమానా
మేకస్స్వమాయా గుణబింబితో యః,
విరించివిష్ణ్వీశ్వరనామభేదాన్
ధత్తే స్వతంత్రః పరిపూర్ణ ఆత్మా.

నమోస్తు తే రామ తవాంఘ్రిపంకజం
శ్రియాధృతం వక్షసి లాలితం ప్రియాత్
ఆక్రాంత మేకేన జగత్త్రయం పురా
ధ్యేయం మునీంద్రై రభిమానవర్జితైః.

జగతామాదిభూత స్త్వం జగత్త్వం జగదాశ్రయః
సర్వభూతేష్వసంయుక్త ఏకో భాతి భవాన్పరః.

ఓంకారవాచ్య స్త్వం రామ వాచా మవిషయః పుమాన్,
వాచ్యవాచకభేదేన భవానేవ జగన్మయః.

కార్యకారణకర్తృత్వఫలసాధనభేదతః
ఏకో విభాసి రామ త్వం మాయయా బహురూపయా.

త్వన్మాయా మోహితధియ స్త్వాం నజానంతి తత్త్వతః,
మానుషం త్వాభిమన్యంతే మాయినం పరమేశ్వరమ్.

ఆకాశవ త్త్వం సర్వత్ర బహిరంతర్గతో ఽమలః,
అసంగో హ్యచలో నిత్య శ్శుద్ధో బుద్ధ స్స దవ్యయః.

యోఽషి న్మాథాహ మజ్ఞాతే త త్త్వం జానే కథం విభో,
తస్మా త్తే శతశో రామ నమస్కుర్యా మనన్యధీః.

దేవ మే యత్ర కుత్రాపి స్థితాయా అపి సర్వదా,
త్వత్పాదకమలే సక్తా భక్తి రేవ సదాఽస్తు మే.
నమ స్తే పురుషాధ్యక్ష నమ స్తే భక్తవత్సల,
నమ స్తేస్తు హృషీకేశ నారాయణ నమోస్తుతే.

భవభయహరమేకం భానుకోటిప్రకాశం
కరధృతశరచాపం కాలమేఘావభాసమ్,
కనకరుచిరవస్త్రం రత్నవత్కుండలాఢ్యం
కమలవిశదనేత్రం సానుజం రామ మీడే. *

(అధ్యాత్మరామాయణము—బాల. ౫, ౪౬-౬౦)

ఓజగన్నివాసా ! రామా ! నీపాదధూళిలవమున నేను కృతార్థురాల నైతిని. ఏనీపాదపద్మమునకై బ్రహ్మరుద్రాదులు వెదకియుఁ గానఁ జాలరో, దానిని నేను స్పృశించుచున్నాను.

రామా ! నీచేష్ట విచిత్రము. మనుష్య భావమున జగమును మోహింపఁజేయుచున్నావు. ఎప్పుడు చరణాదులు లేనిఆనందమయుఁ డవు గదా !

ఎవనిపాదపద్మరజమునఁ బుట్టినగంగానది బ్రహ్మరుద్రాదులనే పవిత్రము చేయుచున్నదో, అట్టిపాదపద్మయుగ్మని కనులారఁగాంచఁ జాలిన నాభాగ్యము నేమని వర్ణింతును?

మనుజుఁడై పుట్టి మానవాకృతిని రాముఁడనుపేర రమణీయ దేహముఁ దాల్చిన ధనుర్ధరుని, పద్మవిశాలలోచనుని నేను నిత్యము భజింతును.

ఎవనిపాదపద్మరజము వేదములున్నైతము వెదకునో, ఎవని నాభి పంకమున బ్రహ్మ పుట్టెనో, ఎవనిపేరు శివుఁ డెపుడు భజించునో, అట్టి రామచంద్రుని నిరంతరమును నేను భావించెదను.

ఏమహనీయుని యవతారకథలను బ్రహ్మలోకమున నారద, బ్రహ్మ, రుద్రాదులు గానము చేయుదురో, ఎవనిగానమున సరస్వతి సైతము ఆనందాశ్రువుల రాల్చునో, అట్టిమహనీయుని నేను శరణు చొచ్చెదను.

పరమాత్మ, పురాణపురుషుఁ డగు నీరాముఁడు స్వయంప్రకాశుఁడుఁ సమస్తకారణుఁడు, లోకానుగ్రహమున కొఱఁకు మాయామయశరీరముఁ గాంచును.

ఈతఁడు సత్త్వరజస్తమోగుణములఁ బ్రతిబింబించి బ్రహ్మవిష్ణు రుద్ర రూపుఁడై సృష్టిస్థితిలయములఁ జేయుసర్వవ్యాపకుఁడైన పరమాత్మ.

ఓరామా! లక్ష్మీదేవి తనవక్షస్స్థలమును జేర్చి లాలించునది, ఒక్కటే ముల్లోకముల నాక్రమించినది, అభిమానవర్జితు లగుమునులచే ధ్యానింపఁబడినది యగు నీపాదకమలమునకు నమస్కారము.

రామా! నీవే జగత్కారణుఁడవు. నీవే జగత్తు. జగత్తునకాశ్రయుఁడవు. అన్నిభూతముల నున్నవాఁడవు. సర్వమునకుఁ బరుఁడవై స్వయంప్రకాశుఁడవై యున్నావు.

నీవు ఓంకారవాచ్యుఁడవు. వాచామగోచరుఁడవు. వాచ్యవాచకభేదముచే నీవే ప్రపంచరూపుఁడవు.

రామా! నీ వొక్కఁడ వయ్యు వివిధరూపములఁ గానవగుచున్నావు.

నీమాయచే మోహితులైనవారు నీ నిజస్వరూప మెఱుఁగరు. పరమేశ్వరుఁడవు. మనుష్యరూపుఁడ వని తెలియక నీవు నిజమగు మనుజుఁడవే యనుకొనుచున్నారు.

నీ వంతట నాకాశమువలె నావరించినవాఁడవు. అసంగుఁడవు. అచలుఁడవు. నిత్యుఁడవు. శుద్ధుఁడవు. బుద్ధుఁడవు. అవ్యయుఁడవు.

స్త్రీని, మూఢురాలను, నీ తత్త్వమెట్లెఱుఁగఁగలను? నీకటాక్షమునకై, అనన్యచిత్తనై నీకు నూఱుసారులు నమస్కరింతును.

శ్రీరామా! నే నెచట నున్నను, నీ పాదపద్మములందు భక్తి యెల్లపుడు నెడతెగకుండున ట్లనుగ్రహింపుము.

పురుషోత్తమా! నమస్కారము. భక్తవత్సలా! నమస్కారము. హృషీకేశా! నమస్కారము. నారాయణా! నమస్కారము.

సంసారభీతిఁ బోఁద్రోలువాఁడు, ఒక్కఁడు, భానుకోటి ప్రకాశుఁడు, కోదండపాణి, కనకరుచిరవస్త్రిఁడు, రత్నకుండలుఁడు, కమల విశద పత్రాక్షుఁడు, సోదరయుతుఁడు నగు శ్రీరాముని స్తుతించెదను.

ఇట్లు స్తుతించి భర్తను జేరిన యహల్యాసాధ్వికి రామలక్ష్మణులు మ్రొక్కి విశ్వామిత్రునివెంట మిథిలాపురి కేగిరి.

## శతానందజనకులు స్వాగత మిచ్చుట

వీరిరాక యెఱిఁగి జనకుఁడు గురువగు శతానందునితో నెదురేగి వారికి స్వాగతమొసఁగి తాను చేయుయజ్ఞమున కాహ్వానించెను. వా రంగీకరించి యాతనివెనుక నేఁగిరి. యజ్ఞశాల నుచితాసనముల వారిఁ గూర్చుండ నియమించి జనకుఁ డా రాజకుమారు లెవ రని విశ్వామిత్రు నడుగ నాతఁడు వారివిషయ మెల్లఁజెప్పి యహల్యాశాపవిమోచన మైన పిదప నిటు వచ్చినా రని తెలిపెను. ఆ మాటలు విన్న శతానందుఁ డమితానంద మంది తనతల్లి శాపవిముక్తయై తండ్రిని జేరిన దని విని మిగుల నానందించి యా వివరములు తెలుపు మని విశ్వామిత్రునిఁ గోరెను. విశ్వామిత్రుఁ డంతయుఁ బూసగ్రుచ్చినట్లు తెలిపెను. శతానందుఁడు నితాంతానందమున రామలక్ష్మణుల నభినందించి వారికి విశ్వామిత్ర చరిత్రము నంతయుఁ జెప్పి యా మహనీయు ననుసరింపఁ గలిగినవారి భాగ్యమును మెచ్చుకొనెను.

శ్రీరాముఁడు శివధనుర్భంగముఁ గావించి సీతను వివాహమాడు తఱి దశరథపక్షమున వసిష్ఠుఁడు, జనకునిపక్షమున శతానందుఁడు గోత్రప్రవరాదులు చెప్పి సీతారామ కల్యాణసంధాయకులైరి. *

## శతానందుని సంతానము

శతానందుఁ డీ విధముగా లోకోపకారకక్రియ లొనరించుచు జనకుని కులగురువై చిరకాలము జీవించెను. అతని ధర్మపత్నియందాతఁడు సత్యధృతి యను సుపుత్త్రుని గాంచెను. సత్యధృతి మాతృగర్భము నుండి జనింపఁగనే యాతనిచేత బాణ ముండెను. ఆ కారణమున నాతనికి శరద్వంతుఁ డనియుఁ బేరు వచ్చెను.

సత్యధృతి పుట్టిననాఁటినుండియు శరము విడువక చేతిలోనుంచు కొనువాఁడు. దాని ననుసరించి యాతఁడు పెరిగి పెద్దవాఁడగుచున్న కొలఁది నాతనిమనస్సు వేదశాస్త్రాది విద్యలయందుకంటె ధనుర్వేద మందే లగ్నము కాఁజొచ్చెను. శతానందుఁడు తనయుని కుపనయన మొనరించి "వత్సా! నీకు వలసినవిద్యలను తపస్సుచే సాధింపుము. అన్యవిధసాధ్యము లగువిద్యలకు విలువ లే" దని ప్రబోధించి యాతనికిఁ దపోజీవన మలవఱిచెను.

సత్యధృతి మహాతప మొనరించి ధనుర్వేదమును, వివిధాస్త్రములను బడసియు నింకను గొప్పయస్త్రములను సంపాదించుటకై నిరంతర తప మొనరించుచుండెను. ఈతని తపము పెంపునకు మచ్చరము గొన్న యింద్రుఁ డీతనితపముఁ జెఱుప జాలవతి యను దేవకన్యను బంపెను. ఆమె తనరమణీయశరీరముచేతను గాననృత్యములచేతను ధనుర్బాణములు ధరించియున్న సత్యధృతికి వలపు గొలిపెను. మహాసౌందర్యవతి యగునామెను గాంచినంతనే సత్యధృతిచేతిలోని విల్లమ్ములు జాఱి క్రిందపడెను. వెంటనే యా మహాత్ముఁ డది గ్రహించి యావిల్లమ్ములను, ఆమెను, ఆ ప్రదేశమును విడిచి దవుదవ్వులకుఁ బోయి తన కామో

---

* రామాయణము — బాలకాండము.

ద్రేకమును నిగ్రహించుకొనెను. కాని, యాతనికిఁ దెలియకుండఁగనే రేతః పతనమై యది యొకతెల్లుగడ్డిలో పడెను. అది రెండుభాగములై యమోఘ మగుట నందుండి యొకబాలుఁడు నొకబాలిక జన్మించిరి.

ఆ తరువాతఁ గొంతకాలమునకు శంతనమహారాజు వేఁటాడుచు నచటికి వచ్చి యా బాలుని బాలికను జూచి వారినగుమోములఁ బరికించి వారిని దీసికొనిపోయి తన బిడ్డలుగాఁ బెంచుకొనఁ దొడఁగెను. వారికి జాతకర్మాదిసంస్కారములు గావించి తనచేఁ గృపతోఁ బెంచఁబడిరి కావున వారికి కృపుఁడు, కృపి అనునామకరణము చేయించెను.

కాలక్రమమున నీ సంగతి యంతయు దివ్యదృష్టిని గ్రహించిన సత్యధృతి శంతను నింటికి వచ్చి తనసంగతి చెప్పి ధనుర్వేదాసక్తుఁ డగు కృపునకుఁ జతుర్విధ ధనుర్వేదములను నానావిధశాస్త్రములను నేర్పెను. కృపుఁ డచిరకాలముననే విలువిద్యయందుఁ బరమాచార్యుఁడై భీష్ముని ప్రార్థనమునఁ గౌరవ పాండవులకు గురు వయ్యెను. పిదప యాదవులు, మఱి పెక్కురు రాజకుమారులును నీతనినే చాపాచార్యునిగా గ్రహించి గౌరవించిరి.*

ఈ విధముగా శతానందమహర్షి యుత్తమపుత్త్రపౌత్త్రవంతుఁడై ధన్యాత్ముఁ డయ్యెను.

---

* భారతము—ఆదిపర్వము

# మహర్షుల చరిత్రలు

## సౌభరి మహర్షి

### తపోనిరతి

పూర్వము కాంపిల్య మను పురమున సౌభరి యను విప్రుఁ డొకఁ డుండెను. అతఁ డఖిలవేదశాస్త్రములను నేర్చి బ్రహ్మచర్య మవలంబించి మహాతపోనిరతుఁడై యుండెను. అతఁడు తపోధనముతోపాటు వ్రతనియమధనమును సైత మమితముగాఁ బ్రోగుచేయఁదొడఁగెను.

సౌభరి మొదటఁ జాంద్రాయణాదివ్రతము లొనరించెను. పిదప నాతఁడు మాసోపవాసము లారంభించెను. పిమ్మట నాతఁడు పర్ణాశనుఁడై కొంతకాలము తపముచేసెను. తదనంతర మా మహర్షి నిరశనవ్రత మారంభించి మాఘమాసమున జలములో నుండి ఘోరతప మొనరింపఁ జొచ్చెను.

### సంసారకాంక్ష

ఈ విధముగా నొకశతాబ్దము గతించెను. అప్పు డాజలములలో సామమద మనుపేరు గల * మత్స్య మొకటి పుత్త్రపౌత్త్రప్రపౌత్త్రకళత్త్ర మిత్త్ర బంధుపరివేష్టితమై మహారాజువలె స్వచ్ఛందముగ సంచరించుచు సౌభరిముని చుట్టుపట్టులఁ దిరుగుచుండెను. ఆ జలచరవిహార సౌఖ్యముఁ జూచిన సౌభరి తాను సైతము వివాహమాడి గృహపతియై సుఖింపవలయు నని కోరెను. పరమచిత్రము! తపముపై నామౌని తగులము విడిచి తరుణిపైఁ గాంక్ష గలిగి యామెకై వెదుకఁ జొచ్చెను. అహా! అంతటి వ్రతదీక్ష గలమహర్షికూడఁ దపస్సమాధియెడ నిలిపిన లక్ష్యము వదలి సంసారసుఖముల కభిముఖుఁ డయ్యెను. ఇం దున్న వారికి దానిపై నందున్న వారికి దీనిపై మనసు గలుగుచుండునేమో!

---

* పద్మపురాణము సమ్మదుఁ డనుపేరు గలమత్స్య మని విష్ణుపురాణము.

## సౌభరి మాంధాత పాలి కేతెంచుట

సౌభరి యట్లు బయలుదేఱి మాంధాతృచక్రవర్తి యింటి కేతెంచెను. ఆతనిని జూచి మాంధాత ఆసనార్ఘ్యపాద్యాది వివిధోపచార విధుల నొనర్చి నమస్కరించి "మహాత్మా! మీరు నాకడ కొక్కరు రాఁగత మేమి? మీ కిట్లు నాపై దయ గలుగుట కేమి హేతువో సెలవిం"డని ప్రార్థించెను.

అందుల కా మహర్షి మాంధాత సుచిత వాగ్విధానముల సంభావించి "రాజా! నీవు దాతవు కదా! ని న్నొకటి యడుగఁ గోరి వచ్చితిని. ఇక్ష్వాకువంశజు లెవ్వ రెప్పుడు వచ్చి యే మడిగినను నిచ్చివేయు మహాదాత లని మీ వంశజులకుఁ బేరు. మఱియు నీవు జగమెల్ల బాహుసంపద నుజ్జ్వలముగ నేలి యింద్రాదులకైనఁ గోరిక తీర్చువాఁడవు. నేను ని న్నొకయిహలోకకాంక్ష కాంక్షించుటకు వచ్చితిని.

"క్షేత్ర మెఱిఁగి వి త్తిడుటయుఁ
పాత్ర మెఱిఁగి దాన మిచ్చి పనుచుటయు వివే
కత్రాణపరాయణులకు
ధాత్రీశ్వర! ఇందు నందుఁ దగ మే లొసఁగున్.

ఇన్ని గుణంబులందు నుతికెక్కినవాఁడవు సత్యవాక్యపం
పన్నుఁడ విట్టి నీకు వరపాలక! నాకొసఁగంగరాని వే
ఱున్నవి? యైన నేమియును నొల్ల నరేంద్రకులావతంస! నీ
కన్నియలందు నాకు నొకకన్నియనిమ్ము గృహస్థు నయ్యెదన్"

(విష్ణుపురాణము ౪. ౧౩.౨)

అని పలికెను.

ఆ మాటలు విన్న మాంధాత నరసినగడ్డము, జడలువడిన జుట్టు, వయసు ముదిరిన జడతయుఁ గలిగినసౌభరివంకఁ జూచి యాతనికిఁ దనకూఁతు నీయలేక ఈయ నన్న నాతఁడు శపించునని భయపడి యుపాయాంతరమునఁ దప్పించుకొనఁ దలఁచి "మహాత్మా! మా కులము

వారు కన్యలకుఁ బెండ్లి సేయుపట్ల వారు కోరిన వరులకే యిత్తురు కాని కోరనివారి కెంతవారికైన నీయనొల్లరు. ఈ మా కులాచార మెట్లుల్లంఘింతును? నిన్నుఁ జూచిన ముసలివాఁడవు. నిన్ను నా కన్నెలు వరింతు రనువిశ్వాసము నాకెంతమాత్రము లేదు. ఏమిచేయుమందువు?" అని ప్రశ్నించెను.

అందులకు సౌభరి యిట్లు సమాధానము చెప్పెను. "రాజా! చాల మంచిమాట చెప్పినావు. నాకు నదియే యిష్టము. నన్ను నీ కన్నెలకుఁ జూపుము. వారిలో నెవతెయైన నన్ను మెచ్చిన నే నామెను బెండ్లాడుదును. లేదా నేను నీ కేయపకారమును జేయక వచ్చినదారి నేఁగెదను సరియా?" "సరే" యని మాంధాత కన్య కాంతఃపురమునఁ గలవర్షధరు నొకనిఁ బిలిచి "ఈ మునీశ్వరునిఁ గన్నియ లున్నచోటికిఁ గొనిపొమ్ము. వారిలో నెవతెయైన నీతనిఁ బరిణయమాడఁదలఁచిన వచ్చి నాతోఁ జెప్పుము. ఆమె నీతని కిచ్చి వివాహముచేసెద" నని పలికెను.

## మాంధాతకూఁతులు సౌభరిని వరించుట

ఆ కంచుకి యట్లే యని సౌభరిమునీంద్రుని దీసికొని రాజాంతఃపురమున కేఁగెను. ఆ మునీంద్రుఁడచట నఖిలసిద్ధసాధ్యగంధర్వ మనుష్యులకంటె నతిశయ మైనరూపము ధరించెను. అపుడు కంచుకి రాజకన్యకల రప్పించిన వారు:

"కాఱుమెఱుంగులో మెఱపుఁ గైకొననేర్చిన పైఁడిబొమ్మలో
మారునిదీములో కలికిమాటలచంద్రికలో చెలంగు శృం
గారరసాధిదేవతలో కమ్మనిక్రొవ్విరితీఁగలో యనన్
వారిజపత్త్రిలోచనలు వచ్చిరి మోహనిలాసమూర్తులై.

(విష్ణు. ౫. ౧౪౬)

వారిని జూచి కంచుకి "కన్నియలారా! ఈ ముదుసలి మీ తండ్రికడకు వచ్చి మీలో నొకతె నర్థించెను. మీ తండ్రి మాటాడక యాతనినే మీ కడకుఁ బంపెను. మీలో నెవరైన నీతనిని వరించినచో నామె నాతని కిచ్చి పెండ్లిచేయునఁట, చూచుకొం"డని హెచ్చరించెను.

అప్పు డా కన్యక లందఱు సౌభరి సౌందర్యమునకు ముగ్ధలై యంద ఱాతనిని వరించి యీతఁడు మాకే కావలయును మాకే కావలయు నని సిగ్గువిడిచి యాతనిని మోహించిరి. ఈ సంగతి కంచుకి వచ్చి చెప్పిన మాంధాత యా మునితపశ్శక్తి కచ్చెరువడి తన కన్యకల నేఁబది మందిని నొక్కశుభలగ్నమున నా మునీశ్వరుని కిచ్చి వివాహము కావించెను. పిదప, మణికనకశిబిరారూఢలంజేసి వారిని మాంధాత వీడ్కొలిపెను.

సౌభరియు నేఁబదిమంది భార్యలతోడను నిజాశ్రమమునకు వచ్చి యనేకశిల్పకల్పనాచార్యుఁడైన విశ్వకర్మను రప్పించి "ఓయీ! నేను గృహస్థాశ్రమము స్వీకరించితిని. నాదగుభార్య లేఁబదిమంది మహారాజ పుత్రికలు; మహాభోగము నందినవారు. వీర లందఱకు విహారోచితము లగు దివ్యరత్నకాంచనగృహములు నిర్మించి యి"మ్మని శాసించెను.

ఆ మునిశాసనమున విశ్వకర్మ తత్క్షణము బహువిధద్వారోపద్వారకవాట వప్రప్రాకార పరిఖావిశాలము లయిన కనకరత్నధగధగ ద్ధగాయమాన ప్రాసాదములను, నానావిచిత్రభిత్తికా సభాస్తంభసంభృతదేహళిప్రాం గణసుందరము లైనమందిరములను, జలాశయములను, ఆరామము లను, హంసతూలికాతల్పములను, వినోదవిహారడోలాజాలములను మొదల గున వెన్నిటినో నిర్మించి యిచ్చెను. సౌభరి వారి నందఱ నన్నిసౌధ ముల నుంచి వారివారి కూడిగము లొనరించుటకుఁ దనతపశ్శక్తి నప్సరసల రప్పించి రమణీయాంబర దివ్యమాల్యవిభూషణముల నొసఁగి వివిధపరి మళానులేపనముల నిచ్చి, అతిమనోహరము లగుభక్ష్యభోజ్యాది సము చితాన్నపానముల నర్పించి యాతఁ డా కాంతాజనములతో సురతసుఖ మనుభవించెను.

## సౌభరి సాంసారిక సౌఖ్యములు

ఇట్లు పరమగృహస్థధర్మమున సంసారసుఖములు చిరకాల మనుభ వించుచుండఁగా మాంధాతచక్రవర్తి తనకూఁతుండ్రఁ జూడవేడుకపడి

"అడవులఁ గందమూలముల నాఁకలిదీర్చి తపంబుసేయుచున్
బడలినవృద్ధతాపసుని బాలికలన్ సుకుమారమూర్తులన్
గడుసుఖులై నవారలను గట్టిఁడినై వెసఁ గట్టి త్రోచితిన్
నడఁకుచు వార లెవ్విధమునన్ దురపిల్లుచునున్న వారొకో!

(విష్ణు. ౫.౧౬౩)

అని కటకటంపడుచు సపరివారముగా సౌభరిమహర్షి యాశ్రమము వంకకుఁ బ్రయాణము సాగించెను. ఆ యాశ్రమప్రాంతమున కేఁగునరి కాతఁడు తననేత్రములను దానే నమ్మలేనట్లుగా —

"బహువిధాలంకార భర్మదీప్తిచ్ఛటా
    ప్రాకారమణిహర్మ్యభవనములును
నానావిధప్రసూనానూనసౌరభ
    రమణీయమందిరారామములును
కలహంసచక్రవాకక్రౌంచ కలనాద
    జలజకైరవజలాశయచయంబు
ధనధాన్యయుతనిరాతంకశంకాచతు
    ర్వర్ణసంకీర్ణనివాసములును
తతఘనానద్ధసుషి రాభిధానవాద్య
కేలితామర కామినీ గీతరవము
గలిగి త్రిభువనలక్ష్మికి నిలయ మగుచుఁ
బరగు సౌభరి సౌభాగ్య పురవరంబు.

(విష్ణు. ౫.౧౬౭)

కనుఁగొని యాశ్చర్యముతో "ఏమీ! ఈ ప్రాంతమున నెప్పు డేపట్టణము లేదే! సురపురిని బోలిన యీ పురి నెవరు నిర్మించిరో? దీని రా జెవరో?" యని యందలిపౌరుల నడుగ వారు సౌభరి తపఃప్రభావమున నిర్మిత మైనసౌభాగ్యపుర మది యని తెలిపిరి. మాంధాత యానందబాష్పములు విడుచుచు నమ్మహామునిని గని నమస్కరించి

యాతనిచే యథోచితగౌరవమర్యాద లందెను. పిదప మాంధాత తన పుత్త్రికలఁ జూడఁ గోర సౌభరి యాతనిని సపరివారముగా సాదరముగాఁ గన్యాంతః పురమునకుఁ బంపెను. మాంధాత యచట నొక రమ్యహర్మ్యమునఁ గర్పూరవీటీవదనను, మణి డోలికాచలితనానాభూషణభూషితను, దివ్యాంబరసంవృతస్తనయుగను, కాశ్మీరకస్తూరికాఘనసార గంధబంధుర శుభాంగను దనకూఁతును జూచెను. ఆమె లేచి నమస్కరించి తండ్రిని సకలోపచారములతో సబహుమానముగాఁ దనకేళీ సౌధమునకుఁ దీసికొనిపోయి కూర్చుండ నియమించి యోగక్షేమ మడిగిన నాతఁ డమితానందమంది యిట్లనెను "బిడ్డా! నీవు నీ సోదరీమణులు సుఖముగ నున్నారా? మీ భర్త మీ కన్ని సౌఖ్యములు సమకూర్చుచున్నాఁడా? తొడుగఁ బూయఁ గట్ట నన్నియుఁ గలవా? చెప్పుము." ఆ మాటలకామె చిఱునవ్వు నవ్వి "తండ్రీ! నాకు సమస్తము సంపన్నము. నిన్నుఁ జూడకుంటి నను విషాదము తక్క నొండేమియు లేదు. మన్మథరూపమహిమతో నామనోనాథుఁడు నా యింట నెప్పుడుండుచు నాకు సర్వవిధసౌఖ్యములు సమకూర్చుచు నన్నుఁ దనప్రియకాంతగాఁ బరిగణించుచున్నాఁ" డని తెలిపెను.

ఆమె యొక్కతెయే యిట్లున్నదేమో మిగిలిన కూఁతులె దుస్థితిలో నున్నారో యని మాంధాత మఱియొక కూఁతుసౌధమున కేఁగి మొదటికూఁతుకంటె నధికవిభవమున నలరారు పుత్త్రికారత్నముఁ గని యామె వందనాద్యుపచారముల నంది యామెయోగక్షేమము అడిగిన నామెయు నప్పచెప్పినచొప్పుకంటె నధికముగా వర్ణించిన మాంధాత సంతోషించి మూఁడవకూఁతునింటి కేఁగెను. ఆమెయు నట్లే యుండెను. నాలవకూఁతు నింటికివెళ్ళెను. ఆమె యంతకంటె నెక్కువసుఖముగా నుండెను. ఇట్లందఱు నొక్కవాక్యముగా మగనివలన సకలసుఖము లనుభవించుచున్న సంగతి తెలియఁజేసిరి.

మాంధాత సౌభరిమహర్షి దివ్యశక్తి కచ్చెరు వంది తన కూఁతుండ్ర సౌభాగ్యమునకుఁ బ్రమోదభరితుఁడై సౌభరిని సమీపించి యాతనికి సాష్టాంగనమస్కారము లొనరించి మెచ్చుకొని యాతని సెలవుగైకొని

కూఁతులకు గౌరవార్థము ధనకనకవస్తు వాహనవనితారత్నముల నిచ్చి నిజపురమున కేఁగెను.

సౌభరి మాంధాతపుత్రికలైన ధర్మపత్నులయందు సమస్తభోగములు ననుభవించి యేఁబదిమంది భార్యలయందు నూటయేఁబదిమంది కుమారులను గాంచెను. అతఁ డావిధమున శైశవ క్రీడా ప్రసంగములఁ గొన్నేండ్లు, కుమారుల ముద్దుపల్కులఁ గొన్నేండ్లు, విద్యావినోదగోష్ఠులఁ గొన్నేండ్లు, వడుగుఁ బ్రాయపు వైభవములఁ గొన్నేండ్లు, యౌవనోన్నతులఁ గొన్నేండ్లు, వివాహక్రియావ్యసనములఁ గొన్నేండ్లు కోడండ్ర కోడం(డ్రికములఁ గొన్నేళ్లు, మనుమలు మనుమరాండ్రతోఁ గొన్నేళ్లు, వారియౌవనములతోఁ గొన్నేళ్లు, వారివివాహసంతానములతోఁ గొన్నేళ్ళు నిట్లు తరతరము తామరతంపరైన సంసారసాధనములైన మనోరథములఁ దగిలి యనేకవేల సంవత్సరములు వినోదించెను.

## సౌభరివైరాగ్యము

చిరకాల మిట్లు కడచినపిదప సౌభరి యొకనాఁడు పరతత్త్వ చింతా సమాధానమానసుఁడై యైహికమోహజాలానేక బంధములను పరమయోగ విమలతత్త్వ మనుకొడవలితోఁ గోసివేసి యాత్మజ్ఞాన సంపన్నుఁడై యిట్లు తలపోసెను. "అహా! ఈ యిహసౌఖ్యములు దుస్స్వహములు. పుత్రమిత్రకళత్రాది సంగతి దుస్సంగతి. ఈ నిస్సారమైన సంసారము నజ్ఞులు లెస్సగా భావింతురు. పదివేలవిధముల సకలవిషయోపభోగముల ననుభవించినను నా చిత్తము తృప్తినందలేదు. పైఁగా, తత్కాంక్ష దినదినాభివృద్ధి నందుచున్నది. ఈశ్వరవిలాసము పరమచిత్రము! జలములలో నిలిచి తపోవృత్తిఁ జరించుచునా కా మత్స్యము కనిపించి సంసారభ్రమ గొలుపఁగా నొక్క కన్యకై నేనేఁగి పెక్కురు కన్యలఁ బరిణయ మాడితిని. అంతతో నూరకుంటినా? వారికిఁ బిల్లలఁ బుట్టించితిని. వారికై బహుసంపదల సంపాదింపవలసివచ్చెను. తదాసక్తివే పుత్ర పౌత్రదౌహిత్ర కళత్రమిత్రబంధు ధనధాన్యవైభవప్రాభవములు చూచి పెక్కేండ్లు సంసారసుఖముల గాసిపడితి. కాలమెల్ల వ్యర్థమై పోయెను. నిజమునకు:

"యోగము కల్గినచోటను
భోగంబులు లేవు భోగములు గల్గినచో
యోగంబు లేదు కావున
యోగము భోగంబుఁ బడయ నేరులకు వశమే."

(విష్ణు. ౫ ౧౯౩

అని సర్వసంగపరిత్యాగ మొనరించి నిజభార్యాయుక్తుఁడై కానకేఁగి పెక్కేండ్లు మరల మహానియమమునఁ దపోయుక్తుఁడై యుండెను.*

## అర్జునాదులు సౌభరి యాశ్రమమున కేతెంచుట

ఇట్లుండ ధర్మరా జశ్వమేధయాగ మొనరించి యాగాశ్వమును విడిచెను. దానివెంట నర్జునాదులు తత్సంరక్షణకై వెడలిరి. ఆ యశ్వమును బట్టినవారిని బోర జయించుచు వారు పోవఁబోవనొకచో యజ్ఞాశ్వ మొక్కశిలను గదియఁబోయి దాని నంటుకొని కదల లేకుండెను. అది కన్న సైనికులు దానిని గదల్ప నెన్నిప్రయత్నములో చేసి విఫలులై తుద కర్జునునితోఁ జెప్పిరి. అర్జునుఁడాశ్చర్య మంది యా సమీపమునఁ గల సౌభరిమహర్షి యాశ్రమమునకుఁ బోయి యాతని నడిగి తెలిసికొంద మనుకొని ఋష్యాశ్రమము సమీపింప దానిసమీపమునఁ గల యారామమున జంతువులు జాతి వైషమ్య ముడిగియుండుటఁ గాంచి యబ్బురపడి సర్వసైన్యముల నట నిలిపి ప్రద్యుమ్నవృషకేతనాదులతో ముందు కేఁగి

"అక్షయపుణ్యశీలు నిగమార్థరహస్యకథా ప్రవీణు రు
ద్రాక్షవిభూతివల్కలమృగాజినశోభితగాత్రు శ్రీమద
ష్టాక్షరమంత్రలబ్ధమహిమాధికుఁ" డైన సౌభరి
మహర్షిని గాంచి సాష్టాంగనమస్కారము లొనరించి —

* పద్మపురాణము: ఉత్తరఖండము; విష్ణుపురాణము

"మునీంద్రా! ధర్మరాజు గోత్రవధ మొనర్చినకారణమున నపరిమిత పరితాపమంది వ్యాసమహర్షి యాదేశమున నశ్వమేధ మొనర్చి యా దురితముఁ బాపుకొన సమకట్టి యజ్ఞాశ్వమును విడువఁగానది తిరిగి తిరిగి యీ వింధ్యప్రాంతమునకు వచ్చి యీ సమీపమునఁ గలయొక శిల కంటుకొనిపోయినది. అది బయటపడు నుపాయ మెఱిఁగించి కరుణింపు" మని ప్రార్థించెను.

అందులకు సౌభరి యర్జునుని జూచి "ఓయీ! భయపడకుము. తొల్లి యుద్దాలకుఁ డనుమహర్షి బ్రహ్మచర్యమును గడపి చండిక యను పేరుగల పరుషవచన, దుశ్శీల యగు కన్యను బెండ్లాడెను. ఆమె యాతఁడు చెప్పినపనిచేయకపోవుటే కాక దానికి వ్యతిరేక మగుపని చేయుచుండెడిది. కాని దాని కాతఁ డుపాయ మూహించి తా నొకపని కావలయు నని కోరుకొన దానికి వ్యతిరేక మగునదే కావలయు నని యామెకుఁ జెప్పి యామె యాతఁడు చెప్పినదానికి వ్యతిరేక మగుపని చేయఁ దనసంకల్పసిద్ధి నందుచు నాతఁడు కాలము పుచ్చుచుండెను. కొంతకాలమున కాతఁడు పితృకార్య మొనరించి యాపారణము నావు నకుఁ బెట్టు మని పొరపాటున నామెకు నిజము చెప్పెను. అది యామె తీసికొనిపోయి యావునకుఁగాక కుక్కకుఁ బెట్టెను. దాని కాతఁ డాడలు మండి యామెను వింధ్యశైలప్రాంతమునఁ బాషాణమవై పడియుండు మని శపించెను. ఆమె దుఃఖింప "నోసీ! కొన్నాళ్లకు ధర్మరాజు యాగాశ్వము నిన్నంటుకొనిన, దానిని విడిపించుటకై వచ్చు నర్జునుని కరస్పర్శమున నీవు పవిత్రురాలవై స్త్రీ వగుదు వని కరుణించెను. ఆ శిల యామెయే. కావున, నీ వేగి నీచేతితో నాశిల నంటిననామె శాప మోక్ష మందును. మీ యశ్వము విడుదల గాంచును" అని చెప్పెను.

అర్జునుఁ డా మహర్షి కనేకవందనము లొనర్చి యేఁగి యాశిలను దాఁకఁగనే యామె శాపమునుండి విడివడి మరలచండికయయ్యెను. యాగాశ్వము విడుదల నంది ముందు కేగెను. అర్జునాదులు దానిని ననుసరించిరి. *

---

* జైమినిభారతము.

## సౌభరి మోక్ష మందుట

అంతరము సౌభరి సన్న్యాసియై వార్ధకమున సాంగత్యవశము లైన విషయములు మాని యంత్యమున విష్ణుభక్తివలనఁ గల్యాణ కైవల్యమును గాంచెను.

"ఈ సౌభరికథఁ దలఁచిన
వ్రాసినఁ జేర్కొనిన వినిన వర్ణించిన న
ఖ్యానముచేసినవారికి
శ్రీసంపద లొనరి మోక్షసిద్ధియుఁ గలుగున్."

(విష్ణు. ౫, ౧౯౫)